


తిరుమల సర్వస్వం



సేకరణ, పరిశోధన, కూర్పు, లేఖకులు:

శ్రీవారి పాద సేవకులు

పల్లపోతు వాణిశ్రీ

పల్లపోతు కృష్ణ బాలాజీ

+91-99490-98406



2020







తిరుమల సర్వస్వం

ఓం నమో వేంకటేశాయ!

విషయసూచిక











పీఠిక

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం /
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే //



తెలుగునాట ఇంటింటి ఇలవేలుపు శ్రీవేంకటేశ్వరుడు. తెలుగు వారందరి మనోరథం హైందవ సాంప్రదాయానికి ఆలవాలమైన తిరుమల క్షేత్రసందర్శనం. ఎన్నిసార్లు దర్శించుకున్నా తనివి తీరదు. మరొక్కసారి దర్శించుకోవాలని మనసు ఉవ్విళ్ళూరుతూ ఉంటుంది. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా శ్రీవారిని దర్శించుకునే వారు కొందరైతే, బ్రహ్మోత్సవాలకు తప్పనిసరిగా హాజరయ్యేవారు మరికొందరు.

ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా అది స్వామి వరప్రసాదంగా భావించి, సకుటుంబ సమేతంగా తిరుమల క్షేత్రాన్ని సందర్శించి శ్రీవేంకటేశ్వరునికి ఇబ్బడిముబ్బడిగా కానుకలు సమర్పించుకునే వారు కొందరు! తల పెట్టిన ప్రతి శుభకార్యానికి నాందీ ప్రస్తావనగా స్వామివారికి మ్రొక్కుకొని, సఫల మనోరథులైన వెనువెంటనే తిరుమలేశునికి ముడుపులు సమర్పించుకునే వారు ఇంకెందరో!

కొండలరాయడిని కొంగుబంగారంగా భావించని హైందవుడు ఉండడంటే అందులో అణుమాత్రమైనా అతిశయోక్తి లేదు.

తిరుమలక్షేత్రానికి తరచుగా విచ్చేసి ఆఘమేఘాలపై స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణానానికి సమాయత్తమయ్యే భక్తజనకోటికి సప్తగిరుల ఐతిహాసిక ప్రాశస్త్యం గురించి, తిరుమలక్షేత్ర చారిత్రక ప్రాధాన్యత గురించి, క్షేత్రంలో లెక్కకు మిక్కిలిగా ఉన్న దర్శనీయ ప్రదేశాల గురించి, వేల సంవత్సరాలుగా స్వామివారిని సేవించుకుంటూ వస్తున్న భక్తాగ్రేసరుల గురించి, శ్రీవారి ప్రసాద, ఉత్సవ విశేషాల గురించి, పద్మావతీ–శ్రీనివాసుల పరిణయం గురించి, కొండపైకి చేరుకునే నడక దారుల గురించిన సమగ్రమైన సమాచారాన్ని సరళమైన రీతిలో, తేనెలొలికే తేటతెలుగులో అందించాలనే సదుద్దేశ్యంతో, ఈ చిరు ప్రయత్నాన్ని స్వామివారి కృపతో ప్రారంభించాము. వివిధ గ్రంథాల నుండి, అనేకపర్యాయాలు స్వామివారిని ప్రత్యక్షంగా దర్శించుకున్న స్వానుభవాల నుండి, ఆలయంలో దశాబ్దాలుగా స్వామివారిని సేవించుకుంటున్న అర్చకస్వాముల నుండి, వివిధ ప్రసారమాధ్యమాలు పత్రికల ద్వారా సేకరించిన సమాచారాన్ని సంక్షిప్తీకరించి, విషయానుసారంగా విభజించి, ప్రతిరోజూ ఒక ప్రకరణాన్ని శ్రీనివాసుని సంపూర్ణకటాక్షంతో వాట్సప్ మాధ్యమం ద్వారా మీ ముందుకు తెచ్చే ఈ బృహత్తర యజ్ఞాన్ని ఆదరించినందుకు మీకు హృదయపూర్వక ధన్యవాదాలు. మనస్ఫూర్తిగా, ఆసాంతం చదివి; శ్రీనివాసుని కృపకు పాత్రులవ్వడమే గాకుండా, ఎప్పటికప్పుడు ఈ ప్రకరణాల్లోని తప్పొప్పులను సరిదిద్దుతూ మీ అమూల్యమైన సలహాలను మాకందిస్తూ,వచ్చినందుకు ప్రకరణాలు మరింత అర్థవంతంగా వెలువడడానికి తోడ్పడినందుకు మీకు కోటి కోటి నమస్సుమాంజలులు.

----------: : ----------



పంచబేరాలు

మొట్టమొదటగా పరమపావనమైన ఆనందనిలయం, అనగా తిరుమలక్షేత్రం నందలి ప్రధానాలయపు గర్భాలయం, లోని పంచబేరాలుగా పిలువబడే శ్రీవేంటేశ్వరుని ఐదు రూపాల గురించి తెలుసుకుందాం.

సకల లోక కళ్యాణ కారకుడైన శ్రీవేంకటేశ్వరుని రూపాంతరాల స్మరణతో "తిరుమల సర్వస్వం" ప్రారంభమవ్వటం మంగళదాయకంగా భావించి, తొట్టతొలి ప్రకరణాన్ని శ్రీనివాసుని "పంచబేరాల" కు అంకితమివ్వడం జరిగింది.

ఆనందనిలయంలో కొలువై, పంచబేరాలు గా పేర్గాంచిన శ్రీనివాసుని ఐదు దివ్యమంగళ స్వరూపాలు ఈ విధంగా పిలువ బడుతాయి.

ధ్రువబేరం	అనిరుద్ధబేరం	కౌతుకబేరం	స్నపనబేరం	ఉత్సవబేరం
మూలవిరాట్టు	కొలువు శ్రీనివాసుడు	పురుషబేరం	అచ్యుతబేరం	మలయప్ప స్వామి
	దర్బారు శ్రీనివాసుడు	భోగ శ్రీనివాసుడు	ఉత్సవ శ్రీనివాసుడు	
	అళగప్పిరాన్	మనవాళ పెరుమాళ్	స్నపనమూర్తి	
			ఉగ్ర శ్రీనివాసుడు	

మూలవిరాట్టు

సుమారు వెయ్యేళ్ళ క్రితం, చరిత్రకు అందనట్టి ప్రాచీనకాలం నుండి తిరుమల శిఖరంపై విరాజిల్లుతూన్న ఈ ప్రతిమ శివుడిదా లేదా అమ్మవారిదా లేదా విష్ణువుదా అనే వివాదం నెలకొన్నది. ఆ సమయంలో శ్రీమద్రామానుజుల వారు బంగారు శంఖు చక్రాలు తయారు చేయించి, వాటిని తన భక్తితత్పరతతో స్వామివారి ఉభయహస్తాలలో శ్రీవారి చేతనే స్వయంగా ధరియింప జేసి ఆ ప్రతిమ శ్రీమహావిష్ణువు కలియుగావతారమైన శ్రీవేంకటేశ్వరునిదేనని నిర్ద్వంద్వంగా, తర్కపూరితంగా నిరూపించారు.



కుడి వక్షఃస్థలంలో అమ్మవారితో, చతుర్భుజాలతో, శంఖు చక్రాలతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ వుండే స్వామి ఇక్కడ స్వయంగా వెలిశారు. మూలవిరాట్ నే **ధ్రువబేరం** (స్థిరంగా వుండే విగ్రహం) అని కూడా వ్యవహరిస్తారు. తొమ్మిదిన్నర అడుగుల ఎత్తుతో సమున్నతంగా ఉండే స్వామివారి యజ్ఞోపవీతంలో ఒక ప్రోగు తెగి వుంటుంది. ప్రలంభాసురునితో ప్రచండయద్ధం జరిగినప్పుడు ఆ ప్రోగు తెగి పోయిందని ప్రసిద్ధి. శ్రీవారికి నాగాభరణంతో బాటుగా అనేక స్వర్ణాభరణాలు అలంకరించబడి వుంటాయి. మొదట్లో సన్నగా ఉండే తిరునామం రామానుజాచార్యుల వారి హయాం నుండి ప్రస్తుతం మనకు కనపడే వెడల్పాటి ఊర్ధ్వపుండ్రంగా రూపాంతరం చెందింది. ఈ తిరునామానికి మామూలు రోజుల్లో 16 తులాల పచ్చ కర్పూరం, ఒకటిన్నర తులాల కస్తూరి వినియోగిస్తారు. అదే బ్రహ్మోత్సవాల్లో దీనికి రెండింతల పదార్థాన్ని ఉపయోగిస్తారు. స్వామివారు కుడి వరదహస్తంతో (అంటే వరాలనిచ్చే హస్తం), ఎడమ కటిహస్తంతో (అంటే నడుము భాగంలో చేర్చబడిన చేయి) దర్శన మిస్తారు. స్వామివారి పాదపద్మాలు పద్మపీఠంపై విరాజిల్లు తుంటాయి. సూర్యకఠారి, లేదా నందకం, అనే ఖడ్గాన్ని నడుము క్రింది భాగం నుంచి ధరించి వుంటారు.

దాదాపు 120 సంవత్సారాలు జీవించి స్వామివారి సేవలో పునీతుడైన రామానుజాచార్యుల వారి గురించి ముమ్మందు సవివరంగా తెలుసుకుందాం. అలాగే, స్వామివారి మూలవిరాట్టు ఆవిర్భావం, స్వరూప స్వభావాల గురించి కూడా ఆనందనిలయాన్ని వివరిస్తున్నప్పుడు సవిస్తారంగా వర్ణించుకుందాం.

కొలువు శ్రీనివాసుడు

ఈ శ్రీనివాసుడినే "దర్బారుశ్రీనివాసుడు", **అనిరుద్ధబేరం**, అళగిప్పిరాన్ అని వేర్వేరు పేర్లతో పిలుస్తారు. ఈ స్వామి బంగారువాకిలి దాటి బయటకు రారు. వీరు ఆదాయం, పద్దులు, లేఖిక, దర్బారు, బలిబేరం (నైవేద్యం) స్వీకరిస్తారు. 826వ సం. నాటిదిగా భావింపబడే ఈ విగ్రహం ఆనందనిలయం లోనికి ఎలా వచ్చిందో చెప్పటానికి చారిత్రక ఆధారాలు లేవు. ప్రతి రోజూ తోమాలసేవ (తోమాలు అసగా పూలు) అనంతరం దర్బారుసేవ నిర్వహిస్తారు. అంటే – ఆ రోజు తిథి, వార, నక్షత్రాలు, ముందు రోజు ఆదాయం ఎంత వచ్చింది – ఆ లెక్కలన్నీ స్వామి వారికి చెబుతారన్న మాట. ఇంగ్లీషు తేదీల ప్రకారం కూడా పంచాంగాన్ని వినిపిస్తారు. తరువాత నైవేద్యం సమర్పించి మరునాటి తిథి, వార, నక్షత్రాలు వినిపిస్తారు. నిత్యాన్నపథకానికి విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు కూడా స్వామివారికి మనవి చేస్తారు. బొక్కసం (లెక్కల) గుమస్తా, అర్జితసేవలవల్ల, ప్రసాద విక్రయాల ద్వారా, హుండీ ద్వారా కానుకలుగా వచ్చిన వెండి, రాగి, బంగారం ఇతర లోహ పాత్రలు, నగలు వగైరాలను; రొక్ఖరూపంలో వచ్చిన కానుకలను పైసలతో సహా లెక్కగట్టి స్వామి వారికి వినిపించి; సాష్టాంగ నమస్కారం చేసి శెలవు తీసుకుంటారు. ప్రతి రోజూ ఉదయం 4.30 గం. లకు ప్రారంభమయ్యే ఈ సేవను ఆలయ ప్రాంగణంలో కూర్చొని వీనులవిందుగా విని తరించవచ్చు. ఈ కార్యక్రమం అంతా బంగారువాకిలికి ఆనుకుని వున్న 'స్నపనమండపం' లో జరుగుతుంది. ఇది పూర్తిగా ఏకాంతసేవ.

భోగశ్రీనివాసుడు

మూలవిరాట్ కు ఎడమవైపు వున్న బేరం (మూర్తి లేదా ప్రతిమ) భోగశ్రీనివాసుడు. సామాన్య శకం 624 సం. లో పల్లవరాణి 'సామవై' అనే మహాభక్తురాలు ఈ వెండి ప్రతిమను చేయించింది. మరికొందరు శాస్త్రకారుల అంచనా ప్రకారం ఈ విగ్రహం సామాన్యశకం 966వ సం. లో చేయించబడింది.

ఒకటిన్నర అడుగుల ఎత్తుతో ముగ్ధమనోహరంగా ఉండే ఈ మూర్తిని **కౌతుకబేరం**, **పురుషబేరం** అని కూడా వ్యవహరిస్తారు. ఈ మూర్తికే 'మనవాళప్పెరుమాళ్' అనే మరో నామధేయం కూడా ఉంది. 'మనవాళన్' అనే తమిళపదానికి 'పెండ్లికొడుకు' అని అర్థం. నిత్య పెండ్లికొడుకులా నిత్యమూ పట్టుపానుపుపై శయనించే భోగభాగ్యాలను పొందుతూ ఈ స్వామి సార్థక నామధేయు డయ్యాడు.

జ్యేష్ఠమాసంలో ఈ మూర్తికి ప్రత్యేక సహస్రకలశాభిషేకం నిర్వహిస్తారు. పూర్వం – ఇప్పటి, మలయప్పస్వామి వారి ఉత్సవవిగ్రహాలు లేనప్పుడు – మాడవీధుల్లో భోగశ్రీనివాసుణ్ణే వూరేగించేవారు. అన్ని మర్యాదలూ, సేవాకైంకర్యాలు, అభిషేకం, ఏకాంతసేవ, బంగారు పట్టుపరుపుపై పవళింపుసేవ, బుధవారం జరిగే ప్రధానసేవ యైన సహస్రకలశాభిషేకం భోగశ్రీనివాసునికే చెందుతాయి. ప్రతి ఉదయం తోమాలసేవకు ముందుగా భోగశ్రీనివాసునుకి అభిషేకం జరుప బడుతుంది.

సామవై మహారాణికి మరో పేరు 'పేరుందేవి'. ఆమె కాలంలో ఆనందనిలయం జీర్ణోద్ధారణ కావించ బడినప్పుడు, నిత్యపూజకు ఆటంకం కలుగకుండా ఉండే నిమిత్తం మూలమూర్తికి నకలుగా భోగశ్రీనివాసుడి విగ్రహం చేయించి; నేడు స్నపనమంటపంగా పిలువబడే ప్రదేశంలో 'బాలాలయం' నిర్మించి; భోగశ్రీనివాసుణ్ణి అందులో ప్రతిష్ఠింప జేసి; వారికి సకల లాంఛనాలతో పూజాదికాలను నిర్వహించింది. స్వామివారికి అనేక ఆభరణాలు చేయించి, ఆడంబరంగా అనేక ఉత్సవాలు నిర్వహిస్తూ పరమ భక్తశిరోమణిగా పేరు గాంచింది. స్వామివారి సేవలో తరించిన మొట్టమొదటి చారిత్రక వ్యక్తిగా గూడా ఈమె చరిత్రపుటల్లో చిరస్థాయిగా నిలిచి, తరువాతి కాలంలో శ్రీవారి మహాభక్తులైన ఎందరో రాజులు, మహారాజులకు ఆదర్శప్రాయమైంది.

ఉగ్రశ్రీనివాసుడు

ఈ శ్రీనివాసునికే ఉత్సవ శ్రీనివాసుడని మరియొక పేరు వుండేది. ఈ మూర్తిని **స్నపనబేరం**, **అచ్యుతబేరం** మరియు స్నపనమూర్తి అని కూడా పిలుస్తారు. స్నపనం అంటే పరిశుద్ధం చేయుట లేదా శుద్ధి చేయుట అని అర్థం. శ్రీదేవి–భూదేవి సమేతుడై ఉండే ఈ స్వామిని సామాన్యశకం 1200 సం. లో యాదవరాజొకరు ఆలయానికి బహూకరించారు. అప్పటినుండి ఈ మూర్తులు అనందనిలయం నందుండి, ఉత్సవమూర్తులుగా పూజాపునస్కారాలు అందుకుంటూ ఉండేవి. ఒకానొకప్పుడు బ్రహ్మోత్సవాల సందర్భంలో ఈ మూర్తులను ఉత్సవమూర్తులుగా వూరేగిస్తున్నపుడు ఒక అగ్నిప్రమాదం జరిగి తిరుమలలోని గృహాలన్నీ భస్మీపటల మయ్యాయి. శ్రీవారు

అర్చకస్వాములకు దర్శనమిచ్చి ఇక మీదట ఆ మూర్తుల్ని వుత్సవ విగ్రహాలుగా ఉపయోగించ వద్దని చెప్పారు. అంతే గాకుండా, మలయకొండల్లో స్వామివారి విగ్రహాలు లభిస్తాయని, ఇకనుండి అవి మాత్రమే ఉత్సవ విగ్రహాలుగా పూజలందు కోవాలని శెలవిచ్చి అంతర్థాన మయ్యారు. స్వామివారికి ఆగ్రహం వచ్చి అగ్ని ప్రమాదం జరిగిందని భావించి, అప్పటినుండి ఆయనను "ఉగ్రశ్రీనివాసునిగా" పిలుస్తూ ఆనందనిలయానికే పరిమితం చేశారు. ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి సందర్భంగా జరిగే ఆరాధన నాడు మరియు కార్తికద్వాదశి రోజు మాత్రమే ఈ ఉగ్రశ్రీనివాసునికి ఆస్థానం జరుగుతుంది.

కార్తీకద్వాదశి నాడు సుప్రభాతం, తోమాలసేవ అనంతరం శ్రీదేవి-భూదేవి సమేత ఉగ్రశ్రీనివాసునికి అభిషేకాదులు నిర్వహించి; పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పమాలలు అలంకరిస్తారు. పిదప స్వామివారు మాడవీధుల్లో ఊరేగింప బడతారు. ఈ ఊరేగింపు సూర్యోదయానికి చాలా ముందుగా జరుగుతుంది. సూర్యోదయానంతర వెలుగులు ఈ మూర్తిని సోకితే ఉగ్రత్వం వస్తుందని భావించి, ఈ ఉత్సవాన్ని తెల్లవారు ఝామున సూర్యోదయానికి చాలా ముందుగానే ముగిస్తారు. ఉదయం 3 గం. లోపే ఈ మూర్తులు మందిరం అంతర్భాగం చేరేట్లు అర్చకులు అత్యంత జాగ్రత్త వహిస్తారు. ఊరేగింపు పూర్తయిన తరువాత ఉగ్రశ్రీనివాసుణ్ణి ఆలయం నందలి రంగమండపంలో గల సర్వభూపాల వాహనంలో వేంచేపు చేసి నైవేద్య నీరాజనాలు సమర్పించి ఆనందనిలయంలో పునఃప్రవేశింప జేస్తారు. శ్రీవారి మూలమూర్తికి ముమ్మూర్తులా నకలు ప్రతిమ అయిన ఉగ్రశ్రీనివాసుని విగ్రహం పంచలోహ నిర్మితమైనది. ఈ మూర్తి ఇరవై అంగుళాల ఎత్తు కలిగి వుండి ఆరంగుళాల ఎత్తైన పద్మపీఠంపై అమర్చబడి వుంటుంది. అలాగే, స్వామి వారికి ఇరువైపులా అయిదంగుళాల ఎత్తైన పీఠంపై పద్ధెనిమిది అంగుళాల ఎత్తైన శ్రీదేవి-భూదేవిల పంచలోహ ప్రతిమలు దర్శనమిస్తాయి.

మలయప్ప స్వామి

3 అడుగుల 9 అంగుళాల ఎత్తుతో, ఈ స్వామి దేవేరులైన శ్రీదేవి-భూదేవి సమేతంగా వుంటారు.

సామాన్యశకం 1330 సం. లో మలయకోనలో ఈ స్వామి లభించారు. ఒకానొక బ్రహ్మోత్సవాల సందర్భంలో అగ్నిప్రమాదం సంభవించినప్పుడు, ఉగ్రశ్రీనివాసుని అనతిపై తిరుమల సానువుల్లోని మలయపర్వతంలో గాలింపు చర్యలు చేపట్టగా ఈ మూర్తులు లభ్యమయ్యాయి. మలయపర్వతం అంటే 'తల వంచిన కొండ' అని అర్థం. ఉభయదేవేరులతో ఉన్న మలయప్పస్వామి వారి మూర్తులను ఉత్సవ విగ్రహాలుగా ఊరేగిస్తూ అర్థాంతరంగా ఆపివేయబడ్డ బ్రహ్మోత్సవాలను తిరిగి కొనసాగించారు. అప్పటినుండి ఈనాటి వరకూ ఈ మూర్తులే ఉత్సవ విగ్రహాలుగా పూజలందు కొంటున్నాయి.

తిరుమలలో జరిగే డోలోత్సవం, నిత్యకళ్యాణోత్సవం, ఆర్జితబ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవ, పవిత్రోత్సవాలు అన్నీ మలయప్పస్వామికే చెందుతాయి. అన్ని ఉత్సవాలు, వేడుకల నందుకొనే ఈ స్వామి తిరుమలను సందర్శించుకునే భక్తులందరికీ సుపరిచితులు. ఆనందనిలయం లోని మూలమూర్తి దర్శనార్థం భక్తులు వారి చెంతకు

చేరుకోవాలి. కానీ భక్తసులభుడైన మలయప్పస్వామి వారు మాత్రం తానే ఆనందనిలయం లోనుండి బయటకు వచ్చి భక్తుల వద్దకు వేంచేస్తారు. ఆనందనిలయం లోనికి ప్రవేశించటంలో అశక్తులైన తన భక్తుల సందర్శనార్థం, మూలమూర్తే తన ప్రతిరూపాన్ని బయటకు పంపుతున్నారేమో!

కొల్లిగళ వీరణ్ణశెట్టి అనే భక్తునికి విష్ణుమూర్తి కలలో కనిపించినందుకు గుర్తుగా ఆయన స్వామివారికి వజ్రకిరీటం చేయించారు. ఆ వజ్రకవచాన్ని తొలుతగా తమ ఇలవేలుపు అయినట్టి "చెరువు నారాయణస్వామి" కి తొడగడానికి ప్రయత్నిస్తే అది సరిపోదు. ఆ తరువాత శ్రీరంగనాథునికి ప్రయత్నిస్తే వారికి కూడా సరిపోదు. అప్పుడు కంచిలో ఉన్న అర్చకస్వాములు తిరుమల లోని మలయప్పస్వామి పేరు సూచించారు. అప్పుడా భక్తుడు తిరుమల క్షేత్రానికి విచ్చేసి మలయప్పస్వామికి ఆ కవచం తొడిగితే సరిగ్గా సరిపోతుంది. ఇప్పటికీ ఆ కవచం క్రింద భాగంలో ఆ భక్తుని పేరును మనం చూడవచ్చు.

ఈ పంచలోహ విగ్రహాలు తామరపువ్వు ఆకారంలోని పీఠం మీద కొలువై వుంటాయి. అనేక స్వర్ణాభరణాలతో బాటుగా, వజ్రకవచం మరియు ముత్యాలకవచం కూడా మలయప్పస్వామి వారి స్వంతం.

ఆనందనిలయం లోని ఈ పంచబేరాలు విష్ణువు యొక్క మహారూపాలను సూచిస్తాయి:

మూలవిరాట్టు	విష్ణువు
భోగ శ్రీనివాసుడు	పురుషుడు
మలయప్ప స్వామి	మహా విష్ణువు
ఉగ్ర శ్రీనివాసుడు	సదా విష్ణువు
కొలువు శ్రీనివాసుడు	వ్యాపి నారాయణుడు

ఈ పంచబేరాలే కాకుండా, ఆనందనిలయంలో ఇతర పరివారదేవతలు కూడా ఉంటారు – ఆంజనేయ లక్ష్మణ సీతా సమేత శ్రీరాముడు, రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడు, సుదర్శనచక్రం, సేనాని విష్వక్సేనుడూ, గరుత్మంతుడూ – మొదలగు వారు. ఈ మూర్తుల గురించి వచ్చే ప్రకరణాల్లో వివరంగా తెలుసుకుందాం.

----------: : ----------

శ్రీవారి సేవలు

తిరుమలక్షేత్రంపై ఆజమాయిషీ తరచూ చేతులు మారినప్పటికీ; చారిత్రకాధారాలు లభ్యమైనంత వరకు, సకలలోక సార్వభౌముడైన శ్రీనివాసునికి సేవలు, ఉత్సవాలు పదిహేను వందల సంవత్సరాలకు పైబడి కొనసాగుతూనే ఉన్నాయి. వెయ్యేళ్ళక్రితం శ్రీరామానుజులవారు, అంతకు పూర్వం జరిగే సేవలన్నింటినీ క్రమబద్ధీకరించి, ఒక నిర్దిష్టమైన సేవలపట్టీని, అర్చనావిధానాన్ని రూపొందించారు. ఈనాడు కూడా, స్వల్ప మార్పులు, చేర్పులతో అవే సేవలు, అదే క్రమంలో జరుప బడుతున్నాయి. కాలానుగుణంగా, మరికొన్ని ఇతరసేవలు కూడా చేర్చబడ్డాయి.

ప్రస్తుతం సంవత్సరానికి 450 కు పైగా ఉత్సవాలు జరుగుతాయి.

నిత్య, వార, పక్ష, త్రైమాసిక, వార్షిక ఉత్సవాలు ఎన్నో, ఎన్నెన్నో...

ఆలయ ఆగమశాస్త్రానుసారం, స్వామి రోజూ ఆరుసార్లు పూజలందు కుంటున్నారు. వీటినే "షట్కాల పూజలు" గా వ్యవహరిస్తారు.

సుప్రభాతసేవ నుండి దాదాపు నడిరేయి సమయంలో జరిగే ఏకాంతసేవ వరకూ...

బ్రహ్మముహూర్తంలో సుప్రభాతగానాన్ని ఆలకించి, నవనీతహారతి నందుకొని విశ్వరూపదర్శనాన్ని అనుగ్రహించే స్వామివారు అనేక సేవలు, లెక్కకు మిక్కిలి నైవేద్యాలు అందుకుంటూ, రాత్రి ఏకాంతసేవలో ముత్యాలహారతితో హాయిగా విశ్రమిస్తారు. ఆ సేవలన్నింటినీ ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

సుప్రభాతసేవ

చారిత్రక ఆధారలను బట్టి ప్రస్తుతం అమలులో ఉన్న సుప్రభాతసేవా విధానం 15వ శతాబ్దిలో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. అంతకు ముందు ఈ సేవ ఎలా జరిగేదో తెలిపే ఆధారాలు లభ్యం కాలేదు. ఐతే, స్వామివారికి మేలుకొలుపులు పాడే సాంప్రదాయం మాత్రం ఎప్పటినుండో ఉంది.

తరతరాలుగా, హైందవజాతిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతం చేస్తున్న మహత్తర స్తవం "శ్రీవేంకటేశ్వరసుప్రభాతం." నేటికీ లక్షలాది, దేశవిదేశాలలో ఉన్న తెలుగువారి ఇండ్లలో దినచర్య, నిత్యపూజ సుప్రభాత పఠనంతోనే ఆరంభ మవుతాయి. ప్రాతఃసంధ్య వేళ ఈ సుప్రభాతగానం వినగానే, భగవద్ధ్యానంలో తాదాత్మ్యం చెంది, మనం పొందే అలౌకిక, ఆధ్యాత్మిక అనుభూతి వర్ణనాతీతం!

కలియుగంలో కూడా, త్రేతాయుగపు శ్రీరామునివలెనే "కౌసల్యాసుప్రజారామా" అంటూ మేలుకొలుపు పాడించుకోవడం ద్వారా, తాను సాక్షాత్తూ శ్రీరామచంద్రుని మరో అవతారమని స్వామి లోకాలకు చాటుతున్నారు. అలాగే, శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలో ద్వాపరయుగపు శ్రీకృష్ణుని ప్రస్తావన మరియు ప్రత్యేక పూర్వపుయుగాల్లో శ్రీమహావిష్ణువు యొక్క అనేక అవతారల వర్ణన కూడా కానవస్తుంది. 29 శ్లోకాలున్న సుప్రభాతాన్నీ, 11 శ్లోకాలున్న

స్తోత్రాన్ని (కమలాకుచ చూచుక కుంకుమతో...), 16 శ్లోకాలున్న ప్రపత్తినీ (ఈశానాం జగతో...), 14 శ్లోకాలున్న మంగళాశాసనాన్నీ (శ్రియఃకాంతాయ కళ్యాణనిధయే...), 15వ శతాబ్దంలో మనవాళ మహాముని శిష్యుడైన "ప్రతివాద భయంకర అణ్ణన్ స్వామి" రచించారు. వారి అసలు పేరు హస్తగిరినాథన్. ఇంతటి మహత్తరమైన స్తోత్రరత్నావళి నందించిన వీరు శ్రీవారి భక్తులందరికీ ప్రాతఃస్మరణీయులు.

ప్రతిరోజు బ్రాహ్మీముహుర్త కాలంలో (తెల్లవారుఝామున 2:30–3:00 గం. ల మధ్య) సుప్రభాతసేవ జరుగుతుంది. ఆ సమయంలో 'సన్నిధిగొల్ల' తిరునామం ధరించి, దివిటీ చేబూని ఉత్తరమాడవీధి లోని అర్చకుల ఇంటికి వెళ్ళి, వారికి నమస్కరించి, సాదరంగా వారిని ఆలయానికి ఆహ్వానిస్తాడు. అప్పటికే పవిత్ర స్నానం, ఊర్ధ్వపుండ్రధారణ (తిరునామాలు), అనుష్ఠానాదులు ముగించి సిద్దంగా ఉన్న అర్చకస్వాములు శ్రీవారి బంగారువాకిలిని తెరిచే "కుంచెకోల" అనబడే పరికరాన్ని భుజంపై పెట్టుకొని, తాళంచెవుల గుత్తితో, సన్నిధిగొల్లను అనుసరిస్తూ ఆలయానికి విచ్చేస్తారు.

ఇలా అర్చకస్వాములు మహాద్వారం వద్దకు చేరగానే మహాద్వారానికి లోపల, ఉత్తరదిక్కున ఉన్న నగారామండపంలో పెద్ద పలకగంటను మ్రోగిస్తారు. 1960 ల్లో, ఈ గంట దేవాలయానికి ఎదురుగా ఉన్న వేయికాళ్ళమంటపం పైకప్పుకు వ్రేలాడుతుండేది. మాడవీధుల విస్తరణలో భాగంగా, ఈ మధ్యకాలంలో ఆ మంటపం కూల్చివేయబడింది.

సన్నిధిగొల్లననుసరిస్తూ వస్తున్న అర్చకులు ప్రధాన ద్వారదేవతలకు (శంఖనిధి–పద్మనిధి) మంత్రపూర్వక ప్రణామాలర్పిస్తూ ఆలయప్రవేశం చేస్తారు. వారివద్ద ఉన్న కుంచెకోలనూ, తాళంచెవులగుత్తినీ ధ్వజస్తంభ మండపంలో ఈశాన్యదిక్కున ఉన్న క్షేత్రపాలకశిలకు తాకించి, భక్తితో నమస్కరించి, ధ్వజస్తంభానికి ప్రదక్షిణగా వెండి వాకిలిని దాటి, బంగారువాకిలి ముందు మౌనంగా స్వామివారిని ధ్యానం చేస్తుంటారు.

అర్చకస్వాములను అక్కడ వదిలి, సన్నిధిగొల్ల మరల సన్నిధివీధిలోని బేడి ఆంజనేయస్వామి గుడి వద్దనున్న శ్రీమాన్ పెద్దజియ్యంగార్ మఠానికి వెళ్ళి, జియ్యంగారినీ లేదా వారి పరిచారకుడైన ఏకాంగినీ ఆలయంలోని బంగారువాకిలి ముంగిటకు తోడ్కొని వెళ్తాడు.

ఆ సమయానికి అర్చకులతో పాటుగా; ఆలయ అధికారులు, శ్రీవారి సుప్రభాతాన్ని పఠించే వేదపండితులు బంగారువాకిలి ముందు వేచి ఉంటారు. అలాగే అన్నమయ్య వంశీయులొకరు తుంబుర ధరించి మేలుకొలుపు సంకీర్తన పాడటానికి సిద్ధంగా ఉంటారు. వీరందరితో బాటుగా ఇంద్ర, వరుణ, బ్రహ్మాదిదేవతలు; శివపరివారము, సనకసనందనాదులు, సప్తఋషులు, అష్టదిక్పాలకులు, నారదాది మహర్షులు, గంధర్వ యక్ష కిన్నెర కింపురుషులు, గరుత్మంతుడు, ఆదిశేషువు మున్నగువారందరు పుష్కరిణిలో పవిత్ర స్నానమాచరించి, అదృశ్యరూపంలో స్వామివారి సుప్రభాతానంతర దర్శనార్థం వేచియుంటారని ప్రసిద్ధి.

అర్చకులు, జియ్యంగార్ లేదా వారి పరిచారకుడైన ఏకాంగి, ఆలయ అధికారులు, వేదపండితులు, తాళ్ళపాక వంశీయులు, సన్నిధిగొల్ల, సుప్రభాతసేవ ఆర్జితసేవకు విచ్చేసిన భక్తులు వీరందరి సమక్షంలో, అర్చకులు కుంచెకోలతో బంగారువాకిలికి ఉన్న చిన్న రంధ్రం ద్వారా, లోపల వేసివున్న గడియను తీస్తారు. తరువాత అందరి

సమక్షంలో తాళం చెవులకు, తాళాలకు రాత్రి వేసిన సీళ్ళను పరిశీలించి, తాళాలు తెరుస్తారు. తాళంచెవులను ఆలయ ధర్మకర్తలుగా వ్యవహరించే – అర్చకులు, జియ్యంగార్లు, ఆలయ అధికారులు – ఈ ముగ్గురి వద్ద సీళ్ళు వేసియున్న పెట్టెలలో భద్రపరిచే సంక్లిష్టమైన మరియు సురక్షితమైన వ్యవస్థ ఏనాటినుంచో అమలులో ఉంది. ఆ విధివిధానాలను ఈనాటికీ పొల్లుపోకుండా పాటిస్తారు. ఆనందనిలయుని అంతులేని సంపదకు ఆమాత్రం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాల్సిందే మరి!

తదనంతరం, బంగారువాకిలి తెరుచుకుని సన్నిధిగొల్ల దివిటీతో ముందుగా లోనికి ప్రవేశిస్తాడు. మరుక్షణం అర్చకులు కూడా సుమధురస్వరంతో, '*కౌసల్యాసుప్రజారామ*' అంటూ వీనులవిందుగా ఆలపిస్తూ బంగారు వాకిలిలోనికి ప్రవేశిస్తారు. ఏకాంగి మహంతుమఠం వారు తెచ్చిన పాలు, చక్కెర, వెన్న, తాంబూలం గల బంగారు పళ్ళేరాన్ని అందుకుని లోనికి వెళ్ళిన వెంటనే బంగారువాకిలి మూయబడుతుంది. బంగారువాకిలి ముందు వేచివున్న వేదపండితులు అర్చకులు ప్రారంభించిన సుప్రభాతగీతాన్ని అందుకుని వీనులవిందుగా వినిపిస్తారు. తరువాత అన్నమయ్య వంశీయులు బంగారువాకిలి ముందు నిలబడి మేలుకొలుపు కీర్తనను భూపాలరాగంలో ఆలపిస్తారు. సుప్రభాతసేవకు విచ్చేసిన భక్తులు శ్రవణపేయంగా, రాగయుక్తంగా ఆలపింప బడుతున్న సుప్రభాతాన్ని వింటూ భక్తిపారవశ్యంలో మైమరచి పోతారు. సుప్రభాతసేవలో పాల్గొనే భక్తులకు దాదాపు 20–25 నిముషాల పాటు బంగారువాకిలికి ఎదురుగా, అత్యంతసమీపంలో వేచియుండి, వీనులవిందైన సుప్రభాతగానాన్ని ప్రత్యక్షంగా ఆలకిస్తూ, అందులో స్వరం కలుపుతూ, బంగారువాకిళ్ళను శాస్త్రోక్తంగా తెరిచే విస్తారమైన ప్రక్రియను పరత్యక్షంగా తిలకించుకునే మహత్తరభాగ్యం దక్కుతుంది. ఈసేవ కోసం ఏళ్ళ తరబడి వేచియుండే భక్తులు ఎందరో ఉంటారు.

బంగారువాకిళ్ళను దగ్గరగా మూసిన సన్నిధిగొల్ల వద్దనున్న దివిటీ వెలుగులో, అర్చకులు రాములవారి మేడకు (బంగారువాకిలిని దాటిన వెంటనే వచ్చే మంటపం) వేసివున్న తలుపుల తాళాలను తీసి, శయనమండపంలో పానుపుపై శయనించి ఉన్న భోగశ్రీనివాసునుకి ప్రదక్షిణగా శ్రీవారిసన్నిధికి చేరుకుంటారు. వైఖానస అర్చకులు, జియ్యంగార్లు వెంట రాగా దివిటీతో ముందుగా లోనికి వెళ్ళిన సన్నిధిగొల్ల, కులశేఖరపడి (ఏడుద్వారాల్లో చిట్టచివరిది, అంటే స్వామివారికి అత్యంత సమీపంలో ఉండేది) వద్ద నిలచి, ఆ వెలుగులో శ్రీవారి దివ్యమంగళవిగ్రహ తొలిదర్శనం చేసుకుంటాడు. ఓ గొల్లవానికి తొలిదర్శనభాగ్యమా? ఆశ్రితపక్షపాతియైన స్వామివారి అనుగ్రహానికి హద్దులుండవు మరి!

సన్నిధిగొల్ల చేతిలోని దివిటీ నందుకుని 'ఏకాంగి' దేవుని సన్నిధిలోని దీపాలు వెలిగించగా, సన్నిధిగొల్ల రాములవారిమేడ లోని దీపాలను వెలిగిస్తాడు. అనంతరం అర్చకులు శ్రీవారికి నమస్కారం చేసి, శయనమండపం లో బంగారు పట్టుపరుపుపై శయనించివున్న భోగశ్రీనివాసమూర్తిని సమీపించి, నమస్కరించి, చప్పట్లు చరిచి, మేల్కొనవలసిందిగా ప్రార్థిస్తారు. తరువాత, భోగశ్రీనివాసమూర్తి విగ్రహాన్ని మూలమూర్తి సన్నిధిలో (జీవస్థానంలో) వేంచేపు చేస్తారు.

ఆనందనిలయంలో కులశేఖరపడి వద్ద తెరవేసి, అర్చకులు శ్రీవారికి దంతధావన, ఆచమనాది ప్రక్రియలు గావించి

మహంతుమఠం వారు తెచ్చిన నవనీతం, పాలు, చక్కెరను నివేదన చేసి, సుగంధ తాంబూలాన్ని సమర్పిస్తారు. బంగారువాకిలి ముంగిట్లో వేదపండితులు సుప్రభాతం, మంగళాశాసనాన్ని ముగిస్తూవుండగా, లోపల అర్చకులు శ్రీవారికి నవనీతహారతి నిస్తున్నప్పుడు, బంగారువాకిళ్ళు తెరువబడతాయి.

విశ్వరూప దర్శనం

శ్రీవారిపాదాలపై బంగారు తొడుగులు, తులసి, పుష్పాలవంటివి లేకుండా; స్వామివారి దివ్యమంగళరూపం ఆపాదమస్తకం కనిపించే ఈ దర్శనాన్ని "విశ్వరూపదర్శనం" అంటారు. ఇలా ఎందుకన్నారంటే –

రాత్రి ఏకాంతసేవకు ముందు చిన్న గంధం ముద్ద భోగశ్రీనివాసుని వక్షఃస్థలంలోనూ, మరో కొంచెం గంధం మూలమూర్తి పైనున్న అమ్మవారివద్ద ఉంచుతారు. ఇతర పూజాద్రవ్యాలు వేరొక పళ్ళెంలోను, ఐదు బంగారుపాత్రలలో శుద్ధమైన నీరు కూడా ఉంచుతారు. అంతే గాకుండా, స్వామివారి పాదాలకున్న బంగారు తొడుగులు తీసి, రెండు పాదాలపై రెండు గంధం ముద్దలు ఉంచి వాటిపై చిన్న వస్త్రం కప్పుతారు. బ్రహ్మాదిదేవతలు నిశిరాత్రి (రాత్రి ఏకాంతసేవకు మరియు మరునాటి వేకువఝామున జరిగే సుప్రభాతసేవకు మధ్య) సమయంలో విచ్చేసి శుద్ధోదకం, చందనం, ఇతర పూజాద్రవ్యాలతో స్వామివారిని అర్చించుకోవడం కోసం ఈ ఏర్పాటు. ఇదివరలో ఈ గంధాన్ని, తీర్థాన్ని సుప్రభాతసేవకు విచ్చేసిన భక్తులకు ఇచ్చి, పాదవస్త్రాలను కళ్ళకద్దుకో నిచ్చేవారు. ఇప్పుడు మాత్రం చందన, తీర్థాలను మొదటగా అర్చకస్వాములు స్వీకరించి, తరువాత జియ్యంగారికి, ఏకాంగికి, సన్నిధిగొల్లకు అందజేస్తారు. సన్నిధిగొల్లకు వీటితోపాటుగా నివేదన పళ్ళెంలోని తాంబూలాన్ని కూడా ఇస్తారు. నిశిరాత్రిసమయంలో బ్రహ్మచే పూజించబడిన స్వామివారి "విశ్వరూపాన్ని" యథాతథంగా, మరునాడు ఉదయం సుప్రభాతసేవకు విచ్చేసిన భక్తులు దర్శించుకుంటారు కావున ఈ దర్శనాన్ని "విశ్వరూపదర్శనం" గా పిలుస్తారు.

నవనీతహారతి

అప్పుడే తీసిన వెన్న, ఆవుపాలను నివేదించి ఇచ్చే హారతి గావున, సుప్రభాతసేవలో స్వామివారికిచ్చే తొలిహారతిని "నవనీతహారతి" గా వర్ణిస్తారు. స్వామివారికిచ్చే అనేక రకాలైన హారతుల గురించి మరోసారి తెలుసుకుందాం.

అనంతరం జియ్యంగార్, ఏకాంగి, సన్నిధిగొల్ల బంగారువాకిలి వెలుపలికి వస్తారు. దేవస్థానం పరిచారకులు లోనికి వెళ్ళి శ్రీవారి పాన్పునూ, మంచాన్నీ తీసి ఆనందనిలయానికి ఉత్తరంగా ఉన్న "సబేరా"° అనబడే గదిలో ఉంచుతారు.

సుప్రభాతం పఠించిన వేదపండితులు, అన్నమయ్య వంశీయులు, మహంతు, మైసూరు సంస్థానంవారు స్వామి వారి సన్నిధికి వెళ్ళి హారతి, తీర్థం, శఠారి, చందనం, వెన్న, ఇతర మర్యాదలు పొందుతారు. తదుపరి స్వామివారి సుప్రభాతసేవకై వేచివున్న భక్తులు వరుస క్రమంలో స్వామివారిని దర్శించుకుని, అనంతరం ఆనందనిలయానికి దక్షిణం వైపునున్న ఓ ఎత్తైన అరుగుపైన, అంకురార్పణ మండపం నందు తీర్థం, శఠారులను స్వీకరించి ధన్యులవుతారు.

నిత్యం శ్రీవారికి జరిగే అనేక సేవల్లో తొలిసేవ కావటం, బంగారువాకిలిని తెరిచే ఆసక్తికరమైన సాంప్రదాయాన్ని కళ్ళారా వీక్షించగలగటం, బంగారువాకిలి ముందు దాదాపు ముప్పై నిముషాలు నిలబడి, వీనులవిందైన సుప్రభాతగానాన్ని వేదపండితుల ద్వారా వినగలగటం; అప్పుడే వెలిగించిన ఆవునెయ్యి దీపాలకాంతిలో స్వామివారి దివ్యమంగళ "విశ్వరూపాన్ని" కన్నులారా దర్శించ గలగటం వంటి కారణల వల్ల సుప్రభాతసేవంటే భక్తులకు ఎంతో ప్రీతిపాత్రమైనది. తాత్కాలిక అడ్డంకులన్నీ తొలగి, ఈ సేవాదర్శనభాగ్యం మీకు అతి త్వరలోనే కలగాలని ఆ దేవదేవుణ్ణి కోరుకుంటున్నాం.

తిరుప్పావై పఠనం

సంవత్సరంలో పదకొండు మాసాల పాటు స్వామివారిని మేలుకొలిపే సుప్రభాతపఠనం, ధనుర్మాసంలో మాత్రం జరుగదు. ఆ మాసంలో సుప్రభాతానికి బదులుగా, "తిరుప్పావై" పఠిస్తారు. పన్నెండుగురు ఆళ్వార్లు రచించిన "దివ్యప్రబంధం" లోని ముప్పై పాశురాల మాలికను "తిరుప్పావై" గా పిలుస్తారు. "ఆండాళ్ అమ్మవారి" గా కొలువబడే గోదాదేవి, శ్రీరంగనాథుణ్ణి భర్తగా పొందటం కోసం చెలులతో కలిసి, ముప్పైరోజుల పాటు కఠిన వ్రతమాచరిస్తూ, "తిరుప్పావై" గానం చేసినట్లు ప్రతీతి.

మూడు వైష్ణవదివ్యక్షేత్రాలలో ఒకటైన (శ్రీరంగం, కంచి – మిగిలిన రెండు క్షేత్రాలు) తిరుమల, "పుష్పమంటపం" గా పేర్గాంచింది. పుష్పప్రియులైన స్వామివారి నిత్యకైంకర్యాలలో, ఉత్సవాలలో, అలంకరణలో పుష్పాల్ని విరివిగా వినియోగిస్తారు.

సుప్రభాత సేవానంతరం, పుష్పాలే ప్రధానంగా శ్రీవారికి నిత్యం జరిగే "తోమాలసేవ" ను మంగళ, బుధ, గురువారాల్లో మాత్రమే భక్తులు దర్శించ గలరు. ఆ మూడు రోజులు ఇది అర్జితసేవగా పరిగణించ బడుతుంది. మిగిలిన నాలుగు రోజులు ఈ సేవ ఏకాంతంగా జరుగుతుంది. అయితే, శుక్రవారం మాత్రం సుప్రభాత సేవానంతరం అభిషేకం, తదనంతరం తోమాలసేవ జరుగుతాయి.

తోమాలసేవ

తోమాలసేవ అంటే?

తోమాలసేవ భోగశ్రీనివాసునుకి జరిగే అభిషేకం.

శ్రీనివివాసుని దివ్యమంగళమూర్తికి అనేక పుష్పమాలలతో, తులసిమాలలతో, అనునిత్యం చేసే సేవాకైంకర్యమే "తోమాలసేవ". ఈ సేవకు "తోమాలసేవ" అనే పేరు రావడం వెనుక అనేక కథనాలున్నాయి.

- తమిళంలో 'తోడుత్తమాలై' అంటే నారతో కట్టిన మాల అని అర్థం. కాలక్రమంలో అదే 'తోమాల' గా మారి ఉండవచ్చు.
- 'తోల్' అంటే భుజం అని అర్థం. భుజం నుంచి వ్రేలాడే మాలలు గనుక 'తోమాలలు' అని అంటారు.

- 'తోమాల' అంటే చేతితో కట్టిన పూలదండ అని మరియొక అర్థం కూడా ఉంది.
- అంతే కాకుండా, తోమాల అంటే తోటలో నుండి తెచ్చిన పూమాలలు లేదా తులసిమాలలు అనే అర్థం కూడా ఉంది.

దాదాపుగా పైన చెప్పిన అర్థాలన్నీ ఈ సేవకు వర్తిస్తాయి.

ముందురోజు రాత్రే ఆయా కాలాల్లో లభించే అనేక రకాల, రంగురంగుల, పరిమళ పుష్పాలతో తయారు చేయబడిన పుష్పమాలికలను, విమానప్రదక్షిణం లోని యోగానరసింహస్వామి ఆలయం ప్రక్కనవున శీతల పుష్పఅర లో సిద్ధం చేస్తారు.

అభిషేకనిమిత్తం ఆకాశగంగ తీర్థం

మూలవిరాట్టుకు నవనీతహారతిని సమర్పించగానే భోగశ్రీనివాసునకి జరిగే అభిషేకంతో "తోమాలసేవ" ప్రారంభమవుతుంది. ఈ అభిషేకానికి, పూర్వం శ్రీవారి నిత్యాభిషేకకైంకర్యంలో తరించిన మహాభక్తుడు తిరుమలనంబి వంశీయులు (వీరిని "తోళప్పాచార్యులు" గా పిలుస్తారు), దేవాలయానికి దాదాపు మైలున్నర దూరాన ఉన్న ఆకాశగంగ తీర్థాన్ని వెండి బిందెలతో, ఛత్రచామర మంగళవాద్య మర్యాదలతో, తెల్లవారకముందే తీసుకుని వచ్చేవారు. నడిరేయి చిమ్మచీకట్లలో, రక్షకభటులు వెంటరాగా, అరణ్యమార్గంలో, కాలినడకన, తరతరాలుగా ఈ అభిషేకజలాన్ని భుజాలపై మోసుకుంటూ తెస్తున్న తిరుమలనంబి వంశీయులు ధన్యజీవులు. అయితే ఈ మధ్యకాలంలో, ఆకాశగంగ నుండి అభిషేకజలాన్ని తెచ్చే లాంఛనం కేవలం శుక్రవారం నాడు మూలమూర్తికి జరిపించే శుక్రవారాభిషేకానికి మాత్రమే పరిమితం చేశారు.

ఈ తీర్థాన్ని తెచ్చి, ఆలయానికి ప్రదక్షిణ చేసి, ఆ బిందెలను సన్నిధిలో ఉంచేవారు.

భోగశ్రీనివాసునికి అభిషేకం

అనంతరం అర్చకస్వాములు శ్రీవారికి నమస్కరించి, సుప్రభాతసేవలో మేల్కొలపబడిన భోగశ్రీనివాసుణ్ణి వెండి స్నానపీఠంపై వేంచేపు చేయిస్తారు. ఆర్ఘ్య, పాద్య, ఆచమన, అనుష్ఠాన, ఉపచారాలు చేసిన తరువాత, బంగారుబావిలో నిలువ ఉంచబడిన ఆకాశగంగ తీర్థంతో భోగశ్రీనివాసునకి అభిషేకం చేస్తారు.

తరువాత శ్రీవేంకటేశ్వరస్వామి (మూలవిరాట్టు) వారి నిజపాదాలపై ఉన్న బంగారు తొడుగులకు కూడా అభిషేకం చేస్తారు. వేదపండితులు పురుషసూక్తం పఠిస్తూండగా, అర్చకులు శ్రీవారి సన్నిధిలోని నృసింహ, శ్రీరామ సాలగ్రామాలకు కూడా అభిషేకం చేస్తారు. అనంతరం మూలమూర్తికీ, వక్షస్థలలక్ష్మికీ, శ్రీదేవీ-భూదేవి సహిత మలయప్పస్వామికీ, ఉగ్రశ్రీనివాసునికీ, ఇలా సన్నిధిలో వున్న పంచబేరాలకు, అభిషేకం చేయించినట్లుగా ఆకాశగంగ తీర్థంతో సంప్రోక్షిస్తారు.

అయితే రోహిణీనక్షత్రం నాడు మాత్రం సన్నిధిలోనే వున్న రుక్మిణీ శ్రీకృష్ణులకు కూడా తిరుమంజనం (అభిషేకం)

నిర్వహిస్తారు. అలాగే, పునర్వసు నక్షత్రం నాడు సీతారామలక్ష్మణులకూ, శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణానక్షత్రం నాడు శ్రీదేవీ–భూదేవి సహిత మలయప్పస్వామికీ కూడా అభిషేకం జరుగుతుంది.

అభిషేకానంతరం భోగశ్రీనివాసునుకి వస్త్రాలంకరణ, తిలకధారణ చేసి; మిగిలిన ఉత్సవమూర్తులకు షోడశోపచారాలు సమర్పిస్తూండగా జీయ్యరు గార్లు, వైష్ణవస్వాములు దివ్యప్రబంధంలోని ఆళ్వార్లు గానం చేసిన 'తిరుప్పళ్ళిఎళుచ్చి' అనే అరువది పాశురాలను పారాయణం చేస్తారు.

శ్రీవారికి పుష్పాలంకరణ

ఉత్సవమూర్తు లందరికీ అభిషేకాదులు జరిగిన వెనువెంటనే, జియ్యంగారు పూలమాలలు ఉన్నట్టి వెదురుగంపను తలపై పెట్టుకుని, ఛత్రచామర మర్యాదలతో, పలకగంట–సన్నడోలు మ్రోగుతుండగా, సన్నిధిగొల్ల దివిటీతో దారి చూపుతుండగా, పుష్పఅర నుండి బయలుదేరి ధ్వజస్తంభానికి ప్రదక్షిణ చేసి, వెండివాకిలి ద్వారా లోనికి వచ్చి, విమానప్రదక్షిణ చేసి, బంగారు వాకిలి ద్వారా, శ్రీవారి సన్నిధిలో ఉన్న అర్చకులకు అందజేస్తారు.

అర్చకస్వాములు ఈ మాలలను స్వీకరించి, నీళ్లతో శుద్ధి పరుస్తారు. ఆ మాలలతో ముందుగా భోగశ్రీనివాసుణ్ణి అలంకరించి, ఆ తరువాత మూలమూర్తికి కంఠంలోనూ, హృదయం పైనా పుష్పమాలు వేసి, శంఖుచక్రాలను, కిరీటాన్ని, నందకఖడ్గాన్ని అలంకరిస్తారు.

ఆ తరువాత భుజాలమీదుగా నాభి వరకు, నడుమువరకు, ఊరువులవరకు, మోకాళ్ళవరకు, పాదాలవరకు వ్రేలాడునట్లుగా పొడవైన పూలదండలను అలంకరిస్తారు. ఈ పుష్పాలంకరణం శ్రీవారి పాదాలతో మొదలవుతుంది.

అమలులో ఉన్న ఆచారం ప్రకారం, శ్రీవారికి శిఖామణిని అలంకరించేటప్పుడు, తెరవేసి మరలా తీస్తారు.

మాలలకు పేర్లు

ఆపాదమస్తకం అలంకరింపబడే ఈ పుష్పమాలలకు కొన్ని స్థిరమైన పేర్లు ఉండటం విశేషం –

- శ్రీవారి పాదాలపై అలంకరించే ఒక్కక్క మూర గల రెండు పుష్పమాలలను ***తిరువడి దండలు*** అంటారు.
- శ్రీవారి కిరీటం మీదుగా రెండు భుజాలవరకు అలంకరింపబడే 8 మూరల పుష్పమాలను ***శిఖామణి*** అంటారు.
- శ్రీవారి భుజాలనుండి ఇరువైపులా పాదాలవరకు వ్రేలాడునట్లుగా అలంకరించే పొడవాటి మాలను ***సాలగ్రామమాల*** అంటారు.
- శ్రీవారి మెడలో రెండు వరుసలుగా భుజాలమీదికి అలంకరించబడే మూడున్నర మూరల పుష్పహారాన్ని ***కంఠసరి*** అంటారు.
- శ్రీవారి వక్షఃస్థలంలో ఉన్న శ్రీదేవి–భూదేవిలకు ఒకటిన్నర మూరల పొడవుండే రెండు పుష్పమాలికలను ***వక్షస్థలమాలలు*** లేదా వక్షఃస్థల తాయార్ల సరాలు అంటారు.

- ఒక్కొక్కటి ఒక్కొక్క మూర ఉన్న రెండు దండలను శంఖుచక్రాలకు అలంకరిస్తారు. వీటిని ***శంఖుమాల, చక్రమాల*** అంటారు.
- శ్రీవారి నందకఖడ్గానికి అలంకరించే రెండు మూరల పుష్పమాలికను ***కఠారిసరం*** అంటారు.
- రెండు మోచేతుల క్రింద నుండి పాదాలవరకు వ్రేలాడదీసే రెండు పుష్పమాలలను ***తావళములు*** అంటారు. వీటిలో ఒకటి 40 అంగుళాలు మరియొకటి 50 అంగుళాల పొడవు ఉంటాయి. వీటిని శ్రీవారికి ఇంగ్లీషు అక్షరం U ఆకారంలో ధరింపజేస్తారు.

ఉత్సవమూర్తులకు పుష్పమాలాలంకరణ

శ్రీవైష్ణవస్వాములు గోదాదేవి కీర్తించిన తిరుప్పావై లోని తిరుప్పళ్ళియెళుచ్చి, తిరుప్పళ్ళాండు మొదలైన పాశురాలు శ్రావ్యంగా గానం చేస్తుండగా, అర్చకస్వాములు శ్రీదేవీ–భూదేవి సమేతుడైన మలయప్పస్వామికీ, ఉగ్రశ్రీనివాసమూర్తికీ, కొలువుశ్రీనివాసమూర్తికీ, సీతాలక్ష్మణ సమేతుడైన కోదండరామస్వామికీ, రుక్మిణీ సమేతుడైన శ్రీకృష్ణునికీ, చక్రత్తాళ్వార్ కు మరియు సాలగ్రామాలకు పుష్పమాలలు అలంకరిస్తారు.

ధూప-దీప హారతులు

పుష్పమాలాలంకరణ పూర్తయిన తరువాత వేదపండితులు మంత్రపుష్పాన్ని సమర్పిస్తారు. ఆ తరువాత స్వామివారికి ధూప, దీప, నక్షత్రహారతులు, చివరగా కర్పూరహారతి సమర్పిస్తారు.

ముప్పూటలా తోమాలసేవ

ఈ సేవ సుమారు అరగంటకు పైగా జరుగుతుంది.

నిత్యార్చనలో భాగంగా జరిగే ఈ తోమాలసేవ, ఉదయం విస్తారంగా, మధ్యాహ్నం క్లుప్తంగా మరల సాయంత్రం విస్తారంగానూ, ముప్పూటలా జరుగుతుంది. ఉదయం జరిగే తోమాలసేవ మాత్రమే అర్జితసేవ. అప్పుడు మాత్రమే ఈసేవను భక్తులు దర్శించుకో గలరు. మధ్యాహ్నం, రాత్రి జరిగే తోమాలసేవలు ఏకాంతంగా జరుగుతాయి.

ఈ మాలలన్నింటినీ మూర (18 అంగుళాలు), బార (36 అంగుళాలు) కొలమానంతో వ్యవహరిస్తారు.

అంతటితో తోమాలసేవ ముగిస్తుంది.

కొలువు (లేదా ఆస్థానం లేదా దర్బార్)

బంగారు వాకిలిని ఆనుకుని లోపల ఉన్న గదిని 'స్నపన మండపం' అంటారు. అక్కడే శ్రీవారికి ప్రతిరోజూ ఉదయం 4.30 గం. ల నుండి ఆస్థానం జరుగుతుంది.

సన్నిధిలో ఉన్న పంచబేరాలలో ఒకరైన కొలువుశ్రీనివాసమూర్తిని ఛత్రచామరాది మర్యాదలతో, మంగళవాద్యాలతో, స్నపన మండపంలో ఉంచిన బంగారు సింహాసనంపై వేంచేపు చేస్తారు. ఆ తరువాత స్వామివారికి కొలువు నిర్వహింప

బడుతుంది. ఈసేవ పూర్తిగా ఏకాంతం. అర్చకులూ, ఆలయ అధికారులచే నిర్వహించ బడుతుంది. భక్తులకు అనుమతి లేదు.

కొలువు శ్రీనివాసునికి షోడశోపచారాలు నిర్వహించి, ధూపదీప హారతులు సమర్పిస్తారు. అనంతరం అర్చకులు, శ్రీవారి నుండి తాంబూలం, దక్షిణతో కూడిన 20 శేర్ల (ఇంచుమించుగా 16 కిలోలు) బియ్యాన్ని దానంగా స్వీకరించి, "నిత్యైశ్వర్యోభవ" అని శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తారు. ఆస్థానసిద్ధాంతి శ్రీనివాసునికి పంచాంగశ్రవణం చేస్తూ, ఆనాటి తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలను వినిపిస్తూ, నాటి ఉత్సవవిశేషాలను శ్రీవారికి తెలుపుతారు. ఆలయం యొక్క బొక్కసం (ట్రెజరీ) అధికారులు క్రితంరోజు ఆలయానికి హుండీ ద్వారా వచ్చిన రొక్కం, ఇతర కానుకల వివరాలను, ఆర్జితసేవల ద్వారా వచ్చిన ఆదాయ వివరాలను మొదలగు వాటిని చదివి వినిపిస్తారు.

కొలువు లేదా దర్బార్ యొక్క మిగతా విశేషాలన్నింటినీ మనం పంచబేరాలు కొలువుశ్రీనివాసుడు అనే ప్రకరణంలో తెలుసుకున్నాం. ఉదయం 4.30 గం. ల ప్రాంతంలో, ఆలయపరిసరాల్లో మనం ఎక్కడ ఉన్నా "కొలువు" సందర్భంగా శ్రీవారికి చెప్పబడే వివరాలన్నింటినీ మనం కూడా వీనులవిందుగా విని తరించవచ్చు.

సహస్రనామార్చన

స్వామివారికి ప్రతిరోజూ మూడుపూటలా ఆనందనిలయంలో ఈ అర్చనసేవ జరుగుతుంది. ఉదయం 4.45 గం. నుండి 5.30 గం. వరకు జరిగే మొదటి అర్చనలో సహస్రనామావళితోనూ, మధ్యాహ్న మరియు సాయం సమయాల్లో అష్టోత్తరనామాలతోనూ స్వామిని అర్చిస్తారు. శ్రీవారి సహస్రనామాలలో ఒక్కో దానికి ఒక్కో విశేషం, ఒక్కో పరమార్థం ఉంది. ఈ నామాలు శ్రీమహావిష్ణువు యొక్క అన్ని అవతార విశేషాలను స్ఫురణకు తెస్తాయి.

భక్తులు కులశేఖరపడి నుంచి గరుడాళ్వార్ సన్నిధి వరకు బారులుతీరి కూర్చుని, సహస్రనామార్చనలో పాల్గొంటారు.

శ్రీవారి పాదపద్మాలవద్ద వైఖానస అర్చకస్వాములు ఒక మేడికర్రతో చేయబడిన కూర్మాసనంపై కూర్చుని, సహస్రనామార్చనను ప్రారంభిస్తారు.

ఆ తరువాత అర్చకులు తులసిదళాలతో శ్రీవారి పాదాలను, వారి వక్షఃస్థలంలో వెలసివున్న మహాలక్ష్మి అమ్మవారినీ అర్చిస్తారు. అనంతరం నక్షత్రహారతినిచ్చి, నారికేళాన్ని, అరటిపండ్లనూ సమర్పిస్తారు.

ఆ తరువాత స్వామివారికి చక్కెరపొంగలి, పులిహోర, పొంగలి మున్నగు అన్నప్రసాదాలతోనూ, లడ్లు, వడల వంటి పిండివంటలతో నిండిన గంగాళాలను స్వామివారి ముందుంచి నివేదన జరుపుతారు.

అంతకు ముందుగానే ఒక పరిచారకుడు శ్రీవారి వంటశాల నుండి ప్రసాదాలను ఛత్రచామర మంగళవాద్యాలతో వరాహస్వామి ఆలయానికి తీసుకువెళ్ళి క్షేత్రనియమానుసారం, కలియుగారంభంలో శ్రీనివాసుడు ఇచ్చినమాట ప్రకారం, తొలి నివేదన ఆదివరాహునికి చేస్తారు. అక్కడ నివేదన జరిగిన తరువాత మాత్రమే, ఇక్కడ ఆనందనిలయంలో శ్రీవారికి నైవేద్యసమర్పణ జరుగుతుంది.

అనంతరం అర్చకులు సుగంధద్రవ్య పూరితమైన తాంబూలాన్ని శ్రీవారికి సమర్పిస్తారు.

ఈ అర్చన చేసినా, విన్నా, పాప విముక్తులౌతారని, సర్వదోషాలు హరిస్తాయని భక్తుల నమ్మిక.

ఈ నామావళి మహాత్మ్యాన్ని సాక్షాత్తూ నారదమహర్షి తన తుంబురనాదంతో కీర్తించడమే కాకుండా, స్వయంగా శ్రీనివాసునికి సహస్రనామార్చన గావించి జన్మ ధన్యం గావించుకన్నాడని ప్రతీతి.

నిత్యకళ్యాణోత్సవం

శ్రీదేవీ-భూదేవి సమేతుడైన శ్రీమలయప్పస్వామికి ప్రతినిత్యం మధ్యాహ్నం 12 గం. లకు అభిజిల్లగ్నంలో నిత్యకళ్యాణోత్సవం ప్రారంభమవుతుంది. రెండవ అర్చన, గంట ('గంట' గురించి తరువాత తెలుసుకుందాం), నివేదన పూర్తయిన తరువాత సంపంగిప్రాకారం లోని కళ్యాణమంటపంలో శ్రీమలయప్పస్వామి వారు తూర్పు ముఖంగా ఒక బంగారు సింహాసనం మీద వేంచేపు చేయబడుతారు. దక్షిణంగా శ్రీదేవీ-భూదేవి అమ్మవార్లు మరొక బంగారు సింహాసనం మీద వేంచేపు చేస్తారు. 15-17 శతాబ్దాలలో తాళ్ళపాక వంశీయులు ఈ కళ్యాణోత్సవం ప్రారంభించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. తాళ్ళపాక వంశస్థులే నేటికీ కన్యాదాతలుగా వ్యవహరిస్తారు. శ్రీవారికి కళ్యాణం చేయించటానికి విచ్చేసిన గృహస్థులను కళ్యాణమంటపానికి అనుమతించి, వారి గోత్రనామాదులతో సంకల్పం చెప్పించి, వారిని స్వామి వారికి అభిముఖంగా కూర్చోబెడతారు.

కళ్యాణోత్సవ కైంకర్యం జరిపించే వైఖానసఅర్చకులు పసుపు ధోవతి ధరించి, బృహస్పతిగా వ్యవహరించే మరో అర్చకునితో సహా 'వోచి' సహాయంతో మంటపప్రవేశం చేసి శ్రీవారి పాదసేవ చేసుకుంటారు.

తదుపరి క్రమంగా విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, రక్షాబంధన (కంకణధారణ), అగ్నిప్రతిష్ఠ, హోమములు, తెరపట్టడం, కన్యావీక్షణము, మహాసంకల్పము, కన్యాదానము, గోత్రపఠనం, మాంగల్యపూజ, మాంగల్యధారణ, కర్పూరనీరాజనం, ప్రధానహోమం, లాజహోమం, పూర్ణాహుతి, రక్షాతిలకధారణ వంటి కైంకార్యాలను పూర్తి చేస్తారు.

ఆ వెంటనే 'వారణమాయిరం' (వధూవరులు నారికేళాలు చేతులు మార్చుకునే వివాహ లాంఛనం) కైంకర్యం జరిపి, పుష్పమాలా పరివర్తనం (శ్రీవారు-అమ్మవార్లు వేడుకగా పుష్పమాలలు మార్చుకునే ఘట్టం) గావించి, అమ్మవార్లను స్వామివారి వద్దకు వేంచేపు చేసి, 'అక్షతారోపణ' తంతు (తలంబ్రాలు పోసుకోవడం) కావించి, చివరిగా ఆనందకర్పూరహారతితో కళ్యాణం ముగిస్తారు.

సర్వజనులు క్షేమ, స్థైర్య, ధైర్యాదులతో ఉండాలనీ, స్త్రీలు ఈ జన్మలోనూ, మరుజన్మలోనూ, సువాసినులుగా ఉండాలనే మహాసంకల్పంతో శ్రీవారికి నిత్యకళ్యాణోత్సవం జరిపించటం పరిపాటి. ఈ నిత్యకళ్యాణోత్సవం వల్లనే శ్రీవారికి 'కళ్యాణచక్రవర్తి' అని, తిరుమలక్షేత్రం నిత్యకళ్యాణం-పచ్చతోరణంగా విరాజిల్లుతున్నదని ప్రశస్తులు ఏర్పడ్డాయి.

ప్రతిరోజూ మధ్యాహ్నం 12 గం. నుండి 1 గం. వరకూ ఈ నిత్యకళ్యాణోత్సవం జరుగుతుంది.

డోలోత్సవం

నిత్యకళ్యాణోత్సవం పూర్తయిన తరువాత శ్రీదేవీ-భూదేవి సమేత శ్రీమలయప్పస్వామిని ధ్వజస్తంభానికి ఎడమవైపు (మనం మందిరంలోకి వెళ్ళేటప్పుడు కుడి వైపు) ఉన్న ఆయినామహల్° (అద్దాలమంటపం) లోకి తీసుకుని వెళతారు. ఈ మండపం మధ్యలో ఉన్న డోల (ఉయ్యాల) లో, స్వామివారికి ఉభయదేవేరుల సమేతంగా డోలోత్సవం నిర్వహిస్తారు. భక్తులను స్వామివారికి ఎదురుగా కూర్చుండబెట్టి, వేదపఠనం, వేదాశీర్వాదం జరుపుతారు. ఈ మండపంలో బిగించివున్న అద్దాలలో స్వామి అన్నివైపులా కనిపిస్తూ, భక్తులకు దివ్యదర్శనాన్ని అనుగ్రహిస్తూ, తన సర్వవ్యాపకత్వాన్ని తెలియజేస్తారు. తదుపరి, శ్రీవారికి పంచకజ్జాయం అనే ప్రసాదాన్ని నివేదన చేసి, హారతిస్తారు. (శ్రీవారికి సమర్పించే అనేక రకాలైన ప్రసాదాల గురించి మరొక ప్రకరణంలో విస్తారంగా తెలుసుకుందాం).

ప్రతిరోజూ మధ్యాహ్నం 1-2 గం. ల మధ్య ఈ డోలోత్సవం జరుగుతుంది.

ఆర్జితబ్రహ్మోత్సవం

ఉభయదేవేరులతో కూడిన మలయప్పస్వామికి సంక్షిప్తంగా వాహనసేవలను నిర్వహించడం 'ఆర్జితబ్రహ్మోత్సవం' గా పిలువబడుతుంది. శ్రీవారి ఉత్సవమూర్తులను బంగారు తిరుచ్చి మీద ఆలయం వెలుపల ఉన్న వైభవోత్సవ మండపానికి (ఈ మండపాన్ని రాంబగీచా అతిథి గృహం నుంచి శ్రీవారి మందిరానికి వెళ్ళేటప్పుడు, గేటు దాటగానే కుడి ప్రక్కన చూడవచ్చు).

అక్కడ శ్రీవారికి ఆర్జిత బ్రహ్మోత్సవంలో భాగంగా ముఖ్యమైన వాహనాలైన గరుడవాహనం, హనుమంతవాహనం, పెద్దశేషవాహనంలో వేంచేపుచేసి హారతి ఇస్తారు.

ఈ సేవలో పాల్గనటం ద్వారా భక్తులకు శ్రీవారి అనుగ్రహం ద్వారా బుద్ధిబలం, యశస్సు, ధైర్యం, ఆరోగ్యం, ధనలాభం, సంతానప్రాప్తి కలుగుతాయి.

ప్రతిరోజూ మధ్యాహ్నం 2-3 గం. ల మధ్య ఈ సేవ జరుగుతుంది.

ఆర్జితవసంతోత్సవం

ఆర్జితబ్రహ్మోత్సవా నంతరం, శ్రీవారి ఉత్సవమూర్తులను (శ్రీదేవీ-భూదేవి సమేత మలయప్పస్వామిని) స్నానపీఠం మీదకు వేంచేపుచేసి తెల్లటి స్నానవస్త్రాలను ధరింపజేస్తారు.

తదుపరి, భక్తులను అనుమతించిన తరువాత, వైఖానస అర్చకులు ఘంటానాదంతో వసంతోత్సవ కైంకర్యాన్ని ప్రారంభించి, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, వరుణదేవతారాధన, ద్రవ్యదేవతారాధన నిర్వహిస్తారు.

పంచామృతద్రవ్యాలైన ఆవుపాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, మరియు చందనాదులతో ఆయా దేవతలను ఆవాహన చేసి అర్చిస్తారు.

అనంతరం అర్చకులు ఉత్సవమూర్తులకు పంచామృతద్రవ్యాలతో స్నపన తిరుమంజనం (అనగా, పవిత్ర అభిషేకం) నిర్వహిస్తారు.

చివరగా, కుంభంలోని మంత్రోదకంతో సహస్రధారాస్నపన (జల్లెడ వంటి, వెయ్యి రంధ్రాలు కలిగిన, వెండి సహస్రధారాపాత్ర ద్వారా అభిషేకద్రవ్యాన్ని మూర్తులపై ప్రోక్షింపజేయటం) చేసిన పవిత్రతీర్థజలాన్ని భక్తుల శిరస్సు మీద జల్లుతారు. తరువాత శ్రీవారికి వస్త్ర, ఆభరణ, పుష్పమాలా సమర్పణ మరియు మహానివేదన జరిపి, కర్పూరహారతి సమర్పణతో వసంతోత్సవం పూర్తి చేస్తారు.

ఈ సేవలో పాల్గొన్న భక్తులకు శ్రీవారి కరుణ వల్ల సంతానవృద్ధి, విజయప్రాప్తి, కీర్తి, కామ్యసిద్ధి, సర్వవ్యాధి-పీడ నివారణ, దేహాంతంలో విష్ణుసాయుజ్యం లభిస్తాయి.

వసంతోత్సవం వైభవమండపంలో సాయంకాలం 3-4 గం. ల మధ్యలో జరుగుతుంది.

సహస్రదీపాలంకరణసేవ

ఉభయదేవేరులతో కూడిన మలయప్పస్వామి వారు వైభవోత్సవమండపం నుండి సహస్రదీపాలంకరణ మండపానికి విచ్చేస్తారు. ఈ మండపం నాదనీరాజనం వేదికకు కుడిప్రక్కగా, తూర్పు-దక్షిణ మాడవీధుల కూడలిలో ఉంటుంది.

అప్పటికే దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న సహస్రదీపాల మధ్య ఉన్న ఊయలలో స్వామివారు ఉభయదేవేరుల సమేతంగా ఆసీనులై భక్తులకు దర్శనమిస్తారు. శ్రీవారికి మొదటగా పంచకజ్జాయం నివేదన చేసిన తరువాత వేదపారాయణ పఠనం, అన్నమాచార్య-పురందరదాసు కీర్తనల ఆలాపన, నాదస్వరవాదన వినిపిస్తారు. ఈ విధంగా వేద, నాద, గానాలతో మలయప్పస్వామి మెలమెల్లగా ఊయల ఊగుతూ భక్తులకు దర్శనమిస్తారు. తరువాత శ్రీవారికి నక్షత్రహారతి, కర్పూరనీరాజన సమర్పణతో ముగిసే ఈ సేవ ప్రతిరోజూ సాయంకాలం 5.30 గం. లకు మొదలవుతుంది. ఏ విధమైన ముందస్తు బుకింగు లేకుండా, టిక్కెట్టు లేకుండా కూడా ఎవరైనా ఈ సేవ చూసి తరించవచ్చు. ముందస్తు టిక్కెట్టు తీసుకున్న భక్తులకు మాత్రం, ముందు వరుసల్లో కూర్చుని, సేవను సమీపం నుంచి దర్శించుకునే అవకాశం కలుగుతుంది.

అనంతరం స్వామివారు ఉభయనాంచారులతో, నాలుగు మాడవీధులలో నిత్యోత్సవానికి వేంచేస్తారు. ఆలయానికి 8 దిక్కులలో కర్పూరనీరాజనం సమర్పిస్తారు. తూర్పు మాడవీధిలో పుష్కరిణి వద్ద 'పుష్కరిణి హారతి' సమర్పింప బడుతుంది. తదుపరి, కుంభహారతి మరియు కర్పూరహారతి సమర్పణతో శ్రీవారు ఆలయ పునఃప్రవేశం చేస్తారు.

దీనితో, ఉత్సవమూర్తులకు ఆలయం వెలుపల జరిగే నిత్యసేవలు పూర్తవుతాయి.

సాయంకాలం అర్చన

శ్రీవారి ఉత్సవమూర్తులను బంగారువాకిలిలో వేంచేపు చేసి, సిరాతళిగను (రవ్వతో చేసిన ప్రసాదము – రవ్వకేసరి

లాగా ఉంటుంది) నివేదించి నీరాజనం సమర్పిస్తారు. ఉత్సవర్లను తిరిగి సన్నిధిలో యథాస్థానానికి వేంచేపుచేసి హారతి సమర్పిస్తారు. అప్పుడు రెండవ తోమాలసేవ ప్రారంభమవుతుంది.

సన్నిధిగొల్ల ముందు రాగా అర్చకులు ఆలయప్రవేశం చేసి స్వామికి పాదసేవ చేసి, హారతి ఇచ్చిన తరువాత మూలవర్లకూ, ఇతర దేవతా మూర్తులకు ఉదయం తోమాలసేవలో అలంకరింపబడిన పుష్పమాలలు సడలింపు చేయబడతాయి. తరువాత స్థలశుద్ధి, పాత్రశుద్ధి జరుపబడతాయి. అనంతరం జియ్యరుస్వాములు యమునోత్తరైలోని పుష్పమాలలు వెదురుబుట్టలో ఉంచి, శిరస్సు మీదుంచుకొని, ధ్వజస్తంభ ప్రదక్షిణగా సన్నిధికి చేరుతారు. పిమ్మట అర్చకులు ఘంటానాదం చేసి, జియ్యంగార్ స్వామికి ఆలవట్టం (వెడల్పైన, నగిషీలతో కూడిన వెండి వింజామర) ఇచ్చి, వారిచేతి నుండి తులసి స్వీకరించి, ప్రాణాయామం, సంకల్ప క్రియలు చేస్తారు. బంగారుబావి తీర్థంతో పాత్రలు నింపి శ్రీవారి ఆరాధనకు సిద్ధం చేస్తారు. మూలవర్లకు ఆసనం, పాదం, అర్ఘ్యం, ఆచమనం, శంఖోదకం వంటి ఉపచారాలు చేస్తారు. తర్వాత మూలవర్లతో సహా దేవతా మూర్తులందరినీ పుష్పమాలలతో నేత్రపర్వంగా అలంకరిస్తారు. మంత్రపుష్పం చదివిన తరువాత, ఉదయం వలె జియ్యర్ స్వాములు,"సాయిత్తిరుళా..." అని పాత్రం చెప్పగానే, కులశేఖరపడి వెలుపల ఉన్న అధ్యాపకులు, "నిత్యానుసంధానం" అనే నాలాయిర దివ్యప్రబంధలోని పాశురాలను గానం చేస్తారు.

అనంతరం శ్రీవారికి నక్షత్రహారతి, కర్పూరనీరాజన సమర్పణ జరుగుతుంది. అర్చకస్వామి శ్రీవారికి ఆలవట్టం సమర్పించి క్షమాప్రార్థన, పాదసేవ చేసిన తరువాత జియ్యరు స్వాములకు, గోష్ఠికి (అర్చక బృందం) శఠారి ఇస్తారు.

రాత్రి అర్చన

అర్చకస్వామి ఘంటానాదం చేసి, కూర్మాసనం మీద ఆసీనుడై, సంకల్పం చేసి అర్చన ప్రారంభించగానే, వేదపారాయణదారు కేశవాది చతుర్వింశతి నామాలు పఠిస్తుండగా, తులసిదళాలను శ్రీవారి పాదాలకు అర్పించి, ధూప, దీప సమర్పణ చేస్తారు. తర్వాత శ్రీవారికి అష్టోత్తర నామావళి పఠనంతో పాటుగా తులసీ దళార్చన జరుగుతంది. వెంటనే వక్షఃస్థల మహాలక్ష్మికి "చతుర్వింశతి" నామార్చన చేసి, నీరాజనం సమర్పణ చేసి, నైవేద్యాన్ని సమర్పించి బంగారువాకిలి ప్రక్కన ఉన్న ఘంటామండపం లోని గంటలన్నింటినీ ఒకే సారి గంభీరంగా మ్రోగిస్తారు.

పర్యంకాసనము (లేదా ఏకాంతసేవ)

శ్రీవారి ఆలయంలో చిట్టచివరిగా జరిగే సేవ ఏకాంతసేవ. దీనినే ఆగమ పరిభాషలో "పర్యంకాసనము" లేదా "శయనాసనము" అని కూడా అంటారు.

మొట్టమొదటగా, సన్నిధిలో శ్రీవారిమూలవర్లకు, ఇతర దేవతా మూర్తులకు రాత్రి తోమాలసేవలో అలంకరించిన పుష్పమాలలను సడలింపు చేస్తారు.

బంగారు పట్టెమంచాన్ని తెచ్చి అనందనిలయానికి ముందున్న శయనమండపంలో వెండిగొలుసుతో వ్రేలాడదీసి దానిపై పట్టుపరుపునూ, దిండ్లను అమర్చుతారు. శయనమండపంలో ముగ్గు వేసి దీపాలను వెలిగించుతారు.

పర్యంకాసనంలో అయిదు ఉపచారాలు ఉంటాయి.

- మృగనాభిశ్చతాంబూలం (కస్తూరి సహిత సువాసన భరిత తాంబూలం),
- గంధము,
- పుష్పము,
- ప్రదక్షిణ,
- నమస్కారాదులు.

ఈ ఉపచారాల మహా భక్తురాలైన తదుపరి తరిగొండ వెంగమాంబ వంశీయులు పట్టెమంచం చుట్టూ రంగవల్లులు తీర్చి దిద్దుతారు. ఈ సేవను కౌతుకబేరం భోగశ్రీనివాసునికి జరుపుతారు. అయితే, ధనుర్మాసంలోని 30 రోజులూ భోగశ్రీనివాసునుకి బదులుగా సన్నిధిలో ఉన్న వెండి కృష్ణమూర్తికి జరుపుతారు.

అర్చకులు, ఆనంద నిలయాంతర్భాగంలో గల రాములవారిమేడ తలుపు దగ్గరగా వేసి, బంగారువాకిలికి తెర వేస్తారు. అప్పుడు గరుడమండపం వద్ద సన్నాయిమేళం శ్రవణానందంగా మ్రోగింప బడుతుంది. పోటువారు వేడిగా కాచిన ఆవుపాలు సన్నిధికి తెస్తారు. సభ అరవారు పంచకజ్జాయం (జీడిపప్పు, పంచదార, యాలకులు, గసగసాలు, ఎండుకొబ్బరి ముక్కల మిశ్రమం), మధురఫలాల ముక్కలు, తాంబూలం, చందనం సిద్ధం చేసి సన్నిధికి తెస్తారు. అర్చకస్వామి పంచపాత్రలలో, బంగారు బిందెలోని తీర్థం నింపి ఉంచుతారు. ఆలయ ఐతిహ్యం ప్రకారం రాత్రి తలుపులు వేసిన తరువాత బ్రహ్మాదిదేవతలు శ్రీవారికి ఏకాంతంగా ఆరాధన చేస్తారని ప్రతీతి. వారి ఆరాధన కోసం పంచపాత్రలలో ఈ తీర్థం సిద్ధం చేస్తారు. శ్రీవారి దర్శనం తరువాత, వకుళమాత దర్శనానంతరం ముఖ్యాలయానికి ఎడంప్రక్కగా ఉన్న గట్టుమీద, అంకురార్పణ మంటపంలో సుప్రభాతసేవ భక్తులకు వితరణ చేసే తీర్థం అదే. బ్రహ్మచే అభిషేకించబడిన తీర్థం కనుక దాన్ని "బ్రహ్మతీర్థం" అంటారు.

శ్రీవారి గెడ్డాన్ని పచ్చకర్పూరంతో అలంకరిస్తారు (దీనికి సంబంధించి ఆసక్తికరమైన కథను శ్రీవారి భక్తశిఖామణి అయిన అనంతాళ్వార్ చరిత్రలో తెలుసుకుందాం). శ్రీవారి బంగారు పాదకవచాలు తీసి, స్వామిపాదాల మీద రెండు చందనపుముద్దలు సమర్పిస్తారు. వక్షఃస్థల లక్ష్మీఅమ్మవారికి ఒక చందనపు ముద్ద ఉంచుతారు. మరొక ముద్ద బ్రహ్మాదిదేవతల ఆరాధన నిమిత్తం, అరముద్ద భోగశ్రీనివాసమూర్తి హృదయంపైనా ఉంచుతారు. తరిగొండ వంశీయులు "ముత్యాలహారతి" తట్టలో ముత్యాలతో శ్రీవారి రూపం ఏర్పరిచి, హారతికర్పూరం, ముడుపు (తమలపాకులు, వక్కలు) సిద్ధం చేస్తారు.

తదుపరి, సన్నిధిలో వైఖానస అర్చకులు మాత్రం ఉండగా, రాములవారిమేడ తలుపులు వేయబడతాయి. అర్చకులు మంచాన్ని మంత్రోదకంతో సంప్రోక్షించి, ఉదయం ఆరాధన సమయంలో మూలవర్ల నుండి ఇతరబేరములకు ఆవాహన చేసిన శక్తిని తిరిగి మూలవర్లలోనికి పునరావాహన చేసి, శ్రీవారి శయనబేరం అయిన భోగశ్రీనివాసుణ్ణి

శయనం పైకి ఆహ్వానించి, పట్టెమంచంపై నుండి భక్తులను చూస్తున్నట్లుగా, దక్షిణం తలంపుగా శయనింపజేస్తారు. తదుపరి, హారతి సమర్పించడంతో ఆ రోజు నిత్యకైంకర్యాలు సమాప్తి అవుతాయి.

అర్చకులు సాబూతు (స్వామివారికి అలంకరించిన నగల పరిశీలన) చూసుకుని, మంత్రోచ్ఛారణ జరుగుతుండగా, కుంచెకోలతో తలుపులు మూసివేస్తారు.

----------: : ----------

శ్రీవారి కైంకర్యపరులు

"కైంకర్యం" అంటే భగవంతునికి ప్రీతిపాత్రమైన కార్యాన్ని ఆచరించటం. కింకరుడు చేసే పని "కైంకర్యం" గా పిలువబడు తుంది. కింకరుడు అంటే భగవంతుడు చెప్పిన లేదా ఆయనకు ప్రీతికరమైన పనులను తూచా తప్పకుండా, ఏ విధమైన సందేహం, తడబాటు, తాత్సారం లేకుండా, ఒక క్రమశిక్షణ గల సైనికుని వలె చేసుకుంటూ పోయే వాడు.

శ్రీవారి ఆలయంలో నిత్యం నిర్వహించే కైంకర్యాలలో అనేకమంది కైంకర్యపరులు వివిధరకాల సేవలను శతాబ్దాలుగా అందించటం జరుగుతూ ఉంది. వీరిలో ప్రధానంగా మూడు రకాల వారున్నారు.

- శ్రీవైఖానస అర్చకులు
- జియ్యరు స్వాములు
- ఆచార్యపురుషులు

వీరితో పాటుగా సన్నిధిగొల్ల కూడా ముఖ్యభూమిక పోషిస్తున్నారు.

శ్రీవారి కైంకర్యాలలో ఎవరెవరు పాల్గొంటారు, వారు ఎప్పటినుండి ఆలయంతో అనుబంధం కలిగి ఉన్నారు, వారెటువంటి విధులు నిర్వహిస్తారు మొదలైన వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

శ్రీవైఖానస అర్చకులు

వైఖానస అనే పదం విష్ణ్వాలయాల్లో అత్యంత అంకితభావంతో సేవలందించే నిమిత్తం శ్రీమహావిష్ణువు అంశతో జన్మించిన "విఖనమహర్షి" నుండి వచ్చింది. విఖనమహర్షి ఆలయాన్ని తిరుమల లోని ఉత్తరమాడవీధిలో, రాధాగోపాల ఆలయానికి ఎడంప్రక్కగా దర్శించుకోవచ్చు. విష్ణువు అంశతో జన్మించడం వల్ల, ఈ మహర్షి సాక్షాత్తూ బ్రహ్మదేవునికి సోదరుడన్నమాట.

వైఖానసశాఖకు చెందినవారు ఇతర వైష్ణవశాఖల్లో వలె తర్కం, మీమాంస జోలికి వెళ్ళకుండా, కేవలం విష్ణువు పూజా-పునస్కారల మీదనే శ్రద్ధ వహిస్తారు. శీవారి కైంకర్యాలకు వీరి ప్రధానగ్రంథమైన "శ్రీవైఖానస ఆగమం" మూలాధారం. దీనిలో పొందుపరచ బడిన ప్రతి అంశాన్నీ వీరు పొల్లుపోకుండా ఆచరిస్తారు.

ప్రస్తుతం ఈ శాఖకు చెందిన నాలుగువేల కుటుంబాల వారు ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటకల్లోనూ; వృత్తిరీత్యా అమెరికా వంటి ఇతర దేశాల్లోనూ నివసిస్తున్నారు.

శ్రీవైష్ణవుల నుండి సులభంగా గుర్తించ బడడానికి వీలుగా, వీరు తిరుచూర్ణం స్థానంలో (నిలువు నామాల మధ్యలో ఉన్న గీత) కేసరి రంగు మిశ్రమాన్ని వాడుతారు. ఈ సారి మీరు తిరుమల లేదా శ్రీరంగం, కంచి వంటి మరేదైనా ప్రముఖ వైష్ణవక్షేత్రాన్ని దర్శించుకున్నపుడు, వైఖానస అర్చకులకు ఉన్న నామాలను గమనించండి.

శ్రీవారి ఆలయద్వారాలను తెల్లవారక ముందే తెరువటం మొదలు, తిరిగి అర్ధరాత్రి సమయంలో మూసివేసే వరకు సమస్త కైంకర్యాలు వీరి చేతుల మీదుగా జరగాల్సిందే. ఇతర కైంకర్యపరులందరూ వీరికి కేవలం సహాయ పడతారు.

ఒక ఆలయం లోని అర్చామూర్తిలో దైవత్వం నెలకొని, ఆ ఆలయం అత్యంత ప్రసిద్ధిలోకి వచ్చిందంటే దానికి ప్రధాన కారణం సుశిక్షితులు, సద్వర్తనులైన అర్చకులు క్రమపద్ధతిలో నిరంతరాయంగా, లోప రహితంగా శతాబ్దాల తరబడి స్వామి వారికి అర్చనాదులు చేయడమే. తిరుమల ఆలయం ఈనాడు ఇంత ప్రాశస్త్యం చెందిందంటే, అందులో వీరి అకుంఠిత కృషి, అంకితభావాల పాత్ర ఎంతుందో చెప్పకనే చెబుతుంది.

ఆగమశాస్త్రానుసారం, విష్ణువును పూజించే అర్హత, సామర్థ్యం కేవలం "విష్ణువు" కే ఉంటాయి. కాబట్టి, శ్రీవైఖానస అర్చకులు విస్తారమైన వైదిక ప్రక్రియల ద్వారా, అర్చన ప్రారంభించటానికి ముందు శ్రీమహావిష్ణువును తమలో ఆవహించుకుని, తమను తాము విష్ణువుగా పరివర్తించుకొని శ్రీవారి అర్చనాది కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఇంతటి మహత్కార్యం అనునిత్యం చేయాలంటే వారెంతటి నియమనిష్ఠలు, క్రమశిక్షణ, ఇంద్రియనిగ్రహం కలిగి ఉండాలో ఆలోచించండి!

శ్రీవారి ఆలయానికి సంబంధించి అత్యంత ప్రామాణికంగా చెప్పుకునే "సవాల్-జవాబ్" పట్టీ అనే 1817వ సం. నాటి, బ్రిటీష్ పాలకులు వ్రాసిన పుస్తకంలో పొందుపరచిన వివరాల ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులైన శ్రీమాన్ గోపీనాథ దీక్షితుల వారి కుటుంబం, శతాబ్దాల తరబడి అవిచ్ఛిన్నంగా ఉండి, 9వ శతకంలో రెండుగా విభజించబడింది. మొదటి కుటుంబం భారద్వాజ గోత్రానికి చెందిన గోపీనాథ దీక్షితులది. విడివడిన, రెండవ కుటుంబం, కౌశిక గోత్రానికి చెందిన, తపస్సంపన్నుడైన శ్రీశ్రీనివాస దీక్షితుల వారిది.

ప్రస్తుతానికి ఈ రెండు గోత్రాలవారు గోత్రానికి రెండు కుటుంబాలు చొప్పున, మొత్తం నాలుగు కుటుంబాల వారు గుడిలో అర్చకత్వం వహిస్తున్నారు.

- భారద్వాజ గోత్రానికి చెందిన గొల్లపల్లి మరియు పైడిపల్లి కుటుంబాల వారు.
- కౌశికగోత్రానికి చెందిన తిరుపతమ్మ గారి మరియు పెద్దింటి వారి కుటుంబాల వారు.

ప్రస్తుత ప్రధానార్చకులైన శ్రీ వేణుగోపాలదీక్షితుల వారు మరియు వారి ముందున్న శ్రీరమణదీక్షితుల వారు, భారద్వాజ గోత్రజులైన గొల్లపల్లి కుటుంబానికి చెందినవారు.

ఆయా కాలాల్లో దాతలైనటువంటి రాజులూ, జమీందార్లూ ఆయా కుటుంబాలకు దానంగా ఇచ్చిన గ్రామాల పేర్లే కాలక్రమేణా వారి కుటుంబ నామధేయాలుగా మార్పు చెందాయి.

శ్రీవైఖానస అర్చకులు మాత్రమే శ్రీవారి మూలవిరాట్టును స్పృశించి, వారికీ మరియు ఆనందనిలయంలో గల ఇతర దేవతామూర్తులకు కైంకర్యం చేయగలిగే అధికారం కలిగియున్నారు.

క్షణకాల దర్శనానికే మనలాంటి సామాన్యులు పరితపించిపోతుంటే, నిత్యం స్వామివారిని సేవిస్తూ, స్పృశిస్తూ వారిసన్నిధిలో గడిపే భాగ్యం కలగటం ఎన్ని జన్మల సుకృతమో కదా!

జియ్యంగార్లు

ఆలయ ఆర్థిక వ్యవహారాలు చూడడానికీ, కైంకర్య ఏర్పాట్లు చేయడానికీ ఆలయంలో ఆది నుండీ ఒక "అధికారవ్యవస్థ" ఉండేది. అయితే, వారు జీతభత్యాలకు పని చేసేవారు కావటంతో, వారికి శ్రీవారి పట్ల అచంచల భక్తి విశ్వాసాలు లేకుండా, వారు కేవలం ఉద్యోగధర్మంగా విధులు నిర్వర్తించే అవకాశం ఉంది. ఆ కారణంగా, వారు కైంకర్యానికి కావలసిన వస్తు సామాగ్రిని సరియైన పరిమాణంలో, తగు నాణ్యతతో, సకాలానికి అందిస్తున్నారా లేదా అన్న విషయాన్ని నిర్ధారించు కోవడానికి, అర్చకులకు అధికారగణానికీ మధ్య ఒక అనుసంధాన వ్యవస్థ ఉండాలని భగవద్రామానుజులు తలంచారు (నేటి పరిభాషలో దీన్ని "ఆడిటింగ్" వ్యవస్థ అనుకోవచ్చు). ఆ వ్యవస్థను ఆజమాయిషీ చేసే వ్యక్తి ఆలయ ఆచార వ్యవహారాలను క్షుణ్ణంగా తెలిసినవాడై, స్వతహాగా నియమనిష్ఠలు కలవాడై, పాండిత్యవైరాగ్యాల్లో అధికుడైతేనే అతని మాటపై గౌరవం ఉంటుందని కూడా తలచారు. అంతేగాక, హుండీద్వారా, ఆర్జితసేవల ద్వారా, దానధర్మాల ద్వారా, ఇంకా అనేక మార్గాల ద్వారా దేవాలయానికి చేకూరే ఆదాయాన్ని; నిత్యం జరిగే కైంకర్యఖర్చులు, జీతభత్యాలను సరిచూసుకునే ఒక సమాంతరవ్యవస్థ కూడా ఉండాలి. ఇంకా, ఆలయ కైంకర్య పద్ధతులు అధికారులకు పూర్తిగా తెలియక పోవచ్చు. వారికి ఈ విషయాల్లో మార్గదర్శకత్వం వహించాలి. ఈ కోణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని, "ఏకాంగి" అనే ఒక వ్యవస్థను రామానుజులవారు నెలకొల్పారు. తదనంతరం అదే జియ్యంగార్ల వ్యవస్థగా ప్రసిద్ధి కెక్కింది. వివిధ కైంకర్యాలలో,

ఆలయంలో జరిగే ప్రతి ఉత్సవం మరియు సేవలో ఈ వ్యవస్థ యొక్క ప్రాతినిధ్యం ఉండేలా కట్టుబాటు చేయబడింది.

ఆలయం అభివృద్ధి చెందిన తరువాత, క్రమంగా అధికారయంత్రాంగ పరిమాణం భారీగా పెరగడంతో బాటు, అత్యున్నతస్థాయి (ప్రస్తుతం IAS) అధికార్లను కూడా నియమిస్తూ వచ్చారు. అంతే కాకుండా, ఆలయ నిత్యకృత్యాలన్నీ లిఖితపూర్వక ప్రమాణాలతో, లోటుపాట్లకు తావులేని రీతిలో చట్టబద్ధతను సంతరించుకున్నాయి. దాంతో, జియ్యంగార్ల బాధ్యతల్లో కూడా కొంత మార్పులు చోటు చేసుకున్నాయి.

ప్రస్తుతం, వీరు సేవలూ ఉత్సవాల్లో అర్చకులకు పూజా సంభారాలు అందించడం, ఆలయద్వారాలు శాస్త్రోక్తంగా తెరిచే లాంఛనాల్లో సహాయపడడం, ఉత్సవసమయాల్లో దివ్యప్రబంధగానానికి ఆధ్వర్యం వహించడం, ఆలయ సాంప్రదాయాల నిర్వహణలో సాధారణంగా వచ్చే సందేహాల నివృత్తి చేయడం లాంటి కార్యక్రమాలన్నీ నిర్వహిస్తున్నారు.

సాక్షాత్తూ భగవద్రామానుజులవారు ప్రవేశపెట్టిన వ్యవస్థ కావటం మరియు మందిర ఆచార వ్యవహారాల్లో ఆరితేరి ఉండడం వల్ల, వీరింకా విశేష గౌరవాదరాలను చూరగొంటున్నారు. శ్రీవారి గర్భాలయంలో ప్రవేశించడానికి, శ్రీవైఖానస అర్చకులతో పాటుగా కేవలం జియ్యంగార్లకు మాత్రమే అనుమతి ఉంది.

ఈ జియ్యంగార్లు వానప్రస్థాశ్రమం స్వీకరించినవారు. వీరు ఎల్లప్పుడూ చేతిలో త్రిదండం ధరించి ఉంటారు. "త్రిదండం" అంటే ఒకే పొద నుండి తీయబడిన మూడు వెదురు బద్దలను కలిపి కట్టి ఉంచిన పొడవాటి దండం. ఒక

బద్ధ ఆత్మకు, మరియొకటి ప్రకృతికి, మూడవది పరమాత్మకు సంకేతాలు. ఈ దండాన్ని ధరించిన వారిని "త్రిదండి" గా పిలుస్తారు (ఉదాహరణకు త్రిదండి చినజియ్యర్ స్వామి. వీరి ఫోటోను గుర్తు చేసుకుంటే, ఎల్లప్పుడూ కుడిచేతితో, భుజం మీదుగా త్రిదండాన్ని ధరించి ఉంటారు).

కైంకర్యాలలో అంతరాయం ఉండకూడదని ఇద్దరు జియ్యంగార్లు ఉండే సంప్రదాయం మొదలైంది. పెద్దజియ్యంగార్ పరమపదించితే చిన్న జియ్యరు పెద్దజియ్యర వుతారు. వెంటనే మరొక యోగ్యుడైన వ్యక్తిని చిన జియ్యంగారుగా నియుక్తి చేస్తారు. వీరు వంశ పారంపర్యంగా వచ్చే మిరాశీలు కాదు. అరబిక్ భాషలో "మిరాశీ" అంటే వంశ పారంపర్యమని అర్థం. మహమ్మదీయుల పరిపాలనా కాలంలో ఈ పదం వాడుకలోకి వచ్చింది. గౌ||. ఎన్. టి. రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో మిరాశివ్యవస్థలో పెను మార్పులు సంభవించాయి. ఆ విషయాలు ఇతర మరొకచోట వివరంగా చర్చించడమైనది.

పెద్దజియ్యరుగారి మఠం ప్రస్తుతం తిరుమలయందు బేడి ఆంజనేయస్వామి ఆలయం ప్రక్కగా, రాంబగీచా విశ్రాంతిగృహం నుండి, దేవాలయానికి వెళ్ళేటప్పుడు మనకు కుడి ప్రక్కగా, ప్రముఖంగా కనిపిస్తుంది. జియ్యరుస్వామి వారు వేరే కార్యక్రమాల్లో లేనప్పుడు ఈ ఆశ్రమాన్ని దర్శించుకొని, వారి ఆశీర్వాదం తీసుకోవచ్చు.

ప్రస్తుతం "ఏకాంగి" అంటే, జియ్యంగార్ల పరిచారకుడుగా, వారి తరఫున కైంకర్యాలలో సేవలందించే వ్యక్తిగా ప్రసిద్ధి కెక్కారు. ఈయన ఏకవస్త్రుడైన బ్రహ్మచారి

ఆచార్యపురుషులు

ఆలయంలో జరిగే వివిధ కైంకర్యాలలో పాలు పంచుకునే మూడవ వ్యవస్థే "ఆచార్యపురుషుల వ్యవస్థ". ప్రాచీనకాలంలో తిరుమల ఆలయం అనేక క్రూరమృగాలు మరియు విషపురుగులతో నిండివున్న దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండేది. ఆ కాలంలో దర్శనానికి వెళ్ళటమే గొప్ప విషయం. మరి ఇతర సేవల ప్రస్తావనే అత్యంత దుర్లభం. అట్టి క్లిష్ట పరిస్థితుల్లో, స్వామివారికి జరిగే కైంకర్యాలలో ఆగమశాస్త్రానుసారం కావలసిన సమస్త సదుపాయాలు సమకూరుస్తూ; ఆలయ ఆచారాలను కాపాడుతూ శ్రీవారికి వంశపారంపర్యంగా సేవ చేసి తరించిన శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందిన గొప్ప భక్తులే ఈ ఆచార్యపురుషులు!

వారు చాలామంది ఉన్నా, ముఖ్యులైనవారు ఏడుగురు అని బ్రిటీషుకాలం నాటి "కైంకర్యపట్టీ" ద్వారా తెలుస్తోంది. వారెవరంటే –

1. **తోళప్పాచారి** – వీరు ఆకాశగంగ ఉద్భవించటానికి కారణ భూతులైన, శ్రీవారి మహాభక్తుడు "తిరుమలనంబి" వంశీయులు. తీర్థకైంకర్యం, మంత్రపుష్పకైంకర్యం,
2. వేదపారాయణ కైంకర్యం వీరి విధులు.
3. **పురిశై** – వీరు శ్రీవారితో ప్రగాఢ అనుబంధం కలిగివున్న మరో భక్తాగ్రేసరుడు "అనంతాళ్వార్" వంశస్థులు. పుష్పకైంకర్యం మరియు ఉత్సవ సమయాలలో దివ్యప్రబంధగానం వీరి విధులు.

4. భావనాచారి,
5. ప్రతివాది భయంకరం ("సుప్రభాత" రచయిత అణ్ణన్ స్వామి వంశీయులు)
6. వీరవల్లి
7. కిడాంబి ధర్మపురి
8. పరవస్తు

వీరందరూ, శ్రీవారికి పరంపరానుగతంగా, వివిధ కాలాల్లో, వందల ఏళ్ళుగా పూజలు, నివేదనలు, పుష్పకైంకర్యాలు నిర్వహిస్తూ, శ్రీవారి ఆలయ కైంకర్య సాంప్రదాయాలకు భంగం వాటిల్లకుండా కాపాడు తున్నటువంటి మహనీయులే!

ప్రస్తుతం వీరందరూ వివిధ ఉత్సవ సమయాల్లో దివ్యప్రబంధ గానం చేస్తూంటారు.

సన్నిధిగొల్ల

శ్రీవారి సన్నిధిలో కైంకర్యాలను నిర్వహించే శ్రీవైఖానస అర్చకులను వారి నివాసగృహం నుండి జాగ్రత్తగా, సన్నిధికి దారి చూపుతూ, చేతిలో దివిటీ నుంచుకొని శ్రీవారి ఆలయానికి తోడ్కొని, రావటం స్వతహాగా "గొల్ల" లైన వీరి ప్రధాన బాధ్యత. ఉదయం సుప్రభాతసేవా సమయంలో మరియు రాత్రి ఏకాంతసేవ సమయంలో వీరి పాత్రను మనం ముందు చెప్పుకున్న "సుప్రభాతసేవ" మరియు "ఏకాంతసేవ" ప్రకరణాలలో వివరించడం జరిగింది.

తిరుమలనంబి, అనంతాళ్వారు, సన్నిధిగొల్లల గురించి మరిన్ని వివరాలు ముమ్మందు "శ్రీవారి భక్తాగ్రేసరులు" అనే ప్రకరణంలో సవివరంగా తెలుసు కుందాం.

----------: : ----------

శ్రీవారి ప్రసాదవిశేషాలు

శ్రీవారి భోజనప్రియత్వం

శ్రీవారు అలంకార, పుష్ప, సంకీర్తన ప్రియుడే కాదు; నైవేద్యప్రియుడు కూడా! ఆనందనిలయుడైన శ్రీనివాసుడు ఆరగించే లెక్కకు మిక్కిలిగా ఉన్న పిండివంటలనూ, దివ్యాన్నాలను లెక్క పెట్టలేక తికమక పడ్డ తెనాలి రామలింగ మహాకవి "తిండిమెండయ్యగారు" అని తిరుమలేశునికి ఒక బిరుదు తగిలించి ఆ స్వామివారి భోజనప్రియత్వాన్ని చాటి చెప్పాడు.

"*ఇందిర వడ్డించ ఇంపుగను*" అంటూ అన్నమయ్యా, "*పాలు, వెన్న, బకాళాబాతు*" అంటూ మరొక కవి, ఇలా ఎందరెందరో కవులు తిరుమలేశుని భోజనప్రియత్వాన్ని ఎలుగెత్తి చాటారు.

శ్రీవారికి మడులు – మాన్యాలు

శ్రీవారి నివేదనకు నాటిరోజుల్లో ఎందరో చక్రవర్తులు, సామాన్యులు మడులూ-మాన్యాలు సమర్పించారు. ఆ విధమైన మాన్యాలు తిరుపతి పరిసరాల్లోనూ, చిత్తూరుజిల్లా అంతటా, అంధ్రా, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సుదూర ప్రాంతాలలోను ఈనాటికీ లెక్కలేనన్ని ఉన్నాయి. అయితే, శ్రీవారి భక్తుల హృదయాలను కలచివేసే విధంగా ప్రసాదాల రూపంలో తరతరాలుగా కోట్లాది భక్తుల ఆకలి తీర్చిన మరెన్నో మాన్యాలు వివిధ పాలకుల హయాంలో అన్యాక్రాంతం అయ్యాయి కూడా! మిగిలివున్న వాటిని పదిలపరచు కోవాల్సిన బాధ్యత తి.తి.దే. సంస్థదే కాదు, ఆ అంతులేని ఆధ్యాత్మిక, చారిత్రాత్మక సంపదకు వారసులమైన మన అందరిదీ కూడా!

భక్తుల ఆకలి తీర్చిన ప్రసాదాలు

శ్రీవారి ఆలయంలో గోడల నిండా ఉన్న శాసనాలలో ఎక్కువ భాగం ఏ ఏ రాజులు, ఏ ఏ ప్రసాదాలకు ఎంతెంత రొఖ్ఖం చెల్లించారో, ఎన్నెన్ని మాన్యాలు ఇచ్చారో లాంటి వివరాల గురించే ప్రస్తావించాయి. తిరుమల కొండపై ఏ విధమైన హోటళ్ళు, ఇతరత్రా భోజన ఏర్పాట్లు లేని ఆ రోజుల్లో ఈ ప్రసాదాలే సుదూరప్రాంతాల నుండి వచ్చి తిరుమలను సందర్శించుకునే యాత్రికుల క్షుద్బాధను తీర్చేవి. యాత్రికుల సంఖ్య పెరిగే కొద్దీ ప్రసాదాల పరిమాణం కూడా పెరుగుతూ వచ్చింది. ఈనాడు తిరుమలలో, ప్రసాదాలు భోజనాల నిమిత్తం జరిగే వంట ఏర్పాట్లు ప్రపంచస్థాయిలో ఉంటాయంటే అతిశయోక్తి కాదు. దేవాలయానికి వచ్చిన ఏ భక్తుడు ఆకలితో లేదా అర్ధాకలితో తిరిగి వెళ్ళరాదనే హిందూ సాంప్రదాయం తిరుమలలో అనూచానంగా పాటించ బడుతోంది.

శాస్త్రోక్తంగా వంటలు

వంటవారు "వైఖానస ఆగమ సాంప్రదాయానికి" గానీ, "పాంచరాత్ర ఆగమసంప్రదాయానికి" గానీ చెంది ఉండాలి.

వైఖానసాన్ని గురించి ఇంతకు ముందే చెప్పుకున్నాం. "పాంచరాత్ర సాంప్రదాయం" అనగా – హయవదనునే రాక్షసుడు బ్రహ్మనుండి వేదాలను తస్కరించి సముద్రగర్భానికి వెళ్ళి దాక్కున్నపుడు, వేదాలు మరియు అందులో పొందు పరుచబడిన మంత్రాలూ అందుబాటులో లేనందున, అయిదు రాత్రుల పాటు దేవతలంతా మంత్రం బదులుగా, తంత్రంతో విష్ణువుకు పూజ చేశారు. ఆ అయిదు రోజులు ఒక ప్రత్యేక పద్ధతిలో భగవదారాధన జరిగింది కావున ఆ పూజావిధానానికి "పాంచరాత్ర" మనే పేరొచ్చింది. వేదాలను అసురుల నుండి రక్షించిన "వేదనారాయణ స్వామి" వారి అత్యద్భుతమైన ఆలయాన్ని తిరుపతి సమీపంలో ఉన్న "నాగులాపురం" అనే గ్రామంలో నేడు మనం చూడవచ్చు.

శ్రీవారి అర్చాప్రక్రియలో ఒక ముఖ్య ఘట్టమైన "భోజ్యాసనం" అంటే, నైవేద్యం సమర్పించే ప్రక్రియ.

విస్తారంగా జరిగే ఈ ప్రక్రియలో ప్రసాదాల వంటలకు సంబంధించి ఖచ్చితమైన విధివిధానాలు, నివేదించే పద్ధతులు, నివేదనా సమయాలు, జరగ వలసిన ఉపచారాలు, వంటలో ఉపయోగించే దినుసులు, వాటి నిష్పత్తులు మొదలైనవన్నీ తూచా తప్పకుండా పాటిస్తారు.

శ్రీవారికి నివేదించే హవిస్సును (ప్రసాదాలను) గర్భాలయ ప్రాకారానికి ఆగ్నేయమూలలో ఉన్న "పోటు" అనబడే ప్రధాన వంటశాలలో సిద్ధం చేస్తారు. **వకుళమాత** ఈ వంటశాల గోడకు ఉన్న రంధ్రంలోంచి చూస్తూ, తన కుమారుడైన శ్రీనివాసుని కోసం తయారయ్యే వంటలన్నింటినీ నిత్యం పర్యవేక్షిస్తూ ఉంటారు. తల్లి ప్రేమ మరి!

ఈ సారి తిరుమల వెళ్ళినపుడు ఈ వకుళమాతను కూడా దర్శించుకుందాం.

శ్రీవారి ప్రసాదాల గురించి మొట్టమొదటి, 614వ సం. నకు చెందిన శాసనం విమానప్రాకారంలోని ఉత్తరపు గోడమీద చెక్కబడి ఉంది. ఆలయచరిత్రకు సంబంధించి మనకు లభ్యమైన తొలిశాసనం కుడా ఇదే!

ఈ శాసనంలో తెలిపిన వివరాల ప్రకారం **నాలుగు నాళీలు** (ఒక నాళీ అంటే 16 పిడికిళ్ళు, సుమారు కిలో పైన) బియ్యంతో వండిన అన్నాన్ని కులశేఖరపడి లోపల శీవారికి నివేదన చేయాలి. దీని కోసం ఒక దాత తిరుచానూరు సమీపంలోని పైడిపల్లి అనే గ్రామాన్ని అర్చకులకు దత్తత ఇచ్చారు.

ప్రసాదాల విక్రయం?

తిరుమల ఆలయంలో ప్రసాదాలకు సంబంధించి జనబాహుళ్యానికి అంతగా పరిచయం లేని ఆసక్తికరమైన చరిత్ర ఎంతో ఉంది. ఆలయంలో లభించిన శాసనాల ప్రకారం (శాసనం సంఖ్య 286 T. T.) ఆరేడు వందల సంవత్సరాల క్రితం అప్పటివరకూ ఏ దక్షిణభారత ఆలయంలోనూ లేనివిధంగా శ్రీవారి అర్చకులు, దేవాలయంలో పనిచేసే

సిబ్బంది, ఇతర రాజోద్యోగులు, శ్రీవారి నైవేద్యకైంకర్య నిమిత్తం భూములను దానంగా ఇచ్చేవారు. అందుకు ప్రతిగా, వారు ఏ ఏ ప్రసాదాల నిమిత్తం భూములను దానమిచ్చారో, ఆయా ప్రసాదాల్లో నాలుగో వంతు వాటా వారికి దక్కేది. ఆ విధంగా వారి హక్కుభుక్తమైన వాటాను "**ప్రసాదక్కరార్**" లు అనబడే ప్రసాదం విక్రయదారులకు అమ్ముకునేవారు. అలా వారికి దత్తమైన విక్రయహక్కులకు సంబంధించి దస్తావేజులను వ్రాయించి, ఆలయ రికార్డుల్లో నమోదుచేసి ఆ లావాదేవీలకు చట్టబద్ధత కల్పించబడేది. ఆ విక్రేతలు తమకు హక్కుగా సంక్రమించిన నాలుగవ వంతు ప్రసాదాన్ని, ఆలయంలో "**ప్రసాదంపట్టెడ**" అనే ప్రదేశంలో ఉంచి భక్తులకు విక్రయించుకునే వారు. ఇలా దేవస్థానంవారి గుర్తింపుతో చట్టబద్ధంగా జరిగే లావాదేవీలు ఉభయతారకంగా ఉండేవి. ఈ ఏర్పాటుతో, అప్పట్లోనే విపరీతంగా గిరాకీ ఉన్న ప్రసాదాలను భారీమొత్తంలో తయారుచేయడం కోసం ఆలయానికి కావలసిన ఆదాయవనరులు, సాధన సంపత్తులు సమకూరేవి. అలాగే, జీతభత్యాలు లేకుండా లేదా అరకొర ఆదాయంతో స్వామివారిని నమ్ముకొని తరతరాలుగా అర్చనలు చేస్తున్న అర్చకులకు, ఆలయంలో ఇతర విధులు నిర్వర్తిస్తున్న చిరుద్యోగులకు స్వల్ప ఆదాయం ఒనగూడేది. నాలుగవ వంతు ప్రసాదం దాతలకు కేటాయించగా, మిగిలిన మూడు వంతుల ప్రసాదంలో దేవస్థాన యాజమాన్యం కొంత భాగం విక్రయించి, మరి కొంత భాగాన్ని ఆర్జితసేవా భక్తులకు వితరణ చేసి, మిగిలిన ప్రసాదాన్ని భక్తులకు ఉచితంగా పంచిపెట్టేవారు. నాలుగో వంతు ప్రసాదం దాతలకు ఇచ్చే ఆనవాయితీ ఈనాడు లేకపోయినా, మొత్తం ప్రసాదంలో కొంత భాగాన్ని భక్తులకు ఉచితంగా పంచిపెట్టి, మిగిలిన దానిని దేవస్థానం వారు నిర్ణయించిన ధరలకు విక్రయించే సాంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. తిరుమలలో ప్రారంభమైన ఈ "**ప్రసాదం హక్కుల విక్రయ**" సాంప్రదాయం, తర్వాతి కాలంలో దక్షిణభారతదేశం లోని అనేక దేవాలయాలకు విస్తరించినట్లు తెలుస్తోంది.

ప్రసాదాల తయారీకి నిబంధనలు

ప్రసాదాల తయారీకి కొన్ని ఖచ్చితమైన నియమాలున్నాయి.

- వంట చెరకుగా – మామిడి, అశ్వత్థ, పలాస వృక్షాల ఎండు కొమ్మల్నే ఉపయోగించాలి. దీనికి వ్యావహారిక పారమార్థం ఏంటంటే భూగర్భ జలాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా ఈ చెట్లు పెరుగుతాయి. ఇలాంటి వృక్షాలను వంటచెరకుగా వాడడం వల్ల, నేలనుండి అధికంగా నీటిని సంగ్రహించే వృక్షాలను పరిరక్షించ బడతాయి. నీటి సంరక్షణా పద్ధతుల్ని అప్పట్నించే పాటించే వారన్నమాట.
- పాలు కారే చెట్లనూ, ముండ్లచెట్లనూ ఉపయోగించ రాదు. కట్టెలు కొట్టేవారికి, వంట చేసేవారికి ఏ విధమైన శారీరక హాని జరగకుండా ఈ కట్టుబాటు.
- నివేదన సిద్ధం చేయడానికి వాడే పాత్రలు బంగారం, వెండి, రాగి, ఇత్తడి లోహాలతో గానీ, మట్టితో గానీ తయారు చేయబడి ఉండాలి. ఇతరత్రా లోహాలతో తయారు చేయబడ్డ పాత్రలు ఆరోగ్యరీత్యా మంచివి కావని అప్పుడే గ్రహించారు.
- మట్టికుండలను ఒక మాసం పైబడి వాడరాదు. ఎక్కువకాలం వాడితే మట్టిపాత్రలు అరిగిపోయి, ఎక్కవ వేడి తగిలినప్పుడు పగిలిపోయే ప్రమాదం ఉంది.

- స్వామివారికి సిద్ధం చేసిన ప్రసాదాలను వాసన చూడరాదు – అందు కొరకు వంటవారు ముక్కుకూ, నోటికీ గుడ్డ కట్టుకుంటారు. ఒకరకంగా ఇది ఈనాడు మనం నోటికి, ముక్కుకు తగిలించుకుంటున్న "మాస్కు" లాంటిదన్నమాట. ఆవిధంగా, వంటవారికి ఏమైనా శారీరక అస్వస్థతలుంటే, వారి నిశ్వాసద్వారా వచ్చే క్రిములవల్ల ఆహారం కలుషితం కాకుండా ఉంటుంది. ఈ రోజుల్లో మనం ఆపత్కాల పరిస్థితుల్లో మాత్రమే ప్రాధాన్యతనిచ్చే "**శుచి–శుభ్రత**" కు ఆ రోజుల్లోనే మన పూర్వీకులు పెద్దపీట వేశారు. ఈ విషయంలో ఏమాత్రం అశ్రద్ధగా ఉన్నా, ఆ ప్రసాదాలు భుజించే అసంఖ్యాక భక్తులు అనారోగ్యానికి గురవుతారు.
- ఒక పాత్రలో "ద్రోణం" (సుమారుగా 7,168 గ్రాములు) కంటే ఎక్కువ అన్నం వండరాదు. ఇంతకంటే ఎక్కువ వండితే, వంటపాత్ర పొయ్యిమీద ఉన్నప్పుడు, పాత్రను వేరేచోటుకు తరలించడానికి అనేక ఇబ్బందులు ఎదురవుతాయి.
- పూర్తిగా పక్వం కానిదీ, వెంట్రుకలూ, చెమట, కీటకాలూ పడినదీ, మాడినదీ, చల్లబడినదీ అయినటు వంటి ప్రసాదాలను శ్రీవారికి నివేదించ రాదు. ఇవన్నీ కూడా అనారోగ్యకరం అని మనకు తెలుసు.
- పాత్రలో మిగిలిన అన్నాన్ని నివేదించరాదు. ఆనాడు, ఈనాడు కూడా మనం భుజించగా మిగిలినది అతిథులకు వడ్డించడం హైందవ సాంప్రదాయం కాదన్న విషయం మనందరికీ సుపరిచితమే.
- శ్రీవారికి నివేదించే వరకూ ప్రసాదాలపై అన్యుల దృష్టి పడరాదు. నోరూరుతున్న సిద్ధాన్నాలను చూస్తే, భక్తుల ధ్యాస దర్శనానికి ముందే దేవుని మీద నుండి ప్రసాదాలపైకి మళ్ళే అవకాశం ఉంది. ఆ విధంగా, ఎన్నో కష్టనష్టాలకోర్చి చేపట్టిన తిరుమల యాత్ర నిష్ఫలం కావచ్చు.

ఇలా, కట్టెలు కొట్టేవారు, వంట చేసేవారు, పాత్రలను మోసే పరిచారకులు, నివేదించే అర్చకులు, ఆరగించే భక్తులు, సమస్తమైన వారి క్షేమాన్ని, భక్తుల తిరుమల యాత్రా లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని; శ్రీవారికి అత్యంత శుచి–శుభ్రతలు కలిగిన ప్రసాదాలు నివేదించే లక్ష్యంతో, దాదాపు వెయ్యేళ్ళ క్రితమే ఇంతటి సమగ్రమైన విధి–విధానాలను పొందుపరచిన మన పూర్వీకుల దూరదృష్టికి జోహార్లు.

పూర్వం శ్రీవారి ప్రసాదాలను సిద్ధం చేయడానికి మట్టికుండలను ఎక్కువగా వాడేవారు. మిగతా అన్ని ప్రసాదాలను కులశేఖరపడి కి ఇవతల నుండే నివేదించగా, తెల్లవారు ఝామున జరిగే తొలినైవేద్యంలో మాత్రమే, "మాత్రాన్నం" (కుమ్మరి భీమన్న అనే మహాభక్తునికి గుర్తుగా అన్నం, గడ్డ పెరుగు, శొంఠి, ఉప్పు, వెన్నతో తయారు చేయబడిన పెరుగన్నం) మాత్రం గర్భాలయం లోనికి తీసుకొని వెళ్ళి పగిలిన కొత్తకుండ పెంకులో నివేదిస్తారు.

కాబట్టి దాన్ని "ఓడు ప్రసాదంగా" వ్యవహరిస్తారు.

ఎన్నిరకాల ప్రసాదాలో!

శ్రీవారి ప్రసాదాన్ని, ప్రముఖంగా ఉపయోగించే దినుసులను బట్టి నాలుగు రకాలుగా విభజించవచ్చు:

1. అన్నప్రసాదాలు బియ్యంతో చేసేటటు వంటి ముద్గాన్నం (కట్టెపొంగలి), తింత్రిణీఫల రసాన్నం (చింతపండు పులిహోర), చక్కెరపొంగలి (బెల్లంతో చేసేది), దధ్యోజనం (పెరుగన్నం), తీపి అన్నం (పంచదారతో చేసేది), మారీచ్యాన్నం (మిరియాల అన్నం లేదా "మొళిహోర"), కదంబం (పులుసన్నం లేదా శాకాన్నం),

బకాళా బాతు (మసాలా పెరుగన్నం) మరియు మాత్రాన్నం (అన్నం, గడ్డపెరుగు, శొంఠి, వెన్నతో తయారు చేయబడినది)

2. బెల్లం లేదా చక్కెర ప్రధానంగా గలవి పాయసం, సిరా (కేసరి), చిన్నలడ్డు, పెద్దలడ్డు, ఆస్థానలడ్డు, అప్పం, జిలేబీ, మనోహరం (బియ్యం, పెసరపప్పు, నెయ్యి, బెల్లం, మిరియాలతో చేసిన లడ్డు), పోళీలు, సుఖియం (పూర్ణం బూరెలు), బెల్లపుదోశె, అమృతకలశం (బియ్యం పిండి, బెల్లం, నెయ్యి, మిరియాలతో చేసేది) మరియు కొలువు ప్రసాదం (నల్లనువ్వులు, బెల్లం, శొంఠి మిశ్రమం)
3. ఉప్పుతో కూడినవి (లేదా పణ్యారములు) వడ, దోశె, నెయ్యిదోశె, తేనెతోళీలు (పెద్ద జంతికలు లేదా మురుకులు), సుండలు (పచ్చి శనగపప్పు, కొబ్బరితో చేసిన గుగ్గిళ్ళు)
4. అపక్వ (వండని) ప్రసాదాలు పంచకజ్జాయం (జీడిపప్పు, గసగసాలు, ఎండుకొబ్బరి తురుము, చక్కెర, యాలకులపొడి – ఈ ఐదు పదార్థాల మిశ్రమం), బెల్లం పానకం, ఆవుపాలు, వెన్న, వడపప్పు, మధురఫలాలు (ఒక్కో రకానికి 25 ఫలాల చొప్పున), ఎండుఫలాలు, తమలపాకులు మరియు వక్కలు

అన్నప్రసాదాలను శ్రీవారి కైంకర్యనిమిత్తం సమర్పించే ముందు పాత్రలన్నింటిలో ఆవునెయ్యి వేసి, తులసిదళాలను ఉంచి, అష్టాక్షరీ మంత్రాన్ని (ఓం నమో నారాయణాయ) ఉచ్చరిస్తారు.

శ్రీవారికి త్రికాలకైంకర్యం జరుప బడుతుంది. మూడు పూటలా జరిగే నైవేద్యసమర్పణ సమయాన్ని "**మూడు ఘంటలు**"గా వ్యవహరిస్తారు:

1. **మొదటి ఘంట** – ఉదయం అయిదు గం. లకు జరిగే నైవేద్యాన్ని బాలభోగం అని కూడా అంటారు.
   - కులశేఖరపడి లోపల శ్రీవారికి అభిముఖంగా, రెండడుగుల ఎత్తైన వేదిక మీద మాత్రాన్నం ఉంచుతారు.
   - శ్రీవారికి ఎడమవైపు లడ్డు, వడ వంటి పణ్యారాలు; కుడివైపు బలి ప్రసాదం (శుద్ధాన్నం లేదా తెల్ల అన్నం) ఉంచుతారు.
   - కులశేఖరపడి బయట, శ్రీవారికి కుడివైపున దధ్యోజనం, శుద్ధాన్నం, పులిహోర, కదంబం, ముద్గాన్నం; ఎడమవైపున గుడాన్నం (చక్కెరపొంగలి), నాలుగు గంగాళాలతో దధ్యన్నం (పెరుగన్నం) ఉంచుతారు.

   ఇది మొదటి ఘంట ప్రసాదాలుంచే క్రమం.
2. **రెండవ ఘంట** – ఉదయం 10 గం. లకు మొదలయ్యే ప్రసాద సమర్పణను రాజభోగం అని కూడా అంటారు.
   - ఈ నివేదనలో భాగంగా, శ్రీవారికి అభిముఖంగా శుద్ధాన్నం ఉంచుతారు.
   - బలిప్రసాదాన్ని (శుద్ధాన్నం) గర్భాలయ దక్షిణద్వారం వైపు ఉంచి; కులశేఖరపడి వెలుపల దక్షిణంవైపు సిరా, పులిహోర, కట్టెపొంగలి; ఉత్తరంవైపు చక్కెరపొంగలి, దధ్యోజనం ఉంచుతారు.
   - తరువాత ఘనసారం (ముఖవాసం లేదా తాంబూలం) పేరుతో తమలపాకులు, వక్కలు, పచ్చకర్పూరం, యాలకులు, ముక్తాచూర్ణం (ముత్యాలపొడి) సమర్పిస్తారు.
3. **మూడవఘంట** లేదా **రాత్రిఘంట** – రాత్రి 7:30 గం. లకు సమర్పించే నైవేద్యాన్ని శయనభోగం గా పిలుస్తారు.

- సన్నిధి లోపలనున్న వేదిక మీద మారీచ్యాన్నం (మిరియాల అన్నం), బలిఅన్నం, రెండు వెదురుబుట్టలలో త్రాంద్రవం (తోమాల దోశె), లడ్డు, వడ ఉంచుతారు.
- కులశేఖరపడికి వెలుపల దక్షిణం వైపు పులిహోర, కదంబం; ఉత్తరంవైపు గుడాన్నం ఉంచుతారు.
- పులిహోరను శ్రీవారికి అర్పించిన తరువాత బేడి ఆంజనేయస్వామికి నివేదించుతారు.

ఇవే కాకుండా, మనం చిరుతిళ్ళు తిన్నట్లే స్వామివారికి ప్రతిరోజూ నాలుగు రకాల పణ్యారములు (స్నాక్స్, లడ్డూ, వడ, జిలేబి లాంటివి) కూడా అర్పిస్తారు.

వీటితో పాటుగా, శ్రీవారికి నిశిరాత్రి (అర్ధరాత్రి) నివేదన సైతం చేస్తారు. దీనిలో భాగంగా, తిరువీశం అనబడే బెల్లపు అన్నాన్ని స్వామివారికి నివేదిస్తారు.

సాధారణంగా, శ్రీవారికి ప్రసాదాల నివేదన జరిగే సమయంలో, తిరుమామణి మంటపంలో ఉన్న బంగారువాకిలి ముందున్న పెద్ద మంటపం) పెద్దగంటలను వాయిస్తూ, ఆలయంలోను, పరిసర ప్రాంతాలలో ఉన్న వారందరికి నివేద సూచన నిస్తారు. శ్రీవారికి నివేదన జరిగిన తరువాత మాత్రమే ఆహారాన్ని తీసుకునే భక్తులు నేటికీ ఎందరో ఉన్నారు. అయితే, నిశిరాత్రి జరిగే "తిరువీశం" నివేదనలో మాత్రం పెద్దగంటలకు బదులుగా "స్నపనమండపం" లోని చిన్న గంటను మ్రోగిస్తారు. అంటే, అది దాదాపుగా నడిరేయి సమయం కాబట్టి, స్వామివారికే తప్ప భక్తులకు సూచన అవసరం లేదన్నమాట.

కొద్దిసేపటి తరువాత, స్వామివారు పట్టెమంచంపై శయనించటానికి సిద్ధంగా ఉన్నపుడు, ఆ రోజుకు చిట్టచివరి నైవేద్యంగా వేడిపాలతో పాటుగా, నేతిలో వేయించిన ఎండు ఫలాలు మరియు తాజా పండ్లముక్కలు ("మేవా" అనబడే పంచామృతం) సమర్పిస్తారు.

ప్రతిరోజూ జరిగే సహస్రదీపాలంకరణసేవ, డోలోత్సవం తరువాత పంచకజ్జాయం నివేదిస్తారు.

శ్రీవారి భోజనాల "మెనూ" ను నిశితంగా పరిశీలిస్తే, మనకు కొన్ని అబ్బుర పరిచే విశేషాలు అవగత మవుతాయి. శ్రీవారిది సమతుల్యాహారం – కడుపు నింపే పదార్థాలు, జిహ్వకు రుచిగా ఉండేవి, పుష్టికరమైనవి, ఔషధగుణాలు కలిగినవి, సులభంగా జీర్ణమయ్యేవి, చలువ చేసేవి, ఎముకలను పటిష్ఠం చేసేవి (శరీరంలో అదనపు కాల్షియం కోసం, ప్రతిరోజు అత్యంత స్వల్పమోతాదులో మంచిముత్యాల పొడిని ఆహారంలో తీసుకునే ఆనవాయితి కొందరు శ్రీమంతుల కుటుంబాల్లో నేటికీ ఉందని చెప్తారు) – వీటన్నింటి సమాహారం.

ఇంచుమించుగా ప్రతిరోజూ నైవేద్యక్రమం, ప్రసాదాలు ఇలాగే ఉంటాయి. అయితే ఋతువులను బట్టి స్వల్ప మార్పులు చేస్తారు. అలాగే వారంలో కొన్ని రోజులు అదనపు నైవేద్యాలు సమర్పిస్తారు (పైన చెప్పుకున్న నిత్యనైవేద్యాలతో పాటుగా).

బ్రహ్మోత్సవాలలో, ధ్వజారోహణ (గరుడిని జండా ఎగురవేయడం) సందర్భంగా, "కోడెపొంగలి" అనే ప్రత్యేకమైన అన్నప్రసాదాన్ని నివేదిస్తారు.



వారక్రమానుసారం సమర్పించే ప్రసాదాలు ఈ క్రింది విధంగా ఉంటాయి.

వారక్రమానుసారం అర్పించే ప్రసాదాలు

సోమవారం	మంగళవారం	బుధవారం	గురువారం **తిరుప్పావడ సేవ**	శుక్రవారం **అభిషేకం**	శనివారం	ఆదివారం
51 పెద్ద దోశలు	ప్రత్యేక ప్రసాదాలు ఏవీ ఉండవు	పెసరపప్పు	484 కిలోల పులిహోర	51 పోళీలు	రోజువారీ నైవేద్యాలు మాత్రమే	అమృత కలశం లేదా గరుడ ప్రసాదం
51 చిన్న దోశలు		పానకం	51 తేనె తోళీలు	పాయసం		
51 పెద్ద అప్పాలు		పాయసం	51 పెద్ద జిలేబీలు			
102 చిన్న అప్పాలు			వడలు			
			పాయసం			

ఆదివారం రోజున సమర్పించే ప్రసాదం పేరు అమృతకలశం లేదా గరుడప్రసాదం. ఈ ప్రసాదం వెనుక గల ఐతిహ్యం ఏమిటంటే స్వామివారి వాహనమైన గరుడునికి సర్పాలంటే జాతివైరం. అందువల్ల సర్పదోష పీడితులై సంతానలేమితో బాధపడుతున్న వారు ఈ ఈ ప్రసాదం సేవిస్తే, గరుత్మంతుడు వారిని సర్పదోష విముక్తులను చేసి, సంతానప్రాప్తి కలిగిస్తాడు.

లెక్కకు మించిన ప్రసాదాలను గుర్తుంచు కోలేక, సతమతమవుతున్నారు కదూ!

ఈ తికమక వికటకవి తెనాలి రామలింగడికీ, నందకఖడ్గ అంశతో కారణజన్ముడిగా జన్మించిన అన్నమయ్యకు కూడా తప్పలేదు. ఆ సాహితీ, సంగీత సార్వభౌముల ముందు సామాన్యులమైన మనమెంత?

జగన్నాటక సూత్రధారి శ్రీవేంకటేశ్వరుడు ఇన్నెన్ని తినుబండారాలను ఆరగిస్తున్నట్లుగా నటిస్తూ, తెనాలి రామలింగడి లాంటి వికటకవుల వెటకారాలకు (వారు కూడా శ్రీవారికి పరమభక్తులే! వెటకారంతో కూడిన వారి "నిందాస్తుతు" లలో శ్రీవారి పట్ల సాన్నిహిత్యం, చొరవ, ప్రియసఖుల పట్ల ఉండే స్వాతంత్ర్యం ధ్వనిస్తాయి) గురౌతూ, తన భక్తుల జిహ్వాచాపల్యాన్ని, అన్నార్తిని తీరుస్తున్నాడు.

భక్తులను కాపాడడానికి, ఉద్ధరించటానికి తాను స్వయంగా శారీరక బాధలను, నీలాపనిందలను భరించటం శ్రీమహావిష్ణువుకు అన్ని యుగాల్లోనూ పరిపాటే!

గర్భాలయంలోని ఇతర ఉత్సవమూర్తులకు కూడా మధ్యాహ్న, సాయం సమయాల్లో నాలుగు రకాల అన్నప్రసాదాలు, నాల్గు రకాల పణ్యారాలు, పంచకజ్జాయం నివేదిస్తారు.

ప్రత్యేక సందర్భాలలో, అంటే – మూడు రోజుల పవిత్రోత్సవాలు, తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు, మూడు రోజుల జ్యేష్ఠాభిషేకం – ఉగాది, శ్రీరామనవమి, దీపావళి – ఆస్థాన సందర్భాల్లో ఈ ప్రసాదాల పరిమాణం రెట్టింపవుతుంది.

తోమనిపళ్ళాల వాడు

అన్నమాచార్యుని "*వేడుకొందామా.... తోమనిపళ్ళాల వాడే*" అనే కీర్తన మనకు సుపరిచితం. శ్రీనివాసుణ్ణి ఈ విధంగా ఎందుకు కీర్తించారంటే – స్వామి ఒకసారి ఆరగించిన పళ్ళాన్ని తోమి మరలా వాడకుండా, పారవేస్తారు. తదుపరి భోజనానికి మళ్ళీ కొత్తపళ్ళెం ఉపయోగిస్తారు. ఆ తోమనిపళ్ళాలే – "పగిలిన మట్టికుండలు". వీటిలో ఉంచే నైవేద్యమే ఓడు ప్రసాదం. కుమ్మరి భీమన్న అనే మహాభక్తుని గుర్తుగా, తరతరాల నుండి వస్తున్న ఈ సాంప్రదాయం వెనుకనున్న ఐతిహ్యాన్ని మరొకచోట వివరించడమయ్యింది. అపార కరుణామయుడైన వేంకటేశుడు తాను మాత్రం పగిలిన మట్టికుండలో భుజిస్తూ, "తిండిమెండయ్య" అనిపించుకుంటూ, భక్తకోటికి పంచభక్ష్య పరమాన్నాలు అందిస్తున్నాడు!

లడ్డూ చరిత్ర

లెక్కకు మిక్కిలి ప్రసాదాలున్నా, దేనికీ లేని ఖ్యాతి తిరుపతి లడ్డూ (లాడుకము) సంపాదించుకుంది. మిగతా ప్రసాదాలకంటే ఎక్కువ కాలం మన్నటం, దేశవిదేశాలకు సునాయాసంగా ఆకారం చెడకుండా తీసుకెళ్ళ గలగటం, సులభంగా అందుబాటులో ఉండడంతో పాటుగా, దాని అద్భుతమైన రుచి కూడా "లడ్డూ" ప్రాచుర్యానికి కారణం. తిరుపతియాత్ర చేసి వచ్చినవారు ఎవరైనా, లడ్డూప్రసాదం తీసుకు రాకుండా ఉండరు. శ్రీవారి ప్రసాదమంటే ఎవ్వరికైనా ఠక్కున గుర్తొచ్చేది లడ్డూయే!

దాదాపు, ఆలయ పరిసర ప్రాంతమంతా నోరూరిస్తూ, తియ్యటి, కమ్మని, ఘుమఘుమలాడే స్వచ్ఛమైన నేతి సువాసనలు లడ్డూల నుంచి వచ్చినవే!

ఎవరెన్ని రకాలుగా ప్రయత్నించినా, తిరుపతి లడ్డూ రుచి మాత్రం దేనికీ రాదు గాక రాదు. ఎందుకంటే....

చక్కెరమోము గల తల్లి అయిన అలమేలుమంగ యొక్క పతిదేవుని ఎంగిలి ఇతరత్రా చేసిన లడ్డూలకు తగలక పోవడమే దీనికి కారణమేమో!

అంతే గాక, ఎనభయ్యేళ్ళకు పైగా, ఒకే పద్ధతిలో, అదే పాళ్ళలో, లక్షలకొద్దీ లడ్డూలు నిరంతరాయంగా, శ్రీవారి పట్ల అచంచల భక్తితో, తయారు చేస్తుండడం వల్ల, "పోటు" బ్రాహ్మణులు ఈ విలక్షణమూ, నిత్యనూతనమూ అయిన లడ్డూ తయారీలో అత్యంత నైపుణ్యాన్ని సంపాదించారు.

తిరుమల లడ్డూకు తి.తి.దే. 2009 సం. లో పేటెంటు హక్కు సాధించుకొని, జియోగ్రాఫికల్ ఇండికేటర్ జాబితాలో చేరింది. లడ్డూ వేర్వేరు రూపాల్లో అనేక శతాబ్దాలనుంచి ఉన్నా, తీపి బూంది ప్రసాదంగా సుమారు 1800 సం. లో

విక్రయాలు మొదలై, తదనంతర కాలంలో రూపాంతరం చెందుతూ, 1940 ల్లో ప్రస్తుత లడ్డూ రూపం దాల్చుకుంది.

ప్రతిరోజూ ఇంచుమించు మూడు లక్షల లడ్లు తయారు చేస్తారు. ఒకప్పుడు వాడే కట్టెలపొయ్యి స్థానంలో నేడు ఆవిరి పొయ్యిలను (సుమారుగా 48 పొయ్యిలు) వాడుతున్నారు. దాదాపు 700 మంది పోటు కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు. శ్రీవారి సంపంగి ప్రాకారానికి ఉత్తర భాగాన ఉన్న "పడిపోటు" అనబడే వంటశాలలో లడ్డూలను తయారు చేస్తారు. వంటలకు కావలసిన దినుసులన్నింటినీ "ఉగ్రాణం" అని పిలువబడే గిడ్డంగిలో భద్రపరుస్తారు.

లడ్డూల తయారీకి వాడవలసిన సరుకుల మోతాదును "దిట్టం" అని అంటారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న కొలమానాన్ని "పడితరం దిట్టం" గా వ్యవహరిస్తారు. దీని ప్రకారం, 5100 లడ్డూలను తయారు చేయడానికి సుమారుగా 830 కిలోల సరుకులను ఉగ్రాణం నుంచి "పడిపోటు"కు తరలిస్తారు.

ప్రస్తుతం మూడు రకాల లడ్డూలను తయారు చేస్తున్నారు:

1. **ఆస్థానలడ్డు** – వీటిని ప్రత్యేక సందర్భాలలో తయారు చేసి అత్యంత ప్రముఖులకు మాత్రమే అందజేస్తారు. సాధారణంగా, ఈ లడ్డూల విక్రయం జరగదు. వీటి తయారీలో, అధిక మొత్తంలో నెయ్యి మరియు ముంతమామిడి పప్పు (సారపప్పు) వంటి ప్రత్యేక దినుసుల్ని ఉపయోగిస్తారు. దీని బరువు సుమారుగా 750 గ్రాములు ఉంటుంది. అమోఘమైన దీని రుచిని ఆస్వాదించి తెలుసుకోవాలే గానీ, వర్ణించనలవి కాదు.
2. **కళ్యాణోత్సవ లడ్డు** – కళ్యాణోత్సవ ఆర్జితసేవలో పాల్గొన్న గృహస్తులకు ఈ లడ్డూలను ప్రసాదంగా అందజేస్తారు. సుమారుగా 700 గ్రాముల బరువుంటుంది. దక్షిణభారత దేశపు వివాహవిందుల్లో ఈమధ్యకాలం వరకు – అంటే "క్యాటరింగ్" సంస్కృతి మొదలై సాంప్రదాయిక విందుభోజనాలు అంతరించి పోయేంత వరకు – లడ్డూ వడ్డన తప్పనిసరి. ఈ ఆనవాయితీ, తిరుమలక్షేత్రంలో శ్రీవారి నిత్య కళ్యాణోత్సవానికి ప్రసాదంగా ఇచ్చే "లడ్డూ" ద్వారానే ప్రారంభమైందని చెపుతారు. ఇలా, తరతరాలుగా మన దైనందిన జీవనంలో భాగమై పోయిన తిరుమల సాంప్రదాయాలు ఎన్నో ఉన్నాయి. కళ్యాణోత్సవం మరికొన్ని ఇతరసేవల్లో పాల్గొన్న భక్తులు, ఈ లడ్డూలను, దర్శనానంతరం సంపంగిప్రాకారంలో గల "వగపడి" నందు పొందవచ్చు.
3. **ప్రోక్తం లేదా సాధారణ లడ్డు** – సాధారణ దర్శనానికి వచ్చే భక్తులకు ఈ లడ్డూలను, లెక్కగా, ఆలయం వెనుక భాగాన ఉన్న లడ్డూ కౌంటర్లలో విక్రయిస్తారు. కొన్ని రకాల ఆర్జితసేవల్లో పాల్గొన్న భక్తులకు ఉచితంగా కూడా ఇస్తారు. దీని బరువు సుమారు 175 గ్రా. లడ్డూలన్నింటి లోకి అత్యంత ప్రాచుర్యంలోకి వచ్చింది ఇదే!

ఇవే కాకుండా, భక్తులకు దర్శనానంతరం ఉచిత ప్రసాదంగా ఒక్కోసారి బుల్లి లడ్డూలను కూడా అందజేస్తారు.

51 వస్తువుల్ని (లడ్డూ, వడ, జిలేబి లాంటివి) ఒక "పడి"గా వ్యవహరిస్తారు. ఒక పడి చిన్న లడ్డూలను తయారు చేయటనికి కావలసిన పదార్థాలు:

1.80 కిలోల శనగపిండి

1.65 కిలోల నెయ్యి



4.00 కిలోల పంచదార
300 గ్రాముల జీడిపప్పు
160 గ్రాముల ఎండుద్రాక్ష
80 గ్రాముల కలకండ (పటికబెల్లం)
40 గ్రాముల యాలకులు

అదీ శ్రీవారికీ, భక్తులందరికీ అత్యంత ప్రీతికరమైన, ఖండఖండాంతరాల ఖ్యాతి గాంచిన "తిరుపతి లడ్డూ" కథ–కమామిషు.[1]

----------: : ----------

[1] కరోనా కారణంతో శ్రీవారి ఆలయంలో కొంతకాలంగా భక్తులకు ప్రవేశం లేకపోవడం వల్ల, భక్తుల సౌకర్యార్థం, లడ్డూ మహాప్రసాదాన్ని ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లా కేంద్రాలలో ప్రత్యేక కౌంటర్లద్వారా, సగం ధరకు అందజేస్తుడడంతో, ఈ లడ్డూలను పొందటం ఇప్పుడు మరింత సులువైంది.

శ్రీవారి భక్తాగ్రేసరులు

స్వామివారు రాజాధిరాజులను కాదని ప్రతిరోజూ తొలిదర్శనం ఓ గొల్లవానికి అనుగ్రహించారు. ఓ భక్తుణ్ణి "తాతా" అని ఆప్యాయంగా పిలిచారు. మరో భక్తుని "మామా" అని సంబోధించి ఆయనతో గునపం దెబ్బలు తిన్నారు. ఒకరితో పాచికలాడారు. ఒక భక్తుని మేలుకొలుపు లేనిదే నిద్ర లేవని స్వామి, మరో భక్తురాలి హారతి లేనిదే కునుకు తీయరు. ఇలా చెప్పుకుంటూ పోతే, భక్తజనకోటి పట్ల శ్రీవారి వాత్సల్యాన్ని తేటతెల్లం చేసే ఉదంతాలు ఎన్నో-ఎన్నెన్నో!

"వైకుంఠాన్నైనా" వదులుకుంటాను గానీ, తన భక్తులను మాత్రం క్షణకాలమైనా విడిచి ఉండలేనని చెప్పి, భూలోక వైకుంఠమైన తిరుమలలో శాశ్వతంగా నెలకొన్న భక్తుల పాలిటి కొంగుబంగారం ఈ శ్రీనివాసుడు!

శ్రీవారి భక్తశిఖామణులను తలంచుకున్నా స్వామివారిని స్మరించినట్లే!

శ్రీవారిసేవలో తరించి, వారి కృపకు పాత్రులైన అసంఖ్యాక భక్తుల్లో కొంతమందిని స్మరించుకుందాం.

సన్నిధిగొల్ల

స్వామివారి తొలి దర్శనభాగ్యం ఆయనదే! అతని తరువాతే అర్చకులైనా, రాజాధిరాజులైనా, మరెవరైనా!

ఆవు – దూడగా బ్రహ్మ, రుద్రులు

ఇతిహాసాల ననుసరించి భృగుమహర్షి వృత్తాంతానంతరం, కోపంతో విసవిసా వైకుంఠాన్ని వీడి కొల్హాపూరుకు చేరుకున్న శ్రీమహాలక్ష్మీ జాడ కానక, విసిగి వేసారిన శ్రీమహవిష్ణువు వేంకటాచలాన్ని చేరుకుని, పుష్కరిణికి దక్షిణం వైపున ఉన్న పెద్దపుట్టలో ఆకలిదప్పులతో అలమటిస్తుంటాడు. ఆయన దయనీయ స్థితిని గమనించి తనయుడైన బ్రహ్మదేవుడు గోవుగానూ, శివుడు దూడగానూ మారి, చోళరాజు పాలనలో ఉన్న వేంకటాచలం పరిసర ప్రాంతానికి చేరుకుంటారు. శ్రీమహావిష్ణువు పట్ల పట్టరాని ఆగ్రహంతో ఉన్నప్పటికీ, శివుడు, బ్రహ్మల ప్రోద్బలంతో లక్ష్మీదేవి గోపస్త్రీగా మారి, ముందుగా నిర్ణయించుకున్న పథకం ప్రకారం చోళరాజుకు ఈ ఆవూ-దూడను విక్రయిస్తుంది.

శ్రీనివాసునికి నుదుటిపై గాయం

మేతకు వెళ్ళిన ఆవు గొల్లకాపరి కన్నుగప్పి, పుట్టలో ఉన్న శ్రీనివాసుని వద్దకు వచ్చి పాలు ధారగా కార్చేది. ఆ ఆవుపాలతో శ్రీనివాసుడు ఆకలి-దప్పులు తీర్చుకునేవాడు. అయితే, దేవతాకళ ఉట్టిపడే ఆ గోమాత పాలను తన పిల్లవానికి త్రాగించాలనే ఉబలాటంతో ఉన్న రాణి, ఆవు పాలు ఇవ్వకపోవడంతో, రాజుగారికి ఫిర్యాదు చేస్తుంది. చోళరాజు ఆవులకాపరిని తీవ్రంగా దండిస్తాడు.

దాంతో, ఆ ఆవును రహస్యంగా వెంబడించిన గొల్లకాపరి, ఆ గోమాత పుట్టలో పాలు కార్చడం గమనించి గొడ్డలితో గోవుపై వేటు వేస్తాడు. ఆవు ప్రక్కకు తప్పుకోగా, పుట్టలో దాగున్న వేంకటేశుడు ఒక్క ఉదుటున లేవడంతో గొడ్డలిదెబ్బ

వారి తలకు తగిలి రక్తం చిందింది.

గొల్లవానికి ప్రథమదర్శన భాగ్యం

గోమాతను గొడ్డలితో దండించబోవడం వల్ల కోపోద్రిక్తుడైన స్వామి గొల్లకాపరిని పరుషవాక్కులతో మందలిస్తాడు. శ్రీనివాసుని నుదిటిపై తగిలిన గాయం నుంచి ధారగా కారుతున్న రుధిరాన్ని చూసి కలవరపడిన గొల్లవాడు తీవ్రంగా భీతిల్లి, క్షమాభిక్ష వేడుకుంటూ అక్కడికక్కడే మరణిస్తాడు.

మృతుడై పడివున్న గొల్లవానిని కరుణించిన శ్రీనివాసుడు "ఈ భూలోకంలో తొలిసారిగా నన్ను చూసిన ఈ గొల్లవాని సుకృతం గొప్పది. అందువలన కలియుగాంతం వరకు ప్రతిరోజూ మొట్టమొదట నన్ను దర్శించుకునే మహద్భాగ్యాన్ని ఈ గోపకుని సంతతికి కలిగేట్లు అనుగ్రహిస్తున్నాను" అని వరమిస్తారు. ఆనాటి నుండి నేటి వరకూ గొల్లవాని సంతతే వంశపారంపర్యంగా ఆనందనిలయంలో దివ్యమంగళమూర్తిని తొలిగా దర్శించుకుంటున్నారు. అలాగే, ప్రథమతాంబూలం కూడా సన్నిధిగొల్లకే ఇస్తారు. సుప్రభాతసేవలో భాగంగా లాంఛనప్రాయంగా బంగారువాకిళ్ళు తెరిచే సమయంలోను, తోమాల, ఏకాంతసేవల్లో, శ్రీవారి ఉత్సవమూర్తులను ఆనందనిలయం బయటకు లేదా లోనికి తీసుకు వెళ్ళేటప్పుడు, వీరి సేవలు అమూల్యం. వారి భావితరాలకు కూడా ఈ మహద్భాగ్యం యుగాంతం వరకూ కలుగుతూనే ఉంటుంది.

ఈ గొల్లల గుర్తుగా ప్రతి సంక్రాంతికీ కనుమనాడు అత్యంత వైభవంగా జరిగే "పార్వేట ఉత్సవం" గురించి ముస్ముందు తెలుసుకుందాం.

ఆలమందలతో అనుబంధం

స్వామివారి ఆకలిదప్పులను తీర్చిన గోమాత పేరు "గౌతమీధేనువు". స్వామివారు సుప్రభాత సమయాన మేల్కొన్న వెంటనే, తొట్టతొలిగా వెచ్చని ఆవుపాలను స్వీకరిస్తూ ఆ గోమాత సంతతిని కూడా అనుగ్రహిస్తూనే ఉన్నారు. ద్వాపర యుగంలో గోకులం, వెన్నముద్దలతో చిన్నికృష్ణునికి ఉన్న అనుబంధం అలాగే కొనసాగుతూ, ఈ కలియుగంలో సన్నిధిగొల్ల పట్ల వేంకటేశుని వాత్సల్యానికీ మరియు వారి దినచర్య ఆవుపాల సేవనంతో ప్రారంభించటానికి దారి తీసిందేమో!

బ్రహ్మ – రుద్రులకు శ్రీవారి అనుగ్రహం

అలాగే, గోమాత రూపంలో పాలందించిన బ్రహ్మదేవునికి ప్రతిరోజూ నిశిరాత్రివేళలో, బంగారువాకిలి ద్వారాలు తెరువక ముందే, తనను సేవించుకునే మహద్భాగ్యాన్ని కలిగించాడు శ్రీనివాసుడు. "బ్రహ్మతీర్థాన్ని" గురించి మనం ముందుగానే తెలుసుకున్నాం.

ఆవు వెంట దూడగా వచ్చిన పరమశివునికి తిరుమల ఆలయ "క్షేత్రపాలకుని" గా ఉండే మహద్భాగ్యాన్ని ప్రసాదించారు. అందువల్లనే, ఆలయ ధ్వజస్తంభ మంటపంలో, ఈశాన్యదిక్కున క్షేత్రపాలకుడైన శివునికి గుర్తుగా

ఈరోజుకూ ఉన్న "క్షేత్రపాలక శిల" పై ప్రతిరోజూ అర్చకులు బంగారువాకిలి తాళంచెవులను తాకించి నమస్కరిస్తారు. ఈ శిలలో కొంతభాగాన్ని, చిన్న "బలిపీఠం" రూపంలో నేడూ మనం చూసి తరించవచ్చు. దీనిని గురించి వెలుగులో ఉన్న ఓ ఆసక్తికరమైన ఐతిహ్యం మరోసారి తెలుసుకుందాం.

ఇలా, స్వామివారు తనను సేవించిన భక్తులందరికీ తరతరాలుగా తన కృపాకటాక్షాలు అందజేస్తూనే ఉన్నారు.

కుమ్మరి భీమన్న

పూర్వం, ఆకాశరాజు (శ్రీనివాసునుకి మామగారు) తమ్ముడైన "తొండమానుడ" నే చక్రవర్తి శ్రీవారి పాదాలకు అనునిత్యం బంగారు తులసిదళాలతో డాంబికంగా సహస్రనామార్చన చేస్తూ, తన లాంటి భక్తుడెక్కడా ఉండడని గర్వపడుతూ ఉండేవాడు. మనం ఈనాడు చూస్తున్న, సాక్షాత్తు ఆ శ్రీనివాసుడు నివసించే ఆనందనిలయాన్ని నిర్మించిన మహానుభావుడే ఈ చక్రవర్తి.

సువర్ణపుష్పాల స్థానంలో మట్టిపువ్వులు

ఒకరోజు ఉదయాన్నే తొండమానుడు స్వామివారి దర్శనానికి వచ్చినపుడు తన బంగారుపుష్పాల స్థానంలో, బంకమట్టి పూలు కనిపించాయి. దానితో ఖంగుతిన్న తొండమానుడు ఒకింత నిరాశతో శ్రీనివాసుణ్ణి ఇదేమని ప్రశ్నించగా, శ్రీవారు కుమ్మరిభీమన్న వృత్తాంతాన్ని తొండమానునికి విశద పరిచారు. ఆ రోజుల్లో భక్తులతో మానవభాషలో సంభాషించే శ్రీనివాసుడు తరువాతి కాలంలో తొండమానునిపై అలక వహించి ప్రత్యక్షంగా మాట్లాడడం విరమించారు. ఆ వృత్తాంతాన్ని మరో సారి ప్రస్తావించు కుందాం.

శ్రీనివాసుడు ఉటంకించిన భీమన్న భక్తితత్పరత

శ్రీవారికి అత్యంత ఆప్తులైన భక్తుల్లో ఒకడైన "భీమన్న" అనే కుమ్మరివాడు ఆలయానికి అవసరమైన కుండలను తయారు చేస్తూ, తన ఇంటిలోనే స్వామివారిని కొయ్యబొమ్మగా ప్రతిష్ఠించి, తన చేతివ్రేళ్ళకు అంటినట్టి మట్టితో చేసిన పువ్వులతో అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీనివాసుణ్ణి నిత్యం పూజించేవాడు. ఉదయం నుండి రాత్రి వరకూ ఏ పని చేస్తున్నా స్వామినే ధ్యానించేవాడు. అతని ధ్యాసంతా శ్రీవారికి కావలసిన కుండలు తయారు చేయడం మీదనే ఉండేది. రెక్కాడితే గానీ డొక్కాడని భీమన్న నిరుపేదతనం శ్రీనివాసుని పట్ల అతనికున్న అపారమైన భక్తిని, సమర్పణాభావాన్ని ఏమాత్రం సడలించలేక పోయింది. ప్రతిరోజూ చద్ది ఆరగించి, నీవే ఈ పని చేయించు కుంటున్నావంటూ శ్రీవారికి నమస్కరించి పని ప్రారంభించే వాడు. అతను తయారు చేస్తున్న ప్రతి కుండలో స్వామివారు ఆరగిస్తున్నట్లు భావించి, అత్యంత భక్తిశ్రద్ధలతో తన పని చేసుకునే వాడు. ప్రతిరోజూ కుండలను స్వయంగా కొండమీదికి తెచ్చి సమర్పిద్దా మనుకునే వాడు కానీ, మరునాటికి కావలసిన క్రొత్త కుండలు తయారు చేయలేనేమోననే బెంగతో, వేంకటాచలం మీదకు వెళ్ళే కార్యక్రమాన్ని వాయిదా వేసుకునే వాడు.

స్వామి ప్రతిరోజూ ఆ కుమ్మరి సమర్పించిన మట్టి కుండలలో నైవేద్యం ఆరగించడమే కాకుండా, అతడు

భక్తిపూర్వకంగా అర్పించిన మట్టిపూలను కూడా పరమానందంగా స్వీకరించేవారు. తొండమానునికి ఆనందనిలయంలో స్వామిపాదాల చెంత, తన బంగారుపూలకు బదులుగా కనిపించినవి ఆ పుష్పాలే.

భీమన్న గృహానికి తొండమానుని ఆగమనం

భీమన్న భక్తి తత్పరతను సాక్షాత్తు శ్రీనివాసుని ద్వారా విన్న తొండమానునికి అహంకారపు తెరలు తొలగిపోయాయి. ఆడంబరాల కంటే ఆత్మసమర్పణే ముఖ్యమని విదితమయ్యింది. శ్రీనివాసుని అనుగ్రహానికి అంతగా నోచుకున్న భీమన్నను చూడాలనే తీవ్రమైనకాంక్షతో, తన పరివారాన్నంతటినీ కొండపైనే వదలి, ఒంటరిగా, కాలినడకతో, అలిపిరి సమీపంలో ఉన్న భీమన్న గృహానికి వెళతాడు. తిరుమలకు వెళ్ళే అలిపిరి మెట్లదారిలో, తలయేరుగుండు దాటిన తరువాత, ఆ కాలంలో భీమన్న నివాసంగా చెప్పబడే ప్రాంతంలో, "కుమ్మరి సారె" గుర్తులున్న శిలాఫలకాలను, భీమన్న కుటుంబీకుల బొమ్మలను నేడు కూడా చూడవచ్చు. ఆకాలంలో, ఆ ప్రదేశంలో శ్రీవారి గుర్తుగా భీమన్న నిర్మించినట్లు చెప్పబడే "గోపురం", ఇప్పుడు కాలగర్భంలో కలిసిపోయింది.

విరామం లేని ఒంటరి ప్రయాణం వల్ల, అలసి సొలసి తన ఇంటిముందు అచేతనంగా పడి ఉన్న చక్రవర్తిని చూసిన భీమన్న, తన వల్ల ఏం తప్పిదం జరిగిందా అని కలవరపడతాడు.

శ్రీనివాసుని సాక్షాత్కారం

అంతలో, భీమన్న సపర్యలవల్ల స్పృహలోకి వచ్చిన తొండమానుడు చూస్తుండగానే, అక్కడ శ్రీనివాసుడు ప్రత్యక్షమయ్యాడు. శ్రీవారి దివ్యమంగళరూపాన్ని గాంచిన భీమన్న ఆనందాశ్చర్యాలతో నోట మాట రాక తడబడతాడు. కొంత సేపటి తరువాత తెప్పరిల్లిన భీమన్న, శ్రీవారిని పరిపరి విధాలుగా తనదైన పామరభాషలో కీర్తిస్తాడు. మంత్రతంత్రాలు, పూజా విధానాలు తనకు తెలియనందున క్షమించమని శ్రీనివాసుణ్ణి ఆర్తిగా అర్థిస్తాడు.

మట్టిమూకుడులో స్వామివారికి నైవేద్యం

స్వామివారికి నివేదిద్దామని చూస్తే, ఆ నిరుపేద ఇంటిలో ఏమీ కనపడవు. అలా చింతాక్రాంతుడై ఉన్న భీమన్నను ఓదార్చుతూ, శ్రీనివాసుడు, "*జపతపాల కన్నా అచంచలమైన భక్తే నాకు మక్కువ. నీవు తింటున్నదే నాకూ పెట్టు. అవే నాకు పంచభక్ష్య పరమాన్నాలు. నాకు ఆకలిగా ఉంది*" — అని భీమన్నను సమాధాన పరుస్తాడు.

అప్పుడా కుమ్మరి భార్య, ఇంట్లో సిద్ధంగా ఉన్న ఒక పగిలిన పెంకులో సంకటి పెట్టి స్వామివారిని ఆరగించ వలసిందిగా వేడుకొంటుంది. ప్రేమతో ఆ ఆహారాన్ని స్వీకరించిన స్వామి యొక్క పాదాలకు నమస్కరించగానే, ఆ పరమ పవిత్రస్పర్శతో భీమన్న దంపతులు దివ్యశరీరాలు ధరించి, దేవ దుందుభులు మ్రోగుతుండగా, పుష్పకవిమానంలో వైకుంఠానికి పయనమవుతారు.

తొండమానుని పశ్చాత్తాపం

ఈ ఉదంతాన్ని కళ్ళారా కాంచిన తొండమానుడు భీమన్న నిరాడంబరమైన భక్తిని శ్లాఘిస్తూ, తాను అహంకారాన్ని విడనాడానని, తన తప్పిదాన్ని మన్నించి తనను కూడా తరింపజేయమని శ్రీనివాసుణ్ణి ప్రార్థిస్తాడు. సంతృప్తి చెందిన స్వామివారు, తొండమానునుకి దివ్యోపదేశం గావిస్తూ, నిర్మలమైన బుద్ధితో తపఃస్సాధన సాగిస్తే మరు జన్మలో మోక్షం సిద్ధిస్తుందని వరమిస్తాడు. ఆ తరువాత, తొండమానుడు నిరాడంబర భక్తితో స్వామిని చాలా కాలం సేవించి, మరు జన్మలో మోక్షాన్ని పొందుతాడు.

ఇప్పటికీ, శ్రీవారు ఆ మహా భక్తుడైన కుమ్మరి భీమన్న గుర్తుగా, మట్టిపెంకులో (సగం పగిలిన కొత్త మట్టి కుండ) పెరుగన్నాన్ని రోజూ ప్రాతఃసంధ్య వేళలో తొలి నైవేద్యంగా స్వీకరిస్తూ, భీమన్నను, అతని వారసులను అనుగ్రహిస్తూనే ఉన్నారు. ఈ ఒక్క నైవేద్యాన్ని మాత్రమే కులశేఖరపడి దాటి, గర్భాలయం లోనికి తీసుకు వెళ్ళి నివేదిస్తారు. వాడిన కుండ మళ్ళీ వాడకుండా, ప్రతిరోజూ కొత్త కుండలో నైవేద్యం సమర్పిస్తారు. అన్నమయ్య, శ్రీవారిని "తోమనిపళ్యాల వాడని" కీర్తించడంలోని అంతరార్థం అదే!

మిగిలిన సమస్త నైవేద్య విశేషాలన్నింటినీ, గర్భాలయం బయటనుంచే నివేదిస్తారు.

అదీ శ్రీవారు తన భక్తుల యెడ చూపించే వాత్సల్యం!

తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య, మనందరికీ సుపరిచితమైన "కొండలలో నెలకొన్న... కుమ్మర దాసుడైన కురువరతి నంబి" అంటూ, కుమ్మరి భీమన్నను తన కీర్తనలో చిరంజీవిని చేశాడు.

ఆవిధంగా, తొలి దర్శనం ఓ గొల్లవానికిచ్చే గోవిందుడు, తొలినైవేద్యం ఓ కుమ్మరితో తయారు చేయబడ్డ కుండపెంకులో ఆరగిస్తాడు.

అల్పసంతోషి అయిన ఆ అఖిలాండ నాయకునికి ఆడంబరాలు, అట్టహాసాలు అవసరమా? నిరాడంబరమైన భక్తితో ఆయన్ను ధ్యానిస్తూ, ఆయన సృష్టిలో భాగమైన ఓ అన్నార్తునికి పట్టెడన్నం పెట్టడం శ్రీవారికి నిజమైన సేవ కాదా?

తిరుమల నంబి

తిరుమలక్షేత్రంలో జన్మించి, సాక్షాత్తు శ్రీమద్రామానుజు లంతటి వారిని శిష్యునిగా పొంది, తన జీవితకాలమంతా శ్రీవారి సేవకే అర్పించారు తిరుమలనంబి. ఆ ధన్యజీవి జీవితవిశేషాలను ఇప్పుడు పరికిద్దాం.

తిరుమలకు ఆగమనం

పదవ శతాబ్దంలో, మూడు వైష్ణవదివ్యక్షేత్రాలలో ఒకటైన శ్రీరంగంలో యామునాచార్యులు అనే వైష్ణవభక్తుడు శ్రీరంగనాథస్వామికి కైంకర్యసేవలు కొనసాగిస్తూ, తన శిష్యులకు శ్రీవైష్ణవ మతబోధ కావించేవాడు. ఒక నాడాయన శిష్యులతో సంభాషిస్తూ, శ్రీవేంకటాచల క్షేత్రంలో శ్రీనివాసునుకి అభిషేక, తీర్థ, పుష్ప కైంకర్యాది సపర్యలు చేయటం

భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్యంగా నమ్మాళ్వార్ (పన్నెండుమంది వైష్ణవ ఆళ్వార్లలో ఐదవ మరియు అత్యంత ప్రభావశాలియైన ఆళ్వార్) పేర్కొన్నట్లు చెబుతాడు. అయితే, వ్యక్తిగత కారణాల వల్ల అతికొద్ది కాలం మాత్రమే తానా కైంకర్యాలు చేయగలిగాననీ, తన శిష్యుల్లో ఎవరైనా, వేంకటాచలం మీద ఉండే, ఎముకలు కొరికే చలి, క్రిములు, క్రూరజంతువుల బాధలు తట్టుకుంటూ, శాశ్వతంగా అక్కడే ఉండి శ్రీవారికి సేవా కైంకర్యాదులు నిర్వహిస్తే, వారి కృపకు పాత్రులవుతురాని మరియు గురుతుల్యుడైన నమ్మాళ్వార్ ఆదేశం శిరసావహించి నట్లవుతుందని శెలవిస్తాడు. ఆ రోజుల్లో తిరుమల నిర్జనారణ్యంగా, ప్రమాదభరితంగా ఉండడం వల్ల మిగిలిన శిష్యులెవ్వరూ అక్కడ నివాసమేర్పరుచు కోవడానికి సాహసించలేదు.

యామునాచార్యుని ప్రియశిష్యుడు, మనుమడు అయిన శ్రీశైలపూర్ణుడు మాత్రం గురువుగారి ఆదేశానుసారం తిరుమలలో స్థిరనివాస మేర్పరుచుకుని, శ్రీవారికి నిత్యసేవలందించే లక్ష్యంతో, గురువుగారి ఆశీర్వాదంతో వేంకటాచలక్షేత్రానికి చేరుకుంటాడు. తిరుమలలో నివాసం ఏర్పరుచు కోవడం వల్ల ఆయన తిరుమలనంబి గా ప్రసిద్ధి కెక్కాడు.

పాపనాశనం తీర్థం

ఆయన అనునిత్యం స్వామివారి మూలవిరాట్ కు, ఉత్సవమూర్తులకు సేవాకైంకర్యం చేసేవాడు. అంతే కాక, ప్రతిరోజూ, శ్రీవారి ఆలయానికి అరుమైళ్ళ దూరంలో ఉన్న పాపవినాశనం వెళ్ళి, పవిత్ర తీర్థ జలాన్ని శిరస్సు పైనున్న ఒక మట్టికుండలో నింపుకుని, భగవన్నామ సంకీర్తన చేస్తూ, ఆ జలాన్ని తెచ్చి అర్చకులకు పూజాదికాల నిమిత్తం సకాలంలో అందించేవాడు.

బోయవాని రూపంలో శ్రీవారు

పెక్కు సంవత్సరాల పాటు, అత్యంత నిష్ఠతో, భక్తిశ్రద్ధలతో అందిస్తున్న ఈ సేవకు శ్రీవారు తిరుమలనంబి యెడ సంతుష్ఠు లవుతారు. ఒక రోజు యథాప్రకారం, అభిషేకజలం నెత్తిన పెట్టుకుని, వేళ మించకుండా ఆలయానికి చేరుకోవాలనే ఆతృతతో నడుస్తున్న శ్రీశైలపూర్ణుడుని, విల్లంబులు ధరించి, యువకుడైన బోయవాని రూపంలో స్వామివారు వెంబడిస్తారు. తనను తాతా, తాతా అని పిలుస్తూ వెంట వస్తున్న ఆ అందమైన బోయ యువకుణ్ణి, అరణ్యమధ్యంలో చూసిన శ్రీశైలపూర్ణుడు ఆశ్చర్య చకితుడ వుతాడు.

తాను చాలా దప్పికతో ఉన్నాననీ, ఆ కుండలోని నీళ్ళతో తన దాహం తీర్చమని ఆ బోయవాడు తిరుమలనంబిని వేడుకొంటాడు. అయితే, శ్రీవారిసేవకు వినియోగ మవ్వాల్సిన పవిత్రజలాన్ని ససేమిరా ఇవ్వనంటాడు తిరుమలనంబి. ఇప్పటికే ఆలస్యమైనందున, తన దారికి అడ్డు రాక దూరంగా వెళ్ళమని, ఆ బోయవాణ్ణి కసురుకుంటాడు.

తనను కాదని వేగంగా నడక సాగించిన తిరుమలనంబిని అనుసరిస్తున్న ఆ బోయవాడు తన బాణప్రయోగంతో కుండకు రంధ్రం చేసి, ధారగా వస్తున్న నీటితో దాహం తీర్చుకుంటాడు.

కొంత సేపటికి కుండ తేలిక పడడంతో వెను దిరిగిన తిరుమలనంబి కోపోద్రిక్తుడై, బోయవానితో పరుషంగా మాటలాడి, సమయానికి అభిషేకజలం సమకూర్చలేని తన అశక్తతను మన్నించమంటూ, శ్రీవారిని క్షమాభిక్ష అర్థిస్తాడు.

ఆకాశగంగ ఆవిర్భావం

అంత ఆ బోయవాడు, "తాతా! నువ్వెంత మాత్రం విచారించకు. నా వెంట వస్తే దగ్గరలోనే ఉన్న మరో పవిత్ర తీర్థాన్ని చూపిస్తాను" అంటూ తిరుమలనంబిని ప్రక్కనే ఉన్న ఓ లోయలోనికి తీసుకు వెళతాడు. ఆ బోయవాడు తన పదునైన బాణంతో ఒక కొండరాతిని ఛేదించగా, స్వచ్ఛమైన పేయజలం పెల్లుబికింది. ఇకనుండి ఈ జలాన్నే నా అభిషేకానికి ఉపయోగించమని శెలవిచ్చి బోయవాని రూపంలో ఉన్న స్వామి అంతర్థాన మవుతారు. అదే తరువాతి కాలంలో, తిరుమలలోని సుప్రసిద్ధ తీర్థాల్లో ఒకటైన ఆకాశగంగ గా వినుతికెక్కింది.

కొంత సేపటికి సంభ్రమాశ్చర్యానందాల నుండి తేరుకున్న తిరుమలనంబి అసలు విషయం గ్రహించి, వడివడిగా ఆలయాన్ని చేరుకుంటాడు. అదే సమయంలో శ్రీవారు తన అర్చకుల నుద్దేశించి, ఇక నుండి శాశ్వతంగా తిరుమలనంబి తెచ్చే ఆకాశగంగ తీర్థాన్నే తన అభిషేక జలంగా ఉపయోగించాలని ఆదేశిస్తాడు.

ముదిమి మీరుతున్న తిరుమలనంబి అత్యంత ప్రయాసతో ప్రతిరోజూ ఆరు మైళ్ళదూరం నుంచి పాపనాశన తీర్థజలాన్ని తేవడం గమనించి దయార్ద్రుడైన శ్రీనివాసుడు, అతని నిత్యకృత్యాన్ని సులభతరం చేయడమే కాకుండా, అతని అనన్యభక్తిని లోకానికీ రీతిగా చాటిచెప్పాడు!

శ్రీపాదములు

తిరుమలనంబి శ్రీవారి మహాభక్తుడే కాకుండా విద్వాంసుడు, వేదవేదాంగ పారంగతుడు కూడా!

భగవద్రామానుజులవారు తిరుపతిలో ఉన్న సంవత్సరకాలంలో, తిరుమలనంబి వద్ద శ్రీమద్రామాయణం లోని రహస్యాలను ఆకళింపు చేసుకున్నారు. తిరుమలనంబి ప్రతిరోజూ ప్రాతఃకాలంలో స్వామివారిని సేవించుకుని, కొండదిగి, అలిపిరి వద్దనున్న తలయేరుగుండు సమీపానికి చేరుకునేవారు.

అదే సమయంలో, రామానుజులవారు కూడా, తిరుపతిలో ఉన్న గోవిందరాజస్వామిని సేవించుకుని, ఆ ప్రదేశానికి వేంచేసేవారు. తిరుమలనంబి, రామాయణ రహస్యాలను, పదహారు సార్లు, పదహారు రకాల భాష్యంతో, పునరావృతం గాకుండా, రామానుజులవారికి అవగతం చేశారు. ప్రతిరోజూ వ్యాఖ్యానం పూర్తయిన తరువాత, తిరుమలనంబి తిరిగి కొండపైకి చేరుకొని శ్రీవారికి సాయంకాల కైంకర్యం చేసుకునేవారు. అయితే, అలిపిరిలో ఉండిపోయిన కారణంగా, మధ్యాహ్న సమయంలో శ్రీవారిని దర్శించుకో లేకపోతున్నానని తిరుమలనంబి చింతించేవాడు. వారి మనోగతాన్ని గుర్తెరిగిన శ్రీనివాసుడు తన పాదాలను తలయేరుగుండు వద్ద ప్రతిష్ఠింపజేసి, మధ్యాహ్న సమయంలో కూడా

తిరుమలనంబి శ్రీవారి పాదపద్మాలను సేవించుకునే అవకాశం కల్పించాడు. ఆ పాదాలను అలిపిరి నడకమార్గంలో, తలయేరుగుండు సమీపాన నేడు కూడా దర్శించుకోవచ్చు.

కొండపై మనం దర్శించుకునే "శ్రీవారి పాదాలు" వేరు.

అయితే, ఈ రామాయణ వ్యాఖ్యానం అలిపిరి నడకదారిలోని మోకాళ్ళపర్వతం నందున్న "త్రోవభాష్యకార్ల సన్నిధి" లో జరిగిందని కొందరు అభిప్రాయ పడతారు.

శ్రీరామానుజాచార్యులువారు శ్రీగోవింద భట్టారకులు సోదరులు. భట్టారకులవారు కొంతకాలం శ్రీకాళహస్తిలో నివసించి శైవమతాన్ని అవలంబించారు. శ్రీరామానుజుల వారు తన సోదరుడిని వైష్ణవమతం లోకి మార్చడానికి విశ్వప్రయత్నం కావించి విఫలమయ్యాడు. తిరుమలనంబి సహాయంతో 40 రోజులు వాదించి, తన సోదరుడిని వైష్ణవమతం లోకి మార్చగలిగాడు.

తోళప్పాచార్యుల కైంకర్యం

ఇప్పటికీ, తిరుమలనంబి వంశీయులు ప్రతి శుక్రవారం ఉదయం ఒంటిగంటకు (అంటే తెల్లవారితే శుక్రవారం) రక్షకసిబ్బంది వెంటరాగా, దివిటీల వెలుగులో, కాలినడకన అడవిబాటలో మూడు మైళ్ళు ప్రయాణించి మూడు బిందెలతో ఆకాశగంగతీర్థం నుంచి అభిషేక జలాన్ని తెచ్చి మేళతాళాలతో ఆలయప్రవేశం చేస్తారు. దారి మధ్యలో ఉన్న బాటగంగమ్మకు మ్రొక్కి ఆ దేవత ఆశీర్వచనం తీసుకుంటారు. ఆకాశగంగ తీర్థాన్ని, ఆ తీర్థానికి వెళ్ళే అరణ్యమార్గంలో బాటగంగమ్మ ఆలయాన్ని ఈనాడు కూడా చూసి తరించుకోవచ్చు.

తిరుమలనంబి ఆలయం

శ్రీవారి ఆలయానికి దక్షిణమాడ వీధిలోని మహాప్రదక్షిణ మార్గంలో, సంపంగి వృక్షాలనీడలో, తిరుమలనంబి ఆలయాన్ని మనం చూడవచ్చు. అందులో తిరుమలనంబి మూలమూర్తి ఉత్సవమూర్తులతో బాటుగా, రామానుజాచార్యుల వారిని కూడా దర్శించుకోవచ్చు. మలయప్పస్వామి మాడవీధుల్లో ఊరేగుతున్నప్పుడు ఈ ఆలయం ఎదురుగా నీరాజనం అందుకుంటారు. ఈ ఆలయంలో తిరుమలనంబి వంశీయులే ఇప్పటికీ అర్చకత్వం వహిస్తూంటారు.

వేకటేశుడు తిరుమలనంబిని తాతా అని పిలవడం వల్ల ఆ వంశస్థులందరూ "తాతాచార్యులు"గా పిలువబడుతున్నారు. అంతే కాకుండా, శ్రీవారు తిరుమలనంబిని "తోళన్" గా సంబోధించడం వల్ల ఈ వంశం వారిని "తోళప్పాచార్యులు"గా కూడా పేర్కొంటారు. తమిళంలో "తోళన్" అంటే స్నేహితుడని అర్థం. ప్రస్తుతం తిరుమలలో కైంకర్యం నిర్వహిస్తున్న తిరుమలనంబి వంశీయులను "తోళప్పాచార్యులు" గానూ; కాంచీపురంలోని తిరుమలనంబి వారసులను "తాతాచార్యులు" గానూ వ్యవహరిస్తారు.

వైకుంఠ ఏకాదశికి పదకొండు రోజుల ముందుగా ప్రారంభమై, ఇరవయ్యైదు రోజులపాటు సాగే అధ్యయనోత్సవాల్లో

చివరిరోజున తిరుమలనంబిని బోయవాడు తాతా అంటూ ఆప్యాయంగా పిలిచి, నీళ్ళు త్రాగిన రోజుకు గుర్తుగా తన్నీరుముదు అనే ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

అన్నమయ్య ఈ భక్తుణ్ణి కూడా,

.....మచ్చిక దొలక తిరుమలనంబితోడుత నిచ్చనిచ్చ మాటలాడి నచ్చినవాడు ॥

అంటూ తన పదబంధనంతో అమరుణ్ణి చేశాడు.

తరాలు మారినా, యుగాలు మారినా వేంకటేశుడు తన భక్తుల కష్టనష్టాలను అనుక్షణం గమనిస్తూ, అడగకనే కడగండ్లు తీరుస్తూ ఆపద్బాంధవుడిగా అలరారుతున్నా డనడాని తిరుమలనంబి వృత్తాంతమే నిలువెత్తు నిదర్శనం!

----------: : ----------

శ్రీవారి వారోత్సవాలు

"ఎన్ని జన్మల పుణ్యమో – నీకిన్ని సేవలు చేయగా!
ఏడుకొండల దేవరా – ఈ భాగ్యమంతా మాదిరా!"

తిరుమల లోని శ్రీవారి ఆలయం, లెక్కకు మిక్కిలి ఉత్సవాలు, సేవలతో వైకుంఠాన్ని తలపిస్తుంది. ఈ సేవలను ఆచరించే వారు యజ్ఞఫలాన్ని పొందుతారని భక్తుల విశ్వాసం. ఉత్సవ ప్రియుడైన స్వామి సేవలలో ఉన్న పరమార్థాన్ని వేయి నోర్లు, రెండువేల నాలుకలు కల ఆదిశేషుడు, ఆయన నాభికమలంలో ఉద్భవించిన బ్రహ్మ, వక్షోవిహారిణి అయిన అమ్మవారు కూడా చెప్పలేక సతమత మయ్యారట. అంతటి మహత్తరమైన సేవలను వర్ణించటానికి మనమెంతటి వారం? అయినా, ఆ స్వామి వారి మీద భారం ఆ సేవల సారాంశాన్ని లేశామాత్రంగా తలుచుకుందాం.

సుప్రభాతసేవ నుంచి ఏకాంతసేవ వరకూ ప్రతిరోజూ జరిగే "నిత్యసేవలను" మనం ముందే చెప్పుకున్నాం. ఇక వారంలో ఒక రోజు మాత్రం జరిగే "వారోత్సవాల" గురించి తెలుసు కుందాం.

శ్రీవారి పాదపద్మాలకు జరిగే అష్టదళపాద పద్మారాధన తో "వారోత్సవాలు" వాటి విశేషాలను తెలుసుకుందాం.

అష్టదళ పాద పద్మారాధన

ప్రతి మంగళవారం, ఉదయం ఆరు గంటలకు, రెండవ అర్చనగా, నూట ఎనిమిది బంగారు కమలాలతో మూలవిరాట్టు పాద పద్మాలకు, సుమారు 20 నిముషాల పాటు జరిగే సేవా కార్యక్రమమే ఈ అష్టదళ పాద పద్మారాధన. ప్రతిరోజూ, స్వామివారి పాదాలకు తులసిదళాలతో ఏకాంతంగా అర్చన జరుగుతుంది. కైంకర్యపరులకు తప్ప వేరెవరికీ అది చూసి తరించే భాగ్యం లేదు. కానీ మంగళవారం మాత్రం "అష్టదళ పాద పద్మారాధన" ఆర్జితసేవలో పాలు పంచుకొనే భక్తులందరూ ఈ అర్చనను చూసి తరించవచ్చు.

ముస్లిం భక్తుడు?

1984 సం. లో, తి.తి.దే. స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ సేవ ప్రారంభించబడింది. హైదరాబాదు/ గుంటూరు వాస్తవ్యుడైన ఓ మహమ్మదీయ భక్తుడు ఇందుకు అవసరమైన 108 బంగారు పద్మాలను శ్రీవారికి కానుకగా సమర్పించాడు. స్వామివారు ఒక మతానికో, ప్రాంతానికో పరిమితం కాని అఖిలాండ, బ్రహ్మాండ నాయకుడనటానికి ఇంతకంటే చక్కటి నిదర్శనం ఏం ఉంటుంది?

కొంతకాలం తరువాత ఇది ఆర్జితసేవగా రూపు దిద్దుకుంది. అయితే, అన్ని ఇతర సేవాకైంకర్యాల లాగా ఈ అర్చన యొక్క మూలాలు కూడా ప్రాచీన కాలం నాటి ఆగమశాస్త్రం లోనే ఉన్నాయి.

ఈ సేవ, ఎప్పుడు – ఎలా ప్రారంభమైంది!

దీని విషయమై ఒక ఆసక్తికరమైన, అద్భుతమైన, ఈ మధ్యకాలంలోనే జరిగిన యదార్థసంఘటన ఉంది. 1982వ సంవత్సరంలో తి.తి.దే. బోర్డు సమావేశం జరుగుతున్నప్పుడు, షేక్ మస్తాన్ అనే ముస్లిం భక్తుడు అప్పటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి వి ఆర్ కే ప్రసాద్ గారిని కలుసుకునే నిమిత్తం తి.తి.దే. కార్యాలయానికి వచ్చారు. సమావేశంలో వ్యస్తులై వుండటంవల్ల శ్రీ ప్రసాద్ గారు అయిష్టంగానే ఆ భక్తుణ్ణి కలుసుకున్నారు. ఆ భక్తుని కథనం ఇలా ఉంది –

"అయ్యా! గుంటూరు జిల్లాకు చెందిన మా అన్నదమ్ముల మందరం ఉమ్మడి కుటుంబంలో కలసి మెలసి ఉంటూ ఓ చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్నాం. మాది ఓ మధ్యతరగతి కుటుంబం. తరతరాలుగా మేము శ్రీవారి భక్తులం. మా గృహంలో శ్రీవెంకటేశ్వరసుప్రభాతం, మంగళాశాసనం, శ్రీవేంకటేశ్వరగద్యం – వీటి పఠనం నిత్యం జరుగుతుంది. ప్రతి మంగళవారం నాడు అష్టోత్తర శతనామార్చన కూడా భక్తితో జరుప బడుతుంది. మా తాతగారు, తన స్వార్జితంతో 108 స్వర్ణపుష్పాలు చేయించి శ్రీవారికి సమర్పిస్తానని మొక్కుకున్నారు. కానీ కొన్ని పద్మాలు చేయించగానే అస్వస్థతతో కాలం చేశారు. దాంతో ఆ మొక్కు తీర్చుకునే బాధ్యత మా తండ్రిగారు భుజానికెత్తుకుని, మరికొన్ని పుష్పాలు చేయించి, వారు కూడా స్వర్గస్తులయ్యారు. ఇప్పుడా బాధ్యత మా మూడోతరం వారిపై పడింది. ఆ బాధ్యతను ఆనందంగా స్వీకరించి, ఆర్థికంగా అంతంత మాత్రమే స్థోమత గల మేమందరం ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి, ప్రతి పైసా కూడబెట్టి, ఎన్నో ఏళ్లుగా స్వర్ణకమలాలు తయారు చేయిస్తున్నాము. ఒక్కొక్కటి 23 గ్రాముల బరువు గల 108 కమలాలు ఈమధ్యనే పూర్తయ్యాయి. తమరు దయతో వీటిని స్వీకరించి స్వామివారి కైంకర్యంలో ఏదోవిధంగా వినియోగిస్తే, మన తండ్రి, తాత గార్ల ఆత్మలు శాంతిస్తాయి. మా కుటుంబ సభ్యులందరికీ ఎనలేని ఆనందం చేకూర్చిన వారవుతారు. ఈ విషయం తమతో ప్రత్యక్షంగా విన్నవించు కోవడానికి, 54 మంది సభ్యులు గల మా పరివారమంతా, కాలినడకన బయలు దేరి కొండకు చేరుకున్నాం."

ఆ మహమ్మదీయ భక్తుడి ఆవేదనను, ఆర్తిని ఆసాంతం విన్న బోర్డు సభ్యులకు నోటమాట రాలేదు. మరో రెండేళ్ల తర్వాత జరుగబోయే తి.తి.దే. స్వర్ణోత్సవాలు చిరకాలం గుర్తుండిపోయే విధంగా ఏ సేవను ప్రవేశపెట్టాలా! అని తర్జనభర్జన పడుతున్న బోర్డు సభ్యులకు ముస్లిం భక్తుని విన్నపం, వెదకబోయిన తీగ, శ్రీవారి కృపతో కాలికి తగిలినట్ల నిపించింది. అంతే! బోర్డు సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించి, 1984 సంవత్సరంలో జరిగిన స్వర్ణోత్సవాల సందర్భంగా "అష్టదళ పాద పద్మారాధన" అనబడే, ప్రతి మంగళవారం జరిగే, నయనా నందకరమైన ఆర్జితసేవను ప్రవేశపెట్టారు. అప్పటినుండి ఈ సేవ నిరాటంకంగా జరుప బడుతోంది.

పద్మారాధన మహత్యం

పురాణేతిహాసాల్లో ఉటంకించిన దాని ప్రకారం, గర్భాలయంలో మూలవిరాట్టుకు జరిగే ఈ సేవ అత్యంత మహత్తరమైనది. మన మనస్సనే పద్మాన్ని స్వామివారి పాదపద్మాలకు సమర్పిస్తున్నామనే భావం భక్తులను పరవశింప జేస్తుంది. స్వామివారి పాదాలు, హస్తద్వయం, ముఖము, నేత్రాలు, పద్మంలో ఉన్నటువంటి వక్షఃస్థల లక్ష్మీ అమ్మవారు సమస్తం పద్మమయమే! వేంకటేశుని ఆ పద్మతత్వం మనలను ధర్మమార్గం వైపు నడిపిస్తుంది. కాబట్టే, ఈ పద్మారాధనకు అంతటి ప్రాముఖ్యం ఉంది.

ఆరాధనా విధానం

ఉదయం 6 గం. లకు, వైఖానస అర్చకులు గర్భాలయ మూర్తికి అర్ఘ్య, పాద్య, ఆచమనాదులు నిర్వహించడంతో ఈ సేవ మొదలవుతుంది. తరువాత, "శ్రీవేంకటేశాయనమః" అనే ఉచ్చారణతో ప్రారంభమైన అష్టోత్తర శతనామావళి పఠనంతో బాటుగా, శ్రీవారి పాదాలకు, ఒక్కో నామానికి ఒక్కో స్వర్ణపద్మ సమర్పణతో అర్చన కొన సాగుతుంది. శ్రీవారి పాదాల ముందుంచిన ఓ ఐదంచెల వర్తులాకార పీఠంపై ఈ పద్మాలను ఒకటొకటిగా ఉంచుతారు. ఈ 108 నామాలలో శ్రీవారి ఘనతనూ, దివ్యచరితనూ, లీలలనూ, పరాక్రమాన్నీ, అవతార విశేషాలను కొనియాడతారు.

ఐతిహ్యం

పూర్వయుగాల్లో బ్రహ్మదేవుడు సమస్త దేవగణ సమేతుడై, స్వర్గంలో ప్రవహించే మందాకిని అనబడే గంగానదిలో వికసించే బంగారు పద్మాలతో, స్వామి వారి పాదాలకు అర్చన చేసినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. బ్రహ్మ స్వయంగా విష్ణువు కుమారుడు. అంటే, ఇది కొడుకు తండ్రికి చేసే టటువంటి పాదపూజ. నాడు బ్రహ్మదేవుడు శ్రీకారం చుట్టిన ఈ సేవ నేటికీ తిరుమలలో అంగరంగ వైభవంగా జరుగుతోంది. ప్రాతఃసంధ్యలో, తల్లి తండ్రుల పాద సేవనంతో దినచర్య ప్రారంభించాలని సాక్షాత్తూ బ్రహ్మదేవుడే స్వయంగా ఆచరణలో చూపించి, యుగ-యుగాలలో తన సంతతి కంతటికీ మార్గదర్శకు దయ్యాడు.

ఈ సేవలో పాల్గొన్న భక్తులందరికీ, శ్రీవారి కటాక్షంతో, అష్టైశ్వర్యాలు చేకూరడంతో బాటు, వంశాభివృద్ధి కలుగుతుంది.

సహస్రకలశాభిషేకం

సప్తగిరి సార్వభౌముని సహస్రకలశాభిషేకం!
బుధవార మహోత్సవం – భువన-భూమి వైభవం!

ప్రతి బుధవారం ఉదయం 6 గం. లకు బంగారువాకిలి ముందు ఘంటామండపం లో జరిగే ప్రధానసేవే **సహస్రకలశాభిషేకం**. 1511వ సం. కు పూర్వం నుంచే ఈ సేవ జరగుతూ ఉన్నట్లు చారిత్రకా ధారాలున్నాయి.

సాధారణంగా, భోగశ్రీనివాసుని అర్చారూపం మూలవిరాట్టు పాదాల వద్ద, కొద్దిగా ఈశాన్యం వైపు తిరిగి ఉంటుంది. ఆ స్థానాన్ని "జీవస్థానం" అంటారు (తాత ముత్తాతల నుండి ఉంటున్న స్థానమే జీవస్థానం). ఆ స్థానం లోని భోగశ్రీనివాసుణ్ణి గర్భాలయం నుంచి బయటకు తెచ్చి ఓ చూడ చక్కనైన వేదికపై తూర్పు ముఖంగా వేంచేపు చేస్తారు. మరో ప్రక్క ఉత్తరదిక్కుగా, శ్రీదేవి-భూదేవీ సహిత మలయప్పస్వామిని వేరొక వేదిక మీద వేంచేపు చేస్తారు. దక్షిణదిశగా, అంటే మలయప్పస్వామి వారికి అభిముఖంగా ఉండేట్లు విష్వక్సేనుల వారిని నెలయింప చేస్తారు. ఇలా, మూడు మూర్తులూ అర్ధవృత్తాకారంలో, కన్నుల పండువగా సమావేశం అయ్యేటటువంటి అద్భుతఘట్టం మనకు సహస్రకలశాభిషేక సందర్భంగా గోచరిస్తుంది.

మరో ప్రక్క, ధాన్యపు గింజలతో ఒత్తుగా పరచ బడిన పాన్పుపై 1008 వెండి చెంబులను పేర్చి, వాటిని సుగంధద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాలతో నింపి, నాలుగు మూలలా వస్త్రంతో కప్పి, వాటిని మంత్ర పూర్వకంగా ఆవాహన చేస్తారు. మంగళకరంగా ఉండేందుకు గానూ, వీటిపై మామిడాకులు కూడా ఉంచుతారు.

ఇక్కడో రహస్యం ఉంది!

భోగశ్రీనివాసుడుకి స్నానం చేయిస్తూంటే, ఆ కైంకర్యాలన్నీ గర్భగుడిలో ఉండే వేంకటేశ్వరస్వామి కెలా చేరుతాయి? మూలవిరాట్టు కంత శక్తి ఎలా వస్తుంది? గర్భగుడి లోని మూలమూర్తికి ఏ రోజూ 1008 కలశాలతో అభిషేకం జరగట్లేదు కదా? వందల, వేల సంవత్సరాల తరబడి, అనేకానేక భక్తులు శాస్త్రానుసారం, చిత్తశుద్ధితో చేసే సేవల వల్లే దేవతా మూర్తులకు వర్చస్సు, తేజస్సు, శక్తి సమకూరుతాయని వైదిక గ్రంథాల్లో చెప్పబడింది.

సహస్రకలశాభిషేకం వల్ల ఉత్సవమూర్తులకు చేకూరే శక్తిని మూలమూర్తికి చేర్చడం కోసం, భోగశ్రీనివాసుణ్ణి మరియు గర్భగుళ్ళోని మూలవిరాట్టును కలుపుతూ ఓ పట్టు దారం కడతారు. దీన్ని అనుసంధాన తోరణం అంటారు. అభిషేకం జరుగుతున్నప్పుడు, ఈ 1008 కలశాల్లో ఉన్నటువంటి అభిషేకజలం యొక్క పవిత్రశక్తి ఈ పట్టుదారం ద్వారా గర్భగుడిలో ఉన్న స్వామివారిలో మమేక మోతుంది. అప్పుడు శ్రీవారు మరింత శక్తిమంతులై, భక్తులను సంరక్షిస్తూ ఉంటారు.

మనం కూడా ఏవైనా పూజా కార్యక్రమాలు చేసేటప్పుడు ముంజేతికి కంకణం కట్టుకుంటాం. దీని వల్ల కంకణధారులకు అంతులేని అదృశ్యశక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం.

దీనికి ముందుగానే, అర్చామూర్తులను ఉంచే ప్రదేశానికి స్థలశుద్ధి చేసి, మలయప్పస్వామి మరియు ఇద్దరమ్మవార్లకు కంకణధారణ గావిస్తారు. తరువాత విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరుగుతుంది. విష్వక్సేనుడు శ్రీవారి సేనాపతి కావున, ముందుగా ఆయన్ను పూజించే సంప్రదాయం ఉంది. అగ్నిప్రతిష్ఠ చేసి, హోమకార్యక్రమా నంతరం, 1008 రజత కలశాల జలంతో ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తారు. పురుషసూక్తంతో ప్రారంభమై, స్వామివారికి – పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు – ఈ అయిదు ద్రవ్యాలతో, విడి విడిగా అభిషేకం చేస్తారు. ప్రతి ద్రవ్యంతో అభిషేకం జరిగిన తరువాత, మూర్తులు శుభ్రపడం కోసం వాటిని మంచినీటితో స్నాన మాచరింప జేస్తారు. లేత కొబ్బరి నీళ్ళతో కూడా అభిషేకం చేస్తారు.

చివరగా, సహస్రధార పాత్ర, అంటే వెయ్యి రంధ్రాలు గల వెండి పాత్ర (వెండి జల్లెడగా చెప్పుకోవచ్చు) మీదుగా, శంఖధార, చక్రధారలుగా చెప్పబడే ప్రత్యేక పాత్రల ద్వారా జలాభిషేకం జరిపించడంతో, సహస్రకలశాభిషేకం పూర్తవుతుంది. అభిషేక జలం వెయ్యి ధారలతో, స్వామివారి మీద జడివానలా కురుస్తుంటే, చూపరులకు బహుచక్కనైన దృశ్యకావ్యం ఆవిష్కార మవుతుంది. సేవ చివరిగా, పాల్గొన్న భక్తులందరి మీదా అభిషేక జలాన్ని ప్రోక్షిస్తారు. ఈ ఆర్జితసేవ సమాప్తమవగానే, భక్తులందరినీ శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు.

ఈ అభిషేకం ద్వారా, తేజస్సు, ఓజస్సు, జ్ఞానము, వైరాగ్యం, మేధస్సు లభిస్తాయి. ఇంకా, సకల తీర్థ జలాలతో

స్వామివారికి జరిగే అభిషేకం కనులారా దర్శించటం ద్వారా, భక్తులకు పుణ్యనదులు కలిసే టటువంటి సాగరంలో పవిత్రస్నాన మాచరించిన పుణ్యం కూడా కలుగుతుందని ప్రతీతి.

సర్వేజనాః సుఖినోభవంతు!

గురువారపు సేవలు – తిరుప్పావడ *లేదా* అన్నకూటోత్సవం

"గురువార-గురుతర సేవా మహిమా వర్ణింపగ మా తరమా!
పరమాత్మా... తిరువేంకట శిఖర పరంధామా!"

ప్రతి గురువారం స్వామి వారికి రెండవ అర్చనానంతరం, ఉదయం 6 గం. లకు జరిగే నివేదనను తిరుప్పావడసేవ లేదా అన్నకూటోత్సవం అంటారు. సాధారణంగా మనం ఇంట్లో, మహా అయితే 1-2 కిలోలు, అదే దేవాలయాల్లో, రామనవమి, వినాయక చవితి ఉత్సవాల్లో 10-15 కిలోల పులిహోర వండుకుంటాం. కానీ, గురువారం జరిగే తిరుప్పావడ లేక అన్నకూటోత్సవ సేవలో, బళ్ళ కొద్దీ, వందలాది కిలోల పులిహోర కలిపి, స్వామి నైవేద్యానంతరం భక్తులకు ప్రసాదవితరణ చేస్తారు.

గురువారం ప్రాతఃకాల ఆరాధన పూర్తి కాగానే, అర్చకస్వాములు ఏకాంతంగా శ్రీవారికి అలంకరించిన స్వర్ణాభరణాలు, పీతాంబరాల నన్నింటినీ సడలింపు చేస్తారు. తరువాత ఊర్ధ్వపుండ్రాన్ని (తిరునామాన్ని) సగానికి తగ్గించి, స్వామి వారి నేత్రాలు స్పష్టంగా, నయనానంద కరంగా కనపడేట్లు చేస్తారు. ఆభరణాలు లేకుండా స్వామి వారి దివ్యమంగళకరమైన, రూపాన్ని రోజల్లా చూడగలిగే భాగ్యం కేవలం గురువారం నాడు మాత్రమే కలుగుతుంది.

అనంతరం, పండితులు వేదపారాయణతో పాటు శ్రీనివాసగద్యం పఠిస్తుండగా, ఈ "అన్న" నివేదన జరుగుతుంది. బంగారువాకిలి ముందు గరడాళ్వార్ సన్నిధిలో ఉన్న నాలుగు స్తంభాల మధ్య 484 కిలోల బియ్యంతో తయారు చేసిన పులిహోర రాశిని, ప్రత్యేకంగా తయారు చేయబడ్డ ఓ అతిపెద్ద, లాగుడుబండి వంటి వెండిశకటంలో పెద్దశిఖరం లాగా అమర్చుతారు. దానికి ఎనిమిది దిక్కుల్లో పులిహోరతో ఎనిమిది చిన్న శిఖరాలను ఏర్పాటు చేసి నివేదన చేస్తారు. పులిహోరతో పాటుగా, గురువారం నాడు మాత్రమే తయారు చేయబడే పెద్ద జిలేబీలు, మురుకులు (తేనేతోళీలు లేదా కారం జిలేబీ) వంటి వాటిని కూడా చక్కగా అమర్చి పూలతో అలంకరిస్తారు.

స్వామివారికి అన్నం ఎందుకు నివేదించాలి?

సమస్త జీవకోటికి ప్రాణాధారం అన్నం. అన్నం పరబ్రహ్మ స్వరూపం. మన జీవనం సజావుగా సాగిపోవడానికి భగవంతుడు మనకు ప్రసాదిస్తూ వస్తున్న అన్నానికి కృతజ్ఞతగా, సమస్త జీవరాశులకు మున్ముందు కూడా ఏ లోటూ లేకుండా అన్నలభ్యత చేకూరాలని ప్రార్థిస్తూ జరిగే ఈ సేవ అత్యంత ప్రముఖమైన సేవల్లో ఒకటి.

వీటితో పాటు ఇంకా అనేక నైవేద్యాలు సమర్పించి "ఓ స్వామీ! ఈ రోజు నువ్వు నిజనేత్రాలతో సమస్తమైన భక్తులందరినీ అనుగ్రహిస్తున్నావు. ఇదుగో స్వీకరించు నాయనా.." అంటూ స్వామివారికి నివేదిస్తారు.

ఈ తిరుప్పావడ సేవ గాంచిన భక్తులకు, నివేదించిన పులిహోరలో ఎన్ని మెతుకు లున్నాయో, అన్ని సంవత్సరాల పాటు స్వర్గవాసం లభిస్తుందని పెద్దలు చెబుతారు.

నిజనేత్ర దర్శనం

"కంటి నఖిలాండతతి కర్తనధికుని గంటి –
కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి...."

అంటూ, అన్నమయ్య కీర్తించిన, మహా మహిమాన్వితమైన శ్రీవారి నిజనేత్ర శోభను దర్శించడం పూర్వ జన్మ సుకృతం.

ప్రతి గురువారం జరిగే నిజనేత్రదర్శనోత్సవం లో స్వామివారు సన్నటి నామాలతో, విప్పారిన నేత్రాలతో, ఆభరణాలు లేకుండా, కేవలం ధోవతి, పైపల్లెవాటుతో, మెడలో రెండు కంటెలతో, బుగ్గన పచ్చకర్పూరపు దిష్టిచుక్కతో, సొగసైన తలగుడ్డతో, నిరాడంబరంగా ఉంటారు. నల్లని మేనుతో మెరిసి పోతూ, ద్వాపరం నాటి ఆ నల్లనయ్యే కలియుగంలో ఈ శ్రీనివాసునిగా ఉద్భవించాడనే జగద్విదితమైన సత్యాన్ని దృఢపరుస్తారు. అందువల్లనే కొందరు నిజనేత్ర దర్శనాన్ని 'గోపాలుని దర్శనం" అని కూడా అంటారు. గోమాతతో అనుబంధం, గొల్లల సాన్నిహిత్యం, పాలు–పెరుగుల సేవనం, ఇవన్నీ గుర్తుకు తెచ్చుకుంటుంటే, ఆ నల్లనయ్యే ఈ చక్కనయ్య అనే నమ్మకం మరింత బలపడట్లేదూ?

నిజనేత్ర దర్శనానికి సంబంధించి ఓ ఆసక్తి కరమైన అంశం స్థానికంగా వెలుగులో ఉంది. తిరుమలలో ఉన్నటువంటి సిబ్బంది, వ్యాపారులు అందరూ, గురువారం నాడు మరింత జాగ్రత్తగా, ఏ విధమైన పొరపాట్లు, తప్పిదాలు జరగకుండా జాగ్రత్త పడతారట. ఎందుకంటే, స్వామివారు సన్నటి నామాల కారణంగా వికసిత నేత్రాలతో ఉండడం వల్ల, ఏ తప్పు జరిగినా వెంటనే గమనిస్తారని వారి నమ్మకం. మిగతా రోజుల్లో అర్ధనిమీలిత నేత్రాలతో ఉన్నంత మాత్రాన ఆ సర్వాంతర్యామికి, సహస్రనేత్రుడికీ మనం చేసే తప్పొప్పులు కనబడటం లేదనుకోవడం కేవలం అజ్ఞానం!

పూలంగి సేవ

"పూలంగి సేవకే పూలెన్నొ తెచ్చేము!
మా భక్తి సీమలో పూమాల లల్లేము!"

పూలంగి అంటే పువ్వుల అంగీ. అనగా పుష్పాలనే వస్త్రాలు గా ధరించడం.

గురువారం నాడు జరిగే మరో సేవ పూలంగిసేవ. రాత్రి 8 గం. లకు జరిగే ఈ సేవ పూర్తిగా ఏకాంతం. జియ్యంగార్లు అందించే పూలమాలలను అర్చకులు శ్రీవారిమూర్తికి వస్త్ర రూపంగా, ఉత్తరీయ రూపంగా, ఆభరణ రూపంగా, కిరీట–శంఖు–చక్రాల రూపంగా, మొత్తం పుష్పమయంగా, శోభాయమానంగా అలంకరిస్తారు. స్వామి వారు పూల అంగీని తొడిగినట్లుగా, కోటి రెట్ల సౌందర్యంతో, నవ మన్మథునిలా కను విందు చేస్తారు.

వైష్ణవాలయాలను పుష్పమండపం, జ్ఞానమండపం, త్యాగమండపాలు గా వర్గీకరిస్తారు. తిరుమల పుష్పమండప మన్న మాట. ఈ క్షేత్రంలో పూచే పువ్వులన్నీ, పూర్వ జన్మల్లో మహా భక్తులు, సిద్ధపురుషులు, మునిపుంగవులే. వారి వారి

పూర్వజన్మ పుణ్యఫలాల ననుసరించి వారీ జన్మలో పూవులుగా పూచి స్వామి వారికి అలంకృత మవుతున్నారు. అందువల్లనే, తిరుమలలో పుష్పాలన్నీ స్వామికే చెందుతాయనీ, వేరెవ్వరూ పూలు అలంకరించు కోరాదనే సాంప్రదాయం అమల్లో ఉంది.

సువాసనలు వెదజల్లే పుష్పాలతో అలంకరింప బడిన స్వామివారిని దర్శించుకుంటే, జన్మాంతర వాసనలన్నీ పోయి, గత జన్మల పాపాలన్నీ పటాపంచ లవుతాయని భక్తుల నమ్మిక.

గురువారం నాడు జరిగే వారపు సేవలైన తిరుప్పావడసేవ, నిజనేత్రదర్శనం, పూలంగిసేవలు సమాప్తం.

శుక్రవారం అభిషేకం

"కంటి శుక్రవారము గడియ లేడింట –
అంటి అలమేల్మంగ అండ నుండే స్వామిని!"

అన్న కీర్తనలో, అన్నమయ్య, శుక్రవారాభిషేకం సందర్భంగా శ్రీవారికి జరిగే ఉపచర్యలన్నీ ముగ్ధ మనోహరంగా వర్ణించాడు. ఆ వాగ్గేయకారుని వర్ణన ముందు, మనం చెప్పుకునే అభిషేక ముచ్చట్లన్నీ, చంద్రుని ముందు దీవిటీ లాగా వెల వెల బోతాయని తెలిసీ, స్వామివారి మీద భారం వేసి ఈ సాహసానికి పూనుకుంటున్నాం.

శ్రీవేంకటేశుని మూలమూర్తికి ప్రతి శుక్రవారం ఉదయం 3:30 గం. ల నుండి 5 గం. ల మధ్య శుక్రవార అభిషేకం జరుగుతుంది. అభిషేక సమయంలో ఆభరణాది అలంకారాలు లేకుండా ఉన్న స్వామివారి మూర్తి యొక్క సొబగులు వర్ణించడం మహామహుల తరం కూడా కాదు. తీర్చిదిద్ది నట్లుండే పెదవులు, సంపెంగ వంటి ముక్కు, వికసించిన పుష్పంలా ఉండే ముఖారవిందాన్ని వీక్షిస్తూ భక్తజనులు మైమరచి పోతుంటారు.

అభిషేక సేవ పుట్టు పూర్వోత్తరాల్లోకి వెళ్తే –

పల్లవరాణి "సామవై" భోగశ్రీనివాసుని వెండి ప్రతిమను బహూక రించినప్పటి కాలం, అనగా 614వ సం., ముందు నుండీ, విశేష సందర్భాల్లో ఈ అభిషేకోత్సవం జరిగేది. తరువాతి కాలంలో ప్రతి రెండవ శుక్రవారం (పక్షానికో సారి) జరిగేది. అయితే, 11–12 శతాబ్దాల్లో భగవద్రామానుజుల వారు స్వామివారి వక్షఃస్థలంలో "బంగారు అలమేలు మంగ" ప్రతిమను అలంకరింప జేసిన శుక్లపక్షద్వాదశి ఉత్తరఫల్గుణీ నక్షత్ర శుక్రవారం నాటి నుండి, ప్రతీ శుక్రవారం ఈ అభిషేక సేవ నిరాఘాటంగా జరుగుతూ వస్తోంది.

ప్రాతఃకాల ఆరాధన పూర్తి కాగానే, అర్చకులు తెర వేసి శుక్రవార అభిషేక నిమిత్తం, ఏకాంతంగా శ్రీవారికి సంకల్పం చేస్తారు. ఉపచారాలు సమర్పించి, అష్టోత్తరశత నామార్చన కూడా చేస్తారు. అభిషేకానికి ముందుగా శ్రీవారి ఊర్ధ్వపుండ్రాన్ని (తిరునామం) అర్ధభాగానికి తగ్గించి సూక్ష్మ ఊర్ధ్వపుండ్రంతో ఉంచుతారు. ఉత్తరీయాన్ని తొలగించి స్నాన కౌపీనాన్ని ధరింప జేస్తారు.

ఆ సమయంలో పరిచారకులు శీవారి సన్నిధానంలో రెండు వెండి గంగాళాల గోక్షీరం, మరో రెండు గంగాళాల

బంగారుబావి శుద్ధోదకం సిద్ధం చేస్తారు.

జియ్యంగార్లు అందించే క్షీరంతో నిండి ఉన్న శంఖుపాత్రలను అర్చక స్వాములు స్వీకరించి, పండితులు వేదపారాయణం జరుపుతుండగా, క్షీరాభిషేకం చేస్తారు. అప్పుడు, శ్రీవారి వరదహస్తం నుండి జాలువారే గోక్షీరాన్ని పాత్రల్లో స్వీకరించి తరువాత భక్తులకు తీర్థంగా ఇస్తారు.

తరువాత చందనాన్ని శ్రీవారి దక్షిణహస్తం పై సమర్పించి, శ్రీవారి హస్తరేఖాంకితం చేసి అర్చకులు, జియ్యంగార్లు స్వీకరిస్తారు. పిమ్మట అర్చకులు పరిమళ పాత్రను తీసుకుని, ఆ పరిమళద్రవ్యాన్ని స్వామివారి కిరీటాన్నుండి ప్రారంభించి శరీరమంతా పూసి నలుగు పెడతారు. ఈ పరిమళ ద్రవ్యం పునుగు, జవ్వాది, కస్తూరి వంటి సుగంధద్రవ్యాల మిశ్రమం.

"పచ్చకప్పురమె నూరి పసిడి గిన్నెల నించి
తెచ్చి శిరసాదిగ దిగనలది
అచ్చెరపడి చూడ అందరి కన్నులకింపై
నిచ్చెమల్లెపూవు వలె నిటుతానుండే స్వామిని!!"

అనే కీర్తనలో అన్నమయ్య శ్రీవారిని అభిషేక నిమిత్తం సిద్ధం చేసే ఘట్టాన్ని ముగ్ధమనోహరంగా వివరించారు.

తరువాత, మహాభక్తుడు తిరుమలనంబి వంశీయులు తెచ్చి సిద్ధంగా ఉంచిన ఆకాశగంగ తీర్థంతో, తదుపరి శుద్ధోదకంతో, స్నానాన్ని ప్రారంభించి స్వామివారి తిరుమేను పైనుండి పరమళద్రవ్యంతో కలిసి జాలు వారుతున్న అభిషేక ఉదకాన్ని అవయవాల వారిగా, ఆయుధాల వారిగా స్వీకరించి ఆ పవిత్ర తీర్థాన్ని తరువాత భక్తులకు ప్రసాదిస్తారు.

ఆ తరువాత పసుపుతో శ్రీవారి వక్షఃస్థల మహాలక్ష్మికి కూడా అభిషేకం జరుగుతుంది. ఏ యుగం లోనో బ్రహ్మాది దేవతల కోరిక మేర, కలియుగ మానవుల కోసం వెలసిన శ్రీనివాసుని యథాతథమైన రూపాన్ని, వక్షఃస్థల లక్ష్మితో సహా దర్శించే మహద్భాగ్యం శుక్రవార అభిషేక సమయంలో మాత్రమే కలుగుతుంది. శ్రీవారి మెడలో ఉన్న బంగారు అలమేల్మంగకు కూడా తరువాత అభిషేకం జరుగుతుంది.

తదనంతరం శ్రీవారికి 108 కలశాల శుద్ధ జలంతో అభిషేకం పూర్తి చేస్తారు. ఈ అభిషేక తీర్థాన్ని ప్రధాన అర్చకుడు పాత్రలలో సేకరించి, మొదట తన శిరస్సును సంప్రోక్షించుకుని, సన్నిధానంలో ఉన్న ఇతర అర్చకులు, ఏకాంగి, ఆచార్యపురుషులు, ఆలయ అధికారుల మీద "భూతోభవః" అంటూ ప్రోక్షణ చేస్తారు.

తరువాత అర్చకులు తెరవేసి శ్రీవారికి ఉన్ శాత్ అనబడే 24 మూరల పొడవు గల సరిగంచు పట్టు ధోవతిని ధరింప జేస్తారు. ఆలాగే 12 మూరల ఉత్తరీయాన్ని వల్లెవాటుగా వేస్తారు. వెంటనే శ్రీవారికి గోనవనీతం (వెన్న, పంచదార) నివేదన చేసి, ముఖవాసం (కస్తూరి తాంబూలం) సమర్పిస్తారు. తరువాత పచ్చకర్పూర హారతినిస్తూ, తెర తొలగిస్తారు.

తరువాత, మళ్ళీ తెరవేసి ఏకాంతంగా ఊర్ధ్వపుండ్రం, వస్త్రాలంకార సేవలు కావించి భక్తుల సందర్శనార్థం తిరిగి తెర తీయడంతో, అభిషేక సేవాకార్యక్రమం పూర్తవుతుంది. అభిషేకానంతరం గడ్డం బొట్టు మాత్రం అలంకరించరు.

శ్రీవారి శుక్రవార అభిషేక దర్శనంతో, భక్తుల జన్మ జన్మాంతర పాపాలన్నీ శుభ్రంగా కడిగి వేసినట్లు తొలగిపోవడమే కాకుండా, ఆరోగ్య-ఐశ్వర్య సంపదలు సమృద్ధిగా కలుగుతాయని ప్రతీతి.

అత్యంత దుర్లభమైన ఈ సేవలో పాల్గొనాలనే ప్రగాఢవాంఛ శ్రీనివాసుని ప్రతి భక్తునికీ ఉంటుంది. అయితే, శ్రీవారి అనుగ్రహం పొందిన ఏ కొద్ది మందికో మాత్రమే ఈ భాగ్యం కలుగుతుంది.

అకుంఠిత భక్తి విశ్వాసాలతో, అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని ఎందరో భక్తులు నిరూపించారు.

మనమూ ప్రయత్నిద్దాం! కృషితో నాస్తిః దుర్భిక్షం!

నిజపాద దర్శనం

ప్రతి శుక్రవారం అభిషేకానంతరం, అభిషేక సేవలో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించి వెళ్ళిన తరువాత నిజపాద దర్శనం అనే ఆర్జితసేవ ప్రారంభ మవుతుంది. ఈ సేవలో పాల్గొనే భక్తులు స్వామివారి పాదాలను ఎటువంటి ఆచ్ఛాదన లేకుండా చూడవచ్చు. మిగిలిన వేళల్లో ఆ పాదాలు బంగారు తొడుగులతో విరాజిల్లుతూ ఉంటాయి.

మూలమూర్తిని శ్రద్ధగా గమనిస్తే, శ్రీవారు దక్షిణహస్తంతో తన పాదద్వయాన్ని సూచిస్తుంటారు. వామహస్తం కటి భాగాన, కుడివైపు తిరిగి నేలకు సమాంతరంగా ఉంటుంది. అంటే, భక్తులు తన పాదాల్ని శరణు వేడితే, వారిని తన వామహస్తంతో అక్కున చేర్చుకుంటానని సందేశమిస్తున్నా రన్నమాట. అందువల్లనే, శ్రీవారి పాద దర్శనంతో పాపాలు పటాపంచలౌతాయని తరతరాల నమ్మిక.

శ్రీవారి పాద దర్శనం సర్వ పాప విమోచనం.

బ్రహ్మ కడిగిన ఆ పాదాలు కనికరిస్తే కానిదే ముంటుంది?

వస్త్రాలంకారసేవ

ఈ ఆర్జితసేవ కూడా ప్రతి శుక్రవారం అభిషేకానంతరం జరుగుతుంది.

అర్చకులు ముందుగా భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలను శ్రీవారికి ధరింపజేసి, వారిని ఆభరణాలతో అలంకరిస్తారు. ఇదంతా ఏకాంతంగా జరుగుతుంది.

వస్త్రాలంకార మరియు అభిషేకసేవల్లో పాల్గొన్న భక్తులను నైవేద్యం తరువాత, నూతన వస్త్రధారుడైన వేంకటేశుని దర్శించటానికి అనుమతిస్తారు.

శ్రీవారికి సడలింపు జేసిన వస్త్రాన్ని, విమాన ప్రదక్షిణ మార్గంలో ఉన్న సబేరా అనే గదిలో భద్రపరుస్తారు. స్వామి వారి

అలంకరణకు కావలసిన ఇతర సామగ్రి, ఏకాంతసేవలో ఉపయోగించే వెండి మంచం, మొదలైనవన్నీ కూడా ఈ గది లోనే భద్ర పరుస్తారు.

అత్యంత ప్రముఖులు శ్రీవారి దర్శనార్థం వచ్చినప్పుడు వారికి ఈ సడలింపు చేయబడిన వస్త్రాన్ని మేల్చాట్ వస్త్రంగా బహూకరిస్తారు. అందుకే ఈ సేవను మేల్చాట్ వస్త్రసేవ అని కూడా అంటారు. శ్రీవారి సేవలన్నింటిలో ఖరీదైన ఈ సేవ నిమిత్తం ఒక జంటకు ప్రస్తుతం ₹12,250 చెల్లించాలి.

తిరునామంతో పాటుగా, శ్రీవారి గడ్డం కూడా కర్పూరంతో అలంకరింప బడి ఉండటం మనం చూసే ఉంటాం. అలాగే, శ్రీవారి మహాద్వారానికి కుడివైపుగా (మందిరంలోకి వెళ్తూంటే) అలంకరింప బడిన గడ్డపారను కూడా తరచూ ఆలయాన్ని సందర్శించేవారు గమనించే ఉంటారు. వీటన్నింటికీ సంబంధించి ఓ ఆసక్తికరమైన కథను, మరో మహా భక్తుడు భక్తశిఖామణి అనంతాళ్వార్ గురించి తెలుసుకునే ముందు, ప్రతి సోమవారం నాడు జరిగే విశేషపూజల గురించి తెలుసుకుందాం.

విశేషపూజ

ఈ ఆర్జితసేవ, ప్రతి సోమవారం ఉదయం 6 గం. లకు సంపంగిప్రదక్షిణం లోని కళ్యాణ మంటపంలో, ఉభయ నాంచారులతో కూడిన మలయప్ప స్వామి వారికి జరుప బడుతుంది. 1991వ సం. లో ఈ సేవ ప్రవేశపెట్టబడింది.

శ్రీ మలయప్పస్వామి కళ్యాణమంటపానికి వేంచేసిన తరువాత, వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించిన పిదప, స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. తదనంతరం, భక్తులకు ప్రసాదాలు అందజేస్తారు.

శనివారం, ఆదివారం ప్రత్యేక సేవలు ఏమీ ఉండవు.

అనంతాళ్వార్

1053 సం. లో జన్మించిన అనంతాళ్వార్ సుమారు 84 సంవత్సరాలు జీవించారు. సుదీర్ఘకాలం పాటు శ్రీవారి పుష్పకైంకర్యంలో పాలుపంచు కున్న ఆ ధన్యజీవి, శ్రీవారి భక్తులందరికీ ప్రాతఃస్మరణీయుడు.

తిరుమల ప్రయాణం

పూర్వం, భోగమండపమైన శ్రీరంగక్షేత్రంలో, భగవద్రామానుజులు శ్రీవైష్ణవ విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని శిష్యులకు వివరిస్తూ, తిరుమల క్షేత్రంలో స్వామివారికి పుష్పమాలా కైంకర్యం చేయడం భగవత్ప్రీతికరమని శెలవిచ్చారు. అలాగే, శాశ్వతంగా తిరుమలలో ఉంటూ, వేంకటేశునికి పుష్పసమర్పణ చేయగల వారెవరైనా ఉన్నారా? అని శిష్యులను ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు సమాధానంగా, అనందాళ్వాన్ (అనంతాళ్వార్) అనే శిష్యుడు తన సంసిద్ధతను వ్యక్తం చేసి, తిరుమల వెళ్ళటానికి అనుజ్ఞ ఇవ్వ వలసిందిగా ప్రార్థించాడు. సంతృప్తి చెందిన రామానుజాచార్యులు, అనంతాళ్వార్ ను, ఆణ్ పిళ్ళై (నీవే నిజమైన మగవాడివి) అని ప్రశంసిస్తూ, తిరుమల వెళ్ళటానికి అనుమతించారు.

పుష్పకైంకర్యం

గురువాజ్ఞ ప్రకారం భార్యాసమేతంగా తిరుమల చేరుకున్న అనంతాళ్వార్, అత్యంత నిష్ఠతో శ్రీవారికి పుష్పకైంకర్యం చేయసాగాడు. అప్పటికే తిరుమల చేరుకుని తీర్థకైంకర్యం చేస్తూవున్న తిరుమలనంబి ద్వారా శ్రీవారి పుష్ప ప్రియత్వాన్ని గురించి, తిరుమలలో లభించే వివిధ పుష్పజాతుల గురించి చాలా వివరాలు తెలుసుకున్నాడు.

తన గురువైన రామానుజాచార్యుల వారి గురువైన యామునాచార్యుల వారి పేరుతో శ్రీవారి ఆలయ ప్రాంగణంలో యామునోత్తరై అనే పుష్పమండపాన్ని అనంతాళ్వార్ నిర్మించారు. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం ఆ పరమభక్తుడు శ్రీకారం చుట్టిన యమునోత్తర (పుష్ప అర) అనే పుష్పమంటపాన్ని నేటికీ మనం శ్రీవారి ఆలయం నందున్న సంపంగిప్రాకారంలో చూడవచ్చు.

చెరువు త్రవ్వకం

శ్రీవారి నిత్యకైంకర్యానికి కావలసిన వివిధ రకాలైన, రంగురంగుల, పరిమళాలు వెదజల్లే పుష్పాల నిమిత్తం ఆయన ఒక ప్రత్యేక పుష్పవాటికను పెంచ దలిచాడు. దానికి నాందిగా, ఆలయానికి దక్షిణ దిక్కున ఉన్న విశాలమైన ప్రదేశంలో ఒక పెద్ద చెరువును నిర్మించ తలపెట్టాడు. ఈ చెరువును ఇప్పటికీ మనం క్యూ కాంప్లెక్స్ ప్రక్కగా చూడవచ్చు. దీని ఒడ్డునే అనంతాళ్వార్ వారి సమాధి కూడా ఉంది.

దైవకార్యంలో ఇతరుల సహాయం కోరకుండా, గర్భవతి అయిన తన భార్యతో కలిసి ఈ మహత్కార్యానికి పూనుకున్నాడు అనంతాళ్వార్. ప్రతి రోజూ ఉదయం, పుష్పమాలా కైంకర్యాలు ముగిసి, తీర్థప్రసాదాలు స్వీకరించాక, చెరువు నిమిత్తం, భార్యతో కలిసి గుంట త్రవ్వడం ప్రారంభించేవాడు.

ఈయన గడ్డపారతో (గునపం) మట్టి త్రవ్వి గంపలో పోస్తే అతని భార్య ఆ మట్టిని దూరంగా తరలిస్తుండేది.

ఇలా ఈ కార్యక్రమం దీక్షగా కొన్ని రోజులు కొనసాగింది. గర్భవతి కావడంతో, ఆమె అలిసిపోయి మధ్యమధ్యలో నిలబడి పోయేది. ఆయన పిలవడంతో, చెమట బిందువుల్ని పమిట చెంగుతో తుడుచుకొని తిరిగి పని కొనసాగించేది.

బాలునిరూపంలో శ్రీవేంకటేశ్వరుడు

ఇలా పట్టుదలతో, ఇతరుల సాయం కోరకుండా, అంకితభావంతో సేవ చేస్తున్న ఆ దంపతుల శ్రమను చూడలేని శ్రీనివాసుడు పదమూడేండ్ల పసివాని రూపంలో వచ్చి "అయ్యా! మీరు త్రవ్వి పోసిన మట్టిని నేను మోసుకుని వెళ్తాను. నన్ను అనుమంతించండి" అని వేడుకొన్నాడు. ఆ కుర్రవాడి సాయాన్ని తిరస్కరించిన అనంతాళ్వార్, తమ గురువాజ్ఞ ప్రకారం తామిరువురూ ఆ కైంకర్యం నిర్వహిస్తున్నామనీ, భగవత్సేవలో తామెవరి సాయం తీసుకోబోమని, తమను విసిగించకుండా తక్షణం అక్కడినుంచి వెళ్ళిపొమ్మని, ఆ బాలుణ్ణి కసురుకుంటాడు. అయితే, కరుణా మయుడైన శ్రీనివాసుడు ఎలాగైనా ఆ దంపతులకు సాయం చేయలని గట్టిగా నిశ్చయించు కుంటాడు. ఇటు, అనంతాళ్వార్ ధ్యాసంతా – త్వరగా చెరువు త్రవ్వి, పూదోటను పెంచి, ఎప్పుడెప్పుడు శ్రీవారికి పుష్పాలను అలంకరిద్దామా! – అని

ఉండేది. భర్తే దైవంగా భావించిన భార్య కూడా, తన బాధనంతా ఓర్చుకుని, తనకూ, భర్తకూ కలిగిన శ్రీవారి సేవాభాగ్యానికి మురిసిపోతూ, దైవకార్యంలో నిమగ్నమై ఉండేది. ఒక రోజు స్వామివారికి మనసాగక, బాలుని రూపంలో అనంతాళ్వార్ వెనుక ఉండి, ఆయన మట్టిని తట్టలో వేయగానే, పరుగుతో వెళ్ళి తట్టను ఖాళీ చేసి, ఖాళీ తట్టను అక్కడ పెట్టసాగాడు.

శ్రీవారికి గాయం

అనుమానంతో వెనుకకు తిరిగి చూసిన అనంతాళ్వార్ కు ఆ పిల్లవాడు కనుపించాడు. వద్దన్నా పదే పదే తమ జోలికి వస్తున్న ఆ పిల్లవాణ్ణి తన చేతిలో ఉన్న గునపంతో కొట్టబోయాడు. ఆ పిల్లవాడు భయంతో, చేతిలో ఉన్న మట్టితట్టను అక్కడే వదిలేసి పరుగు లంకించుకున్నాడు. అయినా అనంతాళ్వార్ ఆ పిల్లవాడి వెంట బడ్డాడు. ఆ పరుగులో, పిల్లవాడు చేతికి అందినట్టే అంది జారి పోతున్నాడు. శ్రీహరి అంత సులభంగా చిక్కుతాడా?

దాంతో కోపం ఆపుకోలేని అనంతాళ్వార్ విసిరిన గునపం ఆ పిల్లవాడి గడ్డానికి తగిలింది. బొట బొటా కారుతున్న రక్తంతోటే ఆ బాలుడు పరిగెత్తుకుంటూ ఆనందనిలయం లోకి జొరబడి కనపడకుండా దాక్కుంటాడు. వెదకి వేసారిన అనంతాళ్వార్ వెను దిరుగుతాడు.

అనంతాళ్వార్, ఆ రోజు సాయం సమయంలో పుష్పమాలలతో ఆనందనిలయంలోకి వెళ్ళేటప్పటికి, వేంకటేశ్వర స్వామికి గడ్డం వాచి, రక్తం పెచ్చుకట్టి ఉంది. అది చూసిన అర్చకులు హడలి పోతారు. స్వామి వారి గాయాన్ని చూసిన అనంతాళ్వార్ కు తాను చేసిన ఘోరతప్పిదం తృటిలో అర్థమై, స్వామిని క్షమించమని ప్రాధేయపడ్డాడు.

పచ్చకర్పూరం బొట్టు

అప్పట్లో తన భక్తులతో నేరుగా మాట్లాడే శ్రీనివాసుడు, వ్యాకులతతో ఉన్న అనంతాళ్వార్ ను సమాధాన పరుస్తున్నట్లుగా అర్చకులతో , "నా భక్తుడు గునపంతో కొట్టగా ఏర్పడిన గాయం మీద పచ్చకర్పూరపు బొట్టు పెట్టండి. రాబోయే తరాలలో నా భక్తులు నా గడ్డం మీద పచ్చకర్పూరపు బొట్టును చూసి, అది అనంతాళ్వార్ అనే భక్తుడు కొట్టిన దెబ్బ అని చెప్పుకుంటుంటే, అది విని నేను మురిసిపోతాను" అని చెప్పి తన భక్తప్రియత్వాన్ని చాటుకున్నారు. అంతే కాకుండా, స్వామివారు అనంతాళ్వార్ యొక్క నిరుపమాన భక్తిని ఆ విధంగా లోకానికి చాటిచెప్పారు. స్వామివారి ఆజ్ఞానుసారం ఆ సంఘటనకు గుర్తుగా, నేటికీ ప్రతిరోజూ, శ్రీవారి గడ్డం మీద పచ్చకర్పూరంతో అలంకరిస్తారు. శ్రీవారి దివ్యమంగళ విగ్రహాన్ని మదిలోనే ఊహించుకొని, వారి గడ్డంపై నిత్యం ఉండే తెల్లటి మచ్చను తలచుకోండి. దాని వెనుక ఉన్న మర్మం ఇదే!

అనంతాళ్వార్ గడ్డపార

శంఖనిధి–పద్మనిధి దాటుకుని ఆలయంలోకి వెళుతూంటే, మహాద్వారపు ఉత్తరం గుమ్మం మీద నేటికీ అనంతాళ్వార్ విసిరిన గునపాన్ని మనం చూడవచ్చు.

స్వామివారి గడ్డానికి తగిలిన దెబ్బకు గుర్తుగా, ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో, ధ్వజారోహణ జరిగిన మరునాడు, స్వామివారికి "బాగ్ సవారి" అనే ఉత్సవం జరుగుతుంది. నాడు అనంతాళ్వార్ తరుముకు వస్తూంటే స్వామి ఎలా పరుగు పెట్టారో, ఆ ఉత్సవం రోజు స్వామి పల్లకి అలా పరుగు పెడుతుంది.

ఆ ఉత్సవం పూర్తి విశేషాలను "సంవత్సరోత్సవాల్లో" విశదీకరించబడినది.

అన్నమాచార్యుడు, **కొండల్లో నెలకొన్న**, అనే కీర్తనలో

"అచ్చపు వేడుకతోడ ననంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు"

అంటూ అనంతాళ్వార్ గాథను ప్రస్తుతించారు.

అనంతాళ్వార్ గునపం దెబ్బకు శ్రీవారు గాయపడ్డ ఉదంతం తరువాత, వేంకటేశుని సంపూర్ణ అనుగ్రహానికి పాత్రుడైన అనంతాళ్వార్, చెరువును త్రవ్వడం అత్యంత శీఘ్రంగా పూర్తి చేయ గలిగాడు. తన గురువు గారైన భగవద్రామానుజుల వారిని స్మరింపజేసే విధంగా, అ ఉద్యానవనానికి శ్రీరామానుజోద్యానవనం అని పేరు పెట్టాడు. కాలక్రమంలో ఆ తోట శ్రీవారికి కావలసిన సమస్త పుష్ప రాశులనూ సమకూర్చ గలగడమే కాకుండా, అత్యంత అరుదైన పుష్పజాతులతో తిరుమల క్షేత్రానికే ప్రధానాకర్షణగా నిలచింది.

అనంతాచార్యుని ఆలోచనలన్నీ ఆనందనిలయం మీదే ఉండేవి. శ్రీనివాసుణ్ణీ, శ్రీమహాలక్ష్మినీ రంగురంగుల పుష్పాలతో పలువిధాలుగా అలంకరించినట్లు, పాదపద్మాలకు పూలు సమర్పించినట్లు, పరంధాముణ్ణీ, పద్మావతీ అమ్మవార్నీ పూలపల్లకిలో ఊరేగించినట్లు పరిపరి విధాల ఆలోచనల్లో మునిగి ఉండేవాడు. చిగురించే చెట్టును చూసినా, పూచే పుష్పాన్ని చూసినా శ్రీవారిని పుష్పగుచ్ఛాల్తో ముంచెత్తినట్లు అనుభూతి చెందేవాడు.

ఇలా, అనంతాళ్వార్ మనసా వాచా కర్మణః, శ్రీవారి పుష్పకైంకర్యసేవలో తలమునకలై ఉన్న తరుణంలో, సపరిచర్యలతో సంతృప్తి చెందిన శ్రీవారి ఆలోచనలు మరో విధంగా ఉన్నాయి. '*ఈ దండలే ఇంత మనోహరంగా ఉంటే, ఈ పూవులు పూచే తోట ఇంకెంత ఆహ్లాదకరంగా ఉంటుందో? ఏమైనా సరే! తన భక్తుడు అత్యంత అంకితభావంతో పెంచుతున్న పూదోటను ప్రత్యక్షంగా చూసి తీరాల్సిందే!*' అని సంకల్పించారు.

ఒకనాటి రాత్రి ఏకాంతసేవా కార్యక్రమం ముగిసిన తరువాత, స్వామివారు అలివేలుమంగా సమేతంగా, విహారనిమిత్తం అనంతాళ్వార్ తోటకు ఏతెంచారు. కన్నులపండువగా ఉన్న పుష్పవనాన్ని చూసి పరవశించిపోయిన శ్రీవారు, కనిపించిన పువ్వునల్లా కోసి అమ్మవారి తలలో తురిమాడు. కొన్నింటిని తాను స్వయంగా ధరించి మరి కొన్నింటిని ఆఘ్రాణించాడు. అమ్మవారు కూడా, అయ్యవారికి ఏ మాత్రం తీసి పోకుండా, ప్రతి మొక్క వద్దకూ వెళ్ళి, పువ్వుల పరిమళాల్ని ఆస్వాదించి, వాటిని కోసి స్వామివారి కిచ్చింది. ఇలా, పూదోట సోయగంలో మైమరచి, చెట్టపట్టాలేసుకు తిరిగి, ఆ జంట సుప్రభాత సమయానికి ఆనందనిలయం తిరిగి చేరారు.

తెల్లవారిన తరువాత, తోటలో ప్రవేశించిన అనంతాళ్వార్ కి మతిపోయి నట్లైంది. ఎక్కడ చూసినా, నలిపి పడేసిన

పూలు, విరిగిన కొమ్మలు, రాలిన మొగ్గలు, తెగిపడిన ఆకులతో తోటంతా భీభత్సంగా ఉంది. ఉగ్రుడైన అనంతాళ్వార్, తోట ఆ పరిస్థితిలో ఉండటానికి కారణమైన వారిని శాపనార్థాలు పెడుతూ, దోషులను ఎలాగైనా పట్టుకోవాలనే కృతనిశ్చయంతో, తన శిష్యులను తోటకు కాపలా ఉంచాడు. కానీ, ఎంతకూ దొంగలు దొరకలేదు. పుష్పచౌర్యం యథావిధిగా కొనసాగుతూనే ఉంది. ఇక లాభం లేదనుకొని, కంటి మీద కునుకు లేకుండా తనే కాపలా కాసేవాడు. ఎన్నాళ్ళకూ దొంగ దొరకక పోవడంతో తల్లఢిల్లి పోయిన అనంతాళ్వార్, తన పుష్పకైంకర్యానికి ఎలాంటి విఘాతం రానివ్వ వద్దని, కన్నీళ్ళతో స్వామిని వేడుకొన్నాడు. భక్తుని కన్నీటికి కరిగిపోయిన శ్రీనివాసుడు, అనంతాళ్వార్ భక్తిని లోకానికి తెలియ జెప్పాలను కొన్నాడు.

అదలా ఉండగా, తోటలో పహరా కాస్తున్న అనంతాళ్వార్ కు, ఓ నడిరాత్రి సమయంలో, తోటలో సంచరిస్తున్న రెండు మానవాకారాలు కనిపించాయి. సుందర, సుకుమార శరీరాలతో, రాచఠీవి ఉట్టిపడే ముఖవర్చస్సుతో ఉన్న ఈ జంట రాజ దంపతులేమో? అయినా, 'ఎవరైతే నాకేంటి? స్వామివారికి అర్పించాల్సిన పుష్పాలను చిందరవందర చేస్తున్న వీళ్ళను ఏ మాత్రం ఉపేక్షించ కూడదు' ఆ విధంగా మనసులో తలపోస్తూ, స్వామిని చేజిక్కించుకో బోయాడు. ఇంద్రాది దేవతలకు, సనకాది మహర్షులకు చిక్కని చిద్విలాసుడు, ఈ బడుగు బాపడికి బందీ అవుతాడా? సంధించిన బాణంలా సాగిపోయాడు. పారిపోతున్న పెనివిటిని చూసి అచ్చెరువొందిన జగజ్జనని అనంతాళ్వార్ చేతికి చిక్కింది. ఉక్రోషం ముంచుకొచ్చిన అనంతాళ్వార్, చేజిక్కిన సిరుల తల్లిపై ప్రశ్నల వర్షం కురిపించాడు. "మీరు యక్ష, కిన్నెర, గంధర్వులా? యతీంద్రులా? ఒక వేళ మానవులయితే, గొప్పింటి బిడ్డల్లా ఉన్నారు. మీకిదేం బుద్ధి? శ్రీవారి కైంకర్యానికి ఉపయోగించే ఈ సుకుమార కుసుమాల్ని ఛిద్రం చేయటానికి మీకు చేతులెలా వచ్చాయి? మీ సరస, సల్లాపాలకు నా తోటే కావలసి వచ్చిందా? ఎక్కడుంటారు మీరు? నీ మగని పేరేమిటి? భార్య కోసం రాని భర్త ఉంటాడా? అందులోనూ నీలాంటి ముగ్ధమనోహరి కోసం రాకుండా ఎక్కడికి పోతాడు?" ఇలా తన ఆక్రోశాన్నంతా వెళ్ళగ్రక్కుతూ, తన ఉత్తరీయంతో అమ్మవారిని తోటలోనే ఉన్న ఓ సంపంగి మానుకు కట్టేశాడు.

కలవరపాటుకు గురైన అమ్మవారు, వాత్సల్యం ఉట్టిపడే మృదువైన స్వరంతో "నాయనా! నీ బిడ్డలాంటి నన్ను విడిచి పెట్టు. నేను వారిస్తున్నా వినకుండా నా మగడే నన్నీ తోటకు తోడ్కొని వచ్చాడు. నా మగని పేరు నేనెట్లా ఉచ్చరించ గలను? ఏ స్త్రీ అయినా తన పతిదేవుని పేరును పెదాలతో పలుక గలదా? ఓ పట్టాన ఆయన ఎవరికీ దొరకడు. అందు గలడిందు లేడనలేని వాడు ఎక్కడుంటాడని చెప్పగలను? ఎంత మంది ఎన్ని రకాలుగా పిలిచినా పలికే సర్వాంతర్యామి ఆయనే" అంటుంది.

"ఇందుకలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూసిన
అందందే గలడు"

అమ్మవారి మాటలకు ఆగ్రహం హద్దులు దాటిన అనంతాళ్వార్ "చాలా గడుసుగా మాట్లాడు తున్నావమ్మా! ఎలా రాకుండా ఉంటాడో నేనూ చూస్తాను" అంటూ, తోట వెలుపలికి వెళ్ళి పరికించాడు. తోట బయట తచ్చాడుతున్న ఆ

ఆకతాయి వెంట బడతాడు. ఆ పురుషుడు తోట నుంచి ఆనందనిలయానికి దక్షిణపు వీధిలో ప్రవేశించి ఆలయానికి అప్రదక్షిణంగా పారిపోతుండగా, అనంతాళ్వార్ అతన్ని తరుముతూ వెంటబడ్డాడు. శ్రీవారి ఆలయం ముందు, పుష్కరిణి దగ్గర, ఉత్తర–పశ్చిమ మాడ వీధుల్లో, అడ్డదిడ్డంగా పరిగెత్తిన ఆ దొంగ మళ్ళా అనంతాళ్వార్ తోటను సమీపించి అదృశ్యమయ్యాడు. విసిగి వేసారిన అనంతాళ్వార్ "తెల్లవారిన తరువాత దొంగ సంగతి చూద్దాం" అనుకుంటూ, అమ్మవారి పాదాల చెంత కునుకు తీశాడు. ఏ తల్లి కరుణా కటాక్షం కోసం సమస్త జగత్తూ అనుక్షణం పరితపిస్తూ ఉంటుందో, అటువంటి బందీ చేసి ఆమె పాదాల చెంత రాత్రల్లా పడుకున్నాడు అనంతాళ్వార్!

ఇంతలో, భళ్ళున తెల్లవారడంతో బంగారువాకిళ్ళను తెరిచిన అర్చకస్వాములు, వక్షఃస్థల లక్ష్మి కనపడక పోవడంతో వణికి పోయారు. స్వామివారు సౌమ్యంగా "అర్చక శిఖామణులారా! ఆందోళన చెందకండి. అనంతాళ్వార్ రాత్రంతా అమ్మవారిని కట్టేశాడు. ఆయన్ను వేడుకొని, అమ్మవారిని తోడ్కొని రండి" అని శెలవిచ్చారు. అర్చకులు వేద మంత్రాలతోటీ, మంగళ వాద్యాలతోటీ అమ్మవారి కోసం తరలి వెళ్ళారు. చెట్టుకు కట్టివేయబడి, బేలగా, మగని రాక కోసం వీక్షిస్తున్న లక్ష్మీదేవిని చూసి అచ్చెరువొందిన అర్చకులు అనంతాళ్వార్ తో "ఎవరిని కట్టేశావో తెలుసా? సమస్త జగత్తునూ శాసించ గలవాడి భార్య ఆవిడ. సాక్షాత్తూ, శ్రీమహావిష్ణువు యొక్క శక్తి స్వరూపాన్ని నువ్వు కట్టేశావు. శ్రీవారు ఆమెను తోడ్కొని రమ్మన్నారు" అని స్వామి ఆదేశం వినిపించారు. తన తప్పు తెలుసుకొన్న అనంతాళ్వార్ "అయ్యో! ఎంత అపరాధం చేశాను? అనుక్షణం కొలిచే ఈ చేతులతోనే నిన్ను కట్టిపడేశాను." అని సాష్టాంగ నమస్కారం చేశాడు. జరిగిన తొందరపాటుకు పశ్చాత్తాపం ఒక వంక, అమ్మవారి సాక్షాత్కారానికి నోచుకొన్న భాగ్యానికి అంతు లేని ఆనందం వేరొక వంక! ఇలా పలు భావనలు ముప్పిరి గొనగా, అశ్రునయనాలతో అమ్మవారికి మనసారా నమస్కరించి, జరిగిన తప్పిదానికి క్షమార్పణ కోరి, ఆడపిల్లను అల్లుని చెంతకు చేర్చే విధంగా, ఓ బుట్టలో తోటలోని పువ్వులు అమర్చి, అమ్మవారిని వాటిపై ఆసీనురాల్ని చేసి, బుట్టను శిరస్సునుంచుకుని, వగర్చుతూ, వగర్చుతూ అమ్మవారిని శ్రీవారి పాదాల చెంతకు చేర్చి, తెలియక చేసిన తప్పును మన్నించమని వేడుకొంటూ శ్రీవారి పాదాక్రాంతు డయ్యాడు.

అప్పటివరకూ వినోదం చూస్తూన్న శ్రీనివాసుడు "మామగారూ రండి" అని అనంతాళ్వార్ ను ఆప్యాయంగా ఆహ్వానించి "నా భార్యను నీ ఇంట్లో ప్రేమతో కట్టేసుకున్నావు. పూలబుట్టలో కూర్చోబెట్టి స్వంత కూతురిలా నా చెంతకు చేర్చావు. చందన తాంబూలాలు స్వీకరించు. పిల్లనిచ్చిన మామ గారివి కదా!" అంటూ అనంతాళ్వార్ కు గంధం రాసి, పుష్పమాలలు వేసి, పట్టుబట్టలు పెట్టారు. అనుకోని కొత్త చుట్టరికంతో అనంతాళ్వార్ ఆనందానికి ఎల్లలు లేవు. భక్తి పారవశ్యంతో, శ్రీవారిని వేనోళ్ళ కీర్తిస్తూనే ఉన్నాడు.

అలా, స్వామివారి చేత మామా అని పిలిపించు కొన్న ధన్యజీవి ఆ అనంతాళ్వార్!

ఆ పూలగంప లోని అమ్మవారు యథాప్రకారంగా బంగారు ప్రతిమయై శ్రీవారి వక్షఃస్థలాన్ని తిరిగి అలంకరించారు. అలా, అనంతాళ్వార్ పుణ్యమా అని, ఒక్క రాత్రిలోనే మునుపెన్నడూ లేని విధంగా అమ్మవారికి శ్రీవారితో వియోగము, పునఃస్సంగమము కలిగాయి.

అనంతాళ్వార్ తవ్విన చెరువు ప్రక్కన ఉన్న వసతి గృహాల్ని "అనంతాళ్వార్ టాంక్ కాటేజెస్ (ఎ.టి.సి.)" గా వ్యవహరిస్తారు. ఆనాడు ఆ పుణ్యమూర్తి ఒంటరిగా తవ్విన ఆ చెరువు ఈనాడూ లక్షలాది యాత్రికుల దాహార్తిని తీర్చుతూ ఉంది.

84 సం. ల సుదీర్ఘకాలం జీవించి శ్రీవారి సేవకే అంకితమైన ఆ అనంతాచార్యులు స్వామివారి సన్నిధిలోనే పరమపదం చేరుకొన్నారు. ఆయన నడయాడిన స్వగృహాన్ని మహాప్రదక్షిణ మార్గంలో నైఋతిమూలలో చూడవచ్చు. ఆయన ఇంటి ప్రాకారం మీదా, తోటలో ఉన్న మండపంలోనూ, అనంతాళ్వార్, ఆయన భార్యాబిడ్డలూ, సేవకుల చిత్తరువులు దర్శించుకోవచ్చు. ఆయన ఇంటికి వెనుకగా, నేటికీ ఉన్న ఓ దిగుడు బావి నీటినే అనంతాళ్వార్ తన అనుష్ఠానానికీ, ఆరాధనకు ఉపయోగించే వారు.

అనంతాళ్వార్ ఇంటి వెనుకగా ఉన్న తోటలో ఆయన సమాధిని (బృందావనం) మనం దర్శించవచ్చు. ఈ బృందావనం నుంచి ఉద్భవించిన పొగడమాను ఎండిపోయి, దాని పాదులో ఓ వటవృక్షం వృద్ధి చెందుతూ ఉంది.

బ్రహ్మోత్సవాల వంటి ప్రత్యేక సమయాల్లో, ఆలయ మహా ప్రదక్షిణ మార్గంలో ఊరేగు తున్నప్పుడు, అనంతాళ్వార్ ఇంటి వద్ద కర్పూరహారతి నందుకున్న తరువాతనే ఆనందనిలయుడు ముందుకు సాగుతారు.

భక్తునికీ–భగవంతునుకీ ఉన్న ఈ విడదీయరాని బంధం — ఎన్నెన్నో జన్మల అనుబంధం!

అనంతాళ్వార్ జ్ఞాపకాలన్నింటినీ పదిలపరుస్తూ, భావి తరాలకోసం భద్రపరుస్తున్న తి.తి.దే. వారి కృషి శ్లాఘనీయం!

----------: : ----------

ఆది వరాహస్వామి ఆలయం

ఒకప్పుడు బ్రహ్మదేవుడు సృష్టి కార్యక్రమంలో క్షణం తీరిక లేకుండా, ఒక పగలంతా (బ్రహ్మ దేవునికి ఒక పగలంటే వేయి మహాయుగాలు. కృత, త్రేతా, ద్వాపర, కలి యుగాల్ని కలిపి సమిష్టిగా ఒక మహాయుగం అంటారు) శ్రమించిన తరువాత అలసటతో ఓ కునుకు తీస్తాడు. దాంతో, ఆయన సృష్టించిన జగత్తంతా అల్లకల్లోలమై, సూర్యచంద్రులు గతులు తప్పి, కుంభవృష్టితో జలప్రళయం సంభవించింది.

అదే అదనుగా తీసుకుని, హిరణ్యాక్షుడనే రాక్షసుడు భూమండలాన్ని పాతాళానికి తీసుకుని వెళ్ళి భయోత్పాతం సృష్టిస్తాడు. ఇంద్రాది దేవతల కోరిక మేరకు, శ్రీమహావిష్ణువు శ్వేతవరాహ రూపునిగా అవతరించి, భీకరంగా జరిగిన యుద్ధంలో హిరణ్యాక్షుణ్ణి సంహరించి, తన కోరలతో భూమిని తిరిగి పైకెత్తి సృష్టి నంతటినీ యథాస్థితికి తెస్తాడు.

అనంతరం, ఆదివరాహస్వామి, తన చెంతనే భక్తితో నిలబడి ఉన్న, తన వాహనమైన గరుత్మంతుణ్ణి, "పక్షిరాజా! భూదేవిని ఉద్ధరించడం వల్ల, ఆమె నన్ను పతిగా వరించింది. యుగధర్మానుసారం నేనందుకు అంగీకరించాను. ఇక్కడే కొంత కాలం ఉండి, భూలోకాన్ని పరిరక్షించ వలసిన బాధ్యత నాపైనున్నది. అందువలన నీవు వైకుంఠానికి వెళ్ళి నా క్రీడాచలాన్ని సత్వరమే తోడ్కొని రా" అని ఆజ్ఞాపించాడు.

అంత, ఆ పక్షీంద్రుడు వైకుంఠానికి వెళ్ళి లక్ష్మీదేవికి వైకుంఠనాథుని ఆదేశాన్ని విపులంగా విన్నవించాడు. శ్రీమహాలక్ష్మి తాను కూడా స్వామి చెంతకు చేరాలని సంకల్పించుకొని, తన మూలస్వరూపాన్ని వైకుంఠం లోనే ఉంచి, మరొక అంశతో భూలోకానికి బయల్దేరింది. జగన్మాతతో కూడిన క్రీడాచల పర్వతాన్ని తీసుకొని భూలోకానికి చేరుకున్న పక్షీంద్రుడు, స్వామి వారి ఆనతి ననుసరించి, క్రీడాచలాన్ని సువర్ణముఖీ నది ఉత్తర భాగంలో ప్రతిష్ఠించాడు. ఈ నది వద్దనే నేడు శ్రీకాళహస్తీశ్వరుడు కొలువై ఉన్నాడు.

శ్వేతవరాహుడు భూదేవీ సమేతంగా క్రీడాపర్వతాన్ని అధిరోహించి, దైత్యసంహార నిమిత్తం తాను ధరించిన శత్రుభయంకర రూపంలోనే పుష్కరిణికి పడమటి గట్టున కొలువు తీరాడు. కాలాంతరాన ఆ క్రీడాచలమే తిరుమల క్షేత్రంగా భాసిల్లుతోంది.

బ్రహ్మాది దేవతలు ఆదివరాహుణ్ణి స్తుతించి "స్వామీ! తమరీ భీకరమైన రూపాన్ని త్యజించి, సౌమ్యరూపం దాల్చి, ఈ పర్వతశ్రేణుల పైనే స్థిరనివాస మేర్పరుచుకుని, ప్రజలకు దర్శనభాగ్యం కల్పించడి. భక్తజనులకు ధ్యాన-కర్మ యోగాలను బోధిస్తూ, దివ్య మహిమలతో కూడిన మీ లీలలను చాటుతూ ఉండండి" అని వేడుకొన్నారు.

దేవతల మొర నాలకించిన ఆదివరాహుడు, భూదేవీ సమేతంగా, దివ్యకాంతుల ప్రకాశంతో ఉన్న ఓ విమానగోపురం కలిగిన భవనం లోనికి ప్రవేశిస్తాడు. అంతలోనే ఆ విమానగోపురం అంతర్ధానమై, ఆ భవనమే నేడు శ్రీవారి పుష్కరిణి ఒడ్డున, పడమర మాడవీధిలో, "ఆదివరాహస్వామి ఆలయం" గా ప్రసిద్ధి చెందింది. అలాగే, తిరుమల ఆదివరాహక్షేత్రమని, తిరుమలలో మొట్టమొదటి దైవం ఆదివరాహుడు లేదా శ్రీవరాహస్వామి అని, తిరుమల

క్షేత్రాధిపతి వరాహస్వామి వారని భావిస్తుంటారు.

ఆ తరువాత కొంత కాలానికి వైకుంఠం నుండి భూలోకానికి వచ్చి, తిరుమల లోని ఓ పుట్టలో నివాసముంటూ, గొల్లవాని గొడ్డలి దెబ్బతో బయటకు వచ్చిన శ్రీనివాసుడు, అప్పటికే శేషాచలానికి అధిపతియైన వరాహస్వామిని, తన శాశ్వతనివాసం నిమిత్తం కొంత స్థలాన్ని దానంగా అడుగుతాడు.

ఆదివరాహుడు విధించిన – ప్రథమ దర్శనం, ప్రథమ పూజ, ప్రథమ నైవేద్యం – అనే షరతులకు అంగీకరించి, ఆ నియమాలతో కూడిన ఓ దానపత్రాన్ని రాసిచ్చి శ్రీనివాసుడు వందగజాల స్థలాన్ని దానంగా పొందుతాడు. బ్రాహ్మీలిపిని బోలిన లిపిలో లిఖించబడిన ఈ దానపత్రాన్ని (ఆంగ్ల భాషలో గిఫ్ట్ డీడ్), వరాహస్వామి ఆలయంలో నిక్షిప్తమై యున్న ఒక చతురస్రాకార "రాగి పలక యంత్ర" రూపంలో నేటికీ చూడవచ్చని చెబుతూంటారు.

తరువాతి కాలంలో, "ముందు వచ్చిన చెవుల కంటే వెనుక వచ్చిన కొమ్ములు వాడి" అన్న చందంగా, శ్రీనివాసుడు తన ప్రాబల్యాన్ని అపరిమితంగా పెంచుకొన్నాడు. అయితే, ఆనాడు శ్రీనివాసుడు అంగీకరించిన షరతులకు లోబడి, ఇప్పటికీ తిరుమల క్షేత్రంలో ప్రథమ పూజ, ప్రథమ నైవేద్యం వరాహస్వామికే చేయ బడతాయి. క్షేత్ర సాంప్రదాయాన్ననుసరించి, వరాహస్వామి దర్శనానంతరం మాత్రమే శ్రీవారిని దర్శించుకోవాలి. అప్పుడే తిరుమల యాత్ర సంపూర్ణంగా ఫల ప్రదమవుతుంది. ముందుగా వరాహస్వామిని దర్శించక పోతే, సాక్షాత్తూ శ్రీనివాసుడు అంగీకరించిన షరతును ఉల్లంఘించటమే అవుతుందని భక్తుల విశ్వాసం.

"వరాహ దర్శనాత్పూర్వం శ్రీనివాసం సమేన్నచ
దర్శనా త్రా గ్వరా హస్య శ్రీనివాసో న తృప్యతి"

వరాహస్వామి ఆలయం – ముఖమండపం, అర్థమండపం, అంతరాళం, గర్భాలయం – అని నాలుగు భాగాలుగా, మూడు ప్రాకారాలతో నిర్మింపబడింది. గర్భాలయం మధ్యలో ఒక అడుగు ఎత్తైన శిలావేదికపై, రెండడుగుల భూవరాహస్వామి విగ్రహం ప్రతిష్ఠింపబడింది. ఈ స్వామి, పై రెండు చేతుల్లో శంఖుచక్రాలతో, ఎడమ తొడపై భూదేవిని కూర్చుండ బెట్టుకుని చెవిలో తత్వబోధ చేస్తూ, ఊర్ధ్వపుండ్రంతో విరాజిల్లు తుంటారు. ఆలయంలో ధ్వజస్థంభం లేనందున, వరాహస్వామికి ప్రత్యేకంగా ఉత్సవాలు జరిపించే సాంప్రదాయం లేదు. శ్రీవారు మరియు వరాహస్వామి అభిన్నులవ్వటం చేతనూ, ఇద్దరిదీ శ్రవణానక్షత్రం అవ్వటం వల్లనూ, ఆనందనిలయవాసునికి జరిగే సమస్త ఉత్సవ కైంకర్యాలూ వరాహునికి జరిగినట్లే అని అనూచానంగా వస్తున్న నమ్మిక.

ఈ ఆది వరాహస్వామి ఆలయ చరిత్ర, శ్రీ వేంకటేశ్వర కళ్యాణంతో ముడివడి ఉంది. మానవరూపం దాల్చి ఉన్న శ్రీనివాసుడు, పద్మావతితో పరిణయం జరిగే నాటికి, కళ్యాణ ఖర్చులకు సైతం పైకం లేని నిరుపేద. ఆకాశరాజు కూతురితో వివాహం అంటే ఆడంబరంగా జరగాలి మరి! చేతిలో చిల్లిగవ్వ లేదు. ఏం చేయాలో తోచక మధన పడుతూంటే, స్నేహితుడైన శివుని సిఫారసు మేరకు, కావలసిన పైకాన్ని ఋణంగా ఇవ్వడానికి కుబేరుడు సంసిద్ధుడవుతాడు.

అక్షరాలా పదునాలుగు లక్షల రామచంద్ర ముద్రలు కలిగిన బంగారు కాసులు అప్పుగా ఇచ్చేట్లు ఒప్పందం ఖరారైంది. ప్రతి నూరు కాసులకు ఒక కాసు వడ్డీ చెల్లించడానికీ, ఋణమొత్తాన్ని యుగాంతంలో తీర్చి వేయడానికీ స్వామివారు అంగీకరించారు. ఈ చర్చోపచర్చలూ, రాతకోతలన్నీ, ఆదివరాహక్షేత్రం లోని అశ్వత్థ వృక్షనీడలో, హేవళంబి నామ సంవత్సర, చైత్రశుద్ధ దశమి నాడు జరిగాయి.

పై షరతులన్నీ అంగీకరిస్తూ, స్వామివారు కుబేరునికి వ్రాసి ఇచ్చినట్లుగా చెప్పబడుతూన్న ఆ కాలపు ప్రామిసరీ నోటు, ఈమధ్యకాలం వరకూ వరాహస్వామి ఆలయకుడ్యం పై వ్రేలాడతూ ఉండేది. ఇటీవలనే దాన్ని తిరుమలలో ఉన్న వస్తుప్రదర్శనశాల కు తరలించారు.

కుబేరుని షరతులు అంతటితో అయిపోలేదు, సాక్షి సంతకం కావాలన్నాడు. మొదట బ్రహ్మదేవుడితో సంతకం పెట్టించగా, "కుమారుడి సంతకమేం చెల్లుతుంది?" అంటూ పెదవి విరిచాడు. శివుడి సంతకం ప్రతిపాదిస్తే, "ముచ్చటగా మూడో సంతకం కూడా కావా" లన్నాడు. తదుపరి, "సత్యనిష్ఠకు మారు పేరైన అశ్వత్థవృక్షాన్ని సాక్ష్యంగా అంగీకరిస్తా" నన్నాడు. చివరికి, ముగ్గురిచేతా సాక్షి సంతకాలు పెట్టించిన తరువాతే, ఋణమొత్తం శ్రీనివాసుని చేతికిచ్చాడు. అప్పు కోసం సాక్షాత్తూ ఆ లక్ష్మీ వల్లభుడికే ముప్పతిప్పలు తప్పలేదు.

కలి మహిమ కాకుంటే మరేంటి?

నాటికీ, నేటికీ అప్పిచ్చేవాడికి, అప్పు తీసుకునే వాడంటే లోకువే మరి. సవాలక్ష షరతులకు తల వంచాల్సిందే! అయితే, సత్యసంధుడైన శ్రీనివాసుడు ఆ షరతులన్నింటినీ తరతరాలుగా నేరవేరుస్తూనే ఉన్నాడు. నేటితరం మానవుల వలె ఎగ వెయ్యడానికి ఎత్తులు వేయట్లేదు.

శ్రీవరాహస్వామికి ఆగమశాస్త్రానుసారం, ప్రతిరోజూ మూడు పూటలా అర్చనలు, నివేదనలూ జరుప బడతాయి. అన్నప్రసాదాలన్నీ శ్రీవారి కంటే ముందుగా, వరాహస్వామికి నివేదింప బడతాయి. అలాగే, ప్రతి శుక్రవారం తెల్లవారు ఝామున అభిషేకం జరుప బడుతుంది.

ప్రతి బ్రహ్మోత్సవం చివరి రోజున "చక్రస్నానం" సందర్భంగా, ఉభయ నాంచారులతో కూడిన మలయప్పస్వామి, చక్రత్తాళ్వార్ (స్వామివారి బంటుగా భావింపబడే సుదర్శనచక్రం) తో సహా వరాహస్వామి ఆలయం లోకి వేంచేస్తారు. పంచామృత స్నపన తిరుమంజనం తరువాత పుష్కరిణిలో చక్రస్నానం జరుప బడుతుంది. అయితే రథసప్తమి, ముక్కోటి ద్వాదశి నాడు శ్రీచక్రత్తాళ్వార్ మాత్రమే మందిరం లోకి వేంచేసి పుష్కరిణీలో స్నానం చేస్తారు.

వేర్వేరు శాసనాల్లో, వరాహస్వామి "వరాహనాయనార్" గానూ, "జ్ఞానప్పిరాన్" గానూ పేర్కొన బడ్డారు. 1982 సం లో, ఆలయానికి జరిగిన మహా సంప్రోక్షణ కార్యక్రమ సందర్భంగా, శ్రీవరాహస్వామి వారి ఆలయం చుట్టూ మకరతోరణ నిర్మాణం, ఆలయంపై పెద్ద విమాననిర్మాణం మరియు బంగారు కలశస్థాపన జరిగింది.

ఈ సారి తిరుమల వెళ్ళినపుడు, ముందుగా శ్రీవరాహస్వామి దర్శనం తరువాతనే శ్రీవారిని దర్శించుకుందాం.

ఆ దేవదేవుడు ఒప్పుకున్న షరతుల్ని పాటించాల్సిన బాధ్యత, వారి భక్తులుగా మనందరి మీదా ఉంది.

శ్రీవారి నిత్యోత్సవాలు మరియు వారోత్సవాల గురించి మనం ఇంతకు ముందే చెప్పుకున్నాం. ఇవే కాకుండా, స్వామి వారికి పక్ష, మాస, సంవత్స రోత్సవాలు కూడా లెక్కకు మిక్కిలిగా జరుగుతూనే ఉంటాయి. వాటిలో, పక్షోత్సవాలు, మాసోత్సవాల గురించి ఇప్పుడు కొద్దిగా తెలుసు కుందాం:

----------: : ----------

పక్ష, మాసోత్సవాలు

పక్షోత్సవాలు

శ్రీవారికి ప్రతి ఏకాదశి నాడూ పక్షోత్సవం జరుగుతుంది. ఆనాడు విశేష ఉత్సవాలు, ఊరేగింపులు ఉండవు. అయితే, నివేదనలో మాత్రం ప్రత్యేకంగా దోశెలు, సుండలు (గుగ్గిళ్ళు) సమర్పించ బడతాయి.

మాసోత్సవాలు

శ్రీవారి ఆలయంలో ప్రతి నెలా ఆయా నక్షత్ర దినాల్లో విశేషంగా కొన్ని ఉత్సవాలు జరుగుతున్నాయి. కాబట్టి వీటిని నక్షత్రోత్సవాలు గా కూడా పిలుస్తారు. నెలకు ఒక్కసారే వస్తాయి కనుక వీటిని మాసోత్సవాలు గా కూడా పిలుస్తారు. వీటిలో ముఖ్యమైనవి అయిదు.

1. రోహిణీ నక్షత్రోత్సవం

ప్రతినెలా శ్రీకృష్ణుని జన్మ నక్షత్రమైన రోహిణి నక్షత్రం నాటి ఉదయం, సుప్రభాతానంతరం, భోగశ్రీనివాసునితో పాటు గర్భాలయం లోని రుక్మిణీ–శ్రీకృష్ణులకు కూడా అభిషేకం జరుగుతుంది. ఆరోజు సాయంత్రం, శ్రీకృష్ణుడు, రుక్మిణీ సమేతంగా ఆలయం వెలుపలకు వేంచేసి, సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొంటారు. పిదప, మాడవీధుల్లో ఊరేగి ఆలయప్రవేశం చేస్తారు. ఈ సేవలో పాల్గొన్న ఇరువది ఏడు నక్షత్రాల వారందరికీ, విశేషంగా రోహిణీ నక్షత్రం వారికీ, నక్షత్రశాంతి జరిగి, దోష విముక్తు లవుతారు.

2. ఆర్ద్రా నక్షత్రోత్సవం

శ్రీభగవద్రామానుజుల వారి అవతార నక్షత్రమైన ఆర్ద్రా నక్షత్రం నాటి సాయం సంధ్యలో శ్రీమలయప్పస్వామి వారు సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొంటారు. ఆరోజు భగవద్రామానుజుల వారు మరో పీఠాన్ని ఎక్కి శ్రీస్వామివారికి అభిముఖంగా, స్వామివారికి స్వాగతం పలుకుతున్నట్లుగా, తిరుమల మాడ వీధుల్లో ఊరేగింప బడతారు. మేషమాసంలో ప్రత్యేకంగా, ఆర్ద్రా నక్షత్రానికి పది రోజుల ముందు నుండీ, భాష్యకార్ల ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఆ పది రోజులూ స్వామివారికి అభిముఖంగానే రామానుజాచార్యుల వారు ఊరేగింప బడతారు. ఆలయంలో, భాష్యకార్ల సన్నిధి యందు స్వామివారికి ఆస్థానం జరుప బడుతుంది. నివేదనానంతరం, స్వామివారి పూలమాలలు రామానుజాచార్యుల వారికి సమర్పిస్తారు. అలాగే, స్వామివారి శేషహారతి రామానుజులకు ఇవ్వబడుతుంది. ఈ దర్శనంతో, ఇరవయ్యేడు నక్షత్రాలవారికీ, ముఖ్యంగా ఆర్ద్రా నక్షత్ర సంజాతులకు, నక్షత్రశాంతి జరిగి శుభం చేకూరుతుంది.

3. పునర్వసు నక్షత్రోత్సవం

శ్రీరాముని జన్మనక్షత్రం పునర్వసు. ప్రతినెలా పునర్వసు నక్షత్రదినాన, సుప్రభాతానంతరం, భోగశ్రీనివాసునితో పాటుగా, శ్రీసీతారామలక్ష్మణులకు కూడా అభిషేకం జరుగుతుంది. శ్రీరామనవమి రోజూ, ఆ మరునాడైన దశమి రోజూ, బంగారువాకిలి ముందు శ్రీసీతారామలక్ష్మణులకు ఆస్థానం జరుగుతుంది. ఆ సాయంత్రం జరిగే సహస్రదీపాలంకరణ సేవలో, శ్రీసీతారామలక్ష్మణులు, శ్రీదాసాంజనేయస్వామి మాత్రమే పాల్గొంటారు. అనంతరం, తిరుమల పుర వీధుల్లో ఊరేగింపు జరిగిన తరువాత, శ్రీసీతారామలక్ష్మణులు శ్రీ బేడీ ఆంజనేయస్వామివారి సన్నిధికి వేంచేస్తారు. రాములవారి పూలమాలలను ఆంజనేయుడికి సమర్పించిన తరువాత, వారికే శేషహారతి కూడా ఇవ్వ బడుతుంది. పిదప, శ్రీసీతారామలక్ష్మణులు ఆలయ ప్రవేశం చేసి యథాస్థానంలో ఆసీను లవుతారు. ఈ సేవలో పాల్గొనడం ద్వారా, 27 నక్షత్రాలవారికీ, విశేషంగా పునర్వసు నక్షత్రంలో జన్మించిన వారికీ నక్షత్రశాంతి జరుగుతుంది.

బేడీ ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన విశేషాల్ని ఈరోజే, రాబోయే ఉపప్రకరణంలో తెలుసుకుందాం.

"రామచంద్రుడితడు రఘువీరుడు
కామిత ఫలము లియ్యగలిగె నిందరికి!!...
తలప శబరి పాలి తత్త్వపు రహస్యము
అలరి గుహుని పాలి ఆదిమూలము
కలదన్న వారి పాలి కన్ను లెదుటి మూరితి
వెలయ శ్రీ వేంకటాద్రి విభుడీతడు!!"

4. శ్రవణా నక్షత్రోత్సవం

శ్రీవేంకటేశ్వరస్వామి శ్రవణానక్షత్ర పుణ్యదినాన అవతరించారు. వేంకటేశునికి అభిన్నుడైన ఆదివరాహుడు కూడా శ్రవణానక్షత్ర సంజాతుడే! శ్రవణానక్షత్రం ఉదయాన, భోగశ్రీనివాసునితో పాటుగా, ఉభయ నాంచారులతో కూడిన మలయప్పస్వామికి అభిషేకం జరుగుతుంది. ఆరోజు పగటి సేవలన్నీ సమాప్తం అయిన తరువాత, మలయప్పస్వామివారు దేవేరులతో సహా, సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొన్న పిదప పురవీధుల్లో ఊరేగి, ఆలయంలో పునఃప్రవేశం చేస్తారు. కొన్ని మాసాల్లో, శ్రీవారి అవతార నక్షత్రమైన శ్రవణానక్షత్రంలో విశేషపూజలు జరుగుతాయి. ప్రతి కన్యారాశిలో, శ్రవణానక్షత్రం నాటికి ముగిసేటట్లుగా, బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆ తరువాత వచ్చే కార్తీకమాసంలోని శ్రవణానక్షత్రం రోజున, స్వామివారికి కన్నుల పండువగా, పుష్పయాగోత్సవం నిర్వహిస్తారు.

5. పున్నమి గరుడసేవ

వివిధ నక్షత్రోత్సవాలే కాకుండా, ప్రతి నెలా, ప్రతి పున్నమిరాత్రీ తిరుమలేశునికి పున్నమి గరుడసేవ జరుప బడుతుంది.

ఆ రోజు సాయంకాలం ఏడు గంటలకు, వజ్రకవచ, వజ్రకిరీటధారీ, సర్వాలంకరణ భూషితుడైన శ్రీమలయప్పస్వామి వారు గరుడునిపై వేంచేసి, ఛత్రచామరాలతో, గజ, తురగ, వృషభరాజాలతో, తిరువీధుల్లో విహరిస్తారు.

బేడీ ఆంజనేయుని సన్నిధి

త్రేతాయుగంలో శ్రీరామునికీ–శ్రీఆంజనేయునికీ ఉన్న ఆత్మీయతానుబంధం కలియుగంలోనూ కొనసాగుతోంది. దాస్యభక్తికి ప్రతిరూపమైన ఆంజనేయుడు, ముకిళిత హస్తాలతో, శృంఖలాబద్ధుడై, స్వామివారి మహాద్వారానికి ఎదురుగా, సమున్నతంగా, అఖండానికి చేరువగా ఉన్న ఓ మందిరంలో దర్శనమిస్తారు. దీనినే బేడీ ఆంజనేయస్వామి ఆలయం గా వ్యవహరిస్తారు.

ఆంజనేయుడికి ఈ పేరు రావడం వెనుక అనేక కథనాలు వెలుగులో ఉన్నాయి.

పూర్వం సప్తగిరులలో ఒకటైన అంజనాద్రిపై, అంజనాదేవి, తనయుడైన ఆంజనేయుడు పసి బాలునిగా ఉన్నప్పుడు, అతనితో కలిసి నివసించేది. చిన్నారి ఆంజనేయుడు చిలిపితనంతో ఒక ఒంటె వెనుక అల్లరిగా పరుగెడుతుండే వాడు (ఒంటెను ఆంజనేయస్వామి వాహనంగా పేర్కొంటారు). విసుగెత్తిన అంజనాదేవి తన కుమారుణ్ణి ఇప్పుడీ ఆలయం ఉన్న ప్రదేశంలో శృంఖలాబద్ధుణ్ణి గావించి, తాను తిరిగి వచ్చేంత వరకూ అక్కడే ఉండమని ఆజ్ఞాపించి, తపస్సు నిమిత్తం ఆకాశగంగ తీర్థాని కేతెంచింది. కారణాంతరాల వల్ల, ఆమె తిరిగి రాలేకపోయింది. ఆజ్ఞాబద్ధుడైన ఆంజనేయుడు, తల్లి రాక కోసం ఎదురు చూస్తూ, ఇంకా ఆ ప్రదేశంలోనే, స్వామివారికి నమస్కరిస్తూ నిలబడి ఉన్నాడు. ఆ విధంగా, అచంచల రామభక్తికే కాదు, మాతృవాక్య పరిపాలనకు కూడా ఆంజనేయుడు ప్రఖ్యాతి గాంచాడు.

మరో కథనం ప్రకారం, భేరీ అనే ఉత్తరభారత పదానికి "సమ్ముఖం" అని అర్థం. స్వామి వారి సమ్ముఖంలో ఉన్నాడు గనుక 19వ శతాబ్దంలో తిరుమల క్షేత్రం ఉత్తర భారతదేశానికి చెందిన మహంతుల ఆధ్వర్యంలో ఉన్నపుడు, ఈ ఆంజనేయుడిని భేరీ ఆంజనేయుడిగా పిలిచేవారు. అదే కాలక్రమంలో, బేడీ ఆంజనేయుడిగా రూపాంతరం చెందింది.

ఇంకా, అనేక ఆసక్తి కరమైన కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

తిరుమలలో, స్వామివారి ఆలయం, ఆదివరాహస్వామి ఆలయం తరువాత అత్యంత ప్రసిద్ధి చెందినది ఈ ఆలయమే!

ఈ ఆలయం గర్భాలయం, ముఖమండపం అని రెండు భాగాలుగా నిర్మించబడింది. గర్భాలయంలో, గోడవారకు మధ్యలో ఆరడుగుల నిలువెత్తు ఆంజనేయుడు ప్రతిష్ఠింప బడ్డాడు. గర్భాలయంపై ఏక కలశ గోపురం నిర్మింపబడింది. దీనికి నాలుగు మూలలా, సింహాల ప్రతిమలు అమర్చబడి ఉన్నాయి. ఆలయం చుట్టూ ప్రదక్షిణ మార్గంకూడా ఉంది.

ప్రతిరోజూ మూడు పూటలా, స్వామివారి నివేదనానంతరం, స్వామివారి ఆలయం నుండి వచ్చిన అన్న ప్రసాదాలతో ఆంజనేయునికి నైవేద్యం జరుగుతుంది.

బ్రహ్మోత్సవాలలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు, బేడీ ఆంజనేయుడి ఆలయం నుండి ఊరేగింపుగా వెళ్ళి శ్రీవేంకటేశునికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

అంజనాదేవి తపస్సు ముగించుకొని ఎప్పుడు వస్తుందో? పాపం! ఆంజనేయుడికి ఈ బేడీల నుండి ఎప్పుడు విముక్తి కలుగుతుందో?

అంతా, శ్రీనివాసుని చిద్విలాసం!

ఉభయులూ, ఒకరిని విడిచి వేరొకరు ఉండలేక, జన్మజన్మలకూ ఈ సాన్నిహిత్యాన్ని కొనసాగిస్తున్నారేమో?

"కలశాపురముకాడ గంధపుమాకులనీడ –
లరేవు మేలు మేలు హనుమంతురాయ....
దిక్కులు గెలిచితివి ధీరత బూజ గొంటివమిక్కిలి ప్రతాపాన మెరసితివి
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరుబంటు వైతివి హనుమంతరాయ"

శ్రీవారి దర్శనం ముగించుకోగానే, మనం సాధారణంగా, మాడవీధుల ప్రక్కనే ఉన్న తరిగొండ వెంగమాంబ సత్రం లో ఉచిత భోజనం చేసి, అదే శ్రీవారి మహాప్రసాదంగా భావిస్తాము. ప్రతిరోజూ సుమారు లక్ష మందికి, అదే బ్రహ్మోత్సవాల్లో రెండు లక్షల మందికి, వండి వడ్డించే, "నభూతో నభవిష్యతి" అన్న చందంగా ఉండే ఈ భోజనశాలకు ఆ భక్తురాలి పేరెందుకు పెట్టారు?

----------: : ----------

తరిగొండ వెంగమాంబ

తిరుమలేశుడు ప్రతిరాత్రీ ఏకాంతసేవ తరువాత, ఓ భక్తురాలి ఇంటికి వెళ్ళి, ఆమె భక్తి పారవశ్యంతో తనను కీర్తిస్తుంటే, తాను నాట్యం చేస్తుండేవాడు. ఆమె చెప్పే ముచ్చట్లు ఆసక్తిగా వింటుండేవాడు. ఆమెకు అవమానం జరిగితే, తనకు జరిగినట్లుగానే భావించేవాడు. ఈ లీలలన్నీ పూర్వయుగాల నాటివో, వేల ఏళ్ళ నాటివో కాదు; కేవలం రెండు వందల యాభై ఏళ్ళ క్రితం జరిగిన యథార్థ సంఘటనలు!

ఆ మహాభక్తురాలే పరమ పూజ్యురాలైన తరిగొండ వెంగమాంబ గారు.

మహా మహిమాన్వితురాలు వెంగమాంబ ప్రస్తావన లేకపోతే శ్రీనివాసుని ఐతిహ్యం అసంపూర్తిగానే మిగిలి పోతుందంటే, అతిశయోక్తి కాదు.

వెంగమాంబ బాల్యం

తిరుపతి నుండి మదనపల్లె వెళ్ళే మార్గంలో, నేడు "వాయల్పాడు" గా పిలువబడే "వాల్మీకపురం" అనే పట్టణానికి నాలుగు మైళ్ళ దూరంలో తరిగొండ అనే గ్రామం నేటికీ ఉంది. ఆ గ్రామంలో, కానాల కృష్ణయ్య-మంగమ్మ అనే దంపతులకు ఐదుగురు కొడుకుల తరువాత, శ్రీనివాసుని కటాక్షంతో జన్మించిన ఆడపిల్లకు ఆమె తల్లిదండ్రులు "వెంకమ్మ" అని స్వామివారి పేరు పెట్టారు. ఆమె అతి చిన్నతనం నుండీ భజనలూ, ఉపవాసాలతో గంటలకొద్దీ ధ్యానంలో మునిగి ఉండడంతో, తల్లిదండ్రులు మొదట్లో ముచ్చట పడ్డారు. అయితే, రోజులు గడిచే కొద్దీ, పెళ్ళి కావలసిన పిల్ల ఇలా పనిపాటలు మానేసి ఎడతెరిపి లేకుండా పూజా పునస్కారాలలో మునిగి ఉండటం వారికి ఆందోళన కలిగించింది. ఆ చింతతోనే వెంకమ్మకు పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించారు. వెంకమ్మ మాత్రం "వేంకటేశ్వరుడే నా భర్త. నాకు వివాహ ప్రయత్నాలు విరమించండి." అని వేడుకొంటూ ఉండేది. ఆమె మొరను పెడచెవిని పెట్టిన తల్లిదండ్రులు సమీప గ్రామానికి చెందిన వెంకటాచలపతి అనే యువకుడితో ఆమెకు అతి చిన్నతనం లోనే బలవంతంగా వివాహం జరిపించారు. కానీ, వేంకటేశ్వరుని తలంపు వేరే విధంగా ఉండడంతో, వెంకమ్మ కాపురానికి వెళ్ళక ముందే భర్త మరణించాడు. ఇవేమీ పట్టించుకోని వెంకమ్మ మాత్రం శ్రీనివాసుణ్ణే తన భర్తగా తలుస్తూ, కొలుస్తూ, పసుపు కుంకుమలు సిగారించుకొని, సమీపంలోనే ఉన్న ఆలయం లోని ఆంజనేయస్వామికి, నారసింహునికి హారతులిచ్చేది. తరిగొండ గ్రామంలో ఈ ఆలయాన్ని నేడూ చూసి తరించవచ్చు.

వెంగమాంబగా మారిన వెంకమ్మ

కూతురి వ్యవహారంతో ఏంచేయాలో పాలుపోని పరిస్థితుల్లో తండ్రి కృష్ణయ్య, వెంకమ్మకు, మదనపల్లి వాస్తవ్యులైన సుబ్రహ్మణ్యశాస్త్రి అనే ఆధ్యాత్మికవేత్తతో ఉపదేశం చేయించాడు. అసలే మహా భక్తురాలైన వెంకమ్మ, ఆ ఉపదేశ మహిమతో మహాతపస్వినిగా మారిపోయింది. ఆమె నోటినుండి; వేంకటేశ్వరుణ్ణి కీర్తిస్తూ అనేక శ్లోకాలు, శతకాలు

ఆశువుగా వెలువడుతుండేవి. ఇరుగు పొరుగు వారందరూ అప్పటినుండి ఆమెను ఓ మహాయోగినిగా భావించి, వెంగమాంబ అంటూ, గౌరవ మర్యాదలతో సంబోధించేవారు.

పీఠాధిపతుల ఆగమనం

అయితే, వితంతువులను చిన్నచూపు చూసే ఆ రోజుల్లో భర్తను కోల్పోయిన ఓ మహిళ, సౌభాగ్యవతి వలె ఆలయాన్ని సందర్శించడం కొందరు సాంప్రదాయ వాదులకు కంటగింపైంది. ఆమెను ఎలాగైనా ఇంటికే పరిమితం చేయాలని భావించారు. అదే సమయంలో తన ఆధ్యాత్మిక పర్యటనలలో భాగంగా ఆ గ్రామానికి వేంచేసిన పుష్పగిరి పీఠాధిపతుల వారికి, గిట్టనివారు కొందరు వెంగమాంబ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. ఆ విషయాన్ని స్వాములవారు వెంగమాంబతో ప్రస్తావించగా, ఆమె తన భర్త వేంకటనాథుడని, ఆయనకు మరణంలేదని, తాను నిత్య సౌభాగ్యవతినని ఖరాఖండిగా సమాధాన మిచ్చింది. ఆమె మాటలకు అవాక్కయిన పీఠాధిపతుల వారు ఆమెను ఏమార్చలనే ఉద్దేశ్యంతో, తానో పీఠానికి అధిపతిననీ, తనకు నమస్కరించాలని తెలియదా? అంటూ వెంగమాంబను ప్రశ్నించారు. అంతట వెంగమాంబ "స్వామీ! నేను నమస్కరిస్తాను. ఒక్కసారి తాము ఆసీనులై ఉన్న పీఠం మీద నుండి లేవండి" అని ప్రార్థించటంతో స్వామివారు పీఠం మీద నుండి పైకి లేచారు. ఆమె నమస్కరించగానే, హఠాత్తుగా పీఠం అగ్నికి ఆహుతై పోయి, పీఠాధిపతుల వారికి తృటిలో ఘోరప్రమాదం తప్పింది. అచ్చెరువొందిన స్వామివారు, ఆమె మహా తపస్సంపన్నురాలనీ, దైవకృప సంపూర్ణంగా కలిగిన మహిళామూర్తి అనీ, ఆమె ఆలయంలో ప్రవేశించడానికి ఏ విధమైన అభ్యంతరం పెట్టవద్దని గ్రామస్తులకు నచ్చజెప్పారు. ఆ ఉదంతంతో వెంగమాంబ మరింత ప్రసిద్ధురాలైంది.

తిరుమలకు పయనం

అయినా కొందరు ఆమెనూ, ఆమె కుటుంబాన్నీ ఇంకా వేధిస్తూనే ఉన్నారు. ఇవేమీ పట్టించుకోని వెంగమాంబ ఆ వూళ్ళోనే ఉన్న నృసింహస్వామినీ, ఆంజనేయుణ్ణీ పూజించడం కొనసాగించింది. ఒకనాడు ఆ దేవాలయం లోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ధ్యానం చేసుకుంటున్న వెంగమాంబను కొందరు ఛాందసవాదులు "ఏ క్షేత్రానికో వెళ్ళి తపస్సు చేసుకోకండా, ఈ గుళ్ళో ఎందుకు దాపురించావు?" అని దూషిస్తూ, ఆమెను జుట్టు పట్టుకుని ఆలయం నుండి బరబరా బయటకు ఈడ్చివేశారు. వారి మాటలను భగవత్సంకల్పంగా భావించిన వెంగమాంబ వేరే ఆలోచన లేకుండా, అరణ్యమార్గం పట్టి హుటాహుటిన తిరుమల క్షేత్రం చేరుకుంది.

క్షేత్ర సందర్శన

తిరుమలక్షేత్రాన్ని తొలిసారిగా సందర్శించు కొన్నపుడు, ఆనంద పారవశ్యంలో అలవోకగా ఆమె నోటినుండి జాలువారిన ముత్యాల మూటలు "శ్రీవేంకటాచల మహాత్మ్యం" లో ఈ విధంగా పొందు పరచబడి ఉన్నాయి.

ఘనగోపురములు ప్రాకారమంటపములు
తేరులు, సత్పుణ్యతీర్థములును
ముద్దుగా బల్కు శుక, పికములును నీలి

కంఠములును తులసికాదళ సుమములు
క్రిక్కిరిసియుండు వేంకటగిరి పురమున

కొద్ధిమార్పులు, చేర్పులతో తిరుమలక్షేత్రం నేటికీ అదే విధమైన ముగ్ధమనోహర ప్రాకృతిక సౌందర్యంతో భక్తజనులను అలరిస్తోంది.

వెంగమాంబకు నిలువనీడ

వెంగమాంబ ప్రతిరోజూ శ్రీనివాసుణ్ణి దర్శించి, సేవించి; ఆశువుగా వచ్చే పద్యాలతో, శతకాలతో భక్తి పరవశురాలై వేంకటేశుణ్ణి స్తుతించేది. ఆమె భక్తికి ఎందరో తన్మయులయ్యే వారు. ఆమెను ఎంతగానో కొనియాడేవారే తప్ప, నిలువనీడ లేక గుడిలోనే తలదాచు కుంటున్న ఆమె దీనావస్థను మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. తనకో నీడ కల్పించమని ఆనందనిలయణ్ణీ, ఆయనకూ సిఫారసు చేయమని అమ్మవారినీ ఆమె పరిపరి విధాలా వేడ్కొనగా ఎట్టకేలకు శ్రీనివాసుడు కరుణించాడు. స్వామివారి ప్రేరణతో, వారి ఆంతరంగిక భక్తుడైన హాథీరాంబావాజీ వారి శిష్యులు, మహంతుమఠానికి ఆనాటి అధిపతి అయిన ఆత్మారాందాసు సుమారు 1750వ సం. లో వెంగమాంబకు తగిన నివాసాన్ని ఏర్పరచడానికి, సంకల్పించారు (హాథీరాంబావాజీ గురించీ, దేవాలయ పరిపాలనా కార్యకలాపాలను సుదీర్ఘకాలం నిర్వహించిన మహంతుమఠం గూర్చి మరో ప్రకరణంలో వివరించబడింది).

భగవత్ప్రేరణతో ఆత్మారాందాసు గారు శ్రీవారి మందిరానికి తూర్పు మాడవీధి చివరన, ఈశాన్యమూలలో, శ్రీవారి రాతిరథానికి ప్రక్కగా ఓ పూరి గుడిశెను నిర్మించి, వెంగమాంబ వద్దకు వెళ్ళి, ఆ గుడిశెను ఆమె నివాసనిమిత్తం స్వీకరించాల్సిందిగా అర్థించాడు. అంతే గాకుండా, "వకుళమాత" పేరుతో ఒక పడి బియ్యాన్నీ, ఇతర వంటవస్తువులనూ వెంగమాంబ నివాసానికి నిత్యం పంపేటట్లుగా తీర్మానించాడు. మహంతు ఏర్పాటు చేసిన కట్టడి ననుసరించి ఆలయాధికారులు వెంగమాంబకు కావలసిన సంభారాల్ని ఆలయ ఉగ్రాణం (సరుకుల గిడ్డంగి) నుంచి వెంగమాంబ ఇంటికి పంపేవారు.

స్వామివారికి తులసీ కైంకర్యం

ఇలా ఆవాసం మరియు ఆహారం విషయాల్లో నిశ్చింత అయిన వెంగమాంబకు; కళ్ళు తెరిచినా, మూసినా ఆ సప్తగిరీశుడే సాక్షాత్కరించేవాడు. శ్రీనివాసుడు ఆమె పాటకు పదం కలుపుతూ, ఆమె ముచ్చట్లను మైమరచి వినేవాడు. భక్తిపారవశ్యంలో ఆసాంతం మునిగిన వెంగమాంబ అలంకారప్రియుడైన శ్రీనివాసునికి ప్రతిరోజూ పూమాలలు సమర్పించాలనీ, ప్రతి సాయంత్రం చివరగా కర్పూరహారతితో నీరాజనం సమర్పించాలనీ కలలు గనేది. అంతేగాకుండా, తులసీ ప్రియుడైన తిరుమలేశునికి కోసం తన కుటీరం వెనుక తులసివనాన్ని ఏర్పాటు చేయదలిచి, ఒక దిగుడుబావిని త్రవ్వించింది. బావి అడుగున ఓ పెద్ద బండరాయి తగలగా వెంగమాంబ గంగమ్మను ప్రార్థించడంతో, బండ చిట్లి జలధార వెల్లువలా ఉబికి వచ్చింది. ఆ వనం నుండి ప్రతిరోజూ తులసీ దళాలు తెచ్చి, మాలలు కట్టి శ్రీవారికి కైంకర్యం చేసేది.

ఆనాడు వెంగమాంబ త్రవ్వించిన దిగుడుబావిని పాపవినాశనంకు వెళ్ళేదారిలో, ఏనుగుశాలవద్ద "అమ్మోరిబావి" అనే పేరుతో నేడూ చూడవచ్చు. ఇందులోని నీళ్ళను ఈనాడు కూడా తి.తి.దే. వారు తోటను పెంచడానికి ఉపయోగిస్తున్నారు.

ఇలా వెంగమాంబ సమర్పించిన తులసి మాలలతోనూ, కర్పూర నీరాజనంతోనూ శ్రీ వారు మరింత అందంగా, వింత వింత కాంతులు విరాజిల్లుతూ ఉండేవారు.

వెంగమాంబ మరో ధ్యాస లేకుండా స్వామివారి మీద కవితలల్లుతూ, పాటలు పాడుతూ, శ్రీవారి సేవ చేసుకుంటూ కాలం గడిపేది. శ్రీవారికి అంకితభావంతో ఆమె చేసే సపర్యల వల్ల యాత్రికులకూ, తిరుమల వాసులకూ, శ్రీవారి కైంకర్యపరులకూ, వెంగమాంబ పట్ల అపరిమిత గౌరవాభిమానాలు కలిగాయి. ఆమెను సాక్షాత్తూ భగవదంశగా తలచి, ఆమె ఆశీస్సులకోసం తహతహ లాడుతుండే వారు.

తాళ్ళపాక వారి ప్రాపకం

ఆ సమయంలో, స్వామివారి మరొక పరమ భక్తుడైన తాళ్ళపాక అన్నమయ్య (ఈ భక్తుని గురించి వేరే ప్రకరణంలో వివరించబడింది.) వంశీయులు వెంగమాంబ భక్తి తత్పరత గూర్చి, ఆమె మహిమల గూర్చి విన్నారు. ఆమె కూడా తమ బ్రాహ్మణశాఖకు చెందినదే నని తెలుసుకుని ఉత్తరమాడవీధిలో, శ్రీవరాహస్వామి ఆలయాని కెదురుగా తాము నివాసముంటున్న ఇంటిలో కొంత భాగాన్ని ఆమె నివాసార్థం ఉచితంగా ఇచ్చారు. వెంగమాంబ శ్రీనివాసునుకి మరొక్కసారి కృతజ్ఞతలు ప్రకటించుకొని, తాను ఉంటున్న పూరింటిని వదిలి, తాళ్ళపాక వారింటికి చేరింది. ఆ ఇంటి వెనుక కూడా తులసివనాన్ని పెంచుతూ, శ్రీవారికి కైంకర్యం నిర్వహిస్తూండేది.

అక్కరామ దీక్షితుల అక్కసు

ఆరోజుల్లో వంశ పారంపర్యంగా ఉండే అర్చకులు మాత్రమే కాకుండా, ప్రభుత్వం తరఫున కూడా అర్చకులు నియమింపబడే వారు. అక్కరామ దీక్షితులు అనే శ్రీవారి సర్కారు అర్చకుడు వెంగమాంబ ఇంటి ప్రక్కనే మందీ మార్బలంతో నివసించేవాడు. హోదా, సంపద, పరివారజనం కారణంగా ఆయనకు గర్వమూ, అహంకారమూ తలకెక్కాయి. పైగా శ్రీవారిని స్పృశించి, వారికి సేవలు చేయగలిగే భాగ్యం గలిగిన తాను సాక్షాత్తూ భగవత్సంభూతుడే అన్న అహంభావం ఆయన మదిలో మెదిలేది. అందరూ ఆయనకు వంగి వంగి నమస్కరిస్తూంటే, శ్రీవారినే సమస్తంగా భావించే వెంగమాంబ మాత్రం తన పనిలో తాను నిమగ్నమై ఉండేది. అది అక్కరామ దీక్షితులుకు కంటగింపుగా తయారైంది. సౌభాగ్యం కోల్పోయిన స్త్రీ రోజూ వచ్చి హారతి ఇవ్వడం ఏమిటని ఆయనకు అక్కసుగా కూడా ఉండేది. వేదవేదాంగ పారాయణుడు తానుండగా, తన ఎదుటే ఓ వితంతువు సత్కారాలు పొందటం ఏమిటి? అని ఈర్ష్యతో రగిలి పోయేవాడు. పుండు మీద కారం అద్దినట్లు తాళ్ళపాక వారామెను చేరదీసి, వారి ఇంట్లో ఆశ్రయం ఇవ్వడం వల్ల అతని అంతరంగం ఇంకా క్రోధపూరిత మయ్యింది. ఉద్యోగరీత్యా నిత్యం శ్రీవారి సమక్షంలోనున్నప్పటికీ, అరిషడ్వర్గాలపై ఆధిపత్యం సాధించనట్టి ఆ అర్చకుడు స్వామి తోడిదే లోకంగా జీవిస్తున్న వెంగమాంబను నోటికి

వచ్చినట్లు దూషించేవాడు. అయినప్పటికీ అలౌకికమైన ఆధ్యాత్మిక జగత్తులో తాదాత్మ్యమై ఉన్న వెంగమాంబ పన్నెత్తు మాట కూడా అనక పోవడంతో, ఆమె సహనాన్ని అలుసుగా తీసుకున్న అర్చకుని ఆగడాలు అంతకంతకూ మితిమీరి పోయాయి. ఆయన బుద్ధి మరింత వక్రించి, ఆమె పెంచుతున్న తులసివనంలో ఎంగిలి విస్తళ్ళు వేయించేవాడు. అసూయా ద్వేషాలు మనుషుల్ని ఎంతకైనా దిగజారుస్తాయి కదా!!

శ్రీవారి క్రోధాగ్ని

ఎంగిలివిస్తళ్ళ వల్ల శ్రీవారికి చెందాల్సిన తులసిదళాలు అపవిత్రం కావడంతో నొచ్చుకొన్న వెంగమాంబ, ఒకటికి రెండు సార్లు అర్చకుణ్ణి మృదువుగా వారించింది. అయినా ఆయన వంకరబుద్ధి మారలేదు.

ఒకనాడామె పెరటిలో కూర్చొని ఆనందనిలయ శిఖరాన్ని తదేకంగా చూస్తూ, ధ్యానమగ్నురాలై ఉండగా; అపరాహ్ణ సమయంలో, పక్కింటిలోని అర్చకుడూ, అతని పరివారగణం, మధ్యాహ్న భోజనాలు ముగించుకొని యథాప్రకారం ఎంగిలి విస్తళ్ళు విసిరారు. అవి తులసివనం లోనూ, వెంగమాంబ మీదా పడ్డాయి. ఇన్నాళ్ళూ తనకు అర్పితమయ్యే తులసిదళాలు పెరుగుతూ ఉన్న వనంలో ఎంగిలి విస్తళ్ళు పడేస్తున్నా పట్టించుకోని శ్రీనివాసుడు ఆరోజు ఎంగిలాకులు తన భక్తురాలైన వెంగమాంబ మీద పడడంతో, అది ఆమెకు – తద్వారా తనకు – తీరని అవమానంగా భావించి ఆగ్రహోదగ్రుడయ్యాడు. ఆశ్రిత పక్షపాతియైన శ్రీనివాసుడు తనకెన్ని అవమానాల నైనా భరిస్తాడు గానీ, తనను నమ్మినవారి నెవరైనా దూషిస్తే మాత్రం అణుమాత్రం సహించడు! దోషులను శిక్షించి గానీ వదలడు! అందుకే శ్రీవారిని శరణాగత రక్షకుడూ, ఆర్తత్రాణపరాయణుడూ అని కీర్తిస్తారు. కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఉన్న స్వామివారు వెంగమాంబను ఆవహించి, ఆమె నోటి ద్వారా "ఓరీ పాపీ! నేటితో నీ వంశం సరి. అందరూ నెత్తురు కక్కుకుని మరణిస్తారు" అని పరుషవాక్కులు పలికింప జేశాడు. ఆమె వాణిని సాకారం చేస్తూ, ప్రధానార్చకునితో సహా వారి కుటుంబ సభ్యులందరూ తక్షణమే నెత్తురు కక్కుకుని మరణించారు. అర్చకుని ఒక్క కొడుకు మాత్రం పాక్కుంటూ వచ్చి వెంగమాంబ పాదాల మీద పడి శరణు వేడాడు. అప్పుడు కొంచెం శాంతించిన వెంగమాంబ – మీ వంశంలో ఒక్కడు మాత్రం బ్రతుకుతాడని అభయమిచ్చింది. వెంగమాంబ ఇచ్చిన శాపమూ, అభయమూ నేటికీ తిరుమల యందు చెల్లుబాటులో ఉన్నాయని స్థానికులంటారు. ఆ దైవిక ఘటన జరిగిన రోజు సాయంకాలం, వికలమనస్కురాలై ఉన్న వెంగమాంబతో శ్రీవారు జరిగిన దానికి చింతించవలదనీ, అంతా తన ప్రమేయంతోనే జరిగిందనీ, వెంగమాంబ నిమిత్త మాత్రురాలనీ, తన భక్తురాలిని నిష్కారణంగా దూషించినవారికి తగిన శాస్తి జరిగిందనీ చెప్పి సమాధాన పరుస్తాడు. శ్రీవారి ఓదార్పుతో కుదుట పడ్డ వెంగమాంబ ఆ దినం నుండీ క్రమం తప్పకుండా, ఆలయంలో ఆనందనిలయునికి మరింత భక్తిశ్రద్ధలతో హారతినిస్తూ ఉండేది. అధికారులు అమెకే విధమైన ఆటంకాలూ కలిగించే వారు కాదు. భక్తులు కూడా, ఆమె శ్రీవారి సమక్షంలో ఉండటమే మంగళదాయకంగా భావించేవారు.

శ్రీవారికి తాత్కాలికంగా దూరమైన వెంగమాంబ

వెంగమాంబ కైంకర్యాలు కొనసాగు తుండం, ఆమె భక్తుల మన్నన లందుకోవడం మరో వర్గానికి చెందిన అర్చకులకు

కంటగింపైంది. ఆమెను సూటీపోటీ మాటలతో, పరుష పదజాలంతో బాధించేవారు. విసిగి వేసారిన వెంగమాంబ పరిపరి విధాలుగా ఆలోచించి, మనసు రాయి చేసుకొని, శ్రీవారి సేవకు దూరమ వుతున్నానన్న బాధను అతి కష్టం మీద దిగమ్రింగుకొంటూ, ఆలయానికి వెళ్ళడం విరమించుకొంది. స్వామివారి దర్శనభాగ్యం లేకుండా జీవించడం దుర్భర మైనప్పటికీ, అర్చకుల మనస్సు నొప్పించటం ఇష్టంలేని వెంగమాంబ నిత్యహారతికి స్వస్తి చెప్పి కొంతకాలం ఇంటికే పరిమితమైంది. శ్రీవారి ఆగ్రహం అతిశయించి ప్రధానార్చకుల ఉదంతం పునరావృతం కాకూడదని ఆమె ఉద్దేశ్యం. అటు, తమ పథకం పారి వెంగమాంబ ఆలయానికి దూరమవడంతో అర్చకులు మురిసిపోయారు. అది మూణ్ణాళ్ళ ముచ్చటే అని వారికి తెలియదు.

వెంగమాంబ ఆలయానికి రాకపోవడం ఆనందనిలయునికి ఆందోళన కల్గిస్తుంది. ఆమె సమర్పణభావంతో ఇచ్చే హారతి కోసం రోజుల తరబడి ఆర్తిగా నిరీక్షించేవాడు. ఆ భక్తవత్సలుడు ఆమె గొప్పదనాన్ని లోకానికి చాటిచెప్పి, ఆమె మనసు నొప్పించిన వారికి మరోసారి బుద్ధి చెప్పాలనుకున్నాడు. అంతే! శ్రీవారు మరో అద్భుతమైన పథకాన్ని రచించారు.

ఆగిన తేరు

మరునాడు బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు. శ్రీవారి తేరు దేదీప్యమానంగా వెలుగుతూ తిరుమల మాడ వీధుల్లో విహరిస్తోంది. పురజనులనూ, భక్తసందోహాన్నీ అనుగ్రహిస్తూ, తూర్పు, దక్షిణ, పశ్చిమ మాడవీధుల్లో నిరంతరాయంగా సాగిపోయింది. ఉత్తర మాడవీధిలో తేరు ముందుకు సాగుతూ, తరిగొండ వెంగమాంబ ఇంటి ముందు ఉన్నపళంగా ఆగిపోయింది. అర్చకులు, ఆలయాధికారులు, యాత్రికులు, తిరుమలవాసులు రథాన్ని కదల్చటానికి శతవిధాలుగా ప్రయత్నించారు. వృథా శ్రమ తప్ప, రథం ఆవగింజంతైనా కదల్లేదు. గంటలకొద్దీ కాలయాపన జరిగింది. ఈ ఆటంకాన్ని గమనించిన పెద్దలు, "ఏ భక్తునికో కష్టం కలిగి, స్వామివారి మనసు నొచ్చుకోవడం వల్ల ఇలా జరిగి ఉండవచ్చు" అని ఊహించు కున్నారు. వెంటనే అర్చకులకు వెంగమాంబ విషయం స్ఫురణకు వచ్చింది. ఆమెను దుర్భాషలాడడం, ఆమె ఆలయానికి దూరమవడం, ఆమె నిత్యం ఇచ్చే హారతి కొన్ని రోజులనుండి శ్రీవారికి అందకుండా పోవడం, ఇవన్నీ ఒక్కొక్కటిగా గుర్తుకు రావడంతో వారి అనుమానం దృఢమైంది. దానితో అర్చకులందరూ హుటాహుటిన వెంగమాంబ ఇంటికి వెళ్ళి, తమవల్ల జరిగిన అపరాధానికి క్షమార్పణ కోరి, స్వామివారికి తక్షణమే హారతినిచ్చి రథం కదిలేందుకు సహకరించ వలసిందిగా ప్రాధేయపడ్డారు. అర్చకుల ప్రార్థనలు విన్న వెంగమాంబ వెంటనే హారతి పళ్ళెంతో బయటకు వచ్చి, తిరుమలేశునికి నీరాజనం ఇచ్చి, నిరాటంకంగా ముందుకు సాగమని ప్రార్థించింది. తక్షణమే భక్తులందరూ ఆశ్చర్యానందాలతో మైమరచి వీక్షిస్తుండగా, రథం సునాయాసంగా ముందుకు కదిలింది.

ముత్యాలహారతి

ఆనాటి నుండీ ఆలయనిర్వాహకులు మరింత భక్తి ప్రపత్తులతో, ఆమె చేత స్వామివారికి కర్పూరహారతి నిప్పించేవారు.

ప్రతిరోజూ చిట్టచివరగా వెంగమాంబ కర్పూరహారతి లేనిదే ఆలయం మూయ కూడదనీ, ఆమె హారతి తరువాత మరే హారతీ ఇవ్వరాదని స్వామివారు అర్చకులకూ, అధికారులకూ స్వప్నంలో కనపడి ఆదేశించారు. ఆనాటి నుండి ప్రతిరోజూ ఏకాంతసేవ సమయంలో చిట్టచివరగా వెంగమాంబ గారి ముత్యాలహారతి అయిన తరువాతనే శ్రీవారి ఆలయం మూయ బడుతున్నది. ఈ ముత్యాలహారతి గురించి మనం "ఏకాంతసేవ" లో ఇంతకు ముందే తెలుసుకున్నాం. తన తదనంతరం కూడా ముత్యాలహారతి నిరాఘాటంగా కొనసాగే నిమిత్తం, నిస్సంతు అయిన వెంగమాంబ తన చెల్లెలి కూతురైన మంగమ్మను దత్తత తీసుకుంది. నేటికీ ఈమె సంతతి వారే పవళింపుసేవలో ముత్యాలహారతి నిచ్చే సాంప్రదాయాన్నీ, రంగువల్లులు తీర్చిదిద్దటాన్నీ కొనసాగిస్తున్నారు.

చిరిగిన శ్రీవారి వస్త్రం

ఇలా కొంతకాలం గడిచాక, ఒకనాటి రాత్రి శ్రీవారు యథాప్రకారం ఏకాంతసేవ పూర్తయిన తరువాత, వెంగమాంబ ఇంటికి వెళ్ళి, ఊయలలో ఊగుతూ, ఆమె చెప్పే భాగవతం మైమరచి వింటున్నారు. ఆమె ఓ మంచి ఘట్టం చదువు తుండగా స్వామివారు తెల్లవారు ఝామున మూడు గంటలకు సుప్రభాతసేవ కోసం, ఉయ్యాల దిగి వెళ్ళిపో బోయారు. శ్రీవారి సామీప్యంలో మరికొంత సేపు ఉండాలన్న ఉబలాటంతో వెంగమాంబ స్వామివారి పంచె పట్టుకొని వారించబోగా, శ్రీవారు, "*నీలాగే ఎందరో భక్తులు ఉన్నారు. వారందర్నీ అనుగ్రహించాలి కదా*!!" అంటూ, అప్పటికే సుప్రభాతసేవకు కాలాతీత మవ్వడంతో, ఒక్క ఉదుటున లేచి విసవిసా ఆనందనిలయం లోనికి వెళ్ళిపోయారు. దాంతో, శ్రీవారి పంచె సగానికి చిరిగి, ఒక ముక్క వెంగమాంబ చేతిలో చిక్కుకు పోయింది.

సుప్రభాతానంతరం, అర్చకులు దర్శనానికెళితే, స్వామివారు సగం చిరిగిన పట్టుపంచెతో దర్శనమిచ్చారు. అర్చకులందరూ కొంచెం సేపు కంగారు పడినా, అంతలోనే తేరుకుని, అది దొంగతనం కాదనీ, ఎవరో భక్తుల ద్వారా ఇలా జరిగిందనీ, స్వామివారితో అంతటి సాన్నిహిత్యం కలిగింది వెంగమాంబే అయి ఉంటుందనీ నిర్ధారించుకున్నారు. అందరూ కలిసి వెంగమాంబ ఇంటికి వెళ్ళి ఆరా తీయగా అసలు విషయం బయట పడింది. ఆమె, పూజాగృహంలో అపురూపంగా భద్రపరిచిన పట్టుపంచె చిరిగిన భాగాన్ని కళ్ళకద్దుకుంటూ, అర్చకులకు అప్పగించింది.

మనం గత రెండు రోజులుగా చెప్పుకున్న అనేక మహిమాన్వితమైన సంఘటనల ద్వారా వెంగమాంబ పేరు సర్వ వ్యాపితమైంది. ఎందరెందరో సంస్థానాధీశులు, జమీందార్లు, భూస్వాములు, సామాన్యులు ఆమెకు భక్తులుగా, శిష్యులుగా మారి ఆమెకు లెక్కలేనన్ని మడి మాన్యాలను ఈనాములుగా సమర్పించారు.ఆ యావత్తు సంపదనూ ఆమె భక్తులకోసమే వెచ్చించేది. అన్నసత్రాల నిర్వహణ, చలివేంద్రాల ఏర్పాటు, బ్రహ్మోత్సవాల్లో యాత్రికులకు ప్రత్యేక సదుపాయాలు వంటివి విరివిగా చేపట్టేది. ఆకొన్నవారికి లేదనకుండా ఆమె చేసిన అన్నదాన స్ఫూర్తితోనే తి.తి.దే. వారు, నేడు ప్రపంచంలోనే నభూతోనభవిష్యతి అన్న చందంగా, నిత్యాన్నదాన పథకాన్ని ఆమె పేరు మీద చేపడుతున్నారు. తూర్పు మాడవీధికి ఆనుకుని ఉన్న మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాదకేంద్రం గురించి మనందరికీ సుపరిచితమే.

ధార్మిక కార్యక్రమాలు

దాన కార్యక్రమాలతో పాటు, ధార్మిక కార్యక్రమాలు కూడా వెంగమాంబ వైభవోపేతంగా నిర్వహించేది. బాల్యంలో తన ఇష్టదైవమైన నృసింహస్వామి జయంత్యుత్సవాలను తిరుమలలో పదిరోజుల పాటు స్వయంగా జరిపించేది. అందువల్లే, నేటికీ తిరుమలలో జరిగే నృసింహోత్సవాల్లో ఉభయ నాంచురలతో కూడిన మలయప్పస్వామి వారు వెంగమాంబ ఇంటికి వేంచేసి నివేదనలందు కుంటారు.

సాహిత్యసేవ

ఆమె దాన–ధార్మిక కార్యకలాపాలలో పాల్గొంటూనే, అమోఘమైన సాహిత్య సాధన కూడా చేశారు. ఆమె రచించిన గ్రంథం ప్రతులు తయారు చేయడం కోసం, "అష్టఘంటములు" అనే పేరుతో ఎనిమిది మంది "వ్రాయసకాండ్ర" ను (అంటే, నేటి కాలంలో స్క్రైబ్స్ అన్నమాట) నియమించింది. వెంగమాంబ విరచిత గ్రంథ ప్రతులను అప్పటి వెంకటగిరి, శ్రీకాళహస్తి, కార్వేటినగర సంస్థానాధీశులు జ్ఞానసముపార్జనార్థం తెప్పించుకొనే వారు.

తుంబుర తీర్థానికి ప్రస్థానం

అసమాన ప్రజ్ఞా ధురీణి, బహుముఖప్రజ్ఞాశాలిని అయిన ఆమెను దర్శిస్తే జన్మ ధన్యమౌతుందని భావించి తండోప తండాలుగా భక్తులు వెంగమాంబ వద్దకు వచ్చేవారు. ఇలా భక్తజనం క్రిక్కిరిసి పోవడం తన ఆధ్యాత్మిక సాధనకు ఆటంక మవుతోందని, దానికేదైనా మార్గాంతరం శెలవీయమని ఆ శ్రీనివాసుణ్ణి వేడుకొంది. తనలో ఐక్యం చేసుకొమ్మని కూడా ఆ పరంధాముణ్ణి ప్రార్థించింది. ఆ సమయమింకా ఆసన్న మవ్వలేదనీ, ఆమె మరి కొన్నాళ్ళు ఇహలోకంలోనే ఉండాలని సూచించిన సప్తగిరీశుడు ఆమె ప్రశాంతంగా తపస్సు నాచరించుకోవడం కోసం ఆలయానికి పన్నెండు మైళ్ళ దూరంలో ఉన్న తుంబురతీర్థం అనే పవిత్రమైన, జన సందోహానికి దూరంగా ఉండే ప్రశాంతమైన ప్రదేశాన్ని సూచించాడు. అక్కడ ఉన్న ఓ పర్వతగుహను చూపుతూ, "వెంగమాంబా! నీవు పగలంతా నిశ్చింతగా సాధన చేసుకొని, ఈ గుహలోని సొరంగ మార్గం ద్వారా, అన్యులకు కానరాకుండా, ఆనందనిలయం లోనికి వచ్చి నన్ను ఆరాధించుకో" అంటూ ఆదేశించాడు. ఆ గుహను సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే, ప్రత్యేక ఉత్సవ సందర్భంగా అనుమతింపబడే తుంబురతీర్థ సమీపంలో నేటికీ మనం చూడవచ్చు. తుంబురతీర్థ ప్రాశస్త్యం గురించి మరోసారి చెప్పుకుందాం.

మూర్ఛిల్లిన మహంతు

ఆనాటి నుండీ, వెంగమాంబ, బంగారువాకిలి మూసిన తరువాత, తుంబురతీర్థం నుండి బిలమార్గం ద్వారా వెళ్ళి ప్రతిరాత్రీ స్వామిని ఆరాధించేది. వాడిన పూలను సడలింపు చేసి, తాజాపూలతో పూజ చేసి, యథావిధిగా కర్పూరహారతి సమర్పించేది. ఇలా కొన్ని రోజులు గడచిన పిదప అర్చకులు, ప్రతిరోజూ తాము సమర్పించిన పూవులు

ప్రక్కకు నెట్టబడి, తాజా పూలు స్వామి పాదాల చెంత ఉండటం గమనించారు. మూసివేసిన ద్వారాల నుండి బంగారు వాకిలి లోనికి ప్రవేశించడం మానవమాత్రుల వల్ల కాని పని. ఇదెలా సాధ్యం?

ఈ రహస్యాన్ని ఛేదించటానికి అప్పటి మహంతు బంగారువాకిలి మూయక ముందే గర్భాలయంలోకి ప్రవేశించి ఆగంతుకుని కోసం కాపు కాశాడు. సరిగ్గా అర్థరాత్రి సమయంలో శ్రీవారి పాదాలముందు ఒక బిలం ఏర్పడగా, అందులోనుండి దివ్యకాంతులు వెదజల్లుతూ, పూజాద్రవ్యాలతో పైకి వచ్చింది వెంగమాంబ!

కళ్ళు మిరిమిట్లు గొలిపే ఆ ప్రకాశాన్ని చూడలేక మహంతు మూర్ఛిల్లాడు. మరునాడు సుప్రభాత సేవానంతరం, తెప్పరిల్లిన మహంతు తాను రాత్రి చూసిన ఉదంతాన్నంతా పూసగుచ్చినట్టు విశద పరిచాడు. వెంగమాంబ తిరుమలలోనే ఉంటూ, ఆనందనిలయానికి రోజూ వచ్చి వెళుతుందని గ్రహించిన భక్తులు ఆమె కోసం వాగూ వంకా, చెట్టూ పుట్టా గాలించడం మొదలు పెట్టారు. కానీ ఆమె ఆచూకి తెలుసుకోవడం అంత సులభం కాలేదు.

కుష్టువ్యాధి నుండి ఉపశమనం పొందిన విప్రుడు

ఇదిలా ఉండగా, తిరుమల క్షేత్రానికి భయంకర కుష్టువ్యాధితో బాధపడుతున్న ఓ విప్రుడు వచ్చాడు. వడలంతా పుండ్లతో, దుర్వాసన వెలువడడంతో కుటుంబ సభ్యులందరూ అతన్ని వెలివేశారు. దిక్కు తోచని స్థితిలో ఆ బ్రాహ్మణుడు శ్రీవారిని చివరిసారిగా దర్శించుకొని, వారి సన్నిధిలో ప్రాణాలు వదలాలని అత్యంత ప్రయాసకోర్చి తిరుమల క్షేత్రం చేరుకున్నాడు. కానీ అక్కడ కూడా ఆయన భక్తుల, ఆలయాధికారుల తిరస్కారానికి గురై; ఒకవైపు శరీరబాధ, మరొక వైపు ఆకలిబాధ తట్టుకోలేక పోయాడు. వాడవాడలా తిరుగుతూ, ఆత్మహత్య చేసుకోవాలనే దృఢసంకల్పంతో (అదృష్టవశాత్తూ) తుంబురతీర్థం చేరుకున్నాడు. అలవికాని బాధతో బిగ్గరగా రోదిస్తుంటే, అతని ఆక్రందన ఆ నిర్జనారణ్యంలో ప్రతిధ్వనించింది. ఆ ఆర్తనాదంతో ధ్యానభగ్నం కలిగిన వెంగమాంబ గుహలో నుండి బయటకు వచ్చి అతని దీనావస్థను గమనించింది. ఆ దీనుణ్ణి ఆదుకోవలసిందిగా ఆ ఆర్తత్రాణపరాయణుణ్ణి వేడుకొని, అతనికి తియ్యని ఫలాలను తింటానికి ఇచ్చింది. క్షుద్బాధ తీరిన ఆ విప్రునికి, శేషాచలవాసుని కృపతో అతని బాధ తీరుతుందని అభయమిచ్చింది. అయితే, తన ఉనికిని ఎవ్వరికీ తెలియపరచరాదనీ, నోరుజారితే తల వెయ్యి ప్రక్కలవుతుందని హెచ్చరించి పంపింది. వెంగమాంబ బాధోపశమన వాక్కులకు ఆనందాతిశయంతో కనులు మూసుకున్న ఆ విప్రుడు, కళ్ళు తెరిచేటప్పటికల్లా "స్వామిపుష్కరిణి" లో తేలాడు. నీటిలో నుంచి లేచిన అతడు, తన శరీరాన్ని తడిమి చూసుకుని ఆశ్చర్యానందాలతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. పుళ్ళు మటుమాయ మయ్యాయి, శారీరకబాధ శాంతించింది. వెంగమాంబనూ, శ్రీనివాసుణ్ణీ పరిపరి విధాలా, మనసులోనే కీర్తించాడు. అయితే, ఆ బ్రాహ్మణుడు ఎక్కువకాలం ఆ రహస్యాన్ని దాచలేక పోయాడు.

విప్రుని మరణం

ఆ విప్రుడు కుష్టువ్యాధి గ్రస్తునిగా ఉన్నప్పుడు చూసిన కొందరు భక్తులు, అతని వ్యాధి అత్యంత శీఘ్రంగా నయమవ్వటంలోని రహస్యాన్ని బహిర్గత పరచమని ఒత్తిడి చేయసాగారు. అతనిని సిద్ధపురుషుడిగా ప్రశంసించ

సాగారు. వారి పొగడ్తలకు ఉబ్బిపోయిన బ్రాహ్మణుడు తనకు గలిగిన భాగ్యాన్ని అందరికీ చాటిచెప్పాలనే అత్యుత్సాహంతో, వెంగమాంబ ఆనతిని అతిక్రమించి, అసలు విషయం అందరికీ చెప్పేశాడు. మెచ్చుకోలు మాటలకు మానవుడు ఎంతటికైనా తెగిస్తాడు మరి.

మహా తపస్విని వెంగమాంబ శాపం ఊరికే పోతుందా? ఒక్క తృటిలో ఆ బాపని తల ముక్కచెక్కలై ప్రాణాలు వదిలాడు.

సమాధి నొందిన వెంగమాంబ

విప్రుని అనాలోచిత ప్రవర్తనతో వెంగమాంబ ఉనికి బహిర్గతమై పోయింది. భక్తజనమందరూ తుంబురకోన బాట పట్టడంతో, అక్కడ కూడా వెంగమాంబకు ప్రశాంతత కరువైంది. అలాంటి సమయంలో, ఒకనాటి రాత్రి ఆనందనిలయం చేరుకున్న వెంగమాంబ మరలా శ్రీవారితో మొర పెట్టుకుంది. అపరిమిత జన సంచారంతో తుంబురతీర్థం కూడా అలజడిగా ఉందనీ, తనను అక్కడ నుంచి కూడా తప్పించమని అనేక విధాలుగా ఆనందనిలయుణ్ణి వేడుకొంది. ఆమె మొరనాలకించిన శ్రీనివాసుడు వెంగమాంబతో "ఇక మీదట నిన్ను నానుంచి వేరుగా ఉంచటం భావ్యంకాదు. అందువల్ల నువ్వు తీవ్రమైన సమాధినిష్టలో ప్రవేశించు. ఆ సమాధి నుండే, ప్రతిరాత్రీ దివ్యతేజోరూపంతో ఆనందనిలయానికి వచ్చి నన్ను సేవించుకో" అని ఆనతిచ్చారు. పరమానందం చెందిన వెంగమాంబ, శ్రీవారి ఆజ్ఞ ననుసరించి, తుంబురకోనను విడిచి, తిరిగి తిరుమల వీధుల్లో ప్రవేశించి, తనకు అంతిమ కాల మాసన్నమైందనీ, శ్రీవేంకటేశ్వరుడు తనను పిలుస్తున్నాడనీ, అందువల్ల సమాధిలో ఉంటూ సిద్ధి పొందుతాననీ అందరికీ తెలియ పరచింది. ఆ ప్రకారమే, 1817 సం. లో, సహస్రచంద్రదర్శనం (వెయ్యి పున్నమిలు – అంటే సుమారుగా 83 సంవత్సరాలు జీవించిన వారు సహస్రచంద్రదర్శనం చేసినట్లు భావిస్తారు) చేసిన ఆ వృద్ధ తపస్విని, ఈశ్వరనామ సంవత్సరం, శ్రావణశుద్ధ నవమి నాడు సమాధిలో ప్రవేశించింది. అనంతరం, ఆమె ఆజ్ఞానుసారం, ఆ సమాధిని సుగంధ ద్రవ్యాలతో మూసివేసి, ఆ ప్రదేశంలో తులసీ బృందావనాన్ని ఏర్పాటు చేశారు.

వెంగమాంబ బృందావనం

వెంగమాంబ బృందావనాన్ని నేటికీ మనం తిరుమలలో దర్శించుకోవచ్చు. ఆదివరాహస్వామి కాటేజీల వెనుక ఉన్న చిన్న రోడ్డులో, వెంగమాంబ జూనియర్ కాలేజీ ఆవరణలో ఆమె బృందావనం ఉంది. ఆ బృందావనంపై తొలిసారిగా అరణ్యమార్గంలో తిరుమల చేరుకున్నప్పుడు దారిలో ఆమెను రక్షించిన "సంతకాపు మొగిలిపెంట" ఆంజనేయస్వామి వారి చిన్న విగ్రహం కూడా ప్రతిష్ఠించబడింది.

నేటి తరిగొండ గ్రామం

తరిగొండ గ్రామం నందలి తి.తి.దే. ఆధ్వర్యంలోని దేవాలయంలో ఆమె చిన్నప్పుడు పూజించిన ఆంజనేయస్వామి మరియు నృసింహస్వామి మూర్తులనూ ఇప్పటికీ చూడవచ్చు. స్థానికుల కథనం ప్రకారం, ఆంజనేయుడి విగ్రహం

వెనుకనున్న ఓ బిలమార్గం ద్వారా ఆమె తిరుమలకు చేరుకుంది. దేవాలయంలో రాతిపలకలతో కప్పబడి వున్న ఆ బిలద్వారాన్ని, దేవాలయానికి సమీపంలో దేవతార్చన నీటి కోసం ఆమె ఉపయోగించిన దిగుడుబావిని కూడా నేడు చూడవచ్చు.

గ్రంథరచన

ఆమె వ్రాసిన **వేంకటాచలమహాత్మ్యం** అనే గ్రంథం పారాయణ చేస్తే, పెళ్ళి కానివారికి సత్వరమే వివాహ మవుతుందని ప్రతీతి. తిరుమల చరిత్రకు సంబంధించి, ఇప్పటికీ ఆ గ్రంథమే అత్యంత ప్రామాణికంగా భావింప బడుతుంది. సుమారు రెండువేల పద్యాలతో అలరారే ఈ గ్రంథప్రతులను వ్రాయసకాండ్రతో తయారు చేయించుకోవడం కోసం తిరుమల యాత్రికులు రోజులతరబడి వేచిఉండే వారంటే, దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు. తరువాత అనేక గ్రంథాలు వెలువడినా, ఆ గ్రంథ ప్రాశస్త్యం అలాగే కొనసాగుతోంది.

ఆ సాహితీ సార్వభౌమురాలి కలం నుండి **అష్టాంగరాజయోగం**, **ముక్తికాంతావిలాసం**, **గోపికానాటకం**, **జలక్రీడావిలాసం**, **వాశిష్ఠరామాయణం**, **రుక్మిణీకళ్యాణం**, **శ్రీకృష్ణమంజరి** లాంటి గ్రంథాలు; అనేక నాటకాలు, ద్విపదలు, వేదాంతగ్రంథాలు, మరెన్నో వెలువడ్డాయి.

ఆ తెలుగింటి ఆడబడుచు గురించి మనకు తెలిసింది చాలా తక్కువ!

తరతరాలకూ తరగని తెలుగువారి పెన్నిధి తరిగొండ వెంగమాంబ, ప్రతి వేంకటేశ్వరుని భక్తునికీ ప్రాతఃస్మరణీయురాలు.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవితచరిత్రకు సంబంధించి తిరుమల లోనూ, తరిగొండలోనూ నేటికీ సజీవంగా ఉన్న ప్రతి జ్ఞాపికనూ దర్శించుకునే భాగ్యం కలగటం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం.

స్వామివారి సపరిచర్యల్లోనూ, దాన–ధర్మ–సాహిత్య సాధనల్లోనూ అగ్రగామిగా వర్థిల్లిన ఆ ధన్యజీవి జీవితచరిత్ర సమాప్తం.

----------: : ----------

శ్రీవారి ఆలయవైశిష్ట్యం

"వేంకటాద్రి సమస్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి"

అనగా "విశ్వంలో తిరుమలకు సమానమైన పుణ్యక్షేత్రం లేదనీ, గతంలోగానీ, వర్తమానంలోగానీ, భవిష్యత్తులోగానీ శ్రీవేంకటేశ్వరునితో సరితూగ గల దేవుడు లేడని" అర్థం. అటువంటి దైవం నివసించే "బంగారుమేడ" నిర్మాణవైశిష్ట్యం గురించి మనం తెలుసుకోబోతున్నాం. శ్రీవారి ఆలయానికి మరోపేరే **బంగారు మేడ.**

శ్రీవారి ఆలయ నిర్మాణ వైశిష్ట్యం

సప్తగిరులు, అంటే – శేషాచలం, గరుడాచలం, వేంకటాచలం, నారాయణాచలం, వృషభాచలం, నీలాచలం, అంజనాచలం – అనే ఏడుకొండల శిఖరశ్రేణుల మధ్య కొలువైన శ్రీవారి ఆలయం, మూడు ప్రాకారాలు–మూడు ప్రదక్షిణ మార్గాలతో విరాజిల్లుతోంది. అయితే, కేవలం వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో మాత్రం తెరిచివుంచే వైకుంఠ ద్వారంతో కలుపుకుంటే, నాలుగు ప్రాకారాలు, నాలుగు ప్రదక్షిణ మార్గాలుగా చెప్పుకోవచ్చు.

అ ప్రాకారాలు వరుసగా:

1. మొదటి ప్రాకారము లేదా మహా ప్రాకారము
2. రెండవ ప్రాకారము లేదా సంపంగి ప్రాకారము
3. మూడవ ప్రాకారము లేదా విమాన ప్రాకారము
4. నాలుగవ ప్రాకారము లేదా వైకుంఠ ప్రాకారము

ప్రతి ప్రాకారం చుట్టూ ఉన్న ప్రదక్షిణ మార్గాలను కూడా అవే పేర్లతో పిలుస్తారు.

ఒకటవ ప్రాకారానికి చుట్టూ, దేవాలయానికి బాహ్యంగా ఉన్న ప్రదక్షిణ మార్గాన్ని **మహా ప్రదక్షిణమార్గం**,
మొదటి మరియు మరియు రెండవ ప్రాకరాల మధ్యభాగాన్ని **సంపంగి ప్రదక్షిణ మార్గం**,
రెండవ మరియు మూడవ ప్రాకారాల మధ్యభాగాన్ని **విమాన ప్రదక్షిణమార్గం**,
మూడవ మరియు నాల్గవ ప్రాకారాల మధ్యభాగాన్ని **వైకుంఠ ప్రదక్షిణమార్గం** అంటారు.

మొదటి మూడు ప్రదక్షిణ మార్గాలూ మనకు సుపరిచితమే గానీ, మహద్భాగ్యంగా చెప్పుకోబడే, వైకుంఠప్రదక్షిణ మార్గం చూడగలగటం మాత్రం అత్యంత అరుదుగానే జరుగుతుంది. వీటన్నిటి గురించీ వీలైనంత వివరంగా తెలుసుకుందాం.

మహా ప్రదక్షిణమార్గం

సుమారు ముప్పై అడుగుల ఎత్తు, 1354 అడుగుల చుట్టుకొలతతో, దీర్ఘచతురస్ర ప్రాకారం చుట్టూ ఉండే ప్రదక్షిణ

మార్గాన్ని మహాప్రదక్షిణమార్గం గా పిలుస్తారు. తూర్పు-పడమరల పొడవు ఎక్కువగానూ, ఉత్తర-దక్షిణాల వెడల్పు తక్కువగానూ ఉంటుంది. అంటే, లోతు ఎక్కువగా ఉంటుందన్నమాట. ఈ ప్రదక్షిణ పూర్తిచేస్తే, మనం ఆలయాన్నీ, ఆలయ వెనుకభాగంలో ఉండే ప్రేక్షక గ్యాలరీలను, లడ్డూ కౌంటర్లనూ, ఆదివరాహస్వామి ఆలయాన్నీ, స్వామిపుష్కరిణినీ ఓ మారు చుట్టినట్లే. అంటే, ఈ మహాప్రాకారాన్ని చుట్టి ఉండే, విశాలమైన తూర్పు-దక్షిణ-పడమర-ఉత్తర మాడవీధుల్లో, సవ్యదిశగా సంచరిస్తా మన్నమాట. స్వామివారి ఊరేగింపులన్నీ ఈ మాడవీధుల్లోనే జరుగుతాయి.

ఈ మాడవీధులన్నీ ఒక్కప్పుడు చాలా ఇరుకుగా ఉండేవి. అయితే, కాలం గడుస్తున్నకొద్దీ, వీటిని వెడల్పుగా, అధునాతనంగా, శ్రీవారి ఉత్సవరథాలు నిరాటంకంగా తిరగటానికి వీలుగా తీర్చిదిద్దారు. కానీ, ఆ వీధుల్లో ఉండేటువంటి శిల్పకళ ఉట్టిపడే అనేక మంటపాలు, కట్టడాలు కనుమరుగయ్యాయి. సుమారు 15 సంవత్సరాల క్రితం వరకూ కూడా, ఆలయానికి ఎదురుగా, చాలా సందడిగా ఉండే "వెయ్యికాళ్ళ మంటపం" మనకు సుపరిచితమే. ఇప్పుడది కాలగర్భంలో కలిసిపోయింది.

ఈ నాల్గు మాడవీధుల కలయికతో ఏర్పడే చతుర్భుజికి ఆగ్నేయమూలలో స్వామివారి మందిరం కొలువై ఉంటుంది.

ఈ మహాప్రదక్షిణమార్గంలో ఉండే విశేషాల్ని ఇప్పుడు తెలుసుకుందాం.

ఆలయ మొదటి ప్రాకారం లేదా మహాప్రాకారాన్ని అనుసంధానిస్తూ, ఆలయానికి తూర్పుగా మహాద్వారం, దానికి ఎదురుగా, ఆలయానికి వెలుపల గొల్లమంటపం ఉంటాయి. వీటి గురించి తరువాత తెలుసుకుందాం.

తూర్పు మాడవీధిలో, మహాద్వారానికీ మరియు గొల్లమంటపానికి మధ్య నిలబడి, దక్షిణదిశగా వెళితే, మాడవీధి చివరగా, ప్రాచీనమైన పాతసహస్రదీపాలంకరణ సేవ మంటపం వస్తుంది. సాధారణ సమయాల్లో ఈ మంటపం మూసివేసి ఉంటుంది. సహస్రదీపాలంకరణ సేవను ప్రస్తుతం ప్రక్కనే ఉన్న విశాలమైన మంటపంలో చేస్తున్నారు. ఆ పాతమండపం వెనుక హాథీరాంబాబా మఠం ఉంటుంది.

తూర్పుమాడవీధి చివరినుంచి కుడిప్రక్కకు తిరిగి, దక్షిణమాడవీధి లో ప్రవేశించి తిన్నగా వెళితే, మొదటగా ఎడం ప్రక్కన "సుపథం" మార్గం కనపడుతుంది. అది దాటగానే, సంపంగి వృక్షాలనీడలో తిరుమలనంబి ఆలయం, దాని తరువాత క్యూ కాంప్లెక్స్ నుండి ఆలయానికి వెళ్ళే ఓవర్ బ్రిడ్జి కనపడతాయి. శ్రీవారి ఆలయప్రాకార అందాల్నీ, సమున్నతంగా నిలిచే ఆ కుడ్యం యొక్క రాచఠీవిని దగ్గరనుంచి చూసి తరించాలంటే, అది దక్షిణమాడవీధిలోని ప్రథమార్థభాగం నుండి మాత్రమే సాధ్యం. దర్శనానికి క్యూలో వెళుతున్నప్పుడు, ఓవర్ బ్రిడ్జి నుంచి కనువిందు చేసే ఆలయ కుడ్యభాగం ఇదే.

దక్షిణమాడవీధిలో తిన్నగా వెళ్ళి కుడిప్రక్కకు తిరిగితే పడమర మాడవీధి లోకి ప్రవేశిస్తాము. వెంటనే మనకు "చిన్నజియ్యంగారిమఠం", "గోవిందనిలయం" అనబడే అర్చకుల క్వార్టర్సు కనబడతాయి.

తిన్నగా వెళ్ళి మరలా కుడి ప్రక్కకు తిరిగి ఉత్తరమాడవీధి లోకి ప్రవేశించగానే, వరుసగా లక్ష్మీనరసింహస్వామి

ఆలయం (ఈయన భోగనరశింహుడు. యోగనరశింహుడు విమాన ప్రదక్షిణంలో ఉంటారు), వైఖానస అర్చకనిలయం, స్వామిపుష్కరిణి, ఆదివరాహస్వామి ఆలయం, వ్యాసరాజ ఆహ్నీకమండపం, వాటికి ఎదురుగా వైఖానస ఆగమ శాస్త్రానికి మూలపురుషుడైన విఖనసమహర్షి ఆలయం, ప్రక్కనే రాధాగోపాల ఆలయం, దాన్ని ఆనుకుని చదువులతల్లి సరస్వతికే గురువైన హయగ్రీవుని ఆలయం కనపడతాయి.

అవి దాటి మళ్ళా కుడిప్రక్కకు తిరిగి తూర్పు మాడవీధి లోకి ప్రవేశించి తిన్నగా వెళితే ఆలయమహాద్వారం వస్తుంది. అంటే, మనం మహాప్రదక్షిణ పూర్తి చేసుకుని, బయలుదేరిన చోటికే తిరిగి చేరుకున్నా మన్నమాట. ఈ ప్రదక్షిణ మార్గంలో, ఆదివవరాహుని ఆలయం, స్వామిపుష్కరిణి, వ్యాసరాజమంటపం తప్ప మిగతావన్నీ మనకు ఎడం ప్రక్కనే ఉంటాయి.

తూర్పుమాడవీధిలో స్వామిపుష్కరిణి ఉన్న ప్రాంతం, తూర్పు-దక్షిణ మాడవీధుల కలయికలో ఆలయం ఉన్న ప్రాంతాన్ని మినహాయిస్తే, మాడవీధుల మిగిలిన ప్రాంతమంతా, ఇరువైపులా, విశాలమైన ప్రేక్షక గ్యాలరీలు ఉంటాయి. బ్రహ్మోత్సవసమయంలో ఈ గ్యాలరీలన్నీ, స్వామివారి వాహనసేవలను చూడటానికి వేచిఉండే లక్షలాది భక్తులతో క్రిక్కిరిసి ఉంటాయి. బ్రహ్మోత్సవాల గురించి మరోసారి వివరంగా తెలుసుకుందాం.

మహాద్వార గోపురం

మహాప్రాకారాన్ని అనుసంధానిస్తూ ఉన్న ద్వారమే మహాద్వారం. ఇదే ఆలయం యొక్క ప్రవేశ ద్వారం. ఇది తప్ప ఆలయం లోనికి ప్రవేశించటానికి వేరే మార్గంలేదు. దీనికే "పడికావలి", "సింహద్వారం", "ముఖద్వారం", తమిళంలో "పెరియ తిరువాశల్ (పెద్దవాకిలి)", అంటూ అనేక పేర్లు ఉన్నాయి. ఈ పెద్దవాకిలికి 1996వ సం. లో ఇత్తడిరేకు తాపడం చేయబడిన కారణంగా, దీన్ని "ఇత్తడివాకిలి" అనికూడా పిలుస్తారు. స్వామివారిని దర్శించే భక్తులు ఒకటవ వైకుంఠం క్యూ, లేదా రెండవ వైకుంఠం ద్వారా మాత్రమే వచ్చి, ఈ మహాద్వారం గుండా, ముందుగా దేవస్థానం వారు ఏర్పాటు చేసిన నిరంతరం ప్రవహించే నీటితో పాద ప్రక్షాళన చేసుకొని, ఆలయంలోకి ప్రవేశించాలి. ఈ మార్గానికి, అత్యద్భుత శిల్పకళ ఉట్టిపడుతూ, సమాంతరంగా ఉండే రెండు రాతి ద్వారాలు ఉన్నాయి. బయటవైపు ద్వారానికి, రెండు పెద్ద చెక్కవాకిళ్ళు (తలుపులు) అమర్చబడి ఉన్నాయి. ఉత్తరంవైపు ఉన్న పెద్దవాకిలి నందుండే చిన్న తలుపులో నుంచి, మహాద్వారం మూసిఉండే సమయంలో సిబ్బంది రాకపోకలు సాగిస్తారు.

ఈ మహాద్వారం పైన శిల్పకళా చాతుర్యం ఉట్టి పడుతూ, యాభై అడుగుల ఎత్తుతో, ఐదు అంతస్తులతో, శ్వేతవర్ణంతో, సప్త కలశాలతో శోభితమైన రాజగోపురం లేదా మహాద్వారగోపురం విరాజిల్లుతూ ఉంటుంది. ఉత్సవసమయాల్లో పుష్పాలంకృతమై, విద్యుద్దీపాల కాంతిలో మరింత శోభాయమానంగా ఉంటుంది. 13వ శతాబ్ధంలో ప్రారంభమైన ఈ రాజగోపుర నిర్మాణం, తరువాతి కాలంలో అంచెలంచెలుగా పూర్తైనట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

శంఖనిధి – పద్మనిధి

పాదప్రక్షాళన చేసుకోగానే, ఆలయ మహాద్వారానికి ఇరువైపులా దిగువభాగంలో, సుమారు రెండు అడుగుల

పంచలోహ విగ్రహాలు కనిపిస్తాయి. వీరు శ్రీవారి సంపదను సంరక్షించే దేవతలు. ఆనందనిలయుని అంతులేని ఆస్తుల్ని అమరులే రక్షించాలి గానీ, అల్పమానవుల్ల అవుతుందా?

ఇతిహాసాల ప్రకారం, ఒకానొకప్పుడు కుబేరుడు ఘోరమైన తపస్సు చేసి బ్రహ్మదేవుడి నుండి శంఖనిధి, పద్మనిధి, పుష్పకవిమానాలను వరాలుగా పొందాడు. శ్రీవారికి, పద్మావతీ పరిణయ సందర్భంలో తాను అప్పుగా ఇచ్చిన 14 లక్షల బంగారు నాణాల్ని వడ్డీతో సహా తిరిగి తీసుకునే నిమిత్తం, కుబేరుడే ఆ బ్రహ్మదత్త దేవతలను శ్రీవారి సంపదలకు కాపుంచాడని కొందరి విశ్వాసం.

ఇందులో, ఎడమవైపు, అంటే దక్షిణదిక్కులో ఉండే రక్షకదేవతయైన శంఖనిధి రెండు చేతుల్లో రెండు శంఖాలు ఉంటాయి. మందిరంలోకి ప్రవేశించేటప్పుడు, ఈ దేవతను స్పృశించి నమస్కరించుకోవచ్చు. కుడి వైపున ఉండే దేవత పద్మనిధి రెండు చేతుల్లో రెండు పద్మాలు ఉంటాయి. క్యూ నిబంధన కారణంగా, దేవాలయం లోంచి బయటకు వెళ్ళేటప్పుడు మాత్రమే ఈ దేవతను స్పృశించగలం.

ఈ నిధిదేవతల పాదాలవద్ద, ఆరంగుళాల ఎత్తుగల, నమస్కారభంగిమలో ఉన్న విజయనగర రాజైన అచ్యుతరాయలు విగ్రహాన్ని చూడవచ్చు. దీన్ని బట్టి ఈ విగ్రహాల్ని ఆ రాజే ప్రతిష్ఠించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆగమశాస్త్రనుసారం, ఈ నిధిదేవతలను ఆలయానికి మూడవ ప్రాకార ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేయడం సాంప్రదాయం.

అనంతాళ్వార్ గడ్డపార (గునపం)

పడికావలి దాటగానే, దేవాలయంలోకి వెళ్తుంటే, అంటే ద్వారానికి ఉత్తరంవైపు పై భాగంలో, ఈ గునపం, గోడకు వ్రేలాడదీయబడి ఉంటుంది. ఇది సుమారు వెయ్యి సంవత్సరాలు ప్రాచీనమైనది. దీనికి సంబంధించి, అత్యంత ఆసక్తికరమైన కథను శ్రీవారి మహాభక్తుడు అనంతాళ్వార్ చరిత్రలో వివరంగా తెలుసుకున్నాం. సాక్షాత్తూ శ్రీవారిని గాయపరచిన ఈ గునపాన్ని ఆలయంలోకి ప్రవేశించేటప్పుడు, బయటకు నిష్క్రమించేటప్పుడు తప్పక దర్శించండి.

మనకి తెలియకుండానే మనమిప్పుడు ఆలయంలోనికి, అంటే రెండవ ప్రదక్షిణ మార్గమైన సంపంగి ప్రదక్షిణ మార్గం లోనికి ప్రవేశించి, దేవదేవుని దర్శనం కోసం ఆతృతతో ఎదురు చూస్తున్నాం!

సంపంగి ప్రదక్షిణమార్గంలో ఎందరో రాజులు, చక్రవర్తులు శ్రీవారి మీద ఎనలేని భక్తితో కట్టించిన అనేక మండపాలు, వారివారి కాంశ్యప్రతిమలు మరెన్నో దర్శించదగ్గ ప్రదేశాలున్నాయి. ప్రతిమండపం, ప్రతి ప్రతిమ మనను చరిత్రలోతుల్లోకి తీసుకొని పోతుంది. ఆ విశేషాలన్నింటినీ రేపు తెలుసుకుందాం!

సంపంగి ప్రదక్షిణం

మహాద్వారం ముందు పాదప్రక్షాళణ చేసుకొని, శంఖనిధి–పద్మనిధిల మూర్తులకు నమస్కరించుకొని, అనంతాళ్వార్ గడ్డపారను దర్శించుకొని, మహాద్వారం గుమ్మాన్ని దాటగానే, మనం సంపంగి ప్రాకారంలోకి, అంటే మందిరంలోనికి ప్రవేశిస్తాము.

దేవాలయం యొక్క మహాప్రాకారం మరియు సంపంగి ప్రాకరం మధ్యన (అంటే మొదటి-రెండవ ప్రాకారాల మధ్యన) గల సుమారు 30 అడుగుల వెడల్పైన ప్రదక్షిణ మార్గాన్ని సంపంగిప్రదక్షిణం అంటారు. ఆలయంలోనికి ప్రవేశించిన వెంటనే ఉండే మొట్టమొదటి ప్రదక్షిణమార్గం ఇదే. లెక్క ప్రకారం ఇది రెండవ ప్రదక్షిణమార్గం అయినప్పటికీ, ఆలయం వెలుపలి మహా ప్రదక్షిణమార్గాన్ని ఆగమశాస్త్రం పరిగణించదు కాబట్టి, శాస్త్రరీత్యా, ఆలయానికి ఇదే మొదటి ప్రదక్షిణమార్గం. పూర్వం ఈ ప్రదక్షిణమార్గంలో స్వామివారి పుష్పకైంకర్యానికి ఉపయోగపడే సంపంగి లేదా చంపక వృక్షాలు విరివిగా ఉండటం చేత, ఈ మార్గానికి సంపంగి ప్రదక్షిణమార్గం లేదా చంపక ప్రదక్షిణమార్గం అనే పేర్లు ఏర్పడ్డాయి. పేరుకు ప్రదక్షిణమార్గమే అయినా, ప్రస్తుతం ఉన్న క్యూ ప్రతిబంధకాల కారణంగా ఈ మార్గం ద్వారా పూర్తి ప్రదక్షిణం చేయలేము. కేవలం తూర్పుమార్గం, దక్షిణ-ఉత్తర మార్గాల్లోని కొంతభాగం మాత్రమే మనం దర్శించుకోగలం.

కృష్ణరాయమండపం లేదా ప్రతిమామండపం

మహాద్వారాన్ని దాటగానే, మనం సంపంగి ప్రదక్షిణమార్గం లోని ప్రతిమామండపం లోనికి ప్రవేశిస్తాము. శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఉండటం వల్ల దీన్ని కృష్ణరాయమంటపమనీ, ఇంకా ఇతరుల ప్రతిమలు కూడా ఉండటం వల్ల ప్రతిమామండపం అనీ వ్యవహరిస్తారు. పదహారు స్తంభాలతో ఉన్న ఈ ఎత్తైన మంటపం విజయనగర వాస్తుశైలిలో నిర్మించబడింది. ఆలయంలోకి వెళుతూంటే, మహాద్వారానికి కుడిపక్క, ఉభయ దేవేరులైన తిరుమలదేవి- చిన్నాదేవి సమేతంగా శ్రీకృష్ణదేవరాయలు స్వామివారికి ఎదురుగా ప్రాంజలి ఘటిస్తూ , పడమరదిశలో నిలబడి దర్శనమిస్తాడు. రాయలవారే తమ విగ్రహాలను జనవరి 2, 1517వ తేదీన స్వయంగా ప్రతిష్ఠించుకున్నారు.

యావద్దక్షిణ భారతదేశాన్ని కంటిసైగతో శాసించిన ఆ చక్రవర్తినలా, అత్యంత నిరాడంబరంగా, నమస్కరిస్తూ చూస్తుంటే ఏమనిపిస్తుంది?

"కోటికి పడగెత్తినా ధనవంతుడూ, నీకృపకెన్నడూ సమపాత్రులూ... "

అన్న ఘంటసాల గీతం గుర్తుకు రావట్లేదూ?

ఆలయ అధికారులు తెలియక చేసిన తప్పులవల్ల భక్తులకేదన్నా అసౌకర్యం కలిగితే, వారి తరఫున రాయలవారు క్షమాభిక్ష అడుగుతున్నట్లుగా కూడా మనకు గోచరిస్తుంది. దర్శనానంతరం ఆలయం నుండి బయటకు వెళ్ళేటప్పుడు, మనకు ఎడం ప్రక్కగా, ఈ విగ్రహాల్ని దగ్గరగా చూడగలుగుతాం!

అలాగే, మహాద్వారానికి ఎడమ ప్రక్క నమస్కార భంగిమలో ఉన్న, చంద్రగిరి రాజైన వేంకటపతిరాయలవారి నిలువెత్తు కాంశ్యవిగ్రహం కూడా చూడచ్చు. ఈ విగ్రహానికి దక్షిణం వైపున అచ్యుతరాయలు, ఆయన రాణి వరదాజి అమ్మాణ్ణి ల నిలువెత్తు నల్లరాతి విగ్రహాలు నమస్కారభంగిమలో ప్రతిష్ఠించబడ్డాయి. ఈ రాజులందరూ శ్రీవారికి పరమభక్తులే కాక, దేవాలయపోషణకు అనేక మడులూ, మాన్యాలూ సమర్పించి చిరస్మరణీ యులయ్యారు. రాయలవారి ప్రతిమలు తప్ప, మిగతా విగ్రహాలన్నింటినీ మనం క్యూలో శ్రీవారి దర్శనార్థం వెళుతున్నప్పుడు, మనకు

ఎడం ప్రక్కగా చూడవచ్చు.

ఈ మండపం చూస్తూంటే, *"రాజులకైనా, రారాజులకైనా, సమస్తభోగభాగ్యాలూ ఆ శ్రీవారి చలవే. వారికి అందరూ వినమ్రంగా కృతజ్ఞతలు తెలుపాల్సిందే"* అన్న అలౌకికభావం కలుగుతుంది.

తులాభారం

ప్రతిమామంటపానికి సమీపంలో, ఎడంప్రక్కగా ఓ త్రాసు కనబడుతుంది. సంస్కృతంలో త్రాసును తుల అంటారు. భక్తుల శరీరబరువును త్రాసులో కొలుస్తారు కాబట్టి దీనిని తులాభారం గా పేర్కొంటారు. కోరిన కోర్కెలు సిద్ధించినవారు, తమ బరువుకు లేదా తమ కుటుంబసభ్యుల బరువుకు సరితూగేట్లుగా, తాము మ్రొక్కుకున్న ధనాన్ని లేదా ద్రవ్యాన్ని స్వామివారికి సమర్పిస్తారు. ఈ ద్రవ్యాల్లో ముఖ్యంగా కలకండ, బెల్లం, కర్పూరం మొదలైనవి ఉంటాయి. అదే, మ్రొక్కుకుంది ధనమైతే, తగినంత రొఖ్ఖం చెల్లిస్తే కావలసిన నాణాలను దేవస్థానం వారే సమకూరుస్తారు. నేటికీ, దక్షిణభారతదేశం లోని అనేక కుటుంబాల్లో, పసిపిల్లలకు శ్రీవారి ఆలయంలో తులాభారం జరిపించి సరిపడా ద్రవ్యాన్ని లేదా ధనాన్ని స్వామివారికి సమర్పించటం పరిపాటి.

ఇది కేవలం నాణాల సమర్పణ కాదు, శ్రీవారికి కృతజ్ఞతా పూర్వకంగా చేసుకునే "ఆత్మసమర్పణ" కూడా!

అద్దాలమంటపం

ఆలయంలోకి ప్రవేశిస్తుంటే కుడివైపున, రాయలవారి కాంశ్యప్రతిమకు ఎదురుగా ఉన్న విశాలమైన మండపమే అద్దాలమంటపం. దాన్నే ఉత్తరభారతీయులు "ఆయినామహల్" అనీ, తమిళులు "కన్నాడి అరై" అని పిలుస్తారు. అన్ని వైష్ణవాలయాల్లో విధిగా ఉండే ఈ అద్దాలమంటపం, శ్రీవారి ఆలయంలో ఓ ఎత్తైన రాతి అధిష్ఠానం మీద నిర్మింప బడివుంది. ఈ మంటపంలో "ముఖమంటపం", "అంతరాళం" అని రెండు భాగాలున్నాయి.

ముఖమండపంలో ఇదివరకు "ప్రసాద అరలు" ఉండేవి. ఈ అరల్లో అర్చకులు తమవంతుకు వచ్చే ప్రసాదాన్ని ఉంచి భక్తులకు విక్రయించేవారు. ఈ అరలు ఉండే ప్రాంతాన్ని "ప్రసాదం పట్టెడ" గా పిలుస్తారు. ప్రస్తుతం అర్చకుల వంతుకు వచ్చే ప్రసాదాలను కూడా దేవస్థానం వారే స్వీకరించి భక్తులకు ఉచితంగా, విక్రయాలద్వారా వేర్వేరు ప్రాంతాల్లో అందజేస్తున్నారు కాబట్టి "ప్రసాద అరలు" తీసివేయబడ్డాయి.

అతరాళం మధ్యలో, నాలుగు స్థంభాల నడుమ ఉన్న చతురస్రాకార వేదిక గోడలకూ, పై కప్పుకూ, అన్నివైపులా పెద పెద్ద అద్దాలు అమర్చబడ్డాయి. అలాగే, డోలోత్సవానికి అనువుగా గొలుసులు వ్రేలాడదీయబడి ఉన్నాయి. ఈ మంటపంలో ఉభయనాంచారుల సమేత మలయప్పస్వామికి డోలోత్సవం (ఊయలసేవ లేదా ఊంజల్ సేవ) జరుగుతున్నప్పుడు, స్వామివారి ప్రతిరూపం అద్దాల్లో అన్నిప్రక్కలా కనువిందు చేస్తూ, స్వామివారి సర్వవ్యాపకత్వానికి ప్రతినిధిత్వంగా గోచరిస్తుంది. ఈ అద్దాల మంటపంలో ప్రతి మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ డోలోత్సవం అర్జితసేవ. ఈ సేవలో పాల్గొనే భక్తులు మాత్రమే అంతరాళం దర్శించగలరు. సాధారణంగా, ముఖమండపం లోనికి

భక్తులను అనుమతించరు. అయితే, శ్రీవారి దర్శనానంతరం, ప్రసాదాలు స్వీకరించిన తరువాత చేతులు శుభ్రపరుచుకోవటానికి వెళ్ళేటప్పుడు, మనకు కడిప్రక్క నుంచి ఈ "ముఖమంటపాన్ని" దగ్గరగా చూడవచ్చు. ఉత్తరభారతదేశం నుండి వచ్చిన ఈ డోలోత్సవసేవా విధానం, మహంతులద్వారా శ్రీవారిఆలయంలో ప్రవేశపెట్టబడి ఉండవచ్చు. 1831వ సం. నుండి ఈ ఉత్సవం జరుగుతున్నట్లు ఆధారాలున్నాయి.

అన్నమాచార్యుని బాణిలో ఈ డోలోత్సవ శోభను వర్ణించుకుందాం:

"డోలాయాంచల డోలయాంహరే డోలాయాం
మీనకూర్మ వరాహ మృగపతి అవతారా
దానవారే గురశౌరే ధరణిధర మరుజనక...
శీరపాణే గోసమాణే శ్రీవేంకటగిరి కూటనిలయ"

రంగనాయకమండపం

అద్దాలమంటపానికి ఎదురుగా, ప్రతిమామండపం లోని వేంకటపతిరాయల విగ్రహానికి దగ్గర్లో, దర్శనానికి వెళ్ళేటప్పుడు మన ఎడమ ప్రక్కగా, ఎత్తైన శిలావేదికపై నుండే విశాలమైన మండపమే రంగనాయక మండపం లేదా, రంగమండపం. 108 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పు గల ఈ మంటపంలో శ్రీరంగనాథుడు కొన్నాళ్ళు కొలువై ఉన్నాడు కావున, ఆయన పేరు మీద ఇది "రంగమంటప" మైంది. 1320–1360 సం. ల మధ్య మహమ్మదీయ దండయాత్రల కారణంగా, శ్రీరంగక్షేత్రంలోని రంగనాయకుల ఉత్సవమూర్తులను, సురక్షితమైనదిగా భావింపబడే తిరుమల క్షేత్రానికి తెచ్చి, ఈ మండపంలో ఉంచి నిత్యపూజా నివేదనలు చేశారు. తరువాత విగ్రహాలను యథావిధిగా శ్రీరంగం తరలించారు. కేవలం శ్రీరంగనాథుని ఉత్సవ విగ్రహాలను ఉంచి పూజాదికాలు నిర్వహించటానికే ఈ మంటపాన్ని "రంగనాథయాదవరాయలు" అనే ఓ స్థానిక పాలకుడు నిర్మించాడు.

"రంగ రంగ రంగపతి రంగనాథా – నీ
సింగారాలె తరచాయ శ్రీ రంగనాథా...
వేంకటాద్రి మీద చేరి నన్ను కూడితివి
ఏవల చూచిన నీవే ఇటు రంగనాథా"

ఈ మండపంలో, "పెద్దశేషవాహనం" గా పిలువబడే ఏడు పడగల బంగారు శేషవాహనాన్ని కొద్ది దూరంగా, క్యూలోనుంచే దర్శించుకోవచ్చు. బ్రహ్మోత్సవాల మొదటి రోజున ఈ వాహనం మీదే స్వామివారు ఊరేగుతారు.

మలయప్పస్వామి వారు ఉభయదేవేరుల సమేతంగా, సంవత్సరానికి రెండు మార్లు – దసరా బ్రహ్మోత్సవాల్లో ఒకసారి, వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఒకసారి – ఈ మండపంలో కొలువై ఉంటారు.

ఒకప్పుడు ఈ మంటపంలోనే స్వామివారికి నిత్య కళ్యాణోత్సవాలు, వసంతోత్సవం, బ్రహ్మోత్సవం జరిగేవి. రాను రానూ భక్తులసంఖ్య పెరగడంతో, ప్రస్తుతం సంపంగి ప్రదక్షిణమార్గంలో దక్షిణంవైపున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణమంటపంలో కళ్యాణోత్సవం జరుగుతూ ఉంది.

ప్రస్తుతం ఈ మంటపంలో శ్రీవారి తిరుమంజన కార్యక్రమాలు, దేశాధిపతులు, రాష్ట్రాధిపతులకు వేదపండితుల ఆశీస్సులూ వారికి ప్రసాదవితరణలు, జరుగుతున్నాయి.

తిరుమలరాయమంటపం

రంగనాయక మంటపాన్ని ఆనుకుని, దానికి పడమరదిక్కున, ధ్వజస్థంభ మంటపానికి దక్షిణదిశగా పది అడుగుల దూరంలో, రెండంచెలుగా ఈ మంటపం నిర్మింపబడింది. మొదటి అంచె ఎత్తైన వేదికగా, వేరొక అంచె నేలమట్టానికి సమంగా ఉండి, వేదికపై జరిగే ఉత్సవాలను భక్తులు దక్షిణదిశగా కూర్చొని తిలకించటానికి వీలుగా నిర్మింపబడింది.

విజయనగర ప్రభువైన సాళువనరశింహరాయలు శ్రీవారికి మొక్కు చెల్లింపుగా "అన్నా ఊయల తిరునాళ్ళ" అనే ఉత్సవాన్ని నిర్వహించే నిమిత్తం, 1473వ సం. లో "ఎత్తైన వేదిక" నిర్మించాడు. "అన్నా" అనే తమిళపదానికి "హంస" అని అర్థం. తమిళ "ఆణిమాసం" (జూన్-జూలైల మధ్య) లో జరుపబడే ఈ ఉత్సవం కాలాంతరంలో నిలిచిపోయింది.

అరవీటివంశ చక్రవర్తి అయిన తిరుమలరాయలు 16వ శతాబ్దంలో ఈ మంటపాన్ని విస్తరింపజేసి, వార్షికవసంతోత్సవం నిర్వహించేవాడు. అందువల్ల ఈ మంటపానికా పేరు వచ్చింది. కానీ ఆయన ఏర్పాటు చేసిన ఉత్సవం కూడా అర్థంతరంగానే నిలిచిపోయింది.

ప్రస్తుతం ఈ మంటపంలో, "కొలువుమేళం" గా పిలువబడే ఓ సేవలో భాగంగా – మేళం, డోలు, నగారాలు – మ్రోగింపబడతాయి. సూర్యోదయవేళ 6:00-6:30 గం. ల మధ్య జరిగే కొలువును "హరికొలువు" గా, సూర్యాస్తమయ సమయంలో 5:30-6:00 గం. ల మధ్య జరిగే కొలువును "సందెకొలువు" గా పిలుస్తారు.

ప్రస్తుతం బ్రహ్మోత్సవాల సమయంలో ధ్వజారోహణవేళ మాత్రమే స్వామివారు ఈ మంటపంలోకి వేంచేసి పూజా నివేదనలు అందుకుంటారు.

రాజా తోడరమల్లు

తిరుమలరాయమంటపంలో, ధ్వజస్థంభానికి సుమారు పది అడుగుల దూరంలో స్వామి వారికి అభిముఖంగా ముగ్గురి భక్తుల నిలువెత్తు రాగి ప్రతిమలు దర్శనమిస్తాయి. ఈ విగ్రహాల భుజాలపై ఉన్న పేర్లననుసరించి, తలపాగా ధరించి ఉన్న పురుషుడు "లాలా ఖేమరాము". మిగిలినవి ఆయన భార్య "పితాబీబీ", తల్లి "మాతా మోహనదేవి" ల విగ్రహాలు. లాలా ఖేమరామునే "రాజా తోడరమల్లు" అని పిలుస్తారు. 17వ శతాబ్దంలో, శ్రీవారి ఆలయానికి వచ్చే భక్తజనసందోహాన్ని చూసి, అప్పట్లో భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో అధికారంలో ఉన్న మహమ్మదీయుల మరియు బ్రిటీషు వారి కళ్ళు ఆలయంపై పడ్డాయి. హైందవమతానికి ఆలవాలమైన ఈ దేవాలయాన్ని ధ్వంసం చేయాలనే ఉద్దేశ్యంతో మహమ్మదీయులూ, అత్యధిక ఆదాయం వచ్చే ఈ ఆలయం పై ఆధిపత్యం సాధించటానికి బ్రిటీషువారూ, ఒకే సారి ఆలయంపైకి దండెత్తారు. శ్రీవారికి పరమభక్తుడూ, వారికోసం ప్రాణాలైనా అర్పించే తోడరమల్లుకు ఈ విషయం తెలిసి, మిత్రుల సహాయంతో వారిద్దరి (మహమ్మదీయులు, బ్రిటీషువారు) మధ్య

చిచ్చుపెట్టి, ఒకరితో ఒకరు కలహించుకొనేట్లు చేసి ఆలయాన్ని రక్షించాడు. అప్పుడు ఆయన ఆర్కాటు నవాబు సాదతుల్లాఖాన్ తరపున కర్ణాటక ప్రాంతాన్ని పర్యవేక్షించేవాడు. ఓ మహమ్మదీయుని కొలువులో ఉంటూ, హిందూ దేవాలయాన్ని రక్షించి భావితరాలవారికి పదిలంగా అప్పగించిన, ఆ భక్తశిఖామణికి జోహార్లు. స్వామివారంటే తనకున్న అపరిమిత భక్తికి చిహ్నంగా, నమస్కార భంగిమలో ఉన్న ఈ విగ్రహాలను ఆయనే ప్రతిష్ఠించుకున్నారు.

సంపంగిమార్గంలో ఉన్న మంటపాలనూ, మూర్తులనూ దర్శించుకుని ఇప్పుడు మనం ధ్వజస్తంభమంటపం లోకి అడుగు పెట్టాం. ఈ మంటపం ద్వారానే వెండివాకిలి దాటి మనం విమానప్రదక్షిణ మార్గంలోకి ప్రవేశించాలి. ఇక్కడ తెలుసుకోవలసిన విషయాలు చాలానే ఉన్నాయి:

ధ్వజస్తంభ మంటపం

ఇప్పుడు మనం – ప్రతిమామంటపం (తూర్పు) వెండివాకిలి (పడమర), అద్దాలమంటపం (ఉత్తరం) తిరుమలరాయ మంటపాల (దక్షిణం) – మధ్య ఉన్న చతురస్రాకార మంటపంలో ఉన్నాం. ఈ మంటపంలో ఆలయ ధ్వజస్తంభం ఉన్నది కావున దీన్ని ధ్వజస్తంభ మంటపం అంటారు. ఇక్కడనుంచి చూస్తే, మేలిమి బంగారుకాంతులతో మెరుస్తున్న ధ్వజస్తంభం వెండివాకిలికి తూర్పుదిక్కులో కనిపిస్తుంది. పైకి చూస్తే, ధ్వజస్తంభానికి ఎదురుగా ఏడు బంగారు కలశాలతో కూడిన మూడంతస్తుల వెండివాకిలి గోపురం కూడా చూడవచ్చు.

15వ శతాబ్దంలో నిర్మింపబడిన ఈ మంటప శిలాస్థంభాలపై, యోగనరశింహస్వామి, ఆంజనేయుని మూర్తులు; బకాసురవధ, శ్రీనివాసకళ్యాణం వంటి పౌరాణిక ఘట్టాలు; ఎన్నెన్నో మనోహరంగా మలచ బడ్డాయి. ఈ మంటపంలో బంగారు తొడుగుతో ఉన్న ధ్వజస్తంభం; దాన్ని ఆనుకుని తూర్పువైపున పెద్ద బలిపీఠం; దానికి ఈశాన్యదిక్కున చిన్న బలిపీఠంలా కనుపించే "క్షేత్రపాలకశిల" స్థితమై ఉన్నాయి. వీటన్నింటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

ధ్వజస్తంభం

వెండివాకిలికి ఎదురుగా, నగిషీలు చెక్కిన శిలాపీఠం మీద ఉన్నటువంటి ఎత్తైన కొయ్యస్తంభమే ధ్వజస్తంభం. శిలాపీఠం మరియు స్తంభం మొత్తానికీ బంగారుపూత పూయబడిన రాగిరేకు తాపడం చేయబడి ఉంటుంది. ఈ స్తంభంమీద కూడా – గరుత్మంతుడు, హనుమంతుడు, శంఖుచక్రాలు, కాళీయమర్దనఘట్టం – వంటి శిల్పాలు అత్యద్భుతంగా చెక్కబడి ఉన్నాయి.

ధ్వజం అంటే "జండా". తమిళంలో ధ్వజస్తంభాన్ని "కొడిక్కంబం" అంటారు. "కొడి" అంటే "కేతనము" లేదా "జండా" అని అర్థం.

ధ్వజారోహణం అంటే – స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రారంభాన్ని సూచిస్తూ, ధ్వజస్తభంపై స్వామివారి పరమభక్తుడు మరియు వాహనమైన గరుడుని చిత్రపటం ఉన్న జండా ఎగురవెయ్యటం. అందుకే ధ్వజస్తంభాన్ని గరుడగంభంగా కూడా పిలుస్తారు.

"ధ్వజారోహణం" ద్వారా, ఆకాశమార్గాన అత్యంత వేగంగా పయనించగల గరుడినితో సమస్తలోకాల వారికీ బ్రహ్మోత్సవ సంబరాల నిమిత్తం లాంఛనప్రాయంగా ఆహ్వానం పలకబడుతుంది. ఈ ధ్వజస్తంభానికి మరో ప్రాముఖ్యత కూడా ఉంది. ఏ వ్యక్తులైనా, వస్తువులైనా, పూజాద్రవ్యాలైనా ఆఖరుకు స్వామివారైనా, మదిరంలోంచి బయటకు వెళ్ళాలన్నా, బయటనుంచి లోనికి రావాలన్నా, ధ్వజస్తంభానికి ప్రదక్షిణ చేస్తూ వెళ్ళాల్సిందే. సహస్రాబ్దాలుగా శ్రీవారి ముందు స్థిరచిత్తంతో నిలుచుని ఉండే ధ్వజస్తంభానికి ఆమాత్రం గౌరవమర్యాదలు దక్కాల్సిందే మరి. చిత్తచాంచల్యంతో చరించే మనబోటి మానవులకో చక్కటి సందేశమిస్తుందీ అచంచలమైన ధ్వజస్తంభం!

పూర్వం విమానప్రదక్షిణ మార్గంలో నుండే ధ్వజస్తంభం, అక్కడ స్థలాభావం కారణం చేత ఐదారు శతాబ్దలక్రితం ప్రస్తుతమున్న ప్రాంతానికి మార్చబడింది.

ఈ ధ్వజస్తంభం కర్రదైనందువల్ల దాన్ని మార్చుతూ ఉండాలి. ప్రస్తుతం ఉన్న ధ్వజస్తంభం 1982వ సం. లో, కర్ణాటకలోని "దండేలి" అడవుల్లో లభించే టేకుచెట్టు మానుతో తయారైంది. ధ్వజస్తంభానికి ఉపయోగించే మాను – ఎలాంటి తొర్రలు, పగుళ్ళు, కొమ్మలు, వంకరలు లేకుండా, 75 అడుగుల పొడవుతో, దృఢంగా, దీర్ఘకాలం మన్నేట్లు ఉండాలి. ఇన్ని సులక్షణాలు కలిగిన టేకుమానును వెదకటం, కొండమీదకు రవాణా చేయటం, కనీసం వందేళ్ళవరకూ చెక్కుచెదరకుండా వుంచే రసాయనిక ప్రక్రియ చేపట్టటం, అన్నింటినీ మించి అంత పొడవైన ఏక స్తంభాన్ని దానికంటే ఎంతో తక్కువ ఎత్తుతో నుండే పైకప్పు గల ఈ నిర్ణీతప్రదేశంలో ప్రతిష్ఠించడం కోసం అప్పటి తి.తి.దే. యాజమాన్యం అత్యంత వ్యయప్రయాసల కోర్చింది. గత రెండువందల సంవత్సరాల తి.తి.దే. రికార్డుల్లో ధ్వజస్తంభం మార్చిన సాంకేతికాంశాల ప్రస్తావనేమీ లేకపోవడం వల్ల, ఈ కార్యక్రమం మరింత జటిలం అయ్యింది. అయితే, ఆ శ్రీనివాసుని కృప, భక్తులసహకారం, తి.తి.దే. యాజమాన్యం–సిబ్బంది యొక్క అంకితభావంతో, అత్యంత క్లిష్టతరమైన ఈ ప్రక్రియ అవిఘ్నంగా జరిగి ఎట్టకేలకు విజయవంత మయ్యింది.

తమిళశాసనాలు ఎక్కువగా ఉండే తిరుమల ఆలయంలో ధ్వజస్తంభాన్ని మార్చేటప్పుడు, పాత ధ్వజస్తంభం యొక్క పద్మపీఠంపై ఓ తెలుగుశాసనం బయట పడింది. దాని ప్రకారం, సుమారు మూడు వందల సంవత్సరాల క్రితం; పాతధ్వజస్తంభాన్ని "సిద్దూరి రామాజీమాదర్సు పంతులు" అనే ఒక తెలుగు భక్తుడు సమర్పించాడు. ఆలయంలో తమిళుల ఆధిపత్యం ఎక్కువా ఉండే ఆ రోజుల్లో, దేవాలయానికి ఆయువుపట్టైన ధ్వజస్తంభాన్ని ఓ తెలుగు భక్తుడు సమర్పించినట్టు తెలుసుకోవడం మన తెలుగు వారందరికీ కొద్దిగా ఉపశమనం కలిగిస్తుంది.

మయూరధ్వజుడనే మహారాజు త్యాగనిరతికీ, దానశీలతకు మెచ్చి శ్రీకృష్ణభగవాను డిచ్చిన వరాన్ననుసరించి, అతనికి ధ్వజస్తంభరూపంలో వైష్ణవాలయాల యందుండే భాగ్యం కలిగింది. శ్రీకృష్ణుని ఆనతి ప్రకారం ధ్వజస్తంభదర్శనం, ప్రదక్షిణం పూర్తయిన తరువాతనే దైవదర్శనం చేసుకోవాలి. ఈనాటికీ అదే సాంప్రదాయం కొనసాగుతోంది.

క్షేత్రపాలకశిల (లేదా గుండు)

ధ్వజస్తంభమంటపంలో ఈశాన్యదిక్కున ఉన్న ఒకటిన్నర అడుగుల ఎత్తైన, చిన్నపాటి శిలాపీఠాన్ని "క్షేత్రపాలకశిల" లేదా "క్షేత్రపాలకగుండు" అంటారు. తిరుమల ఆలయానికి క్షేత్రపాలకుడు "శివుడు" అని "సన్నిధిగొల్ల" , ప్రకరణంలో తెలుసుకున్నాం.

ఆ క్షేత్రపాలకునికి గుర్తుగా, మాడవీధుల్లోని ఈశాన్యదిక్కున జీవం ఉన్న ఓ పెద్ద శిల ఉండేదట. అర్చకులు ఆలయద్వారాలు మూసేసి ఇళ్ళకెళుతూ తాళాలగుత్తిని ఆ శిలకు మూడుసార్లు తాకించేవారు. దాంతో, ఆలయద్వారాలు మూసుకున్నట్టి సంకేతం అందుకున్న ఆ శిల గుడి చుట్టూ మాడవీధుల్లో తిరుగుతూ, అలయానికి కాపు కాస్తూ, అన్యులెవ్వరినీ మాడవీధుల్లోకి ప్రవేశించనిచ్చేది కాదు. సుప్రభాత సమయంలో వాకిళ్ళు తెరిచేముందు మరలా ఆ తాళాలగుత్తిని శిలకు తాకిస్తే, ఆ శిల తన గమనాన్ని ఆపి, తిరిగి ఈశాన్యమూలలో స్థిరంగా ఉండేది. ఒకనాటి రాత్రి వేగంగా సంచరిస్తున్న ఆ శిల క్రింద పడి ఓ బాలుడు మరణించడంతో, అటువంటి దుర్ఘటన పునరావృతం కాకుండా ఆ శిలను ఆలయానికి కొద్దిదూరంలో ఉన్న గోగర్భంతీర్థం వద్దకు తరలించారు. అయితే, ఆ శిలలోని చిన్నభాగాన్ని మాత్రం, తరలించ బడిన క్షేత్రపాలకశిలకు గుర్తుగా, ధ్వజస్తంభమంటపం లోని ఈశాన్యదిక్కున ఉంచారు.

ఆలయం బీగాలగుత్తిని రెండు పూటలా ఈ శిలకు తాకించి, నమస్కరించే సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.

ప్రతి మహాశివరాత్రి పర్వదినాన అర్చకులూ, ఆలయాధికారులూ, భక్తులూ ఛత్రచామర మంగళవాద్యాలతో గోగర్భతీర్థానికి వెళ్ళి; నమకం–చమకంతో రుద్రాభిషేకంచేసి; ఆ గుండుకు వెండినామాలూ (ఊర్ధ్వపుండ్రాలు), కళ్ళూ అతికించి; పుష్పాలంకర ణానంతరం ధూప–దీప–అర్చన–నివేదనాదులు కావించి; భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారు. విష్ణుమూర్తికి సాక్షాత్తు శివుడు క్షేత్రపాలకుడిగా నుండటం; ప్రపంచప్రసిద్ధ వైష్ణవాలయంలో శివరాత్రి ఉత్సవం ఘనంగా నిర్వహించటం; శివుణ్ణి ఊర్ధ్వపుండ్రంతో అలంకరించటం చూస్తుంటే, "**శివాయ విష్ణురూపాయ – విష్ణురూపాయ శివే**" అన్న తత్వం సంపూర్ణంగా అవగత మవుతుంది.

బలిపీఠం

ధ్వజస్తంభాన్నానుకుని, తూర్పుదిక్కున ఉన్న ఓ ఎత్తైన పీఠమే "బలిపీఠం". ఇది కూడా బంగారుపూత పూసిన రాగిరేకు తాపడంతో తళతళా మెరుస్తూ ఉంటుంది. శ్రీవారికీ, ఇతర ప్రధాన పరివార దేవతలకూ, ద్వారపాలకులకూ ప్రసాదాలను నివేదించిన తరువాత; విమానప్రదక్షిణ మార్గంలోని అష్టదిక్కుల్లో ఉన్న బలిపీఠాలపై ఆయా దిగ్దేవతలకు మంత్రపూర్వకంగా బలిని వేస్తారు. ఇలా సమర్పిస్తూ చివరగా వెండివాకిలి వద్దకు వచ్చి; మిగిలిన అన్నాన్ని, అంటే బలిని ధ్వజస్తంభం ముందున్న ఈ ఎత్తైన బలిపీఠంపై ఉంచుతారు. ఈ బల్యన్నాన్ని రాత్రింబవళ్ళూ సంచరించే భూత–ప్రేత–యక్ష–పిశాచాది గణాలూ, క్రిమికీటకాదులూ ఆహారంగా భుజిస్తాయని ప్రతీతి.

శ్రీకృష్ణుని ఆనతి ప్రకారం మనం ధ్వజస్తంభానికి భక్తి పూర్వక నమస్కారాలు సమర్పించుకున్నాం కాబట్టి ఇక శీఘ్రంగా

వెండివాకిలి దాటి, బంగారువాకిళ్ళలో ఉన్న శ్రీవారిని దర్శించుకో వచ్చు.

దీనితో వెండివాకిలి లోనికి ప్రవేశించే ముందు, సంపంగిప్రదక్షిణంలో చూడవలసిన ముఖ్య విశేషాలన్నీ పూర్తయ్యాయి.

శ్రీవారి దర్శనానంతరం ప్రసాదం స్వీకరించిన తరువాత, ఓ ఊచల పంజరంలో ఉన్న నల్లటి బావిని మనందరం చూసే ఉంటాం. దాని విశేషాలూ, శ్రీవారి దర్శనానంతరం, సంపంగిప్రదక్షిణమార్గం లో చూడవలసిన మరికొన్ని విశేషాలను ఈపై చెప్పుకుందాం.

సంపంగిప్రదక్షిణ మార్గంలో శ్రీవారిదర్శనానికి ముందు చూడగలిగే విశేషాలన్నింటినీ దాదాపుగా చెప్పుకున్నాం.

ఇదే ప్రదక్షిణమార్గంలో, దర్శనానంతరం చూడగలిగేవి, ప్రత్యేకసందర్భాల్లో మాత్రమే చూడగలిగేవీ, అసలు దర్శించలేనివీ ఎన్నో విశేషాలున్నాయి. వాటన్నింటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

నాలుగుకాళ్ళ మంటపాలు

1470వ సం. లో విజయనగరచక్రవర్తి సాళువనరశింహరాయలు – తన భార్య, ఇద్దరు కుమారులు, తన పేరున – నాలుగుకాళ్ళ మంటపాలుగా పిలువబడే నాలుగు మంటపాలను సంపంగిప్రదక్షిణమార్గానికి నాలుగు మూలల్లో అంటే – ఆగ్నేయ, నైఋతి, వాయువ్య, ఈశాన్యాల్లో – కళాత్మకంగా నిర్మించాడు. జనసమ్మర్ధం అంతగా లేని కాలంలో స్వామివారి ఉత్సవ-ఊరేగింపులన్నీ సంపంగిప్రదక్షిణ మార్గం నందే జరిగేవి. ఆ సమయంలో, ఈ మార్గంలోని నాలుగు మూలల్లో ఉన్న మండపాల్లో స్వామివారు వేంచేసి పూజాదికాలు అందుకునే వారు. కళ్యాణోత్సవాలు సైతం వీటిలోనే నిర్వహించేవారు. ఎత్తైన ఈ మంటపాల్లో జరిగే పూజలను భక్తులు అన్నివైపుల నుండీ వీక్షించవచ్చు. కళ్యాణోత్సవ సమయాల్లో ఈ మండపాల ఉపరితలం నుంచి మంగళవాద్యాలను నగారాల వలె మ్రోగించేవారు.

కాలక్రమేణా భక్తులరద్దీ ఎక్కువ కావడంతో, శ్రీవారి ఉత్సవాలను విశాలమైన ఇతర మంటపాల్లోనూ, ఊరేగింపులను వెడల్పాటి మాడవీధుల్లోనూ నిర్వహించసాగారు.

ప్రస్తుతం, ఆగ్నేయ, వాయువ్య, ఈశాన్య మూలల్లోని నాలుగుకాళ్ళ మంటపాలు మూడు మాత్రం మిగిలి ఉండగా, నాల్గవది తరువాతి కాలంలో చేపట్టిన విస్తరింపు కట్టడాల్లో విలీనమైపోయింది. మిగిలిన మూడింటిలో కూడా, కేవలం ఆగ్నేయమూలలో ఉన్న మంటపాన్ని మాత్రమే ఇప్పుడు మనం చూడగలం. ఇతర దిక్కుల్లోనున్న మంటపాలను చూడటానికి భక్తులకు ప్రవేశం లేదు.

శ్రీవేంకటరమణుని కళ్యాణమంటపం

నీరజాక్షుని నిత్యకళ్యాణోత్సవం కోసం సంపంగిప్రదక్షిణం లోని దక్షిణమార్గంలో నూతనంగా, సృజనాత్మకత ఉట్టిపడేటటువంటి కళాఖండాలతో, తూర్పుముఖంగా ఈ కళ్యాణమంటపం నిర్మింపబడింది. ఇందులో ప్రతిరోజూ మధ్యాహ్నం పన్నెండు గంటలకు మలయప్పస్వామి వారికీ ఉభయనాంచారులకు కళ్యాణోత్సవం ఘనంగా జరుగుతుంది. విశాలమైన ప్రాంగణంలో వందలాది భక్తులు కూర్చొని కళ్యాణోత్సవాన్ని కన్నులారా తిలకించవచ్చు.

ప్రతి సోమవారం జరిగే విశేషపూజ; పవిత్రోత్సవం, పుష్పయాగం, జ్యేష్ఠాభిషేకం వంటి సంవత్సరోత్సవాలు కూడా ఈ మంటపంలోనే జరుప బడతాయి.

మొదట్లో విమానప్రదక్షిణ మార్గపు నైఋతి దిక్కులోని కళ్యాణమంటపంలో, తరువాత సంపంగిప్రాకారంలోని రంగనాయకమంటపంలో జరుపబడే కళ్యాణోత్సవాలు ప్రస్తుతం విశాలమైన ఈ కళ్యాణమంటపం లో జరుగుతున్నాయి. కళ్యాణోత్సవ ఆర్జితసేవలో పాల్గొనే భక్తులు మాత్రమే ఈ కళ్యాణమంటపాన్ని కాంచగలరు.

ఉగ్రాణం

"ఉగ్రాణం" గా పిలువబడే సరుకుల గిడ్డంగులను మనం తి.తి.దే. ఆధ్వర్యంలోని అన్ని దేవాలయాల్లోనూ చూస్తాం. వీటిలో ప్రసాదాల తయారీకి ఉపయోగించే వంట సామగ్రీ మరియు పూజాద్రవ్యాలు నిలువ ఉంచుతారు. సంపంగిప్రదక్షిణమార్గం లోని వాయువ్యమూలలో ఉన్న ఈ "ఉగ్రాణం" లో, స్వామివారి అభిషేకాలకు, అర్చనలకు ఉపయోగించే పసుపు, చందనం, కర్పూరం, నెయ్యి, సుగంధద్రవ్యాలు వంటి వాటిని నిలువ చేస్తారు.

ఇదే కాకుండా, సంపంగిప్రదక్షిణమార్గానికి పడమటి దిక్కున ఉన్న కొన్ని మంటపాలను కూడా – శనగపిండి, బెల్లం, మినపప్పు, పంచదార, బియ్యం వంటి సరుకులు; పిండి కలుపుకోవడం కోసం ఉపయోగించే పెద్ద పెద్ద మిక్సీలు – ఉంచటానికి ఉపయోగిస్తారు. ప్రసాదాల తయారీ నిమిత్తం వాడే వంటదినుసులు బాహ్యకుడ్యం వెనుక నుండి కన్వేయరు బెల్టులద్వారా సంపంగిప్రదక్షిణం పడమరదిశగానున్న గిడ్డంగుల్లోనికి చేర్చబడతాయి. వీటివద్దకు కూడా భక్తులకు ప్రవేశం లేదు.

విరజానది లేదా విరజాతీర్థం

వైకుంఠంలోని పవిత్రతీర్థమైన విరజానది స్వామివారి పాదాల క్రింద నుండి ప్రవహిస్తూ స్వామిపుష్కరిణిలో కలుస్తుందని భక్తుల విశ్వాసం. అందువల్లనే, గోవిందనామాల్లో శ్రీనివాసుణ్ణి "విరజాతీర్థదని" కూడా అభివర్ణిస్తారు.

ఈ నదీగమనమార్గంలో ఉపరితలంపై నిర్మింపబడిన బావిని విరజానది గా పిలుస్తారు. ఈ బావి అంచులపై అద్భుతమైన శిల్పాలు, పౌరాణిక ఘట్టాలు చెక్కబడి ఉండటంతో స్థానికులు దీన్ని "బొమ్మలబావి" గా కూడా పిలుస్తారు. ఈ బావి ప్రస్తుతం నేలమట్టానికి ఉన్న కటకటాల తలుపుతో మూయబడి, దానివద్ద "విరజానది" అనే బోర్డు వ్రేలాడ దీయబడి ఉంటుంది. ఈ బావి వద్దకు కూడా భక్తులకు ప్రవేశం లేదు.

పడిపోటు

ఇది సంపంగిప్రదక్షిణానికి ఉత్తరమార్గంలో ఉంటుంది. పడమటి భాగంలో ఉగ్రాణం వద్ద మొదలై, పొడవుగా, దాదాపు మనం ప్రసాదాలు స్వీకరించే ప్రదేశం వరకూ విస్తరించి ఉంటుంది. స్వామివారి ప్రసాద నివేదనలన్నీ – అన్నప్రసాదాలు తప్ప – అంటే లడ్డూ, వడ, జిలేబీ, మురుకు, అప్పం, దోశ మొదలైనవి పరిశుభ్రమైన వాతావరణంలో, అత్యంత నైపుణ్యంతో, భారీ ఎత్తున ఈ పడిపోటులో తయారు చేయబడతాయి. ఈ ప్రదేశంలోకి సాధారణంగా

భక్తులకు ప్రవేశం లేదు. అయితే, మనం ప్రార్థనా పూర్వకంగా అడిగితే, అక్కడ ఉన్న సిబ్బంది ఒక్కో సారి అనుమతిస్తారు. ఈ సారి ప్రయత్నించండి. ప్రపంచంలో మరెక్కడా లేనంత భారీ ఎత్తున జరిగే వంటల ప్రక్రియను చూసి తీరాల్సిందే! ఈమధ్య కాలంలో, స్థలాభావం చేత, లడ్డూ తయారీకి కావలసిన బూందీని మాత్రం ఆలయం వెలుపల తయారు చేయిస్తున్నారు.

పడిపోటుకు ఆగ్నేయమూలలో, తూర్పుదిశగా ఉన్న "పోటుతాయారు" అనే అమ్మవారికి భక్తిపూర్వకంగా నమస్కరించి వంటబ్రాహ్మణులు శుచిగా తమ దినచర్యను ప్రారంభిస్తారు. పడిపోటుకు ఎదురుగా ఇదివరకు ఉండే చిన్న బావిలోని నీటిని వంటలకు ఉపయోగించే వారు.

పూల అర లేదా పుష్పమండపం లేదా యమునోత్తరై

సంపంగిప్రదక్షిణం లోని ఉత్తరమార్గంలో, పడిపోటు నానుకొని ఉన్న గదిని ఈ మూడు పేర్లతో పిలుస్తారు. శ్రీవారి కైంకర్యాలకు, వివిధ ఉత్సవాలకు అవసరమయ్యే పుష్పమాలలను ఈ గదిలో తయారు చేసేవారు. అయితే స్థలాభావం, పెరిగిన అవసరాల దృష్ట్యా, ఇప్పుడు పుష్పమాలలను వేరొక చోట తయారు చేయించి, ఉపయోగార్థం విమానప్రాకారంలోని ఓ శీతలీకరించిన గదిలో భద్రపరుస్తున్నారు. దాని వివరాలు తరువాత తెలుసుకుందాం.

"యమునోత్తరై" అంటే "యమునానది ఒడ్డు" అని అర్థం. స్వామిని శ్రీకృష్ణునికి ప్రతిరూపంగానూ, స్వామిపుష్కరిణిని యమునానది గానూ భావించడం వల్ల దీనికా పేరు వచ్చి ఉండవచ్చు. మరో కథనమేమంటే – ఈ పుష్పకైంకర్యాన్ని ప్రారంభించిన అనంతాళ్వార్ అనే భక్తుడు తన గురువు రామానుజుల వారి గురువుగారైన "యామునాచార్యుల" వారి పేరు మీద ఈ గదికి ఆ పేరు పెట్టాడు. ఈ మహాభక్తుని గురించి ముందుగానే తెలుసుకున్నాం.ఈ గదిని బయటనుంచి దర్శించుకోవచ్చు.

వగపడి

రెండస్తుల కలిగిన ఈ ప్రసాదాల గిడ్డంగి, పూల అరను ఆనుకుని ఉంటుంది. ఆర్జితసేవల్లో పాల్గొన్న భక్తులకు, తి.తి.దే. సిబ్బందికి ఇక్కడే ప్రసాదవితరణ చేస్తారు. సిబ్బంది అనుమతితో లోనికి ప్రవేశించవచ్చు. ఈ గది ముంగిట్లో నుంచే లడ్డూ, వడ, జిలేబీల సుగంధాలు చవులూరిస్తాయి. సాధారణంగా, మనం దీని ముంగిట్లో నుంచునే ఉచిత ప్రసాదాలను సేవిస్తాం. గంటల తరబడి క్యూలో వేచిఉండటం వల్ల వచ్చిన అలసట, ఆకలి; ఘుమఘుమలాడే స్వచ్ఛమైన నేతి సువాసనలు; అంతకుమించి శ్రీవారి ప్రసాదాల మీదుండే అపరిమిత భక్తిశ్రద్ధలు; వెరసి, మన ఆలోచనలన్నీ తాత్కాలికంగా, ఆధ్యాత్మిక భావనల్లోంచి ఆత్మారాముణ్ణి సంతృప్తి పరచే దిశలో అనాలోచితంగానే పయనిస్తాయి.

పూలబావి

స్వామివారికి సడలింపు చేసిన పూలమాలలను భక్తులకిచ్చే సాంప్రదాయం తిరుమలలో లేదు. "పూజానైర్మల్యాలు" గా

పేర్కొనబడే వీటన్నింటినీ, సంపంగిప్రదక్షిణానికి ఈశాన్యంలో ఉన్న "పూలబావి" గా పిలువబడే ఓ బావిలో విసర్జించేవారు. అందుకే దానికా పేరు వచ్చింది. అయితే సంవత్సరంలో ఒక్కసారి తిరుచానూరులో కార్తీకమాస బ్రహ్మోత్సవ చక్రస్నానం జరిగే రోజున మాత్రం, శ్రీవారికి అలంకృతమైన పూమాలలు, పరిమళద్రవ్యాలు, ప్రసాదాలు, చీర-రవికెలు సమస్త గౌరవలాంఛనాలతో, తిరుమలనుంచి కాలినడకన తీసుకొని వచ్చి పద్మావతి అమ్మవారికి సమర్పిస్తారు.

ఈ పూలబావిని అద్దాలమండపానికి వెనుకభాగంలో, సరిగ్గా మనం ఉచిత ప్రసాదాలు స్వీకరించే ప్రదేశానికి ఎదురుగా చూడవచ్చు.

ఐతిహ్యం ప్రకారం భూదేవిచే ఏర్పరచబడిన ఈ "భూతీర్థం" (పూలబావికి పూర్వనామం) కాలాంతరంలో నిక్షిప్తమై పోయింది. శ్రీనివాసుని ఆనతిపై రంగదాసుడనే భక్తుడు నేలను త్రవ్వి ఈ బావిని వెలుగులోకి తెచ్చి దాని నీటిని శ్రీవారి పుష్పకైంకర్యానికి ఉపయోగించేవాడు. శ్రీవారికి ప్రీతిపాత్రమైన ఈ బావి శిథిలమైపోగా రంగదాసే తొండమానునిగా పునర్జన్మించి, ఆ బావిని తిరిగి పునరుద్ధరించాడు. అంతే కాకుండా, ఆ బావినందలి రహస్యమార్గం ద్వారా నిత్యం వచ్చి స్వామిని దర్శించుకునే వాడు.

ఒకప్పుడు శత్రురాజులు తరుముకు రాగా, తొండమానుడు ఈ మార్గం ద్వారా పరుగు పరుగున వచ్చి శరణాగతవత్సలుణ్ణి శరణు వేడాడు. అభ్యంతరమందిరంలోకి అకస్మాత్తుగా వచ్చిన ఆగంతుకుణ్ణి చూసి సిగ్గుతో – శ్రీదేవి శ్రీవారి వక్షస్థలంలోను, భూదేవి ఈ బావిలోనూ – దాక్కున్నారు.

వరాహపురాణం ద్వారా ఈ ఇతిహాసాన్ని తెలుసుకున్న భగవద్రామానుజులవారు భూదేవిని ఆ బావిలో తిరిగి ప్రతిష్ఠింపజేసి, అర్చనాదులు క్రమం తప్పకుండా జరిగే ఏర్పాటు చేశాడు. అంతే కాకుండా, భూదేవి నిమిత్తం పెనిమిటి పూజా నైర్మల్యాలను ఈ బావిలో విడిచే కట్టడి కూడా చేయడంతో, కొన్ని వందల సంవత్సరాలు ఆ సాంప్రదాయం కొనసాగింది.

కానీ, ఈ మధ్యకాలంలో పూలవాడకం విపరీతంగా పెరిగిపోవడం వల్ల, వాడిన పూమాలలను తిరుమల సానువుల్లో ఎవరూ త్రొక్కని ప్రదేశంలో విడవడం ప్రారంభించారు. అదీ "పూలబావి" పుట్టు పూర్వోత్తరాలు!

ఈ మధ్యకాలం వరకూ దిగుడుబావిగా ఉన్న ఈ బావిని చేదుడు బావిగా మార్చి, దాని వరలకు బయటివైపు నల్లటి గ్రానైట్ పలకలు తాపడం చేసి, దాని చుట్టూ ఇనుప ఊచల తడికెను ఏర్పాటు చేశారు. ఇంతటి పౌరాణిక, చారిత్రక ప్రాశస్త్యం కలిగిన పూలబావికి ఈసారి తప్పక నమస్కరించి తరించండి.

శ్రీవారి ఆలయంలో అత్యంత ముఖ్యమైన సంపంగిప్రదక్షిణ మార్గం లోని అన్ని విశేషాలను దాదాపుగా తెలుసుకున్నాం.

సంపంగిప్రదక్షిణమార్గం లోనే ఉండినట్లుగా చెప్పబడే ప్రొద్దు తిరగని చింతచెట్టు గురించీ, వెండివాకిలి గురించీ, దేవాలయ మహద్వారానికి తూర్పు దిక్కున గంభీరంగా నిలబడి ఉండే గొల్లమంటపం గురించీ చెప్పుకొని రేపటితో "సంపంగిప్రదక్షిణం" సమాప్తం చేద్దాం.

మొదటి మూడు భాగాల్లో మనం "సంపంగిప్రదక్షిణమార్గం" లో ఉండే విశేషాలను దాదాపుగా తెలుసుకున్నాం. ఇంకా మిగిలిన కొన్నింటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

నీడ తిరగని చింతచెట్టు

11వ శతాబ్దంలో భగవద్రామానుజులు; 15వ శతాబ్దంలో అన్నమయ్య; దర్శించి తరించిన ఓ పరమాద్భుతమైన చింతచెట్టు శ్రీవారి ఆలయంలో ఉండేది. శ్రీనివాసుని ఆవిర్భావంతో ముడివడిన ఈ వృక్షరాజం యొక్క ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగించే పూర్వాపరాలను శ్రీనివాసుని భక్తులందరూ తెలుసుకుని తీరాలి:

లోక కళ్యాణార్థమై, నారదమహర్షి ఒకానొకప్పుడు తండ్రియైన బ్రహ్మదేవుణ్ణి ఈ విధంగా ప్రార్థించాడు – "తండ్రీ! మీ విన్నపాన్ని ఆలకించి ఆ శ్రీమహావిష్ణువు, శ్రీవేంకటాచలక్షేత్రంలో అవతరించి భక్తులను అనుగ్రహించే టట్లుగా వరమిచ్చి చాలా కాలమైంది. కావున, ఆ వైకుంఠనాథుని మరలా ప్రార్థించి, సత్వరమే తిరుమలక్షేత్రంలో ప్రత్యక్షమై మానవులందరికీ వారి దర్శనభాగ్యం కలిగింప జేయండి."

నారదుని ప్రార్థనకు తన సమ్మతిని తెలియజేస్తూ, ఆ మహత్కార్యం నెరవేరటంలో నారదుని పాత్ర ఏమిటో విశదపరచి, బ్రహ్మదేవుడు అతనితో ఈ విధంగా శెలవిచ్చాడు – "నేను శేషాద్రిశిఖరాన, స్వామిపుష్కరిణి సమీపంలో, త్రేతాయుగపు దశరథ మహారాజు అంశతో మరియు ద్వాపరయుగపు వసుదేవుని అంశతో ఓ చింతచెట్టును సృష్టిస్తాను. ఆ వృక్షఛాయలో శ్రీ రాముని తల్లి కౌసల్య అంశతో మరియు శ్రీకృష్ణుని తల్లి దేవకి అంశతో ఓ విశాలమైన పుట్టను ఏర్పాటు చేస్తాను. వీళ్ళనే ఎందుకు ఎన్నుకున్నానంటే; ఆయా పుణ్యదంపతులకు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే శ్రీరామ-శ్రీకృష్ణుల రూపాలలో త్రేతాయుగం-ద్వాపరయుగాల్లో తనయుడుగా జన్మించినప్పటికీ; కారణాంతరాల వల్ల వారికి అనతికాలం లోనే పుత్ర వియోగం సంభవించింది. శ్రీరాముని వనవాసంతో కౌసల్యాదశరథులు పరితపించగా, కారాగారంలో జన్మించగానే శ్రీకృష్ణుడు దేవకీవసుదేవులకు దూరమయ్యాడు. వారికి పుత్రునిపై మమకారం తీరనేలేదు. అలాగే, చిన్నికృష్ణుణ్ణి అత్యంత ప్రేమాభిమానాలతో పెంచుకున్న యశోదమ్మ, శ్రీకృష్ణుని వివాహాన్ని చూడలేక పోయింది. కావున కలియుగంలో ఆమెను వకుళమాతగా జన్మింపజేసి శ్రీనివాసుని కళ్యాణాన్ని దగ్గరుండి జరిపించే ఏర్పాటు కూడా చేయాలని ఎప్పుడో నిశ్చయించు కున్నాను".

అలా బ్రహ్మదేవుడు వచించినదే తడవుగా వేంకటాచలంలో ఓ చింతచెట్టూ, దానిక్రింద పుట్ట (వల్మీకం), వకుళమాత చెకచెకా సృష్టించబడ్డాయి.

తండ్రియానతి మేరకు కార్యరంగంలోకి దిగిన నారదమహర్షి, వైకుంఠవాసుణ్ణి వల్మీకవాసునిగా తయారుచేసే ప్రయత్నంలో పడ్డాడు. అదే సమయంలో, యోగిపుంగవులందరూ కలిసి ఓ మహాయజ్ఞాన్ని ప్రారంభించారు. ఆ యజ్ఞానికి విచ్చేసిన కలహభోజనుడు, త్రిమూర్తుల్లో అత్యంత మహిమాన్వితునుకి మాత్రమే యజ్ఞఫలాన్ని ధారపోయ వలసిందిగా సలహా ఇచ్చాడు. త్రిమూర్తుల్లో ఎవరు గొప్పో నిగ్గు తేల్చటం కోసం, మహర్షుల కోర్కె మేరకు బ్రహ్మనూ, మహేశ్వరుణ్ణీ దర్శించిన భృగుమహర్షి చివరగా వైకుంఠాని కేతెంచాడు. ఆ తరువాత క్షణికావేశానికి గురైన భృగుడు

– లక్ష్మీనివాసమైన శ్రీనివాసుని హృదయంపై కాలితో తన్నడం; క్రోధితురాలైన శ్రీమహాలక్ష్మి వైకుంఠాన్ని వదలి కరివీరపురానికి (నేటి కొల్హాపూరుకు) చేరడం; విష్ణువు, లక్ష్మీదేవి జాడ వెతుకుతూ భూలోకానికేతెంచి వేంకటాచలంలో చింతచెట్టు క్రిందున్న పుట్టలో సేదతీరడం; ఓ గొల్లవాని గొడ్డలిదెబ్బకు గాయపడిన శ్రీనివాసుడు పుట్టలో నుండి బయటకు వచ్చి వకుళమాత చెంత చేరి పద్మావతిని పరిణయమాడటం – మనకు సుపరిచితమే! ఇందులో కొంతభాగాన్ని మనం "సన్నిధిగొల్ల" ప్రకరణంలో తెలుసుకున్నాం కూడా.

కాలాంతరాన ఆ పుట్ట సమీపంలో తొండమానునిచే శ్రీవారికి ఆలయం నిర్మించబడడంతో ఓ ప్రాకారం ఏర్పడి, ఆ చెట్టు సంపంగిప్రదక్షిణమార్గంలో మహాద్వారానికి చేరువగా నిల్చింది.

ఆ చింతచెట్టు కాండం దృఢంగా ఉండి శాఖోపశాఖలుగా విస్తరించింది. ఆ చెట్టు నీడ ఎటూ తిరగక వృక్షమూలంలోనే స్థిరంగా ఉండటంతో అది "నీడ తిరుగని చింతచెట్టు" గా ప్రసిద్ధి చెందింది. అంతే గాకుండా, ఆ చెట్టు విశ్రాంతి యన్నదే లేకుండా చిగురిస్తూ, పుష్పిస్తూ, ఫలిస్తూ ఉండేది. అందువల్ల అది "ఉన్నిద్ర తింత్రిణీ వృక్షం" (నిద్రపోని చింత చెట్టు) గా కూడా పేరొందింది. కాలక్రమాన, భూలోకంలో తనకు మొట్టమొదటి సారిగా నీడ కల్పించిన ఆ వృక్షం శ్రీనివాసునికి అత్యంత ప్రీతిపాత్ర మయ్యింది. ఒకానొకప్పుడు ఆ లక్ష్మీవల్లభుడు తన భక్తుడైన తొండమానునితో, "ఆ చింతచెట్టునూ, మహాలక్ష్మికి ఆవాస స్థానమైన చంపకవృక్షాన్ని మాత్రం రక్షించి, మిగిలిన చెట్లనన్నింటినీ తొలగించి ఆలయప్రాకారాలు నిర్మించ వలసిందిగా" ఆదేశించినట్లు వెంగమాంబ విరచిత "వేంకటాచలమహాత్మ్యం" ద్వారా తెలుస్తోంది.

ప్రస్తుతం ఆలయంలో కానరాని ఆ వృక్షం ఎప్పుడు, ఎలా కనుమరుగైందో ఎవరికీ తెలియదు. తన కార్యం పరిసమాప్తి చెందడంతో బ్రహ్మదేవుడే ఆ వృక్షాన్ని తనలో తిరిగి ఐక్యం చేసుకున్నాడేమో!

11వ శతాబ్దంలో భగవద్రామానుజులు ఆ చింతచెట్టును దర్శించి తరించినట్లు "పరమయోగివిలాసం" అనే ప్రామాణిక గ్రంథంలో వ్రాయబడింది. అలాగే, 15వ శతాబ్దంలో అన్నమయ్య తొలిసారిగా తిరుమల యాత్ర చేసినపుడు –

"... కుందనపు
బొలుపుల పెద గోపురము సేవించి
తరగని ఫలపుష్ప తతి తోడ నీడ తిరుగని
చింత వర్తిల నమ్రుడగుచు."

అనే కీర్తనలో, ఈ చింతచెట్టును దర్శించు కున్నట్లుగా పేర్కొన్నాడు.

సాక్షాత్తు శ్రీనివాసునికే నీడనిచ్చిన ఆ వృక్షరాజం, "మానవుడు ఐహిక ప్రలోభాలకు లోనై తన దిశను మార్చుకోకుండా; అజ్ఞానాంధకారపు ఛాయలను దరిజేర నీయకుండా; ఆ పరమాత్ముని సాక్షాత్కారం కోసం అలుపెరుగని సాధన చేయాలని; జన్మ సార్థక్యం కాగానే నిశ్శబ్దంగా నిష్క్రమించాలని" సూచిస్తుంది.

వెండివాకిలి

ప్రప్రథమ ప్రాకారం లోని మహాద్వారం గుండా ప్రవేశించి, సంపంగిప్రదక్షిణమార్గం లోని వివిధ మండపాలను దర్శించుకొని, ధ్వజస్తంభ దర్శనం తరువాత మనం వెండివాకిలి ముందుకు చేరుకుంటాం. ఈ ప్రవేశద్వారం యొక్క, గడపలకూ, ప్రక్కనున్న గోడలకూ వెండితాపడం చేసి యుండడం వల్ల దీన్ని "వెండివాకిలి" గా పిలుస్తారు. అలాగే, రెండవ ప్రవేశద్వారం కావటం వల్ల దీనిని "నడిమి పడికావలి" గా కూడా వ్యవహరిస్తారు. 1929వ సం. లో, నైజాం ఎస్టేటుకు చెందిన "శ్రీరాం ద్వారకా దాస్ పర్భణి" అనే భక్తుడు ఈ వాకిళ్ళకు వెండితాపడం చేయించినట్లుగా ఆ తలుపులపై హిందీ, ఆంగ్లభాషల్లో వ్రాయబడి ఉంది. సంపంగి ప్రాకారానికి అనుసంధానమై ఉండే ఈ ద్వారంపై ఏడు కలశాలతో, శిల్పకళా శోభితమైన మూడంతస్తుల గోపురం నిర్మించబడింది.

వెండివాకిలికి ఇరుప్రక్కలా ఉన్న కుడ్యాలపై, హాథీరాంబాబా–వేంకటేశ్వరుల పాచికలాట మరియు శ్రీరామపట్టాభిషేకం ఘట్టాలు హృద్యంగా చెక్కబడి వెండి రేకుతో తాపడం కావించబడ్డాయి.

12వ శతాబ్దంలో ప్రారంభమైన ఈ కుడ్య–ద్వార–గోపుర నిర్మాణం అంచెలంచెలుగా చేకూరి; 13వ శతాబ్దంలో పూర్తయినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ వెండివాకిలి దాటగానే మనం మూడవ లేదా విమానప్రదక్షిణమార్గం లోనికి ప్రవేశిస్తాం.

అయితే, అంతకు ముందుగా శ్రీవారి ఆలయ మహాద్వారం ముందున్న ఓ ముఖ్యమైన మంటపాన్ని గూర్చి తెలుసుకుందాం:

గొల్లమంటపం

పూర్వకాలంలో శ్రీవారి ఉత్సవాలు తిరుచానూరులో జరిగేవి. అవన్నీ శ్రీవారి నివాస స్థానమైన "తిరుమలక్షేత్రం" లోనే జరగాలని 11వ శతాబ్దంలో రామానుజులవారు తీర్మానించారు. అందునిమిత్తం తిరుమల కొండను అభివృద్ధి చేసే పనుల్లో నిమగ్నమైన కూలీలకు, పర్యవేక్షకులకు చంద్రగిరికి చెందిన "గోపమ్మ" అనబడే ఓ గొల్లవనిత చల్లని మజ్జిగ నిచ్చి దాహం తీర్చేది. ఆమె సేవకు మెచ్చిన రామానుజాచార్యులు ఏ వరం కావాలో కోరుకొమ్మనగా, ఆ వనిత అమాయకంగా, "తమరు చీటీ రాసిస్తే మోక్షమొస్తుందట. ఓ చీటీ రాసి మోక్షమిప్పియ్యండి" అని బదులిచ్చింది. ఆమె నిష్కల్మషత్వానికి మెచ్చిన రామానుజులు, ఓ తాళపత్రంపై "శ్రీనివాస పరబ్రహ్మ ముక్తిని ప్రసాదించుగాక" అని వ్రాసి ఆమె చేతిలో నుంచారు. ఆ గొల్లవనిత సేవానిరతికి, మోక్షపిపాసకు, నిష్కళంకభక్తికి గుర్తుగా, రామానుజుని ప్రేరణతో ఆ ప్రదేశంలో "గొల్లమంటపం" నిర్మించబడింది.

మరో కథనం ప్రకారం, మజ్జిగ విక్రయాలతో సంపాదించిన డబ్బుతో స్వయంగా ఓ గోపవనితే, ఆమెకు స్వామివారిపై ఉన్న అచంచల భక్తివిశ్వాసాలకు గుర్తుగా ఈ మంటపాన్ని నిర్మించింది.

కథనమేదైనప్పటికీ, ద్వాపరంలో గోవిందునికి-గోపాలురకు ఉన్న బాంధవ్యం కొనసాగుతూ; కలియుగంలో శ్రీవేంకటేశ్వరునికీ-గొల్లలకూ మధ్య ఏర్పడ్డ అనుబంధం ఈ "గొల్లమంటపం" రూపంలో ద్యోతక మవుతోంది.

1470వ సం. లో నిర్మించబడిన ఈ కట్టడంలో నిలబడి ఒకప్పుడు ప్రధానార్చకులు ప్రతినిత్యం ఘంటానాదం చేసిన కారణంగా దీనికి "ఘంటామండపమ"నే మరో పేరు కూడా వచ్చింది.

ఈ మంటపం శ్రీవారి ఆలయ మహాద్వారానికి ఎదురుగా, సమున్నతంగా నిలబడి ఉంటుంది. శ్రీవారి ఉత్సవ వాహనాలు మహాద్వారానికీ, గొల్లమంటపానికి మధ్య నుండి సాగిపోతాయి.

ఇప్పటివరకు, సంపంగిప్రదక్షిణమార్గంలోని ప్రతిమా, మంటప, ఇతర కట్టడాల విశేషాలన్నింటినీ తెలుసుకున్నాం.

ఇవే కాకుండా అన్ని మంటపాల్లోని కుడ్యాలపై, స్తంభాలపై, పైకప్పు లోపలిభాగంలో లతాపుష్ప ఆకృతులు, జంతువులు, పక్షుల చిత్రాలు, ఏనుగు తలపైనున్న గుర్రం, ఆ గుర్రంపై స్వారీ చేస్తున్న యోధుడు, వివిధ దేవతా శిల్పాలు; పూతనవధ, గోపికావస్త్రాపహరణం వంటి పౌరాణిక ఘట్టాలు; ఆదిశేషుడు, హనుమ, గరుడిని శిల్పాలు; ఇంకా అనేక కళాకృతులు ముగ్ధమనోహరంగా చెక్కబడి ఉన్నాయి. వీటినన్నింటినీ వీలున్నంతలో వీక్షించాల్సిందే గానీ, వాటిశోభను వర్ణింప నలవి కాదు.

వెండివాకిలిని దాటి మనం ఇక మూడవ ప్రదక్షిణం, అంటే "విమానప్రక్షిణమార్గం" లోనికి చేరుకోవడమే తరువాయి.

అయితే, ఆ ప్రదక్షిణం చేసే ముందుగా కొన్ని శ్రీవారి ఉత్సవాల గురించి తెలుసుకుందాం. నిత్య, వార, మాస ఉత్సవ విశేషాలను ముందుగానే చెప్పుకున్నాం కాబట్టి, కొన్ని "సంవత్సరోత్సవాల" గురించి కూడా తెలుసుకుందాం.

----------: : ----------

శ్రీవారి సంవత్సర సేవలు

ఉత్సవాలకు నెలవైన తిరుమలక్షేత్రంలో, ప్రతినిత్యం లెక్కకు మిక్కిలిగా ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. వాటిలో దైనందిత, వార, మాస లేదా నక్షత్ర ఉత్సవాలన్నింటి గురించి ఇంతకుముందే చెప్పుకున్నాం. ఇప్పుడు కొన్ని ముఖ్యమైన సంవత్సరోత్సవాల గురించి తెలుసుకుందాం.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనోత్సవం

తిరుమల కొండపై ఉన్న ప్రతి చెట్టూ-పుట్టా, రాయీ-రప్పా, తీర్థాలూ, సమస్త జంతుజాలం, అన్నీ కారణ జన్మలైన దేవతలు, సిద్ధిపొందిన మునిపుంగవులే. వైకుంఠవాసుడైన శ్రీమహావిష్ణువు కలియుగంలో ఆవిర్భవించటంతో ఆ దేవదేవునికి సపర్యలు చేయటం కోసం, లోక కళ్యాణార్థం శ్రీవారు చేపట్టే కార్యాలకు సహాయ సహకారాలు అందించటం కోసం స్వర్గవాసు లందరు వివిధ రూపాలు ధరించి తిరుమలక్షేత్రంలో కొలువై ఉన్నారు.

ఆ కారణంగా తిరుమలను ఎల్లప్పుడూ అత్యంత పవిత్రంగా, పరిశుభ్రంగా ఉంచటం అనూచానంగా వస్తున్న సాంప్రదాయం. ఆలయ పరిసరాలు, తిరుమల పట్టణమంతా పరిశుభ్రతకు మారుపేర్లు.

అలాగే, ఆలయాంతర్భాగాన్ని కూడా సతతం శుభ్రపరుస్తూ, పరిశుభ్రత ఉట్టిపడేలా తీర్చిదిద్దుతారు. అయితే, దైవసన్నిధిలో జరిగేది కనుక ఈ ప్రక్రియనంతా శాస్త్రోక్తంగా, భక్తిభావంతో, క్రమశిక్షణతో పూర్తిచేయాలి.

సంవత్సరంలో నాలుగు సార్లు, అనగా:

- ఉగాది,
- ఆణివార ఆస్థానం (ఇదివరకు ఆలయ వార్షికలెక్కల ముగింపు),
- బ్రహ్మోత్సవాలు,
- వైకుంఠ ఏకాదశి

ఈ పండుగలకు ముందు వచ్చే మంగళవారాల్లో జరిగే ఈ "శుద్ధికార్యక్రమాన్నే" , కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం గా పిలుస్తారు. శ్రీవారికి జరిగే ఆర్జితసేవల్లో ఇదో ముఖ్యమైన సేవ!

"కోయిల్" అంటే ఆలయం. "ఆళ్వార్" అంటే విష్ణుభక్తుల్లో గొప్పవారు. "తిరుమంజనం" అంటే పవిత్రమైన శుద్ధికార్యక్రమం. ఆలయంలో జరిగేది కాబట్టి ఈ శుద్ధికార్యక్రమాన్నే "అభిషేకం" గా భావిస్తారు.

వెరసి, ఈ పదానికి అర్థం **ఆలయంలో విష్ణుభక్తులు జరిపించే పవిత్రమైన అభిషేకం**.

ఈ ఉత్సవం జరిగే రోజుల్లో, దైనందిత సేవలైన సుప్రభాతం, తోమాలసేవ, అర్చనల తరువాత, గర్భాలయంలోని మూలమూర్తికి ఆసాంతం "మలైగుడారం" అనే వస్త్రాన్ని కప్పి, దుమ్మూ ధూళీ పడకుండా చూస్తారు. ఇదే గుడారంలో భోగశ్రీనివాసుణ్ణి కూడా ఉంచుతారు.

మిగతా ఉత్సవమూర్తులు, పరివారదేవతలు, శ్రీ వారికి నిత్యం అలంకరింపబడే సాలగ్రామాలను ఘంటామండపం లోకి; వెండి, బంగారు పాత్రల్ని బంగారుబావి వద్దకూ; స్వామివారి వెండిమంచం, వెండి ఆభరణాలను విమానప్రదక్షిణ మార్గంలోనికి భక్తి పూర్వకంగా తరలిస్తారు.

- ఉత్సవమూర్తులు, సాలగ్రామాలను, అర్చకులు ఘంటామండపంలో తెరలు కట్టి అభిషేకిస్తారు.
- బంగారుబావి వద్దకు తెచ్చిన వస్తువులన్నింటినీ చింతపండుతో శుభ్రపరుస్తారు.
- అర్చకులు గర్భాలయాన్ని;
- పరిచారకులు, ఏకాంగులు కులశేఖరపడి ముందున్న ప్రాంతాన్ని; ఆలయ ఉద్యోగులు మిగతా దేవలయం అంతటినీ, ఉపాలయాలనూ శుభ్రంచేసి శీకాయనీళ్ళతో కడుగుతారు.
- అభిషేకం అందుకున్న ఉత్సవమూర్తులు, పరివారదేవతా మూర్తులకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.
- రంగనాయక మండపంలోని వెండి, బంగారు వాహనాలకు మెరుగు పెడతారు.
- నామంకోపు, గడ్డకర్పూరం, శ్రీచూర్ణం, గంధంపొడి, కుంకుమ ఖచిలిగడ్డ లను కలిపి లేహ్యంలా తయారుచేసిన "పరిమళం" అనబడే మిశ్రమాన్ని ముందురోజు రాత్రే గంగాళాల్లో సిద్ధంగా వుంచుకుంటారు.
- గర్భాలయంలో స్వామివారి పైకప్పు భాగానికి కట్టే మఖమల్ వస్త్రాన్ని "కురాళం" అంటారు.
- పరిమళాన్ని, కురాళాన్ని తీసుకుని జియ్యంగార్లు, ఆలయ ఉన్నతాధికారులు మంగళవాయిద్యాలతో, ధ్వజస్తంభానికి ప్రదక్షిణగా వచ్చి అర్చకులకు అందజేస్తారు.
- అర్చకులు కురాళాన్ని యథాస్థానంలో (గర్భాలయపు ఉపరితల భాగంలో) అమర్చి, "పరిమళాన్ని" గర్భాలయ మరియు ఇతర ముఖ్య ఉపాలయాల గోడలకు లేపనంలా పూస్తారు.
- తరువాత నేలనంతా కడిగి, ఉత్సవమూర్తులను, పూజాసామగ్రిని వారివారి స్థానాలకు చేరుస్తారు.
- అనంతరం బంగారువాకిళ్ళకు నూతన పరదాలు కట్టి, తెరవేసి, మూలమూర్తిని కప్పి ఉంచిన మలైగుడారాన్ని తొలగించి, రోజువారీ సేవాకార్యక్రమాలను యథావిధిగా కొనసాగిస్తారు.

ఈ సేవను మొట్టమొదటగా వంగపురం నారాయణశెట్టి అనే తిరుపతికి చెందిన వర్తకుడు, 1544వ సం. లో, తన ఖర్చుతో జరిపించాడు.

ఈ సేవాకార్యక్రమం నందు పరిమళద్రవ్యాలను అధిక మొత్తంలో ఉపయోగించటం వల్ల గవాక్షాలు లేని ఆనందనిలయంలో గాలి పరిశుభ్రంగా, సువాసనా భరితమై ఉండటమే కాకుండా, లోనికి క్రిమికీటకాదులు రాకుండా ఉంటాయి. ఈ సేవలో పాల్గొనే భక్తులు, వ్యక్తికి ₹300 చొప్పున చెల్లించాలి.

తిరుమలలో పరిశుభ్రత గురించి ముఖ్యంగా ఒక విషయం చెప్పుకోవాలి. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" – అటువంటి టన్నులకొద్దీ అన్నాన్ని ప్రతిదినం లక్షకు పైగా భక్తులకు వండి వడ్డించే, తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాదకేంద్రంలో; ఒక్క ఈగను కానీ, పదార్థాల్లో ఒక్క వెంట్రుకను గానీ ఎప్పుడైనా, ఎవరైనా చూశారా? అంకితభావంతో పనిచేసే వంటశాల సిబ్బంది అవిశ్రాంత కృషికి శ్రీనివాసుని సంపూర్ణకటాక్షం తోడవటం వల్లనే ఇది సాధ్యం!

ఆత్మ, శరీర, పరిసరాల పరిశుభ్రతే పరమపద సోపానానికి తొలిమెట్టు.

సాలకట్ల తెప్పోత్సవం

వేసవికాలంలో తాపం తీర్చుకోవడానికి మనం చల్లని ప్రదేశాలను, ఈతకొలనులను సందర్శించినట్లే; ఆ వేంకటేశుడు కూడా సతుల సమేతంగా నౌకా విహారానికి వెళతాడు.

వేసవి ప్రారంభంలోని (ఫిబ్రవరి–మార్చి) పున్నమిరోజుల వెన్నెల కాంతుల్లో, స్వామిపుష్కరిణి యందలి చల్లటి నీళ్ళలో జరిగే ఈ ఉత్సవాల్ని "సాలకట్ల తెప్పోత్సవాలు" గా వ్యవహరిస్తారు. ఏటా ఫాల్గుణమాస శుక్లపక్ష ఏకాదశినాడు ప్రారంభమై, ఐదు రోజులపాటు రాత్రి 7 నుంచి 8 గం. ల మధ్య జరిగే ఈ ఆర్జితసేవలో పాల్గొనటం కోసం వ్యక్తికి ₹500 చొప్పున చెల్లించాలి.

తిరుమలలో అతి ప్రాచీనకాలం నుండి జరుగుతున్న తెప్పోత్సవాల్ని మరింత ఘనంగా నిర్వహించటానికి, 1468వ సం. లో, పుష్కరిణి మధ్యభాగం నందు "నీరాళి మంటపాన్ని" సాళువ నరశింహరాయలు నిర్మించాడు.

సర్వాంగసుందరంగా తీర్చిదిద్దిన పుష్కరిణిలో, విద్యుద్దీపాలంకార శోభితమైన తెప్ప యందు స్వామివారు విహరించే ఈ తెప్పోత్సవం ఇలా సాగుతుంది –

- **మొదటిరోజు** — సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేతంగా శ్రీరామచంద్రమూర్తి పుష్కరిణిలో మూడుసార్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు.
- **రెండవరోజు** — రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణుడు మూడు సార్లు విహరిస్తారు.
- **మూడవరోజు** ఉభయ నాంచార సమేతులైన మలయప్పస్వామి వారు పుష్కరిణిని మూడు సార్లు చుట్టివస్తారు.
- **నాల్గవరోజు** — మలయప్పస్వామి వారు మరలా ఐదు సార్లు విహరిస్తారు.
- **ఐదవరోజు** – చివరిసారిగా, మలయప్పస్వామి వారు ఏడు మార్లు నౌకావిహారం చేస్తారు.

తాళ్ళపాక అన్నమయ్య ఈ తెప్పోత్సవ శోభను హిందోళరాగంలో ఇలా కీర్తించాడు –

"దేవునికి దేవికిని తెప్పల కోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మా!!"
"తెప్పగా మర్రాకు మీద తేలెడువాడు
ఎప్పుడు లోకములెల్ల నేలేటి వాడు!!"

ప్రణయకలహోత్సవం

షికారు కెళ్ళొచ్చిన శ్రీవారిపై సతీమణి అలక బూనటం, శ్రీవారు సంజాయిషీ లిచ్చుకొని సతీమణిని బుజ్జగించటం, ఇవన్నీ ఈనాడు మొదలైన ముచ్చట్లు కావు. శ్రీనివాసుడే ఈ సాంప్రదాయానికి శ్రీకారం చుట్టి ఉంటాడు. అదెలా అంటే ఏటా వైకుంఠఏకాదశికి ఆరో రోజు, అంటే అధ్యయనోత్సవాల్లో 17వ రోజున (అధ్యయనోత్సవాల గురించి తరువాత

తెలుసుకుందాం) రెండవఘంట నివేదన తరువాత, మలయప్పస్వామివారు పల్లకీ ఎక్కి ఒంటరిగా మహాప్రదక్షిణమార్గంలోని స్వామిపుష్కరిణి వద్దకు వేంచేస్తారు. ఇంతలో ఇద్దరు అమ్మవార్లూ చెరొక పల్లకిపై అప్రదక్షిణంగా వచ్చి స్వామివారికి ఎదురుగా నిలుచుంటారు.

పురాణపఠనం జరుగుతుండగా, అలక పూనిన అమ్మవార్ల తరఫున జియ్యంగార్లు, వేటకు వెళ్ళివచ్చిన స్వామివారిని మూడు మార్లు పూలచెండ్లతో తాడించుతారు, స్వామివారు బెదిరినట్లు నటించి, తానేమీ తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడతారు. జియ్యరు స్వాములు నమ్మాళ్వార్ విరచిత నిందాస్తుతి పాశురాలను గానం చేస్తుండగా అమ్మవార్లు శాంతించి, స్వామికి ఇరు పార్శ్వాలా చేరి కర్పూరనీరాజనా లందుకుంటారు. అనుభవజ్ఞులైన అయ్యంగార్లు, అర్చకస్వాములు రసవత్తరంగా, హావభావ ప్రదర్శన చేస్తూ ప్రణయఘట్టాన్ని రక్తి కట్టించే ఈ ఉత్సవం, ఆర్జితసేవ కాదు.

ఏడాదికోమారు శ్రీవారి బంగారుకవచాన్ని మార్చే అభిషేకం; దేశవిదేశాల నుండి తెప్పించిన, టన్నులకొద్దీ, రంగురంగుల పరిమళభరిత పుష్పాలతో శ్రీవారికి చేసే యాగం; సుమారు ఐదువేల ఏళ్ళక్రితం తిరుమలకు 30 కి. మీ. దూరంలో శ్రీవారికి పద్మావతి అమ్మవారితో జరిగిన వివాహాన్ని స్ఫురణకు తెచ్చే ఉత్సవం – ఇవన్నీ పఠనాసక్తితో బాటుగా, అలౌకికమైన ఆధ్యాత్మి కానుభూతులు కలిగించేవే!

జ్యేష్ఠాభిషేకం

ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసంలో, జ్యేష్ఠానక్షత్రానికి ముగిసేటట్లుగా, మూడు రోజులపాటు సంపంగిప్రదక్షిణం నందున్న కళ్యాణోత్సవ మంటపంలో శ్రీవారికి జరిగే అభిషేకాన్ని జ్యేష్ఠాభిషేకం లేదా అభిధేయక అభిషేకం గా వర్ణిస్తారు. అభిధేయకం అంటే "నశింపశక్యం గాని రక్షణకవచం."

శ్రీదేవి–భూదేవి సమేత మలయప్పస్వామి విగ్రహాలు 800 సంవత్సరాలకు పైగా పురాతనమైనవి. ఇవి ఇత్తడి, బంగారం, రాగి, వెండి, సీసంల మిశ్రమమైన పంచలోహంతో తయారు చేయబడ్డాయి. నిరంతరం అభిషేకాలు అందుకునే ఈ మూర్తులు అరిగిపోకుండా భద్రపరచడం కోసం ఎల్లవేళలా అవి బంగారుకవచంతో కప్పబడి ఉంటాయి. ఏడాదికో మారు ఈ బంగారు కవచాన్ని జాగ్రత్తగా తొలగించి, అభిషేకాదులు నిర్వహించి, అత్యంత భక్తిశ్రద్ధలతో కవచాన్ని తిరిగి ధరింప జేయటమే ఈ "అభిదేయక అభిషేకం". అలంకార కవచం లేకుండా మలయప్పస్వామి వారి నిజరూపాన్ని దర్శించుకునే భాగ్యం, ఈ అభిషేకం సందర్భంగా మాత్రమే కలుగుతుంది.

- **మొదటిరోజు** శ్రీమలయప్పస్వామికి ఉన్న బంగారు కవచాన్ని తొలగించి, హోమ, అభిషేక, పంచామృత స్నపన తిరుమంజనాదులు జరిపిన తరువాత శ్రీవారికి వజ్రకవచాలంకరణ చేసి పురవీధుల్లో ఊరేగిస్తారు.
- **రెండవరోజు** ముత్యాల కవచాన్ని ధరింపజేసి ఊరేగిస్తారు.
- **మూడవరోజు** తిరుమంజనాదులు పూర్తిచేసి తిరిగి బంగారు కవచధారణ చేసి మాడ వీధుల్లో ఊరేగిస్తారు. ఈ కవచాన్ని ఏడాది తరువాత జ్యేష్ఠాభిషేక సందర్భంగానే మరలా తీస్తారు.

ఈ ఆర్జితసేవలో పాల్గొన్న భక్తులను స్వామివారు అభేద్యమైన కవచంలా కాపాడతారని భక్తుల విశ్వాసం. అంటే అరిషడ్వార్గాలనే శత్రువులు మనపై దాడి చేయకుండా "ఆత్మనిగ్రహమనే" కవచాన్ని మనకు ప్రసాదిస్తారు. ఈ ఆర్జితసేవా రుసుము, ప్రతి ఒక్కరికీ ₹400.

పద్మావతీ పరిణయోత్సవాలు

సుమారు ఐదు వేల ఏళ్ళక్రితం, కలియుగారంభంలో శ్రీమహావిష్ణువు వైకుంఠం నుండి వేంకటేశ్వరునిగా భూలోకానికి తరలివచ్చి వేంకటాచలంలో కొలువై ఉన్నారు. ఆ సమయంలో "నారాయణవనం" రాజ్యాన్ని పరిపాలించే ఆకాశరాజు తన కుమార్తె అయిన పద్మావతీదేవిని వైశాఖశుద్ధ దశమి, శుక్రవారం, పూర్వఫల్గుణీ నక్షత్రలగ్నంలో, శ్రీనివాసునుకి కన్యాదానం చేశాడు. తిరుపతి పట్టణానికి 30 కి. మీ. దూరాన ఉన్న "నారాయణవనం" అనే గ్రామంలో కళ్యాణవేంకటేశ్వరుడి ఆలయాన్నీ, అందులో, పద్మావతీ పరిణయ సందర్భంలో పసుపుకొమ్ములు విసరటానికి ఉపయోగించిన పెద్ద తిరగలినీ, ఈనాడూ మనం చూడవచ్చు. పట్టుచీరెలకు ప్రసిద్ధిగాంచిన ఈ గ్రామాన్ని, అందున్న కళ్యాణవేంకటేశ్వరుని మరియు సొరకాయలస్వామి ఆలయాలనూ, వాటితో పాటు మరెన్నో దేవాలయాలనూ ఈ సారి తప్పక దర్శించండి.

వేంకటేశుడు–పద్మావతీల కళ్యాణానికి విచ్చేసిన ముక్కోటి దేవతలకు ఆకాశరాజు విలాసవంతమైన భవనాల్లో విడిది ఏర్పాటు చేశాడు. కొండలు–కోనల్లో ఉండటానికి ఇష్టపడే శివుని కోర్కెపై, శివపార్వతులకు మాత్రం సమీపంలోని, ఓ పర్వతగుహలో విడిది ఏర్పాటు చేశాడు. ప్రకృతి వడిలో పరవశిస్తూ "కైలాసకోన"గా పిలువబడే ఆ గుహను, అందులో ప్రతిష్ఠితమైన శివపరివారాన్నీ, కొండలమీద నుంచి జాలువారే తీర్థాన్ని నారాయణవనానికి కొద్ది దూరంలో నేడూ చూసి తరించవచ్చు.

శ్రీవేంకటేశ్వరుని కళ్యాణం గురించి మరోసారి వివరంగా తెలుసుకుందాం.

ఆనాటి కళ్యాణ వైభవానికి గుర్తుగా ప్రతి వైశాఖశుద్ధ దశమికీ, మూడురోజుల పాటు ఈ కళ్యాణోత్సవాలు జరుగుతాయి. "నారాయణవనానికి" ప్రతీకగా, తిరుమల లోని "నారాయణగిరి ఉద్యానవనం" లో ఈ వేడుకలు జరుప బడుతాయి. 1992వ సం. లో ఈ ఆర్జితసేవా ఉత్సవాల్ని ప్రారంభించారు.

ముందురోజు, అంటే, వైశాఖశుద్ధ నవమి రోజు సాయంత్రం మలయప్పస్వామి వారు, ఉభయనాంచారులు ప్రత్యేకమైన పల్లకీలలో కళ్యాణోత్సవ మంటపానికి వేంచేస్తారు.

రెండవ, మూడవ రోజులైన దశమి, ఏకాదశి నాడు, వరుసగా, అశ్వవాహనం మరియు గజవాహనంపై కళ్యాణమంటపానికి సర్వ లాంఛనాలతో చేరుకుంటారు. మూడు రోజులూ కళ్యాణవేడుకలు అత్యంత ఘనంగా నిర్వహింప బడతాయి.

అన్నమయ్య తన "శ్రీరాగ" కీర్తనలో పెండ్లి ముచ్చట్లను, పెడ్లికూతురి సిగ్గును, నగలను, తలంబ్రాలవేడుకను ముగ్ధమనోహరంగా వర్ణించాడు:

"పిడికిట తలంబ్రాల పెండ్లికూతురు కొంత
పెడమరలి నవ్వీనె పెండ్లికూతురు
పేరుకల జవరాలె పెండ్లికూతురు పెద్ద
పేరుల ముత్యాల మెడ పెండ్లికూతురు
పేరంటాండ్ల నడుమ పెండ్లికూతురు విభు
పేరుకుచ్చ సిగ్గుపడీ పెండ్లికూతురు!!"

ఈ కళ్యాణోత్సవ వేడుకలు దర్శించిన భక్తుల గృహాల్లో శుభకార్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. ఈ ఆర్జితసేవలో పాల్గొనటానికి ప్రతి వ్యక్తికీ ₹1000 చెల్లించాలి.

పుష్పయాగం

"పుష్పమండపం" గా పేరొందిన తిరుమల, పరిమళాలు వెదజల్లే రంగురంగుల పుష్పాలకు పెట్టింది పేరు. తిరుమల నాడూ, నేడూ కూడా అనేక పూలతోటలతో శోభిల్లుతూ ఉంది. ఆగమశాస్త్రానుసారం స్వామివారికి నిర్వహించే పూజాదికాలయందు విరులకో ప్రత్యేకస్థానముంది. పుష్పార్చన ద్వారా, పంచ ఫలాలైన – శ్రీవారి అనుగ్రహం, పుష్టి (శారీరక దృఢత్వం), వృష్టి (సకాల వర్షాలు), ఐహిక సంపద (ధనధాన్యాలు, భోగభాగ్యాలు), ఆధ్యాత్మిక సంపద (మోక్షం) – పొందవచ్చని పెద్దలు చెపుతారు.

ఆ దేవదేవునికి ప్రకృతివల్ల, క్రిమికీటకాలవల్ల, మానవ తప్పిదాలవల్ల జరిగే అసౌకర్యానికి పరిహారార్థం, దాదాపు అయిదు శతాబ్దాలుగా ఈ పుష్పయాగం నిర్వహింప బడుతోంది. తిరుమలలో అత్యంత కోలాహలంగా జరుపబడే అతి పెద్ద వేడుక – లక్షలాది భక్తులు విచ్చేసే తొమ్మిదిరోజుల "**బ్రహ్మోత్సవాలు**". అంత భారీస్థాయిలో, అనేక విభాగాల సమన్వయంతో జరిగే ఉత్సవాల్లో, ఎంత పకడ్బందీగా ఏర్పాట్లు చేసినప్పటికీ, తెలిసో తెలియకో కొన్ని తప్పులు దొర్లుతాయి. ఆ దోష పరిహారార్థం, బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత వచ్చే, స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణానక్షత్రం నాడు, సంపంగి ప్రదక్షిణమార్గంలోని కళ్యాణోత్సవమంటపంలో, ఈ పుష్పయాగం నిర్వహించబడుతుంది.

15వ శతాబ్దంలో ప్రారంభమైన పుష్పయాగం ఆలయ ఆదాయవ్యయాలపై ఎక్కువ దృష్టిపెట్టిన ఈస్టిండియా కంపెనీ హయాంలో, రెండు శతాబ్దాల క్రితం అర్ధంతరంగా ఆగిపోయింది. 1980 సం. లో, అప్పటి తి.తి.దే. ఆస్థాన విద్వాంసులైన జగన్నాథాచార్యులు, శ్రీమాడబాకం ఆచార్యులు ఈ ఉత్సవాన్ని పునరుద్ధరించారు.

పుష్పయాగానికి ముందు రోజున జరిగే "**అంకురార్పణ**" ఘట్టంలో భాగంగా శ్రీవారిసేనాధిపతి విష్వక్సేనులవారిని ఊరేగిస్తూ, వసంతమంటపంలో పుట్టమన్ను సేకరించి, ఆ మట్టితో ఆలయం చేరుకుని, కళ్యాణోత్సవ మండపంలో

బీజావాపం (నవధాన్యాలను మొలకెత్తించటం) చేస్తారు. పుష్పయాగం జరిగే రోజున రెండో అర్చన, నివేదనానంతరం, ఉభయనాంచారుల సమేతంగా మలయప్పస్వామివారు, ఉదయం తొమ్మిది గంటలకు కళ్యాణోత్సవమంటపానికి వేంచేస్తారు. తొలుతగా స్వామివారికి పంచామృత ద్రవ్యాలతో స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. తరువాత పంచగవ్యప్రాసనం, రక్షాబంధనం, హోమం, రాజోపలాంఛనాలు, నక్షత్రహారతి సమర్పిస్తారు.

రెండు సార్లుగా జరిగే ఈ ఉత్సవంలో, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటలవరకు – అనేక రకాలకు చెందిన, సుమారుగా ఏడు టన్నుల సుమాలతో – ఈ యాగం నిర్వహిస్తారు.

ప్రకృతి ప్రసాదితమైన మల్లె, గులాబీ, చామంతి, కనకాంబరం, గన్నేరు, తెల్లగులాబీ, సంపంగి, నందివర్ధనం, జాజులు, కలువతామరలు; వాటితో బాటు దవనం, మరువం, తులసిదళాలతో స్వామివారిని పూజిస్తారు. వీటితో పాటుగా అనేక రకాలైన, విదేశాలనుండి దిగుమతి చేసుకున్న పూలతో ఈ యాగం సర్వాంగశోభితమోతుంది.

పుష్పయాగానికి వినియోగించే కుసుమాలన్నింటికీ, ఉద్యానవన కార్యాలయంలో ఆలయాధికారులు శాస్త్రోక్తపూజలు నిర్వహిస్తారు. అనంతరం అధికారులు, ఉద్యానవన సిబ్బంది, శ్రీవారిసేవకులు, భక్తులు ఊరేగింపుగా ఈ పూలన్నింటినీ ఆలయం వద్దకు చేర్చుతారు. పుష్పయాగం సందర్భంగా, శ్రీవారి ఆలయం మొత్తాన్ని, ముఖ్యంగా కళ్యాణోత్సవమంటపాన్ని పుష్పాలతో, విద్యుద్దీపాలతో అత్యంత కళాత్మకంగా అలంకరిస్తారు. అంతే కాకుండా, ఆలయ ముఖద్వారం వద్ద, నయనానందకరంగా, పుష్పాలతో స్వామివారి రూపాన్ని ఏర్పాటు చేస్తారు. సాధారణంగా పుష్పాలకు, అలంకారాలకు అయ్యే ఖర్చంతా భక్తులైన దాతలే భరిస్తారు.

అన్నిరకాల పుష్పాలను, అంత పెద్ద మొత్తంలో, బహుశా ప్రపంచంలో మరెక్కడా చూడబోము. నేత్రానందాన్నీ, ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తూ శ్రీవారి వైభవానికి, శ్రీవారి సేవలో పుష్పాలకున్న ప్రాశస్త్యానికి అద్దం పట్టే ఆ పుష్పయాగాన్ని చూసి తరించవలసిందే!

ఆరోజు తిరుమల క్షేత్రమంతా పూల పరిమళంతోనూ, అపరిమిత భక్తిభావంతో పుష్పాలను గంపలతో దేవాలయానికి చేర్చే ఆలయ సిబ్బంది భక్తులసందడి తోనూ, పులకితమవుతుంది. ఆ యాగాన్ని తిలకించి పరవశిస్తున్న భక్తుల మదిలో మెదిలేది ఒకే ఒక్క తలంపు అన్ని కోట్ల పుష్పాలలో తానూ ఒకరై, స్వామివారి పూజాభాగ్యాని కెందుకు నోచుకోలేదూ? ఆ భాగ్యం పొందాలంటే మరెన్ని జన్మలెత్తాలి?

జియ్యరు స్వాములు భక్తిపూర్వంకంగా పుష్పాలను అందిస్తుండగా అర్చకస్వాములు, శ్రీవారి–అమ్మవారి హృదయాలను తాకే వరకూ పూజ చేసి ఆ తరువాత పుష్పాలను తొలగిస్తారు. మరల పుష్పాలతో పూజిస్తారు. ఈ విధంగా 20 సార్లు చేసి, పుష్పాలకు అధిపతియైన "పుల్లుడు" అనే దేవతను ఆవాహన చేస్తారు. ఈ ఆర్జితసేవకు ₹700 రుసుము చెల్లించాలి.

"పూజలందరు జేసేదే పుష్పయాగము
ఆజి నర్జునుడు చేసినది పుష్పయాగము!!"
"తొరలి అలమేల్మంగతురుమున విరులే నీకు

పొరసి నీయురముపై పుష్పయాగము
సిరులతో మునులెల్ల శ్రీ వేంకటాద్రీశ నీకు
పొరి పొరి జేసేరు పుష్పయాగము!!"

ప్రతి ఆర్జితసేవలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీవారి దర్శనభాగ్యం కలుగజేస్తారు.

----------: : ----------

వేంకటేశుని సేవలో విజయనగర సామ్రాట్టులు

"తిరుమల" చరిత్రలో స్వర్ణయుగంగా చెప్పుకోబడే "విజయనగర" రాజుల పరిపాలనా కాలంలో దేవాలయం సర్వతోముఖాభివృద్ధి చెందింది. మనం ఈనాడు తిరుమలలో చూస్తున్న యాత్రికుల వసతి, మంచినీటి, భోజన సదుపాయాలు, రహదారులు, నిఘావ్యవస్థ, కట్టడాలు, మొదలైన వాటన్నింటికీ, అప్పటికి ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో, ఆ రాజుల కాలంలోనే శ్రీకారం చుట్టబడింది. వారు స్వామివారి నిత్యకైంకర్యాలకు, ప్రత్యేక ఉత్సవాలకు, ప్రసాదాలకు, అర్చకస్వాముల ఉదరపోషణకు లెక్కలేనన్నీ మడులు, మాన్యాలు సమర్పించుకున్నారు. ఇక వారు స్వామివారికిచ్చిన నగలు, వజ్రవైఢూర్యాలు, వెండి, బంగారు పాత్ర-పూజా సామగ్రిలకైతే లెక్కేలేదు. నూతనసేవలు, ఉత్సవాలు, తిరుణాళ్ళు ప్రవేశపెట్టి, అవకాశం వచ్చినప్పుడల్లా మంత్రులు, సేనాధిపతులు, దండనాయకులు, సామంతరాజులు, సిబ్బంది, పరివారజన సమేతంగా తిరుమలకు విచ్చేసి, తమకు లభించిన ప్రతి విజయాన్నీ స్వామివారికి అకితం చేసి, స్వామివారి ప్రాభవం దక్షిణభారత దేశమంతా వ్యాప్తి చెందటానికి ఎంతగానో దోహదపడ్డారు. తరచూ పాలకులు సందర్శించటం వల్ల ఆలయ అధికారగణం అప్రమత్తమై ఉండటంతో దేవాలయనిర్వహణ, పూజావిధానాలు ఏ విధమైన లోటుపాట్లు లేకుండా సక్రమంగా జరిగేవి.

శ్రీకృష్ణదేవరాయలు

విజయనగర సామ్రాజ్య చక్రవర్తులందరికీ మకుటాయమానంగా చెప్పుకోబడే, సాహితీసమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు 1509-1530 సంవత్సరాల మధ్యకాలంలో కటకం (నేటి ఒరిస్సాలో భాగం) మొదలు కన్యాకుమారి వరకు విస్తరించియున్న సువిశాల సామ్రాజ్య పరిపాలనలో వ్యస్తుడై ఉండి కూడా; తిరుమలక్షేత్రాన్ని ఏడు సార్లు దర్శించుకుని, స్వామివారికి అమూల్యమైన కానుకలు సమర్పించి తన భక్తితత్పరతను చాటుకున్నాడు. తిరుమలలో లభ్యమైన దాదాపు 50 కు పైగా శాసనాల్లో రాయలు వారు, ఆయన కుటుంబసభ్యుల ప్రస్తావన ఉందంటే, ఆలయానికి, ఆయనకు ఎంత ప్రగాఢ అనుబంధం ఉందో చెప్పుకోవచ్చు. రాయలవారు తిరుమలను సందర్శించిన ప్రతి సందర్భంలో ఏమేమి విజయాలు సాధించాడో, ఎన్నెన్ని కానుకలు సమర్పించాడో ఇప్పుడు వివరంగా చూద్దాం.

మొదటియాత్ర

రాయలువారు తన పరిపాలన ఆరంభ సమయంలోనే సంగమ, సాళువ రాజులకాలంలో చిన్నాభిన్నమైన విజయనగర సామ్రాజ్యలక్ష్మిని గజపతుల నుంచి జయించి; తన పాలనను సుస్థిరం చేసుకున్నాడు. దక్షిణాన మైసూరు వరకూ రాజ్యాన్ని విస్తరించుకుని, పెనుగొండ పాలకులను మరియు ఉమ్మత్తూరులో గంగరాజును ఓడించి, ఇక్కేరి రాజుల పరిపాలనలో ఉన్న ప్రాంతాన్ని యుద్ధం చేయకుండానే స్వాధీనం చేసుకున్నాడు. ఆ సందర్భంలో మొదటిసారిగా 1513 సం. ఫిబ్రవరి మాసంలో తిరుమల క్షేత్రాన్ని దేవేరులిద్దరితో సందర్శించుకుని, తన మహత్తర విజయాన్ని స్వామికి అంకితమిస్తూ వారికో నవరత్నకిరీటం, మూడుపేటల ముత్యాలహారం, వజ్రాలు-రత్నాలు పొదిగిన

15 కంఠాభరణాలు, 5 రకాల మాణిక్యాలతో చేయించిన పతకం, 25 వెండిపళ్ళాలు సమర్పించుకున్నాడు. మహారాణులూ తమవంతుగా స్వామివారికి బంగారు హారతి పళ్ళాలు ఇచ్చారు.

రెండవయాత్ర

మరో మూడు నెలలకల్లా స్వామివారు మళ్ళీ తలంపుకు రాగా అదే సంవత్సరం మే నెల మండుటెండల్లో, ఒంటరిగా స్వామివారిని సందర్శించుకున్నారు. అది అంతకు ముందే సాధించిన విజయాలకు కృతజ్ఞతా భావంతోనో లేక ముందు ముందు చేబట్టబోయే విజయయాత్రలకు నాందీ ప్రస్తావన గానో తెలియదు గానీ కానుకలు మాత్రం మునుపటి కంటే భారీగా సమర్పించు కున్నాడు. ఆ కానుకల జాబితా ఇలా ఉంది –

1. 5 వజ్రాలు, 17 అడ్డిగలు, ఇతర మాణిక్యాలు పొదిగిన ఉదుధార నగ
2. వజ్రాలు, మాణిక్యాలు, కెంపులు పొదిగిన ఒర లో చురకత్తి
3. ముత్యాల ఒరతో వేరొక కత్తి
4. కెంపుల ఒరతో కూడిన ఖడ్గం
5. 87 క్యారట్ల వజ్రాల పతకం
6. వజ్రాలు, రత్నాలు, కెంపులు పొదిగిన ఐదు బంగారు భుజకీర్తులు
7. రెండు బంగారు గొలుసులు
8. ఉత్సవమూర్తులకు, మూలమూర్తికి, దేవేరులకు నవరత్నఖచిత కిరీటాలు

మూడవయాత్ర

మరో నెలన్నర కాలంలోనే, అదే సంవత్సరం జూన్ నెల వర్ష ఋతువులో మళ్ళీ శ్రీవారిని దర్శించుకుని, తన తల్లిదండ్రుల పేరిట బంగారు తాంబూలాలను సమర్పించు కున్నాడు. స్వామివారి సంవత్సర ఉత్సవాల నిమిత్తం కరకంబాడి (చిత్తూరు జిల్లాకు తలమానికమై, వేలమందికి ఉపాధి కల్పిస్తున్న "అమరరాజా బ్యాటరీస్" కర్మాగారం ప్రస్తుతం ఈ గ్రామం చెంతనే ఉంది), ఛత్రవాడి, తూరూరు గ్రామాలను దేవదేయంగా ఇచ్చాడు. ఈ దానశాసనంలో శ్రీకృష్ణదేవరాయల వంశ వృక్షానికి చెందిన సుదీర్ఘవర్ణన ఉంది. ఆయన చంద్రవంశస్థుడనీ; చంద్రుడు, బుధుడు, పురూరవుడు, నహుషుడు ఆయన పూర్వీకులనీ, వీరనరశింహేంద్రుడు–నాగలదేవి ఆయన తల్లిదండ్రులని ఆ శాసనంలో పొందుపరచబడి ఉంది. ఆమె తల్లిగారైన "నాగలదేవి" పేరుమీద "నాగులాపురం" అనే గ్రామం నిర్మించి, అందులో విస్తృతమైన ప్రాకారాలతో, అత్యద్భుత శిల్పసౌందర్యం ఉట్టిపడే "వేదనారాయణస్వామి" ఆలయాన్ని నిర్మించాడు. తిరుపతికి 60 కి. మీ. దూరంలో ఉన్న ఈ దేవాలయాన్ని నేడూ చూసి తరించవచ్చు.

తిరుమలలో అప్పటికే ఏడు బ్రహ్మోత్సవాలు జరుగుతుండగా, రాయలు వారు మూడవసారి తిరుమలయాత్రలో ఎనిమిదవ బ్రహ్మోత్సవాన్ని ప్రవేశపెట్టాడు.

నాల్గవయాత్ర

సరిగ్గా సంవత్సరం తరువాత, ఉదయగిరిదుర్గాన్ని స్వాధీనం చేసుకుని, ఉభయదేవేరులతో 1514 సం. జూన్ నెలలో నాల్గవసారి ఆలయాన్ని సందర్శించుకుని, అన్నమయ్య జన్మస్థలమైన "తాళ్ళపాక" గ్రామాన్ని దేవదేయంగా ఇచ్చి, ఆ ఆదాయంతో స్వామివారి ప్రత్యేక నైవేద్యానికి ఏర్పాట్లు చేశాడు. 30,000 వరహాలతో కనకాభిషేకం చేసి, మూడుపేటల ముత్యాలహారం, రెండు బంగారు కడియాలు కానుకగా ఇచ్చాడు.

ఆ యాత్రలో చిన్నమ్మ, పెద్దమ్మ కూడా పెద్ద ఎత్తున బంగారు కానుకలు సమర్పించుకుని – ముదియారు, పిరాట్టి, కులత్తూరు – అనే గ్రామాలను దేవదేయంగా ఇచ్చుకున్నారు. తిరుమలలో యాత్రికుల సౌకర్యార్థం ఓ సత్రం కూడా ఏర్పాటు చేశారు.

ఆ తరువాత 15 నెలల కాలం అద్దంకి, వినుకొండ కోటల ముట్టడిలో గడిపి, వాటిని వశం చేసుకుని; ధరణికోటలో విజయోత్సవ సంబరాలు అట్టహాసంగా జరుపుకుని; కృతజ్ఞతా సూచకంగా, 1515 సం. అక్టోబరు నెలలో శ్రీవారికి ఓ నవరత్న ప్రభావళిని, మకరకంటినీ రాజలాంఛనాలతో పంపించారు.

ఐదవయాత్ర

కొండపల్లి, అనంతగిరి, ఉర్లకొండ దుర్గాల్ని జయించి, హంపి–విజయనగరం నుండి బయలుదేరి, 1517 సం. జూలై నెలలో ఐదవసారి తిరుమలను ఒంటరిగా సందర్శించుకుని; స్వామివారికి ఓ కంఠమాల, పచ్చల పతకం బహూకరించాడు. అంతే కాకుండా, ఆలయ విమానానికి నాలుగవ సారి బంగారు పూత పూయించడానికి 30,000 వరహాలు ఇచ్చాడు. సెప్టెంబరు నెల, 1517 సం. నాటికి ఆ బృహత్తర కార్యక్రమం పూర్తయ్యింది.

ఆరవయాత్ర

తాను చేపట్టిన బంగారుతాపడం పని పూర్తయిన నలభై రోజులకల్లా, మేలిమి బంగారు కాంతులతో మెరిసిపోతున్న విమానగోపురాన్ని కళ్ళారా చూసుకోవాలని; అక్టోబరు నెల, 1519 సం. లో భార్య తిరుమలదేవమ్మ నెలల కొడుకుతో మళ్ళీ తిరుమలకు వచ్చాడు. అప్పటికి రెండవభార్య స్వర్గస్తురా లయ్యింది. తన కుమారునికి "తిరుమలరాయలు" అని నామకరణం చేసి, అతని పేరున ఉన్న కొన్ని భూములు దేవదేయం చెశాడు. ఇలా, తన కుటుంబం మొత్తాన్ని స్వామిసేవలో తరింప జేశాడు.

ఏడవయాత్ర

1521 సం. ఫిబ్రవరి నెలలో భార్య తిరుమలదేవమ్మతో కలిసి చివరిసారిగా తిరుమల క్షేత్రానికి విచ్చేసి; నవరత్నాలు పొదిగిన పట్టు పీతాంబరం, ముత్యాలు, కెంపులు పొదిగిన తలపాగా, ఆణిముత్యాలు పొదిగిన రెండు చామరాలూ సమర్పించాడు.

తరువాతి కాలంలో అనేకసార్లు తిరుమల యాత్రకు ప్రయత్నించి నప్పటికీ, ఎడతెరిపి లేని యుద్ధాలతో కాలం గడిచిపోయింది. అయితే, తరచుగా శ్రీవారికి ఘనమైన కానుకలు సమర్పించు కోవడం మాత్రం జీవితాంతం కొనసాగింది.

స్వతహాగా తెలుగు, కన్నడభాషల్లో విశేషపాండిత్యం కలిగిన రాయలవారు శ్రీనివాసునికి చేసిన సాహిత్యసేవ కూడా తక్కువేం కాదు. విజయవాడ వద్ద ఉన్న శ్రీకాకుళంలో రాయలవారు ఆంధ్రమహావిష్ణువు దర్శనం చేసుకున్నప్పుడు, ఆయనకు స్వప్నంలో శ్రీమహావిష్ణువు దర్శనమిచ్చి తనపై "ఒక రచన చేసి తిరుమల వేంకటేశునికి అంకితమివ్వ" వలసిందిగా ప్రేరేపించాడు. స్వామి ఆదేశానుసారం, రంగనాథస్వామి ఆండాళ్ కథను "ఆముక్తమాల్యద" అనే ప్రబంధంగా రచించి శ్రీనివాసునికి అంకితమిచ్చాడు. "ఆముక్తమాల్యద" అంటే "ముడిచి విడిచిన దండలను ఇచ్చే అమ్మ". గోదాదేవి ముందుగా తానలంక రించుకున్న పూమాలలను దేవునికి సమర్పించేది.

500 వందల ఏళ్ళక్రితం శ్రీకృష్ణదేవరాయలు పునరిద్ధరించిన "**శ్రీకాకుళాంధ్ర మహావిష్ణువు**" దేవాలయాన్ని విజయవాడకు 30 కి. మీ. దూరంలో నేటికీ దర్శించుకోవచ్చు.

నేటి ప్రకరణం ఆధ్యాత్మిక వాతావరణం నుండి కొద్దిగా వైదొలగి, చరిత్రపుటల్లోకి తొంగి చూచింది. సహృదయంతో అర్థం చేసుకోగలరు. తెలుగువారి ఇలవేలుపు శ్రీవేంకటేశుని ఆలయాభివృద్ధికి విశేషంగా పాటుపడి, దక్షిణ భారతదేశంలోని అనేక ప్రాచీన దేవాలయాలను పునరుద్ధరించి, తిరుమలక్షేత్రంలో భక్తులకు ఆనాడే తగిన వసతులు కల్పించి, అష్టదిగ్గజాలనబడే కవి పుంగవుల నాదరించి తెలుగు సాహిత్యాభివృద్ధి కెంతగానో పాటుపడిన రాయలవార్ని స్మరించుకోక పోతే, "తిరుమల సర్వస్వం" సంపూర్ణం కాదనిపించి ఈ ప్రకరణాన్ని రాయలవారికి అంకితమవ్వటం జరిగింది.

అచ్యుతరాయలు

శ్రీకృష్ణదేవరాయల అనంతరం, అతని సోదరుడైన అచ్యుతరాయలు శ్రీవేంకటేశ్వరుని సమక్షంలో ఆలయశంఖంతో సంప్రోక్షణ గావించుకుని విజయనగర సామ్రాజ్యాన్ని చేపట్టాడు. రాజ్యాభిషిక్తుడైన వెంటనే, జీర్ణదశలో ఉన్న, మనందరికీ సుపరిచితమైన "కపిలతీర్థం" ఆలయాన్ని పునరుద్ధరించి; తీర్థానికి ఇరు ప్రక్కలా (కోనేటి చుట్టూ) సంధ్యావందన మండపాలు నిర్మించాడు. ఈ తీర్థానికి పూర్వకాలంలో చక్రతీర్థమనే పేరుండడం వల్ల, ఆలయానికి నాలుగు దిక్కులా చక్రచిహ్నాలను చెక్కించాడు. తిరుపతి పట్టణం నందు తిరుమల ఘాట్ రోడ్డు ప్రారంభంలో, నంది సర్కిల్ వద్ద ఆ కపిలతీర్థాన్ని, పొడవాటి మండపాలను నేడూ మనం చూడవచ్చు. ఆ సువిశాలమైన మంటపాలన్నీ నేటికీ, మరీ ముఖ్యంగా కార్తీకమాసంలో, కపిలేశ్వరుని దర్శనార్థం వచ్చి తీర్థస్నాన మాచరించే భక్తులతో క్రిక్కిరిసి ఉంటాయి.

మూడు పర్యాయాలు తిరుమలను దర్శించుకున్న అచ్యుతరాయలు మొదటిసారి 1533 సం. లో కపిలగోవులతో బాటుగా మరెన్నో ఆభరణాలు, దుస్తులు స్వామివారికి దానం చేసి, స్వామివారికి కనకాభిషేకం కావించాడు. అర్చకులు సహస్రనామాలు చదువుతూంటే, స్వామికి స్వయంగా అర్చన చేసేవాడు.

అలాగే 1535 లో రెండవసారి, 1537 లో మూడవసారి తిరుమలకు విచ్చేసినప్పుడు అనేక ధార్మిక కార్యక్రమాలు చేపట్టి ఆలయచరిత్రలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు.

తిరుమల క్షేత్రంలో అనేక ఉత్సవాలు ఊరేగింపులు ప్రవేశపెట్టి, వాటికి తగినంత ప్రచారం కల్పించి, భక్తులు ఎక్కువగా తిరుమలను దర్శించుకునేట్లు చేయగలిగాడు. రాజధాని పట్టణమైన హంపి–విజయనగరం నుండి నర్తకీమణుల్ని రప్పించి తిరుమల ఉత్సవాల్లో నాట్యాలను కూడా ప్రవేశపెట్టాడు. నిత్యపూజానంతరం మనం చేసే "షోడశోపచారాల్లో" నాట్యోపచారం కూడా ఒకటి. "నృత్యం దర్శయామి" అని కూడా చదువుతాం కదా!!

శ్రీకృష్ణదేవరాయలి కాలంలో విజయనగర సామ్రాజ్యానికి మంత్రియైన "మహామంత్రి తిమ్మరుసు" కూడా, వేకటేశ్వరుడికి వీర భక్తుడే. భార్యాసమేతంగా తిరుమలను సందర్శించుకుని, అనేక కానుకలతో పాటు "పరాంతలూరు" అనే గ్రామాన్ని దేవదేయంగా సమర్పించుకున్నాడు. అలాగే విజయనగర రాజులకు మంత్రిగా, సేనాధిపతిగా పని చేసిన సాళువనరశింహుడు; విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన సదాశివరాయలు, అళియరామరాజు మొదలగు చక్రవర్తులు కూడా ఆలయాభివృద్ధికి విశేష కృషి చేశారు. కొండ మీదకు వచ్చిన భక్తులకు కానీ ఖర్చు లేకుండా భోజన, వసతి, దర్శనం లాంటి సదుపాయాలన్నీ విజయనగర సామ్రాజ్య పాలనలోనే ప్రారంభమై నేటికీ కొనసాగుతున్నాయి.

అ విధంగా తిరుమల ఆలయంతో విజయనగర రాజులకున్న అనుబంధం 1365 సం. లో మొదటి బుక్కరాయలుతో ప్రారంభమై, 300 సంవత్సారాలు అప్రతిహతంగా కొనసాగి, 1665 సం. లో శ్రీరంగరాయల తిరుమల దర్శనంతో ముగిసింది. తరువాత ఆలయ నిర్వహణ అనేక చేతులు మారి, చివరిగా 1933 సం. లో తి.తి.దే. చేతికి వచ్చింది.

విజయనగర చక్రవర్తుల పాలన అంతమైనా, తిరుమలపై ఆధిపత్యం ఎన్ని చేతులు మారినా; వారు ఆలయంలో ప్రవేశపెట్టిన అనేక సేవలు సాంప్రదాయాలు, భక్తులకు వారు ఏర్పాటు చేసిన సౌకర్యాలు; నేటికీ కొనసాగుతూ, వారు దేవాలయాభివృద్ధికి చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచి పోయింది.

వ్యాసరాయలు వారు

విజయనగర చక్రవర్తులైన వీరనరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుతరాయలు ఈ ముగ్గురికీ గురువుగా ప్రసిద్ధికెక్కిన వ్యాసరాయలు, ద్వైతసాంప్రదాయ పీఠాధిపతులు. వీరిని "వ్యాసతీర్థులు" గా కూడా పిలుస్తారు. తపఃసంపన్నుడైన ఈ పండితోత్తముడు, సూత్రభాష్యం, ఋగ్వేదభాష్యం, గీతాతాత్పర్యం లాంటి 37 సర్వమూల గ్రంథాలు రచించాడు. వ్యాసతీర్థులవారు, భగవద్రామానుజార్యుల వలనే, తిరుమలక్షేత్రాన్ని ఓ దివ్యసాలగ్రామంగా భావించి, తిరుమల మెట్లను కాళ్ళతో ఎక్కి అపవిత్రం చేయరాదని తలంచి, మోకాళ్ళతో అధిరోహించినట్లు చెబుతారు.

ఆనందనిలయ విమానంలో వాయువ్యమూలన ఉన్న ఓ చిన్న శ్రీనివాసుని విగ్రహానికి "విమానవేంకటేశ్వరునిగా" ప్రాణప్రతిష్ఠ జరిపించడం ద్వారా "ఏ కారణంచేతనైనా, స్వామివారి దర్శనం చేసుకోలేక పోయినట్లైతే, విమానవేంకటేశ్వరుణ్ణి దర్శించుకుంటే స్వామివారిని దర్శించుకున్నట్లే" అన్న సాంప్రదాయానికి వ్యాసతీర్థులవారే శ్రీకారం చుట్టారు. వారు 108 పెద్ద సాలగ్రామాలకు బంగారు తొడుగులు చేయించి, "సాలగ్రామమాల" గా తయారుచేసి స్వామివారికి అలంకరింప జేశారు.

కన్నడదేశాన విజయనగర సామ్రాజ్యకాలంలో వైష్ణవాన్ని, వేంకటేశ్వరస్వామినీ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది వ్యాసరాయలవారే.

వీరు ప్రతిష్ఠచేసిన 1,008 ఆంజనేయ విగ్రహాలలో ఒకటైన "కోనేటి గట్టు ఆంజనేయుణ్ణి" ఇప్పుడు కూడా మనం స్వామి పుష్కరిణికి ఉత్తరం దిక్కున దర్శించుకోవచ్చు. ఆ దేవాలయానికి ప్రక్కనే "వ్యాసరాయ ఆహ్నిక మండపంగా" పిలువబడే ఓ కాషాయరంగు లోని ఉన్న మండపాన్ని నేడు కూడా చూడవచ్చు. వ్యాసరాయలు వారు అర్చకత్వం వహించిన రోజుల్లో, వారు ఆ మండపంలోనే నివాసం ఉన్నట్లుగా కొందరు చెబుతారు.

వారు హిందూధర్మాన్ని పరిరక్షించి అప్పటివరకూ అగ్రవర్ణాలవారికి మాత్రమే అందుబాటులో ఉన్న పురాణేతిహాసాలను, వైష్ణవప్రబంధాలను, స్వామివారి కీర్తనలను జనబాహుళ్యంలోకి తెచ్చారు. నిమ్నకులస్థుడైన "కనకదాసు" అనే భక్తుణ్ణి చేరదీసి, అయనను శిష్యునిగా స్వీకరించారు. తరువాతి కాలంలో, కనకదాసు కన్నడ వాగ్గేయకారునిగా ప్రసిద్ధికెక్కి, స్వామివారిపై అనేక కీర్తనలు రచించి గానం చేశాడు. కనకదాసు, పురందరదాసు మరి కొందరు దాసభక్తులు రచించిన కీర్తనలను తి.తి.దే. వారు సేకరించి, కన్నడిగులకు "దాసప్రాజెక్టు" గా వెలుగులోకి తెచ్చారు. అలాగే, జాతి, వర్ణ, వర్గాలకు అతీతంగా, భక్తి ఉద్యమం వేళ్ళూనుకుని సర్వ వ్యాపితమవ్వాలనే ఉద్దేశ్యంతో తెలుగువారికి "అన్నమాచార్య" ప్రాజెక్టు, తమిళులకు "దివ్య ప్రబంధ ఆళ్వార్" ప్రాజెక్టులను తి.తి.దే. చేపట్టింది.

తిరుమలలో బ్రహ్మోత్సవాల నిర్వహణ నిమిత్తం 14000 నర్పణాలను, పౌర్ణమినాటి నైవేద్యానికి "బద్దంపెట్ట" అనే గ్రామాన్ని వ్యాసరాయలవారు దేవదేయంగా ఇచ్చారు.

శ్రీకృష్ణదేవరాయలు ఒకానొకప్పుడు "కుహూ" యోగమనే కాలసర్పదోష గ్రస్తులయ్యారు. అప్పుడు వ్యాసతీర్థులవారు కొన్ని ఘడియలపాటు విజయనగరసామ్రాజ్య సింహాసనాన్ని అధిష్ఠించి, శ్రీకృష్ణదేవరాయల వారిని తాత్కాలికంగా సింహాసనాన్నుంచి తప్పించి, తన తపఃశక్తితో రాయలవారికి జాతకరీత్యా కలిగిన సర్పదోషాన్ని తొలగించారు. సింహాసనాన్ని అధిష్ఠించడంతో, ఆయన విజయనగరచక్రవర్తుల వంశనామమైన "రాయలు" బిరుదాంకితులై, "వ్యాసరాయలు" గా పిలువబడ్డారు.

అదే సమయంలో అప్పటి వైఖానస అర్చకుడు స్వామివారి నగలు అపహరించాడనే నేరం మీద దేశబహిష్కరణకు గురై, అర్చకత్వానికి అనర్హుడయ్యాడు. అతని వారసుడు అప్పటికింకా పసిబాలుడు కావడంతో, వ్యాసరాయలు వారు 12 సంవత్సరాలు శ్రీవారికి అర్చకత్వం వహించారు. దానితో బాటుగా ఆ బాలుణ్ణి సంరక్షించి, ఆగమశాస్త్రప్రకారంగా

అర్చనావిధానాలను నేర్పించి, యుక్తవయసులో అతనికి అర్చకత్వ బాధ్యతలు తిరిగి అప్పగించారు; శ్రీవారి అర్చన సాంప్రదాయం పరహస్తగతం కాకుండా కాపాడి, వైఖానస అర్చక పరంపర కొనసాగేట్లు చేశారు.

ఆ విధంగా, తిరుమల ఆలయానికి, వ్యాసరాయలు వారికి, విడదీయరాని అనుబంధం ఉంది. శ్రీకృష్ణదేవరాయలను సర్పదోషం నుంచి రక్షించడం, ఆలయంలో స్వయంగా అర్చకత్వం వహించడం, వైఖానస అర్చకసాంప్రదాయం పర హస్తగతం కాకుండా చూడడం, స్వామివారి కీర్తనలను జనబాహుళ్యంలోకి తీసుకెళ్ళడం వంటి మహత్తరమైన పుణ్యకార్యాల ద్వారా, ఆయన స్వామివారి భక్తులందరికీ పూజనీయుడయ్యాడు.

----------: : ----------

శ్రీవారి బ్రహ్మోత్సవాలు

"తిరువీధుల మెరసీ దేవదేవుడు
గరిమల మించిన సింగారముల తోడను"

లక్షలాది మంది భక్తుల గోవిందనామ స్మరణతో దిక్కులు పిక్కటిల్లుతుండగా, అడుగడుగు దండాలతో ఆబాలగోపాలం హారతి పడుతుండగా, సర్వాలంకారశోభితుడైన శ్రీవారు వివిధ వాహనారూఢుడై మాడవీధుల్లో ఊరేగే మహత్తర ఘట్టాల సమాహారమే "శ్రీవారి బ్రహ్మోత్సవాలు". వాటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

పౌరాణిక నేపథ్యం

ఈ బ్రహ్మోత్సవాలను తొలిసారిగా సాక్షాత్తూ బ్రహ్మదేవుడే తన తండ్రిగారైన, కలియుగంలో శ్రీవేంకటేశ్వరుని రూపంలో ఆవిర్భవించిన శ్రీమహావిష్ణువుకు జరిపించినట్లు భవిష్యోత్తరపురాణంలో చెప్పబడింది. అందుకే అవి "బ్రహ్మోత్సవాలు" గా ప్రసిద్ధికెక్కాయి. అయితే, తిరుమలలో జరిగే మిగిలిన ఉత్సవాలతో పోలిస్తే ఇవి చాలా పెద్ద ఎత్తున జరుగుతాయి కాబట్టి వీటిని "బ్రహ్మోత్సవాలు" అంటారని కొందరు భావిస్తారు. ఏది ఏమైనా భక్తులను విశేషంగా ఆకర్షిస్తూ; మహమ్మదీయ, క్రైస్తవపాలకుల హయాంలో కూడా నిరంతరాయంగా కొనసాగుతూ, ఈ "బ్రహ్మోత్సవాలు" తమ వైశిష్ట్యాన్ని చాటుకుంటున్నాయి.

"నానాదిక్కుల నరులెల్లా
వానలలోనే వత్తురు గదలి..."

అంటూ, అన్నమాచార్యుల వారు బ్రహ్మోత్సవాలను సందర్శించటానికి భక్తులు నలు దిక్కుల నుండి ఎండవానలను లెక్కజేయకుండా, తండోపతండాలుగా ఎలా కదలి వస్తారో వివరించారు.

చారిత్రక నేపథ్యం

చారిత్రకాధారాలు లభ్యమైనంత వరకూ, మొట్టమొదటగా బ్రహ్మోత్సవాల ప్రస్తావన 614వ సం. లో వచ్చింది. అప్పట్లో, తమిళ నెల "పెరటాసి" మాసంలో జరిగే బ్రహ్మోత్సవాలలో భోగశ్రీనివాసుణ్ణి ఊరేగించేవారు. 966వ సం. లో, పది రోజులపాటు జరుపబడే బ్రహ్మోత్సవాల చివరి రోజును "తీర్థవారి దినం" గా పిలిచేవారు. తరువాతి కాలంలో నిడివిని మరో రోజు పొడిగించి, 11వ రోజున "విదయాత్ర" పండుగ నిర్వహించేవారు. వివిధ పాలకుల హయాంలో ఈ బ్రహ్మోత్సవాలను వివిధ పేర్లతో పిలిచినప్పటికీ, రోజుల సంఖ్యలో కొద్ది మార్పులున్నటికీ, ఈ ఉత్సవాలు దాదాపు 1400 సం. లుగా తమ మౌలికస్వభావాన్ని యథాతథంగా ఉంచుకో గలిగాయి. తెలుగు పల్లవరాజు విజయగండగోపాలుడు "ఆడితిరునాళ్ళు" పేరుతోనూ, వీరప్రతాపదేవరాయలు "మాసి తిరునాళ్ళు" పేరుతోనూ, అచ్యుతరాయలు "అచ్యుతరాయ బ్రహ్మోత్సవం" పేరుతోనూ, ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేవారు. 1583వ

సం. లో నెలకో సారి జరిగే బ్రహ్మోత్సవాలు, 1638వ సంవత్సరంలో 11 సార్లు నిర్వహించబడ్డాయి. ఒక్కోసారి 3 నుంచి 5 రోజులవరకూ ఈ ఉత్సవాలను జరిపించేవారు. బ్రహ్మోత్సవాల్లో ఏ రోజు ఏ వాహనం మీద స్వామిని ఊరేగించాలనే విషయం ఆగమశాస్త్రంలో నిర్దిష్టంగా చెప్పబడలేదు. ఆయా కాలాల్లో అప్పటి నిర్వాహకులు, అర్చకస్వాములు కలిసి ఏ ఏ వాహనాలను ఏ ఏ రోజుల్లో ఉపయోగించాలో నిర్ణయించేవారు. కాలక్రమేణా ఉత్సవాల స్థాయి, వైభవం పెరుగుతూ, రోజుల సంఖ్య తగ్గుతూ వచ్చి, ప్రస్తుతం ఈ ఉత్సవాలను సంవత్సరానికో సారి, తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్నారు. అదే, అధికమాసం వచ్చిన సంవత్సరంలో మాత్రం రెండు సార్లు నిర్వహిస్తారు. ఆ వివరాలు తరువాత తెలుసుకుందాం.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

పూర్వకాలంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా పంపించే ఆహ్వానం ఆసక్తికరంగా ఉండేది. శ్రీవారి ఆలయద్వారం ముందుగా పెద్దశబ్దం వచ్చేట్లు బాణాసంచా పేల్చేవారు. తరువాత మహంతుల కాలంలో భక్తులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ; చుట్టుప్రక్కల పల్లెలు, పట్టణాలు, తిరుమల గ్రామంలో "దండోరా" వేసేవారు. ఈమధ్య కాలం వరకూ తిరుమల గ్రామప్రజలు తమ ఇళ్ళను కొబ్బరి, అరటి, మామిడి ఆకులతో అలంకరించుకుని, దేవాలయాన్ని కూడా శోభాయమానంగా అలంకరించి; ఇతరగ్రామాల్లో ఉన్న తమ బంధుమిత్రులను స్వంత ఇంట్లో శుభాకార్యానికి ఆహ్వానించినట్లు బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేవారు. దేవాలయ పరిశుభ్రత, భద్రత, యాత్రికులకు వసతి, భోజనం, మంచినీటి సౌకర్యం లాంటి ఏర్పాట్లన్నీ తిరుమల గ్రామప్రజలే స్వయంగా నిర్వహించేవారు.

బ్రహ్మోత్సవాల్లో రకాలు

- నిర్ధారిత మాసంలో, నిర్ధారిత నక్షత్రంలో 3, 5, 7, 9, 11, 13 రోజులపాటు జరిగేవాటిని "నిత్యబ్రహ్మోత్సవాలు" అంటారు. ఇప్పుడు మనం చెప్పుకుంటున్నది ఈ బ్రహ్మోత్సవాల గురించే!
- కరువులు, వ్యాధులు, దుష్టగ్రహకూటములు సంభవించినప్పుడు ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాలను "శాంతిబ్రహ్మోత్సవాలు" అంటారు.
- భక్తులెవరికైనా కోరిన కోర్కెలు నెరవేరిన సందర్భంగా, స్వంతధనం వెచ్చించి జరిపించుకునేవి "శ్రద్ధాబ్రహ్మోత్సవాలు". శ్రీవారి ఆలయంలో ప్రతిరోజూ జరిగే."ఆర్జితబ్రహ్మోత్సవాలు" ఈ కోవలోకే వస్తాయి.
- ఇవన్నీ కాకుండా, తిరుమలలో సంవత్సరానికి ఒక్కరోజు మాత్రమే జరిగే మరో మూడు బ్రహ్మోత్సవాలున్నాయి. అవి రథసప్తమినాడు జరిగే "ఆర్షము", కైశికద్వాదశి రోజున జరిగే "రాక్షసం", ముక్కోటి ఏకాదశి నాడు జరిగే "దైవికం".

పుష్ప, విద్యుద్దీపాలంకరణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా, ఉద్యానవన విభాగ ఆధ్వర్యంలో తిరుమలప్రధాన ఆలయాన్ని, ఉత్సవ వాహనాలను, పరిసరాలను, మాడవీధులను, ఇతర దేవాలయాలను, మండపాలను, కూడళ్ళను, రహదార్లను రంగు రంగుల

పుష్పాలతో శోభాయమానంగా అలంకరిస్తారు. ఇందు నిమిత్తం పోయిన బ్రహ్మోత్సవాల్లో సుమారు 40 టన్నుల సాంప్రదాయపుష్పాలు, రెండు టన్నుల కట్ ఫ్లవర్స్, 50 వేల ఆ కాలంలోమాత్రమే దొరికే పుష్పాలను వినియోగించారు. ఇంతే కాకుండా వందలకొద్దీ విద్యుత్ కార్మికులు వారాల తరబడి శ్రమించి కళ్ళు మిరుమిట్లు గొలిపేలా; లక్షలాది విద్యుద్దీపాలతో అనేక పౌరాణికపాత్రలు, భారత భాగవత ఘట్టాలు, వన్యప్రాణులు, దేవతలు మున్నగువాటిని ఆవిష్కరింప జేస్తారు.

కళాకార్ల బృందాలు

వివిధ కళారూపాలతో స్వామివారిని కొలుస్తూ భక్తులకు కనువిందు చేయటంకోసం, 2019 బ్రహ్మోత్సవాలకు 18 రాష్ట్రాలనుండి, 357 బృందాలుగా, 8200 మంది కళాకారులు విచ్చేశారు. ఏటా ఈ సంఖ్య పెరుగుతూనే ఉంది. మాడవీధుల్లో స్వామివారి వాహనానికి ముందుండి ఈ కళాకారులందరూ వివిధరకాల విన్యాసాలు, దేవతామూర్తుల వేషధారణ, అభినయం, కోలాట ప్రదర్శన, కోయనృత్యాలు, కూచిపూడి, భరతనాట్యం, అస్సాంకు చెందిన బిహు నాట్యం, ఉత్తరాఖండ్ కు చెందిన చోలియా నృత్యం, తమిళనాడుకు చెందిన టపాటం, గరగాటం, బయలాటం, సయ్యాండిమేళం, కొక్కిల్ ప్రదర్శనలతో భక్తులను అలరిస్తారు. దాదాపుగా భారతదేశంలో నుండే అన్ని కళారూపాలను మనం బ్రహ్మోత్సవాల సందర్భంగా, మాడవీధులలో చూసి ఆనందించవచ్చు. ఆలయానికి నాలుగు ప్రక్కలా ఉన్న మాడవీధుల గ్యాలరీల్లో కూర్చుని సుమారు రెండు లక్షలమంది భక్తులు ఈ ఉత్సవాల్ని కన్నులపండువగా వీక్షిస్తారు. వివిధ మాధ్యమాల ద్వారా ఈ ఉత్సవాల్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

గజరాజుల సేవ

పద్మ, పెద్దపద్మ, లక్ష్మి, మహాలక్ష్మి అనే నలుగురు గజరాజులను మావటీలు ముందుగా శుభ్రంచేసి, ముస్తాబు చేసి, శరీరం కాంతివంతంగా మెరిసిపోవడానికి నువ్వులనూనెతో మర్దనా చేస్తారు. వీటి నుదుటన తెల్లనినామాలు, మధ్య సింధూరంతో అలంకరించి ఆలయం వద్దకు తీసుకుని వస్తారు. అలాగే, అలంకరించిన వృషభాలను కూడా తోడ్కొని వస్తారు.

నూతన గొడుగుల వితరణ

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా చెన్నైకు చెందిన హిందూమహాసభ సభ్యులు గత ఎనిమిది సంవత్సరాలుగా శ్రీవారికి ఈ క్రింది వాటిని లాంఛనప్రాయంగా సమర్పిస్తున్నారు:

- 12 జానల శ్వేతగొడుగులు: 2
- 10 జానల పట్టుగొడుగులు : 2
- 6 జానల శ్వేతగొడుగులు : 2

ఈ గొడుగులన్నింటినీ వైభవోత్సవమండపానికి తీసుకుని వచ్చి, అక్కడినుండి ఆలయ అధికారులతో కలసి వాటిని ఆలయంలోనికి తీసుకు వెళతారు.

స్వామివారి వాహనానికి వెనుకగా, "ఘటాటోపం" అనబడే ఒక గుడారాన్ని పరిచారకులు మోసుకుంటూ వెళ్తారు. అకస్మాత్తుగా వర్షం వస్తే స్వామివారి వాహనానికి ఇది రక్షణ కల్పిస్తుంది.

దర్భ సమర్పణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా తి.తి.దే. అటవీ శాఖాధికారులు, ఆలయ అధికారులకు దర్భను సమర్పిస్తారు. ధ్వజారోహణపర్వంలో; ఆలయం నందు నిర్వహించే సేవలు, కైంకర్యాలు, హోమాల్లో ఈ దర్భను వినియోగిస్తారు. ఈ దర్భతో తయారు చేయబడిన చాప, తాడు ఊరేగింపుగా తీసుకుని వచ్చి ఆలయాధికారులకు అందజేస్తారు. ఈ దర్భను తిరుమలలోని కళ్యాణవేదిక కెదురుగా ఉండే తి.తి.దే. అటవీ విభాగం నర్సరీల్లోనూ, తిరుపతి సమీపం నందున్న వడమాలపేట గ్రామంలోని పొలంగట్ల నుండి సేకరిస్తారు. ఇలా సేకరించిన దర్భలను పదిహేను రోజులు నీడలో ఆరబెడతారు. ఆ దర్భతో తయారు చేసిన కొడితాడు, చాప, విడిగా సుమారు 10 కిలోల దర్భను అధికారులకు అందజేస్తారు.

రవాణా సదుపాయాలు

తిరుపతి–తిరుమల మధ్య రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడిపే తొలి బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, బస్సులన్నింటినీ అరటి పిలకలు, మామిడి తోరణాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో రోజుకు సుమారు 400 బస్సులతో, 2000 ట్రిప్పులతో, రెండు లక్షలమంది భక్తులను కొండపైకి చేరవేస్తారు. గరుడవాహనం రోజున ఈ సంఖ్య దాదాపుగా రెట్టింపవుతుంది.

భోజనసదుపాయాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా నిత్యం సుమారు మూడు లక్షల మందికి ఉచిత భోజనం అందజేస్తారు. గరుడసేవ రోజున రాత్రి 1:30 గం. వరకూ, భోజనాలు వడ్డిస్తుంటారు. ప్రధాన అన్నదాన కేంద్రమైన తరిగొండ వెంగమాంబ భవనంలోనే కాకుండా, తిరుమలలోని వివిధ కూడళ్ళలో కూడా అన్నదానం చేస్తుంటారు. భోజన ఏర్పాట్లు ఏ స్థాయిలో జరుగుతాయంటే క్రితం బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రోజున రెండు లక్షల పులిహోర పొట్లాలు, లక్షా డెబ్బయ్యైదు వేల పళ్ళాల టమాటా అన్నం, సాంబారన్నం సరఫరా చేశారు. మొత్తం 32,500 కిలోల బియ్యం, 20 వేల లీటర్ల పాలు, 8000 కిలోల ఉప్మారవ్వను ఉపయోగించారు. దాదాపుగా ఈ మొత్తం సరుకుల్ని దాతలే సమకూర్చారు.

వివిధ విభాగాల సేవలు

వేలకొద్దీ పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తూ, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తారు. అలాగే, డజన్లకొద్దీ వైద్యసిబ్బంది

అహోరాత్రులు వైద్యసేవల నందిస్తుటారు. వేలకొద్దీ పోలిసులతో బాటుగా, వందలాది మంది ఆలయ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేస్తారు. వేలాదిమంది శ్రీవారిసేవకులు, స్కౌట్లు క్యూల నిర్వహణతో బాటు, భక్తులకు ఇతరసేవల నందిస్తుంటారు. "వాహనబేరర్లు" రెండు పూటలూ కలిపి సుమారుగా రోజుకు ఐదు గంటల పాటు స్వామివారి వాహనాల్ని మోస్తుంటారు. బ్రహ్మోత్సవాల్లో లడ్డూ మొదలగు ప్రసాదాల్ని కూడా భారీగా తయారు చేయిస్తారు.

ఉత్సవాలు, ఊరేగింపులు ఎందుకు జరుగుతాయి?

అశౌచం, అంగవైకల్యం, అనారోగ్యం, వృద్ధాప్యం, సమయాభావం లేదా మరే ఇతర కారణాల చేతనైనా గుడిలోని దేవుణ్ణి దర్శించుకోలేని వారికోసం దైవమే స్వయంగా, ఉత్సవమూర్తుల రూపంలో, ఆలయం వెలుపలి కేతెంచి భక్తులను అనుగ్రహించటం కోసం; ఆగమశాస్త్రానుసారం ఉత్సవాలు, ఊరేగింపులు ప్రవేశ పెట్టబడ్డాయి. దేవతలు, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుషులూ, మానవులే కాకుండా అనేక వన్యమృగాలు, పక్షులు కూడా స్వామివారి సేవలో తరించాయి. అవి వేర్వేరు సమయాల్లో స్వామివారికి సమర్పించిన సేవలకు గుర్తుగా బ్రహ్మోత్సవాల్లో స్వామివారు జంతు మరియు ఖగ (పక్షి) వాహనాలపై ఊరేగుతారు.

తిథి – నక్షత్రాలు

సాధారణంగా, ప్రతి ఆలయంలో ఉత్సవాలను ప్రారంభ తిథికి అనుగుణంగా మొదలు పెడతారు. కానీ తిరుమలలో మాత్రం ముగింపు రోజును పరిగణనలోకి తీసుకుని ఉత్సవాలను ప్రారంభించే సాంప్రదాయం అనాదిగా ఉంది. కన్యారాశిలో శ్రవణా నక్షత్రం నాడు "అవభృధము" లేదా "చక్రస్నానం" నిర్ణయించి, దానికి తొమ్మిది రోజుల ముందుగా బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తారు. సాధారణ సంవత్సరాల్లో – అంటే అధికమాసం లేని సంవత్సరాల్లో – ఈ బ్రహ్మోత్సవాలు ఆశ్వయుజ మాసమందు దసరా నవరాత్రుల్లో ఒక్కసారి మాత్రమే వస్తాయి. వీటిని "సాలకట్లబ్రహ్మోత్సవాలు" అంటారు. ఉత్తరభారతీయ భాషల్లో "సాల్" అంటే సంవత్సరం, "కట్ల" లేదా "కట్టడి" అనే తెలుగు పదానికి "సాంప్రదాయం" అని అర్థం. మహంతుల కాలం నుండి ఈ పదం వాడుకలోనికి వచ్చింది.

అదే అధికమాసం వచ్చిన సంవత్సరాల్లో బ్రహ్మోత్సవాలు రెండుసార్లు జరుగుతాయి. ఈ సంవత్సరాల్లో కన్యాశ్రవణం భాద్రపదమాసంలో వస్తుంది. ఈ మాసంలో జరిగే బ్రహ్మోత్సవాలను "వార్షికబ్రహ్మోత్సవాలు" అని పిలుస్తారు. ఇవి ముఖ్యమైనవి. ఆ సంవత్సరంలో రెండవసారి, ఆశ్వయుజమాసంలో జరిగే ఉత్సవాలను "నవరాత్రి బ్రహ్మోత్సవాలు" గా పిలుస్తారు. ఈ సందర్భంలో, అధికమాసం గురించి కొద్దిగా చెప్పుకోవాలి.

తమిళులు ఎక్కువగా అనుసరించే, సంవత్సరానికి 365 రోజులు గల సౌరమానంలో అధికమాసాలు లేవు. కానీ, తెలుగువారు అధికంగా అనుసరించే చంద్రమానంలో సంవత్సరానికి 354 దినాలు. అంటే చాంద్రమాన సంవత్సరం, సౌరమాన సంవత్సరం కంటే 11 రోజులు తక్కువగా ఉండటంతో చంద్రమానంలో సూర్య సంక్రమణం లేని మాసం వస్తుంది. అదే అధికమాసం. సౌరమానం మరియు చంద్రమానాన్ని సమన్వయ పరచడం కోసం ఏర్పాటు చేయబడిన

ఈ అధికమాసం ప్రతి మూడవ సంవత్సరంలో వస్తుంది. ఇలా సమన్వయించక పోతే, ఋతుచక్రం కొంత కాలానికి గతి తప్పుతుంది.

సాలకట్లబ్రహ్మోత్సవాలు మరియు వార్షిక బ్రహ్మోత్సవాలు, "అంకురార్పణ', "ధ్వజారోహణం' తో ప్రారంభమై "ధ్వజావరోహణం" తో ముగుస్తాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఇవి ఉండవు. ఇంకో ముఖ్యమైన తేడా ఏమిటంటే వార్షిక బ్రహ్మోత్సవాల్లో రథోత్సవానికి "కొయ్యతేరు" ను ఉపయోగిస్తారు. అదే, నవరాత్రి బ్రహోత్సవాల్లో కొయ్యతేరుకు బదులు మొదట్లో వెండి రథాన్ని, ప్రస్తుతం బంగారు రథాన్ని ఉపయోగిస్తున్నారు.

బ్రహ్మోత్సవాల పరమార్థం

బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు జరిగే అంకురార్పణ పర్వం నుండి తొమ్మిదవ రోజున జరిగే చక్రస్నానం వరకు జరిగే ప్రతి వేడుక, ప్రతి ఉత్సవం, స్వామివారు అధిరోహించే ప్రతి వాహనం సందేశాత్మకమే. వాహనాలపై విహరించే మలయప్పస్వామిని దర్శించుకుంటే అశ్వమేధయాగం చేసినంత ఫలితం వస్తుందని పురాణాల్లో చెప్పబడింది.

అంకురార్పణ ఘట్టం

ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల యందు అర్చకుల్లో ఒకరిని "కంకణ భట్టాచార్యులు" గా నియమిస్తారు. అంకురార్పణఘట్టం నుండి చక్రస్నానం వరకు వాహనసేవల్లో, యాగశాలలో, ఇతర పూజాదికాల్లో ఆయనే ప్రధానపాత్ర వహిస్తారు. ఆగమశాస్త్రప్రకారం ఉత్సవాలు పూర్తయ్యేంత వరకూ వీరు పొలిమేర దాటి వెళ్ళరాదు.

వైఖానస ఆగమ సాంప్రదాయ క్రతువుల్లో తలపెట్టిన కార్యక్రమం విజయవంతం కావటంకోసం తొలిగా జరిపించే "అంకురార్పణం" లేదా "బీజావాపనం" అత్యంత ముఖ్యమైన ఘట్టం.

ఈ ఘట్టం ఆరంభంలో, స్వామివారి సేనాధిపతి అయిన విష్వక్సేనుడు నాలుగు మాడ వీధుల్లో ఊరేగే సన్నివేశాన్ని అన్నమయ్య ఇలా వర్ణించాడు –

"అది వచ్చె నిది వచ్చె నచ్యుత సేనాపతి
పది దిక్కులకు నిట్టె పార లో యసురులు".

తాత్పర్యమేమంటే, "విష్ణుదేవుని యొక్క సేనాధిపతి అయిన విష్వక్సేనుని రాక దానవులందరికీ భయం కలిగించింది."

బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడానికి ముందురోజున, విష్వక్సేనులవారు పంచాయుధ ధారియై తన తిరుచ్చి వాహనంపై ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి నాలుగు మాడ వీధుల్లో బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తారు. ఇందులో భాగంగా పడమర వీధి లోని నైఋతి మూలన ఉన్న వసంతమండపం లోకి విచ్చేస్తారు. ఆ తరువాత నిర్ణీతప్రదేశంలో భూదేవి ఆకారాన్ని చిత్రించి, అందులోని లలాట, బాహు, స్థన ప్రదేశాల నుండి మట్టిని తీసి ఆలయం లోనికి తీసుకు వస్తారు. దీన్నే "మృత్సంగ్రహణం" లేదా "పుట్టమన్ను సేకరించటం" అంటారు. ఆలయంలోని యాగశాలకు సమీపంలో అంకురార్పణ జరిగే ప్రదేశాన్ని ముందుగా ఆవుపేడతో శుద్ధిచేసి, తరువాత సేనాధిపతికి ఆ

ప్రదేశంలో "బ్రహ్మపీఠాన్ని" ఏర్పాటు చేస్తారు. తదుపరి, అగ్ని ద్వారా – బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ – దేవతలను ఆహ్వానిస్తారు. ముందుగా సేకరించి నటువంటి, మట్టితో నింపిన 9 పాళికల్లో శాలి, వ్రీహి, యువ, ముద్గ (పెసలు), మాష (మినుములు), ప్రియంగు (కొర్రలు) వంటి నవధాన్యాలను చల్లి, వరుణ మంత్రాన్ని పఠించి నీరు చిలకరిస్తారు. ఈ పాళికలను నూతన వస్త్రాలతో అలంకరించి పుణ్యాహవచనం చేస్తారు. ప్రతిరోజు ఈ పాళికల్లో నీరు పోస్తూ పచ్చగా మొలకలు వచ్చేలా చూస్తారు. అందుకే ఇది "అంకురార్పణ కార్యక్రమం" గా పిలువ బడుతుంది. ఈ కార్యక్రమానికి సోముడు లేదా చంద్రుడు అధిపతి. పాళికల లోని నవధాన్యాలు శుక్లపక్ష చంద్రునిలా దినదినాభివృద్ధి చెందాలని ప్రార్థిస్తారు. ఆ తరువాత సోమరాజమంత్రాన్ని, విష్ణుసూక్తాన్ని పఠిస్తారు. ఖగోళశాస్త్రనుసారం ఔషధాధిపతి చంద్రుడు కాబట్టి, రాత్రి సమయంలోనే విత్తనం నాటడం ఆనవాయితీగా వస్తోంది. ఇలా వేడుకగా, శాస్త్రయుక్తంగా సమకూరే అంకురార్పణ కార్యక్రమంతో స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకలు మొదలవుతాయి.

ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల తొలిరోజు సాయం సమయాన జరిగే ఉత్సవం "ధ్వజారోహణం". ఇందులో భాగంగా శ్రీదేవి-భూదేవి సమేత మలయప్పస్వామి వారికి ఏకాంతంగా తిరుమంజన ప్రక్రియ నిర్వహించి నైవేద్యం సమర్పిస్తారు. ఆ తరువాత స్వామి వారిని ధ్వజస్తంభం వద్దకు చేరుస్తారు.

ఈలోగా ఆగమశాస్త్రానుసారం కంకణధారణ, అష్టదిక్కుల్లో అర్చకుల బలినివేదన, శాస్త్రోక్తంగా జరిపి ధ్వజపటాన్ని మాడవీధుల్లో ఊరేగిస్తూ ఆలయం వద్దకు తీసుకొస్తారు.

మలయప్పస్వామి వారి సమక్షంలో, వేదగానాలమధ్య మంగళవాద్యాలు మ్రోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజం లేదా ధ్వజపటం ఎగురవేస్తారు. స్వామివారి వాహనం గరుడుడు కాబట్టి, గరుడిని బొమ్మ చిత్రీకరించిన క్రొత్తవస్త్రమే ధ్వజపటం లేదా గరుడధ్వజం. కొడిత్రాడు సాయంతో దాన్ని ధ్వజస్తంభ శిఖరానికి చేరుస్తారు. గగనతలాన ఎగిరే ఈ గరుడ పతాకమే సకల దేవతలకు, అష్టదిక్పాలకులకు, భూత-ప్రేత-యక్ష-రాక్షస-గంధర్వగణాలకు ఆహ్వానం పలుకుతుంది. ఈ ఆహ్వానం అందుకుని ఉత్సవాలకు విచ్చేసిన ఆహ్వానితులందరికీ, నైవేద్య రూపంలో బలిని సమర్పిస్తారు. ఈ సందర్భంగా, "ముద్గాన్నం" అనబడే పెసరపులగం నివేదించ బడుతుంది. దీన్ని స్వీకరిస్తే స్త్రీలు సంతానవతు లవుతారని భక్తుల విశ్వాసం.

ప్రస్తుతం సాయంకాలాలలో జరుపబడే ధ్వజారోహణం నాడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు బేడి ఆంజనేయస్వామి వారి సన్నిధి నుండి ఊరేగింపుగా వచ్చి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. దాంతో బ్రహ్మోత్సవాలు ఆరంభమైనట్లే!

ఆ రాత్రి నుండే స్వామివారు ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేర్వేరు వాహనాలపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహిస్తారు.

వాహనోత్సవ క్రమం

వాహనోత్సవక్రమం ఈ విధంగా ఉంటుంది:

బ్రహ్మోత్సవాల ముందు రోజు – అంకురార్పణ ఘట్టం

- **మొదటి** రోజు సాయంత్రం ధ్వజారోహణం, వెనువెంటనే పెద్దశేషవాహనం
- **రెండవ** రోజు ఉదయం చిన్న శేష వాహనం, సాయంత్రం హంసవాహనం
- **మూడవ** రోజు ఉదయం సింహవాహనం, సాయంత్రం ముత్యపుపందిరి వాహనం
- **నాల్గవ** రోజు ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం సర్వభూపాల వాహనం
- **ఐదవ** రోజు ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం గరుడవాహనం
- **ఆరవ** రోజు ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం స్వర్ణరథం, తదుపరి గజవాహనం
- **ఏడవ** రోజు ఉదయం సూర్యప్రభవాహనం, సాయంత్రం చంద్రప్రభవాహనం
- **ఎనిమిదవ** రోజు ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం
- **తొమ్మిదవ** రోజు ఉదయం పల్లకి ఉత్సవం, మధ్యాహ్నం తిరుచ్చి ఉత్సవం, తదనంతరం 6 గంటలకు చక్రస్నానం

ఇలా మొత్తం పదిహేడు వాహనాలెక్కి ఊరేగుతుండడం వల్లనే స్వామివారు భక్త జనులకు ప్రీతిపాత్రు దయ్యాడట. అందుకే అన్నమయ్య స్వామివారిని ఈ విధంగా కీర్తించాడు.

"ఎట్టు నేరిచితివయ్య ఇన్ని వాహనములెక్క
గట్టిగా నిందుకే హరి కడు మెచ్చేమయ్యా!"

తండ్రిగారికి తనయుడు చేసే సేవ

బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఉత్సవ వాహనాల ముందుగా "బ్రహ్మరథం" వెళుతూ ఉంటుంది. ఎందుకంటే శ్రీవారి బ్రహ్మోత్సవాలు బ్రహ్మదేవుని నేతృత్వంలో, ఆయన సమక్షంలో జరుగుతున్నాయని లోకాలకు తెలియపరచడం కోసం! శ్రీవారి వాహనానికి ముందు, శోభాయమానంగా అలంకరించిన ఓ చిన్న రథంలో, నిరాకార నిర్గుణ స్వరూపంలో బ్రహ్మదేవుడు వేంచేసి ఉత్సవాలకు ఆధ్వర్యం వహిస్తాడు. కానీ ఒక్క రథోత్సవం నాడు మాత్రం అదృశ్యంగా స్వామివారి రథం యొక్క పగ్గాలను స్వయంగా పట్టి లాగుతూ రథోత్సవంలో పాల్గొంటాడు. అందుకే ఆరోజు స్వామివారి వాహనమైనం ముందు, బ్రహ్మదేవుడు వేంచేసి ఉండే చిన్న రథం ఉండదు.

లోక కళ్యాణార్థమై ఈ ఉత్సవాలను ఏర్పాటు చేసిన బ్రహ్మను గుర్తుకు తెస్తూ, శ్రీవేంకటేశ్వర అష్టోత్తర శతనామావళిలో "ఓం బ్రహ్మకృతోత్సవాయ శ్రీవేంకటేశాయ నమః" అనే నామం చేర్చబడింది. దీనర్థం, '**బ్రహ్మచే ఏర్పాటు చేయబడిన మహోత్సవాలను స్వీకరించిన శ్రీవేంకటేశ్వరునికి ప్రణామం**."

బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారు అధిరోహించే ప్రతి వాహనానికి జన్మజన్మల ఆధ్యాత్మిక చరిత్ర ఉంది. ప్రతి జన్మలోనూ వాటికి శ్రీవారితో విడదీయరాని అనుబంధం ఉంది. ఒక్కో వాహనం ఒక్కో సందేశాన్నిస్తుంది. ఆ పదిహేడు

వాహనాల చరిత్ర, అవి మనకందించే సందేశాలు ఇప్పుడు వివరంగా చూద్దాం.

పెద్దశేష వాహనం

అన్నమయ్య, బ్రహ్మోత్సవాల్లో శేషవాహన శోభనీ విధంగా వర్ణించాడు:

వీడుగదే శేషుడు శ్రీ వేంకటాద్రి శేషుడు
వేడుక గరుడునితో బెన్నుద్దైన శేషుడు ॥
పట్టుపు వాహనమైన బంగారు శేషుడు
చుట్టు చుట్టుకొనిన మించుల శేషుడు
నట్టుకొన్న రెండువేల నాలుకల శేషుడు
నెట్టిన వారి బొగడ నెరుపరి శేషుడు ॥

ధ్వజారోహణ జరిగిన రోజు, అంటే బ్రహ్మోత్సవాలలో మొదటిరోజు రాత్రివేళలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి వారికి ఏడు పడగల బంగారు "పెద్దశేషవాహనం" పై ఉత్సవం జరుగుతుంది. కృతయుగంలో అనంతునిగా, త్రేతాయుగంలో లక్ష్మణునిగా, ద్వాపరంలో బలరామునిగా, కలియుగంలో భగవద్రామానుజాచార్యులుగా అవతరించి; శ్రీమన్నారాయణుడికి మిక్కిలి సన్నిహితునిగా ప్రసిద్ధికెక్కినవాడు ఆదిశేషుడు.

శారీరక దృఢత్వం మరియు బుద్ధిబలం సమృద్ధిగా, సమపాళ్ళలో కలిగిన ఈ ఆదిశేషుడు, శ్రీ మహావిష్ణువుకు – సింహాసనంగా, శయ్యగా, పాదుకలుగా, వస్త్రంగా, ఛత్రంగా, ఆనుకునే దిండుగా – ఇలా సమస్తసేవలు ఎల్లవేళలా అందిస్తున్నాడు. ఆదిశేషుడు నాగజాతికి అధిపతి.

ఆదిశేషునికి సంబంధించి ఓ ఆసక్తికరమైన కథ ఉంది. ఒకానొకప్పుడు, కశ్యప ప్రజాపతి భార్యలైన వినతి–కద్రువల మధ్య ఒక వివాదం ఏర్పడింది. ఇంద్రుని ఉచ్చైశ్రవం వాస్తవంగా స్వచ్ఛమైన శ్వేతవర్ణంతో ఏ విధమైన మచ్చలు లేకుండా ఉంటుంది. దాని తోకపై ఓ నల్లటి మచ్చ ఉందని, ఒకవేళ అది నిజమైతే వినతి తనకు దాస్యం చేయాలని, లేకుంటే తానే వినతికి దాస్యం చేస్తానని కద్రువ, వినతితో పందెం కాసింది. అయితే, ఉచ్చైశ్రవం మీద ఏ విధమైన మచ్చ లేదని తరువాత తెలుసుకున్న కద్రువ తన కుమారులైన నాగులను పిలిచి, ఎవరైనా ఒక నాగు ఉచ్చైశ్రవం తోకకు చుట్టుకుని దాన్నే నల్లటి మచ్చగా భ్రమింపజేసి తనను పందెంలో గెలిపించాలని కోరింది. అటువంటి అనైతిక కార్యం సాకారం చేయడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. తనయుల ధిక్కారంతో ఆగ్రహం చెందిన కద్రువ, వారందరూ తల్లి మాట వినని కారణంచేత జనమేజయుని సర్పయాగంలో మాడి మసైపోతారని శపించింది. నాగుల్లో ఒకడైన కర్కోటకుడనే వాడు మాత్రం శాపానికి భయపడి, తల్లి మాట ననుసరించి ఉచ్చైశ్రవం తోకను చుట్టుకొని ఆమెను పందెంలో గెలిపింప జేశాడు.

మిగిలిన నాగుల్లో ఒకడైన ఆదిశేషుడు తన తల్లి, సోదరుడు చేసిన అనైతిక కార్యానికి విరక్తి చెంది బ్రహ్మను గూర్చి

దీర్ఘతపస్సు చేశాడు. అతని ధర్మనిరతి, సత్యనిష్ఠకు సంతృప్తి చెందిన బ్రహ్మదేవుడు, ఆదిశేషునికి భూమిని ధరించే మహత్తర కార్యాన్ని అప్పగించాడు. ఆ ప్రకారం అపరిమిత బలసంపన్నుడైన ఆదిశేషుడు, తన పడగలపై భూభారాన్నంతటినీ నిరంతరం మోయసాగాడు. అత్యంత కష్టతరమైన ఆ కార్యాన్ని ఎంతో శ్రద్ధగా, త్యాగనిరతితో నిర్వహిస్తున్న ఆదిశేషుణ్ణి చూసి సంతోషించిన శ్రీమహావిష్ణువు అతన్ని తన శయ్యగా, సింహాసనంగా ఎంచుకున్నాడు.

ఈ వాహనసేవను చూసి తరించిన భక్తులకు ఆదిశేషుని కున్నంత సహనం, త్యాగనిరతి, ధర్మనిష్ఠ, శ్రీనివాసుని ఎడల అచంచలమైన భక్తి కలుగుతాయని ప్రతీతి.

ఉభయనాంచారులతో కూడిన మలయప్పస్వామిని పుష్పమాలాలంకృతుణ్ణి చేసి, వాహనమండపంలో ఉన్న ఆదిశేషునిపై అధిరోహింప జేసి, మాడవీధుల్లో జరిపించే ఊరేగింపును బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైనదిగా పరిగణిస్తారు. మొదట్లో తొమ్మిదవ రోజు ఉదయం ఊరేగింపునకు ఉపయోగించే ఈ వాహనం, కారణాంతరాల వల్ల ఇప్పుడు మొదట్లోనే వినియోగించ బడుతోంది.

శేషవాహనం దాస్య భక్తికి నిదర్శనం. ఆ భక్తితో అంకితభావం పెంపొంది, పశుత్వం నశించి, క్రమంగా మానవత్వం, అందుండి దైవత్వం, దానిద్వారా పరమపదం సిద్ధిస్తాయని నమ్మిక.

మామూలు రోజుల్లో ఈ వాహనాన్ని సంపంగిప్రదక్షిణ మార్గంలోని రంగమండపంలో మనం దర్శించుకోవచ్చు.

చిన్నశేషవాహనం

రెండవరోజు ఉదయం మలయప్పస్వామివారు ఒంటరిగా చిన్నశేషవాహనంపై, మురళీకృష్ణునిగా లేదా నవనీతగోపాలునిగా దర్శనమిస్తారు.

మునుపటి రోజున స్వామివారు అధిరోహించిన "పెద్దశేషవాహనం" విష్ణుమూర్తి సింహాసనమైన ఆదిశేషుని ప్రతిరూపం కాగా; ఈరోజు ఉదయం శ్రీవారు ఊరేగే "చిన్నశేషవాహనం" క్షీరసాగరమథనంలో మంథరపర్వతానికి కవ్వపుత్రాడుగా వ్యవహరించిన "వాసుకి" యొక్క ప్రతిరూపం.

ఆదిశేషుడు "నాగజాతి" కి రాజైతే, వాసుకి "సర్పజాతి" కి పాలకుడు. ఆదిశేషునికి నిత్య సాన్నిధ్యభాగ్యం కలిగించిన విష్ణువు సాగరమంథన కార్యానికి తోడ్పడ్డ వాసుకికి మాత్రం "చిన్నశేషవాహనం" గా మారి బ్రహ్మోత్సవాల్లో తన సేవచేసుకునే అదృష్టాన్ని కల్పించాడు.

శేషుడు, వాసుకి, ఇద్దరూ చైతన్యశక్తికి సంకేతాలు. కావున ఈ రెండు వాహనాల దర్శనంతో, భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరుస్తుంది. యోగశాస్త్రంలో సర్పాన్ని కుండలినీ శక్తికి సంకేతంగా భావిస్తారు. కావున ఈ వాహనానసేవలను దర్శించిన భక్తులకు కుండలినీ యోగఫలం సిద్ధించి, మానవుడు, మాధవునికి నిజమైన సేవకుడయ్యే అవకాశం లభిస్తుంది.

తరిగొండ వెంగమాంబ ఈ రెండు వాహనాలను ఈ విధంగా వర్ణించింది:

అలఘు శేషవాహనోత్సవంబును,
మరునాడుదయంబు నందు లఘుశేషవాహనోత్సవంబును

హంసవాహనం

హంస వాహనముపైన హరి నేడు చూడరు
వీణాపాణియై వేయి రాగాలతో
అందరి గుండెలోను అమృతం కురియగా...

రెండవరోజు సాయంత్రం, శ్రీవారు వీణాపాణి, ధవళవస్త్రధారి, చల్లని వెన్నెల లొలికించే తెల్లని పుష్పాలు ధరించిన చదువులతల్లి రూపంలో, బంగారు హంసవాహనారూఢుడై మాడవీధులలో విహరిస్తారు. పురాణాల ప్రకారం — ఒకప్పుడు లోకాలన్నీ అజ్ఞానతిమిరంలో మునిగిపోయి ఉండగా; దేవతల కోర్కెపై, విష్ణువు హంసవాహనమెక్కి హయగ్రీవునిగా లోకాలకేతెంచి తిమిరాన్ని పారద్రోలుతాడు. అలాగే, బ్రహ్మోత్సవాలలో స్వామివారు హంసవాహన మెక్కి "అన్ని కళలకూ, సర్వవిజ్ఞానానికి కారణభూతుణ్ణి నేనే, అన్నీ నా ద్వారానే సిద్ధిస్తాయి!" అన్న సందేశమిస్తారు.

జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిమ్
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే

– అన్న శ్లోకంతో మొదలయ్యే "హయగ్రీవస్తోత్రం" సారాంశమిదే.

చదువులతల్లి సరస్వతి రూపంలో ఉన్న స్వామివారిని దర్శించుకుంటే, అజ్ఞానతిమిరం తొలగిపోకుండా ఉంటుందా?

సృష్టికర్తయైనట్టి బ్రహ్మదేవుని వాహనమైన హంసకు, వేరెవ్వరికీ లేనటువంటి ఓ అద్భుతమైన విచక్షణాశక్తి ఉంది.

గుంభనమున దుగ్ధజీవన విభాగ విధాన నిరూఢ నైపుణీ జనిత మహాయశో విభవసారము

– అనగా, ఓ పాత్రలో క్షీరనీర మిశ్రమాన్ని ఉంచితే, హంస పాలను మాత్రం గ్రహించి, నీటిని త్యజిస్తుంది. అలాగే, సృష్టిలో విచక్షణాజ్ఞానం కలిగి ఉన్న ఏకైక జీవి మానవుడు, నిరంతర సాధన చేస్తూ, చరాచర విశ్వంలో సమ్మిళితమై ఉన్నటువంటి బ్రహ్మతత్వాన్ని ఆకళింపు చేసుకుని, ఐహిక వాంఛలన్నీ పరిత్యజించాలి. నిస్సారమైన ప్రాపంచిక పాశాలలో నిగూఢంగా నిక్షిప్తమై ఉన్న ఆత్మసాక్షాత్కారాన్ని ఆవిష్కరింప జేసుకోవాలి. హంసవాహనా రూఢుడైన శ్రీవారు అందించే సందేశ మిదే!

సింహవాహనం

బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు ఉదయం మలయప్పస్వామి ఒక్కరే సింహవాహనంపై ఊరేగుతారు.

"మృగాణాం చ మృగేంద్రో అహం" అంటూ భాగవతంలో శ్రీకృష్ణభగవానుడు తనను తాను "మృగాల్లో సింహరాజుగా" అభివర్ణించు కున్నాడు. అపరిమితమైన "సింహబల" మంత భక్తి గలవారిని స్వామి అనుగ్రహిస్తారనే సందేశం ఈ వాహనసేవ ద్వారా పంపబడుతుంది.

సింహానికీ – శ్రీవారికి అనేక సారూప్యాలు, అత్యంత సాన్నిహిత్యం ఉన్నాయి –

- శ్రీవారి నిలయమైన ఆనందనిలయ విమానంపై నలుదిక్కులా, సింహప్రతిమలు వేంచేసి ఉంటాయి.
- విష్ణుసహస్రనామ పారాయణంలో సింహనామం రెండు పర్యాయాలు వస్తుంది (శ్లోకాల సంఖ్య 22 మరియు 52).
- దశావతారాల్లో నృశింహావతారము నాలుగవది. అలాగే, బ్రహ్మోత్సవాల్లో కూడా సింహవాహనం నాల్గవది కావడం విశేషం.

యోగశాస్త్రంలో సింహం సహనశక్తికీ, గమనశక్తికీ ప్రతీకగా చెప్పబడుతుంది. సింహాన్ని చూసి ఇతర జంతువులు భయపడినట్లు, సింహవాహనాన్ని అధిష్ఠించిన శ్రీవారిని చూచి సమస్త మానవులు "తప్పు చేసినచో భగవంతుని దండన తప్పదు" అనే భయం కలిగి విచక్షణాజ్ఞానంతో వ్యవహరిస్తారు. యోగా నరసింహస్వామిగా సింహవాహనంపై ఊరేగుతున్న స్వామివారు దుష్టజనసంహార, భక్తజన సంరక్షణ సంకేతాలు జనియింప చేస్తారు.

హిరణ్యకశిపుని చీల్చి చెండాడిన నరసింహావతారాన్ని ఆళ్వార్లు ఎంతో భక్తితో పూజించారు. ఈ సింహం ప్రహ్లాదుని ప్రార్థనకు పూర్వం అదృశ్యశక్తిగా రాక్షసభవన స్తంభంలో దాగి ఉంది. శ్రీహరి పరమభక్తుడైన ప్రహ్లాదుడు "హరి ఎందెందు వెదకిన అందందే గలడు" అంటూ తన తండ్రికి ధైర్యంగా సమాధాన మిచ్చాడు. ఆ బాలభక్తుని వాక్కు సాకారం చేయడం కోసం; సకల చరాచర సృష్టిలో నిక్షిప్తమై ఉన్నటువంటి శ్రీహరి స్తంభాన్ని చీల్చుకుని, నారసింహుని రూపంలో ప్రత్యక్షమై, దుష్టుడైన హిరణ్యకశిపుణ్ణి అంతమొందించాడు. కృతయుగంలో ఆ నాస్తికస్తంభాన్ని ఛేదించి వెలికి వచ్చి దుష్టసంహారం గావించినట్లు; ఈ కలియుగంలో నాస్తికత్వాన్ని పటాపంచలు చేసి మానవుల హృదయాలలో భక్తిభావాన్ని పెంపొందించి వారిని సన్మార్గంలో నడిపించడానికై స్వామివారు సింహవాహనంపై ఊరేగుతారు.

జయజయ నృసింహ సర్వేశ
భయహర వీర ప్రహ్లాద వరద!!
మిహిర శశినయన మృగన రవేష
బహిరంతస్థల పరిపూర్ణ అహినాయక సింహాసన రాజిత
బహుళ గుణగణ ప్రహ్లాద వరద!!

ప్రతి సంవత్సరం వాహనాలు స్థిరంగా ఉంటాయి గానీ, అందులోని మలయప్పస్వామి వేషధారణలో మాత్రం స్వల్పమార్పులు ఉంటాయి. ఉదాహరణకు, ఒక సంవత్సరం నవనీత గోపాలుడయితే, మరో సంవత్సరం కాళీయమర్దను డవుతాడు.

ముత్యపుపందిరి వాహనం

మూడవరోజు రాత్రి ముత్యపుపందిరి వాహనంపై శ్రీదేవి–భూదేవిలతో కూడిన మలయప్పస్వామి వారు తిరుమల మాడ వీధుల్లో విహరిస్తారు. వాహనాన్ని నిండుగా ముత్యాల సరాలతో అలంకరించి, వాటి చివర్ల పట్టుకుచ్చులు

అమర్చి, కళ్యాణశోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దుతారు. వాహనానికి నలువైపులా కట్టబడి యున్న సరిగంచు పట్టుపరదాలకు, శ్వేత వర్ణంతో తళుకులీను తున్న ముత్యాలను ఒద్దికగా పేర్చి ఫల, పుష్ప, జంతు, వస్తు ఆకృతులను సృష్టిస్తారు.

చల్లని ముత్యాల పందిరిలో వేంచేసియున్న శ్రీనివాసుని దర్శనం, భక్తుల మదిలోని తాపత్రయాలను తొలగించి, జీవితాలకు అలౌకిక ప్రశాంతత చేకూర్చుతుంది. స్వచ్ఛతకు, నిర్మలత్వానికి, అసమాన సౌందర్యానికి ప్రతీక అయిన ముత్యం, స్వాతికార్తెలో పడిన వర్షపుచినుకు ద్వారా సముద్రగర్భం లోని ముత్యపు చిప్పలో ఉద్భవిస్తుంది. సాగరం ప్రసాదించే మేలి వస్తువుల్లో "ముత్యం" ముఖ్యమైనది.

అంతటి ప్రాశస్త్యం ఉన్న ముత్యాలకు – శ్రీమహావిష్ణువుకు ఉన్న అనుబంధం యుగయుగాలుగా కొనసాగుతోంది:

- ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు "నాసాగ్రే నవమౌక్తికం" – అనగా "ముక్కుకొనలో నూతన ముత్యాన్ని ధరించిన వాడుగా" కీర్తించబడ్డాడు.
- కలియుగంలో శ్రీనివాసుడు – "మౌక్తిక స్రగ్వి" అంటే, "ముత్యాలహారాన్ని ధరించినవాడు" అని ప్రస్తుతింపబడ్డాడు.
- స్వామి వారు అనునిత్యం ధరించే అనేకానేక ఆభరణాలలో మేలుజాతి ముత్యాలు పొదగబడి ఉంటాయి.
- పద్మపురాణంలో ముత్యాలతో చేయబడిన ఓ ఛత్రం విష్ణుమూర్తికి నీడనిచ్చినట్లుగా చెప్పబడింది.
- కృతయుగంలో శ్రీమహావిష్ణువు "ముక్తాత ప్రతితానంత మండలుడు" అంటే "ముత్యాల గొడుగుల రూపంలో ఉన్న ఆదిశేషుని యొక్క వేయి పడగల క్రింద విశ్రాంతి తీసుకుంటున్నట్లు" వర్ణించబడింది.
- నేడు కలియుగంలో ఈ ముత్యాలపందిరి స్వామివారికి నీడనిస్తూ, చల్లదనం చేకూరుస్తుంది.

శరన్నవరాత్రులలో నిర్మలాకాశంలో మెరుస్తున్న నక్షత్రాలతో పోటీ పడుతూ, విద్యుద్దీపాల కాంతిలో ప్రకాశిస్తున్న ముత్యాల పందిరి వాహనం రసరమ్య భరితంగా ఉంటుంది. శ్రీనివాసుని భక్తిలో ఓలలాడిన భక్తులందరూ పులుకడిగిన ముత్యంలా స్వచ్ఛమైన మనస్సుతో ఆవిష్కరింపబడతారు.

కల్పవృక్షవాహనం

బ్రహ్మోత్సవాలలో నాల్గవరోజు ఉదయం శ్రీదేవి–భూదేవి సమేతుడైన మలయప్పస్వామి, కల్పవృక్షవాహనంపై విహరిస్తూ భక్తులను అలరిస్తారు. కాండము, శాఖలు, పత్రాలు, పుష్పాలు, లతలు, ఇలా: వృక్షభాగాలన్నింటినీ మేలిమి బంగారంతో, కళాకౌశలం ఉట్టిపడేలా, సృజనాత్మకంగా తీర్చిదిద్దుతారు.

ప్రకృతికి శోభనిచ్చేది వృక్షం. సృష్టిలోని వృక్షాలన్నింటికీ మేటి కల్పవృక్షం. క్షీరసాగరమథనంలో ఉద్భవించిన ఈ కల్పవృక్షం మనోవాంఛా ఫలాలను సిద్ధిస్తుంది.

ఎల్ల ఋతువులందు నెలరారి పరువమై కోరివచ్చువారి కోర్కులు నీనెడు వేల్పుమాను పాలివెల్లి బుట్టె

– అంటే దేవతలు, రాక్షసులు క్షీరసముద్రాన్ని అమృతం కోసం చిలుకుతున్నప్పుడు: అన్ని ఋతువులలోనూ పచ్చగా నుండి, కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షం ఉద్భవించింది.

అది ఐహిక సుఖాలను మాత్రమే అందిస్తుంది. కానీ, ఆ వాహనాన్ని అధివేష్ఠించి ఉన్న శ్రీనివాసుడు ఐహిక, ఆముష్మిక సుఖాలను కూడా ప్రసాదిస్తాడు.

అన్నమయ్య రామావతారుడైన శ్రీమహావిష్ణువును కోర్కెలు తీర్చే కల్పవృక్షము, కామధేనువు, చింతామణిగా ఇలా వర్ణించాడు –

గౌతము భార్యాపాలిటి కామధేను వితడు,
ధాతల కౌశికుపాలి కల్పవృక్షము,
సీతాదేవి పాలిటి చింతామణి ఇతడు,
ఈతడు దాసులపాలి ఇహపరదైవము //

కృష్ణావతారంలో శ్రీకృష్ణుడు సత్యభామ కోర్కె తీర్చడం కోసం పారిజాతవృక్షాన్ని దివి నుంచి భువికి తెచ్చి ప్రతిష్ఠించాడు. ఇప్పుడు కలియుగంలో ఆశ్రిత భక్తజన వాంఛితాలను యీడేర్చడం కోసం శ్రీవారు కల్పవృక్షవాహనంపై విహరిస్తున్నారు.

వృక్షం అనంతమైన జీవజాలానికి ఆలవాలం. చెట్టు తొర్రలు, బొరియలు, వ్రేళ్ళు, శాఖలు సమస్తం పక్షులకు, చీమలకు, పాములకు ఇంకా అనేక రకాల క్రిమికీటకాలకు ఆవాసం కల్పిస్తాయి. చెట్లు మానవజాతికి ఫల, పుష్పాదులను ప్రసాదించడమే గాకుండా, జీవం కోల్పోయిన తర్వాత కూడా కలప నిచ్చి శాశ్వత నివాసం కల్పించడానికి తోడ్పడతాయి. అనేక ఔషధాలు చెట్ల నుండి తయారవుతాయి. అదేవిధంగా, కల్పవృక్షవాహనంలో కొలువైన శ్రీవారిని దర్శించుకుంటే "పండిన పెరటి కల్పము వాస్తవ్యుండు" అన్నట్లు స్వామి వారు కల్పవృక్షంలా భక్తుల కోర్కెలను కాదనకుండా తీర్చుతారు.

సర్వభూపాలవాహనం

బ్రహ్మోత్సవాల్లో నాల్గవనాటి రాత్రి మలయప్ప స్వామి శ్రీదేవి–భూదేవిలతో సర్వభూపాలవాహనంపై తిరుమల మాడ వీధుల్లో విహరిస్తారు. మేలిమిబంగారంతో, అచ్చెరువొందే శిల్పకళా సోయగంతో, ఇంద్రభవనాన్ని తలపించే రాజప్రాసాదాన్ని ఈ వాహనంపై ఆవిష్కరిస్తారు. అన్ని వాహనాల్లో కెల్లా అత్యంత బరువైన ఈ సర్వభూపాల వాహనం వెయ్యి కిలోలకు పైగా ఉంటుంది.

"సర్వభూపాల" అంటే "రాజులందరూ" అని అర్థం. దిక్కులను కాచే అష్టదిక్పాలకులు కూడా ఈ కోవకే చెందుతారు. విష్ణు అంశ లేనిదే రాజభోగం లభించదు. "రాజాధిరాజాయ ప్రసహ్య సాహినే" అనే వేదస్మృతి ననుసరించి, శ్రీహరి రాజాధిరాజు. మిగిలిన రాజులందరూ శ్రీనివాసుణ్ణి తమ భుజస్కంధాలపై మోస్తూ ఆదరిస్తున్నారు. లోకపాలకులందరూ శ్రీవారి పాదాక్రాంతులై, వారి కనుసన్నల్లో మెలుగుతూ ఉన్నట్లుగా ఈ ఉత్సవం ద్వారా మనకు

గోచరిస్తుంది. సమస్తలోకాలలో ఉన్న రాజులందరికీ విశేషమైన అధికారాలు ఉంటాయి. వాటి సహాయంతో, దుష్టశిక్షణ–శిష్టరక్షణ గావిస్తూ మనోరంజకంగా పరిపాలన కొనసాగిస్తూ ఉంటారు. ఆ అధికారం దుర్వినియోగం కాకుండా ఉండాలంటే, వారికి శ్రీవారి పట్ల అపరిమితమైన భయభక్తులు కలిగి ఉండాలి. సర్వభూపాలవాహన వీక్షణం ద్వారా రాజులందరూ ఈ సద్గుణాలను పుణికిపుచ్చుకొనటం వల్ల పరిపాలన సజావుగా సాగుతుంది. ఈ సేవను దర్శించడం ద్వారా భక్తులు తమ అహంకారం నశింపజేసుకొని, శాశ్వత ఫలితాన్ని పొందుతారు. ఇతిహాసాల్లో చెప్పబడినట్లు, *సాటి నరుడు కోపిస్తే రాజు రక్షిస్తాడు. రాజు కోపిస్తే, దేవుడు రక్షిస్తాడు. అంటే, దేవుని కృప ఉంటే వేరెవ్వరూ మనకేమాత్రం హాని తలపెట్ట లేరు.*

ఈ వాహనం దర్శించడం ద్వారా దేవదేవుని కృపను సంపూర్ణంగా పొందవచ్చు.

మోహిని అవతారం

ఐదవ నాటి ఉదయం శ్రీవేంకటేశ్వరుడు మోహిని రూపం ధరించి, రాక్షసులను మోహింప చేసిన జగన్మోహినిగా బంగారుపల్లకిలో సోయగాలు ఒలకబోస్తూ దర్శనమిస్తాడు. శ్రీకృష్ణుడు దంతపు పల్లకి పై స్వామివారిని అనుసరిస్తూ ఊరేగుతాడు. మోహిని అవతారం ప్రత్యేకత ఏమిటంటే మిగతా అన్ని వాహనాలు వాహనమండపం నుండి మొదలైతే, ఈ వాహనం మాత్రం శ్రీవారి ఆలయం నుండి ప్రారంభమవుతుంది.

శ్రీ మహావిష్ణువు యొక్క మోహిని అవతార ప్రసక్తి పురాణాల్లో అనేకసార్లు గోచరిస్తుంది –

- మొదటగా, క్షీరసాగరమథనంలో శ్రీహరి జగన్మోహిని వేషధారియై రాక్షసులను తన ముగ్ధమోహన అవతారంతో మైమరిపింపజేసి అమృతభాండాన్ని అమరులకు అందజేస్తాడు.
- మరోసారి, భోళాశంకరుడిచ్చిన వరగర్వంతో విర్రవీగుతూ ముల్లోకాలలో కల్లోలం సృష్టించిన భస్మాసురుణ్ణి శ్రీహరి జగన్మోహన రూపంతో సమ్మోహింప జేసి ఆ దానవుడి పీచమణుస్తాడు.
- మూడవసారి, దారుకావనం నందు జగన్మోహిని రూపంలో ఉన్న విష్ణువును చూసి మోహించిన శివునితో జరిగిన సంగమం వల్ల శాస్తా ఉద్భవం జరిగింది.

మోహిని అవతారంలో, మలయప్పస్వామి కూర్చున్న భంగిమలో కనిపిస్తారు. స్త్రీలు ధరించే సర్వాభరణాలు శ్రీవారికి అలంకరింప బడతాయి. మోహిని వేషధారణలో ఉన్న మలయప్ప స్వామికి పట్టు చీర, రవిక, కిరీటం స్థానంలో రత్న ఖచ్చితమైన సూర్య–చంద్ర–సావేరిలను అలంకరిస్తారు. స్వామివారికి వజ్రపు ముక్కుపుడక, ముత్యాల బులాకీని సైతం ధరింపజేస్తారు. సాధారణంగా, వరదభంగిమలో ఉండే స్వామివారి కుడి చెయ్యి మోహిని అలంకరణలో కొన్నిసార్లు రాచిలుక తోనూ, మరికొన్ని సార్లు అభయ హస్తంగానూ దర్శనమిస్తుంది.

జగత్తంతా మాయా మోహానికి లొంగబడి ఉంటుంది. తన భక్తులు కానివారు మాయాధీనం కాక తప్పదని గీతలో శ్రీ కృష్ణ భగవానుడు సెలవిచ్చారు. మాయా పూరితమైన ఈ ప్రపంచం నుండి తన భక్తులను రక్షించడానికి తిరుమలేశుడు మోహిని వేషధారియై తిరువీధుల్లో దర్శనమిస్తున్నాడు.

"బలగర్వితులు, అహంకారులు కార్య ఫలితాన్ని పొందలేరని, వినయవిధేయతలతో భగవంతుని ఆశ్రయించిన వారే కృషి ఫలితాన్ని సంపూర్ణంగా పొందగలరనే" సందేశం మోహిని అవతారం ద్వారా ప్రకటిత మవుతుంది.

గరుడవాహన సేవ

కపిలాక్షం గరుత్మంతం సువర్ణసదృశప్రభమ్
దీర్ఘ బాహుం బృహత్ స్కంధం వందే నాగాంగభూషణం ॥

తిరుమల బ్రహ్మోత్సవాలలో ఐదవనాటి రాత్రి జరిగే గరుడోత్సవం అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఈ ఉత్సవంలో మలయప్పస్వామివారు ఒక్కరే, వారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడవాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరిస్తారు.

తిరుమల బ్రహ్మోత్సవాల్లో మిగతా వాహనసేవలన్నీ ఒక ఎత్తయితే, గరుడవాహనం ఒక్కటీ ఒక ఎత్తు. ఈ వాహనసేవను వీక్షించడానికై తిరుమలక్షేత్రానికి విచ్చేసిన అశేష భక్తజన సందోహాన్ని చూస్తుంటే ఒడలు పులకరించి పోతుంది.

గరుడ గమన గోవిందా! గరుడ గమన గోవిందా!! గరుడ గమన గోవిందా!!!

బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు గరుత్మంతుడు ఉత్సవాలను పర్యవేక్షిస్తూ, ఉత్సవ నిర్వాహకుడైన బ్రహ్మకు సహాయకుడిగా ఉంటాడు.

గరుత్మంతుని ఇరు రెక్కలు కర్మ-భక్తికి సంకేతాలు. నాసిక-జ్ఞానానికి ప్రతిరూపం. ఇలా, కర్మ-భక్తి-జ్ఞాన సంయోగమైన వేదమే ఆ గరుత్మంతుని రూపంలో స్వామివారిని మోస్తున్నది. స్వామివారు వేదమయుడు, వేదరూపుడు, వేదవేదాంత వేద్యుడు. కనుక, వేదమే ఆయనను భరిస్తోందన్న మాట.

"ఓం పక్షిస్వాహా!" అన్న గరుడపంచాక్షరి మంత్రంలో ఐదు అక్షరాలు ఉన్నాయి. కనుక "పంచవర్ణరహస్యం" గా పేర్కొనబడే ఈ గరుడోత్సవం, బ్రహ్మోత్సవాలలో ఐదవరోజు జరగటం శ్రీవారి సంకల్పమే కానీ, యాదృచ్ఛికం కాదు.

"శ్రీశేషశైల గరుడాచల వేంకటాద్రి నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యాం" అంటూ, శ్రీవేంకటేశ్వర సుప్రభాతంలో కీర్తించబడే సప్తగిరులలో 'గరుడాచలం' ఒకటి. అలిపిరి నుంచి తిరుమలకు వెళ్లే రోడ్డుమార్గంలో, వినాయకుని మందిరం సమీపాన, ఓ పర్వతసానువు "గరుడపక్షి" ఆకారంలో కనిపిస్తుంది. కొనదేలిన నాసిక, విశాలమైన నుదురు, రెక్కలు, చెవులు ఈ విధంగా, గరుత్మంతుడి శరీర భాగాలన్నీ ఆ పర్వతశిఖర పార్శ్వభాగాన గోచరిస్తాయి. "శ్రీనివాసుడు గరుడాద్రిపై కొలువై ఉన్నాడు" అని చెప్పటానికి ఇంకేం ఆధారం కావాలి?

కృతే వృషాద్రిం వక్షంతి త్రేతాయాం గరుడాచలమ్ ద్వాపరే శేషాచలం చ వెంకటాద్రి కలౌ యుగే ॥

– అన్న సంస్కృత శ్లోకాన్ని బట్టి శేషాచలానికి, త్రేతాయుగంలో గరుడాద్రి అనే పేరు ప్రధానంగా ఉన్నట్లు తెలుస్తోంది.

పౌరాణిక మూలాల్లోకి వెళితే, కృతయుగంలో శ్రీమహావిష్ణువు మరో అవతారమైన ఆదివరాహుని ఆదేశం మేరకు

వైకుంఠం లోని క్రీడాచల పర్వతాన్ని తెచ్చి, సువర్ణముఖి నది ఉత్తరతీరాన నిలిపింది 'గరుడుడే'. అందువల్లనే వేంకటాద్రిని గరుడాద్రిగా వ్యవహరిస్తారని మార్కండేయ పురాణం లోని ఈ శ్లోకం వివరిస్తుంది –

వైకుంఠలోకాత్ గరుడేన విష్ణోః
క్రీడాచలో వెంకటనామధేయః
ఆనీయ చ స్వర్ణముఖీ సమీపే
సంస్థాపితో విష్ణునివాస హేతోః

గరుత్మంతుడు తన తల్లి వినతి యొక్క దాస్యాన్ని, క్లేశాన్ని పోగొట్టడం కోసం స్వర్గలోకానికి వెళ్లి అక్కడి వారందరినీ చాకచక్యంగా ఏమార్చి, అమృతభాండాన్ని చేజిక్కించు కుంటాడు. అమృతసేవనంతో జరామరణాలు ఉండవని తెలిసికూడా, స్వయంగా సేవిద్దామనే ప్రలోభానికి ఏమాత్రం లోను గాకుండా, తన తల్లి దాస్యవిముక్తే ఏకైక లక్ష్యంగా కార్యోన్ముఖుడవుతాడు. ఎంతో నిర్లిప్తంగా మాతృకార్యాన్ని నిర్వహించిన గరుత్మంతుని కార్యదీక్ష, త్యాగనిరతి, వినయశీలత, శారీరకదృఢత్వం వంటి మంగళకరమైన లక్షణాలకు ముగ్ధుడైన శ్రీ మహావిష్ణువు ఏదైనా వరం కోరుకోవలసిందిగా శెలవిస్తాడు. అప్పుడు గరుత్మంతుడు కోరుకున్న కోరిక పరమాద్భుతం. అమృతం సేవించక పోయినా జరామరణాలు లేకుండా, తానెంతటి బలవంతు డైనప్పటికీ పరమ వినయ విధేయతలతో విష్ణుమూర్తి సేవ చేసుకునే భాగ్యం కలగాలని కోరుకుంటాడు. గరుత్మంతుని నిస్వార్థ సేవాభావానికి అచ్చెరువొందిన వైకుంఠనాథుడు అతనికి రెండు వరాలిస్తాడు. వాటి ననుసరించి గరుడుణ్ణి విష్ణుమూర్తి తన వాహనంగా స్వీకరించి, తన పతాకంపై ఎల్లప్పుడూ గరుడుని చిహ్నం ఉంచుకుంటాడు. "తాను అత్యంత ప్రీతిపూర్వకంగా అధిరోహించే వాహనం గరుత్మంతుడే" అని కూడా శ్రీహరి పలుమార్లు పెక్కు సందర్భాల్లో పేర్కొన్నాడు.

శ్రీమహావిష్ణువు ఆదేశం మేరకు గరుత్మంతుడు శ్రీవారి సన్నిధిలో, సరిగ్గా బంగారువాకిలికి ఎదురుగా, నమస్కారముద్రలో నిలుచుని; భక్తులకు శ్రీవారి దర్శనమార్గాన్ని, విధానాన్ని సూచిస్తుంటాడు.

శ్రీమహావిష్ణువు వరాలనొసగిన నాటినుండి వైనతేయుడు శ్రీమహావిష్ణువుకు దాసునిగా, ప్రియసఖుడిగా, విసనకర్రగా, చాందినిగా, ఆసనంగా, ఆవాసంగా, ధ్వజపటంగా అనేకానేక సేవలు అందిస్తున్నాడు.

దాసో మిత్రం తాళ వృంతం వితానం
పీఠం వాసో వాహనం చ ధ్వజశ్చ
ఏవం భూత్వా అనేకథా సర్వథా సః
శ్రీ శం శ్రీమాన్ సేవతే వైనతేయః ॥

గరుత్మంతుడు విష్ణువుకు ధ్వజపటం కూడా అవ్వటం చేత బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమై, ధ్వజావరోహణంతో ముగుస్తాయి.

ఇప్పుడు, గరుడుని అధిరోహించిన స్వామి వారిని అవలోకిద్దాం.

స్వామివారు స్వర్ణకిరీటం ధరించి శోభాయమానంగా దర్శనమిస్తుంటారు. ఆ కిరీటం మధ్య భాగంలో మిలమిలా

మెరుస్తున్న పచ్చ, కిరీటానికి వ్రేలాడుతున్న ముత్యాలు, కిరీటానికి పొదిగినటు వంటి రత్నాలు; కంఠసీమ యందు కేవలం గరుడోత్సవం నాడు తప్ప తక్కిన సర్వకాల సర్వావస్థల యందు మూలమూర్తికి మాత్రమే పరిమిత మయ్యుండే – శ్రీవెంకటేశ్వరసహస్రనామమాల, మకరకంఠి, లక్ష్మీహారాలు; ఉదరభాగాన మరో అందమైన పచ్చ, దివ్యంగా అలంకరింపబడిన పూలమాలలు – ఇలా స్వామి నయనానందకరంగా, భక్తజన రంజకంగా అలరారుతుంటారు. గరుత్మంతుడు కొనదేలిన నాసికతో, పదునైన చేతిగోళ్ళతో, తిరునామాలతో ఓ ప్రక్క వైభవోపేతంగా, మరోపక్క అరివీర భయంకరంగా దర్శనమిస్తారు.

ఒక్క గరుడసేవలో మాత్రమే శ్రీవారు ఈ ఆభరణాలన్నింటినీ ధరిస్తారు. గరుడసేవలో, ధ్రువమూర్తి అయిన శ్రీవెంకటేశ్వరస్వామికి – ఉత్సవమూర్తియైన మలయప్పస్వామికి వ్యత్యాసం లేదన్న విశ్వాసం కారణంగా, ఆనాడు మాత్రం మూలమూర్తికి అలంకరింప బడే ఆభరణాలన్నీ మలయప్ప స్వామి చెంత చేరుతాయి.

గోదా సమర్పిత సుభాషిత పుష్పమాలాం
లక్ష్మీహార మణిభూషిత సహస్రనామ్నాం
మాలాం విధార్య గరుడోపరి సన్నివిష్టః
శ్రీవేంకటాద్రి నిలయో జయతి ప్రసన్నః ||

తమిళనాడు లోని శ్రీవిల్లిపుత్తూరు ఆలయంలో గోదాదేవికి అలంకరించి తొలగించిన పూమాలలను తిరుమలకు తెప్పించి స్వామివారి బ్రహ్మోత్సవాలలో ప్రధాన మైనటువంటి గరుడసేవ నాడు స్వామి వారికి అలంకరిస్తారు. శ్రీకృష్ణదేవరాయలు స్వామికి సమర్పించిన స్వర్ణాభరణాలు, మడిమాన్యాలు చాలా వరకు కనుమరుగై నప్పటికీ వారి హయాంలో ప్రవేశపెట్ట బడిన ఆముక్తమాలల సమర్పణ, అలంకరణ సాంప్రదాయాలు మాత్రం నేటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నాయి. "ఆముక్తమాల" అంటే, రాయల విరచిత "ఆముక్తమాల్యద" గ్రంథంలో పేర్కొన్నట్టి "గోదాదేవి అలంకరించు కొని తీసివేసి శ్రీరంగనాథునికి ధరింప జేసిన పూమాలలు" అని అర్థం.

రాష్ట్ర ప్రభుత్వం తరఫున సమర్పించే నూతన పట్టు వస్త్రాలను కూడా గరుడసేవ నాడు స్వామివారికి అలంకరిస్తారు. అలాగే, గరుడోత్సవం నాడు చెన్నపట్టణం లోని హిందూధర్మార్థ సమితి వారు నూతన ఛత్రాలకు విశేషపూజలు గావించి, చెన్నై నుండి కాలినడకతో ఊరేగింపుగా తిరుమలకు తీసుకొని వచ్చి స్వామివారికి భక్తిశ్రద్ధలతో సమర్పిస్తారు. ఈ గొడుగులతో పాటుగా, శ్రీవారికి పూలంగి కపాయి, కొల్లాయి; వక్షస్థల లక్ష్మీదేవికి పావడాలు; తిరుచానూరు పద్మావతి అమ్మవారికి గొడుగులు, పసుపు, కుంకుమ, చందనం మొదలైన వాటిని "శ్రీవారిసారి" గా పేర్కొంటూ ఒక వెదురుబుట్టలో పెట్టి శాస్త్రోక్తంగా సమర్పిస్తారు.

అంగరంగ వైభోగంగా సాగుతున్న గరుడోత్సవ వైభవాన్ని చూచి పులకించిన అన్నమాచార్యులు ఉత్సవశోభను ఈ విధంగా వర్ణించాడు –

పల్లించి గరుడునిపై నీవుబ్బున నెక్క..
బంగారు గరుడునిపై నీవు వీధులేగ

చెంగట శ్రీవెంకటేశ్వర సిరులు మూగే
సంగతి నలమేల్మంగ సంతసాన విర్రవీగే
పొంగారు దేవదుందుభులు పై పై వాగె ॥

గరుడోత్సవంలో, విష్ణుమూర్తి, గరుడుని మందారవర్ణపు చిగుళ్ల పొట్లాల వంటి రెండు అరచేతులపై ఎర్రతామరలవలె ఉన్న తన రెండు పాదాలను పెట్టి వైభవం ఒలకబోస్తూ దర్జాగా కూర్చుని ఉంటాడు.

గరుడ వాహనారూఢుడైన విష్ణుదేవుని దర్శించి మైమరచిపోయిన పెరియాళ్వార్ (విష్ణుచిత్తుడు) "పల్లాండు-పల్లాండు" అంటూ మంగళాశాసనం చేశాడు.

"*గరుడగమనా రారా! నన్ను కరుణనేలు కోరా!!*" అంటూ రామదాసు ప్రార్థించాడు.

గరుడసేవ రోజున తిరుమలక్షేత్రం అంతా లక్షలాది భక్తులతో క్రిక్కిరిసి ఉంటుంది. కొండ నిండిపోవడంతో ఇక రావద్దంటూ తి.తి.దే. అధికారులు మొత్తుకుంటున్నా భక్తులు మెట్లమార్గాల ద్వారా, ఆర్టీసీ బస్సులు, సొంత వాహనాలపై తిరుమలకు పోటెత్తుతూనే ఉంటారు. ఎటు చూసినా అలౌకిక ఆధ్యాత్మికానుభూతికి లోనై హారతులిస్తూన్న భక్తులతో, తిరుమల జనసంద్రంగా గోచరిస్తుంది. గోవిందనామస్మరణతో సప్తగిరులు మార్మోగి పోతాయి. తిరుమల పట్టణమే కాకుండా, దాదాపుగా చిత్తూరు జిల్లా అంతా పండుగ వాతావరణం ఉట్టిపడుతుంది.

దేశవిదేశాల నుండి కళాకారుల బృందాలు తరలి వచ్చి తమ తమ కళాకృతుల్ని ముగ్ధమోహనంగా ప్రదర్శిస్తాయి.

దాదాపు రెండు లక్షల మంది పట్టే మాడ వీధుల్లోని ప్రేక్షక గ్యాలరీలన్నీ వాహనవీక్షణ కోసం ఎండనక, వాననక నిరీక్షిస్తున్న భక్తజనులతో పొంగి పొరలుతుంటాయి. ఆరోజు ఉదయం నుండీ, గంటల తరబడి భక్తులు శ్రీవారికై ఎదురుచూస్తూ, కళావిన్యాసాలను తిలకిస్తూ ఉంటారు. గరుడోత్సవం నాడు ఇంద్రుడు, వరుణుడు చిరుజల్లులతో స్వామివారిని తప్పక దర్శించు కుంటారని స్థానికుల నమ్మకం అందుచేత, తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే భక్తులందరూ తమతో పాటుగా చత్రాలు తీసుకెళ్తారు. గరుడవాహనం, వాహనమండపం నుంచి బయలుదేరగానే కొన్ని గరుడ పక్షులు గగనతలం మీద విహరిస్తూ స్వామివారిని చూసి తరిస్తాయి. పోయిన ఏడాది గరుడోత్సవం నాడు తిరుమల కొండపై జడివానలో పులకరిస్తూ, గరుడుల విహంగవీక్షణాన్ని చూసి తరించుకునే భాగ్యం మాకు కలగటం మా పూర్వజన్మ సుకృతం.

గరుడోత్సవం నాడు ఆకాశంలో కలిగిన అలజడిని చూసి అన్నమయ్య ఇలా వర్ణించాడు –

ఇటు గరుడని నీవెక్కినను
పటపట దిక్కులు బగ్గన బగిలె ॥
ఎగసిన గరుడని ఏపున 'ధా' యని
జిగిదొలక చబుకు చేసినను
నిగమాంతంబులు నిగమసంఘములు
గగనము జగములు గడగడ వడికె ॥

గరుడవాహనం నాడు భోజన ఏర్పాట్లు, ప్రసాదాల తయారీ, భద్రతా సేవలు, క్యూల నియంత్రణ, వైద్య సదుపాయాలు, మొదలైనవన్నీ అత్యంత భారీ ఎత్తున, ఏవిధమైన లోటుపాట్లు లేకుండా చేపడతారు. మాడవీధుల్లో, తిరుమల పట్టణమంతా పెద్ద పెద్ద వెండి తెరలు ఏర్పాటు చేసి ఉత్సవ విశేషాలన్నింటినీ ప్రత్యక్షప్రసారం గావిస్తారు.

గరుత్మంతుడు మాతృభక్తికి, విష్ణుభక్తికి, పరోపకార గుణానికి, నిష్కల్మషత్వానికి ప్రతీక. వైష్ణవసంప్రదాయంలో గరుడ వాహనాన్ని "పెరియతిరువడి" వాహనంగా కీర్తిస్తారు. ఈ వాహన సేవ దర్శించినవారు, కాలసర్పదోషం నుంచి, సంతానలేమి నుంచి, ఆలస్యవివాహం నుంచి ముక్తులై, కష్టాలకడలి నుంచి గట్టెక్కుతారు.

శ్రీస్వామివారు "సర్వకాల సర్వావస్థలయందు మీ రక్షణకై శంఖు–చక్రాయుధాలను ధరించి, గరుడ వాహనారూఢుడనై, సదా సన్నద్ధునిగా ఉంటాను. నా శరణువేడి, నా పాదాలను ఆశ్రయించి, మీ రక్షణ భారం నాకు వదిలేయండి. తప్పక రక్షింపబడతారు" అన్న హితాన్ని ఈ గరుడవాహనసేవ ద్వారా ఉపదేశిస్తారు.

గరుడ వాహన దర్శనం సర్వపాపహరం, సకలసంపత్కరం, శ్రేయోదాయకం!

హనుమంత వాహనం

బ్రహ్మోత్సవాలలో ఆరవనాటి ఉదయం వరదహస్తం దాల్చిన శ్రీవారు, హనుమంతుణ్ణి వాహనంగా చేసుకుని మాడ వీధుల్లో ఊరేగుతూ, "త్రేతాయుగం నాటి శ్రీరామచంద్రుణ్ణి నేనే" అని ప్రకటిస్తున్నట్లు వేంకటాద్రిరాముడిగా దర్శనమిస్తారు.

"కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే! ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్" అంటూ, ప్రతిరోజు ఆ శ్రీరాముని పేరుతోనే మేలుకొలుపులు పాడించుకుంటున్న శ్రీనివాసుడు "త్రేతాయుగంలోని శ్రీరాముణ్ణి నేనే" అన్న విషయాన్ని భక్తజనులకు పదే పదే జ్ఞాపకం చేయడం కోసం, హనుమద్వాహనారూఢుడై వేంకటరామునిగా ఉత్సవ సేవలో పాల్గొంటారు.

హనుమ, భగవత్ భక్తులలో అగ్రగణ్యుడు. శ్రీమద్రామాయణంలో ఆంజనేయుని పాత్ర అద్వితీయమైనది. వేదవేదాంగ పారంగతునిగా, రావణదర్ప దమనునిగా, భక్తాగ్రేసరునిగా వినుతికెక్కాడు.

కేసరి భార్య అంజనా దేవి వేంకటాద్రిలోని ఆకాశగంగ సమీపాన ఉన్న "జాబాలితీర్థం" లో తపస్సు చేసింది. ఆ తపఃఫలితంగా ఆంజనేయుడు జన్మించాడు. అంజనాదేవి తపస్సు చేయడం వల్ల ఆ పర్వతం "అంజనాద్రి" గా వినుతికెక్కి సప్తగిరుల్లో ఒకటిగా భాసిల్లుతోంది. శ్రీవారి ఆలయానికి ఎదురుగా, శృంఖలాబద్ధుడైన "బేడి ఆంజనేయస్వామి" ఆలయాన్ని నేడూ చూసి తరించచ్చు. అంజనాదేవి పుత్రుడు అంజనాద్రీశునికి వాహనం అయినాడు.

ఆంజనేయుడు లేనిదే రామాయణం లేదు. శ్రీ రామునితో పాటుగా, రామపరివారమంతటికీ ఆంజనేయుడు ఎనలేని మేలు గావించాడు. లక్ష్మణునికి ప్రాణదాత. జానకీశోక వినాశకుడు. అతని చేతుల్లో రక్కసి మూకలు దోమల్లా నలిగి

పోయారు. హనుమంతుడు లోకాల్లో రామరాజ్యస్థాపనకు దోహదపడ్డాడు. రామ–రావణ సంగ్రామంలో రావణుడు రథంపై నుండి యుద్ధం చేస్తుండగా, శ్రీరాముడు మాత్రం హనుమంతుని భుజస్కంధాల నధిరోహించి రావణుని పరిమార్చాడు.

భగవంతుని కంటే భగవన్నామస్మరణమే ముక్తిదాయకమని ఆంజనేయుడు చాటిచెప్పాడు. భారతదేశ నలుదిక్కులలో ఏ వూరు వెళ్ళినా, ఏ దిక్కు చూసినా హనుమంతుని చిన్నా, పెద్దా విగ్రహాలు లెక్కకు మిక్కిలిగా మనకు దర్శనమిస్తాయి. భారతదేశంలోని కోట్లాది

కుటుంబాల్లో "హనుమాన్ చాలీసా" నేడు కూడా నిత్యం పఠిస్తారు.

దాస్యభక్తుల్లో మేటియైన హనుమంతుడు, వేదవేదాంగాలు, ఉపనిషత్తులు, అష్టాదశపురాణాలు క్షుణ్ణంగా తెలిసినవాడు. హనుమంతుణ్ణి స్మరిస్తే బుద్ధి, బలం, యశస్సు, నిర్భయత్వం, ఆరోగ్యం, వాక్పటిమ సిద్ధిస్తాయి. హనుమంతుడు తన భక్తులతో "మీకు కావలసిన భౌతిక, ఆధ్యాత్మిక, ధార్మిక ఫలాలన్నీ నేనే ఇస్తా. మోక్షం మాత్రం నాస్వామి రామయ్యను సేవించి పొందండి" అంటూ, తాను సర్వశక్తి సంపన్నుడైనప్పటికీ, "రాముడే దేముడ" నే విషయాన్ని వినయంగా లోకానికి చాటి చెప్పాడు. తన బలాన్ని స్వయంగా తెలుసుకోలేనంత నిగర్వి, వినయశీలి హనుమంతుడు. జాంబవంతాదులు నుడివిన తరువాతనే ఆ వాయుపుత్రునికి తాను సాగరాన్ని లంఘించగలననే విషయం తేటతెల్లమైంది. మూర్ఛిల్లిన లక్ష్మణుడు తెప్పరిల్లగానే, యుద్ధపరిసమాప్తి కాకుండానే ఎంత వేగంతో సంజీవని పర్వతాన్ని తీసుకుని వచ్చాడో, అంతే వేగంగా దాన్ని యథాస్థానంలో చేర్చేశాడు. భావితరాల ఔషధావసరాల రీత్యా, ఆ పర్వతరాజాన్ని సత్వరమే స్వస్థలానికి జేర్చిన, అపారమైన దూరదృష్టి కలవాడు హనుమంతుడు. ఈనాడు మనం చెప్పుకునే "పర్యావరణసమతౌల్యత" ఆవశ్యకతను ఆనాడే క్షుణ్ణంగా ఆకళింపు చేసుకొని, అమలు పరచిన దార్శినికుడు.

ఈనాటి వాహనమైన హనుమంత దర్శనంతో, ఇహలోక వాంఛలు సిద్ధించడమే కాకుండా, మోక్షం కూడా లభిస్తుంది.

తాళ్ళపాక అన్నమయ్య హనుమంతుని సముద్రలంఘన, రావణవధ ఘట్టాల్ని ఇలా వర్ణించాడు –

ఇతడే యతడు గాబోలేలిక బంటు నైరి
మితిలేని రాఘవుడు మేటి హనుమంతుడు
జలధి బంధించి దాటె హనుమంతుడు
అలరి వూరకే దాటె హనుమంతుడు
అలుకతో రావణుని దండించె నితడు
తలచి మైరావణుని దండించె నితడు

హనుమద్వాహన విధమైన క్షణంతో ప్రతి భక్తుడు ఆంజనేయునిలా నిష్కళంక హృదయం, నిస్వార్థ సేవాతత్పరత, ప్రభుభక్తి పరాయణత్వం, సచ్ఛీలత, భావితరాల సంక్షేమం పట్ల నిబద్ధత వంటి సద్గుణసంపద కలిగి, స్వామికృపకు సదా పాత్రులవుతారు.

స్వర్ణ రథోత్సవం

ఆరవరోజు సాయంసంధ్యా సమయంలో అస్తమిస్తున్న సూర్యుని కిరణాలు ప్రసరిస్తుండగా, దివ్యకాంతులీనుతున్న స్వర్ణరథంలో ఇరువురు దేవేరులతో కలిసి మలయప్పస్వామి వారు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు నేత్రానందం కలిగిస్తారు. పోయిన బ్రహ్మోత్సవాల్లో తన ప్రియభక్తుడు వాయిపుత్రునిపై, ధనుర్బాణాలు ధరించి, అయోధ్యాధీశునిగా, కటి–వరద హస్తాలతో, కలియుగ దైవంగా స్వామి దర్శనమిచ్చారు.

బ్రహ్మదేవునిశూన్యరథం, గజ–అశ్వ–వృషభాదులు యధావిధిగా స్వర్ణరథోత్సవంలో కూడా పాల్గొంటాయి. దాసభక్తులనృత్యాలతో, భజనబృందాల కోలాహలంతో మాడవీధులు కడురమణీయతను సంతరించు కుంటాయి.

స్వర్ణం అంటే "మిక్కిలి ప్రకాశించేది" అని వ్యుత్పత్తి. బంగారం మహా శక్తివంతమైన లోహం. ఈలోహం శరీరాన్ని తాకుతుంటే దేహంలో రక్తప్రసరణ చక్కగా జరుగుతుంది. అనేకానేక ఔషధోత్పత్తుల్లో స్వర్ణం వినియోగించ బడుతుంది. ఆర్థిక ఇబ్బందుల్ని అధిగమించడంలో యుగయుగాల నుంచి ఈనాటివరకూ, స్వర్ణం పాత్ర వెలకట్టలేనిది. బంగారాన్ని తాకట్టు పెట్టో లేదా తెగనమ్మో, కష్టాల కడలి నుండి గట్టెక్కడం సత్యహరిశ్చంద్రునికాలం నుండి, ఆధునిక జగత్తులో కూడా మనం చూస్తూనే ఉన్నాం. వర్తక, వాణిజ్య, వినిమయాలకు సువర్ణ నాణాలను వినియోగించే సాంప్రదాయం, కలియుగారంభం నుండి, ఈ మధ్యకాలం వరకూ ఉండేది. పద్మావతీ పరిణయం సందర్భంగా శ్రీనివాసుడు కుబేరుణ్ణించి అప్పుగా తీసుకుంది సువర్ణముద్రికలే!

స్వర్ణం లభ్యమయ్యేది భూమి నుంచే! భూదేవి సాక్షాత్తు శ్రీవారిలో భాగం. శ్రీవారి ఇల్లు బంగారం. ఆనందనిలయ గోపురం బంగారు మయం. ధ్వజస్తంభం బంగారు తాపడం చేయబడింది. ఇంటిలోని పాత్రలు బంగారువి. సింహాసనం బంగారుది. ధరించేది మేలిమిబంగారు నగలు. రాజాధిరాజుల నుండి సామాన్యుల వరకూ భక్తులందరూ స్వామివారికి హుండీలో సమర్పించుకునేది కనకమే!

సకల సంపదలకు, ధనకనకాదులకు ఆధిపత్యం వహించేది శ్రీదేవిగా పిలువబడే లక్ష్మీదేవి. ఆమె కూడా శ్రీవారిలో భాగమే. బంగారంతో ఇంత ప్రగాఢమైన అనుబంధం కలిగిన శ్రీవారు ఇరువురు దేవేరులతో కలసి స్వర్ణరథంలో ఊరేగుతుండగా చూచి తరించటం ఓ అలౌకిక, ఆధ్యాత్మికానుభూతి.

దేవేరులతో స్వామివారు స్వర్ణరథంపై ఊరేగే ఈ స్వర్ణరథోత్సవం శ్రీవారి మహోన్నతిని, సార్వభౌమత్వాన్ని, శ్రీపతిత్వాన్ని, భూదేవీనాథత్వాన్ని సూచిస్తుంది.

స్వర్ణరథోత్సవంలో, కళ్యాణకట్ట సంఘంవారు సమర్పించిన బంగారు గొడుగును రథంపై అలంకరిస్తారు. కేవలం మహిళా భక్తులు మాత్రమే తేరును లాగటం ఈ స్వర్ణరథోత్సవ ప్రత్యేకత.

ఈ రథోత్సవాన్ని "సువర్ణరంగ డోలోత్సవం" అని కూడా వ్యవహరిస్తారు. ఉయ్యాలసేవ ఈ రథోత్సవంలో అంతర్భాగం కావడం వల్ల, బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు సాయంత్రం జరిగే ఉయ్యాలసేవ స్వర్ణరథవాహనం నాడు జరగదు.

స్వర్ణరథోత్సవ దర్శనం ద్వారా శ్రీదేవి కరుణతో సమస్త భోగభాగ్యాలు, అష్టైశ్వర్యాలు; భూదేవి కరుణతో భూసంపద, కనక, మణిమయాదులు, నవరత్నాలు, ధాన్యసంపద, పశుసంపద; శ్రీవారి కరుణతో సర్వ సుఖాలూ, శుభాలు చేకూరుతాయి.

గజవాహనం

బ్రహ్మోత్సవాల్లో ఆరవనాటి రాత్రి గజేంద్రమోక్ష ఘట్టానికి గుర్తుగా జరిగే "గజవాహనసేవ" లో మలయప్పస్వామివారు ఒక్కరే గజరాజుపై ఊరేగుతారు.

పూర్వకాలం నందు చతురంగబలాలలో గజబలం ఒకటి. "గజం" అంటే విశ్వాసానికి సంకేతం. రాజులకు పట్టాభిషేకం కావించేటప్పుడు వారిని గజాధిష్ఠితులుగా చేసి ఊరేగిస్తారు. ఓ విశిష్టవ్యక్తిని ఘనంగా సత్కరించాలంటే, వారిని "గజారోహణ" చేయించే సాంప్రదాయం నేటికీ ఉంది. పూర్వం రాజుల శక్తిసామర్థ్యాలను, సేనాపాటవాన్ని గజబలంతో సూచించేవారు. ఎన్ని ఎక్కువ ఏనుగులుంటే అంత ఎక్కువ సైన్యబలం ఉన్నట్లు లెక్క. ఏనుగు కుంభస్థలం లక్ష్మీనివాసంగా అభివర్ణింప బడుతుంది.

తిరుమల ఆలయ నిర్మాణంతో కూడా గజరాజులకు ప్రత్యక్షసంబంధం ఉంది. ఆలయనిర్మాణం జరిగేటప్పుడు ఆలయమండప స్తంభాలను క్రిందనే చెక్కించి వందలాది ఏనుగుల ద్వారా కొండపైకి చేర్చేవారు. మైళ్ళదూరం పైకి ఎక్కుకుంటూ వెళ్ళి ఆలయకుడ్యాలకు వాడిన టన్నులకొద్దీ బరువైన అత్యంత భారీ రాతి ఇటుకలనూ, పైకప్పుకు ఉపయోగించే రాతిపలకలనూ, శిల్పస్తంభాలనూ గజరాజులు భద్రంగా కొండపైకి చేర్చాయి. ఒక్క వేయికాళ్ళ మండపానికే "వేయి" స్తంభాలుండేవంటే, మొత్తం ఆలయనిర్మాణానికి ఎన్ని స్తంభాలను వినియోగించారో ఊహించుకోవచ్చు!

అంత శ్రమకోర్చి, శ్రీవారి ఆలయానికో రూపం ఇచ్చిన గజరాజుల ఋణం ఏమిచ్చి తీర్చుకోగలం?

అంతేకాదు. తిరుమలను దర్శించుకున్న వందలకొద్దీ రాజులనూ, వారి పరివారాలను ఏనుగు అంబారీలే సురక్షితంగా పైకి చేర్చేవి.

స్వామివారితో నిత్యం పాచికలాడే, వారి ప్రియభక్తుడైన "హాథీరాంబాబా" ను అప్పటి పాలకులు ఏవో నిందారోపణలపై ఖైదు చేయగా, శ్రీవారు ఏనుగు రూపంలో వచ్చి, రాత్రికి రాత్రే బండెడు చెరకుగడలను పిప్పి చేసి అతణ్ణి రక్షించి, ఆ పాలకులను కూడా పరమ భక్తులుగా మార్చిన చరిత్ర మనందరికీ చూచాయగా తెలుసు (వివరంగా ముందు తెలుసుకుందాం). అందుకే ఆయన హాథీ రాం గా పిలువబడ్డాడు.

అంతటి ప్రశస్తిగాంచిన గజరాజుపై శ్రీనివాసుడు ఊరేగుతూ ఉంటే అత్యద్భుతమైన దృశ్యం ఆవిష్కరింప బడుతుంది.

గజేంద్రమోక్షపురాణాన్ననుసరించి ఒకనాడు జలక్రీడ లాడుతూ మొసలికి పట్టుబడ్డ గజేంద్రుడు దానితో చాలాకాలం పోరాడి, కడు దయనీయ స్థితిలో శ్రీమహావిష్ణువును ఇలా ప్రార్థించాడు –

లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛ వచ్చె దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెరుగ మన్నింపందగున్ దీనునిన్
రావే ఈశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా!

గజేంద్రుని ఆక్రందన విన్న, శ్రీ మహావిష్ణువు, "సిరికిన్ జెప్పకన్", అంటే సమక్షంలోనే ఉన్న శ్రీమహాలక్ష్మికి సైతం చెప్పకుండా, హుటాహుటిన అలవైకుంఠపురం వీడి, మొసలిని సంహరించి, గజరాజును కాపాడాడు. భక్తులను కాపాడాలనే విష్ణుమూర్తి ఆతృత అలాంటిది మరి.

సంసారం ఒక సరస్సు. మొసలి కర్మకు సంకేతం. ప్రతి భక్తుడు గజేంద్రుడు. సంసారసాగరంలో కొట్టుమిట్టాడుతూ, "కర్మ" అనబడే మొసలి కోరలకు చిక్కి శరణు వేడిన వారికి కర్మ బంధాలనుండి విముక్తుని ప్రసాదించేవాడు శ్రీవేంకటేశ్వరుడు. ఎంతటి బలం గల ఏనుగైనా మావటివాని అంకుశానికి ఏ విధంగా లొంగిపోతుందో, అదే విధంగా, మానవుడు ఎంతటి బలవత్తరమైన ప్రాపంచిక విషయాల్లో చిక్కుకున్నా, శ్రీవారు నైపుణ్యం కలిగిన మావటివానిలా ఆ భవబంధాలను తొలగించగలరు.

గజరాజులు ప్రతిరోజు శ్రీవారి వాహనసేవల్లో వాహనం ముందు ప్రత్యక్షంగా పాల్గొంటూనే ఉంటాయి. తమ పూర్వీకుడైన గజేంద్రుణ్ణి రక్షించినందుకుగాను తమ కృతజ్ఞతను ప్రదర్శించే అవకాశం కోసం, "స్వామివారు తమపై ఎప్పుడెప్పుడు అధిరోహిస్తారా!" అని ఆ మత్తేభాలు ఆశగా ఎదురు చూస్తుంటాయి. బ్రహ్మోత్సవాల్లో గజవాహనం నాడు గజరాజులకు ఈ పరమాద్భుతమైన అవకాశం లభిస్తుంది. తమ జాతిలో ఏ ఒక్క ఏనుగుకు ఆ అదృష్టం లభించినా జాతి మొత్తానికి సంతోషదాయకమే కదా! స్వామి శరణాగతవాత్సల్యానికి గజవాహనసేవ ఓ ప్రత్యక్ష తార్కాణం. భక్తితో ప్రార్థిస్తే, గజేంద్రుణ్ణి రక్షించినట్లు మనని కూడా శ్రీవారు రక్షిస్తారని గజవాహనసేవ ద్వారా వ్యక్తం అవుతుంది.

తాళ్ళపాక అన్నమయ్య గజవాహనోత్సవ వైభవాన్ని ఇలా మనోహరంగా వర్ణించాడు –

చొల్లపు జుట్టుతోడి చుంగుల రాజసముతో
వెల్లివిరిగా నేగి వెలదులు గొలువ
వీపు గుచాలు మోపి వెలది కౌగిలించగా
నేపున నేనుగు నెక్కి విదె దేవుడు
చేపట్టి యాపె చేతులు బిగ్గె బట్టక
పైపై వీధుల వెంట బరువు దోలీని

మూడు వాహనోత్సవాలతో అత్యంత ప్రత్యేకతను సంతరించుకున్న ఆరవరోజు బ్రహ్మోత్సవాలు ముగిశాయి. (మిగిలిన అన్ని రోజులూ రెండు వాహనసేవలు మాత్రమే జరుగుతాయి).

ఆరవరోజు ఉత్సవకార్యక్రమం ఈ విధంగా ఉంటుంది –

- హనుమంత వాహనం: ఉ. 9–11 గం.

- స్వర్ణరథోత్సవం: సా. 4–6 గం.
- గజవాహనం: రా. 8–10 గం.

సూర్యప్రభ వాహనం

బ్రహ్మోత్సవాల్లో ఏడవరోజు ఉదయం సప్తగిరీశుడు ఒక్కరే – ఏడు గుర్రాలు పూన్చిన రథంపై, ఏడంతస్తుల కనకపు సింహాసనాన్ని అధిష్టించి, వజ్రకవచధారియై; బాలభానుడు తన ఉదయపు లేలేత కిరణాలతో నమస్కారాలు సమర్పిస్తుండగా మాడ వీధుల్లో ఊరేగుతూ "సూర్య మండలం మధ్యనున్న నారాయణమూర్తిని నేనే" – అని భక్తులకు సందేశమిస్తారు.

"ధ్యేయస్సదా సవిత్రృ మండల మధ్యవర్తీ నారాయణః" అంటే, "సూర్య మండలం మధ్యలో ఉన్న శ్రీమన్నారాయణుడు ఎల్లప్పుడూ ధ్యానింప దగినవాడు" అని వేదశృతి. అందుకే హిందూ సాంప్రదాయంలో ప్రతిరోజూ ఉదయం సూర్యనమస్కారాలు, సూర్యోపాసన చేసే సంస్కృతి ఉంది. గాయత్రీమంత్రంతో సూర్యనారాయణుణ్ణి ఆరాధిస్తాము. సూర్యుడు తేజోనిధి. నిత్యం కంటికి కనిపించే ప్రత్యక్షదైవమైన సూర్యనారాయణుడు ప్రకృతికి, జీవులకు చైతన్యప్రదాత. వర్షాలు, వాటివల్ల కలిగే పాడి పంటలు, చంద్రుడు అతని షోడశకళల వల్ల వృద్ధిచెందే ఔషధులు; అన్నీ సూర్యప్రసాదితాలే. సూర్యుడు కర్మసాక్షి.

నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారిని తట్టుకునే రోగనిరోధకశక్తి, లేలేత సూర్యకిరణాల ద్వారా లభించే "విటమిన్ డి" లో మెండుగా ఉంటుందని వైద్యులు, శాస్త్రవేత్తలు చెప్తున్నారు. మయూరాదులు, సాంబుడు వంటి భక్తులు సూర్యోపాసనచేతనే శారీరక అనారోగ్యం నుండి విముక్తులైనట్లు పురాణాలద్వారా తెలుస్తోంది.

"ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్!!"

శ్రీమహావిష్ణువుకు సూర్యుడు కుడికన్నుగా, చంద్రుడు ఎడమనేత్రంగా చెబుతారు. అందుకే విష్ణుమూర్తి దివారాత్రాలకు (పగలు, రేయి) అధిపతి.

రాజవంశాలలో సూర్యవంశం ప్రథమం. శ్రీమహావిష్ణువు పుత్రుడు బ్రహ్మతో మొదలైన సూర్యవంశంలో ముప్పయ్యొనిమిదవ తరానికి చెందినవాడు శ్రీరామచంద్రుడు. బ్రహ్మకు మరీచి, అతనికి కాశ్యపుడు, అతనికి సూర్యుడు జన్మించారు. రామ–రావణ సంగ్రామంలో శ్రీరామచంద్రుడు "ఆదిత్యహృదయం" పఠించి, తన పూర్వజుడు, వంశనామ కారకుడు అయిన సూర్యనారాయణుని ఆశీస్సులు పొంది, తద్వారా రావణసంహారం గావించాడు.

సూర్యుడు నమస్కార ప్రియుడు. మనకు అంతులేని ఫలాలు ప్రసాదించినా, ఏ ప్రతిఫలం ఆశించడు. మనం త్రికరణశుద్ధిగా చేసే నమస్కారానికే ఆయన సంతృప్తి చెందుతాడు. "ఆరోగ్యం, కవిత్వం, విద్య, ఐశ్వర్యం, సంతానం – ఇవన్నీ సూర్యదేవుని అనుగ్రహం వల్ల సిద్ధిస్తాయి" అని సూర్యశతకం తెలియజేస్తుంది. సూర్యోపాసన, చక్షూరోగ (కంటి సంబంధిత వ్యాధులు) నివృత్తి గావిస్తుందని యజుర్వేదంలోని చాక్షూషోపనిషత్తు విదిత పరుస్తుంది. చర్మరోగగ్రస్తులు సైతం సూర్యనారాయణుని పూజించి బాధా విముక్తులవుతారు.

ఇప్పుడు ఓసారి మలయప్పస్వామివారు అధిరోహించిన వాహనాన్ని దగ్గరనుంచి దర్శించుకుందాం. జపాకుసుమాలు ధరించిన స్వామి వాహనానికి, గరుత్మంతుని అన్నగారైన "అనూరుడు" సారథ్యం వహిస్తున్నాడు. రథాన్ని లాగుతున్న ఏడు గుర్రాలను ఏడు ఛందస్సులుగా పరిగణిస్తారు. గాయత్రి, బృహతి, ఉష్ణిక్, జగతి, త్రిష్టుప్, అనుష్టుప్, పంక్తి అనేవి ఆ ఛందస్సుల పేర్లు. విష్ణుసహస్రనామంలో "అనుష్టుప్ ఛందః" అని పఠిస్తాం. అంటే "అనుష్టుప్ అనబడే ఛందస్సులో వ్రాయబడినది" అన్నమాట.

అనూరుడు అంటే "ఊరువులు (తొడలు) లేకుండా జన్మించినవాడు" అని అర్థం. సూర్యరథసారథి అయిన అనూరుడు; తన తమ్ముడూ, విష్ణుమూర్తి వాహనమైన గరుత్మంతుని వద్దకు వచ్చాడు.

ఆహా, ఏమి ఆ అపూర్వ సంగమము!

ఒకరేమో జగతి కాలచక్రాన్ని నిర్ధారించే సూర్యదేవుని రథానికి సారథి, మరొకరేమో జగద్రక్షకుడైన శ్రీమన్నారాయణుని ముల్లోకాలను విహరింపజేసే వాహనము!

ఇంతటి ధన్యులైన ఇద్దరు పుత్రరత్నాలను కన్న "వినతి" చేసుకున్న పూర్వజన్మల పుణ్యఫలం ఎంత గొప్పదో కదా!

సూర్యప్రభవాహనంపై శ్రీనివాసుని దర్శనం భక్తులకు పూర్ణ ఫలాన్ని ప్రసాదిస్తుంది. ఈ వాహనసేవ దర్శనం ద్వారా భక్తకోటికి ఆరోగ్యం, ఐశ్వర్యం సంపూర్ణంగా సిద్ధిస్తాయి.

అదివో చూడరో అందరు మ్రొక్కరో
ముదిగొనె బ్రహ్మము కోనేటి దరిని
రవిమండలమున రంజిల్లు తేజము
దివి చంద్రునిలో తేజము
భువి ననలంబున బొడమిన తేజము
వివిధంబులైన విశ్వతేజము

– అంటూ, ఆ శ్రీనివాసుడే సూర్యమండల మధ్యవర్తియగు శ్రీమన్నారాయణుడని ధృవపరిచి, కీర్తించాడు, పదకవితా పితామహుడు అన్నమయ్య.

స్వయం ప్రకాశా గోవిందా!
ప్రత్యక్షదేవా గోవిందా!!
దినకరతేజా గోవిందా!!!

చంద్రప్రభ వాహనం

ఏడవనాటి రాత్రి వేంకటేశ్వరుడు ఒక్కరే, తెల్లని వెన్నెలతో కూడుకున్న చల్లని వాతావరణంలో, చంద్రప్రభ వాహనంపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ దర్శనమిస్తారు. పగలు సూర్యప్రభ వాహనంపై ఊరేగిన విష్ణుదేవుడు; ఆనాటి రాత్రి

నిశాకరుడై, అమృత కిరణాలు ప్రసరించే చంద్రప్రభ వాహనంపై ఊరేగుతారు. శ్రీకృష్ణుడు తన విభూతులను తెలుపుతూ, "నక్షత్రాణా మహం శశి!" అంటూ, తనను తాను చుక్కల్లో చంద్రునిగా అభివర్ణించుకున్నాడు.

"చంద్రుడు" అంటే అమృతానికి నిధి అని అర్థం. అమృతకిరణుడు, సుధాకిరణుడు, హిమకిరణుడు అయినటువంటి చంద్రప్రభవాహనంలో; ధవళ వస్త్రాలు, శ్వేతవర్ణపుష్పాలు ధరించి "ధన్వంతరి" అలంకారంలో అలరిస్తున్నారు మలయప్పస్వామి.

క్షీరసాగరమథనంలో కల్పవృక్షము, కామధేనువు, శ్రీమహాలక్ష్మిలతో పాటుగా; చేతిలో అమృతకలశంతో ధన్వంతరి ఉద్భవించారు. సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు అవతారం అయిన ధన్వంతరిని ఆయుర్వేదవైద్యానికి మూలపురుషుడిగా వర్ణిస్తారు. ఆయనను పూజిస్తే ఆరోగ్యం వృద్ధి చెందుతుందని ప్రతీతి. దీపావళికి రెండు రోజులు ముందు వచ్చేటటువంటి, ధన్వంతరి జన్మతిథి అయిన ధనత్రయోదశిని ఉత్తరభారతదేశంలో "ధంతేరాస్" పండుగగా జరుపుకుంటారు. అదే తిథిలో బంగారానికి ప్రతిరూపమైన లక్ష్మీదేవి సైతం క్షీరసాగరమథనంలో ఉద్భవించడం వల్ల ఆరోజు బంగారం కొనడం, లక్ష్మీదేవిని పూజించడం అనే సాంప్రదాయాలు అమల్లోకి వచ్చాయి. ఉత్తరభారతదేశంలో ఇదు రోజులపాటు జరుపుకునే అతి పెద్ద పండుగ "దీపావళి"లో మొట్టమొదటి రోజు "ధనత్రయోదశి". ఆరోజును భారతప్రభుత్వం "జాతీయ ఆయుర్వేద దినం" గా ప్రకటించింది.

ధన్వంతరి ఆయురారోగ్యాలకు అధిపతి అయినందున, ప్రస్తుత విపత్కర పరిస్థితుల దృష్ట్యా తిరుమలక్షేత్రంలో ప్రతిరోజూ ఉదయం యోగవాశిష్ఠం, తదుపరి ధన్వంతరి మహామంత్ర పారాయణం జరుపబడుతోంది. తిరుమలక్షేత్రం నుండి ఉదయం ఏడు గంటలకు శ్రీవేంకటేశ్వరా భక్తి ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం గావించబడే ఈ స్తోత్రంపఠనంలో మనం కూడా శృతి కలిపి, కరోనా కట్టడికి ఉడుతాభక్తిగా మనవంతు కృషి చేద్దాం.

పురాణేతిహాసాల్లోకి వెళితే "కర్కటి" అనబడే బ్రహ్మరాక్షసి, ఘోరమైన తపస్సు గావించి బ్రహ్మ నుండో వరం పొందింది. ఆ వరం ప్రకారం, కర్కటి అత్యంత సూక్ష్మక్రిమిగా మానవశరీరాల్లోకి ప్రవేశించి, "విషూచికా" అనబడే విషజ్వరాన్ని వ్యాపింపజేసి, శరీరాంతర్భాగాల నన్నింటినీ ఛిద్రంగావించి, రోగగ్రస్త శరీరావశేషాలను సుష్టుగా భుజించి, తన క్షుద్బాధను తీర్చుకో గలుగుతుంది. మానవజాతి మొత్తాన్ని అప్రయత్నంగా, ఏకమొత్తంగా దిగమ్రింగాలని దాని పన్నాగం. సమస్తమానవాళికి మహమ్మారిలా దాపురించిన ఆ రక్కసి కోరల బారిన పడే మానవుల విపరీత లక్షణాలు, దాని నుండి తప్పించుకునే మార్గాంతరం, పఠించాల్సిన స్తోత్ర మంత్రాలను కూడా బ్రహ్మదేవుడే శెలవిచ్చారు. ఆ "విషూచికా" అనబడే విషజ్వరమే నేటి "కరోనా" అని విజ్ఞుల నమ్మకం. దాని కబంధహస్తాల నుండి మానవాళిని కాపాడడం కోసం, బ్రహ్మదేవుడు ఆనతిచ్చినట్లుగా,

".... ప్రాణాపాయకరస్య, కరోనా నామకస్య..."

అనే సంకల్పంతో మొదలై, యోగవాశిష్ఠ పారాయణం జరుగుతుంది. తరువాత,

"అచ్యుతానంద గోవింద విష్ణో నారాయణామృతః
రోగాన్మే నాశయాశేషాన్ ఆశు ధన్వంతరే హరే ॥"



అన్న శ్లోకంతో ప్రారంభమై, ధన్వంతరీ మహామంత్ర పారాయణం జరుగుతుంది. నిత్యం క్రమం తప్పకుండా ఈ మంత్రపారాయణం చేస్తే, ఉచ్చారణ శుద్ధి కావడంతో పాటుగా; ప్రాణాయమఫలం పొంది, ఊపిరితిత్తులు దృఢమై, శ్వాస సంబంధిత వ్యాధులనుండి రక్షింపబడతారని విజ్ఞుల ఉవాచ!

చంద్రునితో తెలుగువారికి విశేషానుబంధం ఉంది. ప్రతి మాతృమూర్తి తన పిల్లలకు "చందమామరావే" అనే పాటతో చల్లనయ్యకు ఆప్యాయంగా మేనమామ వరుస కలుపుతూ, గోరుముద్దలు తినిపిస్తుంది. ప్రేయసీ-ప్రియులకు వెన్నెల రాత్రి విహారాలంటే ఎంతో ఇష్టం. అందమైన ముఖాన్ని చంద్రబింబం తో పోలుస్తారు. తెలుగు సాహిత్యంలో పున్నమివెన్నెల మీద రాయబడినంత కవిత్వం, బహుశా మరే ఇతర ఇతివృత్తం పైనా వెలువడలేదంటే అతిశయోక్తి కాదు.

"చంద్రమా మనసో జాతః" అంటే, చంద్రుడు భగవంతుని మనస్సు నుండి ఉద్భవించినట్లుగా పురుషసూక్తం చెబుతుంది. *"పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః"* అని పురుషోత్తమ ప్రాప్తియోగంలో ప్రకటించబడింది. అంటే "చంద్రకిరణ స్పర్శతోనే ఔషధ మొక్క వృద్ధి చెందుతుంది" అని అర్థం. ఔషధాలు లేకపోతే మానవుని మనుగడ ప్రశ్నార్థక మవుతుంది గనుక, ఓషధీశుడైన చంద్రుడే మనకు జీవనాధారం!

పురాణాలలో చంద్రుని ప్రస్తావన విస్తృతంగా లభిస్తుంది. చంద్రుడు కూడా క్షీరసాగరమథనం లోనే ఉద్భవించాడు. చంద్రుడు శివునికి శిరోభూషణం. హాలాహలసేవనంతో విపరీతమైన ఉష్ణతాపానికి గురైన గరళకంఠుడు, చల్లనైన చంద్రుణ్ణి శిరస్సున ధరించి తాపోపశమనం పొందుతాడు. శైవసంప్రదాయానికి మూలమైన శివునికి శిరోభూషణంగా భాసిల్లే చంద్రుడు ప్రఖ్యాత వైష్ణవక్షేత్రమైన తిరుమలలో శ్రీవారికి చంద్రప్రభవాహనంగా ఉండటం అత్యంత విశేషం! శివకేశవుల కెంతమాత్రం తారతమ్యం లేదనటానికి మరో ప్రబల నిదర్శనం!

చంద్రోదయం కాగానే కలువలు వికసిస్తాయి. సాగరుడు ఉప్పొంగి చంద్రకాంతమణులను స్రవింపజేస్తాడు. *"యత ప్రహ్లాదయాత్ చంద్రః"* అంటే చంద్రుని వల్ల సంతోషం కలుగుతుంది. అదేవిధంగా, చంద్రప్రభ వాహనంపై స్వామిని చూడగానే భక్త్యావేశాలు ఉప్పొంగి, పారవశ్యంతో భక్తుల నేత్రాలు వికసిస్తాయి. "సూర్యుని తీక్ష్ణత్వం, చంద్రుని కోమలత్వం రెండూ తన స్వరూపమే" అని శ్రీనివాసుడు ఏడవరోజు జరిగే సూర్యప్రభ మరియు చంద్రప్రభ వాహనాల ద్వారా వెల్లడిస్తున్నారు. ఈ వాహన సందర్శనం ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవికమనీ; అందువల్ల త్రివిధ తాపాలు నివారింప బడతాయని ప్రతీతి. చంద్రునిలాంటి చల్లనైన మనస్సు కలిగి, చల్లని వెన్నెల వంటి ప్రశాంతతను తన చుట్టూ ఉన్నవారికి పంచి పెట్టాలని ఈ వాహనం సందేశిస్తుంది.

చంద్రుని శోభను అన్నమయ్య ఈ విధంగా వర్ణించాడు –

చందమామ రావో జాబిల్లి రావో
కుందనపు పైడికోర వెన్నపాలు తేవో ॥
నగుమోము చక్కనయ్యకు నలుగు పుట్టించిన తండ్రికి నిగములందుండే అప్పకు మా నీలవర్ణునికి
జగమెల్ల ఏలిన స్వామికి చక్కని ఇందిర మగనికి ముగురికి మొదలైన ఘనునికి మాముద్దులమురారిబాలునికి

రథోత్సవం

బ్రహ్మోత్సవాలయందు గరుడవాహనం తర్వాత అత్యంత వైభవంగా జరిగే "రథోత్సవం" లో, భక్తులు తేరు (రథం) యొక్క పగ్గాలను పట్టిలాగుతూ, ఉత్సవంలో ప్రత్యక్షంగా పాల్గొనటం వల్ల ఇది అత్యంత జనాకర్షకమైన వాహనోత్సవంగా ప్రసిద్ధిగాంచింది. తక్కిన వాహనసేవ లన్నింటిలో భక్తులు కేవలం చూసి తరించగలరే గానీ, ప్రత్యక్షంగా పాలు పంచుకొనే అవకాశం లేదు.

బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవరోజు ఉదయం ఉదయభానుని కిరణకాంతులలో, వివిధ వర్ణాల పరిమళ పుష్పాలతో అలంకృతమై మేరుపర్వతచందంగా ఉన్న రథంపై, శ్రీదేవి-భూదేవి సమేతులైన మలయప్పస్వామివారు మాడవీధుల్లో విహరిస్తారు. ఈ రోజు శ్రీవారివాహనం అశ్వసమానమైన వేగంతో దౌడు తీస్తుంది. స్వయంగా పాల్గొనే అవకాశం రావడంతో, భక్తులు రెట్టించిన ఉత్సాహంతో కర్పూరనీరాజనాలు సమర్పిస్తూ; కోలాటనృత్యాలతో దిక్కులు పిక్కటిల్లేలా గోవిందనామసంకీర్తనలు ఆలపిస్తూ; తమ అచంచలమైన భక్తిని, ఆధ్యాత్మిక ఆనందాన్ని వ్యక్తం చేస్తారు.

అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం దేవాలయ సిబ్బంది వారిస్తున్నప్పటికీ, నడుస్తున్న రథంపై భక్తులు ఉప్పు, మిరియాలు జల్లటం ఈ ఉత్సవంలో మరో ప్రత్యేకత.

పురాణేతిహాసాలలో రథాలకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. ప్రాచీనకాలంలో కాల్బలం, అశ్వబలం, గజబలంతో పాటుగా రథబలానికి కూడా చతురంగబలాల్లో సముచితమైన స్థానం ఉండేది. అనాదికాలం నుండి యుద్ధవిద్యల్లో రథసంచాలనం కూడా ఒకటి. కేవలం యుద్ధాలకే కాకుండా వేటకు, విహారానికి, వ్యాహ్యాళికి కూడా రథాలను విరివిగా ఉపయోగించేవారు. రథాలకు, వాటి సారథులకు, గుర్రాలకు చిత్రవిచిత్రమైన పేర్లుండేవి. ఉదాహరణకు సూర్యుని రథం పేరు "సప్త". అలాగే, కృష్ణుని రథసారథి పేరు "దారుకుడు". శైబ్యము, సుగ్రీవము, మేఘపుష్పము, వలాహకము అనేవి కృష్ణుని యొక్క నాల్గు గుర్రాలపేర్లు.

రథాలకు యుద్ధాలకు అవినాభావ సంబంధం ఉంది. యుద్ధవిన్యాసాలలో, యోధుల యొక్క శక్తిసామర్థ్యాలను బట్టి వారిని రథి, అతిరథి, మహారథి, అతిమహారథి, మహామహారథిగా వర్గీకరించేవారు. "రథి" అంటే, రథారూఢుడై ఏకకాలంలో ఐదువేల మంది యోధులతో యుద్ధం చేయగల సమర్థుడు. "మహామహారథి" అత్యధికంగా, 20 కోట్ల 73 లక్షల 60 వేల మందితో ఒకేసారి యుద్ధం చేయగలిగినవాడు. ఉదాహరణకు ఉపపాండవులు, శకుని మొదలైనవారు "రథి" కోవలోనికి వస్తే; బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు, దుర్గాదేవి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరుడు "మహామహారథులు".

దేవాలయాల ఉత్సవవేడుకలలో కూడా రథాలకు చెప్పుకోదగ్గ పాత్ర ఉంది. దాదాపు అన్ని ప్రాచీన ఆలయాలలోనూ, ఈనాడు కూడా రథాన్ని, రథమండపాన్ని మనం చూస్తాం. ఆగమశాస్త్రానుసారం వైదికకర్మలు జరిగే ప్రతి ఆలయంలోనూ, రథోత్సవం నేడూ ఓ తప్పనిసరి వేడుక. జగద్విదితమైన, అత్యంత వైభవోపేతంగా జరిగే పూరీ జగన్నాథుని రథయాత్ర గురించి ప్రత్యేక పరిచయం అక్కరలేదు.

"*రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే*" రథంలో వేంచేసి ఉన్న విష్ణుదేవుని దర్శనం పునర్జజన్మరాహిత్యాన్ని కలిగిస్తుందనే విశ్వాసంతో భక్తులు రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొంటారు.

స్వతహాగా యోధానయోధుడు, భక్తజన పరిపాలకుడు, మృగయావినోదుడు (వేట యందు ఆసక్తి గలవాడు), విహారప్రియుడు ఐనటువంటి స్వామివారికి, రథంతో సహజంగానే ఎంతో అనుబంధం ఉంది. నేడు "రథికుడు" అయిన స్వామివారు, కృష్ణావతారంలో అర్జునునికి "రథసారథి". ఈనాటి రథోత్సవం ద్వారా ఆ అనుబంధాన్ని శ్రీవారు లోకాలకు చాటి చెప్తున్నారు.

రథోత్సవానికి ఓ విశిష్టమైన ఆధ్యాత్మిక పరమార్థం ఉంది. కఠోపనిషత్తులో ఆత్మకు, శరీరానికి ఉండే సంబంధం రథసారూప్యతతో వివరించడం జరిగింది. "బుద్ధి" అనే సారథి సంచాలనంలో "మనస్సును" పగ్గాలుగా చేసుకుని, "ఇంద్రియాల" నబడే గుర్రాల సాయంతో చరిస్తున్న "శరీరమనే" రథాన్ని, "ఆత్మ" అనే రథికుడు అధిరోహిస్తాడు. ఈ రకంగా శరీరాన్ని రథంతో పోల్చడం వల్ల, స్థూల-సూక్ష్మశరీరాలు వేరని, ఆత్మ ఆ రెండింటికీ భిన్నమనే ఆధ్యాత్మిక విచక్షణాజ్ఞానం కలుగుతుంది.

రథోత్సవాన్ని వర్ణిస్తూ, అన్నమయ్య, సకలజీవులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తన రథాన్ని తానే సంచాలనం చేస్తున్నాడని పేర్కొన్నాడు.

దేవదేవుడెక్కెనదె దివ్య రథము
మా వంటి వారికెల్ల మనోరథము
మిన్ను నేలా నొక్కటైన మేటి తేరు
కన్నులపండువైన శ్రీకాంతుని తేరు

అశ్వవాహనోత్సవం

గక్కన నయిదవనాడు గరుడునిమీదను
యెక్కెను ఆరవనాడు యేనుగుమీద
చొక్కమై యేడవనాడు సూర్యప్రభలోను
యిక్కున దేరును గుర్ర మెనిమిదోనాడు

బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవరోజు రాత్రి మలయప్పస్వామివారు ఒంటరిగా, కలిపురుషుని వేషధారణలో, శిరస్త్రాణభూషితుడై, నడుముకు కత్తి డాలు ధరించి, ఒక చేతియందు ఛర్నాకోల, మరో చేతితో గుర్రపు పగ్గాలు చేబూని, యుద్ధానికి సిద్ధంగా ఉన్న వీరాధివీరుని వలె, అశ్వవాహనంపై రాచఠీవి ఉట్టిపడేలా ఊరేగుతారు.

అశ్వానికి చారిత్రక, పౌరాణిక, ఆధ్యాత్మిక, సమకాలీన ప్రాశస్త్యం విశేషంగా ఉంది. వేగానికి ప్రతీక అయిన అశ్వం చతురంగబలాలలో ప్రధానమైనది. యుద్ధాలలో సైనికులు గుర్రాలనెక్కి యుద్ధం చేస్తుండగా, దళాధిపతులు, రారాజులు తమతమ హోదాలను బట్టి అశ్వాలు పూన్చిన రథాలపై నుండి సమరం సాగించేవారు. విశ్వాసానికి

మారుపేరైన అశ్వరాజాలు తమ యజమానులను కాపాడటం కోసం, తమ ప్రాణాలను పణంగా పెట్టిన ఉదంతాలు చరిత్రలో కోకొల్లలుగా ఉన్నాయి.

పురాణేతిహాసాల ననుసరించి శ్రీహరి శ్రీనివాసునిగా భూలోకంలోని వేంకటాచలంచేరి పద్మావతిదేవిని పరిణయమాడటం కోసం వేట నెపంతో, ఖడ్గధారియై, అశ్వంమీద నారాయణవనానికేతెంచారు. క్షీరసాగరమథనంలో పుట్టిన ఉచ్చైఃశ్రవము అనే అశ్వరాజ్యాన్ని ఇంద్రుడు తన వాహనంగా స్వీకరించాడు. శ్రీమహావిష్ణువు యొక్క జ్ఞానావతారాలలో మొదటిది "హయగ్రీవుని" అవతారం. హయగ్రీవుడంటే, "గుర్రం ముఖం కలిగిన దైవం" అని అర్థం.

హయగ్రీవునికి గుర్రం ముఖం ఉండటం వెనుక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. ఒకానొకప్పుడు పదివేల ఏండ్లపాటు నిర్విరామంగా రాక్షసులతో యుద్ధంచేసి అలసిపోయిన శ్రీమహావిష్ణువు అల్లెత్రాడుతో (వింటినారితో) ఇరుకొనలూ బిగించి కట్టబడిన "శార్ఙ్గం" అనబడే ధనుస్సు యొక్క ఒక కొనను నేలపైనుంచి, మరొక కొనపై గెడ్డాన్ని ఆన్చి, నుల్చొని ఉండే నిద్రపోతాడు (*"...శార్ఙ్గధన్వా గదాధరః"* అన్న 107వ విష్ణుసహస్రనామ శ్లోకాన్ని స్మరణకు తెచ్చుకోండి). ఆయనను నిద్రనుండి మేల్కొలపటానికి దేవతలు భయపడుతుంటే బ్రహ్మదేవుని ఆజ్ఞమేరకు ఓ "వమ్రి" (చెదపురుగు), వింటినారిని కొరికి శ్రీహరికి నిద్రాభంగం కావించే ప్రయత్నం చేస్తుంది. కానీ, దురదృష్టవశాత్తూ వింటినారి తెగడంతో, ధనుస్సు యొక్క కోపు అతివేగంగా వెళ్ళి విష్ణువు యొక్క తలను ఛేదించగా, ఆ శిరస్సు వెళ్ళి ముల్లోకాలకు ఆవల పడుతుంది. ఈ హఠాత్సంఘటనకు నివ్వెరబోయిన దేవతలు, లక్ష్మీదేవి యానతి ననుసరించి, ఓ అశ్వరాజాన్ని వధించి దాని శిరస్సును తీసుకుని వస్తారు. దేవశిల్పి గుర్రం తలను విగతజీవియైన విష్ణుమూర్తి మొండానికి అతికించగా, బ్రహ్మదేవుడు తిరిగి ప్రాణం పోస్తాడు. ఇదంతా, లోకకళ్యాణార్థం, పూర్వపు యుగాల శాపాలు–వరాల ననుసరించి జరుగుతుంది.

సమస్తవిద్యలకు అధిదేవత అయినటువంటి హయగ్రీవుని ఆలయం, ఉత్తరమాడవీధి చివరిభాగంలో, స్వామిపుష్కరిణి యొక్క ఈశాన్యదిక్కుకు ఎదురుగా స్థితమై ఉంది.

బ్రహ్మోత్సవాలలో మొట్టమొదటిదైన "పెద్దశేషవాహనం" కుండలినీయోగానికి ప్రతీక అయితే, చిట్టచివరిదైన "అశ్వవాహనం" ఓంకారానికి సంకేతం.

అసమాన శక్తికి, శారీరకదృఢత్వానికి కూడా అశ్వం పేర్గాంచింది.

ఆధునికయుగంలో యంత్రశక్తిని "హార్స్ పవర్" లేదా "అశ్వికశక్తి" తో గణించటం మనందరికీ విదితమే!

దాదాపు నూరు సంవత్సరాల పూర్వం వరకూ, బ్రహ్మోత్సవాలకై ఆహ్వానం పలకడం లోనూ అశ్వరాజాల పాత్ర ఎంతగానో ఉండేది. ఉత్సవ ప్రారంభానికి దాదాపు రెండు నెలల ముందుగానే బ్రహ్మోత్సవ చిహ్నమైన ధ్వజాన్ని చేబూని, 24 అశ్వికదళాలు మేళతాళాలు మ్రోగించుకుంటూ, ఉత్సవాలకై అట్టహాసంగా సమస్త జనులకూ ఆహ్వానం పలుకుతూ అన్ని దిక్కులలో బయలుదేరేవి. వారి తిరుగుప్రయాణంలో ఉత్సవాలకు విచ్చేసే భక్తుజనులందరూ,

వారివారి వాహనాలలో అశ్వికదళాల ననుసరిస్తూ, వారి రక్షణలో తిరుమలక్షేత్రాన్ని చేరుకునేవారు. రాలేని భక్తులు వారి వారి కానుకలను అశ్వదళం ద్వారా శ్రీవారికి పంపేవారు.

విష్ణుమూర్తి యొక్క దశావతారాలలో చిట్టచివరిది "కల్కి" అవతారం. కలియుగాంతంలో కల్కిభగవానుడు ఖడ్గం చేబూని, అశ్వవాహనం ఎక్కి, దుష్టసంహారం గావించి ధర్మాన్ని పునరుద్ధరించుతాడని పురాణాలు చెబుతున్నాయి.

శ్రీకృష్ణదేవరాయలు తన "ఆముక్తమాల్యద" గ్రంథంలో కల్కి అవతారం గురించి విశదంగా వర్ణించాడు.

అశ్వం వేగానికి ప్రతీక అయితే, మనస్సు దాని కంటే వేగవంతమైనది. హరిని తలంచినంతనే జ్ఞానచక్షువులు వైకుంఠాన్ని దర్శిస్తాయి. ఇంద్రియాలను ఆలవాలంగా చేసుకొని మనస్సు అత్యంత వేగంతో పరిభ్రమిస్తుంది. అందుకే "మనోవేగము" అన్న నానుడి వాడుకలోకి వచ్చింది. అశ్వారూఢుడై ఊరేగుతున్న స్వామి నిరంతర సాధనతో ఇంద్రియాలపై విజయం సాధించి, దాని ద్వారా మనస్సు యొక్క వేగాన్ని నియంత్రించి పరమాత్మపై లగ్నం చేయాలని ఉపదేశిస్తున్నారు. యుగాంతంలో తాను జరుపబోయే దుష్టశిక్షణ కార్యక్రమానికి నాందీ ప్రస్తావన కూడా ఇప్పుడే పలుకుతున్నారు.

"కలి" అనే శబ్దానికి పుణ్యం అని అర్థం. కృతయుగంలో ఒక సంవత్సరం పాటు చేసేటటువంటి తపస్సు, త్రేతాయుగంలో చేసినటువంటి యజ్ఞాలు, ద్వాపరయుగంలో కావించినటువంటి అర్చనలు, వీటి ద్వారా ఎంత ఫలితం వస్తుందో, అంతే ఫలితం కలియుగంలో ఒక్కరోజు, ఒక్కగంట నిశ్చలమైన మనస్సుతో భగవద్ధ్యానం చేస్తే వస్తుందట!

అందుకే కలియుగం అంత గొప్పది. ఈ యుగంలో జన్మించిన మనం పరమాత్మను సేవించుకుంటూ, కలిపురుషుని రక్షణలో, జన్మను సార్థకం చేసుకోవాలి. ధర్మానికి ఎప్పుడు హాని కలుగుతుందో, నిజమైన ధార్మికులు ఎప్పుడైతే కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతారో, అప్పుడు దుష్ట శిక్షణకు కల్కిభగవానుడు అవతరిస్తాడని అశ్వ వాహనం ద్వారా తెలుప బడుతోంది.

నీవు తురగముమీద నేర్పు మెరయ
వేవేలు రూపములు వెదచల్లి తపుడు
పదిలముగ నిరువంక పసిడి పింజల యంప
పొదల తరకసములొరవులు నెరపగా
గదయు శంఖము చక్రము ధనుఃఖడ్గములు
పదివేలు సూర్యబింబము లైనవపుడు
("తురగము" అంటే అశ్వము)

పల్లకి మరియు తిరుచ్చి ఉత్సవాలు

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదవ మరియు చివరిరోజు తెల్లవారు ఝామున మూడుగంటల నుంచి ఆరుగంటల వరకు, చక్రస్నానానికి ముందుగా దేవాలయంలో పల్లకి ఉత్సవం మరియు తిరుచ్చి ఉత్సవం జరుగుతాయి.

చక్రస్నానం

తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలలో జరిగినటువంటి అన్ని సేవలు సఫలమై లోకాలన్నీ క్షేమంగా ఉండటానికి, భక్తులు సుఖశాంతులతో వర్ధిల్లడానికి, శ్రవణానక్షత్రం నాడు "చక్రస్నానం" జరుగుతుంది. యజ్ఞాంతంలో క్రతుకర్త చేసే స్నానాన్ని "అవభృథస్నానం" అంటారు. బ్రహ్మోత్సవాలు ఓ మహాయజ్ఞమే కనుక, చివరి రోజున అవభృథస్నానం చేస్తారు. స్వామివారి సేవకుడు, పంచాయుధాల్లో ఒకరైన సుదర్శనచక్రం (లేదా చక్రత్తాళ్వార్) ఈ స్నానమాచరించటం వల్ల ఇది "చక్రస్నానం" అయ్యింది.

స్వామిపుష్కరిణికి వాయువ్య భాగంలో, తిరుమల క్షేత్రంలో మొట్టమొదటిదైన "ఆదివరాహస్వామి" ఆలయం కొలువై ఉంది. శ్రీదేవి-భూదేవి సమేత మలయప్పస్వామి తొమ్మిదవరోజు ఉదయం ఈ ఆలయప్రాంగణం చేరుకుంటారు. వారితో పాటుగా, వేరే పల్లకిలో చక్రత్తాళ్వార్ (సుదర్శన చక్రం) కూడా వేంచేస్తారు. మొదటగా స్వామివారికి దేవేరులకు స్నానవస్త్రాలు ధరింపజేసి, అర్ఘ్య పాద్య ఆచమనాదులు జరిపి, శుద్ధోదక స్నానం చేయిస్తారు. తదుపరి, ఆవుపాలు దాని తరువాత శుద్ధజలంతో అభిషేకం జరుగుతుంది. ఆ తరువాత వరుసగా – పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపుతో – అభిషేకం చేస్తారు. ఒక ద్రవ్యంతో అభిషేకం చేసిన తరువాత ప్రతిసారి, శుద్ధజలంతో విగ్రహశుద్ధి గావిస్తారు. తదనంతరం ధూప, దీప, కర్పూరనీరాజనాలు సమర్పించి; దేవతామూర్తులకు చందనసంస్కారం, తిలకధారణ గావించి; తులసిమాలలతో అలంకరిస్తారు. వరుసగా – కుంభహారతి, నక్షత్రహారతి, సహస్రాభిషేకం – జరుపబడతాయి. ఈ వైదికప్రక్రియ జరుగుతున్నంతసేపు శ్రీసూక్తం, పురుషసూక్తం, భూసూక్తం పఠిస్తారు. తరువాత స్వామివారి అభిషేకజలంతో అర్చకులు తమ శిరస్సును సంప్రోక్షించుకొని, ఆ జలాన్ని భక్తుల మీద జల్లుతారు.

తదనంతరం, చక్రత్తాళ్వార్ కు మాత్రమే స్వామి పుష్కరిణిలో "చక్రస్నానం" లేదా "అవభృథస్నానం" లేదా "పవిత్రస్నానం" జరుగుతుంది. స్థూలంగా చెప్పాలంటే, ఉత్సవవైభోగం యజమాని అయిన శ్రీవేంకటేశ్వరస్వామికి, అవభృథస్నానం సేవకుడైన చక్రత్తాళ్వార్ లేదా సుదర్శన చక్రానికి అన్నమాట.

ఆ దివ్యాయుధ స్పర్శవల్ల పవిత్రమైన పుష్కరిణీ జలాల్లో భక్తులు, అర్చకులు, ఆచార్యపురుషులు, జియ్యంగార్లు అందరూ స్నానంచేసి పవిత్రులవుతారు. తరువాత స్వామివారు, దేవేరులు, చక్రత్తాళ్వార్ ఊరేగింపుగా ఆలయంలోకి పునఃప్రవేశం చేసి, యథాస్థానాన్ని అలంకరిస్తారు. శ్రవణానక్షత్రం నాడు సుదర్శనచక్రంతో పాటుగా స్వామిపుష్కరిణిలో స్నానం చేసినవారు పూర్వజన్మల పాపాలు తొలగించుకుని సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారు.

శ్రవణంబునందు నా చక్రంబుతో గూడ
స్వామి పుష్కరిణిలో స్నానములను
సల్పువారలు పూర్వజన్మంబులను జేయు పాపంబులను బాసి భాగ్యవం
లై యిహపరములయందు సుఖింతురు
నా పల్కు నిజముగా నమ్ముడని

స్వామిపుష్కరిణిలో ఉన్న మహత్తు ఏమిటంటే మూడు దివ్యమైన మార్గాలద్వారా అందులోకి జలం చేరుతూ ఉంటుంది:

- మొదటిది: **భూస్పర్శ**. పుష్కరిణిలో ఉన్న అనేక ఊటబావుల నుండి ఎల్లవేళలా జలం ఊరుతూ, పుష్కరిణి నిండుగా ఉంటుంది. అంటే, భూదేవి, పుష్కరిణిని నింపడానికి తనవంతు ప్రయత్నం నిర్విరామంగా చేస్తుందన్నమాట.
- రెండవది: ఇంద్రుని **సమర్పణ**. వర్షపుధారల ద్వారా వచ్చిన నీటితో పుష్కరిణి నిండుతుంది.
- మూడవది: స్వర్గలోకం నుండి భువికి దిగివచ్చి స్వామిపాదాల క్రిందుగా ప్రవహిస్తూ పుష్కరిణిలో చేరుకుంటున్న "**విరజానది**".

త్రిపథ జల సంగమమైనది కాబట్టే ఈ పుష్కరిణి పరమపవిత్రమైనదిగా విరాజిల్లుతోంది.

ఈ పుష్కరిణి చుట్టూ దేవతలు కొలువై ఉంటారని భక్తుల విశ్వాసం. ప్రాచీనకాలంలో ఎందరో మహర్షులు పుష్కరిణి ఒడ్డున తపస్సు చేసి సిద్ధి పొందారు. సంస్కృతంలో "నీరము" అంటే నీరు లేదా జలము అని అర్థం. ఉదకం సాక్షాత్తు ఆ శ్రీహరి స్వరూపం కనుక, ఆ స్వామి "నారాయణు" డయ్యాడు.

ఈ సందర్భంలో తీర్థక్షేత్రాల గురించి కూడా కొద్దిగా చెప్పుకోవాలి:

- పుష్కరిణిలు, నదులు, ఏ ఇతర సహజ జలసదుపాయం లేకుండా ఉన్నటువంటి దేవాలయాన్ని క్షేత్రం అంటారు.
- దేవాలయం లేకుండా కేవలం సహజ జలసదుపాయం ఉంటే వాటిని తీర్థం అంటారు.
- పుష్కరిణి లేదా నది మరియు ఆలయం –ఈ రెండూ కలిసి ఉంటే దాన్ని తీర్థక్షేత్రం అంటారు.

తిరుమల అన్ని తీర్థక్షేత్రాలకు తలమానికం.

దేవాలయాల్లో కూడా వాటి ఆవిర్భావాన్ని బట్టి ఐదు రకాలున్నాయి:

- భగవంతుడే "స్వయంగా" అవతరిస్తే అవి స్వయంవ్యక్తక్షేత్రాలు.
- దేవతలచే నిర్మింపబడినవి దివ్యక్షేత్రాలు.
- పురాణప్రసిద్ధి గాంచినవి పురాణక్షేత్రాలు.
- మునిపుంగవుల ద్వారా ఏర్పాటు చేయబడినవి సిద్ధక్షేత్రాలు లేదా ఆర్షములు
- భక్తులు, రాజులచే నిర్మించబడినవి మానుషక్షేత్రాలు

భారతదేశంలో ఉన్న ఎనిమిది స్వయంవ్యక్తక్షేత్రాలలో తలమానికమైనది తిరుమలక్షేత్రం. జీవితంలో ఎనిమిదిసార్లు తిరుమలక్షేత్రాన్ని దర్శించుకుంటే, మిగతా ఏడు స్వయంవ్యక్త క్షేత్రాల్లో ఉన్న శ్రీమన్నారాయణుణ్ణి దర్శించినంత ఫలం లభిస్తుంది.

తిరుమలక్షేత్రంలో, ఆదివరాహస్వామి ఆలయప్రాంగణం నందు విరాజిల్లుతున్న స్వామిపుష్కరిణిలో స్నానమాచరించటం ఎన్నో జన్మల సుకృతం. ఈ పుష్కరిణిలో సంవత్సరానికి నాలుగు సార్లు చక్రస్నానం జరుగుతుంది –

- భాద్రపదశుద్ధచతుర్దశి – అనంతపద్మనాభవ్రతం నాడు

- ఇప్పుడు మనం చెప్పుకుంటున్న తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాలలో చివరిరోజు
- వైకుంఠద్వాదశి ఉదయం
- రథసప్తమినాటి మధ్యాహ్నం

స్వామివారి పరివారదేవతలైన – గరుత్మంతుడు, హనుమంతుడు, జయవిజయులు, సుదర్శనుడు – మొదలగు వారిని దర్శిస్తే స్వామివారి పరమానందభరితు డవుతారు. అలాగే, బ్రహ్మోత్సవాల్లో ఆయన పరివార సదస్యుడైన సుదర్శనచక్రాన్ని సందర్శించుకొని వారితోబాటు చక్రస్నానం గావిస్తే స్వామివారు మరింత సంతృప్తి చెందుతారు.

చక్రమా హరి చక్రమా వక్రమన దనుజుల వక్కలించవో //
చుట్టి చుట్టి పాతాళము చొచ్చి హిరణ్యాక్షుని
చట్టలు చీరిన వో చక్రమా
పట్టిన శ్రీహరిచేత పాయక ఈ జగములు
ఒట్టుకొని కావగదవొ ఓ చక్రమా //

అలంకార తిరుమంజనం

ఇది వాహనోత్సవం కాదు.

శ్రీవారిబ్రహ్మోత్సవాల్లో ఉత్సవ–ఊరేగింపు కార్యక్రమాలయందు స్వామివారికి ఏదైనా తెలియని శ్రమ కలిగితే దానిని పోగొట్టి, నూతనత్వాన్ని, కాంతిమత్వాన్ని ఆపాదింపచేయటమే "స్నపనతిరుమంజన ఉత్సవం" లేదా "అలంకార తిరుమంజనం" యొక్క లక్ష్యం. ఈ సాంప్రదాయం అనాదిగా వస్తోంది.

రంగనాయకమండపాన్ని శోభాయమానంగా అలంకరించి, మొదటగా ఉత్సవర్లను స్వర్ణపీఠంపై వేంచేపు చేస్తారు. తరువాత తీర్థం (కుంకుమపువ్వు, యాలకలు, జాపత్రి, లవంగాలు, పచ్చకర్పూరం కలిపిన జలం) తో తిరుమంజనం లేక అభిషేకం చేస్తారు. ఆ తరువాత పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో, ఒకదాని తరువాత ఒకటిగా, జియ్యంగార్లు శంఖనిధి–పద్మనిధి బంగారుపాత్రలలో అందిస్తుండగా, కంకణభట్టాచార్యులైన అర్చకులు, ఉత్సవర్లకు అభిషేకం చేస్తారు. చివరగా సహస్రధారపాత్రతో అభిషేకం గావిస్తారు. ఒక్కో ద్రవ్యంతో అభిషేకం జరిగిన తర్వాత, ఉత్సవమూర్తులకు ఒక్కో రకం – మొత్తం తొమ్మిది రకాల మాలలు, కిరీటాలు, జడలను – స్వామివారు, అమ్మవార్లకు అలంకరిస్తారు. వీటిని యాలకులు, ఎండుద్రాక్ష, వట్టివేళ్ళు, గులాబీరేకులతో; వీటితో పాటుగా, కొన్నిసార్లు విలక్షణంగా శనగఫలాలు, చిక్కుడుకాయలు, చెర్రీఫలాలు, పొగడపూలు తులసీపత్రాలతో ఆకర్షణీయంగా తయారుచేస్తారు. ప్రత్యేకంగా తయారు చేయబడిన విసనకర్ర, అద్దం, ఛత్రం వీటిని కూడా అందుబాటులో ఉంచుతారు. పోయిన సంవత్సరం విసనకర్రను ముత్యాలతో, నెమలిపింఛాలతో తయారు చేశారు. అలాగే, అద్దాన్ని ముత్యాలు–తామరపువ్వుల గింజలతో, గొడుగును మంచిముత్యాలతో రూపొందించారు.

స్నపనతిరుమంజనం జరుగుతున్నంతసేపు, మధ్య మధ్యలో ఉత్సవమూర్తులకు నివేదనలు సమర్పిస్తారు. గత సంవత్సరం జరిగిన స్నపనతిరుమంజనంలో ఆస్ట్రేలియా, సింగపూర్ భక్తులు సమర్పించిన నారింజ, కివి; జపాన్,

థాయిలాండ్, అమెరికాకు చెందిన ప్లమ్ ఫలాలు; న్యూజిలాండ్ నుంచి తెచ్చిన గోల్డెన్ యాపిల్ ఫలాలు; భారతదేశంలోని సుదూరప్రాంతాల నుంచి వచ్చిన స్ట్రాబెర్రీ, దానిమ్మఫలాలను నైవేద్యంగా సమర్పించారు.

స్నపనతిరుమంజన కార్యక్రమం జరుపబడే రంగనాయకమండపాన్ని థాయిలాండ్, ఇండోనేషియా దేశాల నుండి తెప్పించిన ఆర్కిడ్స్, గ్లాడియోలస్, ఓరియంటల్ తులిప్స్ తో కన్నుల పండువగా అలంకరించారు.

ధ్వజావరోహణం

బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదవనాటి రాత్రి ఆలయంలోని వెండివాకిలి ముందు "ధ్వజావరోహణం" జరుగుతుంది.

శ్రీదేవి-భూదేవి సమేత మలయప్పస్వామి బంగారుతిరుచ్చిలో సాయంత్రం ఏడు గంటలకు ధ్వజస్తంభం వద్దకు చేరుకుంటారు. రాత్రి తొమ్మిది గంటలకు పూజాదికాలు ముగించుకొని, వేదపారాయణం చేస్తుండగా, మంగళ వాద్యాలు, భేరీనినాదాలు మార్మోగుతుండగా, ఉత్సవాలకు విచ్చేసినట్టి బ్రహ్మాది దేవతలు, అష్టదిక్పాలకులకు వీడ్కోలు చెబుతూ, మరుసటి బ్రహ్మోత్సవాలకు ఇపుడే తొలి ఆహ్వానం పలుకుతూ, గరుడకేతనాన్ని ధ్వజస్తంభం మీద నుండి అవనతం చేస్తారు. ఈ సందర్భంగా – గరుడధ్యానం, భేరీపూజ, భేరీతాడనం, గరుడగద్యం, దిక్పాలకగద్యం, గరుడలగ్నాష్టకం, గరుడచూర్ణిక – అనే ఏడు మంత్రాలను జపించి, బ్రహ్మోత్సవాలు ముగిసినట్లుగా అర్చకస్వాములు ప్రకటిస్తారు.

ఈవిధంగా గరుడకేతనాన్ని ఎగురవేస్తూ ముల్లోకవాసులను ఆహ్వానించడంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు, గరుడధ్వజాన్ని దించివేస్తూ అతిథులందరికీ వీడ్కోలు చెప్పడంతో పరిసమాప్తి అవుతాయి. ఈ వీడ్కోలుపర్వాన్న అన్నమయ్య అత్యంత సహజంగా, హృద్యంగా, ఆప్యాయంగా, అహూతులందరికీ పేరు పేరునా వీడ్కోలు చెబుతూ, ఈ విధంగా వర్ణించాడు:

భోగీంద్రులును మీరు పోయి రండు
వేగనమీదటి విభవాలకు ॥
హరుడ పోయిరా అజుడ నీవునుంబోయి
తిరిగి రా మీదటి తిరునాళ్ళకు
సురలు మునులును భూసురులు పోయిరండు
అరవిరి నిన్నాళ్ళు అలసితిరి ॥

బ్రహ్మోత్సవాల్లో తెలియక జరిగిన లోటుపాట్లకు, తప్పిదాలకు ప్రాయశ్చిత్తంగా, క్షమాభిక్ష కోరుతూ, అంగరంగవైభవంగా, టన్నులకొద్దీ పువ్వులనుపయోగించి, చక్రస్నానానికి సరిగ్గా నెలరోజుల తరువాత, కార్తీకమాసంలో వచ్చే శ్రవణానక్షత్రంలో, సంపంగిప్రాకారంలోని కళ్యాణోత్సవమండపంలో జరిగే "పుష్పయాగం" గురించి శ్రీవారి సంవత్సరోత్సవాల వివరణలో ఇంతకుముందే తెలుసుకున్నాం.

శ్రీకృష్ణుడు అర్జునునితో తన విభూతులను తెలుపుతూ ఇలా అంటాడు: "అర్జునా! నేను జ్యోతిస్వరూపాలలో సూర్యుణ్ణి, నక్షత్రాలలో చంద్రుణ్ణి, పర్వతాలలో హిమాలయాన్ని, వృక్షాలలో కల్పవృక్షాన్ని, అశ్వాలలో ఉచ్చైఃశ్రవాన్ని, గజాలలో ఐరావతాన్ని, గోవులలో కామధేనువును, నాగులలో అనంతుణ్ణి, మృగాలలో సింహాన్ని, పక్షుల్లో గరుత్మంతుణ్ణి" అని శెలవిచ్చాడు. మాడవీధుల్లో జరిగిన సూర్యప్రభ, చంద్రప్రభ, కల్పవృక్ష, గరుడ, పెద్దశేష, అశ్వ, గజవాహనాలన్నీ, శ్రీకృష్ణభగవానుని విభూతిలన్నింటిని ఒక్కటొకటిగా విశద పరుస్తున్నాయి.

మరో కోణంలో చూస్తే, బ్రహ్మోత్సవాలు సత్య, త్రేతా, ద్వాపర, కలియుగాలలో జరిగినటువంటి భాగవత, రామాయణ, భారత పౌరాణిక ఇతిహాసలు మరియు సమకాలీన సంఘటనల సమాహారం. అంతటి మహా మహిమాన్వితమైన బ్రహ్మోత్సవాల్లో పాల్గొనటం లేదా పఠనం చేయడం లేదా శ్రవణం చేసి తరించటం జన్మ జన్మల సుకృతం.

బ్రహ్మోత్సవాలు సుసంపూర్ణం.

----------: : ----------

శ్రీభగవద్రామానుజాచార్యులు

1017వ సంవత్సరంలో తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో జన్మించిన శ్రీరామానుజులు, తన 120 ఏళ్ల సుదీర్ఘ జీవితకాలంలో మూడుసార్లు తిరుమలయాత్ర చేశారు. శ్రీవేంకటాచలక్షేత్రాన్ని సాక్షాత్తు శ్రీనివాసుని ప్రతిరూపంగా భావించి ఆ దివ్యక్షేత్ర మహాత్మ్యాన్ని పలువిధాలుగా లోకానికి తెలియ జెప్పారు.

ఐతిహ్యం

పురాణాల ననుసారించి త్రేతాయుగంలో లక్ష్మణునిగా, ద్వాపరయుగంలో బలరామునిగా అవతరించిన ఆదిశేషుడు కలియుగంలో రామానుజుల రూపుదాల్చాడు. రామ+అనుజుడు అంటే, శ్రీరామునికి తమ్ముడని అర్థం. ఆవిధంగా రామానుజులు సార్థక నామధేయుడయ్యాడు.

తిరుమలక్షేత్రానికి, రామానుజుల జీవితానికి విడదీయరాని అనుబంధం ఉంది.

తిరుమలక్షేత్ర సందర్శనం – నాందీ ప్రస్తావన

రామానుజాచార్యులు తిరుమలను సందర్శించడానికి అనేక కారణాలున్నాయి:

- తన మేనమామ, గురువు అయిన తిరుమలనంబి ద్వారా మరియు శిష్యుడయిన అనంతాళ్వార్ ద్వారా; అప్పటికే సుప్రసిద్ధ వైష్ణవక్షేత్రమైన తిరుమల లోని శ్రీవారి ఆలయంలో అర్చన, ఉత్సవ, కైంకర్యాది కార్యాలు వైఖానస ఆగమశాస్త్రానుసారం జరగడం లేదన్న విషయాన్ని తెలుసుకున్న రామానుజాచార్యులు అక్కడి పరిస్థితులను చక్కదిద్దాలనుకున్నారు.
- రామానుజ ప్రచలిత, విశిష్టాద్వైతానికి ఆధారగ్రంథమైన దివ్యప్రబంధంలో, శ్రీవేంకటేశ్వరునకు సంబంధించిన పాశురాలు చదివి ఉత్తేజితుడయ్యాడు.
- అంతకు మునుపే, తనకు ఆప్తుడైన తిరుమలనంబి తిరుమలలో స్థిరనివాసం ఏర్పరచుకుని కైంకర్యాదులు నిర్వహిస్తున్నారు.
- శ్రీరంగం లాంటి వైష్ణవాలయాలలో పూజాకార్యక్రమాలు జరగటానికి నియమావళిని ఏర్పాటుచేసిన రామానుజులు, తిరుమలలో కూడా అలాంటి వ్యవస్థను నిర్వహించదలచారు.
- వైష్ణవులయినవారు తమ జీవితకాలంలో ఒక్కసారైనా వేంకటాచలక్షేత్రాన్ని వీక్షించి తరించాలని కోరుకుంటారు.

వీటన్నింటి వల్ల, శ్రీరామానుజులు వారు తిరుమలక్షేత్రాన్ని దర్శించాలని దృఢంగా సౌకల్పించారు.

గోవిందరాజస్వామి ఆలయ నిర్మాణం

తిరుమలయాత్రలో మొదటి మజిలీగా తిరుపతి చేరుకున్న రామానుజులు, భగవత్కార్యాన్ని అక్కడే ప్రారంభించారు.

దక్షిణాదిన శైవమత ప్రాబల్యం అధికంగా ఉన్న రోజుల్లో కుళోత్తుంగచోళుడనే శైవారాధక పాలకుడు విష్ణుద్వేషిగా మారి; కావేరీ తీరంలో, చిత్రకూట ఆలయం నందున్న గోవిందరాజస్వామి విగ్రహాన్ని సముద్రంలో పారవేశాడు. "క్రిమికంఠుడని" కూడా పిలువబడే ఆ చోళరాజు, ఆ సుప్రసిద్ధ వైష్ణవక్షేత్రాన్ని శైవక్షేత్రంగా మార్చాడు. నాటి చిత్రకూటమే తమిళనాడు లోని ఇప్పటి "చిదంబరం". విశేషమైన పౌరాణిక ప్రాశస్త్యం కలిగిన ఆ విగ్రహం సముద్రం పాలు కావడంతో పాలకుని విష్ణుద్వేషానికి కలత చెందిన కొందరు వైష్ణవులు, ఆ ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను తీసుకునివెళ్ళి తిరుపతిక్షేత్రంలో భద్రపరిచారు. ఈ వృత్తాంతాన్ని తెలుసుకుని విషణ్ణుడైన రామానుజులు సముద్రం పాలైన గోవిందరాజస్వామి మూలవిరాట్టు ప్రతిరూపాన్ని తిరుపతిలో ప్రతిష్ఠింప జేసి, తన శిష్యుడైన యాదవరాజుతో అద్భుతమైన శిల్పకళ ఉట్టిపడేలా సమున్నతమైన ప్రాకారాలు, ఆకాశాన్ని చుంబించే గోపురాలతో, సువిశాలమైన గోవిందరాజస్వామి ఆలయాన్ని నిర్మింపజేశాడు. తిరుపతి పట్టణం నడిబొడ్డున, రైల్వేస్టేషన్ సమీపంలో ఇప్పుడు మనం చూస్తున్న గోవిందరాజస్వామి ఆలయం అదే! దానికి కొంత దూరంలో ఆలయనిర్మాణం కాక మునుపే ఉన్న ఓ విశాలమైన పుష్కరిణిని కూడా నేడు చూడవచ్చు. తిరుమల యాత్రికులు ముందుగా గోవిందరాజస్వామిని దర్శించుకునే సాంప్రదాయం నేటికీ ఉంది.

తిరుపతి పట్టణంలో, ఈనాడు "మంచినీటి కుంట" గా పిలువబడే "నరశింహక్షేత్రం" ఒడ్డున; ఆలనా-పాలనా లేకుండా ఈనాడు కూడా పడి ఉన్న శయనముద్ర లోని గోవిందరాజస్వామి విగ్రహం, ఆనాడు సముద్రంలో పారవేయ బడిన విగ్రహమేనని చరిత్రకారుల అభిప్రాయం. ఆ మూర్తిని చిత్రకూటం నుండి రవాణా చేస్తున్నప్పుడు కొద్దిగా దెబ్బ తిని ఆరాధనకు అనర్హమవ్వడం వల్ల దానిని ఈ ప్రదేశానికి తరలించినట్లు చెబుతారు. ఈసారి తిరుపతి యాత్రలో, చూడచక్కగా, జీవకళతో ఒప్పారుతూ ఉండే, చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఆ విగ్రహాన్ని తప్పక దర్శించండి.

పాదాలమండపం

తిరుమలక్షేత్రాన్ని దర్శించుకోవటానికి పూర్వం కొంతకాలం తిరుపతిలో నివాసం ఉండిన రామానుజులు, తన గురువుగారైన తిరుమలనంబి ద్వారా శ్రీమద్రామాయణం లోని ఆధ్యాత్మిక విశేషాలను తెలుసుకో దలిచారు. రామానుజుల కోర్కెమేరకు, తిరుమలక్షేత్రంలో నివాసముండే తిరుమలనంబి ప్రతిరోజు ఉదయం శ్రీవారి కైంకర్యాలు ముగించుకొని, అలిపిరి నడకమార్గానికి ప్రారంభంలో ఉన్న తన తింత్రిణీవృక్షం (చింతచెట్టు) వద్దకు వచ్చేవారు. అదే సమయానికి గోవిందరాజస్వామిని సేవించుకొని రామానుజులవారు ఆ ప్రదేశానికి చేరుకుని, తిరుమలనంబి ద్వారా రామాయణకావ్య రహస్యాలు తెలుసుకునేవారు. సాయం సమయానికి తిరుమలనంబి తిరుమలక్షేత్రం తిరిగి చేరుకునేవారు. ఆ విధంగా ఒక్క సంవత్సరకాలంలో 18 పర్యాయాలు, 18 రకాలుగా, రామాయణ రహస్యాలను చర్వితచరణం కాకుండా తిరుమలనంబి, రామానుజులకు విశదీకరించారు. రామాయణ పారాయణం ఇలా కొనసాగుతున్న తరుణంలో, ఒకసారి తిరుమలనంబి తాను ఉభయ సంధ్యలలో మాత్రమే శ్రీవారిని దర్శించుకో గలుగుతున్నానని, అలిపిరిలో ఉండిపోవడం వల్ల మధ్యాహ్న సమయంలో శ్రీవారి దర్శనభాగ్యం కలగడం లేదని వాపోయారు. భక్తుని యొక్క ఆర్తిని అర్థం చేసుకున్న శ్రీనివాసుడు, రామాయణ ఉపదేశం జరుగుతున్న ప్రదేశం లోనే

తన పాదపద్మాలు ప్రత్యక్షమయ్యేట్లు చేశారు. అప్పటినుండి అపరాహ్ణసమయంలో కూడా, రామాయణప్రసంగం మధ్యలో తిరుమలనంబి, రామానుజులువార్లు శ్రీవారి పాదదర్శనం చేసుకుంటూ ఉండేవారు. అలిపిరి నడక మార్గం ప్రారంభంలో ఈనాడు మనం "శ్రీవారి పాదమండపం" గా చెప్పుకునే దేవాలయంలో విరాజిల్లుతున్న పాదపద్మాలు అవే. ఆ దేవాలయాన్ని సందర్శించుకునే భక్తులను శ్రీవారి లోహపాదుకలతో అర్చకులు ఆశీర్వదించే సాంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.

త్రోవభాష్యకార్లసన్నిధి

రామానుజుల కలంనుంచి వెలువడిన ఆణిముత్యాలలో, శ్రీభాష్యం విశిష్టమైంది. అందువల్లనే రామానుజులవారు "భాష్యకారులుగా" ప్రసిద్ధికెక్కారు. వైష్ణవాలయాలన్నింటిలో, "భాష్యకార్లసన్నిధి" యందు కొలువై ఉండే రామానుజులవారిని మనం దర్శించుకోవచ్చు.

ఒకసారి రామానుజులవారు తిరుమలక్షేత్రానికి పయనమై తన పాదాలతో వేంకటాచలాన్ని అపవిత్రం చేయడానికి మనస్కరించక, మార్గ మధ్యలో ఉన్న వేంకటాద్రిగా భావింపబడే మోకాళ్ళపర్వతాన్ని తన మోకాళ్ళతో అధిరోహించ సాగారు. మోకాలి చిప్పలు గాయ పడడంతో, మోకాళ్ళపర్వతం మధ్యభాగంలో కొంత సేపు విశ్రమించారు. విషయాన్ని తెలుసుకున్న అనంతాళ్వార్, తిరుమలనంబి, కొండపై నుండి కొంత దూరం దిగి వచ్చి, రామానుజుల వారి కెదురేగి, స్వామివారి ప్రసాదం అయిన మామిడి పండ్లను రామానుజులకు సమర్పించారు. వారు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని స్వీకరించగా, క్రిందపడిన ఉచ్ఛిష్టం (ఫలాలను తినగా మిగిలిన టెంకలు) మొలకెత్తి కొన్నాళ్లకు పెద్దవయ్యాయి. తరువాతి కాలంలో, ఆ పవిత్రస్థలంలో ఓ మందిర నిర్మాణం జరిగి, అందులో భగవద్రామానుజుల మూర్తి ప్రతిష్ఠించబడింది. ఆ ఆలయాన్ని, తిరుపతి-తిరుమల "త్రోవలో" ఉన్న కారణం చేత, "త్రోవభాష్యకార్లసన్నిధిగా" పిలుస్తారు. అలిపిరి నడకమార్గంలో, దాదాపు మూడొంతులు ప్రయాణం చేసిన తర్వాత వచ్చే "మోకాళ్ళపర్వతం" మధ్యభాగంలో ఈ ఆలయాన్ని నేడు కూడా చూసి తరించవచ్చు.

తిరుమలక్షేత్ర ఆగమనం

మోకాళ్ళపర్వతం మెట్లన్నీ మోకాళ్ళపై అధిరోహించి తిరుమల చేరుకున్న రామానుజాచార్యులు, తదనంతరకాలంలో ఆలయాభివృద్ధికి అవిరళ కృషిచేశారు. శ్రీకృష్ణరాయలు ఆలయాన్ని భౌతికంగా అభివృద్ధి చేస్తే, అంతకు ఐదు శతాబ్దాలక్రితమే రామానుజులు శ్రీవారి ఆనందనిలయానికి ఆధ్యాత్మిక సొబగులు చేకూర్చి, నిర్జనారణ్యంలా ఉండే దేవాలయ పరిసరాల్ని ఆవాసయోగ్యంగా అభివృద్ధి పరచి, ఆలయనిర్వహణను, వైదిక కైంకర్యాలను క్రమబద్ధీకరించి, భక్తుల కొంగుబంగారమైన శ్రీవారి ఆలయాన్ని భద్రంగా భావితరాల కందించారు.

ఆలయసందర్శన

మోకాళ్ళపై తిరుమలక్షేత్రం చేరుకున్న రామానుజులు, క్షేత్ర సాంప్రదాయాన్న నుసరించి మొట్టమొదటగా శ్రీభూసమేత

ఆదివరాహ స్వామిని దర్శించారు.

కలియుగారంభంలో శ్రీనివాసునికి, వరాహస్వామికి జరిగిన ఒప్పందం ప్రకారం, మొదటిదర్శనం, మొదటిపూజ, మొదటినైవేద్యం ఆదివరాహుడికే చెందాలన్న నియమాన్ని పునరుద్ధరించి, స్వామివారు ఆదివరాహునికి చేసిన వాగ్దానాన్ని చెల్లుబాటు చేశారు. ఈ ఒప్పంద వివరాలను "ఆదివరాహస్వామి ఆలయం" అనే ప్రకరణంలో ఇంతకుముందే తెలుసుకున్నాం. తరువాత ఆనంద నిలయంలోని శ్రీవారిని సందర్శించారు.

విష్ణువా? శివుడా?

ఆ సమయంలో మూలమూర్తి శివుడని, అమ్మవారని, వీరభద్రుడని రకరకాల వాదన లుండేవి. వాగ్వాదాలు, సవాళ్ళు, ప్రతిసవాళ్ళతో ఉద్విగ్నభరిత వాతావరణం నెలకొని ఉండేది. అన్నింటికంటే, మూలమూర్తిని "శివునిగా" భావించే శైవులవాదం ప్రబలంగా ఉండేది. రామానుజులవారు అప్పటి పాలకుడు, తన శిష్యుడు అయిన యాదవరాజు సమక్షంలో, పురాణేతిహాసాల ప్రామాణికంగా, హేతుబద్ధమైన తర్కంతో, ఆ మూలమూర్తి విష్ణుమూర్తి అవతారమైన వేంకటేశ్వరుడేనని సాక్ష్యాధారాలతో నిరూపించారు. రామానుజులవారి తర్కాన్ని యాదవరాజు విశ్వసించాడు గాని, కరుడు గట్టిన శైవులు మాత్రం నమ్మలేదు. వాదోపవాదాలతో విసిగిపోయిన యాదవరాజు, రామానుజుల చొరవతో వైష్ణవులు, శైవులను సమావేశపరచగా, వారిద్దరూ ఓ ఒప్పందానికి వచ్చారు. దాని ప్రకారం ఒకరోజు, సుదర్శనచక్రం, శంఖం వంటి వైష్ణవచిహ్నాలను చేయించి భగవంతుని సన్నిధిలో ఉంచారు. అలాగే త్రిశూలం, ఢమరుకం వంటి శైవచిహ్నాలను కూడా ఆలయంలో ఉంచారు. ఆనాటిరాత్రి కట్టుదిట్టమైన కాపలాతో, ఆలయద్వారాలు మూసి ఉంచారు. తెల్లవారేసరికి స్వామి ఏ చిహ్నాలను ధరిస్తే అదే అవతారంగా అందరూ అంగీకరించాలని నిర్ణయించుకున్నారు. ఆరోజు రాత్రి తన తపఃశ్శక్తితో శ్రీనివాసుణ్ణి సాక్షాత్కారం చేసుకున్న రామానుజులు, శంఖు-చక్రాలను స్వీకరించాల్సిందిగా శ్రీవారిని పరిపరి విధాలుగా వేడుకున్నాడు. మరునాడు ఉదయం ఆలయద్వారాలు తెరిచేటప్పటికి స్వామివారు కరుణించి, ఉభయహస్తాలతో శంఖు-చక్రాలు ధరించి దేదీప్యమానంగా దర్శనమిచ్చారు. దాంతో శైవుల వాదం వీగిపోయింది. రామానుజులవారు ఆలయానికి మహాసంప్రోక్షణ గావించి, తిరుమల నిర్ద్వంద్వంగా వైష్ణవక్షేత్రమేనని, అందులో కొలువుండేది సాక్షాత్తూ శ్రీమన్నారాయణుని అవతారమైన శ్రీనివాసుడేనని దేశమంతటా ప్రచారం గావించాడు.

తిరుమల వైష్ణవక్షేత్రమేనని నిరూపింపబడటంతో, వైఖానస ఆగమకైంకర్యాలు పూర్తిస్థాయిలో జరగడం మొదలయ్యాయి. రామానుజులు "పాంచరాత్ర" ఆగమసాంప్రదాయానికి చెందినవాడైనప్పటికీ, ఏవిధమైన పక్షపాతం చూపకుండా, అనూచానంగా వస్తున్న ఆలయ ఆచారం ప్రకారం, "వైఖానస" ఆగమసాంప్రదాయాలనే కొనసాగిస్తూ వచ్చాడు.

మూలమూర్తికి మరిన్ని సొబగులు

వీరనరసింహరాజు అనే ఓ ప్రభువు ఎప్పుడో శ్రీవారికి ఒక నాగాభరణం సమర్పించాడు. శ్రీవారి మరో హస్తం ఖాళీగా



ఉండడంతో, రామానుజులు స్వామివారి రెండవచేతికి కూడా నాగాభరణం చేయించారు. ఇప్పుడు స్వామివారు ఇరుహస్తాలకు నాగాభరణ భూషితుడై దర్శనమిస్తారు.

స్వామివారి మూలవిరాట్టు ఎల్లప్పుడూ పట్టుపీతాంబరాలతో, వజ్రవైఢూర్యఖచిత స్వర్ణాభరణాలతో, పూలమాలలతో అలంకరింపబడి ఉండటంవల్ల స్వామివారి వక్షస్థలలక్ష్మిని కేవలం శుక్రవారం అభిషేకసమయంలో మాత్రమే దర్శించుకోగల్గుతాం. మిగిలిన సమయాల్లో కేవలం స్వామిదర్శనంతోనే సంతృప్తి పడాల్సి రావడం భక్తులకు తీరని లోటుగా భావించిన రామానుజులు, ఒక బంగారు అలమేల్మంగ ప్రతిమను తయారు చేయించి స్వామివారికి కుడివైపున అలంకరింప జేశారు. తరువాతి కాలంలో భూదేవికి ప్రతిరూపంగా మరో బంగారుప్రతిమ శ్రీవారిమెడలో సమర్పింపబడింది. అప్పటినుండి రెండు బంగారుప్రతిమలు శ్రీవారి ఉదరభాగంలో అలంకరింపబడి దర్శనమిస్తున్నాయి.

అప్పటిపాలకులను ప్రేరేపించి శిథిలావస్థలో ఉన్న ఆనందనిలయ విమానాన్ని, గర్భాలయ కుడ్యాలను జీర్ణోద్ధారణ గావించారు. నిత్యకైంకర్యాలు, నైవేద్యసమర్పణలు నిరాటంకంగా కొనసాగటంకోసం అప్పటి పాలకులు, భక్తులనుండి భూములను దేవదేయాలుగా ("దేవదత్తం" అంటే దేవుడు మనకు ప్రసాదించేది. "దేవదేయం" అంటే, భక్తులు దేవునికి సమర్పించుకునేది) సమీకరించి, ఆ వివరాలను శిలాశాసనబద్ధం గావించి, వాటిద్వారా వచ్చే ఆదాయంతో శాశ్వత ఏర్పాట్లు చేశారు. వెయ్యేళ్ళక్రితం భక్తులు శ్రీవారికి సమర్పించుకున్న అనేక భూములు ఇంకా అన్యాక్రాంతం కాకుండా ఉండటానికి, దూరదృష్టితో రామానుజులవారు ఆనాడే చేపట్టిన ఈ చర్యలన్నీ ఎంతో దోహదపడ్డాయి. నేటికీ తిరుపతి పరిసరప్రాంతాలలో వేలాది ఎకరాల "మఠం" భూములు, తి.తి.దే. ఆధ్వర్యంలోనే ఉన్నాయి. "మఠం" అంతే "మహంతుమఠం" అన్నమాట. మహంతులంటే శ్రీవారి మహాభక్తుడు "హాథీరాంబాబా" వంశస్థులు. ఈ భక్తాగ్రేసరుని గురించి ముమ్ముందు తెలుసుకుందాం.

అంతకుపూర్వం స్వామివారికి సన్నటిరేఖలతో కూడుకున్న తిరునామా లుండేవి. వాటిస్థానంలో, కస్తూరి, పచ్చకర్పూరం దట్టంగా అద్ది, ఇప్పుడు మనం చూసే వెడల్పాటి ఊర్ధ్వపుండ్రం ఎల్లవేళలా శ్రీవారి నుదుటి నలంకరించి ఉండే ఏర్పాటు చేసింది రామానుజుల వారే! శ్రీవారి నిజ నేత్రదర్శనానికి వీలుగా, శుక్రవార అభిషేకసమయంలో మాత్రం నామాలను చిన్నగా ఉంచే సాంప్రదాయాన్ని కూడా రామానుజులవారే ప్రవేశపెట్టారు.

విమానప్రదక్షిణ మార్గంలో ఈశాన్యదిక్కున యోగానరసింహస్వామి విగ్రహప్రతిష్ట చేయించి, నిత్యపూజా నివేదన కట్టడి చేశారు. వ్యాఖ్యానముద్రలో ఉన్న తన శిలావిగ్రహాన్ని స్వయంగా ఆలింగనం చేసుకొని, దానిని అనంతాళ్వార్ కు బహూకరించారు. ఈ విగ్రహం విమానప్రాకారంలోనే ఉన్న భాష్యకార్లసన్నిధిలో ప్రతిష్ఠించబడింది. ఈ మందిరంలో ఉన్న రామానుజులవారి పాదుకలు కల్గిన "శెఠారి" కి తన పేరు పెట్టుకొని రామానుజుల పట్ల తనకున్న అపారమైనభక్తిని చాటుకున్నాడు ధన్యజీవి "అనంతాళ్వార్".

ఇతర సాంప్రదాయాలు

నమ్మాళ్వార్ విరచిత పాశురాలద్వారా స్వామివారు పుష్పప్రియుడని తెలుసుకుని, తన శిష్యుడైన అనంతాళ్వార్ ను ప్రేరేపించి తిరుమలలో పుష్పకైంకర్యం కొనసాగింపు చేశారు. పుష్పమండపంగా పేరుగాంచిన తిరుమలక్షేత్రంలో పుష్పాలన్నీ స్వామివారికి మాత్రమే చెందాలనే మహత్తరలక్ష్యంతో, కొండపై ఎవ్వరూ పువ్వులు ధరించరాదని, పూజానంతరం కూడా ఆ నిర్మాల్యాన్ని ఎవ్వరికి ప్రసాదించకుండా, పూలబావిలో నిక్షిప్తమైవున్న భూదేవికి సమర్పించాలనే కట్టడి చేశారు. శ్రీవారి మరోభక్తుడు తిరుమలనంబిని శ్రీనివాసుడు "తాతా" అని పిలిచిన రోజుకు గుర్తుగా, ప్రతిసంవత్సరం జరిగే "తన్నీరుముదు" ఉత్సవానికి కూడా రామానుజులవారే శ్రీకారం చుట్టారు. ధనుర్మాసంలో సుప్రభాతానికి బదులుగా "తిరుప్పావై" పఠనాన్ని, తోమాలసేవలో "దివ్యప్రబంధ" పారాయణాన్ని, ఇతర ఉత్సవ సమయాల్లో "శాత్తుముర్రై" గానాన్ని సైతం రామానుజులవారే ప్రవేశపెట్టారు.

అంతకు పూర్వం, బ్రహ్మోత్సవాలు తిరుమలలో జరిగేవి కాదు. మొదటిరోజు ధ్వజారోహణ మాత్రం తిరుమలలో జరిపి, మిగతా ఉత్సవాలన్నీ తిరుచానూరులో జరిపించేవారు. కీకారణ్యంతో కూడుకున్న తిరుమలలో ఆ ఉత్సవాలకు కావలసిన సాధన-సంపత్తులు, వసతులు లేకపోవడమే దానికి కారణం. స్వామివారికి చెందిన ఉత్సవాలన్నీ తిరుమలలోనే జరగాలనే లక్ష్యంతో తిరుమల మాడవీధులను విశాలంగా తీర్చిదిద్ది, అర్చకులకు, జియ్యంగార్లకు ఆలయసమీపంలోనే నివాసగృహాలు ఏర్పరిచి, అప్పటినుండి తిరుమలలోనే బ్రహ్మోత్సవాలన్నీ జరిగేలా ఏర్పాట్లు చేశారు. తిరుమలక్షేత్రం అంతా పూదోటలు ఏర్పాటుచేసి స్వామివారి నిత్యకైంకర్యాలకు పూలను విరివిగా ఉపయోగించే సాంప్రదాయాన్ని అమల్లోకి తెచ్చారు. ఆలయనిర్వహణ, కైంకర్యాదులు సజావుగా సాగడం కోసం రామానుజులవారు ప్రవేశపెట్టిన ఏకాంగివ్యవస్థ గురించి, తదనంతరకాలంలో అదే జియ్యంగార్ల వ్యవస్థగా మార్పు చెందటం గురించి ఇంతకుముందే తెలుసుకున్నాం.

రామానుజుల పేరిట ఉత్సవాలు

శ్రీనివాసునికి, ఆనందనిలయానికి, తిరుమలక్షేత్రానికి రామానుజుల వారందించిన అనిర్వచనీయమైన సేవలకు గుర్తుగా, ఈనాటికీ ఆనందనిలయంలో రామానుజుల వారి పేరున కొన్ని ఉత్సవాలు జరుగుతాయి. రామానుజుల జన్మనక్షత్రమైన "ఆర్ద్రానక్షత్రం" నాడు జరిగే మాసోత్సవం గురించి ఇంతకు ముందే తెలుసుకున్నాం. వైశాఖమాసంలో శ్రీరామానుజ జయంతి సందర్భంగా జరిగే పదిరోజుల ఉత్సవాల యందు, భాష్యకార్లసన్నిధిలో ప్రత్యేక ఆరాధనలు జరుగుతాయి. స్వామివారి శేషహారతి, తీర్థ-చందనాలు రామానుజులవారికి ప్రసాదిస్తారు.

సంస్కరణలు

అప్పట్లో కొందరికి మాత్రమే పరిమితమై ఉన్న వైష్ణవమతాన్ని అందరికీ ఆమోదయోగ్యం చేస్తూ, సమాజంలోని అత్యున్నతస్థాయి నుండి అట్టడుగున ఉన్న వారందరికీ వైష్ణవమతాన్ని స్వీకరించే అర్హత కల్పించారు. హైందవసంస్కృతికి గుళ్ళూ గోపురాలు ఆయువుపట్లని విశ్వసించిన శ్రీరామానుజులు, దేశం నలుమూలలా

సంచరించి ఎన్నో వైష్ణవాలయాలను పునరుద్ధరించి వాటిలో నిత్యకైంకర్యాలకు శాశ్వత ఏర్పాట్లు చేశారు. అప్పటివరకు అస్తవ్యస్తంగా ఉన్న అర్చారీతు లన్నింటినీ తీర్చిదిద్ది సక్రమమైన ఆలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అటువంటి క్షేత్రాల్లో శ్రీవేంకటాచలక్షేత్రం ప్రధానమైనది.

మధ్వాచార్యులు ద్వైతమతానికి, ఆదిశంకరులు అద్వైతమతానికి కృషి చేసినట్లే, విశిష్టాద్వైత వ్యాప్తికి ఎంతగానో కృషి చేసిన రామానుజాచార్యులు, అనేకానేక ఆధ్యాత్మిక గ్రంథాలను కూడా రచించారు. వాటిలో **శ్రీభాష్యం, గీతాభాష్యం, వేదాంతదీపం, వేదాంతసారం, శ్రీరంగగద్యం, శరణాగతిగద్యం, వైకుంఠగద్యం** ముఖ్యమైనవి.

కలియుగ సంవత్సరం 4118, పింగళవర్షం, చైత్రమాసం, ఆర్ద్రానక్షత్రం, శుక్లపంచమి తిథి నాడు (ఏప్రిల్ 13, 1017 సం.), తమిళనాడులోని భూతపురంలో (నేటి శ్రీపెరంబుదూరు), ఆసూరి కేశవాచార్యులు, కాంతిమతి పుణ్యదంపతులకు జన్మించిన శ్రీమద్రామానుజులు, 120 వసంతాలు జీవించి; 1237 సం. లో, శ్రీరంగం నందు తుదిశ్వాస విడిచారు.

(ఈ లెక్క ప్రకారం, క్రీ. పూ. 3101 సం. లో కలియుగం ప్రారంభమైనట్లు).

అన్నమయ్య, రామానుజులను "పలికేదైవం" గా కీర్తించాడు:

గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతి యితడే చూపె ఘన గురు దైవము.
వెలయించె నీతడె కా వేదపురహస్యము
చలిమి నీతడే చూపె శరణాగతి
నిలిపి నా డీతడె కా నిజముద్రాధారణము
మలసి రామానుజులే మాటలాడే దైవము.

శ్రీనివాసుని కృపతో అర్ధశతకం (50 ప్రకరణాలు) పూర్తయిన సందర్భంగా మీకు ఆ శ్రీవేంకటేశ్వరుని శుభాశీస్సులు కలగాలని ప్రార్థిస్తూ ఒక మాట:

మే 18, 2020వ తేదీ నాడు వాట్సాప్ లో ప్రారంభింపబడిన "తిరుమలసర్వస్వం" నేటితో (జూలై 07, 2020 నాటికి) అర్ధశతకం (యాభై ప్రకరణాలు) పూర్తి చేసుకుంది. దానికంటే, ఆ శ్రీవేంకటేశ్వరుడే పూర్తి చేయించుకున్నాడనటం సముచితం. ఆ శ్రీవారి కృప లేకుండా – తిరుమలక్షేత్రాన్ని గురించి గానీ, తెలుగుభాష గురించి గానీ అంతంత పరిజ్ఞానమే ఉన్న మేము 50 ప్రకరణాలను నిరాటంకంగా పూర్తి చేయగలగటం అసాధ్యం!

శ్రీమహావిష్ణువు తన కలియుగావతారం కోసం – ఈ సువిశాల భూమండలంలో తెలుగుగడ్డపై ఉన్న తిరుమలక్షేత్రాన్ని మాత్రమే ఎంచుకోవటం, మన తెలుగువారందరి జన్మ జన్మల సుకృతం. ప్రపంచంలో ఏదేవుడికి లేనంత సంపద, ఏక్షేత్రానికి రానటువంటి భక్తజనం, ఏ ఇతర ధార్మికసంస్థకు లేనంత కట్టుదిట్టమైన ఏర్పాట్లు – ఇవన్నీ శ్రీవారికే, తిరుమలకు సొంతం. కొన్ని అరుదైన సేవలలో పాల్గొనటానికి ఐదారు సంవత్సరాలు వేచి ఉంటారంటే శ్రీవారి పట్ల ప్రజలకున్న భక్తి తత్పరత ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. కుల, మత, భాష, ప్రాంతాలకు అతీతంగా, ఖండఖండాంతరాల నుండి భక్తులు విచ్చేసే పుణ్యక్షేత్రం బహుశా ప్రపంచంలో ఇదొక్కటేనేమో! అన్నమయ్య వంటి పదకవితా పితామహుడు తేటతెలుగులో 32,000 సంకీర్తనలు చేసి భావితరాల కందించడం తెలుగుతల్లి చేసుకున్న పుణ్యఫలం.

చెప్పుకుంటూ పోతే, తెలుగువారి పట్ల శ్రీవారికున్న అవ్యాజమైన ప్రేమానురాగాలకు అంతే లేదు.

అడుగడుగు దండాలు!

ఆపద మొక్కులు!!

గోవిందనామస్మరణలు!!!
నిలువు దోపిడీలు!!!!
తలనీలాల సమర్పణలు !!!!!
తులాభారాలు!!!!!!
నిత్యాన్నసంతర్పణలు!!!!!!!
ఇవన్నీ తిరుమలలో నిత్యకృత్యాలు...
వందలమైళ్ళ దూరం నుంచి కాళ్లకు చెప్పుల్లేకుండా నడిచి వచ్చేవారు కొందరైతే, మోకాళ్ళతో మెట్లన్నీ ఎక్కి కొండను చేరుకునే వారు మరికొందరు!!! ఆయురారోగ్యాలు, ఐశ్వర్యవృద్ధి, కళ్యాణసిద్ధి, సంతానప్రాప్తి, ఎన్నికల్లో విజయం, పరీక్షల్లో ఉత్తీర్ణత, విదేశాల్లో ఉద్యోగం, కరోనా కట్టడి, ఉపగ్రహాల విజయకేతనం, కరువుకాటకాల నివారణ – ఒకటేమిటి! కోటీశ్వరుల నుండి కడుపేద వరకు, దేశాధ్యక్షుల నుండి సామాన్యపౌరుల వరకు – కోరికలకు అంతే లేదు.
అందరి మొరలు వింటూ, ఎందరివో కోర్కెలు తీర్చే శ్రీవేంకటేశ్వరునికి ప్రతిరోజ రెండు గంటలు మాత్రమే విశ్రాంతి!!!
శ్రీవారి వైభవాన్ని దగ్గరుండి, వారం రోజులపాటు కళ్ళారా చూసే భాగ్యం "శ్రీవారిసేవకురాలిగా", శ్రీవారికృప వల్ల నాకు కలిగింది.
ఇంతటి మహత్తరమైన శ్రీవారి గురించి, తిరుమలక్షేత్రాన్ని గురించి ఈ తరంవారికి తెలియజెప్పడం మనందరి బాధ్యత. తెలుగువారి కొంగుబంగారమైన శ్రీనివాసుణ్ణి మన గుండెగుడిలో సదా కొలువుంచుకుందాం!!!

----------: : ----------



పద్మావతి-శ్రీనివాసుల పరిణయం

భృగుమహర్షి వృత్తాంతానంతరం శ్రీమహాలక్ష్మి జాడ తెలియని శ్రీమహావిష్ణువు, కృతయుగాంతంలో భూలోకంలోని వేంకటాచలశ్రేణుల యందు ఒక వల్మీకంలో (పుట్ట) తల దాచుకుంటాడు. ఇంతవరకు "ఆదివరాహస్వామి ఆలయం" ప్రకరణంలో ఇంతకు ముందే మనం తెలుసుకున్నాం.

శ్రీనివాసుడు – ఆదివరాహస్వామి కలయిక

ఆ విధంగా చాలాకాలం పుట్టలో గడిపిన శ్రీనివాసునికి కలియుగారంభంలో తాను ఒకనాడు పుట్టలో నుంచి బయటకు వచ్చి సంచరిస్తుండగా తన పరివారంతో విహరిస్తూ వృద్ధాప్యదశలో ఉన్న ఆదివరాహస్వామి తారసపడతాడు. శ్రీమహావిష్ణువే ఆదివరాహస్వామి అవతారంలో భూమండలాన్ని రక్షించి దేవతల కోర్కెపై ఈ పర్వతం మీద శాశ్వతనివాసం ఏర్పరుచుకున్న ఉదంతం కూడా మనం ఇంతకు ముందే తెలుసుకున్నాం. అంటే, ఇప్పుడు శ్రీమహావిష్ణువు యొక్క ఒక అవతారమైన శ్రీనివాసుడు, మరో అవతార స్వరూపమైన ఆదివరాహస్వామితో బేటీ అయ్యారన్న మాట. శ్రీమహావిష్ణువు అనేక సందర్భాల్లో లోకకల్యాణార్థం పలు అవతారాల నెత్తడం మనకు విదితమే.

ప్రథమ పరిచయంలోనే ఈ క్షేత్రం ఆదివరాహుని అధీనంలో ఉన్నట్లు తెలుసుకున్న శ్రీనివాసుడు, తన నివాసనిమిత్తం కొంత స్థలం అనుగ్రహించాల్సిందిగా ఆదివరాహస్వామిని ప్రార్థిస్తాడు. కలియుగధర్మానుసారం, వరాహుడు స్థలం ఉచితంగా ఇవ్వడం కుదరదని, తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని శెలవిస్తాడు. అప్పుడు శ్రీనివాసుడు ప్రస్తుతానికి తన వద్ద ద్రవ్యం లేదని చెబుతాడు. అంతేకాకుండా, ముందు ముందు కోట్లాది భక్తులు తన దర్శనార్థం వస్తారని, అప్పుడు ప్రథమదర్శనం, ప్రథమపూజ, ప్రథమనైవేద్యం వరాహస్వామికే చెందుతాయని వాగ్దానం చేస్తాడు. ఆ ఒప్పందం ప్రకారం, స్వామిపుష్కరిణికి దక్షిణం వైపున ఉన్న నూరు చదరపు గజాల ప్రదేశం శ్రీనివాసుని శాశ్వతనివాస నిమిత్తం కేటాయించ బడుతుంది.

శ్రీనివాసుడు ఒంటరిగా ఉన్నాడన్న విషయాన్ని తెలుసుకున్న వరాహస్వామి, సపరిచర్యల నిమిత్తం "వకుళాదేవి" అనే దాసిని కూడా శ్రీనివాసునితో పంపుతాడు. ఈసందర్భంలో వకుళాదేవి పూర్వజన్మ వృత్తాంతం కొద్దిగా తెలుసుకోవాలి.

వకుళాదేవి పుర్వజన్మ వృత్తాంతం

ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు దేవకీవసుదేవులకు జన్మించినప్పటికీ, అతని బాల్యమంతా యశోద వద్ద ముద్దు మురిపాలతో, ఆలమందలతో, వెన్నముద్దలతో గడిచింది. శ్రీకృష్ణుని బాల్యలీలలన్నీ చూడటానికి నోచుకున్న యశోదాదేవి, కంస వధానంతరం శ్రీకృష్ణుడు తిరిగి దేవకీవసుదేవుల వద్దకు చేరుకోవడంతో శ్రీకృష్ణుని కళ్యాణం చూడలేకపోయింది. అష్టభార్యలున్న శ్రీకృష్ణపరమాత్ముని ఒక్క వివాహమైనా యశోదమ్మ సమక్షంలో జరగలేదు. ఆ



విషయమై చింతిస్తూ ఉన్న యశోద మనసునెరిగిన శ్రీకృష్ణుడు, ద్వాపరం నాటి యశోదమ్మ కలియుగంలో వకుళమాతగా జన్మిస్తుందని, అప్పుడు పద్మావతీదేవితో జరిగే తన వివాహాన్ని కన్నులారా తిలకించ వచ్చునని అభయమిస్తాడు. నాటి యశోదామాతయే నేడు వకుళమాతగా జన్మించిందన్న మాట.

ఈ విధంగా శేషాచలంగా పిలువబడే వరాహక్షేత్రంలో, ఆదివరాహునిచే దాసిగా నియమింప బడిన వకుళమాత సపర్యలలో కొంత ఉపశమనం పొందుతూ శ్రీనివాసుడు కాలం వెళ్లబుచ్చుతున్నాడు.

వేటకు వెడలిన శ్రీనివాసుడు

ఒకనాడు వేటకు వెళ్లాలన్న సంకల్పంతో, శ్రీనివాసుడు అశ్వరూపంలో ఉన్న వాయుదేవునిపై స్వారీ చేస్తూ, శేషాచలసానువుల్లో ఉన్న రమణీయదృశ్యాలను ఆస్వాదిస్తూ మృగయావినోదం కొనసాగిస్తున్నాడు. ఆవిధంగా, నేడు "శ్రీవారిమెట్లు" గా పిలువబడే మెట్లమార్గంలో చాలా దూరం వెళ్లిన శ్రీనివాసునికి "రక్షించండి! రక్షించండి!" అనే ఆర్తనాదాలు వినిపిస్తాయి. జగద్రక్షకుడైన శ్రీనివాసుడు విల్లంబులను సవరించుకుంటూ ఆ ఆక్రందనలు వచ్చిన దిశగా గుర్రాన్ని దౌడు తీయిస్తాడు. అక్కడ ఓ భయంకరమైన మదపుటేనుగు తరుము తుండడంతో ఆర్తనాదాలు చేస్తూ చెట్టుకొకరు పుట్టకొకరుగా పరుగులు దీస్తున్న కొందరు కన్యామణులు శ్రీనివాసుని కంట పడతారు. వెనువెంటనే శ్రీనివాసుడు "గజేంద్రా!" అని భీకరంగా గర్జిస్తూ, విల్లు ఎక్కుపెట్టి ఆ మత్తగజానికి ఎదురుగా వెళతాడు. దిక్కులు పిక్కటిల్లేలా ధ్వనించిన ఆ గర్జనకు బెదిరిపోయిన ఏనుగు కారడవిలోకి పారిపోవడంతో, యువతులందరూ ప్రాణాపాయం తప్పించుకుంటారు.

పద్మావతితో తొలి సమాగమం

ప్రాణాపాయం నుంచి తప్పించుకొని కృతజ్ఞతా దృక్కులతో నిలుచుని ఉన్న కన్యారత్నాల మధ్య గంధర్వకన్యలా ప్రకాశిస్తున్న ఓ యువతిని చూసి, ఆమె అందచందాలకు మోహావేశుడై, ఆమెనే చూస్తూ అచేతనంగా ఉండిపోతాడు శ్రీనివాసుడు. ఆ యువతి కూడా శ్రీనివాసుని యెడ పరవశురాలై తదేకంగా చూస్తూ ఉండి పోతుంది. ఈ ఇరువురి వాలకాన్ని గమనించిన చెలికత్తెలు భయాందోళనలతో; ఆ యువతి ఆ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న ఆకాశరాజు గారి కుమార్తె పద్మావతీదేవి యని, ఆమెను ఆవిధంగా చూడటం ఎంత మాత్రం తగదని వారిస్తారు. అక్కడి నుంచి తక్షణమే వెళ్లిపోవలసిందిగా హెచ్చరిస్తారు. అంతట పద్మావతీదేవి తన చెలికత్తెలను వారిస్తూ, తమ ప్రాణాలను రక్షించిన ఆపద్బాంధవుణ్ణి ఆ రీతిలో తూలనాడడం తగదని, అతని పూర్తి వివరాలను తెలుసుకొమ్మనీ ఆజ్ఞాపిస్తుంది. దానితో కొంచెం తెప్పరిల్లిన శ్రీనివాసుడు చిరు మందహాసం చేస్తూ దేవకీవసుదేవులను తల్లిదండ్రులుగా, బలరాముణ్ణి సోదరునిగా గలిగిన తాను వేంకటాచలవాసినని, ఆ అందాలరాశిని తొలిచూపులోనే ప్రేమించానని, వారంగీకరిస్తే వివాహం చేసుకుంటానని తన అంతరంగాన్ని వెల్లడించాడు. ఈ వ్యవహారం శృతిమించడంతో కలవరపడ్డ చెలికత్తెలు అతని నుంచి పద్మావతీదేవిని రక్షించటానికి శ్రీనివాసుని రాళ్ళతో కొడుతూ తరమసాగారు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుణ్ణి అబలలైన ఆ మానవమాత్రులు ఏం చేయగలరు?

శ్రీనివాసుని సంకల్పంతో, అశ్వరూపంలో ఉన్న వాయుదేవుడు చెలికత్తెల రాళ్ల దెబ్బలకు చనిపోయినట్లు నటించగా, పెనుగులాటలో చిరిగిపోయిన వస్త్రాలతో, చిందరవందరగా తయారైన కేశాలతో విషణ్ణవదనుడైన శ్రీనివాసుడు వేంకటాచలం లోని తన స్వగృహానికి చేరుకుంటాడు.

వకుళమాత ఓదార్పు

స్వగృహానికి చేరుకున్న శ్రీనివాసుడు నిరాహారుడై, విరహతాపంతో బాధపడటం చూసిన వకుళమాత శ్రీనివాసుని ఆవేదనకు కారణం చెప్పమని గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తుంది. జరిగిన వృత్తాంతాన్నంతా యథాతథంగా వివరించిన శ్రీనివాసుడు, నారాయణవనం పరిసర ఉద్యానవనంలో ఆకాశరాజు కూతురైన పద్మావతిని చూశానని, తొలిచూపులోనే తామిరువురు ప్రేమించుకున్నామని, ఆమె లేనిదే తాను జీవించలేనని తెలియజేశాడు. వకుళమాత శ్రీనివాసునికి అతని పూర్వజన్మను గుర్తుచేస్తూ, సామాన్యమానవుని వలె ఓ అజ్ఞాత మానవకాంతను ప్రేమించడం విచిత్రంగా ఉందని, ముందు వెనుకలాలోచించి ఓ సముచితమైన నిర్ణయం తీసుకోమని శ్రీనివాసుణ్ణి ప్రార్థిస్తుంది. సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారమైన తాను అనైతికంగా ప్రవర్తించనని, ఆకాశరాజు కుమార్తె అతిలోక సౌందర్యవతి అయిన "పద్మావతిదేవి" సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మి అంశతో, తనను వివాహమాడటం కోసమే ఈ భూలోకంలో అయోనిజగా అవతరించిందని శెలవిస్తాడు. అంతే కాకుండా, ఈ భూలోకంలో తనకు వేరెవరూ లేరు కనుక, వకుళమాతే మధ్యవర్తిగా వ్యవహరించి ఈ శుభకార్యాన్ని నెరవేర్చాలని వేడుకుంటాడు. ఇంతటి మహత్కార్యం తన చేతుల మీదుగా సంపన్నం కావడం తన పూర్వజన్మ సుకృతంగా భావించిన వకుళాదేవి, ఆకాశరాజు చెంతకు వెళ్ళటానికి సిద్ధమై, శ్రీనివాసుని అనుజ్ఞకై ప్రార్థిస్తుంది.

అంత శ్రీనివాసుడు, వేంకటాచలక్షేత్రం నుంచి దక్షిణదిశగా వెడలి కపిలేశ్వరస్వామి[2] ఆశీస్సులందుకొని, తరువాత అగస్త్యేశ్వరుని సందర్శించి, తదుపరి నారాయణవనం చేరుకుని, ఆకాశరాజు దంపతులను కలిసి కన్యాదానం కోరవలసిందిగా వకుళాదేవిని ఆదేశిస్తాడు. ఇంతటి మహత్తరకార్యాన్ని తన భుజస్కంధాలపై ఉంచటంతో అమితానందం చెందిన వకుళాదేవి, వరుసగా కపిలతీర్థాన్ని, మార్గమధ్యన ఉన్న శుకమహర్షి ఆశ్రమాన్ని, తరువాత అగస్త్యేశ్వర ఆలయాన్ని సందర్శించి శ్రీనివాసకళ్యాణం సాఫల్యం చేయాల్సిందిగా మొక్కుకుంటుంది.

శ్రీనివాసుని ఆదేశానుసారం అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్న వకుళమాతకు, అదే సమయంలో అక్కడికి విచ్చేసిన పద్మావతీదేవి యొక్క చెలికత్తెలు తారసపడతారు. వారితో మాట కలిపిన వకుళాదేవికి, పద్మావతిదేవి వనంలో ఓ అజ్ఞాత వ్యక్తిని చూసిందని, తొలిచూపులోనే అతనిపై ప్రేమలో పడి విరహతాపానికి గురై జ్వరంతో మంచం పట్టిందని, కుమార్తె రుగ్మతకు కారణం తెలియని ఆకాశరాజు తన గురువుగారైన బృహస్పతిని సంప్రదించాడని, అతడు సూచించిన తరుణోపాయం మేరకు పద్మావతిదేవి ఆరోగ్యం కుదుటపడటం కోసం ఆమె తరపున ఆలయంలో

[2] ఈ కపిలేశ్వరస్వామి ఆలయం తిరుపతి పట్టణంలో అలిపిరి కి ఒక కిలోమీటరు దూరంలో ఉంది. నారాయణవనం తిరుపతికి 30 కిలోమీటర్ల దూరంలోనూ, అగస్త్యేశ్వర ఆలయం (దీనినే "ముక్కోటి" అని కూడా పిలుస్తారు) తిరుపతి పట్టణ పరిసర ప్రాంతాల్లోనూ ఉంటాయి.

పూజాదికాలు నిర్వహించడానికై తాము వచ్చామని చెలికత్తెలు చెబుతారు. భగవత్సంకల్పంతో ఎదురుపడ్డ చెలికత్తెల ననుసరించి, ఆకాశరాజు, ధరణీదేవి దంపతుల వద్దకు వెళ్ళడానికి వకుళాదేవి ఉద్యుక్తురా లవుతుంది.

ఎరుకలసాని వేషంలో శ్రీనివాసుడు

అటు శ్రీవేంకటాచలం పైనున్న శ్రీనివాసుడు, పద్మావతిదేవిపై బెంగతో, మానవసహజమైన ఆత్రుతతో, వికలమనస్కుడై ఉంటాడు. ఇప్పుడు తాను శ్రీమహావిష్ణువు కాదు – మానవరూప ధారియై ఉన్నాడు. కార్యసిద్ధి కోసం పూర్తిభారం వేరొకరిపై వేయకుండా, స్వశక్తిని కూడా నమ్ముకోవాలి కదా! సాధారణ మానవ మాత్రులందరూ తనపై భారం వేసి నిశ్చింతగా ఉంటారు. మరి తానెవరిపై భారం వేయాలి? వృద్ధురాలై, కొండకోనల్లో జీవితాన్ని సాగిస్తున్న వకళమాత ఇంతటి కార్యాన్ని సఫలం చేసుకు రాగలదా?

ఇలా పరి పరి విధాలుగా ఆలోచించిన శ్రీనివాసుడు, వకుళాదేవి ప్రయత్నానికి తోడుగా తాను కూడా కార్యరంగంలోకి ప్రవేశించ దలుచుకుంటాడు. అనుకున్నదే తడవుగా, "ఎరుకలసాని" వేషధారణలో, గురువింద గింజల మాలను మెడలో ధరించి, భూమండలాన్నంతా తాటాకుబుట్టగా మార్చి, దానిని తలపై కెత్తుకుని, నారాయణవనం వీధుల్లో సంచరిస్తూ, తన విలక్షణమైన రూపంతో, వాక్చాతుర్యంతో, హావభావాలతో, పురజనులను విశేషంగా ఆకట్టుకుంటాడు. కుమార్తె అనారోగ్యంతో తల్లడిల్లుతున్న ధరణీదేవికి ఎరుకలసాని మాటలతో ఆశలు చిగురిస్తాయి. ఎరుకలసానిని రాజభవనంలోకి సాదరంగా ఆహ్వానించి "సోది" (భవిష్యవాణి) చెప్పవలసిందిగా కోరుతుంది. ఎరుకలసాని వేషంలో ఉన్న శ్రీనివాసుడు వృత్తిధర్మాన్ని అనుసరించి, బ్రహ్మాదిదేవతలను, సమస్త పుణ్యక్షేత్రాలను స్మరించుకుంటూ సోది చెప్పడం ప్రారంభిస్తాడు. పద్మావతిదేవి ఎడమచేతిని తన చేతిలోకి తీసుకుని ఎరుకల యాసలో కొండపైనున్న శ్రీనివాసుడనే వాడు పద్మావతిదేవి ప్రేమలో పడ్డాడని, ఈమె సైతం ఆ నామాలవాడిని ప్రాణప్రదంగా ప్రేమిస్తుందని, ఆ యువకుడు కారణజన్ముడు, అనితర శక్తిసామర్థ్యాలు కలవాడని, ఇరువురికి వివాహం జరిపిస్తే పద్మావతిదేవి ఆరోగ్యం కుదుటపడుతుందని; అంతేకాకుండా శ్రీనివాసునితో జరుగబోయే కళ్యాణం ద్వారా పద్మావతిదేవి అష్టైశ్వర్యాలతో, భోగభాగ్యాలతో తులతూగుతుందని కూడా నమ్మబలుకుతాడు.

కొద్దిసేపట్లోనే ఓ వృద్ధురాలు ఆ శ్రీనివాసుని తరఫున వచ్చి కన్యాదానం చేయమని కోరుతుందని, పద్మావతిదేవి ఏ వ్యక్తినైతే మోహించిందో అదే వ్యక్తితో ఆమె వివాహం సాఫల్యం కాబోతోందని చెప్పి నిష్క్రమిస్తాడు. జగన్నాటక సూత్రధారునికి లోకకల్యాణార్థం వింత వింత వేషాలు ధరించడం కరతలామలకమే!

వకుళమాత రాయబారం

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని తీర్థప్రసాదాలతో అంతఃపురాని కేతెంచిన చెలికత్తెలు, తమతో పాటుగా వచ్చిన వకుళమాతను ధరణీదేవికి పరిచయం చేస్తారు. వకుళమాత రాజదంపతులకు నమస్కరిస్తూ, తనను శ్రీనివాసుని తల్లిగా పరిచయం చేసుకుని, పద్మావతి, శ్రీనివాసులు ఒకరినొకరు తొలిచూపులోనే ప్రేమించుకున్నారని, కారణజన్ములైన వారిరువురికి వివాహం జరిపించాలని ప్రార్థిస్తుంది. ఎరుకలసాని ద్వారా అప్పటికే ఈ

విషయాలన్నింటినీ విన్న ఆకాశరాజు దంపతులు, శ్రీనివాసుణ్ణి తమ అల్లునిగా పొందటం తమ జన్మజన్మల సుకృతంగా భావించి, పద్మావతినిచ్చి వివాహం చేయడానికి మనస్ఫూర్తిగా అంగీకరించి, త్వరలో ముహూర్తం నిశ్చయించి వివాహం జరిపిస్తామని వకుళమాతకు మాట ఇస్తారు. తన కార్యం సఫలం కావడంతో సంతృప్తి చెందిన వకుళాదేవి వేంకటాచలం చేరుకొని, శ్రీనివాసునికి శుభవార్తను చేరవేస్తుంది.

ఆనంద పరవశుడైన శ్రీనివాసుడు వకుళమాతను ఆప్యాయంగా, మాతృవాత్సల్యంతో ఆలింగనం చేసుకుంటాడు.

వివాహాహ్వాన పనుల్లో ఆకాశరాజు

పట్టరాని సంతోషంతో ఉద్విగ్నుడైన ఆకాశరాజు వెంటనే కార్యరంగంలోకి ఉరికి, తన పుత్రుడైన "వసుద" తో తమ గురువుగారైన దేవలోకవాసి "బృహస్పతి" కి కబురు పంపుతాడు. క్షీరసాగరమధనంలో లక్ష్మీదేవికి తమ్మునిగా పుట్టిన "చంద్రుడు", కలియుగంలో ఆకాశరాజు దంపతులకు, పద్మావతిదేవి అనుజునిగా జన్మిస్తాడు. వసుద ద్వారా ఆ శుభవార్త తెలుసుకున్న బృహస్పతి, పెండ్లి కుమారుడెవరో తన దివ్యదృష్టితో తెలుసుకొని పరమానందభరితుడై, అంతటి శుభకార్యం తనచేతుల మీదగా సఫలం కాబోవడం తన భాగ్యంగా భావించి పొంగిపోతాడు. కానీ, వెంటనే తన స్థాయిని గుర్తెరిగి భగవంతుని కళ్యాణం జరిపించగల సామర్థ్యం తనకు లేదని, తిరుచానూరుకు దగ్గరలోనున్న సరోవరంలో నివసిస్తున్న "శుకాచార్యులు" దానికి సమర్థుడని వసుదతో విన్నవించు కుంటాడు. అంతట ఆకాశరాజు, తన తమ్ముడైన తొండమానునితో శుకాచార్యునికి వర్తమానం పంపుతాడు. ఆకాశరాజు విజ్ఞప్తిని విన్న వెంటనే సంతోషంతో ఉబ్బితబ్బిబ్బైన శుకాచార్యులవారు, తొండమానునితో నారాయణవనం చేరుకుంటారు. తన దివ్యదృష్టితో పూర్వాపరా లన్నింటిని తెలుసుకున్న శుకాచార్యుడు, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే శ్రీనివాసునిగా భూలోకంలో అవతరించాడని ఆకాశరాజుకు విశద పరిచి, వకుళాదేవి ద్వారా శ్రీనివాసుని జన్మనక్షత్రం, తల్లిదండ్రుల వివరాలు తెలుసుకుంటారు. ఇరువురి జాతకాలు పరిశీలించిన శుకాచార్యుడు – వైశాఖమాసం, శుక్లదశమి, శుక్రవారం నాటి ఉత్తరఫల్గుణి నక్షత్రం అత్యంత శ్రేష్ఠమైన లగ్నంగా నిశ్చయించి – ఆ శుభఘడియలో పద్మావతి–శ్రీనివాసుల వివాహం జరగాలని వివాహ శుభలేఖను వ్రాయిస్తారు. ఆకాశరాజు కోరికపై శుకాచార్యుడు శుభలేఖను స్వయంగా శ్రీనివాసునికి అందజేస్తాడు. ఆ శుభవార్త విన్న శ్రీనివాసుడు అమితానందంతో శుభలేఖను శిరస్సుపై నుంచుకొని, శుకాచార్యుణ్ణి ఆలింగనం చేసుకుంటాడు. ఆకాశరాజు లేఖకు ప్రత్యుత్తరం రాసి, వివాహానికి లాంఛనప్రాయంగా తమ ఆమోదాన్ని తెలుపుతాడు.

పెండ్లి సంరంభంలో శ్రీనివాసుడు

వివాహానికి ఆమోదం తెలిపిన కొద్ది సేపట్లోనే, కలియుగంలో మానవసహజమైన చిత్తచాంచల్యంతో శ్రీనివాసుని మనసు మారిపోతుంది. ఆయన వకుళాదేవిని పిలిచి తనకు ఈ వివాహం ససేమిరా వద్దంటాడు. నివ్వెరబోయిన వకుళాదేవి, పూర్వజన్మలో శ్రీకృష్ణుడు ఎనిమిది వివాహాలు చేసుకున్నప్పటికీ తల్లి అయిన యశోదకు ఒక్క వివాహం కూడా చూసే భాగ్యం కలుగలేదని, ఆ అదృష్టం ఈ జన్మలోనైనా కలగాలని గంపెడాశతో ఎదురు చూస్తున్నానని, ఎన్నో

ప్రయాసలకోర్చి ఆకాశరాజు దంపతులను వివాహానికి ఒప్పించానని, తన ఆశలను వమ్ముచేయవద్దని పదేపదే ప్రాధేయ పడుతుంది. అందుకు సమాధానమిస్తూ శ్రీనివాసుడు, ఆకాశరాజు అపరిమితమైన ఐశ్వర్యం కలవాడని; ఎందరో బంధుమిత్రులు, పరివారం, మందీమార్బలం కలవాడని; తాను మాత్రం ఎవరూ లేని నిరుపేదనని; కయ్యానికైనా వియ్యానికైనా సమఉజ్జీ ఉండాలి కదా అంటూ తన మనసులోని సంకోచాన్ని వెల్లడిస్తాడు. అందుకు వకుళాదేవి, శ్రీనివాసుడు సకల లోకాలకు సార్వభౌముడని, ఆకాశరాజు పేరుకే రాజని, సాధనసంపత్తులలో ఆ రాజు శ్రీనివాసునికి ఎంతమాత్రం సరితూగడని, శ్రీనివాసుడు ఆజ్ఞాపించినంతనే బ్రహ్మాదిదేవతలు శిరసావహిస్తారని విన్నవించుకుంటుంది. వకుళాదేవి వాక్కులతో అద్వితీయమైన తన వైకుంఠ వైభవాన్ని స్మరణలోకి తెచ్చుకున్న శ్రీనివాసుడు, వెంటనే కళ్యాణ ఏర్పాట్లకు సన్నద్ధు డవుతాడు. పెండ్లిపనులను బ్రహ్మాదిదేవతలకు, తన సేవకులైన గరుత్మంతుడు, ఆదిశేషునికి పురమాయిస్తాడు. వార్త విన్న మరుక్షణం ముక్కోటిదేవతలు వెంటరాగా ఆఘమేఘాలపై బ్రహ్మదేవుడు భూలోకానికి బయలు దేరుతాడు. యక్ష కిన్నెర కింపురుషులు, గంధర్వులు, బ్రహ్మర్షులు, అష్టదిక్పాలకులు, బ్రహ్మ మానసపుత్రులు అందరూ కలిసి శ్రీనివాసుని రూపంలో ఉన్న శ్రీమహావిష్ణువు కళ్యాణాన్ని సందర్శించడానికి ఉద్యుక్తు లవుతారు. శ్రీనివాసుడు ఆహ్వానితు లందరికి ఎదురేగి మార్గమధ్యంలోనే వారందరిని ఆప్యాయంగా పలకరిస్తాడు. వచ్చిన వారందరూ తనకు ఆప్తులు, అత్యంత సన్నిహితులు కావడంతో వారందరికీ చనువుతో, వారి వారి శక్తి సామర్థ్యాలకు తగ్గట్టుగా, పనులు పురమాయించడం ప్రారంభించాడు శ్రీనివాసుడు

ఇంద్రుడు, దేవతా శిల్పులైనట్టి మయుడు విశ్వకర్మలను పిలిచి వేంకటాచలక్షేత్రం మీద ఆహ్వానితులందరికి విడిదిగా, సకలసౌకర్యాలు కలిగిన ఓ పట్టణాన్ని నిర్మించ వలసిందిగా ఆదేశించాడు. ఎంతటి మహారాజైనా, మానవమాత్రుడే కాబట్టి ఆకాశరాజుకు సైతం ఇంతమందికి, వారివారి హోదాలకు తగ్గట్లుగా విడిది ఏర్పాటు చేయాలంటే సాధ్యమా!

ఆ విధంగా దూరదృష్టితో ఆలోచించిన శ్రీనివాసుడు, తనకు కాబోయే మామగారైన ఆకాశరాజు నగరం "నారాయణవనం" లో కూడా ఓ మహానగరాన్ని విశ్వకర్మచే నిర్మింపజేశాడు.

- సకలదేవతలకు ఆదరపూర్వకంగా, తగు లాంఛనాలతో స్వాగతం పలికే కార్యక్రమాన్ని మృదుభాషియైన కుమారస్వామికి అప్పగించాడు.
- వంటపని భారం అంతా అగ్నిదేవునికి అప్పజెప్పాడు.
- ఆహూతులందరికీ స్నానపానాదులకు, జపతపాదులకు, సంధ్యావందనాలకు కావలసిన శుద్ధోదకాన్ని సరఫరా చేసే బాధ్యతను వరుణుడు స్వీకరించాడు.
- పౌరోహిత్య కార్యక్రమానికి వశిష్ఠుడు పెద్దదిక్కు.
- ఆహ్వానితులందరు క్రమశిక్షణతో మెలిగేటట్లు చూసే బాధ్యత యమునికి అప్పగించబడింది.
- లక్షలాదిమంది భోజనం చేయడానికి కావలసిన విస్తరాకులను, ఆకుదొన్నెలను తయారు చేయించే బాధ్యత నవగ్రహాలది.
- బ్రాహ్మణులకు భూరిగా దక్షిణ ఇప్పించే భారాన్ని ధనాధిపతి కుబేరుడు భుజాన వేసుకున్నాడు.

ఘటనాఘటన సమర్థుడైన శ్రీనివాసుడు ఈ సమస్త కార్యాలను ఒంటిచేత్తో, అనాయాసంగా నిర్వర్తించగలడు. కేవలం

తన బంధుజనులను సంతృప్తిపరచడానికి, వారిని కూడా ఈ పుణ్యకార్యంలో భాగస్వామ్యులుగా చేయడానికి, అందరికీ తలా ఒక బాధ్యత అప్పగించాడు.

అటు శ్రీనివాసుని తరఫున, ఇటు ఆకాశరాజు తరఫున పెండ్లిపనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

శ్రీమహాలక్ష్మి ఆగమనం

కానీ శ్రీనివాసుడు మాత్రం ఎందుచేతనో ఉదాసీనుడై ఉన్నాడు. ముఖారవిందంలో పెండ్లికళ కనపడడం లేదు. బ్రహ్మదేవుడు దానికి కారణం ప్రశ్నించగా, శ్రీనివాసుడు, వివాహానికి ఎందరు విచ్చేసినా, నా మహాలక్ష్మి లేని కొరత కనిపిస్తూనే ఉంది. ఆమె లేకుండా పెండ్లికళ రాదు" అని బదులిస్తాడు. అది చిక్కు సమస్యే!

ఎందుకంటే శ్రీమన్నారాయణుని పట్ల అలిగి భూలోకానికి చేరుకున్న శ్రీమహాలక్ష్మి, పెనిమిటి రెండవ వివాహానికి అంత తేలిగ్గా వస్తుందా? లక్ష్మీదేవిని తోడ్కొనిరావటానికి ఎవరిని పంపాలి?

ఇంత క్లిష్టతరమైన కార్యం సాధించటానికి ఎవరు అత్యంత సమర్థులు?

అన్నీ సమస్యలే!

కొద్దిగా తర్జనభర్జన పడిన తర్వాత శ్రీనివాసుడు, "శ్రీమహాలక్ష్మి పద్మంలో ఉద్భవించింది. ఉదయిస్తున్న బాలభానుని చూస్తూనే పద్మం వికసిస్తుంది. పుట్టింటివారి పట్ల ఉండే సహజమైన మమకారంతో, సూర్యనారాయణుడంటే లక్ష్మీదేవికి మిక్కిలి అభిమానం. ఆమె సూర్యుని మాట కాదనదు. కాబట్టి సూర్యుణ్ణే లక్ష్మీదేవి చెంతకు రాయబారంగా పంపుదాం" అని నిర్ణయించాడు. కానీ, ఇది పెద్దలతో వ్యవహారం, అందునా భార్యాభర్తల మధ్య పేచీ అవడంతో సూర్యుడు కొద్దిగా జంకుతాడు. శ్రీనివాసుడు సూర్యునికి ధైర్యం చెప్పి, విష్ణుమూర్తి అనారోగ్యం పాలయ్యాడని, బ్రహ్మ రుద్రాదుల సహాయంతో మాత్రమే లేచి నడవ గలుగుతున్నాడని లక్ష్మీదేవితో చెప్పమంటాడు. "జగజ్జనని, సర్వజ్ఞురాలు అయిన లక్ష్మీదేవికి అసలు విషయం తెలియకుండా ఉంటుందా!" అంటూ సందేహాన్ని వెలిబుచ్చిన సూర్యునికి, శ్రీనివాసుడు "నా మాయతో ఆమె మోహవశు రాలవుతుంది. నీకార్యం నిర్విఘ్నంగా సాకార మవుతుంది. క్షేమంగా వెళ్లి రమ్మంటూ" బదులిస్తాడు. సప్తాశ్వరథారూఢుడైన సూర్యనారాయణుడు హుటాహుటిన లక్ష్మీదేవి నివసిస్తున్న కరివీరపురం చేరుకుంటాడు. మొదట్లో కొద్దిగా అభ్యంతరం చెప్పినా, శ్రీనివాసుని అనారోగ్యం గురించి తెలియగానే ఆందోళన చెందిన లక్ష్మీదేవి, వెంటనే బయలుదేరి వేంకటాచలం విచ్చేస్తుంది.

చెంతకు చేరుకున్న శ్రీమహాలక్ష్మిని ఆప్యాయంగా పలకరించిన శ్రీనివాసుడు, త్రేతాయుగం నాటి వేదవతి ఈ కలియుగంలో పద్మావతిగా జన్మించిందని, ఆనాడు శ్రీమహాలక్ష్మి ఆనతిచ్చిన ప్రకారం ఈనాడు పద్మావతి రూపంలో ఉన్న వేదవతిని వివాహమాడ దలచానని, కానీ లక్ష్మీదేవి సమక్షంలోనే ఈ పెళ్లి జరగాలని కోరుకుంటాడు. ఆప్యాయమైన శ్రీవారి పలకరింపుతో, త్రేతాయుగం నాటి తన కోరిక నిజం కాబోతుందన్న సంతోషంతో, లక్ష్మీదేవి ఆ వివాహానికి అంగీకరించి, పార్వతి, సరస్వతి మొదలైన ముత్తయిదువుల సహకారంతో శ్రీనివాసునికి మంగళద్రవ్యాలతో అభ్యంగనస్నానం కావించింది.

ముక్కోటి దేవతలకు విందుభోజనాలు

కుబేరుడు అరువుగా ఇచ్చిన ఆభరణాలను, నూతనవస్త్రాలను శోభాయమానంగా అలంకరించుకున్న శ్రీనివాసుడు, కుమారధార తీర్థానికేతెంచి, తమ కులదైవమైన శమీవృక్షానికి పూజాదికాలు గావిస్తాడు. ఆ వృక్షరాజం యొక్క శాఖను తెచ్చి ప్రక్కనే ఉన్న వరాహస్వామి ఆలయంలో ప్రతిష్ఠించి ఆ దైవాన్ని ఆరాధిస్తాడు. స్వయంగా తన వివాహానికి ఆహ్వానించిన శ్రీనివాసునితో, ఆదివరాహుడు "తాను వృద్ధాప్యం వల్ల పెండ్లికి రాలేనని, తన ఆశీర్వాదం శ్రీవారికి ఎన్నడూ తోడుగా ఉంటుందని" తెలవిస్తాడు.

అంతలో, శ్రీ నివాసునికి భోజనాల ప్రసక్తి గుర్తుకొస్తుంది. పనులైతే పురమాయించాడు గానీ, లక్షలాది మందికి షడ్రశోపేతమైన భోజనం ఏర్పాటు చెసే ఆర్థికస్తోమత, కొండకోనల్లో నివసించే తనకెక్కడిది? ఖర్చు కోసం చింతిస్తున్న శ్రీనివాసుణ్ణి పరమశివుడు ఓదార్చి, తన మధ్యవర్తిత్వంతో కుబేరస్వామి నుంచి కావలసిన ధనాన్ని అరువుగా, కలియుగాంతం వరకు వడ్డీ తీర్చే షరతుపై ఇప్పిస్తాడు.

చేతిలో రొక్కం సమకూరింది సరే! అంతమందికి వండివార్చాలంటే మాటలా? ఎన్నెన్ని ఏర్పాట్లు చేయాలి? ఎల్లవేళలా లోకకళ్యాణం కోసం పరితపించే స్వామి, తన కళ్యాణం గురించి ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోలేక పోయాడు!

అంత భారీగా వంటలు చేయడానికి తగ్గ పాత్రలు తనవద్ద లేవంటాడు, వంటపని బాధ్యత తీసుకున్న అగ్నిదేవుడు. వాస్తవానికి ఈ కార్యం అగ్నిదేవునికి సునాయాసం! ఆయన శ్రీవారి లీలలను చూచి తరించా లనుకున్నాడంతే!

పాత్రల అవసరం లేకుండా, వేంకటాచలం నందున్న తీర్థాలలోనే వంటలు వండమని శ్రీనివాసుడు సలహా ఇస్తాడు. స్వామివారి యానతి ప్రకారం, స్వామిపుష్కరిణిలో అన్నం వండబడింది. పాపనాశనం తీర్థంలో పప్పు, ఆకాశగంగతీర్థంలో పులుసు, తుంబురతీర్థంలో చిత్రాన్నం, పాండవతీర్థంలో తింత్రిణీరసం (చారు), మిగిలిన తీర్థాలన్నింటిలో రకరకాల పచ్చళ్ళు, ఇతర కమ్మనైన పిండి వంటలు తయారు చేయబడ్డాయి. సిద్ధాన్నాన్ని ముందుగా అహోబిల నరసింహస్వామికి నైవేద్యం చేసి, అతిథులందరూ భోజనానికి ఉపక్రమించారు. భోజనపంక్తులు శేషాచల పర్వతసానువుల్లో, వేంకటాచలం నుంచి శ్రీశైలం వరకు బారులు తీరాయి. అతిథులందరూ సంతృప్తిగా భోజనం చేసిన తర్వాత శ్రీనివాసుడు బ్రాహ్మణులకు, వేదాంతులకు, బ్రహ్మచారులకు శాస్త్రానుసారం తాంబూలం, దక్షిణ సమర్పించుకున్నాడు. తదనంతరం పెండ్లిపెద్దలైన బ్రహ్మ, శివుడు, లక్ష్మీదేవి, ఆదిశేషుడు, గరుడునితో కలిసి శ్రీనివాసుడు భోజనం ముగించేటప్పటికి సూర్యాస్తమయం అయింది.

నారాయణవనానికి పయనం

ఆ రాత్రి మయుడు, విశ్వకర్మచే వేంకటాచలంపై నిర్మించబడ్డ భవనాల్లోనే గడిపిన అతిథులందరూ, మరునాడు ఉదయం మంగళ వాయిద్యాలతో నారాయణవనం బయలుదేరారు. పెండ్లిబృందం మార్గమధ్యంలో ఉన్న పద్మసరోవరాన్ని సమీపిస్తున్న తరుణంలో, శుకాచార్యులవారు శ్రీనివాసునికి ఎదురేగి, బంధుమిత్ర సపరివార సమేతంగా తన ఆతిథ్యం స్వీకరించవలసిందిగా కోరతాడు. ఈ వివాహాన్ని ఖాయపరచడంలో శుకాచార్యుల పాత్రను

స్మరణకు తెచ్చుకున్న శ్రీనివాసుడు, ఆతని ఆతిథ్యం స్వీకరించటానికి సమ్మతిస్తాడు. ఆప్యాయంగా ఆహ్వానించాడే గానీ, సర్వసంగపరిత్యాగి అయిన శుకచార్యుడు కోట్లకొద్దీ ఉన్న అతిథిగణానికి కేవలం పులుసన్నం మాత్రమే వడ్డించ గలుగుతాడు. సాక్షాత్తు శ్రీనివాసునికి, అమరులైన తమకు అంత సాధారణమైన భోజనం వడ్డించడం అవమానకరంగా భావించిన దేవతలందరూ, శుకాచారిని శపించచడానికి ఉద్యుక్తు లవుతారు. ఇది గమనించిన శ్రీనివాసుడు ఒక్క "హుంకారం" తో అతిథులందరికీ చవులూరించే భోజనం చేసిన అనుభూతిని కలిగిస్తాడు. శపించడానికి సిద్ధ మవుతున్న దేవతలందరు, అత్యంత స్వల్పవ్యవధిలో అంత కమ్మని భోజనం పెట్టిన శుకాచారిని ప్రశంసిస్తారు. ఆవిధంగా శ్రీ నివాసుడు తన భక్తుడైన శుకమహర్షిని గట్టెక్కించాడు. తన భక్తులను కష్టాలకడలి నుంచి కడతేర్చటం శ్రీనివాసునికి కొత్తేమీ కాదు కదా!

పద్మసరోవరం నుంచి నవమినాడు బయల్దేరిన శ్రీనివాసుడు సపరివార సమేతంగా నారాయణపురం చేరుకోగానే ఆకాశరాజు ఎదురేగి, భక్తిపూర్వకంగా అందరిని ఆహ్వానిస్తాడు. వారి వారి హోదాలకు తగ్గట్లుగా, విశ్వకర్మచే నిర్మించ బడిన హర్మ్యాలలో విడిది ఏర్పాటుచేసి విందుభోజనాలతో అతిథులందరినీ అలరింపజేస్తాడు.

పద్మావతీ పరిణయ ఘట్టం

ఆరోజు సాయంత్రం ఆకాశరాజు తన భార్య ధరణీదేవితో కలిసి, తమకు అల్లుడు కాబోతున్న శ్రీనివాసుడి పాదపద్మాలను స్వామిపుష్కరిణి నుండి తెప్పించిన పవిత్రజలంతో కడిగి, ఆ ఉదకాన్ని తమ శిరస్సుపై జల్లుకొని రాజ్యమంతటా సంప్రోక్షణ గావించాడు. తదుపరి రాజదంపతులు శ్రీనివాసునికి దివ్యపూజ గావించి, సుగంధద్రవ్యాలతో తాంబూలాన్ని సమర్పించారు. శ్రీనివాసుణ్ణి భద్రగజంపై నెక్కించి, మంగళవాద్యాలతో, వేదపారాయణంతో సాదరంగా రాజభవనానికి తోడ్కొని వెళ్ళారు. రత్నఖచిత సింహాసనంపై శ్రీనివాసుని ఆసీనుణ్ణి గావించారు. అంతకుముందే పద్మావతీదేవి సర్వాలంకార భూషితురాలై, సుమంగళులైన స్త్రీల పర్యవేక్షణలో గౌరీపూజ గావించి వివాహానికి సిద్ధంగా ఉంది. లోకకళ్యాణార్థం జరుగబోతున్న వివాహ వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించడానికి సకల చరాచర జగత్తులోని జీవులన్నీ తరలివచ్చాయి.

కట్నకానుకలు

వివాహసందర్భంలో అల్లుడికి ఆకాశరాజు కోటి స్వర్ణనాణాలను కానుకగా ఇచ్చాడు. అంతేకాకుండా విశేషమైన, అముల్యాభరణాలను కూడా శ్రీనివాసునికి కట్నం కింద సమర్పించుకున్నాడు. భవిష్యోత్తరపురాణంలో ఆ ఆభరణాల వర్ణన ఇలా ఉంది: *నూరుతులాల బంగారు కిరీటం, నూరుతులాల నడుముపట్టీ, భుజకీర్తులు, నూపురములు, నాగభూషణం, ముత్యాల కంఠాభరణాలు, ముత్యాలు-నవరత్నాలు పొదగబడిన హస్తకంకణాలు, పది అంగుళీయకాలు, వజ్రాలు పొదిగిన మొలత్రాడు, బంగారు పాదుకలు, భోజన నిమిత్తం బంగారుపళ్ళెరాలు, పానీయాలు సేవించడానికి వెండిచెంబులు, పట్టువస్త్రాలు.*

కలియుగవేంకటేశ్వరుని అంగరంగవైభవం ఆనాడే మొదలైంది. పద్మావతీదేవి శ్రీనివాసుని నట్టింట కాలిడిన

వేళావిశేషం – చేతిలో చిల్లిగవ్వలేని శ్రీనివాసుడు, ఆనాటినుండి ఈనాటివరకు అష్టైశ్వర్యాలతో తులతూగుతున్నాడు.

గోత్రప్రవర

ఆకాశరాజు తరఫున పద్మావతిదేవి గోత్రవివరాలను దేవగురువు బృహస్పతి ఈవిధంగా విశదపరిచాడు: *"అత్రిమహర్షి గోత్రంలో జన్మించిన సుధీరచక్రవర్తి మునిమనుమరాలు, సుధర్మని మనుమరాలు, ఆకాశరాజు కూతురు అయిన పద్మావతిని శ్రీనివాసునికి సంపూర్ణంగా, సంతోషంగా సమర్పిస్తున్నాం. ధర్మపత్నిగా స్వీకరించాల్సిందిగా ప్రార్థిస్తున్నాం".*

శ్రీనివాసుని తరఫున పురోహితుడైన వశిష్ఠులవారు, శ్రీనివాసుని గోత్ర వివరాలను ఈ విధంగా తెలియజెప్పారు: *"యయాతిరాజు యొక్క మునిమనవడు, శూరసేనచక్రవర్తి యొక్క మనుమడు, వసుదేవుని పుత్రుడు, వశిష్ఠగోత్రీకుడు అయిన శ్రీనివాసుడు, ఆకాశరాజు పుత్రిక అయిన పద్మావతిదేవిని స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాడు. అమితానంద పరవశులమై మేమీ కన్యారత్నాన్ని స్వీకరిస్తున్నాం."*

ఈనాడు కూడా తిరుమలక్షేత్రంలో శ్రీవేంకటేశ్వరునికి, తన పూర్వావతారమైన శ్రీకృష్ణుని గోత్రనామాలతోనే సంకల్పం చెప్పే సాంప్రదాయం ఉంది.

మంగళసూత్ర ధారణ

గోత్రప్రవరానంతరం కంకణధారణ, వేదపండితుల ఆశీర్వాదం మొదలైన వివాహతంతులన్నీ శాస్త్రోక్తంగా జరిగాయి. వైశాఖశుక్లపక్షం, దశమి, శుక్రవారం, పూర్వఫల్గుణినక్షత్ర శుభముహూర్తంలో శ్రీనివాసుడు పద్మావతిదేవి మెడలో మంగళసూత్రధారణ గావిస్తుండగా, దేవలోకం నుంచి పుష్పవర్షం కురిసింది. దేవదుందుభులు మ్రోగించబడ్డాయి.

ఈవిధంగా నాలుగు రోజుల వివాహకార్యక్రమం అత్యంత వైభవోపేతంగా, "నభూతోనభవిష్యతి" అన్న చందంగా జరిగిన తరువాత, అయిదవ రోజున ఆకాశరాజు–ధరణీదేవి దంపతులు పద్మావతిని శ్రీనివాసునికి లాంఛనప్రాయంగా అప్పగించారు.

ఆకాశరాజు పంపిన సారె

అప్పగింతల సందర్భంగా ఆకాశరాజు పద్మావతిదేవితో పాటుగా పంపిన "సారె" ఈవిధంగా ఉంది:

- మూడు వందల మేకలు,
- ఐదు వేల ఆవులు,
- వందలకొద్దీ దాస–దాసీజనం,
- పట్టు పీతాంబరాలు,
- రత్నఖచిత మంచంతో పాటుగా పట్టుపరుపులు, దిండ్లు,
- మూడువందల పుట్ల పెసలు,

- మహాభారం కలిగిన బెల్లం,
- ఒకభారం చింతపండు,
- భూరిమొత్తంలో మెంతులు, ఉప్పు, ఇంగువ, ఆవాలు,
- వెయ్యి కడవల పాలు, నూరు కుండల నిండా పెరుగు,
- పదిహేనువందల చర్మపాత్రల నిండా నెయ్యి,
- రెండువందల కుండల నిండా చక్కెర,
- రెండువందల కుండలనిండా తేనె,
- గుమ్మడికాయలు, అరటిగెలలు, మామిడిపండ్లు, ఉసిరికాయలు
- వీటన్నింటినీ క్షేమంగా వెంకటాచలం చేర్చటానికి వెయ్యి అశ్వాలు, వెయ్యి ఏనుగులు

తన గారాలపట్టిపై ఆకాశరాజుకు గల ఆప్యాయ తానురాగాలకు అంతే లేదు.

అగస్త్యాశ్రమ సందర్శన

వివాహానంతరం శ్రీమహాలక్ష్మి కొల్హాపూర్ కు తిరిగి వెళ్ళిపోయింది. నూతన వధూవరులైన పద్మావతి–శ్రీనివాసులు మూడు రోజులపాటు నారాయణపురం లోనే ఉండి, సర్వసౌఖ్యాలను అనుభవించారు. మూడు నిద్రల అనంతరం, లాంఛనప్రాయంగా అప్పగింతలు జరిగిన తర్వాత, ఆకాశరాజు ఇచ్చిన సారెతో నూతన వధూవరులు వేంకటాచలానికి బయలుదేరారు.

అగస్త్యాశ్రమ సందర్శన

పద్మావతీ శ్రీనివాసులు మార్గమధ్యలో సువర్ణముఖీ నదీ తీరాన ఉన్న అగస్త్యముని ఆశ్రమంలో ఆగి, వారిని, ఋషిపత్ని యైన లోపాముద్రను దర్శించుకున్నారు. భక్తిప్రపత్తులతో ఆతిథ్యం ఇచ్చిన అగస్త్యుడు శాస్త్రనియమానుసారం కొత్తదంపతులు ఆరునెలల వరకు తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలు సందర్శించరాదని; అందుచేత ఆరుమాసాల పాటు తమ ఆతిథ్యం స్వీకరించి తదనంతరమే శ్రీవేంకటాచలానికి తిరిగి వెళ్లాలని అభ్యర్థించాడు. అగస్త్యుని ప్రార్థనను మన్నించిన శ్రీనివాసుడు ఆ ఆశ్రమంలోనే ఆరు నెలలు గడపటానికి నిశ్చయించు కున్నాడు.

ఆనందనిలయ నిర్మాణం

శ్రీనివాసుడు ఈలోగా ఆకాశరాజు తమ్ముడైన తొండమానుని పిలిచి, ఈ ఆరునెలల వ్యవధిలో వేంకటాచలంపై తాము నివసించడానికి ఓ అద్భుతమైన భవనాన్ని వాస్తుప్రకారం నిర్మించి ఇమ్మని ఆదేశించాడు. ఆ భవనంలో తాము కలియుగాంతం వరకు నివసిస్తామని, తద్వారా తొండమానుని పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని కూడా శెలవిచ్చాడు. శ్రీవారి ఆనతిని శిరసావహించిన తొండమానుడు అత్యంత స్వల్పసమయంలో, తిరుమల క్షేత్రంలో స్వామిపుష్కరిణికి దక్షిణభాగాన, తూర్పు ముఖంగా, ఆదివరాహుడు శ్రీనివాసునికి ఆవాసనిమిత్తం ఇచ్చిన స్థలంలో, మూడు ప్రాకారాలు, ఏడు ప్రవేశద్వారాలు, బంగారుగోపురం, ధ్వజస్తంభ పరివేష్టితంగా ఓ అద్భుతమైన భవనాన్ని

నిర్మింపజేశాడు. అదే ఈనాడు తిరుమలలో సర్వాంగ సుందరంగా, నిత్యకళ్యాణం-పచ్చతోరణంగా శోభిల్లే "ఆనందనిలయం" అనబడే ముఖ్యాలయం. అందులోనే శ్రీవారు అర్చామూర్తి రూపంలో, దేవేరులిద్దరితో ఈనాటికీ కొలువై ఉన్నారు.

భవననిర్మాణం పూర్తికాగానే, గృహప్రవేశం చేయవలసిందిగా శ్రీవేంకటేశ్వరునికి వర్తమానం అందింది.

శ్రీనివాస మంగాపురం- ముక్కోటి

శ్రీనివాసుడు పద్మావతి సమేతంగా శ్రీవరాహక్షేత్రానికి బయలుదేరుతూ, అగస్త్యుని ఆతిథ్యానికి సంతుష్టుడై, ఆరునెలల పాటు తాము నివసించిన ఆ ప్రదేశం తమ దంపతు లిరువురి పేరునా, "శ్రీనివాసమంగాపురం" గా ప్రసిద్ధిగాంచు తుందని, అందులో తాను "కళ్యాణ వేంకటేశ్వరుని" గా కొలువై ఉంటానని శెలవిస్తాడు. మనందరికీ సుపరిచితమైన ఈ "శ్రీనివాస మంగాపురం" ఆలయం గురించి మరోసారి వివరంగా తెలుసుకుందాం.

అయితే, స్థానికుల కథనం ప్రకారం, పద్మావతీ శ్రీనివాసులు, ఆ ఆరునెలల్లో పగటిపూట అగస్త్యుని ఆశ్రమంలోను, రాత్రివేళల్లో శ్రీనివాసమంగాపురంలో ఉన్న మరో ఆశ్రమం లోనూ నివసించేవారట! తిరుపతికి సమీపంలో, సువర్ణముఖి నదీతీరాన, నేటి "తొండవాడ" గ్రామంలో, "ముక్కోటి" గా పిలువబడే దేవాలయమే పద్మావతీ-శ్రీనివాసులు కొలువున్న ఆశ్రమం. ఈ విషయం ఆ ఆలయ కుడ్యాలపై చిత్రించబడి ఉంది. ఈ ఆలయాన్ని నేడు కూడా మనం చూసి తరించవచ్చు.

శుభమస్తు

పద్మావతి శ్రీనివాసుల పరిణయ ఘట్టం భక్తిశ్రద్ధలతో ఎవరు విన్నా, చదివినా, పారాయణం చేసినా; వారి వివాహమహోత్సవం ఎవరు జరిపించినా, శ్రీనివాసుని అనుగ్రహంతో వారింట సర్వశుభాలు కలుగుతాయని తరతరాల నమ్మిక.

శుభప్రదము, సర్వమంగళకరము అయిన "పద్మావతి పరిణయం" ఇక్కడితో ముగిసింది. ఆకాశరాజు ఎవరు? తొండమానుని పూర్వజన్మ వృత్తాంతం ఏమిటి? త్రేతాయుగం నాటి వేదవతికి, కలియుగపు పద్మావతిదేవికి ఉన్న సంబంధం ఏమిటి? శ్రీనివాసమంగాపురం, ముక్కోటి ఆలయాల పూర్తి వివరాలు, వీటన్నింటినీ విపులంగా తెలుసుకుందాం.

----------: : ----------

విమానప్రదక్షిణం

శ్రీవారి ఆలయ మహాద్వారం మరియు వెండివాకిలి దాటి లోనికి ప్రవేశించగానే, మొట్టమొదటగా కనిపించే మార్గమే "విమానప్రదక్షిణమార్గం" లేదా "పథం".

స్వామివారి ప్రధాన ఆలయం చుట్టూ దీర్ఘచతురస్రాకారంలో ఉన్న ఈ ప్రదక్షిణ మార్గం, సంపంగిప్రాకారానికి మరియు విమానప్రాకారానికి మధ్యలో ఉంటుంది. మునుపటి ప్రకరణాలలో శ్రీవారి ఆలయ కుడ్యాలకు చుట్టూ, బాహ్యంగా ఉన్న మహాప్రదక్షిణాన్ని; ఆలయం లోనికి ప్రవేశించగానే ఉన్న సంపంగిప్రదక్షిణాన్ని; ముగించుకొని పరమపవిత్రమైన ధ్వజస్తంభ ప్రదక్షిణగా; వెండివాకిలి దాటి, విమానప్రదక్షిణ మార్గంలోనికి చేరుకున్నాం. శ్రీవారి దర్శనానంతరం ఈ మార్గంలో ఉన్న విశేషాలన్నింటిని ఏ విధమైన అవరోధాలు లేకుండా దర్శించుకోవచ్చు. శతాబ్దాల చరిత్ర గల ఈమార్గంలో నడయాడుతూ ఉన్నప్పుడు ఎడమప్రక్కగా, ఎత్తయిన అరుగులతో ఉన్న అనేక మండపాలు మనను ఆకట్టుకుంటాయి. మన కుడిప్రక్కన శోభాయమానంగా వెలుగుతున్న ఆనందనిలయ గోపురాన్ని లేదా విమానాన్ని కూడా కన్నులారా వీక్షించవచ్చు.

ఒక్కో మంటపానికి ఒక్కో చరిత్ర! ఆయా రాజుల దాతృత్వానికి, శ్రీవారి పట్ల వారికున్న అచంచలభక్తికి నిలువెత్తు నిదర్శనం! ఆనందనిలయ విమాన వైశిష్ట్యాన్నైతే ఎంత చెప్పుకున్నా తక్కువే!

ఆ చరిత్రపుటలను, ఆధ్యాత్మిక సొబగులను ఒక్కొక్కటిగా ఇప్పుడు అవలోకిద్దాం.

శ్రీరంగనాథస్వామి

విమానప్రదక్షిణ మార్గంలో ప్రవేశించగానే, మొట్టమొదటగా, మనకు ఎదురుగా శేషతల్పంపై శయనించివున్న శ్రీరంగనాథుడు దర్శనమిస్తాడు. ఈ కుడ్యశిల్పం గరుడాళ్వార్ సన్నిధికి వెనుకభాగాన ఉంటుంది. బంగారుపూతతో ధగధగ లాడుతున్న శ్రీరంగనాధునికి పైభాగంలో వరదరాజస్వామి, క్రిందిభాగంలో శ్రీవెంకటేశ్వరుని ప్రతిమలు, ఒకే ఫలకంపై చెక్కబడి ఉంటాయి. అంటే *శ్రీరంగపు రంగనాథస్వామిని, కాంచీపుర వరదరాజస్వామిని, తిరుమల వేంకటేశ్వరుణ్ణి,* మూడు వైష్ణవ దివ్యక్షేత్రాలను ఏకకాలంలో దర్శించి తరించుకున్నామన్నమాట. వైష్ణవులందరి చిరకాల స్వప్నం, ఈ మూడు వైష్ణవ దివ్యక్షేత్రాల సందర్శనం!

1991వ సంవత్సరంలో 55 లక్షల రూపాయలు వెచ్చించి ఈ బంగారు తాపడం చేయించబడింది.

పూర్వం భక్తులు స్వామివారికి కర్పూరనీరాజనం, టెంకాయలు ఇక్కడే సమర్పించుకునే వారు. భక్తుల రద్దీ కారణంగా ఇప్పుడు కర్పూరహారతులను ఆలయ మహాద్వారానికి ఎదురుగా, బేడి ఆంజనేయస్వామి సన్నిధి ముందున్న "అఖిలాండం" అనబడే ప్రదేశానికి తరలించారు.

ప్రతిరోజూ తెల్లవారు ఝామున జరిగే "అంగప్రదక్షిణలు" లేదా "పొర్లుదండాలు" రంగనాథస్వామి విగ్రహం ఎదురుగా

మొదలై, విమానప్రాకారాన్ని సవ్యదిశగా ఆసాంతం చుట్టి, మళ్లీ ఇక్కడే పూర్తవుతాయి. అంగప్రదక్షిణ చేయాలనుకున్న భక్తులు సంబంధిత తి.తి.దే. కార్యాలయంలో గానీ లేదా ఆన్లైన్ లో గాని ముందుగానే రిజర్వ్ చేసుకోవాలి. ప్రతిరోజు 750 మంది భక్తులను మాత్రమే అనుమతిస్తారు. శుక్రవారం మరియు ముఖ్యమైన పర్వదినాల్లో అంగప్రదక్షిణకు అనుమతి లేదు. భక్తులు ముందుగా స్వామిపుష్కరిణిలో పవిత్ర స్నానమాచరించి, నిర్ణీతసమయానికి క్యూ కాంప్లెక్స్ ను చేరుకొని, ఆలయ నిబంధల ననుసరించి, అంగప్రదక్షిణ గావించుకోవచ్చు.

వరదరాజ స్వామి ఆలయం

శ్రీరంగనాథునికి ఎదురుగా నిలుచున్నప్పుడు, మనకు ఎడంప్రక్కగా కొద్ది అడుగుల దూరంలో, కాంచీపుర వరదరాజస్వామి ఆలయాన్ని దర్శించుకోవచ్చు. ఈ ఆలయం విమానప్రదక్షిణానికి ఆగ్నేయదిక్కున, పశ్చిమాభిముఖంగా కొలువై ఉంటుంది. మూడు అడుగుల ఎత్తైన పీఠంపై, చిరునవ్వు చిందిస్తున్న వరదరాజస్వామి విగ్రహం అభయముద్రలో దర్శనమిస్తుంది. ఆలయ పైభాగంలో, ఏకకలశ నిర్మితమైన గర్భాలయ గోపురాన్ని కూడా చూడవచ్చు. ఈ స్వామిని ఇక్కడ ఎప్పుడు, ఎవరు ప్రతిష్ఠించారో చెప్పడానికి చారిత్రక ఆధారాలు లేవు. అయితే, 1354వ సం. ముందు నుండే ఈ ఉపాలయం ఉన్నట్లు తెలుస్తోంది. కాంచీపురంలో కొలువై ఉన్న వరదరాజస్వామి విగ్రహాన్ని మ్లేచ్ఛుల దండయాత్ర నుండి తప్పించే నిమిత్తం ఇక్కడికి తీసుకొచ్చి ప్రతిష్ఠించారని కొందరంటారు. కానీ ఈ విషయాన్ని ధ్రువీకరించే చారిత్రక ఆధారాలు లేవు.

క్యూ ప్రతిబంధకాల కారణంగా ఈ స్వామిని దగ్గరనుంచి దర్శించుకోలేము.

పురాణేతిహాసాల ననుసరించి:

- శ్రీరంగనాథుడు
- తిరుమల వేంకటేశుడు
- కంచి వరదరాజస్వామి

ఈ ముగ్గురి మూర్తులు మూడుకోణాలుగా ఏర్పడే త్రిభుజాకారంలో అపారమైన ఆధ్యాత్మికశక్తి నిక్షిప్తమై ఉంటుంది. మనం వెండివాకిలి దాటినది మొదలు, శ్రీవారిదర్శనం పూర్తయ్యేంత వరకూ ఈ త్రిభుజాకారం లోనే గడుపుతాం. ఎంతో దూరాలోచనతో, మన పూర్వీకులు ఆలయ సందర్శనార్థం వచ్చే భక్తులకు అపారమైన దైవికశక్తిని ప్రసాదించడం కోసం ఈ మూర్తులను ఆయా ప్రదేశాల్లో ప్రతిష్ఠించడం జరిగింది. ఈ ఏర్పాటు చేసిన ఆ ద్రష్టలను మనసులోనే స్మరించుకొని శ్రీవారి దర్శనార్థం ముందుకు సాగుదాం.

గరుడాళ్వార్ సన్నిధి

శ్రీరంగనాథస్వామి కుడ్యప్రతిమకు ఎడంప్రక్కన ఉన్న కటాంజన ద్వారంలో ప్రవేశించి, క్యూ మార్గంలో కుడిప్రక్కకు తిరగగానే, కొన్ని అడుగుల దూరంలో మనకు తూర్పుదిశగా, పంచభూతాల సమ్మేళనం గా భావించబడే "గరుడి" ని

ఆలయం కనబడుతుంది. అదే "గరుడాళ్వార్ సన్నిధి". 1512వ సం. లో ఎవరో అజ్ఞాతభక్తుడు ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠింప జేశాడు. శ్రీమహావిష్ణువు పరివారదేవత, వారి సేవకులలో ముఖ్యుడైన గరుత్మంతుని గురించి ఇంతకుముందే "శ్రీవారి బ్రహ్మోత్సవాలు – గరుడవాహనం" ప్రకరణంలో విస్తారంగా తెలుసుకున్నాం. సరిగ్గా శ్రీవారి బంగారువాకిలికి ఎదురుగా, శ్రీవారిని సతతం దర్శించుకుంటూ, నమస్కారభంగిమలో, రెక్కలు విప్పార్చుకున్నట్టి ఆరు అడుగుల గరుత్మంతుని విగ్రహం నేత్రపర్వంగా దర్శనమిస్తుంది. ఈ సన్నిధి గోపురంపైన ఉన్న మూడు బంగారు కలశాలను మనం విమానప్రదక్షిణ మార్గంలో ప్రవేశించగానే, శ్రీరంగనాథుని మూర్తి ఉపరితలభాగంపై చూడవచ్చు. శ్రీవారి ముల్లోకవిహారానికి ఎల్లవేళలా సన్నద్ధుడై, అజ్ఞాబద్ధునిగా ఉండే గరుత్మంతుణ్ణి మనఃపూర్వకంగా నమస్కరించుకుని, ఆ తరువాతే తన దర్శనం చేసుకోవడం శ్రీనివాసునికి సంతోషదాయక మని చెప్పబడుతుంది.

మహామణి మండపం లేదా, తిరుమామణి మండపం

క్యూ మార్గంలో నడుస్తూనే గరుత్మంతుని దర్శనం చేసుకుని, ఆనందనిలయానికి ప్రధాన ద్వారమైన బంగారువాకిలి ఎదురుగా ఉన్న "ఘంటామండపం" లేదా "మహామణిమండపం" లోనికి ప్రవేశించాము. ఈ మంటపం ఈ క్రింది విధంగా అనుసంధానిస్తూ, దాదాపుగా చతురస్రాకారంలో ఉంటుంది.

- తూర్పుదిక్కున గరుడాళ్వార్ సన్నిధిని,
- పడమరదిక్కున బంగారువాకిలిని,
- ఉత్తరదిక్కున హుండీని,
- తూర్పుదిక్కున విమానప్రదక్షిణాపథాన్ని.

ఈ మండపం పైకప్పుకు ఆధారంగా ఉన్న 16 శిలా స్తంభాలపై శ్రీమహావిష్ణువు, శ్రీవేంకటేశ్వరుడు, వరదరాజస్వామి, ఆదివరాహస్వామి యొక్క ఆకృతులు కడు రమణీయంగా చెక్కబడి ఉంటాయి. పైకప్పు అంతా అత్యద్భుతమైన పౌరాణిక ఘట్టాలు మలచబడి, బంగారుతాపడంతో ముగ్ధ మనోహరంగా దర్శనమిస్తుంది. 15వ శతాబ్దం ప్రారంభంలో, చంద్రగిరికి చెందిన ఓ విజయనగర పాలకుని ద్వారా నిర్మింపబడ్డ ఈ మండపంలోనే, ప్రతిరోజు సుప్రభాత సమయంలో స్వామివారికి మేలుకొలుపులు పాడుతారు. ప్రతి బుధవారం, ఈ మంటపంలోనే, ఆర్జితసేవయైన "సహస్రకలశాభిషేకం" కూడా జరుగుతుంది. ఈ మండపంలో, బంగారువాకిలికి ఎడమప్రక్కగా రెండు పెద్ద ఘంటలు వ్రేలాడదీయబడి ఉంటాయి. తమిళంలో "మహామణి" అంటే "పెద్దఘంట" అని అర్థం. అందువల్లనే ఈ మంటపానికి ఆ పేర్లు వచ్చాయి. ఈ ఘంటలను మ్రోగించే ఆలయ పరిచారకులను "ఘంటాపాణి" గా పిలుస్తారు. ఈ ఘంటానాదం విన్న తరువాతనే, చంద్రగిరిలో నివసించే స్వామివారి వీరభక్తులైన విజయనగర రాజులు ఆహారాన్ని స్వీకరించేవారట. ఆ సాంప్రదాయం చాలామంది తిరుమల వాసులు నేటికీ కొనసాగిస్తున్నారు.

ఈ రెండు ఘంటలలో ఒక దానిని "నారాయణఘంట" గానూ, రెండవ దానిని "గోవిందునిఘంట" గానూ వ్యవహరిస్తారు. ఒకప్పుడు బంగారువాకిలికి ఇరు ప్రక్కలా ఉండే ఈ రెండు ఘంటలను ప్రస్తుతం ఒక పార్శ్వానికి చేర్చి, రెండింటిని ప్రక్క– ప్రక్కనే అమర్చారు.

జయ-విజయులు

శ్రీవారు కొలువుండే వైకుంఠానికి ఏ విధంగా జయవిజయులు కాపుంటారో, అదేవిధంగా బంగారువాకిలికి దక్షిణాన జయుడు, ఉత్తరాన విజయుడు; శంఖు, చక్ర, గదాధారులై, సాక్షాత్తు విష్ణుమూర్తి ప్రతిరూపాల్లా దర్శనమిస్తుంటారు. వీరిని "చండ-ప్రచండులు" అని కూడా వ్యవహరిస్తారు. పది అడుగుల ఎత్తుతో గంభీరంగా ఉండే ఈ పంచలోహ విగ్రహాలు తర్జనితో భక్తులను ఎల్లవేళలా హెచ్చరిస్తుంటాయి. స్వామిపుష్కరిణిలో పవిత్రస్నాన మాచరించి, శుచిగా ఆలయంలోకి ప్రవేశించి, ఆలయ నిబంధనలు పాటిస్తూ, క్రమశిక్షణతో మెలుగుతూ, తోటి భక్తులకు ఇబ్బంది కలుగకుండా స్వామి దర్శనం చేసుకోవాలని సూచిస్తున్నారేమో!

ఈ మూర్తులను జాగ్రత్తగా గమనిస్తే, వారి నోళ్లకు చిన్నచిన్న కోరలుంటాయి. దానికి కారణం పూర్వజన్మలో వారు రాక్షసులుగా జన్మించడమే.

పురాణాల్లోకి వెళితే ఒకప్పుడు వైకుంఠానికి ద్వారపాలకులుగా ఉండే జయ-విజయులు, కారణాంతాన బ్రహ్మామానస పుత్రులైన సనక సనందనాది మునులచే శపించబడి, కృతయుగంలో హిరణ్యాక్ష-హిరణ్యకశిపులు గానూ, త్రేతాయుగంలో రావణ-కుంభకర్ణులు గానూ, ద్వాపరయుగంలో శిశుపాల-దంతావక్త్రులు గానూ జన్మించి, వారి వారి దుష్కృత్యాల వల్ల శ్రీవారి చేతిలో సంహరింప బడ్డారు. శాపకాలం పూర్తయిన తర్వాత, శ్రీమహావిష్ణువు కటాక్షంతో తిరిగి కలియుగంలో శ్రీనివాసునికి ద్వారపాలకులుగా నియమింపబడ్డారు. ఆదిశేషుడు, గరుత్మంతుడు, విష్వక్సేనుడు తరువాత, విష్ణుమూర్తి పరివార దేవతలలో అత్యంత ప్రముఖులు వీరే!

శ్రీవారిసన్నిధి యందున్న బంగారు కటాంజనాలలో నిరంతరం నిలుచుని ఉండే మహద్భాగ్యానికి నోచుకున్న జయ-విజయులకు భక్తిపూర్వకంగా నమస్కరించి, వారి అనుమతితో, శ్రీవారి దర్శనార్థం, "బంగారువాకిలి" ముంగిట చేరుకున్నాం.[3] ఇప్పుడు బంగారువాకిలి, దాని లోపల ఉన్న ఇతర మండపాలు మరియు "గర్భాలయం" గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

బంగారువాకిలి

శ్రీవారి ఆలయానికి మూడవది (మొదటిది "మహాద్వారం" లేదా "పడికావలి", రెండవది "వెండివాకిలి" లేదా "నడిమి పడికావలి"), అత్యంత ముఖ్యమైనది అయిన ఈ బంగారువాకిలి పేరుకు తగ్గట్లే, పసిడి కాంతులతో తళతళలాడుతూ, లక్ష్మీవల్లభుడైన శ్రీనివాసుని అనంతమైన ఐశ్వర్యాన్ని, వైకుంఠ వైభవాన్ని చాటుతూ ఉంటుంది.

---

[3] **అయితే, చిన్న మనవి**: కొన్ని అర్జితసేవలలో పాల్గొనేవారు, విఐపి బ్రేక్ దర్శనం అనుమతి ఉన్న భక్తులు మాత్రమే బంగారువాకిలి దాటి లోనికి ప్రవేశించగలరు. మిగతా భక్తులందరూ, ఇక్కడినుండే, "లఘుదర్శనం" ద్వారా శ్రీవారి దివ్యమంగళరూపాన్ని దర్శించుకుని, మహామణి మంటపానికి దక్షిణంగా ఉన్న కటకటాల ద్వారం నుంచి నిష్క్రమించాల్సి ఉంటుంది.

బంగారువాకిలి గుమ్మం పైభాగాన, గుమ్మానికి ఇరుప్రక్కలా, జయ-విజయుల మధ్యనున్న ప్రదేశమంతా కడు రమణీయమైన పుష్పాలు, లతలు చెక్కబడి బంగారుతాపడంతో మెరుస్తూ ఉంటాయి. ఈ రెండు తలుపులు గళ్ళు-గళ్ళుగా విభజించబడి, ప్రతి గడిలోనూ ఒక్కో అద్భుతమైన ప్రతిమ అచ్చెరువు గొల్పుతూ ఉంటుంది. సుదర్శనచక్రం, శ్రీవేంకటేశ్వరుడు, మహావిష్ణువు, పాంచజన్యం, వాసుదేవుని విభిన్నరూపాలు, కేశవుని ద్వాదశమూర్తులు (కేశవుడు, నారాయణుడు, మాధవుడు, గోవిందుడు, విష్ణువు, మధుసూదనడు, త్రివిక్రముడు, వామనుడు, శ్రీధరుడు, హృషీకేశుడు, పద్మనాభుడు, దామోదరుడు), దశావతారరాలు కన్నులకింపుగా చెక్కబడి, సాక్షాత్తూ వైకుంఠమే ఇక్కడికి చేరుకున్నట్లుగా గోచరిస్తుంది. పై గడపకు ఇరుపార్శ్వాలలో గజరాజులచే పూజింపబడుతున్న గజమహాలక్ష్మి పద్మాసీనురాలై ఉంటుంది. బంగారువాకిళ్ళను సుప్రభాత సమయంలో "కుంచెకోల" అనే పరికరంతో, జియ్యంగార్లు, అర్చకులు, ఆలయ అధికారుల వద్దనున్న తాళంచెవులతో అందరి సమక్షంలో తెరిచే విస్తారమైన ప్రక్రియను మనం "సుప్రభాతసేవ" లో తెలుసుకున్నాం.

ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తిరుమలకు చేరుకున్న భక్తులు, పూటలకొద్దీ క్యూలైన్లలో వేచిఉండి, మొక్కుబడులు చెల్లించుకుని, బంగారువాకిలి వెలుపలి నుండే క్షణకాల దర్శనంతో సంతృప్తిపడి, శ్రీనివాసుని దివ్యమంగళమూర్తి నుండి దృష్టి మరల్చుకోలేక, రెప్పవేస్తే కన్నుల ముందున్న పెన్నిధి కనుమరు గవుతుందేమోనన్న బెంగతో, అతికష్టం మీద ముందుకు సాగిపోతారు. స్వామివారిని ఎన్నెన్నో కోర్కెలు కోరుదామని వచ్చిన భక్తులు ఆనందాతిశయంతో, భక్తిపారవశ్యంతో, తన్మయంతో తమను తాము మైమరచిపోతారు. మనం కోరుకో గలిగింది అత్యల్పం, స్వామివారు ప్రసాదించ గలిగింది అనంతం!

భక్తుని మానసం భగవంతు డెరుగడా?

కొండంత దేవుడిని కోటి కోర్కెలతో కష్టపెట్టకుండా, క్షణకాల దర్శనంలో ఆ చిన్మయానంద రూపాన్ని గుండెగుడిలో పదిలంగా కొలువుంచు కోవడం శ్రేయస్కరం!

స్నపనమండపం

బంగారువాకిలి దాటగానే మనం మొట్టమొదటగా ప్రవేశించే ఓ ఇరుకైన, చిరుచీకటిగా వుండే నాలుగుస్తంభాల మంటపమే "స్నపనమండపం." ఈ మంటపం యొక్క శిలాస్తంభాలపై వివిధ ఆకృతుల్లో ఉన్న శ్రీకృష్ణుని, యోగానరసింహుని శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. 614వ సంవత్సరం నందు, ఆలయానికి మరమ్మతులు జరుగుతున్న సమయంలో, పల్లవరాణి "సామవై" మూలమూర్తికి నకలుగా భోగశ్రీనివాసమూర్తి వెండిప్రతిమను చేయించి, ఈ మంటపంలో ప్రతిష్ఠ చేయించి నందున, దీన్ని "బాలాలయం" అని కూడా పిలుస్తారు. ప్రస్తుతం కొలువు శ్రీనివాసమూర్తికి ప్రతినిత్యం తెల్లవారు ఝామున జరిగే "దర్బారు" ఈ మంటపంలోనే నిర్వహింప బడుతుంది. స్వామివారికి అలంకరించే అమూల్యమైన ఆభరణాలన్నీ ఈ మండపంలోని బీరువాలలో, అర్చకులు, ఆలయ అధికారులు ఆధ్వర్యంలో భద్రపరుస్తారు. శ్రీవారి ఆభరణాల గురించి ముందు ముందు వివరంగా తెలుసుకుందాం.

రాములవారి మేడ

స్నపనమంటపం దాటగానే మనం మరో ఇరుకైన మంటపంలోకి ప్రవేశిస్తాం. ఈ మండపంలో దక్షిణం వైపున ఉన్న అరుగుపై – ఉత్తరాభిముఖంగా సీతారామలక్ష్మణులు; రాములవారి పరివార దేవతలైన హనుమంతుడు, సుగ్రీవుడు, అంగదుడు – కొలువై ఉండేవారు. అలాగే, ఉత్తరం వైపున ఉన్న అరుగుమీద, దక్షిణాభిముఖంగా శ్రీవేంకటేశ్వర పరివారదేవతలైన – గరుత్మంతుడు, విష్వక్సేనుడు, అనంతుడు – కొలువై ఉండేవారు. ఎప్పటినుంచో రామపరివారం వేంచేసి ఉండటం వల్ల ఈ మంటపాన్ని "రాములవారి మేడ" గా వ్యవహరిస్తారు. కాలాంతరంలో, సీతారామలక్ష్మణుల విగ్రహాలను గర్భాలయంలోకి, మిగిలిన మూర్తులన్నింటిని విమానప్రదక్షిణ మార్గంలోనున్న "అంకురార్పణ మంటపం" లోనికి తరలించారు. ఈ మండపం గురించి తరువాత తెలుసుకుందాం. రాత్రి ఏకాంతసేవ సమయంలో తాళ్లపాక వంశీయులు రాములవారిమేడ నుండే తుంబురనాదం వినిపిస్తూ జోలపాట పాడుతారు. 13వ శతాబ్దానికి పూర్వం, ఈ మంటపం ముక్కోటి ప్రదక్షిణమార్గంలో కలిసిపోయి, నాలుగో ప్రదక్షిణమార్గంగా ఉండేది. తరువాత ఇరుపార్శ్వాలలో గోడలు నిర్మించడం వల్ల, ఇదో మంటపమై పోయింది.

శయనమండపం

రాములవారిమేడ దాటగానే శయనమండపం లోనికి ప్రవేశిస్తాం. గర్భాలయానికి అనుసంధానించి, దానికి ఎదురుగా ఉండే ఈ మండపాన్ని ఆగమశాస్త్ర పరిభాషలో "అంతరాళం" గా పిలుస్తారు. ఈ మంటపం శ్రీవారికి శయనమంటపంగా మరియు భోజనశాలగా కూడా ఉపయోగ పడుతుంది. వెన్న, పాలు, పెసరపప్పు (వడపప్పు), స్వామివారికి తొలినైవేద్యంగా సమర్పించబడే మాత్రాన్నం మరియు అతికొద్ది ముఖ్యమైన ప్రసాదాలు తప్ప, మిగిలిన సమస్త ప్రసాదవిశేషాలను శయనమంటపం నుంచే స్వామివారికి నివేదిస్తారు. ఈ మంటపంలోనే భోగశ్రీనివాసమూర్తిని, వెండి గొలుసులతో వ్రేలాడ దీయబడిన బంగారు పట్టెమంచం పైనున్న పట్టుపరుపుపై శయనింపజేసి, ఏకాంతసేవ జరుపుతారు. తోమాలసేవ సమయంలో ఆళ్వారుల దివ్యప్రబంధగానం, శ్రీసూక్త-పురుషసూక్తం పఠనం, ఈ మండపం నుండే జరుగుతాయి. తోమాలసేవ, సహస్రనామార్చన, అష్టదళ పాదపద్మారాధన, శుక్రవారాభిషేకం వంటి ప్రముఖమైన ఆర్జితసేవల్లో పాల్గొనే భక్తులకు మాత్రమే శయనమంటపంలో కూర్చుని తనివితీరా స్వామివారిని దర్శించుకునే భాగ్యం దక్కుతుంది. ఇంత సమీపం నుండి స్వామివారిని వీక్షించుచుకునే మహదవకాశం, అత్యంత అరుదుగా మాత్రమే లభిస్తుంది.

కులశేఖరపడి

పన్నెండుమంది ఆళ్వార్లలో ఒకరైన "కులశేఖరాళ్వార్", 767వ సం., కుంభమాసాన, పునర్వసు నక్షత్రంలో, కేరళదేశము నందలి "కోళి" అనే పట్టణంలో, "దృఢవ్రతుడ" నే రాజుకు, శ్రీమహావిష్ణువు యొక్క కౌస్తుభరత్నాంశతో జన్మించారు.

104 పాటలతో ఆయన రచించిన "పెరుమాళ్ తిరుమొళి" అనే గీతమాలికలోని 11 పాటలలో తిరుమలేశుణ్ణి వర్ణించబడింది. లోకప్రసిద్ధమైన ఈ పాటలను విని, ఆనందపరవశులై తిరుమలేశుని దర్శనార్థం వేంకటాచలానికి వచ్చిన భక్తులు ఎందరో ఉన్నారు. ఒక పాశురంలో ఆయన స్వామివారిని ఈ విధంగా వేడుకొన్నారు:

పడియాయ్ కెడందు ఉన్
పవళవాయ్ కాన్ బేనే"

అంటే, "ఓ వెంకటేశా! నీముందు రాతిగడపగా పడిఉన్నట్లైతే నీ ముఖారవిందాన్ని నిత్యం దర్శించుకోవచ్చు కదా!"

ఈ చిన్ని పదబంధంతో కులశేఖరుని ఆర్తిని, ఆకాంక్షను, భావోద్వేగాన్ని, శ్రీవారి పట్ల వారికుండే అనన్య భక్తిని అవగతం చేసుకోవచ్చు. ఆయన కోరికను తీర్చటానికా అన్నట్లు, స్వామివారికి అత్యంత సమీపంలో ఉండే గడప "కులశేఖరపడి" గా పిలువ బడుతుంది. "పడి" అనగా "గడప" లేదా "మెట్టు" అని అర్థం.

భగవద్భక్తి పూరితమైన 'ముకుందమాల' అనే గ్రంథాన్ని కూడా ఈయన రచించారు.

ఈ గడపకు పైన, క్రింద, ఇరుపార్శ్వాల యందు బంగారుతాపడం చేయబడి ఉంటుంది. స్వామివారి వైఖానస ఆగమ అర్చకులు మరియు జియ్యంగార్లకు తప్ప, వేరెవ్వరికీ ఈ గడప దాటి గర్భాలయం లోనికి ప్రవేశించే అధికారం లేదు. కోటీశ్వరులైనా, దేశాధినేతలైనా, ఈ గడప వెలుపలనుండి వెనుదిరిగాల్సిందే!

గర్భాలయం

కులశేఖరపడికి లోపల, స్వామివారి మూలమూర్తి కొలువై ఉండే ఇరుకైన ప్రదేశమే "గర్భాలయం". దీన్నే "ఆనందనిలయం" గా కూడా వ్యవహరిస్తారు. బంగారుతాపడం కలిగిన ఆనందనిలయ "విమానం" లేదా "గోపురం" ఈ గర్భాలయం ఉపరితలం పైనే ప్రతిష్ఠించబడి ఉంటుంది.

చారిత్రక ఆధారాల ననుసరించి, ఈ గర్భాలయం 900వ సంవత్సరానికి పూర్వమే నిర్మించబడగా, మిగిలిన కట్టడాలన్నీ 11వ శతాబ్దా నంతరమే, అంచెలంచెలుగా రూపు దిద్దుకున్నాయి.

సంవత్సరానికి నాలుగు మార్లు జరిగే "కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం" ఆర్జితసేవలో భాగంగా, గర్భాలయ అంతర్భాగాని కంతటికీ సుగంధద్రవ్యాల మిశ్రమమైన "పరిమళం" అనబడే పదార్థాన్ని పూయడం ద్వారా, గాలి–వెలుతురు లేకపోయినప్పటికీ, గర్భాలయం అంతటా, ఏ విధమైన క్రిమి–కీటకాలు లేకుండా, సువాసనలతో గుబాళిస్తుంది.

ఈ గర్భాలయం, పన్నెండు అడుగుల తొమ్మిది అంగుళాల పొడవు, వెడల్పులతో చతురస్రంగా ఉంటుంది. గర్భాలయానికి ఆగమశాస్త్రం అనుమతించిన అత్యధిక వైశాల్యం ఇదే! స్వామివారు స్ఫురద్రూపు లవ్వడంచేత, వారికి తగ్గట్లుగా ఇంత విశాలమైన గర్భాలయం నిర్మించబడింది.

పల్లవరాజుల కాలంలో నిర్మింపబడిన ఆలయాలన్నింటిలో గర్భాలయగోడలు దాదాపు మూడు–నాలుగు అడుగుల

మందం కలిగి ఉంటాయి. దానికి భిన్నంగా, శ్రీవారి గర్భాలయ కుడ్యాలు ఏడు అడుగులకు పైగా మందం కలిగి ఉన్నాయి. వివిధ రాజుల కాలంలో స్వామివారి గర్భాలయానికి చుట్టూ ఉన్న అసలు గోడను అనుసంధానించి వేర్వేరు లక్ష్యాలతో కొత్త గోడలు నిర్మించుకుంటూ పోవడమే దీనికి కారణం. అంతకు ముందు (వెలుపలి గోడ నిర్మించక ముందు), ఈ గర్భాలయం చుట్టూ ఒక ప్రదక్షిణమార్గం కూడా ఉండేది.

గర్భాలయం పైకప్పు క్రిందుగా, మూలమూర్తి పైభాగంలో "కురాళం" అనబడే మఖమల్ వస్త్రం ఎప్పుడూ కట్టబడి ఉంటుంది. దీనిని సంవత్సరానికి నాలుగు సార్లు మార్చుతారు. అలాగే, మూలమూర్తి వెనుక ఉండే పరదాను, ప్రతి శుక్రవారాభిషేకానికి ముందురోజున మార్చుతారు.

గర్భాలయంలో మూలవిరాట్టుతో పాటుగా భోగశ్రీనివాసుడు, శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి, కొలువుశ్రీనివాసుడు, ఉగ్రశ్రీనివాసుడు కూడా కొలువై ఉంటారు. ఈ పంచబేరాలకు తోడుగా సీతారామలక్ష్మణులు, రుక్మిణీశ్రీకృష్ణుల పంచలోహ విగ్రహాలు కూడా వేంచేసి ఉంటాయి. ఒక్క మూలవిరాట్టు తప్ప, మిగిలిన మూర్తులన్ని తరువాతి కాలంలో గర్భాలయంలో చేర్చబడినవే!

స్వామివారికి ఎదురుగా, గర్భాలయం లోపల, ఆగ్నేయ–ఈశాన్య మూలల్లో, ఎల్లవేళలా నేతిదీపాలు దేదీప్యమానంగా వెలుగుతూ ఉంటాయి. మొట్టమొదటిసారిగా ఈ దీపాలను బ్రహ్మదేవుడు వెలిగించటం వల్ల వీటిని "బ్రహ్మ అఖండం" గా పిలుస్తారు.

గర్భాలయంలో స్వయంవ్యక్తమై, చరిత్రకందని కాలం నుండి పూజల నందుకుంటున్న మూలమూర్తి గురించి, తర్వాతికాలంలో చేర్చబడిన సీతారామలక్ష్మణులు, రుక్మిణిశ్రీకృష్ణ ప్రతిమల గురించి, విమానప్రదక్షిణ మార్గంలో ఉన్న మరికొన్ని విశేషాలగురించి తెలుసుకుందాం.

మనం బంగారువాకిలిలో నుంచి స్నపనమంటపం, రాములవారిమేడ దాటుకుని, శయనమంటపం లోకి ప్రవేశించి, కులశేఖరపడి ఆవల నిలబడి, మూలమూర్తి దర్శనం కోసం ఎదురు చూస్తున్నాం.

ఇప్పుడు మూలమూర్తిని, గర్భాలయంలో ఉన్న ఇతరదేవతా మూర్తులను తనివితీరా దర్శించుకుందాం!

శ్రీవారి మూలవిరాట్టు

స్వామివారు సుమారుగా తొమ్మిదిన్నర అడుగుల ఎత్తులో, పాదపద్మాలను పద్మపీఠంపై నుంచి, నిగనిగలాడే నల్లని మేనిఛాయతో దర్శనమిస్తారు. ముంగాళ్లకు అందెలు లేదా నూపురాలు అలంకరింపబడి ఉంటాయి. స్వామివారి మూర్తి నిటారుగా నిలబడి ఉన్నట్లు కనిపించినప్పటికీ, నడుముభాగంలో కొద్దిగా ఎడమప్రక్కకు ఒరిగి, మోకాలు కొద్దిగా పైకి లేచి ఉంటుంది. అంటే స్వామివారు వయ్యారంగా నిలబడి ఉన్నారన్నమాట. నడుముకు రెండంగుళాల వెడల్పైన కటిబంధం చుట్టబడి ఉంటుంది. నడుము పై భాగంలో ఏ విధమైన ఆచ్ఛాదన లేని స్వామివారు, క్రింది భాగంలో ఒక ధోవతి ధరించి ఉంటారు. బొడ్డు నుండి పాదాల వరకు వ్రేలాడుతున్న ఖడ్గాన్ని "సూర్యకఠారి" లేదా

"నందకఖడ్గం" అని పిలుస్తారు. చతుర్భుజుడైన స్వామివారు, పైనున్న కుడిచేతిలో సుదర్శనచక్రాన్ని, ఎడమచేతిలో పాంచజన్య శంఖాన్ని ధరించి ఉంటారు. ఈ ఆయుధాలు స్వామివారి మూర్తికి సహజసిద్ధమైనవి కావు. అమర్చబడ్డవని మనం ముందుగానే తెలుసుకున్నాం. మరో కుడిచెయ్యి వరదభంగిమలో నుండి, అరచేతి వేళ్లతో కుడిపాదాన్ని సూచిస్తూ ఉంటుంది. నడుముపై, నేలకు సమాంతరంగా పెట్టుకుని ఉన్న ఎడమచేతిని కటిహస్తంగా పిలుస్తారు. ఈ హస్తభంగిమను ఆగమపరిభాషలో "కట్యావలంబితముద్ర" గా పేర్కొంటారు. వరదహస్తంతో కోరిన వరాలను కురిపిస్తూ, నా పాదాలే భక్తులకు శరణ్యమని సూచిస్తుంటారు. కటిహస్తంతో, నన్ను నమ్ముకున్న భక్తులు సంసారసాగరంలో నడుములోతు వరకే మునుగుతారనే సంకేతం ఇస్తారు. ముంజేతులకు కంకణాలు, కంఠభాగంలో యజ్ఞోపవీతం, మరో నాలుగు హారాలు మనోహరంగా దర్శనమిస్తాయి. నిరంతరం విల్లంబులను, అమ్ములపొదిని ధరించి ఉండడం వల్ల భుజంపై రాపిడి గుర్తులు కూడా కనిపిస్తాయి. వక్షస్థలంపై దక్షిణభాగాన కొలువైవున్న మహాలక్ష్మిని "వక్షస్థల లక్ష్మి" గా పిలుస్తారు. శిరస్సు పైనుండి సొగసుగా జాలువారుతున్న శిరోజాలను, భుజాలపై దోబూచులాడుతున్న ముంగురులను కూడా దర్శించుకోవచ్చు. ముఖారవిందంలో నాసిక, పెదిమలు, గడ్డము, చెవులు, నేత్రాలు సమపాళ్ళలో తీర్చిదిద్ది నట్లుంటాయి.

శంఖుచక్రాలు తప్ప పైన పేర్కొన్నవన్నీ మూలమూర్తిలో అంతర్భాగంగా ఉన్నవే!! వీటిలో చాలా భాగం శుక్రవార అభిషేక సమయంలో, ఆభరణాలు, వస్త్రాలంకరణ లేనప్పుడు మాత్రమే దర్శించగలం. అయితే, స్వామివారు నిత్యం పట్టుపీతాంబరాలతో, వజ్ర వైఢూర్య రత్నఖచిత స్వర్ణాభరణాలతో, అనేక పూలమాలలతో, శ్రీదేవి-భూదేవి అమ్మవార్ల పతకాలతో, విశేష సందర్భాల్లో వజ్ర కిరీటధారణతో, యజ్ఞోపవీతం, ఉదరాన కౌస్తుభమణి, నడుముకు బంగారు మొలత్రాడు, పాదాలకు బంగారు తొడుగులుతో అలంకరింపబడి ఉంటారు. స్వామివారి విప్పారిన నేత్రాలను, నాసిక ఉపరితల భాగాన్ని చాలా వరకు కప్పివేస్తూ వెడల్పాటి ఊర్ధ్వపుండ్రం, దాని మధ్యభాగాన కస్తూరితిలకం కనిపిస్తాయి. కాబట్టి మిగిలిన సమయాల్లో మూలమూర్తి సహజరూపాన్ని దర్శించటం వీలుకాదు.

స్వయంవ్యక్తము, దివ్యసాలగ్రామశిల అయినటువంటి శ్రీవారు, అర్చారూపాన్ని పొందటం వెనుక ఆగమశాస్త్ర నేపథ్యం ఉంది. అర్చనాదికాలకు అనువైన రూపాన్ని ధరించి కలియుగవాసులలో భక్తి భావాన్ని, పాపభీతిని, ధర్మాధర్మవిచక్షణ పెంపొందించడమే అర్చారూపంలోని పరమార్థం! తన ముగ్ధమోహన రూపంతో భక్తులను పరవశింపజేసి, వారి మనస్సును. దృష్టిని తనపై మళ్ళింప జేసుకుని, వారికి ఇహపరాలను ప్రసాదిందిడం కోసమే స్వామివారు ఇక్కడ భౌతికంగా కొలువై ఉన్నారు.

స్వామివారి దివ్యమంగళ రూపాన్ని వర్ణించటం మహామహులకే సాధ్యం కాలేదు. శ్రీవారి శోభను చూచాయగా, లేశామాత్రంగా తెలియజెప్పే చిన్ని ప్రయత్నమే ఇది!

శ్రీవారి మూర్తి మానవనిర్మితమై ఉండవచ్చునని కొందరు సందేహం వెలిబుచ్చుతారు. అయితే, ఆలయశాస్త్రంలో నిష్ణాతులైన స్థపతులు ఈ వాదనను తర్కయుక్తంగా, శాస్త్రబద్ధంగా ఖండించారు. ఆగమశాస్త్రానుసారం మానవనిర్మిత మూర్తులలో – యోగమూర్తి, భోగమూర్తి, వీరమూర్తి, అభిచారకమూర్తి – అనే నాలుగు భంగిమలు కలిగిన

మూర్తులుంటాయి. ప్రతి మూర్తికి ఉండవలసిన నిర్దిష్ట లక్షణాలను ఆగమశాస్త్రంలో పొందుపరిచారు. మూలమూర్తి ఆకారాన్ని, హస్తభంగిమలను, ధరించిన ఆయుధాలను, స్వతఃసిద్ధంగా ఉన్న అలంకారాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే, ఈ నాలుగు రకాల మూర్తులకు నిర్ధారించబడిన ఏ లక్షణాలను గర్భాలయంలోని మూలమూర్తి కలిగి ఉండదు. అందుచేత, ఈ మూలవిరాట్టు మానవనిర్మితం కాదని, ఆగమశాస్త్ర ఆవిర్భావానికి ఎంతో ముందుగానే ఈ మూర్తి ఉద్భవించిందని తేటతెల్ల మవుతుంది.

గర్భాలయంలో స్వామివారి మూలమూర్తితో పాటుగా పంచబేరాలు (ధ్రువబేరమైన అయిన మూలవిరాట్టు తోపాటుగా), సుదర్శన చక్రత్తాళ్వార్, పవిత్ర సాలగ్రామాలు, రుక్మిణి–శ్రీకృష్ణుడు, సీతారామలక్ష్మణ మూర్తులు కూడా దర్శనమిస్తాయి. పంచబేరాల గురించి మనం మొట్టమొదటి ప్రకరణంలోనే తెలుసుకున్నాం. తక్కిన ఉత్సవమూర్తుల గురించి ఇప్పుడు చెప్పుకుందాం.

చక్రత్తాళ్వార్ (సుదర్శనచక్రం)

చక్రత్తాళ్వార్ గా పిలువబడే "సుదర్శనచక్రం", రెండడుగుల ఎత్తు కలిగి, చక్రాకారంలో 16 కోణాలు కలిగి, పంచలోహ నిర్మితమై, ఆరంగుళాల ఎత్తైన, వెండి చతురస్రపీఠంపై విరాజిల్లు తుంటుంది. ప్రతి సంవత్సరం నాలుగు సందర్భాలలో చక్రత్తాళ్వార్ కు స్వామిపుష్కరిణిలో చక్రస్నానం గావిస్తారు. స్వామివారి పరమాయుధమైన సుదర్శనచక్రం పూర్వయుగాలలో ఎందరో దైత్యులను సంహరించింది. చక్రాయుధానికి స్వామివారు ప్రత్యేకంగా అనుజ్ఞ ఇవ్వనవసరం లేదు. స్వామివారి చిత్తాన్ని, సంకల్పాన్ని, భక్తుల వాంఛితాలను గుర్తెరిగి, శిష్టరక్షణ–దుష్టశిక్షణ గావించి, తిరిగి పదిలంగా స్వామివారి చెంతకు చేరుకుంటుంది. మనకు సుపరిచితమైన "గజేంద్రమోక్షం" ఘట్టమునందు మొసలి కోరలనుండి గజరాజును రక్షించినది సుదర్శనచక్రమే!

భక్తులు తిరుమల యాత్రకు సంకల్పించినది మొదలు, వారిని ప్రయాణ మార్గంలోనూ, తిరుమలక్షేత్రం లోనూ అనుకోని విపత్తుల నుండి కాపాడి, తిరిగి వారి వారి గమ్యాలకు సురక్షితంగా చేర్చే బాధ్యతను సుదర్శనచక్రం చేపడుతుందని భక్తులు నమ్ముతారు.

సాలగ్రామాలు

గర్భాలయం నందు వివిధ ఆకృతుల్లో, పరిమాణాల్లో ఉన్న అనేక సాలగ్రామాలు స్వామివారి పాదాల చెంతనున్న వెండిపళ్లెరంలో కొలువై ఉండి అనూచానంగా పూజాదికాల నందుకుంటున్నాయి. భగవద్రామానుజచార్యులు, వ్యాసతీర్థులవారు, ఇంకా అనేక భక్తశిఖామణులు మూలవిరాట్టును దివ్యసాలగ్రామశిల గానూ, తిరుమలక్షేత్రాన్ని దివ్యసాలగ్రామ మయంగానూ భావించి పూజించారు. పూజలందుకునే సాలగ్రామాలే కాకుండా మాలలరూపంలో కూడా అనేక సాలగ్రామాలు మాలల రూపంలో అమర్చబడి స్వామివారి కంఠసీమను అలంకరిస్తున్నాయి. శ్రీ కృష్ణదేవరాయలు గురువుగారైన వ్యాసతీర్థుల వారు బంగారు కవచాలను తొడిగిన సాలగ్రామాలను స్వామివారికి బహూకరించారు. వేరెందరో భక్తులు కూడా తరచుగా స్వామివారికి సాలగ్రామమాలలను సమర్పిస్తున్నారు.

రుక్మిణి శ్రీకృష్ణులు

గర్భాలయం నందు, కుడిచేతిలో వెన్నముద్దను పెట్టుకొని ఒంటికాలి మీద వయ్యారంగా నిల్చుని ఉన్న బాలకృష్ణుడు, రెండడుగుల ఎత్తైన రుక్మిణి-శ్రీకృష్ణుని వెండివిగ్రహాలు ఎప్పటి నుంచో పూజింప బడుతున్నాయి. రాజేంద్రచోళుని భార్య 1100వ సంవత్సరంలో ఈ విగ్రహాలకు పాలు పెరుగు నైవేద్యం సమర్పించేది.

ప్రతి సంవత్సరం కనుమనాడు మలయప్పస్వామితో పాటుగా, శ్రీకృష్ణుడు కూడా "పార్వేటఉత్సవం" లో పాల్గొంటారు. బ్రహ్మోత్సవాల్లో "మోహినీ అవతారం" రోజున, మలయప్పస్వామితో పాటు మరొక పల్లకిపై శ్రీకృష్ణుడు ఊరేగుతారు. ధనుర్మాసంలో సుప్రభాతానికి బదులుగా తిరుప్పావై పాశురాలను పాడుతూ, చిన్నికృష్ణుని మేల్కొలుపుతారు. అలాగే, ఆ మాసంలో రాత్రివేళయందు భోగశ్రీనివాసమూర్తికి బదులుగా చిన్నికృష్ణునికి పవళింపుసేవ జరుగుతుంది. ద్వాపరపు శ్రీకృష్ణుని కొనసాగింపే కలియుగ వేంకటేశ్వరుని అవతారమని అనేక సందర్భాల్లో చెప్పుకున్నాం!

సీతారామలక్ష్మణులు

గర్భాలయంలో మూలమూర్తికి ఎడమప్రక్కగా, ఒకప్పుడు రాములవారిమేడలో కొలువై ఉండే సీతారామలక్ష్మణుల పంచలోహవిగ్రహాలు దర్శనమిస్తాయి. ఈ విగ్రహాలు ఇక్కడికి ఎలా చేరుకున్నాయి అనే విషయంపై రెండు కథనాలు ఉన్నాయి.

- త్రేతాయుగంలో సీతమ్మవారిని వెతుక్కుంటూ వెంకటాద్రికి విచ్చేసిన రామలక్ష్మణులకు గుర్తుగా ఈ మూర్తులు ఇచ్చట కొలువై ఉన్నాయి. అందువలననే రామలక్ష్మణులు రాజోచితమైన కిరీటాలు ధరించకుండా, అరణ్యవాసంలో ఉన్నట్లు జడధారులై దర్శనమిస్తారు.
- మరో కథనం ప్రకారం – భగవద్రామానుజుల వారు తిరుమలనంబి నుండి శ్రీమద్రామాయణ రహస్యాలను, నడకదారిలోని ఓ ప్రదేశంలో తెలుసుకుంటూ ఉన్నప్పుడు, ఒక సద్బ్రాహ్మణుడు వారికి ఈ విగ్రహాలను సమర్పించాడు. తదనంతర కాలంలో తిరుమలనంబి ద్వారా ఇవి ఆనందనిలయం లోనికి చేర్చబడ్డాయి.

గర్భాలయంలోని మూలమూర్తులను తనివితీరా దర్శించుకుని, వెనుదిరిగి, వరుసగా – శయనమండపం, రాములవారిమేడ, స్నపనమండపం – మీదుగా బంగారువాకిలి దాటి, జయ-విజయుల అనుమతితో తిరుమామణి మంటపానికి ఉన్న దక్షిణద్వారం నుంచి నిష్క్రమించి, తిరిగి విమానప్రదక్షిణమార్గాన్ని చేరుకున్నాం.

ప్రధాన వంటశాల (పోటు)

విమానప్రదక్షిణమార్గంలో ఆగ్నేయదిశగా, ఎత్తైన అరుగులతో ఉండే వంటశాలను "పోటు" అంటారు. ఇదే వాస్తును ఇప్పటికీ మనం అనుసరిస్తూ, ఇంటికి ఆగ్నేయమూలన వంటగదిని ఏర్పాటు చేసుకుంటున్నాం. శ్రీవారిని దర్శించుకుని బయటకు రాగానే మనకు ఎదురుగా ఉండే బంగారుబావికి ఎడమప్రక్కగా ఈ ప్రధాన వంటశాల కనిపిస్తుంది. ప్రస్తుతం శ్రీవారికి సమర్పించే అన్నప్రసాదాలను మాత్రం ఇందులో తయారు చేస్తున్నారు. పూర్వం లడ్డు, వడ వంటి

పణ్యారాలను కూడా ఇందులోనే తయారు చేసేవారు. ప్రస్తుతం ఇటువంటి పణ్యారాలను సంపంగిప్రదక్షిణమార్గంలో ఉన్న "పడిపోటు" లో తయారుచేస్తున్నారని ఇంతకు ముందే తెలుసుకున్నాం.

ఈ "పోటు" యందు అన్నప్రసాదాలను వంటబ్రాహ్మణులు అత్యంత శుచిగా, నియమనిష్ఠలతో, వేళప్రకారం తయారుచేసి, స్వామివారి నివేదన నిమిత్తం గంగాళాలలో నింపుతారు. "గమేకార్లు" అనబడే పరిచారకులు ఈ ప్రసాదాల గంగాళాలను స్వామివారి సన్నిధికి చేరుస్తారు. పంచభక్ష్య పరమాన్నాలు ఎన్నో తయారైనా, పెరుగన్నాన్ని, మాత్రమే కులశేఖరపడి దాటి, కుమ్మరిభీమన్నకు గుర్తుగా గర్భాలయంలో ఉంచి నివేదన చేస్తారు. దాదాపుగా మిగిలిన ప్రసాదాలన్నీ గర్భాలయం వెలుపలనున్న శయనమందిరం నుండే స్వామివారికి నివేదించ బడతాయి.

వకుళమాత

పోటుకు ప్రక్కగా, ఎత్తైన వేదికపైనున్న అద్దాలమందిరంలో, శ్రీవారి తల్లి వకుళమాత సుఖాసీనురాలై, నిత్యపూజ లందుకుంటూ, మనకు దర్శనమిస్తుంది. ముఖారవిందానికి ఎదురుగా ఉన్న ఓ చిన్నరంధ్రం ద్వారా ఆమె, తనయుడైన శ్రీనివాసుని కోసం తయారవుతున్న నైవేద్యాలను పర్యవేక్షిస్తారు. దేశానికి రాజైనా తల్లికి తనయుడే కదా!

అలాగే, బ్రహ్మాండనాయకుడు కూడా తల్లిగారైన వకుళమాత చేతిముద్దలు తిన్నవాడే. వేల ఏళ్లనాటి, ఆ శ్రీనివాసుని బాల్యాన్ని స్ఫురణకు తెచ్చుకుంటూ, తన కుమారునికి సమర్పింపబడే నైవేద్యాలు "శుచిగా, రుచిగా, సమయబద్ధంగా తయారవుతున్నాయా లేదా" అన్న విషయాన్ని వకుళాదేవి అనుక్షణం గమనిస్తూ ఉంటుంది. అందుచేతనే ఈ మాతను "పాకలక్ష్మి" లేదా "పచనలక్ష్మి" అని కూడా అంటారు. కలియుగ ఆరంభంలో శ్రీనివాసుడు వరాహస్వామి అండదండలతో వెంకటాచలంపై స్థిరనివాసం ఏర్పరుచుకున్నప్పుడు, వకుళాదేవి శేషాచల అడవుల్లో పండే శ్యామకధాన్యాన్ని అన్నంగా వండి, తేనెతో కలిపి ప్రేమగా శ్రీనివాసుని తినిపించేదట. ఆ శ్యామకధాన్యాన్ని నేడు తెలంగాణ-రాయలసీమల్లో "కొర్రలు" అని, కర్ణాటకలో "శ్యామలు" అని పిలుస్తారు. ఈ ధాన్యానికి "ప్రియంగు" అనే మరో పేరు కూడా ఉండడం చేత, శ్రీవేంకటేశ్వర అష్టోత్తర శతనామావళిలో శ్రీస్వామివారిని "ఓం ప్రియంగు ప్రియాఢ్యై నమః" అని కూడా స్తుతిస్తారు. ఈ విధంగా, ఆ తల్లి-తనయుల సంబంధం యుగయుగాలుగా, తరతరాలుగా కొనసాగుతోంది. ఈ మధ్యకాలంలో కొందరు అది "వకుళమాత విగ్రహం కాదు. శ్రీమహాలక్ష్మి మూర్తి" అంటున్నారు. కానీ, తి.తి.దే. వారు "వకుళమాత" అంటూ స్పష్టంగా సూచిస్తున్నారు.

బంగారుబావి

వంటశాల మెట్లను ఆనుకొని, భూమి ఉపరితలం నుండి బంగారుతాపడం చేయబడి ఉన్న బావిని "బంగారుబావి" గా పిలుస్తారు. మహామణిమండపం నుండి బయటకు రాగానే, మన ఎదురుగా ఉన్న కటాంజనాలలో (లోహపు ఊచల పంజరం) దీనిని చూడవచ్చు. శ్రీవారి బోజనావసరాల నిమిత్తం సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి ఈ తీర్థాన్ని ఏర్పాటు చేసినట్లుగా చెబుతారు. అందువలన దీనికి "శ్రీతీర్థం" లేదా "లక్ష్మీతీర్థం" అనే నామాంతరాలు ఉన్నాయి. తరువాతికాలంలో ఆ బావి శిథిలం చెందగా, తొండమాన్ చక్రవర్తిగా పునర్జన్మించిన రంగదాసు అనే శ్రీవారి భక్తుడు,

స్వామివారి ఆనతి మేరకు దీనిని పునరుద్ధరించాడు. శ్రీవారి అభిషేకానికి కావలసిన శుద్ధోదకాన్ని వెయ్యేళ్ళక్రితం వరకు పాపనాశనతీర్థం నుండి, ఆ తరువాత ఆకాశగంగాతీర్థం నుండి "తిరుమలనంబి" అనే భక్తుడు తీసుకు వచ్చేవారు. తరువాతికాలంలో తిరుమలనంబి గురువుగారైన యామునాచార్యులవారు, సాక్షాత్తు శ్రీమహాలక్ష్మిచే నిర్మించబడిన తీర్థం స్వామివారి చెంతనే ఉండగా, వేరే తీర్థాలనుండి అభిషేకజలం తీసుకు రావాలసిన అవసరం లేదని భావించి నప్పటినుండి, ఈ బంగారుబావి లోని పవిత్రజలాలను శ్రీవారి వంటకాలు, అభిషేక, అర్చనాదుల నిమిత్తం ఉపయోగిస్తున్నారు. ఈ బావిలోని నీరు "సుందరుడైన" స్వామివారికి ఉపయోగ పడుతుంది కనుక దీనిని "సుందరస్వామి కూపం" లేదా "సుందరబావి" అని కూడా పిలుస్తారు. ఆ రోజుల్లో స్వామివారిని "సుందరస్వామి" గా కూడా కీర్తించేవారు.

అయితే, శుక్రవార అభిషేకానికి మాత్రం ఆకాశగంగాతీర్థం నుండి మూడు బిందెల అభిషేకజలాన్ని "తోళప్పాచార్యులు" గా పిలువబడే తిరుమలనంబి వంశీయులు తెచ్చే సాంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. పూర్వకాలంలో ఈ బావి నుండి అమర్చిన రాతి కాలువ ద్వారా నీరు వంటశాల లోనికి నేరుగా చేరుకునేది. తరువాతికాలంలో నీటికుండలతో చేదటం ద్వారా, ప్రస్తుతం విద్యుత్ ద్వారా ఈ బావిలోని నీటిని తోడుతూ వంటలకు ఉపయోగిస్తున్నారు. వేలాది సంవత్సరాల క్రితం నిర్మించబడ్డ ఈ బావి ఇప్పటికీ పానయోగ్యమైన జలాన్ని ప్రసాదించటం సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి మహాత్మ్యమే!

ఈమధ్యకాలంలో, కొండపై గుడి చుట్టూ అనేక నివాసగృహాలు రావడంతో నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉండటంవల్ల, సిమెంటు తాపడంతో ఆ అవకాశం లేకుండా చేసి పాపనాశన తీర్థంలోని నీటితో ఈ బావిని నింపుతున్నారు.

అంకురార్పణ మంటపం

"పోటు" ను దర్శించుకుని ఎత్తైన అరుగు మీద ప్రదక్షిణ చేస్తున్నప్పుడు మనకు ముందుగా వచ్చేది "అంకురార్పణ మంటపం". బ్రహ్మోత్సవాలకు ముందు రోజున ఈ మంటపంలో, సేకరించుకొచ్చిన పుట్టమన్నులో నవధాన్యాలను మొలకెత్తింపజేయడం వల్ల ఈ మంటపానికి "అంకురార్పణ మంటపం" అనే పేరు వచ్చింది. అంకురార్పణపర్వం గురించి "శ్రీవారిబ్రహ్మోత్సవాలు" లో వివరంగా తెలుసుకున్నాం. ఒకప్పుడు దేవాలయ అంతర్భాగం నందున్న రాములవారిమేడలో కొలువుండే రామపరివార దేవతలైన – ఆంజనేయుడు, అంగదుడు, సుగ్రీవుని విగ్రహాలు; అలాగే, "నిత్యశూరులు" అనబడే శ్రీమహావిష్ణువు పరివారదేవతలైన విష్వక్సేనుడు, ఆదిశేషువు, గరుత్మంతుడు విగ్రహాలను – ప్రస్తుతం ఈ మండపంలో దర్శించుకోవచ్చు. శ్రీవారి దర్శనానంతరం తీర్థం, శెఠారిని ఈ మంటపం ఎదురుగానే భక్తులకు ప్రసాదిస్తారు. రాత్రివేళల్లో స్వామివారి ఏకాంతసేవ పూర్తయి, ఆలయద్వారాలు మూసిన తరువాత, బ్రహ్మాదిదేవతలు విచ్చేసి స్వామిని కొలుస్తారని ఓ గట్టి నమ్మకం. వారు అర్చించుకోవడం కోసం, ప్రతిరోజు ఆలయద్వారాలు మూసేటప్పుడు ఐదు బంగారు గిన్నెలలో ఆకాశగంగ తీర్థం నింపి ఉంచుతారు. ఉదయం సుప్రభాతం తర్వాత విశ్వరూపసందర్శనం కోసం విచ్చేసే భక్తులకు అంకురార్పణమండపంలో ఇచ్చేది ఈ తీర్థమే!!

దీన్నే "బ్రహ్మతీర్థం" గా పిలుస్తారు.

బ్రహ్మ కడిగిన విష్ణు పాదోదకం గనుక, ఈ తీర్థాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు.

యాగశాల

అంకురార్పణ మండపానికి ఆనుకుని ఉన్న "యాగశాల" లో పూర్వం హోమాలు, యజ్ఞయాగాదులు వంటి వైదికక్రతువు లన్ని జరుగుతుండేవి. కానీ ప్రస్తుతం స్థలాభావం, భక్తులరద్దీ చేత ఈ క్రతువుల్లో చాలావరకూ సంపంగిప్రాకారం లోని "కళ్యాణమండపం" లో జరుప బడుతున్నాయి. బుధవారం నాడు జరిగే సహస్రకలశాభిషేకం సమయంలో మాత్రం, బంగారువాకిలి వద్ద ఏర్పాటు చేయబడిన తాత్కాలిక యజ్ఞగుండంలో యాగం నిర్వహింపబడుతుంది.

కళ్యాణమండపం

సంపంగిప్రాకార కుడ్యానికి లోపలివైపున అనుసంధానింపబడి, యాగశాలకు ఆనుకొని దానికి పడమరగా, విమానప్రదక్షిణ మార్గంలో ఉన్న విశాలమైన మంటపాన్ని "కళ్యాణమండపం" అంటారు. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం వరకు శ్రీవారి నిత్యకళ్యాణోత్సవం ఈ మంటపం లోనే జరుగుతూ ఉండేది. శ్రీవారి మహా భక్తుడు తాళ్ళపాక అన్నమయ్య, తదనంతర కాలంలో వారి వంశీయులు ఈ మంటపంలోనే శ్రీవేంకటేశ్వరుని కళ్యాణోత్సవాలు జరిపేవారు.

1586వ సంవత్సరంలో విజయనగర సామ్రాజ్య ప్రతినిధియైన అయిన చెన్నప్ప అనే అధికారి ఈ మండపాన్ని నిర్మించారు. పూర్తిగా విజయనగరశైలిలో నిర్మింపబడ్డ ఈ మండపం రమణీయమైన శిల్పకళా చాతుర్యంతో కనువిందు చేస్తుంది. ఈ మంటప అంతర్భాగంలో వున్నటువంటి, నాలుగు స్తంభాల తోనున్న "మధ్యమండపం" విజయనగరశిల్పుల కళాకౌశల్యానికి మచ్చుతునక. ఈ నాలుగు స్తంభాలు, ఒక్కొక్కటి మరో నాలుగు స్తంభాల సముదాయం – ఒక లావాటి స్తంభం మరియు దానికి బాహ్యంగా మరో మూడు సన్నటి స్తంభాలు – ఒకే రాతిలో చెక్కబడి ఉంటాయి. అత్యంత నునుపైన నల్లటి గ్రానైట్ వంటి రాతిపై అందమైన కళాకృతులు అత్యద్భుతంగా మలచ బడ్డాయి. ఈ మధ్యమంటపం లోనే, కళ్యాణోత్సవం జరిగేటప్పుడు ఉభయ నాంచారులతో కూడిన మలయప్పస్వామి వారిని వేంచేపు చేసేవారు.

కళ్యాణమంటపం లోని శిలాస్తంభాల మీదా, కుడ్యాల యందు అనేక ఆకృతులు హృద్యంగా చెక్కబడ్డాయి. వాటిలో ముఖ్యమైనవి – యోగముద్ర లోనున్న నరశింహస్వామి, హిరణ్యకశిపుణ్ణి సంహరిస్తున్న ఉగ్రనరశింహుడు, సింహవాహనంపై ఆసీనుడై ఉన్న నరశింహుడు, త్రివిక్రమావతారంలో ఉన్న విష్ణుమూర్తి, గరుడవాహనంపై విహరిస్తున్న శ్రీమహావిష్ణువు, ఆదిశేషునిపై శయనించిన శేషసాయి, పదహారు చేతులతో కరందమకుటం ధరించి శిరస్సు చుట్టూ అగ్నిజ్వాలలతో ప్రకాశిస్తున్న అత్యంత అరుదైన సుదర్శనుని ప్రతిమ – మున్నగునవి. ఇవే కాకుండా,

విజయనగర సామ్రాజ్య చిహ్నమైన "యాలి" అనబడే కాల్పనిక జంతువు, కామధేనువు, పుష్పాకృతులు, హనుమంతుడు, జాంబవంతుడు, రామాయణఘట్టాలు మొదలైనవెన్నో చెక్కబడి ఉన్నాయి.

ఇదివరకు నాణేలపరకామణి (నాణాల లెక్కింపుకేంద్రం) ఈ మంటపంలోనే ఉండేది. శ్రీవారికి చెందిన ప్రాచీన, నూతన ఉత్సవ వాహనాలను కూడా ఈ మంటపం లోనే భద్రపరిచేవారు. తరువాతి కాలంలో, కల్యాణోత్సవ వేడుకలు సంపంగి ప్రాకారంలోని "శ్రీవేంకటరమణస్వామి కళ్యాణమంటపం" లోనికి మార్చబడ్డాయి. అలాగే, వాహనాలను ఆలయం బయట నుండే వాహనమండపం లోనికి; నాణేలపరకామణిని తిరుపతి లోని తి.తి.దే. పరిపాలనాకార్యాలయ భవనానికి తరలించారు. తెలుగు పదకవితా పితామహుడు అన్నమాచార్యుల చే శ్రీనివాసునికి కళ్యాణోత్సవం చేయబడ్డ ఈ పవిత్ర కళ్యాణమంటపం ప్రస్తుతం చాలా వరకు ఖాళీగానే ఉంటుంది. కొన్ని ఉత్సవ సందర్భాల్లో మాత్రం అర్చకులు, ఆలయ అధికారులు పూజాద్రవ్యాలను శిరస్సులపై నుంచుకొని, స్వామివారిసన్నిధి లోనికి ఈ కళ్యాణమండపం నుండి బయలుదేరుతారు. శ్రీవారి దర్శనానంతరం ఈ మంటపంలో కూర్చుని కొద్దిగా విశ్రాంతి తీసుకుంటూ, ఉత్తరం వైపున ఉన్న ఆనందనిలయ గోపురాన్ని తనివితీరా దర్శించుకోవచ్చు.

నోట్లపరకామణి (నోట్ల లెక్కింపుకేంద్రం)

కళ్యాణమంటపానికి ఆనుకొని, ఆలయానికి పడమరదిక్కున ఉన్న విశాలమైన, పొడవాటి మంటపాన్ని ప్రస్తుతం "నోట్లపరకామణి" గా వ్యవహరిస్తారు. పూర్వం ఈ మంటపంలో కూడా కొన్ని వాహనాలను భద్రపరిచేవారు. మూలమూర్తికి పూతగా పూసే పునుగుతైలం కూడా ఇక్కడే తయారు చేయబడేది. ప్రసాదవితరణ సైతం ఇక్కడే జరిగేది. కాలాంతరంలో ఇవన్నీ వేర్వేరు ప్రదేశాలకు తరలించబడ్డాయి. ప్రస్తుతం శ్రీవారికి హుండీలో రొక్కరూపంలో, వస్తురూపంలో సమర్పింపబడే కానుకలను వేరు చేసి, దేశవిదేశాలకు చెందిన కరెన్సీనోట్లను లెక్కించే "నోట్లపరకామణి" గా ఈ మంటపాన్ని ఉపయోగిస్తున్నారు. ఈ మంటపం పగటిపూట నడుము పైభాగంలో ఏ ఆచ్ఛాదన లేకుండా నోట్లను వేరుచేస్తున్న శ్రీవారిసేవకులతోనూ, నోట్ల లెక్కింపు యంత్రాలతోనూ, నోట్ల కట్టలను బయటకు చేరవేస్తున్న బ్యాంకు సిబ్బంది తోనూ సందడిగా ఉంటుంది. నిబంధనల ప్రకారం నోట్ల లెక్కింపు విధుల్లో ఉన్న శ్రీవారిసేవకులు, బ్యాంకు సిబ్బంది, ఏ విధమైన ఆభరణాలను కానీ, చేతి గడియారాలను కానీ ధరించరాదు.

ప్రతినిత్యం 3–4 కోట్ల రూపాయలు, బ్రహ్మోత్సవాల్లో దానికి రెండింతల నగదు ఇక్కడ లెక్కించబడుతుంది. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని చూస్తుంటే శ్రీమహాలక్ష్మి "ధనలక్ష్మిరూపం" లో శ్రీవారి చెంతనే కొలువుతీరి ఉన్నట్లుగా, ముల్లోకాల యందలి సమస్తసంపదలు ఇక్కడే ప్రోగుపడ్డట్లుగా అనిపిస్తుంది. నోట్ల లెక్కింపు విధుల్లో ఉన్న సిబ్బంది 2–3 షిఫ్టుల్లో పని చేస్తారు. పరకామణిలో జరిగే కార్యక్రమాలన్నింటినీ సీసీటీవీల ద్వారా విజిలెన్స్ శాఖ వారు నిశితంగా పరిశీలిస్తూ ఉంటారు. స్వామివారి దర్శనానంతరం, విమానప్రదక్షిణ మార్గంలో వెళుతున్న భక్తులు ఒకరిద్దరిని పిలిచి, ఈ లెక్కింపు కార్యక్రమానికి సాక్షి సంతకాలు తీసుకునే సాంప్రదాయం ఉంది.

శ్రీవారి కృప ఉంటే, ఈసారి మనమే సాక్షులుగా ఎన్నుకోబడి ఆ వైభవాన్ని కన్నులారా తిలకించి, పునర్దర్శన భాగ్యాన్ని,

శ్రీవారి ప్రసాదాన్ని పొందే అవకాశం ప్రాప్తిస్తుంది.

చందనపు అర

నోట్లపరకామణికి ఉత్తరం దిక్కున, సంపంగి ప్రదక్షిణమార్గంలో వాయువ్యమూలకు, ఇనుపకడ్డీల వాకిళ్ళతో కనిపిస్తున్న చిన్నగదిని "చందనపు అర" గా పిలుస్తారు. ప్రతినిత్యం స్వామివారికి అవసరమయ్యే చందనం ఈ గదిలోనే తయారు చేయబడుతుంది. గంధం తీయడానికి అనువుగా వుండే ఎత్తైన సానరాళ్ళు ఏర్పాటు చేయబడి ఉంటాయి. పెద్ద తిరుగలిరాళ్ల లాగా ఉండే వీటిపై గంధం చెక్కలను వడివడిగా అరగదీస్తూ, చందన ద్రవ్యాన్ని తయారుచేసే దేవాలయ పరిచారకులను "చందనపాణి" గా వ్యవహరిస్తారు. చందనంతో పాటుగా, నీళ్ళతో తడిచిన మెత్తని పసుపు ముద్దలు కూడా ఇక్కడే తయారు చేయబడతాయి. ఈ గదిలో తయారైన చందనాన్ని, పసుపును శ్రీవారికి జరిగే అన్ని ఉత్సవాల్లో వినియోగిస్తారు.

ఆనందనిలయ విమానం

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని బంగారుమేడపై ప్రతిష్ఠితమైన "ఆనందనిలయ విమానం" లేదా "గోపురం" ప్రదక్షిణమార్గంలో ఏ మూలనుంచైనా, చాలా దగ్గరగా, చక్కగా దర్శనమిస్తుంది. సరిగ్గా దీని క్రిందనే ఉన్న గర్భాలయంలో మూలమూర్తి కొలువై వుంటారు. ఆనందనిలయం ఉపరితలభాగంలో ఉండటంవల్ల దీనిని "ఆనందనిలయ విమానం" అని కూడా పిలుస్తారు. పురాణకాలంలో దీన్ని వాహనంగా చేసుకుని శ్రీహరి వైకుంఠం నుండి భూలోకానికి వచ్చినట్లు, మొట్టమొదటగా, శ్రీమహావిష్ణువు ఆదేశం మేరకు గరుత్మంతుడు విష్ణుమూర్తితో సహా ఈ విమానాన్ని వైకుంఠం నుంచి తెచ్చి వేంకటాచలక్షేత్రంలో ప్రతిష్ఠించినట్లు పురాణాల్లో చెప్పబడింది. అయితే, అత్యుత్తమ భక్తులకు మాత్రమే దివ్యవిమాన దర్శనభాగ్యం కలుగుతుంది. మనలాంటి సామాన్యు లందరికీ, ఆ దివ్యవిమానం స్థానంలో, ఈ బంగారుగోపురం యొక్క భౌతిక స్వరూపమే గోచరిస్తుంది. ఈ గోపురాన్ని శ్రీనివాసుని ఆనతిపై తొండమాన్ చక్రవర్తి నిర్మించాడని చెబుతారు. దర్శనమాత్రం తోనే కోరిన కోర్కెలు సిద్ధించే ఈ గోపురాన్ని ఉద్దేశ్యించే అన్నమయ్య, తిరుమలను "బంగారు శిఖరాలు బహు బ్రహ్మమయము" అని వర్ణించాడు.

మూడంతస్తుల గోపురంలో, కింది రెండంతస్తులు దీర్ఘ చతురస్రాకారంలోను, మూడవ అంతస్తు వర్తులాకారం లోనూ నిర్మింపబడ్డాయి. పది అడుగుల ఎత్తైన మొదటిఅంతస్తులో లతలు, తీగలు, చిన్నచిన్న శిఖరాలు, మకర తోరణాలు చెక్కబడి ఉన్నాయి. పదకొండు అడుగుల ఎత్తున్న రెండవ అంతస్తులో మకరతోరణాలతో పాటుగా – విష్ణుమూర్తి, వరాహస్వామి, నరశింహస్వామి, జయవిజయులు, గరుడుడు, అనంతుడు, విష్వక్సేనుడు, సప్తఋషులు, ఆంజనేయుడు, విమాన వేంకటేశ్వరుడు – లాంటి 40 శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. పదహారు అడుగుల మూడవ అంతస్తులో – మహాపద్మం, నాలుగు మూలలలో సింహాలు, చిలుకలు, లతలు, హంసలు – చోటుచేసుకున్నాయి. అయితే, ఈ అద్భుతమైన ప్రతిమలన్నీ బంగారుతాపడంతో పూర్తిగా కప్పబడి ఉండటం వల్ల, ఎంతో శ్రద్ధగా, నిశితంగా పరిశీలిస్తే గానీ వీటి అందచందాలను ఆస్వాదించలేము. దర్శనానంతరం ఏ విధమైన ఆంక్షలూ లేకుండా ఈ

గోపురాన్ని తనివితీరా కాంచవచ్చు. ఈసారి తిరుమల యాత్రలో ఆనందనిలయ వీక్షణానికి తగినంత సమయం కేటాయించండి.

బయట నుండి లోనికి వచ్చే ఉత్సవాలు, లేదా బయటకు వెళ్ళే ఉత్సవాలు, ఆనందనిలయ విమాన ప్రదక్షిణ చేసిన తర్వాతనే లోనికి రావడం గాని, బయటకు వెళ్ళడం గానీ జరుగుతుంది. తిరుమలకొండ మీద ఈ ఒక్క విమానమే ఉండాలనే కట్టడి ఉంది. సప్తగిరులపై మరే మానవనిర్మిత విమానం కానీ, హెలికాప్టర్ గాని అనుమతించ బడదు. దేశాధినేతలైనా సరే, తిరుపతి నుంచి తిరుమలకు మెట్లద్వారా లేదా రోడ్డు మార్గంలో రావాల్సిందే!

ఆధారాలు లభించినంత వరకు, మొట్టమొదటగా 839వ సంవత్సరంలో పల్లవరాజైన విజయ దంతి విక్రమవవర్మ, తరువాత 1262 లో జాతవర్మ సుందరపాండ్యుడు, 1518 లో శ్రీకృష్ణదేవరాయలు, 1630 లో కంచి వాస్తవ్యుడైన 'కోటికన్యాదానం తాతాచార్యులు' అనబడే వైష్ణవభక్తుడు, 1908లో బావాజీమఠం వారు, 1958 లో తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఈ గోపుర బంగారుకవచాన్ని తిరిగి నిర్మించారు. 1359వ సంవత్సరంలో సాళువ మంగిదేవ మహారాజు పాత బంగారుకలశం స్థానంలో కొత్తదానిని ప్రతిష్ఠించారు.

1958వ సంవత్సరంలో జరిగిన ఆనందనిలయవిమాన మహాసంప్రోక్షణ కార్యక్రమంలో, విమానం మీదున్నటువంటి పాతరేకులపై ఉన్న బంగారాన్ని, హుండీ ద్వారా భక్తులు సమర్పించుకున్న బంగారాన్ని, రసాయన ప్రక్రియ ద్వారా శుద్ధిచేసే కార్యక్రమాన్ని మహారాష్ట్రకు చెందిన శ్రీరామ్ నాథ్ షిండే గారు చేపట్టి, మేలిమిబంగారాన్ని వెలికి తీశారు. తమిళనాడుకు చెందిన చొక్కలింగాచారి అనే స్థపతి, విమానానికి కావలసిన రాగిరేకులను తయారు చేశారు. ఈ రేకులకు తమిళనాడులోని మరో భక్తుడు రాజగోపాలస్వామి రాజు గారు బంగారు తాపడం చేశారు. దీని తయారీకి పన్నెండు టన్నుల రాగి, పన్నెండువేల తులాల బంగారం వినియోగించబడింది. మొత్తం పద్దెనిమిది లక్షల రూపాయలు ఖర్చు కాగా, అందులో పాతబంగారం విలువ ఎనిమిది లక్షలు. మిగిలిన బంగారం అంతా హుండీ ద్వారా సేకరించబడింది. మొత్తం ఐదు సంవత్సరాలు పట్టిన ఈ కార్యక్రమంలో, మూడు సంవత్సరాలు రాగిరేకుల తయారీకి, మరో రెండు సంవత్సరాలు బంగారు తాపడానికి పట్టింది.

విమాన వేంకటేశ్వరుడు

ఆనందనిలయ గోపురం రెండవ అంతస్తులో అత్యంత ముఖ్య మైనటువంటి, మనకు చిరపరిచితమైన, వెండి మకరతోరణంతో ఉన్న శ్రీవెంకటేశ్వరుని ప్రతిమను ఆనందనిలయ విమానం నందున్న కారణంగా "విమాన వేంకటేశ్వరస్వామి" అని పిలుస్తారు. తొండమాన్ చక్రవర్తి దీనిని ప్రతిష్ఠించినట్లు చెబుతారు. ముమ్మూర్తులా మూలవిరాట్ ని పోలియున్న ఈ విగ్రహం, ఆనందంనిలయ గోపురానికి వాయువ్యదిక్కున దర్శనమిస్తుంది. పూర్వం ముందుగా విమానవేంకటేశ్వరుని దర్శించుకున్న తరువాతనే మూలవిరాట్ దర్శనం కావించుకునే వారట. కానీ ఇప్పుడా సాంప్రదాయం మారిపోయింది. క్యూ నిబంధనల కారణంగా, మొదట మూలమూర్తిని దర్శించుకున్న తరువాతే విమానవేంకటేశ్వరుని దర్శించు కోగలం. ఏ కారణం చేతనైనా గర్భాలయంలో గల మూలమూర్తిని

దర్శించుకోలేని భక్తులు, విమానవేంకటేశ్వరుణ్ణి దర్శించుకుంటే చాలుననే సాంప్రదాయానికి పదహారవ శతాబ్దానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు గురువైన వ్యాసతీర్థులవారు ఆద్యులు.

విమానవేంకటేశ్వరునికి ఇరువైపులా గరుత్మంతుడు, హనుమంతుడు, బాలకృష్ణుడు దర్శనమిస్తారు. ప్రతి సంవత్సరం మూడురోజుల పాటు జరిగే పవిత్రోత్సవాల్లో, అర్చకులు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నిచ్చెన నెక్కి స్వామివారికి పవిత్రమాలలు సమర్పిస్తారు. గర్భాలయంలో మూలవిరాట్టుకు జరుపబడే నివేదన సమయంలో, లోపలనుండే విమాన వేంకటేశ్వరునికి కూడా నివేదన సమర్పింప బడుతుంది.

వేదపారాయణం

స్థలాభావం కారణంగా గర్భాలయం నందున్న స్వామిసన్నిధిలో వేదపారాయణం చేయడం సాధ్యం కాదు కనుక, ఆలయానికి ఉత్తరదిక్కున ఉన్న ఎత్తైన అరుగులపై, విమానవేంకటేశ్వరునికి అభిముఖంగా కూర్చొని పండితులు వేదపారాయణం జరుపుతారు. తిరుమల ఆలయంలో వేదపఠనానికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. దీనికి సంబంధించిన నియమ-నిబంధనలు విజయనగర సామ్రాజ్యానికి చెందిన రెండవ దేవరాయలు కాలంలో ప్రామాణీకరింప బడ్డాయి. వేదపారాయణ సక్రమంగా, నిరాటంకంగా జరిగేందుకు గాను 24 మంది వేదపండితులు నియమింపబడ్డారు. శ్రీనివాసపురం అనే గ్రామ వార్షిక ఆదాయంలో సగభాగం ఈ వేదపండితుల ఉదరపోషణ నిమిత్తం కేటాయించే ఏర్పాట్లు చేశారు. వీరిలో, ప్రతిరోజు ఇద్దరు చొప్పున, వంతులవారీగా వేదం చదివే ఏర్పాటు జరిగింది. ఋగ్వేదము, సామవేదము, అథర్వణవేదము, కృష్ణయజుర్వేదము, శుక్లయజుర్వేదము పఠింప బడుతాయి.

ఆ కాలం నుండి నేటి వరకు ఈ వేదపారాయణ నిరాటంకంగా జరుగుతోంది.

సబేరా (సభ అర)

"సభ" అనగా కొలువు లేదా ఉత్సవం. "అర" అనగా గది. కాలాంతరంలో "సబేరా" గా మారిన ఈ "సభ అర", వేదపారాయణం జరిగే ప్రదేశానికి ఆనుకుని విమానప్రదక్షిణ మార్గం ఉత్తరభాగంలో ఉన్నది. ఆయా ఉత్సవాల్లో ఉపయోగింపబడే వివిధ సాంప్రదాయిక పూజాసామాగ్రి అయిన – ఛత్రచామరాలు, వెండి దివిటీలు, బంగారు గొడుగులు, ఏకాంతసేవలో ఉపయోగించే పట్టుపరుపు, బంగారు నవారుమంచం, పరిమళద్రవ్యాలు – మొదలైనవన్నీ ఈ గదిలో భద్రపరుస్తారు. శ్రీవారి శేషవస్త్రం లేదా మేల్ ఛాట్ వస్త్రాన్ని ఈ గదిలో ఉంచి, ప్రముఖులు శ్రీవారి దర్శనానికి వచ్చినప్పుడు వారి కళ్ళకు అద్దుతారు.

సంకీర్తనా భండారం

విమానప్రదక్షిణ మార్గంలో, సబేరా గదికి ఎదురుగా, దక్షిణాభిముఖంగా శిల్ప శోభితమై, పెద్ద పెద్ద చెక్కడపు రాళ్లతో ఉన్న బీరువా లాంటి అరను "సంకీర్తనాభండారం" అని పిలుస్తారు. దీన్నే "తాళ్ళపాక అర" అని కూడా అంటారు. దీని పైభాగంలో "అన్నమాచార్యుల భాండాగారం" అనే బోర్డు ఉంటుంది. ఈ భండారానికి చెక్కతలుపులు బిగించబడి

ఉన్న చిన్న ద్వారం ఉంటుంది. ద్వారానికి ఇరువైపులా తమ ఎడమ, కుడి చేతులతో అర ముఖద్వారాన్ని సూచిస్తూ, భుజాల మీదనున్న తుంబురలను మీటుతూ రెండు శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. వాటిలో తూర్పుదిక్కున ఉన్నది అన్నమయ్య విగ్రహం అయితే, పడమటి దిక్కున ఉన్నది వారి కుమారుడైన పెద్ద తిరుమలాచార్యుని ప్రతిమ. తాళ్ళపాక వంశీయులు తాము గానం చేసిన కీర్తనలన్నీ, వారే స్వయంగా రాగిరేకులపై చెక్కించి, ఈ అరలో భద్రపరచి, భావితరాలకు అందజేశారు. తాళ్ళపాక అన్నమాచార్యులు తన ఆరాధ్యదైవమైన స్వామివారికి తన కృతులను అర్పిస్తూ ఈ విధంగా గానం చేశాడు:

"దాచుకో నీ పాదాలకుఁదగ నే చేసిన పూజలివి
పూచి నీ కీరితి రూప పుష్పము లివి యయ్యా
ఒక్క సంకీర్తన చాలు వొద్దికై మమ్ము రక్షించగ
తక్కినవి నీ భండారాన దాచివుండనీ"

సన్నిధి భాష్యకారులు

సంకీర్తనాభండారానికి ప్రక్కనే ఉన్న "భాష్యకారుల సన్నిధి" లో, భగవద్రామానుజుల వారు వ్యాఖ్యాన ముద్రయందు, పద్మాసనంలో కొలువై ఉంటారు. ఆయన వ్రాసిన "శ్రీభాష్యం" అనే ఉద్గ్రంథాన్ని స్వయంగా వ్యాఖ్యానిస్తూ, శ్రీవారిసన్నిధి యందు ఉండటం వల్ల "సన్నిధి భాష్యకారులు" గా ప్రసిద్ధి కెక్కారు. ఈ విగ్రహాన్ని మూలవిరాట్టుగా చెప్పుకోవచ్చు. దీంతోపాటుగా, రామానుజులవారు తన శిష్యుడైన అనంతాళ్వార్ కు బహూకరించిన ఒకటిన్నర అడుగుల ఎత్తయిన తన (రామానుజుల వారి) శిలావిగ్రహాన్ని కూడా ఈ సన్నిధిలో దర్శించుకోవచ్చు. ఈ సన్నిధిలో గల, రామానుజుల వారి పాదుకలు ముద్రాంకితమై ఉన్న శఠారిపై అనంతాళ్వార్ పేరు చెక్కబడి ఉంటుంది. రామానుజులవారు పరమపదించిన తర్వాత, 1200 సంవత్సరం ప్రాంతంలో, ఈ విగ్రహప్రతిష్ఠ జరిగినట్లు తెలుస్తోంది. ఈ సన్నిధిలో నిత్యనివేదన, వైశాఖమాసంలో శ్రీరామానుజుల జయంతి సందర్భంగా పదిరోజుల పాటు ఆరాధనలు జరుగుతాయి.

యోగా నరసింహస్వామి సన్నిధి

విమానప్రదక్షిణ మార్గంలో, పశ్చిమాభిముఖంగా, భాష్యకారులు సన్నిధికి సమీపాన ముఖమండపం, అంతరాళం, గర్భాలయం అనే మూడు భాగాలు కలిగిన "యోగా నరశింహ స్వామి" ఆలయంలో, యోగముద్రలో ఉన్న, మూడు అడుగుల ఎత్తైన నరశింహస్వామి విగ్రహం కొలువై ఉంటుంది. తిరుమలక్షేత్రంలో ఎక్కడో పడిఉన్న యోగానరశింహుని ప్రతిమను భగవద్రామానుజుల వారు తెచ్చి ఇక్కడ ప్రతిష్ఠించినట్లు, తరువాత, 14వ శతాబ్దం ప్రథమార్ధంనందు, ఆ ప్రదేశంలోనే ఈ ఆలయం నిర్మించబడినట్లు చెబుతారు. మరో కథనం ప్రకారం, అదే సమయంలో షోలంగిపురం మరియు అహోబిలం లోని దేవతామూర్తులను మహమ్మదీయుల దండయాత్రల నుంచి రక్షించేనిమిత్తం వాటిని అక్కడి నుంచి తరలించి, తిరుమలక్షేత్రంలో ప్రతిష్ఠించడానికి ఈ ఆలయాన్ని నిర్మించారు. యోగముద్రలో ఉన్న స్వామివారి మోకాళ్ళు రెండింటినీ కలుపుతూ ఒకవస్త్రం కట్టిన రీతిలో నారశింహుని శిల్పం

మలచబడి ఉంటుంది. రెండు మోకాళ్ళపై రెండు అరచేతిలు ఆన్చి ఉంటాయి. వైశాఖమాసంలో వచ్చే నృసింహజయంతి నాడు ఈ ఆలయంలో ఘనంగా పూజలు జరుగుతాయి. ప్రతి శనివారం అభిషేకం జరుగుతుంది.

శంకుస్థాపన స్తంభం

యోగా నరసింహస్వామి సన్నిధికి ఒక ప్రక్కగా, దిగువ భాగాన నాలుగు దిక్కుల్లో ఆంజనేయస్వామి శిల్పాలతో అలరారుతున్న స్తంభాన్ని "శంకుస్థాపన స్తంభం"గా వ్యవహరిస్తారు. స్వామివారి ఆలయ నిర్మాణానికి తొండమాన్ చక్రవర్తి మొట్టమొదటగా వేసిన పునాది స్తంభం ఇదేనని చెబుతారు. స్వామివారిని స్మరించుకుంటూ, దీనికి ప్రదక్షిణం చేస్తే శీఘ్రంగా స్వగృహం సమకూరుతుందని భక్తుల నమ్మకం.

పూల అర

శంకుస్థాపన స్తంభం ప్రక్కనే, గాజు తలుపులు కలిగి, శీతలీకరించబడి ఉన్న గదిని "పూల అర" గా పిలుస్తారు. ఇందులో స్వామివారికి సమర్పించే టటువంటి పూలమాలలు, పండ్లు, తులసిదళాలు భద్రపరుస్తారు. సంపంగిప్రదక్షిణంలో నుండే మరో పూల అరను "యామునోత్తరై" అంటారు.

పరిమళపు అర

యోగా నరశింహుని ఆలయప్రదక్షిణ మార్గంలో, దక్షిణాభిముఖంగా ఉన్న రాతిశిల ఉండే ప్రదేశాన్ని "పరిమళపు అర" గా పిలుస్తారు. ప్రతి గురువారం నాడు, మరుసటి రోజు శ్రీవారికి జరుపబడే శుక్రవార అభిషేక సందర్భంగా, శ్రీవారి నుదుటన అలంకరించే ఊర్ధ్వపుండ్రానికి అవసరమైనటువంటి పచ్చకర్పూరాన్ని ఈ సానరాతిపై నూరుకునే వారు. అంతేకాకుండా, అభిషేకానికి కావాలసిన పునుగు, జవ్వాది, కస్తూరి, కుంకుమపువ్వు వంటి సుగంధద్రవ్యాలను కూడా ఈ అరలోనే సిద్ధం చేసుకునేవారు. అయితే, ప్రస్తుతం భక్తులతాకిడి దృష్ట్యా ఈ ద్రవ్యాలను వేరే ప్రదేశంలో తయారు చేసుకొని, వాటిని సిద్ధం చేసిన గిన్నెలను ఈ రాతి పైనుంచి, ఇక్కడి నుంచి ఆలయ అంతర్భాగం లోనికి లాంఛన పూర్వకంగా తీసుకు వెళతున్నారు. తమ మనసులో ఉన్న కోరికలను చూపుడువేలు ద్వారా ఈ రాతిశిలపై లిఖిస్తే వాటిని స్వామివారు సత్వరమే తీరుస్తారని భక్తుల నమ్మకం.

శ్రీవారి హుండీ

1831వ సంవత్సరంలో, ఆనాటి చిత్తూరు జిల్లా కలెక్టర్, "ఏషియాటిక్ జర్నల్" అనే పత్రికలో – బంగారువాకిలి ముందున్న "స్నపనమండపం" లో, నాలుగు స్తంభాల మధ్యన, యాత్రికులు ముడుపులు, కానుకలు సమర్పించు కోవడానికి వీలుగా ఓ పెద్దగంగాళం ఉండేదని వ్రాశాడు. శ్రీవారి దర్శనం నిమిత్తం, ఈ గంగాళానికి ఒక ప్రక్కగా వెళ్లి, దర్శనానంతరం ఈ గంగాళానికి మరో ప్రక్కనుంచి తిరిగి వచ్చేవారు. ప్రస్తుతం ఈ హుండీ మహామణిమంటపానికి ఉత్తరపార్శ్వంలో, నాలుగుస్తంభాల నడుమ ఏర్పాటు చేయబడి ఉంది. స్వామివారి దర్శనానంతరం విమానప్రదక్షిణ చేసుకున్న భక్తులు తమ మొక్కుబడులను, కానుకలను, నిలువుదోపిళ్ళను ఈ హుండీలో సమర్పించుకుంటారు.

బంగారునగలు, కరెన్సీనోట్లు, వెండివస్తువులు, సెల్ ఫోన్లు, అలంకరణసామగ్రి, పుస్తకాలు, మనీపర్సులు, కళాఖండాలు, లాటరీ టిక్కట్లు, బొమ్మలు, ఆటవస్తువులు, పూజలో వినియోగించే వస్తువులు – ఒకటేమిటి, ఎవరి అభిరుచి, వృత్తి, ప్రవృత్తికి తగ్గట్లుగా వారు శ్రీవారికి కానుకలు సమర్పిస్తుంటారు.

నిటారుగా, పెద్దసంచి ఆకృతిలో, శ్రీవారి శంఖు, చక్ర తిరు నామాలు చిత్రించి ఉన్న కాన్వాస్ గుడ్డలో పెద్ద కంచుగంగాళాన్ని దించి, ఆ వస్త్రాన్ని తాళ్లతో కట్టి వ్రేలాడ దీస్తారు. భక్తులు వేసే కానుకలు భద్రంగా, నేరుగా చేరుకోవడానికి ఏర్పాటు చేయబడిన ఈ గంగాళాన్ని "కొప్పెర" అని కూడా వ్యవహరిస్తారు. ఈ హుండీ చుట్టూ ఉన్న వస్త్రంపై దేవస్థానం వారి సీలు వేసి ఉంటుంది. హుండీని తెరిచేటప్పుడు, ఇద్దరు భక్తుల సమక్షంలో సీళ్లు తనిఖీ చేస్తారు. జగద్గురు శ్రీఆదిశంకరాచార్యుల వారు శ్రీచక్రం ప్రతిష్ఠించినందు వల్లనే అపరిమితమైన సంపద ఈ హుండీలో సమకూరుతోందని పెద్దలు చెబుతారు. శ్రీస్వామివారి వక్షస్థలంలో లక్ష్మీదేవి కొలువై వుండటం కూడా అంతులేని సంపద ప్రోగు పడడానికి మరో కారణం! ఆధారాలు లభ్యం అయినంత వరకూ, 42 ఏళ్ల పాటు ఈ హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఈస్టిండియా కంపెనీవారు కైవసం చేసుకున్నారు. తదనంతరం ఇది మహంతులకు అప్పగించబడింది. 1933వ సంవత్సరంలో, ఆలయం తి.తి.దే. ఆధ్వర్యం లోకి వచ్చేటంత వరకు మహంతులదే పెత్తనం. అప్పుడు హుండీ ద్వారా వచ్చే సంవత్సర ఆదాయం సుమారు రెండు లక్షలు. ఇప్పుడది ఇబ్బడిముబ్బడిగా పెరుగుతూ, సుమారుగా 1200 కోట్లకు చేరుకుంది. ప్రస్తుతం ఈనాడు వచ్చే దినసరి ఆదాయం ఆనాటి వార్షికాదాయానికి సుమారుగా 200 రెట్లు అన్నమాట!

శ్రీవారిపై భక్తులవిశ్వాసం ఏ స్థాయిలో పెరుగుతోందో తెలుసు కోవడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది?

ఇప్పటివరకు రికార్డ్ అయిన అత్యధిక దినసరి ఆదాయం – 2018 సం. జూలై 26వ తేదీ నాటి, ఆరు కోట్ల ఇరవై ఎనిమిది లక్షలు!

ఈ హుండీద్వారా వచ్చిన ఆదాయంలో చాలా భాగాన్ని దేవాలయాభివృద్ధికే కాకుండా, వివిధసేవాకార్యక్రమాలకు, ధార్మిక, శిక్షణ, వైద్య సంస్థల నిర్వహణకు కూడా వినియోగించ బడుతుంది.

బంగారు వరలక్ష్మి

శ్రీవారిహుండీలో కానుకలు సమర్పించి బయటకు వచ్చిన వెంటనే, ఎడమవైపున్న ప్రాకారానికి పైభాగంలో ఒక నిలువెత్తు బంగారువరలక్ష్మి ప్రతిమ అమర్చబడి ఉంటుంది. సరిగ్గా ఈ ప్రతిమకు ఎదురుగా, ఈ మధ్య కాలంలో మరో హుండీ ఏర్పాటు చేయబడింది.

ఈ అమ్మవారు స్వామివారికి ఈశాన్యమూలలో కొలువై, కనకవర్షాన్ని కురిపిస్తూ, భక్తులను అనుగ్రహిస్తుంటారు. స్వామివారికి భక్తిపూర్వకంగా తృణమో, పణమో సమర్పించిన భక్తులకు, ఈ వరలక్ష్మి విశేషంగా సంపదలు ప్రసాదిస్తుందని భక్తుల నమ్మకం. భక్తుడు ఎంత విలువైన కానుక ఇచ్చాడో ముఖ్యం కాదని, "గంగగోవు పాలు గరిటెడైనను చాలు" అన్నట్లు అచంచల భక్తివిశ్వాసాలతో, నీతి–నిజాయితీలతో ఆర్జించిన సంపదలో ఎంతో

కొంతభాగాన్ని తన శక్తికి తగ్గట్లుగా కానుకల రూపేణా సమర్పించుకుంటే స్వామివారు కృపావృష్టి కురిపిస్తారని ఈ అమ్మవారు చెబుతుంది.

కటాహతీర్థం (తొట్టి తీర్థం)

విమానప్రదక్షిణ మార్గంలో, అన్నమయ్య భండారానికి ఎదురుగా, ఎడమ ప్రక్కన నీటితొట్టివలె ఉన్న రాతిపాత్రను "కటాహతీర్థం" లేదా "తొట్టితీర్థం"గా అభివర్ణించేవారు. అంతకు ముందు ఈ తీర్థం ముక్కోటి ప్రదక్షిణమార్గంలో ఉత్తరదిక్కున ఉండేది. శ్రీస్వామివారి పాదాలనుండి జాలువారే పవిత్ర అభిషేకజలం ఇది! గర్భాలయపు ఉత్తరం వైపున ఉన్న ప్రాకారానికి రంధ్రం చేసి, "గోముఖం" ద్వారా స్వామివారి అభిషేకజలం వచ్చే ఏర్పాటు చేయబడింది. అయితే, దాదాపు ఏడడుగులకు పైగా మందం ఉన్న గర్భాలయపు గోడ యందలి రంధ్రాన్ని శుభ్రపరిచే ఏర్పాటు ఏర్పాటు ఆకాలంలో లేకపోవడంతో ఆ రంధ్రం మూసివేయబడి ఉంటుందని చరిత్రకారుల అభిప్రాయం.

స్వామిపుష్కరిణి స్నానం, శ్రీనివాసుని దర్శనం, కటాహతీర్థ పానం – ఈ మూడు త్రైలోక్య దుర్లభాలని పురాణాలలో ప్రవచించబడింది. అంటే ఈ మూడింటి సంయోగం వేంకటాచలక్షేత్రంలో తప్ప, ముల్లోకాలలో వేరెక్కడా కానరాదన్నమాట. ఈ తీర్థాన్ని స్వీకరించేటప్పుడు కేశవనామాలను లేదా అష్టాక్షరీమంత్రాన్ని ఉచ్చరించేవారు. స్పర్శాదోషం లేశమాత్రం లేని ఈ కటాహతీర్థాన్ని ఎవరైనా, ఎప్పుడైనా సేవించవచ్చు. ఈ తీర్థసేవనం బ్రహ్మహత్యాది పాపాలను సైతం తొలగించి, భయంకర వ్యాధులను కూడా రూపుమాపుతుందని స్కాందపురాణం తెలుపుతుంది. పురాణేతిహాసాల ననుసరించి, పూర్వం తుంగభద్రానదీతీరంలో కేశవుడనే బ్రాహ్మణయువకుడు విధివశాన, వేశ్యాలోలుడై, ధనాశతో ఒక విప్రుణ్ణి హత్య గావించడంతో అతనికి బ్రహ్మహత్యాపాపం చుట్టుకుంది. కేశవుడు భయంతో తండ్రి కాళ్ళపై పడి క్షమించమని వేడుకొనగా, ఆ సమయానికి విచ్చేసిన భరద్వాజమహర్షి, వేంకటాచలానికి ఏతెంచి, కటాహతీర్థం సేవించమని సూచించాడు. ముని ఆనతి ప్రకారం తిరుమలక్షేత్రాన్ని సందర్శించిన కేశవుడు స్వామిపుష్కరిణిలో స్నానమాచరించి, కటాహతీర్థాన్ని సేవించి బ్రహ్మహత్యాదోష విముక్తుడయ్యాడు.

విష్వక్సేనుడు

శ్రీవారిహుండీకి ప్రదక్షిణచేసి, వెలుపలికి రాగానే ఎడమప్రక్కగా, అంటే గర్భగుడికి ఈశాన్యదిశలో, దక్షిణాభిముఖంగా విష్వక్సేనమందిరం కొలువై ఉంది. నారాయణాద్రిపై ఎన్నో సంవత్సరాలు కఠోరతపస్సు చేసి, శ్రీమహావిష్ణువును మెప్పించి, వైకుంఠంలోని సేనలన్నింటికీ ఆధిపత్యం పొందిన విష్వక్సేనుడు, ప్రతిఉత్సవానికి విఘ్ననాయకునిగా పూజింపబడుతాడు. కైలాసంలో గణేశుడు ఏ విధులు నిర్వహిస్తాడో, అవే విధులను వైకుంఠంలో విష్వక్సేనుడు నిర్వర్తిస్తాడు. బ్రహ్మోత్సవాల ముందురోజున మాడవీధుల్లో తిరిగి ఉత్సవ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించే విష్వక్సేనుడు – ఆణివార ఆస్థానం, ఉగాది ఆస్థానం, దీపావళి ఆస్థానం – వంటి ఉత్సవాల్లో కూడా ప్రముఖమైన పాత్ర పోషిస్తాడు. ముక్కోటిప్రదక్షిణ మార్గంలో కొలువై ఉండటంచేత, వైకుంఠఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో మాత్రమే "విష్వక్సేనుణ్ణి" దర్శించుకోగలం. సాధారణ దినాల్లో, హుండీ ప్రక్కగా "విష్వక్సేనుడు" అని ఉండే బోర్డును మాత్రమే

చూడగలం.

యస్య ద్విరద వక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతమ్
విఘ్నం నిఘ్నంతి సతతం విష్వక్సేనం! తమాశ్రయే!!

ముక్కోటిప్రదక్షిణం

శ్రీవారి దర్శనానంతరం, మహామణి మంటపానికి దక్షిణదిక్కున ఉన్న నిష్క్రమణమార్గం నుంచి వెలుపలికి వచ్చి, వెనువెంటనే, విమానప్రదక్షిణ మార్గంలో కుడిప్రక్కకు తిరిగి చూస్తే, ఎల్లప్పుడూ మూసి ఉండే ముక్కోటిప్రదక్షిణ మార్గం లేదా వైకుంఠప్రదక్షిణ మార్గం కనిపిస్తుంది. దర్శనానంతరం, మూసిఉన్న ఈ ప్రవేశమార్గం ఎదురుగుండా సాష్టాంగనమస్కారం చేస్తున్న భక్తగణాన్ని కాంచవచ్చు.

విమానప్రదక్షిణ మార్గంలో దక్షిణదిక్కున, గర్భాలయానికి ఆనుకొని ఉన్న ప్రాకారానికి గల ఈ చిన్న ద్వారం గుండా ఈ ప్రదక్షిణమార్గం లోనికి ప్రవేశించి, గర్భాలయాన్ని చుట్టుకుని, హుండీకి ప్రక్కన గల నిష్క్రమణ మార్గం ద్వారా బయటకు రావాలి. స్వామివారి గర్భాలయ ప్రాకారానికి మరియు విమానప్రదక్షిణం లోని లోపలి ప్రాకారానికి మధ్యన ఉన్న మార్గమే ఈ ప్రదక్షిణమార్గం. పేరుకు ప్రదక్షిణాపథం అయినప్పటికీ, గర్భాలయానికి దక్షిణ–పశ్చిమ–ఉత్తర దిక్కుల లోనే మనం సంచరించగలం. మూడు దిక్కులలోనూ సమానమైన వెడల్పు లేకుండా, ఉత్తరదిక్కున ఉన్న ప్రదక్షిణమార్గం మిగతా రెండు దిక్కులతో పోల్చితే దాదాపు రెండింత లుంటుంది. ఇంతకుముందు మనం చెప్పుకున్న "రాములవారిమేడ" అనే మంటపాన్ని తర్వాతికాలంలో నిర్మించడం వల్ల, వైకుంఠప్రదక్షిణ మార్గం తూర్పు దిక్కున మూసివేయబడింది.

ఈ ప్రదక్షిణమార్గం శ్రీవారికి అత్యంత సమీపంగా, గర్భాలయానికి ఆనుకొని ఉండే ప్రదక్షిణమార్గం! ప్రతి ఏడాది ధనుర్మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి–ద్వాదశి దినాలలో మాత్రమే ఈ ప్రదక్షిణమార్గం తెరిచి ఉంటుంది. అంటే దశమి నాటి ఉదయం సుప్రభాతసేవ నుండి, ద్వాదశి నాటి అర్ధరాత్రి ఏకాంతసేవ వరకు మాత్రమే తెరచి ఉండి, మిగిలిన సమయాల్లో మూసి ఉంచ బడుతుంది. అత్యంత అరుదుగా లభించే ముక్కోటిప్రదక్షిణ భాగ్యం జన్మజన్మల సుకృతం అని, శ్రీవారి సంపూర్ణకటాక్షం తోనే అది సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం.

శ్రీ వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీ తటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

ఇక్కడితో "బ్రహ్మాండనాయకుని బంగారుమేడ" వైభవాన్ని వర్ణించటం పూర్తయింది.

శ్రీవారి ఆనందనిలయాన కొలువుండే "విమానప్రదక్షిణమార్గ" విశేషాలను భక్తితో చదివిన భక్తులందరికీ ఆ స్వామివారి కటాక్షం సంపూర్ణంగా సిద్ధించాలని కోరుకుంటున్నాం!

----------: : ----------

తాళ్ళపాక అన్నమాచార్యుడు

శ్రీవారి భక్తుల్లో అగ్రగణ్యుడైన తాళ్ళపాక అన్నమాచార్యులు దాదాపుగా ముప్పైరెండు వేల సంకీర్తనలు రచించి శ్రీవారి ప్రాభావం తెలుగు, తమిళ, కన్నడ దేశాల్లో వ్రేళ్ళూను కోవటానికి ఎంతగానో పాటుపడ్డాడు. ఆ పదకవితాపితామహుని గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే.

అన్నమయ్య పూర్వీకులు

వందలకొద్ది మైళ్ళ పొడవునా వ్యాపించి ఉన్న శేషాచలశ్రేణుల పరిసరాల్లో, నేటి కడపజిల్లా, రాజంపేట పట్టణ పరిసర ప్రాంతంలో "తాళ్ళపాక" అనబడే సస్యశ్యామలమైన గ్రామం ఉంది. ఆ ఊరి ఆరాధ్యదైవమైన, జనమేజయ మహారాజుచే ప్రతిష్ఠింప బడ్డ, "తాళ్ళపాక చెన్నకేశవు"ని ఆరాధిస్తూ, విద్యాపారంగతుడైన "విఠలయ్య" అనే నందవరీక శాఖకు చెందిన సద్బ్రాహ్మణుడు ఆ గ్రామంలో నివసించేవాడు. వారు ఋగ్వేదశాఖకు చెందిన భరద్వాజస గోత్రీకులు. అతని ఏకైక పుత్రుడు నారాయణయ్యను విద్యాబుద్ధుల కోసం ఊటుకూరు అనే గ్రామంలో ఒక గురువు గారి వద్ద చేర్పించాడు. పుట్టుకతో మందబుద్ధి అయిన నారాయణయ్య, గురువుగారు విధించే శిక్షల వల్ల చదువుసంధ్యల మీద విరక్తి కలిగి, ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో ఊరి పొలిమేరలో ఉన్న పాముపుట్టలో చెయ్యి పెట్టాడు. ఇంతలో, ఆ గ్రామదేవత అయిన "చింతాలమ్మ తల్లి" ప్రత్యక్షమై చిన్నతనంలోనే జీవితం మీద విరక్తి తగదని, చెన్నకేశవస్వామిని ఆరాధిస్తే సర్వవిద్యలు సమకూరుతాయని, ఉత్తరోత్తరకాలంలో, శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహం వల్ల ఒక పరమభక్తుడు మనుమనిగా జన్మించి వారి వంశాన్ని ఉద్ధరిస్తాడని భవిష్యవాణి పలికింది. కాలాంతరాన, నారాయణయ్యకు "నారాయణసూరి" అనే కుమారుడు కలిగాడు. యుక్తవయస్కు డయ్యాక అతనికి "లక్కమాంబ" అనే యువతితో వివాహమైంది.

అన్నమయ్య జననం

చాలా కాలం వరకూ సంతానం లేకపోవడం చేత, పసుపుబట్టలతో, సంతానార్థులై, నారాయణసూరి–లక్కమాంబ దంపతులు తిరుమలను చేరుకుని, ఆలయ సాంప్రదాయాన్న నుసరించి స్వామిపుష్కరిణిలో స్నానమాడి, ఆదివరాహుణ్ణి దర్శించుకుని, ఆలయంలో ప్రవేశించి శ్రీనివాసుని సేవించుకున్నారు. వారి మనోరథాన్ని తెలుసుకున్న సర్వాంతర్యామి ఆ దంపతులకు స్వప్నంలో దర్శనమిచ్చి, తన ఆయుధమైన "నందకఖడ్గాన్ని" వారికి ప్రసాదించాడు. సఫల మనోరథులైన దంపతు లిరువురూ ఆశ్చర్యానందాలతో తాళ్ళపాక తిరిగి చేరుకున్నారు. నవమాసాలు నిండిన తర్వాత వైశాఖ శుద్ధపౌర్ణమి, విశాఖానక్షత్రంలో, 1408వ సం. సంవత్సరం, మే 9వ తేదీ నాడు, నవగ్రహాలు ఉచ్ఛస్థితిలో నుండగా, స్వామివారి నందకఖడ్గ అంశతో, లక్కమాంబ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిదండ్రులు ఆ పిల్లవానికి "అన్నమయ్య" అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచసాగారు.

అన్నమయ్య బాల్యం

శ్రీవేంకటేశ్వరుని వరప్రసాదంతో జన్మించిన అన్నమయ్యను చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. బాల్యం నుంచి అన్నమయ్యకు వేంకటేశ్వరుని కథలు వినడం, పాటలు పాడటం నిత్యకృత్యా లైపోయాయి. పువ్వు పుట్టగానే పరిమళించినట్టు, ముక్కుపచ్చలారక ముందునుంచే అతని కోతికొమ్మచ్చులు, ఆటపాటలు, గుజ్జనగూళ్ళూ అన్ని స్వామివారి చుట్టూ పరిభ్రమించేవి. ఆ విధంగా బాల్యాన్ని గడుపుతూ ఐదేళ్ల ప్రాయంలోకి వచ్చిన అన్నమయ్యకు తల్లి లక్కమాంబ రామాయణ, మహాభారతాలను, శ్రీవేంకటేశ్వరుని లీలలను వినిపిస్తూ గోరుముద్దలు తినిపించేది. జానపదులు పాడుకునే శ్రీవారి గీతాలను ఆలపిస్తూ ఆ బాలుడు అందరిని అలరించే వాడు. ఎక్కువ సమయం గుళ్ళూ గోపురాలలోనే గడిపేవాడు.

ఆన్నమయ్య తిరుపతి ప్రయాణం

చదువు-సంధ్యా లేకుండా పాటలు పాడుకుంటూ, సోమరిగా కనిపించే ఎనిమిదేళ్ల అన్నమయ్యను చూసి తండ్రి కోపగించుకునే వాడు. దాయాదులు విసుక్కునేవారు. వదినగార్లు ఆడిపోసుకునే వారు. ఆ బుడతడి నోటినుండి వెలువడే ప్రతి పదం భవిష్యత్తులో ఓ ఆణిముత్యంగా వెలుగొందుతుందని ఏమాత్రం ఊహించని ఆ కుటుంబ సభ్యులందరూ కలసి, ముక్కుపచ్చలారని ఆ చిన్నారి చేతులకు కొడవలి నిచ్చి, గడ్డి కోసే నిమిత్తం పొలానికి పంపారు. అయినవారి అనాదరణకు గురైన ఆ పసిమనసు గాయపడింది. తన ప్రారబ్ధానికి చింతిస్తూ, అప్రయత్నంగా నోటి నుండి రాగాలు వెలువడడంలో తన తప్పేంటో తెలియని అన్నమయ్య ఆ వేంకటేశ్వరుణ్ణి స్మరించుకుంటూ పరధ్యానంగా గడ్డి కోస్తున్నాడు. అలవాటు లేని కారణంగా, పదునైన కొడవలి తగలడంతో ఆ చిన్నారి చేతివ్రేలు తెగి రక్తం కారింది. బాధతో విలవిల్లాడుతున్న ఆ పసివానికి

"అడుగడుగు దండాల వాడు గోవిందా!
ఏడుకొండల వాడా! గోవిందా! గోవిందా!"

అంటూ శ్రీవారిని కీర్తిస్తూ తిరుమల క్షేత్రానికి వెళుతూన్న ఓ భక్తబృందం కనబడింది. ఇష్టదైవమైన వేంకటేశ్వరుని కీర్తనలు వినబడడంతో తన బాధను మరచిపోయి, తన్మయత్వంతో ఆ భక్తుల్ని చూస్తూ ఉండిపోయిన అన్నమయ్యకు ఒక్కసారిగా జ్ఞానోదయం అయినట్టు అనిపించి, 'బంధుత్వాలన్ని మిథ్య' అన్నట్లు తోచింది. భక్తులందరూ తనను కూడా తిరుమల యాత్రకు ఆహ్వానిస్తున్నట్టు, ఆ క్షేత్రాన్ని చేరుకుని స్వామివారి సమక్షంలో కీర్తనలు ఆలపిస్తున్నట్లు, అలమేలుమంగా సమేతుడైన శ్రీవారు ఆ కీర్తనలను ఆదమరచి ఆలకిస్తున్నట్లు కలలు గన్నాడు. నొప్పి మటుమాయం అయింది.. మనసు తేలికపడి తన ప్రేరణ లేకుండానే అడుగు ముందుకు పడింది. వడివడిగా తిరుమల క్షేత్రం వైపు ప్రయాణం సాగించాడు. భక్తిపారవశ్యంలో మునిగి పోతూ, స్వామివారిని తలచుకుంటూ; అలుపుసొలుపులు, ఆకలిదప్పులు లక్ష్యపెట్టకుండా మైళ్ళకొద్దీ ప్రయాణం చేసి, ముందుగా, ఆ రోజుల్లో "శ్రీపదపూరి" గా పిలువబడే నేటి "దిగువ తిరుపతి" కి చేరుకున్నాడు. తిరుపతి గ్రామదేవత అయిన గంగమ్మ దర్శనం తరువాత, గోవిందరాజస్వామి

ఆలయం చేరుకుని వారిని –

తిరమై శ్రీ వేంకటాద్రి తిరుపతి లోపలనుఁగొరబాయ నీ బ్రతుకు గోవిందరాజా!

అని కీర్తిస్తూ, గోవిందరాజు–శ్రీనివాసుడు అభిన్నులని చాటిచెప్పాడు. తదుపరి, దూరంగా కనబడుతున్న శేషాచల శిఖరాలను చూస్తూ, అలౌకికమైన ఆధ్యాత్మిక అనుభూతికి లోనయ్యాడు.

అలిపిరి మార్గంలో తిరుమలకు...

స్వామివారి కీర్తనలు పాడుకుంటూ, భజనలు చేసుకుంటూ తిరుమల కొండ ఎక్కడానికి ఉద్యుక్తుడైన అన్నమయ్య, మొట్టమొదటగా అలిపిరిలో ఉన్న "శ్రీవారి పాదమండపాన్ని", ఆ ప్రక్కనే కొలువై ఉన్న "లక్ష్మీనారశింహుణ్ణి" దర్శించుకున్నాడు. ఆయా దేవతలను సందర్శించి నపుడు అన్నమయ్య ఆశువుగా గానం చేసిన:

- *బ్రహ్మ కడిగిన పాదము బ్రహ్మము దానీ పాదము*
- *కదిరి నృసింహుదు కంభమున వెడల*
- *విదితముగా సేవించరా మునులు*

అనే పాటలు తరువాతి కాలంలో లోకప్రసిద్ధ మయ్యాయి.

ఇలా గానామృతంలో మునిగిపోతూ, స్వామివారి పైనే మనసును లగ్నం చేసి, అలిపిరి మార్గంలోని తలయేరు గుండు, చిన్న ఎక్కుడు, పెద్ద ఎక్కుడు, గాలి గోపురం, ముగ్గుబావి దాటుకుంటూ; కొండలు, కోనలు, సెలయేళ్ళతో నిండిన పచ్చని ప్రకృతికి పరవశించి పోతూ; వన్యమృగాలు, భక్తబృందాలతో సందడిగా ఉన్న మెట్లమార్గాన్ని అధిగమిస్తూ, అల్లంత దూరంలో శేషాద్రి శిఖరాన్ని తొలిసారి చూడగానే –

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టలాయ మహిమలే తిరుమల కొండ...

అన్న గానం అప్రయత్నంగానే అన్నమయ్య నోటినుండి వెలువడింది. లోయలన్నీ తన గానాన్ని ప్రతిధ్వనిస్తున్నాయి. పక్షులు కిలకిల లాడుతూ ఆతని పాటకు వంత పాడు తున్నట్టున్నాయి. ఇలా మరో లోకంలో పరవశించి పోతున్న అన్నమయ్యను గమనించకుండానే, భక్తబృందం ముందుకు సాగిపోయింది. వారికోసం వెదకుతూ, అవ్వాచారికోన దాటి మోకాళ్ళపర్వతం చేరుకున్నాడు అన్నమయ్య. ఒక ప్రక్క ఆకలి, దాహం, మరోప్రక్క అలసట. దానికి తోడు ఎర్రటి ఎండ. ఎదురుగా చూస్తే నిట్టనిలువుగా, గుండెలవిసేలా లెక్కలేనన్ని మెట్లు! దరిదాపుల్లో తెలిసిన వారెవ్వరూ లేరు. నీరసం ఆవహించింది. మరో రెండు–మూడు మెట్లు ఎక్కగానే స్పృహతప్పి కిందపడి పోయాడు.[4]

---

[4] ("అలిపిరి" మెట్లమార్గం ద్వారా తిరుమలకు చేరుకునే టప్పుడు, మార్గమధ్యంలో ఈ ప్రదేశాలన్నింటిని నేడు కూడా చూసి ఆహ్లాదించవచ్చు. కొండమీద తిరుమలేశుని దర్శనం ఒక ఎత్తైతే, అలిపిరి మార్గంలోని శ్రీవారితో ముడివడిన అనేక చారిత్రాత్మక విశేషాలను, రమణీయ ప్రకృతి దృశ్యాలను దర్శించుకోవడం మరో ఎత్తు. 3550 మెట్లను, ఇద్దరి–ముగ్గురి సాహచర్యంతో, ఏ వయసువారైనా నాలుగైదు గంటల సమయంలో, శ్రీవారిముచ్చట్లు చెప్పుకుంటూ అధిరోహించవచ్చు. తప్పనిసరిగా చూసి తీరవలసిన ఈ నడకదారి విశేషాల గురించి మరోసారి వివరంగా తెలుసుకుందాం.)

అలమేలు మంగమ్మ దర్శనం

ఇంతలోనే, "అన్నమయ్యా, లే నాయనా!" అంటూ ఓ స్త్రీమూర్తి ఆప్యాయమైన పిలుపు స్పృహ తప్పి పడి ఉన్న అన్నమయ్యకు వినబడింది. పుత్రవాత్సల్యం తొణికిస లాడుతున్నట్లున్న ఆ మధురస్వరం, తన తల్లి లక్కమాంబ తనను లాలనతో పిలుస్తున్నట్లుగా అనిపించి, కొద్దిగా ఊరట చెందాడు. నడిమార్గంలో దిక్కుతోచని స్థితిలో ఉన్న తనను కాపాడమని ఆ స్త్రీమూర్తిని వేడుకున్నాడు. దయార్ద్ర హృదయురాలైన ఆ తల్లి, "నాయనా! అందరికీ అమ్మనైన నేను అలమేలుమంగను.

శ్రీవేంకటేశ్వరుని హృదయంలో కొలువై ఉంటాను. ఇప్పుడు నీవు సాక్షాత్తు పరమ పవిత్రమైన తిరుమలక్షేత్రం పై ఉన్నావు. ఈ క్షేత్రం అంతా సాలగ్రామమయం. కొండపైనున్న శ్రీనివాసుడు కూడా సాలగ్రామ శిలారూపమే! అందువల్ల పాదరక్షలతో ఈ కొండను ఎక్కడం మహాపాపం. నీ కాలికి ఉన్న పాదరక్షలను విడిచి శిఖరాన్ని అధిరోహించు. నీ మనోరథం సిద్ధిస్తుంది", అంటూ దారీ-తెన్నూ తెలియని అన్నమయ్యను ఓదార్చింది. అప్పటికే శ్రీనివాసుని గురించి, అలమేలుమంగను గురించి చాలా విషయాలు తెలుసుకొని ఉన్న అన్నమయ్యకు, తన తప్పు తెలిసింది. వెంటనే కాలిజోళ్లను దూరంగా విసిరి వేశాడు. అలమేలుమంగ దర్శనంతో తన జన్మ చరితార్థం అయినట్లుగా భావించి, నిండు మనసుతో తన తప్పు క్షమించమని ఆ లోకపావనిని వేడుకున్నాడు. ఆ తల్లి తనతో తెచ్చిన శ్రీవారి అన్నప్రసాదాలను-గోరుముద్దలుగా చేసి బాలుడైన అన్నమయ్యకు తినిపించి, తనను "ముల్లోకాలకు తల్లి" గా చాటుకుంది.

శ్రీవారిప్రసాదం!! అందునా సాక్షాత్తు అమ్మవారి చేతితో తినిపించబడింది.. ఇంకేముంది! అన్నమయ్యలో సరిక్రొత్త ఉత్సాహం ఉరకలు వేసి, ఒక మహత్తరమైన ఆధ్యాత్మికశక్తి ఆవహించింది –

జొచ్చితి తల్లీ! నీ మరగు
సొంపుగ నీ కరుణా కటాక్షమె
ట్లిచ్చెదొ నాకు నేడు పర
మేశ్వరి! యో యలమేలుమంగ! నీ..

అంటూ ప్రారంభించి, అలమేలుమంగను ఓ నూరు పద్యాల శతకంతో ఆశువుగా స్తుతించాడు.

దాంతో పరమానందం చెందిన అలమేలుమంగ, అన్నమయ్యను మనసారా ఆశీర్వదించి, వేంకటాచలాన్ని స్వయంగా సేవించి, తరించి, ఇతరులను కూడా తరింపజేయమని ఆదేశించి అదృశ్య మయ్యింది. అమ్మవారి అనుజ్ఞను శిరసావహించిన అన్నమయ్య, తరువాతి కాలంలో పలుమార్లు శ్రీవారిదర్శనం చేసుకోవడం ద్వారా తాను తరించి, శ్రీవారి యెడ భక్తిభావం ఉట్టిపడే తన రసరమ్య గీతాలాపనతో కోటానుకోట్ల భక్తులను తరింపజేశాడు.

కారణజన్ముడు అన్నమయ్య తిరుమలశిఖరాన్ని చేరుకోవడం, శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళమూర్తిని దర్శించుకోవడం, ఆయాసందర్భాల్లో అన్నమయ్య నోటినుండి ఆశువుగా అనేక గీతాలు వెలువడడం వివరంగా

తెలుసుకుందాం.

కరుణామయు రాలైన అలమేలుమంగమ్మ చేతి ప్రసాదసేవనంతో, ఆమె ప్రోత్సాహంతో, అన్నమయ్య నిరాశా–నిస్పృహలు పటాపంచలయ్యాయి. ఉత్సాహం రెట్టింపైంది. ప్రతి రాయిలోను, ప్రతి చెట్టులోనూ, ప్రతి మెట్టులోనూ, అన్నింటిలోనూ శ్రీవారే గోచరిస్తున్నారు. శ్రీవేంకటేశ్వరునిపై రాగరంజితమైన కీర్తనలను అలవోకగా ఆలపిస్తుండగా, భక్తులు ఒక్కొరొక్కరుగా అన్నమయ్యను అనుసరిస్తూ, పదంలో పదం కలుపుతున్నారు. ఇంతలోనే అల్లంత దూరంలో వేంకటాద్రి పర్వత శిఖరం గోచరించింది. ఇనుమడించిన ఉత్సాహంతో శేషాచల శిఖరాలను ఆర్తిగా అభివర్ణించాడు:

అదివో అల్లదివో శ్రీహరి వాసము
పదివేల శేషుల పడగల మయము ॥
అదివేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిల మునులకు
అదె చూడుడదె మ్రొక్కు డానందమయము ॥

తిరుమల కొండపై అన్నమయ్య

మోకాళ్ళపర్వతాన్ని వడివడిగా ఎక్కుతూ, మధ్యదారిలో ఉన్న "శ్రీభాష్యకార్ల సన్నిధి" లో భగవద్రామానుజుల వారిని సేవించుకుని, తనను అనుసరిస్తున్న భక్తబృందంతో పాటుగా శేషాచల శిఖరాన్ని చేరుకున్నాడు. ముందుగా స్వామిపుష్కరిణిలో పవిత్ర స్నానమాచరిస్తూ –

సకల గంగాది తీర్థస్నాన ఫలములివి
స్వామి పుష్కరిణీ జలమె నాకు

అంటూ పుష్కరిణి మహాత్మ్యాన్ని ప్రస్తుతించాడు. క్షేత్ర నియమానుసారం ఆదివరాహస్వామిని దర్శించుకుని, వెనువెంటనే స్వామివారి ఆలయం చేరుకున్నాడు. ముందుగా మహాద్వార గోపురానికి చేయెత్తి నమస్కరించి, "నీడ తిరగని చింతచెట్టు" ను సందర్శించుకుని, గరుడగంభాన్ని ఈ విధంగా సేవించుకున్నాడు:

గరుడగంభము కాడ కదు బ్రాణాచారులకు
వరము లొసగేని శ్రీ వల్లభుడు

తిరుమలేశుని దర్శనం

గరుడగంభాన్ని సేవించుకుని, బంగారువాకిలి చెంత నిలచి, ఆనందనిలయంలో కొలువై ఉన్న శ్రీవారి దివ్యమంగళ విగ్రహాన్ని తొలిసారిగా దర్శించుకుంటూ, ఆనంద పారవశ్యంతో శేషాచల శిఖరాన్ని, శ్రీవారి మూర్తిని ఈ విధంగా కీర్తించాడు:

ఇప్పుడిటు కలగంటి – నెల్లలోకములకు

అప్పడగు తిరువేంక – టాద్రీశు గంటి //
అతిశయంబైన శే – షాద్రి శిఖరము గంటి
ప్రతిలేని గోపుర – ప్రభలు గంటి
శతకోటి సూర్య తే – జములు వెలుగగ గంటి చతురాస్య బొడగంటి – చయ్యన మేల్కొంటి //

ఈ కీర్తనలో మహోన్నతమైన శేషాచల శిఖరాన్ని, ఆనందనిలయ గోపుర కాంతులను, రత్నఖచితమైన బంగారువాకిళ్ళను, దేదీప్యమానంగా వెలుగుతున్న దీపసమూహాన్ని, కనకాంబర ధారియైన స్వామివారిని, శంఖుచక్రాలను, కటి, వరద హస్తాలను కళ్లకు కట్టినట్లు వర్ణించాడు.

తరువాత ఆలయంలోని ఇతర దేవతలను, మంటపాలను, తిరుమలక్షేత్రం లోని సమస్త తీర్థాలను, గోపురాలను, వైభవోపేతంగా జరిగే ఉత్సవాలను దర్శించుకుని వాటి విశేషాలను ఈ విధంగా పదబంధం చేశాడు –

కంటి నఖిలాండతతి కర్తనధిపుని గంటి
కంటి నఘములు వీడికొంటి నిజమూర్తి గంటి //
మహనీయ ఘన ఫణామణుల శైలము గంటి
బహు విభవముల మంటపములను గంటి..../l

కటాక్షించిన స్వామివారు

ఇలా నిత్యం స్వామివారిని సేవిస్తున్న అన్నమయ్య ఒకనాడు ఆలయ సమీపానికి చేరుకోగానే, కాస్త సమయాతీతం కావటంవల్ల బంగారువాకిళ్ళు మూసి వేయబడ్డాయి. ఆరోజు శ్రీవారి దర్శనం కలుగక పోవడంతో విచారించిన అన్నమయ్య స్వామి వారిని కీర్తిస్తూ, తనకు దర్శనభాగ్యం ప్రసాదించమని రాగయుక్తంగా వేడుకొన్నాడు. అంతే! పరమాశ్చర్యంగా, తాళాలు ఊడిపడి బంగారువాకిళ్ళు తెరుచుకున్నాయి. ఈ సంఘటనతో అన్నమయ్య భక్తిప్రపత్తులను గుర్తెరిగిన అర్చకస్వాములు ఆయనను సాదరంగా తోడ్కొనివెళ్లి శ్రీవారి దర్శనం చేయించి, తీర్థప్రసాదాలు ఇచ్చారు. హద్దులెరుగని ఆనందంతో శ్రీవారిని స్తుతిస్తూ ఒక పద్యశతకాన్ని ఆశువుగా చెప్పాడు అన్నమయ్య! పులకించి పోయిన స్వామివారు తన ఆనందాన్ని వ్యక్త పరచినట్లుగా, మూలమూర్తి మెడలోని ఓ ముత్యాలహారం జారి స్వామి పాదాలపై పడింది. అర్చకస్వాములు దాన్ని అన్నమయ్యకు ప్రసాదంగా బహూకరించారు.

"అన్నమాచార్యుని" గా మారిన అన్నమయ్య

తిరుమలలో "ఘనవిష్ణుయతి' అనే ఒక వైష్ణవగురువుకు స్వామివారు స్వప్నంలో కనిపించి, వేంకటాచల వీధుల్లో పాటలు పాడుకుంటూ పరిభ్రమిస్తున్న అన్నమయ్య రూపురేఖలను వర్ణించి చెప్పి, అతనికి వైష్ణవమతాన్ని ప్రసాదించమని ఆదేశించి, తన శంఖు–చక్ర ముద్రలను ప్రసాదించారు. ఆ గురువుగారు, శ్రీ వారి ఆదేశానుసారం, తిరుమల వీధుల్లో తిరుగాడుతున్న అన్నమయ్యను గుర్తించి అతనికి వైష్ణవమతాన్ని ముద్రాంకితంగా ప్రసాదించారు. ఆ క్షణం నుంచి అన్నమయ్య, "అన్నమాచార్యుని" గా వినుతికెక్కారు.

అన్నమయ్య వివాహం

అటు తాళ్లపాకలో అన్నమయ్య హఠాత్తుగా అదృశ్యం కావటంతో ఊరూ వాడ వెదకి విసిగి వేసారిన అన్నమయ్య తల్లిదండ్రులు చిక్కిశల్యమై మంచాన పడ్డారు. అతని ఆచూకీ కోసం వారి కులదైవమైన చెన్నకేశవుణ్ణి వేడుకున్నారు. చుట్టుప్రక్కల ఉన్న పుణ్యక్షేత్రాలన్నీ గాలించి, చివరి ప్రయత్నంగా తమ పుత్రుణ్ణి తమకు తిరిగి ప్రసాదించమని ఆ శ్రీనివాసుణ్ణి వేడుకోవడం కోసం తిరుమలక్షేత్రం చేరుకున్నారు. శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో పాటలు పాడుకుంటూ తిరుగుతున్న అన్నమయ్యను చూసి, ఆ దంపతులకు పుత్రోత్సాహం పెల్లుబికింది. స్వగృహానికి తిరిగి రావలసిందిగా అన్నమయ్యను బ్రతిమాలుకున్నారు. స్వామివారి చరణాలను వీడి రానంటూ భీష్మించిన అన్నమయ్యకు శ్రీవారు స్వప్నంలో సాక్షాత్కరించి తల్లిదండ్రుల మనస్సు కష్టపెట్టరాదని, వారు కోరినట్లు ఇంటికి తిరిగివెళ్లి గృహస్థాశ్రమం స్వీకరించమని, దానివల్ల తన కటాక్షం మరింతగా సిద్ధిస్తుందని నచ్చజెప్పారు. దాన్ని సుగ్రీవాజ్ఞగా భావించిన అన్నమయ్య, తల్లిదండ్రులతో కలిసి స్వగ్రామానికి చేరుకున్నాడు. గేయాలు, కీర్తనలు, శతకాలతో స్వామి వారిని నిత్యం కీర్తిస్తూ కొంతకాలం గడిపిన తర్వాత, అన్నమయ్యకు అక్కలమ్మ-తిరుమలమ్మ అనే ఇరువురు కన్యలతో వివాహం జరిగింది.

తిరుమలకు తిరిగి వచ్చిన అన్నమయ్య

అన్నమయ్యకు వివాహమయ్యింది కానీ దాంపత్య జీవితం ఎంతో కాలం సాగలేదు. మనస్సంతా స్వామివారి పైనే లగ్నమై ఉంది. తిరుమలలో ఘనవిష్ణుయతి వైష్ణవమతాన్ని ప్రసాదించి నప్పటినుండి ఆ మతంపై అన్నమయ్యకు మక్కువ ఎక్కువయ్యింది. స్వామివారిని సాక్షాత్కరింప జేసుకోవడానికి వైష్ణవమే సులభమార్గమని భావించిన అన్నమయ్య, అప్పట్లో ప్రముఖ వైష్ణవక్షేత్రమైన అహోబిలానికి వెళ్లి శఠగోపముని అనే గురువు వద్ద వైష్ణవసాంప్రదాయం లోతుగా అధ్యయనం చేశాడు. ఆ గురువుగారు అన్నమయ్యకు నృశింహమంత్రాన్ని ఉపదేశించారు. తర్వాత శ్రీనివాసుని సన్నిధిలో స్థిరంగా ఉండే ఉద్దేశ్యంతో అన్నమయ్య తిరిగి తిరుమలకు చేరుకున్నాడు. స్వామివారిని నిత్యం అనేక కీర్తనలతో, శతకాలతో కీర్తిస్తూ, తిరుమలలో ఉన్న తీర్థాలన్నింటినీ సందర్శించి వాటి మహిమలను గానం చేస్తూ ఎంతో కాలం గడిపాడు.

వివిధ వైష్ణవక్షేత్రాల సందర్శన

ఆ విధంగా చాలా కాలం తిరుమలలో గడిపిన తరువాత ఒకసారి స్వామివారు అన్నమయ్యను ఆప్యాయంగా సంబోధిస్తూ "నేను కేవలం తిరుమలక్షేత్రానికి పరిమితమైన శ్రీవేంకటేశ్వరుణ్ణి మాత్రమే కాదు. సర్వాంతర్యామిని! జనపదాలను సంచరిస్తూ, నా తత్వాన్ని దేశమంతటా ప్రచారం చెయ్యి. అందరూ నన్ను సేవించుకుని, నా అనుగ్రహానికి పాత్రులయ్యేందుకు ప్రయత్నించు" అంటూ ఆదేశించారు. స్వామివారి ఆదేశంతో కొండ దిగిన అన్నమయ్య ఆంధ్ర-తమిళదేశాలను విస్తృతంగా పర్యటించి తిరుమలేశుని మహిమలను ఉధృతంగా ప్రచారం గావించాడు. ఆ పర్యటనలో భాగంగా కడప పట్టణంలో ఉన్న శ్రీవేంకటేశ్వరుని ఆలయం (దేవుని కడప),

శ్రీరంగంలోని రంగనాథస్వామి ఆలయం, మార్కాపురపు చెన్నకేశవుని ఆలయం, కదిరి లోని నృశింహస్వామి ఆలయం, ఒంటిమిట్టలోనున్న కోదండరామాలయం, వాల్మీకిపురం (వాయల్పాడు) లోని రామచంద్రాలయం, బహుదానదీ తీరంలోని సౌమ్యనాథాలయం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలతో పాటు మారుమూల పల్లెల్లోని గ్రామదేవతలను సైతం దర్శించి, పూజించి, కీర్తించాడు. ఆ కీర్తనలలో కొన్నింటిని ఆస్వాదిద్దాం:

రంగనాథుని పై –

"తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనె యూగె గన
చెల్లుబడి నూగీని శ్రీరంగ శిశువు ॥"

గండికోట చెన్నకేశవుని మీద –

"చెల్లునా నీకీపనులు చెన్నకేశవా
కొల్లవాడ వౌర గండికోట చెన్నకేశవా ॥"

కదిరి నృశింహుని కీర్తిస్తూ –

"కదిరి నృసింహుడు కంభమున వెడలె
విదితముగా సేవింపరో మునులు ॥"

నందలూరు చొక్కనాథునిపై

"బరి శ్రీ వెంకటగిరి నుండి వచ్చి కూడితివి
మేరలో నెలదవారి మేటి చొక్కనాథా ॥"

తిరుపతి లోని ఆంజనేయుని పై

"మిగటి మిగుల హనుమంతరామ
దిగువ పట్టణంలో దేవ హనుమంత ॥"

అన్నమయ్య ఏ తీర్థాన్ని సేవించినా, ఏ దేవుణ్ణి దర్శించినా అందులో ఆయనకు తిరుమలేశుడే గోచరించేవాడు. అందుచేత ఆయా దేవుళ్ళను శ్రీవేంకటేశ్వరుని ప్రతిరూపాలుగానే కీర్తించాడు. ఒక విధంగా, అన్నమయ్య దృష్టిలో తిరుమలలో కొలువై ఉన్న శ్రీవేంకటేశ్వరుడు మూలవిరాట్టు కాగా, ఇతర క్షేత్రాల్లోని దేవతలందరూ ఉత్సవ మూర్తులు. అందుచేత ప్రజలందరూ వివిధక్షేత్రాల్లో ఆయా దేవతలకు చేసే పూజలన్నీ శ్రీవెంకటేశ్వరునికే చెందుతాయని చాటి చెప్పాడు.

ఆ విధంగా అన్నమాచార్యుడు తన సంకీర్తనా యజ్ఞాన్ని నిరాఘాటంగా కొనసాగించి, ఆబాలగోపాలంలో శ్రీవెంకటేశ్వరుని భక్తితత్వం వ్రేళ్ళూనుకునేలా పాటుపడ్డాడు.

ఆంధ్ర, తమిళ దేశాల్లోని మారుమూల గ్రామాల్లో సైతం ఉన్న వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించుకుని, శ్రీవేంకటేశ్వరుని తత్వాన్ని నలుదిశలా వ్యాప్తి చేసి, తిరిగి తిరుమలకు చేరుకున్న అన్నమయ్య, శ్రీవెంకటేశ్వరుని మహాత్మ్యాన్ని, ఆ

క్షేత్రవైభవాన్ని, శేషాచల సానువుల్లోని జంతుజాలాన్ని, వృక్షజాతులను, సెలయేళ్లను, ప్రకృతిసోయగాన్ని వర్ణిస్తూ వందలు, వేలకొద్ది కీర్తనలను గానం చేస్తూ భక్తులను అలరించేవాడు.

శ్రీవేంకటేశ్వరుని నిత్యకళ్యాణోత్సవం

అన్నమయ్య, ఉత్సవాల్లో శ్రీవారి శోభను కర్ణపేయంగా వర్ణించడమే కాకుండా అత్యంత భక్తి ప్రపత్తులతో ఎన్నో ఉత్సవాల్లో స్వయంగా పాల్గొనేవాడు. తిరుమలక్షేత్రంలో శ్రీనివాసునికి నిత్యకళ్యాణోత్సవం ప్రవేశపెట్టింది అన్నమాచార్యుడే! శ్రీవేంకటేశ్వరుడు, అన్నమాచార్యుడు స్వగోత్రీకులు. ఇద్దరిదీ భారద్వాజస గోత్రమే! అయినా కట్టుబాట్లను త్రోసిరాజని, శ్రీనివాసునికి కన్యాదానం చేసి, సాక్షాత్తు ఆ శ్రీవారిని అల్లునిగా చేసుకున్నారు అన్నమాచార్యుల వారు!

ఆ పరంపరను కొనసాగిస్తూ నేటికీ నిత్యకళ్యాణోత్సవంలో అన్నమయ్య వంశీయులే కన్యాదాతగా వ్యవహరిస్తున్నారు. అంతే గాకుండా, ఉగాది, శ్రీరామనవమి, ఆణివార ఆస్థానాల యందు, వసంతోత్సవం, బ్రహ్మోత్సవం, పుష్పయాగం వంటి సేవలలోనూ ఈ వంశీయులు పాల్గొని ఘనంగా సత్కరించ బడుతున్నారు. శ్రీనివాసునికి అన్నమయ్య మనసా–వాచా–కర్మణః సమర్పించుకున్న సేవల ఫలితంగా, గత ఆరు శతాబ్దాలుగా వారి వంశస్థులందరూ శ్రీవారిసేవలో తడిసి ముద్దవుతున్నారు. ఈనాటికీ వారి వారసులే సుప్రభాత సమయంలో మేలుకొలుపు మొదలుకొని ఏకాంతసేవలో జోలపాట వరకు పాడుతారు. ఆశ్రిత పక్షపాతి అయిన శ్రీవేంకటేశ్వరుని కటాక్షంతో అన్నమాచార్యుని వంశీయులందరికీ ఆచంద్రతారార్కం ఈ భాగ్యం లభిస్తూనే ఉంటుంది.

స్త్రీదేవతలపై కీర్తనలు

శ్రీమహావిష్ణువు యొక్క వివిధ అవతారాలనే కాకుండా, స్త్రీ దేవతా మూర్తులను కూడా అన్నమయ్య స్తుతించాడు. ఉదాహరణకు:

శుక్రవార అభిషేకం సందర్భంగా అలమేలుమంగను –

కంటి శుక్రవారం గడియ లేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామి

రంగనాథుని సేవలో తరిస్తున్న గోదాదేవిని –

చూడరమ్మ సతులారా సోబాన పాడరమ్మ
కూడున్నది పతి చూడి కుడుత నాంచారి;

పెండ్లికూతురి ముస్తాబులోనున్న సీతమ్మవారిని –

సిగ్గరి పెండ్లికూతుర సీతమ్మ
అల్లనాడే రాఘవుడు హరివిల్లు విరిచెను

యెల్లి నేడే పెండ్లాడి నిదవో నిన్ను;

అంటూ అమ్మవార్లందరినీ రాయలసీమ గ్రామీణ నుడివడి ఉట్టిపడేలా వర్ణించాడు.

పెనుగొండ ఆస్థానంలో అన్నమయ్య

ఇలా తన సంకీర్తనా యజ్ఞాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్న అన్నమయ్య యశస్సు నలుదిక్కులా వ్యాపించడంతో, అప్పటి పెనుగొండ ప్రభువైన నరసింహరాయలు అన్నమయ్యను సత్కరించి, రాజగురువుగా తన ఆస్థానంలో నియమించుకున్నాడు. ఆ సమయంలో అలమేలుమంగాశ్రీనివాసుల శృంగారలీలలు వర్ణిస్తూ అన్నమయ్య ఓ కీర్తనను ఆలపించాడు –

ఏమొకొ! చిగురు టధరమున యెడనెడ కస్తూరి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు గదా!

ఈ కీర్తనను విన్న నరసింహరాయలు యుక్తాయుక్త విచక్షణను మరచి, కీర్తికండూతితో, అత్యాశతో, తనపై కూడా అలాంటి కీర్తన చెప్పమని కోరాడు. పూర్తిగా శ్రీవారి సేవకే అంకితమైన అన్నమయ్య, నారాయణుని కీర్తించిన తన నోటితో ఒక నరుని స్తుతించ లేనని చెబుతూ, నరసింహరాయలు కోర్కెను నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. దానికి కోపోద్రిక్తుడైన సాళువరాజు "మూరురాయరగండ" అనే బంగారు సంకెళ్ళతో అన్నమయ్యను బంధించి ఖైదు చేయించాడు. అన్నమయ్య ఆర్తితో వేడుకొనగా, ఆనందనిలయుని కటాక్షంతో సంకెళ్ళు కకావికలం అయ్యాయి. భటులు చెప్పిన విషయం నమ్మని రాజుగారు తానే స్వయంగా దగ్గరుండి మరోసారి సంకెళ్లు వేయించాడు. అన్నమయ్య సంకీర్తనాలాపనతో సంకెళ్లు రెండవసారి కూడా విడిపోయాయి. ఆ వింతను స్వయంగా చూసిన నరసింహరాయల అహంకారం తగ్గి అన్నమయ్యను క్షమాభిక్ష వేడుకున్నాడు. ఆ రాజు అజ్ఞానాన్ని మన్నించి, ఇకమీదట భాగవతులను అవమానించ వద్దని హెచ్చరించి, రాజాస్థానం తన గమ్యం కాదని గుర్తెరిగిన అన్నమయ్య, సకుటుంబంగా తిరిగి వేంకటాచలం చేరుకున్నాడు.

ఇతర వాగ్గేయకారులతో అన్నమయ్య

తన వృద్ధాప్యాన్ని తిరుమల క్షేత్రంలో, స్వామివారిని కీర్తిస్తూ గడుపుతున్న సమయంలో, అన్నమయ్యకు నాలుగు లక్షల యాభదివేల కీర్తనలు వ్రాసినట్లుగా చెప్పబడుతున్న పురందరదాసుతో పరిచయ మేర్పడింది. ఆ భాగవతోత్తముడు అన్నమయ్యను తన గురువుగానూ, హరి అవతారంగానూ భావించి, ఇలా కీర్తించాడు –

హరియవతార మీతడు అన్నమయ్య
అరయ మా గురుడీతడు అన్నమయ్య
వైకుంఠనాథుని వద్ద వడిపాడుచున్నవాడు ఆకరమై తాళ్ళపాక అన్నమయ్య

పురందరదాసే కాకుండా, గొప్ప గొప్ప వాగ్గేయకారు లైన త్యాగయ్య, రామదాసు, క్షేత్రయ్యలు కూడా ఇతని

భక్తిప్రభావానికి లోనై, అన్నమయ్య కవితాఝరికి జేజేలు పలికారు. కవితాదృష్టితో పరికిస్తే క్షేత్రయ్య పదాలు నృత్యానికి అనువుగా, లయబద్ధంగా గోచరిస్తాయి; త్యాగరాజ కీర్తనలు సంగీత భరితంగా సవ్వడి చేస్తాయి; రామదాసు పాటలు భక్తిభావాన్ని పుణికిపుచ్చు కుంటాయి; జయదేవుని అష్టపదులు శృంగారభావాన్ని తొణికిస లాడిస్తాయి; కానీ అన్నమయ్య కీర్తనలు మాత్రం – నృత్యం, సంగీత సాహిత్యాలు, భక్తితత్వం, శృంగార భావనల – మేళవింపై శ్రోతలను ఆనందడోలికల్లో విహరింప జేస్తాయి.

రచనాశైలి

అన్నమయ్య లెక్కకు మిక్కిలిగా రచించి, గానం చేసిన సంకీర్తనల లోని పదాలను పరిశీలిస్తే – స్వచ్ఛమైన, సంస్కృతంతో మిళితం కాని, రాయలసీమ యాసలోని తెలుగుభాష కానవస్తుంది. ఆ ప్రాంతప్రజల్లో ఆనాడు వాడుకలో ఉన్న సామెతలు, జాతీయాలు, పలుకుబడులు, ఊతపదాలు, నుడికారాలు – వీటన్నింటిని గమనించి వాటిని తన రచనల్లో ఒద్దికగా పొందుపరిచాడు. అన్నమయ్య తన కృతుల్లో తరచూ వాడిన కొన్ని పదాలను వర్గీకరించి విశ్లేషించుదాం :

- తిండి పదార్థాలు – కంచం, కూడు, అంబలి, గంజి, చింతకాయ పచ్చడి, ఆవకాయ, కారం, పెరుగు, చద్ది, నూనెలు, వెన్న, ఉప్పు, అన్నం, చద్దన్నం – వంటి పదాలను ఉపయోగించి ఆనాటి రాయలసీమ లోని గ్రామీణజీవితానికి అద్దం పట్టాడు.
- ఆర్థిక, సామాజిక స్థితిగతులను – ఇల్లు, కొట్టం, చావిడి, మేడ, గుడిసె, వంటగది, చెంబు, గొడుగు, రోలు, రోకలి, గడ్డపార – వంటి పదాలను ఉపయోగించడం ద్వారా తేటతెల్లం చేశాడు.
- వివాహవ్యవస్థ – బొమ్మలపెళ్లిళ్లు, పెండ్లికొడుకు, పెండ్లికూతురు, విడిదిఇల్లు, బాసికం, తాళిబొట్టు, పెళ్లిపీటలు, మంగళసూత్రం, తలంబ్రాలు, అక్షింతలు, హారతులు, కొంగుముడి; నిశితంగా గమనిస్తే, నాడు అన్నమయ్య గ్రంథస్థం చేసిన వివాహ ఆచార-వ్యవహారాలు; ఆరువందల సంవత్సరాల తరువాత ఈనాడు కూడా, అతికొద్ది మార్పులతో సజీవంగా ఉన్నాయి.
- కుటుంబవ్యవస్థ – మగువ-మగడు, భార్య-భర్త, అత్తా-కోడలు, బావ-మరదలు, తల్లిదండ్రులు, కొడుకు-కూతురు; ఇలా, ఈనాడు ఎన్నైతే బంధుత్వాలను మనం కలిగివుంటామో, ఆనాడు కూడా అవే చుట్టరికాలు అంతకుమించి ఆప్యాయతాభిమానాలు వ్యక్తం చేయబడ్డాయి.
- మూగజీవాలు – గుఱ్ఱం, ఆవు, చిలుక, నెమలి, హంస, చీమ, తేలు, జింక, ఎద్దు – వంటి వన్యప్రాణులను తరచూ ఉటంకిస్తూ తన జంతు ప్రేమను తేటతెల్లం చేశాడు అన్నమయ్య.
- జానపదాలు – ఉయ్యాల, నలుగు, జోల, కోలాటం, గుజ్జనగూళ్ళు, తందనాలు, లాలిపాటలు, వెన్నెల, చందమామ – అలా అన్నమయ్య తన రచనల్లో ఆనాటి రాయలసీమ పల్లెటూరి సొగసులను ఒద్దికగా పొందుపరిచాడు.
- అన్నమయ్య – పామరులకు సైతం సరళంగా ఆకళింపు అయ్యే సాధారణ భాషతో కూడుకున్న రచనలనే కాకుండా; విద్వాంసుల కోసం ఛందోబద్ధ, వ్యాకరణ సహిత, క్లిష్టతరమైన పెక్కు గ్రంథాలను సైతం అలవోకగా రచించి తన పాండిత్యప్రకర్షను చాటుకున్నాడు. వారి రచనల్లో సంకీర్తనలతో పాటుగా ద్విపదలు,

శతకాలు, దండకాలు, రగడలు, భజనలు, గీతాలు, వ్యాఖ్యానాలు; ఎన్నో, మరెన్నో కూడా ఉన్నాయి. అయితే భాష ఎటువంటిదైనా, ఏ పదం ఉపయోగించినా, స్థూలంగా దాని అర్థం ఏమైనా అంతర్లీనంగా ఉన్న ఇతివృత్తం మాత్రం శ్రీవేంకటేశ్వరుడే!

ఇలా తన సాహిత్యసంపద నంతా ఆ శ్రీనివాసుణ్ణి వేనోళ్ళ కీర్తించడానికే వినియోగించాడు.

1424వ సంవత్సరంలో ప్రారంభించి, 1503వ సంవత్సరం వరకు – 80 సంవత్సరాల కాలం – కొనసాగిన సాహితీప్రస్థానం ముగిసేనాటికి అన్నమయ్య 96 సంవత్సరాల వయోవృద్ధుడు. ఆ సుదీర్ఘకాలంలో సగటున ప్రతిరోజు – రెండు లేదా మూడు సంకీర్తనలను గానం చేశాడు. ఆయన చేసిన సాహితీసేవలను గుర్తించి ఆనాటి రాజాస్థానాలు, పౌరసంఘాలు ఆయనను – **సంకీర్తనాచార్య, ద్రావిడ ఆగమ సార్వభౌమ, పంచాగమచక్రవర్తి** – వంటి బిరుదులతో సత్కరించాయి.

నా నాలికపై నుండి నానా సంకీర్తనలు
పూని నాచే నిన్ను పొగడించితివి
వేనామాల విన్నుడా వినుతెంచ నెంతవాడ
కానిమ్మని నీకే పుణ్యము గట్టితి వింతేయయ్యా!

– అంటూ, తన పాండిత్యమంతా శ్రీనివాసుని కృపయే తప్ప తన స్వంతం కాదని వినమ్రంగా, కవితాధోరణిలో చాటిచెప్పాడు.

అన్నమాచార్యుని లోని సంఘ సంస్కర్త

అన్నమాచార్యుని పేరు లేదా వారి కీర్తన వినగానే మనకు మొట్టమొదటగా స్ఫురణకు వచ్చేది శ్రీవేంకటేశ్వరుని పట్ల ఆయనకు ఉన్న అపారమైన భక్తి-తత్పరతలు! అయితే అన్నమయ్య తన అసంఖ్యాకమైన కృతులలో స్వామివారిని అచంచలమైన భక్తితో కీర్తించడము సామాజిక స్థితిగతులను కళ్ళకు కట్టినట్లు వర్ణించడమే గాకుండా; ఆనాడు సమాజంలో ప్రబలి ఉన్న సాంఘిక దురాచారాలను, అంధవిశ్వాసాలను, కులమతబేధాలను, జంతుబలులను, అంటరానితనాన్ని, స్త్రీ-పురుష వ్యత్యాసాలను, మూఢనమ్మకాలను నిర్ద్వందంగా తిరస్కరించాడు. శ్రీవేంకటేశ్వరుడు తన ఖడ్గంతో అసురులను దునుమాడి నట్లుగానే; వారి నందకఖడ్గ అంశతో జన్మించిన అన్నమాచార్యుడు, నాడు జనబాహుళ్యంలో వ్రేళ్ళూనుకుని ఉన్న సామాజిక రుగ్మతలను తన సమకాలీన స్పృహతో కూడిన సాహితీప్రకర్ష అనే పదునైన ఖడ్గంతో నిష్కర్షగా ఖండించాడు.

అన్నమయ్య రచనలలో అటువంటి కీర్తనలు అసంఖ్యాకంగా ఉన్నాయి. వాటిలో కొన్నింటిని నేటి ప్రకరణంలో అవలోకిద్దాం –

హరిభక్తి గలిగితే అన్నియూ ముఖ్యముగాక
విరహా చారము లెల్ల వృథా వృథా //

పులులు గుహల నుంటె పోలింప ఋషులా
యెలుగు గడ్డము నెంచు నింతలోనె యోగుడా
పక్షులాకాశాన కేగితే దేవతలా
వొలసి కోతి యడవి నుంటే వనవాసమా //
మాకులు మాటలాడవు మౌనవ్రతములా
కోక గట్టరు బాలులు కోరి దిగంబరులా //

ఈ కీర్తనలో అన్నమయ్య పదలాలిత్యం, మూఢాచారాల పట్ల ఆయనకు ఉన్న ఏహ్యభావాన్ని వ్యంగ్యంగా సామాన్యులకు హత్తుకునేలా వ్యక్తం చేయగలిగే నేర్పు, ఉపమానాలను సమయస్ఫూర్తిగా నుపయోగించటంలో వారి చాతుర్యం కొట్టవచ్చినట్లు కానవస్తాయి.

భావార్థానికి వస్తే హరిభక్తి కలిగి ఉండటమే ముఖ్యం కానీ; శరీరాన్ని శుష్కింప జేసుకునే ఉపవాసాలు, మూఢభక్తితో కూడుకుని ఉన్న ఆచార వ్యవహారాలు అక్కరకు రావు. గుహలలో సంచరించిన మాత్రాన పులులు ఋషి పుంగవులు కాలేవు. ఆకాశంలో విహరించి నంతమాత్రాన పక్షులు దేవతలు కాజాలవు. అడవిలో నివసించడం చేత వానరములు వనవాస దీక్షలోనున్నట్లు గాదు. వృక్షజాలాలు నిశ్శబ్దంగా ఉన్నంత మాత్రాన అవి మౌనవ్రతాన్ని పాటిస్తున్నట్లు కాదు. వస్త్రాలు ధరించనందువల్ల పసిపిల్లలు దిగంబర యోగులు కానేకాదు. ఈ విధంగా ప్రజలకు సులభంగా అర్థమయ్యే ఉపమానాలను ఉదహరించి తత్కాలీన సమాజంలో ఆలోచనా శక్తిని మేల్కొలిపాడు.

మొక్కరో మీరు మోసపోక
యిక్కు దిక్కు దైన ఆదిదేవునికి
మారు జేతు లీయవద్దు మారు గాళ్ళీయవద్దు
బీరాన గుండెలు కోసి పెట్టవద్దు
గోలవడి చిచ్చులోన గుండాలు చొరవద్దు
వూరకే మీ వారమని వున్న చాలు //

ఆకాలంలో గ్రామదేవతల ప్రీత్యర్థం జంతుబలులిచ్చే మూఢాచారం ప్రబలంగా ఉండేది. అగ్నిగుండాలలో దూకి ప్రజలు తమ మూఢభక్తిని ప్రదర్శించేవారు. అటువంటి అనాగరిక చర్యలను వ్యతిరేకించిన అన్నమయ్య, భక్తులు తమను తాము ఆర్తిగా దేవునికి సమర్పించుకోవాలే తప్ప; మూగ జంతువులను కడతేర్చ రాదని, భగవదారాధన కోసం నిర్దేశించబడ్డ మానవశరీరాన్ని ఆకారణంగా చిత్రహింసలకు గురి చేయరాదని ఉపదేశించాడు.

నరులకు నరులే పరలోక క్రియలు
సిరిమోహాచారాలు జేతులు గాక
తరుపాషాణ పశుతతుల కెవ్వరు సేసే
రరయగ భ్రమగాక అని పస్తులున్నవా //

ఈ కీర్తనలో అన్నమయ్య తన హేతువాద దృక్పథాన్ని వెల్లడించాడు. మరణించిన వ్యక్తికి పిండప్రదానం చేసే హైందవ

ఆచారప్రక్రియలపై పెదవి విరిచాడు. మనుషులకు మనుషులే పరలోక కర్మలు జరపటం హాస్యాస్పదమని; రాళ్లకు, వృక్షాలకు, జంతుజాలానికి కర్మకాండలు జరగనంత మాత్రాన అవన్నీ పస్తులున్నాయా? అని సూటిగా ప్రశ్నించాడు.

ఏ కులజుడేమి యెవ్వడైననేమి
ఆకడ నాతడె హరినెరిగినవాడు ॥
పరగిన సత్యసంపన్నుడైనవాడే
పరనింద సేయ తత్పరుడు కానివాడు
అరుదైన భూతదయానిధి యగు వాడే
పరులు తానేయని భావించువాడు ॥

ఈ సంకీర్తన ద్వారా హరి చరణాలను చేరుకోవ డానికి "కులం" ముఖ్యం కాదని, సత్ప్రవర్తన తోనే శ్రీమహావిష్ణువు సాయుజ్యం పొందగలరని నొక్కి వక్కాణించాడు. సత్యసంపన్నుడు, పరనింద చేయనివాడు, భూతదయ గలవాడు, సమస్తజీవ రాశులను తనకు అభిన్నంగా భావించి అన్నింటి హితం కోరేవాడు, నిర్మలమైన అంతరాత్మ గలవాడు, ధర్మతత్పరత గలిగి కర్మమార్గమును వీడనివాడు, సర్వకాల సర్వావస్థల యందు హరిభక్తిని వీడని వాడు, సతతము సద్బుద్ధితో సంచరించే వాడు, ఈర్ష్యా ద్వేషములను దరిజేరనివ్వక స్వామివారి పాదపద్మాలను నమ్ముకున్న వాడు మాత్రమే విష్ణుమూర్తి సాన్నిధ్యాన్ని సాకారం చేసుకోగలడని, పుణ్యపురుషుల కుండవలసిన లక్షణాలను రసరమ్య భరితంగా విశదీకరించాడు.

ఆ విధంగా అంటరానితనం ప్రబలి అగ్రవర్ణాల ఆధిపత్యం అప్రతిహతంగా ఉన్న ఆ రోజుల్లో కులాల కట్టుగోడలను కూల్చివేసి సమసమాజ నిర్మాణం కోసం ఆనాటి సాంప్రదాయవాదుల్ని తన కవితా పాటవంతో, సామాజిక స్పృహతో "ఢీ" కొన్నాడు.

తందనాన ఆహి తందనాన పురే తందనాన భళా తందనాన ॥
బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే ॥

లోకప్రసిద్ధమైన, మన అందరికీ సుపరిచితమైన ఈ కీర్తనలో అన్నమయ్య పశుపక్ష్యాదుల లోనూ, మానవులలోనూ శ్రీహరే నిండిఉన్నాడని; అధికుడు-అల్పుడు అనే తారతమ్యం లేకుండా అందరి అంతరాత్మల్లోనూ శ్రీహరి కొలువై ఉంటాడని చాటి చెప్పాడు. రాజాధిరాజు కైనా, సాధారణ భటునికైనా నిద్ర ఒకేరీతిగా ఉంటుందని; సద్బ్రాహ్మణుడైనా, అంటరానిగా భావింపబడే వాడైనా చివరకు చేరుకునేది మరుభూమి కేనని; దేవాధిదేవతలకు, పశుపక్ష్యాదులకు, క్రిమికీటకాలకు కూడా కామసుఖం ఒక్కటిగానే అనిపిస్తుందని; భాగ్యవంతులకైనా, నిరుపేదలకైనా దివారాత్రములు ఒకటిగానే గోచరిస్తాయని; రుచికరమైన శిష్టాన్నమునైనా, అరుచికరమైన ఆహారాన్నైనా రుచి చూసేది ఒకటే నాలుక యని; పరిమళద్రవ్యాల పైనా, దుర్గంధ భూయిష్ట పదార్థాలపైనా వీచే వాయువు ఒకటేనని; దుర్గమారణ్యంలో నిరవసించే టటువంటి గజరాజుపైనా, రహదారిపై నుండే శునకము మీదా కాచే ఎండ ఒకటేనని; పుణ్యాత్ములకైనా, పాపాత్ములకైనా శ్రీవేంకటేశ్వరుని నామజప మొక్కటే దిక్కని ఘంటా పథంగా చాటిచెప్పాడు.

ఈ విధంగా తరతమ బేధాలు, తారతమ్యాలు లేని సమాజాన్ని తన సాహిత్యసౌరభంతో, ఆరు వందల యేళ్ళ క్రితమే ఆవిష్కరింప జేసిన అన్నమాచార్యుడే, తరువాతి కాలంలో ఈ భావజాలంతో మొలకెత్తిన అన్ని "వాదా" లకు (ఉదా.: సామ్యవాదం), అన్ని "ఇజా" లకు (ఉదా.: కమ్యూనిజం, సోషలిజం) ఆద్యుడంటే అందులో అణుమాత్రమైనా అతిశయోక్తి ఉన్నదా?

అన్నమయ్య, వారి వారసులు తమ జీవిత కాలాలలో రచించిన అసంఖ్యాకమైన సంకీర్తనలను పొందుపరిచి నటువంటి రాగిరేకులను పదిలపరచి, భావితరాలకు భద్రంగా అందజేసి నటువంటి, తిరుమల ఆలయ విమానప్రదక్షిమార్గంలో గల అన్నమయ్య సంకీర్తనా భాండాగారం గురించి వివరంగా తెలుసుకుందాం.

అన్నమయ్య సంకీర్తనా భాండాగారం

తిరుమల ఆలయం నందలి విమానప్రదక్షిణ మార్గంలో, ఆనందనిలయానికి ఉత్తరాన, రాగిరేకులపై వ్రాయబడ్డ అన్నమాచార్యుని సంకీర్తనలను భద్రపరచినట్టి రాతిశిలపై మలచిన, బీరువా లాంటి "తాళ్ళపాక అర" ను "అన్నమయ్య సంకీర్తనా భాండాగారం" గా పిలుస్తారు. దీనిని గూర్చిన ప్రాథమిక సమాచారాన్ని మనం "విమానప్రదక్షిణమార్గం" ప్రకరణంలో ఇంతకు ముందే తెలుసుకున్నాం.

ఎవరు వ్రాశారు?

తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుల వారు అత్యంత పిన్న వయసులోనే శ్రీ వేంకటేశ్వరుని సాక్షాత్కారం పొంది, స్వామివారి సన్నిధిలో వసించి తన పదహారవ యేట నుండే సంకీర్తనాయజ్ఞాన్ని ప్రారంభించాడు. వాస్తవానికి ఎనిమిదేళ్ళ వయసు నుండే రాగాలు ఆలపించడం ప్రారంభించిన అన్నమయ్య పదహారేళ్ళ ప్రాయం నుండి వాటిని గ్రంథస్థం చేయడం మొదలు పెట్టాడు. అన్నమాచార్యుని మనుమడైన చిన తిరుమలాచార్యులు రచించిన "అన్నమయ్య చరిత్ర" అనే గ్రంథంలో అన్నమాచార్యుల వారే స్వయంగా ముప్పైరెండు వేల కీర్తనలు రచించినట్లు చెప్పబడింది. వాటిలో ఇప్పటివరకు మనకు లభ్యమైనవి 16,582 కీర్తనలు మాత్రమే. వీటిలో కూడా అది కొద్దిభాగం మాత్రమే సంస్కరింపబడి, ప్రచురణకు నోచుకున్నాయి. అయితే, ప్రసిద్ధికెక్కిన తిరుమల ఆలయ పురావస్తు పరిశోధకుడు "సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి" గారు మాత్రం అన్నమయ్య రచించిన కీర్తనలు 10,000 నుండి 12,000 వరకు ఉండవచ్చని, మిగిలినవి వారి వంశీయులచే వ్రాయబడి ఉండవచ్చునని అభిప్రాయపడ్డారు.

భాండాగారం నిర్మాణం

అన్నమయ్య కాలం నాటికి వారి కీర్తనలన్నీ తాళపత్రాల పైనే (పూతపూయబడిన తాటి యాకులు) వ్రాయబడి ఉన్నాయి. తండ్రి గారి ఆదేశానుసారం, ఆయన తదనంతరం అన్నమయ్య తనయుడైన పెద తిరుమలయ్య ఈ కీర్తలన్నింటిని రాగిరేకులపై చెక్కించి వాటికి శాశ్వతరూపం కల్పించే కార్యక్రమానికి పూనుకున్నాడు. ప్రప్రథమంగా

ఈ భాండాగారం యొక్క ఉనికిని తెలిపిన తి.తి.దే. శాసనం 589 ప్రకారం; 1525–1530 సంవత్సరాల మధ్యకాలంలో, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి అచ్యుతరాయలు సహకారంతో, పెద తిరుమలాచార్యుడు ఈ భాండాగారాన్ని నిర్మించాడు. ఆయన కాలంలోనూ, వారి తర్వాత అన్నమాచార్యుని మనుమడైన "చిన తిరుమలాచార్యుల" వారి హయాంలోనూ వ్రాయబడిన కీర్తన లన్నింటిని తామ్రఫలకాలపై చెక్కించి ఈ భాండాగారంలో భద్ర పరిచారు. కీర్తనలు మలచబడ్డ మరికొన్ని రాగిరేకులను ప్రసిద్ధ వైష్ణవక్షేత్రాలైన అహోబిలం, మంగళగిరి, సింహాచలం, శ్రీరంగం మొదలైనవాటికి తరలించారు.

దక్కిన వెన్ని? కోల్పోయిన వెన్ని??

తిరుమల ఆలయంలోని ఈ సంకీర్తనాభాండాగారం తో పాటుగా, మిగిలిన ప్రదేశాలన్నింటిలో కలిపి మనకు దక్కిన మొత్తం రాగిరేకులు 2590. ప్రతి రేకుపై సగటున ఆరు కీర్తనల చొప్పున, మొత్తం 16,582 కీర్తనలు లభ్యమయ్యాయి. కొన్నింటిలో ఆరు కంటే ఎక్కువ కీర్తనలు కూడా ఉన్నాయి.

తర్వాతి కాలంలో, పురావస్తు పరిశోధకులు, రచనాశైలిని బట్టి, ఉపయోగించిన పదాలను బట్టి, కాలానుగుణంగా పరిణామం చెందిన భావగతులను బట్టి, ఈ కీర్తనలన్నింటినీ రచయితల వారీగా విభజించారు. ఆ వర్గీకరణ ప్రకారం

దొరికిన మొత్తం కీర్తనలలో -

- అన్నమాచార్యుడు స్వయంగా రాసినవి – 14,400
- వారి కుమారుడైన పెద తిరుమలాచార్యులచే రచింపబడినవి – 1,062
- మనుమడైన చిన తిరుమలాచార్యులు వ్రాసినవి – 1,120

అంటే, మొత్తం రచించినట్లుగా చెప్పబడుతున్న సుమారు 32 వేల కీర్తనలలో సగభాగాన్ని తెలుగు జాతి కోల్పోయింది. సంకీర్తనా సౌరభాన్ని ఆఘ్రాణించడం చేతగాక, "రాగం కంటే రాగి ముఖ్య" మను కొన్న అత్యాశాపరుల కారణంగా; ఆయా కాలాల్లోని దేవాలయ యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల; తెలుగుజాతికి తీరని నష్టం వాటిల్లింది.

అన్నమాచార్యుని వంశీయులు

16–17 శతాబ్దాల యందు ఉత్సవాల సమయాలలో అన్నమయ్య, పెద తిరుమలాచార్యులు, చిన తిరుమలాచార్యులు ఈ భాండాగారం ముందు మలయప్పస్వామి వారికి హారతినిచ్చి, నైవేద్యం సమర్పించే సాంప్రదాయం చాలా కాలం కొనసాగింది. తరువాతి కాలంలో నైవేద్య సమర్పణలు, నిత్యదీపారాధనలు, తాళ్ళపాక వారి ధర్మాదాయాలు వేర్వేరు కారణాల వల్ల రద్దయ్యాయి. తదనంతర పాలకుల నిర్లక్ష్యంతో విజయనగర రాజులు ప్రవేశపెట్టిన అనేక ప్రత్యేక ఉత్సవాలు కూడా కాలగర్భంలో కలిసిపోయాయి. అందుచేత సంకీర్తనా భాండాగారం ముందు హారతినిచ్చే సాంప్రదాయం కూడా అర్ధాంతరంగా ఆగిపోయింది. తర్వాతి కాలంలో అక్కడ ఒక అమూల్యమైన సాహిత్యనిధి నిక్షిప్తమై ఉందన్న విషయం కూడా మరుగున పడిపోయింది. భక్తులకు, అర్చకులకు, ఆలయ అధికారులకు, చివరకు తాళ్ళపాకవంశం వారికి కూడా ఈ భాండాగారం గురించిన సమాచారం పూర్తిగా లుప్తమై పోయింది. తదనంతర

కాలంలో, ఈ భాండాగారాన్ని తిరిగి వెలికి తీసిన తరువాత కూడా, వీరి వారసులు తమ పూర్వీకులు ముగ్గురు వ్రాసిన సంకీర్తనలను గానం చేసే వారే కానీ, సరిక్రొత్త కీర్తనలను రచించే సామర్థ్యాన్ని కోల్పోయారు. ఆ తరువాతి తరాల వారిలో కొంతమందికి ఆ శ్రీనివాసుడు కనీస సంగీత పరిజ్ఞానం కూడా ప్రసాదించలేదు. ఈ మధ్యకాలంలో, అన్నమయ్య పరంపరను అనూచానంగా కొనసాగించే లక్ష్యంతో, తాళ్ళపాక వంశీయులకు సంగీత కళాశాలలలో ప్రత్యేక శిక్షణనిచ్చి; సుప్రభాత, ఏకాంత సేవలలోనూ, ప్రత్యేక ఉత్సవాలలోను అన్నమాచార్యుని సంకీర్తనలను వీనులవిందుగా గానం చేయించే ఏర్పాటు జరిగింది. తిరుమలక్షేత్రంలో ఉగాది రోజున ప్రారంభమై 40 రోజులపాటు కొనసాగే శ్రీవారి నిత్యోత్సవాలలో, శ్రీనివాసుడు కేవలం అన్నమయ్య కీర్తనలను మాత్రమే వింటూ పురవీధుల్లో ఊరేగుతారు. ఏ విధమైన బాజాభజంత్రీలు, సంగీత వాయిద్యాల సంరంభం లేకుండా, అన్నమయ్య వారసులు తుంబురను మీటుతూ గానం చేస్తుండగా, ఆనందనిలయుడు మైమరచి వింటూ ముందుకు సాగుతాడు.

సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కృషి

తిరుమల ఆలయంలో మహంతుల ఆజమాయిషీ కాలం నుండి, ఆలయం తి.తి.దే. ఆధ్వర్యం లోకి వచ్చిన తర్వాత కూడా, 1919వ సం. నుండి 1944వ సం. వరకు పురాతత్వశాస్త్ర పరిశోధకుడిగా సేవల నందించిన సుబ్రహ్మణ్యశాస్త్రి గారి నిరంతర శ్రమ ఫలితంగా దేవాలయం నందలి విమానప్రదక్షిణంలో ఈ సంకీర్తనాభాండాగారం ఉన్నదని, అందులో అమూల్యమైన వారసత్వ సంపద అయిన వేలాది కీర్తనలు రాగిరేకులపై భద్రపరచబడి ఉన్నాయనే విషయాలు వెలుగులోకి వచ్చాయి. 1922వ సంవత్సరంలో ఈ రాగిరేకులను కొండపై నుండి తిరుపతి లోని తి.తి.దే. వారి కార్యాలయానికి చేర్చిన తరువాత, శాస్త్రిగారు వాటిలోని సంకీర్తనలను కాగితాలపై కాపీ చేశారు. అనేక సంవత్సరాలు కృషిచేసి అలా తయారు చేసిన కాగితపు వ్రాతప్రతులను మూడు భోషాణాలలో భద్రపరిచారు. అంతేగాకుండా, కొన్ని ముఖ్యమైన కీర్తనలను – "మైండ్ వర్త్", "ఆధ్యాత్మసంకీర్తనలు", "శృంగారసంకీర్తనలు" – అని మూడు సంపుటాలుగా ముద్రించి; శ్రీ కళాచారి వెంకటరమణ గారితో ఆ కవితలకు సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో, వివరణాత్మక వ్యాఖ్యానం కూడా వ్రాయించారు. అప్పటి పరిశోధనల ఫలితంగానే అన్నమయ్య జన్మదినం '1408వ సంవత్సరం, వైశాఖ శుద్ధపూర్ణిమ' అని సహేతుకంగా, శాస్త్రబద్ధంగా నిర్ధారింపబడింది. ఈ బృహత్తర కార్యక్రమం 1930 సంవత్సరం వరకు కొనసాగింది.

కార్యాలయ అధికారి నిర్వాకం

విధివశాత్తూ, 1931వ సంవత్సరంలో మలయప్పస్వామి వారికి అప్పటి గద్వాల మహారాణి వారు వజ్రకిరీటం తయారు చేయించాలని సంకల్పించింది. ఆ కిరీటం తయారీ కార్యక్రమాన్ని పర్యవేక్షించడం కోసం సుబ్రహ్మణ్యశాస్త్రి గారు చెన్నపట్టణానికి తరలి వెళ్లారు. ఆ వ్యవధిలో ముద్రణా కార్యాలయాన్ని వేరే ప్రదేశానికి తరలించాల్సి రావడం వల్ల; దేవస్థానానికి చెందిన ముద్రణాలయ అధికారి ఒకరు, శాస్త్రిగారు మూడు టేకు పెట్టెలలో పదిలపరచిన వ్రాతప్రతులను చిత్తు కాగితాలుగా భ్రమించి, వాటిని తగులబెట్టించి, ఖాళీ పెట్టెలను కొత్త కార్యాలయానికి క్షేమంగా చేరవేశాడు. అలా శాస్త్రిగారి శ్రమ చాలా భాగం బూడిదలో పోసిన పన్నీరై పోగా, వారు అంతకుముందే పొందుపరచిన

మూడు సంపుటాలలో గల అతి కొద్ది సంకీర్తనలు మాత్రం మనకు మిగిలాయి.

భాండాగారంలో బయటపడ్డ రాగిరేకుల లోని రకాలను, ఈ కీర్తనలను వెలుగులోకి తీసుకురావటం కోసం ఇంకెందరో మహానుభావులు చేసినట్టి అవిరళ కృషిని, తి.తి.దే. వారు చేపట్టిన "అన్నమాచార్య ప్రాజెక్టు" అనబడే బృహత్తర కార్యక్రమం గురించి సవివరంగా తెలుసుకుందాం.

అన్నమాచార్యుని రచనలను వెలుగులోకి తెచ్చి, ఆధ్యాత్మిక-ధార్మిక-నైతిక విలువలతో కూడిన ఆ అమూల్యమైన సాహిత్యసంపదను తెలుగు జాతికి అందించిన వారందరినీ తలచు కోవడం, తెలుగువారిగా మనందరి కర్తవ్యం! ఒక్కొక్కరు చేసిన కృషి సంక్షిప్తంగా చెప్పుకున్నా ఒక్కో ఉద్గ్రంథ మవుతుంది. "చంద్రునికో నూలుపోగు" అన్న చందంలో, అతి క్లుప్తంగా, వారందరినీ కొన్ని వాక్యాల్లో పరిచయం చేయడానికే ఈ చిన్ని ప్రయత్నం.

పండిత విజయ రాఘవాచార్యులు

సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారు తయారుచేసిన కీర్తనల వ్రాతప్రతులు టేకు పెట్టెలలో భద్రపరచినంత వరకు పూర్తిగా భస్మీపటలమై పోగా, వారు ఇతరత్రా ప్రదేశాల్లో పదిలపరచి నటువంటి అతికొద్ది వ్రాతప్రతులను మాత్రం పండిత విజయ రాఘవాచార్యులు గారు ప్రచురించి వెలుగులోకి తెచ్చారు.

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

ఆ తర్వాత 1945వ సంవత్సరంలో, తి.తి.దే. వారి ప్రాచ్యకళాశాలలో తెలుగుభాషా విభాగానికి అధ్యక్షునిగా ఉన్న శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు, సుబ్రహ్మణ్యశాస్త్రి గారు చేపట్టిన మహాయజ్ఞాన్ని పునఃప్రారంభించి, రాగి రేకుల యందు నిక్షిప్తమై ఉన్న వేలాది కీర్తనలను జనబాహుళ్యం లోనికి తీసుకు వెళ్ళడంలో సఫలీకృతు లయ్యారు. అప్పటినుండి అన్నమాచార్య కీర్తనలు తిరుమల-తిరుపతి దాటుకొని, ఆంధ్రదేశ మంతటా మాత్రమే కాకుండా, ఖండ ఖండాంతరాలకు విస్తరించి అన్నమయ్య ప్రతిభను, తెలుగునేల సౌభాగ్యాన్ని ప్రపంచమంతా చాటిచెప్పాయి. ప్రభాకరశాస్త్రి గారు రాగిరేకుల నన్నింటిని రచయితల వారిగా వర్గీకరించి, కీర్తనలను రెండు సంపుటాలుగా ప్రచురించారు. "అన్నమాచార్య చరిత్ర – పీఠిక" అనే గ్రంథాన్ని రచించి, అప్పటివరకు మరుగున పడి ఉన్న అన్నమాచార్యుని జీవితచరిత్రను ప్రాభవాన్ని వెలుగులోకి తెచ్చారు.

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారు

ఆ తర్వాత 1951వ సంవత్సరంలో, రాగిరేకుల లోని మరికొన్ని కీర్తనలను పఠన యోగ్యమైన ఈనాటి తెలుగుభాష లోకి అనువదించే బృహత్తర కార్యాన్ని తి.తి.దే. వారు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారికి అప్పగించారు. వారు వేలాది కీర్తనలను దాదాపు 20 సంపుటాలుగా ప్రచురించి, వాటిలో 108 కీర్తనలకు స్వరాలు సమకూర్చి, వాటిని వినసొంపుగా తీర్చిదిద్దారు. ఇంతే కాకుండా , అన్నమయ్య సాహిత్యంలో అంతర్లీనంగా ఉన్న కొన్ని కన్నడ, తమిళ, సంస్కృత శబ్దాలను అందుబాటులో ఉన్న నిఘంటువుల సహాయంతో ఆంధ్రీకరించారు. అన్నమాచార్యుడు తన

కీర్తనలను రాగయుక్తం చేసిన ముప్పయ్యొక్క రాగాలను కూడా వెలుగులోనికి తెచ్చి తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారు. రాగయుక్తంగా పాడగలిగే సంగీతపరిజ్ఞానం లేని వారు, ఆ కీర్తనలను కేవలం పద్యాలుగా చదువుకొని; అందులోని చమత్కారాలను, సందేశాలను, సూక్తులను అర్థం చేసుకోగలిగినా చాలుననే లక్ష్యంతో రెండు దశాబ్దాలపాటు వారీ మహా యజ్ఞాన్ని చేపట్టారు.

వారి తరువాత శ్రీనివాసాచార్యులు గారు, జగన్నాధరావు గారు, గౌరు పెద్దరామసుబ్బశర్మ గారు వంటి మహానుభావులెందరో తాళ్ళపాక వారి కీర్తనలను ప్రచురించి తెలుగుజాతికి అందించారు. వారందరికీ చేతులెత్తి నమస్కరిద్దాం!

రాగిరేకుల్లో రకాలు

పైన ఉదహరించిన మహానుభావు లందరూ కేవలం సాహిత్య సాధకులుగా మాత్రమే గాకుండా, అనువాదకులు గానూ, పురావస్తు శాస్త్రవేత్తలు గాను, జిజ్ఞాస కలిగిన పరిశోధకులు గానూ, ఇలా పలురకాలుగా సేవలందించారు. వారి కృషి ఫలితంగా రాగిరేకులన్నీ పరిమాణాన్ని బట్టి, విభజించ బడి; ఆయా రేకులు ఏ ఏ సందర్భాల్లో ఎలా ఉపయోగించ బడ్డాయో భావితరాలు తెలుసుకో గలిగే అవకాశం లభించింది.

సంకీర్తనాభాండాగారంలో లభ్యమైన తామ్రఫలకాలన్నీ వాటి పరిమాణాన్ని బట్టి నాలుగు రకాలుగా విభజించబడ్డాయి:

సాధారణ రేకులు

ఒకచోట స్థిరంగా ఉంచి ఉపయోగించడం కోసం వ్రాయబడ్డ ఈ రాగిరేకులను ఈనాటి గ్రంథాలయాలలో ఉండే "రిఫరెన్స్ పుస్తకాల" తో పోల్చవచ్చు. ఇలాంటి రేకులు మొత్తం 2531 లభ్యమయ్యాయి.

పెద్ద రేకులు

ఈ రేకులు ఉపరితలం పెద్దవిగా నుండి, ఒక్కొక్క గుత్తికి ఐదారు రేకుల చొప్పున ఇనుప కడియాలతో చుట్టబడి ఉన్నాయి. ఈ కడియాలలో పెద్ద పెద్ద కలప దుంగలను దూర్చి, వాటిని కావడి లాగా లేదా డోలీలాగా సుదూర ప్రాంతాలకు తరలించడానికి అనువుగా తీర్చిదిద్దారు. ఈ పెద్దరేకులలో కొన్నింటిని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు అహోబిల క్షేత్రానికి వెళ్ళి స్వయంగా అన్వేషించి సేకరించారు. ఇలాంటివి మొత్తం 36 రేకులు బయట పడ్డాయి. కీర్తనలు ప్రచారం చేసే సత్కార్యానికి ఆనాడే శ్రీకారం చుట్టబడిందన్న మాట!

శాసనపు రేకులు

ఈ రేకులు సాహిత్య పరమైన విలువల కంటే, చారిత్రక ప్రాధాన్యాన్ని ఎక్కువగా సంతరించు కున్నాయి. ఆయా కాలాల్లో అప్పటి రాజులు చేసినటువంటి సాహిత్యసేవ గురించి, అన్నమాచార్యులు, వారి వంశీయులకు సమకాలీన చక్రవర్తులు అందించిన సహకారం గురించిన వివరాలు, ఈ రేకులలో పొందు పరచబడి ఉన్నాయి. ఇవి కూడా ఇనుప తీగెలతో నాలుగైదు రేకుల గుత్తిగా కట్టబడి ఉన్నాయి. ఇలాంటి రేకులు కేవలం పది మాత్రమే లభ్యమయ్యాయి!

తాళపత్ర రేకులు

ఇవి మొత్తం 119 – తాళపత్ర ఆకృతిలో సన్నగా, పొడవుగా ఉంటాయి. బహుశా దేవాలయాలలో దేవునికి ఎదురుగా కూర్చుని లేదా సాహిత్య సమారోహాలలో పఠనం చేయడానికి వీలుగా ఇవి తయారు చేయబడ్డాయి. వీటిని ఈనాటి కరపత్రాలతో పోల్చవచ్చు.

అన్నమాచార్య ప్రాజెక్టు

పైన పేర్కొన బడ్డ మహానుభావు లందరి కృషి వల్ల అసంఖ్యాకంగా ఉన్న కీర్తనలను ప్రచురించడంలో ఎంతో పురోగతి సాధించబడింది. అయితే, అసలు సమస్య ఇప్పుడే మొదలైంది!

ఈ కీర్తనలు సామాన్య ప్రజానీకానికి చేరువ కాకపోతే వీరందరికి శ్రమకు అర్థం ఏముంది? దేశవిదేశాల్లో నివసిస్తున్న తెలుగు వారందరికీ ఈ కీర్తనలు దరిజేరాలంటే ఏంచేయాలి?

ఈ ప్రశ్నలకు సమాధానంగా ఆవిర్భవించిందే "**అన్నమాచార్య ప్రాజెక్టు**"!

పురందరదాసు కీర్తనలను కన్నడిగులకు చేరువ చేయడం కోసం తి.తి.దే. ఏ విధంగా "దాసప్రాజెక్టు" ను చేపట్టిందో, అదే లక్ష్యంతో తెలుగువారి కోసం "అన్నమాచార్య ప్రాజెక్టు" తి.తి.దే. ద్వారా రూపు దిద్దుకుంది.

ఈ బృహత్తర లక్ష్యంతో 1978 లో ప్రారంభింప బడిన "అన్నమాచార్య ప్రాజెక్టు" కు మొట్టమొదటి స్పెషలాఫీసరుగా, తి.తి.దే. కళాశాలకు ఆ కాలంలో అధ్యాపకునిగా ఉన్న కామిశెట్టి శ్రీనివాసులు గారు నియమింప బడ్డారు. సాహితీ సంపుటాలు తయారుచేసి ముద్రింప జేసే బాధ్యత అధ్యాపకులు సుబ్బరాయశర్మ గారిది కాగా; ఆ సంకీర్తనలకు సంగీతం జోడించి వాటిని జనబాహుళ్యంలోకి తీసుకొని వచ్చే మహత్తర కార్యక్రమాన్ని శ్రీనివాసులు గారు స్వయంగా చేపట్టారు. అప్పట్లో తి.తి.దే. సంగీత కళాశాలకు ప్రధానాధ్యాపకునిగా ఉన్న నేదునూరి కృష్ణమూర్తి గారి సారథ్యంలో కళాశాల విద్యార్థులు ఈ సంకీర్తనలకు బాణీలు కట్టేలా ప్రోత్సహింప బడి, వారికి ఆర్థిక సహాయం కూడా అందజేయబడింది. అలా వారి మార్గదర్శకత్వంలో తెలుగు జాతి గర్వించ దగ్గ గాయకులెందరో వెలికి వచ్చారు. మనకు సుపరిచితులైన శ్రీమతి శోభారాజు గారు, శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గారు ఆ కోవకు చెందినవారే!

ప్రాజెక్టు ముఖ్యోద్దేశాలు

తామ్ర పత్రాలను పర్యవేక్షించడం, కీర్తనలు ప్రచురింప చేయడం, వాటికి రాగ స్వర స్థానాలను నిర్దేశించడం, జనాకర్షణ కలిగిన గాయనీ గాయకులతో వాటిని గానం చేయించటం, ఔత్సాహిక గాయక బృందాలను ఏర్పరిచి వారిద్వారా కీర్తనలను ఊరూరా ప్రచారం చేయించడం, ప్రచారనిమిత్తం ఎలక్ట్రానిక్ మాధ్యమాలను విస్తృతంగా వినియోగించుకునే ప్రణాళికలు రచించి వాటిని అమలు పరచడం, భజనకీర్తనల ఆధారంగా చెక్క భజనలు, కోలాటాలు, బుర్రకథలు వంటి కళారూపాలను ప్రదర్శింప జేయటం, ఆ ప్రచార బృందాలలోని సభ్యులకు శిక్షణనిచ్చి వారిని తిరుమలలో ఏటా జరిగే మెట్లోత్సవానికి ఆహ్వానించడం, విద్యార్థులకు సంగీత పోటీలు నిర్వహించడం,

కీర్తనలకు అనుగుణంగా నృత్యరూపాలను ఏర్పరచడం, అన్నమాచార్యుని జన్మస్థలమైన తాళ్ళపాక గ్రామాన్ని తి.తి.దే. వారు దత్తత తీసుకొని దానిని ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం, విశ్వవిద్యాలయాలలో అన్నమయ్యపై పరిశోధనలను ప్రోత్సహించడం – ఈ ప్రాజెక్టు లక్ష్యాల్లో కొన్ని మాత్రమే!

తిరుపతి పట్టణానికి 93 కిలోమీటర్ల దూరంలో, తిరుపతి-కడప రహదారిలో, రాజంపేట పట్టణం దాటిన తర్వాత, తాళ్ళపాక గ్రామం సమీపం లోని బోయినపల్లి ప్రాంతం వద్ద, అన్నమాచార్యుని 600 జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయబడ్డ 108 అడుగుల ఎత్తయిన అన్నమాచార్యుని విగ్రహ ఆవిష్కరణ ఈ ప్రాజెక్టులో అంతర్భాగమే.

కడప జిల్లాలో చూసి తీరవలసిన ప్రదేశాలలో ముఖ్యమైనది ఈ విగ్రహం!

ఈనాడు మనం కోరుకున్న, అర్థసహస్రాబ్ది కాలం నాటి అన్నమయ్య గీతాన్ని; టీకాతాత్పర్యాలు, రాగం కీర్తనలతో సహా; అంతర్జాలంలో క్షణాలలో పొందగలుగుతున్నామంటే ఆ ఖ్యాతి చాలా వరకూ "అన్నమాచార్య ప్రాజెక్టు" కే దక్కుతుంది.

ఎందరో ఔత్సాహిక కళాకారుల, అంకితభావంతో పనిచేసే సిబ్బంది, పేరెన్నికగన్న సంగీత విద్వాంసుల అవిరళకృషితో నిర్ణీత లక్ష్యాలను శరవేగంగా సాధిస్తూ, తెలుగుజాతి కీర్తి కిరీటాలను సప్తగిరి శిఖరాల నుండి సప్తసముద్రాల కావలి వరకు తీసుకు వెళ్లడంలో ఈ ప్రాజెక్టు చాలా వరకు కృతకృత్య మయ్యింది! అయినా చేయ వలసింది ఇంకా ఎంతో మిగిలే ఉంది.

శ్రీవేంకటేశ్వరునిలో ఐక్యం

తొంభయ్యైదు సంవత్సరాల పాటు శ్రీనివాసుడి నుండి విడివడి, హరి యవతారంగా కీర్తించబడే, నందకఖడ్గ సంభూతుడైన అన్నమయ్య, స్వామివారితో సుదీర్ఘ విరహాన్ని భరించలేక 1503, దుందుభి నామ సంవత్సరం, ఫాల్గుణ బహుళ ద్వాదశి నాడు తన పాంచభౌతిక దివ్యశరీరాన్ని శాశ్వతంగా విడిచి తిరిగి స్వామివారిలో ఐక్యమై అమరుడయ్యారు!

----------: : ----------

శ్రీవారి సంవత్సర సేవలు

ఉగాది ఆస్థానం

తెలుగు లోగిళ్ళలో నూతన సంవత్సరపు తొలిరోజైన ఉగాది నాడు, సందర్భోచితంగా తెలుగువారి కొంగుబంగార మైన శ్రీవేంకటేశ్వరునికి ఉగాది ఆస్థానం జరుగుతుంది. తిరుమలేశుని వార్షికోత్సవాలు, ఉత్సవాలు అన్నీ ఉగాది తోనే మొదలవుతాయి.

ఉగాది పర్వదినాన ప్రాతఃకాల మందు, నిత్యసేవలైన సుప్రభాతసేవ, తోమాలసేవ యథావిధిగా పూర్తయిన తరువాత; ఉభయ దేవేరుల సమేతుడైన శ్రీమలయప్పస్వామి వారికి, సేనాపతి విష్వక్సేనులవారికి ఏకాంతంగా తిరుమంజనం జరుప బడుతుంది. తరువాత, బంగారువాకిలి ముందున్న మహామణిమంటపంలో గరుడాళ్వార్ కు ఎదురుగా స్వర్ణకాంతులీనే సర్వభూపాల వాహనం లో శ్రీదేవి భూదేవి సహిత మలయప్పస్వామి వారిని వేంచేపు చేస్తారు. పట్టు పీతాంబరాలతో, కిరీటాలతో, సర్వాభరణాలతో, పరిమళ భరితమైన పూలమాలలతో ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరిస్తారు. మలయప్పస్వామికి ఎడమవైపున మరో పీఠంపై దక్షిణాభిముఖంగా విష్వక్సేనులవారు ఆసీను లవుతారు. గర్భాలయంలోని మూలమూర్తికి, మిగిలిన ఉత్సవమూర్తు లందరికీ అన్నప్రసాదాలు నివేదించ బడతాయి. తదనంతరం, జియ్యంగార్లు, వారి పరిచారకులైన ఏకాంగులు, అధ్యాపకులు, అర్చకులు, వేదపండితులు వేదపారాయణం చేస్తారు. పెద్దజియ్యంగార్ మూలవిరాట్టు అలంకరణ నిమిత్తం ఒక వెండిపళ్లెంలో ఆరు పట్టువస్త్రాలను అర్చకులకు అందజేస్తారు. తరువాత అర్చకులు స్వామివారికి బంగారుపళ్లెంతో పచ్చ కర్పూర హారతినిచ్చి, అధికారులకు తీర్థ-చందనాదులను అందజేస్తారు. మరో రెండు పట్టు వస్త్రాలను బంగారువాకిలి కెదురుగా ఉన్న మలయప్పస్వామి వారికి, విష్వక్సేనులవారికి ఒక్కొక్కటి చొప్పున అలంకరిస్తారు. అనంతరం శ్రీవారి పాదపద్మాల పైనున్న పంచాంగాన్ని చేతిలోనికి తీసుకొని, ఆస్థానసిద్ధాంతుల వారు శ్రీవెంకటేశ్వరునికి నూతన పంచాంగశ్రవణం చేయిస్తారు. తరువాత, నూతన సంవత్సర ఫలాలను; అన్ని నక్షత్రాల వారి ఆదాయ-వ్యయాలు, రాజపూజ్యాలు, అవమానాలను, నిష్పత్తులతో సహా వివరిస్తారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణానక్షత్రం గురించి వివరించి, భక్తులందరినీ కాపాడ వలసిందిగా నవగ్రహ దేవతలను ఆదేశించమని; విశ్వమంతా సస్యశ్యామలంగా, అతివృష్టి అనావృష్టి వంటి ఈతి బాధలు లేకుండా చూడమని శ్రీవారిని ప్రార్థిస్తారు. తదుపరి శ్రీదేవి-భూదేవి అమ్మవార్లకు కూడా నక్షత్రఫలితాలు చెప్పి తీర్థ ప్రసాదాలు నివేదిస్తారు.

వైకుంఠ ఏకాదశి

తమిళులు అధికంగా అనుసరించే సౌరమానం లోని ధనుర్మాసంలో (అంటే మన మార్గశిర-పుష్య మాసాల్లో) వచ్చే శుక్లపక్ష ఏకాదశిని "వైకుంఠ ఏకాదశి" గా లేదా "ముక్కోటి ఏకాదశి" గా వ్యవహరిస్తారు. "ఏకాదశి" అనగా

"పదకొండు" అని అర్థం; అవి పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, మనస్సు. ఈ ఏకాదశముల పరిపూర్ణస్థితి యైన ప్రతి "ఏకాదశి" పవిత్రమైనదే. అందువల్లనే ఏకాదశి దినాన ఉపవాసముండే సాంప్రదాయం ఈనాటికీ కొనసాగుతోంది. అయితే, వైకుంఠ ఏకాదశి మరింత ప్రశస్తమైనది. ఈ ప్రాశస్త్యాన్ని వివరించే రెండు వృత్తాంతాలు మన పురాణాలలో ఉన్నాయి:

మొదటిది – ఈ తిథి యందే రావణుని బాధలను భరించలేని బ్రహ్మాది దేవతలు వైకుంఠాని కేగి తమను కాపాడ వలసిందిగా శ్రీహరిని వేడుకొని వారి నుండి అభయం పొందారు.

మరో వృత్తాంతం ప్రకారం – అదే తిథినాడు శ్రీమహావిష్ణువు మధుకైటభులనే రాక్షసులను సంహరించిగా; వారు దివ్య రూపాలు ధరించి ఆ రోజున ఉత్తరమార్గం ద్వారా ఆలయమందు ప్రవేశించి శ్రీహరిని కొలిచిన వారికి వైకుంఠ ప్రాప్తి కలిగించమని శ్రీమహావిష్ణువును ప్రార్థించారు.

ఈ విధంగా ఈ "ఏకాదశి" మోక్షప్రదాత కావున దీనిని "మోక్షోత్సవ దినం" గాను; ముక్కోటి దేవతల వెతలు బాపినందున దీనిని "ముక్కోటి ఏకాదశి" అని; వైకుంఠదర్శనం కలిగిస్తుంది కనుక దీనిని "వైకుంఠ ఏకాదశి" అని; భగవంతుని దర్శనం కలిగించేది కావున "భగవదవలోకనదినము" అని; వివిధ నామాలతో పిలుస్తారు.

ఏ రకంగా చూచినా, వైకుంఠ ఏకాదశి పరమ పవిత్రమైనదే!

కలియుగ వైకుంఠమైన శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం అత్యంత వైభవంగా జరుప బడుతుంది. ఏకాదశి ముందురోజు రాత్రి, ఏకాంతసేవ అనంతరం యథావిధిగా బంగారు వాకిళ్ళను మూసివేస్తారు. మరుసటి రోజు అనగా ఏకాదశి – తెల్లవారు ఝామున జరిగే సుప్రభాత వేళ మొదలుకొని, మరునాటి ద్వాదశి అర్ధరాత్రి జరిగే ఏకాంతసేవ పూర్తయ్యేవరకు, శ్రీవారి ఆలయానికి ఆనుకుని ఉన్న "ముక్కోటిప్రదక్షిణ" మార్గాన్ని భక్తుల సందర్శనార్థం తెరచి ఉంచుతారు. ఈ ప్రదక్షిణమార్గం యొక్క వివరాలను మనం ఇంతకు ముందే "విమానప్రదక్షిణం" ప్రకరణంలో వివరంగా తెలుసుకున్నాం!

ఈ రెండు రోజులు (ఏకాదశి–ద్వాదశి) శ్రీవారి దర్శనానంతరం భక్తులందరూ గర్భాలయ ప్రాకారాన్ని ఆనుకొని ఉన్న ముక్కోటి ప్రదక్షిణమార్గంలో ప్రదక్షిణ గావిస్తారు. ఈ ప్రదక్షిణమార్గం యొక్క ప్రవేశద్వారాన్ని "వైకుంఠద్వారం" అని, ఆ మార్గాన్ని "వైకుంఠప్రదక్షిణ" మని పేర్కొంటారు. ఈ రెండు రోజులు ఆ ప్రదక్షిణమార్గమంతా విద్యుద్దీపకాంతులతో, పరిమళాలను వెదజల్లే పుష్పమాలలతో ముగ్ధ మనోహరంగా అలంకరింప బడుతుంది. సంవత్సరకాలంలో కేవలం రెండు రోజులు మాత్రమే ప్రాప్తించే ఈ వైకుంఠప్రదక్షిణం కావించుకున్న భక్తులు ఒక విశిష్టమైన దివ్యానుభూతికి లోనవుతారు.

ఏకాదశి పవిత్ర దినాన – ముల్లోకాలలో కొలువై వున్న మూడు కోట్ల యాభై లక్షల పుణ్య తీర్థాలు, పుష్కరిణిలు – అన్ని తిరుమల లోని స్వామిపుష్కరిణి యందు సూక్ష్మరూపంలో లీనమై ఉంటాయని ప్రతీతి.

ఆరోజు ఉభయ దేవేరులతో కూడిన మలయప్పస్వామి వారికి కన్నుల పండువగా రథోత్సవం జరుగుతుంది. శ్రీవారి

సన్నిధిలో "రాపత్తుతొడక్కం" అనే వేడుకను ఘనంగా జరిపి, శ్రీనమ్మాళ్వార్ రచించిన "భగవద్విషయం" లేదా "తిరువాయ్ మొళి" అనే దివ్యప్రబంధం లోని "నాల్గవ ఆయిరం" అధ్యయనం ప్రారంభిస్తారు.

మరునాటి, ద్వాదశి తిథి యందలి సూర్యోదయ వేళలో "శ్రీస్వామిపుష్కరిణి తీర్థముక్కోటి" అనే ఘట్టం ఘనంగా జరుప బడుతుంది. ఆరోజు ఉదయం సేవలన్నీ యథావిధిగా జరిగిన తరువాత, ఆనందనిలయం లోని చక్రత్తాళ్వార్ (సుదర్శనచక్రం యొక్క ఉత్సవమూర్తి) పల్లకిని అధిరోహించి, తిరుమల మాడవీధుల్లో ఊరేగింపుగా వచ్చి శ్రీవరాహస్వామి ఆలయ ప్రాంగణం చేరుకుంటారు. అక్కడ చక్రత్తాళ్వార్ కు అభిషేకం జరిపి పుష్కరిణిలో స్నానం చేయిస్తారు. వారితో పాటుగా వేలాది మంది భక్తులు కూడా పుష్కరిణిలో పవిత్రస్నాన మాచరించిన తదనంతరం, చక్రత్తాళ్వార్ కు వస్త్రాలంకరణ గావించి, నివేదనలనిచ్చి, హారతులు అందజేస్తారు. ఆ తరువాత చక్రత్తాళ్వార్ వారు ఆలయ పునఃప్రవేశం చేస్తారు.

శ్రీవారి దర్శనానంతరం అసంఖ్యాకమైన భక్తులు వైకుంఠప్రదక్షిణం గావిస్తున్నందున, ఈ వైకుంఠ ఏకాదశి ఉత్సవాన్ని "వైకుంఠద్వారస్థ భగవదవలోకన మహోత్సవం" గా కూడా అభివర్ణిస్తారు.

----------: : ----------

తిరుమలకు చేరుకుందాం!

సప్తగిరుల సమారోహమైన తిరుమలక్షేత్రం లోని ఏడవ శిఖరం "వేంకటాద్రి" పై నెలకొన్న ఆనందనిలయంలో శ్రీనివాసుడు కొలువై ఉన్నాడు.

తిరుమలకు నడక మార్గాలు

తిరుమలక్షేత్రం చేరుకోడానికి అనాదిగా నాలుగు ముఖ్యమైన మార్గాలున్నాయి:

- చిత్తూరు జిల్లాలో ప్రసిద్ధ పర్యాటక స్థలమైన తలకోన నుండి అరణ్యమార్గంలో దాదాపు నలభై కిలోమీటర్లు ప్రయాణించి తిరుమలకు చేరుకోవచ్చు. కాలాంతరాన ఈ మార్గం పూర్తిగా కనుమరుగై పోయింది.
- రెండవమార్గం కడప జిల్లా నుండి వచ్చేవారికి అనుకూలంగా ఉండేది. ఈ మార్గం కడప పట్టణంలో ప్రస్తుతం "దేవునిగడప" గా ప్రాచుర్యం పొందిన వేంకటేశ్వరుని ఆలయం నుండి ప్రారంభ మయ్యేదని చెబుతారు. అచ్చటి నుండి కుక్కలదొడ్డి, మామండూరు గ్రామాల మీదుగా కనుమలతో కూడుకున్న అడవుల్లో సాగిపోయే ఈ మార్గం ప్రస్తుతం చాలావరకు శిథిలమైపోయింది. అయితే, ఈ దారిలో పురాతన సోపానమార్గపు ఆనవాళ్లు, కొన్ని విశ్రాంతి మంటపాలు ఇప్పటికీ కనిపిస్తాయి. తిరుమలక్షేత్ర మందు పాపనాశనం వెళ్లేదారిలోని "గోగర్భం" ఆనకట్ట ప్రక్కన ఉన్న "ఈతకాయల మంటపం" వాటిలో ఒకటి. ఇప్పటికీ అప్పుడప్పుడు కొందరు ఔత్సాహికులు అటవీశాఖ వారి ప్రత్యేక అనుమతితో, విశేష సందర్భాలలో ఈ మార్గం ద్వారా తిరుమలకు చేరుకుంటారు. అపాయాలతో కూడుకున్న, జనసంచారం లేని ఈ మార్గంలో ఒంటరిగా ప్రయాణించడం ఒకరకంగా సాహసయాత్రే!
- మూడవది మనలో చాలామందికి సుపరిచితమైన తిరుపతి పట్టణం లోని "అలిపిరి" నుండి మొదలయ్యేది.
- నాలుగవ మార్గం చంద్రగిరి పరిసర ప్రాంతం నుండి బయలుదేరి తిరుమలకు చేరుకుంటుంది. దీనినే "శ్రీవారిమెట్లు' గా పిలుస్తారు.

ఇవే కాకుండా, తిరుమల క్షేత్రానికి నలుదిక్కుల నుంచి ఇంకా అనేక మార్గాలు ఉన్నట్లుగా చెబుతారు. పురాణాల ననుసరించి కపిలతీర్థం ఆలయం నుండి ఒక రహస్యమైన సొరంగమార్గం కూడా ఉండేది. తొండమాన్ చక్రవర్తి ఆ మార్గం గుండా వెళ్లి స్వామిని సేవించుకునే వాడు.

ప్రస్తుతం "**అలిపిరి**" మరియు "**శ్రీవారిమెట్లు**" నడకమార్గాలు లేదా మెట్లమార్గాలు మాత్రమే (వాహనాలు వెళ్ళి వచ్చే రెండు ఘాట్ రోడ్ లు కాకుండా) వాడుకలో ఉన్నాయి.

నడక మార్గంలో మెట్లు

1850వ సంవత్సరంలో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం యాత్రికుల సౌలభ్యం కోసం కొండమీదకు ఉన్న నడకదారిలో మెట్లను నిర్మించింది. 1953వ సంవత్సరంలో ఆలయం తి.తి.దే. ఆధ్వర్యం లోకి వచ్చిన తర్వాత, 26 వేల రూపాయల

ఖర్చుతో ఆ మెట్లమార్గం అభివృద్ధి చేయబడింది. ఈ మెట్లు నిర్మించక ముందు, అంటే దాదాపుగా 150 సంవత్సరాల క్రితం, తిరుమల యాత్ర దుర్గమంగా ఉండేది. మార్గమధ్యంలో తరచుగా తారసపడే చిరుతలు, ఎలుగుబంట్ల వంటి క్రూర జంతువులను పారద్రోలటానికి డప్పులు వాయించేవారు; రాత్రులందు మంటలు కూడా వేసేవారు. దొంగల భయం అధికంగా ఉండడం చేత యాత్రికులు సమూహాలుగా మాత్రమే వెళ్లేవారు. భక్తులు లోయలు, రాళ్ళు, రప్పలు, ముళ్ళపొదలు, క్రిమికీటకాలతో నిండిన అరణ్యమార్గంలో అత్యంత ప్రయాసతో సపరివార సమేతంగా ప్రయాణిస్తూ; మధ్యలో వంటా–వార్పు చేసుకునే వారు. మధ్య మధ్యలో మంచినీటి కోసం దిగుడు బావులు, విశ్రాంతి తీసుకోవడానికి 'ఠాణాలు" గా పిలువబడే మండపాలు ఉండేవి. ఎందరో మహారాజులు, జమీందార్లు వారి పేరు మీదా లేదా వారి కుటుంబ సభ్యుల పేరు మీదా ఈ మంటపాలను నిర్మించి, "మానవసేవే మాధవసేవ" యని ఆనాడే చాటిచెప్పారు. అంగవైకల్యం కలవారిని, వయోవృద్ధులను పల్లకీలా ఉండే డోలీల ద్వారా కొండకు చేర్చడానికి ప్రత్యేకంగా కూలీలు ఉండేవారు. అందుకుగాను మనిషికి పది అణాలు, అంటే కేవలం 60 పైసలు, కూలి వసూలు చేసేవారు. ఈ డోలీలు నిలుపుకోవడానికి, ఆలయ సమీపంలో ఒక "డోలీ మంటపం" కూడా ఉండేది. ఈ ప్రదేశాన్ని ఇప్పుడు "డోలీ మంటపం బ్లాకు" లేదా "డి ఎం బి" గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి నుండి సన్నిధివీధి మీదుగా వెళ్లి ఇప్పుడున్న క్యూ కాంప్లెక్సుతో ఏమాత్రం సంబంధం లేకుండా నేరుగా మహాద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించి దర్జాగా శ్రీవారిని దర్శించుకునే వారు.

ఘాట్ రోడ్డు నిర్మాణం

భక్తుల సంఖ్య క్రమంగా పెరగటంతో, 1940వ సంవత్సరంలో అప్పటి ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం కొండమీదకు రోడ్డు మార్గం వేసే నిమిత్తం బ్రిటిష్ అధికారులతో సర్వే జరిపించింది. అనేక ఇబ్బందులను అధిగమించిన తరువాత 1944వ సంవత్సరం, ఏప్రిల్ నాటికి అలిపిరి నుండి తిరుమల వరకు ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. అప్పట్లో అదో మహాద్భుతం!

తెలుగువారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. శ్రీవేంకటేశ్వరుడు తమకు చేరువై పోయినట్లు, తమ నట్టింట్లో కొలువై ఉన్నట్లు అనుభూతి చెందారు. మొక్కులు, ముడుపులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగి పోయాయి.

అప్పటి మద్రాస్ రాష్ట్ర గవర్నర్ ఆర్థర్ హోప్ లాంఛనప్రాయంగా ఆ రోడ్డును ప్రారంభించారు. మొదట్లో ఎడ్లబండ్లు, జట్కాబండ్లు మాత్రమే తిరిగేవి. తరువాతి కాలంలో తి.తి.దే. వారు తిరుమల–తిరుపతి మార్గంలో బస్సు సర్వీస్ ప్రారంభించడంతో యాత్రికుల సంఖ్య విపరీతంగా పెరిగి, తదనుగుణంగా బస్సుల సంఖ్య కూడా పెంచాల్సి వచ్చింది. 1974వ సంవత్సరంలో రెండో ఘాట్ రోడ్డు వేసి, బస్సుల రాక పోకలకు వేరు వేరు మార్గాలను నిర్ధారించారు, దాంతో ప్రయాణం మరింత సురక్షితం, వేగవంతం అయ్యింది.

శ్రీవారి భక్తులు భారతదేశ మంతటా, విదేశాల్లోనూ వ్యాపించి ఉన్నప్పటికీ తిరుమలకు విచ్చేసే వారిలో సింహభాగం దక్షిణ భారతీయులే ఉంటారు. వారిలో కూడా తెలుగు, తమిళ, కన్నడ యాత్రికులు; సంఖ్యను బట్టి వరుసగా మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో ఉంటారు. తెలుగువారికి తిరుమల యాత్రకు సంబంధించి నిర్దిష్టమైన విధివిధానలేవీ

పెద్దగా లేవు. శ్రీవేంకటేశ్వరుని అత్యంత ఆప్తునిగా, తమ కుటుంబసభ్యుల్లో ఒకనిగా భావించే తెలుగువారు ఎప్పుడనుకుంటే అప్పుడు శ్రీవారిని సాదా–సీదాగా, శుచి–శుభ్రతలతో గుండెలనిండా భక్తితో దర్శించుకుంటారు.

కానీ, తమిళులు, కన్నడిగులు మాత్రం విలక్షణమైన రీతిలో తమ తమ సాంప్రదాయాల కనుగుణంగా తిరుమల యాత్ర చేపడతారు.

తమిళుల యాత్రావిధానం

తమిళులు ఎక్కువగా సౌరమానంలో వచ్చే పెరటాసి మాసంలో శ్రీవారిని సందర్శించు కుంటారు. సాక్షాత్తు శ్రీమహావిష్ణువు, శ్రీవేంకటేశ్వరునిగా అవతరించిన మాసమిది. సెప్టెంబరు–అక్టోబరు నెలల్లో వచ్చే ఈ పెరటాసి మాసపు మూడవ శనివారం తమిళులకు అత్యంత పవిత్రమైనది. తమిళులు ఎక్కువగా బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాలలో శ్రీవారిమాల ధరించి, గోవిందనామాలు స్మరిస్తూ, వందలాది మైళ్లు ఏకధాటిగా నడుస్తూ తిరుమలకు చేరుకుంటారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా పసుపు బట్టలు, గోవిందమాల ధారణతో ఉన్న తమిళ భక్తులతో చిత్తూరు జిల్లా వీధులన్నీ పసుపుపచ్చగా కనువిందు చేస్తాయి. పాదయాత్ర ద్వారా తిరుమల చేరుకునే భక్తులు ఎక్కువగా తిరువళ్ళూరు, తిరుత్తణి, వేలూరు, చెంగల్పట్టు, కాంచీపురం, పుదుచ్చేరి, చెన్నై తదితర ప్రాంతాల నుండి వస్తారు. నడచి వచ్చే యాత్రికుల సౌకర్యార్థం ఆయా మార్గాలలో విజయనగర రాజుల హయాంలో విశ్రాంతి మండపాలు ఏర్పాటు చేయబడ్డాయి.

ఈ భక్తులు నలభై రోజుల పాటు చన్నీళ్ల స్నానంతో, మద్యమాంసాలకు దూరంగా ఉండి, ఒంటిపూట భోజనంతో, నిత్య పూజలు నిర్వహిస్తూ, కఠోర దీక్ష వహిస్తారు. ఎండావానలను లెక్కచేయకుండా, పాదరక్షలు లేకుండా యాత్రను కొనసాగిస్తారు. పెరటాసిమాసంలో వచ్చే శనివారాలలో తలస్నానం చేయడం, తిరునామం ధరించడం, ఉపవాసదీక్ష చేయడం, పిండిదీపాలు వెలిగించడం తమిళ శిష్టాచారాలలో భాగాలు! ఈ మాసంలో తిరుమలక్షేత్ర మంతా ఊర్ధ్వపుండ్రాలు (తిరునామాలు) ధరించిన తమిళభక్తులతో సందడిగా ఉంటుంది.

కన్నడిగుల తిరుమల యాత్ర

శ్రీవారి మహాభక్తులైన పురందరదాసు, కనకదాసు విజయదాసు వంటి వాగ్గేయకారుల కీర్తనలు పాడుకుంటూ, కోలాటమాడుతూ, భక్తిశ్రద్ధలతో ప్రతి మెట్టుకు పసుపు కుంకుమలు అలంకరిస్తూ, తిరుమలకు చేరుకోవడం కన్నడిగుల సాంప్రదాయం. దీనినే "మెట్లోత్సవం" అని కూడా పిలుస్తారు. ఒకప్పుడు కన్నడిగులు కూడా తమిళుల వలెనే తమ తమ గ్రామాల నుండి గుంపులు గుంపులుగా నడుచుకుంటూ తిరుమలకు చేరుకునే వారు. కానీ ఇప్పుడు మాత్రం సుదూర ప్రాంతాల నుండి కన్నడిగులు కాలినడకన పెద్దగా రావడం లేదు. తిరుపతి పరిసర ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో నివసించే కన్నడిగులు మాత్రమే ఎక్కువగా నడక యాత్ర ద్వారా శ్రీవారిని దర్శించు కుంటున్నారు. బ్రహ్మోత్సవాలలో గరుడసేవకు, రథసప్తమి ఉత్సవానికి కన్నడిగులు అధికంగా హాజరవుతారు.

భాష–ప్రాంతంతో సంబంధం లేకుండా, నడకదారి యందలి భక్తులందరిలోనూ అపరిమితమైన భక్త్యావేశాలు

పెల్లుబుకుతూ ఉంటాయి. మెట్లమార్గ మంతా దిక్కులు పిక్కటిల్లే గోవిందనామ స్మరణతో మార్మోగిపోతూ, అడుగడుగు దండాలతో తిరుణాళ్ళను తలపిస్తూ ఉంటుంది. మోకాళ్ళపై మెట్లెక్కే భక్తులు కొందరైతే, మెట్టుమెట్టుకు పసుపుకుంకుమలు అలంకరించే వారు మరికొందరు!

ముక్కుపచ్చలారని పసివారు, అలవోకగా మెట్లెక్కే యువతీ యువకులు, ఆయాసంతో ఆపసోపాలు పడే నడివయస్కులు; మనుమల సాయంతో పళ్ళబిగువున నడకసాగించే వయసు మళ్ళినవారు ఇలా అన్ని వయసులవారు మనకు నడకయాత్రలో తారసిల్లుతారు.

అలిపిరి మార్గం

తిరుపతి నుంచి తిరుమలకు చేరుకోవడానికి ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న రెండు మార్గాలలో, భక్తులు అధికంగా వెళ్ళేది అలిపిరి మార్గంలోనే. తొమ్మిది కిలోమీటర్ల పొడవైన ఈ మార్గం 3550 మెట్లు కలిగి ఉంటుంది. "శ్రీవారిమెట్లు" మార్గంతో పోల్చితే, అలిపిరి మార్గంలో వెయ్యికి పైగా మెట్లు ఎక్కువ. దూరం కూడా అధికమే! అయినా, తిరుపతి పట్టణానికి అతి చేరువలో నుండటం, దారిపొడవునా అనేక రసరమ్య భరిత ప్రకృతి దృశ్యాలు చారిత్రక విశేషాలు ఉండటం, మధ్య మధ్యలో మెట్లు ఎక్కే అవసరం లేకుండా చాలా భాగం నడకదారి ఉండి అలసట తక్కువగా అనిపించడం; వంటి కారణాల వల్ల ఈ మార్గం ఎక్కువగా ప్రసిద్ధి చెందింది.

సులభతరమైన సోపానాలు

గ్రానైట్ దిమ్మలతో చేయబడి, మెట్లన్నీ దాదాపు తొమ్మిదంగుళాల ఎత్తు, ఒక అడుగు వెడల్పు కలిగి ఉంటాయి. ప్రతి ఐదారు మెట్లకు నాలుగైదు అడుగుల వెడల్పు కలిగిన ఒక పెద్ద మెట్టు ఉండటంతో, అలసట తక్కువగా అనిపిస్తుంది. మెట్లన్నీ దాదాపు 12 అడుగుల పొడవుంటాయి. దారి మధ్యన ఉన్న స్టెయిన్లెస్ స్టీల్ రైలింగ్ మెట్లెక్కే వారికి ఊతంగా పనిచేస్తుంది. బాటకు ఇరువైపులా కొద్దిసేపు కూర్చొని విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా, రెండడుగుల మందం కలిగిన సిమెంటు అరుగులు ఉంటాయి. ప్రతి యాభయ్యవ మెట్టు మధ్యభాగంలో, ఆ మెట్టు యొక్క సంఖ్య చెక్కబడి ఉంటుంది. అలాగే, ప్రతి రెండు-మూడొందల మెట్లకూ, బాటకు ప్రక్కగా; మనం ఎక్కేసిన మెట్లు, ఇంకా ఎక్కవలసిన మెట్లను సూచించే బోర్డులు ఉంటాయి. ఒక్కో బోర్డు చూడగానే, ఒక్కో రాజ్యాన్ని జయించినంత సంబరం కలిగి, తాజా ఉత్సాహాన్ని పుంజుకుంటాం. దాదాపు మార్గమంతా సిమెంట్ రేకులు, కాంక్రీట్ పైకప్పుతో యాత్రికులకు ఎండావానల నుండి రక్షణగా ఉంటుంది. మార్గం పొడవునా తినుబండారాల అంగళ్ళు, మంచినీటి ఏర్పాట్లు, శౌచాలయాలు ఉండటంతో భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగదు. కాంక్రీట్ కప్పును నిలబెట్టే సిమెంట్ స్తంభాలన్నింటిపై గోవిందనామాలు వ్రాయబడి భక్తి భావాన్ని ఇనుమడింప జేస్తాయి. అలాగే సగం మార్గం దాటిన తరువాత బాటకు ప్రక్కగా, గోడలపై విష్ణుసహస్రనామాలు చెక్కబడిన గ్రానైట్ పలకలు అమర్చబడి ఉన్నాయి. మరి కొంత దూరం తరువాత కనకధారా స్తవం కూడా చెక్కబడి ఉంది.

దాదాపుగా మార్గమధ్యలో కానవచ్చే 30 అడుగుల ఆంజనేయుని ప్రతిమ వరకూ, సుమారు ప్రతి 200 మెట్లకు ఒకటి

చొప్పున దశావతార విగ్రహాలు – మత్స్యావతారం మొదలుకొని కల్క్యావతారం వరకు – ఈ మధ్యనే ప్రతిష్ఠింపబడ్డాయి. ఆ తరువాత, దాదాపు ప్రతి నూరు మెట్లకు ఒకటి చొప్పున విష్ణుభక్తిలో మునిగి తేలిన పన్నెండుగురు ఆళ్వారుల విగ్రహాలు ప్రతిష్ఠింపబడ్డాయి.

ప్రకృతిసోయగం

దట్టమైన అడవులతో కూడుకున్న ఈ పర్వతమార్గం ముగ్ధమనోహరమైన ప్రాకృతిక దృశ్యాలకు ఆలవాలం. మార్గానికి ఇరు ప్రక్కలా పచ్చతివాచీ పరచి నట్లుంటుంది. అల్లంత దూరంలో ఉన్న లోయలకావల పచ్చదనం అంతగా లేకుండా నునుపుగా కనుపించే బండరాతి పర్వతశిఖరాలపై ప్రతిబింబించే సూర్యకాంతి, తెల్లని మంచుతో కప్పబడి ఉన్న హిమవత్పర్వత శిఖరాల శోభను తలపిస్తుంది. శేషాచల అడవుల్లో విరివిగా పెరిగే ఔషధమొక్కల పైనుండి వీచే పిల్లతెమ్మెరలు స్వేదంతో కూడిన శరీరంపై మెల్లమెల్లగా వీస్తుంటే, అలసట అటకెక్కి పోతుంది. దట్టమైన వృక్షాల ఆకుల మధ్యభాగం లోని సన్నని రంధ్రాల ద్వారా చొచ్చుకు వస్తున్న సూర్యకిరణాలు, జోరువానలో ఏటవాలుగా కురిసే వాడి అయిన వర్షపు జల్లులను తలపిస్తాయి. వర్షరుతువులో అయితే, లెక్కకు మిక్కిలిగా ఉన్న చిన్నా–పెద్దా జలపాతాలు, పిల్లకాలువలు కూడా కనువిందు చేస్తాయి.

అక్కడక్కడా హోరుగాలుల అలజడి, దూరంగా పారుతున్న నీటి ఒరవడి, ఎండుటాకుల సవ్వడి, పక్షుల కిలకిలారావాలు, గండుతుమ్మెదల ఝుంకారాలు, భక్తుల గోవిందనామ స్మరణలు, పర్వరసానువుల్లో ప్రతధ్వనిస్తూ లౌడ్ స్పీకర్ల ద్వారా దాదాపు మార్గమంతా వినవచ్చే అన్నమయ్య కీర్తనలు కలగలిసి పోయి భక్తులకు అనిర్వచనీయమైన, ఆధ్యాత్మిక తత్వంతో కూడిన శ్రవణానందం కలుగజేస్తాయి.

దాదాపు రెండువేల మెట్ల ఇంతవరకూ తిరుపతి పట్టణం శోభాయమానంగా దర్శనమిస్తుంది. పట్టణం లోని పెక్కు అంతస్తుల దివ్య హర్మ్యాలు అగ్గిపెట్టెల వలె గోచరిస్తాయి.

వృక్ష – జంతుజాలాలు

శేషాచల పర్వతాలు జీవవైవిధ్యానికి ఆటపట్లు. ఈ దట్టమైన అడవుల్లో దాదాపు 50–60 సంవత్సరాల క్రితం వరకు, దక్షిణ భారతదేశంలోనే అత్యధికమైన జంతు జాతులు నివసించేవి. అయితే జనసాంద్రత పెరగడంతోనూ, పలు అభివృద్ధి కార్యక్రమాలు చోటు చేసుకోవడం వల్లనూ; జంతుజాతులు అంతరించి పోతున్నాయి. ఇప్పుడు మనకు సాధారణంగా కనుపించే వన్యప్రాణులలో పిల్ల కోతిని కడుపుకు కరచుకొని, జంకు గొంకు లేకుండా ఛెంగుఛెంగున గంతులేసే వానరాలు; నల్లటి ముఖాలు, పొడపాటి తోకలు కలగి, చెట్లకొమ్మలపై నుండి చోద్యం చూస్తున్న కొండముచ్చులు; చారెడేసి కళ్ళు, వంకర్లు తిరిగిన కొమ్ములతో బిరబిరా పరుగులు తీసే లేళ్లు; ఆహారం కోసం అర్రులు చాస్తూ, అమాయకత్వం పోతపోసినట్లుండే నేత్రాలతో ఉన్న దుప్పులు; అత్యంత అరుదుగా కలుగుల్లోకి ఆతృతగా పరుగులు తీసే సరీసృపాలు; చిరు కోరలతో చిర్రుబుర్రులాడుతున్న అడవిపందులు; రంగు రంగుల సీతాకోక చిలుకలు; మార్గమంతా సందడి చేసే అడవి పిచ్చుకలు; పరుగులలో పోటీపడుతున్న ఉడుతలు; ముదురు

గోధుమరంగుతో ఉన్న పొడవాటి శరీరం కలిగి, చెట్ల కొమ్మల అంచులలో సయ్యాట లాడుతున్న బెట్లుడుతలు ముఖ్యమైనవి. అటవీశాఖ సిబ్బంది కళ్ళు కప్పి – చిరుతలు, ఎలుగుబంట్లు, ఏనుగులు కూడా – చాలా అరుదుగా, మెట్లమార్గంపై సందడి చేస్తుంటాయి. అయితే అనుభవం, నైపుణ్యం కలిగిన అటవీశాఖ సిబ్బంది ముందుజాగ్రత్త చర్యలతో ఇంతవరకు ప్రాణనష్టం జరిగిన దాఖలాలు దాదాపుగా లేవనే చెప్పాలి!

అలాగే, అసంఖ్యాకమైన వృక్షజాతులకు కూడా సప్తగిరులు ఆలవాలాలు. ఈ మార్గంలో కనిపించే వాటిలో – వేప, మద్ది, రావి, జువ్వి, మర్రి, తంగేడు, దేవదారు, అశోక, బ్రహ్మజెముడు, తుమ్మ మొదలైన వృక్షరాజాలు; పున్నాగ, కదంబ, మోదుగ, గన్నేరు, సంపంగి, చామంతి, మందార, జాజి, గులాబి మొదలైన పూలచెట్లు; సీతాఫలం, మామిడి, జామ, సపోటా, మునగ, పనస మొదలగు ఫలవృక్షాలు; వృక్షకాండాలకు చుట్టుకొని ఉన్న మాలతీ లతలు, సన్నజాజి తీగెలు – ముఖ్యమైనవి. వీటిలో అడవులలో సహజసిద్ధంగా పెరిగే వృక్షాలతో పాటు, ఉద్యానవన శాఖ సిబ్బంది శ్రద్ధగా పెంచే పలురకాల ఫల, పుష్ప జాతులు కూడా మిళితమై ఉన్నాయి.

అలిపిరి అంటే?

తిరుమలకు మెట్లదారి మరియు కొండపైకి వాహనాలు వెళ్ళే ఘాట్ రోడ్డు, రెండూ ఒకే ప్రదేశంలో, అంజలి ఘటిస్తూ సమున్నతంగా నిల్చొని ఉన్న గరుత్మంతుని విగ్రహం వద్ద ఆరంభ మవుతాయి. ఆ ప్రదేశాన్నే "అలిపిరి" గా పిలుస్తారు. దానికా పేరు రావడం వెనుక అనేక కథనా లున్నాయి –

- "ఆదిపడి" అనే తమిళ పదబంధంలో – "ఆది" అనే పదానికి "మొట్టమొదట" అని, "పడి" అనే పదానికి "గట్టు" లేదా "ద్వారము" అని అర్థం. తిరుమల కొండకు చేరుకునే మొట్టమొదటి "మెట్టు" ఇక్కడే ఉంటుంది కాబట్టి ఈ ప్రదేశానికి "ఆదిపడి" అనే నామం ఏర్పడి, అదే కాలక్రమంలో "అలిపిరి" గా ఆంధ్రీకరించబడింది.
- మరో కథనం ప్రకారం, తిరుమలకు ఉన్నట్లుగా చెప్పబడే అనేక మార్గాల్లో, చారిత్రకాధారాలు లభ్యమైనంత వరకూ, ఇదే ప్రప్రథమ మార్గం. అందువల్లనే దీనిని "ఆదిపడి" లేదా "అలిపిరి" అని పిలుస్తారు.
- ఈ ప్రదేశంలో, శ్రీవైష్ణవులు పరమ పవిత్రంగా భావించే, శాఖోపశాఖలు కలిగిన "చింతచెట్టు" ఉండేది. చింతచెట్టు తొర్రలో నుండే తమిళుల ఆరాధ్య దైవమైన నమ్మాళ్వారుల వారు ఉపదేశం చేశారని ప్రతీతి. తమిళంలో – చింతచెట్టును "పులి" గానూ (చింతపండుతో చేసే పులి హోరను గుర్తుకు తెచ్చుకుందాం!), పర్వతపాదాన్ని "అడివారం" గానూ వ్యవహరిస్తారు. అందువల్ల, పర్వత ప్రారంభంలో ఉండే ఈ చింతచెట్టును "అడివారపు పులి", లేదా "అడిపులి" గా పిలిచేవారు. అదే, కాలక్రమాన "అలిపిరి" గా రుపాంతరం చెందింది.
- "అలిపిరి" అంటే, "సూక్ష్మరూపం కలిగిన" అనే మరో అర్థం వస్తుంది. ఇక్కడ శ్రీనివాసుడు "సూక్ష్మరూప ధారి" గా కొలువై ఉంటాడనే నమ్మకం ఉండటం చేత, ఆ ప్రదేశానికి "అలిపిరి" అనే పేరు వచ్చింది.

శ్రీవెంకటేశ్వరుని మహిమను సాక్షాత్కరింప జేసే మరో అద్భుతమైన, చారిత్రాత్మక కథనం కూడా ఉంది. అదేంటంటే.

నాటి "అలీఫిరే!" నే ఈనాటి అలిపిరి

'అలిపిరి' కి ఆ పేరు రావడం వెనుక, ఒక అజ్ఞాతభక్తుడు విరచించిన "వేంకటాచల విహారశతకము" అనే గ్రంథంలో మరో కథనం కూడా ఉంది. దాని ప్రకారం, పదిహేడవ శతాబ్దం ద్వితీయార్థంలో, ఢిల్లీలో మొఘలు చక్రవర్తుల పరిపాలన నడుస్తోంది. దక్షిణాన శ్రీకృష్ణదేవరాయల అనంతరం జరిగిన రాక్షసితంగడి, తళ్ళికోట యుద్ధాల తరువాత విజయనగర రాజుల ప్రాబల్యం క్షీణించడంతో; మొఘలు చక్రవర్తులకు సామంతునిగా ఉన్న నిజాం నవాబు రాయలసీమ ప్రాంతాన్ని ఆక్రమించి, హిందూ దేవాలయాలపై అత్యాచారాలు చేయసాగాడు. ఆ శతాబ్దపు చివరి దశకంలో, ఢిల్లీకి ఆజ్ఞాబద్ధుడైన నిజాంనవాబు "అలీ" అనబడే కరుడుగట్టిన మహమ్మదీయ ఛాందసవాది ఆధ్వర్యంలో తన అపరిమిత సైన్యాన్ని తిరుమల దేవాలయంపై దండయాత్రకు పంపాడు. హైందవమతానికి ఆయువుపట్టైన శ్రీవేంకటేశ్వరుని ఆలయాన్ని ధ్వంసం చేయడం ద్వారా హిందూమతాన్ని నిర్వీర్యం గావించి, ఇస్లాం మతాన్ని వ్యాప్తి చేయడమే గాకుండా; అంతకు ముందు శ్రీకృష్ణదేవరాయల వారు స్వామివారికి సమర్పించిన అమూల్య ఆభరణాలను తస్కరించటం కూడా ఈ దండయాత్ర లక్ష్యం. నవాబు ఆదేశం మేరకు తిరుపతి చేరుకున్న అలీ సైన్యానికి పట్టణ ప్రజలందరూ ఎదురై తమ ఊరిలోని స్త్రీలందరి వద్దనున్న బంగారు ఆభరణాలు స్వీకరించి తిరిగి వెళ్ళిపొమ్మని, స్వామివారి జోలికి వెళ్లవద్దని అభ్యర్థించారు. తాళిబొట్లతో సహా గ్రామస్తుల అందరి ఆభరణాలను చేజిక్కించుకున్న, విశ్వాసఘాతకుడైన "అలీ" ఒప్పందాన్ని ధిక్కరించి, ముందుగా రచించుకొన్న పథకం ప్రకారం తిరుమలపై దండయాత్రకు ఉపక్రమించాడు. శేషాచల పర్వతపాదం వద్ద, అంటే సరిగ్గా ఇప్పుడు "అలిపిరి" గా పిలువబడే ప్రాంతంలో, అలీకి ఊహించని ప్రతిఘటన ఎదురైంది. వరాహరూపంలో సాక్షాత్కరించిన స్వామివారు అలీ సైన్యాన్ని నిలువరించారు. అయినా ఆ ముష్కరులు వెనుకకు తగ్గకపోవడంతో, శ్రీవారి ఆగ్రహం వల్ల "అలీ" దృష్టివిహీనుడయ్యాడు. గాఢాంధకారంలో అలమటిస్తూ, దిక్కుతోచక విలపిస్తున్న అలీకి తక్షణమే వెనుదిరిగ వలసిందిగా స్వామివారి హెచ్చరిక వినబడింది. కనువిప్పు కలిగిన అలీ వెంటనే శ్రీవారిని క్షమాభిక్ష నర్థించి నేత్రదానం చేయమని వేడుకొన్నాడు. శాంతించిన స్వామివారి ఆదేశానుసారం అక్కడి నుండి "బతుకు జీవుడా!" అనుకుంటూ అలీ నిష్క్రమించడంతో – అక్కడున్న సిపాయి లందరూ, మహమ్మదీయ మతస్థులతో సహా, అంతులేని ఉద్వేగానికి లోనై, "అలీ ఫిరే!" అంటూ నినాదాలు చేశారు. ఈ ఉత్తరభారత పదబంధానికి "అలీ తోక ముడిచాడు" అని అర్థం. ఈ ఉదంతాన్ని పరిసర ప్రాంతాలలోని సంస్థానాధీశు లందరూ సంబరంగా జరుపుకుని, "అలీ ఫిరే!" అంటూ దండోరా వేయించారు. సాక్షాత్తు స్వామివారు సాక్షాత్కరించిన ఆ ప్రాంతానికి, తండోప తండాలుగా భక్తులు తీర్థయాత్రకు తరలి వెళ్ళేవారు. "అలి ఫిరే!" అన్న నానుడి తదనంతర కాలంలో ఆంధ్రీకరించబడి, "అలిపిరి" గా స్థిరమైంది.

ఎలా వచ్చినప్పటికీ, వినసొంపైన "అలిపిరి" పేరు వినగానే ముప్పిరిగొనే ఆధ్యాత్మిక భావోద్వేగంతో మనసు–తనువు పులకరించి పోతాయి.

అలిపిరి మార్గం – చారిత్రిక, పౌరాణిక విశేషాలు

మనం ఇంతకు ముందు చెప్పుకున్నట్లుగా, ఈ మార్గం తిరుపతి పట్టణ శివార్లలో, ముకుళిత హస్తాలతో ఉన్న

గరుత్మంతుని విగ్రహం సమీపం నుంచి ప్రారంభ మవుతుంది. ఈ ప్రాంతంలో, రహదారికి అవతలి వైపు నుండి చూస్తే సుదూరంగా, రెండు పర్వతశిఖరాల మధ్యన శ్వేతవర్ణంలో తళుకులీనుతున్న "గాలిగోపురం" దర్శనమిస్తుంది. రాత్రివేళల్లో, విద్యుద్దీప కాంతులతో ఈ గోపురం మరింత శోభాయమానంగా గోచరిస్తుంది.

ఇక్కడే ఉన్న తి.తి.దే. కార్యాలయంలో మన సామాన్లను, పాదరక్షలను జమచేసి టోకెన్లు పొందుతాం! ఆ ప్రక్కనే ఉన్న అండర్ బ్రిడ్జి ద్వారా కొన్ని అడుగులు వేయగానే అలిపిరి మార్గానికి 'మొట్టమొదటి' మెట్టు కనపడుతుంది. అక్కడే భక్తిశ్రద్ధలతో టెంకాయ, కర్పూరహారతి సమర్పించుకుని, భక్తులు నడకయాత్ర ప్రారంభిస్తారు. కొందరైతే, పరమపవిత్రంగా భావించబడే ఈ సోపానానికి సాష్టాంగ నమస్కారం కూడా చేస్తారు. అక్కడి నుండి మరికొద్ది అడుగుల దూరంలో తిరుమలకు వెళ్లే వాహన మార్గాన్ని దాటగానే, బాటకు ఇరుప్రక్కలా పొడవాటి విశ్రాంతి మండపాలు కనిపిస్తాయి.

విశ్రాంతి మండపాలు

ఒక్కొక్కటి పదహారు శిలాస్తంభాలతో నిర్మించబడి, అలనాటి రాచరికపు టానవాళ్లను జ్ఞప్తికి తెచ్చే ఈ మంటపాలు, 16వ శతాబ్దంలో మెట్లకుమార అనంతరాజు చక్రవర్తిచే నిర్మింపబడి, తరువాతి కాలంలో అనేకసార్లు పెక్కుమంది రాజుల ద్వారా మరమ్మత్తులు చేయబడ్డాయి. వందల ఏళ్ళ నుంచి తిరుమలయాత్ర చేపట్టే భక్తులు మొట్టమొదటగా తిరుపతిలోని గ్రామదేవత గంగమ్మను, తరువాత గోవిందరాజస్వామి ఆలయాన్ని దర్శించుకుని; తీర్థప్రసాదాలు సేవించి, ఎడ్లబండ్లు, గుర్రపు బళ్ళపై, సాయం సమయానికి ఈ విశ్రాంతి మంటపాలను చేరుకునే వారు. వీటిలో అన్ని తరగతుల వారికి ఆదర పూర్వకమైన స్వాగతమిచ్చి, అందరికీ సమానంగా షడ్రుచులతో కూడిన ఆహారం వడ్డించబడేది. ఈ మంటపాలలో, కుటుంబంలోని పిల్లా, పెద్ద, పరిచారకులు, పల్లకీలు, డోలీలు మోసే కూలి వారు; అందరూ రాత్రికి విశ్రాంతి తీసుకొని, మర్నాటి ఉదయం స్నానపానాదులు, ఉదయపు భోజనాలు ముగించుకుని, మూటా-ముల్లె సర్దుకుని, తాబేటికుండల్లో త్రాగునీటిని నింపుకుని, డప్పులు వాయించుకుంటూ, అలిపిరి మెట్ల ద్వారా తిరుమల యాత్రకు సమాయత్త మయేవారు.

శ్రీవారి పాదమండపం

విశ్రాంతిమంటపాల నుండి బయలుదేరగానే, మనకు ఎడమ ప్రక్కగా "శ్రీవారి పాదమండపం" దర్శనమిస్తుంది. 1628వ సంవత్సరంలో నిర్మింపబడిన ఈ ఆలయాన్ని "పడాలమంటపం" అని కూడా పిలుస్తారు. ఈ ఆలయానికి సంబంధించి రెండు ఆసక్తికరమైన కథనా లున్నాయి:

- **మొదటిది**: శ్రీకాళహస్తి ప్రాంతంలో, శ్రీవేంకటేశ్వరుని భక్తులైన ఒక హరిజన కుటుంబం; అలాగే కాంచీపురం నందుండే మరో హరిజన కుటుంబం ప్రతి శ్రావణ శనివారం నాడు ఉపవాసముండి శ్రీవారికి పిండి తళిగలు నైవేద్యంగా సమర్పించేవారు. ఒక కుటుంబం సమర్పించే పిండిముద్దపై స్వామివారి కుడిపాదం, మరో కుటుంబం సమర్పించుకునే పిండిముద్దపై ఎడమపాదం యొక్క ముద్రలు పడేవి. వాటి కొలతలను బట్టి, ఇరువురు హరిజన భక్తులు కుడి-ఎడమ పాదరక్షలను తోలుతో అందంగా తయారు చేసి,

వాటిని శిరస్సుపై నుంచుకొని ఈ మందిరానికి చేరుకునేవారు. ఆశ్చర్యకరంగా ఈ రెండు జోళ్ళు ఒకరికి తెలియకుండా మరొకరు తయారు చేసినప్పటికీ, ఒకదానికొకటి సరిజోడు గా నుండేవి. స్వామివారు వ్యాహ్యాళికి, వేటకు, తిరుచానూరులో ఉన్న పద్మావతి అమ్మవారిని కలవటానికి కొండ దిగినప్పుడల్లా ఆ చెప్పులు ధరించి కొండకోనల్లో తిరగటం వల్ల అవి త్వరగా అరిగిపోయేవి. సగం అరిగిపోయిన ఆ పాదరక్షలకు గుర్తుగా, ఈ ఆలయంలో ఇప్పుడు కూడా లోహంతో తయారు చేయబడిన అనేక పాదరక్షలను మనం దర్శించుకోవచ్చు. ఈ లోహపు పాదాలను భక్తుల శిరస్సుపై తాకించి శెఠారిగా ఇచ్చే సాంప్రదాయం ఈ ఆలయంలో నెటికీ ఉంది.

- **మరో కథనం ప్రకారం** – శ్రీవారి పరమభక్తుడైన తిరుమలనంబి ప్రతిరోజు తిరుమల కొండపై నుండి క్రిందకు వచ్చి, ఈ ప్రాంతంలో ఉన్న ఒక చింతచెట్టు క్రింద ఒక సంవత్సరం పాటు, ఉదయపు వేళల్లో, భగవద్రామానుజుల వారికి రామాయణ రహస్యాలను బోధించేవాడు. మధ్యాహ్నానికి తిరిగి తిరుమలకు చేరుకొని స్వామివారి పాదాలను దర్శించుకునే వాడు. ఒకరోజు కాలయాపన కావడంవల్ల శ్రీవారిని మధ్యాహ్న సమయంలో దర్శించుకో లేకపోయిన తిరుమలనంబి చింతను తీరుస్తూ, ఆ రామాయణ పారాయణం జరిగే చోటనే శ్రీవారు తన శిలాపాదాలను సాక్షాత్కరింప జేశారు. క్రమంగా, ఆ ప్రదేశంలో ఒక మందిరం నిర్మింపబడి, వెయ్యేళ్ళుగా ఆ పాదాలు పూజల నందు కుంటున్నాయి. 2001వ సంవత్సరంలో, ఈ మందిరం నందు స్వామివారి విగ్రహం కూడా ప్రతిష్ఠించబడింది.

మొదటి కథనం అనూచానంగా వస్తున్నది కాగా, శ్రీవారి పాదమంటపం ముందున్న తి.తి.దే. వారి సమాచారపటం రెండవ కథనాన్ని బలపరుస్తోంది.

అయితే, కొన్ని గ్రంథాలు మాత్రం తిరుమలనంబి దర్శనార్థం వెలయింప బడిన శ్రీవారి శిలాపాదాలను "శ్రీపాదాలు" గా ఉటంకిస్తూ, అవి అలిపిరి మార్గంలోనే మరికొన్ని మెట్లు ఎక్కిన తర్వాత ఉన్నట్లుగా చెప్పబడుతోంది. కానీ అందుకు తగ్గ చారిత్రక ఆధారాలు లేవు. ఏ కథనం నిజమైనప్పటికీ ఈ పవిత్రపాదాలను దర్శించి నంతమాత్రాన పాపాలు పటాపంచలవుతాయని అనాదిగా భక్తులు విశ్వసిస్తున్నారు.

లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం

సరిగ్గా శ్రీవారి పాదమండపానికి ఎదురుగా, 16వ శతాబ్దంలో శ్రీ నరసింహరాయల వారిచే నిర్మితమైన లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించు కోవచ్చు. ఈ ఆలయాన్ని అన్నమాచార్యుల వారు "అలగిరి సింగని" ఆలయంగా వర్ణించాడు. దానిని బట్టి ఒకప్పుడు ఇది "లక్ష్మీ నరసింహస్వామి" ఆలయమని, ఏవో తెలియని కారణాల వల్ల ఇది లక్ష్మీ నారాయణస్వామి ఆలయంగా పరిణామం చెందిందని చెబుతారు. ఏది ఏమైనా, నారాయణుడు–నారసింహుడు ఇద్దరూ అభిన్నులు. స్వామివారిని ఏ రూపంలో సేవించుకున్నా ముక్తిమార్గం లభిస్తుంది.

మాలదాసరి

పై రెండు ఆలయాల నడుమన ఉన్న కాలిబాటలో ముందుకు సాగితే, కొద్ది దూరంలో, రహదారి మధ్యగా సాష్టాంగ నమస్కారం చేస్తున్న శ్రీవారి మహాభక్తుడు "మాలదాసరి" శిలావిగ్రహం దర్శనమిస్తుంది. ఈ విగ్రహానికి పూలమాలలు

వేసి, పూజలు చేసి ముందుకు సాగుతారు. ఈ విగ్రహం ప్రక్కనే, రాతిపలకపై చెక్కబడి ఉన్న మరో ముగ్గురు భక్తుల విగ్రహాలు కూడా కానవస్తాయి. బహుశా వీరు మాలదాసరి కుటుంబ సభ్యులు కావచ్చు. హరిజనునిగా జన్మించి, వైష్ణవ సాంప్రదాయం అవలంభించి, భగవత్ సాక్షాత్కారాన్ని పొందిన మహనీయుడు ఈ మాలదాసరి! ఈతని చరిత్రను శ్రీకృష్ణదేవరాయలు తన "ఆముక్యమాల్యద" లో గ్రంథస్థం కావించాడు.

తరువాతి కాలంలో, మాలదాసరిని అనుసరించి ఎందరో హరిజనులు వైష్ణవం లోకి ప్రవేశించారు. ఈ దాసుల గురించి "దాస సాహిత్య ప్రాజెక్టు" అనే ప్రకరణంలో ముమ్ముందు తెలుసుకుందాం.

అలిపిరి మార్గం – చారిత్రక నేపథ్యం

ఈ మార్గాన్ని 17వ శతాబ్దపు ప్రథమార్థంలో "మట్లకుమార అనంతరాజు" నిర్మించినట్లుగా చారిత్రక ఆధారాలున్నాయి. పలువురికీ ఉపయోగకరమైన, కష్టసాధ్యమైన మెట్లదారి నిర్మించడంతో ఈయన "మెట్లకుమార" గా, తదనంతర కాలంలో "మట్లకుమార" గా ప్రసిద్ధి కెక్కినట్లు చెబుతారు. మరో కథనం ప్రకారం, ఈ మహారాజు, ఆ సమయంలో రాయలసీమ ప్రాంతాన్ని పరిపాలించిన 'మట్లీ' వంశస్తుడు కావడం చేత 'మట్లకుమారుని' గా ప్రసిద్ధి గాంచాడు.

'అలిపిరి" నుండి, మార్గమధ్యంలో నుండే 'గాలిగోపురం' వరకు ఉన్న మెట్లమార్గాన్ని మాత్రమే ఈ రాజు నిర్మించాడు. ఈ మార్గం గాలిగోపురం నుండి కొండపై వరకు అంతకు ముందే ఉన్నట్టి సోపానమార్గంలో కలిసిపోతుంది. తత్పూర్వం, కపిలతీర్థం నుంచి వచ్చే మరో సోపానమార్గం, గాలిగోపురం ద్వారా తిరుమల కొండకు చేరుకునేది. అనంతరాజు కట్టించిన అలిపిరి నుండి గాలిగోపురం చేరుకునే మార్గం దగ్గరగా ఉండటంతో, ఇదే ప్రాచుర్యం పొంది, కాలక్రమేణా గాలిగోపురం నుండి కపిలేశ్వర ఆలయానికి వెళ్లే సోపానమార్గం శిథిలమై పోయింది.

మాలదాసరికి నమస్కరించుకుని ఏడెనిమిది మెట్లెక్కగానే మనకు *ఏడు అంతస్తులు, ఎనిమిది ద్వారబంధాలతో* కూడుకున్న, సమున్నతమైన "రాజగోపురం", లేదా "మహాద్వార గోపురం", లేదా "ప్రథమ గోపురం" కనబడుతుంది. ఈ గోపురాన్ని 16వ శతాబ్దంలో విజయనగర రాజైన నరసింహరాజు నిర్మించారు. 1928వ సంవత్సరంలో దీనిపై పిడుగు పడి, ద్వారమండపం మాత్రం మిగిలి, గోపురమంతా ధ్వంసమై పోయింది. ఆ కారణంగా స్థానికులు దీనిని "మొండిగోపురం" గా పిలుస్తారు. 1982వ సంవత్సరంలో తి.తి.దే. వారు చారిత్రక ఆనవాళ్లకు భంగం కలగని రీతిలో ఈ గోపురాన్ని పునరుద్ధరించారు. సమున్నతంగా, సర్వాంగసుందరంగా గోచరించే ఈ గోపురశోభకు అచ్చెరువొందుతూ, అలనాటి శిల్పకళాకారులకు జేజేలు పలుకుతూ ముందుకు సాగుదాం.

తలయేరు గుండు

రాజగోపుర ద్వారం గుండా మరి కొన్ని మెట్లు ఎక్కగానే, 48వ మెట్టు వద్ద మనకు కుడిప్రక్కగా "తలయేరు గుండు" దర్శనమిస్తుంది. అలిపిరి మార్గం పొడవునా కనిపించే గుండ్రటి శిలలలో మొదటిది, మరియు అత్యంత పెద్దది అయినందువల్లా; ఆ బండరాతి ప్రక్కనే ఇదివరకు ఒక ఏరు ప్రవహిస్తుండటం వల్ల ఇది "తలయేరు గుండు" గా

స్థిరపడింది. తమిళంలో "తలై" అంటే 'మొదటిది' లేదా 'ముఖ్యమైనది' అని అర్థం. యాత్రికులు మెట్లెక్కే టప్పుడు మోకాళ్ళ నొప్పులు రాకుండా ఉండటం కోసం అనాదిగా వస్తున్న ఆచారాన్ని నుసరించి వందల సంవత్సరాలుగా తమ మోకాళ్లను ఆన్చటం వల్ల అరుగుదలతో, బండరాతి క్రింద భాగంలో మోకాటి చిప్పలను పోలే అనేక గుంతలు కనిపిస్తాయి. ఈ శిలకు పైభాగంలో, అంజలి ఘటిస్తున్న ఆంజనేయుణ్ణి దర్శించుకోవచ్చు. సాక్షాత్తు ఆంజనేయుని శిల్పాంకితమైన శిల యొక్క పవిత్రతను పరిరక్షించడానికి, ఈ అమూల్యమైన వారసత్వ సంపదను కాపాడు కోవటానికి ఆ పవిత్రశిలను మోకాటితో తాకకుండా, కొద్ది దూరం నుంచే నమస్కరించు కుంటే శ్రేయస్కరమేమో? ఆలోచించదగ్గ విషయం!

కుమ్మరి మంటపం

తలయేరు గుండు దాటగానే, శ్రీవారి మహాభక్తుడైన కుమ్మరి భీమన్న స్వామివారికి గుర్తుగా ఒక మంటపాన్ని కట్టించాడు. అదే "కుమ్మరి మంటపం" గా పేరు గాంచింది. ఆ ప్రదేశం లోనే భీమన్నను స్మరణకు తెచ్చేవిధంగా; ఆ కుమ్మరివాని కుటుంబీకుల శిల్పాలు, కుమ్మరిసారె చెక్కబడిన శిలాఫలకాలు ఉన్నట్లుగా కొన్ని గ్రంథాలలో చెప్పబడుతోంది. కానీ ఇప్పుడా మంటపం, శిలాఫలకాలు, రెండూ కనుమరుగై పోయాయి.

మైసూరు గోపురం

తలయేరు గుండు దాటిన తరువాత 250వ మెట్టు వద్ద నాలుగు ద్వారబంధాలు, ఐదంతస్తులు గలిగిన గోపురాన్ని "మైసూరు గోపురం", లేదా "రెండవగోపురం", లేదా "కొత్తగోపురం" అని పిలుస్తారు. ఈ గోపురాన్ని 16వ శతాబ్దంలో మట్లకుమార అనంతరాజు నిర్మించాడు. బహుశా, మైసూరు నుండి రప్పించబడ్డ శిల్పులతో నిర్మించ బడడం వల్ల ఈ గోపురానికా పేరు వచ్చి ఉండవచ్చు. గోపురమంటపంలో కుడి ప్రక్కన ఉన్న కుడ్యంపై "శ్రీనివాసుడు" వారికి నమస్కరిస్తున్న అనంతరాజు తల్లిదండ్రులైన తిరువెంగళనాథుడు-చెన్నమ్మల విగ్రహాలు కూడా చెక్కబడి; వారి పేర్లు తెలుగు తమిళ భాషల్లో లిఖించబడి ఉన్నాయి. మరికొంత దూరం ప్రయాణించాక 375వ మెట్టుపై, గజేంద్రమోక్షానంతరం గజరాజును ఆశీర్వదిస్తున్న శ్రీమహావిష్ణువు శిల్పం ఒక పర్వతశిలపై హృద్యంగా చెక్కబడి, ఈమార్గానికి ఎడమ ప్రక్కగా కనబడుతుంది.

ఇప్పటి వరకూ మనం అలిపిరిమార్గం ద్వారా నడక ప్రారంభించి, 375 సోపానాలను అధిగమించి, మొసలి బారి నుండి గజరాజును రక్షించిన శ్రీ మహావిష్ణువును దర్శించుకున్నాం.

మరి కొన్ని మెట్లు ఎక్కిన తరువాత, 535వ మెట్టుపై ముకుళిత హస్తాలతోనున్న ఆంజనేయుని శిల్పం దర్శనమిస్తుంది. ఇంకొంచెం ముందుకు సాగితే, 680వ మెట్టు వద్ద 1928వ సం. లో పునరుద్ధరించబడ్డ పదహారు స్తంభాల "రాజవోలు మండపం" కనబడుతుంది. యాత్రికులు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా, ఈ మంటపంలో ఇరుప్రక్కలా విశాలమైన అరుగులు ఉంటాయి. తిరుమలకు సంబంధించిన గ్రంథాలలో గానీ, స్థానికుల వద్దగాని ఈ మంటపానికి ఇలా చిత్రమైన పేరు రావడానికి గల సమాచారం లభించలేదు.

గగనాన గరుత్మంతుడు

మరికొద్ది దూరం వెళ్లిన తర్వాత, 870వ మెట్టు వద్ద ఎడమ ప్రక్కగా, పైకి చూస్తే; దూరంగా ఉన్న పర్వతశిఖరం అంచులో కొనదేరిన నాసికతో, దృఢమైన దవడలతో, వెడల్పాటి ఫాలభాగంతోనున్న "గరుత్మంతుడు" దర్శనమిస్తాడు. శేషాచలశిఖరాల్లో ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన గరుత్మంతుని ముఖారవిందం, స్వామివారు భక్తరక్షణకో, శిష్టరక్షణకో లేదా ముల్లోక సంచారానికో బయల్వెడలి నప్పుడు, వారిని ఆకాశమార్గంలో సత్వరమే గమ్యం చేర్చడానికి ఖగరాజు సిద్ధంగా ఉన్నట్లు నిపిస్తుంది. ఆవిధంగా, సప్తగిరులలో ఒకటైన "గరుడాద్రి' సార్థక నామధేయ మయ్యింది.

గగనాన వెలసిన గరుత్మంతుని దర్శించగానే వచ్చిన నూతనోత్సాహంతో, నడక వేగం పుంజుకుంటుంది. తదుపరి, 1150వ మెట్టుపై పూర్తిగా శిథిలమై, నేలమట్టం అయిన "యలక్కాయల మంటపం" కానవస్తుంది. ఈ పేరు వెనుక ఉన్న చరిత్ర కూడా అందుబాటులో లేదు. కానీ, ఈ మంటపం సమీపంలో ఒకటి-రెండు వెలక్కాయ చెట్లు ఉండడంతో; ఒకప్పుడు ఇక్కడ వెలగచెట్లు అధికంగా ఉండేవని, ఆ కారణంగా ఇది "వెలక్కాయల మంటపం" గా పిలువబడి; కాలాంతరంలో అదే "యలక్కాయల మంటపం" గా రూపాంతరం చెంది ఉండవచ్చని ఊహించ వలసి వస్తోంది. దాని ప్రక్కనే ఉన్న బండరాతిపై ముకుళిత హస్తాలతో సుసంపన్నమైన ఆంజనేయుణ్ణి, శ్రీవేంకటేశ్వరుణ్ణి, వారికి భక్తితో నమస్కరిస్తున్న రాజదంపతులను దర్శించుకోవచ్చు.

సువిశాలమైన ఈ మెట్టుపై నుండి వెనుకకు తిరిగి చూస్తే, ఇక్కడి నుంచి తిరుపతి పట్టణం మనోహరమైన ఆధునిక దృశ్యకావ్యంగా ఆవిష్కృత మవుతుంది.

మరికొన్ని మెట్లు ఎక్కిన తర్వాత 1800వ మెట్టు వద్ద, వామనావతార విగ్రహం ప్రక్కగా, ఒక ప్రాచీనమైన నాలుగుస్తంభాల మంటపంలో నమస్కార భంగిమలో ఉన్న రామానుజుల వారి ప్రతిమను దర్శించుకోవచ్చు. మొత్తం మెట్లలో సగభాగాన్ని విజయవంతంగా అధిరోహించి నందుకు గాను భక్తులను అభినందిస్తున్నట్లున్న రామానుజుల వారికి ప్రణమిల్లి ముందుకు సాగుదాం!

గాలి గోపురం

2083వ మెట్టును ఒక మైలురాయిగా చెప్పుకోవచ్చు. ముందుగా, బాటకు ఎడమ ప్రక్కన ఓ చిన్న ఆలయంలో ఉన్న వీరాంజనేయుని దర్శించుకుని, కొన్ని అడుగులు వేయగానే సమున్నతమైన "గాలిగోపురం" కనబడుతుంది. దీనిని కూడా మట్లకుమార అనంతరాజు ప్రభువే నిర్మించాడు. అద్భుతమైన కుడ్యశిల్పాలతో అలరారుతున్న ఈ బహుళ అంతస్తుల గోపురాన్ని నడకదారికి తలమానికంగా చెప్పుకోవచ్చు. ఈ గోపురానికా పేరు రావడం వెనుక రెండు కథనా లున్నాయి –

- **మొదటిది** – ఏ విధమైన దేవాలయము లేకుండా ఖాళీగా ఉండటం వల్ల, ఈ గోపురాన్ని మొదట్లో "ఖాళీగోపురం" గా పిలిచేవారు. కాలక్రమేణా అదే "గాలిగోపురం" గా మారిందని కొన్ని గ్రంథాల్లో

చెప్పబడింది. అయితే, నడకదారిలో దీనికంటే ముందున్న రెండు గోపురాల సమీపంలో కూడా ఏ విధమైన దేవాలయాలు లేవు. కాబట్టి ఈ కథనం సందేహాస్పదమే!

- **మరో కథనం ప్రకారం** – సమున్నతమైన ఈ ప్రదేశానికి సమీపంలో వేరే శిఖరాలేవీ లేనందున ఇచ్చట గాలి హోరుగా వీస్తుంది. ఉధృతంగా వీచే వాయువును ప్రత్యక్షంగా అనుభూతి చెందవచ్చు గావున దీనికి "గాలిగోపుర" మనే పేరొచ్చింది. ఈ కథనం విశ్వసనీయం గానే అనిపిస్తుంది.

ఈ ప్రదేశానికి చేరుకోగానే, సప్తగిరులలో తొట్టతొలి కొండ అధిరోహించటం పూర్తయినట్లుగా భావిస్తారు. ఈ గోపురంపై తిరునామం, ఇరుప్రక్కలా శంఖు-చక్రాలు అమర్చబడి, వైకుంఠాన్ని తలపుకు తెస్తుంది. ఈ వైష్ణవచిహ్నాలను విద్యుద్దీపాలతో అలంకరించడం వల్ల, వీటిని రాత్రి సమయాల్లో తిరుపతి పట్టణం నుంచి కూడా దర్శించుకోవచ్చు. ఈ ప్రదేశంలోనే, నవనాథులలో ఒకరైన "గోరక్షానాథ్" అనే సిద్ధుడు కొన్నేళ్లపాటు తపస్సు చేసినట్లుగా చెబుతారు. ఇచ్చట కొన్ని సమాధులు, ఒక పాడుబడ్డ పుష్కరిణి కూడా ఉన్నట్లు కొన్నిచోట్ల పేర్కొనబడింది. గాలిగోపురానికి కొంచెం దూరంలో, పాలరాతి శిల్పాలతో విరాజిల్లుతున్న, ఈ మధ్యనే పునరుద్ధ రించబడిన, ప్రాచీనమైన కోదండ రామాలయం ఉంది. నడకదారి ప్రారంభంలో, మొదటిగోపురం లేదా మహాగోపురం వద్ద మనం తీసుకున్న "దివ్యదర్శనం" టోకెన్ ను, గుర్తింపు పత్రాన్ని చూపిస్తే, గాలిగోపురం వెనుకనే ఉన్న తి.తి.దే. కార్యాలయంలో దర్శన సమయాన్ని నిర్దేశిస్తారు.

తరువాత, ఇక్కడే ఉన్న తి.తి.దే. "అన్నప్రసాద కేంద్రం" లో కానీ, లేదా అధికసంఖ్యలో ఉన్నటువంటి తినుబండారాల అంగళ్లలో గానీ అల్పాహార కార్యక్రమాన్ని ముగించుకుని; ప్రక్కనే ఉన్న తి.తి.దే. జలప్రసాద కేంద్రంలో దప్పిక తీర్చుకొని; ఓ వృక్షరాజం చుట్టూ వృత్తాకారంలో నిర్మించబడ్డ, విశాలమైన సిమెంట్ చెప్టాపై కొంచెం సేపు విశ్రాంతి తీసుకోవచ్చు. అవసరమైన వారికి, అక్కడే తి.తి.దే. వారి ప్రథమ చికిత్సాకేంద్రం కూడా అందుబాటులో ఉంటుంది. గాలిగోపురం దాటగానే సుదీర్ఘమైన నడకదారి ప్రారంభమవుతుంది. మెట్లెక్కే అవసరం తక్కువగా ఉండడంతో, అలసటగా ఉన్న శరీరం కొద్దిగా తెరపిన పడుతుంది. కొన్ని మెట్లు ఎక్కిన తరువాత 2,104వ సోపానం వద్ద, "చిట్టెక్కుడు" అనే ప్రాంతంలో లింక్ రోడ్డు ప్రారంభ మవుతుంది. బహుశా, ఈ ప్రాంతం నుండి మెట్లు సువిశాలంగా, ఎత్తు తక్కువగా ఉండి; నడకదారి అధికంగా ఉండటంతో యాత్రికులు సులభంగా నడవ గలగటం వల్ల; దీనికి "చిట్టెక్కుడు" అనే పేరు వచ్చి ఉంటుంది.

జింకల పార్కు

"చిట్టెక్కుడు" ప్రాంతంలో ఉన్న అనేక సువిశాలమైన మెట్లు దాటగానే, 2566వ మెట్టు వద్ద జింకల పార్కు కనబడుతుంది. లోహపుతీగెల కంచె లోపల చిగురుటాకులు సేవిస్తూ, చారెడేసి కళ్లతో, ఛెంగుఛెంగునా గంతులు వేస్తూ; జింకలు, లేళ్లు, వాటి కూనలు కన్నులపండువ చేస్తాయి. చిన్నపిల్లలయితే అలసట నంతా ఆదమరచి, జింకలతో మమేకమై, ఆ మూగజీవాలకు చిరుతిళ్ళు తినిపించే ప్రయత్నం చేస్తారు. అటవీశాఖ సిబ్బంది వాటికి శ్రద్ధగా,

నిర్ణీత సమయాల్లో, తగినంత సమతు లాహారాన్ని అందిస్తారు గావున; పిల్లలను వారించి ఆ వన్యప్రాణుల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత పెద్దవారిగా మనపై ఉంది!

పురాణాల్లోకి వెళితే వైఖానస ఆగమాలలో యాగాలకు, యజ్ఞాలకు అంతులేని ప్రాముఖ్యత ఉంది. అందువల్లనే తిరుమలలో కళ్యాణ మంటపాలతో పాటు, అనేక యాగశాలలు కూడా ఉన్నాయి. వివిధ ఉత్సవాలు, సేవలతో పాటుగా, తరచు యజ్ఞ-యాగాదులు కూడా జరుగుతూనే ఉంటాయి. యాగం జరిగే ప్రదేశంలో కృష్ణజింకలు ఉండి తీరాలని శాస్త్రం ఘోషిస్తోంది. కావున, తిరుమలక్షేత్రంలో కృష్ణజింకలను కొలువుంచటం జరిగింది.

ఈ జింకలపార్కు వద్ద లోయర్ బ్రిడ్జి ద్వారా వాహనమార్గమైన ఘాట్ రోడ్డును దాటుకొని, కొన్ని మెట్లెక్కగానే "శ్రీకృష్ణావతారం" ముగ్ధ మనోహరంగా కానవస్తుంది!

3,550 మెట్లెక్కి, కొండకోనల్లో తొమ్మిది కిలోమీటర్లు ప్రయాణించి, నడక ద్వారా తిరుమలకు చేరుకోవడం ఓ అనిర్వచనీయమైన అనుభూతి. దారిలో, దర్శించదగ్గ విశేషాలు అనేకం ఉన్నా, సరైన సమాచారం లేకపోవడం వల్ల; చాలా మంది భక్తులు నడకదారి అందచందాలను ఆసాంతం ఆస్వాదించలేరు. అటువంటి వారికి కరదీపికగా ఉపయోగపడాలనే లక్ష్యంతో; మెట్లసంఖ్యను ఉదహరిస్తూ మేము చూచిన, విన్న, చదివిన విశేషాలన్నింటిని; అందుబాటులో ఉన్న వాటి పౌరాణిక, చారిత్రక, సమకాలీన సమాచారంతో సహా; ఈ ప్రకరణాలలో పొందుపరచ బడ్డాయి. మేము చూచినది చూచినట్లుగా, విన్నది విన్నట్లుగా లేదా, చదివినది చదివినట్లుగా పేర్కొనబడింది. ఇప్పటికీ పదిలంగా వున్న కొన్ని చారిత్రక చిహ్నాలను ఎంతో నిశితంగా పరిశీలించినప్పటికీ మేము గమనించ లేకపోయే అవకాశం కూడా ఉంది. దానికి మన్నించగలరు! ఈసారి తిరుమలను సందర్శించుకునే టప్పుడు, అలిపిరి నడకమార్గం ద్వారా కొండకు చేరుకొని, మార్గమధ్యలో ఉన్న విశేషా లన్నింటినీ తప్పనిసరిగా అవలోకిస్తారని ఆశిస్తున్నాం!

భద్రాంజనేయుని విగ్రహం

2,680వ మెట్టు మరో మైలురాయి!! స్థానికులు ఈ ప్రదేశాన్ని "ఏడో మైలురాయి ప్రాంతంగా" గా పిలుస్తారు. ఈ ప్రదేశంలో కొండపై నుండి వాహనాలు దిగే ఘాట్ రోడ్డు మరియు అలిపిరి మెట్లమార్గం ఒకదానికొకటి అత్యంత సమీపంలో సమాంతరంగా ఉంటాయి. దశావతారాల్లో చిట్టచివరిదైన కల్క్యావతారం కూడా ఇక్కడే ఉంటుంది.

1979వ సంవత్సరంలో ఈ ప్రదేశం నందు జరిగిన ఒక దుర్ఘటనను దృష్టిలో ఉంచుకొని, అటువంటివి పునరావృతం కాకుండా అప్పటి టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ పి వి ఆర్ కే ప్రసాద్ గారి నేతృత్వంలో; ఇక్కడ ఘాట్ రోడ్డుకు కాలిబాటకు మధ్యనున్న ప్రదేశంలో, దుష్టగణాలకు సింహస్వప్నమైన భద్రాంజనేయుని విగ్రహం ప్రతిష్ఠించబడింది. పది అడుగుల ఎత్తైన సువిశాల పీఠంపై ముప్పై అడుగులతో సమున్నతంగా ఉన్న గదాధారు దయినటువంటి హనుమంతుని విగ్రహం; శాకిని-ఢాకిని పిశాచాలను, దుష్టశక్తులను, తరిమి కొట్టడానికి సిద్ధంగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది. పెద్దాపురం సమీపంలోని ఒక కుగ్రామంలో నివసించే తోగు లక్ష్మణస్వామి అనే కళాకారుదు ఈ

విగ్రహాన్ని అత్యంత సుందరంగా వేళ్ళకు ఉన్న గోళ్ళు, వ్రేలాడుతున్న జులపాలు, వస్త్రానికి ఉన్న ముడుతలు వంటి సూక్ష్మాతి సూక్ష్మమైన శరీరభాగాలను సైతం అత్యంత నైపుణ్యంతో, ముచ్చట గొలిపేలా తీర్చిదిద్దాడు. సిమెంట్ తో నిర్మించబడ్డ ఈ విగ్రహానికి మొజాయిక్ పూత పూసి, శిలావిగ్రహాన్ని తలపుకు తెచ్చేలా, సుదీర్ఘకాలం నిలిచి ఉండేలా ఈ విగ్రహం తయారు చేయబడింది.

ఈ ప్రదేశం చూడచక్కనైన ఉద్యానవనము, పూలమొక్కలు, విశ్రాంతి స్థలము, త్రాగునీటి సదుపాయాలు, చిరుతిళ్ళ దుకాణాలతో అలరారుతూ; విహారస్థలాన్ని తలపించటంతో, దాదాపు 2,700 మెట్లు ఎక్కిన అలసట కాస్తా దూదిపింజలా తేలిపోయి, మనసు, శరీరం మిగిలిన ప్రయాణానికి సమాయత్త మవుతాయి.

బాటకు ఎడం ప్రక్కగా, తప్పనిసరిగా చూసి తీరవలసిన అటవీశాఖ మ్యూజియం ఉంది. అందులో శేషాచల పర్వతాల నైసర్గిక స్వరూపం, వాటి ఆవిర్భావం, వాటికున్న పౌరాణిక ప్రాశస్త్యం, స్థానిక అడవులలో సంచరించే జంతుజాతులు, అక్కడ పెరిగే వృక్షజాలం, ఔషధమొక్కలు, లభించే ఖనిజాలు, ఒకప్పుడు ఆ ప్రాంతంలో నివసించే కోయజాతుల గురించిన విస్తృతమైన సమాచారం వర్ణచిత్రాల రూపంలో వివరణతో సహా పొందుపరచబడింది.

ఇక్కడి నుంచి కొద్ది అడుగుల దూరంలో స్థానికులు "ఏడవ మైలు మంటపం" గా పిలిచే, ఎనిమిది స్తంభాల విశ్రాంతి మండపం కనబడుతుంది.

మరో 20 మెట్లు ఎక్కిన తరువాత వచ్చే ఎత్తయిన ప్రదేశాన్ని, "మామండూరు మిట్ట" అని పిలుస్తారు. ఇక్కడే పోలీస్ ఔట్ పోస్ట్ కూడా ఉంది. మరికొద్ది మెట్లు ఎక్కిన తర్వాత, పూర్తిగా పునరుద్ధరించబడిన దొరసాని మంటపం కనబడుతుంది. సుదీర్ఘమైన 2815వ మెట్టుపై ఎడం ప్రక్కన "సాష్టాంగ పడి ఉన్న భక్తబృందం" యొక్క శిల్పాన్ని చూడవచ్చు. మరికొద్ది దూరంలో, ఒకదాని తర్వాత ఒకటిగా రెండు పేరులేని విశ్రాంతి మండపాలు కానవస్తాయి.

ముగ్గుబావి మంటపం

తదుపరి, 2,840వ మెట్టుపై బాటకు ఎడం ప్రక్కగా దాసాంజనేయుని ఆలయం దర్శనమిస్తుంది. ఈ ఆలయం వెనుక; ఈనాడు చెట్టు-పుట్ట తో నిండి ఉన్న ఓ విశాలమైన, లోతైన లోయను "ముగ్గుబావి" గా పిలుస్తారు. స్థానికుల కథనం ప్రకారం ఈ ప్రదేశంలో ముగ్గురాయి అధికంగా లభించేది. ఇదివరకు కొన్ని వందల ఏళ్ళపాటుగా శ్రీవారి ఆలయంలో సాంప్రదాయ బద్ధంగా తీర్చిదిద్దబడే రంగవల్లులకు కావలసిన ముగ్గు కోసం ఇక్కడున్న రాతిని త్రవ్వేవారు. కాలాంతరంలో ఈ ప్రదేశం లోతైన సువిశాలమైన దిగుడుబావిగా తయారై, అదే "ముగ్గురాతి బావి" లేదా "ముగ్గుబావి" గా పిలువబడేది. వర్షపునీటితో, పర్వతసానువుల్లో నుంచి వచ్చే జలధారలతో ఈ లోయ నిండినప్పుడు పొంగిపొరలే నీరు అంతర్వాహినిగా దిగువకు ప్రయాణించి, తిరుపతి పట్టణంలో నేడు "మంచినీటి కుంట" గా పిలువబడే చెరువుకు చేరుకుంటుందని స్థానికుల నమ్మకం. ముగ్గుబావి ప్రదేశంలో నరసింహస్వామి ఆలయం కూడా ఉండటం చేత, అక్కడి నుంచి ప్రవహించే నీటిని కలుపుకోవడం వల్ల తిరుపతిలోని "మంచినీటి కుంట" ను "నరసింహతీర్థం" గా పిలిచేవారు. ఈ మధ్యనే అభివృద్ధి చేయబడి, చుట్టూ ప్రహరీ నిర్మించబడిన ఈ చెరువు ఒడ్డున

ఆలనా పాలనా లేకుండా పడి ఉన్న, శయనభంగిమ లోని గోవిందరాజస్వామి విగ్రహాన్ని దర్శించుకోవచ్చు. దాదాపు వెయ్యేళ్ళ క్రితం విష్ణుద్వేషియైన కుళోత్తుంగ చోళుడు ఆనాటి సుప్రసిద్ధ వైష్ణవక్షేత్రమైన చిదంబరం ఆలయం లోనుంచి పెరికివేసి, సముద్రంలో పారవేసిన "గోవిందరాజస్వామి" విగ్రహం ఇదేనని కొందరు అభిప్రాయ పడతారు.

ముగ్గుబావి వద్ద శ్వేతచక్రవర్తి కుమారుడైన "శంఖుడు" భగవత్సాక్షాత్కారం కోసం తపస్సు చేయగా, వేట నిమిత్తం అడవికి వెళ్ళిన శ్రీనివాసుడు ఆ భక్తునికి రాజు వేషంలో దర్శనమిచ్చా డని పురాణాల్లో చెప్పబడింది.

త్రోవ నరసింహాలయం

మరికొన్ని మెట్లు ఎక్కిన తరువాత – 2,850 మెట్టు పై – మార్గానికి ఎడమ ప్రక్కగా శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్న వటవృక్షం చుట్టూ పూలమొక్కలు పెంచి, నయనానందకర మైన విశ్రాంతి స్థలంగా తీర్చిదిద్దారు. దాని తరువాత వచ్చేదే "త్రోవ నరసింహాలయం." దీన్ని చాలా శక్తివంతమైన నారసింహక్షేత్రంగా చెబుతారు. హిరణ్యకశిపుని వధ ఇక్కడే జరిగినట్లు, తదనంతరం ఉగ్రనరసింహుణ్ణి చెంచులక్ష్మి ఈ ప్రదేశంలోనే శాంతింప జేసినట్లు కొన్ని పురాణాల్లో చెప్పబడింది. ఈ మధ్యనే పునరుద్ధరించబడిన ఈ ఆలయపు గర్భాలయంలో స్వయంభువుగా వెలసిన, సాలగ్రామశిలా రూపుడైన నారసింహుడు లక్ష్మీదేవిని ఎడమ తొడపై కూర్చుండబెట్టుకొని దర్శనమిస్తాడు. ఈ ప్రదేశంలో కనకధారాస్తోత్రం పఠిస్తే లక్ష్మీదేవి కటాక్షం శీఘ్రంగా సిద్ధిస్తుందని భక్తులు నమ్ముతుండడంతో, ఇక్కడ తి.తి.దే. వారు ఆ స్తోత్రం చెక్కబడి ఉన్న గ్రానైట్ పలకలను అమర్చారు. ఈ ఆలయాన్ని యాత్రికులకు మార్గమధ్యంలో దుష్టశక్తుల నుండి రక్షణ కల్పించే ఉద్దేశ్యంతో సాళువ నరసింహరాయలు 1485వ సం. లో పునరుద్ధరించాడు. ఈ ప్రాంతాన్ని సప్తగిరుల్లో ఒకటైన "వృషభాద్రి" పర్వతంగా భావిస్తారు. ఈ ఆలయాన్ని గురించిన ఇంకా అనేక పౌరాణిక కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

ఈ ఆలయం వెనుకనున్న మరో చిన్న ఆలయంలో యోగా నరసింహస్వామి 'లింగస్వరూప" ధారియై దర్శనమిస్తారు. ఈ ఆలయాన్ని దాటిన వెనువెంటనే, దర్శన సమయం నిర్దేశించి ఉన్న టోకెన్ పై తి.తి.దే. వారు అధికారిక స్టాంపు ముద్రిస్తారు. ఆ ముద్ర ఉంటేనే శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు.

అక్కడి నుండి కొన్ని మెట్లు దిగిన తరువాత, కొండపై నుండి వాహనాలు దిగివచ్చే రహదారిని వ్యతిరేకదిశలో కలుపుతూ నూతనంగా నిర్మించిన బడ్డ తోరణం ఉంది. ఆ తోరణం గుండా వాహనమార్గం లోనికి ప్రవేశించిన తరువాత; అక్కడి నుండి మెట్లు లేని, సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉండే నడకదారి ప్రారంభమవుతుంది.

అవ్వాచారి కోన

త్రోవ నరసింహాలయం సందర్శించుకుని, కొన్ని మెట్లు దిగి, తోరణం గుండా వాహనమార్గం లోనికి వ్యతిరేకదిశలో ప్రవేశించగానే కొద్ది దూరంలో మనకు కుడిప్రక్కగా ప్రప్రథమ వీక్షణంలో భీతి గొలిపించే, సువిశాలమైన, కొన్ని వందల అడుగుల లోతైన, పచ్చదనంతో పరిఢవిల్లే అగాధం కనిపిస్తుంది. ముందు జాగ్రత్త చర్యగా ఆ లోయ అంచులకు లోహపు కంచె వేయబడింది. ఆ లోయలోకి దృష్టిసారించ గానే, ప్రకృతి శోభతో మనసు పులకరించి

పోతుంది. లోయకు ఆవల ఉన్న సమున్నతమైన శిఖరాలపై నెలకొల్పబడిన గాలిమరలు గిరగిరా తిరుగుతూ, విష్ణుమూర్తి ఆయుధమైన సుదర్శన చక్రాన్ని తలపిస్తాయి. సమస్త వృక్షజాతులకు ఆలవాలమైన ఈ లోయలో, ఇప్పటికీ అనేక క్రూరమృగాలు సంచరిస్తాయని స్థానికులు విశ్వసిస్తారు. ఎడమవైపున ఆకాశాన్ని చుంబించే శిఖరాలు, కుడివైపున పాతాళం స్పృశించే లోయ సృష్టిలోని సోయగమంతా ఇక్కడే ప్రోగు పడినట్లు నిపిస్తుంది. రహదారికి ఎడమ ప్రక్కన ఉన్న శిఖరపు టంచులలో పెరుగుతున్న నిమ్మగడ్డి సువాసనలు ఆ ప్రదేశమంతా గుబాళిస్తాయి.

ఆ లోయకు "అవ్వాచారి కోన" అనే పేరు రావడం వెనుక లెక్కలేనన్ని కథనాలున్నాయి. "అవ్వాచారి" అనే వైష్ణవభక్తుడు అచ్చట నివసించడం వల్ల ఆ పేరు వచ్చిందని కొందరంటారు. ఆ ప్రదేశంలో విపరీతమైన చలి మొదలవ్వడంతో భక్తులు "అబ్బా చలి" అనుకుంటూ నడిచే వారని, కాలాంతరంలో అదే నుడువడి "అబ్బా చలి కోన" గా, తరువాత "అవ్వాచారి కోన" గా రూపాంతరం చెందిందని కొందరు అభిప్రాయపడతారు. మరి కొందరైతే, దాదాపు 3000 మెట్లు ఎక్కేసరికి, అవ్వలు "నా పని సరి" అంటూ చతికిల పడేవారని, ఆ కారణంగా ఆ లోయను "అవ్వ పని సరి" గా పిలిచేవారని, కాలగమనంలో ఆ పదబంధం "అవ్వాచారి" గా రూపు దిద్దుకున్నదని భావిస్తారు.

సప్త మాతృకలు

ఆ నడక దారిలోనే రహదారికి ఎడమప్రక్కగా ఒక చిన్న తలుపులు లేని ఆలయంలో, ఏడు రాతి విగ్రహాలు పూజ లందు కుంటుంటాయి. ఈ ఏడుగురు అమ్మవార్లను "సప్తమాతృకలు" లేదా "శ్రీవేంకటేశ్వరుని అక్కగార్లు" గా పిలుస్తారు. ఇక్కడ రోడ్డు మార్గం వేసేటప్పుడు కొన్ని దుర్ఘటనలు సంభవించి, ఎంతకూ రోడ్డు పూర్తికాక పోవడంతో, ఎక్కడో కీకారణ్యంలో చెట్టు క్రింద ఉన్న ఈ ఏడుగురు అమ్మవార్లను ఈ ప్రదేశానికి తెచ్చి పూజించడంతో రోడ్డు కార్యక్రమం సజావుగా సాగి పోయిందని చెబుతారు. ఈ దేవతలందరూ బ్రహ్మచారిణులు అని, ఆకాశరాజు తన కుమార్తె–అల్లుని రక్షణ నిమిత్తం ఈ ఏడుగురు యువతులను అలమేలు మంగమ్మ వారితో పాటుగా పంపించారని, వారు పగలంతా ఈ ఆలయంలో నివసిస్తూ, రాత్రి వేళల్లో సూక్ష్మరూప ధారులై సప్తగిరి శిఖరాలను కాపు కాస్తుంటారని–ప్రజలు విశ్వసిస్తారు. కొందరైతే, ఈ ఏడుగురు సాక్షాత్తు స్వామివారికి అక్కగార్లని, తమ ముద్దుల తమ్ముణ్ణి నిరంతరం కనిపెట్టుకుని ఉంటారని కూడా విశ్వసిస్తారు. వీరిని దర్శించుకుని వెళితే, ఆ దేవతల అనుగ్రహంతో శ్రీవారి దర్శనం సజావుగా జరుగుతుందని భక్తుల నమ్మకం. తిరుపతి పట్టణపు గ్రామదేవత అయిన గంగమ్మతల్లి శ్రీవారికి మరో అక్కగారని భావిస్తారు. అందుకే, ప్రతిసంవత్సరం స్వామివారి ఆలయం నుండి ఆ దేవతకు సకల లాంఛనాలతో పుట్టింటి కానుకలను పంపించే సాంప్రదాయం ఈనాటికీ ఉంది.

'అవ్వాచారి కోన' అందాలను ఆస్వాదిస్తూ, సప్తమాతృకలను సందర్శించుకుని, దాదాపు రెండు కిలోమీటర్ల దూరం నడవగానే మనకు ఎడమ ప్రక్కగా "మోకాలిమిట్ట గోపురం" దర్శనమిస్తుంది.

మోకాలిమిట్ట గోపురం లేదా అచ్యుతరాయ గోపురం

మోకాలి మిట్ట ప్రారంభంలో, 2910వ మెట్టు వద్ద మూడు అంతస్తులు, ఏడు కలశాలు, రెండు ద్వారబంధాలతో

నిర్మించబడ్డ అద్భుతమైన గోపురాన్ని "మోకాలిమిట్ట గోపురం" లేదా "అచ్యుతరాయ గోపురం" గా పిలుస్తారు. 16వ శతాబ్ది ప్రథమార్థంలో "తుళువ" వంశపు చక్రవర్తి, శ్రీకృష్ణదేవరాయలు తమ్ముడు అయిన అచ్యుతరాయలు ఈ గోపురాన్ని నిర్మించాడు. అయితే, ఈనాడు మనం చూస్తున్న గోపురం మాత్రం, తిరుపతికి సమీపాన ఉన్న కొత్తూరు గ్రామంలోని ఒక శిథిలమైన ఆలయానికి చెందినది. 1998వ సం. లో, ఆ గోపురాన్ని ఇక్కడకు తరలించి, పూర్తిగా శిథలమైపోయిన అసలు గోపురం స్థానంలో దానిని పునఃస్థాపించారు. ఇప్పుడున్న మెట్లదారి నిర్మించడానికి ముందు అంటే దాదాపు 150 సంవత్సరాల క్రితం సప్తమాతృకల ఆలయ సమీపం నుండి పెద్ద లోయ లోనికి దిగి, మళ్లీ ఎత్తైన మెట్లెక్కితే ఈ గోపురాన్ని చేరుకునేవారు. ఇక్కడి నుండి ప్రారంభమయ్యే మెట్లు చాలా ఎత్తుగా, ఎక్కడానికి క్లిష్టంగా ఉండేవి. ఆ మెట్లను మోకాళ్ళపై చేతులు ఆన్చి, ఆపసోపాలు పడుతూ ఎక్కాల్సి వచ్చేది. అందువల్ల ఇది "మోకాలిమిట్ట గోపురం" గా ప్రసిద్ధికెక్కింది. అయితే, నూతన మెట్లమార్గం నిర్మించిన తరువాత, ఇప్పటి మెట్లు అంత కష్టంగా లేవు. అయినప్పటికీ మెట్లు నిరారుగా ఉండటం వల్ల, మధ్య మధ్యలో నడకబాట అతి తక్కువగా ఉన్నందువల్ల, ఇప్పటికీ ఈ మెట్లను అధిరోహించడం కొద్దిగా శ్రమతో కూడుకున్నదే!

సాక్షాత్తు శ్రీనివాసుడు కొలువై ఉండే, సప్తగిరులలో ఒకటైన వెంకటాద్రిపర్వతం ఇక్కడే ప్రారంభ మవుతుందని చెబుతారు. అందుచేత ఈ మెట్లు అత్యంత పవిత్రమైనవి. అన్నమాచార్యుడు తన బాల్యంలో మొట్టమొదటిసారిగా తిరుమలక్షేత్రాన్ని దర్శించుకున్నప్పుడు తెలియనితనంతో, పాదరక్షలు ధరించి ఈ మోకాలిపర్వతం మెట్లు ఎక్కడం ప్రారంభించగానే సొమ్మసిల్లి పోయాడు. ఆ క్షణంలో అలమేలుమంగ అమ్మవారు అన్నమయ్యకు సాక్షాత్కరించి సాలగ్రామశిలగా వెలసిన శ్రీనివాసుడు నివసించే వెంకటాద్రి పర్వతాన్ని పాదరక్షలతో అధిరోహించ రాదని నచ్చజెప్పింది. దాంతో తన తప్పు తెలుసుకొన్న అన్నమయ్య పాదరక్షలను విసిరివేసి, ఆ శ్రీనివాసుని స్తుతిస్తూ శ్రీవేంకటేశ్వరశతకం అనే నూరు పద్యాలు కలిగిన సంకలనాన్ని ఆశువుగా కీర్తించాడు. తరువాతి కాలంలో ఇంకెందరో మహానుభావులు కూడా ఈ పర్వతాన్ని మోకాళ్ళతో అధిరోహించారు. అంతటి పరమ పవిత్రమైన ఈ పర్వతం మెట్లలో, కనీసం కొన్నింటినైనా, ఇప్పుడు కూడా చాలామంది మోకాళ్ళతో అధిరోహిస్తారు. మరికొందరు సుమారు ఆరు వందలకు పైగా ఉన్న ఈ మెట్లన్నింటినీ పసుపు కుంకుమలతో పూజిస్తూ, వాటికి కర్పూరహారతి నిస్తూ, కొండ పైకి చేరుకుంటారు. ఈ మెట్లు ఎక్కుతున్నంత సేపు తిరుమల క్షేత్రంలో లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రసారమయ్యే అన్నమయ్య కీర్తనలు చాలా దగ్గరగా వినిపిస్తుంటాయి. ఉదయం ఎంత త్వరగా బయల్దేరినప్పటికీ మోకాళ్ళ పర్వతం చేరుకునేటప్పటికి దాదాపు మధ్యాహ్నం కావటంతో, ఈ మెట్లెక్కు తున్నప్పుడు చలికాలంలో కూడా చిరుచెమటలు పడతాయి. అయినా ఎప్పటికప్పుడు మెట్ల సంఖ్యను చూస్తూ, జోరుగా వినవస్తున్న గోవిందనామాలలో వంత కలుపుతూ, కొండను సమీపిస్తున్నా మనే ఆనందంతో శారీరకబాధను మరచిపోతాం.

శ్రీవ భాష్యకారుల సన్నిధి

"మోకాళ్ళ పర్వతాన్ని" మోకాళ్ళతో అధిరోహించిన వారిలో అగ్రగణ్యుడు శ్రీమద్రామానుజాచార్యుల వారు. ఆ విధంగా పర్వతాన్ని ఎక్కుతున్నప్పుడు మోకాళ్ళకు గాయ మవ్వడంతో, మార్గమధ్యంలో కొంతసేపు విశ్రమించాడు. ఆ విషయం

తెలియగానే తిరుమలలో నివసించే, వారి గురువుగారైన తిరుమలనంబి, శిష్యుడైన అనంతాళ్వార్ పరుగు పరుగున కొన్ని మెట్లు దిగివచ్చి, విశ్రాంతి తీసుకుంటున్న రామానుజాచార్యుల వారిని పరామర్శించి, కొండపైకి స్వాగతం పలికారు. వారు కొండపై నుంచి వస్తూ, కొన్ని ఆమ్రఫలాలను శ్రీవారి ప్రసాదంగా తెచ్చి రామానుజునుకి ప్రసాదించారు. వాటిని అత్యంత భక్తితో స్వీకరించిన రామానుజులవారు, ఉచ్ఛిష్టాన్ని (ఫలం తినగా మిగిలన మామిడి టెంకలు) అక్కడే వదిలివేశారు. కొన్నాళ్ళకు ఆ టెంకలు మొక్కలుగా మొలచి, వృక్షాలై తియ్యటి ఫలాలను ప్రసాదిస్తూ, బాటసారులకు నీడనిచ్చేవి. ప్రస్తుతం ఇక్కడ ఉన్న మామిడి చెట్లు కూడా, ఆ చెట్ల సంతతికి చెందినవే!

ఆ విషయం తెలుసుకున్న తరువాతి తరాలవారు అక్కడ నమస్కార ముద్రలోనున్న రామానుజుల విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో, ఆ ప్రదేశం "భాష్యకార్ల సన్నిధి" గా పేరు గాంచింది. కొండకు వెళ్ళే త్రోవలో ఉండటం వల్ల దీన్ని "త్రోవ భాష్యకార్ల సన్నిధి" గా కూడా పిలుస్తారు. ఈ మధ్యకాలంలో అక్కడ, 3,260వ మెట్టు వద్ద, రామానుజుల వారికి దేవాలయాన్ని కూడా నిర్మించారు. ఈ సన్నిధికి ఎదురుగా ఉన్న శిలపై పాదపద్మాలు చెక్కబడి ఉన్నాయి. అవి రామానుజులవారు పూజించుకునే "శ్రీవారిపాదాలు" అని కొందరు, "రామానుజుల వారి పాదాలు" అని మరికొందరు భావిస్తారు.

అమ్మవారి సారె పెట్టెలు

రామానుజుల వారికి నమస్కరించుకుని మరికొన్ని మెట్లెక్కగానే మనకు కుడిప్రక్కగా 3302వ మెట్టుపై; నాలుగు భుజాలతో కోణాలతో తీర్చిదిద్దినట్లున్న, చారలు కలిగిన, పూర్వకాలంలో ఉపయోగించుకునే "కావడిపెట్టలు (40–50 ఏళ్ళ క్రితం మనం ఉపయోగించుకున్న ట్రంకు పెట్టెలు)" లేదా "భోషాణం పెట్టెల" ఆకారంలో కొన్ని రాతి శిలలు అస్తవ్యస్తంగా కనిపిస్తాయి. వీటికి సంబంధించి, ఆసక్తికరమైన కథనాలున్నాయి:

- **ఒక కథనం ప్రకారం**: సీతారామలక్ష్మణులు వనవాసానికి వెడలు తున్నప్పుడు కైకేయి, ఏడువారాల నగలు తనతో తోడ్కొని వెళ్ళటానికి సీతమ్మవారిని అనుమతించింది. ఆ నగల పెట్టెలను సీతమ్మవారు వనవాస సమయంలో ఇక్కడ భద్రపరిచగా, సీతమ్మవారు వాటిని తిరిగి తీసుకోక పోవడంతో అవే కాలాంతరంలో శిలలుగా మారాయి. అయితే, సీతారామలక్ష్మణులు వనవాస సమయంలో తిరుమలక్షేత్రానికి వచ్చినట్లు ఏ రామాయణకావ్యంలోనూ ఉటంకించక పోవటంవల్ల ఈ కథనం సందేహాస్పద మనిపిస్తుంది.
- **మరో కథనం ప్రకారం**: పద్మావతి పరిణయానంతరం, ఆకాశరాజు తనయ పద్మావతితో పాటుగా; విశేషమైన ధనకనకాలను, వజ్రఖచిత ఆభరణాలను, వస్తు విశేషాలను, ఖాద్యసామగ్రినీ పెద్ద పెద్ద కావడి పెట్టెలలో సర్ది, సారెగా పంపించాడు. వందలాది ఏనుగులు, గుర్రాలు ఈ పెట్టెలను తమపై కెక్కించుకొని, అలిపిరిమార్గం ద్వారా తిరుమలకు చేరుకుంటూ, మోకాలి పర్వతాన్ని సమీపించాయి. అంతకు కొద్ది సమయం ముందే "శ్రీవారిమెట్ల" మార్గం ద్వారా ఆనందనిలయానికి చేరుకున్న శ్రీనివాసుడు పద్మావతీదేవితో, 'కొత్త కాపురానికి కావలసిన వస్తుసామగ్రి అంతా వచ్చినట్లేనా?' అని ప్రశ్నించాడు. అందుకు పద్మావతీదేవి తనతో పాటుగా తెచ్చుకున్న సారె నంతా గుర్తుకు తెచ్చుకుని సకలమైన వస్తువులు సమకూరాయని, కేవలం కరివేపాకు మాత్రం తీసుకురాలేదని చెప్పింది. ఈ తప్పిదానికి అలక వహించిన

శ్రీనివాసుడు అంతటి చక్రవర్తి ఆకాశరాజుకు ఇంత చిన్న విషయం తెలియదా?, అని ప్రశ్నించాడు. అంతేకాకుండా, ఆకాశరాజు ప్రేమగా పంపిన సారెనంతా తిరస్కరించి, ఇకనుండి తిరుమలక్షేత్రంలో కరివేపాకు వాడకాన్ని పూర్తిగా నిషేధించమని కూడా శాసించాడు. తిరుమలలో ఆ శాసనం నేడు కూడా అమలులో ఉంది, ఆంధ్రులు పులిహోరలో తప్పనిసరిగా ఉపయోగించే కరివేపాకు, తిరుమల ఆలయం లోని పులిహోర ప్రసాదంలో మచ్చుకు కూడా కానరాదు. ఈసారి జాగ్రత్తగా గమనించండి.

శ్రీవారి అస్వీకారానికి గురైన ఆ సారె పెట్టెలన్ని బండశిలలుగా మారి, మోకాలిమిట్ట మార్గంలో కలియుగారంభం నుంచి అచేతనంగా పడి ఉన్నాయి.

అట్టి సారెపెట్టెలలో ఒకదానిపై ఆంజనేయుడు కొలువుండి, ఆకాశరాజు తన కుమార్తెకు, అల్లునికి ఎంతో ప్రేమగా పంపించిన సారెకు రక్షణభారం వహిస్తూ, స్వామివారు ఎప్పుడెప్పుడు కరుణించి ఈ సారెను స్వీకరిస్తారా అని ఎదురు చూస్తున్నాడు. సకల పాపాలను తొలగించి, అందరినీ అక్కున జేర్చుకునే ఆ శ్రీవారు ఇంత స్వల్ప విషయానికి అలక పూనటం వెనక ఏ మహత్తరమైన పరమార్థం దాగి ఉందో? ఎంతటి లోకకళ్యాణం సమకూర నుందో? స్వామివారి ఈ చిత్రమైన లీలలో మనబోంట్ల ఊహకందని నిగూఢ రహస్యమేదో నిక్షిప్తమై ఉండి ఉంటుంది!

సారె పెట్టెపై కొలువై ఉన్న ఆంజనేయునికి అంజలి ఘటించి, మరి కొన్ని మెట్లు ఎక్కి, సరిగ్గా 3550వ మెట్టు చేరగానే, సాక్షాత్తు శ్రీవారు సాక్షాత్కరించిన ఆనందం కలుగుతుంది. అప్రయత్నంగా భక్తుల నోటినుండి వెలువడే గోవిందనామాలతో దిక్కులు పిక్కటిల్లుతాయి.

దారి పొడవునా మెట్లను పూజించుకుంటూ రాగా మిగిలిన పసుపు–కుంకుమను ఆఖరి మెట్టుకు సమర్పించటంతో, 3,550వ మెట్టుపై ఎల్లవేళలా పెద్ద "కుంకుమ రాసి" అరుణ వర్ణంలో కానవస్తుంది. అక్కడే కర్పూరనీరాజనం కూడా సమర్పించి, 'స్వామివారి సన్నిధికి ఎపుడెపుడు ఏతెంచుదామా' అన్న ఆత్రుతతో రహదారిపై కొద్ది దూరం నడుచుకుంటూ, ఈనాడు "టోల్ గేటు మంటపం" గా పిలువబడే 48 స్తంభాల ప్రాచీన మంటపం దాటి, మనకు కుడి ప్రక్కనే ఉన్న గోదాదేవి ప్రతిమకు నమస్కరించు కుంటాం! ఈ మంటపాన్నే ఇదివరకు 'బళ్ళమంటపం' గా పిలిచేవారు. మెట్లు నిర్మించడానికి పూర్వం, ఎడ్లబళ్ళు, గుర్రపుబళ్ళపై కొండకు చేరుకున్న భక్తులు, తమ బళ్ళను ఈ మంటపం ముందు నిలపడం వల్ల ఈ మంటపానికి 'బళ్ళమంటపం' అనే పేరొచ్చింది.

చివరిగా, అక్కడే ఉన్న తి.తి.దే. కార్యాలయంలో మనం అలిపిరి వద్ద నడక ప్రారంభించే ముందు జమ చేసిన సామానులను, పాదరక్షలను తిరిగి తీసుకుని, ముందే బుక్ చేసుకున్న కాటేజీకో లేదా క్యూ కాంప్లెక్సుకో పరుగు పెడతాం!

కానీ, వందేళ్ళక్రితం పరిస్థితి ఎంతో భిన్నంగా ఉండేది. అత్యంత ప్రయాసతో, దాదాపు రెండు రోజులు ప్రయాణం చేసి, అలసి–సొలసి తిరుమలకు విచ్చేసిన భక్తులు ఈ మంటపాల లోనే విశ్రాంతి తీసుకునే వారు. వాటిలో స్నానపానాలకు, భోజనాదులకు, విశ్రాంతికీ కావలసిన వసతులన్నీ ఉండేవి. రాత్రికి మంటపాల లోనే విశ్రమించి, మరునాటి ఉదయం పరగడుపుతో కాలినడకన శ్రీవారి సన్నిధికి చేరుకుని, మహాద్వార సమీపంలోనే తలనీలాలు సమర్పించుకొని,

స్వామిపుష్కరిణిలో పవిత్రస్నాన మాచరించి, క్షేత్రనియమానుసారం ముందుగా ఆదివరాహుణ్ణి దర్శించుకొని, తడిబట్టలతోనే మహాద్వారం లోనుంచి నేరుగా విమానప్రదక్షిణ మార్గానికి చేరుకుని, పొర్లుదండాలు పెట్టుకుని, విమానవేంకటేశ్వరునికి సమస్కరించి, గర్భాలయం ముందున్న "కులశేఖరపడి" చేరుకుని, స్వామివారిని తనివితీరా ఆపాదమస్తకం దర్శించి, ముడుపులు చెల్లించి, ప్రసాదాలను అమృత తుల్యంగా భావించి ఆర్తితో స్వీకరించేవారు.

తదుపరి తిరుమల యాత్రకు అప్పుడే నాందీ ప్రస్తావన జరిగేది కూడా!

తిరుమల నుండి తిరిగి స్వగృహానికి చేరుకున్న తరువాత, ఇరుగుపొరుగు వారందరినీ ఆహ్వానించి, యాత్రావిశేషాలను మధురానుభూతులను కథలు కథలుగా వర్ణించి, తమతో బాటుగా తీసుకువచ్చిన లడ్డూ ప్రసాదాలను, చిరు కానుకలను పంచిపెట్టి వేడుకలా జరుపు కునేవారు.

శ్రీవారి మెట్లు

మనం మొదట్లోనే చెప్పుకున్నట్టుగా ప్రస్తుతం తిరుమలకు కాలి నడకన చేరుకోడానికి రెండే మార్గాలున్నాయి. ఆ రెండింటిలో, అలిపిరిమార్గం నందు గల విశేషాలన్నింటిని గత కొద్దిరోజులుగా చెప్పుకున్నాం. మరో నడకదారి "శ్రీవారిమెట్లు' గురించి ఈరోజు తెలుసుకుందాం.

మెట్లెన్ని?

తిరుపతికి సమీపంలోని శ్రీనివాసమంగాపురానికి కొద్ది దూరం నుండి మొదలయ్యే ఈ మార్గం 2388 మెట్లతో సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అలిపిరిమార్గంతో పోలిస్తే ఈ మార్గానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి:

సుమారు 1100 మెట్లు తక్కువ. దూరం కూడా ఆరేడు కిలోమీటర్లు తక్కువే! కేవలం రెండు గంటల కన్నా తక్కువ సమయంలోనే కొండపైకి చేరుకోవచ్చు. కొండపైన, మెట్లమార్గం పూర్తయిన ప్రదేశం నుండి దేవాలయం అతి సమీపంలో ఉంటుంది. అలిపిరి మార్గంలో అయితే కొండపైకి చేరుకున్న తరువాత కూడా, మరో రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించాక గానీ ఆలయాన్ని సమీపించలేము. ఈ మార్గం కూడా దారి పొడవునా పైకప్పుతో ఉండి ఎండావానల నుండి రక్షణ కల్పిస్తుంది. అలాగే, మార్గమధ్యంలో మంచినీటి సదుపాయం, శౌచాలయాలు, సామాను, పాదరక్షలు పైకి చేర్చే వెసులుబాటు, ప్రథమచికిత్సా కేంద్రం కూడా ఉన్నాయి. ప్రకృతిసోయగం, వృక్ష, జంతుజాతుల సందడి కూడా దాదాపుగా అలిపిరితో సమానంగానే ఉంటుంది. ఈ మార్గంలో మెట్లు ఎక్కువ ఎత్తులో ఉంటాయని, నడివయసు వారు ఎక్కలేక ఇబ్బంది పడతారని కొందరు చెప్పే మాటలు ఊహాజనితాలే! అలిపిరిమార్గం గుండా నడవగలిగే వారందరూ, ఈ మెట్లను కూడా అంతే సులభంగా అధిరోహించ గలరు.

ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే తెరచి ఉండే ఈ మార్గంలో, రోజుకు పరిమితంగా – ప్రస్తుతం ఆరువేల మందిని మాత్రమే – అనుమతిస్తారు.

అలిపిరే అనుకూలమా?

అలిపిరి మార్గంతో పోల్చితే శ్రీవారిమెట్ల మార్గంలో ప్రతికూలాంశాలు కూడా కొన్ని లేకపోలేదు. ఈ మార్గం తిరుపతి పట్టణం నుంచి సుమారుగా 17 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దేవస్థానం వారి "ధర్మరథం" (ఉచిత బస్సులు), అతికొద్ది ప్రైవేటు బస్సులు, త్రిచక్రవాహనాలు తప్ప, తిరుపతి పట్టణం నుంచి రవాణాసౌకర్యం అంతంత మాత్రమే! చాలామంది స్వంత వాహనాల్లోనో లేదా ప్రైవేటు టాక్సీల్లోనో వెళతారు. అలిపిరిమార్గంలో ఉన్నట్లుగా శ్రీవారిమెట్ల మార్గంలో చెప్పుకోదగ్గ చారిత్రక, పౌరాణిక విశేషాలు లేవు. ఈమార్గంలో నడకదారి దాదాపుగా లేకపోవడం వల్ల, ప్రయాణం కొద్దిగా శ్రమతో కూడుకున్నట్లనిపిస్తుంది. మధ్యలో జింకలపార్కు, ఉద్యానవనం వంటి ఉల్లాసభరిత ప్రదేశాలు లేకపోవడం వల్ల, కొంతమంది స్వల్ప అసహనానికి కూడా లోనవుతారు. మార్గమధ్యలో ఘాట్ రోడ్డు ఏమాత్రం తగలదు.

మార్గమధ్యంలో హోటళ్ళు, చిరుతిళ్ళు కూడా అంతగా లేవు కానీ, కనీస సౌకర్యాలకు కొదవలేదు. యాత్రికుల సందడి కూడా తక్కువగానే ఉంటుంది.

కొన్ని ప్రతికూలతలు ఉన్నప్పటికీ తరచూ నడక ద్వారా తిరుమలకు చేరుకోవా లనుకునే భక్తులకు, సమయాభావం ఉన్నవారికి, శీఘ్రంగా చేరుకో గలిగే ఈ మార్గం ఎంతో అనువైనది. ఇద్దరు-ముగ్గురితో కలిసి మెట్లెక్కుతూ, గోవిందనామాలు బిగ్గరగా ఉచ్చరిస్తుంటే అలసట తెలియదు. మధ్యమధ్యలో కొద్దిగా ఆగుతూ, పచ్చని ప్రకృతిలో మమేకమవుతూ ప్రయాణం కొనసాగిస్తే; చూస్తూ చూస్తూ ఉండగానే కొండపైకి చేరుకుంటాం!

శ్రీనివాసమంగాపురం నందున్న కళ్యాణవేంకటేశ్వరుని ఆలయం నుంచి కొద్దిదూరం మైదాన మార్గంలో ప్రయాణించిన తరువాత ఈ మెట్లమార్గం మొదలవుతుంది.

పౌరాణిక ప్రాశస్త్యం

శ్రీవారి పాదస్పర్శతో పునీతమై, 'శ్రీపతిమెట్టు" గా కూడా పిలువబడే ఈ మార్గం ఎనలేని పౌరాణిక ప్రాశస్త్యాన్ని పొందింది. ఈ మార్గంలోనే శ్రీవారు అనేకసార్లు వేటనిమిత్తం, వ్యాహ్యాళికై; అశ్వారూఢుడై కొన్నిసార్లు, కాలినడకన కొన్నిమార్లు కొండదిగి పరిసర అటవీప్రాంతాని కేతెంచేవారు. శ్రీనివాసుడు ఈ మార్గం ద్వారానే కొండ దిగి వచ్చి మొట్టమొదటిసారిగా నారాయణవనం పరిసరప్రాంత అడవిలో ఆకాశరాజు తనయ పద్మావతిని కాంచి, తొలిచూపులోనే ఆమెను ప్రేమించారని; తదనంతరం వారిరువురికి వకుళమాత చొరవతో పరిణయం జరిగిందని; ఇంతకు ముందే తెలుసుకున్నాం. వివాహానంతరం అగస్త్యుని సలహా మేరకు ఆరు నెలలపాటు ప్రస్తుతం "శ్రీనివాసమంగాపురం" గా పిలువబడే ప్రదేశంలోని అగస్త్యాశ్రమంలో గడిపిన శ్రీవేంకటేశ్వరుడు-పద్మావతి, ఈ మార్గం గుండానే ఆదివారాహక్షేత్రానికి చేరుకొని; తొండమాన్ చక్రవర్తి అప్పటికే అంగరంగ వైభవంగా నిర్మించి సిద్ధంగా ఉంచిన ఆనందనిలయంలో ప్రవేశించారు. ఆ ఆరు మాసాల వ్యవధిలో, శ్రీనివాసుడు సతీసమేతంగా పగటివేళల్లో గడిపినట్లుగా స్థానికులు చెప్పుకునే "ముక్కోటి" ఆలయం కూడా శ్రీనివాసమంగాపురం సమీపంలోని

స్వర్ణముఖి నదీ తీరంలో ఉంది. శ్రీమహావిష్ణువు వైకుంఠం నుంచి దిగి వచ్చి మొట్టమొదటగా తిరుమలక్షేత్రంపై కాలు మోపిన "నారాయణగిరి" శిఖరం "శ్రీవారిమెట్ల" మార్గానికి ఆనుకునే ఉంటుంది. శ్రీవారి పాదస్పర్శకు గుర్తుగా నారాయణగిరి శిఖరం మీదనున్న "శ్రీవారిపాదాలు" గా పిలువబడే స్వామివారి దివ్య శిలాపాదాలను ఈనాడు కూడా దర్శించుకుని తరించవచ్చు.

చారిత్రక ప్రాధాన్యం

14-15వ శతాబ్దాలలో విజయనగర చక్రవర్తుల పరిపాలనా కాలం నందు "శ్రీవారిమెట్ల" మార్గం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. శ్రీకృష్ణదేవరాయల వారు సతుల సమేతంగా ఈమార్గం ద్వారానే ఏడు సార్లు తిరుమల కేతెంచి, స్వామివారికి లెక్కలేనన్ని కానుకలు సమర్పించి తరించాడు. రాయలవారి మంత్రులు, సామంతులు, సేనాధిపతులు, ఉన్నతోద్యోగులు సైతం సపరివార సమేతంగా; గుర్రాల పైన, పల్లకీలు, డోలీలు, మేనాల పైన; ఈ మార్గం లోనే ప్రయాణించి తిరుమలకు చేరుకునేవారు. శ్రీవారిమెట్లకు సమీపంలో ఉన్న చంద్రగిరిని ఏలిన ప్రభువులదరూ శ్రీవారి పరమ భక్తులే! తిరుమల ఆలయంలోని నైవేద్యనివేదన ఘంటానాదం విననిదే ఆహారాన్ని తీసుకునేవారు కాదు. వీరు కూడా తరచూ శ్రీవారిమెట్ల మార్గం ద్వారానే తిరుమలేశుణ్ణి దర్శించుకునే వారు. ఆలయనిర్మాణానికి, పునరుద్ధరణకు, ఆ కాలంలో కట్టబడిన లెక్కలేనన్ని మంటపాలకు అవసరమైన బండరాళ్ళను, రాతి ఇటుకలను, గండశిలలను, శిలాస్తంభాలను గజరాజుల చేత, ఈ మార్గం ద్వారానే చేరవేశారని చాలామంది చరిత్రకారులు అభిప్రాయ పడ్డారు.

మనం "విమానప్రదక్షిణం' ప్రకరణంలో చెప్పుకున్నట్లుగా, 15వ శతాబ్దంలో నియమింపబడ్డ 24 మంది వేదపండితులు శ్రీనివాసమంగాపురం లోనే నివాసముంటూ, శ్రీవారిమెట్టు మార్గం ద్వారా తిరుమలకు చేరుకొని వేదపారాయణం చేసేవారు. అలాగే తిరుమల కొండపై జనావాసాలు అంతగాలేని సమయంలో, అర్చకులు శ్రీనివాసమంగాపురం సమీపంలో నుండే 'కొత్తూరు" అనే గ్రామంలో నివసిస్తూ; వేకువఝామునే బయలుదేరి శ్రీవారిమెట్ల ద్వారా కొండపైకి చేరుకుని అర్చనాఅభిషేకాదులు నిర్వహించి చీకటి పడకుండానే క్రిందకు చేరుకునేవారు. శ్రీవారి ఆలయంలో ఉండే హుండీని "కొప్పెర" గా పిలుస్తారని మనం ముందుగానే చెప్పుకున్నాం. "కొప్పెర" అంటే వెడల్పాటి మూతి గల పెద్ద లోహపుపాత్ర అని అర్థం. తిరుమలక్షేత్రం మహంతుల ఆజమాయిషీలో ఉన్నప్పుడు ప్రతిరోజూ రెండుపూటలా కానుకలతో నిండిన "కొప్పెర" ను మోసుకుంటూ వెళ్లి; ఆలయం ప్రక్కనే ఉన్న "మహంతుమఠం" లో చేర్చటానికి ప్రత్యేకంగా పరిచారకులు ఉండేవారు. "కొప్పెర" ను మోసే వారందరూ కలిసి ఒక తెగగా ఏర్పడి శ్రీనివాసమంగాపురం సమీపంలో ఉన్న ఒక గ్రామంలో నివసించటం వల్ల ఆ గ్రామాన్ని "కొప్పెరవాండ్ల పల్లి" గా పిలిచేవారు. వారు కూడా శ్రీవారిమెట్ల మార్గం గుండానే ప్రతిరోజూ తిరుమలకు చేరుకునేవారు. ఆ రోజుల్లో శ్రీవారి సేవలకు, ఉత్సవాలకు, నైవేద్యాలకు, నిత్యదీపారాధనకు కావలసినటువంటి ధాన్యం, పప్పుదినుసులు, కూరగాయలు, ఆవునెయ్యి, పాలు, పెరుగు, పూలు మొదలైనవన్నీ కూడా; చంద్రగిరి పరిసర ప్రాంతాల నుండి గంపలలో కెత్తుకుని శ్రీవారిమెట్ల మార్గం ద్వారానే కొండపైకి చేర్చేవారు. ఈ విధంగా, శ్రీనివాసమంగాపురం,

చంద్రగిరి పరిసర గ్రామాలైన ఎగువ రెడ్డివారిపల్లి, దిగువ రెడ్డివారిపల్లి, మెట్టపాలెం, నరసింగాపురం, కాళూరు, చెర్లోపల్లె, పెరుమాళ్ళపల్లి మొదలైన గ్రామాల ప్రజలందరూ; శ్రీవారిమెట్ల మార్గంతో, ఆనాడూ–ఈనాడూ కూడా; ఆత్మీయ సంబంధం, తద్వారా శ్రీనివాసునితో విడదీయరాని అనుబంధం, కలిగి ఉన్నవారే! ఇంతటి మహత్తరమైన చారిత్రక వారసత్వాన్ని సొంతం చేసుకున్న శ్రీవారిమెట్ల మార్గం గుండా కనీసం ఒక్కసారైనా తిరుమలకు చేరుకుని శ్రీవారిని దర్శించుకోవటం శ్రీనివాసుని భక్తులందరి చిరకాల స్వప్నం.

----------: : ----------

తొండమాన్ చక్రవర్తి

మనం వివిధ ప్రకరణాలలో ఇంతవరకూ ఆకాశరాజు తమ్ముడైన తొండమానుడు పద్మావతీపరిణయం లో ముఖ్య భూమిక వహించటం; శ్రీనివాసుని ఆనతిపై ఆనందనిలయం నిర్మాణం కావించి కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవారు శాశ్వతంగా తిరుమలక్షేత్రం మీద కొలువై ఉండటానికి కారణభూతు డవ్వటం గురించి మాత్రమే తెలుసుకున్నాం. అయితే, ఈ భక్తశిఖామణికి ఎంతో విశిష్టమైన వృత్తాంతం ఉంది.

శ్రీతీర్థం – భూతీర్థం

కృతయుగంలో ముల్లోక పర్యటనలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేతుడై భూలోకాని కేతెంచిన శ్రీమహావిష్ణువు, ఆనాడు క్రీడాద్రిగా పిలువబడే నేటి వెంకటాద్రి పర్వతం పైనున్న ప్రకృతి సోయగానికి ముగ్ధుడై కొంతకాలం అక్కడే విహరిస్తూ ఉండిపోయాడు. ఆ సమయంలో శ్రీమహావిష్ణువుకు కావలసిన భోజనాదుల నిమిత్తం, ఆ పర్వతశిఖరంపై దేవేరులిద్దరూ చెరొక తీర్థాన్నీ (బావులను) ఏర్పాటు చేశారు. శ్రీదేవి ఏర్పరచిన తీర్థం 'శ్రీతీర్థం" గానూ, అలాగే భూదేవి ద్వారా ఏర్పాటు చేయబడ్డ తీర్థం "భూతీర్థం" గానూ ప్రసిద్ధికెక్కాయి. కాలాంతరాన, కలియుగారంభం నాటికి ఈ రెండు తీర్థాలు శిథిలమై పోయాయి. తన ప్రియసఖుల ద్వారా ఏర్పాటు చేయబడిన ఈ తీర్థాలను ఎంతగానో ఇష్టపడే విష్ణుమూర్తి, వాటిని ఎలాగైనా పునరుద్ధరింప చేయాలని సంకల్పించి తగిన సమయం కోసం వేచి చూస్తున్నాడు.

సద్బ్రాహ్మణుడు – శూద్ర భక్తుడు

ఇదిలా ఉండగా, కలియుగారంభం నందు చోళరాజ్యంలోని హరిద్రానదీ తీరాన ఉన్న కృష్ణక్షేత్రమనే గ్రామంలో, శ్రీకృష్ణునికి పరమభక్తుడైన వైఖానసుడనే సద్బ్రాహ్మణుడు భగవత్సాక్షాత్కారం కోసం కఠోరమైన తపమాచరించాడు. అతని నిష్ఠాగరిష్ఠతకు ప్రీతి చెందిన శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుని రూపంలో ప్రత్యక్షమై ఏదనా వరం కోరుకో వలసిందిగా ఆదేశించాడు. అందుకు వైఖానసుడు భౌతిక సంపదలను కోరుకోకుండా; తనకు మోక్షాన్ని ప్రసాదించమని, ఎల్లవేళల శ్రీకృష్ణుని రూపంలో తన పూజలు స్వీకరించమని కోరుకున్నాడు. అతని నిస్వార్థభక్తికి మెచ్చిన శ్రీమహావిష్ణువు, తాను వెంకటాద్రి పర్వతంపై శ్రీనివాసునిగా స్వయంవ్యక్తమై ఉన్నానని; అతను కోరుకున్నట్లే నిత్యము ఆ శ్రీనివాసుణ్ణి సేవించి తరించ వచ్చునని వరమిచ్చాడు. అంతే గాకుండా ఇకనుండి వైఖానసుడే "గోపీనాథుని" గా ప్రసిద్ధి కెక్కుతాడని; అతనికి "రంగదాసు" అనే శూద్రభక్తునితో పరిచయ మేర్పడుతుందని; కృతయుగంలో వేంకటాద్రిపై "శంఖరాజు" అనే భక్తునిచే నిర్మించబడిన విమానగోపురం కలిగిన తన ఆలయం శిథిలమవ్వగా, అందున్న విగ్రహం సమీపంలోనే ఉన్న ఒక చింతచెట్టు క్రింద ఉన్నట్టి పుట్టలో పడిఉన్నదని; వారిరువురూ (వైఖానసుడు, రంగదాసు) కలసి ఆ విగ్రహాన్ని పుట్టలో నుండి బయటకు తెచ్చి, ఒక వైభవోపేతమైన దేవాలయాన్ని నిర్మించి, అందులో విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి, నిత్యము పూజాదికాలు జరుప వలసిందని కూడా శెలవిచ్చాడు. తదనంతరం, భగవదాజ్ఞ మేరకు వెంకటాద్రి పర్వతానికి బయలుదేరిన గోపీనాథునికి మార్గమధ్యంలో రంగదాసు కలువగా; ఇరువురూ కలసి సువర్ణముఖీ నదిలో

స్నానమాచరించి, సమీపంలోనే ఉన్న శుకపురి (నేటి తిరుచానూరు) అనే పుణ్యక్షేత్రం లోని శ్రీకృష్ణ-బలరాముల ఆలయాన్ని దర్శించుకుని, వేంకటాచలానికి తరలి వెళ్ళారు.

శ్రీనివాసుని సేవలో భక్తద్వయం

శ్రీవారి ఆనతి మేరకు వెంకటాద్రి పర్వతాన్ని చేరుకున్న భక్తులిరువురు స్వామిపుష్కరిణి యందు స్నానమాచరించి; పుష్కరిణికి దక్షిణాన ఉన్న చింతచెట్టు క్రింది పుట్టను త్రవ్వి; అందులో నిక్షిప్తమైయున్న, దివ్య తేజస్సు ఉట్టిపడే, సాలగ్రామశిలా నిర్మితమైన స్వామివారి మూర్తిని వెలికి తీసి; ఎంతో కాలంగా పుట్టకు నీడనిచ్చిన చింతచెట్టును, శ్రీమహాలక్ష్మికి ప్రీతిపాత్రమైన చంపక వృక్షాన్ని మాత్రమే ఉంచి; ఇతర వృక్షాలను, తుప్పలను, బండరాళ్లను తొలగించి; ఆ ప్రదేశాన్ని శుభ్రపరిచి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. విగ్రహం చుట్టూ అందుబాటులో ఉన్న బండశిలలతో కుడ్యాలను నిర్మించి, రెల్లుగడ్డితో పైకప్పు నేర్పరచి శ్రీవారికి తాత్కాలిక వసతి కల్పించారు.

ప్రతిరోజూ శ్రీనివాసునికి గోపీనాథుడు పూజాదికాలు సమర్పించు కునేవాడు. పూజకు కావలసిన పుష్పాలను సమయానికి సమకూర్చే బాధ్యతను వహించిన రంగదాసు, పూదోటను పెంచటం కోసం ఆ సమీపంలోనే రెండు బావులను కూడా నిర్మించాడు. భగవత్సంకల్పంతో ఆ బావులు నిర్మించబడ్డ ప్రదేశంలోనే శ్రీదేవి-భూదేవి లచే ఎప్పుడో నిర్మించబడి శిథిలమై పోయిన **శ్రీతీర్థం, భూతీర్థం** బహిర్గత మయ్యాయి. శ్రీతీర్థం నందలి పవిత్ర జలాలను గోపీనాథుడు శ్రీవారి వంటలకు, అభిషేకాఅర్చనాదుల నిమిత్తం ఉపయోగించే వాడు. అదే నేడు విమానప్రదక్షిణ ప్రాకారంలో ఉన్న "బంగారుబావి".

రంగదాసు స్వామివారి నిత్యపూజకు కావలసిన, పరిమళ భరితమైన, రంగురంగుల పువ్వులను పెంచటానికి భూతీర్థం లోని నీటిని వినియోగించే వాడు. ఆ తీర్థమే నేడు సంపంగిప్రదక్షిణంలో ఉన్న "పూలబావి". అలా, శ్రీమహావిష్ణువు తన దేవేరుల ద్వారా నిర్మింపబడ్డ తీర్థాలను తన భక్తుల ద్వారా పునరుద్ధరింప జేయించి తన మనోరథాన్ని నెరవేర్చుకోవడమే గాకుండా, ఆ తీర్థాలను ఈనాటికీ ఉపయుక్తంగా ఉంచి ఆ భక్తులిరువురినీ చరిత్రపుటల్లో చిరస్థాయిగా నిలిపాడు.

ఈ విధంగా, గోపీనాథుడు-రంగదాసులిరువురు, సుదీర్ఘకాలం పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీవారిని సేవించుకున్నారు.

వరమా? శాపమా?

కొంతకాలం తరువాత ఒకనాడు ఒక గంధర్వ చక్రవర్తి తన భార్యలతో కలిసి స్వామిపుష్కరిణిలో స్నానమాచ రిస్తుండగా, అతని భార్యల అందచందాలను చూచిన రంగదాసు వికలమనస్కుడై, ఆ గంధర్వుడి భోగ భాగ్యాలకు అసూయాగ్రస్తుడై, పూలసేకరణలో జాప్యం చేశాడు. ఇంతలోనే జరిగిన పొరపాటుకు చింతిస్తూ, పుష్కరిణిలో తిరిగి స్నానమాచరించి, మరలా పుష్పాలను కోసుకుని, పూలమాలలతో దేవాలయానికి చేరుకున్నాడు. జరిగిన కాలాతీతానికి కారణమేమని ప్రశ్నించిన గోపీనాథునితో, తన తప్పిదానికి పశ్చాత్తాప పడుతూ జరిగినదంతా యథాతథంగా

వివరించాడు. ఆ సంభాషణను విన్న భగవంతుడు అశరీరవాణితో ఇలా పలికింప జేశాడు "జరుగవలసిన సమయానికి పూజ జరుగక పోవడం క్షమార్హం కాదు. కామవాంఛతో కలుషితమైన మనసుతో సాధన జరగటం దుర్లభం. ఈ దేహం విడిచిపెట్టేంతవరకూ ఆ పరమాత్ముడినే సేవిస్తూ, అవసానదశలో స్వామిపుష్కరిణి తీరంలోనే పరమపదం చెంది, మరుజన్మలో 'సుధర్ముడ" నే ధర్మవర్తనుడైన రాజుకు పుత్రునిగా జన్మించి, తొండమండలానికి ప్రభువై, పెక్కుభార్యలతో భోగభాగ్యాల ననుభవించి, ఆ జన్మలో కూడా శ్రీనివాసునికి ఆంతరంగిక భక్తుడై, శ్రీవారికి వెంకటాద్రి శిఖరంపై వైభవోపేతమైన ఆలయాన్ని నిర్మించి, ఆ దేవదేవుని సేవించుకుంటూ చరితార్థుడవుతావు". ఈ విధంగా, క్షణికమైన కామవాంఛకు లోనైన పాపానికి సుదీర్ఘకాలం మోక్షసిద్ధికై వేచి ఉండేలా శాపాన్ని; అచిరకాలం తనను సేవించు కున్నందుకు ఫలితంగా మరుజన్మలో మహారాజుగా జన్మించి ఆనందనిలయాన్ని నిర్మించి తరించేలా వరాన్ని; ఏకకాలంలో అనుగ్రహించాడు.

తరువాత రంగదాసు మరుజన్మ కోసం నిరీక్షిస్తూ, నూరు సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు శ్రీనివాసుణ్ణి పుష్పకైంకర్యంతో సేవించుకొని, స్వామిపుష్కరిణీ తటాన కాలధర్మం చెందాడు.

తిరుమలేశుని ద్వారా శాపాన్ని, వరాన్ని ఏకకాలంలో పొందిన రంగదాసు నూరు సంవత్సరాల పాటు జీవించి, ఎల్లవేళలా శ్రీవారిని సేవించుకొని, స్వామిపుష్కరిణి తటంలో పరమపదించాడు.

రంగదాసు మరుజన్మ

కలియుగారంభంలో ఒకానొకప్పుడు సుధీరుడనే చక్రవర్తి కుమారుడైన సుధర్మ మహారాజు వేట నిమిత్తం కపిలతీర్థం ఆలయ ప్రాంతానికి విచ్చేశాడు. ఆ సమయంలో అక్కడ విహరిస్తున్న సౌందర్యరాశి యైన ఒక నాగకన్యను చూచి మోహించిన సుధర్ముడు, తనను గాంధర్వవివాహం చేసుకోవలసిందిగా ఆమెను వేడుకొన్నాడు. అంతట ఆ నాగకన్య తాను పాతాళలోక వాసుడైన "ధనుంజయుడు" అనే సర్పరాజు కుమార్తెనని, తన తండ్రి ఓ రాకుమారునికే తననిచ్చి వివాహం చేయ సంకల్పించాడని, తనకు జన్మించిన పుత్రునికే రాజ్యాభిషేకం జరగాలనే అభిలాషను కలిగి ఉన్నాడని, తన తండ్రి కోరిక ప్రకారం అటువంటి రాకుమారుణ్ణే తాను వివాహమాడతానని బదులిచ్చింది. సుధర్ముడు, తాను సుక్షత్రియుణ్ణని, సుసంపన్నమైన "నారాయణవన" రాజ్యానికి రాజునని, కావున సర్పరాజు కోరుకున్న లక్షణాలన్నీ తనలో ఉన్నట్లేనని నాగకన్యతో చెప్పాడు. అయితే, అప్పటికే తనకు "ఆకాశరాజు" అనబడే తనయు దున్నాడని, జ్యేష్ఠపుత్రునికే రాజ్యాధికారం సంప్రాప్తిస్తుంది గావున నాగకన్యకు పుట్టే బిడ్డను రాజ్యాభిషిక్తుణ్ణి చేయలేనని విన్నవించు కున్నాడు. అయితే, మార్గాంతరంగా తన సామ్రాజ్యాన్ని రెండు భాగాలు చేసి, నాగకన్య తనను వివాహమాడితే ఆమెకు పుట్టబోయే కుమారునికి అర్ధరాజ్య మిస్తానని వాగ్దానం చేశాడు. ఆ ఒప్పందానికి నాగకన్య అంగీకరించడంతో, వారిరువురూ గాంధర్వవివాహం చేసుకొని, కొండకోనల్లో విహరిస్తూ, కపిలతీర్థం వద్దే చాలా కాలం గడిపారు.

తొండమానుని జననం

సుధర్మునితో కొన్ని సంవత్సరాల పాటు తనివితీరా సుఖభోగాల ననుభవించిన నాగకన్య–సుధర్ముని గుర్తుగా అతని

రాజముద్రికను తీసుకుని తన స్వస్థలమైన పాతాళలోకానికి తిరిగి చేరుకుంది. కూతురికి వివాహమైందన్న విషయం తెలుసుకున్న సర్పరాజు, అంతా తన అభీష్టం ప్రకారమే జరిగినందుకు మిక్కిలి సంతసించాడు.

కొంతకాలం తరువాత నాగకన్య గర్భం దాల్చి పండంటి మగబిడ్డను ప్రసవించింది. తనయుణ్ణి అల్లారుముద్దుగా పెంచిన నాగకన్య అతనికి విద్యాబుద్ధులు నేర్పించి; కౌమారదశలో ఉన్న తనయునికి రాజముద్రికను గుర్తుగా నిచ్చి, తండ్రిగారైన సుధర్ముని వద్దకు వెళ్ళి ఆతడు వివాహసమయంలో ఇచ్చిన మాట ప్రకారం రాజ్యభారాన్ని స్వీకరించ వలసిందిగా ఆదేశించింది. అంతే గాకుండా, కుమారునితో కపిలతీర్థం వద్దనున్న వనాలలోని దొండపాదుల తీగలను త్రెంపి నడుముకు చుట్టుకొని సుధర్ముని సందర్శించమని, తామిరువురూ కలసి దొండతీగ లల్లుకొన్న పొదలలో విహరించామని, అందువల్ల సుధర్ముడు తనను శీఘ్రంగా గుర్తించ గలుగుతాడని చెప్పింది. తల్లి యానతి మేరకు దొండతీగలను చుట్టుకుని, రాజముద్రికతో తనను సమీపించిన ఆ నూనూగు మీసాల నవయువకుణ్ణి వెంటనే గుర్తించిన సుధర్ముడు సంతోషంతో అతనిని గాఢాలింగనం చేసుకుని తన పుత్రునిగా స్వీకరించాడు.

ఇలా, దొండతీగలతో సుధర్ముణ్ణి చేరుకున్న ఆ యువకుడు కాలక్రమాన "దొండమానునిగా", తదనంతరం "తొండమానునిగా" ప్రసిద్ధికెక్కి, తనకంటే ఐదు సంవత్సరాలు పెద్దవాడైన సుధర్ముని జ్యేష్ఠపుత్రుడైన ఆకాశరాజుకు అనుజుడయ్యాడు.

వసుదానునితో వైరం

సుధర్ముని చెంతకు చేరుకున్న తొండమానుడు నారాయణవనం అంతఃపురంలో అల్లారుముద్దుగా, సుధర్ముని ఆలనా పాలనలో, అన్నగారైన ఆకాశరాజు ప్రాపకంలో చాలాకాలం నిశ్చింతగా గడిపుతాడు. తరువాత సుధర్ముడు రాజ్యవిభజన చేయకుండానే కన్ను మూయడంతో, అవిభక్త నారాయణవన సామ్రాజ్యానికి ఆకాశరాజు ప్రభువై, తొండమానుణ్ణి తన పుత్రుడైన వసుదానునితో సమానంగా చూసుకున్నాడు. ఆకాశరాజు అంతులేని ఆప్యాయతతో, పుత్రవాత్సల్యంతో చూసుకోవడం వలల్; రాజ్యంలో తనకున్న హక్కును మరచిపోయి, ఆకాశరాజును పితృసమానునిగా భావించిన తొండమానుడు అన్నగారికి రాజ్యపాలనలో చెదోడు వాదోడుగా నుండసాగాడు. అలా మరికొంత కాలం గడచిన తరువాత, వృద్ధాప్యదశలో ఉన్న ఆకాశరాజు కుమార్తె యైన "పద్మావతి" కి శ్రీనివాసునితో పరిణయం జరిగింది. అప్పుడు కూడా తొండమానుడు అన్నింటా తానై, వివాహ బాధ్యతనంతా భుజమ్మీద వేసుకుని, ముదిమి మీద పడ్డ అన్నగారికి అండగా నిలబడ్డాడు. అదే సమయంలో శ్రీవేంకటేశ్వరునికి పరమభక్తునిగా మారిపోయాడు. ఆ వృత్తాంతాన్నంతా "పద్మావతీ పరిణయం" ప్రకరణంలో వివరంగా తెలుసుకున్నాం!

వివాహానంతరం వెంకటాద్రికి బయలుదేరి, అగస్త్యాశ్రమంలో ఆరునెలల పాటు శ్రీనివాసుడు సతీసమేతంగా విడిది చేసియున్న సమయంలో; శ్రీనివాసునుకి వృద్ధాప్యంతో ఆరోగ్యం క్షీణించిన ఆకాశరాజు మరణశయ్యపై నున్నాడన్న వర్తమానం అందింది. వెనువెంటనే పద్మావతీ సమేతంగా నారాయణవనం తిరిగి చేరుకున్న శ్రీవేంకటేశ్వరుణ్ణి ఆకాశరాజు చివరిసారిగా దర్శించి నమస్కరించు కుంటాడు. తన తనయుడైన వసుదానుణ్ణి తమ్ముడైన తొండమానుణ్ణి కాపాడమని శ్రీనివాసుణ్ణి పరిపరి విధాలుగా వేడుకుని, ఆకాశరాజు సంతృప్తిగా కన్ను మూస్తాడు. శాస్త్రబద్ధంగా

పెద్దలందరి సమక్షంలో ఆకాశరాజు శ్రాద్ధకర్మలు జరిగిన తరువాత శ్రీనివాసుడు–పద్మావతి అగస్త్యాశ్రమాన్ని తిరిగి చేరుకుంటారు.

ఆకాశరాజు మరణానంతరం, రాజ్యం ఎవరికి చెందాలన్న విషయమై అతని తమ్ముడైన తొండమానుడు, ఆకాశరాజు పుత్రుడైన వసుదానుని మధ్య తీవ్రవివాదం నెలకొంటుంది. అగ్రజుని మరణంతో, తన తండ్రిగారైన సుధర్ముడి వాగ్దానం మేరకు రాజ్యం తనకే సంక్రమిస్తుందని తొండమానుడు; తన తండ్రి తన పరాక్రమంతో చేజిక్కించుకున్న రాజ్యం, వారి తదనానంతరం తనకే సంప్రాప్తిస్తుందని వసుదానుడు; ఇలా ఇరువురూ తర్కబద్ధంగా తమ తమ వాదనలను వినిపిస్తారు. ఎంతకూ వివాదం సామరస్యంగా పరిష్కరింప బడకపోవడంతో, ఇద్దరూ ఒక ఒప్పందానికి వచ్చి "రాజ్యం వీరభోజ్యం" కనుక యుద్ధభూమిలో అమీ తుమీ తేల్చుకుందామని, విజేతదే రాజ్యభోగమని నిశ్చయించుకుని, యుద్ధసన్నాహాలలో తలమునక లవుతారు. యుద్ధభూమిగా నారాయణవనం దక్షిణభాగాన ఉన్న మైదానప్రాంతాన్ని ఎన్నుకుని, యుద్ధ ఘడియలను కూడా నిర్ధారించుకుని, బంధుమిత్రుల సహాయంతో సైన్యాన్ని సమకూర్చు కోవడానికి సమాయత్త మవుతారు.

శ్రీనివాసుడెటు వైపు?

తొండమానుడు, వసుదానుడు ఇరువురికీ ఆత్మీయుడైన శ్రీనివాసుడి సహాయాన్ని ఇద్దరూ అర్థిస్తారు. ఇద్దరూ శ్రీనివాసునితో తమకున్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చి, శ్రీనివాసుని సహాయాన్ని పొందే హక్కు తమకే ఉన్నదని విన్నవించు కుంటారు. ఇద్దరూ తనకు ఆప్తులవ్వడంతో, ఎటూ పాలుపోని శ్రీనివాసుడు, పద్మావతీదేవిని తగిన పరిష్కారం సూచించ వలసిందిగా సంప్రదిస్తాడు. తాను ఒంటరి వాడినని, ఇద్దరికీ సహాయపడ లేనని, ఇరువురూ పద్మావతీదేవికి అత్యంత సన్నిహితులే కనుక ఆమె చెప్పిన ప్రకారమే నడుచు కుంటానని తుది నిర్ణయం ఆమెకే వదిలేశాడు. పద్మావతి అమ్మవారు, అటు పితృతుల్యుడైన పినతండ్రి ఇటు పుత్రసమానుడైన ముద్దుల తమ్ముడు, ఎవరిపక్షం వహించాలో తెలియక సంధిగ్ధంలో పడుతుంది. సుదీర్ఘంగా, ధర్మసమ్మతంగా ఆలోచించి ఈ విధంగా తన అభిప్రాయం వ్యక్త పరుస్తుంది: *"పెద్దవయస్కుడైన తొండమానుడు పరాక్రమవంతుడు. తనను తాను రక్షించుకో గలిగిన సమర్థుడు. ఇటు తండ్రిని కోల్పోయి, చిన్నవయసులో ఉన్న వసుదానుడు తనను తాను కాపాడుకోలేని నిర్బలుడు. యుగయుగాలుగా అనాథలు, బలహీనులను అక్కున జేర్చుకున్న శ్రీనివాసుడు వసుదానునికే సాయమందించటం ఉచితం."* అని ధర్మాధర్మ విచక్షణ చేసి తమ్ముని పక్షాన్ని వహించమని శ్రీనివాసునిణ్ణి వేడుకుంటుంది.

ధర్మసంకటంలో పడ్డ శ్రీనివాసుడేం నిర్ణయించుకున్నాడు? శరణాగతులెవ్వరినీ నిరాకరించని శ్రీవేంకటేశ్వరుడు వైరిపక్షాలలో ఉన్న ఇద్దరినీ ఎలా అనుగ్రహించాడు?

పద్మావతీదేవి శెలవిచ్చినట్లు, యుద్ధరంగంలో పిన్న వయస్కుడైన తన బావమరిది వసుదానుని పక్షం వహించడమే శ్రీనివాసునికి సమంజసంగా తోచింది. అయితే తొండమానుడు ఏ ధైర్యంతో ముల్లోకాలలో ఎదురులేని శ్రీనివాసుణ్ణి ఎదుర్కోవడానికి తలపడ్డాడు?

తానొకవైపు – శంఖుచక్రాలు మరోవైపు

అయితే తన పరమభక్తుడు, పద్మావతీదేవితో తన కళ్యాణాన్ని సుగమం చేసిన వాడు అయిన తొండమానుణ్ణి ఉపేక్షించడం ఎలా? ఇలా తర్జన భర్జన పడిన అనంతరం, ఉభయతారకంగా ఉండేట్లు ఒక నిర్ణయానికి వచ్చాడు. తాను మాత్రం వసుదానుని తరఫున యుద్ధం చేస్తూ, తన ఆయుధాలైన శంఖుచక్రాలను తొండమానుని సహాయార్థం పంపించాడు. శ్రీకృష్ణపరమాత్ముడు తాను పాండవపక్షం వహించి తన సమస్తసైన్యాలను కౌరవులకు బాసటగా నిలిపిన మహాభారతయుద్ధం జ్ఞప్తికి వచ్చేలా; అత్యంత భీకరంగా జరిగిన వసుదానుడు – తొండమానుల యుద్ధంలో, శ్రీనివాసుడు రౌద్రరూపం దాల్చి తొండమానుని సేనలను కకావికలం చేశాడు. తొండమానుడు ఉక్రోషంతో వసుదానునిపై సుదర్శనచక్రాన్ని ప్రయోగించగా, వసుదానుణ్ణి రక్షించబోయిన శ్రీనివాసుడు చక్రం దెబ్బకు మూర్ఛిల్లాడు. ఇరుపక్షాల వారు శ్రీనివాసుని శ్రేయోభిలాషులు కావడంతో జోరుగా సాగుతున్న యుద్ధానికి కొంత విరామమిచ్చి స్వామివారికి సపర్యలు చేయసాగారు.

ఉభయతారకమైన ఒప్పందం

శ్రీనివాసుడు గాయపడ్డ విషయం తెలుసుకున్న పద్మావతీదేవి అగస్త్యునితో సహా యుద్ధరంగానికేతెంచి, తగిన ఉపచారాలు చేసి, శ్రీనివాసుణ్ణి తెప్పరిల్ల జేసింది.

అప్పటికే ఇరుప్రక్కలా జరిగిన విశేష జననష్టానికి కలత చెందిన పద్మావతి వైరిపక్షాల మధ్య 'సంధి' చేయవలసిందిగా శ్రీనివాసుణ్ణి వేడుకొంటుంది. మొదట్లో కొంచెం వెనుకాడినప్పటికీ అగస్త్యముని కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంతో, శ్రీనివాసుడు ఇరువురికి ఆమోద యోగ్యమైన ఒడంబడికను ప్రతిపాదిస్తాడు. ఆ ఒప్పందం ప్రకారం ఆకాశరాజు సామ్రాజ్యం రెండు భాగాలు విభజింప బడుతుంది. నారాయణవనం రాజధానిగా గల భాగం వసుదానునికి దక్కగా, తొండమనాడు రాజధానిగా గల మరొక భాగం తొండమానుని వశవుతుంది. ఆ విధంగా, సుధర్మమహారాజు తన భార్యయైన నాగకన్యకు ఇచ్చిన వాగ్దానం శ్రీనివాసుని ద్వారా సాకార మవుతుంది. తానే దగ్గరుండి సైన్యాన్ని, ధనాగారాన్ని సమభాగాలుగా విభజింపజేసిన శ్రీనివాసుడు, ఇరువురూ సంతుష్టులైన తరువాత పద్మావతీ సమేతంగా తిరిగి అగస్త్యాశ్రమాన్ని చేరుకుంటాడు.

ఆనందనిలయ నిర్మాణం

రాజ్యవిభజ నానంతరం తమ విబేధాలను విడనాడి, వసుదానుడు, తొండమానుడు తమ తమ రాజ్యాలను ఏలుకుంటున్నారు. తొండమానుడు మంచి పరిపాలనా దక్షుడిగా పేరు తెచ్చుకున్నాడు. శ్రీనివాసుని పట్ల తొండమానుని కుండే భక్తిభావం రెండింతలైంది. పద్మావతీ పరిణయం మొదలుకొని, నారాయణవనం విభజన వరకూ జరిగిన సంఘటనలన్నీ తొండమానుని మదిలో మెదిలాయి. అతడు శ్రీనివాసుడి మహిమలను ఇంతకు పూర్వమే కొందరి ద్వారా విని ఉన్నాడు గానీ ఆ పరంధాముడు తన శంఖుచక్రాలను సాయంగా పంపటం, చక్రాయుధం కూడా శ్రీనివాసుణ్ణి నిర్జించలేక పోవడం వంటి ఘటనలను కళ్ళారా కాంచిన తరువాత; సాక్షాత్తూ

శ్రీమహావిష్ణువే శ్రీవేంకటేశ్వరుడిగా అవతరించిన విషయాన్ని దృఢపరచు కున్నాడు. ఇంతకాలం శ్రీవేంకటేశ్వరుణ్ణి సేవించుకున్నప్పటికీ, వారిని భగవంతుని కంటే ఎక్కువగా తమ బంధువుగానే భావించినందుకు ఎంతగానో నొచ్చుకున్నాడు. అంతులేని పశ్చాత్తాపంతో అగస్త్యాశ్రమాని కేతెంచి, శ్రీనివాసుని పాదాల శరణు వేడి తన తప్పిదాన్ని మన్నించ వలసిందిగా వేడుకొన్నాడు. సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు పైనే చక్రాయుధాన్ని ప్రయోగించిన తన పాపానికి నిష్కృతి లేదని, ఆ దుష్కృత్యానికి ఎలాంటి శిక్షనైనా అనుభవించటానికి తాను సిద్ధంగా ఉన్నానని, తనను తగిన రీతిలో శిక్షించమని శ్రీనివాసునితో మొరపెట్టు కుంటాడు. అంతే గాకుండా, తనకు సాయంగా పంపిన శంఖుచక్రాలను తిరిగి తీసుకో వలసిందిగా అర్థిస్తాడు.

శంఖు – చక్రాలు లేని శ్రీవేంకటేశ్వరుడు

తొండమానుని ఆవేదనను ఆద్యంతం విన్న, కరుణాంతరంగుడైన ఆ శ్రీనివాసుడు, తొండమానుడు తన క్షాత్రధర్మాన్ని చక్కగా నిర్వర్తించాడని, యుద్ధభూమిలో శత్రువుపై ఆయుధాన్ని ప్రయోగించటం రాజోచితమైన చర్యేనని, దానికై చింతించ వలదనీ, ఆ సంఘటన వల్ల తొండమానునిపై తనకున్న స్నేహసౌశీల్యతలకే మాత్రం భంగం వాటిల్లదనీ చెప్పి తొండమానుణ్ణి శాంత పరచడానికి ప్రయత్నించాడు. అంతే గాకుండా, తొండమానునికి ఒసగిన శంఖుచక్రాలను తిరిగి స్వీకరించడం జరగదనీ, కలియుగాంతం వరకూ శంఖుచక్రాలు లేకుండానే వేంకటాద్రిపై కొలువుంటానని, శంఖుచక్రాల విహీతంగా తనను కాంచినవారికి తన పరమభక్తుడైన తొండమానుని వృత్తాంతం స్ఫురణకు వస్తుందని చెప్పి; వాటిని తొండమానుని వద్దే పదిలపరచమని ఆదేశించాడు.

ఈనాడు ఆనందనిలయంలో మనం దర్శించుకునే శ్రీనివాసుని అర్చామూర్తి హస్తాలలోని శంఖుచక్రాలు స్వతఃసిద్ధమైనవి కావనీ, మూలవిరాట్టుకు తరువాతి కాలంలో శ్రీమద్రామానుజుల వారిచే అమర్చ బడినవని, ఇంతకు ముందే మనం తెలుసుకున్నాం!

ఆనందనిలయ నిర్మాణం

స్వామివారు అంతగా ఓదార్చినప్పటికీ సమాధాన పడని తొండమానుణ్ణి మరింతగా అనుగ్రహించాలనే ఉద్దేశ్యంతో శ్రీనివాసుడు మరో కోరిక కోరుతాడు. తొండమానుని అన్నగారైన ఆకాశరాజు తనకు కన్యాదానం గావించి, తనన్తో గృహస్తునిగా చేశాడనీ; స్వగృహం లేని తనకు వేంకటాద్రి పర్వతంపై ఒక నివాసయోగ్యమైన గృహాన్ని వాస్తురీత్యా నిర్మించి ఇమ్మని; కలియుగాంతం వరకూ ఆ గృహంలోనే తాను పద్మావతీ సమేతంగా కొలువై ఉంటానని; తద్వారా తొండమానుని కీర్తి ప్రతిష్ఠలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయని శెలవిస్తాడు.

శ్రీవారి ఆనతికి పరమానందం చెందిన తొండమానుడు; వెనువెంటనే ప్రారంభించి అనతికాలంలోనే వేంకటాద్రి పర్వతశిఖరంపై స్వామిపుష్కరిణికి దక్షిణం వైపున, అంతకు ముందు శ్రీనివాసుడు వకుళమాతతో సహా నివసించే ప్రాంతం లోనే, తూర్పు ముఖంగా; మూడు ప్రాకారాలు ఏడు ద్వారాలతో, బంగారు విమానగోపురంతో, సువర్ణకలశాలతో, ధ్వజస్తంభంతో, శ్రీవారు కోరిన విధంగా రాజోచితమైన గృహాన్ని సిద్ధం చేసి శ్రీనివాసునుకి

ఆహ్వానం పలికాడు. సరిగ్గా ఆ సమయానికి అగస్త్యాశ్రమంలో పద్మావతీ సమేతంగా ఆరుమాసాల వ్యవధిని పూర్తిచేసుకున్న సప్తగిరీశుడు, ఒకానొక శుభముహూర్తంలో తొండమానుడు, వసుదానుడు, అగస్త్యాది మునిపుంగవుల సాక్షిగా, పద్మావతీ సమేతంగా గృహప్రవేశం చేశాడు. తొండమానునిచే నిర్మించబడ్డ ఆ గృహంలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరుని కాంచిన భక్తులకు సకలమైన "ఆనందాలు" సిద్ధించడంతో, ఆ గృహం "ఆనందనిలయం" గా పేరు గాంచింది. ఈనాడు మనం శ్రీవారిని ఆ "ఆనందనిలయం" లోనే దర్శించుకుని తరిస్తాం!

స్వామివారి భక్తుల్లో అగ్రగణ్యుడైన తొండమానుని స్మరించుకుని శ్రీనివాసుణ్ణి దర్శించుకుంటే తిరుమల యాత్ర మరింత సాఫల్యమవు తుందని తరతరాలుగా భక్తుల విశ్వాసం. ఒకానొకప్పుడు భక్తులతో నేరుగా సంభాషించే శ్రీనివాసుడు తరువాతి కాలంలో మౌనవ్రతం పూనటానికి తొండమానుడే కారణం.

తానెంతో ప్రయాసకు ఓర్చి నిర్మింపజేసిన ఆనందనిలయం లోనికి శ్రీవేంకటేశ్వరుడు పద్మావతి సమేతంగా, సకల లాంఛనాలతో ప్రవేశించడంతో తొండమానుని ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

శరణుజొచ్చిన తొండమానుడు

పద్మావతి సమేతంగా కొలువై ఉన్న శ్రీనివాసుణ్ణి దర్శించుకోవడం కోసం భక్తులు వ్యయప్రయాసలను లెక్కచేయకుండా ఎంతో దూరం నుండి, సప్తశిఖరాలను అధిరోహించి ఆనందనిలయానికి చేరుకునేవారు. అలా వచ్చే యాత్రికుల సౌకర్యార్థం, తొండమానుడు పర్వతపాద భాగం నుంచి శిఖరాగ్రం వరకు ఒక యోజనం దూరం మెట్లు కట్టించి; దారిలో విశ్రాంతి మండపాలు, చలివేంద్రాలు, తాగునీటిబావులు నిర్మించాడు. అటు శ్రీనివాసుడు పద్మావతిదేవితో సరససల్లాపాలాడతూ, శరణు వేడిన భక్తులను అనుగ్రహిస్తుండే వాడు. భక్తుల కోరికలను వింటూ, వారితో ప్రత్యక్షంగా సంభాషిస్తూ, వారి మనోరథాలను ఈడేర్చేవాడు. తొండమానుడు, రాజధాని అయిన తొండమనాడు లోని తన స్వగృహంలో శ్రీవేంకటేశ్వరుణ్ణి విగ్రహరూపంలో ఆరాధిస్తూ, తన భవనం నుండి నేరుగా తిరుమలక్షేత్రం చేరుకోవడానికి రహస్య బిలమార్గం ఏర్పరచుకున్నాడు. ఆ మార్గం ద్వారా ప్రతిరోజూ ఆనందనిలయానికి చేరుకొని శ్రీనివాసుణ్ణి కనులారా దర్శించుకుని మనసారా ప్రార్థించుకునే వాడు.

ఇదిలా ఉండగా, ఒకనాడు శ్రీనివాసుడు–శ్రీదేవి, భూదేవి లిద్దరితో కలిసి ముచ్చట్లాడు తున్నప్పుడు, తొండమానుడు బిలమార్గం ద్వారా ఆనందనిలయానికేతెంచి, అంతఃపుర మర్యాదలను త్రోసిరాజని, చొరవగా అభ్యంతర మందిరంలోకి అడుగు పెట్టాడు. ఏకాంతసమయంలో లోనికి దూసుకు వచ్చిన అనుకోని అతిథిని చూచి లజ్జితులైన శ్రీదేవి, భూదేవి అంతర్ధాన మవ్వగా; విషణ్ణవదనుడైన తొండమానుడు ఉద్వేగంతో, ముప్పిరిగొన్న భయాందోళనలతో శ్రీనివాసుని చరణాలపై సాష్టాంగపడ్డాడు. పాదాలను విడువకుండా తనవల్ల ఘోరతప్పిదం జరిగిందని, ముంచుకొచ్చిన ఆపద నుండి శ్రీనివాసుడే తనను రక్షించగలడని, అభయమిస్తేగానీ పాదపద్మాలను విడువనని వేడుకున్నాడు.

దానికి బదులుగా శ్రీనివాసుడు, శరణన్నవాడిని కాపాడటానికే తాను వైకుంఠం వీడివచ్చానని, తన స్మరణమాత్రం

చేతనే పాపాలు పటాపంచ లవుతాయని, ఎటువంటి అపదనుండైనా రక్షిస్తానని, కలత చెందవలసిన అగత్యం లేదని అభయమిచ్చి; ముంచుకొచ్చిన ఆపదను విశదీకరించ వలసిందిగా తొండమానుణ్ణి ఆదేశించాడు.

శ్రీనివాసుని ఆపన్నహస్తంతో తెరపిన పడ్డ తొండమానుడు తనకు వాటిల్లిన ముప్పునీ విధంగా చెప్పుకొచ్చాడు.

విప్రుని విన్నపం

శ్రీరంగక్షేత్రంలో నివసించే ఒక సద్బ్రాహ్మణుడు ఒకనాడు నిండుకొలువులో ఉన్న తొండమానుణ్ణి సందర్శించి తాను తన తండ్రి పుణ్యక్రియల నిమిత్తం భార్యాపుత్రులతో కాశీయాత్రకు సమాయత్త మయ్యానని, మార్గమధ్యన తిరుపతికి చేరుకున్నపుడు తన భార్య గర్భవతి అయిన విషయం తెలిసిందనీ, చూలాలితో సుదూరయాత్ర సాధ్యపడదని, అత్యవసర సమయాల్లో రాజమందిరం నందు ప్రభువుల రక్షణలో భార్యనుంచటం శాస్త్రసమ్మతమని, తాను యాత్రను ముగించుకొని తిరిగి వచ్చేందుకు ఆరు మాసాల సమయం పడుతుందని, అంతవరకు గర్భవతియైన తన భార్యా, పసిబాలుడైన పుత్రుని సంరక్షణా భారాన్ని వహించమని విన్నవించు కున్నాడు.

ప్రజలను కన్నబిడ్డల వలె కనిపెట్టుకొని ఉండే తొండమానుడు, విప్రుని వినతిని సత్వరమే అంగీకరించి; నిశ్చింతగా కాశీయాత్ర ఫలప్రదం గావించుకుని క్షేమంగా తిరిగి రమ్మని, అంతవరకూ అతని భార్యాబిడ్డలను కంటికి రెప్పలా కాపాడే బాధ్యత తనదేనని ఆ విప్రునికి అభయ మిచ్చాడు.

ఘోరాపరాధం

అంతలోనే, అసమాన సౌందర్యంతో ఉట్టిపడుతూ యవ్వనదశలో ఉన్న విప్రుని భార్య ముఖారవిందాన్ని నిశితంగా గమనించి, దూరదృష్టితో ఆలోచించి; ఇంతటి సౌందర్యరాశిపై చంచల మనస్కులైన పరపురుషుల దృష్టి సోకే అవకాశం ఉందని తలంచి; ఆరు మాసాలకు సరిపడా భోజనసామాగ్రి, ఇతర వస్తువిశేషాలతో సహా ఆమెను సకల సౌకర్యాలు గలిగిన రహస్య గృహము నందుంచి; చేసిన ఏర్పాట్లను సమీక్షించుకుని, సంతృప్తి చెంది, వారికి ఇతరుల వల్ల ఏ హానీ జరుగకుండా వారుంటున్న గృహానికి తాళాలు వేసి కట్టుదిట్టమైన కాపలా ఏర్పాటు చేశాడు. కొంతకాలం పాటు వారి బాగోగులను క్రమం తప్పకుండా పరామర్శించిన తరువాత, కాలక్రమాన రాజ్యపరిపాలనా భారంలో వ్యస్తుడై ఆ విప్రుని పరివారాన్ని పూర్తిగా విస్మరించాడు.

అటు విప్రుడు, తన భార్యాబిడ్డలు రాజాశ్రయంలో క్షేమంగా ఉన్నారనే నిశ్చింతతో; అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగ పరచుకుంటూ, తోటివారితో కలసి సమస్తక్షేత్రాలను సందర్శించుకొని, రెండు సంవత్సరాలు గడచిన తరువాత తొండమానుని వద్దకు వచ్చాడు. తన భార్యాబిడ్డల కుశలమడిగి, అంతకాలం వారిని సంరక్షించిన ప్రభువునకు కృతజ్ఞతలు తెలుపుకొని, వారిని తనకు తిరిగి అప్పజెప్ప వలసిందిగా కోరాడు. విప్రుని రాకతో అతని పరివారం అకస్మాత్తుగా స్ఫురణకు రావడంతో తొండమానుడు భయంతో బిక్కచచ్చి పోయాడు. వారికి ఏదో ఆపద వాటిల్లి ఉంటుందనే ఆలోచనతో మ్రాన్పడిపోయిన తొండమానుడు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ విప్రుని భార్యా, కుమారుడు, అతని అనుపస్థితిలో జన్మించిన బాలిక అందరూ క్షేమంగా ఉన్నారని; తిరుమలేశుని శుక్రవార అభిషేకం

దర్శించు కోవడానికై రాజ కుటుంబీకులతో కలసి వేంకటాచలక్షేత్రానికి తరలి వెళ్ళారని, మరో రెండు రోజుల్లో తిరిగి వస్తారని బొంకి; ప్రయాణ బడలికలో ఉన్న ఆ విప్రుణ్ణి వారు తిరిగొచ్చేంత వరకూ తన ఆతిథ్యం స్వీకరించ వలసిందిగా కోరి, అతనికి సకల సౌకర్యాలతో ఉన్న విడిదిని ఏర్పాటు చేశాడు. అంతలోనే, ఏదో అశుభాన్ని శంకించిన తొండమానుడు, విప్రపరివారాన్ని ఉంచిన రహస్య మందిరానికి హుటాహుటిన వెళ్ళిచూడగా వారు ముగ్గురూ ఆరు నెలల వ్యవధికి సరిపడే వంటసామాగ్రి ఖర్చయి పోవడంతో, వారి ఆక్రందనలను వినే నాథుడు లేక, ఆకలిదప్పులతో అలమటించి విగతజీవులై కనిపించారు.

శరణు – శరణు

తన ద్వారా జరిగిన ఘోరతప్పిదానికి ఖిన్నుడైన తొండమానుడు, విప్రుని శాపభయంతో నిలువెల్లా వణికిపోయి శ్రీనివాసుని పాదాక్రాంతుడవుతాడు.

ఈ వృత్తాంతాన్నంతా విన్న శ్రీనివాసుడు క్రోధితుడై బ్రాహ్మణ పరివార పరిరక్షణ బాధ్యతను విస్మరించి తొండమానుడు మహాపాపం మూటకట్టుకున్నాడని, బ్రహ్మహత్యాదోషం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, కానీ తొండమానుని అన్నగారైన ఆకాశరాజు తనకు అత్యంత ఆప్తుడైనందు వల్ల, తొండమానునికి అభయం ఇచ్చి యున్నందు వల్ల ఆ విప్రుని కుటుంబీకులను పునర్జీవితులను గావించుతానని వచించి తొండమానుణ్ణి శాంతింప జేశాడు.

అస్తికలకు పునరుజ్జీవం

శ్రీవేంకటేశుని ఆనతి మేరకు, తొండమానుడు మృతులై పడియున్న విప్రుని కుటుంబసభ్యుల అస్తికలను వెంకటాచలానికి రప్పించాడు. శ్రీనివాసుడు వాటిని తిరుమలక్షేత్రాన పాండవతీర్థానికి సమీపంలోనున్న మరో తీర్థానికి తోడ్కొనివెళ్ళి, ఆ తీర్థజలాన్ని అస్తికలపై సంప్రోక్షణ గావించటంతో, ఇంద్రాది దేవతలందరూ ఆశ్చర్యానందాలతో వీక్షిస్తుండగా వారు ముగ్గురూ పునర్జీవులయ్యారు. అస్తికలకు ప్రాణప్రదానం గావించటం వల్ల ఆ తీర్థం "అస్తితీర్థం" గా పేరు గాంచింది.

అలకబూనిన ఆనందనిలయుడు

బ్రాహ్మణ కుటుంబాన్ని భద్రంగా విప్రునికి అప్పగించిన తరువాత, శ్రీనివాసుడు, తొండమానునితో నిష్ఠూరమాడాడు. తాను వ్యక్తరూపంలో ఉండి, నిత్యం సంభాషిస్తూ, అండగా ఉన్నాననే ధైర్యంతో, తొండమానుడు తన కర్తవ్యాన్ని విస్మరించి, అహంభావ పూరితంగా, బాధ్యతారహితంగా ప్రవర్తించాడని; ఆశ్రితుల పట్ల తన బాధ్యతను మరచాడని; కానీ తాను ఇచ్చిన మాట ప్రకారం మునుపెన్నడూ లేని విధంగా చనిపోయిన వారిని తిరిగి బ్రతికించి విప్రుని శాపం నుండి తొండమానుణ్ణి కాపాడానని చెప్పాడు. తొండమానుని వ్యవహారశైలితో కలత చెందిన తాను ఇకనుండి వ్యక్తరూపాన్ని విడనాడి, అవ్యక్తరూపానికే పరిమితమై, ఎవరితోనూ నేరుగా సంభాషించనని తొండమానునితో ఆఖరిసారి ప్రత్యక్షంగా మాట్లాడాడు. అయితే, కలియుగాంతం వరకూ కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమై

సాలగ్రామశిలా రూపంలో ఆనందనిలయాన కొలువై ఉంటానని కూడా అభయ మిచ్చాడు. ఆనాటి నుండి శ్రీవేంకటేశ్వరుడు శిలారూపుడై, మన కోర్కెలను మౌనంగా వింటూ, భక్తకోటిని అనుగ్రహిస్తున్నాడు.

తొండమానునికి కనువిప్పు

అప్పటివరకూ తనతో ప్రతినిత్యం సంభాషించే శ్రీనివాసుడు అలకబూని మౌనవ్రత మాచరించటంతో తీవ్ర అసంతృప్తికి గురైన తొండమానుడు, శ్రీనివాసుడి అనుగ్రహాన్ని తిరిగి సంప్రాప్తించు కోవడం కోసం తన గురువైన అంగీరసుణ్ణి సంప్రదించాడు. ఆ మునిపుంగవుని సలహా మేరకు శ్రీనివాసుణ్ణి ప్రతినిత్యం వేయి బంగారు తులసిదళాలతో పూజిస్తూ, తనంతటి భక్తాగ్రేసరుడు మరొకడుండబోడనే, పాలకుల సహజ లక్షణమైన అహంకార ధోరణితో, డాంబికమైన భక్తిని ప్రదర్శిస్తుండే వాడు. శ్రీనివాసుడు, తొండమానుని అహంకారపు తెరలు తొలగించాలనే ఉద్దేశ్యంతో, ప్రతినిత్యం తొండమానుని బంగారు తులసిదళాలను తిరస్కరించి, కుమ్మరి భీమన్న అనే కడు పేదవాడు నిష్కళంక భక్తితో అర్పించుకునే మట్టిపూలను ఆప్యాయంగా స్వీకరించే వాడు. ఆ ఇతివృత్తాన్ని "శ్రీవారి భక్తాగ్రేసరులు – కుమ్మరి భీమన్న" అనే ప్రకరణంలో ఇంతకు ముందే తెలుసుకున్నాం.

కుమ్మరిభీమన్న ఉదంతంతో కనువిప్పు కలిగిన తొండమానుడు సుదీర్ఘకాలం పాటు స్వామివారిని నిష్కళంకమైన భక్తిశ్రద్ధలతో సేవించుకుని, స్వామిపుష్కరిణీ తటాన ఐచ్ఛికమరణం పొంది, మరుజన్మలో అకుంఠిత నిష్ఠతో కఠోరదీక్షతో తపమాచరించి, పరమపదాన్ని పొంది, తిరుమలక్షేత్ర చరిత్రలో అమరుడై, నేటికీ నిత్యం స్మరింప బడుతున్నాడు.

తొండమానుని రాజధాని నగరమైన, తిరుపతి–శ్రీకాళహస్తి రహదారిలో నేటికీ ఉన్న "తొండమనాడు" గ్రామంలో; పచ్చని ప్రకృతిలో, కొండకోనల నడుమ విరాజిల్లుతున్న "ప్రసన్న వేంకటేశ్వరుని" ఆలయాన్ని నేడు కూడా చూసి తరించవచ్చు. ప్రతినిత్యం రహస్యమార్గం ద్వారా వేంకటాచలానికి వెళ్ళి శ్రీవేంకటేశ్వరుణ్ణి దర్శించుకునే తొండమానుడు, తన వృద్ధాప్యదశ యందు కొండను అధిరోహించలేని తన నిస్సహాయతను వ్యక్తం చేయడంతో, భక్తసులభుడైన శ్రీనివాసుడు అతని రాజభవనంలోనే ప్రసన్న వేంకటేశ్వరునిగా వెలశాడనీ, ఆ ప్రదేశంలోనే ఇప్పుడున్న వైభవోపేతమైన మందిరం తొండమానుని ద్వారా నిర్మించ బడిందనీ, తన అవసానదశలో తొండమాన్ చక్రవర్తి శ్రీనివాసుణ్ణి ఆ మందిరం లోనే సేవించుకునే వాడని స్థానికుల ప్రగాఢ విశ్వాసం.

----------: : ----------

స్వామి పుష్కరిణి

తిరుమలలో ప్రధాన ఆలయానికి ఉత్తర దిక్కుగా, ఆదివరాహస్వామి ఆలయాన్ని ఆనుకొని ఉండే సువిశాలమైన స్వామిపుష్కరిణిని చూడని వారుండరు. ఈమధ్య కాలం వరకు ఈ పుష్కరిణిలో పవిత్రస్నాన మాచరించిన తరువాతనే శ్రీవారిని దర్శించుకునే వారు. ఈ పుష్కరిణికి విశేషమైన ఆధ్యాత్మిక, చారిత్రాత్మక, పౌరాణిక ప్రాశస్త్యం ఉంది. దేవాధి దేవతలు, బ్రహ్మర్షులు, రాజాధి రాజులు, భక్తాగ్రేసరులు ఇలా ఎందరో ఈ పుష్కరిణి యందలి పవిత్రజలాలతో పునీతులై, శ్రీనివాసుని కృపకు పాత్రులై, మోక్షప్రాప్తిని, ఇష్టకామ్యార్థ సిద్ధిని పొందారు. నేటి నుండి కొన్ని ప్రకరణాలలో స్వామిపుష్కరిణి గూర్చి సవివరంగా తెలుసుకుందాం.

కొండపై ఎన్నెన్నో కోనేర్లు

తిరుమలక్షేత్రంలో లెక్కలేనన్ని కోనేర్లు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి –

- విజయనగర సామ్రాజ్యానికి చెందిన సాళువ నరసింహరాయలుచే నిర్మించబడిన నరసింహ కోనేరు – ప్రస్తుతం పాడు పడిపోయిన ఈ కోనేరు మైసూరు సత్రంలో ఉంది.
- గతంలో అచ్యుతరాయ కోనేరుగా పిలువబడే పుష్కరిణి – స్వామిపుష్కరిణికి వెనుక భాగంలో, అంటే ఈనాడు లడ్డూ కౌంటర్ ఉన్న ప్రదేశంలో, ఉండేది. భక్తుల స్నాన–సంధ్యావందనాదుల నిమిత్తం ఆ కోనేరు చుట్టూ పన్నెండు మండపాలు ఉండేవి. మహంతుల పరిపాలనా కాలంలో కారణాంతరాల వల్ల ఈ కోనేరు మూసివేయబడింది.
- శ్రీవారి భక్తాగ్రేసరుడైన అనంతాళ్వార్ స్వయంగా, నిండు చూలాలిగా ఉన్న తన భార్యతో కలిసి, శ్రీవారి పుష్ప కైంకర్యార్థం 11వ శతాబ్దంలో నిర్మించిన శ్రీరామానుజుల పుష్కరిణిని–పశ్చిమ మాడవీధికి వెనుక భాగంలో ఉన్న అనంతాళ్వార్ సమాధి వద్ద, అలాగే క్యూ మార్గానికి ప్రక్కగా–నేడు కూడా చూడవచ్చు. అంతటి సువిశాలమైన కోనేటిని ఆ రోజుల్లో స్వయంగా త్రవ్వడం శ్రీవారి పరమభక్తుడైన అంతాళ్వార్ కు మాత్రమే సాధ్యపడింది. వేయి సంవత్సరాల పైబడ్డ ఆ చెరువు, ఆ భక్తుని త్యాగనిరతికి, అచంచల భక్తికి ప్రబల తార్కాణంగా నిలిచి ఇప్పటికీ భక్తులకు అచ్చెరువు గొల్పుతోంది.
- ఎంతో ప్రాచీనమైన మరో పుష్కరిణి మంగళం బావి కాటేజెస్ (MBC) సముదాయంలో ఉంది. ఒకప్పుడు ఈ పుష్కరిణి ఒడ్డునే కళ్యాణకట్ట ఉండేది. శ్రీవారిమెట్ల మార్గంలో తిరుమలకు విచ్చేసిన భక్తులు ఈ పుష్కరిణిలోనే స్నానమాచరించే వారు.
- తిరుమలలో ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఉండే మరో కోనేరును తి.తి.దే. ఉద్యానవనంలో నేను కూడా చూడవచ్చు. దాదాపు 50 సంవత్సరాల క్రితం, అంటే గోగర్భం ఆనకట్ట నిర్మించక ముందు, తిరుమలలో యాత్రికుల నీటి అవసరాలు ఈ పుష్కరిణి తీర్చేది.

తిరుమలలో ఉన్న కోనేర్లు లేదా పుష్కరిణులన్నీ ఒక ఎత్తయితే, స్వామిపుష్కరిణి ఒక్కటీ మరొక ఎత్తు. తిరుమల లోని సమస్త తీర్థాలు స్వామిపుష్కరిణి నుంచే ఉద్భవించాయని, ఆ ప్రదేశం నుంచి అంతర్వాహినులుగా ప్రవహించి,

తిరుమల సానువుల్లోని అనేక ప్రదేశాల్లో బహిర్గతమై, భక్తులను తరింపజేసి మరలా స్వామిపుష్కరిణి లోనే ఐక్య మవుతాయని భక్తుల విశ్వాసం.

స్వామిపుష్కరిణికి ఆ పేరెలా వచ్చింది?

దీనికై ప్రధానంగా రెండు కథనాలు వెలుగులో ఉన్నాయి. తిరుమలక్షేత్రంలో అలరారుతున్న అన్ని పుష్కరిణులలో ప్రముఖమైనది, సువిశాలమైనది మరియు అత్యంత మహత్తు కలిగినది అయి ఉండటం చేత ఈ పుష్కరరాజం స్వామిపుష్కరిణి నామధేయంతో పిలువ బడుతోంది. 'స్వామి' అనగా ప్రభువు, అగ్రగణ్యుడు, అత్యంత ప్రముఖుడు అనే అర్థాలున్నాయి.

మరో కథనం ప్రకారం వివిధ కారణాల వల్ల స్వామిత్వాన్ని, అనగా సామ్రాజ్యాలను కోల్పోయిన మహామహులు ఎవరైనా సరే భక్తిపూర్వకంగా ఈ పుష్కరిణిలో తీర్థస్నానం గావిస్తే పోగొట్టుకున్న రాజ్యాలను, సిరిసంపదలను, భోగభాగ్యాలను తిరిగి పొందుతారు. స్వామిపుష్కరిణిలో మునకలిడడం ద్వారా పోయిన సామ్రాజ్యాన్ని తిరిగి పొందిన 'శంఖణుడు' అనే మహారాజు చరిత్రను ముందు ముందు తెలుసుకుందాం.

తొమ్మిది తీర్థాల సమాగమం

ఏకరూపంలో అవిభక్తంగా కనపడే స్వామిపుష్కరిణి వాస్తవానికి తొమ్మిది తీర్థాల సమారోహం. ఒక్కొక్క తీర్థాన్ని ఒక్కో దివ్యపురుషుడు తమ తమ శక్తులను నిక్షిప్తం చేసి ఆవిర్భవింప జేశారు. ఒక్కో తీర్థంలో స్నానం చేస్తే ఒక్కో విశిష్టఫలం సంప్రాప్తిస్తుంది.

కుబేర తీర్థం లేదా ధన తీర్థం

స్వామిపుష్కరిణికి ఉత్తరదిక్కున, కుబేరస్థానంలో కొలువై ఉన్న ఈ తీర్థం, ధనాధిపతి యైన కుబేరునిచే నిర్మించబడింది. సాక్షాత్తు శ్రీవారికే ఋణం ఇవ్వదగినంత భాగ్యవంతుడీ కుబేరుడు. ఈనాడు కూడా స్వామివారి అపారమైన సంపత్తిని రక్షిస్తూ, మహాద్వారానికి ఇరుప్రక్కలా నిలుచుని ఉండే శంఖనిధి-పద్మనిధి కుబేరుని అనుచరులే! వారి చరిత్రను మనం ఇంతకుముందే తెలుసుకున్నాం.

ఈ తీర్థంలో స్నానమాచరిస్తే సకల పాపహరణం కావడమే కాకుండా సకల సంపదలు సిద్ధిస్తాయని ప్రతీతి. ఈ తీర్థానికి ఉత్తర దిశగా ఉన్న చిన్న కాషాయరంగు మంటపాన్ని 'వ్యాసరాయ ఆహ్నికమంటపం' గా పిలుస్తారు. శ్రీకృష్ణదేవరాయలు గురువైన వ్యాసతీర్థుల వారు ఈ ప్రదేశంలోనే త్రికాల సంధ్యావందన మాచరించేవారు. వారి సంపూర్ణచరిత్రను ఇంతకు ముందే తెలుసుకున్నాం.

గాలవతీర్థం

స్వామిపుష్కరిణికి ఈశాన్య భాగంలో విరాజిల్లుతోంది. గాలవ మహర్షిచే తన యావత్ తపఃశక్తిని ధారపోసి

నిర్మించబడిన ఈ తీర్థజలాలలో పవిత్ర స్నానమాచరిస్తే, క్లేశాలన్నీ తొలగిపోయి సుఖ సంపదలు లభిస్తాయి. ఈ తీర్థానికి ఈశాన్యదిక్కున విరాజిల్లుతున్న ఆంజనేయుణ్ణి 'కోనేటిగట్టు ఆంజనేయస్వామి' గా వ్యవహరిస్తారు. మహమ్మదీయుల దండయాత్రల నుంచి హిందూ దేవాలయాలను సంరక్షించుకునే బృహత్తర కార్యక్రమంలో భాగంగా దక్షిణభారతదేశంలోని అనేక దేవాలయాలవద్ద వ్యాసతీర్థుల వారిచే ప్రతిష్ఠింపబడ్డ వెయ్యికి పైగా ఆంజనేయ విగ్రహాలలో ఇది కూడా ఒకటి. ఆదివరాహస్వామి ఆలయానికి తూర్పుదిశగా ఉన్న ఈ చిన్న ఆలయంలో ఆంజనేయుడు ముకుళిత హస్తాలతో వరాహస్వామికి నమస్కరిస్తూ దర్శనమిస్తాడు.

మార్కండేయ తీర్థం

స్వామిపుష్కరిణి తూర్పు భాగంలో, తూర్పు మాడవీధిని ఆనుకొని ఉండే ఈ తీర్థం మార్కండేయ మహర్షిచే నిర్మించబడింది. ఈ తీర్థంలో స్నానం చేస్తే అకాల మృత్యువు తొలగిపోయి దీర్ఘాయుష్షు లభిస్తుంది. తిరుమలక్షేత్రంలో 'మార్కండేయతీర్థం' అనే మరో పవిత్రమైన తీర్థం కూడా ఉన్నట్లుగా చెబుతారు.

అగ్నితీర్థం

స్వామిపుష్కరిణికి ఆగ్నేయ దిక్కున అగ్నిదేవునిచే స్థాపించబడిన ఈ తీర్థంలో స్నానం చేస్తే దీర్ఘ వ్యాధులు నశిస్తాయి. అగ్నిదేవుడు, పద్మావతీ పరిణయ సందర్భంలో వంట ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి, తిరుమలలోని సమస్తతీర్థలను వంటపాత్రలుగా ఉపయోగించి, ముక్కోటి దేవతలకు తృటికాలంలో షడ్రశోపేతమైన విందుభోజనాన్ని సిద్ధం చేసి స్వామివారికి తన వినమ్రభక్తిని, కృతజ్ఞతాభావాన్ని చాటుకున్నాడు.

వరుణతీర్థం

స్వామిపుష్కరిణికి పశ్చిమదిశలో ఉన్న ఈ తీర్థంలో స్నానమాచరిస్తే వరుణుని కృపతో జన్మజన్మల పాపపంకిలమంతా మటు మాయమైపోతుంది. సకాలంలో వర్షాలను కురిపించి స్వామిపుష్కరిణి సదా పవిత్రజలాలతో నిండి ఉండి భక్తులను పునీతం చేయటంలో వరుణుడు ఎంతగానో తోడ్పడుతాడు.

వాయుతీర్థం

స్వామిపుష్కరిణికి వాయువ్యమూలలో వాయుదేవునిచే నిర్మించబడ్డ ఈ తీర్థస్నానం వల్ల పరమపదం సిద్ధిస్తుంది. ఆ ప్రదేశం లోనే ఆదివరాహస్వామి ఆలయం కూడా ఉంటుంది. వాయుదేవునికి, ఆదిశేషునికి మధ్య జరిగిన బలపరీక్షలో శ్రీమహావిష్ణువు, నిగర్వి, నిస్వార్థభక్తుడు అయిన వాయుదేవుని పక్షాన నిలచి, అహంభావపు తెరలు కమ్ముకున్న, తనకు యుగాల నుండి సేవలందిస్తున్న ఆదిశేషువుకు గర్వభంగం కలిగించి, తనకు తన–పర బేధాలు లేవని, అంకితభావంతో, వివయవిధేయలతో తనను సేవించుకున్న వారందరినీ ఆదుకుంటానని నిరూపించుకున్నాడు. ఆ ఉదంతాన్ని ముమ్మందు తెలుసుకుందాం.

యమతీర్థం

స్వామిపుష్కరిణికి దక్షిణదిశలో ఉన్న ఈ తీర్థంలో స్నానం చేసిన వారికి నరక యాతన తప్పుతుందని యమధర్మరాజు వరమిచ్చాడు. ఇక్కడ స్నానం చేస్తే వైకుంఠప్రాప్తి కలుగుతుంది. ఆ సమవర్తి, శ్రీవారి ఆనతి ననుసరించి, స్వామివారి ఆయుధమైన చక్రాయుధపు కనుసన్నలలో నడుచుకుంటూ, ముష్కరుల పీచమణిచి, తన యమపాశంతో వారి ప్రాణాలను పరిహరిస్తాడు.

వశిష్ఠతీర్థం

స్వామిపుష్కరిణికి నైరుతిదిశలో వశిష్ఠమహర్షిచే నిర్మించబడ్డ ఈ తీర్థంలో స్నానం చేస్తే ఋణ విముక్తులవుతారు. వశిష్ఠముని సలహా ననుసరించి, దశరథుడు స్వామిపుష్కరిణిలో స్నానమాడి, పూర్వపు జన్మల ఋణానుబంధాల నుండి విముక్తుడై, తదనంతరం పుత్రకామేష్ఠియాగ మొనర్చి, రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులను పుత్రులుగా పొందిన పురాణ వృత్తాంతాన్ని ముందు ముందు తెలుసుకుందాం.

సరస్వతీ తీర్థం

స్వామిపుష్కరిణికి మధ్య భాగంలో స్థితమై ఉంది. సాక్షాత్తు సరస్వతీదేవే స్వామిపుష్కరిణిగా అవతరించిందని పురాణాలు ఘోషిస్తున్నాయి. దానికి సంబంధించిన ఇతిహాసం ఇలా ఉంది.

సరస్వతి దేవియే స్వామిపుష్కరిణి

గంగ–యమున–సరస్వతి నదుల సంగమాన్ని త్రివేణి సంగమంగా వ్యవహరిస్తారు. ప్రయాగ పుణ్యక్షేత్రం వద్ద గంగాయమున సంగమాన్ని ప్రత్యక్షంగా వీక్షించవచ్చు గానీ, అంతర్వాహినిగా ప్రవహిస్తుండటం వల్ల సరస్వతీ నదిని మనం దర్శించుకోలేము. తాను కూడా గంగానది వలె బహిర్గతమై, భక్తుల పాపాలను నశింప జేయాలనే ప్రగాఢమైన కోరిక గలిగిన సరస్వతి తన వాంఛను సిద్ధింప చేసుకోవడం కోసం నదీ రూపంలోనే వేంకటాచలానికి విచ్చేసి ఘోర తపస్సు నాచరించింది. సరస్వతిదేవి ధ్యానమగ్నయై ఉన్న తరుణంలో బ్రహ్మమానస పుత్రుడు, రావణుని తాత యైన పులస్త్యబ్రహ్మ కూడా వేంకటాచలానికి యేతెంచుతాడు. ధ్యానంలో ఉన్న సరస్వతిదేవి పులస్త్యుని రాకను గమనించక పోవడంతో, పులస్త్యుడు కృద్ధుడై, అహంభావంతో, సరస్వతి దేవి ఏ కార్యసిద్ధి కోసం తపస్సు చేస్తోందో అది నెరవేరదనీ, ఎన్నటికీ సరస్వతీనది గంగానదితో సమానురాలు కాలేదని శపిస్తాడు. దానికి ప్రతిగా సరస్వతీనది, పులస్త్యుడు బ్రహ్మదేవుని సతీమణి అయిన తనకు వరుసకు పుత్రుడని, తనయుని గౌరవ మర్యాదలతో ఆదరించవలసిన అగత్యాన్ని శాస్త్రం తల్లికి ఆపాదించలేదని తర్కపూరితంగా సమాధానమిస్తుంది. అంతే గాకుండా, తపోనిష్ఠలో ఉన్న మాతృమూర్తికి తమోగుణంతో శాపమిచ్చి, రాక్షసునిలా ప్రవర్తించి నందువల్ల పులస్త్యుని వంశం రాక్షసులతో అంతమవుతుందని కూడా తిరుగు శాపమిచ్చింది. శాపభయంతో అహంకారాన్ని విడనాడిన పులస్త్యుడు, మాతృమూర్తి యైన సరస్వతి దేవి పాదాలకు ప్రణమిల్లి ప్రాధేయ పడగా, పులస్త్యుని వంశము నందు తరువాతి తరంలో జన్మించిన

ముగ్గురు రాక్షసులలో ఇద్దరు హరిద్వేషులైన పాపాత్ములుగా మారినప్పటికీ, ఒక్కరు మాత్రం శ్రీమహావిష్ణువుకు చేరువవుతారని శాపాంతరం చెబుతుంది. సరస్వతీదేవి పులస్త్యుని కిచ్చిన శాపము–వరము ఫలితంగా, పులస్త్యునికి రావణ–కుంభకర్ణులతో బాటు విభీషణుడు కూడా జన్మించి, శ్రీరామచంద్రునికి ఆప్తుడు, పరమభక్తునిగా మారి లంకారాజ్య పట్టాభిషిక్తుడయ్యాడు. పులస్త్యుని శాపం కారణంగా బహిర్గతమై భక్తుల నుద్ధారించాలన్న తన సంకల్పం నెరవేరక పోవడంతో తీవ్రమైన అసంతృప్తికి గురియైన సరస్వతి దేవికి విష్ణుమూర్తి వరమిస్తాడు. ఆ వరమహిమతో సరస్వతీ నది త్రివేణీ సంగమంలో ప్రకటితమవ్వ లేక పోయినప్పటికీ; ఆనాడు సరస్వతిదేవి వేంకటాచలం పై ఏ ప్రదేశంలో తపస్సు నాచరించిందో, ఆ ప్రదేశంలోనే స్వామిపుష్కరిణిగా ఆవిర్భవించింది. అంతే గాకుండా, గంగానది ఈ పర్వతం మీదకు రాదని కూడా విష్ణుమూర్తి అభయమిస్తాడు. వారి ఆదేశానుసారం, భక్తులు స్వామిపుష్కరిణిలో స్నానమాచరించిన తరువాతనే శ్రీనివాసుణ్ణి దర్శించుకోవాలి. అప్పుడే తిరుమలయాత్ర సంపూర్ణ ఫలాన్నిస్తుంది. అంతే కాకుండా, సరస్వతీ తీర్థంలో స్నానమాడితే మహా పాపాలు సైతం నశిస్తాయి.

సరస్వతిదేవి స్వామిపుష్కరిణిగా ప్రకటితమైన ప్రదేశంలోనే సాళువ నరసింహరాయలు నీరాళి మంటపాన్ని నిర్మించాడు. స్వామిపుష్కరిణికి మధ్యభాగంలో ముగ్ధమనోహరంగా విలసిల్లుతున్న ఈ మండపం లోనే శ్రీవారి తెప్పోత్సవం కన్నుల పండువగా జరుగుతుంది. **పుట — 79 తేదీ – ఆగష్టు, 10**

ఆదివరాహుని అవతారంలో ఉన్న శ్రీమహావిష్ణువు ఆనతి మేరకు, వారి వాహనమైన గరుత్మంతుడు వైకుంఠం నందలి క్రీడాద్రి పైనున్న "క్రీడావాపి" అనే జలాశయాన్ని క్రీడాద్రితో పాటుగా భూలోకానికి తోడ్కొనివచ్చి వెంకటాచలం పై స్థాపించాడు. సుదీర్ఘకాలంపాటు వేంకటాద్రి శిఖరాంతర్భాగంలో నిక్షిప్తమై ఉన్న క్రీడావాపి, సరస్వతి దేవికి శ్రీమహావిష్ణువు ఒసగిన వరప్రభావం చేత, అదే ప్రదేశంలో బహిర్గతమై స్వామిపుష్కరిణి గా అవతరించింది. శ్రీనివాసుడు దేవేరులతో కలిసి ఈ పుష్కరిణిలో జలక్రీడలాడినందువల్ల అది గంగానది కంటే అత్యంత పవిత్రమైనదిగా పేరుగాంచింది. ఈ పుష్కరిణి దర్శనమాత్రం చేతనే జన్మజన్మల పాపాలు నశించి సమస్త భోగభాగ్యాలు ఒనగూడుతాయి.

స్వామిపుష్కరిణి స్నానం సద్గురోః పాదసేవనమ్
ఏకాదశీవ్రతం చాపి త్రయ మత్యంత దుర్లభమ్
దుర్లభం మానుషం జన్మ దుర్లభం తత్ర జీవనమ్
స్వామిపుష్కరిణీ స్నానం త్రయ మత్యంత దుర్లభమ్

అనగా — **స్వామిపుష్కరిణి స్నానం, సద్గురు పాదసేవనం, ఏకాదశి వ్రతం** — ఈ మూడు సత్కార్యాలు మానవజన్మలో లభ్యం కావడం అత్యంత దుర్లభం. అలాగే మానవజన్మ లభించడం, మానవునిగా మనుగడ సాగించడం, ఆ మానవజీవితంలో స్వామిపుష్కరిణి యందు స్నానమాచరించడం అనే కార్యాలు కూడా దుర్లభాలని వరాహపురాణం చాటుతోంది. దీనిని బట్టి స్వామిపుష్కరిణిలో పవిత్రస్నాన మాచరించడం ఎంతటి మహత్తరమైన పుణ్యకార్యమో తేటతెల్ల మవుతుంది.

చరిత్రపుటల్లో స్వామిపుష్కరిణి

15వ శతాబ్దంలో విజయనగర చక్రవర్తి అయిన సాళువ నరసింహ రాయలు ద్వారా స్వామిపుష్కరిణి మధ్యభాగంలో నిర్మించబడ్డ 'నీరాళిమండపం' విజయనగర శిల్పశైలికి మచ్చుతునక. మండపం ఉపరితల భాగాన దేవతా ప్రతిమలు, ఉరకడానికి సిద్ధంగా ఉన్న మర్కటం మొదలైనవి మనోహరంగా చెక్కబడి ఉన్నాయి. ఈ మంటపాన్ని 'వసంతమండప' మని కూడా వ్యవహరించే వారు.

తరువాతి కాలంలో తాళ్లపాక వంశీయులు పుష్కరిణి మెట్లను పునరుద్ధరించి, నీరాళి మంటపానికి మరమ్మత్తులు చేయించారు. రాతి దీపస్తంభాలను నిలబెట్టి వాటిపై దీపాలను వెలిగించే నిమిత్తం పరిచారకులను నియమించారు. ముక్కోటిద్వాదశి నాడు విశేషంగా దీప ప్రజ్వలన చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు గావించారు. పుష్కరిణి గట్టున ఇరు పార్శ్వాల యందు – అన్నమాచార్యులు, వారి కుమారుడు పెద తిరుమలయ్య, మధ్యభాగంలో శ్రీనివాసుడు – యొక్క శిలాఫలకాలను ఈనాడు కూడా దర్శించుకోవచ్చు.

స్వామిపుష్కరిణికి వెనుక భాగంలో ఒకానొకప్పుడు తాళ్ళపాక వంశీయుల గృహాలు ఉండేవి. వాటి యందే శ్రీవారి మహా భక్తురాలు తరిగొండ వెంగమాంబకు ఉచితంగా ఆవాసం కల్పించబడిందని ఇంతకు ముందే మనం తెలుసుకున్నాం. పుష్కరిణికి పశ్చిమ దిక్కున జగద్గురు ఆది శంకరాచార్యుల స్థూపం ఉంది. ఆదిశంకరులవారు శివకంచి నుండి కాశీ పుణ్య క్షేత్రానికి వెళుతూ మార్గమధ్యంలో తిరుమలను సందర్శించి ఉంటారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. తిరుమల లోనూ, తిరుపతి పట్టణంలోనూ శంకరాచార్యుల మఠాలు నేటికీ ఉన్నాయి.

19వ శతాబ్దపు మధ్య భాగంలో హాథీరామ్ జీ మఠానికి చెందిన మహంతు దేవదాస్ గారు పుష్కరిణిని మరలా పునరుద్ధరించారు.

ప్రస్తుత కాలంలో స్వామి పుష్కరిణి

2007వ సంవత్సరంలో తి.తి.దే. వారు పుష్కరహారతిని ప్రవేశపెట్టారు. బ్రహ్మోత్సవాల యందు, అనేకానేక ఇతర ఉత్సవాల్లో మలయప్పస్వామి వారు మాడవీధుల్లో ఊరేగు తున్నప్పుడు పుష్కరిణికి తూర్పు దిక్కున ఉన్న పుష్కరిణి మహాద్వారం వద్ద పుష్కరిణి హారతిని సమర్పిస్తారు.

నిరంతరం లక్షలాది భక్తుల స్నానాలతో పుష్కరిణి జలాలు కలుషితం అవ్వడం వల్ల ఈ మధ్యకాలంలో తి.తి.దే. వారు శాస్త్రవేత్తలు, ఆగమశాస్త్ర నిపుణులతో సంప్రదించి పుష్కరిణి అంతర్భాగంలో ఉన్న కొన్ని ముఖ్యమైన ఊటబావులను మినహాయించి అడుగు భాగమంతా సిమెంట్ తో కాంక్రీట్ చేయించారు. చుట్టుప్రక్కల ఉన్న జనావాసాల నుండి ప్రవహించే మురికి నీరు పుష్కరిణిలోకి చేరకుండా పుష్కరిణి నాలుగు ప్రక్కలా అంచులకు ఉన్న రంధ్రాలను కూడా మూసివేశారు. ఎగుడుదిగుడుగా ఉన్న మెట్లను సరిచేసి, స్నానమాడే భక్తులకు సౌకర్యవంతంగా ఉండే ఏర్పాటు చేశారు. అన్ని దిక్కుల లోనూ లోహపు కంచెను ఏర్పాటు చేసి భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. తి.తి.దే. వారి

నిరంతర కృషి వల్ల ఇప్పుడు పుష్కరిణి స్నానం ఎంతో సౌకర్యవంతం గానూ నిరపాయకరం గానూ ఉంది. 1972వ సంవత్సరంలో నీటిని వడబోసే ఫిల్టర్ పాయింట్లను ఏర్పాటు చేశారు. సుమారు 20 లక్షల గ్యాలన్ల సామర్థ్యం ఉన్న ఈ పుష్కరిణిలో లక్షలాది భక్తులు నిరంతరం స్నానాలు చేస్తున్నప్పటికీ జలాలు స్వచ్ఛంగా, ఏమాత్రం పాకుడు లేకుండా గోచరిస్తుంటాయి.

చక్రస్నానం

వరాహస్వామి ఆలయాన్ని ఆనుకొని ఉన్న పుష్కరిణి భాగాన్ని 'వరాహపుష్కరిణి' గానూ, దానికి దక్షిణ దిక్కుగా ఉన్న భాగాన్ని 'శ్రీనివాసపుష్కరిణి' గానూ వ్యవహరిస్తారు. ప్రతి సంవత్సరం నాలుగు సందర్భాల్లో వరాహపుష్కరిణి యందు శ్రీవేంకటేశ్వరుని పరివార దేవత మరియు ఆయుధమైన చక్రత్తాళ్వార్ వారికి వైభవోపేతంగా 'చక్రస్నానం' జరుపబడుతుంది. దీనికి సంబంధించిన విశేషాలను మనం ఇంతకు ముందే తెలుసుకున్నాం. **పుట – 80 తేదీ – ఆగష్టు, 11**

స్వామి పుష్కరిణి – మహిమలు

పరమపవిత్రమైన స్వామిపుష్కరిణిలో స్నాన మాచరించడం ద్వారా పూర్వజన్మల పాపాలను తొలగింప జేసుకొని, ఇహపర సౌఖ్యాలను పొందిన పురాణపురుషు లెందరో ఉన్నారు. వారిలో కొందరి గూర్చి ఇప్పుడు తెలుసుకుందాం.

శంఖణ చక్రవర్తి

ఒకానొకప్పుడు ఉత్తర భారతదేశంలోని కాంభోజరాజ్యాన్ని 'శంఖణుడు' అనే చక్రవర్తి పరిపాలిస్తుండే వాడు. మిక్కిలి పరాక్రమవంతు డయిన ఆ రాజు, ప్రజలను కన్నబిడ్డలవలె చూచుకునేవాడు. తన విశాలసామ్రాజ్యంలో ఎందరో సామంతులు కూడా ఉండేవారు. అయితే, ఆ మహారాజు వైభవాన్ని చూచి ఓర్వలేని సామంతులు, దండనాథులు, ఇరుగు పొరుగు రాజ్యాలవారు అందరూ ఏకమై, ఒక్కుమ్మడిగా దండయాత్ర చేసి కాంభోజరాజ్యాన్ని ఆక్రమించుకొని శంఖణ చక్రవర్తిని పదవీభ్రష్టునిగా చేశారు. అప్పటివరకు మహారాజ భోగాలతో తులతూగుతున్న ఆ చక్రవర్తి విధి వక్రించి రాజ్యాన్ని కోల్పోవడంతో అరణ్యాలు పట్టవలసి వచ్చింది.

పోయిన రాజ్యాన్ని తిరిగి పొందాలనే సంకల్పంతో శంఖణుడు, ఒక ప్రక్క శ్రేయోభిలాషుల సహాయంతో సైన్య సమీకరణకు పూనుకుంటూనే, మరో ప్రక్క దైవసహాయం పొందటం కోసం తీర్థయాత్రా సందర్శనం, మహాత్ముల పాదసేవనం కొనసాగించాడు. దాదాపుగా ఉత్తరభారతదేశం లోని సమస్త పుణ్యక్షేత్రాలను దర్శించినట్టి శంఖణుడు, గురువులను, జ్ఞానులను సంప్రదించి, శ్రీవేంకటేశ్వరుని కటాక్షం సిద్ధించుకోవడం కోసం వేంకటాచలానికి బయలుదేరాడు. సపరివార సమేతంగా సప్తగిరులకేతెంచి, పవిత్రమైన స్వామిపుష్కరిణిలో సతీసమేతంగా భక్తిశ్రద్ధలతో స్నానమాడాడు.

స్వామిపుష్కరిణిలో మూడవసారి మునక ముగియకుండానే శంఖణచక్రవర్తికి స్వామివారి సాక్షాత్కారం కలిగింది.

శ్రీవారు ప్రత్యక్షమై స్వామిపుష్కరిణిలో పవిత్రస్నాన మాచరించడంతో శంఖణుని పూర్వజన్మల పాపాలన్నీ పటాపంచలై పోయాయని, తన దర్శనభాగ్యంతో, కోల్పోయిన రాజ్యలక్ష్మి తిరిగి సంప్రాప్తిస్తుందని, పుత్రపౌత్రాభివృద్ధిని పొంది, సుదీర్ఘకాలం పాటు భోగభాగ్యాలు అష్టైశ్వర్యాలు అనుభవించిన తరువాత, అవసానదశ యందు కైవల్యసిద్ధి కలుగుతందని, పునర్జన రాహిత్యం సిద్ధిస్తుందని శెలవిచ్చి అంతర్ధాన మవుతాడు.

స్వామిపుష్కరిణి మహిమకు శ్రీనివాసుని కృప తోడైతే సిరిసంపదలకు కొదవేముంది? తిరుమలక్షేత్ర సందర్శనం ముగించుకుని స్వస్థలానికి తిరిగివెళ్ళే దారిలోనే శంఖణునికి శుభవార్త తెలుస్తుంది. కుట్రలు–కుతంత్రాలతో రాజ్యాన్ని ఆక్రమించుకున్న వైరిపక్షాలలో ఐక్యత లోపిస్తుంది. శంఖణుని రాజ్యం శత్రుకూటమిలో ఎవరికి చెందాలన్న విషయంలో పరస్పరం కలహించుకున్న శత్రురాజులు, తిరిగి రాజ్యాన్ని శంఖణునికే ధారాదత్తం చేయాలని తీర్మానించుకుని, ఆ చక్రవర్తికి కబురంపుతారు. శంఖణుడు పునఃపట్టాభిషిక్తు డవుతాడు.

అలా పుష్కరిణిలో స్నాన మహిమతో శంఖణుడు కోల్పోయిన ప్రాభవాన్ని లేదా స్వామిత్వాన్ని తిరిగి పొందాడు కావున అది 'స్వామిపుష్కరిణి' గా ఖ్యాతి నొందినట్లు పురాణాలలో చెప్పబడింది. తరువాతి కాలంలో, రాజ్యభ్రష్టులైన ఎందరో రాజులు, స్వామిపుష్కరిణిలో స్నానమాడి కోల్పోయిన స్వామిత్వాన్ని తిరిగి చేజిక్కించుకున్నారు.

మరో పౌరాణిక కథనాన్న నుసరించి ఈ పుష్కరిణి యందు స్నానమాచరించటం వల్ల మనస్సనే అంతఃశత్రువును జయించి ఇంద్రియాలపై స్వామిత్వాన్ని సాధించవచ్చు గావున ఇది 'స్వామిపుష్కరిణి' గా పేర్గాంచింది.

బ్రహ్మపురాణాంతర్గత ఐతిహ్యాన్ననుసరించి, స్వామిపుష్కరిణి పవిత్రస్నానంతో పూర్వజన్మ పాపాలను పోగొట్టుకుని దివ్యతేజస్సుతో భాసిస్తున్న శంఖణునికి శ్రీవారు సాక్షాత్కరించి నపుడు, తిరుమలక్షేత్రం నందు తనకో ఆలయం నిర్మించ వలసిందిగా ఆదేశిస్తారు. సాధారణ మానవాళికి శిలారూపంలో గోచరించే తాను మహాత్ములకు, జ్ఞానులకు, దివ్యపురుషులకు మాత్రమే సచ్చిదానంద రూపంలో దర్శనమిస్తానని కూడా పలుకుతారు. ఆ విధంగా, తొండమాన్ చక్రవర్తి కంటే ఎంతో ముందుగా, తిరుమలక్షేత్రంలో స్వామిపుష్కరిణి తటాన మొట్టమొదటగా శ్రీనివాసునికి ఆలయనిర్మాణం గావించిన ఘనత శంఖణుడికి దక్కుతుంది.

పరీక్షిన్మహారాజు

ద్వాపరయుగంలో ఒకానొకప్పుడు అర్జునుని మనుమడు అభిమన్యుని పుత్రుడు అయిన పరీక్షిత్తు మహారాజు సుదీర్ఘ సమయం పాటు వేటాడడంతో అలసిపోయి, పరివారానికి దూరమై, దప్పికతో అలమటిస్తూ శమీకమహర్షి ఆశ్రమానికి సమీపించి త్రాగునీటికై అర్థిస్తాడు. ధ్యానమగ్నుడైన ఋషిపుంగవుడు క్షత్రియుని రాకను గమనించక పోవడంతో కోపోద్రిక్తుడైన మహారాజు యుక్తాయుక్త విచక్షణ మరచి, ఆ ఋష్యాశ్రమంలో చచ్చిపడియున్న సర్పాన్ని తన వింటికొపుతో తీసి, ఋషి మెడలో వేసి వెనుదిరుగుతాడు. ఈలోగా సమిధల కోసం వనానికేతెంచిన శమీకుని కుమారుడు 'శృంగి' ఆశ్రమానికి తిరిగి వచ్చి, తండ్రి కంఠము నందున్న మృతసర్పాన్ని గాంచి కృద్ధుడై, తండ్రిగారిని ఆ విధంగా అవమానించిన వాడు ఏడు దినాలలో 'తక్షకుడు' అనే విషసర్పపు కాటుతో మరణిస్తాడని శపిస్తాడు. ఈ

వార్తను తెలుసుకున్న పరీక్షిత్తు పాముకాటును తప్పించు కోవడానికి మంత్రుల సలహా మేరకు ఒంటిస్తంభపు భవనంలో నివసిస్తూ, కట్టుదిట్టమైన కాపలా ఏర్పాటు చేసుకొని, భాగవత శ్రవణంతో కాలం గడుపుతుంటాడు.

ఇంతలో, 'కాశ్యపుడు' అని పిలువబడే మహిమాన్వితుడైన విప్రుడు, తన మంత్రశక్తితో పరీక్షిత్తు మహారాజును తక్షకుని విషం నుంచి రక్షించి, మహారాజు నుండి భూరి కానుకలను పొందే నిమిత్తం ఆఘమేఘాలపై ప్రయాణించి, సరిగ్గా ఏడవనాటి ఉదయానికి పరీక్షిత్తు మహారాజు నివసించే నగర శివార్లకు చేరుకుంటాడు. మునిపుత్రుని శాపాన్ననుసరించి, ఆరోజే పరీక్షిత్తు మృత్యువాత పడాల్సి ఉంది.

సరిగ్గా అదే సమయానికి మహారాజును తన విషపు కోరలకు బలి కావించి, మునిపుత్రుని శాపాన్ని నిజం చేసే ఉద్దేశ్యంతో తక్షకుడు కూడా నగర పొలిమేరలకు చేరుకుని, కశ్యపునికి తారసపడతాడు. కశ్యపుని ద్వారా అతని అంతరార్థాన్ని గ్రహించిన తక్షకుడు ఆ విప్రుని మహిమను పరీక్షింప గోరి, దగ్గరలోనున్న ఒక మహావృక్షాన్ని తన విషపు కోరలతో భస్మీపటలం గావించి, దానిని పునర్జీవింప జేయవలసిందిగా కశ్యపుని కోరుతాడు. బూడిదకుప్పగా మారిన మహావృక్షాన్ని తన మంత్రశక్తితో తిరిగి బ్రతికించిన కశ్యపుని దివ్యశక్తికి అచ్చెరువొందిన తక్షకుడు, ఆ విప్రునితో, కశ్యపుడు నిస్సందేహంగా మహా మహిమాన్వితుడని, అయితే ఋషిపుత్రుని శాపం అనృతం కాకూడదని, అందువల్ల తాను ఇచ్చే అమూల్యమైన ధనరాశులను స్వీకరించి రాజు గారిని రక్షించే ప్రయత్నాన్ని విరమించుకొన వలసిందిగా ప్రార్థిస్తాడు. ధనాశకు లోనైన కశ్యపుడు తన మహిమతో పరీక్షిత్తు మహారాజు పూర్వాపరాల నెరిగి, అల్పాయుష్కుడైన మహారాజును రక్షించడం వ్యర్థమని తలచి, తక్షకుడు ఇచ్చిన విశేషమైన సంపదను స్వీకరించి, స్వస్థలానికి వెనుదిరుగుతాడు. తత్ఫలితంగా, ఆరోజు సాయం సమయంలో తక్షకుని కాటువల్ల పరీక్షిత్ మహారాజు మరణిస్తాడు.

తదనంతరం, దురాశాపరుడై తన విద్యుక్తధర్మాన్ని విస్మరించి, మహారాజు మరణానికి కారకుడైన కశ్యపుని ఉదంతాన్ని ఆనోటా ఆనోటా విన్న రాజ్య పౌరులందరూ అతనిని అసహ్యించుకొని సభ్యసమాజం నుండి బహిష్కరిస్తారు. ఇలా అందరూ తనను వెలివేయడంతో, నడిమంత్రపు సిరిగా వచ్చిన ధనాన్ని ఏం చేసుకోవాలో తోచని కశ్యపుడు, 'శాక్యముని' తో తన గోడును వెల్లడించు కుంటాడు. తన దివ్యదృష్టి ద్వారా జరిగిన వృత్తాంతాన్నంతా తెలుసుకున్న మహర్షి ప్రజలందరికీ రాజు పితృతుల్యుడని, అటువంటి భూపాలుణ్ణి సర్వకాల సర్వావస్థలయందు రక్షించు కోవలసిన బాధ్యత పౌరులందరిపై ఉందని, అడియాసకు లోనై తన బాధ్యతను విస్మరించిన కశ్యపుడు ఘోరాపరాధానికి ఒడిగట్టాడని, ఆ పాపం కశ్యపుణ్ణి అనేక జన్మల పాటు పీడిస్తుందని శెలవిచ్చాడు. ఇంతటి మహాపరాధానికి ప్రాయశ్చిత్తం లేదని కూడా చెబుతాడు. అయితే, దారి-తెన్ను గానని కశ్యపుడు పరిపరివిధాల ప్రాధేయ పడడంతో, ధర్మశాస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, కశ్యపుని పాపనివృత్తి చేయడానికి స్వామిపుష్కరిణి స్నానమొక్కటే మార్గమని తరుణోపాయం సూచిస్తాడు.

పరమానంద భరితుడైన కశ్యపుడు ఇంకెంత మాత్రం ఉపేక్షించకుండా, హుటాహుటిన బయలుదేరి, తిరుమలక్షేత్రాన్ని చేరుకుని భక్తిప్రపత్తులతో స్నానమాచరిస్తాడు. తదనంతరం శ్రీవేంకటేశ్వరునికి ప్రణమిల్లి తనను పాపవిముక్తుణ్ణి

చేయవలసిందిగా వేడుకొంటాడు.

అలా స్వామిపుష్కరిణి మహిమతో పాపాన్ని పరిహరించుకొని, స్వస్థలానికి చేరుకున్న కశ్యపుణ్ణి, పురజనులందరూ జరిగినదంతా మరచి మునుపటి వలె ఆదరించి అక్కున జేర్చుకుంటారు. పుట – 81 తేదీ – ఆగష్టు, 12

ధర్మగుప్తుడు

ప్రాచీనకాలంలో 'ధర్మగుప్తుడు' అనే చంద్రవంశపు రాజు ఉత్తరభారత దేశాన్ని పరిపాలిస్తుండేవాడు. ఒకనాడు ఆ మహారాజు క్రూరమృగాలను వేటాడుతూ దట్టమైన అరణ్యం లోనికి ప్రవేశించాడు. ఒక భీకరమైన వనసూకరాన్ని (అడవిపంది) చాలాసేపు వెంటాడిన నందువల్ల కాలాతీతమై, సంధ్యచీకట్లు కమ్ముకున్నాయి. ఆ కీకారణ్యంలో మరే ఆశ్రయము లభ్యం కాకపోవడంతో ఆ రాత్రికి తనను వన్యమృగాల బారినుండి రక్షించు కోవడం కోసం, శాఖోపశాఖలుగా విస్తరించి ఉన్న ఒక వటవృక్షాన్ని ఆశ్రయించాడు. అంతలో ఒక సింహం అతివేగంగా తరుముకు రావడంతో, తన ప్రాణసంరక్షణార్థం ఒక భల్లూకం కూడా అదే చెట్టును ఆశ్రయించింది. అలా వటవృక్షం యొక్క ఒక శాఖపై ధర్మగుప్తుడు, దాని ప్రక్కనే ఉన్న మరొక శాఖపై ఎలుగుబంటి కూర్చుని ఉన్నారు. వీరిద్దరినీ వృక్షశాఖలపై కాంచిన సింహం చెట్టు మొదట్లో మాటు వేసింది. దాంతో ధర్మగుప్తుని పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారయింది. చెట్టు పైన ఉన్న తనపై ఎప్పుడైనా భల్లూకం దాడి చేయవచ్చు. క్రిందకు దూకితే తాను సింహానికి బలవ్వడం ఖాయం. ఆ విధంగా, ఏం చేయాలో పాలు పోకుండా సందిగ్ధావస్థలో ఉన్న ధర్మగుప్తుణ్ణి ఉద్దేశిస్తూ ఆ భల్లూకరాజం ధైర్యవచనాలు పలికింది. ఆందోళన వలదని, హాయిగా నిదుర పొమ్మని, ఆ సమయంలో ధర్మగుప్తునికి సింహం నుంచి ఏ హానీ జరగకుండా తాను కాపాడుతానని, మరి కొంతసేపటి తరువాత తాను నిద్రించినప్పుడు ధర్మగుప్తుడు తనను కాపాడాని పలికింది. అలా, ఇద్దరూ ఒక ఒప్పందానికి రావడంతో కొంతసేపు ధర్మగుప్తుడు నిశ్చింతగా విశ్రమించాడు. ఆ సమయంలో క్రింద వేచియున్న కుటిలబుద్ధి గల సింహం ఎలుగుబంటితో, ధర్మగుప్తుణ్ణి క్రిందకు త్రోసి వేయమని, అతనిని భుజించడంతో తన క్షుద్బాధ తీరుతుందని, ఆ విధంగా ఎలుగుబంటి రక్షింపబడుతుందని నమ్మబలికింది. కానీ, ధర్మానికి కట్టుబడ్డ ఎలుగుబంటి, తనను నమ్ముకున్న మహారాజుకు తాను అభయమిచ్చానని, తాను నమ్మకద్రోహం తలపెట్టనని సమాధానమిచ్చింది.

మరి కొంతసేపటికి ధర్మగుప్తుడు నిద్ర నుండి మేల్కొనడంతో, ఎలుగుబంటి నిద్రకు ఉపక్రమించింది. అలా ఆ భల్లూకం గాఢనిద్రలో ఉన్న సమయంలో సింహం ధర్మగుప్తునితో కూడా అదే విధంగా ప్రస్తావించింది. అంతట ధర్మగుప్తుడు ఏమాత్రం ముందువెనుకలు ఆలోచించకుండా స్వార్థబుద్ధితో, నమ్మకద్రోహానికి ఒడికడుతూ ఎలుగుబంటును క్రిందకు త్రోసివేశాడు. ఈ హఠాత్పరిణామానికి నిద్ర నుండి మేల్కొన్న భల్లూకం క్రిందనున్న మరో చెట్టుకొమ్మ సాయంతో తిరిగి పైకి చేరుకోగలిగింది. స్వార్థమానవుని విశ్వాసఘాతుకానికి గురైన భల్లూకం పట్టరాని కోపంతో, ధర్భగుప్తునికి తన పూర్వజన్మ వృత్తాంతం తెలిపింది. తాను అటవీమృగాన్ని కానని, 'ధ్యానకాష్ఠ' అనే నామధేయం కలిగిన మునిపుంగవుణ్ణని, మోక్షప్రాప్తికై ధ్యాననిష్ఠలో ఉన్న తనను దర్శించుకునే నిమిత్తం ఎందరో భక్తులు తన చెంతకు చేరేవారని, తనకు తపోభంగం కలుగకుండా ఉండే నిమిత్తం వేర్వేరు రూపాలు ధరించి సాధన చేసుకుంటానని,

అందులో భాగంగానే తానీ సమయంలో ఎలుగుబంటి రూపంలో నున్నానని విశద పరిచింది. అంతే గాకుండా, ఆశ్రితులను కాపాడవలసిన మహారాజే నమ్మకద్రోహానికి ఒడిగట్టడంతో అతనిని పరుషమైన పదజాలంతో దుర్భాషలాడుతూ; మానవసహజమైన విచక్షణా జ్ఞానాన్ని విస్మరించి ప్రవర్తించినందున ధర్మగుప్తుడు, ఇకమీదట యుక్తాయుక్త విచక్షణను కోల్పోయి ఉన్మత్తుడై సంచరిస్తాడని శపించింది. ధర్మగుప్తుడు తక్షణం మతిస్థిమితం కోల్పోయాడు.

ఇలా మతితప్పినవాడై, కేశసంస్కారం లేకుండా, ఆకులు-అలములు భుజిస్తూ, అరణ్యాలలో అలమటిస్తున్న ధర్మగుప్తుడు కొంతకాలానికి తన రాజ్యాన్ని చేరుకుంటాడు. ఆ మహారాజును గుర్తెరిగిన మంత్రులు అతనిని వానప్రస్థాశ్రమంలోనున్న మహారాజు తండ్రిగారైన 'నందుని' వద్దకు చేర్చుతారు. పుత్రుని దీనావస్థకు తీవ్రంగా మనస్తాపం చెందిన నందుడు తన వానప్రస్థాశ్రమాన్ని తాత్కాలికంగా విడనాడి, పుత్రునితో పాటుగా 'జైమినిమహర్షి' ని దర్శించుకొని, తన పుత్రునికి శాపవిముక్తి కలిగించ వలసిందిగా ప్రాధేయ పడతాడు. తన దివ్యదృష్టితో పూర్వాపరాలను అవగతం చేసుకున్న జైమినిమహర్షి, విశ్వాసఘాతుకానికి పాల్పడిన ధర్మగుప్తునికి నిష్కృతి లేదని, వేంకటాచలాని కేతెంచి, స్వామిపుష్కరిణిలో స్నానమాడి శ్రీనివాసుణ్ణి శ్రద్ధాభక్తులతో సేవించుకుంటే శాపవిముక్తు డవుతాడని శాపాంతరాన్ని బోధిస్తాడు.

జైమినిమహర్షి వాక్కుననుసరించి నందుడు ఉన్మత్తుడైన పుత్రుణ్ణి తోడ్కొని వేంకటాచలాని కేతెంచి, స్వామిపుష్కరిణిలో స్నానమాడి, పుష్కరిణి తటాన సద్బ్రాహ్మణులకు విశేషంగా దానధర్మాలు చేసి, వేంకటాచలపతిని సేవించుకుంటాడు. స్వామిపుష్కరిణి మహిమతో, వేంకటేశ్వరుని కృపాకటాక్షాలతో ధర్మగుప్తుడు శాపవిముక్తుడై, తిరిగి రాజ్యభారాన్ని చేపట్టి, ప్రజారంజకంగా పరిపాలన సాగించాడు.

త్రేతాయుగంలో స్వామిపుష్కరిణి

శ్రీరాముని పుట్టుకకు, స్వామిపుష్కరిణికి కూడా ఎంతో దగ్గరి సంబంధం ఉంది.

వరాహపురాణాన్ననుసరించి సంతానలేమితో చింతిస్తున్న దశరథ మహారాజు వశిష్ఠాది పురోహితుల ఆదేశానుసారం, పుత్రార్థియై వేంకటాచలానికి చేరుకుంటాడు. స్వామిపుష్కరిణి తటంలో తపస్సు నాచరిస్తున్న బ్రహ్మాది దేవతలను, సప్తఋషులను, అష్టదిక్పాలకులను, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుషులను కాంచిన దశరథ మహారాజు, అంతటి పరమపవిత్రమైన పుణ్యక్షేత్రానికి విచ్చేశానన్న తలంపుతో ఆనందపరవశు డవుతాడు. స్వామిపుష్కరిణిలో స్నానమాడి, వారితో పాటుగా తాను కూడా పుష్కరిణి ఒడ్డున కఠోర తపస్సును ప్రారంభిస్తాడు. అలా కొన్ని సంవత్సరాలు గడచిన తరువాత, శ్రీవేంకటేశ్వరుని కృపాదృక్కులు దశరథునిపై ప్రసరించడం వల్ల, దివ్యతేజస్సు లొలికే ఓ పుణ్యపురుషుడు ప్రత్యక్షమై, పుత్రకామేష్టి యాగంతో దశరథుని మనోరథం సిద్ధించి పుత్రసంతానం ప్రాప్తిస్తుందని సెలవిచ్చి అంతర్ధాన మవుతాడు. ఆ సమయంలో, సంతోషాంత రంగుడైన దశరథమహారాజు శ్రీవేంకటేశ్వరుని స్తుతిస్తూ ఆశువుగా ఒక స్తోత్రాన్ని పఠిస్తాడు. తరువాతి కాలంలో తన ధర్మపత్నుల సమేతంగా పుత్రకామేష్టి యాగాన్ని నిర్వహించి, రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులను పుత్రులుగా పొందాడు.

వరాహపురాణంలో మరో ఆసక్తికరమైన ఘట్టం ఉటంకించబడింది. రావణుని ద్వారా అపహరణకు గురైన సీతాసాధ్విని తిరిగి పొందడానికై లంకానగరాని కేగుతూ రామలక్ష్మణులు వానరసైన్యం సమేతంగా శేషాచలపర్వత పాదభాగానికి చేరుకుంటారు. ఆ విషయం తెలుసుకున్న ఆంజనేయుని మాతృమూర్తి అంజనాదేవి, శ్రీరామచంద్రునితో, శేషాచల శిఖరాని కేతెంచి తనను, తనతో పాటుగా తపస్సు నాచరిస్తున్న ఇంకెందరో ఋషోత్తములను అనుగ్రహించ వలసిందిగా ప్రార్థిస్తుంది. సీతావియోగంతో అన్యమనస్కంగా ఉన్న రాములవారు, తాను ప్రస్తుతం కార్యార్థియై ఉన్నానని, సీతమ్మను చేపట్టిన తరువాత తన తిరుగు ప్రయాణంలో అంజనాదేవి కోరిక తీర్చుతానని బదులిస్తాడు. అప్పుడు ఆంజనేయుడు చొరవ తీసుకొని, శ్రీరామచంద్రునితో సుదూర ప్రయాణం వల్ల అలసి సొలసి యున్న వానరులకు కొంతకాలం విశ్రాంతి కావాలని; వానరులు, అంజనాద్రిగా పిలువబడే ఆ శేషాచలశిఖరంపైనున్న మధురఫలాలను భుజిస్తూ, లెక్కకుమిక్కిలిగా ఉన్న పుణ్యతీర్థాలలో స్నానమాడుతూ పేద తీరుతారని; అందువల్ల వానరసమేతంగా అంజనాద్రిపై విశ్రమించమని శ్రీరాముణ్ణి వేడుకుంటాడు. హనుమంతుని చతురసంభాషణకు, వాక్పటిమకు ముగ్ధుడైన శ్రీరామచంద్రుడు ఆంజనేయుని విన్నపాన్ని అంగీకరించి ఆకాశగంగాతీర్థ సమీపంలో ఉన్న అంజనాదేవి ఆశ్రమానికి విచ్చేస్తాడు. తరువాత స్వామిపుష్కరిణిలో పవిత్ర స్నాన మాచరించుతాడు. తదనంతరం, ఆంజనేయుడు స్వామిపుష్కరిణికి దక్షిణాన, అంటే ఖచ్చితంగా ఇప్పుడు ఆలయం ఉన్న ప్రదేశంలో, ఒక పర్ణశాలను నిర్మించి, అందులో తన తల్లి అంజనాదేవి మరియు ఇతర వానరవీరులతో కలిసి కొంతకాలం శ్రీరాముణ్ణి సేవించుకున్నాడు. అంటే, శ్రీమన్నారయణుడు త్రేతాయుగం లోనే కొంతకాలం నివసించిన ఆ ప్రదేశం కలియుగంలో తిరిగి శాశ్వత నివాస స్థానమైందన్న మాట.

అలా వానరవీరులందరు కొద్ది రోజులు అంజనాద్రిపైనున్న తీయని ఫలాలను సేవిస్తూ, జలధారలలో జలకాలాడుతూ సేద తీరిన తరువాత; రెట్టించిన ఉత్సాహంతో నూరు యోజనాల పొడవున్న సాగరాన్ని దాటి, శ్రీరామచంద్రుని నేతృత్వంలో రావణుని పీచమణిచి, సీతమ్మతల్లి చెర విడిపించటానికి సమాయత్త మవుతారు. తదనంతరం శ్రీరామచంద్రుడు లంకేయునిపై విజయం సాధించి, సీతమ్మతల్లితో బాటుగా అయోధ్య కేతెంచి, కోసలరాజ్య సింహాసనాన్ని అధిష్ఠించిన విషయం మనందరకూ తెలిసిన వృత్తాంతమే! స్వామిపుష్కరిణిలో స్నానమాడిన శ్రీరామచంద్రుడు సైతం తాను పోగొట్టుకున్న స్వామిత్వాన్ని తిరిగి పొందాడన్నమాట.

రాములవారు వేంకటాచలక్షేత్రం పై కొలువుదీరి ఉన్నప్పుడు వానరసైన్యం కొండకోనల్లో తిరుగాడుతూ స్వామిపుష్కరిణికి ఈశాన్యదిశలోనున్న ఒక చీకటిగుహ లోనికి ప్రవేశిస్తారు. దానినే ఇప్పుడు 'వైకుంఠగుహ' గాను, అక్కడే ఉన్న తీర్థాన్ని 'వైకుంఠతీర్థం' గానూ వ్యవహరిస్తారు. ఆ తీర్థం యొక్క ఇతివృత్తాన్ని మరో ప్రకరణంలో విస్తారంగా తెలుసుకుందాం. పుట – 82 తేదీ – ఆగష్టు, 13

----------: : ----------

తిరుమల క్షేత్రంలో తీర్థాలు

'తీర్థము' అంటే పావనమైన జలము లేదా ఉదకము అని అర్థం. వ్యావహారిక దృక్పథంతో చూసినట్లయితే తీర్థయాత్రల వల్ల మానవుడు ప్రకృతితో మమేక మవుతాడు. తీర్థాలలోని జలాలు కొండకోనల్లో అనేక రకాలైన ఔషధ మొక్కల వేళ్ళ మీదుగా ప్రవహించడంవల్ల, ఆ జలాలు సైతం ఔషధ గుణాలను పుణికిపుచ్చు కుంటాయి. వాటిలో స్నానమాచరించడం వల్ల, వాటిని తీర్ధంగా సేవించటం వల్ల ఆయురారోగ్యాలు వృద్ధి చెందుతాయి.

ఆధ్యాత్మిక దృష్టితో చూసినట్లయితే తీర్థస్నానం సర్వపాపహరణం. ఆయా తీర్థాల యందు స్నానం చేస్తే చేకూరే ఫలితాల ఆధారంగా తీర్థాలలో ప్రధానంగా నాలుగు రకాలుంటాయి.

- **ధర్మప్రద తీర్థాలు** – ఇవి భక్తుని హృదయంలో ధర్మం పాదుకొల్పి, ఎల్లవేళలా ధర్మబద్ధమైన కర్మలు ఆచరించేలా చేస్తాయి.
- **జ్ఞానప్రద తీర్థాలు** – ఇవి జ్ఞానాన్ని ప్రసాదించి, యుక్తాయుక్త విచక్షణను కలుగజేసి, మానవుడు నిషిద్ధకర్మల నాచరించకుండా సంయమనంతో జీవించటానికి తోడ్పడతాయి.
- **భక్తిపూర్వక తీర్థాలు** – ఈ తీర్థాలలో భక్తిపూర్వకంగా స్నానమాచరించడం వల్ల ఇహలోక సౌఖ్యాలు, భోగభాగ్యాలు, పుత్రపౌత్రాభివృద్ధి కలుగుతాయి.
- **ముక్తిప్రద తీర్థాలు** – ఇవి కైవల్యాన్ని, పునర్జన్మ రాహిత్యాన్ని సిద్ధింప జేస్తాయి.

పురాణేతిహాసాల ననుసరించి తిరుమలక్షేత్రంలో ముక్కోటి తీర్థాలు విరాజిల్లుతున్నాయి. అందుచేతనే తిరుమలను 'తీర్థాబ్ధి' గా కూడా వ్యవహరిస్తారు. అంటే 'తీర్థాలతో కూడుకున్నట్టి సాగరము' అని అర్థం. తిరుమల చరిత్రకు సంబంధించి ప్రామాణికంగా చెప్పబడే శ్రీవెంకటేశ్వర వైభవం, శ్రీవేంకటాచల మహత్యం అనే గ్రంథాలలో సప్తగిరుల యందు 365 తీర్థాలు ఉన్నట్లుగా చెప్పబడింది. వాటిలో ముఖ్యమైనవి 108 తీర్థాలు. అష్టాదశ పురాణాల్లోని భవిష్యోత్తర పురాణం, గరుడ పురాణం, స్కంద పురాణం, మార్కండేయ పురాణం, పద్మ పురాణం, వామన పురాణం మొదలగు వాటిలో ఈ తీర్థాల ప్రస్తావన విరివిగా కానవస్తుంది. అన్నమయ్య సైతం తన కీర్తనలలో ఈ తీర్థాల యొక్క మహత్యాలను కొనియాడాడు. ఎందరో సిద్ధపురుషులు, మునిపుంగవులు ఈ తీర్థాల యందు ఆవాస మేర్పరుచుకుని, జపతపాలను కొనసాగించి, స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

ప్రస్తుతం తిరుమల కొండల లోని అనేక తీర్థాలు కాలగర్భంలో కలిసిపోగా, మరికొన్ని తీర్థాలు దివ్యపురుషులకు తప్ప సామాన్య మానవులకు గోచరించవు. ఈనాడు తిరుమలక్షేత్రంలోనున్న పదిహేడు ముఖ్యమైన తీర్థాలలో స్నానమాచరిస్తే తిరుమల యందలి ముక్కోటి తీర్థాలలో మాత్రమే గాక, భూమండలం లోని సమస్త తీర్థాలలో స్నానమాచరించిన ఫలితం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ పదిహేడు తీర్థాల గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

పాండవ తీర్థం

ఈ తీర్థం పశ్చిమభాగంలో గోమాత ఉదరభాగం వలె లోతట్టు గా ఉండటం చేత, దీనిని 'గోగర్భతీర్థమ' ని కూడా పిలుస్తారు. శ్రీకృష్ణుని ఆదేశం మేరకు పంచపాండవులు ఈ ప్రాంతంలో నివసిస్తూ, ఈ తీర్థంలోని జలాలతో స్నాన-సంధ్యావందనాదికాలు కావించారు. అలా ఒక సంవత్సర కాలం గడచిన తరువాత, ఆ తీర్థజలాల మహిమచే తమ పాపాలు నశించిపోవడం వల్ల; దాయాదులైన దుర్యోధనాదులపై విజయం సాధించడానికై వారు హస్తినాపురం తరలివెళ్ళారు.

మరో కథనం ప్రకారం కురుక్షేత్ర సంగ్రామానంతరం, ఆ యుద్ధంలో పాండవుల చేతిలో అనేక బ్రాహ్మణ యోధులు సైతం హతమవ్వడం చేత; బ్రహ్మహత్యా పాతకాన్ని పరిహరింప చేసుకోవడం కోసం, శ్రీకృష్ణుని ఆదేశంపై పాండవులు, ద్రౌపది, కుంతీ, శ్రీకృష్ణుని సమేతంగా ఈ తీర్థం చెంతన కొంతకాలం గడిపారు. దానికి గుర్తుగా ఈ ప్రదేశంలోనున్న ఒక పర్వతగుహ యందు, ద్రౌపది, కుంతీ, శ్రీకృష్ణ సమేతులైన పంచపాండవుల శిల్పాన్ని ఈనాడు కూడా మనం చూడవచ్చు.

ఈ ప్రదేశంలోనే పరమశివునికి ప్రతిరూపమైన క్షేత్రపాలకశిలను కూడా దర్శించుకోవచ్చు. క్షేత్రపాలకశిల లేదా క్షేత్రపాలకగుండు గురించి మనం ఇంతకు ముందే తెలుసుకున్నాం.

తిరుమలలో ముఖ్యాలయానికి ఈశాన్యదిశగా, సుమారు మైలున్నర దూరంలో; పాపవినాశనతీర్థం వెళ్ళే మార్గంలో, గోగర్భం ఆనకట్ట దాటగానే కుడిప్రక్కగా ఉన్న మఠాలవీధి చివరిభాగంలో ఉన్న అరణ్యంలో ఈ తీర్థరాజం కొలువై ఉంది. ఈ తీర్థంలో స్నానమాచరించడానికి వైశాఖ శుద్ధద్వాదశితో కూడిన ఆదివారం కానీ, లేదా వైశాఖ బహుళద్వాదశితో కూడిన మంగళవారం కానీ అత్యుత్తమమైన దినాలుగా పరిగణిస్తారు. ఆయా రోజుల్లో ఈ తీర్థము నందు స్నానమాచరించిన వారికి వైకుంఠప్రాప్తి కలుగుతుందని ప్రతీతి.

జరహార, వాలిఘ్న, రసాయన తీర్థాలు

ఈ తీర్థాలు స్వామిపుష్కరిణికి తూర్పుదిశగా కొంత దూరంలో ఉన్నట్లు చెప్పబడుతుంది. కానీ కాలగమనంలో, జగన్నాటకసూత్రధారి అయిన భగవంతుని మాయ కారణంగా ఇవి లుప్తమై పోయాయి. అయితే, జ్ఞానసిద్ధి కలిగిన వారికి మాత్రం ఈ తీర్థాలు ఇప్పటికీ గోచరిస్తాయని మహాత్ములు విశ్వసిస్తారు.

కటాహ తీర్థం

దీన్నే 'తొట్టితీర్థమ' ని కూడా పిలుస్తారు. స్వామివారి ఆలయంలో వైకుంఠ ప్రదక్షిణమార్గం నందు పవిత్రజలాలతో నిండి ఉన్న రాతితొట్టెనే 'కటాహతీర్థం' లేదా 'తొట్టితీర్థము' అని వ్యవహరించేవారు. చందన, పరిమళ ద్రవ్య మిశ్రితమైన స్వామివారి అభిషేక జలం ప్రతి శుక్రవారం శ్రీవారి గర్భాలయం నుంచి ప్రవహించి నేరుగా ఈ తొట్టె లోనికి చేరుకుంటుంది. దానికోసమై ఇదివరలో ఒక సంక్లిష్టమైన నిర్మాణవ్యవస్థ కూడా ఉండేది. ఈ జలాన్ని 'ఓం

నమో వెంకటేశాయ' అనే అష్టాక్షరి మంత్రం జపిస్తూ మూడు మార్లు సేవిస్తే పాపాలు పటాపంచలై సౌభాగ్యాలు సిద్ధిస్తాయి. స్వామిపుష్కరిణిలో స్నానం, వరాహస్వామి దర్శనం, కటాహతీర్థ పానం మానవజన్మలో అత్యంత దుర్లభమని స్కాందపురాణంలో చెప్పబడింది. కారణాంతరాల వల్ల ఈ తీర్థం కూడా ఇప్పుడు కనుమరుగై పోయింది.

విరజాతీర్థం

వైకుంఠవాసి అయిన 'దేవగంగానది' శ్రీమహావిష్ణువుతో బాటుగా భూలోకం లోనికి ఏతెంచి, సప్తగిరులలో విరజానదిగా అవతరించి, అంతర్వాహినిగా శ్రీవేంకటేశ్వరుని పాదాలకు ప్రదక్షిణ గావిస్తూ, ఆ పాదపద్మాల క్రింద నుండి ప్రవహించి, సంపంగిప్రదక్షిణ మార్గంలో పశ్చిమదిక్కున ఉన్న చిన్న బావి లోనికి ప్రవహిస్తుంది. సంపంగిప్రదక్షిణంలో ఉన్న సరుకుల గిడ్డంగి లేదా ఉగ్రాణం వద్ద ఈనాడు కూడా దీనిని దర్శించుకోవచ్చు. ప్రస్తుతం భూతలానికి సమంగా ఉన్న ఈ బావిని లోహపు ఊచల చట్రంతో మూసివేశారు. ఈ బావి లోపలి అంచులపై రమ్యమైన దేవతాశిల్పాలు చెక్కి ఉండటంవల్ల, స్థానికులు దీనిని బొమ్మలబావి గా పిలుస్తారు. ప్రస్తుతం ఈ బావిని దర్శించుకోవటానికి భక్తులకు అనుమతి లేదు. ఈ బావి లోనికి చేరుకున్న విరజానది తీర్థం ఇక్కడి నుండి మరలా ప్రవహించి స్వామిపుష్కరిణి లోనికి చేరుకుంటుందని చెబుతారు. సప్తగిరులలో నిరంతరం నీటితో కళకళలాడే తీర్థాలన్నీ విరజానది నుండే ఉద్భవించాయని భక్తుల విశ్వాసం.

తిరుమల గిరులలో అంతర్వాహినిగా ప్రవహించే ఈ నది యొక్క గమనాన్ని కొన్ని శాటిలైట్ చిత్రాలు సైతం సైద్ధాంతికంగా నిరూపించినట్లు కొందరు చెబుతారు.

ఆకాశగంగా తీర్థం

ఈనాడు తిరుమలక్షేత్రంలో ముఖ్యంగా చెప్పుకోబడే తీర్థాలలో ఒకటైన ఆకాశగంగా తీర్థం ముఖ్యాలయానికి ఉత్తరదిక్కున దాదాపు రెండు మైళ్ల దూరంలో ఉంది. స్వచ్ఛమైన నీటితో అలరారే ఈ తీర్థం సమీపంలో అంజనాదేవి పన్నెండు సంవత్సరాలు తపమాచరించి, ఆంజనేయుణ్ణి పుత్రునిగా పొందింది.

ఒకానొకప్పుడు రామానుజులు అనే బ్రాహ్మణుడు ఈ తీర్థానికి సమీపంలో తపస్సు చేయగా, శంఖు-చక్రధారి అయిన శ్రీమహావిష్ణువు మహాలక్ష్మీ సమేతంగా ప్రత్యక్షమై, ఆ విప్రునికి మోక్షప్రాప్తి కలిగించాడు. చైత్రమాసపు పౌర్ణమితో కూడిన చిత్తానక్షత్రం నాడు ఈ తీర్థస్నానం అత్యంత విశిష్టమైనదిగా స్కాందపురాణంలోను, వరాహపురాణంలోను చెప్పబడింది.

మరో ఇతిహాసం ప్రకారం గోదావరి నదీ తీరంలో పితృకర్మలు ఆచరిస్తున్నటువంటి ఒక సద్బ్రాహ్మణునికి తెలియక చేసిన పాపం వల్ల గార్ధభశిరస్సు లభిస్తుంది. చింతాక్రాంతుడైన ఆ బ్రాహ్మణుడు స్వర్ణముఖి నదీతీరంలో నివసిస్తున్న అగస్త్యముని సలహా మేరకు వేంకటాచలానికి వచ్చి, మొదట స్వామిపుష్కరిణి లోనూ తరువాత ఆకాశగంగా తీర్థం లోనూ స్నానమాచరించగా; శాపవిముక్తుడై, వికృతమైన గార్ధభముఖాన్ని పోగొట్టుకొని, నిజరూపధారియై తరించాడు.

ఈ తీర్థ ఆవిర్భావానికి సంబంధించి మరో ముఖ్యమైన ఘట్టాన్ని ఇంతకుముందు తిరుమలనంబి చరిత్రలో తెలుసుకున్నాం. క్లుప్తంగా, సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం, శ్రీవారి మహాభక్తుడు తిరుమలనంబి; శ్రీవారికి అభిషేక నిమిత్తం ఏడుమైళ్ళ దూరంలో ఉన్న పాపవినాశనం తీర్థం నుంచి పవిత్ర జలాలను మోసుకొని వచ్చేవాడు. అతని కష్టాన్ని చూసి సహించలేని శ్రీనివాసుడు బోయవాడి రూపంలో అవతరించి, తన బాణప్రహారంతో ఈ ప్రదేశంలో ఆకాశగంగతీర్థాన్ని ఆవిర్భవింప జేశాడు.

అన్నమయ్య ఈ ఆకాశగంగతీర్థాన్ని, 'గగనగంగ' గా కీర్తించి, దివి నుండి భువి కేతెంచిన తీర్థరాజంగా ధృవీకరించాడు. **పుట – 83 తేదీ – ఆగష్టు, 14**

పాపవినాశనం తీర్థం

ప్రస్తుతం తిరుమల యందున్న ముఖ్యమైన తీర్థాలలో ఒకటైన పాపవినాశనం తీర్థం ఆలయానికి ఉత్తర దిక్కున లేదా ఈశాన్య దిక్కున ఏడు మైళ్ళ దూరంలో స్థితమై ఉంది. బ్రహ్మపురాణాన్ననుసరించి ఉత్తరాషాఢా నక్షత్రం మరియు ఆదివారంతో కూడిన బహుళసప్తమి నాడు; లేదా, ఉత్తరాషాఢా నక్షత్రం ఆదివారంతో కూడిన శుక్లద్వాదశి నాడు ఈ తీర్థంలో స్నానమాచరిస్తే సమస్తమైన పూర్వజన్మల పాపాలు పటాపంచలై పోతాయి. ఆ పవిత్ర దినాలయందు అర్హులైన వారికి సాలగ్రామాన్ని దానం చేస్తే ఈ తీర్థస్నానం మరింత ఫలవంత మవుతుంది. వరాహపురాణం ప్రకారం, వైశాఖమాసంలో పుష్యనక్షత్రం మరియు ఆదివారంతో కూడిన సప్తమి నాడు కూడా ఈ తీర్థంలో స్నానమాచరించ వచ్చు. తిరుమల పురోహితసంఘం ఆధ్వర్యంలో ఇక్కడ అనునిత్యం పూజలు జరుగుతుంటాయి.

కొన్నేళ్ళ క్రితం – అంటే పాపవినాశనం ఆనకట్ట నిర్మించక పూర్వం – ఈ తీర్థస్థలం ప్రస్తుతం ఉన్న ప్రదేశంలో కాకుండా దట్టమైన అరణ్యంలో ఉండేది. గంగాభవాని, ఆంజనేయస్వామి కూడా అక్కడ కొలువై ఉన్నారు.

వైకుంఠతీర్థం

ముఖ్యాలయానికి ఈశాన్య దిశలో, పాపవినాశనం నుండి కుక్కలదొడ్డి వెళ్ళే పురాతన నడకమార్గంలో ఉన్న 'వైకుంఠగుహ' గా పిలువబడే పర్వతబిలం నేటికీ ఉంది. ఈ గుహలో నుండి ఉద్భవించడం వల్ల ఈ తీర్థాన్ని 'వైకుంఠతీర్థం' గా పిలుస్తారు.

వరాహపురాణాన్ననుసరించి, శ్రీరామచంద్రుడు వానరసైన్యంతో లంకానగరాన్ని ముట్టడించడానికి దక్షిణదిశగా వెళుతున్నప్పుడు, అంజనాదేవి ప్రార్థన మరియు ఆంజనేయుని విన్నపంపై రాములవారు తిరుమలక్షేత్రాని కేతెంచి స్వామిపుష్కరిణి ఒడ్డున కొంతకాలం విశ్రమించారు. ఆ సమయంలో కొందరు వానరముఖ్యులు, సమీప అరణ్యాలలో సంచరిస్తూ, వానర సహజమైన చిత్తచాపల్యంతో స్వామిపుష్కరిణికి ఈశాన్యదిశలో ఉన్న ఒక లోతైన గుహ లోనికి ప్రవేశించారు. దట్టమైన చీకట్లు కమ్ముకున్న ఆ గుహలో చాలా దూరం ప్రయాణించిన తర్వాత వారికి స్వర్ణకాంతులతో ప్రకాశిస్తూ, దివ్య హర్మ్యాలతో మిరిమిట్లు గొలుపుతున్న వైభవోపేతమైన నగరం దర్శనమిచ్చింది. అందమైన ఉద్యానవనాలు, స్వచ్ఛమైన సెలయేళ్లు, ఏడంతస్తుల గోపురాలు, శిల్పకళా శోభితమైన మంటపాలు, ఉన్నతమైన

ప్రాకారాలతో అలరారుతున్న ఆ నగరం లోని గృహాలన్నీ మేలుజాతి రత్నాలతో పొదగబడి వున్నాయి. ఆ నగరవాసు లందరూ చతుర్భుజులై, శంఖు చక్రాలు ధరించి, ధవళవస్త్రాలతో, మణిమయ ఆభరణాలతో ధఅలంకృతులై ఉల్లాసంగా కనిపించారు. నగరమధ్యలో ఉన్న దివ్యవిమానంలో ఆదిశేషుని పడగలనీడలో విశ్రాంతి తీసుకుంటూ; పీతాంబరధారియై, మణిమయ మకుటశోభితుడై, చతుర్భుజాలతో తేజరిల్లుతున్న దివ్య పురుషుడు కూడా కనిపించాడు. ఆ పురుషుడు వైజయంతి, వర్ణమాలలుగా పిలువబడే పూలమాలలు ధరించి, హృదయమునందు శ్రీవత్సచిహ్నాన్ని కూడి, దేవతాస్త్రీలు వింజామరలు వీచుచుండగా కృపాదృక్కులు కురిపింప జేస్తున్నాడు. ఆ దివ్యపురుషుడే శ్రీమహావిష్ణువనే విషయం గ్రహించలేని వానరవీరులు, ఇంద్రలోకాన్ని తలదన్నేట్లుగానున్న అక్కడి వైభవాన్ని పరమాశ్చర్యంగా అవలోకిస్తున్నారు. అంతలోనే ఆయుధధారి యైన మరో చతుర్భుజుడు, ఆ స్వర్లోకపు వింతలను ఆదమరచి వీక్షిస్తున్న వానరాలను తరిమికొట్టగా, వారు భయభ్రాంతులై గుహ నుండి బయల్వెడలి, తోటి వానరాలతో తాము చూసిన దంతా వివరించారు. ఆ దివ్యలోకాన్ని ప్రత్యక్షంగా చూడడానికి అందరూ కలిసి తిరిగి గుహలోనికి ప్రవేశించగా, వారికి గుహ లోపలి భాగమంతా చీకటిమయంగా గోచరించింది. వారి వారి పూర్వజన్మ సుకృతాల కారణంగా కొందరు వానరులకు దర్శనమిచ్చిన శ్రీమహావిష్ణువు, ఆ గుహలో ఇప్పటికీ అదృశ్యంగా ఉండి భక్తులను అనుగ్రహిస్తూ ఉంటాడని భాగవతోత్తముల విశ్వాసం. అందువలననే ఈ గుహలో నుండి ఉద్భవించే వైకుంఠతీర్థం అత్యంత మహిమాన్వితమైనదిగా ప్రసిద్ధిగాంచింది.

త్రేతాయుగము నందు శ్రీమహావిష్ణువు దర్శనభాగ్యంతో పునీతులైన వానరోత్తములు – చిరంజీవులై, అదృశ్యరూపంలో శ్రీమన్నారాయణుని సేవించుకుంటూ, ఇప్పటికీ ఈ గుహలోనే నివాస ముంటారని ప్రతీతి. సాధారణ మానవుల దృష్టి పడకుండా, అదృశ్యరూప ధారులైన ఆ వానరులు నిశిరాత్రి వేళలో శ్రీమహావిష్ణువును సేవించు కోవడం కోసం – దేవస్థానం వారు ప్రతి దినము వెండిబిందెలలో తీర్థాన్ని సిద్ధం చేస్తారు. శ్రీమహావిష్ణువు సేవనంతో పునీతమైన ఆ పవిత్ర జలాలను, మరునాటి ఉదయం భక్తులకు శ్రీవారి ప్రసాదంగా అందజేస్తారు.

జాబాలితీర్థం

తిరుమలక్షేత్రంలోనున్న సుప్రసిద్ధ తీర్థాలలో ఇది కూడా ఒకటి. దేశవిదేశాలకు చెందిన ఎందరో ప్రసిద్ధి చెందిన వ్యక్తులు ఈనాటికీ, అంజనాపుత్రుణ్ణి పూజించి తమ తమ వృత్తి, వ్యాపారాలలో రాణించే నిమిత్తం తరచూ జాబాలితీర్థం సందర్శిస్తూ ఉంటారు. తిరుమల ప్రధానాలయం నుండి పాపవినాశనం వెళ్లే మార్గమునందు, వేణుగోపాలస్వామి ఆలయానికి సమీపంలో రహదారి నుంచి దాదాపు మైలు దూరం మెట్ల మార్గంలో ప్రయాణించి ఈ తీర్థాన్ని చేరుకోవచ్చు. రమణీయమైన ప్రకృతిదృశ్యాలతో, వర్షఋతువు నందు చిన్నా–పెద్దా జలపాతాలతో ఈ మార్గమంతా కనువిందు చేస్తుంది. తిరుమలక్షేత్రంలో అత్యంత అరుదుగా కానవచ్చే పట్టుకుచ్చుల్లాంటి తోకలు, ముదురుగోధుమ వర్ణంలోనున్న పొడవాటి శరీరం గల 'బెట్లుడుత' లు ఈ మార్గానికి ఇరుప్రక్కలా ఉన్న వృక్షాలపై సయ్యాట లాడుతూ సందడి చేస్తుంటాయి.

ఇక్ష్వాకువంశపు రాజపురోహితులలో ఒకరైన జాబాలిమహర్షి తన శిష్యులతో సహా కొంతకాలం ఈ తీర్థంలో

నివసించినట్లు వరాహపురాణంలో చెప్పబడింది. తర్వాతి కాలంలో, అదే ప్రదేశంలో అగస్త్యముని తన శిష్యులతో పాటుగా సుదీర్ఘకాలం నివసించి శ్రీవేంకటేశ్వరునికి అట్టహాసంగా పూజాదికాలు నిర్వహించాడు. ఈ క్షేత్రంలో జాబాలిమహర్షి కోరిక మేరకు ఆంజనేయుడు స్వయంభువుగా వెలిశాడని పురాణాల్లో చెప్పబడింది. స్కాందపురాణంలో మరియు తరిగొండ వెంగమాంబ విరచిత శ్రీవేంకటాచల మహత్యంలో కూడా ఈ తీర్థం యొక్క ప్రస్తావన తరచుగా కనిపిస్తుంది.

శ్రీరామచంద్రుడు సీతా-లక్ష్మణ సమేతంగా వనవాసంలో ఉన్నప్పుడు; రాముణ్ణి అయోధ్యకు తిరిగి వచ్చేందుకు ఒప్పించడానికై జాబాలిమహర్షి నాస్తికవాక్కులు పలుకుతాడు. తత్ఫలితంగా వచ్చిన వాక్ దోషాన్ని తొలగించుకోవడం కోసం జాబాలిమహర్షి ఈ క్షేత్రంలో సుదీర్ఘకాలం తపమాచరించాడు. రావణవధ అనంతరం అయోధ్యకు తిరిగి వెళుతూ శ్రీరామచంద్రుడు సీతా సమేతంగా ఈ ప్రాంతంలో కొంతకాలం విశ్రమించాడు. ఆ సమయంలో శ్రీరాముడు స్నానమాచరించిన నీటిమడుగు 'రామకుండం' గానూ; సీతాదేవి స్నానం చేసిన నీటిమడుగు 'సీతాకుండం' గాను ప్రసిద్ధికెక్కాయి. స్వచ్ఛమైన జలాలతో ఒప్పారుతున్న ఈ రెండు కుండాలను ఈనాడు కూడా వేలాది భక్తులు చూసి తరిస్తారు. ఈ క్షేత్రంలో కొలువై ఉన్న సింధూర వర్ణపు ఆంజనేయుడు శిరస్సుపై సీతారామచంద్రులను మోస్తూ దర్శనమిస్తాడు. ఈ తీర్థానికి ఎగువన ధ్రువుడు తపస్సు చేసినట్లుగా చెప్పబడే 'ధ్రువతీర్థం' కూడా ఉంది.

హనుమజ్జయంతి నాడు ఈ ఆలయంలో పెద్ద ఎత్తున పూజాపునస్కారాలు జరుగుతాయి.

చక్రతీర్థం

ఆలయానికి ఉత్తర-పశ్చిమ దిశగా, రెండు మైళ్ల దూరంలో, వేదపాఠశాలకు వెళ్లే దారిలో; శిలాతోరణం ఉద్యానవన ప్రాంగణంలో దాదాపు నూరు మెట్లు దిగి ఈ తీర్థాన్ని దర్శించుకోవచ్చు. ఈ తీర్థంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, శ్రీవేంకటేశ్వరుని ఆయుధమైన సుదర్శన చక్రత్తాళ్వార్ ల విగ్రహాలు మలచబడి ఉన్నాయి. కార్తీకమాసంలో వచ్చే బహుళద్వాదశి నాడు శ్రీవారి ముఖ్యాలయం నుండి తీసుకొని వచ్చిన పాయసాన్ని ఈ మూర్తులకు నివేదన కావించి, తదనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు. స్కాందపురాణం ప్రకారం, శ్రీవత్స గోత్రీకుడైన 'పద్మనాభుడు' అనే విప్రుడు పన్నెండు సంవత్సరాల పాటు కఠోర తపమాచరించగా; శ్రీవేంకటేశ్వరుడు ప్రత్యక్షమై, అప్పట్లో ఆ ప్రదేశాన్ని ఆవరించియున్న రక్కసి మూకలను తన చక్రాయుధంతో దునుమాడాడు. శ్రీవారి సుదర్శనచక్రం ద్వారా రాక్షససంహారం జరిగిన కారణంగా ఆ ప్రదేశం చక్రతీర్థంగా ప్రసిద్ధి కెక్కింది. పాప పరిహారార్థం తపస్సు చేయదలచుకున్న వారికి ఈ ప్రదేశం అత్యుత్తమమైనదిగా పురాణాలలో చెప్పబడింది.

స్కాందపురాణం లోని మరొక ఇతివృత్తాన్ని అనుసరించి, శ్రీరంగానికి చెందిన 'సుందరుడు' అనే బ్రాహ్మణుడు శాపవశాత్తూ రాక్షసరూపం ధరించాడు. ఆ బ్రాహ్మణుడు వశిష్ఠమహర్షి ఆదేశం మేరకు ఈ తీర్థంలో పవిత్ర స్నానమాచరించి తన నిజరూపాన్ని సంతరించుకుని మోక్షసిద్ధి పొందాడు. **పుట – 84 తేదీ – ఆగష్టు, 15**

రామకృష్ణ తీర్థం

ఆలయానికి ఉత్తరదిక్కున ఎనిమిది మైళ్ళ దూరంలో ఉన్న ఈ తీర్థాన్ని, ఆ ప్రదేశంలో కొంతకాలం తపమాచరించుకున్న 'కృష్ణుడు' అనే భక్తుడు తన నిత్య సంధ్యావందనం నిమిత్తం నిర్మించాడు. తరువాతి కాలంలో, ఈ ప్రదేశంలోనే 'రామకృష్ణుడు' అనే మునీశ్వరుడు దీర్ఘకాలం పాటు ఘోర తపమాచరించాడు. గాలి, నీరు, ఆహారం ఏమీ లేకుండా సుదీర్ఘకాలం నిశ్చలంగా ఉండటంతో శరీరం చుట్టూ చీమలు పుట్టలు పెట్టాయి. అయినప్పటికీ, తపోనిష్ఠలో లోనున్న ఆ మునిపుంగవుడు ఏమాత్రం చలించలేదు. ఏకాగ్రతతో శిథిలమవుతున్న తన దేహాన్ని సైతం గమనించకుండా, తపస్సు కొనసాగించాడు. అతని నిష్ఠాగరిష్టతను పరీక్షించదానికై, ఇంద్రదేవుడు ఉరుములు, మెరుపులతో కూడిన కుంభవృష్టి కురిపించగా కేవలం చీమలపుట్టలు మాత్రమే చెల్లాచెదురయ్యాయి. అంతేకానీ, మునీశ్వరుని తపోనిష్ఠకు ఏమాత్రం భంగం వాటిల్లలేదు. అంత, ఆ ఋషి జ్ఞాననిష్ఠకు తపోదీక్షకు ముగ్ధుడైన శ్రీమహావిష్ణువు గరుడ వాహనారూఢుడై ప్రత్యక్షమయ్యాడు. ఆరోజున, అనగా సౌరమానం లోని మకరమాసమందు వచ్చే పుష్యనక్షత్రంలో, ఆ తీర్థంలో స్నానమాచరించిన వారి సకల పాపాలు నివృత్తి అవుతాయని వరమిచ్చాడు. ఈ ఉదంతమంతా స్కాందపురాణంలో వివరించబడింది. ఆ తిథియందు ఈ తీర్థానికి భక్తులు విరివిగా విచ్చేసి, పవిత్ర స్నానమాచరిస్తారు. శ్రీవారి ఆలయం నుంచి తెచ్చిన ప్రసాదాలను ఆ తీర్థం లోనే ఉన్న శ్రీకృష్ణునికి నైవేద్యంగా సమర్పించి, అక్కడున్న భక్తులకు ప్రసాదంగా వితరణ చేస్తారు.

కుమారధారా తీర్థం

శ్రీవారి ఆలయానికి పన్నెండు మైళ్ల దూరంలో పాపవినాశన తీర్థానికి వాయువ్యదిశగా ఉన్న ఈ తీర్థంలో; మాఘమాసము నందు సూర్యుడు కుంభరాశిలో సంచరించే సమయంలో, పున్నమినాటి మధ్యాహ్నం అభిజిల్లగ్నంలో పుణ్య స్నానమాచరిస్తే గంగాది పుణ్యతీర్థాల యందు స్నానమాడిన ఫలితం లభిస్తుంది. ఆ పవిత్రదినం నాడు శ్రీవారి ఆలయం నుండి తెచ్చిన ప్రసాదాలను అక్కడున్న భక్తులకు అందజేస్తారు. ఈ తీర్థం యొక్క ప్రస్తావన వరాహ, మార్కండేయ పురాణాలలో కనిపిస్తుంది.

అగ్ని సంభవుడైన కుమారస్వామి భార్య దేవసేన సమేతంగా ఈ క్షేత్రంలో కొలువై ఉంటూ శ్రీనివాసుణ్ణి సేవించుకున్నాడని వరాహపురాణంలో చెప్పబడింది. షణ్ముఖుడు ఇంద్రాది దేవతల పరిరక్షణార్థం తారకాసుర సంహారం గావించిన పిదప, బ్రహ్మహత్యా దోషాన్ని తొలగించుకోవడానికై, ఇంద్రుని సలహా మేరకు ఈ తీర్థానికి విచ్చేసి శ్రీవేంకటేశ్వరుని ఆరాధిస్తూ అష్టాక్షరీ మంత్రాన్ని జపించాడు. తత్ఫలితంగా కుమారస్వామి పేరున, ఆ తీర్థం కుమారతీర్థంగా ప్రసిద్ధికెక్కినట్లు మార్కండేయ పురాణంలో చెప్పబడింది. దోషరహితుడై, పుటం పెట్టబడిన బంగారంలా ప్రకాశించిన కుమారస్వామి, శ్రీవెంకటేశ్వరునికి కృతజ్ఞతాపూర్వకంగా ఒక వజ్రకిరీటం కూడా బహూకరించాడు.

ఈ తీర్థానికి సంబంధించి, పురాణాలలో మరెన్నో ఇతివృత్తాలు ఉన్నాయి.

పూర్వం, సకలశాస్త్ర పారంగతుడయిన ఒక వృద్ధబ్రాహ్మణుడు, ఈ తీర్థ సమీపంలోని అరణ్యంలో సంచరిస్తూ దారి తప్పి, కుమారా! కుమారా! అని దిక్కులు పిక్కటిల్లేలా ఆక్రందిస్తున్న సమయంలో; శ్రీవేంకటేశ్వరుడు ఒక అందమైన యువకుని రూపంలో ఆ వృద్ధుని వద్దకు చేరుకుంటాడు. దరిదాపుల్లో వేరెవరూ లేరని, ఆ వృద్ధునికి కావలసిన సహాయం మందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని పలుకుతాడు. దానికి సమాధానంగా ఆ వృద్ధుడు, తాను నిరుపేదనని, కారడవిలో దారి తప్పి సంచరిస్తున్నానని, వృద్ధాప్యం వల్ల, స్వశక్తితో తన కుటీరానికి చేరుకోలేని అసమర్థుణ్ణని చెబుతాడు. అంతేగాక, శారీరకరుగ్మతల కారణంగా దైవకార్యం సహితం చేయగలిగే శక్తి లేనివాడనని, కానీ ఆ భగవంతుడు దీర్ఘాయుష్షు నిచ్చి తనను మరింతగా కృంగదీస్తున్నాడని కూడా తన గోడు వెళ్ళబోసుకుంటాడు. అంత, శ్రీవేంకటేశ్వరుడు ఆ వృద్ధుని పరీక్షించ దలచి; అవసాన దశలో ఉన్న తాను మరికొంత కాలం జీవించదలచు కొన్నాడా, లేక, ముదిమిభారంతో శిథిలమైన ఆ శరీరాన్ని అంతటితో చాలించదలచుకున్నాడా, ఏ విషయం మనసులో ఉన్నది ఉన్నట్లుగా చెప్పమని కోరుతాడు. దానికి సమాధానంగా, ఆ బ్రాహ్మణుడు ప్రస్తుతం తాను దుర్భరమైన జీవితం సాగిస్తున్నప్పటికీ; దైవకృప వల్ల తన ఆయుర్దాయం వృద్ధిచెంది, శారీరకస్వస్థత చేకూరితే తానింత కాలం యజ్ఞయాగాదులకు, దైవకార్యాలకు దూరంగా ఉన్న పాపానికి ప్రాయశ్చిత్తంగా కొంతకాలం పాటు వైదికకర్మలను శాస్త్రోక్తంగా నిర్వహించి, ఆ తర్వాత దేహాన్ని త్యజిస్తానని విన్నవించుకుంటాడు. వృద్ధుని మనోగతానికి ప్రసన్నుడైన శ్రీవేంకటేశ్వరుడు అతనిని ఈ తీర్థం వద్దకు తీసుకునివెళ్ళి, అందులో స్నానమాచరింప జేయగానే; అత్యంత ఆశ్చర్యకరంగా ఆ బ్రాహ్మణుడు తన వృద్ధాప్యాన్ని పోగొట్టుకొని, ఆరోగ్యవంతమైన శరీరంతో నవయౌవన వంతుడవుతాడు. పండు ముదుసలి అయిన బ్రాహ్మణుడు, ఆ క్షేత్రమహిమచే కౌమారదశను సంతరించుకోవడం వల్ల ఆ తీర్థానికి 'కుమారధారాతీర్థ' మనే నామధేయ మేర్పడినట్లుగా 'మార్కండేయపురాణం' లో చెప్పబడింది. తదనంతరం శ్రీవేంకటేశ్వరుడు ఆ బ్రాహ్మణుని ఉద్దేశించి; మోక్షసిద్ధిని కోరుకునేవారు వైదికకర్మలను నిరాపేక్షగా నిర్వర్తించాలని, తాను చేసిన పుణ్యకర్మలన్నీ శ్రీవెంకటేశ్వర ప్రీత్యర్థంగా భావిస్తూ, తన కొరకు మాత్రమే చేయవలసిందని సందేశమిస్తాడు. యవ్వనదశలో గృహస్థులకు నిర్దేశించినటువంటి భోగభాగ్యాలను అనుభవించటం శాస్త్రరీత్యా సమ్మతమని, అయితే వాటన్నింటినీ భగవదార్పణ బుద్ధితో భగవంతునికి కృతజ్ఞతా పూర్వకంగా అనుభవించాలని, నిషిద్ధకర్మల జోలికి వెళ్లరాదని కూడా ఆనతిస్తాడు.

ఈ తీర్థంలో మాఘపౌర్ణమి నాడు స్నానమాచరిస్తే, వయోవృద్ధులు సైతం యవ్వనప్రాయానికి తగ్గ శరీరసౌష్టవం కలిగి, ఇహలోక సౌఖ్యాలను తృప్తి తీరా అనుభవించి, అవసానదశ యందు వైకుంఠం చేరుకుంటారని పురాణాలలో చెప్పబడింది.

తి.తి.దే. వారు ఈ తీర్థంపై కుమారధార ప్రాజెక్టు నిర్మించి, భక్తుల త్రాగునీటి అవసరాలను తీర్చుతున్నారు.

సనక సనందన తీర్థం

పాపవినాశనం ఆనకట్టకు వాయువ్యదిశగా కొద్దిదూరంలో ఉన్న ఈ తీర్థంలో సనకసనందనాదులు గా పేరుగాంచిన సనక, సనాతన, సనందన, సనత్కుమారులు కొంతకాలం తపస్సు చేసినందువల్ల ఇది 'సనక సనందన తీర్థం' గా

పేరుగాంచింది. ఈ తీర్థం సమీపంలోనే, శ్రీవారి మహాభక్తులైన మలయాళస్వామి, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ మొదలైనవారు కూడా కొద్దికాలం తపమాచరించారు. సత్పురుషులు యోగసాధనలో ఎదురయ్యే అనేక ఆటుపోట్లను అధిగమించే నిమిత్తం ఈ తీర్థంలో స్నానమాచరించి తమ కార్యదీక్షను ప్రారంభిస్తారు. యోగసిద్ధిని సాధించ దలచుకున్నవారు మార్గశిర శుక్లద్వాదశి నాడు స్వామిపుష్కరిణిలో స్నానమాడి, పరిశుద్ధాంతరంగులై; త్రయోదశి నాటి నుండి ఈ తీర్థంలో స్నానసంధ్యాదులు గావిస్తూ, జపతపాలు చేస్తూ, *'ఓం నమో వేంకటేశాయ'* అనే అష్టాక్షరిమంత్రాన్ని కొన్ని వేలసార్లు జపించి కార్యదీక్ష ప్రారంభిస్తే, వారి కృషి నిరాటంకంగా సాఫల్య మవుతుందని వరాహపురాణంలో చెప్పబడింది.

రేపటి ప్రకరణంతో, 'తిరుమలక్షేత్రం' నందలి ముఖ్యమైన పదిహేడు క్షేత్రాలలో మిగిలినవాటి గురించి చెప్పుకుందాం!

పుట – 85 తేదీ – ఆగష్టు, 16

తుంబుర తీర్థం

అత్యద్భుత ప్రాకృతిక సోయగం ఉట్టిపడే తుంబురతీర్థాన్ని, పాపవినాశనం ఆనకట్ట నుండి సుమారు ఆరు కిలోమీటర్ల దూరం దుర్గమమైన అటవీ ప్రాంతంలో కాలినడకన ప్రయాణించి చేరుకోవచ్చు. ఈ తీర్థం నిర్జనారణ్యంలో, చాలా దూరంగా ఉండడం వల్ల, భద్రతా కారణాల దృష్ట్యా సంవత్సరంలో కేవలం ఒక్కరోజు మాత్రమే దీని వద్దకు భక్తులను అనుమతిస్తారు.

'తుంబురుడు' అనే గంధర్వుడు ఈ ప్రదేశంలో సుదీర్ఘకాలం తపస్సు చేసి శాపవిమోచనం పొందిన కారణంగా ఈ ప్రాంతమంతా 'తుంబురకోన' గానూ, అందులో కొలువై ఉన్న తీర్థం 'తుంబురతీర్థం' గానూ పేరుగాంచాయి. భవిష్యోత్తర పురాణాంతర్గతమైన మరో ఇతిహాసం ప్రకారం ఒకానొకప్పుడు తుంబురుడనే ఒక గంధర్వ గాయకుడు తన భార్యతో సహా ఈ ప్రాంతంలో నివసించే వాడు. ఉత్తమగతులు సిద్ధించుకునే నిమిత్తం ఆ గంధర్వుడు మాఘమాసంలో ఈ తీర్థమునందు సతీసమేతంగా స్నానమాచరించి, ఆ పవిత్రజలాలతో తన పర్ణశాలను శుద్ధి చేసుకుని, పర్ణశాల ప్రాంగణము నందు రంగవల్లులల్లి, భగవంతునికి నైవేద్యం సమర్పించేవాడు. తదనంతరం ఆ అర్చామూర్తి చుట్టూ ప్రదక్షిణ గావించి, అరిషడ్వర్గాల నుండి తమను తప్పించి, తమకు కైవల్యాన్ని ప్రసాదించమని వేడుకునేవాడు. అయితే, శీతాకాల సుప్రభాతసంధ్యా సమయాన ఆ ప్రదేశంలో ఉండే విపరీతమైన చలిని తట్టుకోలేని గంధర్వుడి భార్య, తన భర్తగారి ఆదేశాలను శిరసావహించ లేకపోయింది. దాంతో కృద్ధుడైన గంధర్వుడు ఆమెను మండూకంగా మారి, ఒక మహావృక్షం మొదలులో ఉన్న బిలంలో పడి ఉండవలసిందిగా శపించాడు. తరువాత, గంధర్వుడి భార్య ప్రాధేయ పడటంతో కొద్దిగా కనికరించి ఆమె మండూకజన్మలో చాలాకాలం గడిపిన తరువాత, అగస్త్యముని తన శిష్యులతో సహా ఆ ప్రాంతానికి విచ్చేస్తాడని, ఆ తీర్థంలో స్నానమాడుతూ తన శిష్యులకు ఆ తీర్థమహిమను వివరిస్తాడని, ఆ పరమ పవిత్రమైన ఇతివృత్తాన్ని మండూకరూపంలో ఉన్న గంధర్వునిభార్య కూడా వింటుందని, ఆ సమయంలో ఆమెకు శాపవిమోచనం కలిగి తిరిగి యథారూపం సంప్రాప్తిస్తుందని, శాపాంతరం తెలియజేస్తాడు. తుంబురుని శాపం కారణంగా మండూకజన్మ నెత్తిన అతని భార్య అదే ప్రదేశంలో శాపవిముక్తి

పొందడం వల్ల ఆ తీర్థం 'తుంబురతీర్థం' గా ప్రసిద్ధికెక్కింది.

భౌగోళిక పరిణామక్రమంలో భాగంగా ఇక్కడున్న పర్వతశిఖరం రెండుగా చీలడం వల్ల రహదారికి ఇరువైపులా రెండు కొబ్బరిచిప్పల వంటి బండశిలలు సహజసిద్ధంగా ఏర్పడ్డాయి. ఆ చీలిక ద్వారా కొద్ది దూరం ప్రయాణించి; రాళ్ళు, రప్పలు, బండశిలలు, వేగంగా పారే సెలయేళ్ళు దాటిన తరువాత ఈ తీర్థం దర్శనమిస్తుంది. ఇంతకుముందు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రకరణంలో మనం చెప్పుకున్నట్లుగా ఆ మహాతపస్విని ఈ ప్రాంతంలోని ఒక గుహలో చాలాకాలం నివసించి, ప్రతి నిత్యము రాత్రి సమయంలో రహస్యమార్గం ద్వారా ప్రయాణించి, ఆనందనిలయానికి చేరుకొని, పరుల కంట పడకుండా శ్రీవేంకటేశ్వరుణ్ణి ఆరాధించుకునేది. 'వెంగమ్మ అర' గా పిలువబడే ఆ బిలాన్ని నేడు కూడా మనం దర్శించుకోవచ్చు. వెంగమాంబ విరచిత 'చెంచునాటక' మనే యక్షగానంలో తుంబురతీర్థం కడు రమ్యంగా వర్ణించబడింది.

ఈ ప్రదేశం పలు అరుదైన వృక్షజాతులకే కాకుండా ఎలుగుబంట్లు, వనసూకరాలు, వింతవింత సరీసృపాలు, చిరుతలు వంటి అడవి జంతువులకు కూడా ఆలవాలం.

సూర్యుడు మీనరాశిలో ఉండగా, ఉత్తరఫల్గుణి నక్షత్ర పౌర్ణమినాడు అత్యంత వైభవంగా జరిగే తీర్థముక్కోటి పర్వదినాన, ముక్కోటిదేవతలు దివినుండి భువికేగి అదృశ్యరూపంలో ఈ తీర్థం నందు పవిత్రస్నాన మాచరిస్తారని ప్రతీతి. ఆ రోజున సుమారుగా లక్షమంది భక్తులు విచ్చేసి తీర్థముక్కోటి ఉత్సవంలో పాల్గొంటారు. ఆ పర్వదినం నాడు తమిళభక్తుల సందడి అధికంగా కానవస్తుంది.

కాయ రసాయన తీర్థం లేదా అస్తితీర్థం

సనక-సనందన తీర్థానికి కొంచెం ఎగువగా ఉండి; సామాన్యుల దృష్టికి గోచరించని ఈ తీర్థం యొక్క జలాన్ని సేవించిన వెనువెంటనే మనసు, శరీరం, రెండూ పరిశుద్ధమవు తాయని వరాహపురాణంలో చెప్పబడింది. మలినమైన 'కాయాన్ని' శుద్ధి చేసేది కనుక ఇది 'కాయరసాయన' తీర్థంగా ప్రసిద్ధికెక్కింది. కారణాంతరాల వల్ల సనకమహర్షి ఈ తీర్థం యొక్క ముఖద్వారాన్ని, సామాన్యులకు కనబడకుండా మూసివేసినట్లు చెబుతారు.

ఈ తీర్థమహిమను వివరించే మరో కథనం ప్రాచుర్యంలో ఉంది. దానిననుసరించి ఆ తీర్థం వద్దనే ఉన్న ఓ వృక్షరాజం నుండి రాలిపడిన పసుపుపచ్చటి పండుటాకును ఈ తీర్థజలాలలో పడవేస్తే అది జీవం పోసుకొని ముదురాకు పచ్చలోనికి మారేదట.

వరాహపురాణంలో ఉటంకించబడిన మరో ఐతిహ్యం ప్రకారం తొండమాన్ చక్రవర్తి తొండమనాడును పరిపాలిస్తున్న కాలంలో; ఓ సద్బ్రాహ్మణుడు చూలాలిగా ఉన్న తన భార్యను, బాలుడైన కుమారుణ్ణి తొండమానుని సంరక్షణలో ఉంచి తీర్థయాత్రలకు వెళతాడు. భద్రతాకారణాల దృష్ట్యా వారిరువురిని ఒక భవనంలో ఉంచి, చక్రవర్తి తన కార్యభారంలో మునిగి వారి బాగోగులు మరచిపోవడం పోవడం వల్ల నవజాత శిశువుతో సహా విప్రుని కుటుంబ సభ్యులు ముగ్గురు విగతజీవు లవుతారు.

సుదీర్ఘవిరామం తరువాత విప్రుడు తిరిగిరావడంతో, విప్రకుటుంబం యొక్క విషాదగాథను తెలుసుకొన్న తొండమానుడు తనను ఈ గండం నుండి గట్టెక్కించ వలసిందిగా శ్రీవేంకటేశ్వరుణ్ణి వేడుకొంటాడు. కటాక్షించిన శ్రీవారి ఆనతి ననుసరించి తొండమానుడు బ్రాహ్మణ పరివార సదస్యుల యొక్క శిథిలమైన మృతదేహాలను కొండపైకి రప్పించి, వాటిని ఈ తీర్థంలో సంప్రోక్షణ చేయించగా; మృతులైన ముగ్గురూ పునర్జీవు లవుతారు. స్వామివారి మహిమ వల్ల, ఆ తీర్థజలాల స్పర్శతో అస్థికలు పునరుజ్జీవం చెందిన కారణంగా ఆ తీర్థం 'అస్థితీర్థం' గా కూడా పిలువ బడుతుంది. ఈ వృత్తాంతాన్నంతా 'తొండమాన్ చక్రవర్తి' ప్రకరణంలో వివరంగా తెలుసుకున్నాం.

దేవతీర్థం

దేవిలయానికి ఉత్తర–పశ్చిమదిశలో, చాలాదూరంగా, దట్టమైన అటవీప్రాంతంలోనున్న చెరువునే 'దేవతీర్థం' గా వ్యవహరిస్తారు. పుష్యానక్షత్రంతో కూడుకున్న గురువారం నాడు కానీ; లేదా, శ్రవణానక్షత్రంతో కూడుకున్న సోమవారం నాడు కానీ ఈ తీర్థంలో పవిత్రస్నాన మాచరిస్తే చిరాయువు, సంతానవృద్ధి, సుఖసంతోషాలు కలుగుతాయని వరాహపురాణంలో చెప్పబడింది.

మనం పైన చెప్పుకున్న పదిహేడు ముఖ్యమైన తీర్థాలే కాకుండా; తిరుమలక్షేత్రంలో మరికొన్ని ముఖ్యమైన తీర్థాలు కూడా ఉన్నాయి.

శుక్రతీర్థం లేదా ఇంద్ర తీర్థం

ఇంద్రుడు, గౌతముని భార్య అయిన అహల్యతో సంగమించిన దోషాన్ని, కపిలతీర్థం పైభాగాన ఉన్న ఈ తీర్థంలో స్నానం చేసి పోగొట్టు కొనడం వల్ల ఇది ఇంద్రతీర్థంగా పేరు పేరొందింది.

విష్వక్సేన తీర్థం

వాయుదేవుని పుత్రుడైన విష్వక్సేనుడు ఈ తీర్థంలో తపమాచరించి, విష్ణువును కటాక్షింప జేసుకొని, వారి సేనాధిపతిగా నియమితు డయ్యాడు. ఈ తీర్థం శుక్రతీర్థానికి పై భాగంలో ఉంది.

పంచాయుధ తీర్థం

విష్వక్సేనతీర్థం పై భాగంలో ఉన్న ఈ తీర్థంలో శ్రీమహావిష్ణువు పంచాయుధాలైన శంఖం, చక్రం, గద, ఖడ్గం, శారంగం (విల్లు) తపస్సు చేసి శ్రీహరి అనుగ్రహాన్ని పొందాయి. ఈ తీర్థంలో స్నానం చేస్తే శత్రుభయం తొలగి పోతుందని నమ్ముతారు.

అనలతీర్థం లేదా అగ్నితీర్థం

అగ్నిదేవుడు ఈ తీర్థంలో స్నానం చేసి తన శారీరక రుగ్మతను పోగొట్టుకున్నాడు.

బ్రహ్మ తీర్థం

బ్రహ్మదేవుడు ఈ తీర్థంలో తపస్సు చేసి, శ్రీమహావిష్ణువు అనుగ్రహంతో సృష్టికార్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగించాడు.

సప్తర్షి తీర్థాలు

సప్తఋషులు తపస్సు చేయడం వల్ల ఇవి సప్తర్షితీర్థాలు గా పేరుపొందాయి.

ఇవే కాకుండా తిరుమల కొండల్లో **శేషతీర్థం,తాంత్రికతీర్థం, గరుడతీర్థం, సీతమ్మతీర్థం, నాగతీర్థం, మార్కండేయతీర్థం** వంటి మరెన్నో ప్రముఖమైన తీర్థాలున్నాయి. వీటిలో కొన్నింటిని ఈనాడు కూడా మనం చూసి తరించవచ్చు. చాలా తీర్థాలకు సంవత్సరంలో ఒక నిర్ణీత సమయం నందు ఉత్సవం జరుగుతుంది.

తిరుమల క్షేత్రం పైనున్న తీర్థాలే కాకుండా, శేషాచల పర్వత పాదభాగంలోని తిరుపతి పట్టణ పరిసరాల్లో విశేషమైన ఐతిహాసిక ప్రాశస్త్యం కలిగిన, నయనానందకర మైన 'కపిలతీర్థం' అనే మరో ముఖ్యమైన తీర్థం, దాని సమీపంలోనే కపిలేశ్వరస్వామి ఆలయం కూడా ఉన్నాయి. వాటి గురించి ముందు ముందు తెలుసుకుందాం. పుట – 86 తేదీ – ఆగష్టు, 17

----------: : ----------

శ్రీ హాథీరామ్ బావాజీ

స్వామివారి భక్తాగ్రేసరులలో అత్యంత ప్రముఖుడైన శ్రీ హాథీరామ్ బావాజీని స్మరించుకోకుండా తిరుమలక్షేత్ర చరిత్ర కానీ, శ్రీవేంకటేశ్వరుని ఇతిహాసం కానీ అసంపూర్తిగానే మిగిలిపోతాయంటే అతిశయోక్తి కాదు. వందల ఏళ్ళక్రితం, ఎక్కడో వేలమైళ్ళ దూరంలోనున్న హిమాచల్ ప్రదేశ్ నుంచి కాలినడకన వచ్చి, తిరుమలకొండపై జనావాసాలు ఏమాత్రం లేని రోజుల్లో స్థిరనివాస మేర్పరచుకుని, స్వామివారిని సేవించుకుంటూ, వారితో నిత్యము పాచికలాడిన శ్రీహాథీరామ్ బావాజీ చరిత్ర శ్రీవారి భక్తులందరికీ చిరపరిచితమే!

వారి జీవనగమనం, శ్రీవేంకటేశ్వరునితో వారికున్న ప్రగాఢమైన అనుబంధం, తిరుమలలో బావాజీ జీవితంతో ముడివడి ఈనాటికీ దర్శించుకో దగ్గ ప్రదేశాలు, బ్రిటీషువారి హయాం అనంతరం ఆలయ నిర్వహణను తొంభై సంవత్సరాల పాటు చేపట్టిన మహంతు వ్యవస్థ మొదలైన వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

పుట్టుపూర్వోత్తరాలు

హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం లోని 'ఉనా' అనబడే గ్రామంలో, వంశపారంపర్యంగా శ్రీరామచంద్రుడి పరమభక్తుడైన 'దేశ్ రాజ్ బల్జోత్' అనే మధ్యతరగతి కుటుంబీనికి కలిగిన నలుగురు పుత్రులలో ఒకరిగా బాబాజీ జన్మించారు. వారి అసలు పేరు 'ఆశారామ్ బల్జోత్'. తరువాతి కాలంలో, 'లంబాడా' గిరిజన తెగకు చెందిన బల్జోత్ కుటంబం పంజాబ్ రాష్ట్రానికి వలస వెళ్ళింది.

మరి కొందరు చరిత్రకారుల ననుసరించి, బావాజీ పూర్వీకులు రాజస్థాన్ లోని 'నాగౌర్' పట్టణానికి చెందినవారు. తిరుమల లోని హాథీరాంజీ మఠంలో ప్రస్తుతం నివాసముంటున్న బావాజీ అనుయాయులు ఈ వాదాన్నే బలపరుస్తున్నారు.

తిరుమల యాత్ర

బల్జోత్ వంశస్థులు, ఆనాడు ఉత్తర భారతదేశంలో ఉధృతంగా ప్రచారంలోనున్న రామానంద భక్తి ఉద్యమానికి చెందిన వైష్ణవులు. ఈనాటి 'ఢిల్లీ' పట్టణానికి కొద్ది దూరంలో 'రామానంద మఠం' ఉండేది. శ్రీరామ భక్తిని వంశపారంపర్యంగా పుణికి పుచ్చుకున్న హథీరాం బాబా ఆ రోజుల్లో రామానంద మఠానికి అధిపతి యైన అభయానంద్ స్వామీజీకి ప్రియశిష్యుడు.

గురువాజ్ఞ మేరకు, కౌమారదశలోనున్న ఆశారామ్ బల్జోత్, ఒక భక్తబృందంలో సభ్యుడిగా దక్షిణ భారతదేశంలోని తీర్థాలన్నింటిని కాలినడకన దర్శించుకుంటూ, తిరుమల క్షేత్రానికి విచ్చేశారు. కొద్ది రోజులు శ్రీవారిని సేవించుకున్న తరువాత భక్తబృందం లోని సభ్యులందరూ తిరిగి వెళ్ళిపోగా, బావాజీ మాత్రం తిరుమలక్షేత్రం లోని ప్రకృతి సోయగానికి, శ్రీవేంకటేశ్వరుని దివ్యసౌందర్యానికి ముగ్ధుడై సప్తగిరులే తన దీక్షకు అనువైన స్థానమని తలంచి

కొండపైనే ఉండిపోయాడు. ఆలయానికి అతి సమీపంలో ఆగ్నేయ దిక్కున ఒక చిన్న ఆశ్రమం ఏర్పరుచుకొని, అనునిత్యం స్వామివారిని సేవించు కునేవాడు. ఆ కాలంలో తిరుమల ప్రాంతమంతా దట్టమైన అడవులతో, క్రూరమృగాలతో, భరింపశక్యం గాని చలితో దుర్గమంగా ఉండడం వల్ల కొండపై వేరెవరూ నివాస ముండేవారు కాదు. అర్చకులతో సహా అందరూ కొండ దిగి, చీకటి పడకముందే దిగువ తిరుపతికి చేరుకునే వారు. బావాజీ ఒక్కరే స్వామివారిపై భారం వేసి, ఆశ్రమంలో నివాసముంటూ శ్రీవారిని సేవించుకునేవారు. బావాజీ స్వతహాగా, వంశపారంపర్యంగా శ్రీరాముడి భక్తుడవ్వడంతో; శ్రీవేంకటేశ్వరుని ముఖారవిందంలో కూడా స్వామివారి త్రేతాయుగ అవతారమైన శ్రీరామచంద్రుణ్ణే దర్శించుకునే వాడు. 'కౌసల్యా సుప్రజా రామా' అంటూ స్వామి వారిని శ్రీరాముని వలెనే కీర్తించే వారు.

ఆలయ బహిష్కరణ

ఆశ్రమం ఆలయానికి అతి సమీపంలో ఉండటంతో, బావాజీ ప్రతి దినము పెక్కుమార్లు శ్రీవారిని దర్శించుకునే వారు. ఆలయానికి వచ్చినప్పుడల్లా శ్రీనివాసుణ్ణి తదేకంగా చూస్తూ, శ్రీరాముణ్ణి తలపుకు తెచ్చుకుంటూ, తన్మయత్వంతో చాలాసేపు నిలుచుండి పోయేవారు. స్థానికంగా మాట్లాడే తెలుగు, తమిళ భాషలు ఏమాత్రం తెలియని ఒక ఉత్తరదేశపు వ్యక్తి తిరుమల క్షేత్రంలో స్థిరనివాసం ఏర్పరచుకొని; తరచూ ఆలయం లోనికి ప్రవేశించడం, వచ్చినప్పుడల్లా చాలాసేపు స్వామివారిని తదేకంగా చూస్తుండడంతో ఆలయ ఉద్యోగులు ఆయనను అనుమానించ సాగారు. ఆ విషయాన్ని వారు ఆలయ యాజమాన్యం దృష్టికి తీసుకొని రాగా, మరునాడు హథీరాం బాబాకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరించబడింది. భక్తిపారవశ్యం తప్ప మరే విషయము తెలియని హాథీరాం బాబా, తనను తన రాముడి నుండి వేరు చేయవద్దని, దర్శనానికి అనుమతించమని పదేపదే వేడుకున్నాడు. అయితే, 'పరదేశి' అయిన బావాజీ విన్నపం అరణ్యరోదన గానే మిగిలిపోయింది. స్వామివారితో విరహం ఏమాత్రం భరించలేని హథీరాం బాబా చింతాక్రాంతుడై తన ఆశ్రమానికి తిరిగి చేరుకున్నాడు. నిద్రాహారాలు మాని తన ఇష్టదైవమైన శ్రీరామునికి తన గోడును విన్నవించుకున్నాడు. తాను చిన్నతనం నుంచి శ్రీరాముడికి పరమ భక్తుడనని, నిత్యము స్వామివారిని దర్శించుకోకుండా తాను ఉండలేనన్న విషయం తెలిసి కూడా తనను నీనుండి ఎందుకలా దూరం చేస్తున్నావని, సత్వరమే నిన్ను దర్శించుకోలేని పక్షంలో తనకు ప్రాణత్యాగం తప్ప మార్గాంతరం లేదని స్వామివారితో చనువుగా నిష్ఠూరమాడు. రోజంతా ఉపవాసదీక్షలో నుండి, స్వామివారితో తన వేదనను పంచుకున్న బావాజీ మరునాటి ఉదయం యథావిధిగా స్నాన సంధ్యావందనాదికాలు ముగించుకుని, స్వామివారి దర్శనార్థం ఆలయద్వారం వద్దకు మరలా చేరుకున్నాడు. అప్పుడు కూడా నిరాశే ఎదురైంది. ఆలయ కాపలాదార్లు అధికారుల ఆదేశాల మేరకు బావాజీని నిర్దాక్షిణ్యంగా గెంటి వేశారు. తీవ్రమైన నిరాశతో వెనుదిరిగి మఠానికి వచ్చిన బావాజీకి ఏం చేయాలో తోచలేదు.

స్వామివారితో పాచికలాట

పరిపరి విధాలుగా ఆలోచించి, స్వామివారిపై ధ్యాసను మరల్చుకోలేని బావాజీ, తన ఆశ్రమాన్నే ఆలయంగా ఊహించుకుని, మనసులోనే స్వామివారిని ఆవాహన చేసుకొని, స్వామివారితో పాచిక లాడుతున్నట్లుగా ఊహించుకో

సాగాడు. పాచికలాడే పటాన్ని నేలపై పరచి, తన తరఫున, స్వామివారి తరఫున తానే స్వయంగా పాచికలు వేయడం ప్రారంభించాడు. చాలాసేపు ఆ విధంగా పాచికలాడిన తరువాత, రాత్రిసమయ మవ్వడంతో నిద్రకు ఉపక్రమించాడు. స్వామివారి ఎడబాటుతో విలపిస్తున్న బావాజీకి, అలా పాచికలాడటం ఎంతో ఉపశమ నాన్నిచ్చింది. స్వామివారితో చాలాసేపు పాచికలాడి, తృప్తితో నిదురించిన బావాజీ గాఢనిద్రలో ఉన్నప్పుడు వారికి, మంద్రస్వరంలో శ్రీరామచంద్రుని తీయని పిలుపు వినిపించింది. హఠాత్తుగా నిద్ర లేచిన బావాజీకి తన ఇష్టదైవమైన శ్రీరామచంద్రుడి ముగ్ధ మనోహర రూపం సాక్షాత్కరించింది. బావాజీ ఒక్కక్షణం పాటు దానిని స్వప్నంగా భ్రమించాడు. మహిమ గల సిద్ధులకు, మునిపుంగవులకు సైతం సాధ్యంకాని శ్రీరాముని నిజరూపదర్శనం తనబోటి సాధారణ భక్తునికెలా సాధ్యం? ఇది తప్పనిసరిగా కలయే! స్వామి స్వప్నంలోనికి వచ్చి తనతో పరిహాస మాడుతున్నాడు! ఇలా పరి పరి విధాలుగా ఆలోచిస్తూ ఉద్విగ్న మనస్కుడై, చేష్టలుడిగిన బావాజీ ఆంతరంగాన్ని పసిగట్టిన శ్రీరామచంద్రుడు అతనిని సంబోధిస్తూ, అది కల కాదని, తన ఇష్టసఖుడైన బావాజీతో పాచికలాడ డానికి వైకుంఠం నుంచి దిగి వచ్చానని సర్దిచెప్పి పాచికలాట ప్రారంభించాడు.

భగవంతుని ఐచ్ఛిక ఓటమి

భక్తులచేతిలో పరాజయం పొందటాన్ని అమితంగా ఇష్టపడే శ్రీవారు, పాచికలాటలో స్వచ్ఛందంగా పరాజితు లయ్యారు. తాను ఓటమిపాలై, బావాజీ విజేతగా నిలచినందున ఏదైనా వరాన్ని కోరుకొమ్మని పలికారు. సంతోషాంతరంగుడైన బావాజీ శ్రీరామచంద్రుని దర్శనభాగ్యంతో తన చిరకాల వాంఛ యీడేరి జన్మ ధన్యమైందని, అంతకుమించిన సంపద మరేమీ లేదని, శ్రీరాముని పాదాల చెంత కొంచెం చోటిమ్మని, ఇకమీదట తనను దూరం చేయవద్దని విన్నవించుకున్నాడు. బావాజీ నిస్వార్థ భక్తికి ముగ్ధుడైన శ్రీరామచంద్రుడు బావాజీకి తగిన అభయం ఇవ్వడమే కాకుండా, ప్రతిరోజు రాత్రి బావాజీతో పాచికలాడే నిమిత్తం ఆశ్రమానికి విచ్చేస్తానని శెలవిచ్చి అంతర్ధాన మయ్యాడు. బాబాజీ ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. మరునాటి ఉదయం శ్రీవారి దర్శనం నిమిత్తం ఆలయానికి విచ్చేసిన బావాజీకి పరమాశ్చర్యకరంగా, ఏ విధమైన అడ్డంకులు ఎదురు కాలేదు. చాలాసేపు శ్రీవారిని తనివితీరా దర్శించుకుని, తిరిగి ఆశ్రమానికి వచ్చి, సూర్యాస్తమయం కోసం ఆతృతగా ఎదురు చూడసాగాడు. 'ఎప్పుడెప్పుడు శ్రీవారితో పాచికలాడదామా' అని ఒక ప్రక్కన బావాజీ; ప్రియభక్తునితో భేటీ కోసం మరో ప్రక్కన శ్రీరామచంద్రుడు ఇరువురూ ఉవ్విళ్ళూరుతున్నారు. ఆనాటి రాత్రి పవళింపుసేవ అనంతరం ఆలయద్వారాలు మూయగానే, శ్రీవేంకటేశ్వరుడు శ్రీరామచంద్రుని రూపంలో బావాజీ ఆశ్రమాని కేతెంచి, అతనితో పాచికలాడి, తన భక్తుని సాన్నిహిత్యంలో మురిసిపోయి, బావాజీని కూడా పరమానంద భరితుణ్ణి గావించాడు. అలా చాన్నాళ్ళు రాత్రివేళల్లో పాచికలాడిన తరువాత, బావాజీ సేవాభావానికి పూర్తిగా సంతృప్తి చెందిన శ్రీవారు, బావాజీ భక్తితత్పరతను లోకానికి చాటిచెప్పాలని భావించారు. తక్షణం వారి మదిలో ఒక ఆసక్తికరమైన పథకం రూపుదిద్దుకుంది. ఆ పథకాన్ని ఆచరణలో పెట్టే ఉద్దేశ్యంతో వెంటనే స్వామివారు కార్యోన్ముఖులయ్యారు.

స్వామివారి పథకం ఏమిటో, దాన్ని వారు ఏ విధంగా ఆచరణలో పెట్టారో, దానితో బావాజీ పేరు ప్రఖ్యాతులు ఏ

విధంగా మార్మోగి పోయాయో తెలుసుకుందాం. పుట – 87 తేదీ – ఆగష్టు, 18

బాబాజీ భక్తి తత్పరతను, నిస్వార్థ సేవాభావాన్ని లోకానికి వెల్లడించే ప్రయత్నంలో శ్రీవారు ఒక మహత్తరమైన పథకానికి నాంది పలికారు.

మాయమైన వజ్రాలహారం

ఒకనాటి రాత్రి యథావిధిగా బావాజీ ఆశ్రమానికి వచ్చి, దాదాపు రాత్రి సమయమంతా బావాజీతో పాచికలాటలో వ్యస్తులై ఉన్న శ్రీవారు ప్రాతఃసంధ్య వేళలో సుప్రభాతపఠనం వినిపించడంతో, ఆటను మధ్యలోనే ఆపి హుటాహుటిగా ఆనందనిలయానికి బయలుదేరారు. బాబాజీ లాంటి భక్తులెందరికో దర్శనమిచ్చి వారందరినీ స్వామివారు కటాక్షించాలి కదా!

ఆ హడావిడిలో శ్రీవారు తన వజ్రాలహారాన్ని అక్కడే వదలి వెళ్లారు. స్వామివారు నిష్క్రమించిన తర్వాత, వారి వజ్రాలహారాన్ని గమనించిన బాబాజీ దాన్ని తీసి పూజామందిరంలో భద్రపరిచాడు. మరునాటి రాత్రి ఆటకై వచ్చినపుడు దాన్ని భద్రంగా శ్రీవారికి అందజేద్దామని బావాజీ ఆంతర్యం. ఇంతలో, సుప్రభాతానంతరం గర్భాలయం లోకి విచ్చేసిన అర్చకస్వాములకు, దర్శనార్థమై వచ్చిన అధికారులకు, భక్తులకు స్వామివారు వజ్రాలహారం లేకుండా దర్శనమివ్వడంతో అందరూ విస్తుపోయారు. స్వామివారి అమూల్యమైన హారం చోరీకి గురైందని భావించారు. ఆలయంలో అణువణువునా గాలించారు. చివరికి అర్చకస్వాముల ఇళ్ళలో కూడా సోదాలు జరిగాయి. ఎక్కడా హారం కానరాలేదు.

బావాజీపై నేరారోపణ

చివరికి ఆలయ అధికారుల దృష్టి బావాజీపై పడింది. ప్రతినిత్యం స్వామివారిని గంటల తరబడి తదేకదీక్షతో గమనిస్తూ ఉండడంతో బావాజీపై అనుమాన బీజం నాటుకుంది. కొద్దిసేపట్లోనే అనుమానం పెనుభూతంగా మారడంతో, రాజభటులు బావాజీ ఆశ్రమం లోకి బలవంతంగా ప్రవేశించి వెతుకులాట ప్రారంభించారు. ఈ విషయాలను ఏమాత్రం పట్టించుకోకుండా దైవచింతనలో మునిగివున్న బావాజీ అమాయకంగా ప్రశ్నించడంతో రాజభటులు శ్రీవారి అమూల్యమైన ఆభరణం తస్కరించ బడిందని, అధికారుల ఆనతి మేరకు తాము బావాజీ ఆశ్రమంలో గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేదో మామూలు విషయంగా భావించిన బాబాజీ రాత్రి సమయంలో శ్రీరామచంద్రుడు తన ఆశ్రమానికి విచ్చేసి, తనతో పాచికలాడి, సుప్రభాత సమయంలో హడావిడిగా లేచి వెళ్లారని; ఆ తొందరపాటులో వజ్రాలహారాన్ని అక్కడే మరచి పోయారని జరిగింది జరిగినట్లుగా విడమరచి చెప్పాడు.

బావాజీకి వింత శిక్ష

ఈ వృత్తాంతాన్నంతా విన్న రాజభటులకు, ఆలయ అధికారులకు బావాజీ చెప్పినదంతా నమ్మశక్యంగా గోచరించలేదు. ఆ హారాన్ని స్వాధీనపరచుకొని, బాబాజీని అప్పటి చంద్రగిరి పాలకుడైన 'గిరిధర రాయలు' వద్ద

హాజరు పరిచారు. రాజుగారికి కూడా బావాజీ అదే విషయాన్ని తిరిగి చెప్పాడు. ఇదంతా కట్టుకథగా భావించిన రాజుగారు బాబాజీని గృహనిర్బంధంలో ఉంచి, తదుపరి విచారణ జరుప వలసిందిగా ఆజ్ఞాపించాడు. అయితే, బావాజీ అదే విషయాన్ని పదే పదే నొక్కి చెప్పడంతో తన నిర్దోషిత్వాన్ని నిరూపించు కోవడానికి రాజుగారు ఒక అవకాశం ఇచ్చారు. బావాజీకి స్వామివారితో అంతటి చనువు ఉన్నట్లైతే, తన మహిమను ప్రత్యక్షంగా చూపించాలి. బాబాజీ నిర్దోషిత్వాన్ని నిరూపించు కోవడం కోసం రాజుగారు ఒక పరీక్ష పెట్టారు. దాని ప్రకారం, రాజుగారి ఆజ్ఞ మేరకు బాబాజీని స్వగృహం లో నిర్బంధించి, అందులోనే బండెడు చెరకు గడలను ఉంచారు. మరునాటి ఉదయం లోపు ఆ చెరుకుగడ లన్నింటినీ బాబాజీ తినగలిగితే, వారు చెప్పేది యధార్థమైనట్లు లెక్క! లేకుంటే బాబాజీ తన నేరాన్ని అంగీకరించి, రాజుగారు విధించే శిక్షను అనుభవించాలి. ఆ శిక్ష అత్యంత కఠినంగా ఉండొచ్చు. ఆరోపణ 'దైవద్రోహానికి' సంబంధించిన దవ్వడం వల్ల, మరణశిక్ష కూడా పడే అవకాశం ఉంది. ఆ విధమైన షరతు విధించి, ఆశ్రమం తలుపులను మూసివేసి, కొద్దిమంది భటులతో కట్టుదిట్టమైన కాపలా ఉంచి, మిగిలిన వారందరూ నిష్క్రమించారు.

గండం గట్టెక్కించిన గజరాజు

బావాజీకి ఏం చేయాలో పాలుపోలేదు. చెయ్యని నేరానికి తనకెందుకీ శిక్ష? ఎందుకీ అగ్నిపరీక్ష? ఒక్క రాత్రిలో ఆ చెరకుగడల రాశిని భుజించటం మానవమాత్రుడికి సాధ్యమయ్యే పని కాదు. ఆ పని చేయాలంటే కేవలం ఏనుగు వల్లనే సాధ్యం!

ఆ విధంగా ఆలోచించిన బావాజీ, భగవంతునిపై భారం వేసి, స్వామివారిని స్మరించుకుంటూ నిశ్చింతగా ఆ రాత్రి గడపసాగాడు. ఆ స్వామివారే తనను ఎలాగైనా రక్షించుకుంటారని అతని ప్రగాఢ విశ్వాసం.

కొద్దిసేపట్లో, బావాజీ భగవన్నామ స్మరణలో ఉండగా ఓ మహాద్భుతం జరిగింది. నిశిరాత్రి వేళలో శ్వేతవర్ణంలో ఉన్న, ఐరావతం వంటి మత్తగజం, శరీరమంతా చందన లేపనంతో, నుదుటన తిరునామాలు ధరించి, తలుపులు మూసి ఉన్న గృహంలో ప్రత్యక్షమైంది. బావాజీ ఉద్విగ్నుడై చూస్తూ ఉండగా ఆ మత్తగజం గృహం లోని చెరుకుగడ లన్నింటిని తన తొండంతో తీసుకొని, తృప్తిగా ఆరగించి, సారం లేని చెరకుపిప్పిని గుట్టగా పోసింది.

రాజుగారి పశ్చాత్తాపం

మదపుటేనుగు ఘీంకారానికి మెలకువ వచ్చిన రాజభటులు ఏనుగు చెరకుగడలను భుజించటం చూసి విస్తుపోయారు. మూసిన గృహద్వారాలు మూసినట్లే ఉండటంతో, నమ్మశక్యం కాని ఈ వింతను రాజు గారికి వివరించారు. ప్రత్యక్షసాక్షుల ద్వారా ఈ కథనాన్ని వినడంతో జ్ఞానోదయమైన రాజుగారు బాబాజీ చెప్పిన శ్రీవారి పాచికలాట ఉదంతాన్ని విశ్వసించి, అతణ్ణి శ్రీవారి పరమభక్తుడిగా గుర్తించి, బావాజీకి అనుచరుడిగా మారిపోయాడు. అంతటితో, 'గిరిధర రాయలు', 'గిరిధర దాసు' గా మారి, బావాజీకి ప్రథమ శిష్యుడయ్యాడు. బావాజీ ఆశ్రమానికి లెక్కలేనన్ని కానుకలనిచ్చి తన భక్తిని చాటుకున్నాడు. అప్పటి నుండి ఆశారామ్ బల్జోత్ 'హాథీరాం బాబా' గా వినుతికెక్కారు.

'హాథీ' అనగా ఏనుగు. ఆయన రామభక్తికి గుర్తుగా 'రాం' అనే పదం, ఉత్తరభారతదేశం లో సాధుపురుషులను సంబోధించే 'బాబా' లేదా 'బావా' అనే పదం వెరసి 'హాథీరామ్ బాబాజీ' గా అవతరించారు.

ఈ ఉదంతంతో బావాజీ భక్తి ప్రపత్తులు లోకప్రసిద్ధమై, వారిని దర్శించుకోవడానికి భక్తులు ఎగబడేవారు. ఉత్తరాది నుండి కూడా భక్తులు వెల్లువెత్తడం మొదలైంది. శ్రీవారి దర్శనానంతరం తప్పనిసరిగా బావాజీ ఆశ్రమానికి వచ్చి, వారిని కూడా భక్తిశ్రద్ధలతో నమస్కరించుకుని, కానుకలు సమర్పించుకునే వారు. అలా భక్తుల విరాళాలతో, రాజుగారి ప్రాపకంతో బాబాజీ ఎన్నో ధార్మిక కార్యక్రమాలు చేపట్టేవారు. దేవాలయానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం అనేక దానధర్మాలు నిర్వహించేవారు. బ్రహ్మోత్సవాల వంటి సందర్భాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు గావించేవారు. ఆ విధంగా భక్తుల విరాళాలతో, రాజుగారి అండదండలతో; అనతికాలంలోనే బాబాజీ నివాసముంటున్న చిన్న ఆశ్రమం ఈనాడు మనం చూస్తున్న పెద్దమఠం గా రూపు దిద్దుకుంది. ఎందరెందరో భక్తులు గృహస్తాశ్రమాన్ని త్యజించి, బావాజీ అనుచరులుగా, శిష్యులుగా మారారు. వారికి ప్రతిరాత్రి, బావాజి ఎవరితోనో సంభాషిస్తున్నట్లు, పాచికలు వేసిన సవ్వడి వినిపించేవి.

తరువాతి కాలంలో బాబాజీ, తదనంతరం వారి అనుచరులు 'మహంతుమఠం' పేరిట ఒక ధార్మికసంస్థను ఏర్పరచి, దాని ద్వారా ఆలయాన్ని అనేక రకాలుగా అభివృద్ధి చేశారు. ఈ ఆశ్రమంలో నిరాశ్రయులకు, సాధువులు సన్యాసులకు, బైరాగులకు నిత్యాన్నదానం జరిగేది. 'మహంతు' అనే ఉత్తరభారత పదానికి 'సాధువు' లేదా 'సన్యాసి' అని అర్థం. కొందరి కథనం ప్రకారం, బావాజీ వల్లనే శ్రీవేంకటేశ్వరునికి 'బాలాజీ' అనే నామాంతరం వచ్చింది. అయితే, ఈ విషయం ధృవీకరించటానికి బలమైన ఆధారాలు లేవు. దేవాలయంలో పలు ఉత్తరభారత దేశ సాంప్రదాయాలకు మహంతుల కాలం లోనే శ్రీకారం చుట్టబడింది.

బాబాజీ జ్ఞాపకాలు

బాబాజీ జీవితచరిత్రతో ముడివడియున్న అనేక జ్ఞాపకాలను నేడు కూడా తిరుమలక్షేత్రంలో దర్శించుకోవచ్చు. వాటిలో ముఖ్యమైన వాటిని గురించి ఇప్పుడు చెప్పుకుందాం.

హాథీరామ్ బాబా మఠం

అలయ మహాద్వారానికి ఎదురుగా నిలబడితే, మనకు ఎడం ప్రక్కగా పాత సహస్రదీపార్చన మంటపం పైభాగంలో, స్వామివారితో పాచికలాడుతున్న హాథీరామ్ బాబా కుడ్యశిల్పం నయన మనోహరంగా దర్శనమిస్తుంది. సరిగ్గా, దానికి వెనుకభాగంలోనే, ఎత్తైన గుట్టపై హాథీరామ్ బాబా మఠం ఉంది. దక్షిణమాడవీధి లో, తిరుమలనంబి ఆలయం దాటిన తరువాత, 'సుపథం' ప్రక్కన ఉన్న సన్నటిమార్గం ద్వారా వెళ్ళి, కొన్ని మెట్లెక్కి ఈ మఠాన్ని చేరుకోవచ్చు. ఆ ప్రదేశం లోనే బాబాజీ ఒకప్పుడు నివసించేవారు. బావాజీ ఒక రాత్రి నిర్బంధించబడింది కూడా ఆ ప్రదేశం లోనే!

కొన్ని వందల ఏళ్ళక్రితం, శేషాచల అరణ్యాలలో విరివిగా లభ్యమయ్యే ఎర్రచందనం స్తంభాలతో, వివిధ కళాకృతులు

అత్యంత మనోహరంగా చెక్కబడిన తలుపులు ద్వారబంధాలతో, పటిష్ఠమైన పైకప్పుతో రాచఠీవి ఉట్టిపడేలా నిర్మించబడ్డ ఈ మఠం నేటికీ చెక్కుచెదరకుండా, తిరుమల యాత్రికులను ఆకట్టుకుంటోంది. దీనికి అనుబంధంగా తరువాతి కాలంలో నిర్మించబడ్డ కట్టడాలు యాత్రికులకు వసతిగృహంలా ఉపయోగ పడుతున్నాయి. ముందస్తుగా ఆరక్షణ (రిజర్వేషన్) చేసుకొని, ఇందులో గదులు పొందవచ్చు. అయితే, దేవాలయానికి అతి దగ్గరగా ఉండటం, సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుడు నడయాడిన ప్రాంతం కావటం వంటి కారణాలవల్ల, ఇందులో వసతి లభించటం కొంచెం కష్టంతో కూడుకున్నది.

ఈ అవరణలోనే, కొత్వాల్ ఆంజనేయస్వామి దేవాలయాన్ని మరియు గణపతి ఆలయాన్ని సందర్శించు కోవచ్చు.

మఠం లోపల ఉన్న కోదండరామాలయంలో చలువరాతితో హృద్యంగా చెక్కబడిన సీతారామలక్ష్మణుల ముగ్ధమనోహరమైన విగ్రహాలను కన్నులారా వీక్షించుకోవచ్చు. ఆ విగ్రహాల చెంతనే, దశావతార సాలగ్రామాలు కూడా తరతరాలుగా పూజలందు కొంటున్నాయి. ఒక్కొక్క సాలగ్రామం పై ఒక్కొక్క దశావతారపు చిహ్నం మత్స్యాకారము, తాబేటి డిప్ప, వరాహమూపురము, మొదలైనవి ప్రకృతిసిద్ధంగా ముద్రాంకితమై, చూపరులకు అచ్చెరువు గొల్పుతుంటుంది.

ఆ ఆలయానికి మూడు ప్రక్కలా ఊయలలో ఊగుతున్న చిన్నికృష్ణునికి, దశావతారాలకు ఉపాలయాలు ఉన్నాయి. ముద్దులకృష్ణుని వెండి ఊయలను మనం కూడా ఊపి, స్వయంగా వారికి పవళింపుసేవ చేసి తరించవచ్చు.

ఈ మఠంలో అన్నింటి కంటే ముఖ్యంగా చెప్పుకోదగ్గది హాథీరామ్ బాబాతో, శ్రీవేంకటేశ్వరుడు పాచికలాడిన ప్రదేశం. ఈ ప్రదేశంలో నిర్మించబడిన చిన్న మంటపంలో ఆనాడు పాచికలాడిన, పట్టువస్త్రపు పాచికలపటం మరియు అఖండజ్యోతి నేటికీ నిత్యపూజలందు కొంటున్నాయి. ఈ ప్రదేశం వద్ద, కొన్ని వందల సంవత్సరాలుగా ఎల్లవేళలా, విరామం లేకుండా, రామనామ జపం జరుప బడుతోంది. ఆశ్రమవాసుల కథనం ప్రకారం బావాజీ వారే ఈ రామనామ పారాయణానికి శ్రీకారం చుట్టారు. అప్పటినుండి అది నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఆ రామనామ సంకీర్తన మహాయజ్ఞంలో మనం కూడా కొంతసేపు శృతి కలిపి, బాబాజీ కృపకు పాత్రులు కావచ్చు.

బాబాజీ, వారి శిష్యులైన మహంతులు అసీనులై ఉండే గద్దె కూడా ఈ మఠంలో సంరక్షించబడింది. మఠం ప్రాంగణంలో మఠాధిపత్యం వహించిన మహంతుల సమాధులను కూడా పరిరక్షించారు. మఠం యొక్క ప్రహరీగోడకు గల గవాక్షం గుండా దేవాలయ ఉపరితల భాగాన్ని, గోపురాలను కన్నులపండువగా కాంచవచ్చు. ఇప్పటి ప్రధాన మహంతు, మహంతుమఠానికి చెందిన మరికొందరు సభ్యులు ఈ మఠంలోనే నివాసముంటారు. దాదాపు రెండున్నర ఎకరాల సువిశాల ప్రదేశంలో నిర్మితమైన హాథీరామ్ బాబా మఠం, తిరుమల యందు తప్పనిసరిగా దర్శించి తీరవలసిన విశేషాల్లో ఒకటి.

దాదాపుగా ఇలాంటిదే మరొక మహంతు మఠం తిరుపతి పట్టణాన, గోవిందరాజస్వామి ఆలయానికి సమీపంలో ఉంది. ప్రస్తుతం అది మహంతుకు మరొక ఆవాసంగానూ; తిరుపతిని దర్శించుకొనే సాధవులకు, సన్యాసులకు, బైరాగులకు విడిదిగానూ ఉపయోగ పడుతోంది.

తిరుమలక్షేత్రంలో బాబాజీ జీవితంతో ముడివడిన మరికొన్ని విశేషాలను, మహంతుల పరిపాలనాకాలంలో తిరుమలక్షేత్రం తీరుతెన్నులను ఇప్పుడు తెలుసుకుందాం. పుట – 88 తేదీ – ఆగష్టు, 19

కుడ్యశిల్పం

హాథీరామ్ జీవన గమనానికి సంబంధించి తిరుమలలో దర్శించుకో దగ్గ మరో ముఖ్య విశేషం ఈ కుడ్యశిల్పం. సంపంగిప్రదక్షిణ మార్గంలో, ధ్వజస్తంభానికి ఎదురుగా, 'నడిమిపడి కావలి' లేదా 'వెండివాకిలి' ప్రవేశ మార్గంలో, దక్షిణం వైపున ఉన్న కుడ్యంపై; భక్తిపారవశ్యంలో మైమరచి ఉన్న హాథీరామ్ బాబాజీ, శ్రీవేంకటేశ్వరునితో పాచికలాడుతుండగా, అప్పటి చంద్రగిరి రాజైన గిరిధరదాసు వారి సమీపంలో నిలబడి ఆ వినోదక్రీడను ఆసక్తిగా తిలకిస్తున్నట్టున్న ఘట్టం జీవకళ ఉట్టిపడేట్లు చెక్కబడి ఉంది. ఈ శిల్పాన్ని రాజుగారే ప్రతిష్ఠించి ఉండవచ్చని చరిత్రకారుల అభిప్రాయం. దీనికి వెండి తాపడం గావించి, అద్దాల అరలో భద్రపరిచారు. వెండి వాకిలి లోనికి ప్రవేశిస్తున్నప్పుడు ఈ శిల్పాన్ని మనకు ఎడమప్రక్కగా, అతి సమీపంలో నుండి దర్శించుకోవచ్చు. ఈసారి స్వామివారి దర్శనానికి వచ్చినప్పుడు తప్పనిసరిగా ఈ విగ్రహానికి నమస్కరించు కుందాం!

హాథీరాం బావాజీ సజీవ సమాధి

బాబాజీకి సంబంధించిన మరో ముఖ్యవిశేషం వారి 'జీవసమాధి'. సుదీర్ఘకాలంపాటు శ్రీవారిని సేవించి తరించిన బాబాజీ తన అవసాన దశలో, ఆలయానికి ఉత్తరదిశగా మూడు మైళ్ల దూరంలో ఒక ఆశ్రమాన్ని నిర్మించుకున్నారు. గోగర్భం ఆనకట్ట దాటిన తరువాత, ఆకాశగంగ తీర్థానికి ముందుగా, రహదారికి దాదాపు పావు మైలు దూరంలో ఈ ఆశ్రమం ఉంది. బాబాజీ ఈ ఆశ్రమంలో ఏకాంతంగా ఉంటూ, తపోదీక్షలో శేషజీవితాన్ని గడుపుతూ ఉండేవారు. రోజుల తరబడి నిరాహార దీక్షలో ఉండే బాబాజీ అప్పుడప్పుడు ఆశ్రమానికి సమీపంలో ఉన్న 'రామపత్రవృక్షం' యొక్క ఆకులను మాత్రం భుజించి ప్రాణాలు నిలుపుకునేవారు. తీయని రుచి గల ఆకులతో ఉండే ఈ వృక్షాన్ని, ఆ ఆశ్రమ ప్రాంతంలో నేడు కూడా చూడవచ్చు. సమాధిని దర్శించుకోవడం కోసం వచ్చే భక్తులకు ఈ పత్రాలను ప్రసాదంగా ఇచ్చే సాంప్రదాయం నేటికీ కొనసాగుతోంది.

బాబాజీ ఆశ్రమానికి అతి సమీపంలోనే శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించి, అందులో నిత్యపూజలు నిర్వహించేవారు. అలా త్రేతాయుగపు శ్రీరామచంద్రుణ్ణి సేవించడంతో మొదలైన బాబాజీ ప్రస్థానం, శ్రీమహావిష్ణువు కలియుగ అవతారమైన శ్రీవేంకటేశ్వరుణ్ణి కొలుచుకుంటూ, అంత్యదశలో, ద్వాపరయుగపు అవతారమైన శ్రీకృష్ణుని చరణాల చెంత ముగిసింది. బాబాజీ అక్కడే ఒక అఖండజ్యోతిని వెలిగించి, ప్రతి నిత్యము తన తపస్సును ప్రారంభించేవారు. వయోభారం మీదపడటంతో జనసంచారానికి దూరంగా ఉన్న ఆ ఆశ్రమంలో మౌనంగా శ్రీనివాసుణ్ణి స్మరించుకుంటూ కొన్ని సంవత్సరాలు గడిపిన బాబాజీ అదే ప్రదేశంలో సజీవసమాధి అయ్యారు. ప్రస్తుతం ఆ సమాధి మహంతుల సంరక్షణలో ఉంది. వేణుగోపాల స్వామి ఆలయాన్ని ఈ మధ్యనే ఆధునీకరించారు. ఉత్తర భారతదేశస్తులు, ముఖ్యంగా లంబాడి గిరిజన తెగకు చెందిన భక్తులు, ఈ సమాధిని అధికంగా దర్శించుకుంటారు.

ప్రతి ఏడాది బాబాజీ సజీవసమాధి లోకి ప్రవేశించిన రోజును పురస్కరించుకుని నరక చతుర్దశి నాడు 'హాథీరామ్ బావాజీ సమాధి వార్షికోత్సవం' అత్యంత వైభవంగా జరుగుతుంది.

మహంతుల నిర్వహణలో తిరుమల ఆలయం

ఈ విషయాన్ని చెప్పుకునే ముందు, ఆలయ అజమాయిషీ *ఈస్ట్ ఇండియా కంపెనీ* వారి నుండి మహంతుల చేతిలోకి మారడం వెనుకనున్న చారిత్రక నేపథ్యాన్ని కొద్దిగా తెలుసుకోవాలి. విజయనగర రాజుల తరువాత, మారుతున్న రాజకీయ పరిణామాలకనుగుణంగా ఆలయ నిర్వహణ క్రమంగా ఆర్కాట్ నవాబుల చేతికి, తరువాత మరాఠా పాలకుల చేతికి మారింది. కాలక్రమేణా 19వ శతాబ్దపు ప్రథమార్థంలో, తిరుపతి–తిరుమలలో ఉండే ఆలయాలన్నీ, తిరుమలలోని ప్రధాన ఆలయంతో సహా *ఈస్టిండియా కంపెనీ* పరిపాలన పరిధిలోకి వచ్చాయి.

తెల్లదొరల పరిపాలనలో తిరుమల

దాదాపు అర్థశతాబ్దం పాటు ఆలయనిర్వహణ బాధ్యతను నిర్వహించిన తెల్లదొరలు, వైదిక కార్యక్రమాల కంటే ఆర్థిక వ్యవహారాలకే ప్రాముఖ్యత నిచ్చారు. తిరుమల ఆలయం హైందవమతానికి ఆటపట్టు అన్న విషయాన్ని ఉద్దేశ్యపూర్వకంగా విస్మరించి, ఈ ఆలయాన్ని ఆదాయవనరుగా భావించేవారు. ఒక పద్ధతి ప్రకారం హిందూమతాన్ని నిర్వీర్యం చేసే కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. అంతకుముందు భక్తులకు ఉచితంగా అందించే సేవలకు రుసుము వసూలు చేయడం ప్రారంభించారు. సరుకుల విషయంలో రాజీ పడడం వల్ల, ప్రసాదాల తయారీలో నాణ్యత లోపించింది.

అయితే, ఈస్టిండియా కంపెనీ వారి హయాంలో అనేక లోటుపాట్లు ప్రస్ఫుటంగా కాన వచ్చినప్పటికీ, వారివల్ల ఆలయానికి, అయాచితంగా నైనా కొంత మేలు కూడా జరిగింది.

ఉదాహరణకు హిందువుల మనోభావాలను గౌరవించిన ఒకరిద్దరు బ్రిటిష్ ఉన్నతాధికారుల చొరవతో, సప్తగిరుల పైకి అన్యమతస్తుల రాకను నిషేధిస్తూ కఠినమైన చట్టాలు చేయబడ్డాయి. హిందూ మతస్తులు అందరికీ ఆ రోజుల్లో నిమ్న కులస్తులుగా భావించబడే వారితో సహా ఆలయం లోనికి ప్రవేశం కల్పించబడింది. ఇంతే కాకుండా ఆలయానికి సంబంధించిన అనేక వ్యవహారాలు, బ్రిటిష్ వారి హయాంలోనే గ్రంథస్తం చేయబడ్డాయి. అంతకు ముందు వరకూ శిలాఫలకాపై, రాగిరేకుల మీద, తాళపత్రాలలో, చేతివ్రాత ప్రతుల యందు ఉన్నట్టి ఆలయ నియమ నిబంధనలను మొట్టమొదటిసారిగా, అచ్చులో ముద్రించి, వాటికి శాశ్వతరూపం కల్పించి భావితరాల వారికి అందజేశారు. ఇందులో వారి స్వార్థం ఎంతో ఉన్నప్పటికీ, నిర్వహణ వ్యవహారాలు వ్రాతపూర్వకమైన ప్రామాణికతను సంతరించు కోవడం వల్ల దేవాలయానికి మాత్రం కొంతలో కొంత మేలే జరిగింది. ఈస్ట్ ఇండియా కంపెనీ వారి హయాంలో 19వ శతాబ్దపు తొలి దశకాల్లో ఆలయానికి సంబంధించి వెలువడిన ముద్రితగ్రంథాలలో ఈ ఐదింటినీ ముఖ్యమైనవిగా పరిగణిస్తారు.

సవాల్–జవాబ్ పట్టీ అనే పట్టికలో, తిరుమలలోనూ తిరుపతిలోనూ ఉన్నట్టి అనేక ముఖ్యమైన దేవాలయాల

సమాచారాన్ని ప్రశ్నోత్తరాల రూపంలో పొందుపరిచారు. శిలాశాసనాల రూపంలో అప్పటికి అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా ఈ పట్టిక రూపొందించ బడటం వల్ల, విలువైన చారిత్రక సమాచారం వెలుగు చూసింది. వివిధ ఆలయాలకు ఉన్న మాన్యాల విస్తీర్ణాన్ని, హద్దులను కూడా ఇందులోనే పొందుపరచారు.

కైంకర్య పట్టీ అనే గ్రంథంలో ఆనాడు దేవాలయంలో సేవలందించే వివిధవర్గాల వారి జీతభత్యాలను, వారి హక్కులను, విధులను, వారికి చెందవలసిన ఆలయ మర్యాదలను క్రోడీకరించారు. ఆనాటికి అమలులో ఉన్న సాంప్రదాయాలు, వివిధవర్గాల వారినుండి రాబట్టిన మౌఖిక సమాచార సంకలనమే ఈ గ్రంథం.

బ్రూస్ నిబంధనావళి అనే పుస్తకంలో ఆలయ నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను, స్పష్టంగా నిర్వచించారు. ఆలయవేళలు, ఉన్నతాధికారులకు గల అధికారాలు, ఆలయనిర్వహణలో కంపెనీకి గల పరిమితులు, ఆదాయం పై అజమాయిషీ మొదలగు వాటిని గ్రంథస్థం చేశారు. తిరుమలలో ఈమధ్యకాలం వరకు అమలులో ఉన్న మిరాశీ వ్యవస్థకు ఆలంబనం ఈ నియమావళిలో ఉన్న అంశాలే.

దిట్టం బుక్కు గా వ్యవహరించబడే మరో పట్టికలో వివిధ రకాలైన ప్రసాదాలలో ఉపయోగించే దినుసులు, వాటి నాణ్యత, పరిమాణాలను లిఖించారు. ఏఏ సందర్భాలలో ఏఏ ప్రసాదాలను ఎంత మొత్తంలో తయారు చేయాలో కూడా ఇందులో ఉదహరించబడింది.

పైమాయిషీ గా పిలువబడే మరో పట్టికలో ఆలయానికి సంబంధించిన వివిధ మంటపాలు, ఇతర కట్టడాలు, విగ్రహమూర్తులు మొదలగు వాటికి సంబంధించిన వివరాలను, వాటిని నిర్మించిన దాతలను గురించిన సమగ్రమైన సమాచారాన్ని అందజేశారు.

ఇప్పుడు ఆలయనిర్వహణ బాధ్యత ఈస్టిండియా కంపెనీ అధికారుల నుండి మహంతుల చేతిలోకి ఎందుకు, ఎలా వచ్చిందో పరిశీలిద్దాం.

పరాయి చెరనుండి ఆలయానికి విముక్తి

హిందూ దేవాలయాల, ధార్మిక సంస్థల, మరీ ముఖ్యంగా, కుల వర్గ ప్రాంతీయ బేధాల కతీతంగా హిందువులందరూ ఆరాధించే తిరుమల ఆలయ వ్యవహారాల్లో ఈస్ట్ ఇండియా కంపెనీ వారి జోక్యం మితిమీరడంతో; హిందూ సాంప్రదాయ వాదుల్లో తీవ్రమైన అసంతృప్తి ప్రబలింది. క్రమంగా వారి సహనం హద్దులు దాటి, బ్రిటీష్ ప్రభుత్వంపై వ్యతిరేకత నివురుగప్పిన నిప్పులా వేగంగా విస్తరించడంతో; ముందుచూపు కలిగిన, వివేకవంతులైన కొందరు బ్రిటిష్ అధికారులు కళ్ళు తెరిచారు. లండన్ లోనూ, కలకత్తా లోనూ ఉన్న ఈస్టిండియా కంపెనీ ఉన్నతాధికారులకు అనేక రహస్యనివేదికలు పంపారు. ఈ వ్యవహారాన్ని తెగే వరకు లాగవద్దని, తిరుమల ఆలయ వ్యవహారాలలో మితిమీరిన జోక్యం పనికిరాదని సందేశాలు ఇచ్చారు. ఇండియా లోని గవర్నర్ జనరల్ కు దాదాపుగా అన్ని హిందూ మరియు మహమ్మదీయ ధార్మిక సంస్థలకు సంబంధించి ఇలాంటి నివేదికలే అందాయి. వాటన్నింటిని సమీక్షించిన ఆంగ్లేయ పాలకవర్గం, భారతదేశంలోని అన్ని మతపరమైన సంస్థలలో క్రమంగా జోక్యం తగ్గించుకోవాలని తీర్మానించింది.

తదనుగుణంగా, అప్పుడు తిరుమల దేవాలయం యొక్క వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న నార్త్ ఆర్కాట్ జిల్లా కలెక్టరుకు ఆలయ నిర్వహణ విధుల నుండి తప్పుకొని; ఆ బాధ్యతను తగిన వ్యక్తులకు గానీ, వ్యవస్థకు గానీ అప్పగించ వలసిందిగా తాఖీదు అందింది.

ఎవరు సమర్థులు?

అయితే, అసలు సమస్య ఇప్పుడే మొదలైంది. ఆలయ వ్యవహారాలపై ఆధిపత్యం బ్రిటీష్ వారినుండి ఎవరికి సంక్రమించాలి? ఇంతటి గురుతరమైన బాధ్యతను అత్యంత సమర్థవంతంగా ఎవరు నిర్వహించగలరు? తిరుమలక్షేత్రం లోనే కాకుండా తిరుపతి పట్టణంలోనూ, దాదాపు చిత్తూరు జిల్లా మరియు పరిసర ప్రాంతమంతటా అప్పట్లోనే శ్రీవారికి లెక్కలేనన్ని మడులు, మాన్యాలు ఉన్నాయి. వాటన్నింటిని సంరక్షించడం ఎవరి వల్ల సాధ్యమవుతుంది? ఇటువంటి క్లిష్టమైన ప్రశ్నలకు సమాధానం అంత సులభంగా దొరకలేదు. దానికోసం పెద్ద కసరత్తే జరిగింది.

అప్పట్లో స్వామివారినే తమ సర్వస్వంగా భావించి, తమ జీవితాలను శ్రీవారిసేవకు అంకితం చేసిన వైష్ణవులలో అంకితభావానికి, సేవానిరతికి ఏమాత్రం కొరత లేదు. వారి నీతి–నిజాయితీలను, చిత్తశుద్ధిని ఏమాత్రం శంకించ నవసరం లేదు. అయితే, తంగళై, వడగళై అంటూ ఇరువర్గాలుగా చీలిపోయిన వైష్ణవులలో ఐకమత్యం లోపించి, పరస్పరం కలహించుకునే వారు. ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం శాయశక్తులా ప్రయత్నించే వారు. కాబట్టి వారికి అధికారం అప్పగిస్తే, పరస్పర స్పర్థల కారణంగా వారు ఆలయ పరిపాలనా భారాన్ని సజావుగా నిర్వహించ గలగటం సందేహాస్పదమే!

అలాగే, ఆలయంలో మరో బలమైన వర్గం అనూచానంగా స్వామివారిని సేవించుకుంటున్నట్టి వంశపారంపర్య అర్చకులు. ఎల్లవేళలా పూజా పునస్కారాలలో మునిగి ఉండే అర్చకులలో పాలనా పాటవం అంతగా లేదు. పైగా, వారికి పాలనపగ్గాలు అప్పజెబితే వైదిక కార్యకలాపాలకు అంతరాయమేర్పడి, భక్తులలో ఆలయం పట్ల నిర్లిప్తత కలిగితే కానుకల ద్వారా వచ్చే ఆదాయానికి గండి పడే అవకాశం ఉంది.

జియ్యంగార్లు కూడా వైదికవిధుల నిర్వహణ కైంకర్యాలకే పరిమితమయ్యేవారు కానీ, ఆర్థిక వ్యవహారాలలో ఏమాత్రం ఆసక్తి కనపరిచేవారు కాదు. పైగా ఇంతకు ముందే చెప్పుకున్నట్లుగా; వారిపాత్ర, పాలకవర్గానికి అర్చకగణాలకు మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరించేంత వరకే పరిమితం. వారికి ఇతరత్రా విధులు అప్పగిస్తే, జియ్యంగార్ల వ్యవస్థ యొక్క ముఖ్యోద్దేశం నెరవేరదు.

ఇలా ఆలయానికి సంబంధమున్న వారందరి సామర్థ్యాన్ని, వారివల్ల దేవాలయానికి కంపెనీ వారికి కలిగే లాభనష్టాలను బేరీజు వేసిన తర్వాత బ్రిటిష్ వారి దృష్టి మహంతులపై పడింది. కొన్ని సానుకూలమైన అంశాలు వారికి సహకరించాయి.

- వీరు సుదూర ప్రాంతానికి చెందిన ఉత్తరభారతీయులు. స్థానికంగా బలము, బలగము లేనివారు.

అలాంటివారికి అధికారం అప్పగిస్తే కంపెనీవారు పరోక్షంగా తమ పెత్తనాన్ని కొనసాగించవచ్చు.

- పైగా మఠానికి ప్రథమ మహంతు అయిన హాథీరామ్ బాబాజీ పట్ల ఆలయ అధికారులకు, అర్చకులకు, జియ్యంగార్లకు, భక్తులకు ఇలా ఆలయంతో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సంబంధం ఉన్న వారందరికీ బావాజీ పట్ల విశేషమైన గౌరవాభిమానాలు ఉన్నాయి. తదనంతర కాలంలో వారి శిష్యులు, అనుచరులు కూడా అదే రకమైన ఆదరాన్ని చూరగొన్నారు. కాబట్టి వారికి అధికారాన్ని అప్పగిస్తే, ఆలయం లోని ఇతరవర్గాల వారికి కూడా సమ్మతంగానే ఉంటుంది.
- అంతే గాకుండా మహంతు లందరూ సన్యాసాశ్రమం స్వీకరించిన వారే కాబట్టి, అధికారం వారసులకు సంక్రమించే అవకాశం లేదు.
- మహంతులకు అప్పటికే విస్తృతంగా ధార్మిక కార్యకలాపాలు చేపట్టగలిగినటువంటి పటిష్ఠమైన వ్యవస్థ, అన్ని హంగులతో కూడుకున్న సువిశాలమైన మఠం, ఆ మఠాన్ని ఎన్నో ఏళ్ళుగా సమర్థవంతంగా నిర్వహిస్తున్న అనుభవం సమర్థత ఉన్నాయి.

ఈ విషయాలన్నింటినీ అంతర్గతంగా చర్చించుకొన్న ఆంగ్లేయులు కొంత వారి స్వార్థాన్ని, మరికొంత ఆలయ బాగోగులను దృష్టిలో ఉంచుకొని; ఆలయ నిర్వహణ బాధ్యతను మహంతులకే అప్పజెప్పాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

రేపటి నాలుగవ మరియు ఆఖరి ప్రకరణంలో మహంతుల కాలంలో దేవాలయం నిర్వహణ తీరుతెన్నులను, వారు చేపట్టిన దేవాలయ అభివృద్ధి కార్యకలాపాలను గురించి తెలుసుకుందాం. **పుట – 89 తేదీ – ఆగష్టు, 20**

బ్రిటిష్ వారు ఆలయ నిర్వహణ బాధ్యతను మహంతులకు అప్పజెప్పాలని తీర్మానించుకున్న అనంతరం చకచకా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అధికారాల బదిలీ

ఆ ఉత్తర్వుల ననుసరించి, 1843వ సంవత్సరం జూలై నెలలో మహంతు మఠానికి ఆ సమయంలో నేతృత్వం వహిస్తున్న 'మహంతు సేవాదాస్' గారు 'విచారణకర్త' గా నియమింపబడ్డారు. విచారణకర్త అంటే దాదాపుగా ఈనాటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తో సమాన మన్నమాట. ఆలయ సక్రమ నిర్వహణకుకు, ఆర్థిక వ్యవహారాలకు ఆయనే జవాబుదారీ. ఈ విధంగా మహంతుమఠానికి విశేష అధికారాలు దఖలు పడ్డాయి. అదే నెల 16వ తేదీనాడు, దక్షిణాయన సంక్రాంతి పర్వదినాన అప్పటివరకు ఆలయ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఈస్టిండియా కంపెనీ వారి నుండి, ఆలయానికి సంబంధించిన సమస్త స్థిర చరాస్తుల ధర్మకర్తృత్వం మహంతు సేవాదాసుకు బదిలీ చేయబడింది. శ్రీవారి ఆభరణాలు, వాహనాలు, వెండి బంగారుపాత్రలు, ఇతర కైంకర్య సామాగ్రి, రొక్కం మొదలైనవన్నీ; పలువురి సమక్షంలో వ్రాతపూర్వకంగా మహంతుకు అప్పజెప్పడం జరిగింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని, ప్రతి సంవత్సరం జూలై 16వ తేదీన జరిగే ఆణివార ఆస్థానం అనే సంవత్సరోత్సవం గురించి ఇంతకు ముందే తెలుసుకున్నాం. ఈమధ్య కాలం వరకు ఆలయ ఆర్థిక సంవత్సరం ఆ దినం నుండే ప్రారంభమయ్యేది. అలా దేవాలయ పాలనా బాధ్యతలు చేపట్టిన, బాబాజీ శిష్యులైన, మహంతులు విష్వక్సేనముద్రను తమ అధికారిక ముద్రగా

ఎన్నుకొన్నారు. శ్రీవేంకటేశ్వరునికి సర్వసైన్యాధిపత్యం వహించే విష్వక్సేనుడు వారికి అన్ని రకాలుగా దన్నుగా ఉంటాడని వారి విశ్వాసం.

షరతులతో కూడిన బదిలీ

అయితే, యాజమాన్య మార్పిడి కొన్ని షరతులకు లోబడి జరిగింది. అప్పటి వరకు ఆలయం నందు అమలులో ఉన్న కైంకర్యాలలోనూ, వైఖానస ఆగమ పద్ధతుల్లోనూ ఏ విధమైన మార్పులు చేయరాదు. మనం ఇంతకు ముందు చెప్పకున్నట్టి, బ్రిటీష్ వారి హయాంలో రూపుదిద్దుకున్న అయిదు గ్రంథాలలో పేర్కొన్న విధివిధానాల ననుసరించే దేవాలయ నిర్వహణ అంతా జరగాలి. వంశపారంపర్య అర్చకులకు, మిరాశీదారులకు, ఆచార్యపురుషులకు, జియ్యంగార్లకు, అన్నమాచార్యులు మరియు తరిగొండ వెంగమాంబ వంశస్తులకు పరంపరాగతంగా లభించే ఆలయ మర్యాదల విషయంలో గాని, కానుకల విషయంలో గాని, ప్రసాదాల విషయంలో గాని, ఏ విధమైన లోటుపాట్లు జరగరాదు. అవన్నీ యథాతథంగా కొనసాగుతున్న వలసిందే!

మహంతుల ఆధ్వర్యం లోని తొలి దశకాల్లో నిధులకు విపరీతమైన కొరత ఉండేది. అయినప్పటికీ, మహంతుల అంకితభావం వల్ల ఉన్న అరకొర వనరులతోనే ఆలయ నిర్వహణ ఏ విధమైన ఒడిదుడుకులు లేకుండా, సజావుగా సాగిపోయేది.

ఆలయంలో అప్పటికే వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న హక్కుదారులు (అర్చకులు, ఆచార్యపురుషులు, జియ్యంగార్లు, మొదలగు వారు) అందరికీ, మహంతులకు ఏకపక్షంగా అధికారం దక్కటం అంతగా రుచించనప్పటికీ, వారిలో వారికి ఐకమత్యం లేకపోవడం వల్ల, కంపెనీ వారి నిర్ణయానికి ఎదురు చెప్పే ధైర్యం లేకపోవడం వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో మహంతుల ఆధిపత్యాన్ని అంగీకరించటమే కాకుండా, వారికి దేవాలయ నిర్వహణలో అన్ని రకాలుగా సహకరించారు కూడా!

మహంతుల కృషి

దేవాలయానికి మొట్టమొదటి విచారణకర్తగా 1843వ సంవత్సరంలో బాధ్యతలు చేపట్టిన సేవాదాస్ జీ స్వామిపుష్కరిణిని పునరుద్ధరించి, అందులో వైభవోపేతంగా స్వామివారి తెప్పోత్సవం నిర్వహించే సాంప్రదాయానికి నాంది పలికారు. వీరి హయాంలో మహంతువ్యవస్థ ఏ విధమైన ఆటుపోట్లకు గురికాకుండా, సజావుగా 21 సంవత్సరాల పాటు సాగిపోయింది.

వారి తదనంతరం,1864వ సంవత్సరంలో మహంతు ధర్మదాస్ జీ రెండవ విచారణకర్తగా నియమింపబడ్డారు. వీరు శేషాచల పర్వత పాదభాగంలో, తిరుపతి శివారులో ఉన్న కపిలతీర్థం పుష్కరిణికి, దాని చుట్టూ ఉన్న సంధ్యావందన మంటపాలకు; మహాద్వార గోపురానికి మరమ్మత్తులు గావించి, కొత్త సొగసులు తీర్చిదిద్దారు. వీరి హయాంలో కొన్ని మంటపాల నిర్మాణం కూడా జరిగింది.

వారి తరువాత భగవాన్ దాస్ జీ మూడవ విచారణకర్తగా బాధ్యతలు చేపట్టారు. వారి హయాం వివాదాలకు నెలవుగా మారింది. అప్పటివరకు అరకొర నిధులతో ఆలయ నిర్వహణను చేపట్టిన మహంతులు ఒక్కసారిగా ఆర్థిక వనరులను పెంపొందించు కోవడంపై దృష్టిపెట్టారు. సహజంగానే వైదిక కార్యక్రమాలు, ఇతర ధార్మిక కలాపాలపై శ్రద్ధ కొద్దిగా తగ్గింది. తత్ఫలితంగా అవసరానికంటే ఎక్కువ నిధులు సమకూరాయి. కొన్ని దశాబ్దాల పాటు ఆలయ నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడంతో మహంతు వ్యవస్థపట్ల భక్తులలో గౌరవాభిమానాలు ఇనుమడించాయి. దాంతో పాటుగా భక్తుల రద్దీ కూడా పెరగడంతో మహంతులు తమ విశేషాధికారాన్ని, ఆలయవర్గాలలో తమకున్న పలుకుబడిని ఉపయోగించి; ప్రముఖులకు శీఘ్రంగా దర్శనం కలిగించటం మొదలుపెట్టారు. రాను రానూ ఆలయం యొక్క సాధన సంపత్తులన్నింటికీ తాము తిరుగులేని పెత్తందార్లమన్న మితిమీరిన విశ్వాసం మహంతులలో నెలకొంది. నిధుల దుర్వినియోగం ఆరోపణలు కూడా వచ్చాయి. ఆలయనిధులను తన సొంతానికి మళ్లించుకున్న ఆరోపణపై అప్పటి న్యాయస్థానం మహంతుకు జరిమానా కూడా విధించింది. అంతే గాకుఃడా, వారు ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ జరిపే సమయంలో; పాత ధ్వజస్తంభం యొక్క పాదపీఠం క్రింద ఉన్న నిధులను అపహరించారన్న అపవాదును మూటగట్టుకున్నారు. వీరి హయాంలోనే, మహంతుల నివాసం ఇప్పుడు ప్రధానాలయానికి ఆగ్నేయమూలలో ఉన్న, హంగు ఆర్భాటాలతో యాదవ రాజులు కట్టించిన మహంతుమఠానికి మారింది. అప్పటివరకు వైరాగ్యజీవితాన్ని గడిపిన మహంతులకు భిన్నంగా తరువాతి వారు మహంతుమఠంలో సర్వసౌఖ్యాలు అనుభవించారు. సర్వసంగపరిత్యాగులకు సౌధాలెందుకన్న ప్రశ్న భక్తుల మదిలో మెదిలింది. అప్పటి మహంతుల అతిశయం ఎంతగా వెర్రితలలు వేసిందంటే తిరుమల యాత్రికులు ముందుగా మహంతును దర్శించుకుని, కట్నకానుకలు సమర్పించుకున్న తర్వాతనే స్వామివారిని దర్శించుకునే సాంప్రదాయానికి నాంది పలికారు. అప్పటివరకు ఏ విధమైన తరతమ భేదాలకు తావులేని ఆలయంలో జమీందారులకు, ధనికులకు, రాచకుటుంబీకులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. పరపతి గలవారికి త్వరితగతిన దర్శనాలు జరిగేవి. ఇవన్నీ ఒక ఎత్తయితే, అన్యమతస్తుల విషయంలో మహంతు అవలంబించిన వైఖరి మరో ఎత్తు. అప్పటికి దాదాపు వంద సంవత్సరాల క్రితమే, ఆంగ్లేయులు, తిరుమలక్షేత్రం మరియు మీదకి హైందవేతరుల రాకపోకలపై కఠినమైన ఆంక్షలు విధించారు. దానికి భిన్నంగా ప్రస్తుత మహంతులు, యూరోపియన్ అధికారుల ప్రాపకం సంపాదించుకోవడం కోసం వారికి కొండపై ప్రత్యేకంగా వసతి సౌకర్యాలు కల్పించారు. సాంప్రదాయానికి విరుద్ధంగా దేవాలయ నిధులను, భూముల పూచీకత్తుపై కొంతమంది జమీందార్లకు రుణంగా ఇచ్చారు. అనేక రకాలైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు గానీ వాటన్నింటిలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అపవాదును మూటగట్టుకున్నారు. కొన్ని మహమ్మదీయ సంస్థలకు విరాళాలిచ్చారు.

తరువాతి కాలంలో అధికారంలోకి వచ్చినా రామ్ కిషోర్ దాస్ జీ పై కూడా నిధుల దుర్వినియోగం ఆరోపణలు రావడంతో, న్యాయస్థానంలో విచారణ జరుగుతున్నప్పుడు ఆకస్మికంగా మరణించారు. ఈ విధంగా మహంతుల నిర్వాకంపై వివిధ న్యాయస్థానాల్లో లెక్కలేనన్ని కేసులు నమోదు కావడంతో; 1898వ సంవత్సరంలో ఉత్తర ఆర్కాట్ జిల్లా ప్రధాన న్యాయస్థానం అప్పటి మహంతును కక్షి దారులైన జియ్యంగార్లు, శ్రీవైష్ణవులు, తిరుమలలో వున్న ఇతర

మతాల వారిని పిలిచి; సయోధ్య కుదిర్చారు. దాని ప్రకారం, న్యాయస్థానం ఆలయనిధుల వినియోగాన్ని పర్యవేక్షించడానికి ఐదుగురు సభ్యులతో ఒక ధర్మాసనాన్ని నియమించింది. దానిపై మహంతులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తరువాతి కాలంలో ఆలయనిర్వహణపై మహంతులకున్న తిరుగులేని అధికారాలకు పరిమితులు విధిస్తూ న్యాయస్థానాలు అనేక తీర్పులిచ్చాయి. వాటన్నింటిపై మహంతులు ఎప్పటికప్పుడు పైకోర్టుల్లో పిటిషన్లు వేస్తూనే ఉన్నారు. చివరకు లండన్లోని అత్యున్నత న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. అయినప్పటికీ. మహంతులు తప్ప ఆలయంతో సంబంధం ఉన్న మిగిలిన వారందరూ ఒక వర్గంగా ఏర్పడటంవల్ల, మహంతులపై అధికార దుర్వినియోగం ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతుండడం వల్ల తరచూ వారికి న్యాయస్థానాల్లో ఎదురుదెబ్బలు తగులుతూ ఉండడమే గాకుండా, మహంతు వ్యవస్థ పట్ల తొలినాళ్ళలో భక్తులకున్న గౌరవాభిమానాలు క్రమంగా అంతరించి పోయాయి. ఆ విధంగా, 1900వ సంవత్సరం నాటికి మహంతుల ప్రభావం గణనీయంగా తగ్గింది.

ఆఖరి మహంతు కృషి శ్లాఘనీయం

అయితే, 1900వ సంవత్సరం నుండి 1933 వరకు – 33 ఏళ్ల పాటు – విచారణకర్తగా పనిచేసిన చిట్టచివరి విచారణకర్త 'ప్రయాగ్ దాస్ జీ' హయాంలో మహంతువ్యవస్థ రూపురేఖలు మారిపోయాయి. ఏ విధమైన ఆరోపణలకు తావులేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో వారి ప్రతిష్ఠ ఇనుమడించింది. వారి హయాంలోనే ఎంతోకాలం నుండి పరిశీలన దశలోనే ఉన్న అలిపిరి మెట్ల పునర్నిర్మాణం జరిగి, భక్తులకు ఎంతో వెసులుబాటు కలిగింది. జీర్ణదశలోనున్న గాలిగోపురం మరమ్మత్తు గావించబడింది. ఆనందనిలయ గోపురంపై బంగారుమలాం పూత పూయబడింది. రహదారుల విస్తరణ, యాత్రికులకు త్రాగునీరు ఏర్పాటు, ధర్మసత్రాల నిర్మాణం జరిగింది. పరిశుభ్రత విషయంలో కట్టుదిట్టమైన చర్యలు, విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి అనేక నిర్మాణాత్మక కార్యకలాపాలు చేపట్టబడ్డాయి. ఆలయంలో లభించిన అసంఖ్యాక శిలాశాసనాలపై సమగ్ర పరిశీలన జరిగి, విలువైన సమాచారం గ్రంథస్థం చేయబడింది. అన్నమాచార్య సంకీర్తనాభండారం వెలుగులోకి వచ్చి, దానిలో నుండి వెలువడ్డ రాగిరేకులలో లిఖించబడ్డ కీర్తనలను ప్రచురించే కార్యక్రమం అప్పుడే మొదలైంది. అనేక విద్యా, వైద్య సంస్థలకు వారి హయాంలోనే అంకురార్పణ జరిగింది. వేదపాఠశాల, ప్రాచ్యకళాశాల, ఆయుర్వేద కళాశాల ఆనాడు రూపుదిద్దుకున్న సంస్థలే! స్వామివారికి అనేక ఆభరణాలు కూడా తయారు చేయబడ్డాయి. ప్రయాగ్ దాస్ జీ 33 సంవత్సరాలు పాటు మహంతుగా బాధ్యతలు నిర్వహించిన తరువాత, అంతకు ముందెప్పటి నుండో కోర్టులలో ఉన్న కేసులన్నీ ఒక కొలిక్కి రావడంతో, 1933వ సంవత్సరంలో అప్పటి మద్రాస్ గవర్నర్, దేవస్థానానికి ఒక ధర్మకర్తల మండలిని నియమించి, ఆలయాన్ని వారి ఆధీనంలోకి తెచ్చారు.

ఈ విధంగా, 1843వ సంవత్సరంలో మొదలైన మహంతుల పాలన, అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ, 1933వ సంవత్సరం వరకు – అంటే 90 సంవత్సరాల పాటు – అవిచ్ఛిన్నంగా కొనసాగి, ఆలయచరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. వారి పాలనపై ఎన్ని వివాదాలు నెలకొన్నప్పటికీ, స్థూలంగా ఆలయం అభివృద్ధి

పథంలోనే పయనించింది. 1843వ సంవత్సరంలో కేవలం లక్ష రూపాయలు గా ఉన్న దేవాలయ వార్షిక ఆదాయం 1908వ సంవత్సరంలో సుమారు నాలుగు లక్షలకు పెరిగింది. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తమే! అంతకుముందు అంతంత మాత్రంగానే ఉన్న దేవాలయ ఆర్థిక పరిస్థితి, 1933వ సంవత్సరం నాటికి, బాగా వృద్ధి చెంది, మిగులుబాట పట్టింది. కొందరు మహంతులు స్వార్థబుద్ధితో వ్యవహరించారన్న అపవాదు ఉనప్పటికీ, మిగిలిన వారందరూ ఆలయ అభివృద్ధికి ఎంతో అంకితభావంతో కృషి చేశారు.

ప్రస్తుతం మహంతుల పాత్ర

ఒకప్పుడు తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయించిన మహంతు వ్యవస్థ, కాలగమనంలో అనేక ఒడిదుడుకులకు లోనై; ప్రస్తుతం నామావశేషంగా, లాంఛనప్రాయంగా మిగిలింది. ప్రతిరోజు సుప్రభాత సమయంలో మహంతు మఠం నుండి అప్పుడే పితికిన ఆవుపాలు, వెన్న, పచ్చకర్పూర తాంబూలం ఆనందనిలయానికి చేరుతాయి. ఆ తాంబూల సమర్పణతోనే నవనీతహారతి పూర్తవుతుంది. సుప్రభాతపఠనం తరువాత మహంతులకు తీర్థం, చందనం, శెఠారి వంటి ఆలయమర్యాదలు కూడా జరుగుతాయి. స్వామివారికి జరిగే ఉగాది, శ్రీరామనవమి, ఆణివార, దీపావళి ఆస్థానాలలో; బ్రహ్మోత్సవాలలో మహంతులకు ఆలయ లాంఛనాలతో అనేక మర్యాదలు జరుగుతాయి.

ప్రస్తుతం మహంతుమఠం యొక్క శాఖలు తిరుమల, తిరుపతి లోనే కాకుండా; తిరుచానూరు, వేలూరు, చిత్తూరు, తంజావూరు, మధుర, అయోధ్య, ముంబాయి, నాసిక్, పంచవటి, భాగాల్ కోట్ వంటి; సమీప, సుదూర ప్రాంతాలకు కూడా విస్తరించాయి. ఇవన్నీ ఇప్పటికీ తి.తి.దే. ఆధ్వర్యంలో నడుస్తూ, అనేక ధార్మిక కార్యకలాపాలు చేపడుతున్నాయి.
పుట – 90 తేదీ – ఆగష్టు, 21

----------: : ----------

సప్తగిరులు

ఏడు పడగలే ఏడుకొండలు

ఎన్నో యుగాల నుండి, వైకుంఠం లోని క్షీరాబ్ధిలో శయ్యగా, తల్పంగా, ఛత్రంగా, మరెన్నో రకాలుగా శ్రీమహావిష్ణువుకు సేవలందిస్తున్న ఆదిశేషుడు, శ్రీవేంకటేశ్వరుని రూపంలో వెలసిన విష్ణుమూర్తిని భూలోకంలో కూడా సేవించదలచి, తన ఏడుపడగలను ఏడుకొండలుగా అవతరింపజేసి, వాటిపై శ్రీనివాసుణ్ణి కొలువుంచుకొన్నాడని పురాణాల్లో చెప్పబడింది.

వందలకొద్దీ మైళ్ళ పొడవున్న శేషాచల పర్వతశ్రేణులలో తిరుమల ప్రాంతాన్ని ఆదిశేషువు శిరస్సు లేదా పడగలు గాను; అహోబిలం, మహానంది, త్రిపురాంతకం ప్రాంతాన్ని ఆదిశేషువు యొక్క నడుము భాగంగానూ: శ్రీశైలశిఖరాలను ఆదిశేషువుయొక్క తోకగాను భక్తులు భావిస్తుంటారు. శేషాచలసానువులన్నీ శ్రీవారికి నెలవులే! ఆ పర్వత ప్రాంతాలన్నింటినీ తరచూ పర్యటిస్తూనే ఉంటారు. పద్మావతీపరిణయ సందర్భంలో, పెండ్లిభోజనాల పంక్తులు శేషాచలశ్రేణుల్లో తిరుమలనుండి, అహోబిలం మీదుగా శ్రీశైలం వరకు విస్తరించి యున్నట్లు మనం ఇంతకుముందే తెలుసుకున్నాం.

కట్టెదుర వైకుంఠము కాణాచయినకొండ
తట్టెలాయ మహిమలే తిరుమల కొండ ॥
వేదములే శిలలై వెలసిన కొండ
యేదెస పుణ్యరాసులే యేరులైనదికొండ
గాదిలి బ్రహ్మది లోకముల కొనలకొండ
శ్రీ దేవుడుండేటి శేషాద్రి యీకొండ

అన్న కీర్తనలో అన్నమాచార్యుడు సప్తగిరుల పౌరాణిక ప్రాశస్త్యాన్ని, మహత్యాన్ని కళ్ళకు కట్టినట్లు ఇలా వర్ణించాడు – కళ్ళెదుటే కానవచ్చే కలియుగవైకుంఠం లాంటి తిరుమలకొండ మహా మహిమాన్వితమైనది. బ్రహ్మాది లోకాలతో సమమైన ఈ కొండపై చతుర్వేదములు బండశిలలు గాను, సమస్తదేవతల యొక్క పుణ్యరాశులు సెలయేళ్ళు గాను – అవతరించి ఉన్నాయి. ఈ శేషాద్రిపర్వతంపై దేవదేవుడు వెలసియున్నాడు. పూర్వపు యుగాలలో సైతం అంజనాద్రిగా పిలువబడే ఈ పొడవాటి కొండపై సర్వదేవతలు, గంధర్వులు మృగజాతుల, వృక్షాల రూపంలో అవతరించి యున్నారు. కోరిన వరాల నొసగే ఈ కొండ స్వర్ణకాంతులీనుతూ, సర్వసంపదలకు ఆలవాలమైన గుహలతో నిండి ఉండి, 'వెంకటాద్రి' నామంతో అలరారుతున్నది.

శ్రీవేంకటేశ్వర సుప్రభాతం లోనూ, శ్రీనివాస గద్యంలోనూ సప్తగిరుల ప్రస్తావన కానవస్తుంది. ఈ కొండలు – **శేషశైలము, గరుడాచలము, వెంకటాచలము, నారాయణాచలము, వృషభాచలము, వృషాచలము, అంజనాచలము**

– అనే లోక ప్రసిద్ధమైన నామాలతో ఒప్పారుతున్నాయి. 'అచలము' అనగా 'చలించనిది' లేదా 'పర్వతము' అని అర్థం. పర్వతానికి 'అద్రి' అనే మరో పేరు కూడా ఉండటం వల్ల, వీటిని 'శేషాద్రి', 'గరుడాద్రి' మొదలగు పేర్లతో కూడా పిలుస్తారు. పూర్వ యుగాలన్నింటి లోనూ కొద్దిపాటి మార్పులతో, సప్తగిరులన్నీ ఇవే పేర్లతో పిలువ బడుతుండేవి.

సప్తగిరులలో ప్రతి పర్వతానికి యుగయుగాల ప్రశస్తి, అయా యుగాలలో వినతికెక్కిన పుణ్యపురుషులతో విడదీయరాని అనుబంధం ఉన్నాయి. వివిధ పురాణాల్లో విస్తృతంగా వర్ణించబడ్డ ఆయా గిరిరాజాల వైశిష్ట్యాన్ని ఒక్కొటొక్కటిగా పరికిద్దాం.

వృషభాద్రి లేదా వృషభాచలం

ఒకానొకప్పుడు, వెయ్యి వృషభాల శారీరక దృఢత్వం కలిగిన 'వృషభుడు' అనే దైత్యుడు ఈ కొండపై నివసించేవాడు. శ్రీమహావిష్ణువుకు పరమభక్తుడైన ఆ అసురుడు తన ఇష్టదైవాన్ని కటాక్షింప జేసుకోవడం కోసం ఘోరమైన తపస్సు నాచరించాడు. ప్రతిదినము తుంబురతీర్థంలో స్నానమాడి, నిరాహారుడై, ఐదు వేల సంవత్సరాలు తపమాచరించడం వల్ల విష్ణువు కృపతో ఆ రాక్షసుడు మరింత శక్తివంతుడయ్యాడు. ఆ రాక్షసుడు శ్రీహరిని అర్చించే విధానం విలక్షణంగా, అద్వితీయంగా ఉండేది.

ప్రతి దినము తన శిరస్సును తన ఖడ్గచాలనంతో తానే స్వయంగా తెగనరకు కొని, ఆ శిరస్సును భగవంతునికి భక్తితో సమర్పించేవాడు. తదనంతరం తన తపఃశక్తితో, శ్రీహరి కటాక్షంతో; విగతజీవి అయిన తన మొండానికి తలను తిరిగి జత చేసేవాడు. అతని అచంచల భక్తికి, ప్రాణాధారమైన శిరస్సును సైతం తృణప్రాయంగా అర్పించ గలిగిన అతని చొరవకు ముగ్ధుడైన శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమై భక్తవాత్సల్యంతో, కావలసిన వరాన్ని కోరుకోమన్నాడు. ఇహలోక సంపదలు, జన్మరాహిత్యము, కైవల్యము ఇవేమీ కోరకుండా; తన సహజసిద్ధమైన దౌత్యప్రవృత్తితో, అహంభావంతో శ్రీమహావిష్ణువును తనతో ద్వంద్వయుద్ధం చేయవలసిందిగా వరం కోరాడు. తాను ఇచ్చిన వరానికి కట్టుబడిన శ్రీమహావిష్ణువు, రాక్షసుని కోర్కె తీర్చే నిమిత్తం అతనితో ఇరవయ్యేడేళ్ల పాటు సలిపిన యుద్ధంలో ఆ అసురుడు పరాజితు డవుతాడు. శ్రీహరి చేతిలో మరణం పొందటం కూడా తన సుకృతంగా భావించిన వృషభాసురుడు, తన చిట్టచివరి కోరికగా తాను 5000 సంవత్సరాలు తపమాచరించి, శ్రీమహావిష్ణువును ప్రత్యక్షం చేసుకొని, శ్రీహరితో యుద్ధం చేసిన సంగతి సమస్త లోకాలకు, భావితరాల వారికి తెలిసేటట్లుగా, వారిరువురు యుద్ధం చేసిన ఆ పర్వతరాజానికి తన పేరు వచ్చేటట్లుగా అనుగ్రహించమని శ్రీహరిని వేడుకున్నాడు. భక్తసులభుడైన శ్రీమహావిష్ణువు ఆ దైత్యభక్తుని కోరిక నెరవేర్చడంతో; అప్పటినుండి ఈ పర్వతం వృషభాద్రిగా పేరుగాంచింది. భవిష్యోత్తరపురాణాన్నుసరించి జనకవంశపు రాజపురోహితుడైన శతానందుడు, జనకమహారాజుకు అతని పరివారానికి వేంకటాచలమహత్యం వివరిస్తూ, వృషభాద్రి వృత్తాంతాన్ని పైవిధంగా విశదీకరించారు.

అంజనాచలం లేదా అంజనాద్రి

వాయుదేవుని అంశతో హనుమంతుణ్ణి పుత్రునిగా పొందిన అంజనాదేవి తపస్సు గావించిన ఈ పర్వతం అంజనాద్రిగా పేరుగాంచింది.

పూర్వజన్మ యందు అంజనాదేవి దేవలోకవాసి అయిన 'పుంజికస్థల' అనబడే ఒక గంధర్వకన్య. ఒకానొకప్పుడు తన చెలికత్తెలతో బాటుగా భూలోక విహారానికి వచ్చిన సందర్భంలో ఆమె, తాను గంధర్వకన్య ననే మిడిసిపాటుతో, తపస్సులో నిమగ్నమై ఉన్న ఒక మునిపుంగవుణ్ణి చూసి ఎగతాళి చేసింది. వానరచేష్టలతో తన తపస్సుకు భంగం కలిగించడంతో కృద్ధుడైన ఆ మునీశ్వరుడు గంధర్వకన్యను వానరరూపం ఎత్తమని శపించాడు. మహా తపస్సంపన్నుడైన ఆ జడధారి శాపవచనాల వల్ల ఆమె వానరంగా జన్మించి, 'కేసరి' అనే పేరు గల వానరవీరుణ్ణి వివాహమాడింది. శ్రీమహావిష్ణువును ఎంతో భక్తితో ఆరాధించే ఆ దంపతులకు చాలా కాలం సంతానభాగ్యం కలుగకపోవడంతో; వారు సమీపంలోనున్న మాతంగముని ఆశ్రమానికి వెళ్లి, వారిని సేవించుకుని, తమకు పుత్రసంతానం కలిగే మార్గం చెప్పవలసిందిగా వేడుకుంటారు. మునివర్యుల ఆదేశాన్ననుసరించి, అంజనాదేవి – కేసరి దంపతులు శేషాచలానికేతెంచి, స్వామిపుష్కరిణిలో స్నానమాడి, ఆదివరాహుణ్ణి దర్శించుకుని, ఉత్తరదిక్కున ఉన్న 'ఆకాశగంగ' అనే తీర్థానికి చేరుకుంటారు. ఈ తీర్థప్రాశస్త్యాన్ని ఇంతకు ముందే తెలుసుకున్నాం.

అంజనాదేవి ప్రతిదినము ఆ పవిత్రతీర్థంలో స్నానమాడి, ఆ ప్రదేశంలోనే పన్నెండు సంవత్సరాల పాటు, నిరాహారియై కఠోరసాధన చేస్తుంది.

భగవదేచ్ఛ ననుసరించి వాయుదేవుడు ప్రతి సంవత్సరం ఆకాశగంగా తీర్థంలో అంజలి ఘటిస్తున్న అంజనాదేవి దోసిలిలో ఒక దివ్యఫలం రాలేటట్లుగా చేశాడు. అంజనాదేవి దానిని మాత్రమే ఆహారంగా స్వీకరించేది. పన్నెండవ సంవత్సరం పూర్తవగానే వాయుదేవుడు తన వీర్యంతో నింపిన ఫలాన్ని అంజనాదేవి దోసిలిలో పడేట్లు చేశాడు. యథాప్రకారం ఆ ఫలాన్ని భుజించిన అంజనాదేవి, వెంటనే గర్భం దాల్చింది. వాయుదేవుని అంశతో, అంజనాదేవి సకలసద్గుణసంపన్నుడు, పరాక్రమవంతుడు, మహాబలశాలియైన హనుమంతుణ్ణి పుత్రుడిగా పొందింది.

అంజనాదేవి పన్నెండు సంవత్సరాలు తపస్సు చేసి, హనుమను పుత్రునిగా పొందిన ప్రదేశం 'అంజనాద్రి' లేదా 'అంజనాచలం' గా పేరు గాంచింది.

ఇప్పుడు 'జాబాలితీర్థం' గా పిలువబడుతున్న ప్రదేశం లోనే మాతంగముని ఆశ్రమం ఉండేదని, అంజనాదేవి అక్కడే తపమాచరించిదని భక్తుల నమ్మకం. **పుట – 91 తేదీ – ఆగష్టు, 22**

శేషాద్రి లేదా శేషాచలం

ఈ శిఖరానికి శేషాద్రి లేదా శేషాచలం అనే నామధేయం రావడానికి వెనుక చాలా ఆసక్తికరమైన కథనాలు ఉన్నాయి. ఒకప్పుడు వైకుంఠవాసి అయిన శ్రీమహావిష్ణువు మందిరానికి ద్వారపాలకులుగా ఉండే జయ విజయులు శాపవశాత్తూ

భూలోకంలో రాక్షసులుగా జన్మించినప్పుడు, ఆపద్ధర్మంగా ఆదిశేషుడు వైకుంఠద్వారానికి కాపలా కాస్తున్నాడు. శ్రీమహావిష్ణువుకు పర్యంకముగా, తల్పముగా ఛత్రముగా ఇంకా అనేక రకాలుగా యుగయుగాల నుండి సేవలందించడం వల్ల శ్రీమహావిష్ణువుకు శ్రీమహాలక్ష్మి తర్వాత అత్యంత సన్నిహితంగా మెలగటం వల్ల; ప్రస్తుతం ద్వారపాలకునిగా అదనపు బాధ్యత చేపట్టడం వల్ల అతనిలో కొద్దిగా అహంకారపు ఛాయలు పొడచూపాయి. దానిని గమనించిన శ్రీమహావిష్ణువు ఆదిశేషునికి తగిన గుణపాఠం నేర్పి, సరి అయిన బాటలో పెట్టాలని తగిన అవకాశం కోసం వేచి చూస్తున్నాడు.

ఇదిలా ఉండగా ఒకనాడు అష్టదిక్పాలకులలో ఒకడు, శ్రీమహావిష్ణువుకు పరమభక్తుడు, వినయ విధేయతలతో అణిగిమణిగి ఉండే వాయుదేవుడు విష్ణుమూర్తి దర్శనార్థం వైకుంఠానికి ఏతెంచి, ద్వారపాలకునిగా ఉన్న ఆదిశేషువుతో శ్రీహరి దర్శనానికై అనుమతి కోరాడు. వాస్తవానికి దేవతల తారతమ్యంలో వాయుదేవుడు ఆదిశేషువు కంటే పై కక్ష్యలోని వాడు. కానీ, ఆదిశేషువు తరతమ బేధాలను గుర్తించకుండా వాయుదేవునికి అహంకారపూరితంగా, నిర్లక్ష్యంతో సమాధానమిచ్చాడు. అత్యవసర విషయమై శ్రీమన్నారాయణునితో సత్వరమే సమావేశమవ్వాలని తెలియపరచి నప్పటికీ ఆదిశేషుడు ఏకపక్షంగా వ్యవహరించి, వాయుదేవుణ్ణి అడ్డుకుని, పరుషపదజాలాన్ని ఉపయోగించాడు. దాంతో స్వతహాగా నిగర్వి, శాంతస్వభావుడు అయినట్టి వాయుదేవుడు కూడా కోపోద్రిక్తుడై, ఆదిశేషువును తూలనాడాడు. శ్రీమహావిష్ణువుకు అతి సమీపంలో తాను ఉంటానని, వారికి తాను అత్యంత ప్రీతిపాత్రుడనని ఆదిశేషుడు వాదించగా; విసుగు చెందిన వాయుదేవుడు ఇంటి యజమానికి సమీపంలో నున్నంత మాత్రాన కాపలాగా ఉంచుకున్న శునకం గొప్పదెలా అవుతుందని పరుషంగా ప్రశ్నించాడు.

అలా వారిరువురికి చాలాసేపు వాదోపవాదాలు జరుగుతుండగా, వారి సంభాషణలను అన్యాపదేశంగా విన్న విష్ణుమూర్తి తన పీఠం నుంచి తరలి ప్రవేశద్వారం వద్దకు వచ్చాడు. దాంతో కక్షిదారులిరువురు శ్రీమహావిష్ణువుకు తమ తమ వాదనలను వినిపించారు. అంతే కాకుండా, వారిద్దరిలో ఎవరు గొప్పవారో తేల్చి చెప్పవలసిందిగా శ్రీహరిని కోరారు.

ముల్లోక వాసులందరికీ ప్రాణాధారమైన తాను గొప్పవాణ్ణని వాయుదేవుడు; భూమండల మంతటినీ తన పడగలపై మోస్తున్నందున తానే గొప్పవాణ్ణని ఆదిశేషుడు ఇలా ఎవరికి వారు తమ గొప్పతనాన్ని శ్రీమహావిష్ణువుకు చెప్పుకున్నారు. శ్రీమన్నారాయణుడు ఎప్పటి నుంచో వేచి చూస్తున్న తరుణం రానే వచ్చింది. అదే అదనుగా ఆదిశేషువుకు తన స్థానం ఏమిటో తెలియబరచ దలచుకున్నాడు. వారిరువురిని ఉద్దేశించి ఇరువురు తమ తమ స్థానాలలో, కర్తవ్యనిర్వహణలో తిరుగులేని వారేనని; వారిలో ఎవరు అధికులో తేల్చటం అత్యంత కష్టతరమని బోధపరచి, వారిరువురికి ఒక పరీక్ష పెట్ట దలచుకున్నట్లుగా చెప్పాడు.

వైకుంఠంలో అల్లంతదూరాన ఉన్న 'ఆనందుడు' అనే పర్వతాన్ని చూపించి ఆదిశేషువు తన పడగలతో ఆ పర్వతాన్ని గట్టిగా చుట్టుకుని ఉండాలని; వాయుదేవుడు శక్తినంతా ఉపయోగించి తన వాయుతాడనంతో, ఆదిశేషువు చుట్టుకొని ఉండగా ఆ పర్వతాన్ని కదిలించడానికి ప్రయత్నించాలని ఆదేశించాడు. పర్వతం కదిలితే వాయుదేవుడు గెలిచినట్లు,



లేకుంటే విజయం ఆదిశేషువు దన్నమాట.

ఆ పందానికి అంగీకరించిన వారిరువురు ఈ పరీక్షకు సన్నద్ధమయ్యారు. అపరిమిత బలశాలి అయిన ఆదిశేషువు ఆనందపర్వతాన్ని చుట్టుకొని, పడగలతో గట్టిగా అదిమి పెట్టి, తన బలానికి తానే మురిసిపోయాడు. వాయుదేవుడు ఆ పర్వతాన్ని ఏమాత్రం కదిలించే లేడన్న ధీమాతో నిశ్చింతగా ఉన్నాడు.

ఆటు వాయుదేవుడు భారమంతా శ్రీమహావిష్ణువు పై వేసి, ఆ దేవదేవుని మనసులోనే స్మరించుకుంటూ, ఒక్క ఉదుటున ఉధృతమైన ప్రభంజనాన్ని సృష్టించాడు.

సాక్షాత్తు శ్రీమన్నారాయణుని మహిమ ముందు, అహంకారంతో విర్రవీగే ఆదిశేషుడి శక్తి ఏపాటిది? చండప్రచండంగా వీచిన వాయువు ధాటికి ఆనందుడు అనబడే ఆ పర్వతం ఆదిశేషువుతో సహా ఎగిరి; కొన్ని వేల యోజనాల దూరంలో ఉన్న, భూలోకం లోని సువర్ణముఖి నదీ తీరాన వచ్చి పడింది.

మరో కథనం ప్రకారం, ఈ పోటీ జరుగుతున్న సమయంలో శ్రీమన్నారాయణుని సంకేతాన్ననుసరించి; నారదమహర్షి వైకుంఠాని కేతెంచి, ద్వారం ముందు నిలిచి, తన వీణతో మృదుమధురమైన నాగస్వరం పలికించాడు. నాగులకు సహజమైన ప్రవృత్తితో ఆ నాగస్వరానికి మైమరచిన ఆదిశేషువు తన పట్టును కొద్దిగా సడలించి, తన్మయత్వంతో నాట్యం చేయసాగాడు. అదే అదనుగా వాయుదేవుడు విజృంభించి, తన ప్రచండమారుతంతో ఆదిశేషువుతో సహా ఆనందపర్వతాన్ని భూలోకంలోకి విసిరి వేశాడు. అలా ఎగరవేయబడ్డ పర్వతం స్వర్ణముఖి నదీతీరం వద్ద ప్రతిష్ఠితమైంది.

తిరుమలకొండపై ఇప్పుడు శ్రీనివాసుడు కొలువ దీరి ఉన్న 'ఆనందనిలయం' ఆ పర్వతం పైనే నెలకొని ఉన్నది.

ఈ సంఘటన జరిగిన తర్వాత, వైకుంఠవాసి అయిన మేరుపర్వతం శ్రీమహావిష్ణువు వద్దకు వచ్చి వైకుంఠం నుండి భూలోకంలోకి వాయుదేవుని ద్వారా విసిరివేయ బడ్డ 'ఆనందుడు' అనే పర్వతం తన తనయుడని; ఆదిశేషునికి వాయుదేవునికీ మధ్య తగాదాలతో ఏమాత్రం సంబంధం లేని తన కుమారుడు, తనకూ వైకుంఠానికీ దూరమై, చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తున్నాడని; తాను తన తనయుడు శ్రీహరిని యుగయుగాలుగా భక్తిశ్రద్ధలతో సేవించు కుంటున్నామని; ఎలాగైనా తన తనయుడిని అనుగ్రహించాలని మొరపెట్టుకుంది. మేరుపర్వతం మొరను ఆలకించిన శ్రీమహావిష్ణువు ఇదంతా తన సంకల్పమేనని, ముందు ముందు రాబోయే 28వ కలియుగంలో తాను శ్రీవేంకటేశ్వరునిగా భూలోకంలో అవతరిస్తానని, అప్పుడు తాను మేరుపర్వతం తనయుడైన ఆనందపర్వతం పైనే కొలువై ఉండి, కలియుగాంతం వరకు భక్తులను ఉద్ధరిస్తారని, తద్వారా ఆనందుని జన్మ సార్థకమై అజరామరమైన కీర్తిప్రతిష్ఠలతో వర్ధిల్లుతాడని శెలవిస్తాడు.

ఆ విధంగా శ్రీనివాసుడు కొలువై ఉన్న శేషాచల పర్వతానికి 'ఆనందపర్వత' మనే మరో పేరు కూడా వచ్చింది. అలాగే, శ్రీనివాసుడు కొలువై ఉండే ఆలయానికి కూడా 'ఆనందనిలయం' అనే సార్థక నామధేయం ఏర్పడింది.

సాక్షాత్తు భగవంతుణ్ణే మోయగల సామర్థ్యం కలవాడు, ఈ భూమండలాన్నంతటిని తన పడగలపై మోయగల శక్తి సంపన్నుడు అయిన ఆదిశేషువు సైతం అజ్ఞానపూరితమైన అహంకారానికి లోను కావడం వల్ల, పరాభవాన్ని మూటగట్టుకున్నాడు. ఆ విధంగా ఎంతటి గొప్ప వారికైనా దాంబికము, గర్వము, అహంకారము, అహంభావము తగవని శ్రీ మహావిష్ణువు తెలియజెప్పాడు. అంతేకాకుండా వినయ విధేయతలతో నుండి, భారాన్నంతా తనపై వేసి, యథాశక్తి తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన వారి పక్షాన నిలచి వారికి విజయాన్ని ప్రసాదిస్తానని కూడా శ్రీమహావిష్ణువు చాటిచెప్పాడు.

ఆదిశేషుని వృత్తాంతాన్ని, శేషాచల వాసుణ్ణి తలపుకు తెచ్చుకున్నప్పుడు, అహంకారం ఎంతటి అనర్థాలు తెస్తుందో గుర్తుకు వస్తుంది. శ్రీవెంకటేశ్వరుని దర్శనార్థం తిరుమలక్షేత్రానికి భక్తిభావంతో విచ్చేయాలే తప్ప అధికారదర్పం, అతిశయం ప్రదర్శిస్తే; యాత్ర సాఫల్యం కాకపోవడమే గాకుండా, అనేక అనర్థాలకు కూడా దారి తీస్తుందన్న విషయాన్ని ఈ ఉదంతం స్ఫురణకు తెస్తుంది.

గరుడాద్రి లేదా గరుడాచలం

సప్తగిరుల లోని మరో శిఖరం 'గరుడాద్రి'. శ్రీమహావిష్ణువు ఆదివరాహస్వామి అవతారం దాల్చి భూమండల మంతటినీ చాపగా చుట్టేసి సముద్రగర్భంలో నిక్షిప్తం చేసిన హిరణ్యాక్షుడు అనే రాక్షసుణ్ణి వధించి, భూదేవిని రక్షించాడు. తనకు పునర్జీవితాన్ని ప్రసాదించిన ఆదివరాహుణ్ణి తనతోనే ఉండవలసిందిగా భూదేవి అర్థించింది. ఆమె కోరికను అంగీకరించిన శ్రీమహావిష్ణువు తాను భూలోకంలో స్థిరనివాస మేర్పరచుకొనే నిమిత్తం, వైకుంఠంలో తాను కొలువై ఉండే క్రీడాపర్వతాన్ని తెచ్చి భూమిపై ప్రతిష్ఠించ వలసిందిగా గరుత్మంతుణ్ణి ఆదేశిస్తాడు. అలా గరుడుని ద్వారా రప్పించబడి, స్వర్ణముఖీ నదీతీరాన ప్రతిష్టించబడిన క్రీడాపర్వతమే గరుడాద్రిగా ప్రసిద్ధి చెందింది. ఆదివరాహుడు ఈ కొండ పై కొలువుంటూ, తన తరువాతి అవతారమైన శ్రీవెంకటేశ్వరునికి కొంత స్థలాన్ని కానుకగా ఇచ్చాడు. ఇప్పుడు ఆనందనిలయం గా పిలువబడే ఆ ప్రదేశంలోనే శ్రీనివాసుడు కొలువై ఉన్నాడు. గరుత్మంతుడు వైకుంఠం నుంచి క్రీడాచలాన్ని తెచ్చి భూలోకంలో ప్రతిష్టించిన శుభదినాన్ని మనం 'గరుడపంచమి' గా జరుపుకుంటాం.

గరుడాద్రికి సంబంధించిన మరో పురాణగాథ ప్రకారం నాగులకు తల్లి అయిన కద్రువ, గరుడుని తల్లి మరియు తనకు సవతి అయిన వినతను వంచించి, మాయోపాయంతో ఆమెను తన దాసిగా చేసుకుంటుంది. తన మాతృమూర్తి దీనావస్థకు కలత చెందిన గరుత్మంతుడు ఆమెను దాస్యం నుండి విముక్తి చేయాలని, అందు నిమిత్తం ఏ మూల్యం చెల్లించటానికయినా తాను సిద్ధమని తన పినతల్లిని వేడుకుంటాడు.

ఆమెను దాస్యవిముక్తిరాలిగా చేయడం ఏమాత్రం ఇష్టపడని కద్రువ, గరుత్మంతుడికి ఆచరణసాధ్యం కాని షరతు విధించింది. దేవలోకంలో కట్టుదిట్టమైన కాపలాతో నిక్షిప్తంగా ఉండే అమృతాన్ని తెచ్చి తనకు ఇస్తే, వినతి దాస్య శృంఖలాలను తొలగిస్తానని మాట ఇచ్చింది. అమిత పరాక్రమవంతుడు, మహాబలశాలి, అసాధారణ మాతృభక్తి కలిగిన గరుత్మంతుడు అనితరసాధ్యమైన ఈ షరతుకు అంగీకరించి, అత్యంత దృఢమైన తన రెక్కల సాయంతో

స్వర్గలోకానికి ఎగిరి వెళ్లి, దేవతలను ఎదిరించి, అమృతభాండాన్ని సాధించి తెచ్చి తన పినతల్లికి ఇవ్వడం ద్వారా తన తల్లిని దాస్యపు చెరనుండి విముక్తిరాలిగా చేశాడు. తల్లిపై గరుత్మంతునికున్న నిరుపమానమైన ప్రేమకు, తెగువకు, పరాక్రమానికి ముగ్ధుడైన శ్రీమహావిష్ణువు గరుత్మంతునికి సాక్షాత్కరించి, ఏదైనా వరం కోరుకోమనగా; గరుత్మంతుడు నిస్వార్థబుద్ధితో తనకు ఇహ పరమైన సౌఖ్యాలు ఏమీ అక్కరలేదని, నిరంతరం శ్రీమహావిష్ణువును సేవించుకునే భాగ్యాన్ని ప్రసాదించమని వరంగా కోరుకుంటాడు. దానికి ప్రసన్నుడైన శ్రీహరి కలియుగంలో శ్రీవేంకటేశ్వరునిగా భూలోకంలో అవతరిస్తానని, అప్పుడు గరుత్మంతుడు 'గరుడాద్రి' అనే పర్వత రూపంలో అవతరించి తనకు నివాసస్థానంగా ఉంటాడని వరమిస్తాడు. శ్రీమన్నారాయణుని వరప్రభావంతో సాక్షాత్తు గరుత్మంతుడే గరుడాచలంగా మారి, శ్రీనివాసుణ్ణి సేవించుకుంటున్నాడని పురాణ ప్రశస్తి. **పుట – 92 తేదీ – ఆగష్టు, 23**

వెంకటాద్రి లేదా వెంకటాచలం

'వేంకట' అనే పదబంధంలో 'వేం' అనే పదానికి 'పాపము', 'కట' అనే పదానికి 'తొలగించేది' అనే అర్థాలు ఉన్నాయి. వెరసి 'వేంకట' అంటే 'పాపాలు తొలగించెడిది' అని అర్థం. అనాదిగా కోట్లాదిమంది శాపగ్రస్తుల, శరణార్థుల పాపాలను తొలగిస్తూ ఉన్న కారణంగా ఈ పర్వతం 'వెంకటాద్రి' గా వర్ధిల్లుతోంది. పురాణాలలో ఈ పర్వతం భక్తుల పాపాలను తొలగించిన ఉదంతాలు కొల్లలుగా కానవస్తాయి. వెంకటాద్రి శిఖరరాజం పై కొలువై వున్న స్వామిపుష్కరిణి మహిమతో పాపాలు తొలగిన అనేక పౌరాణిక గాథలను కూడా మనం ఇంతకుముందే తెలుసుకున్నాం.

అయితే, ఈ సందర్భంలో అనేక పురాణాల్లో ఉటంకించబడిన 'మాధవుడు' అనే బ్రాహ్మణుని వృత్తాంతాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

పూర్వం తిరుపతి పట్టణానికి సమీపంలో ఉన్న 'శ్రీకాళహస్తి' అనబడే సుప్రసిద్ధ శైవక్షేత్రంలో 'పురంధరుడ' నే విష్ణుభక్తుడు, సద్బ్రాహ్మణుడు తన భార్య మరియు 'మాధవుడ' నే యుక్తవయస్కుడైన పుత్రునితో నివసించేవాడు. మాధవుడు కూడా తండ్రి వలెనే వేదవేదాంగాలు అభ్యసించి, నిత్యానుష్ఠానాదులు క్రమం తప్పకుండా అత్యంత నిష్ఠతో ఆచరిస్తుండేవాడు. కొంతకాలానికి పాండ్యదేశానికి చెందిన 'చిత్రలేఖ' అనబడే సుందరమైన సౌశీల్యవతియైన యువతితో మాధవుడి వివాహం జరిగింది. కొన్నాళ్ళు శాస్త్రసమ్మతమైన గృహస్థు జీవితం గడపిన తరువాత విధివశాత్తూ, మాధవునికి శాస్త్రసమ్మతం కాని కోరిక కలిగింది. ఒకనాడు మాధవుడు, ఉదయపు సంధ్య అనంతరం తన భార్యతో సంగమించాలన్న కోరికను వెలిబుచ్చాడు. సుగుణవతి యైన భార్య 'అకాలవిహారం' శాస్త్రాలలో సంపూర్ణంగా నిషేధించ బడినదని, అటువంటి విపరీత సంగమం వల్ల జన్మించే సంతానం కుంటుంబానికి సమాజానికి అరిష్టాన్ని కలుగజేస్తుందని నచ్చచెబుతుంది. సర్వవిద్యా పారంగతుడైన మాధవునికీ ధర్మాధర్మాలు క్షుణ్ణంగా అవగతమే! కానీ, ప్రారబ్ధకర్మ వల్ల మాధవుడు భార్య హితవును పెడచెవిని పెట్టి, ఆమెను నిర్బంధంగా అసందర్భోచితమైన కార్యానికి ఒప్పించి, దర్భలు సేకరించే నెపంతో భార్యతో కలిసి అరణ్యం లోకి వెళ్ళాడు. అక్కడ వారిద్దరూ సమాగమానికి సన్నద్ధులవుతారు. దురదృష్టవశాత్తూ అదే సమయంలో మాధవునికీ 'కుంతల' అనే

శూద్రజాతి స్త్రీ కనబడుతుంది. ఆమె మరింత సౌందర్యంతో ప్రకాశించడంతో; కామోద్రిక్తుడైన మాధవుడు యుక్తాయుక్త విచక్షణను విస్మరించి, భార్యను పంపివేసి ఆ ఆటవిక స్త్రీ పొందు కోరుతాడు.

అక్షరజ్ఞానం ఏమాత్రం లేని ఆ స్త్రీ కూడా, తప్పొప్పులను తెలిసి యుండటం చేత మాధవునికి అనేక రకాలుగా నచ్చచెబుతుంది. పరస్త్రీ వ్యామోహం వల్ల మాధవుడి బ్రాహ్మణ్యం మంట గలుస్తుందని, ఆ అకృత్యం వల్ల కలిగే పాపం మాధవుని కుటుంబాన్ని పట్టి పీడుస్తుందని హితవు పలుకుతుంది. విధి బలీయమవ్వడంతో, మాధవుడు ఆ స్త్రీ పలుకులను కూడా పెడచెవిని బెట్టి ఆమెను బలాత్కరించ బోతాడు. వివశురాలైన ఆ స్త్రీ సూచన మేరకు; శిఖ, యజ్ఞోపవీతాలను తొలగించు కోవడానికి, జీవితాంతం ఆమెతో కలసి అంత్యజునిగా జీవితం గడపటానికి, ఆమెతో కలసి మద్యమాంసాదులను సేవించడానికి సైతం సిద్ధపడి ఆమెతో సంభోగిస్తాడు.

ఆమెకిచ్చిన మాట ప్రకారం ఆమెతో కొంతకాలం ఆటవికజీవితం గడిపిన తరువాత కుంతల కు అకాలమరణం సంప్రాప్తిస్తుంది. ఆమెను అమితంగా ప్రేమించిన మాధవుడు కుంతల మరణాన్ని జీర్ణించుకోలేక, జీవితం పై విరక్తి చెంది, కొండలు కోనల్లో గమ్యం లేకుండా సంచరిస్తుంటాడు.

అలా చాలాకాలం గడచిన తరువాత, అతని పూర్వజన్మ ప్రారబ్దకర్మ తీరిపోవడంతో తీర్థయాత్రకు బయల్వెడలిన ఒక రాజపరివారం మాధవునికి తారసపడుతుంది. మాధవుడు ఆ బృందంతో సహా వేంకటాద్రి పాదభాగంలో ఉన్న 'కపిలతీర్థం' లో స్నానమాడి, నిర్ధనుడవ్వడం వల్ల నల్లమట్టి తోనే పిండాలను చేసి, పూర్వీకులకు నిష్ఠతో పిండప్రదానం గావించి, వేంకటాద్రిని అధిరోహించడం ప్రారంభిస్తాడు. ఆ రోజుల్లో అంటే మట్లకుమార అనంతరాజు అలిపిరి నుండి గాలిగోపురం వరకూ గల మెట్లమార్గాన్ని నిర్మించక ముందు కొండ ఎక్కే మార్గం కపిలతీర్థం నుండే ప్రాంభమయ్యేది. శేషాచలేశ్వరుని దర్శనార్థం పరమ పావనమైన వెంకటాద్రి పర్వతాన్ని స్పృశించ గానే, మాధవునికి 'వమనం' జరిగింది. ఆ వాంతి ద్వారా శరీరంలో ఉన్న మలినాలతో పాటుగా అతనిలో గూడు కట్టుకుని ఉన్న సమస్త పాపాలు బహిర్గతములై, మాధవుడు కడిగిన ముత్యంలా ప్రకాశించాడు. ఈ అద్భుతాన్ని అంబరం నుంచి వీక్షిస్తున్న దేవతలందరూ పుష్పవృష్టి కురిపించారు.

తన తండ్రిగారికి నెలవైన వేంకటాచల స్పర్శామాత్రం చేతనే మాధవుడు పునీతుడైన పరమాద్భుత దృశ్యాన్ని పరికించిన బ్రహ్మ దేవుడు అతనికి ప్రత్యక్షమై; భవిష్యత్తులో మాధవుడే సుధర్ముని కొడుకు ఆకాశరాజుగా జన్మించి, శ్రీమహాలక్ష్మికి మరో రూపమైన పద్మావతికి తండ్రియై, సాక్షాత్తు శ్రీనివాసుణ్ణి అల్లునిగా పొందుతాడని వరమిస్తాడు. అలా తన పాపాలను పటాపంచలు చేసుకొని, బ్రహ్మదేవుని వరంతో తన జన్మ సార్థకమయిన తరువాత; మాధవుడు వేంకటాచలానికి వెళ్ళి, స్వామిపుష్కరిణిలో స్నానమాడి, వరాహస్వామిని తదనంతరం శ్రీనివాసుని దర్శించుకుని, మరుజన్మకై ఎదురుచూస్తూ భౌతిక దేహాన్ని త్యజిస్తాడు. అలా స్పర్శామాత్రం చేతనే పాపాలను తొలగింపగలిగిన మహత్యం కలిగి ఉన్నది కావున ఈ పర్వతం వెంకటాద్రి లేదా వెంకటాచలం లేదా వెంకటగిరిగా ప్రశస్తి కెక్కింది. ప్రాతఃసంధ్య వేళలో నిదుర లేచిన వెంటనే ఈ పర్వత నామాన్ని స్మరించినంతనే; గంగాది నదులలో వేలసార్లు స్నానమాచరించిన ఫలితం కలుగుతుందని భవిష్యోత్తరపురాణంలో చెప్పబడింది.

నారాయణాద్రి లేదా నారాయణాచలం

పూర్వం 'నారాయణుడు' అనే మహర్షి ఏ ప్రదేశంలో తపస్సు చేసుకోదలచినా ఏదో ఒక ఆటంకం ఏర్పడుతుండేది. దాంతో విసిగి వేసారిన నారాయణుడు తన తపఃశక్తితో బ్రహ్మదేవుని ప్రత్యక్షం గావించుకొని, తన తపస్సు అవిఘ్నంగా కొనసాగడానికి అనువైన ప్రదేశాన్ని సూచించమని కోరాడు. అప్పుడు బ్రహ్మదేవుడు శేషాచలశ్రేణుల లోని ఒక పర్వతాన్ని చూపించి అక్కడ ఏ ఆటంకమూ లేకుండా తపస్సు చేసుకోవచ్చని శెలవిచ్చాడు. నారాయణుడు బ్రహ్మదేవుడు సూచించిన ప్రదేశంలో శ్రీమన్నారాయణుని గురించి కఠిన తపమాచరించి వారి కటాక్షాన్ని పొందాడు. అలా నారాయణమహర్షి తపస్సు చేసి శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రసన్నం చేసుకున్న ప్రాంతం కాబట్టి, ఆ గిరిశిఖరం 'నారాయణాద్రి' లేదా 'నారాయణాచలం' లేదా 'నారాయణగిరి' గా పేరు గాంచింది.

అంతే గాకుండా శ్రీమహావిష్ణువు వైకుంఠం నుండి భూలోకానికి వేంచేసినప్పుడు, సప్తగిరులలో అత్యంత ఉన్నతమైన నారాయణగిరి పర్వతం పైనే మొట్టమొదటగా కాలు మోపాడని పురాణాలలో చెప్పబడింది.

ఆ ప్రదేశంలో శ్రీవారి ఆగమనానికి గుర్తుగా వెలసినటువంటి 'శ్రీవారిపాదాలను' నేడు కూడా మనం దర్శించుకోవచ్చు. దేవాలయం నుండి వేదపాఠశాలకు వెళ్ళేమార్గంలో కొన్ని మెట్లెక్కి; అద్దాల పేటికలో పదిలంగా భద్రపరచబడి, నిత్యము పూజలందుకునే ఈ పరమ పవిత్రమైన పాదాలను భక్తులందరూ తప్పక దర్శించుకుంటారు. సప్తగిరి శిఖరాలన్నింటి లోకి అతి ఎత్తైన శిఖరం కావడంవల్ల, ఆ ప్రదేశం నుండి శేషాచల సానువులన్నింటిని, దట్టమైన అడవులను, ప్రకృతి సోయగాన్ని నయనానందకరంగా వీక్షించవచ్చు.

ఇప్పటివరకు మనం సప్తగిరుల లోని ఆరు శిఖరాల గురించి తెలుసుకున్నాం. ఏడవ శిఖరంపై కొంత సందిగ్ధత ఉంది. ఒక్కొక్క గ్రంథంలో ఒక్కో పేరు ప్రస్తావించబడింది.

వృషాద్రి లేదా వృషాచలము

ఏడవ శిఖరం పేరు కొన్నిచోట్ల 'వృషాద్రి' గా పేర్కొనబడింది. వృషము అంటే 'ధర్మము' లేదా 'యజ్ఞము' అని అర్థం. ధర్మదేవతకు 'వృషాధిపతి' అనే నామాంతరం ఉంది. సర్వధర్మాలకు అధిపతి అయిన ధర్మదేవత ఈ శిఖరంపై తీవ్రమైన తపస్సు చేసి, శ్రీనివాసుని కటాక్షింప జేసుకుని; ఎల్లవేళలా తన ధర్మాన్ని నిష్పక్షపాతంగా నిర్వహించగలిగే దక్షతను, ధర్మసందేహం వచ్చినప్పుడు సరియైన మార్గాన్ని మాత్రమే ఎంచుకునే విచక్షణను ప్రసాదించమని వేడుకొన్నది. వృషాధిపతి లేదా ధర్మదేవతకు శ్రీవేంకటేశ్వరుడు కోరిన వరాన్ని ఇవ్వడం వలన ఇది 'వృషాద్రి' లేదా వృషాచలంగా వినుతికెక్కింది.

నీలాద్రి లేదా నీలాచలం

మరికొన్ని పురాణాల్లో 'నీలాద్రి' ని ఏడవ శిఖరంగా పేర్కొన్నారు. నీలాద్రి అనే పేరు రావడం వెనుక చాలా

ఆసక్తికరమైన కథనం ఉంది. ఒకానొకప్పుడు నీలాదేవి అని పిలువబడే ఒక భక్తురాలు ఒక గిరిశిఖరం పై తీవ్రంగా తపస్సు చేసుకుంటున్న సమయంలో ఆ ప్రదేశంలో విచ్చలవిడిగా సంచరించే క్రూరమృగాలు ఆమె తపస్సును భగ్నం చేయసాగాయి. తనకు భక్తురాలు అయినా నీలాదేవి తపస్సు నిర్విఘ్నంగా కొనసాగింప జేసే నిమిత్తం ఆమె కోరిన విధంగా శ్రీనివాసుడు విల్లంబులు ధరించి, ఆ మృగాలను వేటాడి, ఆమె తపస్సుకు కావలసిన ప్రశాంత వాతావరణాన్ని ఏర్పరిచాడు. మృగయావినోదంతో అలసి సొలసిన శ్రీవేంకటేశ్వరుడు అక్కడే గాఢనిద్రకు ఉపక్రమించాడు.

నిద్రావస్థలో ఉన్న శ్రీవేంకటేశ్వరుని ముఖారవిందాన్ని తనివితీరా కాంచిన నీలాదేవి కి ఒక లోపం కొట్టొచ్చినట్లు కనపడింది. అదేమిటంటే శ్రీనివాసునికి నుదిటిపైన కొంతభాగంలో కురులు లేవు. ముగ్ధ మనోహరమైన శ్రీవారి ముఖానికి ఆ విషయం అతి తీవ్రమైన లోటుగా నీలాదేవికి తోచింది.

కలియుగ ఆరంభంలో శ్రీవేంకటేశ్వరుడు స్వామిపుష్కరిణికి తూర్పు దిక్కున ఉన్న పాముపుట్టలో నివాసమున్నప్పుడు గొల్లవాని గొడ్డలి ప్రహారంతో శ్రీవారి నుదుటి భాగంలో లోతైన గాయమై, రక్తస్రావం జరిగినట్లు మనం ఇంతకు ముందే తెలుసుకున్నాం. తర్వాతి కాలంలో గాయం మానిపోగా, దెబ్బ తగిలిన ప్రదేశంలో తిరిగి శిరోజాలు మొలవలేదు.

నీలాదేవి వెంటనే నల్లకలువలులా నిగనిగలాడుతున్న తన శిరోజాలను బలవంతంగా ఊడలాగుకుని; వాటిని తన దివ్యశక్తితో, శూన్యంగా ఉన్న శ్రీవారి నుదుటిభాగంలో అతికించింది. దాంతో శ్రీవారి ముఖారవిందం శిరోజాలతో నిండుగా, పూర్ణ చంద్రబింబం వలె మెరిసి పోతూ ఉండడంతో నీలాదేవి తన్మయురాలై శ్రీవారిని తదేకంగా చూస్తూ ఉండిపోయింది. కొంతసేపటి తర్వాత నిద్రలేచిన శ్రీవారు నుదిటిభాగంపై తడిమి చూసుకొని, శిరోజాలు సంపూర్ణంగా ఉండటం గమనించారు. అదే సమయంలో శిరోజాలను బలవంతంగా ఊడబెరకు కోవటంతో గాయపడి, రక్తమోడుతున్న నీలాదేవి శిరస్సును కూడా గమనించారు. జరిగినదంతా తన దివ్యదృష్టితో తెలుసుకున్న శ్రీనివాసుడు నీలాదేవి వాత్సల్యానికి అబ్బుర పడ్డారు. స్త్రీలు ప్రాణప్రదంగా ప్రేమించే శిరోజాలను సైతం లెక్కచేయకుండా, వాటిని తనకు సమర్పించుకున్న నీలాదేవి భక్తితత్పరతను, ఔదర్యాన్ని ప్రశంసించిన శ్రీవారు ఇకనుండి ఆ శిఖరం 'నీలాద్రి' లేదా 'నీలాచలం' గా పిలువబడు తుందని; శిరోజాలు ఆమె పేరున 'నీలాలు' లేదా 'తలనీలాలు' గా పిలువ బడతాయని; తనకు ప్రేమతో తలనీలాలు సమర్పించుకున్న భక్తులందరి కోరికలు ఈడేరతాయని వరమిచ్చాడు. అందువల్లనే ఇప్పటికీ కోట్లాది భక్తులు శ్రీవారికి తమ తలనీలాలను సమర్పించు కుంటారు. స్వామివారికి సమర్పించుకునే లెక్కలేనన్ని మొక్కుబడులలో తలనీలాల సమర్పణ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.

మరికొన్ని గ్రంథాల్లో ముఖ్యంగా శ్రీవేంకటేశ్వరసుప్రభాతంలో 'శ్రీశైలం' అనబడే మరో శిఖరం కూడా సప్తగిరులలో ఒకటిగా చెప్పబడింది. 'శ్రీ' అనగా 'శ్రీమహాలక్ష్మి'. క్షీరసాగరమథనం లో లక్ష్మీదేవి ఉద్భవించి నప్పుడు ఆమె శ్రీమహావిష్ణువును భర్తగా కోరుకుని, తన నివాసస్థానం ఎక్కడో తెలుపమని వారిని ప్రార్థించింది. దానికి బదులుగా శ్రీమహావిష్ణువు తనకు శాశ్వతనివాసం లేదని, తాను భక్తుల మదిలోనే కొలువుంటానని, భక్తులను అనుగ్రహించడానికి రక్షించడానికి ఎల్లవేళలా త్రిలోకసంచారం చేస్తూ ఉంటానని; అందువల్ల శ్రీమహాలక్ష్మి తన

శరీరంలో అవిభాజ్య భాగమై, తన వక్షస్థలంలోనే కొలువై, వక్షఃస్థలలక్ష్మిగా సుప్రసిద్ధ మవుతుందని బదులిచ్చాడు. శ్రీమహాలక్ష్మిని తన హృదయంలో కొలువుంచుకున్న శ్రీవేంకటేశ్వరుడు విలసిల్లే పర్వతం కనుక అది 'శ్రీపర్వతం' లేదా 'శ్రీశైలం' గా వినుతికెక్కిందని పురాణ కథనం. **పుట – 93 తేదీ – ఆగష్టు, 24**

----------: : ----------

శ్రీవారి ఆభరణాలు

తిరుమలేశుడు నైవేద్యప్రియుడే కాదు, అలంకారప్రియుడు, ఆభరణ ప్రియుడు కూడా! కలియుగ ఆరంభంలో పద్మావతి పరిణయ సందర్భంగా మామగారైన ఆకాశరాజుతో మొదలై; వేలాది సంవత్సరాలుగా ఎందరో మహారాజులు, రాజాధిరాజులు, సామంతరాజులు, జమీందార్ల నుండి సామాన్యుల వరకు; శ్రీవారికి లెక్కలేనన్ని ఆభరణాలను భక్తితో సమర్పించుకున్నారు. ఇంకా సమర్పిస్తూనే ఉన్నారు. శ్రీవారి భక్తులయిన ఎందరో పాలకులు బంగారు ఆభరణాలతో తులాభారం తూగి, వాటిని వినమ్రంగా శ్రీవారికి సమర్పించుకున్నారు. భక్తులు నేరుగా అర్పించుకున్న ఆభరణాలే కాకుండా, హుండీలో వచ్చిన ఆదాయం ద్వారా కూడా ఆయా కాలాలలో ఉన్న దేవస్థానం యాజమాన్యాలు తరచూ మేలిమి బంగారంతోనూ, వజ్రవైఢూర్యాల వంటి నవరత్నాల తోనూ కూడిన అమూల్యమైన ఆభరణాలను తయారు చేయిస్తూనే ఉన్నారు. దేవాలయ చరిత్రలో స్వర్ణయుగంగా చెప్పబడే విజయనగర రాజుల పరిపాలనా కాలంలో అయితే శ్రీవారికి ఆభరణాలు కానుకగా సమర్పించే విషయంలో రాజుల మధ్య తీవ్రమైన స్పర్ధ నెలకొని ఉండేది. పోటీలు పడి ఆభరణాలు సమర్పించుకునే వారు. ఆ లక్ష్మీవల్లభునికి ఎన్ని ఆభరణాలు చేయిస్తే అంత గొప్పగా భావించేవారు. ముఖ్యంగా, శ్రీకృష్ణదేవరాయల వారు తన 21 సంవత్సరాల పరిపాలనా కాలంలో ఏడు సార్లు స్వామివారిని ఒంటరిగానూ, కొన్నిసార్లు సతీమణుల సమేతంగానూ దర్శించుకొని, వారిని ఆపాదమస్తకం బంగారు ఆభరణాలతో ముంచెత్తాడు. అంతే కాకుండా బంగారు, వెండి పాత్రలను సైతం సమర్పించుకుని, ఆనందనిలయానికి బంగారు పూతపూసి, ఆలయం మొత్తాన్ని బంగారుమయం చేశాడు. నిజానికి ఈ అమూల్యమైన ఆభరణాలు, హుండీ ద్వారా వచ్చే అపారమైన ఆదాయం వల్లనే మహమ్మదీయులు, బ్రిటిష్ వారు వంటి అన్యమతస్తుల దృష్టి కూడా శ్రీవారి ఆలయం పై పడింది. వాటిని చేజిక్కించుకోవాలని పరాయిపాలకులు శతథః ప్రయత్నించినప్పటికీ, ఆయా సమయాల్లో తిరుమలేశుణ్ణి ప్రాణం కంటే అధికంగా ఆరాధించే భక్తుల, అర్చకస్వాముల మరియు ప్రాంతీయ పాలకుల సమయోచిత నిర్ణయాలతో, వారు చూపించిన తెగువ వల్ల శ్రీవారి ఆభరణాలు చాలావరకూ రక్షింపబడి, ఆ వారసత్వ సంపద భావితరాల వారికి భద్రంగా అందింది.

శిలాశాసనాల ద్వారా అందిన సమాచారం

పన్నెండో శతాబ్దం నుండి పాలకులు, శ్రీమంతులు సమర్పించుకున్న ఆభరణాల వివరాలను చాలా వరకు ఆలయకుడ్యాలపై చెక్కబడియున్న శాసనాల ద్వారా తెలుసుకోవచ్చు. అంతకు ముందు సమర్పింపబడ్డ ఆభరణాల వివరాలు తెలిపే శాసనాలు అతికొద్ది మాత్రమే లభ్యమయ్యాయి. ఆలయానికి తరచూ మరమ్మత్తులు జరగటం, పాత కుడ్యాల స్థానంలో క్రొత్తవాటిని నిర్మించడం మొదలైన కారణాలవల్ల చారిత్రకాధారాలు చాలావరకు లుప్తమై పోయాయి.

స్థూలంగా శ్రీవారి ఆభరణాలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

సదాసమర్పణ ఆభరణాలు

స్వామివారికి నిత్యం అలంకరిస్తూ ఉండే ఆభరణాలను 'సదాసమర్పణ ఆభరణాలు' గా పేర్కొంటారు. అంటే, ఈ అభరణాలతో 'ఎల్లవేళలా' స్వామివారిని అలంకరిస్తుంటా రన్నమాట. స్వర్ణకిరీటాలు, బంగారు కర్ణాభరణాలు, భుజకీర్తులు, చంద్రహారాలు, నాగాభరణాలు, స్వర్ణ శంఖుచక్రాలు, సూర్యకతారి, ఇలాంటివెన్నో ఆభరణాలు ఈ కోవకు చెందుతాయి. వంతుల వారిగా వీటిలో కొన్నింటిని ప్రతినిత్యం శ్రీవారికి అలంకరించగా, మిగిలిన వాటిని బంగారువాకిలికి ఆనుకొని ఉన్న స్నపనమండపం లోని బీరువాలలో, ప్రధానార్చకుల పర్యవేక్షణలో భద్రపరుస్తారు. కోట్లాది రూపాయల విలువైన ఈ ఆభరణాలను భద్రపరచడం స్వామివారి కైంకర్యాలలో సదా మునిగి ఉండే అర్చకులకు కత్తి మీద సాము లాంటిదే! అయినప్పటికీ, భగవంతుని మీద భారం వేసి ఆ ఆభరణాల సంరక్షణాభారాన్ని సమర్థవంతంగా, దోషరహితంగా తరతరాల నుండి నిర్వహిస్తూ వస్తున్నారు.

విశేషసమర్పణ ఆభరణాలు

విశేషసందర్భాలలో అంటే ప్రముఖ హైందవ పర్వదినాలలో, మరియు దేశాధినేతల వంటి ప్రముఖ వ్యక్తులు స్వామివారిని దర్శించుకున్నప్పుడు ఈ ఆభరణాలను స్వామివారికి అలంకరించి వారిని సర్వాంగసుందరంగా ముస్తాబు చేస్తారు. వజ్రఖచిత ఆభరణాలైన కిరీటం, శంఖుచక్రాలు, కటి వరద హస్తాలు వంటి ఆభరణాలను 'విశేష సమర్పణ ఆభరణాలుగా' వ్యవహరిస్తారు. వీటన్నింటిని 'పారుపత్యదారు' గా పిలువబడే ఆలయ ఉన్నతాధికారి అధ్వర్యంలో స్నపనమంటపం లోనే వేరే బీరువాలలో భద్రపరుస్తారు.

మొజాతి నగలు

బ్రహ్మోత్సవాల వంటి అత్యంత అరుదైన, విశేషప్రాముఖ్యం కల సందర్భాలలో మాత్రమే శ్రీవారికి అలంకరింపబడే ప్రాచీనమైన నగలన్నీ ఈ వర్గానికి చెందుతాయి. ఒక్కొక్క ఆభరణం ఒక్కొక్క కళాఖండం ! నాటి దాతల అభిరుచికి, కళాకారులు పనితనానికి నిలువుటద్దం. వారి వారి నైపుణ్యాన్ని శ్రీవారిపైనున్న భక్తివిశ్వాసాలతో మేళవించి, దేవాలయ చరిత్రలో శాశ్వతంగా స్థానం సంపాదించుకున్న ఎన్నో ఆభూషణాలకు దక్షిణభారతదేశానికి చెందిన ఎందరో కళాకారులు ప్రాణం పోశారు. దేవస్థానానికి సంబంధించిన బొక్కసం (ట్రెజరీ) అధికారుల అధీనంలో ఉన్న కోశాగారంలో ఈ నగలను భద్రపరుస్తారు. వీటికి విశేషమైన చారిత్రక ప్రాధాన్యత ఉంది.

ఈ మూడు తరగతులకు చెందిన ఆభరణాలకు పటిష్ఠమైన భద్రత, నిఘా ఏర్పాట్లు, తనిఖీలు, తరచుగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ జరుగు తుంటాయి.

కిలోలూ-క్వింటాళ్ళూ కాదు, ఏకంగా టన్నులే!!

2016వ సంవత్సరంలో జరిగిన మదింపు ప్రకారం, తిరుమలేశునికి సుమారు 14 టన్నుల బరువైన ఆభరణాలు ఉండగా వాటిలో 124 ఆభరణాలు మూలమూర్తి అలంకరణకు, 383 ఆభరణాలను ఉత్సవమూర్తులకు

ఉపయోగిస్తారు. ఇవే కాకుండా రాఘోజీ సంస్థానంవారు, వెంకటగిరి సంస్థానం వారు స్వామివారికి సమర్పించుకున్న ఆభరణాలను వాటికున్న చారిత్రక ప్రాధాన్యతను బట్టి విడి విడిగా భద్రపరుస్తారు. శ్రీవారి ఆభరణాలను నమోదు చెయ్యడానికి మొత్తంగా 17 దస్త్రాలు (రిజిస్టర్లు) ఉన్నాయి. వీటితో పాటుగా తిరుమలలోని అనేక ఉపాలయాలలో, తి.తి.దే. ఆధ్వర్యంలోనున్న తిరుపతి పట్టణంలోని వివిధ ఆలయాలలో కూడా లెక్కలేనన్ని ఆభరణాలు ఉన్నాయి.

తిరుపతి లోనే దర్శించుకోవచ్చు!

సామాన్య భక్తులు సైతం, తిరుపతి నుంచే చూసి తరించు కునేందుకు వీలుగా శ్రీవారి అమూల్యమైన, చారిత్రక ప్రాధాన్యత సంతరించుకున్న ఆభరణాలను తిరుచానూరులో జరిగే పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు తిరుమల నుండి సర్వలాంఛనాలతో; సంవత్సరాని కొక్కటిగా తెచ్చి ఊరేగింపు జరిపే సాంప్రదాయాన్ని ఈ మధ్యనే తి.తి.దే. వారు ప్రవేశపెట్టారు.

ఆణివార ఆస్థానం

విలువ కట్టడానికి సాధ్యంకాని విశేషమైన ఆభరణాలే కాకుండా స్వామివారి భక్తులు నిత్యం పరకామణిలో వేసే చిన్నపాటి ఆభరణాలు, బంగారు బిస్కెట్ లతో ఆ లక్ష్మీపతి కోశాగారం కిటకిట లాడు తుంటుంది. వీటి విలువను ఇదివరకు ఏడాదికోసారి జరిగే 'ఆణివార ఆస్థానం' అనే సంవత్సరోత్సవ సందర్భంలో లెక్కగట్టే వారు. 'ఆణివార ఆస్థానం' అంటే, దేవాలయ అజమాయిషీ ఈస్ట్ ఇండియా కంపెనీ నుండి మహంతుమఠం వారికి దఖలుపడ్డ రోజుకు గుర్తుగా జరిపే వార్షికోత్సవం. అయితే, ప్రస్తుతం శ్రీవారి ఆలయ లెక్కల ముగింపు దినాన్ని సాధారణ ఆర్థిక సంవత్సరానికి అనుగుణంగా మార్పు చేశారు.

శ్రీవారి డాలర్లు

రాళ్లు పొదగబడినవి కాకుండా, హుండీ ద్వారా వచ్చిన సాదా స్వర్ణాభరణాలను – ముందుగా తిరుమలలో ఉన్న కోశాగారానికి, అక్కడ నుంచి నెలకొకసారి తిరుపతిలో ఉన్న తి.తి.దే. పరిపాలనా కార్యాలయ భవనానికి – భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య తరలిస్తారు. తదనంతరం వాటిని ముంబైలో ఉన్న ప్రభుత్వ టంకశాలకు తరలించి, 22 క్యారెట్లతో 5, 10 గ్రాముల బరువుండే శ్రీవారి బంగారు డాలర్లను తయారు చేసి, మళ్లీ వాటిని తిరుమల లోనే భక్తులకు విక్రయించి, తద్వారా వచ్చిన సొమ్మును బ్యాంకుల్లో ఉన్న తి.తి.దే. ఖాతాలకు జమ చేస్తారు. ఇలా ఖాతాల్లో జమ కాబడ్డ డిపాజిట్లు కొన్ని వేల కోట్లకు చేరుకుని, శ్రీవారు సాటిలేని శ్రీమంతు లనిపించు కుంటున్నారు. మార్కెట్ ధరల ననుసరించి, ఏ రోజు బంగారం ధర ఆ రోజే నిర్ణయిస్తారు. అంతే తప్ప భక్తులు సమర్పించుకున్న శ్రీవారి ఆభరణాలను నేరుగా విక్రయించే సాంప్రదాయం లేదు.

బంగారం డిపాజిట్లు

ఈ మధ్యకాలంలో కానుకల రూపంలో వచ్చిన బంగారాన్ని, ఒక్కొక్కటి కిలో బరువుండే 24 క్యారెట్ల బంగారు

బిస్కట్లుగా మార్చి, వాణిజ్యబ్యాంకుల్లోని 'బంగారం డిపాజిట్' ఖాతల్లో జమ చేస్తున్నారు. తద్వారా బంగారం భద్రంగా ఉండటమే కాకుండా, ఆ వడ్డికాసుల వాడికి వడ్డీ రూపంలో కొంత ఆదాయం కూడా లభిస్తుంది. ఆ విధంగా స్వామివారికి కొన్ని వేల కిలోల బంగారం డిపాజిట్లు కూడా ఉన్నాయి.

'వర్తన" అంటే?

శ్రీవేంకటేశ్వరునికి భక్తులెవరైనా నగలు చేయించ దలిస్తే, తి.తి.దే. అధికారులను సంప్రదించాలి. వారు అప్పటికి శ్రీవారికి అవసరమున్న నగల గురించి తెలిపి, వాటిని ఏ ఏ కొలతల్లో చేయించాలో కూడా భక్తులకు వివరిస్తారు. ఆ ప్రకారం నగలు చేయించి తితిదేకు అందజేస్తే సరిపోతుంది. ఇలా కొత్తగా చేయించిన ఆభరణాలను సమీప శుక్రవారం నాడు, స్వామికి అభిషేకసేవానంతరం అలంకరించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ! తాము చేయించిన ఆభరణాలతో అలంకరింపబడి ఉన్న శ్రీవారిని చూడాలని భక్తులు తహతహ లాడుతుంటారు. గతంలో అందుకు 'వర్తన' చెల్లించాల్సి ఉండేవి. 'వర్తన' అంటే వస్తు రూపేణా స్వామివారికి సమర్పించుకున్న ఆభరణాల యొక్క, లేదా వస్తువుల యొక్క విలువతో సమానమైన రొక్కాన్ని రుసుముగా దేవస్థానం వారికి చెల్లించడం. ఇప్పుడా నిబంధనను తొలగించడం వల్ల శ్రీవారికి ఆభరణాలు సమర్పించుకోవడం కొంత సులువైంది.

ఇక, భక్తులు నేరుగా తయారు చేయించి తెచ్చే, రాళ్ళు పొదగబడ్డ చిన్నా చితక ఆభరణాలను ఉత్సవమూర్తులకు అలంకరిస్తారు. వాటికి సరిపోకపోతే తిరుచానూరులోని పద్మావతి ఆలయానికి గాని, గోవిందరాజస్వామి ఆలయానికి గాని, తి.తి.దే. ఆధ్వర్యంలో మరేదైనా ఆలయానికి గానీ పంపించి, ఏ మూర్తికి సరిపోతే దానికి అలంకరింపజేసి, సమర్పించుకున్న నగకు సార్థకత కల్పించ బడుతుంది. ముఖ్యంగా ఆంజనేయుని వాలమంత పొడవైన, అత్యంతాసక్తి కరమైన ఆ లక్ష్మీనాథుని నగలచిట్టాను విపులంగా తెలుసుకుందాం. **పుట – 95 తేదీ – అగష్టు, 25**

ముఖ్యాభరణాలు

శ్రీవారిని అలంకరించుకునే భాగ్యానికి నోచుకొన్న లెక్కలేనన్ని ఆభరణాలలో అత్యంత ముఖ్యమైనవిగా భావించబడే ఈ క్రింది ఆభరణాలు శ్రీవారిని తరచూ సందర్శించుకునే భక్తులకు చిరపరిచిత మైనవే.

1. **సహస్రనామ హారం:** ముప్పైరెండు కిలోల బరువైన ఈ హారంలో ఉన్న 1008 కాసులపై విష్ణుసహస్రనామాలు ఒద్దికగా చెక్కబడి ఉంటాయి. మైసూర్ చారిటీస్ అనే ధార్మికసంస్థ 1965వ సంవత్సరంలో ఈ హారాన్ని శ్రీవారికి బహూకరించింది.
2. **చతుర్భుజ లక్ష్మీహారం:** నాలుగు కిలోల బరువైన ఈ హారంలో లక్ష్మీదేవి ప్రతిమలున్న 108 కాసులుంటాయి.
3. **మకరకంఠి:** 5.6 కిలోల బరువున్న ఈ మూడుపేటల హారాన్ని మైసూరు మహారాజు వారు బహూకరించారు. పై మూడింటిని సాధారణంగా మూలమూర్తికి అలంకరిస్తారు. అయితే, బ్రహ్మోత్సవాలలో అత్యంత వైభవోపేతంగా జరిగే గరుడవాహనోత్సవం నాడు మాత్రం, ఈ ఆభరణాలను ఉత్సవమూర్తి అయిన మలయప్పస్వామి వారికి అలంకరించి ఊరేగిస్తారు.
4. **గరుడమేరు పచ్చ:** స్వామివారికి ఉన్న అత్యంత అరుదైన ఆభరణాలలో 500 గ్రాముల బరువైన గరుడమేరు

పచ్చను ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ఇటువంటి మేలుజాతి రాయి ప్రపంచంలో మరెక్కడా లేదని చెబుతారు.

5. **స్వర్ణ పీతాంబరాలు:** ఇరవై కిలోల బరువైన స్వర్ణాంబరాన్ని 2009వ సంవత్సరంలో అప్పటి తి.తి.దే. బోర్డు సభ్యుడు మేకపాటి రాజమోహన్ రెడ్డి గారు మూడు కోట్లు వెచ్చించి చేయించారు. మూలవిరాట్టుకు నాభి క్రింద భాగం నుంచి ఈ పీతాంబరం ధరింప చేస్తారు. తి.తి.దే. వారు ఇరవై కిలోగ్రాముల మరో స్వర్ణ పీతాంబరం అంతకుముందే తయారు చేయించారు. ఇది రెండవది.

మరికొన్ని ముఖ్యాభరణాలు

ఇవే కాకుండా శ్రీవారి మూలమూర్తిని పాదాల నుండి శిరస్సు వరకు అలంకరించే మరికొన్ని ముఖ్య ఆభరణాల జాబితా, అదే క్రమంలో, ఇలా ఉంది:

1. శ్రీవారి పాదాల క్రిందనున్న బంగారు పద్మపీఠాన్ని కప్పుతూ ఉన్న నగిషీలు చెక్కిన బంగారు రేకు
2. కుడి ఎడమ పాదాలకు రెండు బంగారు కవచాలు
3. ఏడు కిలోల బరువైన బంగారు సూర్యకఠారి (ఖడ్గం)
4. వైకుంఠహస్తానికి బంగారుకవచం
5. వైకుంఠ హస్తానికి, కటిహస్తానికి చెరొక నాగాభరణం. వీటిని శ్రీమద్రామానుజుల వారు తయారు చేయించారు.
6. వైకుంఠ హస్తానికి నాగాభరణం క్రింద ఉండే కడియం
7. వైకుంఠహస్తాన్ని అలంకరించే రత్నాల దస్తుబందు
8. పెన్నా సిమెంట్స్ వారు ఐదు కోట్ల వ్యయంతో చేయించిన వజ్రాల కటి, వరద హస్తాలు
9. 'కమ్మరపట్టి' అనబడే బంగారు వడ్డాణం
10. దశావతార వడ్డాణం 11. బంగారు గంటల మొలత్రాడు
11. వక్షస్థల అమ్మవార్లకు రత్నాలతో కూడిన బంగారు కంటె
12. దశావతార హారం
13. అష్టోత్తర శతనామ హారం
14. నాలుగు పేటలతో కూడిన బంగారు మొహరీల గొలుసు
15. ఆరు ప్రోగుల బంగారు యజ్ఞోపవీతం
16. బంగారు పులిగోరు
17. రెండు భుజకీర్తులు
18. నాలుగు కిలోల బరువైన, రత్నాలు పొదిగిన శంఖం
19. నాలుగు కిలోల బరువైన, రత్నాలు పొదిగిన సుదర్శనచక్రం
20. మూడు కిలోల బరువున్న రవ్వల కర్ణాభరణాలు
21. రత్నాలు పొదిగిన కుడి, ఎడమ బంగారు బావళీలు 23. చంద్రవంక కంటి
22. వజ్ర ఖచితమైన అశ్వత్థపత్ర హారం (అశ్వత్థపత్ర మనగా రావి ఆకు)
23. భుజదండ భూషణాలు 26. రెండు పేటల బంగారు గొలుసు

24. ఐదు కిలోల బరువైన బంగారు గొడుగు
25. ఇరవై ముత్యాల హారాలు
26. యాభై కాసుల దండలు

ఎన్నో కిరీటాలు...

సకలలోక సార్వభౌముడు, దేవాధి దేవుడు అయిన శ్రీనివాసుని మకుటాల గురించి చెప్పుకోవాలంటే ఉద్గ్రంథమే అవుతుంది. శ్రీవారికి ఏడు ముఖ్యమైన కిరీటాలు ఉన్నాయి –

1. మామగారైన ఆకాశరాజుచే బహూకరింప బడ్డ తొమ్మిదిన్నర కిలోల బంగారు కిరీటం. దాదాపు ఐదువేల సంవత్సరాల నాటిదిగా భావించబడే ఈ కిరీటాన్ని 'ఆకాశరాజు కిరీటం' గా పిలుస్తారు.
2. ఇరవయ్యవ శతాబ్దపు ప్రథమార్థంలో అప్పటి దేవాలయ పురాతత్వ శాస్త్రవేత్త సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గారి ఆధ్వర్యంలో గద్వాల మహారాణి చేయించిన వజ్రకిరీటం
3. 2009వ సంవత్సరంలో గాలి జనార్దన్ రెడ్డి గారు సమర్పించిన, 42 కోట్ల రూపాయల విలువగల వజ్రాల కిరీటం
4. వేంకటేశ్వర హెచరీస్ సంస్థ సమర్పించిన 13 కిలోల కిరీటం
5. గోయెంకా కుటుంబం కానుకగా ఇచ్చిన 10 కిలోల బంగారు కిరీటం
6. 1945 సంవత్సరం లో తి.తి.దే. వారు చేయించిన వజ్రకిరీటం
7. 1986వ సంవత్సరంలో, అప్పుడే 5 కోట్ల రూపాయలు వెచ్చించి తి.తి.దే. వారు చేయించిన మరో వజ్రకిరీటం

ఇవే కాకుండా అరుదుగా వాడే లేదా అసలు ఉపయోగించని కిరీటాలెన్నో కూడా శ్రీవారి చెంత ఉన్నాయి.

అన్యమత భక్తుల కానుకలు

శ్రీవారి పరమభక్తులైన అన్యమతస్థులు సమర్పించుకున్న మరి కొన్ని ముఖ్యమైన నగలు ఉన్నాయి.

1. గుంటూరుకు చెందిన షేక్ హుస్సేన్ సాహెబ్ అనే మహమ్మదీయ భక్తుడు సమర్పించిన, శ్రీవారి నిత్యపూజకు వాడే 108 బంగారు పుష్పాలు
2. ప్రతి బుధవారం జరిగే అష్టదళ పాద పద్మారాధనలో స్వామి వారి అర్చనకు ఉపయోగించే, సయ్యద్ మీరా అనే మరో మహమ్మదీయ భక్తుడు సమర్పించిన 108 బంగారు పద్మాలు
3. ఆనాటి చిత్తూరు జిల్లా కలెక్టర్, శ్రీవారి భక్తుడు అయిన థామస్ మన్రో అనే క్రైస్తవ మతస్తుడు సమర్పించుకున్న 'మన్రో గంగాళం' గా ప్రసిద్ధి చెందిన, బంగారు గంగాళం

నానాటికీ, శ్రీవారి పట్ల భక్తి-విశ్వాసాలు ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో, తదనుగుణంగా కానుకలు కూడా వెల్లవెత్తుతున్నాయి. దాంతో శ్రీవారికి ఒకే రకమైన, 2, 3 లేదా అంతకంటే ఎక్కువ సెట్లున్న ఆభరణాలు ఎన్నో ఉన్నాయి.

ఎనిమిది దశాబ్దాల క్రితం ఆలయ యాజమాన్యం తి.తి.దే. ఆధ్వర్యంలోకి వచ్చినప్పటి నుండి, వారు కూడా తరచుగా

శ్రీవారికి అమూల్యమైన ఆభరణాలు చేయిస్తూనే ఉన్నారు. వారు తయారు చేయించిన ఆభూషణాల జాబితాలో ముఖ్యమైనవి:

- 1940 సంవత్సరంలో వజ్రకిరీటం
- 1954వ సం. లో వజ్రాల హారం
- 1972వ సంవత్సరంలో వజ్రాల శంఖు చక్రాలు
- 1974 లో వజ్రఖచిత కటిహస్తం
- 1986 లో వజ్రాల కిరీటం

ఆనందనిలయ విమానం స్వర్ణమయమని మనకు తెలిసిందే! దాదాపుగా వెయ్యేళ్ళక్రితం నుండే, ఆనందనిలయ గోపురానికి స్వర్ణకవచాన్ని తరచూ మార్చుతూ, దానికి మరిన్ని సొబగులు దిద్దుతున్నారు. అంతే కాకుండా, ఆలయంలోని అనేక ద్వారబంధాలు, తలుపులు, తిరుమామణి మంటపం పైకప్పు, ధ్వజస్తంభం ఇవన్నీ మేలిమిబంగారం పూతపూయబడి, ఎల్లవేళలా స్వర్ణకాంతు లీనుతుంటాయి. శ్రీవారికి కనకమహాలక్ష్మితో ఉన్న అనుబంధం అంతా ఇంతా కాదు. చివరికి అత్యంత కళాత్మకంగా తీర్చిదిద్దబడిన స్వర్ణరథం కూడా శ్రీవారి స్వంతమే!

శ్రీవారికి స్వర్ణాభరణాలే కాకుండా, వందలకొద్దీ వెండి ఆభరణాలు, బంగారం తాపడం చేయబడ్డ ఇతర లోహపాత్రలు, వెండి వాహనాలు, ఛత్రచామరాలు, ఉయ్యాలలు, శఠగోపురాలు లాంటివెన్నో ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ జాబితాకు అంతే లేదు. శ్రీనివాసుని కలియుగశోభ, వారి వైకుంఠవైభవాని కేమాత్రం తీసిపోని రీతిలో ఉంటుంది. ఇరులోకాల లోనూ, సర్వకాల సర్వావస్థల యందు శ్రీమహాలక్ష్మి వారి నంటిపెట్టుకొనే ఉండటం వల్లనే ఆ లక్ష్మీపతి కోట్లకు పడగలెత్తుతూ ప్రపంచం లోనే సంపన్నమైన దేవునిగా విలసిల్లుతూ, భక్తుల కొంగుబంగారమై ఒప్పారుతున్నాడు. **పుట – 96 తేదీ – ఆగష్టు, 26**

ఉత్సవమూర్తుల ఆభరణాలు

శ్రీవారి ఆలయంలో మూలమూర్తికి ఉన్న లెక్కలేనన్ని ఆభరణాలు ఒక ఎత్తయితే, ఉత్సవమూర్తులను అలంకరించే ఆభరణాలు మరో ఎత్తు.

మలయప్పస్వామి వారికి కూడా మూలవిరాట్ కేమాత్రం తీసిపోనన్ని ఆభరణాలు ఉన్నాయి. ధ్రువబేరం ఆభరణాలు చూడాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, తప్పనిసరిగా ఆనందనిలయం లోనికి ప్రవేశించి, శ్రీవారిని దర్శించుకోవలసిందే! అయితే మలయప్పస్వామి వారు మాత్రం తరచుగా మాడవీధుల్లో విహరిస్తూ, భక్తుల చెంతకే వచ్చి వారి ఆభరణ విశేషాలతో భక్తులకు కనువిందు చేస్తారు.

ఉత్సవమూర్తులకు అలంకరించే ముఖ్య ఆభరణాల జాబితా ఇలా ఉంది –

1. మలయప్పస్వామి వారికి నాలుగు కిలోల బంగారు కవచం
2. శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు రెండేసి కిలోల బరువున్న చెరొక బంగారు కవచం

3. కొలువు శ్రీనివాసమూర్తికి రెండు కిలోల బంగారు మకరతోరణం
4. రెండు కిలోల బంగారు పద్మాలు
5. రెండున్నర కిలోల బరువైన బంగారు చేతి గంట
6. రెండు కిలోల బరువున్న బంగారు బిందె
7. రెండు కిలోల బరువున్న బంగారు గిన్నెలు
8. రెండు కిలోల బంగారుపళ్ళెం
9. ఒక కిలో బరువైన బంగారు ధనుస్సు
10. ఒక కిలో బరువున్న బంగారు తట్ట
11. రెండు కిలోల బరువున్న బంగారు పళ్లెం
12. నగిషీలు చెక్కిన బంగారు బెత్తం
13. బంగారు చెంబు
14. పచ్చలు, కెంపులు పొదిగిన బంగారు కిరీటం
15. రెండున్నర కిలోల బరువున్న 108 లక్ష్మీ పతకాల మాల
16. మూడు కిలోల బరువైన వజ్రకవచ కిరీటం

– ఇంకా ఎన్నో! ఎన్నెన్నో!!

ఇవన్నీ కాకుండా రత్నాలు, వజ్రవైఢూర్యాలు, పచ్చలు, కెంపులు, గోమేదధికాల వంటి నవరత్నాలకైతే లెక్కేలేదు.

ఇవన్నీ శ్రీవారి ముఖ్యాలయంలో ఉండే నగలు మాత్రమే. ఇవి కాకుండా ఆదివరాహస్వామి ఆలయంలో, భాష్యకార్ల సన్నిధిలో, యోగా నరసింహ స్వామికి, వరదరాజస్వామికి, బేడి ఆంజనేయస్వామి వారికి కూడా లెక్కకు మిక్కిలిగా ఆభరణాలున్నాయి.

ఆభరణాల రికార్డులు

దేవాలయానికి చెందిన రికార్డు పుస్తకాల్లో 1933వ సంవత్సరంలో యాజమాన్య మార్పిడి జరిగినప్పుడు, మహంతుల నుండి తి.తి.దే. ధర్మకర్తల మండలికి సంక్రమించిన ఆభరణాలు, ఆస్తులకు సంబంధించిన వివరాలన్నీ విస్పష్టంగా పొందుపరచబడ్డాయి. ఆ ఆభరణాలన్ని నేటికీ పదిలంగా ఉన్నాయి. అయితే, 1933వ సంవత్సరానికి ముందు అంటే మహంతుల పరిపాలనా కాలంలో; అంతకు ముందున్నటువంటి బ్రిటిష్ వారు, ఆర్కాట్ నవాబుల కాలంలో భక్తులు శ్రీవారికి సమర్పించుకున్న కానుకల వివరాలు రికార్డుల్లో పూర్తిగా నమోదు కాలేదు.

శోధన – పరిశోధన

శ్రీవారి ఆభరణాల భద్రత విషయమై సమగ్రమైన పరిశీలన చేయడం కోసం ఒక విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ వేయడం జరిగింది. ఆ కమిటీ ఈ క్రింది విషయాలపై విస్తృతమైన పరిశీలన జరిపింది.

- స్వామివారి ఆలయంలో మూడు తరగతులకు చెందిన; అంటే – *సదా సమర్పణ ఆభరణాలు, విశేష సమర్పణ ఆవరణాలు, మొజాతి ఆభరణాలు* అన్ని భద్రమేనా?
- వాటిని వెలుపలకు తీస్తున్నప్పుడు, శ్రీవారికి, ఉత్సవమూర్తులకు అలంకరిస్తున్నప్పుడు, వినియోగించిన తరువాత బీరువాలో తిరిగి భద్రపరిచేటప్పుడు సరియైన జాగ్రత్తలు తీసుకుంటున్నారా ?
- ఏ ప్రాతిపదిక పైన మరమ్మతులు చేయిస్తారు? అలా చేయించినప్పుడు ఏర్పడే తరుగుదలను ఎలా నిర్ధారిస్తారు ?
- హుండీద్వారా సమర్పించబడిన నగలను ఎలా భద్రపరుస్తారు?
- ఏ ఏ తరగతులకు చెందిన ఆభరణాలకు ఎవరు బాధ్యులు?
- నగల విలువను ఎలా నిర్ధారిస్తారు?
- వాటిని ఒక చోట నుండి మరొక చోటికి తరలించే టప్పుడు ఏ విధమైన రక్షణ ఏర్పాట్లు చేయాలి ?

ఈ విషయాలన్నింటిపై విస్తారంగా అధ్యయనం చేసిన అనంతరం ఆ కమిటీ తి.తి.దే. బోర్డుకు సమర్పించిన నివేదికలో ఈ విషయాలు పొందుపరచబడ్డాయి.

- నిత్యం స్వామివారికి అలంకరించే నగలలో గాని, వాడుకలో లేకుండా ట్రెజరీలో భద్రపరచబడిన నగలలో గాని, హుండీలో భక్తులు సమర్పించే ఆభరణాల విషయంలో గాని ఏ విధమైన అవకతవకలు జరగటానికి అవకాశం లేదు. వాటన్నింటినీ పరిరక్షించడానికి కట్టుదిట్టమైన వ్యవస్థ ఉంది.
- ఆలయంలో ఉండే చిన్న–పెద్ద, కొత్త–పాత నగలన్నింటిని పరీక్షించి, అవి నిఖార్సైన బంగారు నగలే అని ధ్రువీకరించారు.
- బీరువాలో భద్రపరిచిన నగల వివరాలను ఆయా రిజిస్టర్ లలో ఉన్న వివరాలతో పోల్చి, అన్నీ సక్రమంగా ఉన్నాయని తేల్చి చెప్పారు.
- నిఘా వ్యవస్థ చాలా కట్టుదిట్టంగా ఉన్నదని, అవసరమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని నిరంతరం పరిశీలించే పటిష్ఠమైన వ్యవస్థ కూడా ఉన్నట్లుగా కమిటీ అభిప్రాయపడింది.
- భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారికి సమర్పించుకున్న నగలు చోరీకి గురైనట్లు అప్పుడప్పుడు ప్రసారమాధ్యమాల్లో వచ్చే వార్తలు నిజం కాదని; ఒకరో ఇద్దరో క్రింది స్థాయి ఉద్యోగులు చాలా అరుదుగా ఆభరణాల విషయంలో అవినీతికి పాల్పడినప్పటికీ, అటువంటి వారి విషయంలో ఆలయ యజమాన్యం కఠినంగా వ్యవహరించి, ఎప్పటికప్పుడు భద్రతా ఏర్పాట్లను పునఃసమీక్షించుకుంటూ, దేవాలయ యాజమాన్యం పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని నిలబెట్టే విధంగా విశేషమైన కృషి జరుగుతోంది.
- ఆభరణంలోని ఏదైనా రాయి ఊడినా, ఆభరణం విరిగినా, ఎప్పటికప్పుడు ఆ విషయాలన్నీ రికార్డుల్లో నమోదు చేయబడతాయి. విరిగిన రాళ్లు, ముక్కలు కూడా మిల్లీగ్రాములతో సహా లెక్కగట్టి, వాటిని విడిగా భద్రపరిచే సంప్రదాయం అమలులో ఉంది.
- ప్రతి ఆభరణానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు సంఖ్యను పేర్కొని, ఆ ఆభరణం యొక్క పూర్తి వివరం, బరువు, రాళ్ల సంఖ్య, ఏ జాతి రాళ్ళు మొదలగు వాటన్నింటినీ రిజిస్టర్ లలో లేదా కంప్యూటర్ లో నమోదు చేస్తారు.
- ఏ ఆభరణాన్నైనా దాని నిర్దిష్టస్థానం నుంచి ఏ కారణం చేతనైనా బయటకు తీసినట్లయితే, – దానిని ఎందుకు బయటకు తీయవలసి వచ్చింది, ఏ తేదీ నాడు ఎవరిద్వారా తీయబడింది, మరలా ఎప్పుడు యథా స్థానానికి

చేరింది – వంటి వివరాలు కూడా తప్పనిసరిగా నమోదు చేయబడుతున్నాయి.

- 1933వ సంవత్సరంలో తి.తి.దే. యాజమాన్యం లోకి వచ్చినప్పుడు, మహంతుల ద్వారా అప్పగించబడిన నగలన్నీ యథాతథంగా ఈనాటికీ ఉన్నాయని, ఎటువంటి అవకతవకలు జరగలేదని కమిటీ తేల్చి చెప్పింది.

కుప్పలు తెప్పలుగా ఉన్న స్వర్ణాభరణాలన్నీ కేవలం స్వామివారి భౌతిక సంపత్తి అయితే; శ్రీవారిపట్ల కోట్లాది భక్తుల గుండె సవ్వళ్ళలో గూడు కట్టుకున్నట్టి, వెలకట్ట సాధ్యం కాని ప్రేమాభిమానాలు, భక్తితత్పరతలు వారికి అసలైన ఆభూషణాలు.

ఆ ఆనందనిలయుని అలంకారాలన్నీ భక్తులు తనివితీరా చూసి సంతృప్తి చెందడానికే గానీ, వారికివన్నీ నిమిత్తమాత్రం.

వేల సంవత్సరాల క్రితం ఏ విధమైన ఆచ్ఛాదనా లేని ఒక చిన్న నాలుగు కాళ్ళ మంటపంలో చిన్న కౌపీనంతో ఉన్నప్పుడు; బంగారువిమానం క్రిందనున్న భవ్యమందిరంలో వేలకోట్ల ఆభరణాలను ధరిస్తూ షట్కాలపూజలందు కొంటున్న ప్రస్తుత తరుణంలో అదే చిద్విలాసం, అదే వరదహస్తం. పగిలిన కుండపెంకులో చద్దెన్నం పెట్టిన నిరుపేద కుమ్మరిభీమన్నను; కోట్లరూపాయలు విలువైన ధన, కనక, వస్తు, వాహనాలను సమర్పించుకున్న దక్షిణభారత చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలును స్వామివారు ఒకే రీతిగా కరుణించారు.

'వడ్డికాసులవాడిగా' తాను పేరు తెచ్చుకొని, వచ్చిన కానుకలన్నింటినీ పరోపకారార్థమే వినియోగించే, వితరణశీలి అయిన ఆ మాధవుడు చేసే 'మానవసేవ' గురించి మరొక ప్రకరణంలో వివరంగా తెలుసుకుందాం.

బహుశా భద్రతా కారణాల వల్ల శ్రీవారి ఆభరణాల సంబంధించిన సమగ్రమైన సమాచారం బహిరంగంగా మాధ్యమంలో అందుబాటులో లేదు. అత్యంత అరుదుగా పత్రికల్లో ప్రచురించబడే వార్తలు, ప్రత్యేక కథనాలు, ఆలయంతో చిరకాల అనుబంధం ఉన్న వ్యక్తుల నుండి ముఖతః లభించిన సమాచారం, వీటన్నింటినీ సమన్వయ పరచడం ద్వారా పై వివరాలు సేకరించబడ్డాయి. **పుట – 97 తేదీ – ఆగష్టు, 27**

కపిలతీర్థం

సప్తగిరుల సమారోహమైన తిరుమల కొండ పాదభాగంలో తిరుపతి పట్టణ శివారులో ఉన్న కపిలేశ్వరస్వామి ఆలయం, తిరుపతి వాసులకు అత్యంత ప్రీతిపాత్రమైన దేవాలయం. తిరుమల యాత్రికులతోనూ, స్వామిని అనునిత్యం దర్శించుకునే తిరుపతి పట్టణవాసుల తోనూ కపిలేశ్వరస్వామి ఆలయం ఎల్లవేళలా కళకళలాడుతూ సందడిగా ఉంటుంది. కార్తీకమాసం మరియు ఇతర ముఖ్య పర్వదినాలలో పోటెత్తిన భక్తులు జనసంద్రాన్ని తలపిస్తారు. ఈ దేవాలయ సముదాయానికి ఎదురుగా అలిపిరికి వెళ్ళే దారిలో, ఈమధ్య కాలం లోనే ప్రతిష్ఠించబడ్డ; కపిలేశ్వరస్వామికి అభివాదం చేస్తూ గంభీరంగా కూర్చొనివున్న నందీశ్వరుని విగ్రహం ముచ్చట గొలుపు తుంటుంది. అందువల్లనే ఈ కూడలిని 'నంది సర్కిల్' గా పిలుస్తారు. ఈ ప్రాంతం నుండే తిరుమల శోభ ప్రారంభమవుతుంది. ముఖ్యంగా శివరాత్రి పర్వదినాల్లో, తిరుమలలో బ్రహ్మోత్సవాలు జరిగేటప్పుడు, ఈ ప్రాంతమంతా విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుంది.

కపిలేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సమున్నతమైన పర్వతశ్రేణుల నుంచి జాలువారే పవిత్ర జలధారను 'కపిలతీర్థం' గా వ్యవహరిస్తారు. శేషాచల శ్రేణుల్లోని ఏడుకొండల నుంచి ప్రవహించే వందల కొద్ది జలప్రవాహాలు ఒకదానితో ఒకటి సమ్మిళితమై, ఉధృతమైన జలపాతం గా మారి, ఈ తీర్థంలో బహిర్గతమవ్వడం ద్వారా ఆ సప్తగిరుల మహిమ లన్నింటినీ పుణికిపుచ్చుకున్న ఈ కపిలేశ్వరతీర్థానికి విశేషమైన పౌరాణికప్రాశస్త్యం ఉంది.

ఒక ప్రక్క ఎత్తయిన పర్వతశిఖరాలు, మరో ప్రక్క దట్టమైన, ఆకుపచ్చని అడవులు; మధ్యలో దివి నుండి భువికి వస్తున్నట్లుగా కానవచ్చే జలపాతం.

ఆ ప్రకృతి సోయగం చూసి తీరవలసిందే గానీ, వర్ణింపశక్యం కాదు.

కార్తీకమాసపు ప్రాతఃసంధ్యా సమయంలో చలికి గజగజా ఒణుకుతూ, శివకేశవులను స్మరించుకుంటూ, ఈ చల్లటి జలధార క్రింద పవిత్ర స్నానమాచరిస్తూ పరశమొందటం ఒక ఆధ్యాత్మిక మధురానుభూతి. ఆ మాసంలో కపిలతీర్థం ఎదురుగా ఉన్న పుష్కరిణికి ఇరుప్రక్కలా ఉన్న సంధ్యావందన మండపాలు, మండలదీక్ష లోనున్న అయ్యప్పస్వాముల తోనూ, పుష్కరిణి జలాలు గగనాన మెరిసే తారలను స్మరణకు తెచ్చే అరిటాకు దొన్నెల కార్తీక దీపాలతోనూ; ఉత్సవశోభను తలపిస్తాయి.

ఆ పేరెలా వచ్చింది?

'కపిలతీర్థాని' కి ఆ పేరు రావటం వెనుక ఒక ఆసక్తికరమైన పౌరాణిక గాథ ఉంది.

విశ్వంలో సృష్టిని విస్తరింప జేయడానికై బ్రహ్మ ద్వారా ఉద్భవించిన ప్రజాపతులలో ఒకరైన 'కర్దమప్రజాపతి' కి లోకకల్యాణార్థం సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే 'కపిలుడు' అనే పేరు గల పుత్రునిగా జన్మించాడు. దైవాంశ

సంభూతుడైన ఆ బాలుడు కౌమారావస్థలో ఉండగానే తండ్రి కర్దమప్రజాపతికి, తల్లి 'దేవహూతి' కి 'కపిలగీత' అనబడే ఆధ్యాత్మిక సారాన్ని బోధించి; వారిరువురికి ముక్తిని ప్రసాదించాడు. తదనంతరం ప్రశాంతమైన ప్రదేశం కోసం అన్వేషిస్తూ, పాతాళలోకానికి చేరుకొని, అక్కడ ఒక ఆశ్రమాన్ని నిర్మించుకుని, అందులో శివలింగాన్ని ప్రతిష్ఠించి తీవ్రమైన తపమాచరిస్తుండేవాడు.

అదే సమయంలో ఇక్ష్వాకువంశస్తుడు, శ్రీరామచంద్రునికి పూర్వజుడు అయిన సగరచక్రవర్తి అశ్వమేధయాగాన్ని తలపెట్టి; అత్యంత ప్రతిభాశాలి, మిక్కిలి సమర్థవంతుడు అయిన తన మనుమడు అంశుమంతుని రక్షణలో యాగాశ్వాన్ని విడిచిపెట్టాడు. ఇంద్రదేవుడు అతని యాగాన్ని భగ్నం చేయడం కోసం ఆ అశ్వాన్ని తస్కరించి పాతాళలోకంలో ఉన్న కపిలమహర్షి ఆశ్రమంలో విడిచిపెట్టాడు. యాగాశ్వం జాడ ఎంతకూ తెలియక పోవడంతో, సగరుని ఆజ్ఞ మేరకు అతని అరవై వేల మంది పుత్రులు భూమండలమంతా గాలించారు. అప్పుడు కూడా అశ్వం కానరాక పోవడంతో, భూమినంతా ఒక్కొక్కరు ఒక్కొక్క యోజనం చొప్పున పంచుకొని, మొత్తం 60 వేల యోజనాల పృథ్వీమండలాన్ని పాతాళం వరకు త్రవ్వుకుంటూ పోయారు. పాతాళలోకంలో మిగిలిన మూడు దిక్కులను ఆసాంతం గాలించిన తర్వాత, ఉత్తరదిక్కున కపిలమహర్షి ఆశ్రమంలో మేత మేస్తున్న యాగాశ్వం వారికి కనబడింది. కపిలమహర్షే ఆ అశ్వాన్ని దొంగిలించాడని భ్రమపడ్డ సగరపుత్రులు అతనిని దుర్భాషలాడగా, తపోభంగంతో కోపోద్రిక్తుడైన మునీశ్వరుడు దిక్కులు పిక్కటిల్లేలా 'హుంకారం' చేశాడు. దాంతో సగరపుత్రులు భస్మమై బూడిదరాశిలా మారిపోయారు.

అశ్వపు జాడ గానీ, తన పుత్రుల యోగక్షేమాలు గానీ ఎంతకూ తెలియకపోవడంతో తల్లడిల్లిన సగరుడు తన మనుమడైన అంశుమంతుని పిలిచి తన పినతండ్రుల జాడ తెలుసుకో వలసిందిగా ఆదేశించాడు.

సగరుని దేవేరులిద్దరిలో పెద్దభార్యకు 'అసమంజసుడు' అనే అయోగ్యుడు పుత్రునిగా జన్మించగా; చిన్నభార్యకు అరువది వేల పుత్రులు కలిగారు. కొన్ని అకృత్యాల కారణంగా దేశబహిష్కారానికి గురైన అసమంజసుని కుమారుడే 'అంశుమంతుడు'. ఆ విధంగా సగరుని అరువదివేల పుత్రులు అంశుమంతునికి పినతండ్రులవుతారు.

బుద్ధికుశలుడు, పరాక్రమవంతుడు, వినయశీలి అయిన అంశుమంతుడు తాతగారి ఆజ్ఞ మేరకు ఎట్టకేలకు పాతాళలోకం లోని కపిలమహర్షిని ప్రసన్నం చేసుకొని; అతని ఆశ్రమంలో ఉన్న యాగాశ్వాన్ని తెచ్చి తన తాతగారి యజ్ఞాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేయించాడు. అయితే, అంశుమంతుడు కపిలముని క్రోధాగ్నిలో భస్మమయిన తన పినతండ్రులకు ఉత్తమగతులు కలిగించలేక పోయాడు. తదనంతరం అంశుమంతుని కుమారుడైన దిలీపుడు కూడా తన జీవితకాలమంతా ప్రయత్నించి నప్పటికీ తన పూర్వీకులకు ఊర్ధ్వలోకాలు కల్పించలేక పోయాడు. దిలీపుని పుత్రుడైన భగీరథుడు మాత్రం తీవ్రమైన తపస్సు చేసి దేవలోకం నుండి గంగను భూమికి రప్పించి, అక్కడి నుండి గంగానదిని పాతాళ లోకానికి తోడ్కొని వెళ్లి, ఆ నదీప్రవాహాన్ని సగరపుత్రుల అస్తికల పైకి మళ్లింప జేస్తాడు. పవిత్ర గంగానది స్పర్శచే సగరపుత్రులందరికీ ఉత్తమలోకాలు సంప్రాప్తించాయి. అప్పటినుండి గంగానది భగీరథుని వల్ల దివి నుండి భువికి రావడం వల్ల భూలోకంలో 'భాగీరథి' గాను; పాతాళలోకంలో 'భోగవతి' గానూ ఖ్యాతి గాంచింది.

దేవలోకం, భూలోకం, పాతాళలోకం, ఇలా మూడు లోకాల యందు ప్రవహించడం వల్ల; గంగానది 'త్రిపథగామిని' గా కూడా పిలువ బడుతుంది.

కపిలమహర్షి తనకు సమీపంలోనే ఉన్న కామధేనువుతో కలసి, తన ఆశ్రమం లోని శివలింగాన్ని పూజిస్తుండేవాడు. ఆ శివలింగాన్ని కపిలుడు భోగవతి నదీజలాలతో అభిషేకించగా; కామధేనువు తన క్షీరధారతో అభిషేకం చేసేది. పరమ పవిత్రమైన, భోగవతిగా పిలువబడే దివ్యలోకపు గంగానది యొక్క పవిత్ర జలాల స్పర్శతోనూ; క్షీరసాగరమథనంలో ఉద్భవించిన కామధేనువు యొక్క అమృత తుల్యమైన క్షీరస్పర్శ తోనూ; అపరిమితమైన మహత్తును సంతరించుకున్న ఆ శివలింగం దినదిన ప్రవర్ధమాన మవుతూ, విపరీతంగా పెరగసాగింది. అలా ఊర్ధ్వముఖంగా పెరుగుతున్న శివలింగం, పాతాళలోకం నుండి భూమిని చీల్చుకుని ఈ ప్రదేశంలో, అంటే ప్రస్తుతం కపిలేశ్వరస్వామి ఆలయమున్న ప్రదేశంలో బహిర్గతమైంది.

ఆ విధంగా, కపిలునిగా ఉద్భవించిన శ్రీమహావిష్ణువు పూజించుకున్న శివలింగం, శ్రీమహావిష్ణువే శ్రీనివాసునిగా వెలసిన వేంకటాచల పాదభాగంలో 'కపిలేశ్వరునిగా' ఆవిర్భవించిందన్న మాట. శివకేశవులకున్న బలీయమైన ఆత్మీయ అనుబంధాన్ని చాటి చెప్పడానికిదో ప్రబలమైన తార్కాణం.

లింగంతో పాటుగా, దాన్ని ప్రతి దినము అర్చిస్తున్న కామధేనువు కూడా తన నిత్యార్చనను కొనసాగించడానికై బిలమార్గం ద్వారా పాతాళలోకం నుంచి భూమిపైకి చేరుకుంది. శివలింగం, కామధేనువులకు తోడుగా, భోగవతి నది కూడా ఆ లింగేశ్వరుణ్ణి అభిషేకించు కోవడం కోసం పాతాళలోకం నుండి భువికేతెంచి, శేషాచలశ్రేణుల్లో తీర్థంగా ఆవిర్భవించింది. కపిలేశ్వరుని ఆరాధించుకోవడం కోవడం కోసం పాతాళలోకం నుండి భువికి రావడం వల్ల ఈ తీర్థం 'కపిలతీర్థం' గా పేరు గాంచింది.

అలా కపిలమునిచే అర్చింపబడి, భూమిని చీల్చుకువచ్చిన శివలింగమే 'కపిలలింగం' లేదా 'కపిలేశ్వరస్వామి' గానూ; పాతాళలోకం నుంచి ఉబికి వచ్చిన భోగవతి నది 'కపిలతీర్థం' గానూ; కపిలేశ్వరుడు కొలువైయున్న ప్రదేశం 'కపిలేశ్వర ఆలయం' గానూ వినుతికెక్కాయి.

అపరిమిత శక్తిసంపన్నురాలైన కామధేనువు భూగోళాన్ని బ్రద్దలు కొట్టుకొని ఆవిర్భవించిన శివలింగం మరింత పెరగకుండా; 'మావర్ధస్వ' (మరింత పెరగవద్దు) అంటూ కపిలేశ్వరుణ్ణి ప్రార్థిస్తూ, లింగోపరితల భాగాన్ని తన కాలిగిట్టతో అణచివేసింది. అంతటితో తన పెరుగుదలకు స్వస్తి పలికిన లింగం యొక్క పైభాగంలో కామధేనువు యొక్క కాలిగిట్ట గుర్తులు నేటికీ ముద్రాంకితమై ఉంటాయని, కపిలేశ్వరుడు అలంకార రహితంగా ఉన్నప్పుడు ఆ కాలిగిట్ట గుర్తులను నేటికీ చూడవచ్చని చెబుతుంటారు.

మరికొన్ని పేర్లు !!

కపిలేశ్వరస్వామికి ఇంకా అనేక నామధేయాలున్నాయి.

- ఒకానొకప్పుడు అగ్నిదేవుడు ఆరాధించడం వల్ల దీనిని 'అగ్నిలింగం' అని కూడా పిలుస్తారు.

- పురాణకాలంలో పరమశివుడు తాను కూడా వేంకటాచలంలో నివసించటానికి శ్రీనివాసుణ్ణి అనుమతి కోరుతాడు. అంతట శ్రీనివాసుడు తిరుమలక్షేత్రానికి ఆగ్నేయంగా ఉన్న ఈ ప్రదేశంలో స్థిరనివాస మేర్పరచు కొనవలసిందిగా పరమశివునికి సూచిస్తాడు. అప్పటినుండి పరమశివుడు ఆ ప్రదేశంలో లింగాకారంలో కొలువై ఉండటం వల్ల ఇది 'ఆగ్నేయలింగం' గా వినుతికెక్కింది.
- ఈ శివలింగాన్ని విష్ణువుకు ఆయుధమైన సుదర్శనచక్రం ఆరాధించడం వల్ల దీన్ని 'చక్రత్తాళ్వార్ తీర్థం' గా పిలుస్తారు. శ్రీవేంకటేశ్వరుని పరమభక్తులైన విజయనగర చక్రవర్తుల కాలంలో ఈ పేరు జనబాహుళ్యంలో విరివిగా వాడుకలో ఉండేది.
- కామధేనువు పుత్రిక అయిన 'కపిల గోవు' ఈ శివలింగాన్ని ఆరాధించడం వల్ల ఇది 'కపిలేశ్వరలింగం' గా ప్రసిద్ధి చెందిందనే మరో పౌరాణిక కథనం కూడా ఉంది. **పుట – 98 తేదీ – ఆగష్టు, 28**

చరిత్రపుటల్లో కపిలతీర్థం

తిరుమల సమీపంలోని 'కొత్తూరు' అనే గ్రామానికి చెందిన 'రాయన్న రాజేంద్రచోళుడు' అనే ప్రాంతీయ పాలకుడు, పదకొండవ శతాబ్దపు ప్రథమార్థంలో కపిలేశ్వరస్వామి ఆలయం యొక్క గర్భాలయాన్ని నిర్మించాడు. తరువాతి కాలంలో శ్రీకృష్ణదేవరాయలు తర్వాత అధికారంలోకి వచ్చిన అతని తమ్ముడు అచ్యుతదేవరాయలు, మునుపెన్నడో కపిలతీర్థానికి గల 'సుదర్శన చక్ర తీర్థం' లేదా 'చక్రత్తాళ్వార్ తీర్థం' అనే నామాంతరాన్ని స్ఫురణకు తెస్తూ, కపిలతీర్థం పుష్కరిణికి నాలుగు మూలలలో నాలుగు 'సుదర్శనచక్ర శిలాయంత్రాల' ను ప్రతిష్ఠించి తన విష్ణుభక్తిని చాటుకున్నాడు. వాటిలో మూడింటిని ఈనాడు కూడా దర్శించుకోవచ్చు. నాలుగవ యంత్రం తర్వాతి కాలంలో చేపట్టిన నూతన నిర్మాణాలలో కలిసిపోయింది. అచ్యుతరాయల కాలంలోనే, కోనేటికి ఇరుప్రక్కలా చెక్కడపు శిలాస్తంభాలతో కూడిన పొడవాటి సంధ్యావందన మంటపాలు ఏర్పాటు చేయబడ్డాయి. అచ్యుతరాయలు తదనంతరం సదాశివరాయలు కాలంలో కూడా కపిలతీర్థం ఆలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడ్డాయి.

విజయనగర చక్రవర్తుల అనంతరం కొంతకాలం కరకంబాడి పాలెగార్ల అధీనంలో ఉన్న తరువాత, ఈ ఆలయం 1843వ సంవత్సరంలో మహంతుల పాలనలోకి వచ్చింది. 1865వ సంవత్సరంలో అప్పటి విచారణకర్త అయిన 'మహంతు ధర్మదాస్' కోనేటి మెట్లను, సంధ్యావందన మంటపాలను పునరుద్ధరించి; ఆలయంలో కొన్ని సేవలను కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపే శాసనాలు లభించాయి. ఆ తరువాత తి.తి.దే. హయాంలో ఆలయం మరింత అభివృద్ధి చెందింది.

ఆలయ వైశిష్ట్యం

కొండకోనల్లో నుండి మహోధృతంగా దుముకుతూ భూమిపై జాలువారే కపిలతీర్థం సోయగాలను దర్శించుకుంటూ పుష్కరిణికి ఆగ్నేయ మూలలోని మెట్లెక్కి కపిలేశ్వరస్వామి ఆలయంలోకి ప్రవేశిస్తాం. ఈ మార్గం తిన్నగా కళ్యాణమండపం లోకి దారి తీస్తుంది. కపిలేశ్వరునికి–కామాక్షమ్మవారికి జరిగే నిత్య, వార, మాస, సంవత్సరోత్సవాలలో చాలా వరకు ఈ మంటపం లోనే జరుగుతాయి. ఈ మంటపంలోని సిద్ధివినాయకుణ్ణి

దర్శించుకున్న తరువాత, ధ్వజస్తంభమంటపం లోనికి ప్రవేశిస్తాం. శిల్పసౌందర్యం ఉట్టిపడే ధ్వజస్తంభ పీఠంపై, వెండితో తాపడం చేయ బడిన ఇరవై అడుగుల పొడవు గల ధ్వజస్తంభం ప్రతిష్ఠించబడింది. ధ్వజస్తంభానికి అన్ని దిక్కుల్లోనూ శివపరివార దేవతామూర్తులు మనోహరంగా మలచబడ్డాయి.

కపిలేశ్వరస్వామి సన్నిధి

ధ్వజస్తంభ మంటపానికి అభిముఖంగా, ప్రవేశద్వారాని కిరుప్రక్కలా, వైష్ణవాలయాల లోని జయవిజయులను తలపుకు తెస్తూ; 'దిండి'–'ముండి' అనే శివకింకరులు నిలుచుని ఉంటారు. చతుర్భుజధారులైన వారిరువురూ ఢమరుకం, త్రిశూలం, గదాయుధాలతో అప్రమత్తంగా ఉండి; భక్తులకు స్వాగతం పలుకుతుంటారు. ఈ ప్రవేశద్వారాన్ని దాటి ముఖమండపం లోనికి ప్రవేశిస్తాం. శతాబ్దకాలం క్రితం వరకు కపిలేశ్వరస్వామి వారి ప్రీత్యర్థం, ఈ మంటపంలో దేవదాసీలు నృత్యం చేస్తుండడంతో దీన్ని 'నాట్యమంటప' మని కూడా పిలుస్తారు. దేవునికి సమర్పించే షోడశోపచారాలలో – నృత్యోపచారం, అనగా నాట్యప్రదర్శనం – కూడా ఒకటి.

ఈ మధ్యకాలం వరకూ ఈ మండపంలోని శిలాస్తంభాలపై అద్భుతమైన కళాకృతులు చెక్కబడి ఉండేవి. తరువాత చేపట్టబడిన పునరుద్ధరణ కార్యకలాపాల వల్ల అవన్నీ కనుమరుగై పోయాయి. కపిలేశ్వరస్వామికి అభిముఖంగా నందీశ్వరుడు ఆసీనుడై ఉంటాడు.

గర్భాలయం

గర్భాలయ ప్రవేశద్వారాని కిరువైపులా శివపుత్రులైన 'గణపతి', 'కుమారస్వామి' భక్తితో నిలుచుని ఉంటారు. ప్రవేశద్వారం పైభాగంలో చతుర్భుజుడైన శ్రీమహావిష్ణువును కూడా దర్శించుకోవచ్చు. స్వయంభువుగా వెలసిన, ఆలయ ప్రధాన దైవమైన కపిలేశ్వరస్వామి గర్భాలయంలో పశ్చిమాభిముఖుడై, లింగాకారంలో దర్శనమిస్తారు. పానవట్టంతో సహా మూడడుగుల ఎత్తుండే, నాలుగు ముఖాలు కలిగిన ఈ లింగం దాదాపుగా దీర్ఘ చతురస్రాకారంలో ఉంటుంది. ఈ శివలింగం క్రింది భాగంలో రజతవర్ణం తోనూ, మధ్యభాగంలో స్వర్ణకాంతులీనే బంగారువర్ణం తోనూ, అగ్రభాగాన తామ్రవర్ణం తోనూ, ఇలా మూడు రంగులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ లింగాకారంలో త్రినేత్రాలను కూడా స్పష్టంగా దర్శించుకోవచ్చు. లింగోపరితలభాగంపై కామధేనువు యొక్క కాలిగిట్టల గుర్తులను కూడా చూడవచ్చు. అయితే, కపిలేశ్వరుడు ఎల్లవేళలా నిండుగా పుష్పాలంకృతుడై ఉండటంవల్ల భక్తులు సాధారణంగా లింగాకారాన్ని మాత్రమే చూడగలరు.

లింగోద్భవ ఘట్టం

గర్భాలయ ప్రవేశద్వారానికి ప్రక్కగా, కపిలేశ్వర మహాలింగోద్భవ ఘట్టం ఈ మధ్య కాలంలోనే నిర్మించబడింది. ఆదిశేషుని యొక్క ఏడుపడగలపై భూమండలం; ఆ భూమిని చీల్చుకు వచ్చిన లింగాకారం లోని కపిలేశ్వరుడు; వారికి క్షీరాభిషేకం చేస్తున్న కామధేనువు; లింగాన్ని అర్చిస్తున్న కపిలమహర్షి; వారి ప్రక్కనే గోపాలుని వేషంలో ఉన్న

శ్రీమహావిష్ణువు – ఈ కళాకృతులన్నీ సిమెంట్ తో మనోహరంగా మలచబడ్డాయి.

కామాక్షి అమ్మవారు

లింగోద్భవ ఘట్టానికి ప్రక్కనే ఉన్న మరో గర్భాలయంలో కామాక్షి అమ్మవారిని కాంచవచ్చు. అమ్మవారి గర్భాలయానికి ఎదురుగా, ముచ్చట గొలిపే రీతిలో వారి సింహవాహనం ప్రతిష్ఠించబడి ఉంది. కపిలేశ్వరుని దేవేరి అయిన పార్వతిదేవి ఈ క్షేత్రంలో 'కామాక్షిదేవి' గా పిలువబడుతుంది.

పరివార దేవతలు

శివపరివారంలో అత్యంత ప్రముఖుడిగా భావింపబడే **శ్రీచండికేశ్వరస్వామి**, ప్రదక్షిణాపథంలో దక్షిణాభిముఖంగా కొలువై ఉంటాడు. కపిలేశ్వరాలయంలో ప్రతిరోజు మొట్టమొదటి పూజ **శ్రీశివసూర్యస్వామికి** జరుగుతుండగా, రాత్రి చిట్టచివరి పూజ చండికేశ్వరునికి జరుప బడుతుంది.

కపిలేశ్వరుడు–కామాక్షి అమ్మవార్ల దర్శనానంతరం, సన్నిధికి దక్షిణంగా ఉన్న ద్వారంలోంచి నిష్క్రమిస్తే, మొట్టమొదటగా పరివారదేవతా మంటపం లోకి ప్రవేశిస్తాం. ఈ మండపంలో శ్రీకాలభైరవస్వామి, దక్షిణామూర్తి, మహాగణపతి, మహాశాస్త, కాశీవిశ్వేశ్వరస్వామి, ఉమామహేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, గణపతి, శివసూర్యస్వామి, నటరాజస్వామి యొక్క మూర్తులను; ఆ మూర్తుల సముదాయానికి ఎదురుగా, శ్రీవల్లీ–దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకోవచ్చు. ఈ ప్రాంగణం లోనే, ప్రతి నిత్యము స్వామి అమ్మవార్లకు పవళింపు సేవ జరిగే 'ఏకాంతసేవ మంటపం' లేదా 'అద్దాలమంటపం' కూడా ఉంది. మరో మంటపంలో నృత్యభంగిమలో ఉన్న నటరాజస్వామిని కూడా దర్శించుకోవచ్చు. ఉత్సవమూర్తుల మంటపం కూడా ఇక్కడే ఉంది. ఈ మంటపంలో శ్రీసోమాస్కందమూర్తి, కామాక్షిదేవి, శుక్రవారపుదేవి, చంద్రశేఖరస్వామి, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, అయ్యప్పస్వామి మొదలగు దేవతల పంచలోహ ఉత్సవమూర్తులు పూజింప బడుతున్నాయి.

నాగులకట్ట

పరివార దేవతా మండపం నుంచి నిష్క్రమించగానే ప్రకృతి శోభతో పాటుగా గంభీరమైన ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడే సువిశాలమైన బహిరంగప్రాంగణం లోనికి ప్రవేశిస్తాము. నిష్క్రమణ ద్వారానికి దగ్గరలోనే, విశాలమైన వేదికపై రెండు మహావృక్షాల క్రింద పదుల సంఖ్యలో నాగప్రతిమలు, కొన్ని శివలింగాలు, కాళీయమర్దనం చేస్తున్న చిన్ని కృష్ణుని విగ్రహం కనిపిస్తాయి. గ్రహదోషాల వల్ల ఈతి బాధలకు గురైన వారు ఈ ప్రదేశంలో నాగప్రతిష్ఠ గావిస్తే, సత్ఫలితాలు ఉంటాయని అనాదిగా భక్తుల విశ్వాసం. ప్రస్తుతం స్థలాభావం వల్ల క్రొత్తగా నాగప్రతిష్ఠ చేయడం సాధ్యపడనప్పటికీ ఇప్పటికే ఉన్న నాగప్రతిమలను, శివలింగాలను అర్చించుకుంటే శుభం కలుగుతుంది. శ్రావణశుద్ధ చవితి మరియు కార్తీకశుద్ధ చవితి పర్వదినాలలో వేల సంఖ్యలో విచ్చేసిన మహిళాభక్తులు ఈ మూర్తులను పాలతో అభిషేకిస్తూ కనిపిస్తారు.

కోటిలింగేశ్వరాలయం

నాగులకట్టకు పశ్చిమదిశగా ఉన్న ఈ ఆలయంలో ఒక అడుగు ఎత్తున్న, చూడ చక్కనైన శివలింగాకృతిపై కొన్ని వేలకొద్దీ చిన్నపాటి శివలింగాలు మలచబడి ఉన్నాయి. ఈ ఆలయ ముఖద్వారానికి ఎదురుగా కొలువై ఉన్న నందీశ్వరుడు చూడముచ్చటగా ఉంటాడు.

గర్భాలయానికి ఉపరితలం పైనున్న ఏకశిలా నిర్మితమైన గోపురానికి నలుదిక్కులా దేవతా ప్రతిమలు చెక్కబడి ఉంటాయి.

అగస్త్యేశ్వరస్వామి ఆలయం

ఈ ఆలయంలోని శివలింగాన్ని అగస్త్యమహర్షి ప్రతిష్ఠించాడు. అగస్త్యుడు దక్షిణాది లోని పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ, సువర్ణముఖి నదీతీరాన ఆశ్రమం ఏర్పరుచుకొన్నప్పుడు ఈ లింగాన్ని ప్రతిష్ఠించాడని చెప్పబడుతుంది.

నవగ్రహ మంటపం

అగస్త్యేశ్వరాలయ సమీపంలో, ఒక చతురస్ర పీఠంపై, ఒక్కొక్కటి అడుగు పరిమాణం గల నవగ్రహ శిలామూర్తులు ప్రతిష్ఠించబడి ఉన్నాయి. ఈ మండపానికి దక్షిణంగా, నాలుగు స్తంభాలతో కూడుకున్న రాహు కేతు పూజా మంటపాన్ని, దాని ప్రక్కనే ఉన్న బిల్వవృక్షాలను కూడా దర్శించుకోవచ్చు.

ఇవే కాకుండా, ఈ బహిరంగ ప్రాంగణంలో కపిలేశ్వరస్వామి వారి నిత్యనివేదనలు తయారుచేసే వంటశాల, పర్వదినాలలో మరియు ఉత్సవ సమయాలలో స్వామివారిని అలంకృతులను గావించే అలంకార మండపం, విశేషదినాల్లో యజ్ఞయాగాలు నిర్వహించడానికై యాగశాల కూడా ఉన్నాయి.

ఆ ప్రాంగణానికి ఒక మూలగా ఒక చిన్న గుహ ప్రకృతిసిద్ధంగా ఏర్పడి పర్వతం లోనికి చొచ్చుకుని ఉంటుంది. ఆ గుహలోని పీఠంపై శివపార్వతులు, వారి ప్రక్కనే చతుర్భుజుడైన శ్రీమహావిష్ణువు కొలువై ఉన్నారు. పుట – 99 తేదీ – ఆగష్టు, 29

కపిలతీర్థ ఉపాలయాలు

నరసింహ గుహ

కపిలతీర్థం పుష్కరిణికి పడమటి దిక్కున, పర్వతం లోనికి చొచ్చుకుపోయి ఉన్న రాతిగుహను 'నరసింహ గుహ' గా పిలుస్తారు. ఒకానొకప్పుడు ఈ గుహలోంచి నేరుగా వేంకటాచలానికి బిలమార్గం ఉండేదట. కలియుగ ఆరంభంలో శ్రీనివాసుని ఆదేశానుసారం వకుళమాత వెంకటాచలం నుండి ఈ మార్గం ద్వారానే వచ్చి, కపిలేశ్వరుణ్ణి సేవించుకుని, తదనంతరం ఆకాశరాజు వద్దకు వెళ్లి, పద్మావతి దేవిని శ్రీనివాసుని కిచ్చి కళ్యాణం చేయవలసిందిగా శ్రీనివాసుడి తరపున రాయబారం నెరపింది. కారణాంతరం వల్ల ఇప్పుడా బిలమార్గం మూసి వేయబడింది.

లక్ష్మీనారాయణస్వామి ఆలయం

పుష్కరిణికి దక్షిణదిక్కున ఉన్న 'రంగమంటపం' లేదా 'తీర్థవారి మంటపా' నికి పడమటి దిక్కున, తూర్పు ముఖంగా శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఉంది. పదహారు స్తంభాలతో కూడుకున్న ముఖమండపం మరియు గర్భాలయంతో అలరారుతున్న ఈ ఉపాలయ శిలాస్తంభాలపై కొన్ని దేవతామూర్తులు, పౌరాణికఘట్టాలు చెక్కబడి ఉన్నాయి. ఈ ఆలయం లోని నాలుగు అడుగుల ఎత్తైన ఏకశిలా నిర్మితమైన మూర్తిని తాళ్ళపాక పెద తిరుమలాచార్యులు ప్రతిష్ఠించాడు. శ్రీమన్నారాయణుడు చతుర్భుజుడై, శంఖుచక్రాలు ధరించి, ఎడమ తొడపై లక్ష్మీదేవిని కూర్చుండ బెట్టుకుని దర్శనమిస్తాడు.

వేణుగోపాల స్వామి ఆలయం

రంగమంటపానికి దక్షిణదిశగా ఉన్న ఉపాలయంలో ఉత్తరాభిముఖుడై, స్థానకభంగిమలో (నిలుచుని ఉన్న) ఉన్న రాధాసమేత వేణుగోపాల స్వామిని దర్శించుకోవచ్చు. ఈ స్వామి చతుర్భుజుడై పైనున్న కుడి ఎడమ చేతుల్లో శంఖు చక్రాలను, క్రిందనున్న కుడి ఎడమ చేతులతో వేణువును ధరించి దర్శనమిస్తాడు. కుడి కాలిని కొద్దిగా మడిచి, ఎడమకాలి మునివేళ్ళపై నిలుచున్న ఈ స్వామి స్వస్తికాసనంలో విరాజిల్లుతున్నాడు. అంతకు ముందున్న విగ్రహాలు శిథిలం కాగా, వాటి స్థానంలో 1998వ సంవత్సరంలో కొత్త విగ్రహాలు ప్రతిష్ఠింపబడ్డాయి.

నమ్మాళ్వార్ ఆలయం

కపిలతీర్థం నుండి వెలుపలకు వస్తున్నప్పుడు, బాటకు తూర్పుదిక్కున, ఎత్తైన ప్రాకారంతో నమ్మాళ్వార్ ఆలయం కానవస్తుంది. ఈ ఆలయంలో పశ్చిమాభిముఖంగా, ఆసీనభంగిమలో కొలువై ఉన్న నమ్మాళ్వార్‌ను దర్శించుకోవచ్చు. సాటిలేని విష్ణుభక్తికి ప్రతిరూపాలైన పన్నెండుగురు ఆళ్వార్‌లలో అత్యంత ప్రముఖుడైన నమ్మాళ్వార్, వైష్ణవభక్తులందరికీ పరమపూజనీయుడు. ఈ ఆలయాన్ని 13వ శతాబ్దంలో, 'పల్లవరాయన్' అనే తమిళభక్తుడు నిర్మించాడు. నమ్మాళ్వార్ కు చెందిన మరిన్ని విశేషాలను మరో ప్రకరణంలో తెలుసుకుందాం.

శ్రీ అభయహస్త ఆంజనేయ స్వామి ఆలయం

నమ్మాళ్వార్ ఆలయాన్ని ఆనుకొని ఉన్న ఈ ఆలయంలో సింధూరలేపనంతో కూడుకున్న అభయహస్త ఆంజనేయస్వామి దక్షిణాభిముఖుడై దర్శనమిస్తాడు. సుమారుగా ఆరడుగుల ఎత్తున్న ఆంజనేయుడు వాలాన్ని పైకెత్తి, ఎడమచేతితో గదాయుధాన్ని ధరించి ఉంటాడు. వ్యాసరాయలు వారు 16వ శతాబ్దంలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు.

తీర్థమహత్యం

ఒకానొకప్పుడు ఒక సద్బ్రాహ్మణుడు ప్రపంచంలో ఉన్న తీర్థాలన్నింటిలో స్నానం చేసి తరించాలని సంకల్పించాడు. అలా కొన్ని వందల తీర్థాలను సందర్శించిన తర్వాత, శారీరకంగా విపరీతమైన అలసటకు గురై, శుష్కించి పోయాడు.

అతని దీనావస్థకు జాలిపడిన శ్రీహరి ఆ బడుగు బాపనికి స్వప్నంలో కనబడి, ప్రపంచంలో కోట్లాది తీర్థాలున్నాయని, వాటన్నింటిలో స్నానమాచరించడం మానవ మాత్రులకు సాధ్యం కాదని, వేంకటాచలక్షేత్రం వద్దనున్న కపిలతీర్థం మరియు తిరుమల కొండపైన ఉన్న పదిహేడు ముఖ్య తీర్థాలను సేవించుకుంటే; ముల్లోకాల లోని సమస్త తీర్థాలలో స్నానమాడిన ఫలితం లభిస్తుందని మార్గాంతరం చెప్పి అంతర్ధానమయ్యాడు. అంతటి మహిమాన్వితమైన కపిలతీర్థంలో కార్తీకపౌర్ణమి నాడు ముల్లోకాల లోని పుణ్యతీర్థాలన్ని నిక్షిప్తమై ఉంటాయని, ఆరోజు ఈ తీర్థస్నానం మరింత పవిత్రమైనదని చెబుతారు. ఈ ప్రదేశంలో చేసిన అతి చిన్న దానమైనా మేరుపర్వతమంత సువర్ణదానంతో సమానంమని, గోదానం చేస్తే కైలాసప్రాప్తి సిద్ధిస్తుందని ప్రతీతి. ఈ తీర్థంలో పితృకర్మలు, దానాలు చేసి స్వర్గలోక ప్రాప్తిని పొందిన వారిలో దేవతలు, గంధర్వులు, సిద్ధపురుషుల వంటి వారెందరో ఉన్నారు.

ముఖ్యమైన ఉత్సవాలు

తిరుమలక్షేత్రం వలనే కపిలేశ్వరాలయం కూడా నిత్యకల్యాణం–పచ్చతోరణంగా భాసిల్లుతుంది. సంవత్సరం పొడవునా అనేక ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిని గురించి తెలుసుకుందాం.

అవభృథం లేదా చక్రస్నానం

తిరుపతి లోని గోవిందరాజస్వామికి మే, జూన్ నెలల్లో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. తొమ్మిది రోజులు జరిగే ఈ ఉత్సవాలు అనురాధా నక్షత్రంతో ముగిసేటట్లుగా జరిపిస్తారు. ఆరోజు కపిలతీర్థంలో 'అవభృథం' లేదా 'చక్రస్నానం' సకల లాంఛనాలతో జరుగుతుంది.

ఎద్దైనా మహాయజ్ఞం తలపెట్టి దానిని దిగ్విజయంగా ముగించిన తరువాత – ఆ యజ్ఞంలో తెలియక దొర్లిన తప్పులను మన్నించమని కోరుతూ; అలాగే, యజ్ఞం నిర్విఘ్నంగా జరిపించినందుకు గానూ పంచభూతాలకు కృతజ్ఞత వ్యక్తపరుస్తూ – యజ్ఞకర్త పుష్కరిణిలో ఆచరించే స్నానాన్ని '**అవభృథస్నానం**' గా పిలుస్తారు. అత్యంత వైభవోపేతంగా జరిగే బ్రహ్మోత్సవాలు మహాయజ్ఞాని కేమాత్రం తీసిపోనందున, బ్రహ్మోత్సవాల అనంతరం యజ్ఞకర్తయైన చక్రత్తాళ్వార్ అవభృథస్నానం చేస్తారు. చక్రత్తాళ్వార్ చేస్తారు కావున దీనినే 'చక్రస్నానం' అని కూడా వ్యవహరిస్తారు.

జంధ్యాలపౌర్ణమి

ప్రతి సంవత్సరం శ్రావణపౌర్ణమి నాడు జంధ్యాలపండుగ ఆడంబరంగా జరుగుతుంది. ఆనాడు శ్రీగోవిందరాజస్వామి, శ్రీకృష్ణస్వామి, శ్రీసుదర్శన భగవానుడు, గోవిందరాజస్వామి ఆలయం నుండి వేర్వేరు పల్లకీలపై కపిలతీర్థం లోని వేణుగోపాలస్వామి ఆలయానికి వేంచేస్తారు. తదనంతరం వారికి శాస్త్రోక్తంగా యజ్ఞోపవీతాలు ధరింపజేసి; ఘనంగా హారతి, నివేదన ఇస్తారు.

కార్తీకపౌర్ణమి నాడు కూడా శ్రీగోవిందరాజుల వారు తన దేవేరులతో కలిసి వేణుగోపాలస్వామి ఆలయానికి విచ్చేసి, అభిషేకాలు, నివేదన జరిగిన తరువాత, తిరిగి గోవిందరాజస్వామి ఆలయానికి చేరుకుంటారు.

శ్రీఆండాల్ (గోదాదేవి) ఆస్థానం

ప్రతి సంవత్సరం కనుమపండుగ నాడు, గోవిందరాజస్వామి ఆలయం నుండి శ్రీగోదాదేవి ధరించిన పూల మాలలు తిరుమలలోని శ్రీవెంకటేశ్వరునికి పంపబడతాయి. తదనంతరం గోదాదేవి, గోవిందరాజస్వామి ఆలయం నుండి బయలుదేరి, కపిలతీర్థం వేంచేస్తుంది. అక్కడ గోదాదేవి ముత్తయిదువులకు వాయనదాన మిచ్చిన తరువాత, గోవిందరాజస్వామి ఆలయంలో గోదాదేవి ఆస్థానోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతాయి. పన్నెండు మంది ఆళ్వార్లలో మరో ప్రముఖ ఆళ్వారైన 'గోదాదేవి' లేదా 'ఆండాళ్' గురించి కూడా మరో ప్రకరణంలో విస్తారంగా తెలుసుకుందాం!

కపిలేశ్వర స్వామి వారి త్రిశూల స్నానం

మహాశివరాత్రి సందర్భంగా జరిగే బ్రహ్మోత్సవాలలో చివరి రోజున – అనగా ఫాల్గుణ అమావాస్య నాడు – కపిలేశ్వరస్వామి వారి ప్రధానాయుధమైన త్రిశూలస్వామి వారికి కపిలతీర్థం పుష్కరిణిలో త్రిశూల స్నానం జరుగుతుంది. ఈ స్నానాన్ని కాంచినవారికి త్రిశూలాయుధం సర్వకాల సర్వావస్థలయందు రక్షగా ఉంటుందని, అరిషడ్వార్గాలను అదుపులో ఉంచి, కైలాసప్రాప్తికి దోహద పడుతుందని భక్తులు నమ్ముతారు.

కార్తీకదీపం లేదా ఆకాశదీపం

కార్తీకపౌర్ణమి నాడు, ఆలయం పై భాగాన, కొండశిఖరాలవద్ద అర్చకస్వాములు జ్యోతులను ప్రజ్వలింప జేస్తారు. అదే సమయంలో ఆలయానికి అనుసంధానింపబడి ఉన్న కొండ పైభాగాన గల పెద్దగూటిలో, తిరుపతి వాసులైన గాండ్ల కులస్థులు అఖండజ్యోతిని వెలిగిస్తారు. ఆ జ్యోతి తిరుపతి పట్టణ వాసులందరికీ దేదీప్యమానంగా దర్శనమిస్తుంది. తరువాత, స్వామి, అమ్మవార్లను పల్లకీలో కపిలతీర్థం వద్దకు ఊరేగింపుగా తెచ్చిన అనంతరం జ్వాలాతోరణం జరుగుతుంది. ఆ సందర్భంగా కపిలతీర్థం పుష్కరిణిలో వేలాది భక్తులు అసంఖ్యాకమైన ప్రమిదలను వెలిగిస్తారు.

తేప్పోత్సవాలు

ధనుర్మాసంలో ఆరుద్రానక్షత్రం ముందు రోజు పూర్తయ్యే టట్లుగా, ఐదురోజుల పాటు ప్రతిరోజు ప్రదోష వేళలో తెప్పోత్సవాలు జరుగుతాయి.

చందనోత్సవసేవ

సౌర్యమానపు మకరమాసంలో (చంద్రమానపు పుష్యం లేదా మాఘం) పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం నాడు అమ్మవారికి చందనాలంకార సేవ జరుప బడుతుంది.

బ్రహ్మోత్సవాలు

ప్రతి సంవత్సరం మాఘమాసంలో మహాశివరాత్రి సందర్భంగా పది రోజులపాటు మహావైభవంగా బ్రహ్మోత్సవాలు

జరుగుతాయి.

అన్నాభిషేకం

కపిలతీర్థంలో అత్యంత వైభవంగా, విలక్షణంగా జరిగే ఈ అన్నాభిషేక మహోత్సవం, సౌరమానం ప్రకారం తులామాసంలో, పౌర్ణమి రోజున సంపన్న మవుతుంది. ఈ రోజును 'కపిలతీర్థముక్కోటి' గా పేర్కొంటారు. ఆరోజు మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో, 250 కిలోల బియ్యంతో వండిన అన్నంతో కపిలేశ్వరలింగానికి అభిషేకం చేస్తారు. లింగాకృతి అంతా, పూర్తిగా అన్నమయమై పోతుంది. మిగిలిన అన్నంతో ఒక చిన్న శివలింగాన్ని తయారుచేసి తాత్కాలికంగా ప్రతిష్ఠ చేస్తారు. పోళీలు, కుడుములు, మురుకులు, సుఖియం, వడలు వంటి ఐదురకాల పిండివంటలను లవణరహితంగా తయారుచేసి అన్నలింగం యొక్క పానవట్టంపై అలంకరిస్తారు. తదనంతరం పొట్లకాయ, వంకాయ, అరటికాయ, సీమవంకాయ, బూడిద గుమ్మడికాయలను ముక్కలు కాకుండా పూర్తికాయలు గానే, ఉప్పు లేకుండా ఉడికించి; వీటిని అన్నలింగం పై సర్పాభరణాలుగా, చంద్రవంకగా, ఢమరుకంగా, త్రిశూలంగా అలంకరిస్తారు. పంచవాద్య సమ్మేళనంతో, మంగళధ్వనులతో మహా దీపారాధన జరుగుతుంది. తరువాత అన్నలింగాన్ని ఉద్వాసన చేసి, కర్పూరహారతి నిచ్చి, జలనిమజ్జనం చేస్తారు. తదుపరి, శివలింగంపై అమర్చిన అన్నాన్ని, పులుసు, కూరలతో కలిపి ప్రసాదంగా భక్తులకు పంచుతారు.

అన్నాభిషేక మహోత్సవంలో పాల్గొని, అన్నలింగ దర్శనం చేసుకొన్నట్లయితే సమస్త గ్రహదోషాలు, పూర్వజన్మల పాపాలు సంపూర్ణంగా తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు.[5] **పుట – 100 తేదీ – ఆగష్టు, 30**

[5] శ్రీనివాసుని కృపాకటాక్షాలతో, మీ ఆదరాభిమానాలతో "తిరుమల సర్వస్వం" నేటితో (అనగా ఆగష్టు 30, 2020) నూరు ప్రకరణాలు దిగ్విజయంగా పూర్తి చేసుకోగలిగింది. ప్రతిరోజూ సుదీర్ఘమైన ఈ ప్రకరణాలను ఆసాంతం చదువుతూ, మధ్యమధ్యలో తగిన సూచనలిస్తూ మమ్మల్ని నిరంతరం ప్రోత్సహిస్తున్న శ్రీవారి భక్తులకు మరొక్కసారి ధన్యవాదాలర్పిస్తున్నాం.

తిరుమలేశుని పట్ల భక్తి, ఆసక్తి, అనురక్తి గలిగిన మీ బంధుమిత్రు లందరితో "తిరుమల సర్వస్వాన్ని" పంచుకొని; శ్రీవేంకటేశ్వరుని చరిత్ర మరియు తిరుమలక్షేత్ర మహాత్మ్యం ప్రపంచం నలుదెసలా వ్యాప్తి చెందేందుకు తోడ్పడ వలసిందిగా కోరుతున్నాం.

శ్రీవారి సేవకులు

శ్రీవారి గురించి, ఆనందనిలయం గురించి, తిరుమలక్షేత్రం గురించి ఎన్నో విషయాలు తెలుసుకున్న తరువాత సహజంగానే భక్తుల మదిలో ఎన్నో ఆలోచనలు వస్తాయి. తిరుమలలో కొద్ది రోజులు గడపాలని, స్వామివారికి సాధ్యమైనంత సేవ చేయాలని అసంకల్పితంగానే మదిలో మెదులుతుంది. శ్రీవెంకటేశ్వరుడు భక్తులను ప్రాణప్రదంగా చూసుకుంటాడని మనకు తెలుసు. అందువల్ల శ్రీవారి భక్తులను సేవించుకున్నా శ్రీనివాసుని సేవించుకున్నట్లే! ఈ పరమసత్యాన్ని గ్రహించినట్టి శ్రీవారి భక్తాగ్రేసరులైన శ్రీమద్రామానుజులవారు, హాథీరామ్ బావాజీ, తరిగొండ వెంగమాంబ, శ్రీకృష్ణదేవరాయల వంటివారు, శ్రీవారితో బాటుగా, వారి భక్తులకు సైతం అనేక రకాలుగా సేవలందించారు. ఇప్పుడు భక్తుడు-భగవంతుడు, ఇరువురికీ సేవ చేసుకునే అవకాశాన్ని తి.తి.దే. వారు కల్పిస్తున్నారు.

దాదాపు శతాబ్దం క్రితం వరకు కేవలం వందల సంఖ్యలో మాత్రమే ఉండే భక్తజనం ఇంతింతై వటుడింతై అన్నట్టుగా దినదిన ప్రవర్ధమానమవుతూ, క్రమంగా వేల సంఖ్యను దాటి ఇప్పుడు లక్షల్లోకి చేరుకుంది. అదే వేసవిశెలవులు, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సర సందర్భాల్లో, రోజువారీ భక్తుల సంఖ్య రెండు లక్షల పైమాటే! ఇంత మంది భక్తులను నియంత్రించడానికి, దర్శనాది కార్యక్రమాలు సజావుగా జరగటానికి స్వచ్ఛందంగా సేవలందించే వేలకొద్దీ కార్యకర్తలు కావాలి. అంతే గాకుండా ఆసక్తి కలిగిన భక్తులకు ఆ పరమపవిత్రమైన ప్రదేశంలో సేవ చేసుకునే అవకాశం కల్పించాలి. ఈ రెండు పరమార్థాలను నెరవేర్చటానికి తి.తి.దే. వారు ప్రవేశపెట్టినదే 'శ్రీవారిసేవకుల' వ్యవస్థ.

ఇప్పుడీ వ్యవస్థ తీరుతెన్నులను పరిశీలిద్దాం.

ఎంతెంత మంది? ఎవరెవరు??

ప్రప్రథమంగా, 2000వ సంవత్సరంలో కేవలం 195 మంది స్వచ్ఛంద సేవకులతో 'శ్రీవారి సేవకులు' వ్యవస్థను తి.తి.దే. ప్రారంభించింది. క్రమంగా ఈ స్వచ్ఛంద సేవకుల సంఖ్య పెరుగుతూ, ప్రస్తుతం ప్రతిరోజు 1,500 నుంచి 2,500 వరకు సేవకులు వివిధ సేవాకార్యక్రమాల్లో పాలుపంచు కుంటున్నారు. అయినప్పటికీ ఇంకా కొన్ని వేల మంది భక్తులు తి.తి.దే. తో నమోదు చేసుకుని, అవకాశం కోసం నెలల తరబడి వేచి ఉంటున్నారు. ఇప్పటివరకు సుమారుగా 8 లక్షలకు పైగా భక్తులు శ్రీవారిసేవకులుగా నమోదు చేసుకొని సేవలందించారు.

ప్రపంచం నలుమూలల నుండి శ్రీవారి దర్శనార్థం భక్తులు తిరుమలకు విచ్చేస్తుంటారు. వారిలో అన్నెం పున్నెం ఎరుగని గ్రామీణభక్తులు, జీవితంలో మొట్టమొదటిసారిగా తమతమ గ్రామాలను దాటి వేరే చోటికి వచ్చినవారు ఇలాంటి వారెందరో కూడా ఉంటారు. విశేషసందర్భాల్లో, పర్వదినాల్లో తిరుమలకొండ ఇసుక వేస్తే రాలనంతగా క్రిక్కిరిసి ఉంటుంది. దీంతో వృద్ధులు, వికలాంగులు, మహిళలకు దర్శనం, వసతి, తిరుగుప్రయాణం, స్వామివారి

సేవల విషయంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అంతేగాక, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులకు భాష విషయంలోనూ జటిలమైన సమస్య తల ఎత్తే సందర్భాలు ఉంటాయి. ఇలాంటి సమయాలలో శ్రీవారిసేవకులు వారికి చేదోడు వాదోడుగా ఉండి, తగిన సమాచారమిచ్చి, కావలసిన సహాయం అందిస్తారు. ఈ సేవలో పాల్గొనడానికి ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆసక్తి చూపుతారు. శ్రీవారి సేవలో పేరెన్నికగన్న వైద్యులు, ఇంజినీర్లు, న్యాయవాదులు, విద్యావేత్తలు, ప్రముఖవ్యాపారులు వంటి సమాజంలో ఉన్నతస్థాయికి చెందిన వ్యక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొంటారు. వీరందరికీ తమ తమ వృత్తి నైపుణ్యానికి అనువైన సేవావిభాగాన్ని తి.తి.దే. వారు కేటాయిస్తారు.

ఏఏ సేవలందిస్తారు ?

ప్రస్తుతం ఇరవై ఐదు విభాగాల్లో శ్రీవారి సేవకులను తి.తి.దే. వినియోగించు కుంటోంది. వాటిలో ముఖ్యమైనవి శ్రీవారి ముఖ్యాలయంలో వరుస నియంత్రణ; వైకుంఠం క్యూ సముదాయాల్లో భక్తుల బాగోగులు చూడటం; నాలుగు మాడవీథుల్లో నడిచే భక్తులకు తగిన సూచనలు అందించడం; తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో భక్తులకు ఏ విధమైన ఇబ్బంది కలుగకుండా చూడటం; కూరగాయలను శుభ్రపరచడం, తరగడంలో వంటకార్మికులకు సహాయపడడం; లడ్డూ ప్రసాదకేంద్రాలలో క్యూలను నియంత్రించడం; ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో పూలమాలలను అల్లడంలో సహాయపడటం; వివిధ ప్రదేశాలలో వేచి ఉండే భక్తులకు మంచినీరు, ఇతర పానీయాలు, ఫలహారం అందించడం; చిన్నపిల్లలకు పాలు సరఫరా; లగేజీ సెంటర్లలో సాయం; భక్తులకు తిరునామం దిద్దటం; భక్తులకు అత్యవసర సందర్భాలలో ప్రథమచికిత్స అందించడం; తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రుల వద్దకు చేర్చడం; పరకామణి సేవలు మొదలైనవి. 'పరకామణిసేవ' అంటే శ్రీవారి హుండీ ద్వారా వచ్చే కోట్లాది రూపాయల విలువ గల విదేశీ, స్వదేశీ నాణాలు, నోట్ల రూపంలో వచ్చే కానుకలను లెక్కించడం. ఇంతే కాకుండా, ప్రత్యేక సందర్భాలలో జనసమ్మర్ధం అధికంగా ఉండే కొబ్బరికాయలు విక్రయించే ప్రదేశం, ఉద్యోగుల ఫలహారశాల, కళ్యాణకట్ట, పుస్తక విక్రయశాలలు, ఆరోగ్యవిభాగ కార్యాలయాలు, గోశాల, కొండపైనున్న ఇతర ఆలయాలు, తి.తి.దే. ఆధ్వర్యంలో ఉండే తిరుపతి నగరంలోని ఆలయాలు మొదలగు ప్రదేశాలలో కూడా, అంకితభావంతో సేవలందించే శ్రీవారిసేవకులు కానవస్తారు.

సత్యసాయి సేవాసమితి పాత్ర

శ్రీవారిసేవకులలో మరింతగా సేవాప్రవృత్తి, ధార్మికచింతన, క్రమశిక్షణ పాదుకొలిపే టందుకు; భవిష్యత్తులో వారిని హిందూ ధర్మ ప్రచారకులుగా తీర్చదిద్దేందుకు పుట్టపర్తి సత్యసాయి సేవాసంస్థ తన వంతు సహకారాన్ని అందిస్తోంది. ఈ సంస్థ వారు శ్రీవారిసేవకులకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక గంటపాటు తగిన శిక్షణ ఇచ్చి; వారికి అప్పగించిన బాధ్యతను వారు సక్రమంగా నిర్వర్తించేందుకు తోడ్పడతారు. ఈ సేవకులకు 'శ్రీవారి సేవాసదనం' అనే ప్రత్యేక భవనం లో భజన, సత్సంగము వంటి ఆధ్యాత్మిక విషయాలలో అవగాహన కల్పిస్తారు. ప్రతిరోజు సాయంత్రం

సేవకుల జట్టు నాయకులకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, మరునాడు చేపట్టవలసిన బాధ్యతలపై తగిన సూచనలు, సలహాలు అందిస్తారు.

నియమ – నిబంధనలు

- ఈ సేవా అవకాశం మూడు రోజులు, నాలుగు రోజులు, ఏడు రోజుల కాలవ్యవధిలో లభ్యమవుతుంది.
- ఆయా వ్యవధులను బట్టి శ్రీవారిసేవలో పాల్గొనే భక్తుల వయసు 18 నుండి 60 సంవత్సరాల లోపు వరకు ఉండవచ్చు.
- ప్రతి జట్టులోనూ పది మందికి తక్కువ కాకుండా, 15 మందికి ఎక్కువ కాకుండా సభ్యులు ఉండాలి.
- కనీసం ఏడవ తరగతి ఉత్తీర్ణులై, చదవటం వ్రాయటం తెలిసిన వారై ఉండాలి.
- కొండపైనున్న శ్రీవారి సేవాసదన్ లో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా, ఉచితంగా వసతి కల్పించబడుతుంది. అందులో నిద్రించటానికి, సమాను భద్రపరచు కోవడానికి, స్నానపానాదులకు, దుస్తులు శుభ్రపరచు కోవడానికి సౌకర్యవంతమైన ఏర్పాట్లు ఉన్నాయి. 80 కోట్ల రూపాయలు వెచ్చించి ఈ సేవాసదన్‌ను నూతనంగా నిర్మించారు.
- ఉదయం అల్పాహారం మరియు మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఉచితంగా అందజేయ బడతాయి.
- ప్రతిరోజు నిర్ణీతసమయానికి కాలాతీతం కాకుండా ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తించడానికి సిద్ధపడాలి.
- రోజుకు ఏడెనిమిది గంటలపాటు సేవ చేయడానికి సన్నద్ధులు కావాలి. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు, రెండు షిఫ్టులలో సేవ చేయాల్సిన అవసరం కూడా రావచ్చు.
- నియమాలను అతిక్రమిస్తే రెండు సంవత్సరాల వరకు సేవలో పాల్గొనటానికి అనర్హులు.
- వస్త్రనిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. పురుషులు తెలుపురంగు సంప్రదాయ వస్త్రాలు, స్త్రీలు ముదురు ఎరుపు రంగు అంచు కలిగిన నారింజ రంగు చీర మరియు V మెడ కలిగిన అదే రంగు రవిక ధరించాలి.
- వారి వారికిచ్చిన సేవా బాధ్యతను బట్టి, సేవకులకు నారింజ, పసుపు ఆకుపచ్చ రంగులు కలిగిన ఉత్తరీయాలు (స్కార్ఫ్స్) ఇస్తారు. స్కార్ఫ్ ను, తి.తి.దే. వారి గుర్తింపు పత్రాన్ని తప్పనిసరిగా ధరించాలి.
- ప్రతి భక్తునిలో ఏడుకొండలవాడిని దర్శించుకుంటూ, అంకితభావంతో, ఏ విధమైన భేదభావం చూపకుండా సేవ చేయాలి.
- అంతర్జాలంలో ముందస్తుగా నమోదు చేసుకోవచ్చు (www.tirumala.org – Srivari Seva Services). లేదా కార్యనిర్వహణాధికారి, తి.తి.దే. పరిపాలనా భవనం, కపిలతీర్థం మార్గం, తిరుపతికి లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఒక నెల కనీస గడువుతో దరఖాస్తు చేసుకోవచ్చు.
- తి.తి.దే. వారు అప్పగించిన బాధ్యతను మహాప్రసాదంగా స్వీకరించి, చిత్తశుద్ధిగా నిర్వర్తించాలే తప్ప; గర్భాలయంలో, శ్రీవారి చెంత మాత్రమే సేవ చేస్తామని పట్టు పట్టడం, పైరవీలు చేయడం లాంటివి పూర్తిగా నిషిద్ధం.
- తితిదే నిబంధనల ప్రకారం, శ్రీవారిసేవకు వచ్చిన భక్తులు కేవలం సేవపైనే దృష్టి కేంద్రీకరించాలి తప్ప, తి.తి.దే. సిబ్బందితో పరిచయాలు పెంచుకోవడం, వ్యాపారవిషయాలు చర్చించడం లాంటివి చేయరాదు.
- శ్రీవారిసేవలో పాల్గొన్న భక్తులకు చివరిరోజు సుపథం ద్వారా ఉచితదర్శనం, ఉచితంగా ఒక లడ్డు మరియు రాయితీపై ఐదు లడ్డూలను ప్రసాదంగా అందజేస్తారు.



గత డిశెంబరులో పదిహేను సభ్యుల 'శ్రీవారిసేవకుల' బృందానికి నాయకురాలిగా ఏడురోజుల పాటు తిరుమలక్షేత్రంలో సేవ చేసుకోనే సౌభాగ్యాన్ని శ్రీవారు నాకు ప్రసాదించారు. వైకుంఠం సముదాయంలో వేలకొద్దీ భక్తులకు ఫలహారాలు అందించటం ఓ మధురానుభూతి. సర్వదర్శనం యొక్క ప్రవేశద్వారం వద్దనున్న నిఘావిభాగం వారి తణిఖీకేంద్రంలో కూడా కూడా సేవలందించాను. వీటన్నింటి కంటే శ్రీవారి గర్భాలయంలో ఒకరోజు సేవ చేసుకునే అవకాశం లభించటం మరువలేని, అనిర్వచనీయమైన అనుభూతిని మిగిల్చింది. గోవిందనామాలు ఉచ్చరిస్తూ ఆర్తిగా శ్రీవారిని దర్శించుకొంటున్న వేలమంది భక్తుల భక్త్యావేశాన్ని అతిసమీపం నుండి చూచే మహదవకాశం కూడా లభించింది. అంతటి మహద్భాగ్యాన్ని ప్రసాదించిన తిరుమలేశునికి, ఆ అవకాశాన్ని సానుకూల పరచిన తి.తి.దే. వారికి, క్రమశిక్షణతో మసలుతూ సహాయసహకారా లందించిన మా బృందసభ్యులకు వేలవేల నమస్సులు. **పుట – 101 తేదీ – ఆగష్టు, 31**



మాధవుడు చేసే మానవ సేవ

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కానుకలుగా వచ్చిన వందల, వేల కోట్ల మొత్తంలో సింహభాగం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమాజసేవకే అంకితమవుతుంది. ఏ విధంగా అయితే ఇబ్బడిముబ్బడిగా కానుకలు వచ్చిపడతాయో, అదేవిధంగా, చేతికి ఎముక లేకుండా, ఆ వచ్చిన సొమ్మునంతా శ్రీవారు, భక్తులకు ఇతోధికమైన సౌకర్యాలు కల్పించడం కోసం, హైందవధర్మ పరిరక్షణార్థం మరియు సమాజ శ్రేయస్సుకోసం వెచ్చిస్తారు. ఈ మానవసేవా కార్యకలాపాలు తిరుమలక్షేత్రం లోనూ, తిరుపతి పట్టణంలోనూ, ఆంధ్రరాష్ట్ర మంతటా మరియు జాతీయస్థాయిలోనూ విస్తరించి ఉన్నాయి.

వీటన్నింటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గది 'నభూతోనభవిష్యతి' అన్న చందంగా తిరుమలలో జరిగే నిత్యాన్నదానం.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదకేంద్రం

చారిత్రకాధారాలు లభ్యమైనంత వరకూ, తిరుమలలో అన్నదానం ప్రక్రియ దాదాపుగా వెయ్యి సంవత్సరాల క్రితమే ప్రారంభమయ్యింది. అప్పటి చోళప్రభువైన 'ఇంగోరు రాజు' శ్రీవారి సన్నిధిలో ఇద్దరు బ్రాహ్మణులకు నిత్యాన్నదానం జరిపించడానికి తగిన ఏర్పాట్లు చేశాడు. తరువాత, 1450వ సంవత్సరంలో విజయనగర రాజు సాళువ నరసింహరాయలు, 'రామానుజకూటములు' గా పిలువబడే ఉచిత భోజనశాలలను ఏర్పాటు చేశాడు. దానిని నిర్వహించడానికి కావలసిన ఆర్థికవనరుల కోసం ఆలయానికి అనేక భూములను దానంగా ఇచ్చాడు. ఆ విధంగా, *శ్రీవేంకటేశ్వరుని చెంతకు వేంచేసిన భక్తులెవ్వరూ ఆకలితో వెనుదిరగరాదన్నది* తరతరాలుగా తిరుమల యాజమాన్యం త్రికరణశుద్ధిగా నమ్మి, అచరణలో పెడుతున్న సిద్ధాంతం. అదే లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని, వందల ఏళ్ళ నుండి శ్రీవారి ప్రసాదాలను భారీస్థాయిలో తయారుచేయించి భక్తులకు ఉచితంగానో లేదా నామమాత్రపు ధరలకు వితరణ చేయడం, అలిపిరి మార్గం పొడవునా ఉన్న విశ్రాంతి మంటపాలలో యాత్రికులకు షడ్రశోపేతమైన భోజనాలు వడ్డించడం, తిరుమల కొండపై అనేక అన్నదానసత్రాలను నిర్వహించడం వంటి ఎన్నో అన్న వితరణ కార్యకలాపాలను అయా కాలాలలో ఉన్న ఆలయ యాజమాన్యాలు చేపట్టాయి. శ్రీవారి భక్తులైన ఎందరో దాతలు కూడా ఆ పుణ్యకార్యాలలో పాలు పంచుకునేవారు. అందులో భాగం గానే, దాదాపు నూటయాభై సంవత్సరాల క్రితమే మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అత్యంత భారీస్థాయిలో అన్నసంతర్పణ గావించేది. ఆమె నిత్యాన్నదాన మహాయజ్ఞానికి యథాశక్తి తోడ్పడటం కోసం ఉత్తరాన ఉన్న గోల్కొండ నుంచి, దక్షిణాన తమిళనాట దిండిగల్ వరకు వ్యాపించి ఉన్న శ్రీవారి తెలుగు, తమిళ భక్తులు తమ తమ అమూల్యమైన భూములను వెంగమాంబకు ధారాదత్తం చేస్తూ దానపత్రాలు వ్రాసి ఇచ్చారు. వెంగమాంబ నిత్యాన్నదానమే కాకుండా, వైశాఖ మాసంలో వచ్చే నృసింహజయంతిని పురస్కరించుకొని, భక్తులకు పదిరోజుల పాటు నవకాయ పిండివంటలతో కూడిన ప్రత్యేకమైన భోజనాన్ని అందజేసేవారు.

అవిరామ వితరణ

ఆ మహనీయురాలి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని, ప్రపంచచరిత్రలో ఎన్నడూ లేనంత పెద్దస్థాయిలో ఈ అన్నదాన మహాయజ్ఞాన్ని తి.తి.దే. కొనసాగిస్తోంది. దాదాపుగా గత 35 సంవత్సరాల నుండి నిరంతరాయంగా కొనసాగుతోన్న ఈ యజ్ఞానికి – ఒక్క గ్రహణకాలంలో తప్ప – ఎన్నడూ విరామం లేదు. కరోనా కష్టకాలంలో కొన్నిరోజులు మినహాయించి, నిరాఘాటంగా అన్నవితరణ జరుగుతూనే ఉంది.

తిరుమలలో అన్నప్రసాదానికి కొన్ని విశిష్టమైన ప్రత్యేకతలు ఉన్నాయి. అవి మన అందరికీ తెలిసినవే అయినా, వాటికున్న ప్రాధాన్యత దృష్ట్యా, పునశ్చరణ చేసుకోదగ్గవి. అవేంటో చూద్దాం.

అత్యద్భుతమైన రుచి, తరిగొండ వెంగమాంబ అన్నదానకేంద్రంలో వడ్డించే భోజనం అమృతతుల్యంగా ఉంటుంది. ఆ పదార్థాలలోని రుచి ఐదు నక్షత్రాల హోటల్ లో సైతం మనం ఎన్నడూ చవిచూసి ఉండబోము. అంకితభావంతో పనిచేసే వందలాది మంది చేయి తిరిగిన వంట కార్మికుల అవిరళ కృషికి శ్రీనివాసుని కటాక్షం తోడవ్వటమే దీనికి కారణం. సాంబారు, రసం, రోటిపచ్చడి వంటి సర్వసాధారణమైన వంటకాలకు కూడా, పంచభక్ష్య పరమాన్నాలను మరపించే అమోఘమైన రుచి ఉంటుంది. ఆదరణ–ఆప్యాయతలను రంగరించి వడ్డించడం కూడా ఆ అమూల్యమైన రుచికి కారణం కావచ్చు.

శుచి – శుభ్రత

ప్రతి దినం సగటున లక్ష మందికి పైగా భక్తులు గుమి కూడే ఆ ప్రదేశంలో, ఎన్నడూ ఒక్క వెంట్రుక గాని, ఏ విధమైన క్రిమికీటకాలు గానీ కానరావు. ఎంతో శ్రద్ధ వహించి, రేయింవళ్ళు కృషి చేస్తే గాని పరిసరాలను అంత పరిశుభ్రంగా ఉంచటం సాధ్యం కాదు. తిరుమల క్షేత్రమంతా స్వచ్ఛతకు మారుపేరైతే, అన్నదానకేంద్రం మాత్రం మరింత స్వచ్ఛంగా, శుచి–శుభ్రతకు చిరునామాగా పేరు తెచ్చుకుంది.

సత్వర సేవలు

ప్రస్తుతం ఎంతటి ప్రణాళికాబద్ధమైన ఏర్పాట్లు చేశారంటే, భక్తుల రద్దీ ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ ఉచితభోజనం నిమిత్తం ఎవరూ వేచి ఉండాల్సిన అవసరం ఎంతమాత్రంలేదు. దాదాపుగా 15 నిమిషాల వ్యవధి లోపునే భోజన కార్యక్రమాన్ని ముగించవచ్చు. ఒక హాలు నిండిన వెంటనే భక్తులను వేరే హాలులోకి నిర్దేశించే ప్రణాళికా బద్ధమైన వ్యవస్థ ఉంది. మనం నిర్దిష్టస్థానంలో కూర్చున్నదే తడవుగా, వెనువెంటనే వడ్డన కార్యక్రమం ప్రారంభమవుతుంది. అన్నప్రసాదకేంద్రంలోని కార్మికులు సుశిక్షితులైన సైనికులలా వడ్డన కొనసాగిస్తారు. భక్తుల రద్దీ మరీ ఎక్కువైతే, కాలయాపననరికట్టడానికై, 'బఫే' పద్ధతిలో భోజనాలను వడ్డించే సాంప్రదాయానికి కూడా తి.తి.దే. శ్రీకారం చుట్టింది.

ఆదరణ-ఆప్యాయత

ప్రతినిత్యం లక్షమంది భక్తులకు వండి వడ్డించే సిబ్బంది ముఖాలలో ఏ విధమైన విసుగుదల గాని, అలసటగాని

మచ్చుకు కూడా కానరావు. తమకు కేటాయించిన విధులను వారు త్రికరణశుద్ధితో నిర్వర్తిస్తుంటారు. హాలు లోనికి ప్రవేశించినది మొదలు, చేతులు శుభ్రపరచుకొని నిష్క్రమించేంత వరకూ భక్తులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలందిస్తూ, ఏ విధమైన ఇబ్బంది, అసౌకర్యం కలుగకుండా చూస్తారు.

కాలక్రమం

1985 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు గారు శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదాన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. 'రామయ్య' అనే భక్తుడు సమర్పించుకున్న ఐదు లక్షల రూపాయల విరాళంతో ప్రారంభమైన ఈ పథకంలో భాగంగా అప్పట్లో ప్రతిరోజూ రెండువేల మంది భక్తులకు పులిహోర మాత్రమే అందించే వారు. 1987వ సంవత్సరం నుండి మధ్యాహ్నం, రాత్రి పరిమిత సంఖ్యలో భక్తులకు భోజనం సమకూర్చేవారు.

1994వ సంవత్సరంలో 'శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదాన ట్రస్ట్' రూపుదిద్దుకుంది. ట్రస్టుకు వచ్చిన విరాళాలను బ్యాంకుల్లో కాలపరిమితి డిపాజిట్లలో జమ చేసి, వచ్చిన వడ్డీ సొమ్ముతో నిత్యాన్నదాన కార్యక్రమం నడిపించ బడుతుంది. వడ్డీగా వచ్చిన మొత్తం సరిపోకపోతే, కావలసిన మొత్తాన్ని గ్రాంట్ రూపంలో తి.తి.దే. సమకూరుస్తుంది. ప్రస్తుతం ఈ ట్రస్ట్ కు సుమారు 752 కోట్ల రూపాయలు పైగా డిపాజిట్లు ఉన్నాయి. స్వదేశీ, విదేశీ భక్తుల నుండి ఈ ట్రస్ట్ కు విరాళాల వెల్లువ కొనసాగుతూనే ఉంది.

2007వ సంవత్సరం వరకు శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు మాత్రమే ఉచిత అన్న ప్రసాదం అందించబడేది. తరువాత, దర్శనంతో సంబంధం లేకుండా, ఆకలిగొన్న ప్రతి భక్తునికి అన్నప్రసాదం అందించటం ప్రారంభించారు. దీంతో, అన్నార్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది.

2009వ సంవత్సరంలో అప్పటివరకూ దక్షిణాది భక్తులకు మాత్రమే అనుకూలంగా ఉండే సాంబార్, రసం వంటి పదార్థాలు కు తోడుగా, ఉత్తరాది భక్తుల కోసం రోటీ, దాల్ వంటివి ప్రవేశపెట్ట బడ్డాయి. మొట్టమొదట్లో దక్షిణాది వారి కోసం ముద్దపప్పు, నెయ్యి, చక్కెరపొంగలి కూడా వడ్డించేవారు. తరువాత, వ్యయభారం అధికమవ్వటం వల్ల నెయ్యి, ముద్దపప్పును తొలగించారు.

అన్ని హంగులతో కూడుకున్న భవనం!

రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల తాకిడి వల్ల అప్పటివరకు ఉన్న భవనం సరిపోక పోవడంతో, ఆసియాఖండం లోనే అతి పెద్దదైన రెండంతస్తుల విశాలమైన భవనాన్ని, నాలుగు భోజనశాలలతో నిర్మించారు. 2011వ సంవత్సరంలో అప్పటి భారత రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా దేవీసింగ్ పాటిల్ గారు ఈ భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఈ భవనం మొదటి అంతస్తులో ఉన్న చిన్న ఉద్యానవనంలో, నమస్కారభంగిమలో ఉన్న వెంగమాంబ గారి చూడచక్కనైన నల్లరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దాని ప్రక్కనే ఉన్న ఉన్నతమైన, విశాలమైన కుడ్యంపై శేషాచలపర్వతాలలో కొలువై ఉన్న శ్రీశైలం, త్రిపురాంతకం, మహానంది, అహోబిలం, తిరుమల వంటి అయిదు శైవ, వైష్ణవక్షేత్రాల ఊహాచిత్రం

భక్తులను అమితంగా ఆకట్టుకుంటుంది.

ఈ భవన నిర్మాణానికి అప్పట్లో మొత్తం 37 కోట్ల రూపాయలు వ్యయం కాగా, అందులో 'ఎల్ వి రాజు' అనే భక్తుడు 20 కోట్లను, ప్రతాప్ రెడ్డి అనే మరో భక్తుడు ఐదు కోట్ల రూపాయలను సమకూర్చారు. మిగిలిన 12 కోట్లు తి.తి.దే. వెచ్చించింది. ఒక్కో భోజనశాలలో వెయ్యి మంది చొప్పున, ఒకేసారి నాలుగువేల మంది భక్తులకు ఎక్కడా వేచి ఉండాల్సిన అవసరం లేకుండా భోజనం వడ్డించగలిగే ఏర్పాటు చేయబడింది. అలాగే, తిరుచానూరు ఆలయంలో కూడా ఇదే తరహాలో ఐదుకోట్ల రూపాయలతో నూతన భవనం నిర్మించబడింది.[6]

సుశిక్షితులైన సిబ్బంది

ఈ అన్నప్రసాద కేంద్రంలో పనిచేసే సిబ్బందిని కనిపించే దేవుళ్ళుగా చెప్పుకోవచ్చు. సుమారుగా పన్నెండు వందల మంది ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. దశాబ్దాల నుంచి చేపడుతున్న ఈ అన్నదాన కార్యక్రమంలో ఇప్పటివరకు ఒక్క విమర్శ కూడా రాలేదంటే, ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఎంత శ్రద్ధాభక్తులతో తమ విధులు నిర్వర్తిస్తున్నారో చెప్పుకోవచ్చు. అన్నప్రసాదాల తయారీ కోసం తెల్లవారు ఝామున నాలుగు గంటల నుండి వంటలు ప్రారంభించి, షిఫ్టుకు 40 మంది చొప్పున, రెండు షిఫ్టులుగా వంట చేస్తారు. అన్నప్రసాద వితరణలో శ్రీవారి సేవకుల పాత్ర కూడా ఎంతో కీలకమైనది. ఇప్పటివరకు సుమారుగా రెండు లక్షలకు పైగా శ్రీవారి సేవకులు అన్నప్రసాదాల తయారీ మరియు వితరణలో అమూల్యమైన సేవలను అందించారు. కూరగాయలను శుభ్రపరచడం, తరగటం మొదలు కొని పదార్థాల పంపిణీ వరకు గల అన్ని దశల్లోనూ వీరి సేవలు చెప్పుకోదగ్గవి.

కూరగాయల – వంటదినుసుల లభ్యత

తి.తి.దే. భోజనాలకు కావలసిన టన్నుల కొద్దీ బియ్యాన్ని భక్తుల నుండి కానుకలు రూపేణా స్వీకరించడమే కాకుండా; ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రలలో ఉండే బియ్యం మిల్లుల నుండి కూడా కొనుగోలు చేస్తుంది. బియ్యం మిల్లుల వారు కొన్ని క్వింటాళ్ళ బియ్యాన్ని అన్నప్రసాద నిమిత్తం ఉచితంగా ఇవ్వడమే కాకుండా, మిగిలిన బియ్యాన్ని బహిరంగ విపణి.ధరల కంటే చాలా తక్కువకే సరఫరా చేస్తారు. అలాగే, వంటల నిమిత్తం కావలసిన వంటనూనె, నెయ్యి, పంచదార, పప్పుదినుసులు వంటి మిగిలిన సరుకులు కూడా కొన్నింటిని కానుకల రూపంలో ఉచితంగానూ; మిగిలిన వాటిని రాయితీ ధరలలోనూ తి.తి.దే. సమకూర్చు కుంటుంది. అయితే నాణ్యతను నిర్ధారించుకునే విషయంలోనూ, బహిరంగ విపణిలో పెద్దమొత్తంలో కొనుగోలు చేసేటప్పుడు విధిగా పాటించవలసిన నియమాల విషయంలోనూ పూర్తి పారదర్శకతతో కూడిన అత్యున్నత ప్రమాణాలను పాటిస్తూ ఏ విధమైన వివాదాలకు తావులేకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకో బడుతున్నాయి.

---

[6] ప్రస్తుతం కరోనా తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తులకు మధ్య సామాజికదూరాన్ని పాటింప జేస్తూ, అందరూ మాస్కులు ధరిస్తూ అన్ని జాగ్రత్తలతో భోజనాలు వడ్డించే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. భోజనానంతరం చేతులు శుభ్రపరచు కోవడానికి చేతితో ముట్టుకునే అవసరం లేకుండా కాలితో త్రొక్కడం ద్వారా పనిచేసే ప్రత్యేక పంపులను ఏర్పాటు చేసి, భక్తుల ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తున్నారు.

రోజుకు 8-9 క్వింటాళ్ళ కూరగాయలను కూడా తి.తి.దే. దాతల నుండి స్వీకరిస్తుంది. చెన్నై, బెంగుళూరు, మదనపల్లి, చిక్బల్లాపూర్, విజయవాడ, తిరుపూరు, వెల్లూరు వంటి సమీప, సుదూర ప్రాంతాల నుండి కూడా దాతలు కూరగాయలను ఉచితంగా సరఫరా చేస్తారు. కూరగాయల నిమిత్తం ఇంతవరకు తి.తి.దే. ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదంటే, దాతల, భక్తుల మదిలో శ్రీవారిపట్ల ఎంతటి ఆదరాభిమానాలు ఉన్నాయో వెల్లడవుతుంది.

సరుకుల కొనుగోలు చేసే సమయంలో వాటి నాణ్యతను నిర్ధారించడానికి, వాటన్నింటిని అన్నదాన సముదాయంలోని శీతల గిడ్డంగులలో నిలువ చేయడం కోసం, కూరగాయలు కడగటం తరగడం కోసం, టన్నుల కొద్ది అన్నాన్ని బాయిలర్ లలో వండటం కోసం తి.తి.దే. ఎప్పటికప్పుడు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఎంతో అధునాతనమైన ఉపకరణాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటూ, సమయాన్ని, ఇతర వనరులనూ ఆదా చేస్తూ భక్తుల ఆదరాభిమానాలను చూరగొంటోంది.

అన్నప్రసాదం తయారీ

ప్రసాదాల తయారీ కోసం తరిగొండ వెంగమాంబ అన్నదాన కేంద్రంతో పాటుగా వైకుంఠం క్యూ సముదాయం లో ఉన్న రెండు పెద్ద పాకశాలలను కూడా వినియోగిస్తారు. వీటన్నింటిలో చక్కెరపొంగలి, సాంబార్, రసం, కూర, చెట్నీ, అన్నం తయారీ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఉదయం అల్పాహారంగా ఉప్మా, కిచిడీ, పొంగలి తయారు చేస్తారు. మధ్యాహ్న, రాత్రి భోజనాలలో అన్నం, సాంబారు, రసం, రోటిపచ్చడి, కూర లేదా పప్పుతో పాటుగా, చక్కెరపొంగలి కూడా వడ్డిస్తారు.

వితరణ

ఉదయం 10 గంటలనుండి అన్నదానకేంద్రంలో అన్నప్రసాద వితరణ జరుగుతుంటుంది. కేవలం ఒక గంట విరామంతో, రాత్రి పదకొండు గంటల వరకూ వడ్డన కొనసాగుతూనే ఉంటుంది. అలాగే *వైకుంఠం-2* పాకశాలలో నుండి, క్యూలలో వేచి ఉన్న భక్తులకు నిరంతరాయంగా పాలు, ఉదయం వేళల్లో అల్పాహారాలు సరఫరా అవుతాయి. అంతే కాకుండా, తిరుమల లోని అనేక కూడళ్ళలో అన్నప్రసాద కేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు వేడివేడిగా సాంబారన్నం, పెరుగన్నం, కిచిడీ, ఉప్మా, పొంగలి ఎప్పటికప్పుడు తయారుచేసి అందజేస్తుంటారు. శ్రీవేంకటేశ్వరుని సన్నిధి అంటేనే అన్నవితరణకు పెట్టింది పేరు.

కొండపైనున్న వివిధ ప్రదేశాలకు తోడుగా అలిపిరి నడకమార్గంలోని గాలిగోపురం వద్ద, ఏడవ మైలురాయి వద్ద, శ్రీవారిమెట్ల మార్గం ముగిసే చోట, తిరుపతి లోని విష్ణునివాసం మరియు శ్రీనివాసం వసతి సముదాయాలలోనూ ఉచిత అన్నప్రసాదం కోసం బారులు తీరి ఉన్న వేలాది భక్తులను తరచుగా మనం చూస్తూనే ఉంటాం.

అంతే గాకుండా, బ్రహ్మోత్సవాల సమయంలో తిరుపతి పట్టణంలోని కపిలేశ్వరస్వామి ఆలయం, అప్పలాయగుంట, కోదండరామాలయం, నారాయణవనం, శ్రీనివాసమంగాపురం వంటి తి.తి.దే. అనుబంధ ఆలయాలలో కూడా

అన్నవితరణ జరుగుతుంది.[7]

ఇదివరకు ముఖ్యమైన భక్తులకోసం తి.తి.దే. అతిథిగృహాలలో వంట ఏర్పాట్లు చేసేవారు. ఇప్పుడా ప్రత్యేక ఏర్పాట్లకు స్వస్తి చెప్పి, ముఖ్యమైన అతిముఖ్యమైన భక్తులను కూడా అన్నదాన కేంద్రానికే తరలించడం వల్ల భోజనాల వ్యవస్థలో మరింత నాణ్యత, పారదర్శకత చోటు చేసుకున్నాయి.

నైవేద్యం...

తయారు చేసిన అన్న ప్రసాదాలను ముందుగా అన్నపూర్ణాదేవికి నైవేద్యంగా సమర్పించిన తరువాత భక్తులకు వితరణ చేస్తారు. తిరుమల దివ్యక్షేత్రంలో సాక్షాత్తు శ్రీవారి కనసన్నులలో తయారు చేయబడినది, జగత్తులోని సమస్తమైన జీవరాశులకు ఆహారాన్ని సమకూర్చే అన్నపూర్ణాదేవికి నివేదించ బడినది, ఆర్థికస్థితుగతులతో సంబంధం లేకుండా లక్షలాది భక్తుల క్షుద్బాధ తీర్చేది అవ్వడం వల్ల, అన్నప్రసాదం లోని ఒక్క మెతుకును కూడా వ్యర్థం చేయకుండా, శ్రీవేంకటేశ్వరుని మనసారా ధ్యానించుకుని, భక్తితో సంతృప్తిగా భుజించి ఆ ప్రసాదం యొక్క పవిత్రతను కాపాడవలసిన బాధ్యత మనందరి పైనా ఉంది. అంతే గాకుండా ఈ అన్నదాన కార్యక్రమం అచంద్రతారార్కం కొనసాగాలని ఆశిస్తూ, ఈ మహాయజ్ఞంలో మనం కూడా పాలుపంచుకుని, ఉడుతా భక్తిగా తృణమో, పణమో విరాళాల రూపంలో సమర్పించుకుందాం. పుట – 102 తేదీ – సెప్టెంబరు, 01

వేద విద్యాబోధన

వేదాలంటే పుక్కిటి పురాణాలు కాదు. విజ్ఞాన నిక్షేపాలు. వేలసంవత్సరాల క్రితం హైందవజాతి ఉనికిని ప్రపంచానికి చాటిచెప్పిన కరదీపికలు. నేడు మానవజాతిని పట్టిపీడిస్తున్న అనేక సామాజిక, శారీరక, మానసిక ఋగ్మతలకు తరచి చూస్తే మన వేదాలలో సత్వరమైన, ఖచ్చితమైన, సులభసాధ్యమైన పరిష్కారమార్గాలు కానవస్తాయనేది కాదనలేని సత్యం. కానీ పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదన్న చందంగా, వేదాలను ఉపేక్షించి, పాశ్చాత్య పోకడలను అనుసరించడం వల్ల ఇప్పటికే మనమెంతగానో కోల్పోయాం.

ఈ నేపథ్యంలో మహత్తరమైన వేదసంస్కృతి వ్యాప్తికి తి.తి.దే. అవిరళ కృషి సలుపుతోంది. దానిని వివరించే ముందు, ఏ వేదంలో ఏం చెప్పబడిందో క్లుప్తంగా తెలుసుకుంటే, వేదాల పట్ల ఆసక్తి, అనురక్తి పెరుగుతాయి.

- **ఋగ్వేదం** ఐదు శాఖల సమాహార మైనప్పటికీ, ప్రస్తుతం 'శాకల' అనబడే ఒక శాఖ మాత్రమే మనకు అందుబాటులో ఉంది. దీనిలో, మానవుని సామాజిక నడవడి (సోషల్ బిహేవియర్), రోగ చికిత్సా పద్ధతులు, కృత్రిమ అవయవాల అమరిక (ఆర్టిఫిషియల్ లింబ్స్), సూక్ష్మ శస్త్రచికిత్స (మైక్రో సర్జరీ), వర్షాలకోసం చేపట్టవలసిన పద్ధతులు, మొదలైనవి చెప్పబడ్డాయి.
- **యజుర్వేదం** లో ప్రాణహింస కూడదని, బలులు నిషిద్ధమని చెప్పబడింది. యాగాలు చేసే పద్ధతులు కూడా

[7] కొద్దిరోజుల క్రితం లాక్డౌన్ కఠినంగా అమలులో ఉన్నప్పుడు, తిరుపతి పట్టణం.లోని పలు ప్రాంతాల్లో ప్రతినిత్యం కొన్ని వేలమందికి ఉచితభోజనాన్ని ఏర్పాటు.చేసి వలసకార్మికులను, స్వస్థలాలకు తిరిగి వెళ్ళలేని పేదభక్తులను, ఉపాధి కోల్పోయినవారిని ఆదుకుని; తి.తి.దే. తన ఉదారత్వాన్ని చాటుకుంది.

పేర్కొనబడ్డాయి.

- **సామవేదం** లో కళలు, సంగీతం, వాద్యపరికరాలు, సాహిత్యం మొదలగు వాటిని వివరించడంతో పాటుగా; సృష్టి సమస్తం శూన్యం నుండి ఉద్భవించి, శూన్యం లోనే ఐక్యమై పోతుందని ప్రతిపాదించబడింది. ఈనాటి బ్లాక్ హోల్ సిద్ధాంతానికి సామవేదం లోని సూత్రీకరణలే ప్రాతిపదికలని కొందరు అభిప్రాయ పడతారు.
- **అథర్వణ వేదం** లో ఆత్మలు, ప్రేతాత్మలు, యుద్ధవిద్యలు, విషశాస్త్రం, శతృసైనికులను క్రిమికీటకాలతో హతమార్చటం (బయో వార్) వంటి విషయాలపై విస్తృతమైన సమాచారం ఉంది. ఇంతే కాకుండా, జ్వరం, అతిసారం, అతిమూత్రం, వాతం, పిత్తం, శ్లేష్మం, విషజ్వరం, క్షయ, బొల్లి, కుష్టు వ్యాధులకు; తేలుకాటు, పాముకాటుకు; సుఖప్రసవానికి, సంతానలేమికి; శిరస్సు, ముక్కు, చెవి, కంఠానికి (నేటి ఇ ఎన్ టి) వచ్చే వ్యాధులకు ఔషధాలు, ఉపశమనాలు చెప్పబడ్డాయి.

వేదపాఠశాల

తిరుమల ప్రధానాలయం నుండి దాదాపు ఐదారు మైళ్ళ దూరాన ఉన్న 'ధర్మగిరి' అనే ప్రదేశంలో, తి.తి.దే. వారి ఆధ్వర్యంలో, తిరుపతి లోని వేదవిశ్వవిద్యాలయానికి అనుబంధంగా, ఓ సువిశాలమైన ప్రాంగణంలో 'వేదపాఠశాల' నడుపబడుతోంది. 1884వ సంవత్సరంలో ఒక చిన్న కుటీరంలో ప్రారంభింపబడ్డ ఈ పాఠశాల, దినదిన ప్రవర్ధమాన మవుతూ, నేడున్న ప్రాంగణంలోకి మారింది. వాహనమార్గం ద్వారా ప్రయాణించి, శిలాతోరణం ఉద్యానవన సముదాయాన్ని దాటిన తరువాత, ప్రకృతిశోభతో ఉట్టిపడుతున్న ప్రశాంత వాతావరణంలో నెలకొన్న ఈ పాఠశాలను చేరుకోవచ్చు. పచ్చని పరిసరాలతో మమేకమై సాంప్రదాయ వేషభాషలతోనున్న చిన్నారులు వేదాలను వీనులవిందుగా వల్లె వేస్తున్న దృశ్యం నయనానందకరంగా, కర్ణపేయంగా గోచరిస్తుంది. వీరందరూ పంచెకట్టుతో, నుదుటిపై నామాలతో, శిరస్సుపై శిఖతో అభినవ బృహస్పతుల వలె తేజరిల్లు తుంటారు.

సనాతన కాలం నుంచి, ప్రపంచం నలుమూలల లోని కోట్లాది ప్రజలు అవలంబిస్తున్న హైందవమత మనుగడకు మూలం – 'వేదం'.

చతుర్వేదాలు శేషాచలసానువుల్లో బండశిలలుగా అవతరించాయని అన్నమాచార్యులు వారు తన కీర్తనలో పేర్కొన్నట్లుగా ఇంతకుముందే చెప్పుకున్నాం. నాలుగు వేదాలే ఆనందనిలయం చుట్టూ ఉన్న నాలుగు మాడవ వీధులుగా అవతరించాయని కూడా పురాణాలలో చెప్పబడింది. ఎందరెందరో కవులు, గాయకులు, మహాభక్తులు శ్రీవేంకటేశ్వరుణ్ణి వేదపురుషునిగా అభివర్ణించారు. అంతటి మహత్తరమైన, ఘనచరిత్ర గల వేదాలను పరిరక్షించడంలో తి.తి.దే. తనవంతు పాత్రను అద్వితీయంగా పోషిస్తోంది. అందులో భాగంగా ఆసక్తి, అర్హత గల బాలురకు అతి చిన్నవయసు నుండే వేద విద్యాభ్యాసం గావించడం ఈ పాఠశాల ప్రధానోద్దేశ్యం.

శ్రీవేంకటేశ్వరుని ఆశీస్సులతో, 2006వ సంవత్సరంలో, మహామహోపాధ్యాయ రామేశ్వర్ ఠాకూర్ గారి చేతుల మీదుగా, తిరుపతి పట్టణంలో వేద విశ్వవిద్యాలయం ప్రారంభించబడింది. ప్రపంచంలోనే మొట్టమొదటి 'వేదవిశ్వవిద్యాలయం' గా వినుతికెక్కిన ఈ సంస్థలో ప్రస్తుతం 24 మంది అధ్యాపకుల శిక్షణలో 350 మంది విద్యార్థులు వేదవిద్యాభ్యాసం నెరపుతున్నారు. యూజిసి ఆమోదంతో నడపబడుతున్న ఈ విశ్వవిద్యాలయంలో కానీ

ఖర్చు లేకుండా ఎవరైనా వేదాలను అభ్యసించవచ్చు. విద్యార్థులకు ఉచిత వసతి, భోజన, విద్యా సదుపాయాలు కల్పించబడుతాయి.

కొన్నేళ్ళ క్రితం ఇదే ఆశయంతో పశ్చిమగోదావరి జిల్లా, అయిభీమవరం అనే గ్రామంలో కూడా ఈ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఒక వేదపాఠశాలను తి.తి.దే. ఏర్పాటు చేసింది.

వేదవిశ్వవిద్యాలయంలో ఋగ్వేదం, అథర్వణవేదం సామవేదం లోనూ; వాటికి సంబంధించిన ఉపశాఖలలోనూ మొత్తంగా 27 విభాగాలలో శిక్షణ నిస్తారు. హిందూ ధార్మికవ్యవస్థకు ప్రాతిపదిక యైన ఆగమశాస్త్రంతో పాటుగా పౌరోహిత్యం, అర్చకత్వం వంటివాటిలో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతారు. అలాగే ఖగోళ, వాస్తు, మూలిక, హిందూ ధర్మపరిరక్షణ, ఆలయనిర్మాణ శాస్త్రాలలో కూడా శిక్షణనిస్తారు. ఏదైనా ఒక్క వేదం సంపూర్ణంగా అభ్యసించాలంటే, సుమారు 15 నుండి 18 సంవత్సరాల కాలం పడుతుంది. ఆ కాలంలో, రోజుకు 10 నుండి 12 గంటల పాటు నిర్విరామకృషి సలిపితేనే వేదవిద్యను అభ్యసించ గలుగుతారు. ప్రతిరోజూ ఉదయం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే విద్యార్థుల దినచర్య రాత్రిభోజనాల తోనే ముగుస్తుంది. వంటశాలలో వారే స్వయంగా వండుకొని భుజిస్తారు. మొత్తంగా వారి విద్యావిధానం ప్రాచీనకాలపు గురుకుల వ్యవస్థను స్మరణకు తెస్తుంది.

విద్య పూర్తయిన తరువాత డిగ్రీ విద్యకు సమానంగా 'శాస్త్రి' అనే పట్టాను, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కు సమానంగా 'ఆచార్య' అనే పట్టాను ప్రదానం చేస్తారు. ఎంఫిల్, పీహెచ్డీ వంటి ఉన్నత కోర్సులు కూడా ఈ విశ్వవిద్యాలయంలో లభిస్తాయి. ఎక్కువ మంది విద్యార్థులు విశ్వవిద్యాలయంలో చేరేటందుకు ప్రోత్సహించడానికి గానూ విద్యాభ్యాసం ప్రారంభంలోనే విద్యార్థి పేరిట నిర్ణీతమొత్తాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తారు. విద్యాభ్యాసం పూర్తవగానే, ఆ డిపాజిట్ ద్వారా ప్రతినెలా కొంత మొత్తం వడ్డీ రూపంలో వచ్చే ఏర్పాటు చేసి, వారి ఉదరపోషణకు కనీస భరోసా కల్పిస్తారు.

వివిధ కోర్సులలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు వేదాలపై పరిశోధనలు నిర్వహించే సంస్థలలోనూ, ఆగమశాస్త్ర బద్ధంగా నిర్వహించే ఆలయాల లోనూ, వేదాలను బోధించే విద్యాసంస్థల లోనూ, తాళపత్రాలలో నిక్షిప్తమై ఉన్న ప్రాచీన వేదసంపదను వెలికి తెచ్చే కార్యక్రమంలో నిమగ్నమై ఉన్న వారసత్వ పరిరక్షణా సంస్థలలోనూ ఉపాధి లభిస్తుంది. అంతే కాకుండా, పౌరోహిత్యం వంటి ధార్మిక వ్యాపకాలలోనూ, ఆలయనిర్మాణ రంగంలోనూ, వాస్తుశాస్త్ర విశారదులు, జ్యోతిష్యశాస్త్ర సిద్ధాంతులు గానూ స్థిరపడ్డ వేదవిద్యార్థులు కూడా ఎందరో ఉన్నారు.

గోసేవ

వైకుంఠాన్ని విడిచివెళ్లిన శ్రీమహాలక్ష్మిని అన్వేషిస్తూ భూలోకంలోని వేంకటాచల పర్వతానికి విచ్చేసిన శ్రీమహావిష్ణువు అలసి సొలసి ఆకలిదప్పులతో అలమటిస్తున్నప్పుడు వారిని ఒక గోమాత తన క్షీరంతో ఆదుకుంది. ఆ విధంగా శ్రీవేంకటేశ్వరునికి, గోవులకు విడదీయరాని బంధం ఏర్పడింది. అంతే కాకుండా, హైందవసంస్కృతిలో గోమాతకు విశిష్ఠమైన స్థానం ఉంది. గోమాత తనువులో ముక్కోటి దేవతలు కొలువై ఉన్నట్లుగా చెబుతారు.

అలా గోవుకు ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని, గోసంరక్షణకై తి.తి.దే. అనేక చర్యలను చేపట్టింది. అందులో

భాగంగానే తిరుమల, తిరుపతి పట్టణాలలో వందలాది ఎకరాలలో విశాలమైన గోశాలలు ఏర్పాటు చేసి, అందులో వేలాది గోవులను సంరక్షిస్తున్నారు. వీటిలో పాలిచ్చే ఆవులతో పాటుగా ఒట్టిపోయిన ఆవులు, లేగదూడలు కూడా ఉన్నాయి. వయసుడిగిన ఆవులను కసాయిశాలలకు తరలిస్తుంటే గోరక్షాసమితి కార్యకర్తలు వాటిని రక్షించి, తి.తి.దే. గోశాలలకు తరలిస్తారు.

ఆలయంలో ప్రసాదాల తయారీ కోసం, నేతిదీపాలు వెలిగించడం కోసం, అర్చకుల భుక్తి కోసం ఆలయానికి గోవులను దానం చేసే సాంప్రదాయం అనాదిగా వస్తోంది. చరిత్రపుటల్లోకి వెళితే, లభించిన శాసనాలను బట్టి, మొట్టమొదటగా కుళోత్తుంగచోళుడనే చోళరాజు ప్రప్రథమంగా ఆలయానికి గోవులను దానం చేశాడు. తరువాత, 13వ శతాబ్దానికి చెందిన విజయగండ గోపాలుడు 33 గోవులను; యాదవరాజు వీరనరసింగ దేవరాయల వారి దేవేరి 64 ఆవులు, 2 ఆంబోతులను సమర్పించారు. ఇంకా – పెరియతెమ్మ నాయకన్, వీరకుమార కంపన, చంద్రగిరికి చెందిన మాధవదాసన్, మహాకుండలేశ్వరుడు, సాళువ మహదేవమహారాజు, కందాడై రామానుజ అయ్యంగార్ వంటి ఎందరో మహారాజులు, వారి దేవేరులు, ఆచార్యపురుషులు, పీఠాధిపతులు, జమీందార్లు, వర్తకశ్రేష్ఠులు – ఇలా ఎందరెందరో శ్రీనివాసునికి గోవులనర్పించి తరించారు.

మొట్టమొదట 'గోశాల' గా వ్యవహరించబడే ఈ గోసంరక్షణశాల తరువాత 'శ్రీవేంకటేశ్వర డైరీ ఫామ్' గానూ, తరువాతి కాలంలో 'శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ కేంద్రం' గానూ రూపాంతరం చెందింది.

మహంతుల కాలంలో గోవిందరాజస్వామి ఆలయ పరిసరాలో ఉన్న ఈ గోశాల, పెరుగుతున్న గోవుల సంఖ్యకు అనుగుణంగా తరువాతి కాలంలో కపిలతీర్థం మార్గంలో గల శ్రీవేంకటేశ్వర ఓరియంటల్ కళాశాల ప్రాంగణానికి, తదనంతరం ఇప్పుడు మహతీ ఆడిటోరియం ఉన్న ప్రదేశానికి, చివరగా తిరుపతి పట్టణశివారులో ఇప్పుడున్న సువిశాల ప్రాంగణానికి మార్చబడింది. ప్రస్తుతం ఇందులో గోవులే కాకుండా రేవతి, పద్మ, లక్ష్మీ, మహాలక్ష్మి, వైష్ణవి అనే ఏనుగులు; గుర్రాలు, ఆంబోతులు, ఒంటెలు, జింకలు, పొట్టేళ్ళు, నెమళ్ళు, బాతులు; అనేక పక్షిజాతులు కూడా పెంచబడుతున్నాయి.

దేశం మొత్తం మీద 33 జాతుల ఆవులుంటే, వాటిలో 13 జాతుల ఆవులు తిరుపతి లోని శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ శాలలోనే ఉండడం విశేషం. ఇందులో సంరక్షించ బడుతున్న ఆవులలో చాలా వరకు భక్తులు సమర్పిఃచుకున్నవే! దేశవాళీ ఆవుల సంతతిని వృద్ధి చేయాలనే లక్ష్యంతో మేలుజాతి ఒంగోలు వృషభాలు కూడా గోశాలలలో పెంచబడు తున్నాయి. దేశవాళీ ఆవుల యొక్క పాలు, గోమయం మరియు గోపంచకాలలో ఉన్న ఔషధ విలువలను గుర్తించి, వాటి వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు.

గోశాలలలో ఆవుల ఆరోగ్యానికి, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తారు. ప్రతిరోజు నాలుగు సార్లు నిర్ణీతసమయాలలో పౌష్టికాహారాన్ని అందిస్తారు. క్రమం తప్పకుండా నిపుణులైన పశువైద్యులు వైద్యపరీక్షలు నిర్వహిస్తారు.

పాల దిగుబడి పెంచడం కోసం గోమాతలకు సంగీతం వినిపించడం ఈ గోశాల ప్రత్యేకత. అన్నమయ్య సంకీర్తనలు, శాస్త్రీయసంగీతం నిరంతరంగా వినిపిస్తున్నందు వల్ల పాలదిగుబడి వృద్ధి చెందినట్లు శాస్త్రోక్తంగా వెల్లడైంది.

రోజూ కొన్ని వేల లీటర్ల పాలు ఉత్పత్తి అయినప్పటికీ, పాలను విక్రయించే సాంప్రదాయం లేదు. ఉదయం, సాయంత్రం సేకరించిన స్వచ్ఛమైన పాలు, పెరుగు, వెన్న స్వామివారి సేవకు మరియు దేవాలయ అవసరాలకు వినియోగిస్తారు. మిగిలిన వాటిని వివిధ దేవస్థానాలకు, ఫలహారశాలలకు, అతిథిగృహాలకు, మూగ–బధిర పాఠశాలకు, హాస్టళ్ళకు, వైకుంఠం క్యూ సముదాయంలో వేచి ఉండే భక్తులకు సరఫరా చేస్తారు.

2002వ సంవత్సరంలో ప్రారంభించబడ్డ గోసంరక్షణ ట్రస్టు ఆధ్వర్యంలో అనాథలుగా ఉన్న గోవుల ఆలనా–పాలనా, ఉచిత పశువైద్యశాలల నిర్వహణ, గోవుత్పత్తులు మరియు పశుసంరక్షణా పద్ధతులపై శాస్త్రీయపరిశోధన మున్నగునవి నిర్వహిస్తారు. గోమాత వైశిష్ట్యాన్ని చాటి చెప్పేందుకు గానూ తి.తి.దే. ఆధ్వర్యంలో ఒక జాతీయసదస్సు నిర్వహించబడింది.

గోవుల పట్ల ప్రజలలో శ్రద్ధాభక్తులు పెంపొందించడం కోసం ప్రతిరోజూ గోపూజ నిర్వహిస్తూ, ప్రజలు కూడా పూజలో పాల్గొనే అవకాశం కలిగిస్తున్నారు. అలాగే, కృష్ణాష్టమి నాడు ఘనంగా ఉత్సవాలు నిర్వహించి, వేలాది మంది భక్తులు, పురప్రముఖుల సమక్షంలో గోమాతలకు విశేషపూజలు నిర్వహిస్తారు. **పుట – 103 తేదీ – సెప్టెంబరు, 02**

కళ్యాణకట్ట

తిరుమలను తలచుకోగానే మొట్టమొదటగా భక్తుల మదిలో మెదిలేది లడ్డూ ప్రసాదమైతే, రెండవది కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించడం. దాని పూర్తి వివరాలను ఈనాటి ప్రకరణంలో తెలుసుకుందాం.

కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వరునికి భక్తకోటి సమర్పించుకునే అనేకానేక మొక్కుబడులలో 'తలనీలాల సమర్పణ' అత్యంత ముఖ్యమైనది. వేల సంవత్సరాల నుండి, స్త్రీ పురుషులిరువురూ సౌందర్య చిహ్నమైన తమ కేశసంపదను ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సంరక్షించుకుంటున్నారు. భక్తులు అటువంటి అమూల్యమైన శిరోజాలను ఏమాత్రం సంకోచించకుండా, శ్రీవారి సన్నిధిలో సమర్పించు కుంటారు. తిరుమలలో తలనీలాల సమర్పణకు ఎంతో పౌరాణిక ప్రాశస్త్యం, చారిత్రక వైశిష్ట్యం ఉన్నాయి.

ముండన సంస్కారం

మానవ జన్మనెత్తిన ప్రతి ప్రాణికి, స్త్రీ పురుష బేధాలు లేకుండా, తప్పనిసరిగా జరుగవలసిన సంస్కారాలలో ముండనసంస్కారం ఒకటి. ముండనసంస్కారమంటే తమ ఇష్టదైవం చెంతన కేశఖండన గావించుకొని, మానవసహజమైన అహంకారాన్ని భగవంతుని పాదాల చెంత విడనాడడం. పుట్టిన బిడ్డకు ఆడా–మగా తేడా లేకుండా, ఏడాది తిరుగకుండా శ్రీవారిసన్నిధిలో ముండనసంస్కారం చేయించడం దక్షిణ భారతదేశంలోని లక్షలాది కుటుంబాలలో తరతరాలుగా వస్తున్న ఆచారం.

పౌరాణిక ప్రాశస్త్యం

మానవులు తెలిసో తెలియకో చేసిన పాపాలు వారి కేశాలను ఆశ్రయించి ఉంటాయని పురాణాలలో చెప్పబడింది.

అందువలన తిరుమలక్షేత్రంలో తలనీలాల నర్పిస్తే జన్మ జన్మల పాపాలు పటాపంచలవుతాయని భక్తుల విశ్వాసం. అంతే గాకుండా, శ్రీమహావిష్ణువు నారదునికి, వేంకటాచలంపై తాను శ్రీవేంకటేశ్వరునిగా అవతరిస్తానని, కలియుగంలో తన భక్తులు అశ్వమేధయాగాల వంటి సంక్లిష్టమైన వైదిక ప్రక్రియలు చేపట్టలేరని, అందువల్ల వేంకటాచలంలో వెలసిన తనకు మనస్ఫూర్తిగా నమస్కరించుకుని తలనీలాలు సమర్పించుకుంటే పూర్వజన్మల పాపాలన్నీ తొలగిపోతాయని శెలవిచ్చినట్లుగా శ్రీవేంకటాచల మహత్యంలో చెప్పబడింది. శ్రీవారి మహాభక్తురాలైన 'నీలాదేవి' కి, శ్రీవేంకటేశ్వరు డొసగిన వరం వల్ల, తిరుమలలో తలనీలాలు సమర్పించుకునే సాంప్రదాయ మేర్పడినట్లు చెప్పబడే మరో పౌరాణిక కథనాన్ని మనం 'సప్తగిరులు' ప్రకరణంలో వివరంగా తెలుసుకున్నాం.

ధార్మిక క్రతువుల్లో కేశఖండన

భారతదేశంలో సనాతన కాలం నుండి అనేక సందర్భాలలో కేశఖండన కావించుకోవటం తప్పనిసరి. యజ్ఞయాగాదులు నిర్వర్తించేటప్పుడు, చాతుర్మాస్య దీక్ష చేపడుతున్నప్పుడు, దేవ, పితృ, ఋషి తర్పణం చేసేటప్పుడు తప్పనిసరిగా ముండనం చేయించుకోవాలని శాస్త్రాలు చెబుతున్నాయి. పద్మ పురాణంలో, తీర్థయాత్రలకు వెళ్ళినప్పుడు కేశఖండన విధిగా చేయించుకోవాలని చెప్పబడింది. ప్రపంచం లోనే అత్యంత ప్రాచీనమైనవి, అభివృద్ధి చెందినవిగా చెప్పబడే గ్రీకు, సిరియన్, ఈజిప్షియన్ నాగరికతలలో కూడా ధార్మిక కారణాలవల్ల అప్పటి ప్రజలు తమ కేశాలను తొలగించుకున్నట్లుగా చారిత్రక ఆధారాలు లభ్యమయ్యాయి.

చారిత్రక విశేషాలు

శ్రీవారి సమక్షంలో తలనీలాలు సమర్పించు కోవడమనే ఆనవాయితీ చరిత్రకు అందని కాలంనుంచి ఉన్నప్పటికీ చారిత్రక ఆధారాలు మాత్రం శ్రీకృష్ణదేవరాయల కాలం నుండి మాత్రమే లభ్యమయ్యాయి. ఆ కాలంలో చంద్రగిరిని పరిపాలించిన విజయనగర రాజు శ్రీనివాస మహాదేవ రాయలవారి తామ్రశాసనం ప్రకారం, పంతులు గారి వంశానికి చెందిన 'సంజీవిని' అనే ధర్మకర్త ఆధ్వర్యంలో కొండపైనున్న ఒక పూరిపాకలో తొలి మంగలికట్ట ఏర్పడింది. అప్పట్లో శ్రీవారిమెట్ల ద్వారా నడిచి వచ్చే భక్తులు ఈ మంగలికట్టలో తలనీలాలు సమర్పించి, చెంతనే ఉన్న బావిలో స్నానమాచరించే వారని తెలుస్తోంది. దానిని అప్పట్లో 'మంగలిబావి' గా పిలిచేవారు. క్రమేణా, అదే 'మంగళం బావి' గానూ, దాని సమీపంలో ఉండే అతిథిగృహాలు 'మంగళం బావి కాటేజెస్' (ఎమ్ బి సి కాటేజెస్) గానూ పిలువబడుతున్నాయి.

18వ శతాబ్దంలో అప్పటి పాలకులు క్షౌరకర్మ ద్వారా వచ్చే ఆదాయాన్ని ఒక గుత్తేదారుకు అప్పగించారు. ఆ గుత్తేదారు, క్షురకుల నుండి 'హజన్ గూటా' అనే శిస్తును వసూలు చేసేవారు. క్షురకులు వారు చెల్లించిన శిస్తును ముండనం చేయించుకున్న భక్తుల నుండి నిర్ణీత రుసుము రూపంలో వసూలు చేసుకునే వారు. ఆ విధంగా దాదాపు మూడు వందల సంవత్సరాల క్రితమే, తిరుమలలో తలనీలాల సమర్పణ ఒక ఆధ్యాత్మిక ప్రక్రియగా పరిణతి చెందడమే గాకుండా, ఒక ప్రధాన ఆదాయవనరుగా మారి క్షేత్రాన్నే నమ్ముకున్న అనేకమందికి జీవనోపాధి కూడా కల్పిస్తుండేది.

1831వ సంవత్సరంలో అప్పటి ఆర్కాట్ జిల్లా కలెక్టర్ ఏషియాటిక్ జర్నల్ అనే పత్రికలో ప్రచురించిన వ్యాసంలో భక్తులు హుండీ ద్వారా బంగారం అచ్చులు, వెండి ముద్రలు, రూపాయల సంచులు, రాగి నాణేలు, సుగంధ ద్రవ్యాలు వంటివే కాకుండా; తమ పొడపాటి, అందమైన జుట్టును కూడా భగవంతునికి సమర్పించుకునే వారని పేర్కొన్నాడు. గత రెండువందల సంవత్సరాలలో జీవనవిధానం అనేక క్రొత్త పోకడలు త్రొక్కి, అనేక సాంప్రదాయాలు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ ఈ మ్రొక్కుబడి సజీవంగా ఉండటమే కాకుండా, తలనీలాలు సమర్పించుకునే భక్తుల సంఖ్య ఏ ఏటికాయేడు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతూనే ఉంది. శ్రీనివాసుని పట్ల ప్రజలలో పెరుగుతున్న భక్తివిశ్వాసాల కిది మరో ప్రబలమైన తార్కాణం.

1917వ సంవత్సరంలో కొండపై 70 మంది క్షురకర్మ నిర్వహించేవారంటే ఆ రోజుల్లోనే తలనీలాల సమర్పణకు ఎంతటి ఆదరణ ఉందో ఊహించుకోవచ్చు. 1946వ సంవత్సరంలో అప్పటి తి.తి.దే. పాలక మండలి మరియు ధర్మకర్త పంతులుగారి వంశస్తుడైన 'శివరామయ్య' గారితో కుదిరిన మరో ఒప్పందం ప్రకారం కేశఖండన ద్వారా యాత్రికుల నుండి వచ్చే ఆదాయంలో 25 శాతం తితిదేకు, 75 శాతం క్షురకులకు చెందేటట్లుగా తీర్మానం చేయబడింది. 1952వ సంవత్సరంలో తి.తి.దే. క్షురకర్మ కోసం ఒక విశాలమైన భవనాన్ని నిర్మించింది. అప్పట్లో మంగలికట్టగా పిలవబడే ఆ భవనం కాలక్రమంలో 'కళ్యాణకట్ట' గా నామాంతరం చెందింది. 1974వ సంవత్సరంలో తిరుమలక్షేత్రంలో దేవస్థానం వారి కళ్యాణకట్ట మాత్రమే ఉండాలని నిర్ణయించి, భక్తుల నుంచి వసూలు చేసే రుసుము తితిదేకు, క్షురకులకు చెరిసగం చెందేట్లుగా ఒప్పందం సవరించబడింది. క్షురకుల సంఖ్యను 200 కు పెంచి, అప్పట్లో శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న, సువిశాలమైన 'వెయ్యికాళ్ళమండపం' లో కేశఖండనకు ఏర్పాటు చేశారు. నాలుగైదు దశాబ్దాల క్రితం తిరుమలను దర్శించుకున్నవారికి దేవాలయం ఎదురుగా ఉన్న విశాలమైన, దినమంతా భక్తులతో సందడిగా ఉండే 'వెయ్యికాళ్ళమండపం' లో తవనీలాలు సమర్పించుకోవడం ఇంకా మదిలో మెదులుతూనే ఉంటుంది. ఆ పాత జ్ఞాపకాలు అత్యంత మధురాలు.

1975వ సంవత్సరంలో క్షురకులు మరియు తి.తి.దే. యాజమాన్యం మధ్య జరిగిన మరో ఒప్పందం ప్రకారం తలనీలాల అమ్మకంపై వచ్చే ఆదాయం మరియు క్షవరం నిమిత్తం భక్తులు చెల్లించుకున్న రుసుము మొత్తంగా తితిదేకు మాత్రమే చెందాలి. దానికి ప్రతిఫలంగా క్షురకులందరినీ దేవాలయ సిబ్బందిగా పరిగణించి, వారికి నిర్ణీత జీతభత్యాలు ఇవ్వాలని నిర్ణయించారు.

అనంతరం అలిపిరి మార్గంలో కూడా భక్తుల రద్దీ పెరగడంతో, ప్రస్తుతం ఉన్న ప్రథమ కళ్యాణకట్ట ప్రాంతంలో ఒక పూరిపాక ఏర్పరుచుకుని క్షురకులు తలనీలాలు తీసేవారు. అప్పట్లో ఆ ప్రాంతాన్ని 'ఏనుగులమిట్ట' గా పిలిచేవారు.

ఈ విధంగా మొత్తం కళ్యాణకట్టలన్ని తి.తి.దే. పరం అయిన తరువాత, 1985వ సంవత్సరంలో ప్రస్తుతం ప్రథమ 'కళ్యాణకట్ట' గా పిలువబడే అధునాతన భవనాన్ని అప్పటి ముఖ్యమంత్రి ఎన్ టి రామారావు గారు ప్రారంభించారు. తరువాత 2002వ సంవత్సరంలో రెండవ కళ్యాణకట్ట భవనం ప్రారంభించబడింది.

కాలక్రమేణా, భక్తులకు తలనీలాలు తీసే కార్యక్రమం పూర్తి ఉచితంగానే చేపట్టబడుతోంది. క్షురకులు అతిథిగృహానికి

వచ్చి తలనీలాలు తీయాలంటే మాత్రం, స్వల్ప రుసుము చెల్లించాలి.

ప్రస్తుతం ఈ కళ్యాణకట్టలలో యాత్రికుల సౌకర్యార్థం అనేక అధునాతన సదుపాయాలు కల్పించబడ్డాయి. ధారాళంగా గాలి–వెలుతురు వచ్చే విశాలమైన హాలు, పరిశుభ్రమైన వాతావరణం, వేడినీళ్ల సరఫరాతో బాటుగా; ప్రతి భక్తునికి ఒక సరిక్రొత్త బ్లేడు ఉపయోగించ బడుతుంది.[8]

ఈ మధ్యకాలంలో మహిళా భక్తుల నిమిత్తం మహిళా క్షురకులను కూడా నియమించి, దేశం లోనే ఒక వినూత్నమైన సంప్రదాయానికి తి.తి.దే. శ్రీకారం చుట్టింది. తద్వారా మహిళాభక్తులకు వెసులుబాటు కలగడమే గాకుండా, ఎంతోకాలంగా శ్రీవారినే నమ్ముకున్న నాయీబ్రాహ్మణ కుటుంబాల లోని స్త్రీలకు కూడా కొంత ఉపాధి లభిస్తోంది.

కేశాలు కాదు – కాసుల రాశులు..

భక్తులు సమర్పించుకున్న శిరోజాలకు జాతీయ, అంతర్జాతీయ విపణుల్లో విపరీతమైన గిరాకీ ఉంది. సౌందర్య సాధనాలు తయారు చేసే సంస్థలు, బొమ్మలు ఉత్పత్తి చేసే పరిశ్రమల్లో శిరోజాల వినియోగం అధికంగా ఉంటుంది. చైనా, కొరియా వంటి ఆసియా దేశాలకు; యూరప్, అమెరికా వంటి ఇతర ఖండాలకు కూడా జుట్టు ఎగుమతి అవుతుంది. దేశం మొత్తం మీద లభ్యమయ్యే శిరోజాలలో 80 శాతం పైగా తిరుమల నుంచే సరఫరా అవుతుంది. శిరోజాల అమ్మకాల ద్వారా ప్రతి సంవత్సరం వంద కోట్లకు పైగా ఆదాయం సమకూరడంతో దేవస్థానం వారు జుట్టు కత్తిరించే విధానంలోనూ, శుభ్రపరిచే ప్రక్రియలోనూ, కత్తిరించిన జుట్టును పొడవును బట్టి ఐదు గ్రేడులుగా విభజించే విధానం లోనూ, జుట్టును ఆరబెట్టి ఒక్కొక్కటి ముప్పై కిలోల బరువున్న మూటగా కట్టి గిడ్డంగుల్లో భద్రపరచడం లోనూ ఎప్పటికప్పుడు అధునాతన పద్ధతులను అవలంబిస్తున్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న జుట్టును అంతర్జాలం ద్వారా టెండర్లను ఆహ్వానించి పూర్తి పారదర్శకతతో విక్రయిస్తున్నారు.

క్షౌరకౌశలం..

గుండు గీయడం నైపుణ్యంతో కూడుకున్న విద్య. నెత్తి మీద ఒక్క గాటు కూడా పడకుండా గుండు చేయగలిగిన వారిని అత్యంత నైపుణ్యం కలిగిన వారిగా గుర్తిస్తాము. భక్తుల రద్దీ విపరీతంగా ఉన్న తిరుమలక్షేత్రంలో ఆ పని చెయ్యడం ఆషామాషీ వ్యవహారం కాదు. ఒక్కో క్షురకుడు రోజుకు సుమారుగా 60 నుంచి 70 మందికి గుండు గీస్తారంటే వారు ఎంత వేగంగా, ఎంత చాకచక్యంతో ఈ విధిని నిర్వహిస్తారో అర్థమవుతుంది.

ఈ మొత్తం వ్యవహారాలన్నింటిని పర్యవేక్షించడానికి తితిదేలో ఒక అత్యున్నత అధికారి నేతృత్వం వహించే ప్రత్యేక విభాగమే ఉందంటే, దీనికి దేవస్థానం వారు ఎంతటి ప్రాముఖ్యం ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. అలా తిరుమలలో తలనీలాల సమర్పణకు ఎనలేని పౌరాణిక, చారిత్రాత్మక, వాణిజ్యపరమైన ప్రాముఖ్యం ఉంది. పుట – 104 తేదీ – సెప్టెంబరు, 03

[8] ప్రస్తుతం ఉన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, క్షురకులు పిపిఇ కిట్లు ధరించి, ఎప్పటికప్పుడు శానిటైజర్ వాడుతూ, సామాజిక దూరాన్ని పాటిస్తూ కేశఖండన చేస్తున్నారు.

పుష్పమండపం

తిరుమలక్షేత్రం 'పుష్పమండపం' గా పేరుగాంచినదని, శ్రీవేంకటేశ్వరుడు పుష్పప్రియుడు, అలంకారప్రియుడు అని ఇంతకుముందు పెక్కు సందర్భాల్లో మనం తెలుసుకున్నాం.

తిరుమలక్షేత్ర మంతటా ఎల్లవేళలా పరిమళ భరిత పుష్పాలతో కూడిన ఉద్యానవనాలతోనూ, విశేష సందర్భాలలో కళ్ళు చెదిరే పుష్పాలంకరణ తోనూ నయనానందకరంగా భాసిస్తుంది. అలాగే, శ్రీవారు ఆసాంతం పలురకాల పూలమాలలు ధరించి ముగ్ధమనోహరంగా దర్శనమిస్తారు. స్వామివారు అలంకరించుకునే ప్రతి పుష్పమాలకు ఒక నిర్దిష్టమైన పేరు ఉన్నట్లు కూడా ఇంతకు ముందే తెలుసుకున్నాం. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే శ్రవణానక్షత్రం నాడు టన్నుల కొద్దీ పుష్పాలతో శ్రీవారికి చేసే 'పుష్పయాగపు శోభ చూసి తీరవలసిందే కానీ, చెప్పనలవి కాదు.

పుష్ప కైంకర్యం

తిరుమలేశునికి జరిగే అనేక కైంకర్యాలలో పుష్పకైంకర్యం ప్రముఖమైనది. తిరుమలలో శ్రీనివాసుని పుష్పకైంకర్యంతో తరించిన భక్తులెందరో ఉండగా, ఆ సాంప్రదాయానికి ఆద్యుడిగా 'తిరుమలనంబి' ని పేర్కొనవచ్చు. వారు శ్రీవారికి ప్రతినిత్యము పుష్పకైంకర్యం సమర్పించు కోవడం కోసం, దానికి అవసరమైన ఉద్యానవనం పెంచే నిమిత్తం దాదాపు వెయ్యేళ్ల క్రితం దుర్గమంగా, నిర్జనారణ్యంగా ఉండే కొండపై నివసిస్తూ; తిరుమలక్షేత్రంలో స్థిరనివాస మేర్పరుచుకున్న మొట్టమొదటి వ్యక్తిగా ప్రసిద్ధికెక్కారు. తరువాత తిరుమలనంబికి శిష్యరికం నెరపిన శ్రీవారి మరో భక్తుడు అనంతాళ్వార్, కొండపై శ్రీవారి పుష్పకైంకర్యానికి కావలసిన పుష్పాలను పెంచడం కోసం ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసే నిమిత్తం నిండు చూలాలిగా ఉన్న తన భార్యతో కలిసి ఏకంగా ఓ పెద్ద చెరువునే త్రవ్వాడు. వారు పెంచిన, సప్తవర్ణ శోభితమైన సుమాలను ప్రత్యక్షంగా తిలకించడం కోసం శ్రీవేంకటేశ్వరుడు ప్రతి రాత్రి పద్మావతి అమ్మవారితో పాటుగా ఆ తోటలో విహరించే వారు. మరో భక్తురాలైన తరిగొండ వెంగమాంబ శ్రీవారికి నిత్యము తులసి మాలలతో కైంకర్యం చేయడం కోసం ఒక ప్రత్యేకమైన తులసి తోటను పెంచింది. ఇలా శ్రీవారి భక్తాగ్రేసరులెందరో పుష్పవనాలు పెంచడం ద్వారా, పుష్పకైంకర్యం చేయడం ద్వారా శ్రీనివాసునితో ఆత్మీయ అనుబంధాన్ని పెంపొందించుకున్నారు. వారందరిని శ్రీవారు పలురకాలుగా అనుగ్రహించి ధన్యులను గావించినట్లు మునుపటి ప్రకరణాల్లో తెలుసుకున్నాం. శ్రీవారి పుష్పప్రియత్వాన్ని చాటిచెప్పటానికి ఇంతకన్నా చక్కనైన దృష్టాంతాలు ఇంకేముంటాయి?

అదే ఒరవడిని కొనసాగిస్తూ, తి.తి.దే. యాజమాన్యం కూడా ఎప్పటినుండో ఉద్యానవనాల పెంపకంపై విశేషంగా దృష్టి సారిస్తోంది.

తిరుమలలో ఉద్యానవన చరిత్ర

దేవాలయ అజమాయిషీ తి.తి.దే. చేతికి వచ్చిన తరువాత, ఆంధ్రా ప్రాంతం అవిభక్త మద్రాసురాష్ట్రంలో కలిసి ఉన్నప్పుడు తిరుమలలో ఉద్యానవనాలను సంరక్షించే బాధ్యతను అప్పటి ఆలయ పేష్కార్ చూసేవారు. ఆంధ్రరాష్ట్రం

ఏర్పడిన తరువాత, 1959వ సంవత్సరం వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు ఉద్యానవనశాఖ విధులను నిర్వర్తించేవారు. తదనంతరం 1961వ సంవత్సరంలో మైసూరు ఉద్యానవన విభాగం నుంచి, ఉద్యానవన నిర్వహణలో అప్పటికే మంచి పేరు తెచ్చుకున్న 'తమ్మన్న' అనే అధికారిని తాత్కాలిక బదిలీపై తిరుమలకు రప్పించుకొని, వారికి పూదోటల పెంపకం బాధ్యత అప్పగించడం జరిగింది. ఈ రంగంలో విశిష్టమైన సేవ చేసిన తమ్మన్నగారు పదవీ విరమణ అనంతరం కూడా, తితిదేకు ఉద్యానవన సలహాదారుగా సేవలందించారు. అనుభవజ్ఞుడైన అధికారి సలహాలు, సూచనలు, విశేషకృషి వల్ల తిరుమలలో పూలతోటల పెంపకం మూడు పువ్వులు–ఆరు కాయలుగా వికసించింది. ఆ రోజుల్లో జాతీయస్థాయిలో జరిగిన అనేక పుష్పప్రదర్శనలలో తి.తి.దే. ఉద్యానవనశాఖ అనేక బహుమతులను, ప్రముఖుల ప్రశంసలను గెలుచుకుంది. 1961వ సంవత్సరంలో కేవలం 15 మంది సిబ్బందితో ప్రారంభమైన ఉద్యానవన శాఖలో, ప్రస్తుతం వందల మంది చేయితిరిగిన కార్మికులు పని చేస్తున్నారు.

చిరంజీవులైన జాతీయ నాయకులు

వైజ్ఞానిక ప్రక్రియల ద్వారా క్రొత్తరకాల వృక్షజాతులను రూపొందించటం ఈ శాఖకు మరింత గుర్తింపు తెచ్చింది. జాతీయనాయకుల మరపురాని సేవలను తలపుకు తెచ్చే విధంగా క్రొత్తగా సృష్టించిన వృక్షజాతులకు వారి పేర్లు పెట్టింది. ఉదాహరణకు రామానుజన్, తిరుమలనంబి, డాక్టర్ ఎన్టీ రామారావు, శారదాముఖర్జీ, శంకర్ దయాల్ శర్మ లాంటి ఎందరో చిరస్మరణీయులు తిరుమలలో కొత్తగా సృష్టించబడ్డ మొక్కలరూపంలో చిరంజీవు లయ్యారు.

పుష్పాలంకరణ

ఉద్యానవనాల పెంపకం లోనే కాకుండా పుష్పాలంకరణలో కూడా తి.తి.దే. ఉద్యానవనశాఖ ఎంతో నైపుణ్యం సంపాదించింది. అలంకరణ అంటే కేవలం మాలలు కట్టడం, దండలు చుట్టడమే కాదు; ఒక చేయి తిరిగిన చిత్రకారుడు తన కుంచెకు రంగులద్ది కాన్వాస్ పై జీవకళ ఉట్టిపడే చిత్రాన్ని సృష్టించినట్లు రంగురంగుల పూలను ఒద్దికగా అమర్చి, ఎప్పటికప్పుడు సరికొత్త పుష్పకళాకృతులకు తి.తి.దే. ఉద్యానవన శిల్పులు రూపకల్పన చేస్తారు. ఉత్సవ సమయాల్లో పుష్పాలతో స్వాగత తోరణాలు నిర్మించటం, స్వాగత వచనాలు వ్రాయడం, వివిధ దేవతామూర్తుల పౌరాణిక ఘట్టాలను రంగు రంగుల పూల అమరికతో సృష్టించడం లాంటివన్నీ తి.తి.దే. ఉద్యానవనశాఖకు కరతలామలకం. బ్రహ్మోత్సవాల సమయంలో, తిరుమలలో ఉన్న విద్యుత్ శాఖ ఉద్యానవన శాఖ; వీరిద్దరూ ఒకరితో ఒకరు పోటీపడి, సృజనాత్మకతను రంగరించి, ఉత్సవాలకు మరింత శోభ చేకూర్చుతారు.

అలంకరణే కాదు – ఆరోగ్యం కూడా !

ఉద్యానవనశాఖ వివిధ రకాల ఔషధ మొక్కలను కూడా పెంచుతోంది. శేషాచలశ్రేణుల్లో ఉండే విలక్షణమైన ప్రాకృతిక స్వభావం వల్ల, ప్రపంచంలో మరెక్కడా లేని అత్యంత అరుదైన వృక్షజాతు లెన్నింటినో తిరుమల కొండపై చూడవచ్చు. వేంకటాచలానికే పరిమితమైన ఎర్రకొవ్వి, రత్నపురుష, చిత్రమూలం, సారిందీ, ఈశ్వర, పల్లేరు, ఏనుగు పల్లేరు,

సహదేవి, నేలగల్లిజేరు, గొబ్బి, రణభేరి, దేవదారి, కుక్కతులసి, పేలకాయలు, కుక్కనాలుక, బడిత వంటి విలక్షణమైన, ఔషధ విలువలు గలిగిన ఎన్నో వృక్షజాతులకు తిరుమలక్షేత్రం ఆలవాలం. వీటన్నింటినీ నిపుణులైన వృక్షశాస్త్రజ్ఞుల సాయంతో శ్రద్ధగా, వాటి స్వాభావిక పరిస్థితులలో సంరక్షిస్తూ; ఆయా వృక్షజాతులు అంతరించి పోకుండా తి.తి.దే. శ్రద్ధ వహిస్తోంది.

పుష్పదాతలకూ కొదవేం లేదు !!

శ్రీవారి పుష్పకైంకర్యం చేసేందుకు ఇప్పుడు కూడా ఎందరెందరో దాతలు ముందుకు వస్తున్నారు. ఆ పుష్పప్రియుడి సేవలకు అవసరమయ్యే మొత్తం పుష్పాల్లో 60 శాతం దాతలే విరాళాల రూపంలో సమకూర్చు తున్నారు. 30 శాతం పుష్పాలను సొంతంగా సాగుచేసే ఉద్యానవనాల ద్వారా, మిగిలిన 10 శాతం పూలను కొనుగోళ్ల ద్వారా తి.తి.దే. భర్తీ చేసుకుంటుంది. బ్రహ్మోత్సవాలలో, వైకుంఠ ఏకాదశి పర్వదినం నాడు, పుష్పయాగం జరిగే రోజున పూల విరాళాలకై దాతలు పోటీపడతారు. ఆ సందర్భాలలో దాదాపుగా భూమండలంపై లభించే పుష్పజాతులన్నింటినీ తిరుమల కొండపై చూడవచ్చంటే అతిశయోక్తి కాదు. దేశం లోని కేరళ, అస్సామ్, హిమాచల్ ప్రదేశ్ వంటి సుదూరప్రాంతాల నుండే కాకుండా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూరోప్ వంటి ఖండాంతర దేశాలనుండి కూడా దిగుమతి చేసుకోబడ్డ పూలు శ్రీవారిసేవలో తరించుకుంటాయి.

ఆ పర్వదినాల్లో తిరుమల పట్టణమంతా ముఖ్యంగా శ్రీవారి ఆలయం ప్రత్యేక పుష్పాలంకరణతో పుష్పమయంగా గోచరిస్తుంది.

పూదోటలకు భక్తుల పేర్లు

వందల ఏళ్లక్రితం శ్రీవారికి పుష్పకైంకర్యం చేసిన భక్తుల పేర్లతో కూడా తి.తి.దే. ఉద్యానవనశాఖ అనేక పూలతోటలను పెంచుతోంది. సూరాపురం వారి తోట, పేరిందేవి తోట, హాథీరామ్ జీ తోట – ఇలా తిరుమలలో ఎన్నో ప్రాంతాలు, కూడళ్ళు ఆయా పూలతోటల పేర్లతోనే పిలువ బడుతున్నాయి. తిరుమలలో పెంచబడుతున్న అనేకానేక ఉద్యానవనాల్లో నారాయణగిరి ఉద్యానవనం అత్యంత సుందరంగా తీర్చిదిద్దబడింది. గోగర్భం ఆనకట్ట ప్రాంతంలోనూ, పద్మావతి వసతిగృహ ప్రాంతంలోనూ ఉన్న పూదోటలు కూడా అత్యంత ఆకర్షణీయంగా మలచబడ్డాయి. ఇప్పుడు వైకుంఠం క్యూ సముదాయం ఉన్న ప్రాంతం కూడా ఒకప్పుడు ఉద్యానవనమే! అప్పుడది చేమకూర తోటగా ఉండేది.

ఫల, పుష్ప ప్రదర్శన

తితిదే ఉద్యానవన విభాగం శ్రీవారికి తిరుమల లోని ఇతర ఆలయాలకు కావలసిన పుష్పాలను సరఫరా చేయడంతో పాటుగా; తిరుమలకు విచ్చేసిన భక్తులకు ఆహ్లాదాన్ని కూడా అందిస్తోంది. ప్రతి ఉద్యానవనమూ ఒక నందనవనమే. ఆయా ఉద్యానవనాలను ప్రతి ఒక్కరూ తనివితీరా చూసి ఆనందించవచ్చు. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల సందర్భంగా పాపనాశనం మార్గంలో ఉన్న కళ్యాణవేదిక వద్ద తి.తి.దే. వారి ఆధ్వర్యంలో 'ఫల-పుష్ప ప్రదర్శన'

ఏర్పాటు చేయబడుతుంది. దేశ, విదేశాల నుండి తెప్పించిన అరుదైన పుష్ప జాతులను ఇక్కడ ప్రదర్శిస్తారు. ఏదో ఒక పౌరాణిక ఘట్టాన్ని ఇతివృత్తంగా తీసుకొని, పువ్వులను సృజనాత్మకత ఉట్టిపడేలా అమర్చి, ఆ ఘట్టాన్ని సజీవంగా ఆవిష్కరిస్తారు. క్రితం బ్రహ్మోత్సవాల్లో నీలాదేవి, శ్రీవేంకటేశ్వరుడి నుదుటికి తన కేశాలను అతికిస్తున్న దృశ్యం సాకారం చేయబడింది. ఇంతే కాకుండా తండ్రి జమదగ్ని ఆదేశం మేరకు క్షత్రియసంహారం కావిస్తున్న పరశురాముడు, యాచకుని రూపంలో సీతమ్మను అపహరించి వెడలుతున్న రావణుణ్ణి అడ్డగిస్తున్న జటాయువు, అశోకవనంలో శోకతప్తయై ఉన్న సీతమ్మకు నమస్కరించుకుంటున్న ఆంజనేయుడు, బకాసురునితో తలపడుతున్న భీమసేనుడు, చెట్టుచాటు నుంచి వాలిపై బాణప్రహారం చేస్తున్న శ్రీరాముడు వంటి పదునాలుగు పౌరాణిక పాత్రలకు కూడా జీవం పోశారు. పశ్చిమబెంగాల్ నుండి వచ్చిన ఇరవైమంది కళాకారుల ద్వారా సృష్టించబడ్డ అత్తివరదరాజస్వామి ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

గత కొద్ది సంవత్సరాల నుంచి మైసూర్ కు చెందిన గౌరీ, నీలాంబిక అనే ఇద్దరు అక్కచెల్లెళ్ళు సైకతశిల్పాన్ని అత్యంత సృజనాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. క్రితం సారి బ్రహ్మోత్సవాల్లో వీరిరువురూ రెండురోజులు శ్రమించి, మూడు టన్నుల ఇసుక, అనేక రంగుల నుపయోగించి, 'గరుత్మంతునిపై విహరిస్తున్న శ్రీమహావిష్ణువు' యొక్క సైకతశిల్పాన్ని సాక్షాత్కరింప జేసి భక్తుల మనసును దోచుకున్నారు.

కొండపై పూలు ధరించరాదు..

'పుష్పమండపం' గా వ్యవహరించ బడే తిరుమలక్షేత్రంలో, పువ్వులన్నీ స్వామివారికే చెందాలి. అందుచేత, భక్తులెవ్వరూ కొండపై పూలు ధరించరాదు. కొండపై జరిగే వివాహాలలో కూడా పువ్వులతో చేసిన మాలలు వాడటం పూర్తిగా నిషిద్ధం.

శ్రీవారికి కైంకర్యం చేయబడ్డ పువ్వుల నైర్మల్యాన్ని భక్తులకు ప్రసాదంగా ఇచ్చే సాంప్రదాయం కూడా తిరుమలలో లేదు. వెయ్యేళ్ళక్రితం రామానుజుల వారు చేసిన కట్టడి ననుసరించి, పూజా నైర్మల్యాన్ని ఈ మధ్యకాలం వరకూ సంపంగి ప్రదక్షిణమార్గానికి ఉత్తరదిశలో ఉన్న, నేడు 'పూలబావి' గా పిలువబడే, సాక్షాత్తూ భూదేవిచే నిర్మించబడ్డ 'భూతీర్థం' లో విసర్జించే వారు. అయితే ఎప్పటికప్పుడు పెరుగుతున్న భక్తులు, ఉత్సవాల కారణంగా పూజానైర్మల్యాలు కూడా అధికమవ్వడంతో ఇప్పుడు వాటిని తిరుమల సానువుల్లో, ఎవరూ తొక్కేందుకు అవకాశం లేని నిర్జనప్రాంతంలో వదులుతున్నారు. సంవత్సరంలో ఒకసారి తిరుచానూరులో జరిగే కార్తీకమాస బ్రహ్మోత్సవాల చివరి రోజున మాత్రం శ్రీవారి పూజానైర్మల్యాలను పద్మావతీ అమ్మవారికి కానుకగా సకల లాంఛనాలతో పంపుతారు.

పద్మావతీ ఉద్యానవనం

పద్మావతి అమ్మవారి ఆలయం మాడవీధిని ఆనుకొని 'పద్మావతి ఉద్యానవనం' ఉంది. ఇందులో కూడా కనులకు ఇంపుగా ఉండే మందార, చేమంతి, బంతి, సన్నజాజులు, కాగడామల్లెలు వంటి రకరకాల పూలమొక్కలు, కొన్ని అరుదైన వృక్షజాతులు పెంచబడుతున్నాయి. సువిశాల ప్రాంగణంలో ఉండే ఈ ఉద్యానవనంలో చూడచక్కనైన

కోనేరును కూడా చూడవచ్చు. ఈ మధ్యనే ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా ఒక వినూత్నమైన ప్రదర్శనకు తి.తి.దే. శ్రీకారం చుట్టింది. ఉద్యానవనం లోని కుడ్యాలపై పద్మావతీ పరిణయం లోని విశేషాలన్నింటిని వేరు వేరుగా, క్యూ ఆర్ సంకేతంతో సహా, చిత్రీకరించారు. 'పద్మావతి పరిణయం' యాప్‌ను మన చరవాణిలో డౌన్లోడ్ చేసుకుని, శబ్దగ్రహణయంత్రాలను (ఇయర్ ఫోన్స్) మన చెవులకు అనుసంధానించుకుని, ఆయా చిత్రాలపై ఉన్న క్యూ ఆర్ సంకేతాన్ని చరవాణి ద్వారా స్కాన్ చేస్తే; ఆ చిత్రంలో ఉన్న లఘు చలనచిత్రాన్ని, దృశ్య–శ్రవణ మాధ్యమాల ద్వారా చూడవచ్చు. అత్యద్భుతమైన, వినూత్నమైన ఈ ప్రయోగానికి భక్తుల నుండి ఎంతగానో ఆదరణ లభిస్తోంది.

పుష్పాలకు అధిదేవత యైన 'పుల్లని' ఆశీస్సులతో, శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షాలతో, తి.తి.దే. ఉద్యానవనశాఖ మరింతగా రాణించి, ప్రపంచ ఉద్యానవనరంగంలోనే అగ్రగామిగా వెలుగొందాలని ఆ దేవదేవుణ్ణి వేడుకుందాం. **పుట – 105 తేదీ – సెప్టెంబరు, 04**

శ్రీవెంకటేశ్వర వస్తుప్రదర్శనశాల (మ్యూజియం)

వందల ఏళ్ళ నుండి శ్రీవారి భక్తులైన ఎందరో చక్రవర్తులు, మహారాజులు, జమీందార్లు మున్నగువారు శ్రీవెంకటేశ్వరునికి బంగారు ఆభరణాలు, వజ్రవైఢూర్యాలు, వెండిపాత్రలు, గృహాలంకరణ సామాగ్రి, రత్నఖచితమైన ఆయుధాలు, ఇలాంటివెన్నో భక్తిపూర్వకంగా సమర్పించుకున్నారు. శ్రీవారి పట్ల వారికున్న అచంచల భక్తి, వారి రాచరికపు వైభవం, ఆనాటి కళాకారుల సృజనాత్మకత, ఈ మూడింటి మేళవింపైన ఈ వస్తువిశేషాలన్నీ ఆయా కాలాలలో ఉన్న రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, ఆధ్యాత్మిక స్థితిగతులకు నిలువుటద్దాలు. పల్లవులు, చోళసామ్రాట్టులు, విజయనగర రాజులు, మట్లకుమారులు, ఇలా ఎందరెందరో శ్రీవారికి సమర్పించుకున్న కానుకలను ఎప్పటికప్పుడు ఆలయ కోశాధికారి నమోదు చేసుకుని, ఆ వస్తువులన్నింటికీ గుర్తింపు సంఖ్యనిచ్చి, వాటిపై దాతల వివరాలను చెక్కించి, కానుకలు మరీ విలువైనవైతే వాటి వివరాలను ఆలయం కుడ్యాలపై శిలాఫలకాల రూపంలో మలచి; వాటి విలువ–పరిమాణాన్ని బట్టి, వేర్వేరు ప్రదేశాల్లో కట్టుదిట్టమైన రక్షణా ఏర్పాట్లతో భద్రపరిచేవారు. అవన్నీ క్రమంగా ఈనాటి శ్రీవేంకటేశ్వర పురావస్తుప్రదర్శనశాల (మ్యూజియం) కు భద్రంగా, అంచెలంచెలుగా చేరుకున్నాయి.

ఎప్పుడు? ఎక్కడ?? ఎలా???

1939వ సంవత్సరంలో ప్రాచ్యసాహిత్యం మరియు కళలపై పరిశోధన, అధ్యయనం జరపటం కోసం; తి.తి.దే. ఆధ్వర్యంలో, తిరుపతి–చంద్రగిరి రహదారిలో ప్రాచ్యకళాశాల ప్రారంభించబడింది. ఆ కళాశాల ఆవరణలోనే ఉన్న ఒక హాలులో, కళాశాల సిబ్బంది స్వచ్ఛంద సహకారంతో చిన్నపాటి మ్యూజియం ఏర్పాటు చేయబడింది. ఈ వస్తుసంపదనంతా తిరుమల నుంచి తరలించి, ఆ మ్యూజియంలో భద్రపరిచారు. ప్రాచ్యకళాశాలలో పనిచేసిన ఎందరో మహామహులు కూడా ప్రాచీన కళాఖండాలను సేకరించేందుకు, వాటి చరిత్రను శోధించి ఇతివృత్తాల వారిగా అమర్చేందుకు ఎంతగానో తోడ్పడ్డారు. వారిలో ముఖ్యులు, దేవాలయ పురాతత్వ శాస్త్రవేత్తగా సేవలందించిన సాధు

సుబ్రహ్మణ్యశాస్త్రి గారు, వేటూరి ప్రభాకరశాస్త్రి గారు, మున్నగువారు. అయితే, ఆ మ్యూజియం తిరుమల–తిరుపతి పట్టణాలకు దూరంగా ఉండటం, అప్పట్లో ప్రజారవాణా సౌకర్యాలు లేకపోవడం వంటి కారణాల వల్ల సందర్శకుల సంఖ్య అంతంతమాత్రం గానే ఉండేది.

అలా ఆ మ్యూజియం అరకొర ప్రేక్షకుల తోనే కొన్ని దశాబ్దాల కాలం నడచిన తరువాత, ఆ అమూల్యమైన చారిత్రక సంపదను జనబాహుళ్యం లోకి తీసుకురావడం కోసం 1980వ సంవత్సరంలో అప్పటి కార్యనిర్వహణాధికారి గారి చొరవ మరియు ప్రముఖ చరిత్రకారుడు జయచంద్ర గారి సహకారంతో ఆ వస్తుసంపద నంతా ఆలయానికి ఎదురుగా ఉన్న 'వెయ్యికాళ్ళ మండపం' లోకి మార్చి, దానికి 'శ్రీవేంకటేశ్వర వస్తుసంగ్రహాలయం' గా నామకరణం చేశారు. ఆ మండపంలో దక్షిణదిక్కున వస్తువులన్నింటిని అందంగా అమర్చి, తగిన సిబ్బందిని నియమించారు. దాంతో సందర్శకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. మరో ప్రక్క తిరుమలలో అప్పుడు చేపడుతున్న పాలనా సంస్కరణలలో భాగంగా; అప్పటివరకు ఆదరణకు నోచుకోకుండా కొండపై ఎక్కడెక్కడో పడి ఉన్న కళాఖండా లన్నింటినీ ఒక్కచోటకు జేర్చే ప్రక్రియ కూడా వేగవంతమవ్వడం వల్ల, ప్రదర్శించబడే వస్తువుల సంఖ్య దాదాపుగా రెండింతలయ్యింది. ఈ రెండు కారణాల వల్లా విపరీతమైన స్థలాభావం ఏర్పడింది. వేలాదిగా తరలి వస్తున్న భక్తుల ఉత్సాహాన్ని, కళాఖండాలను అర్థవంతంగా అమర్చడంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని; ఆలయానికి సమీపంలో ఒక పెద్ద భవనాన్ని నిర్మించి, దానిలో ఈ కళాకృతులన్నింటిని ప్రదర్శించాలని అప్పటి తి.తి.దే. పాలకవర్గం నిర్ణయించింది.

సర్వాంగసుందరంగా రూపుదిద్దుకున్న నూతన వస్తుప్రదర్శనశాల భవనం

ఈ నేపథ్యంలో అన్ని హంగులతో కూడుకున్న లక్షా ఇరవై ఐదు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, వైకుంఠం–2 క్యూ సముదాయానికి ఎదురుగా, శిలాతోరణానికి వెళ్ళే దారిలో, గొప్ప రాజప్రాసాదం లాంటి భవనాన్ని నిర్మించారు. అప్పటివరకూ వెయ్యికాళ్ళమంటపంలో ప్రదర్శించ బడుతున్న వస్తుసామగ్రి నంతా ఈ భవనంలోకి తరలించి, విభాగాల వారిగా అమర్చి, ప్రతివస్తువు వద్ద దాని చరిత్రను వివరంగా మరియు ఆసక్తికరంగా సూచించి, సుశిక్షితులైన సిబ్బందిని నియమించారు. 1997వ సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించ బడడంతో, ఈ సంగ్రహాలయానికి ఎంతో ప్రాచుర్యం వచ్చింది. దానికి తోడు భక్తులందరికీ తగిన వసతులతో పాటుగా, ఉచితప్రవేశం కూడా కల్పించడంతో ప్రేక్షకుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగి; రోజువారి సందర్శకుల సంఖ్యలో భారతదేశంలోనే ప్రథమస్థానాన్ని సంపాదించుకుంది. కాలక్రమంలో ఎప్పటికప్పుడు సంగ్రహాలయానికీ, అందులో ప్రదర్శింప బడుతున్న వస్తుసంపదకు కొత్త సొబగులు చేకూర్చడం వల్ల; ఈ మ్యూజియం తిరుమల చరిత్రనే కాకుండా, దక్షిణాది పాలకులందరూ శ్రీవారి భక్తులే కావడం వల్ల, దాదాపు రెండు వేల సంవత్సరాల యావత్ దక్షిణభారత చరిత్రను ప్రతిబింబించే గొప్ప వారసత్వ భాండాగారంగా రూపు దిద్దుకుని, తిరుమల సిగలో కలికితురాయిలా భాసిస్తోంది.

ఈ సంగ్రహాలయంలో ప్రదర్శింపబడుతున్న వస్తువిశేషా లన్నింటిని ఇప్పుడు సంక్షిప్తంగా తెలుసుకుందాం.

- దేశవిదేశాల నాణేలు ఒకటవ శతాబ్దానికి చెందిన రోమన్ సామ్రాజ్యపు బంగారు నాణేల నుంచి, 19వ శతాబ్దంలో బ్రిటిష్ వారు ముద్రించిన రాగినాణేల వరకు, కొన్ని వందల అపురూపమైన నాణేలను ఇందులో చూడవచ్చు. ప్రతి నాణెం ఒక మరుగున పడిన చరిత్రను వెలికి తెస్తుంది. ఆలయంలో భద్రపరచబడిన నాణేలలో ముఖ్యమైనవి – ఒకటవ శతాబ్దానికి చెందిన రోమన్ సామ్రాజ్యపు బంగారు నాణేలు, హోయసల సామ్రాజ్యానికి చెందిన నాణేలు, పశ్చిమ గంగచోళుల నాణేలు, మైసూరు రాజులు ముద్రించిన నాణేలు, రామటెంకి నాణేలు, మైసూరుకు చెందిన హైదర్ అలీ కాలపు నాణేలు, పోర్చుగల్ సామ్రాజ్యం మరియు స్పెయిన్ రాజ్యపు వెనీషియన్ నాణాలు, జర్మన్ నాణేలు – ముఖ్యమైనవి. శ్రీవారికి సమర్పించబడ్డ కానుకలలో ఐరోపా దేశాల నాణేలు ఉండటం వల్ల శ్రీవారికి ఆ రోజుల్లో కూడా అన్యమత భక్తులు అధికసంఖ్యలో ఉండేవారని, శ్రీవారి ప్రాపకం భారతీయులకే పరిమిత మవ్వలేదని తేటతెల్ల మవుతుంది. ఆ కాలంలో అన్యమతస్తులకు ఆలయప్రవేశం నిషిద్ధమైనప్పటికీ, కొంతమంది యూరోపియన్ ఉన్నతాధికారులకు మినహాయింపు ఉండేది.
- ఈ నాణేలన్నింటినీ కాలక్రమానుసారం పేర్చుకుంటూ పోతే, ప్రపంచచరిత్ర కళ్లకు కట్టినట్లు ఆవిష్కృతమవుతుంది.
- ఆయుధాల విభాగంలో ప్రాచీన, మధ్యయుగ, ఆధునిక వలస రాజుల పరిపాలన కాలంలో అప్పటి పాలకులు, సైన్యం ఉపయోగించిన చురకత్తులు, పిడికత్తులు, బాకులు, ఖడ్గాలు, వరలు, కవచాలు, శిరస్త్రాణాలు, యుద్ధ గొడ్డళ్ళు, తుపాకులు, గావించాలు, బళ్ళాలు మొదలగు వాటిని చూడవచ్చు. ఎందరెందరో శత్రురాజులను హతమార్చగల ఆ మారణాయుధాలు అంతిమంగా శ్రీవారి శరణు జొచ్చాయి. శరణాగత వత్సలుడైన శ్రీనివాసుడు వాటిని మన్నించి అక్కున జేర్చుకున్నాడు. శరణన్న వారిని అనుగ్రహించడం శ్రీనివాసునికి పరిపాటే!
- రాతి శిల్పాల గ్యాలరీ యందు 18, 19వ శతాబ్దాల్లో తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాల్లో పురావస్తుశాఖ వారి త్రవ్వకాల్లో బయటపడ్డ రాతిప్రతిమలు, శిల్పాలు, కుడ్యశిల్పాలు, శిలాస్తంభాలు, శిధిలమైన గోపురాలు, ఇలాంటివెన్నో ప్రదర్శింప బడుతున్నాయి. ఆ శిథిలాలలో బయటపడ్డ శిలాశాసనాల ద్వారా అత్యంత అమూల్యమైన చారిత్రక సమాచారం వెలుగు చూసింది.
- వాద్యపరికరాల విభాగం లో ఈనాడు అంతగా వాడుకలో లేని సంగీత పరికరాలు ఎన్నో చూపరులను ఆకట్టుకుంటాయి. తమ గానమాధుర్యంతో శ్రీవారిని తనివితీరా సేవించుకున్న ఎందరో వాగ్గేయకారులను స్మరణకు తెచ్చే విధంగా వీణ, డోలు, తుంబుర, సన్నాయి, తబలా వంటి ఎన్నో వాద్యపరికరాలు ప్రదర్శింపబడుతున్నాయి. వీటిని వీక్షిస్తుంటే అన్నమయ్య, పురందరదాసు వంటి గానగంధర్వులు అప్రయత్నంగానే మదిలో మెదులుతారు.
- స్వామివారు అలంకారప్రియులన్న సత్యాన్ని ఎరిగిన ఎందరో భక్తశిఖామణులు, శ్రీవారికి దుస్తులు, పాదుకల వంటి ఎన్నో అపురూపమైన అలంకరణ వస్తువులను బహూకరించారు. వాటితో పాటుగా వివిధ రకాల పూజాసామాగ్రి, ఆలయంలో ఎప్పటి నుంచో వాడిన పాత్రలు, మైసూరు మహారాజు సమర్పించుకున్న గంగాళం, విజయనగర రాజుల చిహ్నమైన 'యాలి' అనే కాల్పనిక జంతువు యొక్క లోహమూర్తి, నంది, నటరాజస్వామి, వినాయకుడి విగ్రహాలు, పెద్ద పెద్ద ఇనుప గంటలు, పంచముఖ తాళం, శ్రీకృష్ణదేవరాయలు తిరుమల లోని ఒక పూజారికి బహూకరించిన ధూపగంట మొదలగు వాటిని కూడా ఒక గ్యాలరీలో

భద్రపరిచారు. ఇందులోనే, విజయనగర సామ్రాజ్య పతనానంతరం తిరుమల–తిరుపతి ఆలయాలను పోషించిన మట్లరాజుల చిహ్నంగా మిగిలిన దారుమండపాన్ని కూడా ప్రదర్శిస్తున్నారు. ఈ మండపం ఒకప్పుడు అలిపిరిమార్గ ప్రారంభంలో ఉండేది.

- ఈ సంగ్రహాలయం లోని మరో విశిష్టమైన సేకరణ 8వ శతాబ్దానికి చెందిన **శ్రీనివాసశిల్పం**. ఈ శిల్పం ముమ్మూర్తులా ఆనందనిలయంలో స్వామివారి మూలమూర్తిని పోలి ఉంటుంది. సమయాభావం వల్ల స్వామివారిని ఆసాంతం చూడలేకపోయిన లోటును, నూటికి నూరు పాళ్ళూ మూలవిరాట్ ను పోలి ఉన్న ఈ విగ్రహాన్ని తనివితీరా చూడటం ద్వారా భర్తీ చేసుకోవచ్చు.
- ఈ మ్యూజియంలో ఉన్న మరో వెలకట్టలేని వారసత్వ సంపద – శ్రీనివాసుడు–పద్మావతీ పరిణయ సందర్భంగా కుబేరుని వద్దనుండి ఋణంగా స్వీకరించిన 15 లక్షల రామముద్ర కలిగిన నాణేలకు ప్రతిగా, ఒక రాగిశాసనం రూపంలో వ్రాసి ఇచ్చిన ఋణపత్రం (ప్రామిసరీ నోటు). ఆ ఋణపత్రానికి బద్ధుడై, శ్రీనివాసుడు ఇప్పటికీ భక్తులు చెల్లించుకున్న కానుకలను కుబేరునికి వడ్డీగా చెల్లిస్తున్నాడు. కలియుగాంతం వరకూ చెల్లిస్తూనే ఉంటాడు. ఇంతటి చారిత్రక, పౌరాణిక ప్రాశస్త్యం కలిగిన పురావస్తు విశేషాన్ని భక్తుల కోసం ప్రదర్శిస్తున్న తి.తి.దే. వారి కృషిని అభినందించి తీరాల్సిందే!
- బ్రహ్మోత్సవాల సమయంలో ఉపయోగించే శ్రీవారి వాహనశ్రేణి, స్వామివారు ఊరేగిన రథంపై అలంకరింపబడ్డ దారు శిల్పాలను కూడా ఈ విభాగంలో చూడవచ్చు.
- బ్రహ్మోత్సవాల్లో భక్తుల సందర్శనార్థం అన్నమయ్య విరచిత తామ్రపత్రాల ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అప్పుడు మాత్రమే రాగిరేకుల అసలు ప్రతులను దర్శించుకోవచ్చు. మిగిలిన సమయాల్లో వాటి నకలు ప్రతులను మాత్రమే సంగ్రహాలయంలో ప్రదర్శిస్తారు. అన్నమయ్య, వారి కుమారుడు, మనుమడు రచించిన 32 వేల కీర్తనలలో కొన్నింటినైనా ఈ రాగిరేకుల రూపంలో దక్కించుకో గలగటం తెలుగువారి పుణ్యఫలమనే చెప్పుకోవాలి.
- మూడవ అంతస్తు లోని చరిత్ర విభాగంలో, ఆలయచరిత్రను దృశ్యరూపంలో వివరించే అరుదైన చిత్రాలు ప్రదర్శించ బడుతున్నాయి. వీటిలో ప్రముఖ చిత్రకారుడు పిలకా లక్ష్మీనరసింహం గారు చిత్రించిన దశావతార చిత్రమాలిక ప్రముఖమైనది. ఈ విభాగంలోనే ప్రస్తుతం వాడుకలో లేని శ్రీవారి అమూల్యమైన ఆభరణాలను కూడా భద్రపరిచారు.
- కాంస్యవిభాగంలో శతాబ్దాల క్రిందట పోతపోసిన కంచు విగ్రహాలు, వక్కలను కత్తిరించే కత్తెర వంటి సాధనాలు (నట్ క్రాకర్స్), కంచుగంటలు, లోహపు పాత్రలు ఉన్నాయి.
- తరతరాల ఆలయ చరిత్రను ఆసాంతం వర్ణించే వెయ్యికి పైగా శిలాశాసనాలను మ్యూజియం బయట ఉన్న గ్యాలరీలో ప్రదర్శిస్తున్నారు. ఈ శాసనాల ద్వారానే ఆలయానికి చెందిన చారిత్రిక విశేషాలు, ఆయా పాలకులు ఆలయాభివృద్ధికి చేసిన కృషి, శ్రీవారికిచ్చిన కానుకల వివరాలు వెలుగు లోకి వచ్చాయి.
- శ్రీవారిసేవలో తరించిన 12 మంది ఆళ్వారుల లోహ ప్రతిమలు సంగ్రహాలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ మూర్తుల ముఖారవిందాలలో ఉట్టిపడే జీవకళ అనన్య సామాన్యమైనది. ఈ పన్నెండు మంది ఆళ్వారుల గురించి మరో ప్రకరణంలో విస్తారంగా తెలుసుకుందాం!

ఎందరెందరో సాహిత్యకారులు, చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు, ఆలయసిబ్బంది యొక్క సమిష్టికృషితో

అత్యద్భుతంగా రూపుదిద్దుకున్న ఈ సంగ్రహాలయం, తిరుమల చరిత్రను భావితరాల కందించే విశేషమైన కృషిలో ఒక మైలురాయి. మొత్తం పది విభాగాలలో ఏర్పాటు చేయబడ్డ 'శ్రీవెంకటేశ్వర వస్తుప్రదర్శనశాల' తరతరాల తిరుమల చరిత్రకు సాక్షీభూతంగా నిలిచి, తిరుమలలో దర్శించుకోదగ్గ ముఖ్యమైన ప్రదేశాలలో ఒకటిగా రాణిస్తోంది. శ్రీవారి భక్తులు, చారిత్రక అంశాలపై ఆసక్తి కలవారు, చరిత్రకారులు, పురావస్తు శాస్త్రవేత్తలు, అందరూ తప్పనిసరిగా చూసి తీరవలసినదీ ప్రదర్శనశాల.

తిరుపతి నగరంలో కూడా ఇలాంటిదే ఒక అద్భుతమైన ప్రదర్శనశాలను 1983వ సంవత్సరంలో, గోవిందరాజస్వామి ఆలయానికి ఉత్తరమాడవీధిలో ఉన్న ఓ పురాతన మండపంలో తి.తి.దే. ఏర్పాటు చేసింది. దీనిలో వివిధ ఆలయాల ఆకృతులు, వాటి కొలతలు, నిర్మాణ శైలులు, పూజావిధానాలు, పూజాసామగ్రి, మతపరమైన సాంప్రదాయాలు, ఆలయకళలు, ఆలయ నిర్వహణకు సంబంధించిన వివిధ వృత్తులు మొదలగు వాటిని ప్రదర్శిస్తున్నారు. తిరుపతి నగరంలో తప్పనిసరిగా చూసి తీరవలసిన ప్రదేశాల్లో ఇది కూడా ఒకటి. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం ముందు ముందు తెలుసుకుందాం! పుట – 106 తేదీ – సెప్టెంబర్, 05

సామాజిక సేవా కార్యక్రమాలు

తిరుమల–తిరుపతి దేవస్థానం వారు దేశవ్యాప్తంగా అనేక సామాజిక సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. వాటన్నింటి కార్యకలాపాలు దాదాపు తిరుపతి కేంద్రంగా కొనసాగుతున్నాయి. వీటిలో చాలావరకు వైద్య, విద్యా రంగాలకు చెందినవే.

ఈ సేవలన్నీ అణగారిన వర్గాల వారికి ఉచితం గానే అందజేయ బడతాయి. మిగిలిన వారికి మాత్రం నామమాత్రపు రుసుము వసూలు చేయబడుతుంది.

తితిదే ఆధ్వర్యంలో నడుస్తున్న కొన్ని సామాజిక సేవా పథకాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

శ్రీ బాలాజీ దివ్యాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస ట్రస్టు (BIRRD) – దీని ద్వారా పోలియో మెల్లిటస్, సెరిబ్రల్ పాల్సీ, కంజెనిటల్ ఎనామలీస్, వెన్నెముక గాయాలు వంటి వ్యాధులకు, అత్యధిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తారు.

శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకం (SVIMS) – ఈ పథకం కింద 2007వ సంవత్సరంలో ఒక సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మించబడింది. దీన్ని 'శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ' గా పిలుస్తారు. కేంద్రప్రభుత్వ సంస్థ అయిన అఖిలభారత వైద్యవిజ్ఞాన సంస్థ (ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) తరహాలో దీనిని అభివృద్ధి పరిచే ఉద్దేశ్యంతో ప్రణాళికలు రచించారు. ఈ సంస్థ ప్రాంగణం నుంచి శ్రీ పద్మావతి మహిళా కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ విభాగం కూడా నడుప బడుతున్నాయి. ఇందులో కూడా పూర్తి ఉచితంగా, లేదా నామమాత్రపు రుసుముతో అత్యాధునిక వైద్యసేవలను అందిస్తారు.

శ్రీనివాస శంకర నేత్రాలయ ట్రస్ట్ – 2010వ సంవత్సరంలో ప్రారంభించబడిన ఈ ట్రస్టు ద్వారా నేత్ర సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి పూర్తి ఉచిత వైద్యసహాయంతో పాటుగా, కావలసిన వైద్యపరికరాలను కూడా ఉచితంగా ఇస్తారు.

శ్రీవేంకటేశ్వరా ప్రాణదానం ట్రస్ట్ – దీని ద్వారా నిరుపేద వర్గాలకు చెందిన వారికి గుండె, మూత్రపిండాలు, కాలేయం, మెదడు సంబంధిత ప్రాణాంతక వ్యాధులకై ఉచితంగా చికిత్స చేస్తారు.

ఇతర వైద్య సేవలు – తిరుమల యాత్రికులకు అత్యవసర వైద్య సేవలందించే నిమిత్తం అన్ని హంగులతో కూడుకున్న మరికొన్ని వైద్యశాలలను కూడా తి.తి.దే. నడుపుతోంది. వినికిడి సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు చేయూత నివ్వడం కోసం 'శ్రవణం' అనే ప్రాజెక్టును తి.తి.దే. చేపట్టింది. కుష్టువ్యాధి గ్రస్తులకు వైద్యసహాయం అందించడానికి, 'శ్రీవేంకటేశ్వర పేదల గృహం' అనే పేరుతో, ఒక ఆసుపత్రితో కూడుకున్న పునరావాస కేంద్రాన్ని కూడా నడుపుతోంది. అలాగే కొండ పైన, భక్తులకు అత్యవసర వైద్యసేవలు అందించడం కోసం 'అశ్విని' అనే వైద్యశాలను నిర్వహిస్తోంది.

ఇవన్నీ ఒక ఎత్తైతే, కరోనా కష్టకాలంలో తి.తి.దే. అందిస్తున్న వైద్యసేవలు చరిత్రపుటల్లో శాశ్వతంగా నిలిచిపోతాయి[9].

ఇప్పుడు తి.తి.దే. చేపడుతున్న మరికొన్ని సేవలను పరికిద్దాం.

శ్రీవేంకటేశ్వర ట్రైనింగ్ సెంటర్ ఫర్ హాండికాప్డ్ – ఈ కేంద్రం ద్వారా దివ్యాంగులకు, దృష్టిలోపం ఉన్నవారికి, బధిరులకు వృత్తివిద్యలలో శిక్షణనిచ్చి, వారికి ఉపాధి కల్పించబడుతుంది.

శ్రీవేంకటేశ్వర కేంద్ర గ్రంథాలయం మరియు పరిశోధనా కేంద్రం – 1993వ సంవత్సరం లో స్థాపించబడిన ఈ కేంద్రంలో, లక్షకు పైగా పురాతన గ్రంథాలు, వ్రాతప్రతులు, తాళపత్రాలు, శిలాశాసనాలు భద్రపరిచారు. యుజిసీ ఈ పరిశోధనా కేంద్రానికి చరిత్రలో డాక్టరేట్ చేస్తున్న విద్యార్థులకు పరిశోధనా కేంద్రంగా గుర్తింపునిచ్చింది. ఈ కేంద్రంలో ఉన్న పత్రాలన్నింటినీ డిజిటలీకరించే ప్రక్రియ చేపట్టబడింది.

శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టు – దీని ద్వారా చేపట్టే ఉచిత అన్నదాన పథకం వివరాలను ఇంతకుముందే తెలుసుకున్నాం. ఒక రోజుకు సరిపడా ఉదయపు అల్పాహారం గానీ, మధ్యాహ్నం లేదా రాత్రి భోజనం గానీ తమకు కావలసిన తిథిలో అందజేయడానికి సరిపడే మొత్తాన్ని ఈ ట్రస్ట్‌కు విరాళంగా అందించవచ్చు. ఆ రోజు ఉభయదాతలుగా వారి పేరును అన్నప్రసాద సముదాయంలో ప్రకటిస్తారు.

శ్రీ వెంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్ట్ – 1963వ సంవత్సరంలో స్థాపించబడిన 'శ్రీవేంకటేశ్వర బాలమందిరం ట్రస్ట్', పేరు మార్చుకుని, 'శ్రీవేంకటేశ్వర సర్వశ్రేయస్సు ట్రస్ట్' గా రూపాంతరం చెందింది. దీని ద్వారా అనాథలైన బాలబాలికలకు, నిరుపేద తల్లిదండ్రుల పిల్లలకు ఉచితంగా విద్యాదానం చేయబడుతుంది. ఎందరెందరో పేదవర్గాల

[9] దాదాపు తి.తి.దే. ఆస్పత్రులన్నింటినీ కోవిడ్ వైద్యకేంద్రాలుగా మార్చి; వైద్యులు, వైద్యేతర సిబ్బంది ప్రాణాలకు తెగించి కరోనా వ్యాధిగ్రస్తులకు చికిత్స నందించారు. అలాగే, తి.తి.దే. వారు తిరుపతిలో ఉన్న శ్రీనివాసం, విష్ణునివాసం, పద్మావతీ అతిథిగృహం వంటి తి.తి.దే. అతిథిగృహా లన్నింటినీ కోవిడ్ పునరావాసకేంద్రాలుగా మార్చి, పరిశుభ్రమైన వాతావరణంలో మెరుగైన సేవలందించి, వేలాదిమందిని కరోనా బారి నుండి కాపాడారు.,

పిల్లలు దీనిలో ప్రాథమిక విద్యనభ్యసించి, జీవితంలో ఉన్నతశిఖరాల కెదిగారు.

శ్రీవేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్ట్ – వేదాలను, సనాతన ధర్మాన్ని పరిరక్షించే నిమిత్తం ఈ ట్రస్ట్ ద్వారా నడుప బడుతున్న వేదవిద్యాసంస్థల గురించి ఇంతకు ముందే తెలుసుకున్నాం.

శ్రీవేంకటేశ్వర గోసంరక్షణ ట్రస్ట్ – 2002వ సంవత్సరంలో స్థాపించబడ్డ ఈ ట్రస్ట్ కార్యక్రమాలను కూడా ఇంతకుముందే చెప్పుకున్నాం.

శ్రీవేంకటేశ్వర విద్యాలయ ట్రస్ట్ – ఈ ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం ప్రభుత్వ, స్థానిక సంస్థల, తి.తి.దే. ఆధ్వర్యంలో నడుస్తున్నటువంటి ప్రైవేటు మరియు యైడెడ్ పాఠశాలల్లో చదువుకుంటున్న 1000 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకారవేతనం అందజేస్తారు.

ఇతర విద్యాసేవా కార్యక్రమాలు – 1876వ సంవత్సరం లోనే అప్పటి ఆలయ యాజమాన్యం మహంతుల పర్యవేక్షణలో విద్యారంగంలో ప్రవేశించి; తిరుపతి, వెల్లూరు పట్టణాల్లో పాఠశాలలు, కళాశాలలు స్థాపించింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పడిన తరువాత, వృత్తి విద్యా కళాశాలలు, ప్రాచ్యకళాశాలు, డిగ్రీ మరియు జూనియర్ కాలేజీలు, ప్రాథమిక పాఠశాలు, ఉన్నత పాఠశాలు ప్రారంభించ బడ్డాయి. ఢిల్లీలో ఒక డిగ్రీ కాలేజీని కూడా నడుపుతోంది. దేశవ్యాప్తంగా నడప బడుతున్న అనేక ప్రైవేట్ వేదపాఠశాలలకు నిధుల సహాయం చేస్తోంది.

శ్రీ వాణి ట్రస్ట్ – 2019వ సంవత్సరంలో ప్రారంభించిన ఈ ట్రస్టు ద్వారా ఆలయాల నిర్మాణానికి, చిన్న ఆలయాల నిర్వహణకు, భక్తులకు సౌకర్యాలు కల్పించడానికి సహాయం చేయబడుతోంది.

ధార్మిక కార్యక్రమాలు, హరికథలు, భజనలు, బుర్రకథల వంటి కళారూపాల ద్వారా; చిన్న ఆలయాలకు కావలసిన సాధన సంపత్తులను అందించటం ద్వారా; ధార్మిక సాహిత్యాన్ని ప్రచురించడం ద్వారా; అన్నమాచార్య, దాససాహిత్య, దివ్యప్రబంధన, శ్రీనివాస కళ్యాణోత్సవం వంటి ప్రత్యేక ప్రాజెక్టుల ద్వారా, హైందవ మతప్రచారం కోసం విశేషమైన కృషి సలుపుతోంది. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక కార్యక్రలాపాలను నిర్వహించడం కోసం హిందూధర్మ ప్రచార పరిషత్ అనే ప్రత్యేక విభాగం ద్వారా అనేక ధార్మిక కార్యక్రమాలు చేపట్టబడుతున్నాయి. తి.తి.దే. ఆధ్వర్యంలో దేశం నలుమూలలా అద్భుతమైన ఆలయాలు నిర్మించబడ్డాయి.

యాత్రికులకు వసతి సదుపాయాలు తిరుమలకు విచ్చేసిన యాత్రికుల్లో 90 శాతానికి పైగా తి.తి.దే. వసతి గృహాలలోనే బస చేస్తారు. యాత్రికులందరికీ అతితక్కువ ధరలలో పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన వసతి ఏర్పాటు చేయబడుతుంది. శ్రీనివాసం, మాధవం, విష్ణునివాసం, వేంకటేశ్వర ధర్మశాల, కోదండరామస్వామి ధర్మశాల వంటి వసతిగృహాలు తిరుపతి పట్టణం నడిబొడ్డులో రైల్వేస్టేషన్ మరియు బస్టాండ్ కు అత్యంత సమీపంలో ఉన్నాయి. అలాగే తిరుమలలో ఆళ్వార్ టాంక్, అంజనాద్రి, గరుడాద్రి, మంగళం బావి కాటేజెస్, మరియు రాంబగీచా అతిథిగృహాలు ముఖ్యమైనవి.

శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ అనే ఉచిత బుల్లితెర ఛానల్ ద్వారా అనేక ధార్మిక కార్యక్రమాలు, తి.తి.దే. ఆధ్వర్యంలోని

దేవాలయాల్లో జరిగే ఉత్సవాలు, అచ్చం తిరుమల ఆలయంలా ఉండే తిరుపతి లోని నమూనా ఆలయంలో జరిగే శ్రీవారిసేవలు మున్నగునవి నిరంతరం ప్రసారం చేయబడతాయి. దాదాపుగా ప్రతి ఉదయం, తిరుమల లోని 'నాదనీరాజనం' వేదికపై జరిగే పురాణశ్రవణ కార్యక్రమాల ప్రత్యక్షప్రసారం జరుగుతుంది.

తితిదే ప్రచురణల విభాగం సనాతన హైందవధర్మాన్ని, శ్రీవేంకటేశ్వరుని భక్తితత్వాన్ని మరింత ప్రాచుర్యం లోకి తెచ్చేందుకు ఈ విభాగం ఇంతవరకూ 4000 పైగా గ్రంథాలను తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, సంస్కృతం, ,ఆంగ్ల భాషల్లో ప్రచురించి ఉచితంగానూ, రాయితీ ధరల లోనూ పంపిణీ చేస్తోంది. ఈ గ్రంథాలను విక్రయించడం కోసం తిరుమల, తిరుపతి తో పాటుగా, అనేక ముఖ్యపట్టణాలలో విక్రయ కేంద్రాలున్నాయి. ఈ విభాగం, గత ఏప్రిల్ మాసంలో, ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని 751 గ్రంథాలను అంతర్జాలం ద్వారా అందుబాటు లోకి తెచ్చింది. ఏదైనా ప్రైవేటు గ్రంథాలయం వారు తి.తి.దే. పుస్తకాలను ప్రదర్శించటానికి ఆసక్తి కనబరిస్తే, వారికి 15,000 విలువైన పుస్తకాలను ఉచితంగా అందజేస్తారు. ఈ సంస్థ ప్రచురించే గ్రంథాలలో వేద, పౌరాణిక, కావ్యప్రబంధ, సంకీర్తన, ఆలయ సాహిత్యాలకు సంబంధించిన గ్రంథాలున్నాయి.

సప్తగిరి అనే ఆధ్యాత్మిక మాసపత్రిక తి.తి.దే. ద్వారా నడపబడుతోంది. ఈ పత్రిక తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, సంస్కృతం మరియు ఆంగ్ల భాషల్లో వెలువడుతోంది. దీనికి అనుబంధంగా చిన్నారుల కోసం, 'బాల సప్తగిరి' అనే చిరుపుస్తకాన్ని కూడా ఈ మధ్యనే వెలువరిస్తున్నారు. రాయితీ ధరల ద్వారా అందించే ఈ పత్రిక ద్వారా పురాతన దేవాలయాల చరిత్ర, తి.తి.దే. అనుబంధ ఆలయాలపై ప్రత్యేక కథనాలు, తిరుమల-తిరుపతి దేవాలయాలలో జరిగే నిత్య, వార, పక్ష, మాస సంవత్సరోత్సవాల వార్తలు, భారతీయ శిల్పకళా వైభవం, భక్తాగ్రేసరుల కథనాలు, మంత్రోచ్చారణా పద్ధతులు, పురాణ ప్రవచనాలు మొదలైనవి ప్రచురిస్తూ, హిందూధర్మ ప్రచారానికై యథాశక్తి కృషి చేయబడుతోంది.

దాతల సంచాలక వ్యవస్థ (డోనార్ మేనేజ్మెంట్ సిస్టమ్) ద్వారా – తిరుమలలో అతిథిగృహాలు నిర్మించడానికి దాతలను ప్రోత్సహిస్తోంది. అటువంటి దాతలకు లభించే సదుపాయాలను పారదర్శకంగా అందించేందుకు అంతర్జాలంలో ఒక వెబ్ సైట్ ను కూడా తి.తి.దే. ప్రారంభించింది.

కళ్యాణవేదిక – పేద, మధ్య తరగతి వర్గాల వారు తక్కువ ఖర్చులో, సకల సదుపాయాలతో పెళ్లిళ్లు జరుపుకోవడానికి దేశవ్యాప్తంగా 300 కు పైగా కళ్యాణమండపాలు నిర్మించి, వాటిని ఆన్లైన్లో బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని తి.తి.దే. కల్పించింది. ఆంధ్రప్రదేశ్ లో అత్యధికంగా 187, తెలంగాణలో 65 కల్యాణ మండపాలు నడప బడుతున్నాయి. కుప్పం, రాజాం, నర్సాపూర్, మహబూబ్ నగర్, బెంగళూరుల లోని తి.తి.దే. కళ్యాణ మండపాలు అత్యద్భుతమైన సేవలందిస్తూ ఐ ఎస్ ఓ గుర్తింపు తెచ్చుకున్నాయి.

పైన చెప్పబడిన అనేక ట్రస్టులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది. ఆయా ట్రస్టులకు అందించే విరాళాలపై కూడా దాతలు ఆదాయపు పన్ను రాయితీ పొందవచ్చు.

పైన ఉదహరించినవి – తి.తి.దే. చేపడుతున్న అసంఖ్యాకమైన సేవాకార్యక్రమాల్లో అతికొద్ది మాత్రమే! శ్రీవారి చల్లని

చూపుతో తి.తి.దే. సామాజిక సేవారంగంలో మరింతగా ఎదగాలని, బడుగు-బలహీన వర్గాల వారికి మరింత చేయూత నివ్వాలని కోరుకుందాం.

అలాగే తి.తి.దే. ఆధ్వర్యంలో అత్యంత పారదర్శకంగా, ఏ విధమైన వివాదాలకు తావు లేకుండా, సేవాభావంతో నడుప బడుతున్న ట్రస్టులకు ఉడుతాభక్తిగా మన వంతు ఆర్థిక సహాయాన్ని అందించి, వారు చేస్తున్న సమాజసేవలో మనం కూడా తోడ్పడదాం.

శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల

అలిపిరి నుండి శేషాచల పర్వతశ్రేణులను అనుకుని ఉన్న, శ్రీనివాసమంగాపురం వెళ్లేదారిలో దాదాపు ఐదు కిలోమీటర్లు ప్రయాణం చేసిన తరువాత, సుమారు 55,000 ఎకరాల సువిశాల అటవీ ప్రదేశంలో; తి.తి.దే. ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వర జంతుప్రదర్శనశాల నడపబడుతోంది. 1987వ సంవత్సరంలో ప్రారంభించబడిన ఈ జంతుప్రదర్శనశాల విస్తీర్ణంలో ఆసియాలోనే రెండవ అతిపెద్ద జూ గా పేరు తెచ్చుకుంది. ఇందులో వందల కొద్ది సంఖ్యలో అరుదైన జంతువులు, పక్షులు, సరీసృపాలు పరిరక్షించ బడుతున్నాయి. జూ లో పెద్ద సంఖ్యలో ఉన్న వివిధ జాతుల సింహాలు జంతుప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటాయి.

ఎర్రచందనం వృక్షాల సుగంధ పరిమళాలలో, పచ్చని ప్రకృతి మధ్య, కొండ అంచున దాదాపు రెండు మైళ్ళ పొడవున విస్తరించి ఉన్న ఈ జంతుప్రదర్శన శాలలో జంతువులను, పక్షులను నయనానందకరంగా వీక్షిస్తూ మోటారు వాహనంపై విహరించవచ్చు. ఉద్యానవనాల్లో పెంచిన చెట్లు, బోనుల్లో బంధించబడిన జంతువులతో నిర్వహించే జంతుప్రదర్శనశాలలకు భిన్నంగా దట్టమైన అడవుల్లో స్వేచ్ఛగా సంచరించే వివిధ రకాలైన జంతువులతో తీర్చిదిద్దిన ఈ ప్రదర్శనశాల, పర్యాటకులకు అభయారణ్యంలో నడయాడుతున్న అనుభూతిని కలిగిస్తుంది. వివిధ జంతు, పక్షిజాతులతో పాటుగా ఎర్రచందనం, తెల్లకరక్కాయ వంటి దాదాపు పదిహేను వందల రకాల అరుదైన వృక్షజాతులను కూడా ఈ ప్రదర్శనశాలలో వాటి సహజసిద్ధమైన పరిసరాలలో చూడవచ్చు. శేషాచలశ్రేణుల్లో ఉన్న విలక్షణమైన జీవవైవిధ్యాన్ని సంరక్షించడంలోనూ, వన్యప్రాణుల పట్ల ప్రజలలో ఆసక్తి కలిగించడంలోనూ ఈ జంతుప్రదర్శనశాల ఎంతగానో తోడ్పడుతోంది. తిరుపతి పట్టణవాసులకు, తిరుమల యాత్రికులకు ఇదో ప్రముఖ విహారస్థలం కూడా. **పుట – 107 తేదీ – సెప్టెంబరు, 06**

శ్రీవేంకటేశ్వరుని సేవలో దాసభక్తులు

శ్రీమహావిష్ణువు కలియుగ అవతారమైన శ్రీవేంకటేశ్వరుని ప్రాభవాన్ని, మహిమలను, ఆశ్రితపక్షపాతాన్ని ఎందరెందరో భక్తులు, కవులు, వాగ్గేయకారులు రసరమ్య భరితంగా వర్ణించారు. అటువంటి వారిలో శ్రీనివాసుణ్ణి తమ అమూల్యమైన పదబంధాలతో కీర్తించి తరించిన 'కర్ణాటక హరిదాసులు' అగ్రగాములుగా నిలిచారు. వారు రచించి, ఆశువుగా కీర్తించిన వేలాది కృతులను 'దాససాహిత్యం' గా పేర్కొంటారు. ఈ దాసపరంపరకు చెందినవారు శ్రీవేంకటాచలాధీశుణ్ణి కన్నడభాషలో వర్ణించినందువల్ల, ఆ సాహితీసంపదను అత్యధిక సంఖ్యలో ఉన్న శ్రీవారి తెలుగు భక్తులకు సులభంగా అర్థమయ్యే అచ్చ తెలుగుభాష లోకి అనువదించి, ప్రచారం చేసే బృహత్తర కార్యక్రమాన్ని '**దాససాహిత్య ప్రాజెక్టు**' పేరుతో తి.తి.దే. చేపట్టింది. 'అన్నమాచార్య ప్రాజెక్టు' ద్వారా అన్నమయ్య కీర్తనలను అందరికీ అర్థమయ్యే సాధారణ తెలుగు లోకి ఎలా తర్జుమా చేసి జనబాహుళ్యం లోకి తెచ్చారో, అదే విధంగా 'దాససాహిత్య ప్రాజెక్టు' ద్వారా కన్నడభాషలో ఉన్న కీర్తనలను కూడా తెనిగీకరించు తారన్నమాట!

దాస సాహిత్యం ప్రాముఖ్యత

కొన్ని శతాబ్దాల క్రితం వరకు వేదాలు, ఉపనిషత్తులు, మహాభారతం, భాగవతం, అష్టాదశ పురాణాలు సామాన్య మానవులకు అంతగా ప్రవేశం లేని సంస్కృతభాషలో నిక్షిప్తమై ఉండేవి. కర్ణాటక ప్రాంతానికి చెందిన కొందరు మహాపండితులు దేవనాగరిలిపిలో ఉన్న సాహిత్యాన్ని సాధారణ జనస్రవంతి లోకి తీసుకు వెళ్ళే ఉద్దేశ్యంతో, ఆ సాహిత్య నిక్షేపాలన్నిఃటినీ విస్తృతంగా వాడుకలో ఉన్న సాధారణ కన్నడభాషలోకి అనువదించి; కుల, వర్ణ, లింగ వివక్షత లేకుండా ప్రజలలో ప్రచారం చేయాలని సంకల్పించారు. దానితో బాటుగా ఎందరో హరిదాసులు శ్రీవేంకటేశుని మహిమలను వీనులవిందుగా వర్ణించి తరించారు. తమను తాము భగవంతునికి దాసులుగా భావించుకుని, శ్రీవారిసేవకే తమ జీవితాలను సమర్పించుకున్న ధన్యజీవులను 'హరిదాసులు' లేదా 'దాసభక్తులు' గా అభివర్ణిస్తారు. హరికథలు, కీర్తనలు, దేవరనామాలు, భజనలు వంటి కళారూపాల్లో ప్రత్యక్షంగా, లేదా దృశ్య శ్రవణ మాధ్యమాల సాయంతో విస్తృతంగా శ్రీవేంకటేశ్వరతత్వాన్ని ప్రచారం చేయటం ద్వారా; పండితులకే పరిమితమైన 'వ్యాససాహిత్యం' అందరికీ అందుబాటులో ఉండే 'దాససాహిత్యం' గా రూపుదిద్దుకుంది. తద్వారా గడచిన కొద్ది శతాబ్దాలలో వేదాల, ఉపనిషత్తుల, ఆధ్యాత్మికతత్వ సారం కర్ణాటక ప్రాంతంలో నలుదెసలా విస్తారంగా వ్యాప్తి చెందింది. తరువాతి కాలంలో విజయనగరసామ్రాజ్య పతనం మరియు పురందరదాసు, కనకదాసుల వంటి ప్రఖ్యాత దాసభక్తుల నిర్యాణంతో; ప్రోత్సాహం కరువై ఈ ఉద్యమం మరింత ముందుకు సాగలేదు.

పై నేపథ్యంలో అప్పటికే విస్తృతప్రచారంలో ఉన్న దాససాహిత్యాన్ని తెలుగుభక్తుల చెంతకు తీసుకురావడం కోసం తి.తి.దే. చేపట్టిన దాససాహిత్య ప్రాజెక్టు యొక్క పూర్వాపరాలు తెలుసుకునే ముందు, కొందరు ప్రముఖ దాసభక్తులను స్మరించుకోవాలి.

దాసభక్తులు

దాససాహిత్య వ్యాప్తిని తమ భుజస్కంధాలపై వేసుకుని కర్ణాటక దేశమంతా విస్తృతంగా పర్యటించిన కర్ణాటక హరిదాసులను తలచుకునేటప్పుడు మొట్టమొదటగా శ్రీపాదరాయలు వారిని, తరువాత వ్యాసరాయలు వారిని ముఖ్యంగా పేర్కొనాలి. ఆ తరువాత కర్ణాటకసంగీత పితామహులుగా పేరుగాంచిన ఆనాటి పురందరదాసు, కనకదాసు, విజయదాసు, గోపాలదాసు, జగన్నాథ దాసులతో పాటుగా ఈమధ్య కాలం నాటి శ్యామసుందర దాసు కూడా స్మరణకు తెచ్చుకోదగ్గవారు. వీరిలో కొందరు అతి ముఖ్యులైన దాసభక్తుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

శ్రీపాదరాయలవారు

కర్ణాటక దాసులను మననం చేసుకునేటప్పుడు,

‘నమః శ్రీపాదరాజయ నమస్తే వ్యాసయోగినే!
నమః పురంధరార్యాయ విజయార్యతే నమః’

అంటూ మొట్టమొదటగా దాససాహిత్యానికి ఆద్యుడయినటువంటి శ్రీపాదరాయలు వారిని ప్రస్తావించడం అనూచానంగా వస్తున్న సాంప్రదాయం. భౌతికమైన ఈ మాయా ప్రపంచం నుంచి తనను రక్షించువాడు, ఇహలోకం లోని క్లేశాలను దూరం చేయువాడు ఆ వేంకటాచాలాధీశుడే అని శ్రీపాదరాయలు వారు నమ్మారు. శ్రీవారి మూలరూపం మరియు శ్రీమహావిష్ణువుకు యొక్క అవతార రూపాలకు బేధం లేదని ప్రతిపాదించి, శ్రీమహావిష్ణువును ఉపాసన చేసి తన జీవితాన్ని పండించుకున్నారు.

శ్రీకృష్ణదేవరాయలుతో పాటుగా ముగ్గురు విజయనగర సామ్రాట్ లకు రాజగురువుగా సేవలందించి, శ్రీవెంకటేశ్వర భక్తితత్వాన్ని దక్షిణభారత దేశమంతటా చాటిచెప్పిన శ్రీ వ్యాసరాయల వారి గురించి మనం ఇంతకు ముందే తెలుసుకున్నాం. స్వామిపుష్కరిణీ తటాన, వారు పెక్కు సంవత్సరాల పాటు త్రికాల సంధ్యావందనాదు లొనర్చిన 'వ్యాసరాజ ఆహ్నికమండపాన్ని', ఈనాడు కూడా తిరుమలలో ప్రధానాలయపు ఉత్తర మాడవవీధిలో, ఆదివరాహస్వామి ఆలయానికి ఎదురుగా చూడవచ్చు.

పురందరదాసు

'దాసరెందరె పురందర దాసయ్య' అనగా, ‘దాసుడంటే పురందరదాసే’ అని తన గురువులైన శ్రీవ్యాసరాయలవారిచే గౌరవంగా పిలిపించుకున్న పురందరదాసు వారు నారదాంశ సంభూతులు. తల్లిదండ్రులు పెట్టిన పేరు 'శ్రీనివాసనాయక్'. వంశపారంపర్యంగా పాండురంగని భక్తులైన వారి పూర్వీకులందరూ రత్నాల వ్యాపారంలో స్థిరపడ్డారు. కానీ తాత, తండ్రులకు భిన్నంగా పరమలోభిగా మారిన శ్రీనివాసనాయక్ అనువంశిక వ్యాపారాన్ని కొనసాగిస్తూ, ధనసంపాదనలో ఆసాంతం మునిగితేలుతూ; దానధర్మాలకు, ధార్మిక కార్యాలకు తిలోదకాలిచ్చాడు. అయితే తన పూర్వజన్మ సుకృతం వల్ల, సరస్వతీబాయి అనే సౌశీల్యవతితో అతని వివాహమయ్యింది.

పురందరదాసుగా మారిన శ్రీనివాస నాయక్

నిరంతరం రత్నాల వ్యాపారంలో వ్యస్తుడై ఉన్న శ్రీనివాస నాయక్ చెంతకు, ఒకనాడు ఓ బడుగుబాపడు కార్యార్థియై వచ్చాడు. తన ఏకైక కుమారుని ఉపనయనార్థం ధనసహాయాన్ని అందించవలసిందిగా అర్థించాడు. స్వతహాగా పిల్లికి సైతం బిచ్చం పెట్టని శ్రీనివాస నాయక్ కు, ఆ విప్రునికి సాయం చేయడానికి మనసొప్పక తాత్సారం చేయసాగాడు. ఆర్థికసహాయం కోసం పెక్కుమార్లు యాచించి వేసారిన విప్రుడు శ్రీనివాస నాయక్ గృహానికేతెంచి, అతని భార్యకు మొర పెట్టుకున్నాడు. కరుణాంతరంగు రాలైన సరస్వతీబాయి, వేరే ఆలోచన లేకుండా, ఆభరణాల పెట్టెలో ఉన్న తన ముక్కుపుడకను తీసి విప్రునికి దానమిచ్చింది. విధివశాత్తూ, విప్రుడు ఆ బంగారు ఆభరణాన్ని విక్రయించడం కోసం శ్రీనివాస నాయక్ రత్నాల అంగడికే వెళ్ళాడు. తన భార్య ఆభరణాన్ని గుర్తించిన శ్రీనివాస నాయక్ ముక్కుపుడకను భద్రంగా తన భోషాణంలో దాచి, తాళం వేసి, హుటాహుటిన స్వగృహానికి వెళ్ళి, ముక్కుపడకకై భార్యను నిలదీశాడు. దాంతో భర్త యొక్క లోభిత్వాన్ని, క్రోధాన్ని ఎరిగిన సరస్వతీబాయి; ఆత్మసమర్పణే మార్గాంతరమని తలంచి, విషం సేవించబోయింది. దైవకృప వల్ల, ఆ విషపాత్రలో ఆమెకు తన ముక్కుపుడక గోచరించడంతో, ఏమీ ఎరుగని దానిలా ఆ పుడకను తెచ్చి భర్తకు చూపించింది. అచ్చెరువొందిన శ్రీనివాసనాయక్, వెనువెంటనే దుకాణానికి వెళ్ళి చూడగా భోషాణం మూసిన తలుపులు మూసినట్లే ఉన్నాయి గానీ, అందులో ముక్కుపుడక మాయమయ్యింది. సునిశితంగా ఆలోచించిన శ్రీనివాస నాయక్‌కు సర్వం తేటతెల్లమైంది. ఇంతటి విచిత్రం ఘటనాఘటన సమర్థుడైన ఆ సర్వాంతర్యామికే సాధ్యమవుతుంది. పరమాత్ముని మరచి, పారమార్థిక చింతను విడిచి, ధనమే సర్వస్వంగా భావించి, దానధర్మాలకు నీళ్ళొదలి, భౌతిక వ్యాసంగంలో మునిగిన తనకు ఆ పాండురంగడే తన భార్య రూపంలో కనువిప్పు కలిగించాడని ఎరిగి, సరస్వతీబాయి పాదాలపై పడి శరణు వేడాడు. ఆ రోజే తన సర్వసంపదలను పేదసాదలకు పంచి; కట్టుబట్టలతో, కేవలం తుంబుర–తాళాలను చేతబట్టి, భార్యాసమేతంగా పండరీపురాన్ని చేరుకున్నాడు. పాండురంగడి శరణులో, ఆ దేవదేవుణ్ణి కీర్తించుకుంటూ కొంతకాలం గడిపి, హంపీ పట్టణాన్ని చేరుకుని, వ్యాసరాయలు వద్ద దీక్ష తీసుకుని, భక్త 'పురందరదాసు' గా మారాడు.

తరువాతి కాలంలో 'కర్ణాటకసంగీత పితామహుడు', 'కర్ణాటక సంగీత గంగోత్రి' గా ప్రఖ్యాతి గాంచిన పురందరదాసు వారు కన్నడ, సంస్కృత భాషల్లో లక్షలాది కీర్తనలను రచించి, భక్తజనులకు అందించి, హరినామ సంకీర్తనలో ఓలలాడారు. పండిత, పామరులందరూ, పురందరదాసు యొక్క హరినామ కీర్తనలలోని పదలాలిత్యానికి, భావనాపటిమకు ముగ్ధులయ్యారు. ఆ రోజుల్లో కన్నడదేశం లోని ఇంటింటా పురందరదాసు కీర్తనలు మారుమ్రోగేవి. వారి కీర్తనల ద్వారా 'విఠలుడు' వాడవాడలకు వేంచేశాడు. పురందరదాసు యొక్క భక్తి తత్పరతను తెలియజేసే ఆసక్తికరమైన మరొక ఇతివృత్తం ప్రాచుర్యంలో ఉంది.

అన్నసంతర్పణ

వ్యాసరాయలు వారి వద్ద దీక్ష తీసుకున్న భక్త పురందరదాసు, శ్రీనివాసుణ్ణి తన గానామృతంతో కీర్తించుకోవడం కోసం తిరుమలకు చేరుకున్నాడు. స్వామిపుష్కరిణిలో స్నానమాచరించిన అనంతరం గర్భాలయంలో శ్రీనివాసుడి దర్శనంతో

భక్తిపారవశ్యంలో మునిగిపోయాడు. కౌస్తుభమణిహారంతో, శంఖుచక్రధారుడై, చతుర్భుజుడై, శ్రీలక్ష్మీసమేతంగా విరాజిల్లుతున్న శ్రీవేంకటేశ్వరుని దివ్యదర్శనంతో అప్పటివరకు పురందరదాసును ఆవరించియున్న అజ్ఞానపు చీకట్లు చెల్లాచెదురయ్యాయి. ఆ ఆనందనిలయుణ్ణి తన అంతరంగంలోనే ఆవిష్కరించుకొని, తన్మయత్వంలో మునిగి ఆలయం నుండి వెలుపలికి వస్తున్న భక్త పురందరదాసును, శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఒక శ్రీమంతుడు గమనించాడు. ఆ ధనవంతునికి పురందరదాసు ముఖారవిందంలో సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుడు సాక్షాత్కరించాడు. అతడు దివ్యతేజస్సుతో వెలిగిపోతున్న పురందరదాసు పాదాలకు నమస్కరించుకుని, నిరుపేద వలె కానవస్తున్న ఆ భాగవతోత్తముని ఉదరపోషణార్థం కొంత పైకం సమర్పించుకో బోయాడు. అంతట, సర్వసంగ పరిత్యాగి అయిన పురందరదాసు హరియే తన సర్వస్వమని, భౌతిక సంపదలకు తాను దూరమని, తనకు ఈ జన్మలో ధనంతో నిమిత్తం లేదని చెప్పి వినమ్రంగా ఆ కానుకను తిరస్కరించాడు. అంతే గాకుండా, ఆ ధనవంతునికి ఐహికవాంఛలపై మోహాన్ని విడనాడి, భగవన్నామ సంకీర్తనతో తరించవలసిందిగా సందేశమిచ్చాడు. ఆ అమృతవాక్కులు విన్న ధనికునికి పురందరదాసు దైవాంశసంభూతునిగా గోచరించాడు. పురందరదాసు లోని దివ్యమైన సమ్మోహనశక్తికి లోనైన ఆ ధనికభక్తుడు, వారితో ధనం స్వీకరించక పోయినప్పటికీ, కనీసం ఆ ధనంతో వారి చేతుల మీదుగా, ఆకొన్న భక్తులకు అన్నసంతర్పణ చేసి, తన సొమ్ముకు సార్థకత చేకూర్చ వలసిందిగా వేడుకొన్నాడు. అతని కోరిక మేరకు, ఆ శ్రీమంతుడిచ్చిన పైకంతో పురందరదాసు అన్నదానానికి పూనుకున్నాడు.

అప్పన్న రూపంలో ఆపదమ్రొక్కుల వాడు

ఆ సమయంలో 'అప్పన్న' అనే భక్తుడు పురందరదాసుకు ధార్మిక కార్యకలాపాలలో సహకరిస్తుండే వాడు. పురందరదాసు పేదలు, సాధువులు, అన్నార్తులు అందరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ, అందరిలోనూ శ్రీనివాసుణ్ణి దర్శించుకుంటూ, షడ్రశోపేతమైన భోజనాన్ని కొసరి కొసరి వడ్డించసాగాడు. విస్తరాకులపై నేతిని వడ్డించమని తన అనుచరుడైన అప్పన్నను ఆదేశించాడు. వెంటనే అప్పన్న వచ్చి నేతిని వడ్డించగా భక్తులందరూ తృప్తిగా ఆరగించి ఆనందించారు. అన్నసత్రంలో సంతర్పణ కార్యాన్ని ముగించుకున్న పురందరదాసు సంతృప్తాంతరంగుడై స్వగృహానికి వెళుతుండగా, అప్పుడే స్వామీపుష్కరిణిలో స్నానం చేసి వస్తున్న అప్పన్న తారసపడ్డాడు. గురువుగారైన పురందరదాసుకు నమస్కరించి, అప్పుడే తాను స్వామిపుష్కరిణిలో స్నానమాచరించి వస్తున్నానని పలికాడు. దానికి కోపోద్రిక్తుడైన పురందరదాసు స్నానం చేయకుండా భోజనం ఎలా వడ్డించావని ప్రశ్నించి, పరుషవాక్కులు పలికాడు. దానికి అచ్చెరువొందిన అప్పన్న తాను గంట క్రితమే పుష్కరిణికి వెళ్లానని, ఇప్పుడే స్నానం ముగించుకొన్నానని, వడ్డన ప్రారంభ మవుతుందేమోనన్న ఆత్రుతతో వడివడిగా వస్తున్నానని వివరించాడు. ఆశ్చర్యచకితుడైన పురందరుడు వెనుకకు వెళ్లి అన్నసత్రంలో చూడగా, అప్పటివరకూ అక్కడే ఉన్న అప్పన్న జాడ కానరాలేదు. జరిగిన ఉదంతమంతా చూసిన పురందరునికి అసలు విషయం బోధపడింది. తన భక్తుడు అత్యంత నిష్ఠతో, అన్నార్తులందరిలో తననే దర్శించుకుంటూ చేస్తున్న అన్నసంతర్పణలో కాలాతీతమవ్వడం సహించలేని ఆ శ్రీనివాసుడే అప్పన్న రూపంలో వచ్చి నేతిని వడ్డించాడన్నమాట! ఎంతటి శరణాగతవత్సలుడీ వేంకటేశ్వరుడు!!

పురందరదాసు ఆ శ్రీనివాసుణ్ణి ప్రత్యక్షంగా దర్శించుకున్న మధురానుభూతితో తృప్తిగా ఆనందాశ్రువులు రాల్చి, అన్నసంతర్పణలో స్వయంగా వచ్చి వడ్డించిన వైకుంఠవాసుణ్ణి పదే పదే కీర్తించి, పరమానంద భరితుడై; తన హరినామ సంకీర్తనా వ్యాసంగాన్ని మరింత జోరుగా కొనసాగించాడు.

సంగీత, సాహిత్య సాధన

పరంధాముని ప్రత్యక్షదర్శనంతో పునీతుడైన పురందరదాసుల వారు పెక్కుమార్లు తిరుమలక్షేత్రాన్ని దర్శించుకుని, శ్రీవేంకటేశ్వరుని స్తుతిస్తూ లక్షలాది కీర్తనలను అక్షరబద్ధం చేశారు. తన కీర్తనలలో తిరుమలక్షేత్ర మహత్యాన్ని, శ్రీనివాసుని లీలలను, కొండపైనున్న ప్రకృతిని, వృక్ష-జంతు జాతులను, పుష్కరిణి మహత్యాన్ని, శ్రీవారిసేవల వైభవాన్ని, తత్కాలీన సామాజిక పరిస్థితులను కళ్లకు కట్టినట్లు, వీనులకింపుగా వర్ణించాడు.

కనులు మూసినా, తెరచినా ఆ సర్వాంతర్యామినే తన భౌతిక-మనో నేత్రాలతో గోచరింప జేసుకున్న ధన్యజీవి పురందరదాసునకు సర్వమూ శ్రీనివాసుడే! ఏనాడైనా, ఏ కారణం చేతనైనా శ్రీవేంకటేశ్వరుని దర్శనం క్షణకాలం ఆలస్యమైతే విరహవేదనతో విరక్తి చెందేవాడు.

శ్రీవారిసేవలో, సాహిత్య సాధనలో ఎనుబది సంవత్సరాలు తరించిన ఆ కన్నడ వాగ్గేయకారుడు 1564వ సంవత్సరంలో భౌతికంగా జీవితం చాలించినప్పటికీ; వారి సమ్మోహన పూరితమైన సంకీర్తనాగానంతో శ్రీవారి భక్తులు, సంగీతప్రియుల హృదయాలలో అమరుడయ్యాడు. శ్రీవేంకటేశ్వరుని భక్తితత్వాన్ని దక్షిణభారతదేశ మంతటా ప్రచారం చేసిన పురందరదాసుల వారి సంగీతసాధనకు గుర్తుగా, అలిపిరిలో శ్రీవారిపాదాల పద్ద వారి విగ్రహం ప్రతిష్ఠించబడింది.

వారు రచించిన, ఆశువుగా కీర్తించిన నాలుగు లక్షల ఇరవయ్యైదు వేల కీర్తనలలో కేవలం వెయ్యి మాత్రమే నేడు లభ్యమయ్యాయి. సింహభాగం కోల్పోయినప్పటికీ వారి మిగిలిన కీర్తనలనైనా తెలుగువారి ముంగిటకు తీసుకువచ్చే ఉద్దేశ్యంతో చేపట్టబడ్డ బృహత్తరమైన కార్యక్రమమే 'దాససాహిత్య' ప్రాజెక్టు. పురందరదాసుల వారి కీర్ధనలతో పాటుగా, ఇంకెందరో దాసభక్తుల కీర్తనలు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా వెలుగులోకి వచ్చాయి. పుట – 108 తేదీ – సెప్టెంబరు, 07

భక్త కనకదాసు

విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలించే కాలంలో 'బీరప్ప' అనే యాదవ కులశ్రేష్ఠుడు సేనాధిపతిగా ఉండేవాడు. బీరప్ప-బుచ్చమ్మ దంపతులకు సుదీర్ఘకాలం తరువాత తిరుమలేశుని కృపవల్ల పుత్రసంతానం కలిగింది. తల్లిదండ్రులు ఆ బాలునికి 'తిమ్మప్ప' గా నామకరణం చేసి, అల్లారుముద్దుగా పెంచారు. 1509వ సంవత్సరంలో, కర్ణాటకకు చెందిన హవేరీ జిల్లా, 'బాద్' గ్రామంలో తిమ్మప్ప జన్మించినట్లుగా చరిత్రకారులు అభిప్రాయ పడతారు.

దైవచింతనకు దూరమై, భోగభాగ్యాలకు అలవడిన తిమ్మప్ప యుక్తవయసులో ఉండగానే తల్లిదండ్రులు

దూరమయ్యారు. తన కటాక్షంతో జన్మించిన తిమ్మప్పను సన్మార్గం లోనికి తీసుకురావాలనే లక్ష్యంతో, ఆదికేశవుడు అనేక పర్యాయాలు తిమ్మప్ప స్వప్నంలో ప్రత్యక్షమై; తనవైపు దృష్టి మరల్చుకొని మోక్షమార్గంలో పయనించ వలసిందిగా ఆదేశించాడు. కానీ, తిమ్మప్ప సాక్షాత్తు శ్రీహరి హితబోధను సైతం పెడచెవిన బెట్టి, ఐహికవాంఛల సాధనకే మొగ్గు చూపాడు. నిత్యపూజను, సంధ్యానుష్ఠానాలను, హరినామస్మరణాన్ని, సత్పురుషుల సాంగత్యాన్ని త్రోసిరాజన్నాడు.

కరస్పర్శతో బాధోపశమనం

ఆ ఘటనాఘటన సమర్థుని లీలా విలాసం ఎలా ఉంటుందో ఎవరికి తెలుసు? యుద్ధరంగంలో చిచ్చరపిడుగులా చెలరేగిపోయే తిమ్మప్పకు ఒక నాడు యుద్ధంలో తీవ్ర గాయమైంది. శత్రుసైనికుని ఖడ్గప్రహారంతో ఒడలంతా రక్తసిక్తమై, భరింపరాని బాధతో విలవిల లాడుతున్న తిమ్మప్పకు ఆదికేశవుడు మరలా స్వప్నంలో ప్రత్యక్షమయ్యాడు. రాగద్వేషాలను, ప్రాపంచిక బంధాలను, భోగలాలసత్వాన్ని విడనాడి తనను శరణు వేడమని పదే పదే శెలవిచ్చాడు. బాధతో దిక్కుతోచని తిమ్మప్ప తీవ్రంగా వేధిస్తున్న గాయం నుంచి తనకు సత్వర ఉపశమనం కలిగితేనే తాను ఆదికేశవుణ్ణి ఆరాధించు కుంటానని, లేకుంటే తానెప్పటికీ శ్రీహరిని సేవించుకోనని మొండిగా బదులిచ్చాడు. దాంతో, శ్రీవేంకటేశ్వరుడు చిద్విలాసం చిందిస్తూ తన కరస్పర్శతో తిమ్మప్ప శారీరక రుగ్మతను పూర్తిగా తొలగిస్తాడు. ఆ ఉదంతంతో శ్రీహరి మహిమను గుర్తెరిగిన తిమ్మప్ప జ్ఞానోదయం కలిగినవాడై, మోహవాంఛలను విడనాడి, శ్రీవేంకటేశ్వరునికి పరమ భక్తుడయ్యాడు.

కనకతూము

వ్యాసరాయలవారి ఆదేశం మేరకు, యమాంశ సంభూతుడైన తిమ్మప్ప, యముని వాహనమైన మహిషం సాయంతో, ఒక పంటకాలువ త్రవ్వకానికి ఆటంకం కలిగిస్తున్న బండరాయిని తొలగించారు. తద్వారా నిమ్నకులస్తుడన్న కారణంగా ఒకప్పుడు తనను తిరస్కరించిన వ్యాసరాయల వారి మెప్పును సంపాదించి, వారి ద్వారా దాసదీక్షను పొందాడు. నాటి నుంచి తిమ్మప్పే 'కనకదాసు' గా వ్యవహరింప బడుతున్నాడు. కనకదాసు జ్ఞాపకంగా, 'కనకతూము' గా పిలువబడే ఈ కాలువ చిత్తూరు జిల్లా, మదనపల్లి శివారులో ఉంది.

శ్రీనివాసుని చిద్విలాసం!

దాసదీక్షను పొంది తనను మనస్ఫూర్తిగా సేవించుకుంటున్న కనకదాసుకు ఒకనాడు స్వప్నంలో కనిపించిన శ్రీవేంకటేశ్వరుడు తన బ్రహ్మోత్సవాలకై తిరుమలకు రావలసిందిగా ఆహ్వానం పలికాడు. భగవంతుని ఆదేశానుసారం తిరుమలకు చేరుకున్న కనకదాసు నిలువనీడ లేక; ఎముకలు కొరికే చలిలో గజగజా వణుకుతూ, ఆరుబయటే విశ్రమిస్తాడు. భక్తుని దీనావస్థతో హృదయం ద్రవించిన శ్రీనివాసుడు నడిరేయి ఒక ఆజానుబాహువు రూపంలో వచ్చి; కడుపు నింపుకోవడానికి శ్రీవారి ప్రసాదాన్ని, కప్పుకోవడం కోసం సరిగంచుపట్టు వస్త్రాన్ని ప్రసాదించి అదృశ్యమయ్యాడు. తదనంతరం ఆలయ యాజమాన్యం వారికి స్వప్నంలో సాక్షాత్కరించి, తన భక్తుడైన కనకదాసును

సగౌరవంగా ఆలయం లోనికి తోడ్కొని రావలసిందిగా ఆదేశించాడు.

మరునాటి ఉదయం కనకదాసు ఆలయద్వారం వద్దకు చేరుకోగా, నిరుపేద వలె గోచరిస్తున్న ఆ దాసభక్తుణ్ణి దేవాలయ సిబ్బంది గుర్తించ లేకపోయారు. తత్ఫలితంగా కనకదాసుకు ఆలయప్రవేశం నిరాకరించబడింది. కనకదాసు ఆవేదనతో, ఆర్తితో నిద్రాహారాలు లేకుండా, ఆ రాత్రంతా శ్రీనివాసుణ్ణి స్మరించుకుంటూ ఆలయం బయటే నిరీక్షించాడు. దైవసంకల్పంతో అదే రాత్రి ఆలయంలో శ్రీవారి నగలు చోరీ అయ్యాయి. ఆ నేరం దేవాలయం ముంగిట వేచి ఉన్న కనకదాసుపై మోపబడింది. ఆలయ యాజమాన్యం నిష్పక్షపాతమైన విచారణ జరపకుండానే, కనకదాసుకు కొరడాదెబ్బల శిక్ష విధించింది. కనకదాసు మాత్రం, కాగలకార్యం గంధర్వులే తీర్చుతారన్నట్లు, భారమంతా దేవునిపై వేసి నిశ్చింతగా శ్రీహరిని స్మరించసాగాడు. ఆర్తత్రాణ పరాయణుడైన అలమేలుమంగాపతి ఆలయ అధికారులకు స్వప్నంలో దర్శనమిచ్చి, జరిగిన వృత్తాంతమంతా తెలియజేస్తాడు. తన భక్తుడైన కనకదాసును అనుమానించి, అవమానించినందుకు ఆ ఆనందనిలయుడు ఆగ్రహోదగ్రుడయ్యాడు. తమ తప్పు తెలుసుకున్న ఆలయ అధికారులు కనకదాసు పాదాలపై పడి క్షమాభిక్ష వేడుకుని; దైవదర్శనార్థం కనకదాసును ఆలయం వద్దకు తోడ్కొని వెళతారు. దేవాలయం తలుపులు తీయగానే, పోయినట్లు భావించబడిన ఆభరణాలతో స్వామివారు దర్శనమిస్తారు. ఆ విధంగా కనకదాసు భక్తి తత్పరతను శ్రీవారు లోకవిదితం చేసి, ఆ దాసభక్తుని కీర్తిని అజరామరం కావించారు.

కనక భండి అంటే!

సుదీర్ఘకాలం పాటు శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో తరించిన కనకదాసు, శ్రీకృష్ణుని సన్నిధానమైన 'ఉడిపి' క్షేత్రం చేరుకుంటాడు. తొలిప్రయత్నంలో అక్కడ కూడా నిరాశే ఎదురైంది. ధర్మకర్తలు, శ్రీకృష్ణుని దివ్యదర్శనానికై ఉవ్విళ్ళూరుతున్న కనకదాసుకు, నిమ్నకులస్తుడన్న కారణంతో ఆలయప్రవేశం నిరాకరిస్తారు. కనకదాసు పదేపదే ప్రాధేయ పడినప్పటికీ, కరుడుగట్టిన ధర్మకర్తల మనసు కరగలేదు. పరమ భాగవతోత్తముడైన కనకదాసు యొక్క ఆర్తి, దర్పము, డాంబికము, ఆభిజాత్యాలకే ప్రథమ తాంబూలమిచ్చే ధర్మకర్తలకు అర్థం కాలేదు. కలత చెందిన మనస్సుతో, నిరాశ ముప్పిరిగొనగా కనకదాసు ఆలయం వెనుకభాగానికి వెళ్లి రోదించసాగాడు. భక్తవత్సలుడైన చిన్నికృష్ణుని హృదయం ద్రవించింది. తన భక్తుని క్లేశాన్ని తొలగించాలని సంకల్పించాడు. అంతే!!! గర్భాలయం వెనుకనున్న రాతికుడ్యం కకావికలై పోయింది. తూర్పుముఖంగా ఉండే శ్రీకృష్ణుడు పడమర వైపుకు తిరిగి, రాతికుడ్యంలో ఏర్పడిన ఖాళీ ప్రదేశం ద్వారా కనకదాసుకు దర్శనమిచ్చాడు. ధర్మకర్తల పటాటోపం పటాపంచలయ్యింది. దేవదేవుని దివ్యదర్శనంతో పులకించిన కనకదాసు పరమానందభరితుడై, శ్రీకృష్ణునిపై ఆశువుగా అనేక కీర్తనలు ఆలపించాడు. భక్త కనకదాసు పట్ల శ్రీకృష్ణుని కటాక్షానికి గుర్తుగా ఇప్పటికీ ఆ దేవాలయ పశ్చిమ ముఖద్వారాన్ని 'కనక భండి' గా వ్యవహరిస్తారు. అంటే, కనకదాసు స్వామివారిని దర్శించుకున్న 'కిటికీ' లేదా 'దర్శనద్వారము' ని అర్థం.

సంగీతసాధన

ఈ విధంగా పెక్కుమార్లు భగవంతుని కటాక్షింప జేసుకుని, వారి దివ్యదర్శన భాగ్యంతో పునీతుడైన కనకదాసు 90

వసంతాలు జీవించి, వేలాది కీర్తనలను రచించాడు. వీరి రచనలలో 'మోహన తరంగిణి', 'నళ చరిత్ర', 'హరిభక్త సార' అన్న గ్రంథాలు ముఖ్యమైనవి. 'నమ్మమ్మ శారదె ఉమామహేశ్వరి', 'ఇష్టుదిన ఈ వైకుంఠ ఎష్టు దూరవో', 'ఏసుకయంగళ నళిదు ఎంభత్తు నాల్కులక్ష జీవరాసి యన్ను', 'ముట్ట బేడముట్టబెడ', పరమ పురుషని నెల్లిశాయి' అనే లోక ప్రసిద్ధమైన కన్నడ కృతులను రచించారు. వారి కీర్తనలను కన్నడభాషలో 'ముండిగెగళు' గా వ్యవహరిస్తారు. కనకదాసు కృత

'లాలి పావన చరణ లాలి అఘహరణ!
లాలి వేంకట రమణలలిత కళ్యాణ!!

– అనే జోలపాటను వైష్ణవాలయాల యందు పవళింపుసేవ సమయంలో ఎక్కువగా పాడుతుంటారు. వారు రచించిన కృతులలో నిందాస్తుతికి పేరెన్నిక గన్న 'బందెవయ్య గోవింద శెట్టి' అనే పాట కుడా సుప్రసిద్ధమే.

పరమపావన చరితుడైన కనకదాసు, దాసభక్తులందరికీ గురుతుల్యుడే!

కర్ణాటక ప్రభుత్వం కనకదాసు జయంతిని శెలవు దినంగా ప్రకటించి, ఆ దాసభక్తునికి ప్రతి సంవత్సరం శ్రద్ధాభక్తులతో నివాళి నర్పించుకుంటుంది. వారి జయంతిని ప్రభుత్వకార్యక్రమంలా నిర్వహిస్తుంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు కనకదాసు జయంతిని ఘనంగా జరుపుకుంటాయి.

దాసదీక్ష

ఒకసారి దాసదీక్ష తీసుకుంటే ఆ దాసుడు జీవిత చరమాంకం వరకూ తాను హరికి దాసుడననే భావనతో; నిరాడంబరమైన, ఉదాత్తమైన, భగవద్భక్తితో కూడుకున్న దాసజీవితాన్ని గడపాల్సి ఉంటుంది. సన్యాసాశ్రమం స్వీకరించాల్సిన అగత్యం లేదు. దాస పరంపరలో గృహస్తాశ్రమాన్నే మోక్షసిద్ధికి సులభమార్గంగా భావిస్తారు. గృహస్తాశ్రమ ధర్మాలను త్రికరణశుద్ధిగా పాటిస్తూనే, అరిషడ్వర్గాలను అదుపులో ఉంచుకోవాలి. దాసుని యొక్క ఆధ్యాత్మికస్థాయిని బట్టి, తగిన దేవరనామం ప్రసాదింప బడుతుది. పరిపక్వత చెందిన ప్రతి దాసభక్తుడు తన ద్వారా దాసదీక్ష తీసుకుని, దాసజీవితాన్ని సాధన చేసే మరో ముముక్షువుకు ఒక 'అంకితనామం' ప్రసాదించవచ్చు. ఆ విధంగానే వ్యాసరాయలవారు తన శిష్యుడైన శ్రీనివాస నాయక్ కు 'పురందరదాసు' గానూ, తిమ్మప్పకు 'కనకదాసు' గానూ నామకరణం చేశారు. ఇద్దరు దాసభక్తులు ఒకరికొకరు తారసపడితే 'హరే శ్రీనివాస' నామోచ్చారణతో సంభాషణ ప్రారంభించి, అదే నామస్మరణతో ముగిస్తారు. అంటే, వారు ప్రతి భక్తునిలో భగవంతుణ్ణే దర్శించుకుంటారన్నమాట.

భక్తి ఉద్యమంతో దక్షిణాది రాష్ట్రాలకు, మహారాష్ట్ర లోని మారుమూల ప్రాంతాలకు సైతం చొచ్చుకుపోయిన ఈ దాసభక్తులు ఏటా తిరుమలలో జరిగే మెట్లోత్సవాలు మరియు బ్రహ్మోత్సవాలలో నృత్యగానాలతో సందడి చేస్తుంటారు. ఒకప్పుడు కేవలం వందల్లో ఉండే వీరి సంఖ్య క్రమంగా వేలల్లోకి చేరుకుంది. దాస భక్తుల్లో స్త్రీలు, పసుపు రంగు చీరెనూ, పురుషులు కాషాయరంగు ధోవతి, తలపాగానూ ధరించి ఉంటారు. నాట్య బృందాలుగా ఏర్పడి

తన్మయత్వంతో హరినామ సంకీర్తనలో లీనమై కానవస్తారు.

దాససాహిత్య ప్రాజెక్టు

దాసపరంపర గురించిన సమాచారం, మరుగున పడ్డ దాసభక్తుల వివరాలు, వారి దేవర నామాలు వంటి వివరాలను; ఆధ్యాత్మిక అంశాలకు ఆలవాలమైనట్టి దాససాహిత్యాన్ని భావితరాలకు భద్రంగా అందించేందుకు తి.తి.దే. ద్వారా ఎనభయ్యవ దశకంలో రూపొందించబడినదే ఈ దాససాహిత్య ప్రాజెక్టు. వేసవిలో ఆధ్యాత్మక శిబిరాల నిర్వహణ, దాసభక్తుల ఆరాధనోత్సవాలు నిర్వహించడం, వివిధ భజనబృందాల మధ్య ఆరోగ్యకరమైన స్పర్ధలు ఏర్పాటు చేయడం, సరళమైన భాషలో దాససాహిత్యంపై చిరుపొత్తాల ప్రచురణ మున్నగునవి దాసప్రాజెక్టు లక్ష్యాలు. ఈ ప్రాజెక్టు ఆధ్వర్యంలో దాససాహిత్యంపై అనేక తెలుగు, కన్నడ, ఆంగ్ల పరిశోధనా గ్రంథాలు వెలువడ్డాయి. దాసవ్యవస్థకు సంబంధించిన అనేక ప్రదర్శనలు కూడా నిర్వహించబడ్డాయి. వివిధ దాసభక్తుల చిత్తరువులను, వారు ఉపయోగించిన సాధనాలను, వారి గృహాల నమూనాలను, వారు ఆరాధించిన భగవద్ రూపాలను కూడా ఈ ప్రాజెక్టు సేకరించింది. ఒక సాహిత్య ప్రచార ఉద్యమంలా ప్రారంభమైన ఈ ప్రాజెక్టు కాలక్రమేణా భక్తిసాధన ఉద్యమంగా మారి, దక్షిణభారత దేశమంతా విస్తరించింది. దాససాహిత్య ప్రాజెక్టు ప్రచురణల్లో ముఖ్యమైనవి – కర్ణాటక హరిదాసుల సాహిత్యం యొక్క పదకోశం, ఇప్పటివరకు ముద్రణకు నోచుకోని దాసభక్తుల రచనలు, కర్ణాటక హరిదాసుల యొక్క సంక్షిప్త చరిత్ర, హరిదాసుల వర్ణచిత్రాలు, పరిశోధన పత్రాలు, వివిధ గోష్ఠులలో చర్చకు వచ్చిన అంశాలు – మొదలైనవి. హరిదాసుల యొక్క ఆరాధనోత్సవాలు నిర్వహించటం ఈ ప్రాజెక్టు యొక్క మరో ముఖ్యోద్దేశం.

భజనమండళ్ళ ద్వారా ప్రజలలో నిద్రాణమై ఉన్న ఆధ్యాత్మికశక్తిని జాగృత పరచి, సభ్యసమాజంలో ధర్మం వ్రేళ్ళూనుకునేలా చేసే మహత్తర లక్ష్యంతో ఆవిర్భవించిన 'దాససాహిత్య ప్రాజెక్టు' తన లక్ష్యాన్ని చేరుకోవడంలో సఫలీకృత మవుతుందని ఆశిద్దాం. ఉడుతాభక్తిగా మన సాయం అందిద్దాం. *ధర్మోరక్షతి రక్షితః* అంటే, మనం ధర్మాన్ని రక్షిస్తే అది మనలను రక్షిస్తుంది!

మెట్లోత్సవం

సాంప్రదాయ పద్ధతిలో, హరిదాసులు సూచించిన విధంగా మెట్లెక్కుతూ; సప్తగిరులను ఉల్లాసంగా, ఉత్సాహభరితంగా, సంగీత–నృత్య కోలాహలంతో చేరుకోవడాన్ని'మెట్లోత్సవం' అంటారు. వేలాది మంది భజనబృందం సభ్యులు, దాసభక్తులు హరిదాసుల వేషం ధరించి, భజన కీర్తనలు పాడుతూ, ప్రఖ్యాత హరిదాసుల చిత్రాలను తిరుపతిలోని ప్రధానవీధుల గుండా ఊరేగిస్తూ, భక్తజన సమ్మోహనంగా అలిపిరికి చేరుకుంటారు.మొదటి రోజు ఊరేగింపు తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం వద్ద ప్రారంభమై, త్యాగరాజ మండపం చేరుతుంది.అక్కడ 'హరిదాస సంధ్యసంకీర్తన' అనే సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించబడుతుంది.మరునాటి ఉదయం అలిపిరి నుండి బయలుదేరి, మెట్టు మెట్టుకూ నమస్కరిస్తూ;భజనలతో, కోలాటాలతో, కీర్తనలు ఆలపిస్తూ;

అంచెలంచెలుగా, నయనానందకరంగా, తిరుమలకు చేరుకునే సాంప్రదాయిక ప్రక్రియే మెట్లోత్సవం. మూడవరోజు తిరుమలక్షేత్రంలో వైభవోపేతంగా ఊరేగింపు నిర్వహిస్తూ తమ కీర్తనలతో, నృత్య గానాలతో పండుగ వాతావరణాన్ని సృష్టిస్తారు.ప్రతి మూడు నెలలకు ఒకసారి చొప్పున – సంవత్సరంలో నాలుగు సార్లు – మూడు రోజులపాటు – ఈ మెట్లోత్సవం జరుగుతుంది.

ఈనాడు భౌతికంగా మనమధ్య లేకున్నా, 20వ శతాబ్దం చివరవరకూ తిరుమలక్షేత్రాన్ని సందర్శించుకున్నభక్తుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయే, ఆరు శతాబ్దాల చారిత్రక వారసత్వాన్ని సొంతం చేసుకున్న,శ్రీవేంకటేశ్వరుని భక్తులకు తరతరాల పాటు తోడు–నీడగా నిలచిన 'వెయ్యి కాళ్ల మండపం' యొక్క ఆసక్తికరమైన ప్రస్థానాన్ని రేపటి ప్రకరణంలో తెలుసుకుందాం. **పుట – 109 తేదీ – సెప్టెంబరు, 08**

----------: :----------

వెయ్యి కాళ్ల మండపం

2003వ సంవత్సరం వరకు తిరుమలక్షేత్రాన్ని సందర్శించుకున్న భక్తులందరికి, ఆలయ మహాద్వారానికి ఎదురుగా ఉన్న, శిల్పకళా శోభితమైన, సువిశాలమైన 'వెయ్యి కాళ్ల మండపం' సుపరిచితమే! అనునిత్యం భక్తులతో క్రిక్కిరిసి ఉండే తిరుమలలో జరిగే ఎన్నో ధార్మిక, సామాజిక కార్యకలాపాలకు కేంద్రబిందువైన ఈ మండపం, భక్తుల మదిలో కలకాలం మెదులుతూనే ఉంటుంది. ఈ మంటపం, తన ఐదు వందల ముప్పై సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో, కోట్లకొద్దీ శ్రీవారి భక్తులకు ఆశ్రయమివ్వడమే కాకుండా; వేలాదిమంది చిరువ్యాపారుల వృత్తి-వ్యాపారాలకు వేదికయై, శ్రీవారినే నమ్ముకున్న ఆ బడుగువర్గాల వారికి బాసటగా నిలిచింది. అంతే గాకుండా, విజయనగర చక్రవర్తులు, మట్లవంశీయులు, మహమ్మదీయులు, మరాఠారాజులు, మహంతులు, ఆంగ్లేయులు, ఇలా ఎందరెందరో పాలకుల ఉత్థాన పతనాలకు సాక్షీభూతంగా నిలిచి, చరిత్రపుటల్లో శాశ్వతస్థానాన్ని సంపాదించుకుంది.

ఇప్పుడు భౌతికంగా కనుమరుగైన ఈ మండపం ఊహాచిత్రాన్ని మనసులో ముద్రించు కోవాలంటే, మొదటగా ఆలయం యొక్క నైసర్గిక స్వరూపాన్ని ఆకళింపు చేసుకోవాలి. భక్తులు సాధారణంగా భావించేటట్లు, ఆలయం కొండశిఖరంపై లేదు. సప్తగిరి శిఖరాల నడిమధ్యన ఉన్న లోతట్టు ప్రాంతంలో ఉంది. అంటే ప్రధానాలయం, స్వామిపుష్కరిణి, ఒకప్పుడు ఇరుకుగా ఉండే మాడవీధులు, వీటి చుట్టూ, దాదాపుగా వాటికి అనసంధానించబడి, ఎత్తైన పర్వతశిఖరాలు ఉండేవి. బేడి ఆంజనేయుని ఆలయం ఎదురుగా ఉన్న 'అఖండం' వద్దనుండి పరికిస్తే, ఆలయం వెనుకభాగంలో పచ్చని ప్రకృతితో పరవశిస్తున్న పర్వతాలను ఈనాటికీ చూడవచ్చు. వాటిలో అత్యున్నతంగా ఉన్నది నారాయణగిరి శిఖరం. ఈ పర్వతశిఖరాలు ఆలయం కంటే చాలా ఎత్తుగా ఉండటం వల్ల, కొన్నేళ్ళ క్రితం వరకూ, వర్షఋతువులో ఆ పర్వతాల నుండి జాలువారిన జలధారలతో మాడవీధులన్నీ చిత్తడిగా ఉండేవి.

పెరుగుతున్న భక్తజన సందోహానికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు కొండవాళ్ళను చదును చేస్తూ, ఆలయం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని విస్తరించుకుంటూ పోయారు. ఆ క్రమంలోనే, శ్రీవారికెదురుగా రాచఠీవితో ఉట్టిపడుతుండే వెయ్యికాళ్ళమండపాన్ని కూల్చి, భక్తుల సౌకర్యానికి పెద్దపీట వేశారు. వారసత్వ సంపద పరిరక్షణా? భక్తుజనుల సౌలభ్యమా? ఏది ముఖ్యం? ఎవరు నిర్ణయిస్తారు? మంటపం తొలగింపు సాకారం చేసుకున్నాడు కాబట్టి, ఇదంతా శ్రీనివాసుని సమ్మతి తోనే సమకూరినట్లుగా భావించాలేమో!

మంటపం పుట్టుపూర్వోత్తరాలు

ఎవరు, ఎలా కట్టించారు?

1472వ సంవత్సరంలో విజయనగర సామ్రాజ్య వారసుడు సాళువ ఎర్రకంప దేవుని కుమారుడైన సాళువ మల్లయ్యదేవ మహరాజు, శ్రీవారి ఆలయానికి దేవదేయంగా ఇచ్చిన 'దుర్గసముద్రం' అనే గ్రామం మీద వచ్చిన వార్షికాదాయంతో ఈ మంటపం నిర్మించబడినట్లుగా చారిత్రక ఆధారాలున్నాయి. సాధారణంగా, మడులు,

మాన్యాలు, అగ్రహారాలు దేవాలయాల నిర్వహణకు, ప్రసాదాల వితరణ సమర్పించుకుంటారు. దానికి భిన్నంగా, ఈ గ్రామం, గోపురాలు, మండపాలు, కుడ్యాలు నిర్మించే నిమిత్తం ఆలయానికి దారాదత్తం చేయబడినట్లుగా శాసనాలలో లిఖించబడింది. ఆ గ్రామం యొక్క ఆదాయంతో వెయ్యి కాళ్ళ మంటపం వంటి చరిత్ర ప్రసిద్ధికెక్కిన కట్టడం నిర్మించబడటం ద్వారా ఆ దాత యొక్క స్వప్నం సంపూర్ణంగా సాకారమయ్యింది.

సరిహద్దులు

దీర్ఘచతురస్రాకారంలో ఉండే ఈ మంటపం సరిహద్దులు:

పడమరదిక్కున	తూర్పు మాడవీధి,
ఉత్తరదిక్కున	సన్నిధివీధి(వాహన మరియు వైభవోత్సవ మంటపాలకి మధ్యలో ఉన్న రాంబగీచా వసతిగృహం నుండి ఆలయం వరకూ వెళ్ళే రహదారి),
దక్షిణదిక్కున	హాథీరాంజీ మఠం యొక్క ముందుభాగం,
తూర్పుదిక్కున	బేడి ఆంజనేయుని మందిరం

మిట్ట పైనున్న హాథీరామ్ జీ మఠం యొక్క భూతలం ఈ మంటపం యొక్క ఉపరితలభాగానికి సమానంగా ఉండేది. అవగాహన చేసుకోడానికి కొంచెం క్లిష్టంగా ఉన్నప్పటికీ కనులు మూసుకుని ఆలయం ముందుభాగాన్ని మనసులో మననం చేసుకుని, మనకు చిరపరిచితమైన ఈ హద్దులను ఊహించుకుంటే ఆ మండపం యొక్క వాస్తవ స్థావరం కళ్ళముందు సాక్షాత్కార మవుతుంది. ప్రయత్నించండి.

ఈ మంటపం తూర్పు-పడమరలు 310 అడుగుల పొడవు, ఉత్తర-దక్షిణాలు 134 అడుగుల వెడల్పు కలిగిన సువిశాలమైన కట్టడం. పన్నెండు అడుగుల ఎత్తైన మంచె లాంటి సహజసిద్ధమైన మిట్టపై, ఆలయం యొక్క భూతలం నుంచి సుమారు ఇరవైమూడు అడుగుల ఎత్తులో సమున్నతంగా, రాజసం ఉట్టిపడుతూ ఉంటుంది. మంటపం యొక్క భూతలమట్టం తూర్పు నుండి పడమరకు పెరుగుతుండడం వల్ల, ఆలయం ఎదురుగా ఉన్న మంటపభాగం యొక్క ఎత్తు పదకొండు అడుగులు గానూ, బేడి ఆంజనేయుని ఎదురుభాగం ఎత్తు తొమ్మిది అడుగులు గానూ ఉండేది. మంటపం యొక్క పడమర దిక్కున, అంటే ఆలయం ఎదురుగా, విశాలమైన సోపానాలుండేవి. మెట్ల ద్వారా మంటపం లోకి ప్రవేశిస్తుంటే, మొదటి అంతస్తు ఎక్కినట్లనిపించేది.

సరిగ్గా సహస్రమేనా?

మంటపం లోని రెండేసి స్తంభాల నడుమ, ఆరు నుండి ఎనిమి దడుగుల దూరం ఉండేది. ప్రతిస్తంభం ఒక కళాఖండమే! పైకప్పుకున్న, వంపు తిరిగిన బాహ్యకుడ్యపు అంచులపైనా, ప్రతిస్తంభం పైనా దేవతలు, పౌరాణిక ఘట్టాలు, విజయనగర సామ్రాజ్య చిహ్నాలు, నృత్యభంగిమలు, విజయనగర వీరుల విన్యాసాలు, వాస్తవిక, కాల్పనిక జంతువులు మున్నగునవి మనోహరంగా మలచబడ్డాయి.

మంటపానికి సరిగ్గా వెయ్యికాళ్ళే ఉన్నాయని ఇదమిత్థంగా చెప్పలేము. మంటపం నిర్మించినప్పుడు ఆనాటి వాస్తుశైలి ననుసరించో, లేదా సమకాలీన మంటపాలన్నింటి లోకి విలక్షణంగా ఉండాలన్న ఉద్దేశ్యం తోనో; ఆనాటి పాలకులు

ఈ మంటపాన్ని ఖచ్చితంగా వెయ్యి స్తంభాలతో నిర్మించి 'వేయికాళ్ళ మంటపం' గా నామకరణం చేసి ఉండవచ్చు. అయితే, గడచిన 50-60 సంవత్సరాల కాలంలో తిరుమలపై అనేక నూతన కట్టడాలు రావడం వల్ల, ఒకప్పుడు కొండపై ఏకైక ఆవాస స్థానంగా ఉన్న ఈ మంటపం ప్రాధాన్యత క్రమంగా తగ్గుతూ వచ్చింది, దానికి తోడు, పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా, మాడవీధులను వెడల్పు చేయవలసి వచ్చింది. ఈ కారణాలవల్ల, అంచుల్లో ఉన్న స్తంభాలను కూలగొడుతూ, మంటపం విస్తీర్ణం క్రమంగా కుదించబడింది. అందువల్ల ఖచ్చితంగా ఎన్ని స్తంభాలున్నాయో చెప్పడం కష్టసాధ్యమే! అయితే, మంటపం సువిశాలమైన దవ్వడం వల్ల, లెక్కకుమిక్కిలిగా స్తంభాలుండటం వల్ల, ఇది వేయికాళ్ళ మంటపంగా పేరొంది ఉండవచ్చని కొందరి అభిప్రాయం.

మంటపం యొక్క పొడవు-వెడల్పులను బట్టి దాని విస్తీర్ణాన్ని లెక్కగట్టి, దాన్ని ఇరుస్తంభాల మధ్యనున్న సగటు దూరంతో భాగించి, భాగఫలానికి చివరివరుసల్లో ఉన్న స్తంభాలను కలిపితే సుమారుగా ఎనిమిది వందల స్తంభాలు ఉంటాయని ఉజ్జాయింపుగా చెప్పవచ్చు.

ఎందుకు నిర్మించారు?

అప్పట్లో ఆలయం చుట్టూ దట్టమైన అటవీప్రాంతం ఉండేది. క్రూరమృగాలు యథేచ్ఛగా సంచరిస్తుండేవి. తిరుమల కొండపై మరేవిధమైన ఆవాసాలు గానీ, వసతిగృహాలు కానీ ఉండేవి కావు. తరచుగా వర్షాలు కురుస్తూ వాతావరణం పగటిపూట ఎండగానూ, రాత్రివేళల్లో ఎముకలు కొరికే చలితోనూ ఉండేది. ఈదురు గాలులు వీస్తుండేవి. దానికి తోడు కోతుల బెడద.

అందువల్ల భక్తులు ఈ మంటపంలో తలదాచుకునే వారు. అప్పటి పాలకులు తగిన రక్షణ, వసతి, భోజనం ఏర్పాట్లు చేసేవారు. చాలామంది భక్తులు అక్కడే వంట కూడా చేసుకునేవారు.

మహమ్మదీయుల పాలన ముందు ఈ మంటపంలో పవిత్రోత్సవాలు నిర్వహించ బడేవి. ఆలయంలో ఏడాది పొడవునా జరిగే పూజాకైంకర్యాలలో అనాలోచితంగా ఏవైనా పొరపాట్లు దొర్లితే, వాటికి ప్రాయశ్చిత్తంగా జరిగే సంవత్సరోత్సవాలను 'పవిత్రోత్సవాలు' గా పిలుస్తారు. వీటి గురించి మున్ముందు మరింత వివరంగా తెలుసుకుందాం. మహమ్మదీయుల పాలనాకాలంలో, అర్చకుల కొరత వల్ల కొంతకాలం పవిత్రోత్సవాలను నిలిపివేశారు. వారి తదనంతరం సాధారణ పరిస్థితులు నెలకొనడంతో, పవిత్రోత్సవాలను ఈ మంటపం లోనే పునఃప్రారంభించారు

తరువాతి కాలంలో ఈ మంటపం అనేక రకాలుగా ఉపయోగ పడింది. మంటపంలో కొంత భాగం కళ్యాణకట్ట గానూ, మరికొంత భాగం సంగ్రహాలయం గానూ కూడా వినియోగింప బడిందని ఇంతకు ముందు తెలుసుకున్నాం. మంటపం కూల్చేనాటికి, అడ్డుగోడలు నిర్మించబడి, మంటపమంతా గదులు గదులుగా విభజించబడింది. ఆ గదుల లోనే రక్షకభటనిలయం, ఉద్యోగుల ఫలహారశాల, చెవిపోగులుకుట్టే గది, విద్యుత్‌పరికరాల గిడ్డంగి, పురోహితసంఘం, లడ్డూవిక్రయశాల, బోలెడన్ని దుకాణాలు కూడా ఉండేవి. మంటపంలో సింహభాగాన్ని ఆక్రమించిన కళ్యాణకట్ట, సంగ్రహాలయం సరే సరి.

వీటన్నింటికి తోడు శౌచాలయాలు కూడా అందులోనే ఉండటంతో, ఈ మంటపం శ్రీవారి భక్తులకు విశ్రాంతిమందిరంలా కూడా సేవలందించేది.

ఒకప్పుడు మాడవీధుల్లో ఊరేగింపు జరిగే సమయంలో మలయప్పస్వామి వారు ఈ మంటపం లోకి వేంచేసి హారతి నందుకునేవారు. నైవేద్య సమర్పణ కూడా అందులోనే జరిగేది. తరువాతి కాలంలో కారణాంతరాల వల్ల ఈ సాంప్రదాయానికి స్వస్తి పలికారు.

స్థూలంగా చెప్పాలంటే, అర్ధశతాబ్దం క్రితం వరకూ తిరుమలలో శ్రీవారిఆలయ సముదాయం, వేయికాళ్ళమంటపం, కొన్ని మఠాలు, ధర్మసత్రాలు, అర్చకుల, వ్యాపారుల మరియు ఆలయ సిబ్బంది కోసం పరిమిత సంఖ్యలో నిర్మించిన ఆవాసాలు తప్ప, మరే విధమైన కట్టడాలు ఉండేవికాదు. భక్తులు విశ్రాంతి తీసుకోవాలన్నా, ఏదైనా కార్యక్రమం చేపట్టాలన్నా, కార్యాలయం నిర్వహించాలన్నా, ఈ వేయికాళ్ళ మంటపమే శరణ్యం.

ఈ విధంగా ఇందుగలడందు లేదన్నట్లు, సర్వం తానై, ఈ మంటపం ప్రస్థానం తిరుమలక్షేత్ర చరిత్రతో పెనవేసుకు పోయింది.

మంటపం తొలగింపుకు నాంది!

ఇన్ని రకాలుగా సేవలందించిన ఈ మంటపం యొక్క ప్రాభవానికి, పెరుగుతున్న జనసందోహమే అడ్డుకట్ట వేసింది. భక్తుల సౌకర్యార్థం శతాబ్దాల చరిత్ర గల ఈ మంటపాన్ని విడతలవారిగా తొలగించే కార్యానికి 1920వ సంవత్సరంలోనే బీజం పడింది. కానీ, భక్తులనుండి వ్యతిరేకత వ్యక్తం కావడంతో కూల్చివేత కార్యక్రమం తాత్కాలికంగా నిలిచిపోయింది. అయితే, అంచుల్లో ఉన్న కొన్ని శిలాస్తంభాలు సహజసిద్ధంగా కూలిపోవడం వల్ల, మరికొన్ని స్తంభాలను అప్పటి అవసరాల కోసం కూల్చివేయడం వల్ల, 1972వ సంవత్సరం నాటికి దాదాపు వంద స్తంభాలకు పైగా తొలగిపోయి, వాటి పైకప్పు కూలిపోవడం వల్ల అర్థశతాబ్దం క్రితమే ఇది 'భగ్నమందిరం' గా గుర్తించబడి, దైవకార్యాలకు అనర్హమయ్యింది. **పుట – 110 తేదీ – సెప్టెంబరు, 09**

మండపం తొలగింపు

వివిధ కారణాల వల్ల వెయ్యికాళ్ళ మంటపం తొలగించే ప్రస్తావన 1920వ సంవత్సరంలోనే వచ్చినప్పటికీ, భక్తులనుండి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవ్వడంతో, అప్పట్లో ఆ ఆలోచనను విరమించుకున్నారు. తరువాత వచ్చిన పాలకవర్గాలు కుడా ఆ సాహసం చేయలేక పోయాయి.

వంద అడుగుల సన్నిధివీధి!

1980వ సంవత్సరం నాటికి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వెయ్యికాళ్ళ మంటపాన్ని అంతకు ముందే 'భగ్నమంటపం' గా గుర్తించడం వల్ల, దానిలో వైదిక పరమైన కార్యక్రమాలేవీ జరగటం లేదు. పెరిగిన భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ పరిసరాలలో ఉన్న ఇతరకట్టడాలను తొలగించే లేదా వేరే ప్రదేశానికి తరలించే కార్యక్రమం

వేగం పుంజుకుంది. అంతే గాకుండా, స్వామివారి నిత్యకళ్యాణం అప్పటివరకూ విమానప్రదక్షిణమార్గం లోనున్న ఇరుకైన కళ్యాణమంటపంలో జరిగేది. దానివల్ల అతికొద్ది మంది భక్తులకు మాత్రమే దాన్ని తిలకించే అవకాశం లభించేది. అప్పట్లో ఆలయానికి అభిముఖంగా, గొల్లమంటపం వెనుకనుండి బేడి ఆంజనేయస్వామి ఆలయం వరకూ ఉన్న 'సన్నిధివీధి', ఆక్రమణల కారణంగా పదిహేను అడుగుల వెడల్పుకు కుంచించుకు పోయింది. పైగా, సన్నిధివీధికి దక్షిణాన ఉన్న వెయ్యికాళ్ళ మంటపంలో ఆ వీధికి అభిముఖంగా అనేక దుకాణాలు ఉండేవి. వీధికి ఉత్తరభాగంలో కూడా అదే పరిస్థితి. దాంతో, సన్నిధివీధి మరింత కుదించుకు పోయి, కేవలం ఆరడుగుల దారి మాత్రమే మిగిలింది. ప్రధానాలయాన్ని చేరుకోవడానికి అదే ముఖ్యమార్గమవ్వడం వల్ల భక్తులు తీవ్రమైన అసౌకర్యానికి గురయ్యేవారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, భక్తులందరూ సౌకర్యవంతంగా కూర్చొని తిలకించటానికి వీలుగా ఆలయానికి వెలుపల ఒక ఆస్థానమంటపం నిర్మించి, కళ్యాణోత్సవాన్ని అందులో జరపాలని; భవిష్యత్ అవసరాలను సైతం దృష్టిలో ఉంచుకుని, సన్నిధివీధిని ఆరడుగుల నుంచి వందడుగుల వెడల్పు చేయాలని ప్రతిపాదించబడింది. అప్పటికే, వివిధకారణాల వల్ల దఫాలవారిగా వందకు పైగా స్తంభాలు తొలగించబడ్డాయి.

అప్పటి ప్రతిపాదనలు 1982వ సంవత్సరంలో కార్యరూపం దాల్చి, అనుకున్నట్లు గానే సన్నిధివీధి వందడుగుల విశాలమైన రహదారిగా వెడల్పు చేయబడింది. ఆ క్రమంలో వెయ్యికాళ్ళ మంటపం మరో రెండువందల కాళ్ళను కోల్పోయింది. మరో ప్రక్క, ఈ మంటపం యొక్క దక్షిణపార్శ్వానికి హాథీరామ్ జీ మఠానికి మధ్యలో ఉన్న రహదారిని వెడల్పు చేయడంతో, అటుప్రక్క కూడా కొన్ని స్తంభాలను తొలగించాల్సి వచ్చింది. ఇరుప్రక్కలా తొలగించిన మంటపభాగాలలో ఎక్కువగా తి.తి.దే. కార్యాలయాలే ఉన్నాయి. కొన్ని వ్యక్తిగత దుకాణాలు కూడా ఉన్నాయి కానీ వాటికి ఆకర్షణీయమైన పరిహారాన్ని చెల్లించడం మరియు ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయ స్థలాన్ని కూడా చూపించడంతో, తొలగింపు కార్రక్రమానికి పెద్ద అడ్డంకులేవీ ఎదురు కాలేదు.

ఇలా విడతలవారిగా మంటపవైశాల్యం తగ్గుతూ, 1983వ సంవత్సరానికి దాదాపుగా సగమై నామావశిష్ఠంగా మిగిలింది.

భారీ కేటాయింపు!

పోనుపోనూ భక్తుల తాకిడి మరీ ఎక్కువ కావడంతో దుర్ఘటనలు కూడా జరిగాయి. 1983వ సంవత్సరం రథోత్సవం లోనూ, 2002వ సంవత్సరం బ్రహ్మోత్సవాలలోనూ జరిగిన త్రొక్కిసలాటల్లో అనేకమంది భక్తులు గాయపడి, ప్రాణనష్టం సంభవించింది కూడా! దాంతో వెయ్యికాళ్ళమంటపం తొలగింపు అంశం మరలా తెరపైకి వచ్చింది. 2002వ సంవత్సరంలో జరిగిన పాలకమండలి సమావేశంలో చారిత్రాత్మకమైన తీర్మానం చేయబడింది. దానిననుసరించి వెయ్యికాళ్ళమంటపాన్ని ఆ ప్రదేశం నుంచి తొలగించి ఆ స్తంబాలతోనే దాన్ని వేరొకచోట పునర్నిర్మించటానికి; మాడవీధులను వెడల్పు చేయడానికి; ఆలయం చుట్టూ ఇప్పుడున్న బాహ్యప్రాకారానికి వెలుపల మరో మహాప్రాకారాన్ని నిర్మించడానికి 72 కోట్ల భారీ మొత్తాన్ని కేటాయించారు. అప్పట్లో కూల్చివేత నిర్ణయం, అత్యంత భారీగా నిధుల కేటాయింపు, రెండూ సంచలనాన్ని సృష్టించాయి.

ముగిసిన మంటప ప్రస్థానం

కూల్చివేత నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తాయి. అయినా, తీర్మానాన్ని అమలు పరుస్తూ 2003వ సంవత్సరంలో, చరిత్రప్రసిద్ధి కెక్కిన ఈ మంటపం పూర్తిగా నేలమట్టం చేయబడింది. అంతే గాకుండా, అప్పటివరకూ మంటపానికి భూతలంగా ఉన్నట్టి పన్నెండడుగుల సహజసిద్ధమైన శిలావేదికను కూడా సమూలంగా తొలగించి, ఆ ప్రదేశాన్ని ఆలయం యొక్క భూతలంతో సమంగా చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే, మంటపాన్ని నామరూపాలు లేకుండా చేసి, అనవాళ్ళన్నింటినీ తుడిచివేశారు. సుదీర్ఘకాలం పాటు తిరుమల క్షేత్రానికే తలమానికంగా నిలచిన వెయ్యికాళ్ళమంటప ప్రస్థానం అలా దయనీయంగా ముగిసింది.

గొల్లమంటపం అలా ఎందుకుంది?

సాధారణంగా ఏ మంటపం వేదికైనా భూతలానికి నాలుగైదు అడుగుల ఎత్తులో, సౌకర్యవంతంగా, విశ్రాంతి తీసుకోవడానికి అనువుగా ఉంటుంది. కానీ, ఆలయ మహాద్వారానికి ఎదురుగా దాదాపు ఇరవై అడుగుల పైబడిన ఎత్తులో, విచిత్రంగా కానవచ్చే గొల్లమంటపం అలా ఎందుకుంది అనే సందేహం సహజంగానే కలుగుతుంది. ఒకప్పుడు ఇది కూడా అన్ని మంటపాల్లానే, కూర్చోడానికి అనువుగా ఉండేది. పన్నెండడుగుల ఎత్తైన వెయ్యికాళ్ళమంటపం యొక్క శిలావేదిక ఉన్నప్పుడు, దాదాపుగా దానినానుకుని ఉన్న గొల్లమంటపం కూడా మిగిలిన మంటపాల లానే ఉండేది. గొల్లమంటపం వద్దే అఖండం మరియు కొబ్బరికాయలు కొట్టే సదుపాయం ఉండేవి. ఈ మండపంలోనే, పేరుకు తగ్గట్టు పాలు–పెరుగు అమ్ముతూ ఉండేవారు. వెయ్యికాళ్ళ మంటపం మిట్టను కొట్టివేసే టప్పుడు గొల్లమంటపం కాళ్ళను మాత్రం మిగిల్చి, చుట్టూ ఉన్న పర్వతభాగాన్నంతా తొలిచివేశారు. అందువల్లే ఈనాడు గొల్లమంటపం ఉన్నతంగా, మిగిలిన మంటపాలకు భిన్నంగా, పొడవాటి కాళ్ళతో కానవస్తుంది.

మళ్ళీ మొదటికి

మంటపాన్ని హడావిడిగా కూల్చివేసి నేలను చదును చేయడంతో ఆగ్రహజ్వాలలు ప్రజ్వరిల్లాయి. భక్తులు, పలువురు ప్రముఖులతో బాటు శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ జియ్యర్ స్వామి కూడా మంటపం కూల్చివేతను తీవ్రంగా వ్యతిరేకించారు. తన అసమ్మతిని బాహాటంగా వ్యక్తపరుస్తూ, శిష్యులతో కలసి తిరుమలలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు. వెయ్యికాళ్ళ మంటపం కేవలం అలంకార ప్రాయమైన చారిత్రాత్మక కట్టడం మాత్రమే కాదని, స్వామివారికి కైంకర్యాలు చేయడానికై నిర్మించబడిన మతపరమైన కట్టడమని, ఆ మంటపానికి ఆలయంతో సమమైన ప్రాధాన్యం ఉన్నదని, పెక్కు సందర్భాల్లో దృశ్యశ్రవణ మాధ్యమాల ద్వారా ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ విధంగా చర్చోపచర్చలు జరుగుతుండగానే, తొలగించబడిన వెయ్యికాళ్ళ మంటపం యొక్క శిలాస్తంభాలను, ఇతర భాగాలను భద్రంగా తరలించి; స్వామిపుష్కరిణికి వెనుక భాగాన ఉన్న ఖాళీ ప్రదేశంలో వెయ్యికాళ్ల మంటపాన్ని పోలిన మరో విశాలమైన కట్టడాన్ని నిర్మించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. జీయర్ స్వామి ఆ ప్రతిపాదనను కూడా తీవ్రంగా వ్యతిరేకించి, ఆందోళనను మరింత ఉధృతం చేశారు. నిరసనలు తారాస్థాయికి చేరుకోవడంతో త్రవ్విన

మెరక ప్రదేశాన్ని పూడ్చివేసి, వెయ్యికాళ్ళ మంటపాన్ని మరలా అదే స్థానంలో నిర్మించాలని అప్పటి ప్రభుత్వం అదేశించింది.

వివాదాలకు నెలవు

ఇదిలా ఉండగా వెయ్యికాళ్ల మండపం తొలగింపు, సన్నిధివీధి విస్తరణ మొదలైన కార్యక్రమాల కారణంగా; శతాబ్దాల నుండి తమ తమ ఆధీనంలో ఉన్న స్థావరాలను పూర్తిగా లేదా పాక్షికంగా కోల్పోయిన లేదా కోల్పోతామేమోననే అనుమానం ఉన్న హాథీరామ్ జీ మఠం వారు, పెద్ద జియ్యర్ మఠం గారు, సన్నిధివీధిని ఆనుకుని ఉండే మరికొన్ని ఇతర మఠాలవారు, గొల్ల మండపాన్ని విశేషంగా అభిమానించే కొందరు గొల్ల కులస్తులు, తి.తి.దే. యాజమాన్యం తీర్మానాలకు వ్యతిరేకంగా న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ విధంగా తితిదేపై మొత్తం ఆరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి.

త్రిసభ్య మండలి

వెయ్యికాళ్ళ మంటపం తొలగింపు అంశం చిలికి చిలికి గాలివానగా మారి, వీధి ఆందోళనలకు, వాదోపవాదాలకు, చట్టపరమైన చిక్కులకు దారి తీయడంతో; ఈ వివాదాన్ని సానుకూలంగా పరిష్కరించడానికై, 2004వ సంవత్సరంలో ప్రభుత్వం ఒక త్రిసభ్య మండలిని ఏర్పాటు చేసింది. అందులో తిరుమల ఆలయ పాలనా వ్యవహారాలలో ప్రవేశం, విశేషానుభవం ఉన్న ముగ్గురు విశ్రాంత ఉన్నతాధికారులు సభ్యులుగా నియమించబడ్డారు. వెయ్యికాళ్ళ మంటపం యొక్క పుట్టు పూర్వోత్తరాలను వెలికితీసి, అది ఏ లక్ష్యంతో నిర్మించబడిందో ఇదమిత్థంగా తెలుసుకోవడం; ప్రభుత్వం ముందున్న మార్గాలను శాస్త్రీయంగా విశ్లేషించి, అందరికీ ఆమోదయోగ్యమైన, ఆగమశాస్త్ర విరుద్ధం కాని పరిష్కార మార్గాన్ని సూచించటం, మొదలైనవి ఈ కమిటీ పరిధిలోని అంశాలు. ఈ మండలికి పూర్తి సమాచారాన్ని అందించి, మండలి సభ్యులు తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించడంలో సహాయపడటం కోసం సాంకేతిక అంశాలలో ప్రావీణ్యం ఉన్న పురావస్తుశాఖ నిపుణులను, శిలాశాసనాలను పరిశీలించి విశ్లేషించడంలో ప్రావీణ్యం ఉన్న వారిని, సంగ్రహాలయం అధికారులను, సుప్రసిద్ధ స్థపతిని, ఆలయ భవనాల కాలనిర్ణయంలో నిష్ణాతులైన వారిని సభ్యులుగా చేర్చి మరో ఉప మండలి కూడా ఏర్పాటు చేయబడింది.

అభిప్రాయాలు – సిఫార్సులు

తమకు అప్పగించిన అంశాలన్నింటినీ కూలంకషంగా, సాంకేతిక నిపుణుల సహాయంతో పరిశీలించిన త్రిసభ్య కమిటీ సంచలనాత్మకమైన వివరాలతో కూడుకున్న నివేదికను సమర్పించింది. అంతవరకూ, దేవాలయానికి దేవదేయంగా సమర్పింప బడ్డ 'దుర్గసముద్రం' గ్రామం యొక్క వార్షికాదాయం తో నిర్మించినట్లుగా భావించబడే కట్టడం వెయ్యికాళ్ళ మంటపం కాదని; ఈ మండపం నిర్మించింది ఎవరో, ఏ లక్ష్యంతో నిర్మించారో నిర్దిష్టంగా విశదీకరించే శాసనాలు లభ్యం కాలేదని; ఒకప్పుడు ఇందులో నైవేద్యసమర్పణ వంటి వైదిక కార్యక్రమాలు చేపట్ట బడేవని చెప్పగలిగే ఆధారాలు లభించలేదని తేల్చిచెప్పింది.

అంతే గాకుండా, ఆ కమిటీ కొన్ని ముఖ్యమైన సిఫారసులు కూడా చేసింది

దేవాలయానికి ఎదురుగా, వెయ్యికాళ్ల మండపం తొలగించడం ద్వారా ఏర్పడిన విశాలమైన ఖాళీస్థలానికి చుట్టుప్రక్కల ఉన్న ఇతర ఖాళీస్థలాలను కూడా చేర్చి, ఆ ప్రదేశంలో వెయ్యికాళ్ళ మంటపం కంటే విశాలమైన మహా మండపం నిర్మించాలని; మంటపం మధ్యలో స్తంభాలు లేకుండా, అందులో జరగుతున్న కార్యక్రమాలను అందరూ తిలకించడానికి అనువుగా ఉండేటట్లు నిర్మాణం జరగాలని; కార్యక్రమాల నిర్వహణకు ఒక విశాలమైన మంచెను కూడా ఏర్పాటు చేయాలని; వెయ్యికాళ్ళ మండపంలో తొలగించిన శిలాస్తంభాలలో అత్యద్భుత శిల్పచాతుర్యం గల వాటిని వేరు చేసి, అటువంటి వాటిని ఆలయ పరిసర ప్రాంతాలలో కనీసం అలంకార ప్రాయంగానైనా అమర్చాలని అభిప్రాయపడింది. ఈ సూచనలను ప్రభుత్వం తి.తి.దే., ఇరువురూ యథాతథంగా ఆమోదించారు. దాంతో వివిధ న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న వ్యాజ్యాలు ఉపసంహరింప బడ్డాయి. ఆందోళనలు సద్దుమణిగాయి.

కొలిక్కి వచ్చేదెన్నడో ?

ఎన్నెన్నో కారణాల వల్ల ఆ సిఫార్సులు దశాబ్దాలు గడిచినా అమలుకు నోచుకోలేదు. తొలగించ బడిన శిలాస్తంభాలలో కొన్నింటిని తిరుమల లోని కొన్ని ప్రాంతాలు, కూడళ్ళలో అందంగా అమర్చారు. మిగిలిన వాటిని నారాయణగిరి ఉద్యానవనం లోనూ, గోగర్భం ఆనకట్ట పరిసర ప్రాంతాల్లోనూ భద్రపరిచారు. ఐదు శతాబ్దాల ఘనచరిత్ర కలిగిన మంటపం ఆగమేఘాల మీద పడగొట్టబడింది గానీ, దశాబ్దాలు గడిచినా, ప్రభుత్వాలు మారినా దాని పునర్నిర్మాణం మాత్రం ఇంకా ప్రారంభం కూడా కాలేదు. ఆ శుభఘడియ కోసం భక్తులందరు ఆతృతతో ఎదురు చూస్తున్నారు. నారాయణగిరి వనంలో దాన్ని తిరిగి నిర్మిస్తారని, త్వరలోనే నిర్మాణం ప్రారంభిస్తారని, టెండర్ల ప్రక్రియ మొదలైందని, దానికేవో అడ్డంకులు వచ్చాయని; ఇలాంటి వార్తలు అడపా దడపా ప్రసార మాధ్యమాల ద్వారా వస్తుంటాయి. ఈ విషయంలో తి.తి.దే. చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ, భక్తుల చిరకాల స్వప్నం సాకారమవ్వడానికి శ్రీవారి అనుగ్రహం కూడా తోడవ్వాలి కదా!

ఆ కరుణామయుని కటాక్షంతో అద్భుతమైన శిల్పచాతుర్యంగల వేయికాళ్ల మండపం అతి త్వరలోనే పునర్నిర్మించబడి, ఆనాటి శోభను తిరిగి సంతరించుకొని, భక్తజన రంజకంగా భాసిస్తుందని ఆశిద్దాం. పుట – 111 తేదీ – సెప్టెంబరు, 10

----------: : ----------

పద్మావతిదేవి పూర్వజన్మ వృత్తాంతం

శ్రీవేంకటేశ్వరుని కలియుగ అవతారంలో, వారితో పారివారిక సంబంధం ఉన్న వారిలో భార్య పద్మావతి దేవి, మామగారైన ఆకాశరాజు, వారి తమ్ముడు తొండమాన్ చక్రవర్తి మొదలగు వారు ప్రముఖులు. వీరిలో తొండమాన్ చక్రవర్తి మరియు ఆకాశరాజుల పూర్వ-ప్రస్తుత జన్మల విశేషాలను ముందే తెలుసుకున్నాం. ఇప్పుడు పద్మావతిదేవి పూర్వజన్మ వృత్తాంతాన్ని విశదీరించుకుందాం.

శ్రీమహావిష్ణువు యొక్క త్రేతాయుగపు అవతారమైన శ్రీరామచంద్రుడు తండ్రికిచ్చిన మాటకు కట్టుబడి, సీతాలక్ష్మణ సమేతుడై వనవాస దీక్షలో నున్నప్పుడు రావణాసురుడు తన మాయోపాయంతో సీతా మహాసాధ్విని అపహరించడం మనకు సుపరిచితమే.

అగ్నిదేవుని చతురనీతి

రావణుడు సీతమ్మను తోడ్కొని తన పుష్పకవిమానంలో దక్షిణదిశగా వెడలు తున్నప్పుడు దశరథ మహారాజుతో సన్నిహిత సంబంధం ఉన్న 'జటాయువు' అనే పక్షిరాజు, రావణుని చెర నుండి సీతను విడిపించడానికి విఫల ప్రయత్నం చేసి ఆ క్రూరాత్ముని చేతిలో విగతజీవిగా మారాడు. తదనంతరం, సీతాపహరణ సమాచారాన్ని తెలుసుకున్న శ్రీరామచంద్రుని పరమభక్తుడైన అగ్నిదేవుడు సీతను రక్షించడానికి వుద్యుక్తుడవుతాడు. అపరిమిత బలశాలి అయిన రావణుడితో తాను తలపడ లేనని, కామాంధుడైన రావణునికి హితవు పలికి లాభంలేదని గుర్తెరిగిన అగ్నిదేవుడు కపటోపాయంతో నైనా సరే రావణుని చెర నుంచి సీతను తప్పించ దలచాడు. మాన, ప్రాణ, విత్తభంగము లందు అనృత (అసత్యము) మాడటం శాస్త్రసమ్మతమేనని విశ్వసించిన అనలుడు (అగ్నిదేవుడు) వెనువెంటనే వాయువేగంతో బయల్వెడలి, రావణుని కెదురేగి ప్రస్తుతం రావణునితో పాటుగా నున్న స్త్రీమూర్తి శ్రీరామచంద్రుని ధర్మపత్ని సీత కాదని, శ్రీరాముడు అరణ్యవాస సమయంలో అసలైన సీతమ్మ తల్లిని తన సంరక్షణలో నుంచాడని, ఇప్పుడు రావణుని పుష్పకవిమానంలో సీతమ్మ రూపంలో ఉన్నది ఒక బ్రాహ్మణపత్ని అని నమ్మబలికాడు. అంతే గాకుండా అనునిత్యం పరమశివునితో పాటుగా తనను కూడా పూజించే రావణాసురుడంటే తనకు అపరిమితమైన ఆప్యాయతానురాగాలు ఉన్నాయని, రావణుడు వంచితుడవ్వడం తాను సహించలేనని, అందువలన తాను యథార్థం పలుకుతున్నానని అనునయంగా చెప్పాడు.

అగ్నిదేవుని ఆతిథ్యంలో అయోనిజ (సీతాదేవి)

రావణాసురునికి అగ్నిదేవుడంటే ఎనలేని భక్తిప్రపత్తులున్నాయి. మోహావేశంలో నిండా మునిగి ఉన్న రావణుడు అష్టదిక్పాలకులలో ఒకడు, సృష్టిలోని సకల కర్మలకు సాక్షీభూతంగా నిలిచే అగ్నిదేవుని మాటలను ఆసాంతం విశ్వసించి, అతనికి తన కృతజ్ఞతలనర్పించుకొని, తనవద్దనున్న అసలైన సీతను అగ్నిదేవునికప్పగించి, సీతాదేవి

రూపంలోనున్న వేదవతిని చేకొని లంకానగరానికి సాగిపోయాడు. ఆ వేదవతియే 'మాయాసీత' గా పిలువ బడుతుంది.

అలా ఒక ఏడాది సుదీర్ఘకాలం పాటు దానవేంద్రుడి చెరలో మగ్గి, అశోకవనంలో అష్టకష్టాలను అనుభవించినది సీతా వేషధారి అయిన సత్యవతి యన్నమాట.

ఇరువురు సీతలు...

తరువాత జరిగిన రామ రావణ సంగ్రామంలో రావణ సంహారానంతరం సీతాదేవిని స్వీకరించిన శ్రీరామచంద్రుడు ఆ మహాసాధ్వి పాతివ్రత్యాన్ని ముల్లోకాలకు చాటి చెప్పడం కోసం, ఆమెను అగ్నిపునీత కమ్మని ఆజ్ఞాపిస్తాడు. శ్రీరాముని ఆదేశానుసారం అయోనిజ అగ్నిప్రవేశ మొనర్చగా, అగ్నికీలల నుండి ఇరువురు సీతలు ప్రకటిత మవుతారు. ఒకరు అప్పటివరకు రావణుని చెరలో మగ్గిన వేదవతి కాగా, మరొకరు అగ్నిదేవుని సంరక్షణలో నున్న సీతాదేవి. ఒకింత ఆందోళనకు గురైన శ్రీరామచంద్రుడు అగ్ని దేవునిపై ప్రశ్నల పరంపర కురిపిస్తాడు. అంతట అగ్నిదేవుడు జరిగిన ఉదంతాన్నంతా విడమరిచి చెప్పాడు. అంతే గాకుండా, ఆ సంవత్సర కాలంలో సీతకు బదులుగా వేదవతే లంకానగరంలో కష్టనష్టాలు సహించిందని, సీతమ్మ వారి వలనే ఆమె కూడా అనుక్షణం శ్రీరామచంద్రుడే తన భర్తగా భావించిందని, అందువలన వేదవతిని కూడా సీతతో బాటుగా భార్యగా స్వీకరించటం శ్రీరామచంద్రుని ధర్మమని వేడుకుంటాడు.

వేదవతికి వరం

వేదవతి వ్యధాభరిత వృత్తాంతం విని ఆమె పట్ల కరుణాంతరంగుడైన శ్రీరామచంద్రుడు త్రేతాయుగంలో తాను ఏకపత్నీ వ్రతుడనని, కోసలరాజ్య పౌరులందరికీ ఆదర్శప్రాయంగా ఉండవలసిన తాను ద్వితీయకళత్రం స్వీకరించ లేనని తెలియ జెప్పాడు. అంతే గాకుండా తరువాత వచ్చే ద్వాపరయుగంలో తనకు పెక్కుమంది భార్యలుంటారని; తనకోసం, సీత కోసం ఎనలేని త్యాగమొనర్చిన వేదవతిని వారిలో ఒకరిగా స్వీకరించటానికి తన మనస్సాక్షి అంగీకరించదని, అందువల్ల, రాబోయే కలియుగంలో తాను వేంకటాచలం పై శ్రీనివాసునిగా అవతరించినప్పుడు వేదవతిని భార్యగా స్వీకరిస్తానని అభయమిస్తాడు.

ఆనాటి వేదవతే నేటి పద్మావతి

అలా శ్రీమహావిష్ణువు వరప్రభావం వల్ల ఆనాటి వేదవతి, ఈనాటి తిరుచానూరులోని పద్మసరోవరం వద్ద ఆకాశరాజుకు ఆడశిశువు రూపంలో, ఒక స్వర్ణకమలంలో లభించింది. పద్మంలో లభించిన నందువల్ల ఆమెకు పద్మావతిదేవిగా నామకరణం చేసిన ఆకాశరాజు, ధరణీదేవి దంపతులు ఆమెను శ్రీనివాసునికిచ్చి వివాహ మొనర్చారు. త్రేతాయుగం నాటి శ్రీరామచంద్రుడే కలియుగపు శ్రీవేంకటేశ్వరుడన్నది చర్విత చరణమే.

పద్మావతి–శ్రీనివాసుల పరిణయ వృత్తాంతాన్ని మనం ఇంతకుముందే చెప్పుకున్నాం. ఆ పద్మసరోవరాన్ని, దానికి ఎదురుగా నున్న సూర్యనారాయణుడి దేవాలయాన్ని ఈనాడు కూడా తిరుచానూరు లోని పద్మావతి అమ్మవారి ఆలయ

సమీపంలో చూసి తరించవచ్చు.

వేదవతి ఎవరు?

పద్మావతిదేవి పూర్వజన్మ వృత్తాంతాన్ని తెలుసుకున్న తరువాత సహజంగానే ఈ ప్రశ్న మన మదిలో ఉత్పన్నమవుతుంది. దానికి కూడా ఒక ఆసక్తి కరమైన పౌరాణిక గాథ ఉంది. త్రేతాయుగంలో శ్రీమహావిష్ణువు యొక్క పరమ భక్తుడు, నిష్ఠాగరిష్టుడు అయిన 'మయుడు' అనే సద్బ్రాహ్మణుడు ఎల్లవేళలా వేదాధ్యయనంలో మునిగి ఉండేవాడు. సంధ్యానుష్ఠానాలు ఆచరించే నిమిత్తం ఒకానొకప్పుడు ఆ విప్రుడు సమీపంలోని ఒక సరస్సుకు వేంచేయగా, అందులో జలకా లాడుతున్న ఒక గంధర్వ స్త్రీని కాంచటంతో అతనికి కామవాంఛ కలుగుతుంది. తద్వారా ఆ బ్రాహ్మణుని వీర్యస్ఖలనం నుండి ఒక ఆడశిశువు ఉదయించింది. పుత్రికోత్సాహంతో పొంగిపోయిన ఆ బ్రాహ్మణుడు ఆ శిశువును అత్యంత గారాబంగా పెంచి పెద్ద చేసి, విద్యాబుద్ధులు నేర్పించాడు. వేదవిద్యా పారంగతుడయిన తండ్రి శిక్షణలో ఆ బాలిక కూడా చిరుప్రాయం లోనే వేదాల నన్నింటినీ అవపోసన పట్టింది. అందువల్ల తండ్రి ఆమెను 'వేదవతి' గా పిలువసాగాడు.

తండ్రి యొక్క భగవద్భక్తిని కూడా పుణికి పుచ్చుకున్న వేదవతి అనునిత్యం శ్రీమన్నారాయణుని కొలుస్తూ, వారినే తన పతిగా పొందాలని సంకల్పించుకుంది. అయితే, విధివశాత్తు ఒకానొక అసురుడు ఆమెను తనకిచ్చి వివాహం చేయవలసిందిగా వేదవతి తండ్రిపై ఒత్తిడి చేయసాగాడు. తన తపశ్శక్తితో ఆ రాక్షసుని భస్మీపటలం కావించిన వేదవతి శ్రీమహావిష్ణువును భర్తగా పొందటానికి ఘోరమైన తపస్సు నాచరించింది.

అప్పుడు కూడా ఆమెకు కాలం కలసి రాలేదు. అద్వితీయమైన ఆమె సౌందర్యానికి సమ్మోహితుడైన రావణాసురుడు వేదవతి తపస్సును భగ్నం చేసి, తనను పెళ్లాడ వలసిందిగా నిర్బంధించాడు. కృద్ధురాలైన ఆ మహాతపస్విని రావణాసురుని శపించి, తన భర్త అయిన శ్రీమన్నారాయణుని చేతిలో రావణాసురుడు అంత మవుతాడని శాపవాక్కులు పలికి, ఆత్మ సంరక్షణార్థం అగ్నిప్రవేశం చేసింది. కానీ ఆమె తపశ్శక్తి కారణంగా అగ్నిదేవుడు ఆమెను దహించకుండా తన సంరక్షణలో నుంచుకొని, ఆమె మనోగతాన్ని ఎరిగిన వాడై, ఆమెను శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీరామచంద్రుని చెంతకు చేర్చే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు.

సరిగ్గా ఆ సమయం లోనే సీతా మహాసాధ్వి అపహరణకు గురి కావడంతో అగ్నిదేవుడు అదే అదనుగా భావించి, సీతకూ, వేదవతికీ ఉభయతారకంగా ఉండే ప్రణాళికను సిద్ధం చేశాడు. అందులో భాగం గానే, పైన చెప్పుకున్నట్లు సీతమ్మను అపహరించి లంకానగరానికి తోడ్కొని పోతున్న రావణుని ఏమార్చి, వేదవతిని సీతగా భ్రమింపజేసి, అసలైన సీతను రావణుని చెర నుండి విడిపించాడు.

ఆ విధంగా, అయోనిజగా జన్మించిన 'వేదవతి' శ్రీమహావిష్ణువునే తన సర్వస్వంగా భావించుకుంటూ, త్రేతాయుగంలో 'మాయాసీత' పాత్రను పోషించి, శ్రీహరిని భర్తగా పొందడం కోసం త్రేతాయుగ శేషభాగం మరియు ద్వాపరయుగ మంతా వేచియుండి, కలియుగంలో పద్మావతి రూపంలో మరలా అయోనిజగా జన్మించి, శ్రీవేంకటేశ్వరుణ్ణి భర్తగా

పొంది ముల్లోకాలలో పూజల నందుకుంటోంది.

శిలాతోరణం

తిరుమల క్షేత్రంలో శ్రీమహావిష్ణువుతో ప్రగాఢ అనుబంధం ఉన్న పౌరాణిక అవశేషాలలో ముఖ్యమైనది 'శిలాతోరణం'. దీనినొక భౌగోళిక అద్భుతంగా కూడా పరిగణించవచ్చు.

ప్రధానాలయానికి ఉత్తరదిశగా, వేదపాఠశాలకు నెలవై ఉన్న 'ధర్మగిరి' అనే ప్రాంతానికి వెళ్ళే మార్గంలో తిరుమల లోని ముఖ్యమైన తీర్థాలలో ఒకటైన 'చక్రతీర్థం' ఉందని ఇంతకు మునుపే తెలుసుకున్నాం. దీనికి అత్యంత సమీపంలో 'ఈ 'శిలాతోరణం' ప్రకృతిసిద్ధంగా ఏర్పడింది. ఇక్కడ చూడ చక్కనైన ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసి, ఆ ప్రాంతాన్ని 'శిలాతోరణం ఉద్యానవన సముదాయం' పేరుతో ప్రముఖ పర్యాటక స్థలంగా తీర్చిదిద్దారు.

1980 వ సంవత్సరంలో ఈ ప్రదేశంలో త్రవ్వకాలు జరుపు తున్నప్పుడు అప్పటివరకు రాతి పొరల్లో నిక్షిప్తమై ఉన్న ఈ 'శిలాతోరణం' వెలుగు చూసింది. తరువాతి కాలంలో ఇది జాతీయ స్మారకచిహ్నంగా గుర్తించ బడింది. దీనిని కోట్లాది సంవత్సరాల క్రితంనాటి ప్రోటోజాయిక్ కాలానికి చెందిన భౌగోళిక అవశేషంగా భూగర్భ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అంతే గాకుండా ఆ సమయంలో ఈ ప్రాంతంలో ఉన్న బండరాతి శిలలు అతి తీవ్రమైన నీటికోతకు గురవ్వడంతో ఈ ఆకార మేర్పడినట్లు కూడా శాస్త్రవేత్తలు నిర్ధారించారు. మనం అప్పుడప్పుడు వినేటట్లు యుగాంతంలో సమున్నతమైన శేషాచలశిఖరాలు సైతం సాగరగర్భంలో మునిగి పోతాయన్న సత్యాన్ని శిలాతోరణం ఉనికి మరియు దాని ఆవిర్భావం నిర్ధారిస్తున్నాయన్న మాట.

భౌగోళిక, నైసర్గిక పరిణామ క్రమాల్ని అలా ఉంచితే, దీనికి విశేషమైన పౌరాణిక ప్రాశస్త్యం కూడా ఉంది. శ్రీమహావిష్ణువు శ్రీమహాలక్ష్మి జాడకోసం ప్రప్రథమంగా వైకుంఠం నుండి భూలోకానికి వేంచేసినప్పుడు తన మొదటి అడుగును నారాయణగిరి పర్వతశిఖరంపై, నేడు 'శ్రీవారి పాదాలు'గా చెప్పుకునే ప్రాంతంలో మోపాడని ఇంతకుముందే తెలుసుకున్నాం. అక్కడి నుండి ఈ 'శిలాతోరణం' ద్వారా వెళ్ళి, ఇప్పుడు ఆనందనిలయం ఉన్న ప్రాంతానికి చేరుకున్నాడని భక్తుల విశ్వాసం. మూలవిరాట్టు ఎత్తు మరియు శిలాతోరణం ఎత్తు కూడా ఇంచుమించు సరిసమానంగా ఉండటం ఈ నమ్మకాన్ని ధృవపరుస్తుంది.

శ్రీనివాసుడు ఈ ప్రాంతంలో రెండవ అడుగును, ఇప్పుడు మూలవిరాట్టు కొలువై ఉన్న ప్రాంతంలో మూడవ అడుగును మోపాడని కూడా మరి కొందరు భావిస్తారు.

ఈ శిలాతోరణంపై స్వామివారి ఆయుధాలైన శంఖువు, సుదర్శనచక్రం, కటి-వరదహస్తాలు, స్వామివారికి అత్యంత ఆప్తుడు మరియు వాహనము అయిన గరుత్మంతుని రూపం మొదలైనవి సహజసిద్ధంగా ఏర్పడి ఉండటంతో ఈ శిలాతోరణానికి, శ్రీవారికి అనుబంధం ఉన్నదనే విశ్వాసం మరింత బలోపేత మవుతుంది.

ఇన్ని విశేషాల సమాహారమైన 'శిలాతోరణం' తిరుమలక్షేత్రంలో తప్పనిసరిగా చూడవలసిన యాత్రాస్థలమనడంలో అతిశయోక్తి లేదు. పుట – 112 తేదీ – అక్టోబరు, 25

ద్వాదశ ఆళ్వారులు

విష్ణుభక్తిలోలీనమై, శ్రీవేంకటేశ్వరునితోసహా శ్రీమహావిష్ణువుయొక్క అవతారవిశేషాలన్నింటినీ పద్యరూపంలో వర్ణించి, భావితరాలకందజేసి, తాము తరించి భక్తజనులను తరింపజేసిన పన్నెండుమంది ఆళ్వారుల దివ్యచరిత్రలను తెలుసుకుందాం.

ఆళ్వారులంటే?

'ఆళ్వారులు' అనే తమిళ పదానికి 'విష్ణుభక్తిలో సంపూర్ణంగా మునిగినవారు' అనే సమానార్థం ఉంది. వీరు నిరంతరం హరినామస్మరణలో లీనమై సార్థక నామధేయు లయ్యారు. అదే విధంగా, 'ఆళ్వారులు' అనే పదానికి 'రక్షించేవారు' లేదా 'కాపాడేవారు' అనే మరో అర్థం కూడా ఉంది. ఈ దివ్యపురుషులు మనలో విష్ణుచింతనను వ్యాప్తి చేసి మనలను అరిషడ్వర్గాల నుండి రక్షించడం ద్వారా ఈ నామాంతరానికి కూడా సార్థకత చేకూర్చారు. ఈ పదానికి 'విజ్ఞాన నిక్షిప్తం' అనే వేరొక అర్థం కూడా ఉంది. విష్ణుభక్తిని పెంపొందించి జనులలో జ్ఞానతృష్ణను రగిలింప జేయడం ద్వారా వీరు విజ్ఞానఖను లయ్యారు. వీరందరినీ సామూహికంగా 'ద్వాదశ సూరులు' గా వ్యవహరిస్తారు. అంటే పన్నెండు మంది ఆళ్వారులూ, పన్నెండు సూర్యులతో సమానమన్నమాట. సూర్యనారాయణుని వలె వీరు కూడా శ్రీమహావిష్ణువుకు పరమ భక్తులవ్వడం వల్లనూ; సూర్యుని వలె విజ్ఞానకాంతులతో, భక్తిభావమనే దివ్యతేజస్సుతో తేజరిల్లడం వల్లనూ వీరు 'ద్వాదశ సూరులు' గా వ్యవహరింప బడుతున్నారు.

ఆళ్వారుల ఆవిర్భావం

ఆళ్వారులందరూ కారణజన్ములే..

శ్రీమహావిష్ణువు సంకల్పం తోనే వీరందరూ భూమిపై జన్మించారు. ఒకానొకప్పుడు మానవులు శ్రీమహావిష్ణువు ద్వారా ఒసంగబడిన కర్మేంద్రియాలను, జ్ఞానేంద్రియాలను శ్రీహరిసేవకు, హరినామస్మరణకు ఉపయోగించకుండా; వాటిని ఐహికమైన భోగభాగ్యాల సాధనకూ వినియోగిస్తూ ప్రాపంచిక సుఖాలకై వెంపర్లాడసాగారు. ఈ విషయంపై కలత చెందిన శ్రీమహావిష్ణువు భూలోకవాసులను సన్మార్గం లోనికి మళ్ళించే నిమిత్తం తిరుమల, శ్రీరంగం, కంచి ఆదిగా గల 108 దివ్య వైష్ణవక్షేత్రాలలో స్వయంగా వెలశాడు. అదే విధంగా తన భక్తితత్వాన్ని ప్రజలలో వ్యాపింపజేసి వారికి ముక్తిమార్గాన్ని ప్రసాదింప జేయడానికై తన పాంచజన్యశంఖాన్ని, సుదర్శనచక్రాన్ని, శ్రీవత్సచిహ్నాన్ని, కౌస్తుభమణిని, పరివారదేవతలను ద్రావిడదేశంలో సిద్ధపురుషులుగా వెలయింప జేశాడు. ఆ విధంగా శ్రీమహావిష్ణువు అంశతో భువిపై, ద్రావిడదేశంలో ఉద్భవించిన వారే ఆళ్వారులు. ద్రావిడదేశమనగా ఇంచుమించుగా ఈనాటి 'తమిళనాడు' రాష్ట్రమున్న ప్రాంతమన్నమాట.

అందరూ ద్రావిడదేశం లోనే ఎందుకు జన్మించారు ?

ఇది కేవలం కాకతాళీయమో, యాదృచ్ఛికమో కాదు. శ్రీహరి చిత్తసంకల్పం తోనే ఇలా జరిగింది. దానికి సంబంధించి, అత్యంతాసక్తికరమైన పౌరాణిక కథనం ఇలా ఉంది:

ఒకానొకప్పుడు వేదభూమియైన భరతఖండానికి ఉత్తరదిక్కున ఉన్న హిమవత్పర్వత సానువుల్లోని కైలాసగిరిపై, ఆదిదంపతులైన శివపార్వతుల కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. నభూతో నభవిష్యతి అన్న చందంగా జరిగిన ఆ వివాహ మహోత్సవాన్ని తిలకించటానికై దేవ, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుషులతో పాటుగా సమస్త మానవాళి కైలాసగిరి కేతెంచారు. అంతటి జనసందోహం ఒకే దిక్కున కేంద్రీకృత మవ్వడంతో భూమాత సంతులనాన్ని కోల్పోయి ఉత్తరదిక్కుకు ఒరగడం ప్రారంభించింది. ఆ ఉత్పాతం ఒక మహాప్రళయానికి నాందిగా భావించిన ఆహ్వానితు లందరూ అపరిమితమైన ఆందోళనకు గురయ్యారు. రానున్న ప్రమాదాన్ని తృటిలో పసిగట్టిన, కుశాగ్రబుద్ధి కలిగిన, దేవతల శిల్పి 'విశ్వకర్మ' తరుణోపాయాన్ని సూచించాడు. వివాహానికి విచ్చేసిన అగస్త్యమహర్షి తన అపరిమితమైన తపోబలం వల్ల, ఆహ్వానితులందరి మొత్తం భారంలో సగభాగం కలిగి ఉంటాడని, ఆ మహాతపస్వి వివాహమంటపం నుండి వెడలి దక్షిణదిక్కుకు తరలిపోతే ధరాతలం తన సంతులనాన్ని తిరిగి పొందుతుందని పలికాడు. దాంతో, శివపార్వతుల కళ్యాణాన్ని కన్నులారా తిలకించే మహద్భాగ్యాన్ని కోల్పోబోవడం ద్వారా తీవ్రమైన మనస్తాపానికి, నిరుత్సాహానికి గురైన అగస్త్యమహర్షి తన ఈప్సితానికి (కోర్కెకు) భంగం కలిగించిన విశ్వకర్మను క్షణికావేశంలో శపిస్తాడు. నిస్వార్థబుద్ధితో, లోకకళ్యాణార్థం తరుణోపాయాన్ని సూచించిన, మహిమాన్వితుడైన విశ్వకర్మ కూడా అగస్త్యునికి ప్రతిశాపం ఇస్తాడు. దాని ననుసరించి అగస్త్యమునిచే సృష్టించబడి; అప్పటివరకూ దైవ, పండితభాషగా వెలుగొందుతూ, సకల సాహిత్యాలకూ కాణాచిగా ఉన్న 'ద్రావిడభాష' తిరోగమనం పాలైంది.

బ్రహ్మాది దేవతల వినతి మేరకు మహాప్రళయాన్ని నివారించడానికై, అగస్త్యమహర్షి తన అర్ధాంగి లోపాముద్రా సమేతుడై కైలాసపర్వతాన్నుండి వెనుదిరిగి దక్షిణాన స్వర్ణముఖి నదీ తటాన ఉన్న తన స్వస్థలానికి తిరిగి వస్తాడు. తరువాతి కాలంలో అగస్త్యుడు పద్మావతీ పరిణయానంతరం నూతన దంపతులైన పద్మావతీ, శ్రీనివాసులకు ఆరుమాసాల పాటు, ఇప్పుడు సువర్ణముఖి నది ఒడ్డున 'ముక్కోటి' గా విలసిల్లుతున్న తన ఆశ్రమంలో, విడిది ఏర్పాటు చేయడం మనం ఇంతకుముందే తెలుసుకున్నాం.

ముని వెనుదిరగడంతో భూమాతకు ఏర్పడిన సంక్షోభం తొలగి పోయింది గానీ, విశ్వకర్మ శాపఫలితంగా అప్పటివరకూ అప్రతిహతంగా చలామణిలో ఉన్న ద్రావిడభాష మాత్రం తన ప్రాభవాన్ని సమూలంగా కోల్పోయింది. కేవలం పామరులు, పిశాచగణాలు ఉపయోగించుకునే భాషావశేషంగా మిగిలిపోయింది. తన మానసపుత్రిక యైన 'ద్రావిడభాష' కు పట్టిన దుస్థితికి తీవ్రంగా కలత చెందిన అగస్త్యముని అనితర సాధ్యమైన తపమాచరించి, ఆ భాషను పునరుద్ధరింప జేయవలసిందిగా శ్రీమహావిష్ణువును అభ్యర్థించాడు. లోకకళ్యాణార్థం అగస్త్యుని కోర్కెను మన్నించిన శ్రీమహావిష్ణువు ద్రావిడభాషకు పూర్వవైభవాన్ని సంతరింప జేయడానికై పూనుకున్నాడు. తదనుగుణంగా శ్రీహరి ఆదేశానుసారం వారి ఆయుధాలు, ఆభరణాలు, పరివార సదస్యులు వీరంతా ద్రావిడదేశంలో దివ్యపురుషులైన

ఆళ్వారులుగా జన్మించి, శ్రీహరిని స్తుతిస్తూ వేలాది కీర్తనలు, పెక్కు గ్రంథాలు ద్రావిడభాషలో రచించి, వాటికి పండిత పామరులలో విశేషంగా ప్రాచుర్యం కల్పించి ఆ భాషకు తిరిగి ఔన్నత్యాన్ని కల్పించారు. తద్వారా మృతభాషగా నున్న ద్రావిడభాష పునరుజ్జీవం పోసుకొని, అగస్త్యుని చిరకాల స్వప్నం సాకారమైంది. ఆ విధంగా ఆళ్వారులందరూ ద్రావిడదేశం లోనే జన్మించడం, ద్రావిడభాష లోనే తమ సాహితీ సాధనను కొనసాగించడం శ్రీహరి ఆదేశం మేరకే జరిగిందన్న మాట.

నాలాయిర దివ్యప్రబంధం

ఆళ్వారులందరూ శ్రీహరిని, శ్రీవేంకటేశ్వరుణ్ణి స్తుతిస్తూ రచించిన కీర్తనలనూ, పాశురాలనూ తరువాతి కాలంలో సేకరించి ఈనాడు తమిళులకూ, శ్రీవైష్ణవులకూ, వైష్ణవభక్తులందరికీ పరమ పూజనీయమైన 'నాలాయిర దివ్యప్రబంధం' అనే పాశురాల సంకలనం వెలువరించ బడింది. ఈ సంకలనంలో, ఇరవైనాలుగు ప్రబంధాల యందు పొందు పరచబడి యున్న నాలుగు వేల పాశురాలలో కొన్నింటిని నేటికీ వైష్ణవక్షేత్రాలన్నింటిలో నిత్యమూ పఠిస్తారు. ఈ నాలుగు వేల పాశురాల లోని 206 పాశురాలలో శ్రీవేంకటేశ్వరుడు కీర్తించబడ్డాడు. 'నాలాయిర' అనే తమిళపదానికి 'నాలుగు వేలు' అని అర్థం. అలాగే, 'పాశురం' అంటే 'పద్యము' లేదా 'శ్లోకము'; తీయని స్వరం అనే అర్థాలున్నాయి. ధనుర్మాసంలో వైష్ణవాలయాలన్నింటిలో పఠించే, మనకు సుపరిచితమైన, ముప్పై పాశురాల సమాహారం 'తిరుప్పావై' నాలాయిర దివ్యప్రబంధంలో అంతర్భాగమే..

ఈ పాశురాలకు విశేషమైన పౌరాణిక ప్రాధాన్యతతో పాటుగా, చారిత్రక ప్రాశస్త్యం కూడా ఉంది. వీరి రచనల ద్వారా తిరుమలకు, శ్రీరంగానికి, కాంచీపురానికి, మరెన్నో వైష్ణవ క్షేత్రాలకు సంబంధించిన చారిత్రకాంశాలు సైతం వెలుగు చూశాయి. 'నాథముని' అనే విష్ణుభక్తుడు ఈ దివ్యప్రబంధాన్ని పండితపామరు లందరూ రాగయుక్తంగా పాడుకునే వీలుగా రాగాన్ని, తాళాన్ని సమకూర్చి తరించాడు.

పుట్టు పూర్వోత్తరాలు

ఆళ్వారులందరూ తమిళదేశం లోనే జన్మించినప్పటికీ, వీరందరూ సమకాలికులు కాదు. వీరి జీవితకాలం గురించి చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వీరు మూడవ శతాబ్ది నుండి తొమ్మిదవ శతాబ్దానికి చెందినవారని కొందరు అభిప్రాయ పడతారు. కాగా వీరు ఏడు నుండి తొమ్మిది శతాబ్దాల కాలంలో జీవించియున్నారని చాలామంది చరిత్రకారులు భావిస్తారు. అలాగే, వీరి సంఖ్య 'పన్నెండు' అనే విషయంలో స్థూలంగా ఏకాభిప్రాయ మున్నప్పటికీ, ఈ పన్నెండు మంది 'ఎవరెవరు?' అనే విషయంలో స్వల్పంగా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

ఈ ఆళ్వారులందరూ జన్మతః శ్రీవైష్ణవులు కాదు. వీరు శ్రీవైష్ణవ సంజాతుల నుండి అంత్యజుల వరకూ; సుక్షత్రియుల నుండి చోరాగ్రేసరుల వరకూ; అలాగే పుట్టుక తోనే విష్ణుభక్తిలో తల్లీనమైన వారినుండి వేశ్యాలోలత్వానికి గురియైన వారి వరకూ; ఇలా భిన్నమైన నేపథ్యాలు కలిగినవారు. కానీ, వీరందరినీ ఏకసూత్రంలో బంధించే విశేషమైన సారూప్యతలు కూడా అనేకం ఉన్నాయి. వీరందరూ శ్రీమహావిష్ణువును సాక్షాత్కరింప జేసుకున్నవారే!

శ్రీవేంకటేశ్వరుని శ్రీమహావిష్ణువు కలియుగావతారంగా భావించి, తిరుమలేశుని తమ పాశురాలతో కీర్తించి తరించినవారే!

పుట్టుకతో సంబంధం లేకుండా వీరందరూ శ్రీహరిని సేవించుకుని, శ్రీవేంకటేశ్వరుని భక్తితత్వాన్ని విశేషంగా వ్యాప్తిచేసి ఆనాడు సమాజంలో విస్తృతంగా వ్రేళ్ళూనికుని ఉన్న కులవ్యవస్థకు, వర్ణాశ్రమధర్మాలకు పెను సవాలు విసిరి; ముక్తిమార్గాన్ని పొందడానికి కులం, పుట్టుకలతో సంబంధం లేదని, హరినామస్మరణతో, నిరంతర సాధనతో మోక్షాన్ని పొందవచ్చని నిరూపించారు.

జన్మ రీత్యా విభిన్నమైన నేపథ్యాలు, జీవనగమనం రీత్యా పరస్పర విరుద్ధమైన దృక్పథాలు కలిగిన ఆళ్వారులందరూ తరువాతి కాలాలలో శ్రీవైష్ణవులకు తప్పనిరియైన 'పంచ సంస్కారాలను' స్వీకరించి, శ్రీవైష్ణవులుగా పునర్జన్మ నొంది, శేషజీవితాన్ని శ్రీహరికి సమర్పించుకొని, తమ సంకీర్తనామృతంలో భక్తజనులను పరవశింప జేశారు. పుట – 113 తేదీ – అక్టోబరు, 26

పంచసంస్కారాలు

ఏ జాతికి చెందిన వారైనా సరే, చివరికి వైష్ణవుడైనా పంచసంస్కారాలుగా పిలువబడే ఈ క్రింద తెలుపబడిన ఐదు వైదిక ప్రక్రియలను చిత్తశుద్ధిగా చేపడితేనే 'శ్రీవైష్ణవు' డవుతాడు.

- *తాప సంస్కారము*: అగ్నికుండములో వేడి చేయబడ్డ లోహపు అచ్చులతో కుడి, ఎడమ భుజాలపై శంఖు, శంఖ చిహ్నాలను ముద్రించుకోవడమే తాప సంస్కారము. పాంచజన్య శంఖము, సుదర్శన చక్రము శ్రీమహావిష్ణువు యొక్క శక్తివంతమైన ఆయుధాలు. ఈ చిహ్నాలను భుజాలపై ముద్రించుకోవడం ద్వారా శ్రీవైష్ణవుడు సర్వశక్తి సంపన్నుడై, అరిషడ్వార్గాలపై విజయం సాధించుతాడన్న మాట.
- *పుండ్ర సంస్కారము*: ప్రతి ఉదయము స్నానాంతరం తిరునామాన్ని శరీరాంగాలపై అలంకరించు కొనడాన్ని పుండ్ర సంస్కారంగా వ్యవహరిస్తారు. ద్వాదశపుండ్ర ధారులంటే ఫాలభాగం, ఉదరం, భుజాలు, హస్తాలు మొదలుగా గల పన్నెండు శరీరభాగాలపై తిరునామాన్ని అలంకరించుకునే వారు. ఊర్ధ్వపుండ్రాన్ని అలంకరించుకుని మాత్రమే శ్రీవైష్ణవులు విష్ణుకైంకర్యం చేయగలరు. శ్రీవేంకటేశ్వరునితో పాటుగా జయవిజయులు, గరుత్మంతుడు, విష్వక్సేనుడు సైతం ఎల్లవేళలా తిరునామాన్ని ధరించే దర్శనమిస్తారు. దాదాపు అన్ని వైష్ణవాలయాలలో గర్భాలయ ద్వారం ముందున్న ఆళ్వారుల మూర్తులు సైతం ఊర్ధ్వపుండ్ర ధారణతో నయనానందాన్ని కలిగిస్తాయి. ఊర్ధ్వపుండ్రాలంకారణలో ఉండే స్వల్పమార్పుల ద్వారా శ్రీవైష్ణవులలో ఎవరు ఏ తెగకు చెందినవారో గ్రహించవచ్చు.
- *నామ సంస్కారము*: జన్మించినపుడు తల్లిదండ్రులచే నామకరణం చేయబడ్డ పేరుకు 'రామనుజ దాసుడు' అనే పదబంధాన్ని చేర్చడమే 'నామ సంస్కారము'. 'రామానుజుడు' అంటే శ్రీరామునికి తమ్ముడైన లక్ష్మణుడు. శ్రీమహావిష్ణువుకు శయ్యలా, తల్పంలా, పాన్పుగా సతతం సేవలందించే ఆదిశేషుడే త్రేతాయుగంలో లక్ష్మణుని గాను, కలియుగంలో శ్రీమద్రామానుజాచార్యులు గాను జన్మించారని ప్రతీతి. ఆయా కాలాలలో వారు శ్రీమహావిష్ణువుకు, వారి అవతారాలకు సేవందించినట్లే; శ్రీవైష్ణవులు సైతం శ్రీవేంకటేశ్వరునికి,

శ్రీరంగనాథునికి, శ్రీవరదరాజస్వామికి అంకితభావంతో సేవలందించడానికై సిద్ధంగా ఉంటారన్నమాట. 'దాసుడు' అనే పదం మహోత్కృష్టమైన దాసభక్తికి సంకేతం. గరుత్మంతుడు, ఆంజనేయుడు దాస్యభక్తితో తరించిన విషయం మనకు విదితమే!

- *మంత్ర సంస్కారము*: సదాచార సంపన్నుడైన సద్గురువు ద్వారా శ్రీమన్నారాయణ మంత్రోపదేశాన్ని పొంది, ఎల్లవేళలా అష్టాక్షరీ మంత్రాదులను పఠించడమే మంత్ర సంస్కారము. మంత్రపఠనం ద్వారా వాక్శుద్ధి, వాక్సిద్ధి కలిగుతుందని, శ్రీమన్నారాయణునికి శ్రీవైష్ణవుడు మరింత చేరువవుతాడని ప్రతీతి. మంత్రస్మరణ ద్వారా భగవంతుణ్ణి అనేక నామాలతో ప్రస్తుతిస్తూ, శ్రీవైష్ణవులు వారితో సంబంధ బాంధవ్యాలను బలోపేతం చేసుకుంటారు.
- *యాగ సంస్కారము*: వైదికవిధుల ననుసరించి, క్రమం తప్పకుండా దేవతార్చన జరపడమే యాగ సంస్కారము. దేవతార్చన ద్వారా అంతఃకరణం శుద్ధి గావింప బడి; మాలిన్య రహితమైన, చిత్తచాంచల్యం లేని మనసును శ్రీవైష్ణవుడు దేవుని కర్పించుకో గలుగుతాడు. కలియుగంలో, అర్చారూపంలో నున్న పరమాత్మపై విస్తారమైన వైదిక ప్రక్రియల ద్వారా మనసును లగ్నం చేసుకో గలగడమే యాగ సంస్కారం లోని పరమార్థం.

స్థూలంగా చెప్పాలంటే శ్రీవైష్ణవుని మదిలో దేవునిపై ఉండే భక్తిభావనను, శరణాగతిని బాహ్యప్రక్రియల ద్వారా వ్యక్తీకరించడమే 'పంచ సంస్కారాల' పరమార్థం.

తితిదే కృషి శ్లాఘనీయం!

ఆళ్వారుల చరిత్రను, వారి భక్తి తత్వాన్ని జనబాహుళ్యం లోనికి తీసుకు రావడం కోసం తితిదే అవిరళ కృషి జరుపుతోంది. ఆళ్వారులను స్మరించుకొనే సందర్భంలో తితిదే కొనసాగిస్తున్న అమోఘమైన కృషిని కూడా ఉటంకించు కోవలసిందే!

పన్నెండు మంది ఆళ్వారుల నిలువెత్తు నల్లరాతి విగ్రహాలను ముగ్ధమనోహరంగా చెక్కించి, వాటిని అలిపిరి నడకమార్గంలో మోకాళ్ళపర్వతం నుండి తిరుమల కొండ పైభాగం వరకు, మెట్లమార్గానికి ఇరుప్రక్కలా ప్రతిష్ఠింప జేశారు. ఆయా ఆళ్వారుల సంక్షిప్త చరిత్ర కూడా విగ్రహాల వద్ద ప్రదర్శింప బడింది. దీనివల్ల నడకదారి భక్తులకు మార్గాయాసం నుండి కొంత ఉపశమనం లభించడంతో బాటుగా, ఆళ్వారుల చరిత్ర అవగతమై వారి పట్ల జిజ్ఞాస రేకెత్తుతుంది. ఈసారి అలిపిరి మార్గం ద్వారా తిరుమల చేరుకునే టప్పుడు ఈ విగ్రహాలను తప్పని సరిగా దర్శించుకుందాం.

తిరుమల లోని శ్రీవేంకటేశ్వర వస్తు సంగ్రహాలయం (మ్యూజియం) లోని ఒక ప్రత్యేక ప్రదర్శన విభాగం (గ్యాలరీ) లో ఆళ్వారుల పంచలోహ విగ్రహాలను చూడచక్కనైన రీతిలో అమర్చారు. మిగిలిన వైష్ణవాలయా లన్నింటిలో గర్భాలయం ముందున్న ముఖమండపంలో ఆళ్వారులు కొలువై ఉంటారు. కారణాంతరాల వల్ల ఆనందనిలయంలో ఆళ్వారుల మూర్తులు లేని లోటును ఈ ప్రదర్శనశాల లోని పంచలోహ విగ్రహాలు కొంత వరకూ భర్తీ చేస్తాయి. అలాగే, తిరుపతి పట్టణం నడిమధ్యన, గోవిందరాజస్వామి ఆలయం ప్రక్కన ఉన్న పురావస్తు ప్రదర్శన శాలలో కూడా

ఆళ్వారుల సంక్షిప్త చరిత్రను ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం సందర్శకుల ఆదరణకు అంతగా నోచుకోని ఈ ప్రదర్శనశాల హైందవ వారసత్వ సంపదకు భాండాగారం. తిరుపతిలో తప్పనిసరిగా చూడవలసిన ప్రదేశాలలో ఇది కూడా ఒకటి.

ప్రతినిత్యం జరిగే సుప్రభాతసేవలో, ధనుర్మాసంలో మాత్రం సుప్రభాత పఠనానికి బదులుగా నాలాయిర ప్రబంధంలో భాగమైన, గోదాదేవి విరచిత, ముప్పై పాశురాల సంకలనమైన 'తిరుప్పావై' పఠనం జరుగుతుంది. ధనుర్మాసంలో తితిదేకు అనుబంధంగా ఉన్న దాదాపు అన్ని ప్రధానాలయాలలో 'తిరుప్పావై' పారాయణం జరుగుతుంది.

తిరుమల క్షేత్రంలో అనునిత్యం జరిగే అనేక సేవలలో, అతివిశిష్టమైన 'శాత్తుమొరై' సేవలో కూడా నాలాయిర ప్రబంధం లోని పాశురాలు పఠించ బడుతాయి. ఈ సేవను గురించి మరోసారి వివరంగా ముచ్చటించుకుందాం.

ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు

ఆళ్వారుల భక్తితత్వాన్ని ప్రజలకు చేరువ చేయడం కోసం తితిదే చేస్తున్న కృషిలో ప్రముఖంగా చెప్పుకో తగ్గది ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు. తెలుగు వారికోసం అన్నమాచార్య ప్రాజెక్టు, కన్నడభాషలో నున్న దాససాహిత్యాన్ని ఆబాలగోపాలానికి అందించడం కోసం దాససాహిత్య ప్రాజెక్టు ఎలానో అదే విధంగా తమిళభాషలో నున్న ఆళ్వారుల 'నాలాయిర దివ్యప్రబంధాన్ని' ప్రజలకు చేరువ చేయడం కోసం తితిదే ద్వారా ఈ ప్రాజెక్టు చేపట్టబడింది.

పన్నెండు మంది ఆళ్వారుల జీవితచరిత్రనూ, శ్రీమహావిష్ణువును, ముఖ్యంగా శ్రీవేంకటేశ్వరుణ్ణి, కీర్తిస్తూ వారు రచించిన పాశురాలను; శ్రీవైష్ణవ సాంప్రదాయానికి చెందిన ఇతర కవిపుంగవులు, భక్తుల యొక్క కృతులను వెలుగు లోకి తెచ్చే మహత్తర ఆశయంతో, తితిదే ద్వారా 1991 వ సంవత్సరంలో ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. ఈ ప్రాజెక్టు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అనేక ప్రచార కార్యకలాపాలు చేపట్ట బడతాయి. ధనుర్మాసంలో తిరుప్పావై పఠనం దేశమంతటా జరుప బడుతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆయా ఆళ్వారుల జన్మనక్షత్రాల యందు వారి వారి అవతార మహోత్సవాలు వైభవోపేతంగా జరుపబడుతాయి. వివిధ ఆళ్వారులు తమిళభాషలో రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలను సరళమైన తెలుగు, ఆంగ్ల భాషల లోనికి తర్జుమా చేసి జనబాహుళ్యానికి అందజేయడం కూడా ఈ ప్రాజెక్టు లక్ష్యాల్లో ఒకటి. పుట – 114 తేదీ – అక్టోబరు, 27

పొయ్‌గై ఆళ్వార్

ద్వాదశ ఆళ్వార్ లలో ఆద్యుడైన పొయ్‌గై ఆళ్వార్ 'పాంచజన్యం' గా పేరొందిన, శ్రీమహావిష్ణువు యొక్క శంఖాయుధ అంశతో జన్మించారు. ఈనాటి కాంచీపురానికి సమీపంలో నున్న 'తిరువెక్కా' అనే గ్రామం నందున్న తామరకొలను లోని ఒక పద్మంలో వీరి జననం సంభవించినట్లుగా భక్తులు భావిస్తారు. సిద్ధార్థినామ సంవత్సరపు తులామాసం, శ్రీవేంకటేశ్వరుని జన్మనక్షత్రమైన శ్రవణానక్షత్ర సంజాతులైన ఈ ఆళ్వార్ నాలాయిర దివ్యప్రబంధం లోని మొదటి నూరు పాశురాలను రచించగా, వాటిలోని పన్నెండు పాశురాలలో శ్రీవేంకటాచలక్షేత్ర మహిమ వర్ణించ బడింది. 719వ సంవత్సరంలో జన్మించిన వీరికి 'సరోయోగి' అనే నామాంతరం కూడా ఉంది. బహుశా సరోవరంలో

జన్మించిన కారణంగా వీరికి ఈ నామాంతరం స్థిరపడి ఉండవచ్చు.

వీరు తన కృతులలో వేంకటాద్రిని నల్లటి, భీకరాకారం గల మత్తగజాలకు, పొడవాటి సర్పాలకు, కురవజాతికి చెందిన ఆటవికులకు నిలయంగా పేర్కొన్నారు. అంతే గాకుండా, శేషాచల పర్వతాన్ని సాగరగర్భంలో నుండి పుడమిని రక్షించిన దేవదేవునికి (అనగా శ్రీమహావిష్ణువు మరో అవతారమైన ఆదివరాహుడు), గోవర్ధనగిరిధారికి (కృష్ణావతారపు ప్రస్తావన) నివాసంగా కూడా అభివర్ణించారు. ఆ రోజుల్లో అక్కడున్న అర్చామూర్తిని దర్శించడానికై విల్లంబులు, బాణాలు ధరించిన భక్తులు విచ్చేసేవారని; వారు స్వామివారికి సమర్పించడానికై తమతో పాటుగా ఫలపుష్పాలను, శుద్ధజలాలను, అగరు పరిమళాలను తీసుకు వచ్చేవారని; తిరుమలేశుని మూర్తి స్థానకభంగిమలో అలరారు తుండేదని; వేంకటాచలాన్ని దర్శించనవారి కోర్కెలన్నీ ఈడేరి అంత్యకాలంలో వారికి మోక్షసిద్ధి లభిస్తుందని తమ పాశురాలలో ప్రస్తుతించారు. వీరి కృతులలో శ్రీమహావిష్ణువు పరమశివుడు ఒక్కరేనన్న భావన అంతర్లీనంగా కానవస్తుంది.

వీరు రచించిన పాశురాలను 'ఆళ్వారుల మంగళాశాసన పాశురాలు' గా పేర్కొంటారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో మొదటిరోజు రాత్రి జరిగే పెద్దశేషవాహనం ఉత్సవ సందర్భంగా పొయ్‌గై ఆళ్వార్ రచించిన 'మొదల్ తిరువందాది' అనే పాశురాన్ని పారాయణం చేస్తారు.

ఆళ్వారులు తమ పాశురాలలో ఆనాటి వేంకటాచల క్షేత్ర ప్రాకృతికశోభను, దేవాలయ తీరుతెన్నులను, భక్తులు శ్రీవారిని దర్శించుకునే విధివిధానాలను కళ్ళకు కట్టినట్లు వర్ణించి నందువల్ల కాలక్రమేణా 'నాలాయిర దివ్యప్రబంధం' ఒక చారిత్రక ఆధారంలా కూడా రూపుదిద్దుకుంది.

పూదత్తాళ్వార్

పొయ్‌గై అళ్వార్ కు సమకాలికులైన ఈ రెండవ ఆళ్వార్, శ్రీహరి యొక్క 'కౌమోదకి' గదాంశతో, ఒకానొక పుష్పంలో జన్మించారని ప్రతీతి. పుష్పంలో నుండి ఉద్భవించిన కారణంగా వీరిని 'పూదత్తాళ్వార్' గా వ్యవహరిస్తారని కొందరు అభిప్రాయ పడుతారు. వీరు కూడా మొదటి ఆళ్వార్ వలె సిద్ధార్థి నామ సంవత్సరం లోనే జన్మించారు. తులామాసపు ధనిష్ఠానక్షత్రం, నవమి తిథినాటి బుధవారపు దినాన వీరి జననం సంభవించింది. ఈనాడు మహాబలిపురంగా ప్రసిద్ధికెక్కిన 'మామల్లపురం' వీరి జన్మస్థలం.

వీరికి భూతాళ్వార్, ఉత్పలముని, ద్వితీయయోగి అనే నామాంతరాలు కూడా ఉన్నాయి. పంచభూత తత్వాన్ని ఆమూలాగ్రం ఎరిగిన వారు కావున 'భూతాళ్వార్' గాను; ఆళ్వార్ లలో రెండవ వారు గావున 'ద్వితీయముని' గాను పిలువ బడుతున్నారని కొందరు విశ్వసిస్తారు.

స్వామిని దర్శించాలనే దృఢసంకల్పంతో, క్రూరమృగాలు, ఎండవానల వంటి ఈతిబాధలను లక్ష్య పెట్టకుండా, తిరుగులేని భక్తివిశ్వాసాలతో తిరుమలక్షేత్రాన్ని సందర్శించుకున్న వీరు పర్వతమార్గం లోని అందచందాలను, మార్గమధ్యంలో వారి అనుభూతులను తమ పాశురాలలో హృద్యంగా వర్ణించారు. వేంకటాచల క్షేత్రాన్ని ఆకుపచ్చటి

వెదురుపొదలకు, నిత్యం పర్వతసానువుల నుండి జాలువారే జలధారలకు, తామరపూలతో నిండి ఉండే సరోవరాలకు నిలయంగా తమ పాశురాలలో అభివర్ణించారు. మదపుటేనుగులు లేత వెదురుకాండాలను పుట్టతేనెలో రంగరించి తమ ప్రియురాళ్ళకు అందజేస్తాయంటూ మూగజీవుల ప్రేమను కవితాధోరణిలో వెలువరించి; తన సృజనాత్మకతను చాటుకున్నారు.

వీరు రచించిన నూరు పాశురాల సంకలనాన్ని 'ఇరండాం తిరువందాది' గా పేర్కొంటారు. ఇందులో తిరువేంగడపు ప్రాకృతిక శోభనే కాకుండా, విష్ణుమహిమను కూడా అత్యద్భుతంగా తెలియజెప్పారు. ఈ పాశురాలను బ్రహ్మోత్సవాలలో రెండవరోజు ఉదయం, సాయంత్రాలలో జరిగే చిన్నశేషవాహనము, హంసవాహన ఉత్సవాల సందర్భంగా పఠిస్తారు.

పేయాళ్వార్

శ్రీమహావిష్ణువు నందక ఖడ్గాంశ సంభూతులుగా భావించబడే ఈ మూడవ ఆళ్వార్ కూడా ముందు పేర్కొన బడ్డ ఇరువురు ఆళ్వార్లకు సమకాలికులే! వీరు కూడా సిద్ధార్థి నామ సంవత్సరం లోనే జన్మించారు. ఆశ్వయుజ మాసపు, శుక్లదశమి, శతభిషా నక్షత్రంలో వీరి జననం సంభవించింది. చెన్నై మహాపట్టణంలో ఈనాడు మైలాపూరుగా ప్రసిద్ధి చెందిన మయూరనగరం లోని ఒక బావిలో, ఎర్రకలువల నుండి వీరి జననం సంభవించిందని విశ్వసిస్తారు.

' పేయ్' అనే తమిళపదానికి 'భ్రాంతి' లేదా 'మతిభ్రమణం' అనే సమానార్థాలు ఉన్నాయి. మితిమీరిన విష్ణుభక్తితో మతిభ్రమించి సంచరిస్తున్నందువల్ల వీరికా నామాంతరమేర్పడి సార్థక నామధేయులయ్యారని భక్తులు విశ్వసిస్తారు.

తమ పాశురాలలో వేంకటాచల మహత్యాన్ని అత్యద్భుతంగా వర్ణించిన వీరు ఇంద్రాదిదేవతలు తమ మణిమయ మకుటాలు శ్రీవారిపాదాలను స్పృశించేటట్లు సాష్టాంగప్రమాణాలు ఆచరిస్తారని పేర్కొన్నారు. చతుర్వేదాలలో వర్ణించబడ్డ దేవదేవుడు వేంకటాచల వాసుడైన వేంకటేశ్వరుడేనని, భూమ్యాకాశాలను తన పాదాలతో కొలచిన వామనావతారుడు కూడా శ్రీనివాసుడేనని పేర్కొన్నారు. 'తిరుమల' శబ్దం మొట్టమొదటి సారిగా వీరి రచనల్లోనే ప్రాచుర్యం లోకి వచ్చింది. అప్పటివరకు ఈ క్షేత్రాన్ని 'తిరువేంగడం' గా పిలిచేవారు.

వీరు తమ పాశురాలలో వేంకటాచలాన్ని అంబరాన్ని చుంబించేంత ఎత్తైన వెదురుపొదలకు నిలయం గాను; ఆ వెదురు బద్దలను సౌందర్యవంతులైన కురవ మహిళలు వారి సిగలలో అలంకరించుకుంటారని; సమున్నతంగా ఉండి పదునైన అంచులు గల ఆ వెదురు బద్దలు చంద్రుణ్ణి మింగిన రాహువును నిర్జింప జేస్తాయని భక్తిభావానికి సృజనాత్మకతను జోడించి వర్ణించారు. సమున్నతమైన శేషాచల శిఖరాలు మత్తేభాలకు, మర్కటాలకు, వనసూకరాలకు, 'యాలి' లేదా 'శరభం' గా పిలువబడే కాల్పనిక వింతజంతువుకు నిలయాలని కూడా వీరు పేర్కొన్నారు.

పేయాళ్వార్ వారు రచించిన 'మూడవ తిరువందాది' అనే నూరు పాశురాల సంకలనాన్ని బ్రహ్మోత్సవాలలో మూడవరోజు ఉదయం జరిగే 'సింహవాహనం', అదే రోజూ సాయంసమయంలో జరిగే 'ముత్యపు పందిరి'

వాహనోత్సవ సందర్భాలలో పఠిస్తారు. వీరిచే తిరుమలక్షేత్రం లోని ఆదివరాహస్వామి వారికి 10 పాశురాలతో మంగళాశాసనం కూడా చేయబడింది.

యోగిత్రయం

పై ముగ్గురాళ్వారులకు అనేక సారూప్యతలున్నాయి. వీరు ముగ్గురూ ఒకే సంవత్సరం (719 , సిద్ధార్థి నామసంవత్సరం) లో జన్మించి సమకాలికులయ్యారు. ముగ్గురూ విష్ణువు యొక్క ఆయుధాల అంశతో, పుష్పాలలో జన్మించారు. వీరు ముగ్గురికి సాక్షాత్తు శ్రీమహావిష్ణువు సేనాని యైన విష్వక్సేనులవారే స్వయంగా పంచసంస్కారాలు జరిపించి శ్రీవైష్ణవులుగా తీర్చిదిద్దారని ప్రతీతి. ఇన్ని సారూప్యత లుండడం వల్ల వీరిని 'యోగిత్రయమని', 'ముదళాళ్వార్లని' పిలుస్తారు. ముదళాళ్వార్లంటే మొట్టమొదటి ఆళ్వార్లని అర్థం. పుట – 115 తేదీ – అక్టోబరు, 28

యోగిత్రయంగా పిలువబడే మొదటి ముగ్గురు ఆళ్వార్లయిన పొయ్‌గై ఆళ్వార్, భూతాళ్వార్ మరియు పేయాళ్వార్ జీవితచరిత్రలను సంక్షిప్తంగా తెలుసుకున్నాం. వారిముగ్గురికీ ఏకకాలంలో శ్రీమహావిష్ణువు సాక్షాత్కరించినట్టి ఆసక్తికరమైన పౌరాణిక గాథను, ఈ ఆళ్వార్ల పరంపరలో నాల్గవ వాడైన 'తిరుమళిశై ఆళ్వార్' సంక్షిప్త చరిత్రను ఇప్పుడు తెలుసుకుందాం.

శ్రీహరి సాక్షాత్కారం

సర్వసంగ పరిత్యాగులైన ముదళాళ్వార్లు ముప్పురూ భగవద్దర్శనాభిలాషులై, హరినామసంకీర్తనా గానంతో దేశసంచారం చేయసాగారు. వారు సమకాలీనులే అయినప్పటికీ, వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారవ్వడం వల్ల అప్పటివరకూ ఒకరితో నొకరికి పరిచయం లేదు. ఒకానొక రోజు ఆళ్వార్లు ముప్పురూ మూడు దిక్కుల నుండి బయల్దేరి, సాయం సమయానికి యాదృచ్ఛికంగా 'తిరుక్కోవలూర్' అనే పుణ్యక్షేత్రం పొలిమేరలు చేరుకున్నారు.

ముందుగా గ్రామంలోకి ప్రవేశించిన పొయ్‌గై ఆళ్వార్ సాయం చీకట్లు కమ్ముకుంటున్న సమయంలో, జడివాన ఉధృతంగా కురుస్తుండడం వల్ల; ఓ పెంకుటింటి ముందున్న, ఒకరికి మాత్రమే సరిపడే చిన్న అరుగుపై పడుకుని మార్గాయాసం నుండి సేద తీరసాగాడు. కొంతసేపటి తరువాత భుతాళ్వార్ కూడా అదే ప్రాంతానికి విచ్చేసి, అప్పటికే అక్కడ విశ్రమించి యున్న పొయ్‌గై ఆళ్వార్ అనుమతితో తాను కూడా అరుగుపై చేరాడు. అరుగు చిన్నది కావడంతో ఇరువురూ సర్దుకుని కూర్చొన వలసి వచ్చింది. మరికొంత సేపటికి పేయాళ్వార్ కూడా ఆ ప్రాంతానికి వచ్చి, మొదటి ఇద్దరి అనుమతితో అదే అరుగుపై చేరాడు. ఒక్కరికే సరిపడే ఆ అరుగుపై ముగ్గురు చేరడంతో అందరూ నిలబడి మాత్రమే విశ్రాంతి తీసుకో గలుగుతున్నారు. అయినప్పటికీ, హరినామస్మరణలో మునిగి ఉన్న ఆ భక్తశిఖామణులకు ఆ పరిణామం ఎంతమాత్రం ఇబ్బందికరంగా తోచలేదు. 'కాయాపేక్ష' ను త్యజించడం, అనగా శారీరక సుఖాలపై వ్యామోహాన్ని విడనాడడం, ముక్తిమార్గానికి తొలి సోపానం.

ఆ చిన్ని అరుగు ఇప్పుడు ముగ్గురు మహాత్ముల సంగమానికి వేదికగా మారింది. పరస్పర పరిచయాలు జరిగిన

తరువాత భావసారూప్యత గలిగిన వారు ముగ్గురూ ఎముకలు కొరికే చలిని, కుండపోతగా కురుస్తున్న వర్షాన్ని, చిమ్మచీకటిని లెక్క చేయకుండా; సామూహిక హరినామ సంకీర్తనా గానంలో మరింతగా లీనమై పోయారు.

ఆ అద్భుత దృశ్యాన్ని గాంచి ముచ్చట పడిన శ్రీహరి కూడా అదృశ్యరూపంలో వచ్చి, నాల్గవ వ్యక్తిగా అదే అరుగుపై చేరిపోయి; తన ప్రియభక్తుల సామీప్యంలో, మృదు మధురమైన వారి కీర్తనలు వింటూ మురిసి పోయాడు.

నాల్గవ వ్యక్తి రావడంతో ముగ్గురాళ్వార్లకూ ఆ అరుగు మరింత ఇరుకుగా తోచింది. ఒక అదృశ్య శక్తి తమ శరీరాలను అంటి పెట్టుకున్న అనిర్వచనీయమైన అనుభూతికి వారు లోనయ్యారు. క్రమంగా ఆ ప్రాంతమంతా చీకట్లు తొలగిపోయి వింతకాంతి విస్తరించింది. వారి గానం వారికే మరింత మధురంగా వినవస్తోంది. నాల్గవ వ్యక్తి తమ మధ్యనే ఉన్నట్టు వారికి తోచసాగింది. ఆ అదృశ్యరూపుడు సాక్షాత్తు భగవంతుడే నన్న నిర్ధారణకు వచ్చిన ఆళ్వార్లు ముప్వురు, తమ దివ్యచక్షువులతో శ్రీహరిని సందర్శించుకొని పరమానంద భరితులయ్యారు. హరినామ సంకీర్తన కున్న మహత్తు అంత గొప్పదన్నమాట!!!

వీరు ముగ్గురూ కీర్తించిన శ్రీహరి గాథలు 'తిరువందాది' గా ఖ్యాతి గాంచాయి. తిరుమల బ్రహ్మోత్సవాలలో మొదటి మూడు రోజులూ ఈ ముగ్గురు ఆళ్వార్ల పాశురాలు గానం చేయబడతాయి.

తిరుమళిశై ఆళ్వార్

శ్రీమహావిష్ణువు యొక్క పరమాయుధం సుదర్శన చక్రాంశ సంభూతులైన 'తిరుమళిశై ఆళ్వార్' కూడా సిద్ధార్థి నామ సంవత్సరం లోనే జన్మించారు. జన్మరీత్యా అంత్యజుడైన ఈ అళ్వార్ సుమారుగా 720 వ సంవత్సరంలో; చెన్నపట్టణం పరిసరాల్లోని 'తిరుమళిశై' అనే గ్రామంలో ఉద్భవించడం వల్ల వీరికా పేరు స్థిరపడింది. ఒక కిరాతునిచే పెంచి పెద్ద చేయబడ్డ ఈ ఆళ్వార్ తన కులమేమిటో తనకు తెలియదని; పూర్వజన్మ సుకృతం వల్ల ఆగమశాస్త్రాలను కూలంకషంగా, స్వయంగా అభ్యసించ గలిగానని, శ్రీహరి యందున్న అనురక్తితో వైష్ణవమతావలంబియై, పంచసంస్కారాలను గావించుకొని శ్రీవైష్ణవునిగా పునర్జన్మ నొంది, శ్రీమన్నారాయణుని ప్రాభవాన్ని నలుదెసలా చాటి చెప్పటానికై సంకల్పించానని స్వయంగా ప్రకటించు కున్నాడు. వర్ణవివక్షను త్రోసిరాజనే సామజిక ప్రక్రియకు అంకురార్పణ ఆనాడే జరిగిందన్నమాట.

అత్యంత వినయ సంపన్నుడైన ఈ ఆళ్వార్, భగవంతుని సంపూర్ణ కటాక్షానికి నోచుకోని కూడా తాను వేదవేదాంగాలను అభ్యసించ లేదని, అరిషడ్వర్గాలపై విజయం సాధించ లేదని, ఐహిక బంధాల నుండి విముక్తి పొందలేక పోయానని వాపోయాడు. అయినప్పటికీ తాను శ్రీహరి పాదపద్మాలను విడువనని, తనను కడతేర్చడం వారికే సాధ్యమని ఆర్తిగా పేర్కొన్నాడు.

వేంకటాచల శిఖరాల ప్రాకృతిక సోయగాలను శ్రీహరి మహిమలకు అనుసంధానించి, వాటిని రసరమ్య భరితంగా వర్ణించాడు. సృష్టిలో నున్న సకల సంపదలకు ఆలవాలమైనట్టి వేంకటాచలం పైనున్న రతనాల రాశుల తళుకు బెళుకులకు బెంబేలెత్తిన మత్తగజాలు, పర్వత గుహలను పోలియున్న కొండచిలువల నోళ్ళలో చిక్కుకున్నాయని; తన

విన్నపాన్ని మన్నించి శ్రీనివాసుడా గజరాజులను కాపాడ వచ్చాడని; బ్రహ్మరుద్రాదులచే పూజింపబడే, సకల పాపాలను హరించి వేయగల శ్రీవేంకటేశ్వరుని పాదపద్మాలను సతతము తమ శిఖరాలపై నుంచుకొనే మహద్భాగ్యానికి శేషాచల సానువులు నోచుకున్నాయని; శ్రీవారు వనవిహారానికి వేంచేసినప్పుడు, బ్రహ్మదేవుడు గగనాన ఉండే మేఘాలను ఛత్రంగా చేసి వారికి నీడ కల్పిస్తాడని; దేవేంద్రుడు ఉభయ సంధ్యలలో శ్రీవారికి నీరాజనాలు సమర్పిస్తాడని భావయుక్తంగా అభివర్ణించాడు. మరో సందర్భంలో వేంకటాచలంపై నున్న అరణ్యాల లోని ఒకానొక కరిరాజు, నీలాకాశంలో వెన్నెలలు కురిపిస్తున్న చందమామను తన తొండంతో తీసి దానిని పుష్పంలా శ్రీనివాసుని కర్పించడానికై సమాయత్త మయ్యిందని; ఆ సమయంలో వేటగాళ్ళు ఆ మత్తేభంపై బాణవర్షాన్ని కురిపించారని; అంతట స్థానిక కురవ మహిళలు తమ ఆయుధాలతో వేటగాళ్ళను ఎదిరించి, ఏనుగుతో శ్రీనివాసునికి నిరాటంకంగా పుష్పార్చన చేయించారని పేర్కొన్నాడు. ఇలా వారి రచనలు భక్తిపారవశ్యము మరియు కవితావేశాల మేళవింపుగా పరిఢవిల్లాయి.

ఆనాడు ద్వాదశి మరియు శ్రవణా నక్షత్ర దినాలలో ప్రత్యేక పూజలు జరిగేవని, కురవ తెగకు చెందిన గిరిజనులు తప్పితే వేరెవ్వరూ కొండపై నివసించేవారు కాదని, పూజాదికాలు నిర్వహించడానికి అర్చక వ్యవస్థ లేదని, భక్తులు ఎవరికి వారే తమకు తోచిన రీతిలో శ్రీనివాసుణ్ణి అర్చించుకునే వారని, అప్పటికింకా ఆగమశాస్త్ర బద్ధమైన వైదిక కార్యక్రమాలు ఆచరణ లోకి రాలేదని వీరి రచనల ద్వారా అవగత మవుతోంది.

మొదటి ముగ్గురు ఆళ్వారులూ శ్రీమహావిష్ణువుతో పాటుగా, ఇంద్ర, బ్రహ్మ, రుద్రాది దేవతలను కూడా ఆరాధించేవారు. కానీ తిరుమళిశై ఆళ్వారు మాత్రం, యోగిత్రయానికి భిన్నంగా శ్రీవేంకటేశ్వరుణ్ణి తప్ప అన్యదైవాలను సేవించనని కరాఖండిగా చెప్పాడు.

ఈ ఆళ్వారు మహిమలకు సంబంధించిన అనేక ఇతివృత్తాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

కుంభకోణంలో వెలసియున్న, శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన 'శార్ జ్ఞపాణి' నైవేద్యం మొదటగా తిరుమళిశై ఆళ్వార్ కు అర్పించకపోతే తానారగించడని; తిరుమళిశై ఆళ్వార్ క్షీరోచ్ఛిష్టాన్ని (ఎంగిలి పాలు) సేవించడం ద్వారా జన్మించిన వారి శిష్యుడు 'కణిక్కణ్ణన్', ఒక వృద్ధురాలిని పదహారేండ్ల పడుచుకన్యగా మార్చి ఆమెను నిత్యయవ్వనవతిగా అనుగ్రహించాడని; కారణాంతరం చేత ఆ దేశపు రాజు కణిక్కణ్ణన్ కు దేశబహిష్కార శిక్ష విధించగా, తిరుమళిశై ఆళ్వారు శ్రీమహావిష్ణువును ఆదిశేషువుతో సహా తరలి వచ్చి తన శిష్యుణ్ణి కాపాడ వలసిందిగా ప్రార్థించాడని, ఆ విన్నపాన్ని విన్న విష్ణువు దేవాలయం నుండి అదృశ్య మయ్యాడని, అంతే కాకుండా పట్టణంలోని అన్ని దేవాలయాల లోని విష్ణుప్రతిమలు మాయ మయ్యాయని, ఈ పరిణామనికి అచ్చెరువొందిన రాజుగారు గురుశిష్యులను శరణు వేడుకున్నారని, తిరుమళిశై ఆళ్వార్ కనికరించడంతో వెనువెంటనే ప్రతిమలన్నీ యథాస్థానానికి చేరుకున్నాయని భక్తులు విశ్వసిస్తారు.

చక్రాంశయోగి, భక్తిసారముని అనే నామాంతరాలు కలిగిన ఈ ఆళ్వార్ రచించిన నూరు పాశురాల సంకలనాన్ని 'నాన్ ముగన్ తిరువందాది' గాను; మరో 120 పాశురాల సంకలనాన్ని 'తిరుక్కంద వృత్తమ్' గాను వ్యవహరిస్తారు.

ఈ రెండూ నాలాయిర ప్రబంధం యొక్క అంతర్భాగాలే ! వీటిలోని 96 పాశురాలను బ్రహ్మోత్సవాలలో నాల్గవరోజు ఉదయం కల్పవృక్ష వాహనోత్సవం లోను, అదే రోజు సాయంత్రం జరిగే సర్వభూపాల వాహనోత్సవం లోనూ పారాయణం చేస్తారు.

అంత్యజుణ్ణి అందల మెక్కించి పరమపద సోపానానికి చేర్చడం ద్వారా ఆ శ్రీహరి కులాల కట్టుగోడలను కూల్చివేయడం కోసం ఆనాడే కంకణం కట్టుకున్నట్లుగా తిరుమళిశై ఆళ్వార్ చరిత్ర తేటతెల్లం చేస్తుంది. పుట – 116 తేదీ – అక్టోబరు, 29

నమ్మాళ్వార్

'నమ్మాళ్వార్' అంటే 'మన ఆళ్వార్' అని అర్థం. వందలాది సంవత్సరాల క్రితం జీవించియున్న నమ్మాళ్వార్, ఇంతకాలం తరువాత కూడా అంత ఆప్యాయంగా సంబోధించ బడుతున్నారంటే, వారు ప్రజల హృదయాలలో ఎంతటి సుస్థిర స్థానాన్ని సంపాదించు కున్నారో అర్థం చేసుకోవచ్చు.

జన్మవిశేషాలు

శ్రీమహావిష్ణువు సర్వసేనాని యైన విష్వక్సేనుని అంశగా భావించబడే నమ్మాళ్వార్ ప్రమాది నామ సంవత్సరం, వసంత ఋతువు, వైశాఖమాసం, శుక్లపక్షపౌర్ణమి, కటకలగ్నం, విశాఖా నక్షత్రంలో; తమిళదేశం లోని, పరమ పావనమైన తామ్రపర్ణి నది ఒడ్డున స్థితమై 'ఆళ్వార్ నగరి' గా పేరు గాంచిన 'తిరుక్కురుగూర్' అనే గ్రామంలో; ప్రసన్నకులస్తులైన కారి ఉడయనంగై దంపతులకు జన్మించారు. ఈ దంపతుల ప్రార్థన లాలకించి, 'తిరుక్కురుంగుడి' అనే పుణ్యక్షేత్రంలో కొలువై ఉన్న, శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన 'నంబి పెరుమాళ్' వారే స్వయంగా నమ్మాళ్వార్ రూపంలో జన్మించారని ప్రతీతి. నమ్మాళ్వార్ జీవనకాలం విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వీరు తొమ్మిదవ శతాబ్దంలో జీవించారని చరిత్రకారులు అభిప్రాయ పడతారు. కానీ, విస్తృతంగా ప్రాచుర్యంలో నున్న తమిళ ఆధ్యాత్మిక సాహిత్యాన్ననురించి, వీరు కలియుగం ఆరంభమయిన 43 వ రోజున, అంటే సామాన్యశకానికి పూర్వం (క్రీస్తుపూర్వం) 3059 వ సంవత్సరం లోనే జన్మించారు. అలా చూస్తే 5,100 సంవత్సరాల క్రితమే వీరి జననం సంభవించింది. ప్రసన్నకులానికి చెందిన వారందరూ తరతరాలుగా శ్రీమన్నారాయణుణ్ణే ఆరాధిస్తారు. ఆ విధంగా పుట్టుక తోనే నమ్మాళ్వార్ వారికి విష్ణుసాంగత్యం అలవడింది. ద్వాదశ ఆళ్వార్ లలో అత్యంత ప్రముఖునిగా అందరూ అంగీకరించే నమ్మాళ్వారే మొట్టమొదటగా భగవంతుని వద్దనుండి జ్ఞానసముపార్జన చేశాడని కూడా కొందరు విశ్వసిస్తారు.

సుషుప్తావస్థలో నమ్మాళ్వార్

వీరి జన్మనామం 'మారన్'. ఈ పేరుకు 'చైతన్యం' అనే అర్థముంది. కానీ, పేరుకు పూర్తి విరుద్ధంగా పుట్టిన నాటినుండి వారి శరీరంలో ఏ విధమైన చలనం లేదు. అందరు పిల్లల వలె కనీసం కాళ్ళూ చేతులు ఆడించడం కానీ, పాలు త్రాగటం గానీ చేయకుండా; ఆ బాలుడు చాలా కాలం పాటు చలన రహితమైన సుషుప్తావస్థలో ఉండిపోయాడు. అది

'ధ్యానావస్థ' అని తెలియని తల్లిదండ్రులు చింతాక్రాంతులై, ఆ పసిబాలుణ్ణి సమీంలో నున్న 'ఆదినాథస్వామి' ఆలయ ప్రాంగణం లోని చింతచెట్టుకు ఊయల కట్టి, దానిలో పరుండ బెట్టారు. దేవునిపై భారం వేసి, తమ బిడ్డను కాపాడ వలసిందిగా వేడుకొంటూ కాలం గడపసాగారు.

మధురకవి ఆళ్వార్ తో తొలి సమాగమం

అలా ఊయలలో కొన్నాళ్ళు గడిపిన నమ్మాళ్వార్ అదే చెట్టు యొక్క తొర్రలోకి చేరుకుని; అక్కడే చాలా సంవత్సరాలు ధ్యాననిష్ఠలో గడిపారు. నమ్మాళ్వార్ కు నీడ నివ్వడం కోసం సాక్షాత్తు ఆదిశేషుడే చింతచెట్టుగా ఆవిర్భవించాడని చెబుతారు. చింతచెట్టుకు శ్రీమన్నారాయణునికి ఉన్న అనుబంధం ఈనాటిది కాదు. తిరుమలక్షేత్రంలో శ్రీనివాసుడు వేలాది వత్సరాలు నివసించిన వల్మీకానికి (పుట్ట) నీడనిచ్చింది కుడా చింతచెట్టే! దీనికి సంబంధించిన విశేషాలన్నింటినీ 'నీడ తిరగని చింతచెట్టు' అనే ప్రకరణంలో ఇంతకు మునుపే తెలుసుకున్నాం. కొంత కాలానికి 'మధురకవి ఆళ్వార్' గా పిలువ బడే మరో 'ఆళ్వార్' వీరిని సుషుప్తావస్థ నుండి మేల్కొలిపిన తరువాత, నమ్మాళ్వార్ అక్కడి నుండే తమ ఉపదేశాలను కొనసాగించారు. ఆ వృత్తాంతాన్ని 'మధురకవి ఆళ్వార్' అనే మరో ప్రకరణంలో తెలుసుకుందాం.

శఠగోపమంటే?

మానవులలో గూడు కట్టుకొని ఉన్న అజ్ఞానాంధకారాన్ని తొలగించి, జ్ఞానజ్యోతులను వెలిగింప గలిగిన వాడు గనుక, నమ్మాళ్వార్ 'శఠగోపముని' గా విశ్వవిఖ్యాతు లయ్యారు. వారి పేరు మీదనే దేవాలయాలలో తీర్థవితరణతో పాటుగా 'శఠగోపం' పెట్టడమనే సాంప్రదాయానికి తెరలేచింది. కాలగమనంలో అదే 'శఠారి' గా, తరువాత 'చటారి' గా నామాంతరం చెందింది. ఆవిధంగా వారు చిరంజీవులయ్యారు.

తీర్థసేవనంతో పాటుగా శఠగోపం స్వీకరిస్తేనే అంతఃకరణ శుద్ధి పరిపూర్ణంగా జరుగుతుంది. శఠగోపమనగా గూడుకట్టుకున్న లేదా గోప్యమైన, అజ్ఞానం లేదా మూఢత్వం అని అర్థం. మానవులందరి లోనూ కొంత మూఢత్వం గోప్యంగా ఉంటుంది. పరమాత్ముని పాదస్పర్శతో మాత్రమే మూఢత్వం, అహంకారం తొలగిపోతాయి. కానీ ఆలయాలలోని మూర్తుల యొక్క పాదాలను స్పృశించటం మనకు సాధ్యం కాదు. పంచలోహాలు లేదా రజతంతో నిర్మితమైన 'శఠగోపురం' ఉపరితల భాగంపై భగవంతుని పాదాలు మలచిబడి ఉంటాయి. కావున అర్చకస్వాములు శఠారిని మన శిరస్సుకు తాకించడం వల్ల, కేవలం భగవంతుని పాదస్పర్శ మాత్రమే గాకుండా; మన శిరస్సుతో దేవునికి పాదాభివందనం చేసిన ఫలితం లభిస్తుంది. తద్వారా మూఢత్వం, అజ్ఞానం, అహంకారం పటాపంచ లవుతాయి. అప్పుడే భగవంతునికి ఆత్మసమర్పణ చేసుకో గలుగుతాము.

మరో కథనం ప్రకారం, బాల్యావస్థలో తన దరిజేరబోతున్న కరుడుగట్టిన మాయామోహాన్ని పసిగట్టిన నమ్మాళ్వార్ క్రోధంతో హూంకరించి దానిని నిలువరించగలిగారు కావున 'శఠకోపమునులు'గా ఖ్యాతి నొందారు. 'శఠముపై' (మోహం లేదా మూఢత్వం) కోపించినవారు కనుక 'శఠకోపులు. అలా, 'శఠగోపం' మరియు 'శఠకోపం', ఈ

రెండింటికీ వీరు సార్థకనమధేయులే.

ఇతరనామాలు

నమ్మాళ్వార్ వైష్ణవమతావలంబులకు మకుటం వంటి వాడు కావున 'వైష్ణవకులపతి' యని (కులపతి అంటే 'ఛాన్సలర్'); ఎల్లవేళలా వకుళమాలను ధరించి యుండే వాడు కనక 'వకుళాభరణుడు' అని; అన్య మతస్తులను, నాస్తికత్వం ప్రబోధించే వారిని 'అంకుశం' వంటి తన వాక్పటిమతో అణచివేయ గలిగిన కావున 'పరాంకుశుడు' అని పిలువ బడుతాడు. వీరికి మరో ముప్పైకి పైగా నామాంతరాలు ఉన్నాయి. ప్రతి నామం రావడం వెనుక విశిష్టమైన, సుదీర్ఘమైన చరిత్ర ఉంది.

సాక్షాత్తు ఆదిశేషుని అంశ అయిన శ్రీమద్రామానుజాచార్యుల వారు కూడా నమ్మాళ్వార్ శరణు వేడారు. శ్రీవేంకటేశ్వరుని, శ్రీరామచంద్రుని, శ్రీకృష్ణుని యొక్క పరివార సదస్యులందరిలో గల సద్గుణాల నన్నింటినీ నమ్మాళ్వార్ పుణికిపుచ్చుకున్నట్లు శ్రీవైష్ణవులు విశ్వసిస్తారు. మధురకవి ఆళ్వార్ తో పాటు, దివ్యప్రబంధం లోని పాశురాలకు రాగం తాళం సమకూర్చి వాటిని రాగయుక్తం చేసిన నాథముని కూడా నమ్మాళ్వార్ శిష్యులే!

సాహిత్య సాధన

అత్యంత లోక ప్రసిద్ధి గాంచిన నమ్మాళ్వార్ రచనలను 'చతుర్వేద సారము' గా అభివర్ణిస్తారు. వీరు ఋగ్వేద సారాన్ని 'తిరువిరుత్తము' అనే నూరు పాశురాల సంకలనం గాను; యజుర్వేద సారాన్ని 'తిరువశిరియం' అనే ఏడు పాశురాల సంకలనం గాను; అధర్వణవేద సారాన్ని 'పెరియ తిరువందాది' అనే 87 పాశురాల సంకలనం గాను; సామవేద సారాన్ని 'తిరువాయ్ మొళి' అనే 1102 పాశురాల సంకలనం గాను వెలువరించారు. 'ఛాందోగ్యోపనిషద్వివరణ' మని కూడా ప్రసిద్ధి చెందిన 'తిరువాయ్ మొళి' ని నాలాయిర దివ్యప్రబంధం లోని నాలుగువేల పాశురాల యొక్క సంక్షిప్త సారాంశంగా భావిస్తారు. ఈ గ్రంథం లోని మరో విశిష్టత ఏమిటంటే ముందటి పాశురం ఏ పదంతో అంతమవుతుందో, తరువాతి పాశురం అదే పదంతో ప్రారంభ మవుతుంది. గ్రంథం మొత్తం ఇలాగే సాగుతుంది. చదువరులను, శ్రోతలను విశేషంగా ఆకట్టుకునే ఈ ఛందోప్రక్రియను 'ముక్తపదగ్రస్తం' గా వ్యవహరిస్తారు. నమ్మాళ్వార్ 4000 పాశురాల సంకలనమైన 'నాలాయిర దివ్యప్రబంధనం' లో 1296 పాశురాల సింహభాగాన్ని రచించి; ఆళ్వారు లందరిలోకి అగ్రగణ్యులయ్యారు.

నమ్మాళ్వార్ గళంలో శ్రీవేంకటేశ్వరుడు

నమ్మాళ్వార్ శ్రీవేంకటేశ్వరుణ్ణి 'తిరువేంకట ముడియన్' గా సంబోధించేవారు. విష్ణువు నుండి బ్రహ్మ ఉద్భవించాడని; బ్రహ్మ ద్వారా పరమశివుడు సృష్టించ బడ్డాడని; చివరగా బ్రహ్మరుద్రాదులను, శ్రీమహాలక్ష్మిని తనలో ఐక్యం చేసుకోవడం వల్ల వారందరూ తమ ఉనికిని కోల్పోయారని; అందువల్లనే వారందరికీ తిరుమల క్షేత్రంలో ప్రత్యేకంగా ఆలయాలు లేవని (ఆ కాలంలో తిరుమలలో మరే ఉపాలయాలు లేవు. ఇప్పుడు మనం చూస్తున్నవన్నీ తరువాతి

కాలంలో నిర్మించ బడినవే!); ఏ దేవతలను ఆరాధించినా, ఆ ప్రార్థనలన్నీ 'తిరువేంకట ముడియన్' కే దక్కుతాయని నమ్మాళ్వార్ విశ్వసించారు. శ్రీవేంకటనాథుణ్ణి మహాప్రళయం సంభవించినప్పుడు భూమండల మంతటినీ తన కంఠసీమలో నిక్షిప్తం చేసుకుని రక్షించిన 'వైకుంఠవాసి' గా; అసురులను దునుమాడి దేవతలను రక్షించిన సంకటహరణునిగా; బింబాధరుడు అనగా దొండపండు వంటి ఎఱ్ఱని అధరాలు గల నీలమేఘశ్యామునిగా; సప్తసాల వృక్షాలను ఏక శరాఘాతంతో ఛేదించిన (సుగ్రీవునికి తన పరాక్రమాన్ని ఋజువు చేసు కోవడం కోసం) శ్రీరామచంద్రునిగా; భూమ్యాకాశాలను తన పాదాలతో కొలిచిన వామనావతారుడిగా; తన భక్తులను జరామరణాల నుండి, ఈతిబాధల నుండి, శారీరక ఋగ్మతల నుండి కాపాడే ఆర్తత్రాణ పరాయణునిగా నమ్మాళ్వార్ ప్రస్తుతించారు. మిగిలిన విష్ణ్వవతారలన్నీ కేవలం విష్ణువు ప్రతిరూపాలే నని, కాని శ్రీవేంకటేశ్వరుడు మాత్రం సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే నని నమ్మాళ్వార్ విశ్వసించారు. తిరువేంగడాన్ని, శ్రీవేంకటేశ్వరుణ్ణి కళ్ళకు కట్టినట్లు వర్ణించిన నమ్మాళ్వార్ దూరాభారం వల్ల, చిన్నవయసు లోనే విష్ణుసాయుజ్యాన్ని పొందడం వల్ల తిరుమలక్షేత్రాన్ని స్వయంగా దర్శించుకోలేక పోయారు. వారికి ముందున్న ఆళ్వారుల రచనల ద్వారా, శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రత్యక్షంగా దర్శించుకున్న ఇతరభక్తుల కథనాల ద్వారా ఆకళింపు చేసుకున్న వివరాలనే తమ రచనలలో పొందుపరచారు.

విష్ణుభక్తి

వారు విష్ణుభక్తిలో ఎంతగా మునిగిపోయారంటే శ్రీవేంకటెశ్వరుడు వైకుంఠాన్ని, పరమపదాన్ని, తిరువేంగడాన్ని సైతం సారహీనముగా భావించి; తన హృదయసీమ లోనే శాశ్వతంగా తిష్ఠ వేసుకున్నాడని నమ్మాళ్వార్ విశ్వసించారు. ఆత్మ పరమాత్మలో లీనమవుతుందనే నానుడికి స్వస్తి పలికి; తన భక్తిభావంతో పరమాత్మనే తన ఆత్మలో నింపుకో గలిగిన ధన్యజీవి నమ్మాళ్వార్. జనులు వృద్ధాప్యం వచ్చేవరకూ వేచియుండకుండా, యౌవనదశలో నున్నప్పుడే శ్రీవేంకటేశ్వరుని శరణు వేడుకోవాలని; లేకుంటే ముదిమి మీదపడి, శరీరం శిథిలమై దేవతార్చనకు సహకరించనపుడు చింతించాల్సి వస్తుందని హితవు పలికారు.

ముప్పయ్యైదు వసంతాల సుదీర్ఘకాలం భగవత్సంకీర్తనలో పొద్దుపుచ్చిన నమ్మాళ్వార్ అతి చిన్న వయసులోనే, తన ప్రియశిష్యుడైన మధురకవి ఆళ్వార్ సమక్షంలో; వైకుంఠ ఏకాదశి తరువాత వచ్చే బహుళపక్ష పంచమి నాటి పుణ్యతిథిలో, తాను జీవితాంతం గడిపిన చింతచెట్టు సమీపం లోనే విష్ణుసాయుజ్యాన్ని పొందారు. నమ్మాళ్వార్ పరమపదించిన తరువాత, అదే ప్రదేశంలో మధురకవిచే వారికో ఆలయం నిర్మించబడింది.

తరువాతి కాలంలో దేశవ్యాప్తంగా నణ్ణమ్మాళ్వార్ వారికి పెక్కు ఆలయాలు నిర్మించబడ్డాయి. వాటిలో ఒకటి తిరుపతి లోని కపిలతీర్థేశ్వరస్వామి ఆలయ సముదాయంలో, సమున్నత ప్రాకారాలతో అలరారుతోంది. ఆ ఆలయ విశేషాలను ఇంతకు మునుపే మనం తెలుసుకున్నాం.

నమ్మాళ్వార్ విరచిత 'తిరువిరుత్తం' అనే పాశురాల సంకలనాన్ని బ్రహ్మోత్సవాలలో ఐదవరోజు ఉదయం మోహిని అవతారోత్సవ సందర్భంగానూ; అదే రోజు రాత్రి 'గరుడసేవ' లోనూ పఠిస్తారు. పుట – 117 తేదీ – అక్టోబరు, 30



పెరియాళ్వార్

విష్ణుచిత్తుడంటే శ్రీహరిని చిత్తములో నిలుపుకున్న వాడు. సార్థక నామధేయుడైన ఈ ఆళ్వార్, శ్రీకృష్ణదేవరాయలిచే రచింపబడ్డ, లోకప్రసిద్ధమైన 'ఆముక్తమాల్యద' లేదా 'విష్ణుచిత్తీయం' అనే కావ్యంలో ఒక ముఖ్యపాత్ర.

బాల్యావస్థ

725 వ సంవత్సరంలో, తమిళదేశంలో ఆనాడు 'ధన్విపురం' గా పిలువబడే విల్లిపుత్తూరులో జన్మించిన పెరియాళ్వార్ శ్రీమహావిష్ణువుకు వాహనము, సేవకుడు అయిన గరుత్మంతుని అంశగా భావింప బడుతారు. క్రోధన నామ సంవత్సరం లోని మిథునమాసం, స్వాతీనక్షత్రంతో కూడుకున్న శుక్లపక్ష ఏకాదశి, ఆదివారం నాడు; పద్మావతి ముకుందాచార్యులనే పూజ్య దంపతులకు ఐదవ సంతానంగా వీరు అవతరించారు. వీరు పుడమిపై పడ్డ శుభసందర్భాన గరుడ విహంగాలు గగనమార్గంలో ప్రదక్షిణ చేస్తూ శుభశకునాలు పంపాయి. బ్రహ్మోత్సవాలలో గరుడ వాహనోత్సవ సందర్భంగా గగనాన సందడి చేస్తూ మలయప్పస్వామి వారికి మంగళధ్వానాలు పలికే ఖగరాజుల (గరుడపక్షులు) గురించి మునుపటి ప్రకరణాల్లో తెలుసుకున్నాం. తమ అంశతో ఉద్భవించిన విష్ణుచిత్తుణ్ణి గరుడపక్షులు ఆశీర్వదించడంలో అబ్బురమేముంది?

దానికి తగ్గట్లుగానే విష్ణుచిత్తుడు బాల్యం నుండే శ్రీహరి నామస్మరణలో లీనమై, వారికి తులసి, పుష్ప కైంకర్యం చేస్తుండేవాడు. దాని కోసం ఒక అందమైన, నందనవనం లాంటి ఉద్యానవనాన్ని కూడా పెంచేవారు. 'అతిథి దేవోభవ' అన్న ఆర్యోక్తిని చిత్తశుద్ధితో ఆచరిస్తూ, తమ గృహాని కేతెంచిన భాగవతులందరిలో భగవంతుణ్ణి దర్శించుకుంటూ, వారికి ఆదర పూర్వకంగా ఆతిథ్యమిచ్చి సత్కరించేవారు. విష్ణుచిత్తుని విష్ణుభక్తికి మెచ్చిన శ్రీహరి వారితో నిత్యము సంభాషించేవారు.

పాండ్యరాజు ప్రకటన

ఒకనాడు పాండ్యదేశాన్ని పరిపాలించే వల్లభదేవ మహారాజుకు ఒక ధర్మసందేహం కలిగింది. అత్యంత సులభంగా మోక్షాన్ని ప్రసాదించే దేవుడెవ్వరో తెలుప వలసిందిగా తన ఆస్థాన పండితులను, రాజగురువులను కోరాడు. మిడిమిడి జ్ఞానంతో ఎవరికి తోచిన సమాధానం వారిచ్చారు కానీ, తమ వాదనను తర్కబద్ధంగా ప్రతిపాదించ లేకపోయారు. మోక్షప్రాప్తికై ఉవ్విళ్ళూరుతున్న మహారాజుకు ఎవ్వరి సమధానమూ రుచించ లేదు. దానితో తీవ్ర అసంతృప్తికి గురియైన భూపాలుడు విశేషమైన ధనరాశి కలిగిన స్వర్ణపాత్రను సభామధ్యంలో వ్రేలాడదీసి తన ప్రశ్నకు సరియైన సమాధానమిచ్చి, దానిని శాస్త్రబద్ధంగా నిరూపించి, తనను సంతృప్తి పరచిన వారికా భూరి బహుమానం దక్కుతుందని రాజ్యమంతటా ప్రకటింపించాడు. ఎందరెందరో ఉద్దండ పండితోత్తములు ప్రయత్నించారు గానీ, వారి సమాధానాలు కూడా మహారాజుకు రుచించలేదు.



శ్రీహరి ఆన

అటు, శ్రీమహావిష్ణువు స్వతఃసిద్ధంగా పాపభీతి గలవాడు, సదాచార సంపన్నుడు, ప్రజలను కన్నబిడ్డల వలె చూచుకునేవాడు అయిన పాండ్యరాజును తన భక్తునిగా చేసుకొని అతనిని అనుగ్రహించ దలచుకుంటూ, తగిన సమయం కోసం వేచి చూస్తున్నాడు. తన అభీష్టాన్ని సిద్ధింప జేసుకోవడానికి విష్ణుచిత్తుడే తగినవాడని నిర్ధారించుకున్నాడు. ఒకనాటి ప్రాతఃసంధ్యలో, ద్వాదశ ఊర్ధ్వపుండ్రాలంకార ధారుడై తాను నిత్యం పూజలర్పించే ఆలయంలో శ్రీకృష్ణునికి తులసిమాలలు అలంకరిస్తున్న విష్ణుచిత్తునితో శ్రీహరి సంభాషిస్తూ మధురలో నున్న పాండ్యరాజు సభామందిరాని కేతెంచి, శ్రీహరి మహిమలను మహారాజుకు విశదీకరించి; నాస్తికవాదులను, అన్యమత సమర్థకులను తన వాక్పటిమతో ఓడించి; పాండ్యరాజును తన భక్తునిగా జేయమని ఆదేశించాడు. ఎల్లప్పుడూ పుష్పవనాల లోనూ, భగవత్సన్నిధి లోనూ కాలం గడిపే విష్ణుచిత్తునికి గల పాండిత్యప్రవేశం అంతంతమాత్రమే! భగవద్భక్తిలో ఓలలాడడమే తప్ప శాస్త్రగ్రంథాలను పఠించలేదు. వాదోపవాదాలలో ప్రవేశం లేదు. పాండ్యరాజు సభలో నున్న పండితమ్మన్యులతో పోటీ పడితే పరాజయం ఖాయం. శ్రీహరి అనుజ్ఞను శిరసావహించడం కోసం తానెంతటి అవమానాన్నైనా భరిస్తాడు గానీ; తన అజ్ఞానం, అపరిపక్వత వల్ల విష్ణుమూర్తికి పరాభవం జరిగితే ఎంతమాత్రం సహించలేడు. అటు భగవంతుని ఆదేశాన్ని ధిక్కరించలేడు కూడా..

అదే ధర్మసంకటాన్ని శ్రీహరి చెవిని వేశాడు. విష్ణుచిత్తుని ముందుచూపుకు, నిస్వార్థభక్తికి, నారాయణ ప్రియత్వానికి మెచ్చిన శ్రీమహావిష్ణువు నిర్భయంగా రాజాస్థానాని కేతెంచి తన వాక్పటిమతో పిడివాదుల పీచమణచమని, విష్ణుచిత్తుణ్ణి గెలిపించే భారం తనదేనని అభయమిచ్చాడు. ఆ ధైర్యవచనాలు విష్ణుచిత్తునికి కొండంత బలాన్నిచ్చాయి. భగవంతునిపై భారం వేసి వల్లభదేవుని సభాగారానికి సమాయత్త మయ్యాడు.

పండితశ్రేష్ఠుల పరాజయం

వాదోపవాదాలు ప్రారంభమయ్యాయి. విష్ణుచిత్తుడు శ్రీమహావిష్ణువు దివ్యవైభవాన్ని, వారి మహిమలను సోదాహరణంగా, అనాయాసంగా ప్రస్తావిస్తూ ప్రతివాదులను నిర్భాంత పరచాడు. శ్రీహరి మహిమ వల్ల వేదవేదాంగాలను, ఉపనిషత్తులను వల్లెవేస్తూ విష్ణువు విశ్వవ్యాపకత్వాన్ని, సార్వభౌమత్వాన్ని, ఘటనాఘటన సమర్థతను, ఆశ్రితజన పక్షపాతాన్ని విశదీకరించాడు. విష్ణుచిత్తుని వాక్పాటవానికి, ప్రాప్తకాలజ్ఞతకు, పాండితీప్రకర్షకు చిత్తైన ప్రతివాదులందరూ తోక ముడిచారు. సభికులందరూ విష్ణుచిత్తుని ప్రతిభకు హర్షోల్లాసంతో జయ జయ ధ్వానాలు చేస్తుండగా; విజయసూచకంగా రతనాల రాశులతో నిండి ఉన్న స్వర్ణపాత్ర అప్రయత్నంగా నేలపై పడింది. వల్లభదేవుని ఆనందాతిశయానికి హద్దు లేకుండా పోయింది. చిరకాలం నుండి తనను పట్టిపీడుస్తున్న సందేహం తీరిపోయింది. మోక్షప్రదాత నిస్సందేహంగా శ్రీహరే..

వారిని స్మరించుకుంటే సర్వదేవతలనూ సేవించుకున్నట్లే! తక్షణమే మహారాజు విష్ణుభక్తునిగా మారిపోయాడు. శ్రీహరి సంకల్పం కూడా నెరవేరింది.

గజారోహణం

పాండ్యరాజు ఆధ్యాత్మిక స్పర్ధలో నెగ్గి, తన జిజ్ఞాసను తీర్చిన విష్ణుచిత్తుణ్ణి నిండు పేరోలగంలో పట్టుపీతాంబరాలతో, స్వర్ణాభరణాలతో ఘనంగా సత్కరించి గజారోహణం గావించాడు. అపరిమితమైన ధనరాశుల నిచ్చి రాజోచిత మర్యాదలతో, పరివారజనంతో విల్లిపుత్తూరుకు సాగనంపాడు. విజయోత్సాహంతో స్వగృహానికి వెనుదిరిగిన విష్ణుచిత్తుడు, ఎప్పుడెప్పుడా శుభవార్తను తాను నిత్యం సేవించుకునే శ్రీకృష్ణపరమాత్మునికి చేరవేద్దామా! అని ఉవ్విళ్ళూరు తున్నాడు. కానీ, సర్వాంతర్యామికా విషయం ముందే తెలుసు. తెర వెనుక నుండి నడిపించింది వారే కదా!!

శ్రీమహావిష్ణువు ఎదురుకోలు

ఏనుగు అంబారీపై ఠీవిగా గృహాని కేతెంచుతున్న విష్ణుచిత్తునికి స్వాగతం పలకడానికై శ్రీమన్నారాయణుడు ఎదురేగాడు. శ్రీహరి ముగ్ధమనోహర రూపాన్ని తొలిసారిగా తిలకించిన విష్ణుచిత్తుడు పులకించి పోయాడు. అప్పటి వరకు శ్రీహరితో సంభాషించడమే గానీ, వారి దివ్యమంగళ స్వరూపాన్ని మునుపెన్నడూ కాంచలేదు. సౌందర్యం మూర్తీభవించిన స్వామివారికి తన దిష్టే సోకుతుందేమోనని కలత చెంది; వెనువెంటనే గజరాజుకున్న గంటలనే వాద్యపరికరాలుగా వాయిస్తూ నరదిష్టి తొలగించ డానికై పండ్రెండు పాశురాలతో మంగళాశాసనం చేశాడు. ఆ పాశురాలలో శ్రీహరి మహిమలను, పరాక్రమాన్ని వీనులవిందుగా గానం చేయడమే గాకుండా వారిని కోట్ల కొలది కల్పాలు చిరంజీవులై వర్ధిల్లాలని ఆశీర్వదించాడు. ఆ మంగళాశాసనమే అనతి కాలంలో 'తిరుప్పళ్ళాండు' గా వాసికెక్కింది. దానితో విష్ణుచిత్తుని ప్రతిభ, దైవభక్తి లోకవిదితమై, వారు 'పెరియాళ్వారు' గా పిలువ బడ్డారు. ఈ పదానికి 'పెద్ద ఆళ్వార్' అని అర్థం. తన కుమార్తె గోదాదేవికి శ్రీమహావిష్ణువుతో వివాహం జరిపించడం ద్వారా వారికా పేరు మరింత సార్థకమయ్యింది.

ఇనుమడించిన భక్తిప్రపత్తులు

విజేతగా తిరిగి వచ్చిన విష్ణుచిత్తునికి విల్లిపుత్తూరులో విశేషస్వాగతం లభించింది. శ్రీమహావిష్ణువు కృపవల్ల పెరియాళ్వార్ కు విశేషమైన సిరిసంపదలు కూడా ఒనగూడాయి. భోగభాగ్యాల ద్వారా సహజంగా వచ్చే పటాటోపలు, ఆడంబరాలు, డాంబికాలు మాత్రం పెరియాళ్వార్ దరి జేరలేదు. విష్ణువు పట్ల వారి భక్తివిశ్వాసాలు మరింతగా ఇనుమడించాయి. తనకు పాండ్యరాజు ద్వారా, శ్రీమహావిష్ణువు ద్వారా సంక్రమించిన ధనరాశులన్నింటినీ భగవత్కైంకర్యానికి, అతిథి అభ్యాగతులను ఆదరించడానికే వెచ్చించాడు. తన సాహిత్య సాధనను కొనసాగిస్తూ 'తిరుమొళి' గా పేరొందిన పాశురాల సంకలనాన్ని రచించాడు. వారిచే విరచితమైన 'తిరుప్పళ్ళాండు' మంగళాశాసనం 'నాలాయిర దివ్యప్రబంధం' లో భాగమై, ఈనాటి వరకూ వైష్ణవాలయాలలో గానం చేయబడుతోంది.

విష్ణుచిత్తుని పలుకుల్లో విష్ణుమూర్తి

విష్ణుచిత్తునిది వాత్సల్యభక్తి. శ్రీహరిని విలక్షణంగా కొలిచాడు. తనను యశోదామాతగా ఊహించుకొని, శ్రీమహావిష్ణువును చిన్నికృష్ణుని వలె లాలించేవాడు. చిన్నారి కృష్ణునికి జడలు వేస్తున్నట్లు; ఆ జడలలో పరిమళాలు వెదజల్లే మరువాన్ని, మల్లెలను తురుము తున్నట్లు; చిన్నారి చేతులను గోరింటాకుతో అలంకరించినట్లు; వెన్నముద్దలు, గోరుముద్దలు కొసరి కొసరి తినిపించినట్లు కలలు గనేవాడు. వారి రచనలలో, యశోదమ్మ వెన్నెల రాత్రులలో చిన్నికృష్ణుని సోయగం ముందు చందమామ సైతం వెలవెలా పోతాడని మురిసిపోతుంది. గొల్లభామల ఇళ్ళలో దూరి వెన్నను దొంగిలిస్తున్న చిలిపి కృష్ణుణ్ణి మందలిస్తుంది. అమాయకుడైన తన అల్లరికృష్ణుణ్ణి ఇరుగుపొరుగు వారు ఆడిపోసుకోవడం సహించలేక, వారిని నిష్ఠూరా లాడుతుంది. తాను శ్రమదమాదుల కోర్చి చేయించిన ఛత్రాన్ని, పాదరక్షలను, పిల్లనగ్రోవిని విడిచిపెట్టి; ఆలమందలతో పాటుగా అడవులలో తిరగడం వల్ల కృష్ణయ్య పాదాలు బొబ్బలెక్కడం చూడలేక తల్లఢిల్లి పోతుంది. చిట్టచివరిగా జ్ఞానోదయమైన ఆ మాతృమూర్తి సుదర్శనచక్ర ధారి యైన శ్రీకృష్ణుని అండదండ లుండగా ఇహపరాల గురించి చింతించడం వ్యర్థమని తెలుసుకుంటుంది. ఆ విధంగా, పెరియాళ్వార్ తన కృతులలో యశోదమ్మ పుత్రప్రేమను, వాత్సల్యాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించి తరించారు. యశోదమ్మతో శ్రీకృష్ణునికున్న సాన్నిహిత్యం వకుళాదేవి, వేంకటేశ్వరుల వాత్సల్యబంధంగా కలియుగంలో కూడా కొనసాగుతున్న విషయాన్ని మునుపటి ప్రకరణాలలో తెలుసుకున్నాం.

వీరు రచించిన 'పెరియ తిరుమొళి' అనే పాశురాల సంకలనాన్ని బ్రహ్మోత్సవాలలో పెక్కు సందర్భాలలో పఠిస్తారు.

జీవిత చరమాంకం వరకు శ్రీమహావిష్ణువును సేవించుకున్న పెరియాళ్వార్ తన కూతురైన 'ఆండాళ్' కు శ్రీరంగనాథస్వామితో వివాహం జరిపించి, వారికి మామగారైన ఉదంతాన్ని ముచ్చటించుకుందాం.పుట – 118 తేదీ – అక్టోబరు, 31

కులశేఖరాళ్వార్

767 వ సంవత్సరంలో, 'తిరువంజిక్కళం' అనే పట్టణాన్ని రాజధానిగా చేసుకొని సువిశాలమైన కేరళ రాజ్యాన్ని పరిపాలిస్తున్న 'దృఢవ్రతుడనే' సుక్షత్రియునకు జన్మించిన 'కులశేఖరాళ్వార్' శ్రీమన్నారాయణుని యొక్క కౌస్తుభరత్నాంశగా భావింప బడుతారు. ఎల్లవేళలా శ్రీమహావిష్ణువు వక్షస్థలంపై దివ్యకాంతులతో ప్రకాశిస్తుండే 'కౌస్తుభమణి' క్షీరసాగరమథనంలో ఉద్భవించింది. హైందవపురాణాల ననుసరించి, కౌస్తుభమణి పదునాల్గు భువనాల లోని నవరత్నాలకూ తలమానిక మైనది. అందువల్లనే ఈ మణి శ్రీమహాలక్ష్మితో సమానంగా శ్రీహరి వక్షఃస్థలంపై అలంకరింప బడే అర్హతను సంతరించుకుంది.

జననం

కుంభమాసంలో, శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన, దశమి తిథి, గురువారం నాటి శుభఘడియల్లో వీరి జననం సంభవించింది. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు అతి చిన్న వయసు లోనే ఈ బాలుడు క్షాత్రవిద్యలు, రాజనీతి

శాస్త్రంతో బాటుగా వేదవేదాంగాలనూ అభ్యసించాడు. బాల్య, కౌమారావస్థలు సంతృప్తికరంగా గడచి; యౌవనం లోకి ప్రవేశించగానే దృఢవ్రతుడు కులశేఖరుణ్ణి పట్టాభిషిక్తుని గావించి, వానప్రస్థాని కరుదెంచాడు.

శ్రీరంగక్షేత్రానికి సమాయత్తం

ధర్మబద్ధంగా సాగిన కులశేఖరుని పాలనలో సామ్రాజ్యమంతా సుభిక్షంగా ఉండేది. పౌరులందరూ తరతమ బేధాలను విడనాడి, వర్ణాశ్రమ ధర్మాలను క్రమం తప్పకుండా పాటిస్తూ, ఈతిబాధలేవీ లేకుండా సుఖసంతోషాలతో గడప సాగారు. కులశేఖరుని కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించాయి. శత్రురాజులు కన్నెత్తి చూడటానికి కూడా సాహసించలేదు. అలా కొంతకాలం రాజ్యభారం వహించిన తరువాత, లౌకిక సుఖాలపై విరక్తి చెందిన కులశేఖరుడు ముక్తిబాట పట్టాలని సంకల్పించాడు. తక్షణమే సర్వమూ పరిత్యజించి, శ్రీరంగనాథుణ్ణి సేవించుకునే నిమిత్తం వైష్ణవ దివ్యక్షేత్రాలలో ఒకటిగా పేరు గాంచిన శ్రీరంగానికి బయలుదేర దలచాడు. తాను కన్నబిడ్డల వలె ప్రేమించే ప్రజలకు తన రాజ్య నిష్క్రమణ విషయంపై సమాచారాన్ని అందించే నిమిత్తం రాజ్యమంతటా చాటింపు వేయించాడు. ఈ ఊహించని పరిణామానికి మంత్రిమండలి ఆందోళనలో పడింది. కులశేఖరుని కుమారుడింకా పసివాడు. అత్యంత సమర్థుడు, పరాక్రమ వంతుడు అయిన మహారాజు హఠాత్తుగా తీర్థయాత్రల కేగితే, రాజ్యంలో అశాంతి ప్రబలే ప్రమాదముంది. ఎన్నాళ్ళ నుండో వేచిచూస్తున్న శత్రురాజులకు అయాచిత అవకాశం లభిస్తుంది. ధర్మవర్తునుడైన రాజు అనుపస్థితిలో, ప్రజలు ధార్మిక కలాపాలకు స్వస్తి పలికి స్వార్థచింతనలో పడే అవకాశముంది. రాజ్యాని కదెంత మాత్రం శ్రేయస్కరం కాదు. ఇలా పరిపరి విధాలుగా తలపోసిన మంత్రులు, రాజ్యక్షేమాన్ని దృష్టిలో నుంచుకుని రాజుగారి తీర్థయాత్రను విరమింప జేయడానికై పథకం పన్నారు.

భగవత్సేవ కంటే భాగవతసేవే గొప్ప

మరునాటి ఉదయం ముహూర్త కాల మాసన్నమైంది. మంగళవాద్యాలు మార్మ్రోగుతున్నాయి. రాజ్యభారాన్ని, బాలుడైన తన కుమారుని సంరక్షణను మంత్రుల కప్పగించి; కులశేఖరుడు అతికొద్ది పరివారంతో శ్రీరంగానికి బయలు దేరబోతున్నాడు. ఇంతలో, మంత్రులు రచించిన రహస్య ప్రణాళికలో భాగంగా ఊర్ధ్వపుండ్రధారులైన కొందరు శ్రీవైష్ణవులు మహారాజు మందిరాని కేతెంచారు. వారిని చూడగానే కులశేఖరుని మది భక్తిభావంతో పులకించి పోయింది. వారినలా వదలి శ్రీరంగానికి తరలి వెళ్ళడం భావ్యంగా తోచలేదు. భగవద్భక్తి కంటే భాగవతుల భక్తి గొప్పదనే సత్యం మహారాజుకు విదితమే! ఏడాదికాలం శ్రీహరిని కొలుచుకుంటే వచ్చే ఫలితం, ఒక్కరోజు సద్భక్తుణ్ణి చిత్తశుద్ధితో సేవించుకుంటే వచ్చే ఫలానికి సరిసమాన మవుతుంది. ఈ విధంగా తలపోసిన కులశేఖరుడు శ్రీరంగం యాత్రను తాత్కాలికంగా వాయిదా వేసుకుని, ఆ రోజల్లా శ్రీవైష్ణవులను తికరణశుద్ధిగా సేవించుకున్నాడు. మరునాడు కూడా సరిగ్గా అలాగే జరిగింది. మంత్రుల పరోక్ష ప్రమేయం వల్ల ప్రతినిత్యము ఆ విధంగానే జరగు తుండడంతో, తీర్థయాత్ర నిరవధికంగా వాయిదా పడుతూ వచ్చింది.

రామాయణ శ్రవణం

కులశేఖరుడు రాచకార్యాలను మంత్రుల కప్పగించి, శ్రీవైష్ణవ సాంగత్యంలో కాలం గడప సాగాడు. దానికి రామాయణ పారాయణం కూడా తోడయ్యింది. శ్రీరామచంద్రుణ్ణి ప్రాణం కంటే మిన్నగా ప్రేమించే కులశేఖరుడు ఉదయం రామాయణ పఠనం తోను, దినమల్లా భాగవతోత్తముల సేవలోను, సాయంకాలాలలో పౌరాణికుల ద్వారా పారాయణం చేయబడే రామాయణ శ్రవణం లోను తలమునకలై ఉండేవాడు.

ఆ మహారాజు రామాయణ శ్రవణంలో ఎంతగా లీనమై పోయేవాడో తెలిపే రెండు ఉదంతాలు వెలుగులో ఉన్నాయి. ఒకనాడు రామాయణంలో బాలకాండ పురాణశ్రవణం జరుగుతోంది. పేరు గాంచిన పౌరాణికులు తమ హావభావ భంగిమలతో ప్రతి ఘట్టాన్ని రక్తి కట్టిస్తున్నారు. విశ్వామిత్రుని యాగ సంరక్షణార్థం దండకారణ్యాని కేగిన, పసిబాలురైన రామలక్ష్మణులు జనస్థానం లోని, భీకరమైన ఖరదూషణాదులతో సహా పధ్నాలుగు వేల రాక్షసులతో ఒంటరిగా తల పడుతున్నారు. ఆ బాలకుల అవస్థ విన్న మహారాజు హృదయం ద్రవించి పోయింది. రక్కసిమూకలపై అక్కసు పెంచుకున్నాడు. చతురంగ బలాలను తృటిలో సమాయత్తం చేసి రామలక్ష్మణుల సంరక్షణార్థం అరణ్యాని కేగసాగాడు. ఈ హఠాత్పరిణామానికి నివ్వెర పోయిన మంత్రి సత్తములు మరో ఉపాయ మాలోచించారు. వారి పథకంలో భాగంగా కొందరు శ్రీవైష్ణవులు మహారాజు కెదురేగి, రామలక్ష్మణులు రక్కసిమూకను మట్టుబెట్టారని, విజయగర్వంతో విశ్వామిత్రుని ఆశ్రమానికి చేరుకున్నారని సమాచారమిచ్చారు. శ్రీవైష్ణవులంటే విశేషమైన భక్తివిశ్వాసాలు గలిగిన కులశేఖరుడు వారి మాటలను సంపూర్ణంగా విశ్వసించాడు. తెరపిన బడ్డ మహారాజు సంతృప్తాంత రంగుడై, దండయాత్రను విరమించు కొని స్వగృహానికి వెనుదిరిగాడు.

శ్రీరామచంద్రుని సాక్షాత్కారం

మరో సందర్భంలో అరణ్యకాండ పారాయణం జరుగుతున్నప్పుడు, పౌరాణికులు సీతాపహరణ ఘట్టాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తున్నారు. సీతమ్మ తల్లి దురవస్థను విన్న కులశేఖరుని రక్తం సలసలా మరిగిపోయింది. ప్రాణాలకు తెగించి రావణునితో తల పడడానికి సిద్ధమై, సర్వసైన్యాలను తోడ్కొని; ముందువెనుకలు, పూర్వాపరాలు ఆలోచించకుండా; లంకానగరాన్ని ముట్టడించే లక్ష్యంతో సముద్రం లోనికి ప్రవేశించాడు. మంత్రులు, వీరావేశంతో నున్న మహారాజును అడ్డగించే సాహసం చేయలేక పోయారు. చిత్రాక్రాంతులై, చేష్టలుడిగి రాజుగారి దుస్సాహసాన్ని చూస్తుండి పోయారు. సరిగ్గా ఆ సమయంలో ఓ అద్భుతం జరిగింది. కులశేఖరుని అకుంఠిత భక్తికి సంతసించిన శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతంగా ప్రత్యక్షమై ప్రసన్నవదనంతో, తాను అప్పటికే రావణుణ్ణి నిర్జించి ఆతని చెర నుండి సీతమ్మను విడిపించానని విశద పరిచాడు. దానితో సంతృప్తి నొందిన కులశేఖరుడు తన సంకల్పాన్ని విరమించుకున్నాడు.

మరో పన్నాగానికి శ్రీకారం

పై సంఘటనలతో, శ్రీవైష్ణవుల పట్ల కులశేఖరుని భక్తిభావం మరింతగా బలపడింది. ఎల్లవేళలా వారి సాహచర్యం

లోనే కాలం గడపసాగాడు. రాజమహలుకు భాగవతుల తాకిడి పెరిగి పోయింది. రాజు గారిచ్చిన చనువుతో శ్రీవైష్ణవులు సభామండపం లోను, రాజభవనం లోనూ చివరికి అభ్యంతర మందిరము మరియు ఇతర రహస్యప్రదేశాలతో సహా యథేచ్ఛగా తిరుగసాగారు. ఈ విషయంపై మంత్రులు ఆందోళన చెందారు. అపరిచితులను రాజమందిరం లోకి అనుమతించడం శ్రేయస్కరం కాదు. సున్నితమైన సమాచారం శత్రురాజుల పరమయ్యే ప్రమాదముంది. ఎలాగైనా సరే, మహారాజు మదిలో శ్రీవైష్ణవుల పట్ల ఏహ్యాభావం కలిగించి, వారిని రాజమహలుకు దూరం చేసే పన్నాగం పన్నారు.

మాయమైన కళ్యాణహారం

ఒకానొక నాడు, నవమి పుణ్యతిథి యందు రాజమహలు లోని రామమందిరంలో సీతారామకళ్యాణం కన్నుల పండువగా జరుగుతోంది. మంత్రుల పథకం ప్రకారం సీతమ్మకు అర్పించ వలసిన కళ్యాణహారం మాయమైంది. దాన్ని తీవ్ర అమంగళకరంగా భావించిన కులశేఖరుడు చోరులను తక్షణమే బంధిఃచ వలసిందిగా, మంత్రులను ఆజ్ఞాపించాడు. అవకాశం కోసం ఎదురు చూస్తున్న మంత్రిమండలి సభ్యులు, సభామందిరంలో లెక్కకు మిక్కిలిగా నున్న శ్రీవైష్ణవులే చోరత్వానికి పాల్పడి ఉంటారని, మరెవ్వరికీ ఆ అవకాశం లేదని ముక్తకంఠంతో బదులిచ్చారు. వైష్ఠవులపై నేరారోపణను మహారాజు సహించలేక పోయాడు. కానీ విశ్వాసపాత్రులైన మంత్రులందరూ ఒక్కుమ్మడిగా శ్రీవైష్ణవులపై నేరం మోపడంతో నిస్సహాయు డయ్యాడు. ఏది ఏమైనా సరే శ్రీవైష్ణవులను నిర్దోషులుగా నిరూపించ దలచుకున్నాడు.

నిగ్గు తేల్చిన నాగరాజు

కులశేఖరుడు శ్రీహరిపై భారం వేసి, బుసలు కొట్టే కాలసర్పాన్ని సభామందిరానికి తెప్పించాడు. ఆ నాగరాజును తన రెండు హస్తాలతో ఒడిమి పట్టుకొని, శ్రీవైష్ణవులు నిర్దోషులైతే తనను కరవ వద్దని సర్పాన్ని ఆదేశించాడు. అంతే! ఆ కోడెత్రాచు, తన సహజ ప్రవృత్తికి భిన్నంగా కాటు వేయడానికి బదులుగా, తన పడగతో కులశేఖరుణ్ణి ఆశీర్వదించి, మంత్రివర్గ సభ్యుల సమక్షం లోనే సభాగృహం నుండి చరచరా నిష్క్రమించింది. దాంతో మహారాజుకు శ్రీవైష్ణవులపై విశ్వాసం మరింతగా పెరిగిపోయింది. ఆగ్రహోదగ్రుడైన మహారాజు హెచ్చరించడంతో, మంత్రులు అసలు విషయాన్ని విన్నవించు కున్నారు.

శ్రీరంగం ప్రయాణం

రాజ్యక్షేమం, ప్రజాక్షేమం కోరి మంత్రులు పన్నిన పన్నాగాన్ని రాజుగారు క్షమించారు కానీ కుట్రలు, కుతంత్రాలతో నిండిన రాజ్యపాలనా భారాన్ని శాశ్వతంగా వదులుకో దలచి, తన కుమారుడైన 'రెండవ దృఢవ్రతుణ్ణి' రాజుగా పట్టాభిషిక్తుని గావించాడు. వెనువెంటనే, అతికొద్ది పరివారంతో శ్రీరంగం చేరుకుని, తన చిరకాల వాంఛ నెరవేర్చుకున్నాడు.

కులశేఖరుని ఆకాంక్ష

అప్పటి నుండే వారి సాహిత్యసాధన మొదలైంది. వీరు తమ పాశురాల్లో స్వామిపుష్కరిణిలో హంసగానైనా జన్మించాలని; ఇంద్రలోకంలో రంభాది అప్సరసల సరసన ఉండే సుఖం కంటే, భూమండలాన్ని ఏలే చక్రవర్తిత్వం కంటే, స్వామిసన్నిధే శ్రేయోదాయకమని; వేంకటాచల క్షేత్రంలో చంపకవృక్షంగా నైనా జన్మించాలని; మత్తగజాలను అధిరోహించే రాచరికపు జన్మ కంటే తిరుమల క్షేత్రంలో పూపొదగా జన్మించడమే ఇష్టపడతానని తెలియ పరిచాడు. మరుక్షణమే మనసు మార్చుకుని తిరుమలలో పక్షిగా జన్మిస్తే, కొంత కాలానికి మనసు మారి ఎగిరిపోయే ఆలోచన రావచ్చని; చెట్టుగా పుడితే కొన్నేళ్ళ తరువాత తనను వంట చెరకుగా వాడుకుంటారని; పుష్కరిణిలో చేపగా పుడితే పక్షులకు ఆహార మవుతానని; అలా కొంతకాలానికి స్వామివారికి దూరమవుతానని; వీటన్నింటి కంటే, స్వామివారి ఎదుట బండశిలలా పడివుంటే అనుక్షణము వారి ముగ్ధమనోహర రూపాన్ని గాంచుతూ ఉండవచ్చని; స్వామివారి నుండి విరహమేర్పడదని అభిలషించాడు.

కులశేఖరపడి

ఆ శ్రీహరి కులశేఖరుని ఆర్తిని ఆలకించినట్లుగా అనందనిలయం లోని గర్భాలయ ద్వారం 'కులశేఖరపడి' గా వ్యవహరించ బడుతోంది. ఆ విధంగా కులశేఖరుని కీర్తి, అచంచలమైన భక్తిభావం అజరామర మయ్యాయి. 'పడి' అంటే 'ద్వారము' లేదా 'తలుపు'. స్వామివారికి అత్యంత సమీపంలో ఉండే ద్వారమిదే! సప్తద్వారాలలో చిట్టచివరిది. అర్చకస్వాములు, జియ్యంగార్లు మాత్రమే కులశేఖరపడిని దాటుకుని శ్రీవారి చెంతకు చేరుకోగలరు. మిగిలిన వారందరూ ఎంతటి ప్రముఖులైనా, చివరికి దేశాధినేతలైనా సరే కులశేఖరపడికి బయట నుండి స్వామివారిని దర్శించుకొని వెనుదిరగ వలసిందే..

గుబాళించిన సాహితీ సౌరభం

కేరళలో జన్మించి, తమిళభాషలో అద్భుతమైన పాశురాలు వ్రాయగలగడం పరమాత్ముని సంపూర్ణ కరుణాకటాక్షాల తోనే సాధ్యమైంది. శ్రీవేంకటెశ్వరుడిని, శ్రమహావిష్ణువును కీర్తిస్తూ, 'పెరుమాళ్ తిరుమొళి' అనే నూరు పాశురాల సంకలనాన్ని; 42 పాశురాలున్న 'ముకుందమాల' అనే స్తోత్రరత్నావళిని వీరు రచించారు. కేవలం వీరి పాశురాలు విని, శ్రీవేంకటేశ్వరునిపై మమకారాన్ని పెంచుకొని తిరుమల కేతెంచిన భక్తులెందరో ఉన్నారు. బ్రహ్మోత్సవాలలో, తొమ్మిదవ రోజు ఉదయం కులశేఖరుడు రచించిన 'పెరుమాళ్ తిరుమొళి' లోని పాశురాలను పఠిస్తారు.

కులశేఖరపడి రూపంలో చిరంజీవుడై, ముకుందమాల రచనతో తన కీర్తిప్రతిష్ఠలను దిగ్దిగంతాలకు వ్యాపింప జేసుకుని, విష్ణుభక్తిలో తరించి ఆళ్వార్ గా మారిన మహారాజు అరువది ఏడు సంవత్సరాల వయసులో పరమపదించాడు. పుట – 119 తేదీ – నవంబరు, 01

గోదాదేవి (ఆండాళ్)

జనకమహారాజుకు సీతాదేవి, ఆకాశరాజుకు పద్మావతీ దేవి లభించినట్లుగా పెరియాళ్వార్ గా పేరుగాంచిన శ్రీవిష్ణుచిత్తునికి గోదాదేవి లభించింది.

భూదేవి అంశ

విష్ణుచిత్తులవారు విష్ణుకైంకర్యం కోసం పూలమొక్కలకు పాదులు త్రవ్వుతుండగా, మేలిమి బంగరు మేనిఛాయతో మెరిసిపోతున్న ఓ ముక్కపచ్చలారని పసిబాలిక భూమిలో ప్రత్యక్షమైంది. ఆషాఢమాసపు శుక్లపక్షం, చవితి తిథి, మంగళవారం మధ్యాహ్నం, పూర్వఫాల్గుణి నక్షత్రం, తులాలగ్నంలో అయోనిజగా లభించిన ఆ బాలికను 'భూదేవి' అంశగా పరిగణిస్తారు. ఆమె 776 వ సంవత్సరంలో ఉద్భవించినట్లు చరిత్రకారుల అంచనా.

విష్ణుచిత్తుని దంపతులు ఆ బాలికకు 'కొదై' గా నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచసాగారు. 'కొదై' అనే తమిళపదానికి 'పూలమాల' అని అర్థం. కాలాగమనంలో అదే పేరు సంస్కృతభాషలో 'గోదేదేవి' గా రూపాంతరం చెందింది. అపారమైన విష్ణుభక్తి కలిగిన విష్ణుచిత్తుని ద్వారా పెంచి పెద్దచేయ బడటం వల్ల, అత్యంత చిన్నతనం నుండే ఆమెకు శ్రీహరి యెడ విశేషమైన భక్తిప్రపత్తులు ఏర్పడ్డాయి. విష్ణుకైంకర్యంలో తండ్రికి చేదోడు వాదోడుగా నిలిచేది. సౌకుమార్యము, సౌశీల్యము, భక్తి, జ్ఞానము, వైరాగ్యాల వంటి సద్గుణాల రాశిగా రూపుదిద్దుకున్న ఆమెకు, తండ్రిగారే పంచసంస్కారాలు చేయించారు. అసమాన సౌందర్యంతో అలరారే ఆమె రూపలావణ్యాలను, గుణగణాలను అన్నమాచార్యుడు తన కీర్తనలలో కడు రమ్యంగా వర్ణించాడు.

వారు రచించిన –

చూడరమ్మ సతులారా సోబాన పాడరమ్మ
కూడున్నది పతి చూడి కుడుత నాంచారి ...

అనే కీర్తనలో గోదాదేవిని సకల సంపదలకు నెలవైన లక్ష్మీదేవిగా, అసమాన సౌందర్యం కలిగిన మన్మథునికి మాతృమూర్తిగా, షోడశ కళాపూర్ణుడైన చంద్రునికి చెల్లెలుగా, గంభీరతకు మారుపేరైన క్షీరసాగరుని తనయగా, పద్మంలో కొలువై ఉన్న జగజ్జననిగా, మహా మహిమాన్వితురాలిగా, మృత్యువును దరిజేరనివ్వని అమృతానికి బంధువుగా, అపురూప లావణ్యవతిగా అభివర్ణించాడు. శ్రీమహాలక్ష్మి, చంద్రుడు, అమృతము ఈ ముగ్గురూ క్షీరసాగర మథనం నుండి ఆవిర్భవించినవారు కావడం వల్ల వీరిలో ఒకరితో నొకరికి సన్నిహిత సంబంధం ఉన్నదన్నమాట.

వటపత్రశాయిపై మక్కువ!

శ్రీవిల్లిపుత్తూరు పుణ్యక్షేత్రంలో వటపత్రశాయిగా వెలసిన శ్రీమహావిష్ణువుకు, తన చిన్ననాటి నుండి తండ్రిగారు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుతున్న పూజాకైంకర్యాన్ని గోదాదేవి శ్రద్ధగా గమనిస్తూ, అందులో పాలు పంచుకునేది. తన తండ్రి మరియు ఇతర భాగవతోత్తముల ద్వారా అనునిత్యం పారాయణం చేయబడే శ్రీకృష్ణభగవానుని లీలలను

శ్రద్ధాసక్తులతో ఆలకించి, తనకు తాను గోపబాలికగా అనుభూతి చెందేది. అలా మరి కొంతకాలం గడిచి ఆమె యుక్తవయస్కురా లయ్యే తరుణానికి వటపత్రశాయిపై ఆమెకున్న భక్తి కాస్తా అవ్యాజమైన, అలౌకికమైన ప్రేమగా మారింది. రోజులు గడిచే కొద్దీ ఆ ప్రేమానురాగాలు మరింత బలపడ్డాయి. రామచిలుక ద్వారా వటపత్రశాయికి ప్రేమసందేశాలు పంపుతుండేది.

తిరుప్పావై

సాధ్యాసాధ్య విచక్షణను మరచి; తన ప్రేమను పండించుకుని శ్రీకృష్ణుణ్ణి భర్తగా పొందడం కోసం గోదాదేవి 'తిరుప్పావై' అనే వ్రత మాచరించింది. 'తిరు' అనగా 'పవిత్రము' మరియు 'పావై' అనగా వ్రతము. వెరసి, తిరుప్పావై అనే పదానికి 'పవిత్రమైన వ్రతం' అని అర్థం. దీన్నే 'కాత్యాయనీ వ్రతం' గా, 'మార్గశీర్షవ్రతం' గా కూడా వ్యవహరిస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించి త్రేతాయుగంలో గోపికలు శ్రీకృష్ణుని సాన్నిధ్య భాగ్యాన్ని పొందారని ప్రతీతి. తాను తల్లిదండ్రులతో నివాసముంటున్న శ్రీవిల్లిపుత్తూరును వ్రేపల్లెగా, తన సఖులను గోపబాలికలుగా, తనను వారిలో ఒక గోపికగా తాదాత్మ్యత చెంది; అత్యంత నిష్ఠతో ఈ వ్రతాన్ని చేపట్టింది.

పాశురాల పఠనం

గోదాదేవి ముప్పై రోజుల పాటు జరిగిన ఆ వ్రతంలో, ప్రతిరోజు ఒక పాశురాన్ని రచించి శ్రీకృష్ణుని కర్పించేది. అవే పాశురాలు తరువాతి కాలంలో 'తిరుప్పావై' గా అత్యంత ప్రసిద్ధి నొంది, నాలాయిర దివ్యప్రబంధంలో భాగమై, వైష్ణవాలయాలలో పఠించ బడుతున్నాయి. ముఖ్యంగా, ధనుర్మాసంలో ప్రతి వైష్ణవాలయం నందు తప్పనిసరిగా జరిగే తిరుప్పావై పఠనం విశేషమైన ప్రాముఖ్యతను సంతరించుకుంది. తిరుమల ఆలయంలో ప్రతినిత్యము సుప్రభాత పఠనంతో నిదుర లేచే శ్రీవేంకటేశ్వరుడు ధనుర్మాసంలో మాత్రం తిరుప్పావై పఠనంతో మేల్కొంటాడు. ఈ మాసంలో మూలమూర్తి తులసిదళాలతో పాటుగా మారేడుదళాలతో కూడా అర్చన లందుకొంటాడు. గోదాదేవి నుండి చిలుక ద్వారా సందేశాలందుకొన్న ఉదంతానికి గుర్తుగా రత్నఖచిత చిలుకను; పుష్పాలతో, హరితపత్రాలతో తయారు చేసిన శుకపికాన్ని శ్రీవారి భుజస్కంధాలపై అలంకరిస్తారు. 'తిరుప్పావై' ను చిత్తశుద్ధితో పఠించినా, శ్రవణం చేసినా గోపికలకు, గోదాదేవికి కలిగినట్లే శ్రీకృష్ణపరమాత్ముని సాక్షాత్కారము, సంయోగము లభిస్తాయని భక్తుల విశ్వాసం. తిరుప్పావై పాశురాలలో శ్రీకృష్ణుని లీలలు, వివిధ అవతారాలలో శ్రీమహావిష్ణువు మహిమలు, ప్రాతఃకాలంలో ఆనాటి వ్రేపల్లె అందచందాలు, శ్రీకృష్ణుని పట్ల గోపబాలికలలో నున్న ఆప్యాయతానురాగాలు, మురళీ లోలుని ఎడబాటుతో గోపికలు అనుభవించిన విరహవేదనలు, వారి గీతాలాపనలు మృదుమధురంగాను, కర్ణపేయం గాను వర్ణించ బడ్డాయి.

త్రికరణశుద్ధిగా శ్రీకృష్ణుణ్ణే తన భర్తగా భావించి, తుదకు వారిలోనే ఐక్యమైన గోదాదేవి ఉదంతం ఇలా ఉంది –

ఆముక్తమాల్యద

వటపత్రశాయి కర్పించే నిమిత్తం ప్రతి నిత్యము తన తండ్రి అల్లే పూలమాలలను గోదాదేవి ముందుగా తానలంకరించు కునేది. పుష్పమాలా లంకరణతో ద్విగుణీకృత మైన తన సౌందర్యాన్ని దర్పణంలో చూసుకుని తనకు తనే మురిసిపోయేది. అయితే అందులో తన స్వార్థం కానీ, విషయ లాలసత్వం కానీ ఇసుమంతైనా లేదు. వటపత్రశాయి కర్పించుకో దగ్గ అసమాన సౌందర్యం తనకున్నదా? లేదా? అనే సంశయాన్ని నివృత్తి గావించు కోవడానికే ఆమె తాపత్రయమంతా.

సాధారణ రాచకాంతలే అందాలరాశులై ఉండి, తమను తాము ఎంతగానో సింగారించు కుంటారు కదా! అలాంటిది ముల్లోకాలకు ప్రభువైన శ్రీకృష్ణభగవానునికి దేవేరి కాబోతున్న తానింకెంత అందంగా ఉండాలి? మరింకెంత సుందరంగా అలంకరించు కోవాలి? అన్నదే ఆమె తపనంతా..

అంతే గాకుండా, తాను శ్రీకృష్ణుణ్ణి వివాహమాడ బోతోంది కాబట్టి వారిపైనా, వారు ధరించే మాలల పైనా తనకు సర్వాధికారాలు ఉన్నాయి. పెనిమిటి కర్పించబోయే పూమాలలను ముందుగా సతీమణి సిగారించు కోవడంలో తప్పేమీ లేదు. అలౌకికమైన ఆమె ఆలోచనలు ఈ విధంగా సాగిపోతున్నాయి. ఈ కారణంగా గోదాదేవికి తమిళంలో 'శూడిక్కొడుత్త నాచ్చియార్' అని, సంస్కృతభాషలో 'స్వోచ్ఛిష్టమాల్యదాత్రి' మరియు 'ఆముక్తమాల్యద' అనే నామాంతరాలు ఏర్పడ్డాయి. 'ఆముక్త' అంటే 'తాను విడిచిన' అని, 'మాల' అంటే 'పూలమాల' యని, 'ద' అంటే 'అర్పించుట' అని అర్థం. మొత్తంగా, 'ఆముక్తమాల్యద' అంటే 'తాను ముడిచి విడిచిన పూలదండలను పరమేశ్వరుని కర్పించే స్త్రీ' అని అర్థం. శ్రీకృష్ణదేవరాయలు రచించిన 'ఆముక్తమాల్యద' కావ్యం యొక్క ప్రధానాంశం గోదాదేవి వృత్తాంతమే!

స్వప్న సాక్షాత్కారం

విష్ణువు కర్పించబోయే పూలమాలలను ముందుగా తాను ధరిస్తున్న విషయాన్ని గోదాదేవి అత్యంత గోప్యంగా ఉంచడం వల్ల, చాలాకాలం విష్ణుచిత్తునికా విషయం తెలియరాలేదు. కొంత కాలానికి శ్రీకృష్ణుని కర్పించిన పూలమాలలో నున్న రోమం (వెంట్రుక) కారణంగా ఆ విషయాన్ని తెలుసుకున్న విష్ణుచిత్తుడు ఉగ్రుడయ్యాడు. అల్లారుముద్దుగా సాకుతున్న గారాల పట్టిని తీవ్రంగా మందలించాడు. గోదాదేవి మాత్రం శ్రీమహావిష్ణువే తన భర్త యని, ఆ చనువుతో తాను మాలలను ముందుగానే ధరిస్తున్నానని నిష్కర్షగా సమాధానమిచ్చింది. విష్ణుచిత్తుని కేంచేయాలో పాలుపోలేదు. ఇన్నాళ్ళుగా, వటపత్రశాయికి తాను ఉచ్ఛిష్టమాలలను ('ఉచ్ఛిష్టము' అనగా 'ఎంగిలి' లేదా 'వేరొకరు వాడినది' అని అర్థం) అర్పించాడన్న మాట. తనవల్ల ఎంతటి ఘోరాపరాధం జరిగిపోయింది? తనకు తెలియకుండా పొరబాటు జరిగినప్పటికీ, శాస్త్రానుసారం అవివాహిత యైన స్త్రీ చేసే తప్పొప్పులకు తల్లిదండ్రులే బాధ్యత వహించాలి. దీని వల్ల ఎంతటి దుష్పరిణామం ఎదురు కానున్నదో? విష్ణుచిత్తుడు ఇవే ఆలోచనలతో చింతామగ్నుడై ఉండి, ఆరోజు దేవునికి పూలమాలలు సమర్పించనే లేదు. ఆ దినమంతా అన్నపానాలు లేకుండా కలతనిద్ర లోకి

జారుకున్న విష్ణుచిత్తునికి స్వప్నంలో సాక్షాత్కరించిన వటపత్రశాయి తాను అనునిత్యం ఎంతో ప్రేమగా స్వీకరించే పూమాలల నెందుకు అర్పించలేదని చనువుగా ప్రశ్నించాడు. విష్ణుచిత్తుడు జరిగిన ఉదంతమంతా దేవదేవునికి వివరించి, తన అపరాధాన్ని మన్నించమని వేడుకున్నాడు. దానికా వటపత్రశాయి తన పరమ భక్తురాలైన గోదాదేవి ధరించుకొన్న మాలలే తనకత్యంత ప్రీతిపాత్రమని, మున్ముందు కూడా ఆమె అలంకరించుకున్న మాలలనే తన కర్పించాలని శెలవిచ్చాడు. శ్రీహరి సమాధానంతో విష్ణుచిత్తుని మనసు కుదుట పడింది. విష్ణుచిత్తునికి తన పుత్రిక సాధారణ యువతి కాదని, దైవాంశ తోనే ఉద్భవించిందని, ముందు ముందు గొప్ప భాగవతారిణిగా వెలుగొంద బోతోందని తోచి పుత్రికాగర్వంతో ఉప్పొంగిపోయాడు. అప్పటినుండి ఆమెను మరింత వాత్సల్యభావంతో చూస్తూ, ఆమె ధరించిన మాలలనే వటపత్రశాయి కలంకరించ సాగాడు. శ్రీవిల్లిపుత్తూరులో అదే సాంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంలో, ఆండాళ్ అమ్మవారు ధరించిన పూలమాలలను శ్రీవిల్లిపుత్తూరు నుండి వేడుకగా తెచ్చి శ్రీవేంకటేశ్వరునికి సమర్పిస్తారని ఇంతకు ముందే తెలుసుకున్నాం.

శ్రీరంగనాథునిలో ఐక్యం

గోదాదేవి దైవాంశ సంభూతురాలైనప్పటికి తండ్రిగా తన బాధ్యత ననుసరించి, యుక్తవయస్కురాలైన ఆమెను తగిన వరునికిచ్చి వివాహం చేయాలి కదా! అని విష్ణుచిత్తుడు తలపోయ సాగాడు. ఆమేమో భగవంతుడే తన భర్తయని భీష్మించుకుంది. చిత్రమైన సంకటంలో పడ్డ విష్ణుచిత్తుడు వివాహ విషయమై కూతుర్ని సంప్రదించగా అదే విషయం ఆమె ధృవీకరించి, విష్ణువును తప్ప వేరెవ్వరినీ వివాహమాడనని మరో సారి స్పష్టం చేసింది. అంతే గాకుండా, నూట ఎనిమిదిగా గల దివ్యవైష్ణవక్షేత్రాలలో నున్న శ్రీమహావిష్ణువు అవతారా లన్నింటి మహిమలను విశద పరచ వలసిందిగా తండ్రిని కోరింది. చివరికి శ్రీరంగక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీరంగనాథుడే తనకు కాబోయే భర్తయని, వారితోనే తన వివాహం జరిపించమని తండ్రిని వేడుకొంది. ఇప్పుడు విష్ణుచిత్తుని ముందున్న సమస్య మరింత జటిలమైంది. మానవమాత్రురాలిగా, భౌతికరూపంలో నున్న తన కుమార్తెకు అర్చామూర్తిగా నున్న శ్రీరంగనాథునితో వివాహమెలా సాధ్యం? అయినప్పటికీ శ్రీకృష్ణుణ్ణి ప్రాణం కంటే మిన్నగా ప్రేమించే కూతురి నిర్ణయం పట్ల నమ్మకంతో, భగవంతునిపై భారం వేసి, వివాహ ఏర్పాట్ల విషయంలో అప్పటి పాండ్యరాజు సహాయ మర్థించాడు. ఇదంతా భగవత్ప్రేరణ తోనే జరుగుతోందని విశ్వసించిన విష్ణుచిత్తుడు శ్రీరంగనాథుణ్ణే వరునిగా, శ్రీరంగాలయాన్నే వివాహవేదికగా నిర్ణయించి, బంధుమిత్రు లందరిని వివాహాని కాహ్వానించాడు. పుత్రికను సర్వాంగ సుందరంగా అలంకరింప జేసి శ్రీరంగనాథాలయం లోని వివాహవేదిక వద్దకు తోడ్కొని వచ్చాడు. అయినప్పటికీ మదిలోని సంశయం పట్టిపీడిస్తూనే ఉంది. ఈ వివాహమెలా సంపన్నమవు తుందన్న ఉత్కంఠ పాండ్యరాజుతో సహా ఆహ్వానితు లందరి మదిలో మెదులుతోంది. ఏం జరుగ బోతోందోనని అతిథులందరూ ఆసక్తితో తిలకిస్తూ ఉండగా ఏదో అదృశ్యశక్తి తనను ప్రేరేపించినట్లు, గోదాదేవి శ్రీరంగనాథుని పాదపద్మాలపై సాగిలపడింది. మరుక్షణం గోదాదేవి ఆత్మ పరమాత్మలో లీనమవ్వడంతో, ఆమె తన భౌతికకాయాన్ని త్యజించింది. వివాహ సంరంభాన్ని తిలకించటానికి విచ్చేసిన వారందరూ నిశ్చేష్టులయ్యారు. ఆ విధంగా తనను తానుగా భగవంతుని కర్పించుకున్న గోదాదేవి

అనతికాలంలో 'ఆండాళ్' గా, 'ద్వాదశాళ్వారు' లలో ఒకరిగా వినుతి కెక్కింది. 'ఆండాళ్' అనే తమిళపదానికి 'రక్షించే తల్లి' అని అర్థం. కొంతకాలం క్రితం వరకూ తమిళనాడులోని శ్రీవైష్ణవులు తమ బాలికలను 'ఆండాళ్' అని పిలిచే సాంప్రదాయముండేది. ఎత్తైన కొప్పుముడితో, నిండైన చీరెకట్టుతో, ముంజేతిపై రామచిలుకతో విలక్షణంగా గోచరించే గోదాదేవిని 'ఆండాళ్ అమ్మవారి' గా దాదాపు ప్రతి వైష్ణవాలయంలో ఈనాటికీ మనం చూస్తుంటాం.

గోదాదేవి శ్రీరంగనాథునిలో ఐక్యమైన తరువాత, వారి ఆదేశం మేరకు విష్ణుచిత్తుడు తిరిగి శ్రీవిల్లిపుత్తూరు చేరుకుని, సుదీర్ఘకాలం వటపత్రశాయిని సేవించుకున్న అనంతరం పరమపదం చెందారు.

సాహిత్యసాధన

గోదాదేవి తిరుప్పావైతో పాటుగా, 'నాచ్చియార్ తిరుమొళి' అనే 140 పాశురాల సంకలనాన్ని కూడా రచించింది. తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా, ఎనిమిదవ రోజు సాయంత్రం జరిగే 'అశ్వవాహనోత్సవం' లో నాచ్చియార్ తిరుమొళి పారాయణం జరుగుతుంది. పుట-120 తేదీ - నవంబరు, 02

తిరుమంగై ఆళ్వార్

శ్రీమహావిష్ణువు చేబూని ఉండే 'శారంగము' అనే ధనుస్సు యొక్క అంశగా భావించబడే తిరుమంగై ఆళ్వార్ తమిళదేశం లోని 'కురయలూరు' అనే గ్రామంలో జన్మించారు. శ్రీమహావిష్ణువు కున్న సహస్రనామాలలో 'శారంగపాణి' యనే నామధేయం కూడా ఒకటి.

776 వ సంవత్సరంలో, కార్తీకమాసపు కృత్తికానక్షత్రంలో జన్మించిన వీరు సేనాధిపతిగా, రాజప్రతినిధిగా, భాగవతోత్తమునిగా, చోరుశేఖరునిగా, కవిపుంగవునిగా అనేక పాత్రలు పోషించి; వైష్ణవదివ్యక్షేత్రాల నెన్నింటినో సందర్శించి విష్ణుసాయుజ్యం పొందారు. వారి జీవన గమనానికి సంబంధించిన ఆసక్తికరమైన గాథ అనేక దయనీయ మలుపులు తిరుగుతూ కరుణ, భక్తిరస ప్రధానాలుగా చదువరులలో ఉత్సుకత నింపుతుంది.

కంచి వరదుని కటాక్షం

'నీలుడు' అనే కడజాతి వానికి జన్మించిన తిరుమంగై ఆళ్వార్ జన్మనామం కూడా 'నీలుడే'! బాల్యం నుండి కులవిద్యతో పాటుగా యుద్ధవిద్య లన్నింటిలో అత్యంత నైపుణ్యం సంపాదించడంతో అప్పటి చోళరాజు నీలుణ్ణి సైన్యాధిపతిగా, తన సామ్రాజ్యంలో కొంత భాగానికి రాజప్రతినిధిగా నియమించాడు. క్షాత్రవిద్యలతో పాటుగా భగవదారాధానలో కూడా అమితాసక్తిని ప్రదర్శించే నీలుడు ప్రజల నుండి పన్నుల ద్వారా సేకరించిన సొమ్మును ప్రభుత్వ కోశాగారంలో జమ చేయకుండా, భగవత్కైంకర్యాలకు వెచ్చించేవాడు. పన్నుబకాయిలు పేరుకు పోవడంతో, చోళప్రభువు నీలునిపై 'ప్రభుత్వనిధుల మళ్ళింపు' నేరం మోపి; అతనిని నిత్యపూజలకు నోచుకోని ఒక వైష్ణవాలయంలో బంధించాడు. అలా పెక్కుదినాలు ఆకలిదప్పులతో అలమటిస్తూ బందీగా ఉన్న నీలుడు తన అన్నపానాదుల కోసం, సౌకర్యం కోసం, స్వేచ్ఛ కోసం చింతించకుండా; భగవదార్చన చేయలేక పోయినందుకు కృంగిపోయాడు. త్వరలో తనను విడుదల చేయించి,

తనచే నిత్యపూజ జరిపించు కొమ్మని పరమేశ్వరుణ్ణి వేడుకొన్నాడు. అతని త్యాగనిరతికి, నిస్స్వార్థచింతనకు, భక్తిశ్రద్ధలకు ముగ్ధుడైన కంచి వరదరాజస్వామి నీలునికి స్వప్నంలో సాక్షాత్కరించి ఒక గుప్తనిధి జాడ తెలియజేశాడు. నీలుడు చోళరాజు సమ్మతితో నిధిని తెగనమ్మగా సమకూడిన సొమ్ముతో పన్నుబకాయిలను జరిమానాతో సహా తీర్చివేసి, మిగిలిన రొక్కాన్ని భగవత్కైంకర్యానికై వినియోగించాడు. అంతే గాకుండా తన ఆధ్యాత్మిక చింతనకు అడ్డుగా నున్న రాచకొలువును విడనాడి, శ్రీహరిని కొలుచుకుంటూ కవితా వ్యాసంగంలో మునిగి పోయాడు. తన పాశురాల సంకలనమైన 'పెరియ తిరుమొళి' లో శ్రీమన్నారాయణుని కథానాయకునిగా, తనను కథానాయకిగా ఊహించుకొని మధురభక్తిని ప్రకటించాడు.

మంత్రోపదేశం

కాలాంతరాన, ఒకానొక సరోవరంలో జలకమాడుతున్న 'కుముదవల్లి' అనే గంధర్వకన్యను కాంచి మోహించిన నీలుడు ఆమె విధించిన మొదటి షరతు ప్రకారం పంచసంస్కారాలు గావించుకొని, శ్రీవైష్ణవునిగా పునర్జన్మ నెత్తి, ఆమెను శాస్త్రసమ్మతంగా పరిణయ మాడాడు. ఆమె విధించిన రెండవ షరతు ననుసరించి ఒక సంవత్సరకాలం పాటు ప్రతినిత్యం వేయిమంది శ్రీవైష్ణవులకు అన్నసంతర్పణ కావించే మహత్కార్యానికి పూనుకున్నాడు. ప్రతిరోజూ వేయిమందికి అన్నదానమంటే అది మహారాజులకే గానీ, సామాన్యులకు సాధ్యపడే కార్యం కాదు. కొద్దికాలానికే నీలుని ఆర్థిక వనరులన్నీ అడుగంటి పోయాయి. అన్న సంతర్పణను కొనసాగించడం శక్తికి మించిన భారమైంది. రేయింబవళ్ళు కష్టించినప్పటికీ ప్రతిరోజు వేయిమందికి అన్నవితరణకు కావలసినంత పైకాన్ని కూడబెట్ట లేకపోయాడు. ఆరునూరైనా సరే, భాగవతుల విషయంలో సతీమణి కిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టు కోవలసిందే! ఎంతకూ తరుణోపాయం కానరాక పోవడంతో, నీలుడు భావసారూప్యత గలిగిన కొందరు వైష్ణవభక్తులను కూడదీసి, చోరబృందంగా ఏర్పడి, బందిపోటు తనాలకు పాల్పడసాగాడు. శాస్త్రాలను క్షుణ్ణంగా అభ్యసించిన నీలుని దృష్టిలో చోరవృత్తి నేరమే అయినప్పటికీ, దానికి పరిహారముంది. కానీ వాగ్దానభంగం మాత్రం ప్రాయశ్చిత్తం లేని నేరం. అది కుడా, భాగవతోత్తముల విషయంలో అనృతానికి (అసత్యం) పాల్పడడం మరింత మహాపరాధం. ఇలా తర్జన భర్జన పడిన అనంతరం అక్రమ మార్గాలలో ధనార్జన చేసినవారి నుండి మరియు నాస్తికుల నుండి ధనాన్ని దొంగిలించి, ఆ సొమ్ముతో శ్రీవైష్ణవులకు అన్నసంతర్పణను నిరాటంకంగా కొనసాగించాడు. ఇలా కొంత తడవు జరిగిన తరువాత శ్రీరంగనాథుడు తిరుమంగళై ఆళ్వార్ భక్తిశ్రద్ధలను పరీక్షింప గోరాడు. శ్రీరంగనాథుడు ఒక పెళ్ళిబృందంలో వరుని రూపంలో ఊరేగుతూ తనను దోచుకోబోతున్న నీలునికి తారసపడి, స్వీయరక్షణకై అతనితో ముష్టియుద్ధం గావించాడు. తన ప్రాణాలకు తెగించి వీరోచితంగా పోరాడిన నీలుడు పెళ్ళిబృందం వారి ఆభరణాలను, ధనాన్ని దోచుకున్నాడు. కానీ వారి మానప్రాణాల కేమాత్రం హాని తలపెట్టలేదు. ఊరేగింపులో నున్న వైష్ణవుల జోలికి పోలేదు. అతని సాహసాన్ని, కార్యనిరతిని, వాగ్దానాన్ని నిలబెట్టు కోవడానికి ప్రదర్శించిన తెగువను, శ్రీవైష్ణవుల పట్ల అతనికున్న నిబద్ధతను చూచి ముచ్చట పడిన శ్రీరంగనాథుడు స్వయంగా ప్రత్యక్షమై నీలునికి 'నారాయణాక్షరి' మంత్రోపదేశం కావించాడు. శ్రీరంగశాయిని కనులారా కాంక్షించిన తిరుమంగై ఆళ్వార్ భక్తిశ్రద్ధలు మరింతగా ఇనుమడించాయి.

విష్ణుసాయుజ్యం

అప్పటికే చోరవిద్యలో ఆరితేరిన తిరుమంగై ఆళ్వార్ తన చోరవృత్తిని యథేచ్ఛగా కొనసాగించి, ఆ వచ్చిన సొమ్ముతో శ్రీరంగంలో అచ్చెరువొందే అనేక నిర్మాణాలను చేపట్టాడు. వాటిలో కొన్ని ఇప్పటికీ చూపరులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతాయి. అత్యద్భుత కళాఖండాలు సృష్టించిన వేలాది శిల్పకారులకు కూలి డబ్బులు సైతం చెల్లించలేని దయనీయస్థితికి చేరుకున్న తిరుమంగై ఆళ్వార్ తన సర్వస్వాన్ని ధారపోసి, అన్నపానాదులు సైతం త్యజించి, తాను కలగన్న నిర్మాణాలన్నింటినీ పూర్తిచేసి, పరమ భాగవతోత్తము డనిపించుకున్నాడు. తదనంతరం చిరకాలం శ్రీరంగనాథుని కైంకర్యంలో తరించి, పెక్కు వైష్ణవక్షేత్రాలను సందర్శించుకొని మోక్షప్రాప్తి నొందాడు.

నామాంతరాలు

విష్ణుభక్తి ప్రధానంగా కలిగినప్పటికీ, అనేక విద్యలలో ఆరితేరిన వాడవ్వటం వల్ల, తిరుమంగై ఆళ్వార్ కు అనేక నామాంతరా లున్నాయి. బహుముఖ ప్రజ్ఞాశాలి యైన తిరుమంగై ఆళ్వార్, ఆ నామాలన్నింటికీ సార్థకత చేకూర్చాడు. అనన్య సామాన్యమైన కవితాసామర్థ్యం కలిగి యుండటం వల్ల 'చతుష్కవి శిఖామణి' గాను; రాజాస్థానంలో నున్నపుడు శత్రువులకు సింహస్వప్నంలా ఉండటం వల్ల 'పరకాలుని' గాను; వైష్ణవభక్తులకు తలమానికంగా భాసిల్లడం ద్వారా 'తిరుమంగై ఆళ్వార్ గాను ఖ్యాతి నొందాడు. వారి పండితీప్రకర్ష ద్వారా 'ఆశుచిత్రమధురవిస్తరకవితానిర్మాణదక్షులు' అనే బిరుదును కూడా స్వంతం చేసుకున్నారు.

సాహిత్యసాధన

వీరు తమ రచనల్లో శ్రీవేంకటేశ్వరుణ్ణి భూమ్యాకాశలపై పాదాల నుంచిన త్రివిక్రమావతారునిగా, గజేంద్రమోక్షప్రదాతగా, అష్టదిక్కుల సంరక్షకునిగా, బదరికాశ్రమవాసిగా, సప్తలోక సంచాలకునిగా ఇంకా అనేక రకాలుగా అభివర్ణించాడు. 'ఓం నమో వేంకటేశాయ' అనే అష్టాక్షరీ మంత్రాన్ని జపించిన వారికి పునర్జన్మ రాహిత్యం సంప్రాప్తిస్తుందని కూడా వీరు తమ రచనల ద్వారా స్పష్ట పరిచారు. తిరువళుక్కూత్తిరుక్కై, తిరుక్కురుందాండకం, శిరియతిరుమడల్ అనే ఇతర గ్రంథాలను కూడా వీరు రచించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏడవరోజు ఉదయం 'సూర్యప్రభ వాహనోత్సవం' లో తిరుమంగై ఆళ్వార్ రచించిన 'పెరియ తిరుమొళి' లోని ఎనభై పాశురాలను; అదే రోజు రాత్రి జరిగే 'చంద్రప్రభ వాహనోత్సవం' లో 'పెరియ తిరుమొళి' లోని మరో నూటనలభై పాశురాలను పారాయణం చేస్తారు.పుట – 121 తేదీ – నవంబర్, 03

విప్రనారాయణుడు (తొండరడిప్పొడి ఆళ్వార్)

తమిళదేశం లోని కుంభకోణం అనే పుణ్యక్షేత్రంలో శ్రీమహావిష్ణువు 'శారంగపాణి' గా వెలశాడు. వీరు అతృప్తామృతునిగా వాసికెక్కారు. అతృప్తామృతమంటే 'ఎంత సేవించినా తృప్తి తీరని అమృతం'. అంటే, ఈ స్వామిని ఎంతసేపు కాంక్షించి నప్పటికీ తనివి తీరదన్నమాట.

పుష్పకైంకర్యం

కుంభకోణం క్షేత్రానికి కొద్ది దూరంలో గల మండంగుడి అనే చిన్న పట్టణంలో, ఒక విప్రోత్తమునికి కలిగిన బాలునికి 'విప్రనారాయణుని' గా నామకరణం చేశారు. ధనుర్మాసపు జ్యేష్ఠానక్షత్రాన, 787 వ సంవత్సరంలో ఉద్భవించిన వీరు శ్రీమన్నారాయణుడు ధరించే, 'వైజయంతిమాల' యని పేరొందిన పుష్పమాల యొక్క అంశగా భావింప బడుతారు. సద్బ్రాహ్మణ వంశ సంజాతు డవ్వడం వల్ల, పండితుడైన తండ్రిగారి పెంపకం వల్ల విప్రనిరాయణుడు అతి చిన్నవయసు లోనే వ్యాకరణ, తర్క, మీమాంసాది సర్వశాస్త్రాలను; వేదవేదాంగాలను అభ్యసించ గలిగాడు. దానితో బాటుగా, భగవద్భక్తిని కూడా అలవరచుకున్నాడు. యుక్తవయసు కొచ్చిన విప్రనారాయణునికి తల్లిదండ్రులు వివాహ ప్రయత్నాలు ప్రారంభింపగా, తన భగవదారాధనకు సంసారజీవిత మాటంక మవుతుందనే ఉద్దేశ్యంతో; ఆ యువకుడు వివాహ ప్రస్తావనను నిరాకరించి, ఆజన్మ బ్రహ్మచారిగా ఉండదలిచాడు. ముక్తిబాటలో పయనిస్తూ శ్రీరంగనాథుని సందర్శనార్థం 'శ్రీరంగం' చేరుకున్న విప్రనారాయణుడు రంగనాథునికి నిత్యము పుష్పకైంకర్యం చేసే లక్ష్యంతో, మరో ఆళ్వార్ శ్రీవిష్ణుచిత్తుణ్ణి స్ఫూర్తిగా తీసుకుని; ఆలయానికి సమీపంలో ఒక పుష్పవనాన్ని పెంచసాగాడు. మిక్కిలి శ్రద్ధతో సంరక్షించడం వల్ల అనతి కాలంలోనే ఆ పూదోట రంగురంగుల, పరిమళ భరిత పుష్పాలకు నెలవై, నందనవనాన్ని తలపించేంత సుందరంగా తయారై, చూపరులను ఆకట్టుకుంది. విప్రనారాయణుడు మధ్యాహ్న సమయంలో భిక్షాటనతో జీవితాన్ని గడుపుతూ; ఉదయం మరియు సాయంకాల సమయాలలో పూమాల లల్లి శ్రీరంగనాథునికి సమర్పించు కునేవాడు.

దేవదేవి ప్రతిన

ఒకానొక దినాన 'దేవదేవి' గా పిలువబడే ప్రముఖనర్తకి చోళరాజు సభలో తన నృత్యగానాలను అతినేర్పుగా ప్రదర్శించి, చోళప్రభువు నాకట్టుకొంది. రాజుగారిచే బహూకరింప బడ్డ వెల లేని కట్నకానుకలు, దాసదాసీ జనంతో పాటుగా ఆమె తన స్వగ్రామాని కేగుతూ, మార్గమధ్యలో విప్రనారాయణుని పూదోటను చూడటం తటస్థించింది. మార్గాయాసంతో అలసి ఉన్న దేవదేవి, ముచ్చట గొలుపుతున్న ఆ ఉద్యానవనంలో తన సోదరితో పాటుగా విశ్రమించింది. ఆ పూదోట సోయగానికి అబ్బురపడిన వారిరువురూ కొంత తడవు సేద తీరిన తరువాత, వారికి సర్వసంగపరిత్యాగి యైన విప్రనారాయణుడు తారసిల్లాడు. వారిరువురూ విప్రనారాయణునికి నమస్కరించగా, అద్వితీయ సౌందర్యంతో అలరారుతున్న దేవదేవిని అత్యంత సమీపం నుండి చూచి కూడా, యౌవనదశలో నున్న ఆ సాధుపుంగవుడు ఏవిధమైన చిత్తచాపల్యానికి లోనవ్వలేదు. ఆ సాధుసత్తముడు వారినాశీర్వదించి నిష్క్రమించిన తరువాత; దేవదేవి తనవంటి సౌందర్యరాశిని చూచి కూడా నిర్వికారంగా ఉండగలిగిన ఈ విప్రుడు నిశ్చయంగా ఉన్మత్తుడే (పిచ్చివాడు) నని వెటకార మాడింది. అంతట ఆమె సోదరి వీరెవ్వరో ఇంద్రియనిగ్రహం కలిగిన సాధుపుంగవుని వలె గోచరిస్తున్నారని, దేవదేవి తళుకు బెళుకులకు లొంగిపోయే సాధారణ పురుషుడు కారని, ఆ మునివర్యుని వశం చేసుకోవడం దేవదేవి వల్ల కాదని, పుణ్యపురుషులను హేళన చేయడం కూడదని హితవు పలికింది. దానితో అహం దెబ్బతిన్న దేవదేవి ఆరునెలలలో ఆ సన్యాసిని తన దారి లోకి తెచ్చుకుంటానని; అతనిని తన కోసం

సర్వం ధార పోసేటట్లుగా చేయగలనని; లేకుంటే తాను తన సోదరికి జీవితాంతం దాసిగా పడి ఉంటానని ప్రతిన పూనింది.

ముని ఆశ్రయంలో దేవదేవి

తన పంతం నెరవేర్చుకోవడానికై వెనువెంటనే రంగం లోకి దిగిన దేవదేవి తన సర్వాభరణాలను, పట్టుపీతాంబరాలను తీసివేసి; కాషాయ వస్త్రధారియై విప్రనారాయణుణ్ణి సమీపించింది. తాను సమీప గ్రామంలో నున్న ఒక వేశ్యా కుటుంబంలో జన్మించానని; తనకు చిన్నతనం నుండే ఆ వృత్తి పట్ల ఏహ్య భావముందని; కానీ తన తల్లి తనను కులవృత్తి చెపట్టడానికై ఒత్తిడి చేయసాగిందని; మీవంటి మునిపుంగవుల సమీపంలో ఉంటే మరుజన్మ లోనైనా ఉత్తమజన్మ సంప్రాప్తిస్తుందని; ఉద్యానవనంలో తలదాచుకుంటూ మొక్కలను సంరక్షించడానికి తనను అనుమతించమని; లేకుంటే తనకు అత్మహత్యే శరణ్యమని కల్లబొల్లి మాటలల్లింది. అప్పటివరకు పరస్త్రీ సాన్నిహిత్యమే లేని, లోకరీతి తెలియని విప్రనారాయణుడు దేవదేవి కపటపు మాటలను పూర్తిగా విశ్వసించి, ఆ అబల దీనావస్థకు జాలిపడి, తన ఉద్యానవనం లోని ఒక పూరిపాకలో నివసించడానికి ఆమెను అనుమతించాడు. అదే అదనుగా భావించిన దేవదేవి తాను కూడా తాపసి దుస్తులు ధరించి, తోటపని చేస్తూ, మాలలల్లడంలో విప్రనారాయణునికి సాయపడుతూ, కొంత సమయం సంయమనంతో గడిపింది. దేవదేవి ఎంత సమీపంలో నున్నప్పటికీ విప్రనారాయణుడు ఏ విధమైన వికారానికి లోనుకాలేదు. ఆరు నెలలు పూర్తికావడానికి మరికొంత సమయం మాత్రమే మిగలి ఉండడంతో దేవదేవి కలవరానికి గురై; విప్రనారాయణుణ్ణి లొంగదీసు కోవడానికి అనువైన సమయం కోసం వేచిచూస్తూ, తన కార్యం సఫలం చేయమని శ్రీరంగనాథుణ్ణి పరిపరి విధాలుగా వేడుకోసాగింది.

ఉచ్చులో చిక్కిన విప్రుడు

ఇంతలో వర్షఋతువు ఆసన్నమైంది. ఒకనాటి రాత్రి విప్రనారాయణుడు తన కుటీరంలో విశ్రమించి యుండగా ఉరుములు మెరుపులతో కూడిన కుంభవృష్టి కురియసాగింది. ఆ ఫెళఫెళారావాలకు నిద్రాభంగం కలిగిన విప్రనారాయణునికి, ఆశ్రమం బయటే విశ్రమిస్తున్న దేవదేవి దైన్యస్థితి తలపు కొచ్చింది. దయాహృదయం పెల్లుబికిన విప్రనారాయణుడు ఆరుబయలే ఒక వృక్షం క్రింద నిలుచుని జడివానలో తడిసి ముద్దవుతున్న దేవదేవిని కాంచి; తన ఆశ్రమం లోనికి వచ్చి, వర్షం వెలిసేంత వరకూ ఒక మూలన విశ్రమించడానికి ఆమెకు అనుమతి నిచ్చాడు. అదే అదను కోసం వేచియున్న దేవదేవి ఆశ్రమం లోనికి ప్రవేశించి, తన కోకిల కంఠంతో మునీశ్వరుని క్షేమ సమాచారాలడుగుతూ, వారితో సంభాషణ ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా అంత సమీపం నుండి వినవచ్చిన ఆమె మృదువైన కంఠస్వరం విప్రనారాయణునికి ఆసక్తి కలిగించింది. తన నేర్పరితనంతో దేవదేవి సంభాషణ తీరుతెన్నులను తనకు అనుకూలంగా మార్చుకో గలిగింది. అలా వారి సంవాదం సరస సల్లాపంగా మారిన కొంత తడవు తరువాత, విప్రనారాయణుడు దేవదేవి కోరికపై ఆమెను తన పాదాల నొత్తడానికి అనుమతించాడు. తొలిసారిగా అంతటి మధుర స్పర్శను ఆస్వాదించిన విప్రోత్తముడు విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయాడు. ఇరువురూ శ్రీరంగనాథుని భక్తులే! ఆ రంగశాయి లీలావినోదం వల్ల, దేవదేవి ప్రతిన నెరవేరింది. ఆరునెలల సమయం ముగిసే లోపుగానే

విప్రనారాయణుడు దేవదేవికి దాసానుదాసునిగా మారాడు. బ్రాహ్మణ్యం మంట గలిసిపోయింది. విప్రనారాయణుడు నిత్యానుష్ఠానుదులకు, భగవతారాధనకు తిలోదకా లర్పించి, ఎల్లవేళలా దేవదేవి సాంగత్యంలో కాలం గడపసాగాడు. భోగలాలసుడై, ఆశ్రమాన్ని విడిచి దేవదేవితో పాటుగా ఆమె గృహానికి చేరుకున్నాడు. సత్సాంగత్యం వల్ల దేవదేవి కూడా పరిణతి చెందింది. తన ప్రతిన విషయం మరిచి, అర్ధాంగి వలె విప్రనారాయణునికి చిత్తశుద్ధితో సపరిచర్యలు చేయసాగింది. కానీ, కేవలం ధనాపేక్ష మాత్రమే గలిగిన, కఠినాత్ముురాలైన దేవదేవి తల్లి తన సర్వస్వం అప్పటికే ధారపోసిన విప్రనారాయణుణ్ణి, నిర్దాక్షిణ్యంగా ఇంటినుండి తరిమి వేసింది. దేవదేవిపై వ్యామోహం వీడని విప్రనారాయణుడు ఆరుబయట, వేశ్య ఇంటి అరుగుపై విశ్రమించాడు.

శ్రీరంగనాథుని కటాక్షం

ఆనాటి రాత్రి లోకసంచారం గావిస్తున్న శ్రీరంగనాథస్వామికి విప్రనారాయణుడు ఆరు బయట చలిలో విశ్రమిస్తున్న హృదయ విదారకమైన దృశ్యం కానవచ్చింది. సుదీర్ఘకాలం తనను శ్రద్ధాభక్తులతో సేవించుకుని, నిరాడంబరమైన జీవితాన్ని గడిపి, విధివశాత్తూ వేశ్యాలోలుడై, నిరాశ్రయునిగా నున్న విప్రనారాయణుని దీనావస్థకు కరిగిపోయిన శ్రీరంగనాథుడు తన భక్తుణ్ణి ఉద్ధరించ దలిచాడు. వెనువెంటనే ఒక పథకానికి రూపు దిద్దాడు.

భక్తాంఘ్రిరేణువుగా పరిణతి చెందిన విప్రనారాయణుడు

తన భక్తుణ్ణి కాపాడదలచిన శ్రీరంగనాథుడు మారువేషం దాల్చి, తన ఆలయంలో దేవతార్చన కుపయోగించే ఒక పాత్రను తీసుకుని, ఒక బాలుని వేషంలో దేవదేవి ఇంటికి వెళ్ళి; ఆ పాత్రను విప్రనారాయణుడు దేవదేవికి కానుకగా పంపాడని చెప్పి నిష్క్రమించాడు. మరునాటి ఉదయం దేవాలయంలో ఆ పాత్ర అదృశ్యమవ్వడంతో కలకలం చెలరేగింది. తరువాత విచారణలో ఆ పాత్ర దేవదేవి ఇంటిలో నున్నదని తేలడంతో, ఆమెను; ఆమె ఆ పాత్రను విప్రనారాయణుడు తన వద్దకు పంపాడని చెప్పడంతో అతనిని ఇరువురిని కారాగారంలో నిర్బంధించారు. ఆనాటి రాత్రి శ్రీరంగనాథుడు చోళరాజు స్వప్నంలో కనిపించి అసలు విషయం విశదపరిచాడు. మరునాటి ఉదయం చోళప్రభువు విప్రనారాయణుని క్షమార్పణ కోరి; సాదరపూర్వకంగా, రాజోచిత సత్కారాలతో, కట్నకానుకలతో వారి ఆశ్రమానికి సాగనంపాడు. అంతటితో కనువిప్పు కలిగిన విప్రనారాయణుడు భోగలాలసమైన జీవితానికి స్వస్తి చెప్పి, తన పాపకార్యాలతో పంకిలమైన పేరును సైతం వదిలి, 'భక్తాంఘ్రిరేణువు' గా స్థిరపడి, మరింత శ్రద్ధాభక్తులతో విష్ణుసేవకు అంకిత మయ్యాడు. శ్రీరంగనాథుడు విప్రనారాయణునికి కూడా స్వప్నంలో సాక్షాత్కరించి, జరిగిన ఉదంతంలో దేవదేవి దోషం లేదని; పూర్వజన్మలో దేవలోకం లోని అప్సరస ఒక ముని శాపమహిమచే, ప్రస్తుత జన్మలో వేశ్యగా దేవదేవి రూపంలో జన్మించిందని; ముని సాంగత్యం వల్ల ఆమె శాపం తీరిపోయిందని శెలవిచ్చాడు.

అప్పటినుండి దేవదేవి భక్తాంఘ్రిరేణువుకు శిష్యురాలిగా మారి; శేషజీవితాన్ని శ్రీహరి సేవకు అంకితం చేసి, మోక్షసిద్ధిని పొందింది. తరువాత భక్తాంఘ్రిరేణువు కూడా సుదీర్ఘకాలం పాటు శ్రీమహావిష్ణువును సేవించుకుని, 'తొండరడిప్పొడి ఆళ్వార్' గా ప్రఖ్యాతి గాంచి శ్రీమన్నారాయణునిలో ఐక్యమై పోయారు.

వీరు రచించిన 'తిరుప్పళ్ళి యెళుచ్చి' అనే పది పాశురాల సంకలనం నాలాయిర దివ్య ప్రబంధంలో భాగమై, వైష్ణవ దివ్యక్షేత్రాల యందు సుప్రభాత వేళల్లో పఠించ బడుతోంది. 'తిరుమాలై' అనే మరో 45 పాశురాలను కూడా వీరు రచించి తరించారు. పుట – 122 తేదీ – నవంబరు, 04

తిరుప్పాణాళ్వార్

841 వ సంవత్సరం, వృశ్చికమాసపు రోహిణీ నక్షత్రంలో, శ్రీరంగానికి సమీపం లోని 'ఉరయూరు' అనే గ్రామంలో జన్మించిన 'శ్రీపాణయోగి' శ్రీమహావిష్ణువు యొక్క శ్రీవత్సాంశ సంభూతులుగా వాసికెక్కారు. 'శ్రీవత్సం' అంటే, శ్రీనివాసుని హృదయంలో కొలువై ఉన్న 'వక్షస్థల లక్ష్మి' అని అర్థం.

వీరు అంత్యజుడని కొందరు, వ్రీహిగుచ్ఛంలో అనగా వరిధాన్యపు కంకుల నుండి ఉద్భవించిన అయోనిజులని మరికొందరు అభిప్రాయ పడతారు. ఆజన్మబ్రహ్మచారిగా జీవితాన్ని గడిపిన వీరు అతి చిన్నతనం నుండే హరినామ స్మరణలో లీనమై ఉండేవారు.

సైకత శిల్పారాధన

శ్రీరంగనాథుణ్ణి అమితంగా ఆరాధిస్తూ, ఎల్లవేళలా శ్రీహరి నామస్మరణలో కాలం గడిపిన తిరుప్పాణాళ్వార్ శ్రీరంగాలయాన్ని జీవిత చరమాంకం వరకూ దర్శించు కోలేదు. కావేరీనది తటంలో ఉన్న శ్రీరంగం పరమపావనమైన ప్రదేశమని, అచ్చట సాక్షాత్తు శ్రీమహావిష్ణువే శ్రీరంగనాథునిగా కొలువై ఉంటారని, తాను అంత్యజునిగా జన్మించడం వల్ల తనకు శ్రీరంగంలో కాలు మోపే అర్హత లేదని, తన పాదస్పర్శతో శ్రీరంగక్షేత్రం అపవిత్ర మవుతుందని తిరుప్పాణాళ్వార్ భావించేవారు. అయినప్పటికీ, విష్ణుచింతనను వీడకుండా శ్రీరంగం పట్టణ పొలిమేర్లలో, కావేరీనది ఒడ్డున శ్రీరంగనాథుని సైకతశిల్పాన్ని మలచి, దానిని సరిగ్గా శ్రీరంగాలయం లోని రంగశాయికి అభిముఖంగా ప్రతిష్ఠింప జేసి, అనునిత్యం ఆ శిల్పాన్ని అర్చిస్తుండే వారు. ఆలయంలో కొలువై ఉన్న శ్రీరంగశాయిని తన దివ్యచక్షువులతో దర్శించుకుని సంతృప్తి చెందేవాడు.

శ్రీపాణయోగిపై రాళ్ళవర్షం

ఒకనాటి ప్రాతఃసంధ్యలో తిరుప్పాణాళ్వార్ శ్రీరంగశాయిని తన మనోఫలకంపై ముద్రించుకుని, తనచే నిర్మించబడ్డ సైకతశిల్పాన్ని తదేకదృష్టితో గాంచుతూ, పరిసరాల స్పృహ లేకుండా ధ్యానంలో నిమగ్నమై ఉన్నాడు. కర్మ, జ్ఞానేంద్రియా లన్నింటినీ హరిసేవ లోనే నిమగ్నం చేశాడు. సరిగ్గా అదే సమయానికి, పరమ భాగవతోత్తమునిగా పేరుగాంచిన లోకసారంగుడనే ద్విజోత్తము డొకరు శ్రీరంగనాథుణ్ణి అర్చించే నిమిత్తం పవిత్ర కావేరీనది జలాలను స్వర్ణకలశంలో నింపుకోవడానికై తన శిష్యులతో సహా నదీతటానికి విచ్చేశారు. వారికి మార్గమధ్యలో, అంత్యజుని వేషభాషలలో నున్న తిరుప్పాణాళ్వార్ హరినామ సంకీర్తనలో తలమునకలై కానవచ్చారు. నిత్యమూ మంగళవాద్యాల మధ్య, శిల్పకళా శోభితమైన శ్రీరంగనాథుని ఆలయంలో, స్వర్ణసాధనాలతో, పరివారజన పరివేష్ఠితుడై, అత్యంత

ఆడంబరంగా శ్రీరంగనాథుణ్ణి కొలిచే లోకసారంగునికి నిరాడంబరంగా, ఒంటరిగా సాగుతున్న తిరుప్పణాళ్వార్ భగవదారాధన విడ్డూరంగా, అనాగరికంగా తోచింది. లోకసారంగుని మదిలో ఆ సర్వసంగపరిత్యాగి పట్ల న్యూనతాభావం కలిగింది. మందీ మార్బలంతో వస్తున్న తన రాకను గమనించకుండా, హరినామ సంకీర్తనలో మునిగి, తన మార్గానికి ఆటంకంగా ఉన్న తిరుప్పణాళ్వార్ ను తక్షణమే వైదొలగమంటూ పరుషమైన పదజాలాన్ని ఉపయోగించాడు. హరినామ సంకీర్తనాలాపనలో వ్యస్తుడై ఉన్న ఆ యోగిపుంగవునిలో ఎంతకీ చలనం లేకపోవడంతో దుర్భాష లాడాడు. అంతటితో ఆగకుండా తానే గొప్ప విష్ణుభక్తుణ్ణనే అహంకారంతో, కోపోద్రిక్తుడై, అరిషడ్వర్గాలను అదుపులో నుంచుకొన లేక, తన శిష్యబృందంతో తిరుప్పణాళ్వార్ పై రాళ్ళవర్షం కురిపించాడు. భాగవతులను భగవంతుని కంటే ఎక్కువగా ఆదరించాలనే నియమం ఎరిగి ఉండి కూడా, క్షణికావేశం వల్ల పశుప్రవృత్తితో ప్రవర్తించాడు.

రక్తమోడిన రంగనాథుడు

లోకసారంగుని రాళ్ళదెబ్బలతో తిరుప్పణాళ్వార్ ఒడలంతా రక్తసిక్తమైంది. అయినప్పటికీ, బాహ్యస్మృతి లేని ఆ సాధుపుంగవుడు తన హరినామసంకీర్తనను కొనసాగిస్తూనే ఉన్నాడు. అతనిని మొండివానిగా తలచిన లోకసారంగుని బృందం ఇంకేం చేయాలో పాలుపోక, తమ దారి మళ్ళించుకొని శ్రీరంగనాథాలయానికి సాగిపోయింది. రక్తస్రావ మయ్యేటట్లుగా తగిలిన రాళ్ళదెబ్బలు తిరుప్పణాళ్వార్ ను ఏమాత్రం బాధించడం లేదు. లోకసారంగుని దుశ్చర్యలను తిరుప్పణాళ్వార్ గమనించనప్పటికీ; తన ప్రియభక్తునికి జరిగిన అవమానాన్ని, కలిగిన శారీరకబాధను శ్రీరంగనాథుడో కంట కనిపెడుతూనే ఉన్నాడు. వాస్తవానికి తన భక్తుని బాధను చూచి సహించలేక, ఆ రాళ్ళదెబ్బ లన్నింటినీ తిరుప్పణాళ్వార్ కు బదులుగా శ్రీరంగనాథుడే భరించాడు. తత్ఫలితంగా, శ్రీరంగాలయం లోని శేషతల్పశాయికి కూడా ఒడలంతా రక్తసిక్తమై పోయింది.

శ్రీరంగశాయి ఆదేశం

ఈ హఠాత్పరిణామానికి నివ్వెర పోయిన అర్చకస్వాములు ఈ విషయాన్ని మహారాజుకు విన్నవించారు. వారికి కూడా ఏంచేయాలో పాలుపోలేదు. తదుపరి కార్యాచరణను నిర్ణయించ డానికై ఆలయ సిబ్బంది, రాజోద్యోగులు తర్జన భర్జన పడుతున్న సమయంలో శ్రీరంగనాథుడు లోకసారంగుని స్వప్నంలో సాక్షాత్కరించి; అతని వల్ల ఘోరాపరాధం జరిగి పోయిందని, తన ప్రియభక్తుడైన తిరుప్పణాళ్వార్ కు తీరని అవమానం జరిగిందని, అతడు సామాన్యుడు కాడని, తన సంపూర్ణ కటాక్షానికి నోచుకున్నాడని, అతనిని తక్షణమే ఆలయానికి తోడ్కొని రమ్మని, అంగీకరించకపోతే బలవంతంగానైనా తన వద్దకు తీసుకు రమ్మని ఆనతిచ్చాడు. దాంతో లోకసారంగునికి తన తప్పిదం తెలిసి వచ్చింది. తిరుప్పణాళ్వార్ ఎంతటి మహా భక్తుడో అవగతమైంది. జరిగిన పొరపాటుకు చింతిస్తూ, శ్రీహరి ఆజ్ఞను తలదాల్చటానికై తిరిగి కావేరీ నదీతటాన్ని చేరుకున్నాడు.

మునివాహనుడైన తిరుప్పాణాళ్వార్

తిరుప్పాణాళ్వార్ చెంతకేగిన లోకసారంగుడు అతనిని క్షమాభిక్ష కోరుకున్నాడు. అజ్ఞానం వల్ల జరిగిన అపరాధాన్ని మన్నించమని పదే పదే వేడుకొన్నాడు. తిరుప్పాణాళ్వార్ మాత్రం సకల కర్మలు ఈశ్వరేచ్ఛ తోనే ఈడేరుతాయని, దానికి చింతించ వలసిన పని లేదని, తన హృదయంలో లోకసారంగుని పట్ల ఏవిధమైన ద్వేషభావము లేదని తెలిపాడు. అంతే గాకుండా; సద్బ్రాహ్మణ సంజాతుడైన లోకసారంగుడు కడజాతి వాడైన తనను క్షమార్పణ కోరరాదని, తద్వారా తాను మరింత అపవిత్రమవుతానని తెలిపాడు. లోకసారంగుని ఆహ్వానాన్ని నిరాకరిస్తూ తాను పాదం మోపడం వల్ల పరమ పవిత్రమైన శ్రీరంగక్షేత్రం అపవిత్ర మవుతుందని, ఆలయం లోనికి అంత్యజుల ప్రవేశం నిషిద్ధమని, ఏది ఏమైనా సరే ఆలయం లోనికి ప్రవేశించనని కరాఖండిగా చెప్పాడు. తీవ్ర నిరాశకు గురైన లోకసారంగుడు తిరుప్పాణాళ్వార్ ఆలయ ప్రవేశం భగవత్సంకల్పమని, శ్రీరంగనాథుని ఆదేశం అనాదరణకు గురి కారాదని, శ్రీరంగక్షేత్రంలో తన పాదాలను మోపడం ఆమోదయోగ్యం కాకపోతే తన భుజాల నధిరోహించి ఆలయప్రవేశం చేయవచ్చునని పరిపరి విధాలుగా తిరుప్పాణాళ్వార్ ను వేడుకొన్నాడు. భగవదాజ్ఞను ధిక్కరించలేని తిరుప్పాణాళ్వార్ ఎట్టకేలకు లోకసారంగుని ప్రతిపాదనకు అంగీకరించాడు. విధి లేని పరిస్థితులలో లోకసారంగుని భుజాలపై నెక్కి, ఆలయానికి అరుదెంచాడు. ఆ విధంగా లోకసారంగ ముని భుజాల పైనెక్కి శ్రీరంగక్షేత్రం లోనికి ప్రవేశించడం వల్ల, తిరుప్పాణాళ్వార్ 'మునివాహనుడి' గా వినుతి కెక్కాడు.

సాహిత్య సాధన

శ్రీమహావిష్ణువు గరుత్మంతుని పైనెక్కి ముల్లోక విహారాని కేగినట్లు, ఒక వ్యక్తి సద్బ్రాహ్మణుని భుజాల పైనెక్కి ఊరేగడమేమిటి? అంత్యజునికి ఆలయప్రవేశ మెలా సాధ్యం? ఈ విధంగా చర్చించుకుంటూ పురవీధుల్లో తిరుప్పాణాళ్వార్ ను భుజాలపై కెక్కించుకొని అనుచర సమేతంగా ఆలయానికి వెడలుతున్న లోకసారంగుణ్ణి పురజనులందరూ వింతగా చూడసాగారు. మాడవీధులను దాటి ఆలయంలోకి ప్రవేశించగానే తిరుప్పాణాళ్వార్ అలౌకిక భక్తిభావానికి గురయ్యాడు. అంత వరకూ తన జ్ఞాననేత్రాల ద్వారా మాత్రమే దర్శించుకుంటున్న శ్రీరంగనాథుణ్ణి ప్రత్యక్షంగా చూచే మహదవకాశం లభించడంతో చెప్పనలవి కాని ఉద్వేగానికి లోనైన తిరుప్పాణాళ్వార్ శ్రీరంగనాథుణ్ణి ఆపాదమస్తకం వర్ణిస్తూ ఆశువుగా పది పాశురాలను పఠించాడు. ఆ పాశురాల సంకలనం నాలాయిర ప్రబంధంలో భాగమై 'అమలనాదిపిరాన్' అనే నామంతో ప్రాచుర్యమైంది. వారు తమ కీర్తనలలో శ్రీవేంకటెశ్వరుణ్ణి సుగంధ పుష్పాలతో కూడిన తోటలతో అలరారుతున్న వేంకటాచలం లోను; సమున్నత ప్రాకార శోభితమైన శ్రీరంగంలోను ఏకకాలంలో కొలువై ఉన్న దేవదేవునిగా కీర్తించారు. వారి భక్త్యావేశాన్ని సంభ్రమాశ్చర్యాలతో తిలకిస్తూ, వారి గానమాధుర్యాన్ని వీనులవిందుగా ఆస్వాదిస్తున్న భక్తులందరి సమక్షంలో వారు శ్రీరంగనాథునిలో ఐక్యమై పరమపద సోపానాన్ని పొందారు. పుట – 123 తేదీ నవంబరు, 05

మధురకవి ఆళ్వార్

ఏ విధమైన భేషజాలకు, అరమరికలకు తావు లేకుండా జ్ఞాన సముపార్జనే ధ్యేయంగా; వయసులో తన కంటే ఎంతో చిన్నవాడైన 'నమ్మాళ్వార్' ను గురువుగా స్వీకరించడమే కాక, జీవిత చరమాంకం వరకూ వారిని సేవించుకున్న 'మధురకవి ఆళ్వార్' జీవనగమనం జిజ్ఞాసువు లందరికీ అనుసరణీయం.

ఆవిర్భావం

చైత్రమాసపు చిత్తా నక్షత్రంలో, తమిళదేశము నందలి తిరుక్కోవలూరనే పుణ్యక్షేత్రం లోని ఒక సద్బ్రాహ్మణ వంశంలో 'మధురకవి ఆళ్వార్' జన్మించారు. 108 దివ్య వైష్ణవ క్షేత్రాలలో ఒకటిగా భావింప బడే ఈ ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో, శ్రీమహావిష్ణువు 'త్రివిక్రమావతారి' గా వెలశాడు. 'ముదళాళ్వార్లు' లేదా 'యోగిత్రయం' గా ఖ్యాతి గాంచిన మొదటి ముగ్గురు ఆళ్వార్ల సమాగమం ఈ క్షేత్రం లోనే జరిగింది. ఈ ఉదంతాన్ని ఇంతకు మునుపే తెలుసుకున్నాం.

గురుశిష్యుల అనుబంధం

వీరు విష్వక్సేనుని నలుగురు ప్రధాన అనుచరులలో ఒకరైన కుముదుని అంశగా భావింప బడుతారు. గురువు నమ్మళ్వార్ విష్వక్సేనుని అంశ అయితే; వారి శిష్యుడు మధురకవి ఆళ్వార్ విష్వక్సేనుని అనుచరుని అంశ అన్నమాట. ఆ విధంగా ఆ గురుశిష్యుల సంబంధం యుగయుగాలుగా కొనసాగుతోంది. మధురకవి ఆళ్వార్, తన గురువుగారైన నమ్మాళ్వార్ కంటే దాదాపు అర్ధశతాబ్దం ముందుగా జన్మించారు. శిష్యుడు, గురువు గారి కంటే వయసులో దాదాపు యాభై వసంతాలు పెద్దవాడవ్వటం చాలా అరుదుగా జరుగుతుంది. జ్ఞానసముపార్జనకు భౌతికాంశమైన వయసుతో పని లేదని; పూర్వజన్మ సుకృతము, భగవదారాధనము, నిరంతర సాధన, లౌకికబంధాల పట్ల విముఖత వీటి వల్లనే జ్ఞానసిద్ధి కలుగుతుందని; ఈ గురుశిష్యుల బంధం వెల్లడిస్తుంది.

మధురకవి జన్మనామం ఏమిటో తెలియనప్పటికీ; మృదుమధురంగా సాగిపోయే వారి కవిత్వం వల్లా, సాధువర్తన వల్లా, వారు ప్రవచించిన మధురభక్తి భావనా పూరిత గీతాలాపనల వల్ల వారు 'మధురకవి ఆళ్వార్' గా సార్థక నామధేయు లయ్యారు. మిగిలిన ఆళ్వార్ లందరు శ్రీమహావిష్ణువును, వారి అవతార విశేషాలను సేవించుకుంటే; వారికీ భిన్నంగా, మధురకవి ఆళ్వార్ మాత్రం తన గురువైన నమ్మాళ్వార్ నే భగవద్రూపునిగా ఆరాధించుకొని తరించారు.

దివ్యజ్యోతి దర్శనం

తమిళనాడు పరిసరాల లోని పుణ్యక్షేత్రాలనే కాక సుదూరంగా నున్న ద్వారక, ఉజ్జయిని, కాశి, గయ, బదరీనాథ్, అయోధ్య వంటి ఉత్తరదేశపు తీర్థస్థలాలను కూడా వీరు సందర్శించారు. వీరు విష్ణుభక్తులే అయినప్పటికీ, వీరు సందర్శించిన క్షేత్రాలలో పెక్కు శైవక్షేత్రాలు కూడా ఉన్నాయి.

ఒకసారి మధురకవి ఆళ్వార్ అయోధ్యను సందర్శిస్తూ, ఆ ప్రదేశంలో నడయాడిన సీతారామలక్ష్మణులను తలంచుకుంటూ మధురభక్తి భావనలలో మునిగి యున్నప్పుడు; వారికి దక్షిణదిశగా ఒక దివ్యతేజస్సు కానవచ్చింది. అది కీకారణ్యాలను దహించి వేసే కార్చిచ్చు కాదని, దివ్యజ్ఞానాన్ని ప్రసాదించే జ్ఞానజ్యోతి యని నిర్ధారించుకున్న మధురకవి ఆళ్వార్; దానిని సమీపం నుండి దర్శించు కోవాలనే లక్ష్యంతో ఆ జ్యోతి కానవస్తున్న దిశగా పెక్కుదినాలు ప్రయాణించారు. ఆ జ్యోతికి మూలమైన పుణ్యపురుణ్ణి దర్శించుకుంటే తనకు వైరాగ్యప్రాప్తి కలుగుతుందనే లక్ష్యంతో; పగలంతా విశ్రాంతి తీసుకుంటూ, రాత్రివేళల్లో ఆ దివ్యజ్యోతి కానవచ్చే దిక్కుగా దాదాపు రెండు మాసాలు పయనించిన తరువాత ఆ కాంతిపుంజం 'కురుకాపురి' అనే గ్రామంలో ఆవిర్భవించిందని; మరి కొంతసేపు ప్రయత్నించిన తరువాత ఆ గ్రామంలో వెలసియున్న ఆదినాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న చింతచెట్టు తొర్రలో నుండి ఆ దివ్యతేజస్సు ఉదయిస్తోందని ఖాయపరచు కొన్నాడు. ఆ ప్రదేశంలో మధురకవి ఆళ్వార్ కు దివ్యతేజస్సుతో వెలుగొందుతున్న, ద్వాదశ ఊర్ధ్వపుండ్రధారి యైన పుణ్యపురుషుడు సాక్షాత్కరించాడు. శ్రీవైష్ణవులు ఫాలభాగంతో మొదలుకొని, శరీరం లోని పన్నెండు భాగాలపై ధరించే తిరునామాలను ద్వాదశ ఊర్ధ్వపుండ్రాలుగా వ్యవహరిస్తారు.

నమ్మాళ్వార్ కు శిష్యరికం

ఆ పుణ్యపురుషునితో వేదాంత విషయాలపై కొంత తడవు చర్చ జరిగిన తరువాత వారే శఠకోపయోగిగా పిలువబడే 'నమ్మాళ్వార్' అని మధురకవి ఆళ్వార్ గ్రహించారు. వారిని తనకు పరమాత్మునిచే పంపబడ్డ గురువుగా భావించి; తనను శిష్యునిగా స్వీకరించమని నమ్మాళ్వార్ వారిని వేడుకొన్నాడు. జిజ్ఞాసువైన శిష్యుడు లభించడం పట్ల సంతుష్టి చెందిన నమ్మాళ్వార్ అందుకు సమ్మతించడంతో వారికి శిష్యునిగా మారి, జీవితాంతం వారికి శుశ్రూష చేసి, తన ధర్మసందేహాలను నివృత్తి చేసుకోవడమే గాకుండా; నమ్మళ్వార్ వద్దనుండి అనేక ధర్మసూక్ష్మాలను కూడా అవగతం చేసుకున్నారు.

నమ్మాళ్వార్ అత్యంత చిన్నతనం లోనే పరమపదాన్ని చేరుకోవడంతో వ్యాకులచిత్తుడైన మధురకవి అదే ప్రదేశంలో వారికి ఒక ఆలయం నిర్మించి, తన జీవితాంతం అందులోనే పూజాదికాలు నిర్వహిస్తూ తాను కూడా విష్ణుసాయుజ్యాన్ని పొంది ఆళ్వార్ గా వినుతి కెక్కారు.

వీరు రచించిన పదకొండు పాశురాల సంకలనం 'కణ్ణినుణ్ శిరుత్తాంబు' గా ఖ్యాతినొంది నాలాయిర దివ్యప్రబంధంలో భాగమైంది.

మధురకవి ఆళ్వార్ ను ద్వాదశ ఆళ్వారులలో ఒకరిగా పరిగణించే విషయంలో కొన్ని భిన్నాభిప్రాయాలు నెలకొని ఉన్నాయి. కొందరు మధురకవి ఆళ్వార్ స్థానంలో, శ్రీమద్రామానుజాచార్యుల వారిని ద్వాదశ ఆళ్వారులలో ఒకరిగా భావిస్తారు. వీరి గురించిన సమగ్ర సమాచారాన్ని మునుపటి ప్రకరణాలలో తెలుసుకున్నాం.

రామానుజుల వారికున్న పెక్కు నామాలు ఎలా వచ్చాయో ఈరోజు తెలుసుకుందాం.

రామానుజుల వారి నామాంతరాలు

- సాక్షాత్తు చదువుల తల్లి సరస్వతి ద్వారా ప్రశంస లందు కునేంత గొప్పగా బ్రహ్మసూత్రాలకు భాష్యాన్ని రచించడం వల్ల 'శ్రీభాష్యకారులు' గా ఖ్యాతినొందారు.
- శ్రీరామచంద్రునికి తమ్ముడైన లక్ష్మణునిలా, శ్రీమహావిష్ణువు తల్పమైన ఆదిశేషువులా అంకితభావంతో హరియాజ్ఞను అమలు పరుస్తాడని భావించి; మేనమామచే నామకరణం చేయబడిన జన్మనామం 'రామానుజుడని' (రామునికి అనుజుడు, అంటే 'తమ్ముడు' అని అర్థం) పిలువ బడ్డారు.
- శ్రీరంగనాథుని ఆదేశానుసారం రంగనాథాలయంలో పెక్కు సేవలను, ఉత్సవాలను ప్రవేశపెట్టి నందువల్ల 'ఉడయవర్లు' గా వినుతికెక్కారు.
- 'భూతపురి' అనే నామాంతరం కలిగిన శ్రీపెరంబుదూరులో జన్మించి చరిత్రలో చిరస్థాయిగా మిగిలిపోయే మహాత్కార్యాలను అకుంఠిత దీక్షతో, విజయవంతంగా చేపట్టడం వల్ల; 'భూతపురి ముని' గా వ్యవహరింప బడ్డారు.
- సర్వసంగ పరిత్యాగియై భిక్షాటన కొనసాగిస్తూ, 'తిరుప్పావై' ను పఠిస్తూ ప్రజలలో భక్తిభావాన్ని ఇనుమడింప జేయడం వల్ల 'తిరుప్పావై జియ్యరు' బిరుదాన్ని పొందారు.
- శ్రీరంగనాథునితో వివాహం జరిగితే, సుందరాచల వాసియైన సుందరబాహుస్వామికి చక్కెరపొంగలిని, వెన్నభాండాలను నైవేద్యంగా సమర్పించు కుంటానని గోదాదేవి మొక్కుకుంది. కానీ శ్రీరంగనాథునితో వివాహం జరిగిన వెంటనే ఆమె దేవునిలో ఐక్యమవ్వడం వల్ల ఆమె మొక్కు అసంపూర్తి గానే మిగిలిపోయింది. చెల్లెలి మొక్కును అన్నగారిలా నిబద్ధతతో తీర్చడం వల్ల రామానుజులు వారు 'గోదాగ్రజుని' గా పరిగణింప బడుతారు.
- ఒకానొకప్పుడు తన గృహంలో ఆశ్రయం పొందుతున్న తన గురువు గారైన తిరుక్కచ్చి నంబిని, తన భార్య చులకనభావంతో చూడడంతో; ఎంతగానో కలత చెందిన రామానుజులవారు ఆమెను పరిత్యజించి, సన్యాసాశ్రమాన్ని స్వీకరించారు. వారి గురుభక్తికి మెచ్చిన కంచి వరదరాజస్వామి రామానుజులవారిని 'యతీంద్రుని' గా సంబోధించడంతో ఆ నామాంతరం కూడా విస్తృతంగా ప్రాచుర్యం లోకి వచ్చింది.
- రామానుజుని గురువర్యులు ఎంతో రహస్యంగా వారికి చేసిన మంత్రోపదేశాన్ని, గురువుగారి ఆదేశానికి విరుద్ధంగా; జనులందరూ మంత్రాన్ని తెలుసుకొని మోక్షాన్ని పొందాలనే పరోపకారభావంతో బహిర్గత పరచడం వల్ల 'ఎంబెరుమన్నారు' గా విఖ్యాతి నొందారు.

ఆళ్వార్ల విరచితమైన దివ్యప్రబంధగానమే ప్రధాన ఇతివృత్తంగా, ప్రతిదినము జరిగే శాత్తుమొర సేవను స్మరణకు తెచ్చుకుంటూ ద్వాదశ ఆళ్వార్లనే అధ్యాయాన్ని ముగిద్దాం.

శాత్తుమొర సేవ

ద్వాదశాళ్వారులచే రచించబడ్డ పాశురాల సంకలనమైన దివ్యప్రబంధం పారాయణ చేస్తూ, శ్రీవారికి నిత్యమూ ప్రాతఃకాలంలో జరిగే సేవను 'శాత్తుమొర' సేవగా వ్యవహరిస్తారు. తిరుమల ఆలయంలో జరిగే ప్రధాన సేవలలో ఇది

కూడా ఒకటి. 'శాత్తుమొర్రై' అనే తమిళ పదానికి 'మంగళాశాసనం' అనే అర్థం ఉంది. తిరుమల ఆలయంతో పాటుగా 108 దివ్య వైష్ణవక్షేత్రాలలో కూడా శాత్తుమొర సేవ జరుగుతుంది.

ప్రతి ఉదయం ఆరు గంటల నుండి జరిగే ఈ సేవలో శ్రీవైష్ణవశాఖకు చెందిన ప్రముఖులందరూ పాలు పంచుకుంటారు. ఈ సేవలో పాల్గొనే వారందరూ సాంప్రదాయ సిద్ధమైన శ్రీవైష్ణవ వేషధారణ కలిగి ఉండడంతో పాటుగా గర్భచక్రాంకితులు గానో లేదా తప్తచక్రాంకితులు గానో ఉండడం అనివార్యం.

జియ్యంగార్ సమర్పించిన తులసిదళాలతో అర్చకస్వాములు స్వామివారి పాదారవిందాలను పూజిస్తుండగా శయనమందిరంలో ఎదురెదురు వరుసలలో వేచియున్న శ్రీవైష్ణవులందరూ గోదాదేవి విరచిత తిరుప్పావై లోని చివరి రెండు పాశురాలను రెండేసి సార్లు పఠిస్తారు. దీనితో పాటుగా పెరియాళ్వార్ విరచిత 'తిరుప్పళ్ళాండు' సంకలనం లోని మొదటి రెండు పాశురాలను, మణవాళ మహాముని వారి రెండు శ్లోకాలను, శ్రీమద్రామానుజాచార్యుల వారి రెండు ప్రశంసా శ్లోకాలను కూడా రాగ, భావ యుక్తంగా, ఆర్తితో పఠిస్తారు. శుక్రవారం నాటి శాత్తుమొర సేవలో స్వల్ప వ్యత్యాస ముంటుంది.

పాశురాల పారాయణం ముగిసిన తరువాత జియ్యర్ స్వామి కర్పూరహారతిని వెలిగించగా; అర్చకస్వాములు ఆ హారతిని శ్రీవారికి, పరివార దేవతలందరికీ సమర్పిస్తారు. 'పల్లాండు పల్లాండు' అంటూ సమర్పింప బడే ఈ 'శాత్తుమొర హారతి' విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. 'పల్లాండు' అనే పదానికి 'రక్ష', 'వర్ధిల్లు' అనే అర్థాలు ఉన్నాయి. ఈ హారతి నిచ్చేటప్పుడు 'పల్లాండు పల్లాండు పల్లాయి రత్తాండు' అంటూ స్వామివారిని ఆశీర్వదిస్తారు కనుక, ఈ సేవ 'శాత్తుమొర' లేదా 'మంగళాశాసనం' గా పిలువ బడుతుంది.

మొదట ఏకాంతంగా శ్రీవారికి జరిగే శాత్తుమొర సేవ, తరువాత భాష్యకార్ల సన్నిధిలో పలువురి సమక్షంలో బహిరంగంగా జరుగుతుంది. ఈ సేవలో పాల్గొన్న భక్తులకు 'శాకాన్నం' లేదా 'కదంబాన్ని' మరియు దధ్యోజనాన్ని ప్రసాదంగా అందజేస్తారు.

'నాలాయిర దివబంధం' లేదా 'ద్రావిడవేదం' గా పేరొందిన నాలుగు వేల పాశురాలను రచించి, తిరుమల వేంకటేశ్వరునితో పాటుగా శ్రీమహావిష్ణువు అవతార విశేషాలన్నిటినీ వేనోళ్ళతో కీర్తించి, శ్రీమహావిష్ణువు లీలలు జనబాహుళ్యం లోనికి చొచ్చుకొని పోయేటట్లుగా అవిరళ కృషి చేసి, వందల ఏళ్ళుగా విష్ణుభక్తుల మదిలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నట్టి ద్వాదశాళ్వారుల పుణ్యచరిత్ర పన్నెండు ప్రకరణాలతో సుదీర్ఘంగా సాగి, నేటితో ముగిసింది. పుట – ~~114~~ 124 తేదీ – నవంబరు, 06

విఖనస మహర్షి

చరిత్ర కందని కాలం నుండి, కలియుగ వైకుంఠమైన తిరుమల ఆలయంతో సహా మరెన్నో ప్రముఖ వైష్ణవాలయాలలో ప్రతినిత్యం జరిగే పెక్కు సేవలు, కైంకర్యాల నుండి; వార, పక్ష, మాస, సంవత్సరోత్సవాల వరకు జరిగే వైదిక ప్రక్రియలన్నీ శ్రీవైఖానస ఆగమశాస్త్రాన్ని అనుసరించే నిర్వహింప బడుతుంటాయి. ఈ సాంప్రదాయానికి మూలపురుషు డైనట్టి 'విఖనసమహర్షి' గురించి తెలుసుకుందాం.

...వైఖానః సామగాయనః

ఆత్మయోనిః స్వయంజాతో వైఖానః సామగాయనః ।
దేవకీనందనః స్రష్టా క్షితీశః పాపనాశనః ॥

శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రంలో శ్రీమహావిష్ణువును వర్ణించిన వేయి నామాలలో 'వైఖానః' అనే నామం (106 వ శ్లోకం, 987 వ నామం) కూడా ఒకటి. ఈ పదం 'ఖం' అనే పదం యొక్క వ్యుత్పత్తి. 'ఖం' అంటే తొలచిన, మలచిన, తీర్చిదిద్దిన అనే అర్థాలున్నాయి. 'వైఖానః' అంటే 'తొలచిన వాడు' లేదా 'మలచిన వాడు' లేదా 'తీర్చిదిద్దినవాడు' అని అర్థం. ఈ విశ్వాన్ని సమస్త చరాచరజీవులు; భూమండలం, గ్రహాలు, పంచభూతాలు వంటి నిర్జీవులు; తమ మనుగడను నిరంతరాయంగా సాగించడానికి వీలుగా తీర్చిదిద్దిన వాడు కనుక శ్రీమహావిష్ణువు 'వైఖానః' అని కీర్తించబడ్డాడు. 'వైఖానుని' మానసం నుండి ఉద్భవించిన వాడు కనుక 'విఖనస మహర్షి' ఆ పేరుతో పిలువ బడుతున్నాడు.

విఖనసమహర్షి ఆవిర్భావం..

కృతయుగంలో నాలుగు పాదాలతో విరాజిల్లిన 'ధర్మం' క్రమంగా ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క పాదాన్ని కోల్పోతూ కలియుగంలో కేవలం ఒక్క పాదం పైనే నడుస్తుందని; కలియుగ వాసుల్లో విష్ణుభక్తి, పాపభీతి, మోక్షకాంక్ష లుప్తమై భోగలాలసత్వం మరియు భౌతిక సంపదల పట్ల వ్యామోహం ప్రబలడమే దానికి కారణం కాబోతోందని; భూతభవిష్యద్వర్తమానాలకు కర్తయైన శ్రీమన్నారాయణుడు తలపోశాడు. ప్రజలలో నిద్రాణమై ఉన్న విష్ణుభక్తిని మేల్కొలిపి, వారి దృష్టిని ధార్మిక చింతన వైపు మళ్ళించితే ధర్మం తిరిగి పాదుకొంటుందని విష్ణువు భావించాడు. కలియుగంలో నెలకొన్న కాల, మాన పరిస్థితుల దృష్ట్యా తపస్సు, యజ్ఞయాగాదుల వంటి సంక్లిష్ట ప్రక్రియలు ఆచరణ సాధ్యం కాకపోవడం వల్ల అర్చనలు, నిత్యపూజలు, నివేదనల వంటి సులభతరమైన వైదిక పద్ధతుల ద్వారా ప్రజలను భక్తిమార్గం లోకి మళ్ళించాలి. అందునిమిత్తం కలియుగంలో అర్చామూర్తి రూపంలో ఆవిర్భవించబోయే తనను శాస్త్రోక్తంగా అర్చించు కోవడం కోసం కావలసిన నియమ నిబంధనలను ఓ గ్రంథరూపంలో క్రోడీకరించ వలసిందిగా తన పుత్రుడైన బ్రహ్మను కోరాడు. ఈ నియమాలన్నీ అపౌరుషేయాలైన చతుర్వేదాలలో నిక్షిప్తమై ఉన్నాయి. కానీ అవన్నీ కలగాపులగంగా ఉన్న వేదరాశిలో సంక్లిష్టంగా ఇమిడి ఉండడంతో, వేదపరిజ్ఞానం అంతగా లేని కలియుగవాసులు

ఆకళింపు చేసుకో గలిగే సులభమైన రీతిలో శాస్త్రవిధులను సంకలనం చేయించాలని విష్ణుదేవుని సంకల్పం. అంతటి మహత్కార్యాన్ని చేపట్ట గలిగే శక్తి తనకు లేదని, అటువంటి సామర్థ్యం కలిగిన వ్యక్తిని తాను సృజించలేనని బ్రహ్మదేవుడు తన అశక్తతను వ్యక్తం చేశాడు. సృష్టికర్తయైన బ్రహ్మకే సాధ్యం కాకపోతే ఈ కార్యం మరెవరి వల్ల సిద్ధింప బడుతుంది? ఈ విధంగా తలపోసిన శ్రీమహావిష్ణువు, తన సంకల్పాన్ని సాకారం చేసుకోవడం కోసం తన మానసం నుండి ఓ మహానుభావుణ్ణి ఉద్భవింప జేశాడు. అలా జన్మించిన వాడే విష్ణుమానస పుత్రుడైన 'విఖనసమహర్షి'..

'శ్రీవిష్ణోరాత్మజ ■్రమాన్ విఖనో మునివల్లభః' అనే పురాణశ్లోక సారాంశం ఇదే..

ఆ విధంగా, విఖనసుడు 'బ్రహ్మదేవునికి' అనుజుడన్న మాట. మొట్టమొదటి స్వయంభూ మన్వంతరం, శ్రావణమాసపు శుక్లపక్షంలో, పౌర్ణమి, శ్రవణానక్షత్రం సోమవారపు సింహలగ్నంలో నైమిశారణ్యంలో వీరు ఆవిర్భవించారు. వీరు ఉద్భవించిన శ్రావణపౌర్ణమి పుణ్యదినం 'జంధ్యాల పౌర్ణమి' మరియు 'రక్షాబంధనదినం'' గా కుడా వ్యవహరింప బడుతుంది. ఈ రోజున గాయత్రీ మంత్రాన్ని జపించి, నూతన యజ్ఞోపవీతాన్ని ధరించే సాంప్రదాయముంది.

రూపురేఖలు

ముమ్మూర్తులా విష్ణువును పోలియుండే విఖనసుడు కూడా చతుర్భుజుడై, శంఖుచక్రాలను ధరించి, ద్వాదశ ఊర్ధ్వపుండ్రాలంకార శోభితుడై; దివ్యతేజస్సుతో వెలుగొందు తుంటాడు. అదనంగా మునిపుంగవుడు గావున దండ కమండాలలను, తులసీ పుష్పమాలలను కూడా ధరించి ఉంటాడు. బ్రహ్మను పోలిన ముఖవర్చస్సుతో వెలుగొందుతూ విష్ణుసేవకు, జనులలో విష్ణువు పట్ల భక్తిభావనను పెంపొందించడానికి సదా సన్నద్ధంగా ఉంటాడు.

ఆగమాలలో రకాలు..

'ఆగమం' అంటే 'రావడం' లేదా 'ఉద్భవించడం' అని అర్థం. వేదాలు, వేదాంగాలు, ఇతిహాసాల వలె ఆగమాలు కూడా చతుష్షష్టి (64) కళలలో భాగాలే! ఆగమాలన్నీ అర్చారీతులను బోధించేవే!

హైందవమతంలో ముఖ్యంగా నాలుగు ఆగమాలు ఆచరణలో ఉన్నాయి..

- *శైవాగమమంటే* – శివాలయాలలో ఆచరించబడే కైంకర్య పద్ధతులు.
- *శాక్తేయాగమమంటే* – శక్తిస్వరూపిణి యైన అమ్మ వారికి సంబంధించినది.
- *స్మార్తాగమమంటే* – శైవ, వైష్ణవాలయాల యందున్న పరివార దేవతలను కొలిచే విధివిధానాలు
- *వైష్ణవాగమమంటే* – విష్ణుమందిరాలలో పాటించే అర్చన ప్రక్రియలు. వైష్ణవాగమమంలో మరలా రెండు రకాలున్నాయి. ఉదాహరణకు, తిరుమల ఆలయంలో వైఖానస ఆగమాన్ని పాటిస్తే, తిరుచానూరు లోని పద్మావతీదేవిని పాంచరాత్ర ఆగమ రీతుల్లో అర్చిస్తారు.

హైందవులందరూ జరుపుకునే పండుగలు, ఉత్సవాలు; దేవాలయ నిర్మాణం, విగ్రహప్రతిష్ఠ, వివిధరకాలైన ఆరాధనా రీతులు; జననం, శిరోముండనం, ఉపనయనం, వివాహం, మరణం వంటి అష్టాదశ కర్మకాండలు ఇవన్నీ ఆగమశాస్త్ర బద్ధంగానే అనాదిగా జరుగుతున్నాయి.

వైఖానస ఆగమం

విఖనసుని ద్వారా ఉద్భవించినది కనుక ఈ శాస్త్రం 'వైఖానస ఆగమం' అయ్యింది. శ్రీమహావిష్ణువు ఆదేశానుసారం వేదాలలో పొందు పరచబడియున్న అర్చారీతులన్నింటినీ క్రోడీకరించే బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకొన్న విఖనసుడు మరో నలుగురు ఋషిపుంగవులను శిష్యులుగా జేసుకొని, వారి సహాయంతో ఈ మహత్కార్యాన్ని సాధించాడు. వారిలో అత్రిమహర్షి, భృగుమహర్షి, మరీచిమహర్షి బ్రహ్మమానస పుత్రులు కాగా; నాల్గవ వాడైన 'కశ్యపమహర్షి' మరీచి పుత్రుడు. ఈనాటి కాశ్మీర్, ఇరాన్ దేశానికి ఉత్తరదిక్కున ఉన్న కాస్పియన్ సముద్రం (హైందవ పౌరాణిక నామం కశ్యపసముద్రం) కశ్యపమహర్షి పేరు మీదనే పిలువ బడుతున్నాయని చరిత్రకారులు సైతం విశ్వసిస్తారు. ఒకప్పుడు పారశీకదేశం గానూ, తరువాత 'పర్షియా' గానూ పిలువబడిన నేటి ఇరాన్ కూడా ఒకప్పుడు సువిశాల భారతదేశంలో అంతర్భాగమే.

విఖనస మహర్షి వైఖానస ఆగమాన్ని విషయానుసారం వర్గీకరించి ఆత్రేయస గోత్రీకులకు మూలపురుషుడైన అత్రిమహర్షికి సమూర్తార్చనా విధులు, అంటే దేవాలయాలలో మూర్తులను అర్చించే పద్ధతులను; భృగుమహర్షికి అమూర్తార్చనా విధులు, అంటే యజ్ఞయాగాదులను నిర్వహించే పద్ధతులను; కశ్యపగోత్రీకులకు మూలపురుషుడైన కశ్యపమహర్షికి తర్క, జప విధులను; మరీచిమహర్షికి అగ్నిహూతం అనే వైదిక కర్మకాండను బోధించి, వారి శిష్యులు, ప్రశిష్యుల (శిష్యులకు శిష్యులు) ద్వారా వైఖానస ఆగమశాస్త్రాలను వ్యాప్తి చేశాడు.

వేదాలు కర్మలను బోధిస్తే, ఉపనిషత్తులు జ్ఞానాన్ని ప్రసాదిస్తాయి. ఆగమశాస్త్రం మాత్రం కర్మ, జ్ఞానం రెండింటిని సమన్వయ పరచి, కర్తవ్యబోధ చేస్తాయి. శ్రీవేంకటేశ్వరుని ఆదేశం మేరకు తిరుమల లోని ఆనందనిలయ విమానాన్ని మొట్టమొదటగా 'మరీచి సంహిత' ననుసరించి తొండమాన్ చక్రవర్తి నిర్మించాడని ప్రతీతి. 'సంహిత' అంటే 'సంకలనము' అని అర్థం. దీని ద్వారా వైఖానస ఆగమసూత్రాలు వ్రాయబడలేదని, అపౌరుషేయాలైన వేదాల నుండి వెలికి తీసి సంకలనం చేయబడ్డాయని రూఢి అవుతుంది. సహస్రాబ్దాలుగా ఉనికి లోనున్న వైఖానస ఆగమశాస్త్రం శాఖోపశాఖలుగా విస్తరించింది. ప్రస్తుతమున్న

వైఖానస అర్చకులందరూ, దాదాపుగా, వైఖానస కృష్ణయజుర్వేద తైత్తరీయశాఖకు చెందినవారే.

విష్ణురూపాలు..

వైఖానస ఆగమశాస్త్రాలలో శ్రీమహావిష్ణువుకు ఈ క్రింది ఐదు రూపాలు ఉన్నట్లుగా చెప్పబడింది.

విష్ణువు అనగా, విశ్వమంతా వ్యాపించి యున్నవాడు. ఈ రూపం పరమేశ్వరుని విశ్వవ్యాపకత్వాన్ని సూచిస్తుంది.

పురుషుడు అనగా పూర్ణత్వం కలిగినవాడు. విశ్వవ్యాపకత్వం మరియు పూర్ణత్వం సమానార్థం కలిగిన పదాలుగా గోచరించి నప్పటికీ ఈ రెండు రూపాలు ఒక దానికొకటి పూర్తిగా భిన్నం. 'పూర్ణత్వం' అంటే ఉత్తమోత్తముల కుండ వలసిన గుణాలను తనలో పరిపూర్ణంగా కలిగి ఉండటం. 'విశ్వవ్యాప్త' మంటే తాను విశ్వమంతటా వ్యాపించి

యుండటం. సులభంగా అర్థమయ్యే గణిత పరిభాషలో చెప్పాలంటే పూర్ణత్వాన్ని 'గరిష్ఠ సామాన్య ప్రామాణికం' (GCF) తోనూ; విశ్వవ్యాపకత్వాన్ని 'కనిష్ఠ సామాన్యం గుణిజం (LCM) తోనూ పోల్చవచ్చు. మరింత సులభంగా విశదీకరించాలంటే పూర్ణత్వం అంటే తనలో అన్నింటినీ నింపుకోవడం; విశ్వవ్యాపకత్వం అంటే తానన్నింటి యందు నిండియుండటం.

సత్య – అంటే శాశ్వతమైన వాడు. ఈ రూపం శ్రీమహావిష్ణువును పుట్టుక, జరామరణాలు లేనివానిగా ప్రస్తుతిస్తుంది.

అనిరుద్ధ – అంటే, ఏ విధమైన అడ్డంకి గాని లేదా పరిమితులు లేని వాడు. ఈ రూపం – తలచినంతనే అసాధ్యాలను సైతం సుసాధ్యం చేయగలిగే ఘటనాఘటన సమర్థునిగా విష్ణువును తలపుకు తెస్తుంది.

అచ్యుత – అంటే మార్పు లేదా క్షయం లేనివాడు. స్వయంగా తాను మార్పు లేకుండా ఉండడమే గాక, తనచే సృజించ బడిన గ్రహాలను, జీవులను, ప్రకృతిని, పంచభూతాలను, ఋతుచక్రాన్ని సృష్ట్యాది నుండి ఏవిధమైన మార్పుకు లోను గాకుండా ఉంచ గలిగిన వాడు.

విష్ణువుకు ఆపాదించబడిన ఈ రూపాలన్నీ అనాది నుండి నేటివరకూ నిత్యసత్యాలై వెలుగొందు తున్నాయి. వెలుగొందుతూనే ఉంటాయి కూడా..

ఇదే భావనను ప్రామాణికంగా చేసుకొని వైఖానస ఆగమ శాస్త్రం రూపొందించ బడింది.

వైఖానస కల్పసూత్రం

విఖనస మహర్షి విరచితమైన వైఖానస కల్పసూత్రంలో మానవుడు తన బ్రాహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ ఆశ్రమాలయందు తప్పనిసరిగా ఆచరించవలసిన ధర్మాలు; నిదుర లేచినది మొదలు రాత్రి మరలా నిదురించేంత వరకూ దినమంతా చేపట్టవలసిన విధులు; పరమపదాన్ని సులభంగా చేరుకోవడానికి ఆచరించ వలసిన వైదిక కర్మలు మొదలగు విషయాలన్నీ, ముప్పైరెండు ప్రశ్నోత్తరాల రూపంలో పొందుపరచ బడ్డాయి. తరువాతి కాలంలో విఖనుని శిష్యుల ద్వారా మరింత విస్తరించబడి, వైఖానస కల్పసూత్రమే శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రంగా వినుతికెక్కింది.

వైఖానస అర్చకులు

వైఖానస ఆగమశాస్త్రాన్ని అనుసరించి, అందులో పొందుపరచ బడిన నియమాలను తూచా తప్పకుండా పాటిస్తూ, శ్రీమహావిష్ణువును ఆరాధిస్తూ, వారికి ఆగమశాస్త్రంలో ప్రస్తుతించిన కైంకర్యాలను నియమబద్ధంగా నిర్వహించేవారిని 'వైఖానస అర్చకులు' గా వ్యవహరిస్తారు. తిరుమల ఆలయంలో చరిత్రకందని కాలంలో, పురాణాలలో ఉటంకించిన 'గోపీనాథ దీక్షితుల' వారి నుండి ఈనాటి వరకూ కూడా వైఖానస అర్చకులే శ్రీవారి పూజాకైంకర్యాలను నిర్వహిస్తున్నారు. దాదాపు ఐదు శతాబ్దాల క్రితం ఏదో అవాంతరం వల్ల అప్పటి వైఖానస అర్చకుడు అర్చనాదికాలకు అనర్హుడైతే, అప్పుడు పసిబాలునిగా నున్న అర్చకుని కుమారునికి నిర్ణీత వయస్సు వచ్చేంత వరకూ తాను అర్చకత్వ

బాధ్యతను తాత్కాలికంగా చేపట్టి, ఆ బ్రాహ్మణ బాలకునికి తగిన శిక్షణనిచ్చి, తదనంతరం అతనికి అర్చకత్వాన్ని అప్పగించి, వైఖానస ఆగమ పరంపరను కాపాడిన శ్రీపాద వ్యాసరాయలి వారి గురించి ఇంతకుముందే తెలుసుకున్నాం. పురాణేతిహాసాల ననుసరించి విష్ణువును అర్చించగలిగిన అర్హత, సామర్థ్యం కేవలం విష్ణువుకే ఉంటాయి. కావున, వైఖానస అర్చకులు స్నానాదికాలు కావించి, ఊర్ధ్వపుండ్రధారులై, ఆగమప్రక్రియల ద్వారా తమలో విష్ణువును ఆవహింప జేసుకుని మాత్రమే భగవదారాధనకు పూనుకుంటారు. తరతరాలుగా విష్ణ్వాలయాల్లో అర్చకత్వం నిర్వహిస్తున్న సుమారు నాలుగువేల మంది వైఖానసులు ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోనూ; అమెరికా వంటి సుదూరమైన విదేశాల లోనూ నివసిస్తూ, వైఖానస పరంపర నిరంతరాయంగా కొనసాగడానికై పాటుపడు తున్నారు. ఇతర వైష్ణవులకు భిన్నంగా, వీరు ధరించే తిరునామపు మధ్యభాగంలో నున్న రేఖ కేసరివర్ణ శోభితమై ఉంటుంది.

విఖనస మహర్షి ఆలయం

తిరుమల క్షేత్రంలోని ఉత్తర మాడవీధిలో, ఆదివరాహస్వామి ఆలయానికి అభిముఖంగా, ఈ మధ్యనే నిర్మింపబడిన ఆలయంలో విఖనసమహర్షి కొలువై ఉంటాడు. సమున్నతమైన పీఠంపై ఆసీనుడై, తన నలుగురి శిష్యులకు ఆగమశాస్త్రాన్ని ప్రవచిస్తున్న విఖనసుని దివ్యమంగళ మూర్తిని ఈ ఆలయంలో దర్శించుకోవచ్చు. దాని చెంతనే ఉన్న వైఖానస అర్చకనిలయంలో నివసించే అర్చకులు ప్రతిరోజూ లాంఛనప్రాయంగా తమ ఆదిపురుషుడైనట్టి విఖనసమహర్షి అనుమతి తీసుకుని మాత్రమే ప్రధానాలయంలో విధులు నిర్వర్తిస్తారు. ఈ ఆలయంలో ప్రతి ఏటా విఖనమహర్షి జయంత్యుత్సవం వైభవోపేతంగా జరుప బడుతుంది. ఆరోజు సాయం సమయంలో సహస్రదీపాలంకరణ సేవ జరిగిన తరువాత, ఉభయదేవేరులతో కూడిన మలయప్పస్వామి విఖనసమహర్షి ఆలయానికి విచ్చేసి, మునివర్యుల ఆతిథ్యం స్వీకరిస్తారు. తన జన్మదిన సందర్భంగా తండ్రిగారికి ఆదరపూర్వకంగా ఆతిథ్యమిచ్చిన తనయుడు ఆనందపరవశుడై పులకించి పోతాడు.

వైఖానస అర్చక పరంపరను కొనసాగించడానికై అవిరళ కృషి సలుపుతున్న, విఖనసుని వారసులైన వైఖానస అర్చకులకు శతకోటి వందనాలు..పుట – 125 తేదీ – నవంబరు, 07

శ్రీవారి సంవత్సర సేవలు

తిరుమల క్షేత్రం ఉత్సవాలకు పుట్టినిల్లు. ప్రతినిత్యం అనేక సేవలు, ఉత్సవాలతో నిత్యకళ్యాణం-పచ్చతోరణంగా భాసిల్లుతుంది. శ్రీవేంకటేశ్వరునికి జరిగే నిత్య, వార, పక్ష, మాసోత్సవా లన్నింటినీ; సంవత్సరసేవల్లో చాలా వరకూ మునుపటి ప్రకరణాల్లో చెప్పుకున్నాం. మిగిలిన సంవత్సర సేవల గురించి ఈనాటి ప్రకరణంలో తెలుసుకుందాం.

పార్వేటోత్సవం

క్రూరమృగాలను నిర్జించి, పౌరులను కాపాడటం క్షాత్రధర్మం. ఈ కార్యాన్ని నిర్వర్తించడానికై రాజులు, చక్రవర్తులు తరచూ వేటకు వెళ్ళేవారు. కొందరికైతే వేట ఒక వ్యసనంగా కూడా మారేది. శ్రీవేంకటేశ్వరుడు ముల్లోకాలనేలే రాజాధిరాజు. సృష్టిలోని సమస్తజీవాలు వారి పాలితులే! సదా వారిని కాపాడటం కోసం, మృగయావినోది (వేట యందు అనురక్తి కలిగిన వాడు) యైన శ్రీనివాసుడు కూడా వేటాడుతూనే ఉంటారు. వాస్తవానికి సుదీర్ఘకాలం శేషాచలక్షేత్రం లోని వల్మీకం (పుట్ట) లో తలదాచుకున్న శ్రీనివాసుడు అశ్వారూఢుడై వేటకు వెడలినప్పుడే నారాయణవనం ప్రాంతంలోని అరణ్యంలో పద్మావతీ దేవితో తొలి పరిచయం జరిగి వారి పరిణయానికి దారి తీసింది.

ఆధ్యాత్మిక దృష్టితో అవలోకించినట్లైతే, అడవుల్లో సంచరించే క్రూరమృగాలు, యుద్ధరంగంలో శత్రువుల కంటే; నిత్యమూ మనను అంటిపెట్టుకుని ఉండే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలు (అంతర్గతంగా ఉండే ఆరు శత్రువులు) మరింత ప్రమాదకరమైనవి. వాటిపై విజయం సాధాంచాలంటే, ఇంద్రియాలను అదుపులో నుంచుకో గలిగే ఆత్మనిగ్రహం కావాలి. పరమాత్ముని కృపతోనే అది సాధ్యం.

ప్రతి ఏడాది సకల లాంఛనాలతో, రాజోచిత సత్కారాల నందుకుంటూ పార్వేట ఉత్సవంలో పాల్గొనే శ్రీవేంకటేశ్వరుడు తన శరణు జొచ్చినవారిని అరిషడ్వార్గాల నుండి కాపాడతాననే అభయ మిస్తున్నాడు. ప్రధానాలయం నుండి పాపనాశనం వెళ్ళే రహదారికి ఎడం ప్రక్క, నిర్జనంగా నున్న అటవీప్రాంతంలో, రాచఠీవితో ఉట్టిపడే ఓ ప్రాచీన మంటపమే పార్వేట ఉత్సవానికి వేదిక. దీనినే 'పార్వేట మంటపం' గా పిలుస్తారు.

మకరసంక్రాంతి పండుగ దినాలలో మూడవనాడైన 'కనుమ' రోజు ఈ ఉత్సవం జరుగుతుంది. ఆరోజు శ్రీనివాసునికి యథావిధిగా ప్రాతఃకాలం జరిగే నిత్యకైంకర్యాలు పూర్తయిన తరువాత, స్వామివారు రథారూఢుడై ఆలయం నుండి పార్వేటమండపానికి బయల్వెడలుతారు. మరో రథంలో, ఆనందనిలయ వాసి యైన శ్రీకృష్ణుడు వారి ననుసరిస్తారు. ఆ మంటపంలో స్వామివారికి పుణ్యాహవచనం, ఆరాధన, నివేదన వంటి ఉపచారాలు జరిపి, వారిని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మంచెపై ఆసీనుల్ని చేస్తారు. తదనంతరం వేదపఠనం, అన్నమయ్య కీర్తనాలాపనలతో పాటుగా; అన్నమయ్య వంశస్తులకు, హాథిరామ్ జీ మఠం వారికి సత్కారాలు జరుగుతాయి.

ఈలోగా, శ్రీకృష్ణుడు పార్వేట మండపానికి ప్రక్కనే ఉన్న 'గొల్లవిడిది' కి వేంచేసి, చిన్నికృష్ణుణ్ణి తలపుకు తెస్తూ పాలు,

వెన్నా ఆరగిస్తారు. తదనంతరం వారిని పార్వేటమండపానికి తోడ్కొనివెళ్ళి; గొల్లవారు సమర్పించుకున్న పాలు, వెన్నను మలయప్పస్వామి వారికి కూడా నివేదించి, హారతి సమర్పించు కుంటారు.

తదవంతరం మలయప్పస్వామి వారు వేటకు బయల్దేరుతారు. వేగంగా పరుగెడుతున్న మృగరాజును తరుముతున్నట్లు, స్వామివారు కూడా వేగంగా ముందుకు కదులుతారు. స్వామివారి తరపున అర్చకులు శరాన్ని (బాణం) సంధిస్తారు. ఈ విధంగా కొన్ని పర్యాయాలు జరిగిన తరువాత, వేట ముగుస్తుంది. ఉత్సవానంతరం మలయప్పస్వామి, శ్రీకృష్ణుడు యథావిధిగా ఆలయ పునఃప్రవేశం చేస్తారు.

వేట సన్నివేశాన్ని రక్తి కట్టించడంలో పల్లకీని మోసే బోయీలు, స్వామివారి తరపున శరసంధానం చేసే అర్చకులు ప్రధానపాత్ర పోషిస్తారు.

శ్రీవారి పార్వేటోత్సవాన్ని దర్శించుకున్న వారికి ఇంద్రియనిగ్రహం కలుగుతుందని, తద్వారా వారు అరిషడ్వర్గాలను జయించ గలరని భక్తుల విశ్వాసం.

పవిత్రోత్సవాలు

తిరుమల క్షేత్రం పవిత్రతకు మారుపేరు. ఆలయంలో జరిగే ఉత్సవాలు, ఉపచారాలు అన్నీ శాస్త్రోక్తంగా, ఆగమశాస్త్రబద్ధంగా జరుగుతాయి.

వైదిక సాంప్రదాయాల ననుసరించి కొన్ని సందర్భాలలో అశౌచాన్ని (వ్యావహారిక భాషలో అశౌచాన్ని 'మైల' గా వ్యవహరిస్తాం) తప్పనిసరిగా పాటించాలి. ఈ నిబంధనల వెనుక వైదిక కారణాలతో పాటు వ్యావహారిక, ఆరోగ్యపరమైన కారణలు కూడా ఎన్నో ఉన్నాయి. అంతే గాకుండా, వైఖానస ఆగమసూత్రాల ననుసరించి స్వామిని అర్చించడానికి కొన్ని నిర్దిష్టమైన, సంక్లిష్టమైన, విస్తృతమైన నియమాలను పాటించాలి.

కానీ నిత్యము లక్షకు పైగా భక్తులు, వందల సంఖ్యలో సిబ్బంది, పదుల సంఖ్యలో అర్చకులు సందర్శించే ఆలయంలో, తెలిసో తెలియకో పొరపాట్లు జరిగే అవకాశముంది. అన్ని రకాల ముందుజాగ్రత్త చర్యలు చేపట్టినప్పటికీ కొన్ని లోటుపాట్లు జరగవచ్చు. అటువంటి వాటివల్ల ఆలయ పవిత్రతకు ఏవిధమైన భంగం కలుగకుండా, దోషపరిహారార్థం జరిపించే ఉత్సవాలను 'పవిత్రోత్సవాలు' గా పిలుస్తారు. వందల సంవత్సరాలుగా అమలులో ఉన్న ఈ ఉత్సవాలు పాలకులు మారడం వల్ల కొంతకాలం నిలిచిపోగా, 1962 లో పునరుద్ధరించబడి అప్పటినుండి నిరాటంకంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు శ్రావణశుద్ధ దశమి, ఏకాదశి, ద్వాదశి దినాలలో; సంపంగిప్రాకారంలో నున్న శ్రీవేంకటరమణుని కళ్యాణమంటపంలో జరుగుతాయి.

ముందురోజు సాయం సమయాన విష్వక్సేనుల వారు వసంతోత్సవ మండపం చేరుకుంటారు. అక్కడ మృత్సంగ్రహణం (పుట్టమన్ను సేకరించడం), అంకురార్పణ జరిగిన తరువాత పవిత్రోత్సవాలు ప్రారంభ మవుతాయి.

మొదటి రోజైన దశమి నాడు 'పవిత్రాల ప్రతిష్ఠ', శాంతిహోమాలు, ఉభయదేవేరిసహిత మలయప్పస్వామి వారికి అభిషేకాలు, రాత్రివేళలో పూర్ణాహుతి అర్పించడంతో మొదటిరోజు ఉత్సవాలు ముగుస్తాయి.

రెండవరోజైన ఏకాదశి నాడు పూర్ణాహుతి పూర్తయిన తరువాత; ఆలయం లోపల, బయటా ఉన్న ఉపాలయాలకు, బలిపీఠం మరియు ధ్వజస్తంభానికి పవిత్రాల సమర్పణ జరుగుతుంది. తదనంతరం పూర్ణాహుతితో రెండవరోజు కార్యక్రమం ముగుస్తుంది.

మూడవరోజు విశేషహోమం మరియు పూర్ణాహుతితో మూడురోజుల పవిత్రోత్సవాలు సుసంపన్న మవుతాయి. ఈ ఉత్సవాలతో దోషపరిహారం జరిగి, ఆలయ పవిత్రత ఇనుమడిస్తుందని ప్రతీతి.

ఆణివార ఆస్థాన మహోత్సవం

1843 వ సంవత్సరంలో అప్పటి ఆంగ్లపాలకులు తిరుమల ఆలయ నిర్వహణ బాధ్యతను మహంతుల కప్పగించినట్లు ఇంతకు మునుపే తెలుసుకున్నాం. యాదృచ్ఛికంగా జరిగిందో లేదా శుభ ముహూర్తాన్ననుసరించి జరిగిందో తెలియదు కానీ ఆ యాజమాన్య మార్పిడి సరిగ్గా తమిళమాసమైన 'ఆణిమాసం' ఆఖరి రోజున జరిగింది. అదే రోజు దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభ మవుతుంది. 'కర్కాటక సంక్రాంతి' గా కూడా పిలువబడే ఈ పర్వదినం, ప్రతి ఏడాది జూలై 16 లేదా 17 వ తారీఖుల్లో వస్తుంది. సరిగ్గా దీనికి ఆరుమాసాల ముందు జనవరి 15 వ తారీఖున, ఉత్తరాయణ పుణ్యకాలం ఆరంభమయ్యే రోజున మనం మకరసంక్రాంతి జరుపుకుంటాము. తిరుమలలో తమిళులు అధికంగా అనుసరించే సౌరమానం ప్రకారం జరుపుకునే ఉత్సవాలలో ఇది కూడా ఒకటి.

ఆలయ వ్యవహారాలు మహంతుల చేతికి వచ్చినప్పటి నుండి ఆలయ వార్షిక లెక్కల్ని అదే రోజు, లాంఛనంగా ప్రారంభించడం ఆనవాయితీగా వచ్చింది. ఆర్థిక సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని, ఆణిమాసం ఆఖరి రోజున, అట్టహాసంగా 'ఆణివార ఆస్థాన మహోత్సవం' జరుప బడుతుంది. తరువాతి కాలంలో మిగిలిన అన్ని ఆర్థిక, ధార్మిక, వాణిజ్య సంస్థల్లా ఆర్థిక సంవత్సరాన్ని ఏప్రిల్ ఒకటవ తేదీన ప్రారంభిస్తున్నప్పటికీ; అనాదిగా వస్తున్న 'ఆణివార ఆస్థానోత్సవం' మాత్రం అదే రోజు జరుప బడుతోంది.

ఆరోజు ప్రాతఃకాల కైంకర్యాలను యథావిధిగా నిర్వహిస్తారు. అయితే, ప్రతినిత్యం కొలువు శ్రీనివాసునికి మునపటి రోజు ఆదాయవ్యయాల నప్పగించే 'కొలువు' లేదా 'దర్బారు' సేవ మాత్రం జరగదు. ఏకంగా వార్షిక లెక్కల్నే స్వామివారికి నివేదిస్తారు కాబట్టి, ఆరోజు కిక దినవారీ లెక్కలు ఉండవన్న మాట. తరువాత తిరుమామణి మంటపంలో సర్వభూపాలవాహనంపై ఉభయదేవేరీ సమేతులైన మలయప్పస్వామిని; వారి ప్రక్కగా సర్వసేనాధిపతి విష్వక్సేనుణ్ణి వేంచేపు చేస్తారు. విశేష నైవేద్యసమర్పణ జరిగిన తరువాత జియ్యంగార్లు విమాన ప్రదక్షిణమార్గం లోని పరిమళపు అర నుండి ఆరు పట్టువస్త్రాలను పెద్ద వెండితట్టలో నుంచి తీసుకు వస్తారు. ఆ ఆరింటిలో మూలవిరాట్టుకు ధోవతి అంగవస్త్రాలుగా చెరి ఒకటి; ఆకాశరాజు కిరీటం, నందక ఖడ్గం, మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి ఒక్కొక్కటి చొప్పున అలంకరిస్తారు. అప్పుడు గత సంవత్సరం ఆదాయవ్యయాల వివరాలను, నగదు నిల్వలను

సంబంధిత ఆలయాధికారులు స్వామివారికి విన్నవిస్తారు. ఆణివార ఆస్థానమహోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించడం ద్వారా సకలసంపదలు స్వామివారి సొంతమని; మిగిలిన వారందరు వారికి పరిచారకులేనని; వారి ప్రతినిధులుగా మాత్రమే వారి సంపదను, ఆదాయాన్ని పరిరక్షిస్తున్నారన్న సందేశం పంపబడుతుంది. తద్వారా ఆలయానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీల నిర్వహణలో జవాబుదారీతనం మరింత పెరుగుతుంది.

తరువాతి ఘట్టంలో జియ్యంగారి అధికారిక మొహరును, 'లచ్చన' అని పిలువబడే తాళం చెవులగుత్తిని స్వామివారి పాదాలకు తాకించి జియ్యరువారికి అందజేస్తారు. ఆ తరువాత గమేకార్లు (ప్రసాదం గంగాళాలను రవాణా చేసే కార్మికులు), మహంతుమఠం వారు, తాళ్ళపాక మరియు తరిగొండ వంశీయులు హరతు లర్పిస్తారు. తదనంతరం ఉత్సవానికి విచ్చేసిన భక్తులు, సిబ్బంది నుండి ఒక్కొక్క రూపాయి చొప్పున కానుకలు స్వీకరించి శ్రీవారి ఖజానాకు జమ చేస్తారు. దీనిని 'రూపాయి హారతిగా' వ్యవహరిస్తారు.

ఆణివార ఆస్థానోత్సవ సందర్భంగా ఆరోజు సాయంకాలం మలయప్పస్వామిని, ఉభయ దేవేరులను పుష్పపల్లకిలో అధిరోహింప జేసి, మాడవీధుల్లో అత్యంత వైభవోపేతంగా ఊరేగిస్తారు.

ఈ ఆర్జితసేవను కాంచిన భక్తులకు పూర్వజన్మ వాసనలు నశించి, సుఖశాంతులు ఏర్పడుతాయని భక్తుల విశ్వాసం.
పుట – 126 తేదీ – నవంబరు, 08

రథసప్తమి

తన పేరులోనే శ్రీమన్నారాయణుని పదిల పరచుకొన్న 'సూర్యనారాయణుడు' శ్రీమహావిష్ణువు యొక్క పరమ భక్తుడే కాకుండా ఆప్తమిత్రుడు, శ్రేయోభిలాషి కూడా! శ్రీమహాలక్ష్మికి కూడా సన్నిహితుడే! అటువంటి సూర్యుని జన్మదినమైన మాఘశుద్ధ సప్తమి నాడు హైందవులందరూ 'రథసప్తమి' పర్వదినాన్ని వైభవోపేతంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపు కుంటారు. తిరుమలలో జరిగే రథసప్తమి ఉత్సవంలో సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తియైన మలయప్పస్వామి వారే ఉభయదేవేరుల సమేతంగా పాల్గొని ఉత్సవానికి వన్నె తెస్తారు. ఈ సందర్భంలో సూర్యుని గురించిన కొంత ఆసక్తికరమైన సమాచారాన్ని తెలుసుకుందాం.

సప్తాశ్వరథారూఢుడు

సూర్యభగవానుడు సప్తాశ్వరథారూఢుడై, జగత్తంతా అవిశ్రాంతంగా వాయువేగ మనోవేగాలతో పర్యటిస్తూ తన దివ్యకాంతులతో సమస్త సృష్టిని చైతన్యవంతం చేస్తాడు. సూర్యుడు అధిరోహించిన రథం బృహతి, గాయత్రి, ఉష్ణిక, జగతి, పంక్తి, త్రిష్టుప్, అనుష్టుప్ అనే ఏడు అశ్వాల ద్వారా లాగబడుతుంది. ఈ ఏడు గుర్రాల పేరిట, సంస్కృతభాషలో ఏడు 'ఛందస్సులు' ఉన్నాయి. సంస్కృతం లోని శ్లోకాలు, స్తోత్రాలు మొదలైనవన్నీ ఈ ఏడు ఛందస్సుల్లోనే వ్రాయబడ్డాయి. ఉదాహరణకు శ్రీవిష్ణుసహస్రనామం, శ్రీలలితాసహస్రనామం అనుష్టుప్ ఛందస్సులో రచించబడ్డాయి. ఈ రథం 'అనూరుడు' అనే రథికుని సారథ్యంలో నడుపబడుతుంది. అయితే, కొన్ని పురాణాలలో సూర్యుని రథం పేరు

'సప్త' అని, ఆ రథాన్ని కేవలం ఒకే ఒక్క అశ్వం లాగుతుందని, అందువల్ల ఆ అశ్వాన్ని 'సప్తాశ్వం' గా పిలుస్తారని, ఆ అశ్వమే ఏడు రూపాలలో గోచరిస్తుందని చెప్పబడింది.

రథసప్తమి ఉత్సవం

తన ఆదేశం మేరకు విశ్వమంతా సంచరిస్తూ, కాలచక్రం గతులు తప్పకుండా తన వంతు కృషి సలుపుతున్న సూర్యనారాయణునికి, వారి జన్మదినోత్సవ సందర్భంగా అభినందనలు తెలుపడానికై మలయప్పస్వామి మాడవీధుల్లో ఊరేగడమే 'రథసప్తమి ఉత్సవం'. సూర్యుడు కాలచక్ర సంచాలనంలో వ్యస్తుడై ఉండటం వల్ల, తన భక్తుని అభినందించే నిమిత్తం శ్రీవారే ఆనందనిలయం నుంచి బయటకు వస్తారన్నమాట. భక్తుల దరి జేరటానికై భగవంతుడు సదా ఆరాట పడటం సహజమే కదా!

సప్తవాహనారోహణం

రథసప్తమి నాడు, సప్తరథారూఢుని జన్మదినోత్సవంలో సప్తగిరీశుడు సప్తవాహనాలను అధిరోహిస్తాడు. శ్రీవారు ఉభయదేవేరుల సమేతంగా మొట్టమొదటగా సూర్యప్రభవాహనాన్ని అధిరోహిస్తారు. ఆ వాహనంలో ఊరేగుతున్న మలయప్పస్వామి వారి పాదపద్మాలను బాలభానుడు తన లేలేత కిరణాలతో స్పృశిస్తూ భక్తిపూర్వకంగా సేవించు కుంటాడు. తరువాత మలయప్పస్వామి వారు వరుసగా చిన్నశేషవాహనం, గరుడవాహనం, హనుమంతవాహనం, కల్పవృక్షవాహనం చివరగా చంద్రప్రభవాహనంపై ఊరేగుతారు. ఈ సందర్భంగా మలయప్పస్వామి వారు ఆదివరాహస్వామి ఆలయంలో పంచామృతాభిషేకాన్ని స్వీకరిస్తారు. తరువాత స్వామిపుష్కరిణిలో చక్రస్నానం జరుగుతుంది.

ఒకరోజు బ్రహ్మోత్సవం

ఈ రథసప్తమి ఉత్సవం అత్యంత వైభవోపేతంగా, కన్నుల పండువగా జరగడం వల్ల; బ్రహ్మోత్సవాల తరువాత అతిపెద్ద సంఖ్యలో వాహనాలు పాల్గొనడం వల్ల దీనిని 'ఒకరోజు బ్రహ్మోత్సవం' గా కుడా పేర్కొంటారు. ఈ ఉత్సవాన్ని కాంచిన భక్తులపై శ్రీనివాసుని, సూర్యభగవానుని కరుణకిరణాలు ప్రసరించి ఐహికాముష్మికానందాలు సంప్రాప్తిస్తాయని భక్తులు విశ్వసిస్తారు.

అష్టబంధన బాలాలయ మహాసంప్రోక్షణ మహోత్సవం

'అష్టబంధనము', 'బాలాలయము' మరియు 'మహాసంప్రోక్షణము' అనే మూడు మహత్తర వైదిక క్రతువుల సమాహారమే ఈ ఉత్సవం. ఈ ఉత్సవం దాదాపు అన్ని వైష్ణవాలయాలలో జరిగినప్పటికీ తిరుమలలో జరిగే ఉత్సవానికి ఎన్నో విశిష్టతలు, ఎంతో ప్రాముఖ్యం ఉన్నాయి. ఈ ఉత్సవం ఎందుకు, ఎలా జరుగుతుందనే వివరాల్ని ఈరోజు తెలుసుకుందాం.

విష్ణువు అంశ

వైఖానస ఆగమం లోని 'మరీచి సంహిత' ననుసరించి, స్వామివారి అర్చామూర్తిలో శ్రీమహావిష్ణువు అంశ నిరవధికంగా ఉండదు. కలియుగంలో దానికి పన్నెండు సంవత్సరాల కాలపరిమితి ఉంది. ఈ గడువు ముగిసే లోపు, విస్తారమైన వైదిక ప్రక్రియల ద్వారా మూలవిరాట్టులో విష్ణువు అంశను పునఃప్రతిష్ఠింప జేసి, స్వామివారి తేజస్సును ద్విగుణీకృతం చేసే మహోత్కృష్టమైన కార్యక్రమాన్నే 'అష్టబంధన బాలాలయ మహాసంప్రోక్షణ' గా వ్యవహరిస్తారు. అయితే, దీనికో మినహాయింపు ఉంది. ఈ సంప్రోక్షణా కార్యక్రమం దేవతలు, ఋషులు, చక్రవర్తుల వంటి వారి ద్వారా ప్రతిష్ఠించబడ్డ దేవతామూర్తులకే అవసరమని; సాక్షాత్తు దేవదేవుడే స్వయంగా వెలయడం వల్ల, స్వయంవ్యక్త క్షేత్రాలలో ఈ సంప్రోక్షణ జరుప నవసరం లేదని కూడా శాస్త్రాలలో చెప్పబడింది. కానీ, తిరుమల ఆలయం మాత్రం దీనికి భిన్నం. శ్రీవారి మూర్తి స్వయంవ్యక్తమే అయినప్పటికీ మిగిలిన అన్ని వైదిక క్రతువుల లాగా, మహాసంప్రోక్షణ కూడా ఎప్పటినుండో ఆనందనిలయంలో జరుపబడుతోంది.

సంప్రోక్షణలలో రకాలు

సంప్రోక్షణలలో ముఖ్యంగా మూడు రకాలున్నాయి.

- గ్రహణ సందర్భాలలో, ఏదైన అశౌచం జరిగినప్పుడు దేవతామూర్తులను పవిత్రజలాలతో శుద్ధి చేస్తారు. దీన్ని జలసంప్రోక్షణ మంటారు.
- దేవతామూర్తులకు ఏదైనా అనుకోని అపరాధం జరిగితే లఘుసంప్రోక్షణ ద్వారా తగిన పరిహారం చేస్తారు. దాదాపు సంప్రోక్షణ క్రతువునంతా జరిపిస్తారు. కానీ సంప్రోక్షణా కార్యక్రమమంతా, సరళంగా, కేవలం ఒక్క రోజులో ముగిసిపోతుంది.
- మూడవది మహాసంప్రోక్షణ. పన్నెండేళ్ళ కొక్కసారి విష్ణువు అంశను పునఃప్రతిష్ఠించడం కోసం ఐదు రోజుల పాటు విస్తారంగా జరిపే వైదిక కార్యక్రమమే మహాసంప్రోక్షణ.

అన్ని విధులు అర్చకులవే..

కాలక్రమంలో గర్భాలయానికి అవసరమైన మరమ్మత్తుల నిమిత్తం, ఇతర వృత్తులకు చెందిన కొందరు నిపుణులు గర్భాలయం లోనికి ప్రవేశించే లేదా మూలమూర్తిని స్పృశించే అవకాశం ఉంది. కానీ, ఆగమశాస్త్రాన్ననుసరించి, వైఖానస అర్చకులు తప్ప వేరెవరూ గర్భాలయంలో ప్రవేశించరాదు. అటువంటి సందర్భాలలో మిగిలిన దేవాలయాలలో మూలవిరాట్టు అంశను ఒక కలశం లోకి ఆవాహన చేసి, ఆ కలశాన్ని వేరే ప్రదేశానికి తరలించి, అవసరమైన నిపుణులను గర్భాలయం లోకి అనుమతిస్తారు. కానీ తిరుమల ఆలయంలో మాత్రం గర్భాలయ మరమ్మత్తులన్నీ వైఖానస అర్చకులే నిర్వహిస్తారు. అందుచేత, తిరుమల లోని వైఖానస అర్చకులకు సాధారణంగా అవసరమయ్యే అన్ని రంగాలలోనూ ప్రవేశం ఉంటుంది.

కళాపకర్షణ కళాన్యాసం

స్వామివారి అంశ శిరస్సు, ఫాలభాగం, నాసిక, నోరు, కంఠం, భుజస్కంధాలు, హృదయం, నాభి, కటి, మోకాళ్ళు, పాదాలు వంటి పన్నెండు జీవస్థానాలలో నిక్షిప్తమై ఉంటుంది. ఒక్కో జీవశక్తికి నాలుగు కళలుంటాయి. ఆ విధంగా, మొత్తం 48 కళలను 'కుంభం' లేదా 'కలశం' అనే స్వర్ణపాత్ర లోనికి వేదమంత్రోచ్చారణల మధ్య ఆవాహన చేస్తారు. ఈ ప్రక్రియనే కళాపకర్షణగా పిలుస్తారు. ఉత్సవం చివరి దశలో అప్పటివరకు కలశంలో నిక్షిప్తమైన 48 కళలను మూలమూర్తి లోనికి తిరిగి ప్రవేశింపజేసే కార్యాన్ని 'కళాన్యాసం' గా వ్యవహరిస్తారు. సూక్ష్మంగా చెప్పాలంటే 'బింబం' (మూలవిరాట్టు) లోని అంశను 'కుంభం' (కలశం) లోకి చేర్చడమే 'కళాపకర్షణ'.

అష్టదిగ్బంధనం

కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడు భూలోకంలో అవతరించి యున్నాడు. ఈ యుగంలో స్వామివారి సంపూర్ణ కటాక్షం పొందాలంటే, స్వామివారి మూర్తి ఎల్లవేళలా తన దేవేరియైన భూదేవిని స్పర్శిస్తూ ఉండాలి. అందునిమిత్తం స్వామివారి పాదాలను మరియు శ్రీవారి పాదపీఠాన్ని ఒక ప్రత్యేకమైన లేపనంతో అనుసంధానిస్తారు. మధూచిష్ట, లాక్ష, త్రిఫలం, కాసీసం, గుగ్గిలం, చూర్ణం, రక్తశిల, శంఖుచూర్ణం వంటి ప్రకృతిసిద్ధంగా లభ్యమయ్యే, జిగురుగుణం కలిగిన ఎనిమిది పదార్థాలకు, వెన్న, వేడినీటిని తగుపాళ్ళలో జోడించి రోలు, రోకలి, తిరగలి వంటి సాంప్రదాయ సాధనాల ద్వారా మిశ్రితం చేయబడగా వచ్చిన చిక్కటి పదార్థమే ఈ లేపనం. ఏళ్ళ తరబడి జరిగిన అభిషేకాల వల్ల పాదపీఠం మరియు పాదాల మధ్యనున్న సన్నటి ఖాళీ ప్రదేశంలో పేరుకుపోయిన పూజావ్యర్థాలను తొలగించి, వాటి స్థానంలో ఈ లేపనాన్ని నింపుతారు. వీటిలోని ఒక్కో ద్రవ్యం ఒక్కో దిక్పాలకునికి ప్రీతికరమని ప్రతీతి. ఈ ద్రవ్యాలను వినియోగించడం ద్వారా ఆయా దిక్పాలకుల సహకారాన్ని పొందవచ్చని భావిస్తారు. ఈ మిశ్రమం సహజసిద్ధమైన కాంక్రీటులా పనిచేసి, మూలమూర్తి స్థిరంగా నిలద్రొక్కు కోవడానికి దోహద పడుతుంది. ఈ ప్రక్రియ జరుగుతున్నంత సేపు ఆగమబద్ధమైన క్రతువులెన్నో జరుగుతాయి. ఈ క్రతువును దగ్గరుండి జరిపించడానికి నిష్ణాతులైన వైఖానస పండితులను సుదూరప్రాంతాల నుండి ప్రత్యేకంగా రప్పిస్తారు. అష్టదిక్పాలకులకు ప్రీతిపాత్రమైన అష్టద్రవ్యాల మిశ్రమంతో సమకూరే ఈ వైదిక కార్యక్రమమే 'అష్టదిగ్బంధనం'.

బాలాలయం

పైన చెప్పుకున్న 'కళాపకర్షణ' ప్రక్రియ ద్వారా 48 కళలను నిక్షేపం చేయబడ్డ కలశాన్ని సర్వలాంఛనాలతో ఓ ప్రత్యేక మంటపం లోనికి చేర్చుతారు. ఈ కలశంతో పాటుగా పంచబేరాలలో మిగిలిన నలుగురి ఉత్సవమూర్తులను; ఆనందనిలయంలో ఉండే రామపరివార దేవతలను, శ్రీకృష్ణపరివార దేవతలను, చక్రత్తాళ్వార్ ను; జయవిజయుల అంశను; విమానప్రదక్షిణమార్గంలో ఉండే విష్వక్సేనుల వారి, యోగానరసింహుని, వరదరాజస్వామి వారి, శ్రీమద్రామానుజుల వారి అంశలను; ధ్వజస్తంభం, బేడి ఆంజనేయుడు, వేణుగోపాలస్వామి వారి అంశలను మొత్తం 18 కలశాలలో నిక్షిప్తం చేసి, వాటిని 18 ప్రత్యేక పీఠాలపై ఉంచుతారు. మూలవిరాట్టుతో పాటు మిగిలిన

దేవతలందరూ తాత్కాలికంగా కొలువై ఉండి నిత్యనీరాజనాలు అందుకునే ప్రదేశాన్నే 'బాలాలయం' గా వ్యవహరిస్తారు. సుప్రభాత, ఏకాంతసేవలతో పాటుగా శ్రీవారికి అనునిత్యం జరిగే సేవలన్నీ ఈ బాలాలయంలో క్రమం తప్పకుండా జరుగుతాయి. ముఖ్యమైన సేవలన్నీ మూలమూర్తికి కూడా యథావిధిగా జరుగుతాయి. ఇతర వైష్ణవాలయాలకు భిన్నంగా స్వామివారి అంశ బాలాలయంలో ఉన్న సమయంలో కూడా, స్వల్ప అంతరాయంతో మూలవిరాట్టు దర్శనానికి అనుమతిస్తారు. శ్రీవారు స్వయంభువుగా అవతరించి యుండటమే ఈ మినహాయింపునకు కారణం.

మహాసంప్రోక్షణ

'సంప్రోక్షణ' అంటే శుద్ధి చేయడం. గర్భాలయంతో పాటుగా తిరుమలక్షేత్రాన్నంతా శుద్ధిచేసి, అవసరమైన మరమ్మత్తులు జరిపి, నవీనీకరించడమే 'మహాసంప్రోక్షణం'. ఐదు రోజుల ఉత్సవం చివరిరోజు కళాన్యాసం జరిగిన తరువాత మూలమూర్తిని, ఉత్సవమూర్తులను, పరివార దేవతలను, ఉపాలయాలలోని దేవతలను వైదిక సాంప్రదాయ క్రియల ద్వారా, విశిష్టమైన ద్రవ్యాల ద్వారా శుద్ధి చేయడం 'మహాసంప్రోక్షణ' లో భాగం. ఆలయ అర్చకులతో పాటుగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఋత్విక్కులు కూడా ఈ కార్యక్రమంలో పాలు పంచుకుంటారు.

దినసరి కార్యక్రమాలు

ఐదు రోజులు జరిగే ఈ ఉత్సవంలో రోజువారి క్రతువు లీవిధంగా ఉంటాయి.

- ముందురోజు మృత్సంగ్రహణం (పుట్టమన్ను సేకరించడం), అంకురార్పణ, విష్వక్సేనునికి ప్రత్యేక పూజ, ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయి.
- మొదటిరోజు వాస్తుహోమం జరుగుతుంది. ఈ ప్రక్రియలో క్రతువుకు అవసరమయ్యే యాగశాలలను సిద్ధం చేసి, వాటిని శుద్ధిచేసి; ఎటువంటి ఆటంకాలు, విఘ్నాలు కలుగకుండా దైవారాధన చేయబడుతుంది.
- రెండవ రోజున ముందు చెప్పుకున్న కళాపకర్షణ ప్రక్రియ చేపడతారు.
- మూడవ రోజు విశేష హోమాలు; భారత, రామాయణ, భాగవత పారాయణం జరుప బడుతాయి.
- నాల్గవరోజు అష్టదిగ్బంధనం జరుగుతుంది.
- ఐదవరోజు పూర్ణాహుతి, కళాన్యాసం, మహాశాంతి అభిషేకం జరుగుతాయి. తరువాత, శుభముహూర్తంలో ఆలయ సంప్రోక్షణ జరుప బడుతుంది.

ఈ ఉత్సవం జరిగిన ఇదు రోజుల వ్యవధిని ప్రధాన మరియు ఉపాలయాలలోని విగ్రహాలను, గర్భాలయాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన మరమ్మత్తులు చేపట్టడం కోసం వినియోగిస్తారు.

అష్టబంధన బాలాలయ మహాసంప్రోక్షణోత్సవం ఎప్పుడు ప్రారంభమైందో తెలియజెప్పే ఖచ్చితమైన చారిత్రకాధారాలు లభించలేదు. అయితే, దాదాపు వెయ్యేళ్ళ క్రితం శ్రీమద్భగవద్రామానుజుచార్యులే ఈ ఉత్సవానికి నాంది పలికినట్లు కొందరు భావిస్తారు. రెండు శతాబ్దాల క్రితం నుంచి ఈ ఉత్సవం జరిగినట్లుగా చారిత్రక ఆధారాలు ఉన్నాయి. దస్త్రాలు

(రికార్డులు) లభించినంత వరకూ 1908, 1934, 1946, 1958, 1970, 1982, 1994, 2006, 2018 సంవత్సరాలలో ఈ ఉత్సవం జరిగినట్లు తెలుస్తోంది. పుట – 127 తేదీ – నవంబరు, 09

శ్రీవారి మొక్కుబడులు

ఆపదమొక్కుల వాడికి భక్తులు చెల్లించుకునే విలక్షణమైన మొక్కులు, ముడుపులు ఎన్నో, ఎన్నెన్నో!

ఒక్కో ముడుపుకు ఒక్కో ప్రత్యేకత..

ఒక్కో మొక్కుకు ఒక్కో పరమార్థం..

కోరిన కోర్కె నెరవేరిన తరువాత మొక్కులు తీర్చుకునే వారు కొందరైతే, ముందే మొక్కు తీర్చుకుని కోర్కెల చిట్టా విప్పేవారు మరికొందరు..

సంతానప్రాప్తి, శారీరక స్వస్థత, ఉన్నతవిద్య, పరీక్షల్లో ఉత్తీర్ణత, ఉద్యోగప్రాప్తి, వివాహం, పదోన్నతి, విదేశయానం, వ్యాపారాభివృద్ధి, లాటరీ, ఎన్నికల్లో విజయం, మంత్రిపదవి, ఐశ్వర్యప్రాప్తి, పాడిపంటలు లాంటి వ్యక్తిగతమైన కోర్కెలే కాకుండా; దుర్భిక్ష నివారణ, సకాల వర్షాలు, క్రిమిసంహారం, ఉపగ్రహాల విజయవంతం, ప్రపంచశాంతి, దౌత్యవిజయం, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో గెలుపు వంటి సామాజిక పరమైన కోర్కెలకు కూడా అంతే లేదు. ఆ కలియుగ కల్పతరువును కోరుకోవాల్సిన అగత్యం లేనేలేదు. మన హితం మనకంటే ఎక్కువగా స్వామివారికే తెలుసు. భక్తులు కోరుకున్నా, కోరుకోక పోయినా; వారికి ఎప్పుడు, ఏది అవసరమో, వారి వారి కర్మఫలాన్ని బట్టి వారు దేనికర్హులో గుర్తెరిగి అన్నీ సకాలంలో సిద్ధింప జేస్తాడు. మనం చేయవలసిందల్లా శ్రీవారిపై అపారమైన భక్తిశ్రద్ధలతో, మన కర్తవ్యాన్ని, వృత్తి ఉద్యోగధర్మాన్ని ప్రతిఫలాపేక్ష లేకుండా, గెలుపు ఓటములు కృష్ణార్పణమేనని భావిస్తూ, చిత్తశుద్ధితో నిర్వర్తించడమే.

కానీ మానవ సహజమైన ఆరాటంతో, మనం స్వామివారిని నిరంతరంగా ఏవేవో కోర్కెలు కోరుతూనే ఉంటాం.

తలనీలాల సమర్పణ నుంచి నిలువు దోపిడి, అంగప్రదక్షిణం, తులాభారం, జోలె పట్టడం, శనివార వ్రతం, తిరుమలకు నడిచి రావడం, మెట్లను మోకాళ్ళతో ఎక్కడం వరకూ; భక్తులు సమర్పించుకునే ఎన్నో మొక్కుబళ్ళలో ముఖ్యమైన వాటిని ఈనాటి ప్రకరణంలో తెలుసుకుందాం.

నిలువు దోపిడి

అనుకున్న కోరిక నెరవేరితే వెంకన్న కొండకొచ్చి నిలువుదోపిడి సమర్పించుకునే సాంప్రదాయం తరతరాల నుండి ఉంది. 'నిలువుదోపిడి' అంటే మొక్కుకున్న సమయంలో మన వంటి మీదున్న ఆభరణాలన్నింటినీ, తాళిబొట్టుతో సహా కోర్కె తీరిన తరువాత స్వామివారికి సమర్పించు కోవడమన్నమాట. శరీరం మీదున్న ఆభరణాలనే కాదు; మన దేహాన్ని, మనసును ఎల్లవేళలా అంటిపెట్టుకుని ఉండే అహంకారాన్ని, స్వార్థపూరిత భావనలను, అరిషడ్వర్గాలను సైతం భగవదార్పణ చేయాలి. అదే నిజమైన నిలువుదోపిడి. సృష్టి సమస్తం దేవదేవుని సొత్తే అయినప్పుడు మనవిగా

భ్రమ పడుతూ, మనం అనుభవిస్తున్న సిరిసంపదలు, భోగభాగ్యాలు మన సొంతం ఎలా అవుతాయి? ఈ ధర్మసూక్ష్మాన్ని ఆకళింపు చేసుకుని, వాటినన్నింటిని త్రికరణశుద్ధిగా స్వామివారి కర్పించడమే నిలువుదోపిడి.

శ్రీవారికి అత్యంత ఆప్తులైన హాథీరాం బావాజీ, తరిగొండ వెంగమాంబ, అన్నమాచార్యుడు, తిరుమలనంబి, అనంతాళ్వార్ అందరూ తమ సర్వస్వాన్ని స్వామి చరణాలకు 'నిలువుదోపిడి' గా అర్పించి తరించినవారే. స్వామివారికి సమర్పించు కోవడం ద్వారా కోల్పోయిన దాని కంటే కొన్ని వందల, వేల రెట్ల లబ్ధిని పొందుతామని భక్తుల విశ్వాసం. అయితే, స్వామివారు మనకు ప్రసాదించేది భౌతికమైన సాధన సంపత్తులే కానక్కర లేదు. ఆరోగ్యవంతమైన శరీరం, సంస్కారవంతులైన సంతానం, ఒత్తిడి లేని సంసారం మొదలగు వాటి నుండి పరమపద ప్రాప్తి వరకూ, ఏదైనా కావచ్చు.

'నేను', 'నాది' అనే మోహాపేక్షను త్యజించడమే 'నిలువుదోపిడి' మొక్కుబడి లోని పరమార్థం.

అంగప్రదక్షిణం

కోరిన కోర్కెలు తీరినవారు, తాము ముందుగా మ్రొక్కుకున్నట్లు స్వామిపుష్కరిణిలో పవిత్ర స్నానమాచరించి విమానప్రదక్షిణ మార్గంలో, తడిచిన వస్త్రాలతో పొర్లుదండాలు పెట్టడమే 'అంగప్రదక్షిణం'. ఇంతకు మునుపు వెండివాకిలికి ఎదురుగా నున్న రంగనాథుని కుడ్యప్రతిమ వద్ద మొదలై, విమానప్రదక్షిణ మార్గంలో సవ్యదిశగా సాగి, తిరిగి అదే ప్రాంతంలో పూర్తయ్యే అంగప్రదక్షిణం; ప్రస్తుతం భక్తుల రద్దీ, స్థలాభావం వల్ల బంగారుబావి వద్ద మొదలై, హుండీ వద్ద, అర్ధవృత్తాకారంలో ముగుస్తోంది.

సాష్టాంగప్రమాణ మాచరించే టప్పుడు ఎలాగైతే శరీరం లోని అష్టాంగాలు భూతలాన్ని తాకుతాయో అంగప్రదక్షిణ చేసేటప్పుడు కూడా ఈ అష్టాంగాలు అలానే నేలను తాకాలి. సహజంగా ఏ అవయావల వల్లైతే పొరబాట్లు జరుగుతాయో; దేవదేవుని సమక్షంలో ఆ అవయవాలను నేలకు తాకించి, మన అహాన్ని స్వామివారికి సమర్పిస్తూ నీవే శరణమంటూ స్వామివారి చెంత చేరుతాం.

అంగప్రదక్షిణానికి సంబంధించిన విధి విధానాలను, నియమ నిబంధనలను ఇంతకు మునుపే, వేరొక ప్రకరణంలో తెలుసుకున్నాం.

తులాభారం

శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షాలను సంపూర్ణంగా పొందాలంటే తప్పనిసరిగా చేయవలసింది తనను తాను సంపూర్ణంగా శ్రీవారికి సమర్పించు కోవడం. సమకాలీన ప్రపంచంలో అలా చేయడానికి అనేక పరిమితులు, ఇబ్బందులు ఉంటాయి కనుక తన శరీర పరిమాణానికి సమంగా ఉండే ద్రవ్యరాశి నేదైనా స్వామివారికి సమర్పించు కోవడమే 'తులాభారం'. ఆత్మసమర్పణా ప్రస్థానానికి తొలిమెట్టే ఈ 'తులాభారం'.

మ్రొక్కు తీరిన వెంటనే, ముందుగా అనుకున్న ద్రవ్యంతో స్వామివారి సన్నిధి లోనున్న త్రాసులో తూగి; ఆ ద్రవ్యాన్ని స్వామివారికి సమర్పిస్తారు. అలా సమర్పింప బడే ద్రవ్యం కలకండ, బెల్లం, ధాన్యం, పప్పుదినుసులు వంటి తినే పదార్థాల నుండి నాణాలు, కరెన్సీ నోట్లు, వెండి అచ్చులు, బంగారు నాణేల వరకూ ఏదైనా కావచ్చు.

శ్రీవారి భక్తులైన రాజాధిరాజులందరూ స్వర్ణాభరణాల తోనూ, రతనాల రాశుల తోనూ తులాభారం తూగి స్వామి కృపకు పాత్రులైన వారే..

ఎందరెందరో చక్రవర్తులను తూచిన ఈ తరాజును ప్రస్తుతం సంపంగి ప్రదక్షిణమార్గం లోనున్న తిరుమలరాయ మంటపంలో చూడవచ్చు.

జోలె పట్టడం

గృహస్థాశ్రమ ధర్మాన్ని ఆచరిస్తూ అష్టైశ్వర్యాలతో తులతూగే వారు సైతం జోలె పట్టి భిక్షాటన చేస్తూ, తద్వారా వచ్చిన సొమ్ముతో తిరుమల యాత్ర చేస్తామని మొక్కుకుంటారు. విశ్వమంతటికీ విభుడవ్వడం వల్ల ఆ దేవదేవుని ముందు అందరూ యాచకులే! సిరిసంపదలను, మోక్షమార్గాన్ని యాచించే వారే! ఇదే సత్యాన్ని ఈ మొక్కుబడి సూచిస్తుంది. కొన్ని దశాబ్దాల క్రితం వరకూ జోలె పట్టి, శ్రీవేంకటేశ్వరుని చిత్రపటాన్ని హస్తద్వయంలో నుంచుకొని, సపరివార సమేతంగా, పసుపు బట్టలతో తిరుమల యాత్ర చేపట్టే యాత్రికులెందరో కానవచ్చేవారు. ఈమధ్య కాలంలో జోలె పట్టే సాంప్రదాయం అంతగా ప్రాచుర్యంలో లేకున్నా అక్కడక్కడా ఈ మొక్కుబడి ఇంకా సజీవంగానే ఉంది.

ధర్మబద్ధమైన మార్గాలలో, స్వయంగా ఆర్జించిన లేదా సమకూర్చుకున్న సొమ్ము తోనే తీర్థయాత్ర చేయాలని; ఆ విధంగా చేస్తేనే యాత్రాఫలం సంపూర్ణంగా సిద్ధిస్తుందని పురాణాలలో ప్రస్తావించ బడింది. ప్రస్తుతం మనం సంపాదించే సొమ్ము ఈ సులక్షణాలను కలిగి ఉంటుందనే భరోసా లేదు. కాబట్టి, సర్వసంగ పరిత్యాగుల వలె భిక్షాటన చేయగా వచ్చిన సొమ్ముతో చేయడం ద్వారా తీర్థయాత్ర యొక్క పూర్ణఫలాన్ని పొందగలమని భక్తుల నమ్మిక. అంతే గాకుండా తిరుమల యాత్ర చేయడం సాధ్యపడని వారు జోలెలో ఉడుతాభక్తిగా కానుకలు వేసి యాత్రాఫలాన్ని తాము కూడా పొందుతారు.

మోకాళ్ళతో కొండనెక్కడం

కోరిన కోర్కె సిద్ధిస్తే మోకాళ్ళతో కొండనెక్కే భక్తులు కూడా ఎంతో మంది ఉంటారు. మెట్లన్నీ కాకపోతే ఐదారు వందల మెట్లున్న మోకాలి పర్వతాన్నీ, అదీ కాకుంటే కనీసం మూడు మెట్లనూ మోకాళ్ళతో అధిరోహిస్తారు. పూర్వకాలంలో శ్రీవేంకటేశ్వరుడు కొలువున్న వేంకటాద్రి పర్వతాన్ని తమ పాదస్పర్శతో అపవిత్రం చేయడానికి మనస్కరించని వ్యాసరాయలు వారు, భగవద్రామానుజుల వారు వంటి ఎందరో పుణ్యపురుషులు మోకాళ్ళతో కొండ నధిరోహించి తరించారు.

ఈ మొక్కుబడి శ్రీవారి పట్లనున్న శ్రద్ధాభక్తులకు నిలువెత్తు నిదర్శనం. తిరుమలకు వెళ్ళే నడకదారిలో ఎన్నో కొన్ని

మెట్లను మోకాళ్ళతో అధిరోహించే వందలాది భక్తులు నేడు కూడా కానవస్తారు.

మొక్కును బట్టి స్వగృహం నుండి, పసుపు బట్టలతో, వందల మైళ్ళు పాదరక్షలు లేకుండా నడచి, మెట్లదారిలో కొండకు చేరుకునే భక్తులు కోకొల్లలు. మెట్టు మెట్టుకు పసుపు కుంకుమలు రాసేవారు కొందరైతే అగరువత్తులు, దీపాలు వెలిగించి తమ భక్తితత్పరతలను మరికొందరు.

ముడుపు కట్టడం

స్వామివారి నేదైనా కోర్కె కోరుకుని, దానికి గుర్తుగా 'ముడుపు' కడతారు. కొన్ని నాణాలను పసుపు బట్టలో ముడివేసి, పూజామందిరంలో శ్రీవేంకటేశ్వరుని పటం సమీపంలో నుంచి, కొండకు వస్తామని సంకల్పం చెప్పుకుంటారు. కోర్కె నెరవేరిన తరువాత, తిరుమలేశుని దర్శించుకుని ఆ ముడుపును భద్రంగా హుండీలో సమర్పించు కుంటారు.

వడ్డికాసుల సమర్పణ

భక్తులు ఏదైనా కోర్కెను కోరుకునే ముందు, ఆ కోర్కెకు చిహ్నమైన వస్తువును సమర్పించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉదాహరణకు శరీరాంగాలలో దేనికైనా అస్వస్థత గానీ, అంగవైకల్యం గానీ సంభవిస్తే ఆ అంగం యొక్క వెండి ఆకృతిని హుండీలో సమర్పించి, సత్వరమే స్వస్థత చేకూరాలని మొక్కుకుంటారు. కాలు, చెయ్యి, ముక్కు, కళ్ళు, చెవులు ఇలా ఏదైనా కావచ్చు. అలాగే ఉద్యోగప్రాప్తి కావలసినవారు కుర్చీ బొమ్మను, సంతానం కావలసినవారు ఊయలను, గృహనిర్మాణాసక్తి కలవారు ఇల్లు బొమ్మను, వాహనాభిలాషులైన వారు వాహనం బొమ్మను ఇలా లెక్కకుమిక్కిలిగా నున్న వెండిచిహ్నాల నమ్మే చిన్న చిన్న అంగళ్ళు కొండపై అనేకం కనిపిస్తాయి. ఈ చిహ్నాలనే 'వడ్డికాసులు' లేదా 'మొక్కుబడి కాసులు' లేదా 'మొక్కు వడ్డికాసులు' లేదా 'వెండి రేకులు' అని పిలుస్తారు.

శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైన, అత్యంత లోకప్రసిద్ధమైన, అనాదిగా వస్తున్న 'తలనీలాల సమర్పణ' మొక్కుబడిని మునుపటి ప్రకరాణాలలో తెలుసుకున్నాం.

మొక్కుకున్న మొక్కుబళ్ళను కోర్కె తీరిన వెంటనే, సాధ్యపడని పక్షంలో కనీసం సంవత్సరకాలం లోపుగా తీర్చుకోవాలని పెద్దలు చెబుతారు. లేనిపక్షంలో, ఆ వడ్డీ కాసుల వాడు వడ్డీతో సహా వసూలు చేసుకుంటాడు. మనం మన మొక్కును సకాలంలో చెల్లించుకోకపోతే, శ్రీవేంకటేశ్వరుడు కుబేరుని ఋణాన్నెలా తీరుస్తాడు?

అన్యులకు హాని కలిగించని, సమాజహిత కారకమైన కోర్కెలు మాత్రమే తీర్చాలని మొక్కుకోవాలి గానీ; అనుచితమైన కోర్కెలతో స్వామివారిని కష్టపెట్టవద్దు. ఇటు భక్తుల కోర్కెను కాదనలేడు అటు అనుచితమైన కోర్కెను తీర్చనూ లేడు. స్వామివారిని ఈ విధమైన ధర్మసంకటం నుండి తప్పించాలంటే, మనం కోరుకునే కోర్కెలు ధర్మబద్ధంగా ఉండితీరాలి. ఎంత పెద్ద మొక్కు మొక్కుకున్నా మన్న దానికంటే ఆ మొక్కును ఎంత చిత్తశుద్ధితో, ఎంత నిబద్ధతతో తీర్చామన్నదే ముఖ్యం.పుట – 128 తేదీ నవంబరు, 10

సుప్రభాత గానం

దక్షిణభారతదేశం లోని లక్షలాది గృహాలలో, మరీ ముఖ్యంగా విశ్వవ్యాప్తంగా విస్తరించి ఉన్న తెలుగు వారిళ్ళలో దినచర్య నేటికీ సుప్రభాతగాన శ్రవణం తోనే ప్రారంభ మవుతుంది. గృహాల లోనే కాకుండా తిరుమలతో సహా ప్రపంచం నలుమూలలా ఉన్న శ్రీవేంకటేశ్వరుని దేవాలయాల లోను, ఎన్నో హిందూ ధార్మిక సంస్థల్లోను, ప్రసార మాధ్యమాలలో కూడా ఉదయపు వేళల్లో సుప్రభాతగానం చేయబడుతుంది. కోట్లాదిమంది తెలుగువారు కంఠస్థంగా చెప్పగలిగిన ఆధ్యాత్మిక గీతమేదైనా ఉందంటే అది ముమ్మాటికీ 'సుప్రభాతం' మాత్రమే. అంతటి ప్రఖ్యాతి గాంచిన సుప్రభాత గానాన్ని శ్రవణానందకరంగా విని, ఆనందించి, భక్తిపారవశ్యంలో మునిగిపోవడమే గానీ ఆ గీత రచయిత ఎవరు? అది ఏ సందర్భంలో, ఎలా రచింపబడింది? దానిలోని భావర్థమేమిటి? అన్న విషయాలు అతికొద్ది మందికి మాత్రమే తెలుసు. ఈనాటి ప్రకరణంలో ఆ విషయాలను ముచ్చటించుకుందాం.

సుప్రభాతగానం ఆవిర్భావం

అర్థసహస్రాబ్దానికి పైగా కోట్లాది భక్తజనులను తన ఆధ్యాత్మిక శోభతో, భావలాలిత్యంతో, వీనులవిందైన ఛందోబద్ధ శ్లోకాలతో పులకింప జేస్తున్న 'సుప్రభాతగానం' ప్రణాళికా బద్ధంగా, ఎంతోకాలం వెచ్చించి వ్రాసినది కాదు. భక్త్యావేశాన్ని తనువెల్లా రంగరించుకున్న ఒక భక్తాగ్రేసరుని గుండె లోతుల్లోంచి అసంకల్పితంగా, ఆశువుగా పొరలి వచ్చిన గానామృతమే 'సుప్రభాతం'.

మనవాళ మహాముని

దాదాపు ఆరు శతాబ్దాలక్రితం మనవాళ మహాముని అనే శ్రీవారి మహాభక్తుడుండే వారు. విశిష్టాద్వైత సాంప్రదాయాన్ని ప్రాచుర్యం లోకి తెచ్చిన మహామహులలో వీరు కూడా ఒకరు. శ్రీవారి భక్తితత్వ వ్యాప్తికి, హైందవమత సాంప్రదాయం వ్రేళ్ళూను కోవడానికి ఆ మహనీయుడు సలిపిన విశేషకృషికి గుర్తుగా తిరుపతి పట్టణం నడిబొడ్డున ఉన్న గోవిందరాజస్వామి ఆలయ ప్రాంగణంలో వారికో ఉపాలయాన్ని నిర్మించి, అందులో నేటికీ నిత్యపూజలు నిర్వహించ బడుతున్నాయి.

ఆ ఋషిసత్తముడు, తన ఎనిమిది మంది ప్రముఖ శిష్యులలో ఒకరైన 'హస్తగిరినాథన్' వారితో ఒకసారి తిరుమలకు విచ్చేశారు.

హస్తగిరినాథన్

హస్తగిరినాథన్ వారు ప్రఖ్యాత వైష్ణవమత ప్రచారకులు 'ముడుంబైనంబి' వారసులైన అనంతాచారి, ఆండాళ్ పుణ్యదంపతులకు; పద్నాలుగవ శతాబ్దపు ద్వితీయార్థభాగంలో, కాంచీపురంలో జన్మించారు. ఆధ్యాత్మిక గ్రంథాలెన్నింటినో అలవోకగా పఠించిన హస్తగిరినాథన్ తన అసమానమైన కవితాకౌశలంతో, పాండితీప్రకర్షతో;

ఆధ్యాత్మిక చర్చల్లో ప్రతివాదులకు పెనుసవాలుగా నిలిచారు. ఎందరో ఉద్దండ పండితులను తన వాక్పటిమతో ఓడించిన 'నరశింహ మిశ్రుడు' అనే అద్వైత పండితోత్తముడిని పరాజయం పాలు గావించి, వారిని తన శిష్యునిగా చేసుకొనడం వల్ల హస్తగిరినాథన్ 'ప్రతివాద భయంకర అణ్ణన్' గా ప్రఖ్యాతి గాంచారు. వారి వంశీయులు ఇప్పటికీ సంగీతసాధనలో తరించు తున్నట్లు కొందరి కథనం. తెలుగు చలనచిత్రసీమను ఒకానొక సమయంలో తన గానమాధుర్యంతో ఉర్రూత లూగించిన, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రతివాద భయంకర శ్రీనివాస్ (పి. బి. శ్రీ నివాస్) కూడా అదే వంశనామంతో ప్రఖ్యాతి గాంచడం కేవలం కాకతాళీయం కాకపోవచ్చు.

ఆమోదముద్ర!

ఆనాడు, శ్రీవేంకటెశ్వరునికి ప్రత్యేకంగా సుప్రభాతం లేదు. ప్రాతఃకాల సమయాలలో ప్రబంధపఠనం మాత్రమే జరుగుతుండేది. ఒకనాటి ప్రాతఃసంధ్యలో గురుశిష్యులిద్దరూ (మణవాళ మహాముని, హస్తగిరినాథన్) స్వామివారి దివ్యమూర్తిని అలౌకిక ఆనందంతో కాంచుతున్నప్పుడు; గురువుగారు భగవత్సంకల్ప ప్రేరితుడై శ్రీనివాసుణ్ణి మేల్కొలుపుతూ ఒక ప్రత్యేక ప్రార్థనాగీతాన్ని ఆలపించ వలసిందిగా తన శిష్యుణ్ణి ఆదేశించారు. వెనువెంటనే ద్వాదశాళ్వారులలో ఒకరైన తొండరడిప్పొడి ఆళ్వార్ శ్రీరంగనాథునిపై రచించిన, అప్పటికే విస్తృతంగా ప్రచారంలో ఉన్న సుప్రభాతం శిష్యుని మదిలో మెదిలగా, దానిలోని భావార్థాన్ని వారు స్మరణకు తెచ్చుకున్నారు. గురువు గారి ఆజ్ఞను మహాప్రసాదంగా, అందివచ్చిన అవకాశంగా భావించిన అణ్ణన్ స్వామి, శ్రీరంగశాయి సుప్రభాత స్ఫూర్తితో 29 శ్లోకాలతో కూడిన శ్రీ వేంకటేశ సుప్రభాతాన్ని, 11 శ్లోకాలున్న శ్రీ వేంకటేశ స్తోత్రాన్ని, 16 శ్లోకాలు గల శ్రీ వేంకటేశ ప్రపత్తిని, 14 శ్లోకాలు గలిగిన శ్రీ వేంకటేశ మంగళాశాసనాన్ని ఇలా మొత్తం నాలుగు భాగాలను ఆశువుగా పఠించాడు. అప్పటివరకు తమిళభాషలో ప్రబంధపారాయణం జరిగే తిరుమల ఆలయంలో అణ్ణన్ స్వామి సంస్కృతభాషలో రచించిన మేలుకొలుపు గీతాన్ని నిత్యం పఠించే 'శ్రీ వేంకటేశ సుప్రభాతం' గా అంగీకరించే విషయంలో చర్చోపచర్చలు జరిగాయి. కానీ భావసౌందర్యం లోను, రాగయుక్తంగా పాడబడడం లోను, ఛందోబద్ధత లోను ఏ విధమైన లోటుపాట్లు కానరాకపోవడంతో; ఎట్టకేలకు 1430 వ సంవత్సరం, శ్రీవీరప్రతాపరాయల వారి పరిపాలనాకాలంలో అణ్ణన్ స్వామి రచించిన గీతం, 'శ్రీ వేంకటేశ సుప్రభాతం' గా ముక్తకంఠంతో ఆమోదించబడింది. అంటే, నేటికి దాదాపు 590 సంవత్సరాల నుండి సుప్రభాతగానం అవిచ్ఛిన్నంగా కొనసాగు తోందన్న మాట. తన అమోఘమైన ఆధ్యాత్మిక, సాహిత్య, కవితా, గాన పటిమతో అశేషంగా ఉన్న శ్రీవారి భక్తుల గుండెల్లో అజరామరమైన స్థానాన్ని సంపాదించుకున్న అణ్ణన్ స్వామి ధన్యజీవి.

సుప్రభాత అంతర్గతమైన ఒక్కొక్క విభాగంలో ఏముందో ఇప్పుడు క్లుప్తంగా తెలుసుకుందాం.

శ్రీ వేంకటేశ సుప్రభాతం

'సుప్రభాతం' అంటే మంగళకరమైన ఉదయపు వేళ అని అర్థం. శ్రీ వేంకటేశ సుప్రభాతం యొక్క ఇతివృత్తం ముఖ్యంగా శ్రీవారి మేలుకొలుపు గానమే అయినప్పటికీ అందులో వారి అపురూప సౌందర్యం, మంగళకరమైన

గుణగణాలు, మహిమలు యొక్క సంక్షిప్త వర్ణన కూడా కానవస్తుంది. శ్రీవారు ముల్లోకాలకు రాజాధిరాజు. రాజులను, మహారాజులను సర్వ లాంఛనాలతో మేలుకొలుపే సాంప్రదాయం అనాదిగా వస్తోంది. అదే ఆనవాయితీని కొనసాగిస్తూ శ్రీవారికి, సతీ సమేతంగా, రాజోచిత సత్కారాలతో పాడే మేలుకొలుపే సుప్రభాతగానం. ప్రభాత సమయంలో ప్రకృతి శోభ; స్వామివారి తొలిదర్శనానికై వేచియుండే బ్రహ్మాదిదేవతల, నవగ్రహాల మరియు సప్తఋషుల కోలాహలం; రామచిలుకలు, తేనెటీగల వంటి అల్పప్రాణులు సైతం విభిన్నరీతుల్లో శ్రీవారికి తెలియజేసే అభినందనలు; శ్రీమహావిష్ణువు దశావతారాలు మున్నగు అంశాలు కూడా సుప్రభాతంలో మనోహరంగా వర్ణించబడ్డాయి.

శ్రీ వేంకటేశ స్తోత్రం

'స్తోత్రం' అంటే స్తుతి లేదా పొగడ్త అని అర్థం. శ్రీ వేంకటేశ స్తోత్రంలో శ్రీవారి దశావతారాల మహిమలు; వారి విశ్వవ్యాపకత్వం, సార్వభౌమత్వం, ఆశ్రితజన పక్షపాతం; శ్రీరామచంద్రుని విలువిద్యా కౌశలం మున్నగునవి విస్తారంగా వర్ణించబడ్డాయి.

శ్రీ వేంకటేశ ప్రపత్తి

సాధారణంగా, భక్తి ప్రపత్తి అనే మాటలను ప్రత్యాయపదాలుగా ఉపయోగిస్తుంటాం. కానీ రెండింటికీ ఎంతో వ్యత్యాసముంది. భక్తిని 'మర్కటకిశోరన్యాయం' తో పోల్చవచ్చు. అంటే పిల్ల కోతి ఎల్లవేళలా తల్లి ఉదరాన్ని తన కాలి వ్రేళ్ళతో గట్టిగా పట్టుకొని ఉంటుంది. ఏ క్షణంలో నైనా పట్టు తప్పితే కోతిపిల్ల ప్రమాదానికి లోనవుతుంది. కోతిపిల్లను భక్తుని తోనూ, తల్లికోతిని భగవంతుని తోనూ పోల్చినప్పుడు, 'మర్కట కిశోర న్యాయం' లో భగవంతునిపై విశేషమైన భక్తిభావ మున్నప్పటికీ, వారిని ఎల్లవేళలా అంటిపెట్టుకుని ఉండే బాధ్యత మాత్రం భక్తునిదే.

కానీ 'ప్రపత్తి' విషయంలో అలా కాదు. ప్రపత్తిని 'మార్జాల కిశోర న్యాయం' తో పోల్చుతారు. తల్లిపిల్లి తన పిల్లను నోటితో కరుచుకుని ఒక చోటి నుండి మరో చోటికి క్షేమంగా చేర్చుతుంది. పిల్లిపిల్ల తన బాధ్యతను పూర్తిగా తల్లిపై వేసి, నిశ్చింతగా ఉంటుంది. అలాగే, భక్తుడు 'ప్రపత్తి' లేదా 'శరణాగతి' ని ఆశ్రయించి నప్పుడు తన భారాన్నంతా దేవునిపై వేసి, ఐహిక చింతలకు దూరంగా ఉంటూ, భగవన్నామ స్మరణలో ప్రశాంతంగా గడప గలడన్న మాట.

సంక్షిప్తంగా చెప్పాలంటే 'భక్తి' అంటే భగవంతుణ్ణి ఆరాధించడం; 'ప్రపత్తి' అంటే దేవుని శరణు వేడి భారాన్నంతా వానిపై వేసి నిశ్చింతగా ఉండటమన్న మాట. 'భక్తి' కంటే 'ప్రపత్తి' ని ఉత్తమమైనదిగా భావించి, అణ్ణన్ స్వామి దానినే ఆశ్రయించారు.

శ్రీ వేంకటేశ ప్రపత్తిలో శ్రీనివాసుని పాదపద్మాలే

ముల్లోకవాసు లందరికి శరణ్యమని; వారి శరణు వేడినవారికి మోక్షప్రాప్తి లభిస్తుందని; వారు ఈప్సితాలు ఈడేర్చే కల్పతరువని వర్ణించ బడింది. భక్తులకు శ్రీవారి పాదాలే శరణు కావున, వారి పాదారవిందాలను కూడా ప్రపత్తిలో

అణ్ణన్ స్వామి విస్తారంగా వర్ణించారు.

శ్రీ వేంకటేశ మంగళాశాసనం

'మంగళాశాసనం' అంటే 'ఆశీర్వచనము'. శ్రీవేంకటేశ్వరుడు మానవమాత్రునిగా జన్మించి, అర్చారూపంలో వెలసియుండటం వల్ల వారు కూడా నరదృష్టికి అతీతులు కారు. కావున అతిలోక సౌందర్యంతో వర్ధిల్లే వారి దివ్యమంగళ మూర్తికి దృష్టి (దిష్టి) సోకుతుందేమోననే బెంగతో, అణ్ణన్ స్వామి శ్రీవారికి ఆశీర్వచనం పలికారు. వారి శుభచింతనను విని, గగనాన విహరించే తథాస్తు దేవతలు 'తథాస్తు' పలికి, శ్రీవారిని దుష్టశక్తుల నుండి కాపాడతారని అణ్ణన్ స్వాముల ఆకాంక్ష. అందువల్ల ముల్లోకాలను ఏలే, భక్తజనుల పాలిట కొంగుబంగారమైన శ్రీవేంకటేశ్వరుడు, శ్రీమహాలక్ష్మి కలకాలం వర్ధిల్లాలనే ఆకాంక్షను 'మంగళాశాసనం' లో అణ్ణన్ స్వామి వెలిబుచ్చుతారు. 'శ్రీ వేంకటేశ మంగళాశాసనం' 'వరవరముని' అనే మరో భక్తుని ద్వారా రచించబడినదని కొన్ని గ్రంథాల్లో పేర్కొనబడింది. కానీ, అత్యధికులు మాత్రం దీనిని కూడా అణ్ణన్ స్వామివారే వ్రాశారని విశ్వసిస్తారు.

శ్రీ వేంకటేశ సుప్రభాత శ్లోకముల భావసౌందర్యం

ఒకటవ శ్లోకం

"కౌసల్యా సుప్రజా రామ పూర్వాసంధ్యా ప్రవర్తతే,
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్."

శ్లోకార్థం – కౌసల్యామాత పుత్రరత్నమైన రామచంద్రా! తూర్పున తెల్లవారు చున్నది. నరులలో శార్దూలము (అనగా సింహం) వంటి శ్రీరామా! దేవదేవునికి నిత్యకైంకర్యాలు సమర్పించే సమయ మాసన్నమైంది. మేలుకో!

తాత్పర్యం – భావార్థం: దశావతారధారి, విశ్వవ్యాపి, ఘటనాఘటన సమర్థుడు యైన శ్రీవేంకటేశ్వరుణ్ణి ఎలా సంబోధించాలి? సుప్రభాతగానం దేనితో ప్రారంభించాలి? అన్న సంశయం ఎదురైనప్పుడు శ్రీమహావిష్ణువుకు ఏ అవతారంలో, ఏ మహాపురుషుడు, ఎలా, ఏ సందర్భంలో మేలుకొలుపు పాడారో మన్నన్ స్వామి మననం చేసుకున్నాడు. వెనువెంటనే వాల్మీకి రామాయణం వారి మదిలో మెదిలింది. యాగ సంరక్షణార్థం తనతో వచ్చి, రాత్రి అరణ్యంలో విశ్రమించిన శ్రీరామచంద్రుణ్ణి మరునాటి ఉదయం విశ్వామిత్రు దేవిధంగా మేలుకొలిపాడో తలపుకు వచ్చింది. స్వామివారిని తన మనోఫలకంపై త్రేతాయుగ అవతారమైన శ్రీరామచంద్రునిగా చిత్రించుకున్నాడు. తక్షణం వారి నోటినుండి పై శ్లోకం వెలువడింది.

వన్యమృగాలకు మృగరాజే (అనగా సింహం) మకుటం లేని మహారాజు. శ్రీరాముణ్ణి శార్దూలంతో పోల్చడం ద్వారా ఈ శ్లోకంలో వారిని నరులందరికి రారాజుగా వర్ణించడం జరిగింది.

రాముడే దేవుడు. వారింకెవరిని అర్చించుకోవాలి? అనే సంశయం మన మదిలో ఉత్పన్నమయ్యే ఆస్కారముంది. శ్రీరాముడు తన అవతార పరిసమాప్తి వరకు మానవమాత్రుని గానే ప్రవర్తించి, మానవ సహజమైన కష్టనష్టాలను

అనుభవించాడు. వాటన్నింటినీ స్థిరచిత్తంతో సహించి, విపత్కర పరిస్థితులను వీరోచితంగా ఎదుర్కొన్నాడు గానీ విష్ణువుగా తన మహత్తును ప్రదర్శించలేదు. సముద్రాన్ని లంఘించాల్సి వచ్చినప్పుడు వానరసేనతో వారధి నిర్మింపజేశాడు గానీ వైకుంఠం లోని క్రీడాపర్వతాన్ని తెచ్చి అవలీలగా పుడమిపై ప్రతిష్ఠించిన తన భృత్యుడైన గరుత్మంతుణ్ణి, తన సేనలను ఆవలివడ్డుకు చేర్చవలసిందిగా ఆదేశించలేదు. ఆ మహత్తర కార్యాన్ని గరుడుడు తృటిలో నిర్వహించ గలడు. కానీ, రాముడు యుగధర్మాన్ని పాటించి, సామాన్య మానవునిలా మసలుకొన్నాడు. కావున శ్రీరామచంద్రుడు సైతం పురుషార్థసాధనలో భాగంగా దేవతారాధన చేయాల్సిందే.

రెండవ శ్లోకం

"ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ గరుడధ్వజ,
ఉత్తిష్ఠ కమలాకాన్త త్రైలోక్య మంగళం కురు."

శ్లోకార్థం – గోవిందా! గరుడధ్వజాన్ని చిహ్నంగా గలిగిన రాజాధిరాజా! లక్ష్మీనాథా! సత్వరమే మేలుకో..

మేలుకొని ముల్లోకాలకు శుభాలను కలుగజేయి.

తాత్పర్యం – భావార్థం: శ్రీవేంకటేశ్వరుణ్ణి మొదటి శ్లోకంలో శ్రీరామచంద్రునిగా సంబోధించిన అణ్ణన్ స్వామివారు; రెండవ శ్లోకంలో 'గోవిందా' అంటూ శ్రీమహావిష్ణువు యొక్క మరో ఉత్కృష్ట అవతారమైన శ్రీకృష్ణునిగా కీర్తించారు. గోకులంలో గోవర్ధనగిరి నెత్తి గోవులను రక్షించడం ద్వారా శ్రీకృష్ణుడు గోవిందు డయ్యాడు. గోవులతో, గోపకులతో శ్రీకృష్ణుని కానాడు ఉన్న అనుబంధం నేటికీ కొనసాగుతోంది. ఈనాటికీ, ప్రతినిత్యం శ్రీనివాసుని ప్రథమ దర్శనభాగ్యం ఒక గొల్లవానికే లభిస్తుందని మునుపటి ప్రకరణాలలో తెలుసుకున్నాం.

ఈ శ్లోకంలో శ్రీనివాసుణ్ణి 'గరుడధ్వజం' చిహ్నంగా కలిగిన వానిలా కూడా కవివరేణ్యులు వర్ణించారు. శ్రీనివాసునికి తన వాహనము, సేవకుడు అయిన గరుత్మంతునితో ఆత్మీయ సంబంధం ఉంది. శ్రీవారి ధ్వజంలో (జెండా) ఉండే చిహ్నం కూడా గరుత్మంతుడే.

గరుడధ్వజారోహణతో ముల్లోకవాసులకు ఆహ్వానం పలుకుతూ ఆరంభమయ్యే బ్రహ్మోత్సవాలు అదే ధ్వజాన్ని అవనతం చేయడంతో ముగుస్తాయి. ఆర్తత్రాణపరాయణుడైన ఆనందనిలయుడు గరుడుని పేరు విన్నంతనే పులకించిపోయి, తన కారుణ్యకాంతులను ప్రసరింప జేస్తాడని అణ్ణన్ స్వామివారు ఆకాంక్షించారు. పుట – 129 తేదీ – నవంబరు, 11

మూడవ శ్లోకం

"మాత స్సమస్తజగతాం మధుకైటభారేః
వక్షోవిహారిణి మనోహర దివ్యమూర్తే.
శ్రీస్వామిని శ్రితజన ప్రియదానశీలే
శ్రీవేంకటేశదయితే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – మధుకైటభులనే దానవులకు శత్రువైనట్టి శ్రీహరి వక్షస్థలవాసియైన, దివ్యమనోహర రూపాన్ని కలిగియున్న, సకల లోకాలకు తల్లీ! శరణు వేడినవారిని బ్రోచే, శ్రీవేంకటేశ్వరుని అర్ధాంగి వైన మాతా – నీకు సుప్రభాతం.

శ్రీవారి అనుగ్రహం త్వరితంగా పొందాలంటే, దయార్ద్ర హృదయురాలైన అమ్మవారి ఆశీర్వాదం కావాలి. వక్షస్థలంలో కొలువై ఉన్న శ్రీమహాలక్ష్మి సిఫారసును శ్రీనివాసుడు కాదనలేడు. 'పతిదేవు ఒడిలోన మురిసేటి వేళ – మగనికి మా మనవి వినిపించవమ్మా' – అంటూ, విన్నపాన్ని అలమేలు మంగ ద్వారా శ్రీవేంకటేశ్వరునికి చేరవేసే కమ్మనైన తెలుగు పాట మనకు సుపరిచితమే! అన్నమయ్య, తరిగొండ వెంగమాంబ వంటి మహాభక్తు లెందరో శ్రీమహాలక్ష్మిని; భక్త రామదాసు వంటివారు సీతమ్మ వారిని ఆరాధించే శ్రీవారికి చేరువయ్యారు. అదే పంథాలో అణ్ణన్ స్వామివారు కూడా ఈ శ్లోకంలో అమ్మవారి శరణు వేడుతున్నారు.

జగన్మాతచే ఇచ్ఛామరణాన్ని వరంగా పొంది వరగర్వితులై బ్రహ్మాది దేవతలతో, చివరకు తనతో కూడా కదనానికి కాలు దువ్విన మధుకైటభులనే దానవులను శ్రీహరి నిర్జించాడు. ఆ విధంగా తన పతిదేవుడైన శ్రీహరి పరాక్రమాన్ని అన్యాపదేశంగా స్మరణకు తెచ్చి, శ్రీమహాలక్ష్మి కటాక్షాన్ని, తద్వారా శ్రీమహావిష్ణువు అనుగ్రహాన్ని పొందడమే అణ్ణన్ స్వామివారి ప్రార్థన లోని ఆంతర్యం.

నాల్గవ శ్లోకం

"తవ సుప్రభాత మరవిందలోచనే
భవతు ప్రసన్నముఖచంద్రమండలే,
విధిశంకరేంద్ర వనితాభి రర్చితే
వృషశైలనాథదయితే దయానిధే."

శ్లోకార్థం – పద్మముల వంటి నేత్రాలు కలిగి పున్నమిచంద్రుని కాంతితో ప్రకాశించే; బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు మొదలగువారి సతీమణులచే పూజింపబడే; వృషశైల నాథుని సతీమణీ నీకు సుప్రభాతం.

ఈ శ్లోకంలో కూడా అణ్ణన్ స్వామి అమ్మవారి ముఖవర్ఛస్సును, గుణగణాలను వర్ణిస్తూ వారి శరణు వేడుకొంటున్నాడు.

పద్మంలో జనియించి, పద్మాసీనురాలై, పద్మాన్ని చేబూని, పద్మాలచే పూజించబడే శ్రీమహాలక్ష్మికి పద్మాలంటే మిక్కిలి మక్కువ. ఆమెను ప్రసన్నం చేసుకోవడానికై, వారి నేత్రాలను పద్మాలతో పోల్చడం జరిగింది.

'వృషాచలం' సప్తగిరులలో ఒక గిరిశిఖరం కావున, సప్తగిరి వాసుడైన శ్రీవేంకటేశ్వరుడు 'వృషశైలనాథుని' గా కీర్తించ బడ్డాడు. 'వృషము' అంటే 'ధర్మము' అని అర్థం. ఒకానొకప్పుడు ధర్మదేవత ఆ శిఖరంపై తపస్సు చేయడం వల్ల దానికి 'వృషాచలమనే' నామ మేర్పడింది. అలా వృషశైలాధిపతిగా కీర్తించడం వల్ల ఆ శ్రీనివాసుడి ధర్మపరాయణత్వం కూడా లీలగా గోచరిస్తుంది. పతిదేవుణ్ణి పరోక్షంగా నైనా సరే ధర్మాత్ముడని పొగిడితే, అది చెవులారా విని పొంగిపోని పత్ని ముల్లోకాలలో ఉంటుందా!!!

ఐదవ శ్లోకం

"అత్ర్యాదిసప్తఋషయ స్సముపాస్య సంధ్యాం
ఆకాశసింధుకమలాని మనోహరాణి,
ఆదాయ పాదయుగ మర్చయితుం ప్రసన్నాః
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – ప్రాతఃకాల సంధ్యా వందనాదులను పూర్తి చేసుకున్న అత్రి మొదలగు సప్తర్షులు ఆకాశగంగ లోని, ముగ్ధమనోహరంగా నున్న కలువపూలతో అర్చించడానికై వేచియున్నారు. శేషాద్రి శిఖరాధీశా మేలుకో!

సప్తఋషులుగా పిలువబడే అత్రి, కశ్యపుడు, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, వశిష్ఠుడు వంటి మునిపుంగవులు దేవతలతో సమానంగా పూజించ బడతారు. అంతటివారితో ఆరాధింప బడటం ఆ దేవదేవుని కీర్తికిరీటంలో కలికితురాయి. అందులోనూ అత్రిమహర్షి సప్తఋషు లందరిలోకి మకుటాయమానంగా వెలుగొందుతాడు. త్రిమూర్తులను పసిబాలురిగా మార్చి వేయగలిగిన తన ధర్మపత్ని అనసూయ పాతివ్రత్య మహిమ చేతను, త్రిమూర్తుల అంశయైన దత్తాత్రేయుణ్ణి పుత్రునిగా పొందటం వల్లను అత్రిమహర్షి ఖ్యాతి మరింతగా ఇనుమడించింది. అంతటి మహానుభావుడు శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థం వేచి యున్నాడని తెలిస్తే, వారు హుటాహుటిన నిదుర లేచి లోకాల నేలుతారని అణ్ణన్ స్వామి భావించారు.

పైగా సప్తఋషులు శ్రీవేంకటేశ్వరుణ్ణి పూజించడానికి, శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన స్వర్గలోకపు సరోవరంలో వికసించిన కమలాలను గొని వచ్చారు. 'ఆకాశసింధు' పదానికి తిరుమలక్షేత్రంలో కొలువై ఉన్న 'ఆకాశగంగా తీర్థం' అనే మరో అర్థం కూడా ఉంది. ఈ తీర్థం కూడా పరమ పవిత్రమైనదే..

దీనిలో పూచిన కలువపూలను కూడా శ్రీనివాసుడు అమితంగా ఇష్టపడతాడు.

సాక్షాత్తు ఆదిదేవుడే సప్తగిరులలో ఒకటైన శేషాద్రిశిఖరంగా అవతరించాడు. శ్రీమహావిష్ణువుకు సేవకుడు, అత్యంత ప్రీతిపాత్రుడు అయిన ఆదిశేషుని పేరు వినగానే శ్రీనివాసుడు పరవశించి వరాల జల్లులు కురిపిస్తాడని అణ్ణన్ స్వాముల అంతరంగం.

ఆరవ శ్లోకం

"పంచాననాబ్జభవ షణ్ముఖవాసవాద్యాః
త్రైవిక్రమాదిచరితం విబుధాః స్తువంతి,
భాషాపతిః పఠతి వాసరశుద్ధి మారాత్
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – పంచముఖుడైన రుద్రుడు, కమలోద్భవుడైన బ్రహ్మదేవుడు (చతుర్ముఖుడు), ఆరు ముఖాలు కలిగిన సుబ్రహ్మణ్యేశుడు (షణ్ముఖుడు), దేవలోకాధిపతి ఇంద్రుడు (సహస్రనేత్రుడు) నీ త్రివిక్రమావతారం మొదలైన



పురాణగాథలను పఠిస్తున్నారు. దేవతల గురువైనట్టి బృహస్పతి పంచాంగశ్రవణం చేస్తున్నాడు. శేషాద్రిశిఖరాధీశా, మేలుకో!

అనేకమంది దేవతలు ఆరాధిస్తున్నప్పటికీ నాలుగు, ఐదు, ఆరు ముఖాలు గలిగిన దేవతల గురించి ఈ శ్లోకంలో ప్రత్యేకంగా చెప్పబడింది. ఎందుచేతనంటే మిగిలిన వారికి భిన్నంగా, ఈ దేవతలు మరింత ఉచ్చస్వరంతో స్తోత్రపఠనం చేసి స్వామివారిని మేల్కొలప గలరు. అలాగే, వేయినేత్రాలు కలిగిన దేవేంద్రుడు స్వామివారి దివ్యమంగళ రూపాన్ని సంపూర్ణంగా కాంచి, తనివితీరా కీర్తించగలడు.

రాజగురువులు లేదా రాజపురోహితులు ప్రతిరోజూ సామ్రాజ్యాధినేతలకు ఆరోజు తిథి, వార, నక్షత్రాలను; లగ్నఫలాలను తెలియజెప్పే ఆనవాయితీ ఉంది. వాటిననుసరించి జైత్రయాత్రలు, దేవాలయాలు మరియు కోటల నిర్మాణం, యజ్ఞయాగాదుల వంటి ధార్మిక కార్యక్రమాలు మున్నగు వాటికి శ్రీకారం చుట్టేవారు. అదే విధంగా, రాజాధిరాజైనట్టి శ్రీవారికి దేవగురువు బృహస్పతి పంచాంగశ్రవణం కావిస్తున్నాడు. శ్రీవారి ఆలయంలో ప్రతినిత్యం సుప్రభాత సేవానంతరం స్వామివారికి ఆస్థాన పురోహితులు 'పంచాంగశ్రవణం' ద్వారా ఆరోజు తిథి, వార, నక్షత్రాలను తెలియపరిచే 'కొలువు' లేదా 'దర్బారు' సేవ గురించి మునుపటి ప్రకరణాల్లో తెలుసుకున్నాం.

శ్రీమహావిష్ణువు దశావతారధారి యైనప్పటికీ – బలిచక్రవర్తిని మూడడుగుల నేల నడిగి, తన రెండు పాదాలతో భూమ్యాకాశాలను ఆక్రమించిన త్రివిక్రమావతారం లేదా వామనావతారానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. అటువంటి అవతారాన్ని స్మరణకు తెస్తూ, ఈ శ్లోకం ద్వారా శ్రీనివాసుని కటాక్షాన్ని అణ్ణన్ స్వామి అర్థిస్తున్నాడు. పుట – 130 తేదీ – నవంబరు, 12

ఏడవ శ్లోకం

"ఈషత్ప్రఫుల్ల సరసీరుహ నారికేళ
పూగద్రుమాది సుమనోహర పాలికానాం।
ఆవాతి మందమనిలః సహదివ్యగంధైః
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతం॥"

శ్లోకార్థం – సరోవరాల లోని విరిసీవిరియని కమలాల మీదుగా ప్రసరిస్తూ; నారికేళ (కొబ్బరిచెట్లు) మరియు పోక (వక్కచెట్లు) వృక్షాల సువాసనలను గ్రహించిన వాయువు మంద్రంగా వీస్తోంది. శేషాద్రి శిఖరాధీశా నీకు సుప్రభాతం.

ఈ శ్లోకంలో శేషాచల శిఖరాల్లోని ప్రాతఃకాల ప్రాకృతికశోభ మనోహరంగా వర్ణించబడింది. మిగిలిన దేవతలందరితో పాటుగా వాయుదేవుడు సైతం తనదైన శైలిలో శ్రీనివాసుని మేల్కొలుపుతున్నాడు. శేషాచల సానువుల్లో ఎన్నెన్నో వృక్షాలు ఉన్నప్పటికీ కొబ్బరి, వక్కచెట్లను మాత్రమే ఎందుకు ప్రస్తావించారంటే; భగవదారాధనలో టెంకాయలను, వక్కలను విరివిగా వినియోగిస్తారు. స్వామిసేవకై అవి కూడా తహతహ లాడుతున్నాయేమో !

ఎనిమిదవ శ్లోకం

" ఉన్మీల్యనేత్రయుగముత్తమ పంజరస్థాః

పాత్రావశిష్ట కదళీఫల పాయసాని।
భుక్త్వా సలీలమధు కేళిశుకాః పఠంతి.
శేషాద్రి శేఖర విభో తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – ఉత్తమమైన పంజరాలలో పెంచబడుతున్న రామచిలుకలు కనులు తెరచి పాత్రలలో మిగిలియున్న కదళీ ఫలాలను (అరటిపండ్లు), పాయసాన్ని ఆరగించి సుప్రభాతగానాన్ని పఠిస్తున్నాయి. శేషాద్రివాసా మేలుకో!

ఈ శ్లోకంలో కూడా ప్రకృతిశోభ వర్ణించ బడింది. శేషాచల సానువులు జంతువైవిధ్యానికి ప్రఖ్యాతి గాంచాయి. వివిధ రకాల జంతువులతో బాటు, ఎన్నో జాతుల పక్షులకు కూడా సప్తగిరులు ఆలవాలం. ఆ పక్షులన్నీ వినసొంపుగా కులకూజితాలు కూస్తున్నప్పటికీ, రామచిలుకలనే ప్రత్యేకంగా ప్రస్తావించడానికో కారణం ఉంది. ద్వాదశాళ్వార్లలో ఒకరు, విష్ణుచిత్తుని దత్తపుత్రిక యైన 'గోదాదేవి' శ్రీరంగశాయినే తన భర్తగా భావించి, వారికి ప్రతినిత్యం తన పెంపుడు చిలుక ద్వారా ప్రేమసందేశాలు పంపేది. అందుచేత, శ్రీవేంకటేశ్వరునికి చిలుకలంటే ప్రత్యేకమైన అభిమానం ఉంది. అందువల్లనే సాధారణంగా వైష్ణవాలయాలలో ఉండే ఆండాళ్ అమ్మవారు లేదా గోదాదేవి ముంజేతిపై చిలుకతో దర్శన మిస్తారు. ధనుర్మాసంలో శ్రీవారి భుజస్కంధాలపై చిలుకను అలంకరిస్తారు.

భగవదార్చనలో సహజంగా వినియోగించేవి టెంకాయలు, అరటిపళ్ళు. నారికేళాల ప్రస్తావన ముందు శ్లోకం లోనే వచ్చింది కావున, ఈ శ్లోకంలో అరటిపండ్లను పేర్కొనడం జరిగింది.

తొమ్మిదవ శ్లోకం

"తంత్రీప్రకర్ష మధురస్వనయా విపంచ్యా
గాయత్యనంత చరితం తవ నారదోపి।
భాషా సమగ్ర మసకృత్కరచారు రమ్యం
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్॥"

శ్లోకార్థం – నారదుడు సప్తతంత్రులతో కూడుకున్న తన వీణను మీటుతూ; మృదుమధురమైన సంగీతధ్వనులను సృష్టిస్తూ అనంతమైన నీ లీలలను కీర్తిస్తున్నాడు. శేషాద్రిగిరీశా నీకు సుప్రభాతం.

నారదుడు బ్రహ్మ మానసపుత్రుడు. బ్రహ్మదేవుడు శ్రీమహావిష్ణువు నాభికమలం లోనుండి ఉద్భవించాడు. ఆవిధంగా, నారదముని శ్రీమహావిష్ణువుకు మనుమడవుతాడు. శ్రీహరికి గొప్పభక్తుడు కూడా! కలహభోజనుడిగా పేరొందిన నారదుడు శ్రీహరి ఆదేశం మేరకు, లోకకళ్యాణార్థమే జగడాలను సృష్టిస్తాడు. సతతము 'మహతి' గా పేరొందిన తన వీణా తంత్రులను మీటుతూ హరినామసంకీర్తనలో మునిగి ఉంటాడు. ఆదేశించినదే తడవుగా తన ఆనతిని శిరసావహిస్తూ ఎల్లవేళలా లోకకళ్యాణం కోసం పరితపించే తన ముద్దుల మనుమడు, భక్తేగ్రేసరులలో అగ్రగణ్యుడు అయిన నారదమహర్షి పిలిస్తే శ్రీవేంకటేశ్వరుడు తప్పనిసరిగా పలుకుతాడని అణ్ణన్ స్వామి తలపోసి, వారిని ప్రత్యేకంగా పేర్కొన్నాడు.

పదవ శ్లోకం

"భృంగావళీచ మకరంద రసానువిద్ధ
ఝుంకారగీతనినదైః సహ సేవనాయ।
నిర్యాత్యుపాంత సరసీ కమలోదరేభ్యః
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్॥"

శ్లోకార్థం – సమీపం లోని సరోవరాలలో నున్న కలువపూల లోని మకరందాన్ని పీల్చుకొని శక్తివంతమై బయటకు వెడలుతున్న గండుతుమ్మెదల గుంపు నీకు బిగ్గరగా ఝుంకారగీతాలు పాడుతుంది. శేషాద్రివాసా నీకు సుప్రభాతం.

సమస్త మానవాళికే గాక, సృష్టిలోని జీవరాశులందరికీ ప్రభువైన శ్రీవేంకటేశ్వరునికి ముందు శ్లోకాలలో చెప్పుకున్నట్లు వృక్షాలు, పక్షులే గాకుండా; అల్పప్రాణులైన తుమ్మెదలు సైతం సుప్రభాతగానం చేస్తున్నాయి. అందులోనూ తన ప్రియసఖి శ్రీమహాలక్ష్మి జన్మస్థానమైన తామరపువ్వులలో నిక్షిప్తమై ఉన్న మకరందసేవనం ద్వారా వచ్చిన ఝుంకార నాదమంటే శ్రీవేంకటేశ్వరునికి మిక్కిలి మక్కువ. ప్రాతఃకాలంలో శ్రీవారికి, శ్రీలక్ష్మికి ఇరువురికీ ప్రీతిపాత్రమైన పద్మాల ప్రస్తావన పదే పదే తీసుకుని రావడం ద్వారా వారిరువురినీ ఏక కాలంలో ప్రసన్నం చేసుకో వచ్చునని కవివర్యులు ఆశిస్తున్నారు.

పదకొండవ శ్లోకం

"యోషా గణేన వరదధ్ని విమధ్యమానే
ఘోషాలయేషు దధిమంధన తీవ్రఘోషాః।
రోషాత్కలిం విదధతే కకుభశ్చకుంభాః
శేషాద్రిశేఖరవిభో తవ సుప్రభాతమ్॥

శ్లోకార్థం – గొల్లభామలు వెన్న చిలికే సమయంలో కవ్వపు రాపిడితో ఏర్పడిన తీవ్రశబ్దం పెరుగు కుండలు దిక్కులతో తలపడు తున్నాయా! అన్నట్లు వినవస్తోంది. శేషాద్రివాసా మేలుకో!

ఈ శ్లోకంలో – శ్రీమహావిష్ణువుకు ఎంతో ప్రీతికరమైన శ్రీకృష్ణావతారపు ప్రస్తావన మరలా వచ్చింది. త్రేతాయుగంలో గొల్లభామలు శ్రీకృష్ణుణ్ణి ఎంతో భక్తిశ్రద్ధలతో ఆరాధించి, తరించారు. నవనీతప్రియుడైన నల్లనయ్యను తమ గృహాలలోకి రప్పించుకోవడం కోసం పోటీలు పడి వెన్న చిలికి ఉట్లపై దాచేవారు. కవ్వపుశబ్దం వినగానే చిన్నికృష్ణుడు గొల్లకాంతల ఇంట చేరేవాడు. తిరుగులేని వారి ప్రేమానురాగాలు శ్రీమహావిష్ణువు మదిలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఆనాడు కవ్వపు రాపిడి శబ్దానికి గోపవనితల గృహాల్లో దూరిన వెన్నదొంగ, ఈనాడు మాత్రం మజ్జిగ చిలుకగా వచ్చే శబ్దానికి పరవశించి పోడా?

గోదాదేవి కూడా తన ముప్పై పాశురాల సంకలనమైన 'తిరుప్పావై' లో ప్రభాతకాలంలో పల్లెపట్టు లోని అందాలను, సందడిని ఇలాగే వర్ణించి శేషశాయి హృదయాన్ని చూరగొంది. చివరగా శ్రీరంగనాథుణ్ణే పతిగా స్వీకరించి వారిలో

ఐక్యమైపోయింది. అలనాటి మధురానుభూతులను తలపుకు తెస్తే పరంధాముడు పులకించి పోయి వరదహస్తంతో వరాలను వెల్లువలా వర్షింప జేస్తాడని అణ్ణన్ స్వామి తలపోశారు. పుట – 131 తేదీ – నవంబరు, 13

పన్నెండవ శ్లోకం

"పద్మేశమిత్రశతపత్రగతాళివర్గాః
హర్తుం శ్రియం కువలయస్య నిజాంగ లక్ష్మ్యా
భేరీనినాదమివ బిభ్రతి తీవ్రనాదం
శేషాద్రి శేఖర విభో తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – సూర్యదేవునికి మిత్రులు, సూర్యోదయంతో వికసించే కలువపూల యొక్క కాడలలో నివసిస్తున్న తుమ్మెదలు మిసమిసలాడే తమ నల్లని మేని ఛాయతో నల్లకలువల మెరుపును మరపింప జేస్తూ; భేరీనినాదాన్ని తలపించేంత బిగ్గరగా ఝంకారం చేస్తున్నాయి. శేషాచల వాసా నీకు సుప్రభాతం.

ఈ శ్లోకంలో మరోసారి తుమ్మెదలు, నల్లకలువల ప్రస్తావన వచ్చింది. శ్రీమహాలక్ష్మికి అత్యంత ప్రీతిపాత్రమైన కలువపూలను పదే పదే ప్రస్తావించడంలో ఆవగింజంతైనా ఆశ్చర్యం లేదు. అర్థాంగి అంటే ఆనందనిలయునికి అపరిమితమైన ఆదరాభిమానాలు కదా!

ఈ శ్లోకంలో సూర్యభగవానుని ప్రసక్తి కూడా వచ్చింది. సూర్యుడు శ్రీవేంకటేశ్వరునికి పరమ భక్తుడే కాకుండా ఆప్తమిత్రుడు కూడా.

సూర్యుని తొలికిరణాలతో పద్మం వికసించడం వల్ల, ఆ పద్మంలో నివసించే శ్రీమహాలక్ష్మికి కూడా సూర్యుడంటే పుట్టింటివారంత ప్రీతి. అదే కారణంతో, శ్రీవేంకటేశ్వరుడు పద్మావతిదేవితో తనకు జరుగబోయే పరిణయానికి తనపై అలిగి వైకుంఠం నుండి వెడలి కరివీరపురంలో (నేటి కోల్హాపూరు) నివాసముంటున్న శ్రీమహాలక్ష్మికి ఆహ్వానం, రాయబారం పంపించాడు. ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడంతో శ్రీనివాసునికి సూర్యుడు మరింత ఆప్తుడయ్యాడు.

అటువంటి పద్మాలను, సూర్యభగవానుణ్ణి పదే పదే తలపుకు తేవడం ద్వారా శ్రీవేంకటేశ్వరుని త్వరితగతిని మేల్కొలప వచ్చని అణ్ణన్ మహాశయులు భావించారు.

అణ్ణన్ స్వామి తన భక్తి భావోద్వేగ తరంగాలను వ్యక్తపరచడం కోసం ఉపమానాలంకారన్ని కదు సమర్థవంతంగా ఉపయోగించుకున్నారు. ముందటి శ్లోకంలో కవ్వంతో మజ్జిగ చిలుకగా వచ్చే శబ్దాన్ని చల్లకుండలు దిక్కులతో తలపడుతుండగా వచ్చే భీకరశబ్దాలతో పోల్చగా; ఈ శ్లోకంలో తుమ్మెదల ఝంకారాన్ని యుద్ధభేరి నినాదంతో పోల్చారు. దిగ్దిగంతాలను ఏలే శ్రీనివాసుని సన్నిధిలో ఉత్పన్నమయ్యే చిరుధ్వని సైతం దిక్కులు పిక్కటిల్లేలా ఉంటుందేమో!!

పదమూడవ శ్లోకం

"శ్రీమన్నభీష్టవరదాఖిలలోకబంధో
శ్రీ శ్రీనివాస జగదేకదయైకసింధో
శ్రీదేవతాగృహభుజాంతరదివ్యమూర్తే
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్"

శ్లోకార్థం – శ్రీమహాలక్ష్మికి ప్రియతమమైన వానివి, కోరిన కొర్కెలు తీర్చేవానివి, విశ్వమంతటికీ ఆప్తుడైన వానివి, శ్రీమహాలక్ష్మికి నెలవైన వానివి అయిన నీవు విశ్వానికంతటికీ ఏకైక దయా సముద్రుడవై విలసిల్లుతున్నావు. శ్రీమహాలక్ష్మికి నిలయమైన దివ్యదేహముతో వెలుగొందే శ్రీవేంకటాచలాధీశా నీకు సుప్రభాతం.

ఈ శ్లోకంలో శ్రీవేంకటేశ్వరుణ్ణి 'దయాసముద్రుని' గా సంబోధించడం ద్వారా వారి కరుణాంతరంగాన్ని కొనియాడటమే కాకుండా; క్షీరసాగర తనయయైన శ్రీమహాలక్షిని కూడా తలపుకు తెచ్చుకున్నారు. లక్ష్మీదేవి క్షీరసాగరమథనంలో ఉద్భవించింది.

అష్టైశ్వర్యాలకు అధినేత్రియైన శ్రీమహాలక్ష్మి కటాక్షించితేనే శ్రీవేంకటేశ్వరుడు సైతం సిరిసంపదలు చేకూర్చగలడు. వక్షస్థలంలో లక్ష్మీదేవిని ధరించడం వల్లనే శ్రీనివాసునికి అసమాన సౌందర్యం గల దివ్యరూపం సంప్రాప్తించింది. మనవల్ల జరిగే తప్పిదాలను సైతం అమ్మవారు మాతృహృదయంతో క్షమించి, శ్రీవారి ఆగ్రహాతిశయాన్నుండి కాపాడుతారు. అందువల్ల శ్రీమహాలక్ష్మిని శ్రీవేంకటేశ్వరునితో అభిన్నంగా భావిస్తూ, ఇరువురినీ ఏక కాలంలో స్తుతించడం జరిగింది.

పదునాల్గవ శ్లోకం

"శ్రీ స్వామిపుష్కరిణికా ప్లవ నిర్మలాంగాః
శ్రేయోర్థినో హరవిరించిసనందనాద్యాః
ద్వారే వసంతి వరవేత్రహతోత్తమాంగాః
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్"

శ్లోకార్థం – పరమశివుడు, బ్రహ్మదేవుడు, సనందాది మునీశ్వరులు స్వామిపుష్కరిణిలో పవిత్ర స్నానమాచరించి, పవిత్రశరీరులై; నీ దర్శనార్థం ఆలయద్వారం ముందు వేచియున్నారు. నిన్ను త్వరితంగా దర్శించుకోవాలనే అతృతతో వారు నీ ద్వారపాలకుల బెత్తం దెబ్బలు చవిచూస్తున్నారు.

ఈ శ్లోకంలో తిరుమలక్షేత్రంలో కొలువై ఉన్న స్వామిపుష్కరిణి ప్రాశస్త్యాన్ని అన్యాపదేశంగా ఉదహరించడం జరిగింది. సృష్టి–లయకు కారణభూతులు, త్రిమూర్తులలో ఇరువురు అయిన బ్రహ్మరుద్రులు; బ్రహ్మ మానసపుత్రులైన సనందాది మునులు సైతం స్వామిపుష్కరిణిలో స్నానమాడి పవిత్రులయ్యారంటే ఆ పుష్కరిణి మహాత్మ్యాన్ని అవగాహన చేసుకోవచ్చు.

స్వామివారి క్షణకాల దర్శనానికై ఆలయద్వారం ముందు వేచియుండే ఇక్కట్లు ఆనాడే ఉన్నాయన్నమాట. శ్రీవారి

దర్శనార్థం ఈనాడు మనం చూస్తున్న తొక్కిసలాటలకు ఆనాడే నాందీప్రస్తావన జరిగింది. బ్రహ్మరుద్రాదులకు సైతం ద్వారపాలకులైన జయవిజయులతో బెత్తం దెబ్బలు తినే వెతలు తప్పలేదు. మనమెంత? సిఫారసులకు ఎగబడడం, వక్రమార్గాలు వెదకడం మాని ఓర్పుతో వేచియుండి, స్వామివారిని సరియైన రీతిలో దర్శించుకోవడం సర్వదా శ్రేయస్కరం. దేవుని ముందున్నా లేక క్యూ వరుసల్లో కాలం గడిపినా దైవసన్నిధిలో ఉన్నట్లే! క్షణకాల దర్శనం తోనే శ్రీవారి దివ్యమూర్తిని మన మనోఫలకంపై ముద్రించుకోవాలి. ఎంత త్వరగా, ఎన్నిసార్లు, ఎంతసేపు స్వామివారిని దర్శించుకున్నామన్న దానికంటే క్షణకాలమైనా ఎంత ఆర్తితో శ్రీవారి దివ్యసుందర విగ్రహాన్ని దర్శించు కున్నామన్నదే ముఖ్యం.

పదిహేనవ శ్లోకం

"శ్రీ శేషశైల గరుడాచల వేంకటాద్రి
నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రిముఖ్యామ్
ఆఖ్యాం త్వదీయవసతే రనిశం వదంతి
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్"

శ్లోకార్థం – నీకు నివాసమైన తిరుమలక్షేత్రం – శ్రీపర్వతము, శేషాచలము, గరుడాచలము, నారాయణాచలము, వృషభాచలము, వృషాచలము – అనే వివిధ నామాలతో వినుతి కెక్కింది. శ్రీవేంకటాచలాధీశుడా నీకు సుప్రభాతం.

శ్రీవేంకటేశ్వరుడు కొలువై ఉన్న సప్తగిరులలో ఒక్కొక్క దానికి ఒక్కో వైశిష్ట్యం ఉంది. ఆసక్తికరమైన పౌరాణిక గాథలున్నాయి. అవన్నీ శ్రీమహావిష్ణువు తోనూ, దశావతారాల తోనూ, శ్రీవేంకటేశ్వరుని తోనూ ముడిపడి ఉన్నవే! ఆ పర్వతశిఖరాలను స్మరించుకుంటే శ్రీనివాసుణ్ణి, శ్రీమహాలక్ష్మిని సేవించుకున్నట్లే! ఆ సప్తగిరుల మహిమలన్నీ శ్రీవేంకటేశ్వర ప్రసాదితాలే.

సప్తగిరులలో ప్రతిదానికీ ఉన్న పౌరాణిక ప్రాశస్త్యాన్ని, వాటి మహిమలను మునుపటి ప్రకరణాల్లో తెలుసుకున్నాం.

పదహారవ శ్లోకం

"సేవాపరాః శివసురేశకృశానుధర్మ
రక్షోంబునాథ పవమాన ధనాధినాథాః
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – అష్టదిక్పాలకులైన శివుడు, దేవేంద్రుడు, అగ్ని, యముడు, నైఋతి, వరుణుడు, వాయుదేవుడు, కుబేరుడు నీ సేవాభిలాషులై, తమ శిరస్సులపై ముకుళిత హస్తాలనుంచి, తమను తాము నీకు సంపూర్ణంగా సమర్పించు కుంటున్నారు. ఓ వేంకటాచలపతీ నీకు సుప్రభాతం.

బ్రహ్మ, రుద్ర, ఇంద్రాది దేవతలు; సప్తఋషుల తదుపరి అష్టదిక్పాలకుల వంతు వచ్చింది. వారు కూడా శ్రీవేంకటేశ్వరుని సేవించుకోడానికై అతృతతో ఎదురు చూస్తున్నారు. అష్టదిక్పాలకు లందరూ శ్రీవారికి భక్తులే

కాకుండా వారికి అత్యంత ఆప్తులు, భృత్యులు కూడా. వారి ఆజ్ఞ మేరకే తమ తమ విధులను నిర్వర్తిస్తూ ముల్లోకాలను సుభిక్షంగా ఉంచుతారు. వారు కుడా శ్రీవారిని సేవించు కొనడానికి సమాయత్త మయ్యారంటే శ్రీనివాసుడు సంతృప్తాంతరంగుడవుతాడు. పుట – 132 తేదీ – నవంబరు, 14

పదిహేడవ శ్లోకం

"ధాటీషు తే విహగరాజ మృగాధిరాజ
నాగాధిరాజ గజరాజ హయాధిరాజాః,
స్వస్వాధికార మహిమాదిక మర్థయంతే
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – నీ దివ్యవాహనాలైనట్టి పక్షిరాజు (గరుత్మంతుడు), మృగరాజు (సింహము), నాగరాజు (ఆదిశేషుడు), గజరాజు (ఐరావతము), అశ్వరాజము (ఉచ్ఛైశ్రవము) – నీ సేవలో తరించటానికి కావలసిన శక్తియుక్తులను తమకు ప్రసాదించ వలసిందిగా నిన్ను ప్రార్థించేందుకు వచ్చియున్నారు. శ్రీవేంకటా చలపతీ మేలుకో.

శ్రీవారి బ్రహ్మోత్సవాలలో శ్రీవారు, గరుడ వాహనం, పెద్దశేష వాహనం, సింహవాహనం, అశ్వవాహనం, గజవాహనాలలో ఊరేగుతారు. గరుడునికి, ఆదిశేషునికి శ్రీవేంకటేశ్వరునితో నున్న అనుబంధం మనకు సుపరిచితమే.

అశ్వరాజైన ఉచ్ఛైశ్రవము, గజరాజైన ఐరావతము క్షీరసాగర మథనంలో ఉద్భవించి శ్రీహరిసేవలో తరిస్తున్నాయి.

ముల్లోకాలకు రారాజైన శ్రీవేంకటేశ్వరుణ్ణి సేవించు కోవాలంటే అపరిమితమైన శక్తియుక్తులు కావాలి. శ్రీహరి కృప తోనే అవి సాధ్యపడతాయి. ప్రాతఃకాల శుభఘడియలలో శ్రీవారిని సేవించుకోవడం ద్వారా అటువంటి శక్తిసామర్థ్యాలను సంపాదించు కోగలమని ఆ మూగజీవుల ఆకాంక్ష. వారు సైతం తన దర్శనార్థం వేచియున్నారని శ్రీవేంకటేశ్వరునికి తెలియ పరచితే, సత్వరమే వారు మేల్కొంటారని అణ్ణన్ స్వామి ఆశ.

వేదాంతపరంగా చెప్పాలంటే, ఈ ఐదు వాహనాలు పంచేంద్రియాలకు ప్రతిరూపాలు. ఇందియలోలురైన వారు ఈ ఇంద్రియాలకు దాసులైతే, శ్రీహరి మాత్రం జితేంద్రియుడై ఆ వాహనాలపై స్వారీ చేస్తూ, వాటిని అదుపులో ఉంచుతాడని అణ్ణన్ స్వామి అన్యాపదేశంగా ప్రవచిస్తున్నారు.

పద్దెనిమిదవ శ్లోకం

"సూర్యేందు భౌమ బుధవాకృతి కావ్యసౌరి
స్వర్భాను కేతు దివిషత్పరిషత్ప్రధానాః,
త్వద్దాసదాసచరమావధిదాసదాసాః
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – దేవసభలో ముఖ్యులైనటు వంటి సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు, బుధుడు, గురుడు, శుక్రుడు, శని,



రాహువు, కేతువు నీ దాసానుదాసులై నందుకు సంతసిస్తూ, నీ ముంగిట వేచియున్నారు.

దేవాధిదేవతలు, సప్తఋషులు, అష్టదిక్పాలకులు, వాహనశ్రేణి వీటి తదుపరి నవగ్రహాల వంతు వచ్చింది. ఋతుచక్రం సజావుగా సాగటానికి, దివారాత్రాలు (రాత్రి, పగలు) క్రమం తప్పకుండా ఏర్పడడానికి వీరే బాధ్యులు. అంతటి గురుతరమైన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడానికి శ్రీహరి కరుణాకటాక్షాలు తప్పనిసరి. అందువల్ల, ప్రాతఃకాల శుభ సమయాన శ్రీవేంకటేశ్వరుని సేవించు కొనడానికై వారు కూడా బారులు దీరి యున్నారు. వారు శ్రీవారి వద్ద ఎక్కువసేపు వేచియుంటే, వారు నిర్వర్తించే విధులకు ఆటంకం కలిగి కాలచక్రం గతి తప్పుతుంది. స్థితికారకునిగా, సృష్టిని నిరాటంకంగా కొనసాగింప జేసే గురుతరమైన బాధ్యత శ్రీవారిదే! కావున, వారు తన దర్శనార్థం వచ్చారని తెలిపితే శ్రీవేంటేశ్వరుడు సత్వరమే మేలుకుంటాడు.

పంథొమ్మిదవ శ్లోకం

"త్వత్పాదధూళిభరితస్ఫు రితోత్తమాంగాః
స్వర్గాపవర్గనిరపేక్షనిజాంతరంగాః
కల్పాగమా కవలయా కులతాం లభంతే
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – నీ పాదధూళిని తమ శిరస్సులపై ధరించడం ద్వారా పరిశుద్ధాంతరంగులైన నీ సేవకగణం కల్పాంతరంలో స్వర్గలోకాన్ని గాని, మోక్షసిద్ధి గాని పొందడం వల్ల నీ సేవాభాగ్యాన్ని కోల్పోన వలసి వస్తుందేమోనని కలత చెందుతున్నారు. ఓ వేంకటాచలాధీశా నీకు సుప్రభాతం..

హైందవ పురాణాల ననుసరించి కల్పము కాలప్రమాణం. ఒక్కో కల్పానికి కొన్ని మన్వంతరాలు, ఒక్కో మన్వంతరానికి కొన్ని మహాయుగాలు, ఒక్కో మహాయుగానికి నాలుగు యుగాలు ఉంటాయి. ఒక్కో కల్పం సృష్టికర్తకు ఒక్కో 'పగలు' తో సమానం. మొత్తంగా ఒక కల్పం కొన్ని వందల కోట్ల మానవ సంవత్సరాలకు సమానం. కల్పకాలపు సుదీర్ఘసమయం శ్రీవారిని సేవించుకున్న భాగ్యం వల్ల సృష్టిధర్మం ప్రకారం శ్రీవారి సేవకులైన జయవిజయులు, గరుడుడు, ఆదిశేషువు, విష్వక్సేనుడు మున్నగు వారందరూ వారి వారి సేవాభాగ్య ఫలాన్ననుసరించి స్వర్గలోకప్రాప్తి నొందుతారు. లేదా కైవల్యాన్ని సిద్ధింప జేసుకుంటారు. శ్రీవారి సేవలో తడిసి ముద్దవుతున్న వీరందరికీ స్వర్గలోకపు సుఖభోగాల కంటే, శ్రీవారి సాన్నిధ్యము, వారి సేవాభాగ్యమే మిన్న.

సిద్ధపురుషులు, మునివర్యులు వంటి వారెందరెందరో వేలాది వత్సరాలు తపస్సు గావించి, స్వర్గప్రాప్తి పొందుతారు. అటువంటి దాన్ని తృణప్రాయంగా త్యజించడానికి సిద్ధమయ్యారంటే వారు శ్రీవారిసేవలో ఎంతగా తలమునకలయ్యారో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కరుణాసాగరుడైన కోనేటిరాయుడు అంతటి పరమభక్తులను కరుణించకుండా ఉండగలడా! వారికి తన దర్శనభాగ్యం కలిగించడానికి మేలుకోడా!! ఇదే అణ్ణన్ స్వాముల ప్రారషథన లోని అంతరార్థం.

ఇరవయ్యోవ శ్లోకం

"శ్రీభూమినాయక దయాదిగుణామృతాబ్ధే
దేవాధిదేవ జగదేకశరణ్యమూర్తే,
శ్రీమన్ననంతగరుడాదిభి రర్చితాంఘ్రే
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – భూదేవి–శ్రీదేవులకు పతిదేవునివి; కరుణామృత సాగరుడవు; దేవతలందరికీ దేవాధి దేవుడవు; జగత్తంతటకీ శరణు గొలిపెడి వాడవు; ఆదిశేషుడు, గరుత్మంతుడు మరియు ఇతర పరివార దేవతలందరితో పూజింపబడే పాదములు కలిగినవాడివి శ్రీవేంకటాచలాధిపతీ నీకు మేలుకొలుపు.

శ్రీవారి సతులిరువురినీ అణ్ణన్ స్వామి మరలా స్మరించు కున్నాడు. వారి గుణగణాలను, శరణాగత వాత్సల్యాన్ని, కరుణాంతరంగాన్ని ఎంత తలచుకున్నా అణ్ణన్ స్వామివారికి తనివి తీరడం లేదు.

ఇరవయ్యొకటవ శ్లోకం

"శ్రీపద్మనాభ పురుషోత్తమ వాసుదేవ
వైకుంఠ మాధవ జనార్దన చక్రపాణే,
శ్రీవత్సచిహ్న శరణాగతపారిజాత
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – పద్మమును నాభియందు ధరించిన వాడివి, పురుష పుంగవుల లోకెల్లా ఉత్తమమైన వాడివి, వసుదేవ సుతునివి, వైకుంఠవాసునివి, లక్ష్మీదేవికి పతివి ('మా' అంటే లక్ష్మీదేవి, 'ధవుడు' అంటే భర్త), జనులచే అభీష్టసిద్ధులను అర్థించ బడువానివి, సుదర్శన చక్రాన్ని చేతిలో ధరించియున్న వాడివి, శ్రీవత్స చిహ్నాంకితుడవు, శరణన్న వారికి ఆశ్రయప్రదాతవు. శ్రీవేంకటాచల వాసా నీకు సుప్రభాతం.

శ్రీవేంకటేశ్వరుని గుణగణాలన్నింటినీ అణ్ణన్ స్వామి మరొక్కసారి మననం చేసుకున్నాడు. శ్రీవేంకటేశ్వరుణ్ణి అమృత తుల్యమైన దయాగుణానికి సాగరం వంటివాడుగా కీర్తించాడు. ఏ విధంగానైతే అమృతపానం వల్ల జీవులందరూ అజరామర మవుతారో, అదే విధంగా శ్రీవారి కృపకు పాత్రులైనవారు చిరంజీవు లవుతారని; స్వామివారి కృపకు పరిమితులు లేవని ఈ శ్లోకంలో చెప్పబడింది. వేంకటేశుని దక్షిణహస్తం వరద భంగిమలో ఉండి; స్వామి శరణు వేడినవారిపై వారి కృపాకటాక్షాలు ఏరులై పారుతాయన్న సంకేతాన్నిస్తుంది. పుట – 133 తేదీ – నవంబరు, 15

ఇరవై రెండవ శ్లోకం

"శ్రీ పద్మనాభ పురుషోత్తమ వాసుదేవ
వైకుంఠ మాధవ జనార్దన చక్రపాణే।
శ్రీవత్స చిహ్న శరణాగత పారిజాత
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – నాభి యందు పద్మమును గలిగిన వాడవు, పురుషుల లోకెల్లా ఉత్తముడవు, వసుదేవుని పుత్రునివి, వైకుంఠానికి అధిపతివి, లక్ష్మీ నాథుడవు, జనులచే ఆభీష్ఠములను (కోర్కెలు) కోరబడు వానివి, సుదర్శనచక్రాన్ని హస్తము నందు ధరించిన వాడివి, హృదయము నందు శ్రీవత్స చిహ్నాన్ని కలిగియున్న వాడివి, శరణు వేడినవారికి పారిజాతపు వృక్షము వలె ఆశ్రయము కల్పించెడి వాడివి ఇనట్టి శ్రీవేంకటాచలాధీశా నీకు సుప్రభాతం.

ఈ శ్లోకంలో ఉన్న విష్ణునామాలన్నింటికీ, స్థూలార్థాలతో పాటుగా నిగూఢమైన విశేషార్థాలు కూడా ఉన్నాయి. పద్మనాభుడంటే నాభియందు పద్మాన్ని కలిగియున్నట్టి శ్రీమహావిష్ణువు. ఆ పద్మాన్నుండే సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు ఉద్భవించాడు. శ్రీమహావిష్ణువును సాక్షాత్తు సృష్టికర్తకు తండ్రిగా కీర్తించడం వల్ల, అనంతమైన వారి మహిమలను అన్యాపదేశంగా స్మరించి నట్లవుతుంది. తద్వారా వారి కటాక్షాన్ని సులభంగా పొందవచ్చని కవివర్యుల ఉద్దేశ్యం.

అలాగే శ్రీవేంకటేశ్వరుడు 'పురుషోత్తముని' గా వర్ణించబడ్డాడు. సాధారణంగా 'పురుషుడు' అనే పదాన్ని 'మానవుడు' లేదా 'మగవాడు' అనే అర్థంలో ఉపయోగిస్తాం. కానీ, 'పురుషుడు' అంటే 'పూర్ణత్వము కలిగినవాడు' అనే నిగుఢార్థం ఉంది. అంటే, శ్రీవేంకటేశ్వరుడు పూర్ణత్వం కలిగిన వారందరిలోకి ఉత్తము డన్నమాట.

'వైకుంఠ' అంటే, వైకుంఠవాసుడనే అర్థంతో బాటు 'గమనంలో వచ్చే అడ్డంకులను తొలగించెడి వాడు' అనే మరో అర్థం కూడా ఉంది. శ్రీమహావిష్ణువు కరుణిస్తే ఆటంకాలు, అడ్డంకులు ఎందుకేర్పడుతాయి? మార్గం తప్పక సుగమవుతుంది.

శ్రీవేంకటేశ్వరుని 'మాధవుని' గా కూడా కీర్తించబడింది. 'మా' అంటే 'లక్ష్మి' యని, 'ధవుడు' అంటే 'భర్త' యని అర్థం. లక్ష్మి అంటే సంపదకు చిహ్నం. కావున, మాధవుడంటే 'సకల సంపదలకు అధిపతి' అని భావార్థం.

జనార్దనుడంటే జనులచే కోర్కెలు కోరబడే వాడు. ఆనాటి నుండి నేటి వరకూ కోట్లాది భక్తుల కొంగుబంగారమై, అనంతమైన కోర్కెలు కోరబడే వాడూ తీర్చేవాడూ కూడా శ్రీవేంకటేశ్వరుడే.

ఇంత విలక్షణంగా, నిగూఢమైన, భావయుక్తమైన నామాంతరాలతో కీర్తిస్తే శ్రీవారు సత్వరమే కరుణిస్తారని కవిసత్తముల ఆకాంక్ష.

ఇరవై మూడవ శ్లోకం

"కందర్ప దర్పహర సుందర దివ్యమూర్తే
కాంతా కుచాంబురుహ కుట్మల లోల దృష్టే!
కల్యాణ నిర్మల గుణాకర దివ్యకీర్తే
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – మన్మథుని డాంబికాన్ని అణిచి వేసేంత సుందరమైన శరీరం కలవాడివి; పద్మము వంటి సోయగము కలిగిన ప్రియసఖిపై దృష్టి సారించిన వాడివి; దివ్యమైనట్టి కీర్తులను ప్రసాదించే మంగళకరమైన, నిర్మలమైన గుణగణాలను కలిగియున్న వానివి శ్రీవేంకటాచలాధీశా నీకు మేలుకొలుపు.

కందర్పుడంటే మన్మథుడు. అతిలోక సౌందర్యం మన్మథుని సొత్తు. అంతటి వానికి సహజం గానే ఎంతో కొంత దర్పముంటుంది. అంతటి మన్మథుని దర్పాన్ని కూడా అణచి వేయగల మహత్తరమైన దివ్యసౌందర్యం శ్రీవారి పాదాక్రాంతం. ఒకప్పుడు శ్రీవారికి 'సుందరస్వామి' అనే నామాంతరం విస్తృతంగా ప్రాచుర్యంలో ఉండేది. విమానప్రదక్షిణంలో నున్న బంగారుబావిని 'సుందరస్వామి కూపం' గా పిలిచేవారు.

స్వామివారు సుందరుడే కాదు సౌందర్యప్రియుడు కూడా! అందుకే అతిలోక సౌందర్యరాశి యైన శ్రీమతి సోయగాన్ని క్రీగంట గమనిస్తున్నాడు.

స్వామివారి దివ్యమోహన సోందర్యాన్ని, వారి సౌందర్యపిపాసను కీర్తించడం ద్వారా వారిని ప్రసన్నం చేసుకోవచ్చని అణ్ణన్ స్వామి భావించారు.

ఇరవై నాల్గవ శ్లోకం

"మీనాకృతే కమఠ కోల నృసింహ వర్ణిన్
స్వామిన్ పరశ్వథ తపోధన రామచంద్ర!
శేషాంశ రామ యదునందన కల్కి రూప
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – మత్స్యావతార ధారివి, కూర్మావతారుడివి, వరాహావతారుడివి, నారసింహునివి, వామనుడవు, పరశువును (గొడ్డలి) ధరించిన వాడివి (పరశురామునివి), తపోధనుడైన రామచంద్రునివి, ఆదిశేషుని అంశవైనట్టి బలరామునివి, యదు నందనుడివి (యాదవ వంశంలో జన్మించిన శ్రీకృష్ణునివి), కల్క్యావతారుడివి ఐనట్టి శ్రీవేంకటాచలపతీ నీకు సుప్రభాతం.

ఈ శ్లోకంలో శ్రీమహావిష్ణువు దశావతారాలన్ని కాలక్రమంలో పేర్కొనబడ్డాయి. నిశితంగా పరిశీలిస్తే దశావతార క్రమానికి, సృష్టి పరిణామ క్రమానికి ఎంతో సారూప్యం అవగత మవుతుంది.

- మొట్టమొదటిది *మత్స్యావతారం*. మత్స్యము (చేప) పూర్తిగా నీటియందే నివసించే జలచరం. సృష్టి జలం నుండే ఆవిర్భవించిందని ఆధునిక శాస్త్రవేత్తలు కూడా విశ్వసిస్తారు.
- రెండవది *కూర్మావతారం*. కూర్మం (తాబేలు) జలం లోనూ, భూమి పైనా నివసించే ఉభయచరం. సృష్టి పరిణామక్రమంలో ఇది తరువాతి దశ. పూర్తిగా జలాలలో మనుగడ సాగించే జీవుల నుండి నీటిలోనూ, నేలపై కూడా జీవించగలిగే జీవులు ఉద్భవించాయి.
- మూడవది *వరాహావతారం*. వరాహం నాలుగు పాదాలు కలిగిన చతుష్పది (పశువు). ఇది పూర్తిగా నేలపై సంచరించే భూచరం. అంటే, జలాలలో ప్రారంభమైన సృష్టి క్రమంగా నేలకు విస్తరించిందన్న మాట. నేలపై సులభంగా మనుగడ సాగించే నిమిత్తం అవి నాలుగు పాదాలను కలిగిఉన్నాయి.
- నాల్గవది *నారసింహావతారం*. సగభాగం చతుష్పది యైన సింహమైతే, మిగిలిన సగభాగం 'నరుడు'. అంటే, చతుష్పదుల నుండి 'మానవుడు' ఆవిర్భవించడం మొదలైందన్న మాట.

- ఐదవది *'షర్టి'*, అనగా *'వామనావతారం'*. ఈ దశలో పూర్ణపురుషుడు ఉద్భవించాడు. అయితే, సాధారణ మానవుని పరిమాణంతో పోల్చితే వామనుడు ఎంతో పొట్టిగా ఉంటాడు. అంటే మానవుని ఆవిర్భావం ఇంకా శైశవదశ లోనే ఉందన్నమాట. అయితే, శారీరక పరిమాణం శ్రీమహావిష్ణువుకు అవరోధం కాదు గనుక వామనావతారు డైనప్పటికీ, తన చిన్ని పాదాలతో భూమ్యాకాశాలను ఆక్రమించ గలిగాడు.
- ఆరవది ఆటవికులు, నాగరికత పూర్తిగా వికసించని సంచారజాతుల వారు ఉపయోగించే గండ్రగొడ్డలిని ఆయుధంగా గలిగిన *పరశురామావతారం*. ఈ దశలో మానవుడు శారీరకంగా పూర్తిగా ఆవిర్భవించాడు గానీ అర్థవంతమైన, పరిణితి చెందిన సామాజిక, కుటుంబవ్యవస్థలు ఇంకా పూర్తిగా రూపుదిద్దుకోలేదు. శారీరక బలానిదే ఆధిపత్యం. పరశురాముడు పగ, ప్రతీకారాలతో క్షత్రియసంహారం గావించాడు.
- ఏడవది తపోధనుడైన *శ్రీరామచంద్రుని* అవతారం. మానవుడు శారీరకంగా, సామాజికంగా, మానాసికంగా, ఆధ్యాత్మికంగా పరిపక్వత చెందాడు. పటిష్ఠమైన, జనరంజకమైన, ప్రజాభిప్రాయానికి విలువనిచ్చే రాచరికపు వ్యవస్థ పరిఢవిల్లింది. చాతుర్వర్ణ వ్యవస్థ, వర్ణాశ్రమ ధర్మాలు క్రమం తప్పకుండా పాటించ బడ్డాయి. యజ్ఞయాగాదులు, జపతపాలు విరివిగా ఆచరించ బడ్డాయి.
- ఎనిమిదవది – వ్యవసాయానికి ఆనాడు, ఈనాడు కూడా చిహ్నంగా నిలిచే 'నాగలి' ని ఆయుధంగా ధరించే *బలరామావతారం*. యుగపరివర్తనంతో (త్రేతాయుగం నుండి ద్వాపరయుగానికి), ద్వాపరయుగ ధర్మాన్ననుసరించి జనులు ఆధ్యాత్మిక చింతన నుండి కొద్దిగా వైదొలగి ఉదరపోషణలో నిమగ్నమయ్యారు. అందువల్ల జనులకు జీవనాధార మైనటువంటి వ్యవసాయానికి, పశుపోషణకు ప్రాధాన్యత లభించింది.
- తొమ్మిదవది *శ్రీకృష్ణావతారం*. శ్రీరామచంద్రుని యందు నిక్షిప్తమై యున్నటువంటి సమస్త సద్గుణాలతో పాటుగా శ్రీకృష్ణునిలో పరిపూర్ణత కలిగిన రాజనీతిజ్ఞుడు కూడా కానవస్తాడు. శ్రీకృష్ణుడు సామ, దాన, బేధ, దండోపాయాలను కరతలామలకంగా వినియోగించ గలిగినవాడు. దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు సర్వశక్తులను వడ్డినవాడు. సూర్యచంద్రాదు లున్నంత వరకూ, సమస్త మానవాళికి శిరోధార్యమైన భగవద్గీతను బోధించడం ద్వారా సర్వకాల సర్వావస్థల యందు కర్తవ్యనిర్దేశం చేసినవాడు. ఈ దశలో భౌతికమైనట్టి రూపురేఖలతో బాటుగా, మేధోసంపత్తి కూడా పరిపూర్ణంగా వృద్ధి చెందింది.
- పదవది మరియు చిట్టచివరిది కలియుగపు *కల్క్యావతారం*. కలియుగంలో పూర్తిగా కృశించిపోయిన ధర్మాన్ని తిరిగి పాదుకొల్పటానికై, చిట్టచివరిగా శ్రీమహావిష్ణువు ధరించిన అవతారం. యుగాంతాన్ని, సృష్టి అంతాన్ని సూచిస్తుంది.

మత్స్యావతారంతో మొదలైన సృష్టి కల్క్యావతారంతో పరిసమాప్తమవుతుంది. యుగచక్రం పునఃప్రారంభ మవుతుంది.

ఇంత విస్తారమైన సృష్టిచక్రాన్ని రెండే రెండు వాక్యాలు కలిగిన శ్లోకంలో నిబిడీకృతం చేసి, శ్రీమహావిష్ణువు లీలలను వేనోళ్ళ కొనియాడిన అణ్ణన్ స్వామి ధన్యజీవులు.

శ్రీమహావిష్ణువు దశావతారాల యొక్క ముచ్చట గొలిపే నల్లరాతి ప్రతిమలను తిరుమలకు చేరుకునే నడక మార్గంలో, అలిపిరి నుండి ఏడవమైలు రాయివరకు బాటకు ప్రక్కగా, తితిదే వారు ఈ మధ్యనే ప్రతిష్ఠింపజేశారు. ఈ ప్రతిమలు జనులలో ఆధ్యాత్మిక చింతనను ఇనుమడింప జేయడమే గాకుండా, నడకదారి యాత్రికులకు మార్గాయాసం నుండి కొంత ఉపశమనాన్ని కూడా కలిగిస్తాయి.

ఇరవై ఐదవ శ్లోకం

"ఏలాలవంగ ఘనసార సుగంధి తీర్థం
దివ్యం వియత్సరసి హేమఘటేషు పూర్ణమ్ ।
ధృత్వాద్య వైదిక శిఖామణయః ప్రహృష్టాః
తిష్ఠంతి వేంకటపతే తవ సుప్రభాతమ్॥

శ్లోకార్థం – మధురమైన, సుగంధ పరిమళాలు వెదజల్లే యాలకులు, లవంగాలు, పచ్చకర్పూరాలను చేకొని; ఆకాశగంగా తీర్థం యొక్క పవిత్రజలాలను తమ స్వర్ణపాత్రలలో నింపుకున్నట్టి, వేదవిద్యా పారంగతులైన బ్రాహ్మణోత్తములు నిన్ను సేవించుకునే నిమిత్తం ఉల్లాసభరితమైన అంతరంగాలతో వేచియున్నారు. వేంకటాచలంలో కొలువై ఉన్న వాడా నీకు మేలుకొలుపు.

ఈ శ్లోకంలో ఆకాశగంగా తీర్థం మరోసారి ప్రస్తావనకు వచ్చింది. మొదటిసారి శ్రీవారి కైంకర్యానికి ఈ తీర్థంలో వికసించిన పద్మాలను వినియోగించినట్లు పేర్కొనగా, ఈసారి ఆ తీర్థజలాల వినియోగం ప్రస్తావించ బడింది. ఈనాటికీ శ్రీవారి నిత్యకైంకర్యానికి, శుక్రవారాభిషేకానికి ఆకాశగంగా తీర్థాన్నే వినియోగించడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి మహాభక్తుడైన తిరుమలనంబి వంశీయులు నడిరేయి దాటిన తరువాత, దాదాపు రెండు మైళ్ళ దూరం అటవీ మార్గంలో ప్రయాణించి శ్రీవారి ప్రాతఃకాల కైంకర్యాల నిమిత్తం ఆకాశగంగా జలాలను నింపిన కలశాలను స్వయంగా, సర్వలాంఛనాలతో మోసుకుని వస్తారు. దాదాపు వెయ్యేళ్ళ నుండి ఈ సాంప్రదాయం అప్రతిహతంగా కొనసాగుతోంది.

ఆనాటి నుండి నేటి వరకూ శ్రీవారి తీర్థంలో యాలకులు, లవంగాలు, పచ్చకర్పూరం వంటి సుగంధద్రవ్యాలను వినియోగిస్తున్నారు. పరిమళభరితమైన ఈ తీర్థాన్ని సేవించిన వారు అలౌకికమైన ఆధ్యాత్మిక ఆనందానికి లోనవుతారు. విమానప్రదక్షిణమార్గం లోని అంకురార్పణ మంటపంలో ప్రాతఃకాలంలో భక్తులకిచ్చే శ్రీవారి తీర్థాన్ని 'బ్రహ్మతీర్థం' గా పిలుస్తారని; బ్రహ్మాదిదేవతలు శ్రీవారిని నిశిరాత్రి సమయంలో అభిషేకించినట్టి పవిత్రజలం కావున దానికా పేరు వచ్చిందని మునుపటి ప్రకరణాలలో తెలుసుకున్నాం. పుట – 134 తేదీ – నవంబరు, 16

ఇరవై ఆరవ శ్లోకం

"భాస్వానుదేతి వికచాని సరోరుహాణి
సంపూరయంతి నినదైః కకుభో విహంగాః
శ్రీవైష్ణవా స్సతతమర్థితమంగళా స్తే
ధామాశ్రయంతి తవ వేంకట సుప్రభాతమ్."

శ్లోకార్థం – సూర్యుడు ఉదయించు చున్నాడు. సరోవరాలలోని పద్మాలు పూర్తిగా వికసించి ఉన్నాయి. పక్షుల కిలకిలా రావాలు అన్ని దిక్కులలో వ్యాపించాయి. శ్రీవైష్ణవులు నీకు మంగళము కోరుతూ, నీ దివ్యసన్నిధిలో వేచియున్నారు. ఓ వేంకటాచలపతీ నీకు సుప్రభాతం.

బ్రహ్మాది దేవతలు, అష్టదిక్పాలకులు, సప్తఋషులతో పాటుగా; సూర్యభగవానుడు, ఆ కర్మసాక్షి లేలేత కిరణాలతో జీవం పోసుకునే కమలపుష్పాలు, సూర్యోదయపు తొలికాంతులకు తమ తమ కిలకిల ధ్వానాలతో స్వాగతం పలికే విహంగాలు ఇలా, సమస్త ప్రకృతి శ్రీవేంకటేశ్వరునికి మేలుకొలుపులు పాడసాగింది. శ్రీనివాసుడే తమ సర్వస్వంగా భావించే శ్రీవైష్ణవులు కూడా శ్రీనివాసుని తొలి దర్శనం కోసం ఎదురు చూస్తున్నారు. ఆ విధంగా యావత్తు ప్రకృతితో పాటుగా తనకు ప్రియాతిప్రియమైన శ్రీవైష్ణవ భక్తులు కూడా తన కోసం వేచి యున్నారని తెలిపితే శ్రీవేంకటేశుడు త్వరగా మేలుకొంటాడని కవివర్యుల భావన.

ఇరవై ఏడవ శ్లోకం

"బ్రహ్మాదయా స్సురవరా స్సమహర్షయ స్తే
సంతస్సనందనముఖా స్త్వథ యోగివర్యాః,
ధామాంతికే తవ హి మంగళవస్తుహస్తాః
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – ఋషుల యందు ఉత్తమోత్తముడు, అగ్రగణ్యుడు అయిన సనందనుని వంటి పుణ్యపురుషులు తోడుండగా సురులకు మకుటాయమానంగా వెలిగే బ్రహ్మదేవుడు మంగళకరమైన పూజాద్రవ్యాలను చేకొని, నీ సన్నిధిలో వేచియున్నారు. ఓ వేంకటాచలపతీ మేలుకో..

బ్రహ్మదేవుడు దేవతలలో అగ్రగణ్యుడైతే, సనందుడు ఋషులందరికీ తలమానిక మైనవాడు. అప్పటికే ఎంతో కాలాతీత మవ్వ బోతుండడంతో, శ్రీవారి దర్శనానికై ఆతురతో నున్న కవివర్యులు బ్రహ్మదేవుడు, సనందుడు వంటి మహనీయులు సైతం స్వామివారి దర్శనాభిలాషులై, ఆలయద్వారం ముంగిట వేచియున్నారని మరొక్కసారి మనవి చేసుకుంటున్నారు.

ఇరవై ఎనిమిదవ శ్లోకం

"లక్ష్మీనివాస నిరవద్యగుణైకసింధో
సంసారసాగరసముత్తరణైకసేతో,
వేదాంతవేద్యనిజవైభవ భక్తభోగ్య
శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్."

శ్లోకార్థం – శ్రీమహాలక్ష్మికి నెలవైన వానివి; దోషరహితము, మంగళకరము అయినటువంటి గుణగణముల సాగరము వంటి వాడివి; సంసారమనే సాగరమును దాటించగల వారధి వంటి వానివి; వేదవేదాంతోపనిషత్తుల ద్వారా కీర్తించ బడినట్టి వైభవమును కలిగిన వాడివి యైనట్టి ఓ వేంకటాచలపతీ నీకు సుప్రభాతం.

'సంసారం' అంటే సుఖ దుఃఖాలతో కూడుకున్న మానవజీవితం. సంక్లిష్టతతో కూడుకున్న ప్రాపంచిక జీవితాన్ని సాగరంతో పోల్చవచ్చు. సప్తసముద్రాలను దాటడానికి అనేక సాధనాలు ఉంటాయి. కానీ సప్తసాగరాల కంటే లోతైనది, ప్రమాదకరమైనది అయిన సంసారసాగరాన్ని దాటడానికి పరమాత్ముని పరిపూర్ణ కటాక్షం కావాలి.

మత్స్యావతారుడైన శ్రీమహావిష్ణువు ప్రళయకాలంలో ఒక నావను సృష్టించి, సృష్టిమూలాలను అందులో భద్రపరిచి, సృష్టి అంతరించకుండా కాపాడాడు. సకల చరాచర సృష్టినే ఒక నౌక సాయంతో ప్రళయాన్ని దాటించ గలిగిన శ్రీమహావిష్ణువును శరణు వేడితే సంసారసాగరాన్ని దాటడం దుర్లభం కాదు.

ఈ శ్లోకంలో వేదాల ప్రస్తావన కుడా ఉంది. బ్రహ్మదేవుని వద్దనుండి వేదాలను తస్కరించి సాగరగర్భంలో నిక్షిప్తం చేసి; లోకాలను అజ్ఞానాంధకారంలో ముంచివేసే పన్నాగం పన్నిన సోమకాసురుడనే రాక్షసుణ్ణి మత్స్యావతారుడైన శ్రీమహావిష్ణువు నిర్జించి, వేదాలను కాపాడి బ్రహ్మదేవునికి తిరిగి అప్పగించాడు. వేదాలు రక్షించబడిన చైత్రశుద్ధ తదియను మత్స్యజయంతిగా జరుపుకుంటారు. అందుచేతనే మత్స్యావతారుడైన శ్రీమహావిష్ణువు వేదనారాయణస్వామిగా కూడా ప్రసిద్ధికెక్కాడు. తిరుపతికి 50 మైళ్ళ దూరం లోని నాగులాపురం అనే గ్రామంలో అత్యద్భుతమైన శిల్పకళతో, సమున్నతమైన ప్రాకారాలతో అలరారుతున్న ప్రాచీన వేదనారాయణస్వామి ఆలయాన్ని నేడు కూడా చూసి తరించవచ్చు.

ఆ విధంగా శ్రీమహావిష్ణువు మొట్టమొదటి అవతారమైన మత్స్యావతారపు ప్రాశస్త్యాన్ని స్మరణకు తేవడం ద్వారా వారి కృపకు పాత్రులు కావాలని అణ్ణన్ స్వామి అభిలషించారు.

ఇరవై తొమ్మిదవ శ్లోకం

"ఇత్థం వృషాచలపతే రిహ సుప్రభాతం
యే మానవాః ప్రతిదినం పఠితుం ప్రవృత్తాః,
తేషాం ప్రభాతసమయే స్మృతిరంగభాజాం
ప్రజ్ఞాం పరార్థసులభాం పరమాం ప్రసూతే."

శ్లోకార్థం – ఏ మానవులైతే ఈ సుప్రభాతాన్ని అనుదినము ప్రాతఃసంధ్యలో పఠిస్తారో, అటువంటి భౌతిక కాయాన్ని కలిగిన భక్తులందరూ మోక్షసిద్ధిని పొందదానికి అనువైన అత్యుత్తమ జ్ఞానాన్ని సాధించగలరు.

అంతిమంగా మోక్షసిద్ధిని శ్రీమహావిష్ణువు కటాక్షం ద్వారానే పొందవచ్చునని, ఎవరైతే ప్రతిదినము ప్రాతఃసంధ్య వేళలో శ్రీవేంకటేశ్వర సుప్రభాతం పఠిస్తారో వారు శ్రీవారి కటాక్షాన్ని పొందగలరని ముక్తాయిస్తూ శ్రీవేంకటేశ్వరుని భక్తులందరినీ సుప్రభాత పఠనానికై అణ్ణన్ స్వామి ప్రేరేపిస్తున్నారు.పుట – 135 తేదీ – నవంబరు, 17

తిరుమలక్షేత్రంలో నిషిద్ధకర్మలు

పరమపవిత్రమైన, పరిశుభ్రతకు మారుపేరైన తిరుమల కొండపై ఎట్టి పరిస్థితులలోనూ చేయకూడనట్టి కొన్ని పనులున్నాయి. మనం ఎన్నిసార్లు, ఎంత భక్తితో స్వామిని దర్శించుకున్నప్పటికీ, కొన్ని నిషిద్ధకర్మలకు దూరంగా ఉండకపోతే, యాత్రాఫలం సంపూర్ణంగా సిద్ధించదు. అవేమిటో, ఆ పనులు ఎందుకు కూడదో ఈనాటి ప్రకరణంలో సవివరంగా చూద్దాం.

ఆదివరాహదర్శనం

మొదటగా ఆదివరాహుణ్ణి దర్శించుకోకుండా శ్రీవారి దర్శనం కూడదు. తిరుమలక్షేత్రానికి అసలు పేరు 'ఆదివరాహక్షేత్రం'. ఈ క్షేత్రమంతా ఒకప్పుడు శ్రీమహావిష్ణువు మరో అవతారమైన ఆదివరాహస్వామి లేదా భూవరాహస్వామికి చెందినది. వల్మీకంలో (పుట్టలో) సుదీర్ఘకాలం గడిపిన శ్రీనివాసుడు నిలువనీడ కోసం అలమటిస్తున్నప్పుడు శ్రీవారి శాశ్వతనివాసం కోసం స్వామిపుష్కరిణికి దక్షిణం వైపునున్న నూరు అడుగుల నేలను ఆదివరాహుడు ధారాదత్తం చేశాడు. అదే ప్రదేశంలో తరువాతి కాలంలో తొండమానుడు ఆనందనిలయం నిర్మించాడు. ఇప్పుడున్న తిరుమల ప్రధానాలయం అదే! తనకు స్థలాన్ని బహూకరించినందుకు ప్రతిగా భక్తుల తొలిదర్శనం, తొలిపూజ, తొలినైవేద్యం ఆదివరాహునికే చెందుతాయని, తరువాతే తనను దర్శించుకుంటారని శ్రీవేంకటేశ్వరుడు ఆదివరాహస్వామికి వాగ్దానమిచ్చాడు. దానికి ఋజువుగా శ్రీనివాసుడు వరాహస్వామికి ఒక రాగిఫలకంపై వ్రాసి ఇచ్చిన దస్తావేజును తిరుమల లోని శ్రీ వేంకటేశ్వర వస్తుప్రదర్శనశాలలో నేడు కూడా చూడవచ్చు. శ్రీనివాసుని ఆదేశం మేరకు తొలిపూజను, తొలినైవేద్యాన్ని అర్చకస్వాములు నిర్వహిస్తారు. తొలిదర్శనం బాధ్యత మాత్రం భక్తులదే!

'వరాహదర్శనాత్ పూర్వం
శ్రీనివాసం నమేన్నచ
దర్శనాత్ ప్రాగ్ వరాహస్య
శ్రీనివాసో న తృప్యతి'

అన్న శ్లోకం ద్వారా సాక్షాత్తు శ్రీనివాసుడే స్వయంగా తన భక్తులకు ఈ విధంగా శెలవిచ్చాడు. ఈ ఉదంతాన్ని మునుపటి ప్రకరణాలలో విశదంగా తెలుసుకున్నాం.

శ్రీవేంకటేశ్వరుని వాగ్దానాన్ని నిలబెట్టవలసిన బాధ్యత వారి భక్తులుగా మనందరి పైనా ఉంది. ఈ నియమాన్ని ఈమధ్య కాలం వరకూ తూచా తప్పకుండా పాటించేవారు కానీ, ప్రస్తుతం కొంత ఆలసత్వం కాన వస్తోంది. మొట్టమొదటగా ఉత్తరమాడవీధిలో, స్వామిపుష్కరిణి తటాన ఉన్న వరహస్వామిని సేవించుకోకుండా, శ్రీనివాసుని దర్శించుకోరాదు. అలా చేస్తే తిరుమల యాత్రాఫలం సంపూర్ణంగా సిద్ధించదని పురాణాలలో కూడా ఉటంకించబడింది.

ముఖ్య నిబంధనావళి

కొండపై నవదంపతుల నిదుర నిషిద్ధం

వివాహమైన ఆరుమాసాల వరకూ కొత్త దంపతులు కొండపై నిదురించరాదు పద్మావతీ-శ్రీనివాసులు పరిణయానంతరం ఆరు నెలలపాటు, ఈనాడు శ్రీనివాసమంగాపురంగా పిలువ బడుతున్న అలనాటి అగస్త్యాశ్రమంలో విశ్రమించారని, తరువాతే తిరుమలక్షేత్రాన్ని చేరుకున్నారని మునుపటి ప్రకరణాలలో తెలుసుకున్నాం. సాక్షాత్తు శ్రీనివాసుడే పాటించిన ఆ నియమాన్ని ఉల్లంఘించడానికి మనమెంతటివారం?

వివాహమైన తొలినాళ్లలో భార్యాభర్తలలో ఒకరంటే ఒకరికి వ్యామోహం అధికంగా ఉంటుంది. ఆధ్యాత్మిక దృష్టితో, శ్రీనివాసుణ్ణి సేవించు కోవడానికి మాత్రమే పరమపావనమైన తిరుమలకు వెళ్ళాలి కానీ, భోగలాలసత్వంతో తిరుమలపై కాలు మోపరాదు. ఒకవేళ తిరుమల కొండపై వివాహం జరిగితే, వివాహానంతరం స్వామిని దర్శించుకొని వెనువెంటనే కొండ దిగిపోవడం శ్రేయస్కరం. కొండపై నూతన దంపతులతో మూడునిద్రలు చేయిస్తామని మొక్కుకోవడం సమంజసం కాదు.

తిరుమలక్షేత్రంలో పూలు ధరింపరాదు

తిరుమల పుష్పమండపంగా ఖ్యాతినొందింది. తిరుమలేశుడు పుష్పప్రియుడు. శ్రీనివాసునికి పుష్పకైంకర్యం చేయడం ద్వారా తిరుమలనంబి, అనంతాళ్వార్, వెంగమాంబ వంటి ఎందరో భక్తులు శ్రీవారికి ఆప్తులై జన్మ సార్థకం గావించుకున్నారు. నాటి నుండి నేటివరకూ శ్రీవారు అనునిత్యం పెక్కు పూలమాలలను ధరించి దర్శనమిస్తారు. తిరుమల లోని పుష్పాలన్నీ శ్రీవారి సొంతం. పూలతో కూడిన పూజావ్యర్థాలను సైతం భక్తులకు ప్రసాదంగా ఇచ్చే సాంప్రదాయం తిరుమలలో లేదు. పూజానైర్మల్యాలను ఈమధ్య వరకూ సంపంగిప్రాకారంలో ఉండే 'పూలబావి' లో విసర్జించేవారు. ఇప్పుడు మాత్రం జనసంచారం లేని సుదూరమైన అరణ్యప్రాంతంలో ఆ వ్యర్థాలను విసర్జిస్తున్నారు. కొండపైకి పుష్పగుచ్చాలను సైతం అనుమతించరు. తిరుమలలో జరిగే వివాహవేడుకలలో కూడా పుష్పాలను వినియోగించరు. అటువంటి తిరుమల క్షేత్రంలో పూవులన్నింటినీ స్వామివారి అలంకారానికి, అర్చనకు, కళ్యాణానికే వినియోగించాలి తప్ప సామాన్యులు పువ్వులు ధరించడం పూర్తిగా నిషిద్ధం. ఈ నియమాన్ని పాటించకపోతే, 'పరిమళదోషానికి' ఒడిగట్టిన వారమవుతాం. అంతే గాకుండా, కొండపై ఎవరైనా పూలను ధరిస్తే పుష్పాధిపతి యైన 'పుల్లుడు' అనే దేవత ఆగ్రహానికి కూడా గురవుతారు. స్వామివారి అభీష్టానికి వ్యతిరేకంగా, వారికే స్వంతమైన పుష్పాలను కొండపై ఎట్టి పరిస్థితులలోనూ అలంకరించు కోవద్దు.

మాడవీధులలో పాదరక్షలు నిషిద్ధం

నాలుగు వేదాలు నాలుగు మాడవీధులుగా అవతరించి వేదపురుషుడైన శ్రీనివాసుణ్ణి సేవించు కుంటున్నాయని, ఇంతకుముందే తెలుసుకున్నాం. పూర్వకాలంలో ఎందరో మహానుభావులు తమ పాదస్పర్శతో సప్తగిరులు అపవిత్ర

మవుతాయేమోనన్న ఆందోళనతో మోకాళ్ళతో కొండనెక్కేవారు. మాడవీధుల్లోనే కాదు తిరుమలక్షేత్రమంతా పాదరక్షలు లేకుండా సంచరించే ఎందరో భక్తులు ఈనాడు కూడా ఎంతోమంది ఉన్నారు. అటువంటి పరమపావనమైన సప్తగిరులలో, ఆనందనిలయన్ని ఆవరించియున్న మాడవీధులలో పాదరక్షలతో సంచరించడం మహాపరాధం. ఇదే విషయాన్ని శ్రీవారి సేవకులు మనకు అహర్నిశలూ సూచిస్తుంటారు. మండువేసవిలో సైతం పాదాలు బొబ్బలెక్కకుండా, తితిదే వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాలినడకపై తిరుమలకు చేరుకునే మెట్లమార్గంలో కుడా పాదరక్షలు పూర్తిగా నిషిద్ధం. మనం కూడా మన పూర్వీకుల బాటలోనే నడచి, తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడి, కొండలరాయడి కృపకు పాత్రులవుదాం.

ఆహారం, ప్రసాదాలు వ్యర్థం చేయరాదు

శ్రీవారి ఆదేశానుసారం, వేదాలు వల్లెవేసిన వంటబ్రాహ్మణులు వండిన పదార్థాలనే శ్రీవారికి నివేదించాలి. అదే నిబంధన నేటికీ అమలులో ఉంది.

అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నపూర్ణాదేవి పరప్రసాదితం. కావున – ఆహారాన్ని ఎక్కడా, ఏ సందర్భం లోనూ వ్యర్థం చేయరాదు. అటువంటిది, తిరుమలేశునికి నివేదించబడిన ప్రసాదాన్ని వ్యర్థం చేయవచ్చా? ముమ్మాటికి చేయరాదు.

తిరుమలలో ప్రసాదాల తయారీ, నైవేద్యం, భక్తులకు పంపిణీ మొదలగు వాటికి ఉన్న విస్తారమైన, సుదీర్ఘమైన, ఆసక్తికరమైన నిబంధనలను, చరిత్రను మునుపటి ప్రకరణాలలో తెలుసుకున్నాం. ఈ నియమాలన్నీ ప్రసాదాల పవిత్రతను కాపాడి, ప్రసాదం వ్యర్థం కాకుండా నిరోధించే నిమిత్తమే అమలు చేయబడ్డాయి. వందల సంవత్సరాల నుండి, ఏ భక్తుడినీ ఆకలితో వెనుకకు పంపరాదనే సిద్ధాంతం తిరుమలక్షేత్రంలో అమలులో ఉంది. పురాతన కాలం నుండి నడకమార్గం లోని అలిపిరి వద్దనున్న పాదాలమంటపం వద్ద మొదలుకొని మార్గమంతటా, కొండపైనా అనేక ప్రదేశాలలో ఉచిత భోజన ఏర్పాట్లు ఉండేవి. కొండపైన వసతి, వాణిజ్యపరంగా నడిచే ఫలహార, భోజనశాలలు లేనప్పుడు శ్రీవారి ఆలయంలో అందజేసే ప్రసాదం మరియు ఉచితభోజన ఏర్పాట్లే భక్తుల క్షుద్బాధను తీర్చేవి. అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ నేటికీ కొండపై ప్రసాదాల పంపిణీ మరియు భోజన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఉచితభోజనం నిమిత్తం ఎందరెందరో దాతలు కోట్లాది రూపాయలు విరాళంగా ఇచ్చారు. కోట్లమంది అన్నార్తుల వెతలు తీర్చిన అన్నప్రసాదాన్ని వృథా చేయడమంటే, మహాపరాధానికి ఒడిగట్టడమే.

తిరుమలలో మనం భుజించే ప్రతి మెతుకూ ప్రసాదమే. విజ్ఞతతో వ్యవహరించి, మనం ఆహారాన్ని వృథా చేయకుండా ఉండటమే కాకుండా మన తోటివారు కూడా వృథా చేయకుండా చూడవలసిన బాధ్యత మనపై ఉంది.

తిరుమలలో ప్రసాద సేవనంలో నియమాలు

- ప్రసాదాన్ని శ్రీవారి మహాప్రసాదంగా భావించాలే తప్ప జిహ్వాచాపల్యంతో భుజించరాదు.

- పరిమిత మొత్తంలోనే స్వీకరించాలి తప్పితే, ఫలహారంలా భావించరాదు. అలా చేస్తే మన అత్యాశ వల్ల మరో భక్తుడు శ్రీవారి ప్రసాదానికి నోచుకోడన్న విషయం గుర్తెరిగి ప్రవర్తించాలి.
- క్యూలలో మన వంతు వరకూ వచ్చే వరకూ ఓర్పుతో వేచి ఉండాలిగానీ, ఆత్రుత పడి తోటి భక్తులకు ఇబ్బంది కలిగించ కూడదు.
- తీయనిదైనా, కమ్మనిదైనా ప్రసాదం ప్రసాదమే! ఏదైనా అమృతతుల్యమే! రుచులు వెదకటానికి ప్రయత్నించవద్దు. పుట – 136 తేదీ – నవంబరు, 18

తిరుమల సందర్శనం విహారయాత్ర కాదు

తిరుమలక్షేత్రసందర్శనం విహారయాత్ర కాదు సప్తగిరులన్నీ హరితవర్ణ శోభితమైన గిరిశిఖరాలతోనూ, మనోహరమైన సెలయేళ్ళతోనూ, జలజలా జాలువారే జలపాతాలతోనూ, అరుదైన వృక్ష, జంతుజాతులతోనూ, నయనానందకరంగా శోభిల్లుతుంటాయి. అంతమాత్రం చేత తిరుమల విహారస్థలం కాదు. అణ్ణన్ స్వామి, అన్నమయ్య, పురందరదాసు, వెంగమాంబ వంటి ఎందరో భక్తశిఖామణులు సప్తగిరుల ప్రాకృతికశోభను అక్షరబద్ధం చేశారుకానీ, కొండపైనున్న చెట్టు–పుట్ట, రాయి–రప్ప మొదలగు వాటన్నింటిలో శ్రీనివాసుణ్ణి దర్శించుకొని తాదాత్మ్యత చెందారు. ఆ విధంగా మనం కూడా శేషాచల శ్రేణుల అందాన్ని ఆస్వాదించవచ్చు కానీ, అక్కడున్న సమస్తం శ్రీహరి వైకుంఠవైభవానికి ప్రాతినిధ్యం వహిస్తాయన్న అక్షరసత్యాన్ని మరువరాదు. ఆధ్యాత్మిక చింతనతోనే తిరుమలకు రావాలి తప్పితే విహారయాత్ర కోసమో, సేదతీరడం కోసమో తిరుమలకు వెళ్ళకూడదు.

పాశ్చాత్య వస్త్రధారణ కూడదు

స్త్రీలు కాని, పురుషులు కాని తిరుమల క్షేత్రం లోనూ, ఆలయం లోపల సనాతన హైందవ సాంప్రదాయాన్ని ప్రతిబింబించే వస్త్రాలు, ఆహార్యం ధరించాలి కానీ; కట్టు–బొట్టు విషయాలలో పాశ్చాత్య పోకడలకు పోరాదు. ఉపనయనం, వివాహం, సత్యనారాయణ వ్రతం వంటి క్రతువులలో సాధారణంగా మనం సాంప్రదాయ వస్త్రాలనే ధరిస్తాం. తిరుమలయాత్ర ఏ వ్రతము, క్రతువు, శుభకార్యం కంటే తక్కువకాదు. కావున అటువంటి వేషభూషలనే తిరుమలయాత్రలో కూడా ధరించాలి. తిరుమల క్షేత్రంలో మన నడవడిక, ఆచారవ్యవహారాలు అన్నీ భక్తిభావనను, ఆధ్యాత్మిక చింతనను ఇనుమడింప జేయాలి.

డాబు, దర్పం కూడదు

రాజు–భటుడు, పేద–గొప్ప అందరూ శ్రీవారి సేవకులే! శ్రీవారి సన్నిధిలో అందరూ సరిసమానులే! అందరూ వారికి దాసానుదాసులే! స్వామివారి దర్శనార్థం కొండకు విచ్చేసిన వారందరూ ఈ సత్యాన్ని గుర్తెరిగి మసలుకోవాలి. నవవిధ భక్తిమార్గాలలో దాస్యభక్తి అత్యంత శ్రేష్ఠమైనది. ఆంజనేయుడు, గరుత్మంతుడు వంటి వారు ఉత్కృష్టమైన దాస్యభక్తి నవలంబించే తరించారు. దాస్యభక్తి మనలో సహజంగా గూడుకట్టుకుని ఉండే అహంకార భావనను పటాపంచలు చేస్తుంది. శ్రీవారికి మనను మనం సంపూర్ణంగా సమర్పించు కోవడానికి అదియే అత్యుత్తమ మార్గం.

నిరంతరం తనసేవలో తలమునకలై ఉండే ఆదిశేషువు ఒకానొకప్పుడు అహంకారంతో విఱ్ఱవీగడంతో అతనికి శ్రీహరి తగిన గుణపాఠం నేర్పి, తన స్థానాన్ని గుర్తెరిగేటట్లు చేసిన సంఘటనను మునుపటి ప్రకరణాలలో తెలుసుకున్నాం. ఆ పౌరాణిక ఉదంతాన్ని స్మరణకు తెచ్చుకుని డాబు, దర్పం, అధికార హోదాలను మరచిపోయి శ్రీవారిపై చిత్తాన్ని నిలిపి, త్రికరణశుద్ధితో తిరుమలయాత్రను చేపడితేనే యాత్ర సంపూర్ణంగా సాఫల్య మవుతుంది.

ప్రాపంచిక సుఖాల కోసం వెంపర్లాడవద్దు

తిరుమల యాత్రకు వచ్చినపుడు దృష్టంతా శ్రీవేంకటేశ్వరునిపై నిలిపి నిరాడంబరమైన జీవితం గడపాలే కానీ, శీతలీకరించిన గదులు (AC గదులు), మెత్తటి పరుపులు, వేడినీటి సదుపాయం, రుచికరమైన భోజనం కోసం ఆరాట పడవద్దు. అవన్నీ మనం నిత్యం అనుభవించేవే.

ఆ ఒకటి, రెండు రోజులు ప్రాపంచిక సుఖాలను త్యాగం చేసి, ఆ దేవదేవునికి మన శ్రద్ధాభక్తులను ప్రకటించు కోలేమా?

దాదాపు 50-60 సంవత్సరాల క్రితం వరకూ కొండపైనున్న వసతిగృహాలలో మంచాలు కూడా ఉండేవి కాదు. ఎముకలు కొరికే చలిలో కూడా భక్తులు కటికనేల పైనే విశ్రమించేవారు. మారిన కాలమాన పరిస్థితులను బట్టి, ప్రస్తుతం తితిదే వారు కనీస సౌకర్యాలన్నీ అమర్చుతున్నారు. మరిన్ని సౌకర్యాలు ఆశించవద్దు. 'కాయాపేక్ష' – అంటే శారీరక సుఖాలను త్యజించడమే మోక్షప్రాప్తికి మొదటిమెట్టు అని ఇంతకు ముందే తెలుసుకున్నాం. ఆ మహత్తర కార్యానికి తిరుమలక్షేత్రంలోనే శ్రీకారం చుడితే మేలు.

దర్శనానికి అడ్డదార్లు వద్దు

శీఘ్రదర్శనం, ప్రముఖుల దర్శనం (VIP) కోసం పైరవీలు, దగ్గరిదారులు వద్దు. స్వామివారిని ఎన్నిసార్లు, ఎంత త్వరగా, ఎంత దగ్గరగా చూడగలిగామన్నది ముఖ్యం కాదు. అవి భక్తుల పరపతిని, పలుకుబడిని, హోదాను, నిబంధనలను అధిగమించ గలిగే చాతుర్యాన్నీ సూచిస్తాయి గానీ స్వామివారి పట్ల ఉన్న భక్తిప్రపత్తులను కాదు. సర్వశ్రేష్ఠమైనది ఉచితదర్శనం లేదా సర్వదర్శనం లేదా దివ్యదర్శనం. ఏవిధమైన రుసుము చెల్లించనవసరం లేకుండా, ప్రశాంతంగా శ్రీనివాసుణ్ణి స్మరించుకుంటూ ఒక పూట క్యూలైన్లో గడిపి దేవుణ్ణి దర్శించుకోలేమా? క్యూ షెడ్లలో గడపటానికి అవసరమైన కనీస సౌకర్యాలన్నీ తితిదే వారు సమకూర్చుతున్నారు కదా!

తప్పనిసరి పరిస్థితులలో దేవస్థానం వారి నిబంధనలకు లోబడి, తగిన రుసుము చెల్లించి ప్రత్యేక దర్శన సదుపాయం కూడా పొందవచ్చు.

వ్యర్థ కాలాయాపన వద్దు

వ్యర్థప్రసంగాలు వద్దు. తిరుమల క్షేత్రం లోనూ, క్యూలైన్ల లోనూ గడిపే కొద్ది గంటల కాలాన్నీ గోవిందనామ సంకీర్తనలో, సద్గ్రంథ పారాయణంలో, పురాణశ్రవణంలో గడపాలి. వీటికి కావలసిన ఏర్పాట్లన్నీ తితిదే వారు చేస్తున్నారు. అంతేకానీ, ఆ సమయాన్ని కాలక్షేపం కబుర్లతో వృథా చేయవద్దు.

సాధారణ నిబంధనావళి

- కొండపై మద్యమాంసాలు, ధూమ్రపానం, కిళ్ళీల వంటివి పూర్తిగా నిషిద్ధం.
- కొండపై బ్రహ్మచర్యం తప్పనిసరిగా పాటించాలి.
- టోపీ లేదా తలపాగా వంటి శిరోభూషణాలను లేదా తుపాకీ వంటి ఆయుధాలను ధరించి శ్రీవారిని దర్శించుకోరాదు.
- సాంక్రమిక వ్యాధులతో బాధ పడేవారు ఆలయం లోకి ప్రవేశించ వద్దు.
- చిత్తశుద్ధితో, అంకితభావంతో విధులను నిర్వర్తించే దేవస్థానం సిబ్బందిని ఏవిధమైన ప్రలోభాలకు గురి చేయరాదు.
- అన్ని సందర్భాలలో క్యూ పద్ధతిని పాటిస్తూ దేవాలయ సిబ్బంది మరియు శ్రీవారి సేవకుల సూచనలు, సలహాలను తప్పనిసరిగా పాటించాలి.

గోవిందా! గోవిందా!! గోవిందా!!!



ఓం నమో వేంకటేశాయ



🙏తిరుమల సర్వస్వం సుసంపన్నం[i]🙏

------------: : -----------

పుట – 137 తేదీ – నవంబరు, 19

---

[i] ఆరు నెలల పాటు, అనగా మే 18, 2020 నుంచి నవంబర్ 19, 2020 వరకు, 137 ప్రకరణాలతో సుదీర్ఘంగా వాట్సాప్ ద్వారా కొనసాగిన '**తిరుమల సర్వస్వం**' ప్రస్థానం నేటితో ముగిసింది. స్వామివారి చరిత్ర, లీలలు, మహత్యం అనంతం. వేయి తలలు, రెండువేల నాల్కలు ఉన్న ఆదిశేషువు సైతం శ్రీవారి ప్రాభవాన్ని సంపూర్ణంగా కీర్తించ లేక పోయాడట. వారి గురించి, తిరుమలక్షేత్రం గురించి సుపూర్ణంగా విశదీకరించడం మానవ మాత్రులమైన మనబోటి వారికి ఎంతమాత్రం సాధ్యపడని మహత్కార్యం.

అయినప్పటికీ, స్వామివారి కరుణాకటాక్షాలతో, మీ ప్రోత్సాహంతో శ్రీవారి గురించి, తిరుమల గురించి కొంత సమాచారాన్ని మీకు అందించ గలిగినందుకు ఆ శ్రీనివాసునికి శతకోటి ప్రణామాలు సమర్పించుకుంటున్నాం. ప్రతిరోజూ మీ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి, ఈ సుదీర్ఘమైన ప్రకరణాలను ఆసాంతం చదివి, తగిన సూచనలు, సలహాలు అందజేసిన మీకు కూడా శతాధిక వందనాల నర్పిస్తున్నాం.

ఈ విషయాలను సంకలనం చేయడంలో, మా సందేహాలను నివృత్తి చేయడంలో సహకరించిన అర్చకస్వాములకు, శ్రీవారి భక్తులకు, తితిదే సిబ్బందికి, వివిధ గ్రంథకర్తలకు, ప్రసారమాధ్యమాల వారికి కుడా హృదయపూర్వక ధన్యవాదాలు అర్పిస్తున్నాం.

ఏవైనా తప్పులుంటే సహృదయంతో మన్నించి సరిదిద్దగలరు. గ్రంథరూపంలో వెలువడేటప్పుడు తగిన మార్పులు చేస్తాము.

శ్రీవేంకటేశ్వరుని కృపాకటాక్షములతో, కొద్దిరోజుల్లో మరో ఆధ్యాత్మిక ధారావాహికను ప్రారంభించే టందుకు ప్రయత్నిస్తున్నాం. ఆ ప్రయత్నంలో మేము కృతకృత్యులం కావాలని ఆశీర్వదించమని సవినయంగా విన్నవించు కుంటున్నాం.